మహాభారతము



ఉద్యోగ
పర్వము



Sri Kappagantula Lakshmana Shastry, born in 1911 A. D. received education in traditional Style. Though he was primarily educated in Sanskrit, he was also a Scholar in Telugu Hindi, English, Marathi, Kannada, Tamil and Urdu He was also a great Orator, endowed with ready wit and spontaneity on and off the dias.

He translated Vyasa's Mahabharatam (Verbatim) into Lyrical Telugd Prose, out of which Adi. Sabha & Virata parvams are published. Udyoga parva is being presenred now to the readers. Other works of his are listed inside.

He was an Emeritus Professor of the Dr. Sampurnananda Sanskrit University, Banares and was conferred with the titles of "Andhra Bilhana", "Brahmi Bhushana", "Sudhindra Mouli", "Maha Mahopadhyaya" etc.

During his lifetime he pioneered the spread of oriental languages (and formal education in these languages). He also helped towards the popularisation of Telugu and Hindi.

He suffered a Cardiac arrest on 10-1-1981.

భారతం – భారతోపమమ్

సంస్కృతే 'గగనం గగనాకారం సాగరః సాగరోపమః' ఇత్యుక్తిః ప్రచలితా వర్తతే యా సర్వథా యథార్థతామావహతి. ఏవమేవ యది 'భారతం భారతోపమమ్' ఇత్యుచ్యేత తర్హి తదపి సర్వథా యథార్థం భవిష్యతీతి మే బలవతీ ధారణా।

వస్తుతో మహాభారతం విశ్వసాహిత్యస్య సర్వాతిశాయి అనుపమం గ్రంథరత్నం విద్యతే। అస్య అనుపమేయత్వే అనేకే హేతవః సన్తి. తే సర్వేఽపి ప్రాయః మహాభారతే ఏవ ఉల్లిఖితాః సన్తి. యథా-

'యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్-'

స్వర్గారోహణపర్వ.

అర్థశాస్త్రమిదం ప్రోక్తం ధర్మశాస్త్రమిదం మహత్।
కామశాస్త్రమిదం ప్రోక్తం వ్యాసేనామిత బుద్ధినా॥ 83
శ్రుత్వాత్విదముపాఖ్యానం శ్రావ్యమన్యన్నవిద్యతే।
పుంస్కోకిలగిరం శ్రుత్వా రూక్షా ధ్వాంక్షస్యవాగివ॥ 84

ఆదిపర్వణి ద్వితీయోఽధ్యాయః

యద్యపి మహాభారతం సామాన్యతః కౌరవ - పాండవానాం యుద్ధస్య ఇతిహాసరూపేణైవ విఖ్యాతం వర్తతే పరన్తు సమగ్రతయా గంభీరతయా చ అధ్యయనే క్రియమాణే గ్రంథోఽయం బహోః కాలాత్ ప్రాచీనైః ఋషిమహర్షిభిః కృతాయా జ్ఞానవిజ్ఞానసాధనాయా విశ్వకోశ ఇవ ప్రతిభాతి. గ్రంథేఽస్మిన్ యుద్ధవిషయక వివిధప్రసంగాతిరిక్తం సర్వేష్వపి పర్వసు న్యూనాధిక రూపేణ ధర్మార్థ కామమోక్ష - వర్ణాశ్రమ - ధర్మ - రాజనీతి - సామాన్యనీతి - మానవధర్మ - పాప - పుణ్యాది విషయసంబద్ధాయే విచారాః సిద్ధాన్తాశ్చ విశదరూపేణ ప్రతిపాదితాస్తేషామేకత్ర గ్రంథాంతరే దర్శనం సర్వథా సుదుర్లభమేవ। అత ఏవాస్య శ్లోక సంఖ్యాఽపి న కేవలం భారతస్య అపితు విశ్వస్యాపి సర్వాన్ కావ్యగ్రంథానతిశేతే। పాశ్చాత్యదేశేషు యూనాన దేశస్య సుప్రసిద్ధమహా

కవేః 'హోమర్' మహోదయస్య 'ఒడిసీ - ఇలియడ్' ఇత్యాఖ్యస్య కావ్యద్వయస్య సమ్మిళితా శ్లోకసంఖ్యా యావతీ వర్తతే తతః అష్టగుణాఽధికా శ్లోకసంఖ్యా మహాభారతస్య వర్తత ఇతి మెక్‌డోనల్ మహాభాగః స్వకీయే సంస్కృత సాహిత్యస్య ఇతిహాసే లిఖితవాన్ (హిందీ అను. పుట. 264).

మహాభారతస్య అపరం మహద్ వైశిష్ట్యమిదం వర్తతే యదస్య రచనా ప్రాచీనమాన్యతానుసారం వేదాధ్యయనాధికారశూన్యానాం స్త్రీశూద్ర ద్విజబంధు ప్రభృతీనాం సామాన్యజనానాం వేదప్రతిపాదితార్థ పరిజ్ఞానాయ తద్ద్వారా చ తేషాం సర్వవిధ కల్యాణసాధనాయ విహితా వర్తతే భగవతా వేదవ్యాసేన. యథాప్రోక్తం శ్రీమద్ భాగవతస్య చతుర్థేస్కందే—

'స్త్రీశూద్ర ద్విజబంధూనాం త్రయీ న శ్రుతి గోచరా।
ఇతి భారతమాఖ్యానం కృపయా మునినా కృతమ్॥
భారతవ్యపదేశేన ఆమ్నాయార్థశ్చ దర్శితః।'

తదేవమిదం మహాభారతం జనసాహిత్యం, లోకసాహిత్యం, సామాజికం సాహిత్యం వాఽపివక్తుం శక్యతే।

అపరంచ ధర్మాధ్యాత్మదర్శన రాజనీతి ప్రముఖ గంభీర విషయాణామివ సర్వసాధారణోపయోగినాం జ్ఞాతవ్య విషయాణామపి మహాభారతే సువిశాలః సంగ్రహోదృశ్యతే యః స్థలే స్థలే ఆఖ్యానరూపేణ, ప్రశ్నోత్తరరూపేణ, ధర్మోపదేశరూపేణ వాఉల్లిఖితో వర్తతే। ఆంగ్ల భాషాయాం పాశ్చాత్త్యైర్విద్వద్భిః ఏతాదృశాని అనేకాని పుస్తకాని లిఖితాని యాని సర్వ సాధారణజనానాం లౌకిక జీవనస్య కల్యాణాయ, సమృద్ధయే, సఫలతాయై, ఆనందాయచ బహూపకారీణి భవన్తి। తాదృశాని లోకోపకారీణి పుస్తకాని విపుల సంఖ్యాయాం సంస్కృతే న లభ్యంతే ఇతి భవతి కేషాంచిత్ సంస్కృత ప్రణయినామపి సంస్కృతస్యోపరి ఆక్షేపః। పరన్తు ఏకస్య మహాభారతస్యైవ సర్వేషు పర్వసు విశేషతః శాంతి - అనుశాసన - వన - ఉద్యోగ పర్వసుయే ఏకైక లోకోపకారకా విషయా నిరూపితాః సన్తి తే సర్వేఽపి యది ఏకైక లఘు-లఘుపుస్తకరూపేణ సానువాదం ప్రకాశితాః స్యుస్తర్హి సంస్కృత సాహిత్యస్య ఏకా మహతీ న్యూనతా పూరయితుం శక్యతే। అత్ర ఉదాహరణమేకం దాతుమిచ్ఛామి। ఆంగ్ల భాషాయాం 'డేల్ కార్నేగీ' మహోదయస్య How to win friends & influence people ఇతి

పుస్తకే లోకే సమ్మానప్రాప్తేః ప్రభావవిస్తారస్యచయే ఉపాయా వర్ణితాః సన్తి తే సర్వేఽపి శాంతి పర్వణి సంక్షిప్తరూపేణ లభ్యన్తే యత్ర 'తస్మాత్ సర్వత్ర పూజితః' ఇతి వాక్యపర్యవసాయిభి రనేకైః శ్లోకైర్మునినా నారదేన ఆత్మనః సర్వత్ర సమ్మానప్రాప్తేః కారణాని నిర్దిష్టాని. ఏతాదృశాః శతాధికాః శిక్షాప్రదాః ప్రసంగాః ఉపలభ్యన్తే యేషాం లోకహిత దృష్ట్యా సంస్కృత ప్రచారదృష్ట్యా చ పృథక్ పృథక్ పుస్తకరూపేణ ప్రకాశనం పరమావశ్యకం వర్తతే।

పునశ్చ అవిశేషతయా సర్వేషాం మనుష్యాణాం శ్రేష్ఠతాయా ఉద్ఘోషః సర్వధర్మగతానామాచారాణాం సమాదరః, కేనాపి ధర్మేణ సహ విశేషస్యాభావః, ఆపత్తికాలేషు అవశ్యకతానుసారం ధర్మేషు పరివర్తనం, సర్వేషామపి వర్ణానాం సమానతాయాః ప్రతిపాదనం, ధర్మవ్యాధస్యాపి ఋషిపదేన సమ్మానప్రదానం, చతుర్ణామపి వర్ణానాం పరస్పరం భోజనపానాదౌ భేదభావస్య పరిత్యాగశ్చేత్యాదయో యే సిద్ధాంతాః ఉద్ఘోషితాస్తే సర్వే వర్తమానే వివిధ - జాతీయ - సాంప్రదాయిక - భేదభావజనిత - విద్వేష సంఘర్షఘృణాదిదోషగ్రస్తే సమాజే సద్భావనాం శాంతించ స్థాపయిత్వా మానవ సమాజస్య రాష్ట్రస్యచ బహు కల్యాణం సాధయితుమర్హన్తి। ఇత్యేవమాదయోఽనేకే మహాభారతస్య విశేషాః సన్తియే న కేవలం భారతే, న కేవలం వా ఏషియామహాద్వీపే ప్రత్యుత సమస్తే సభ్యే జగతి విద్వత్సమాజే చర్చాయా విషయాః సన్తి। తేషామత్ర విస్తరశో నిరూపణం నైతత్స్థానోచితమితి అత్రైవ విరమ్యతే।

అస్యైవ అష్టాదశపర్వాత్మకస్య గ్రంథస్య తెలుగుభాషానిబద్ధస్య పర్వ చతుష్టయ ప్రకాశానంతరం పంచమం పర్వ ఇదం ప్రకాశ్యతే ఉద్యోగపర్వ నామకమ్। విరాటపర్వణి పాండవానాం నిర్దిష్ట ప్రవాసకాలే అజ్ఞాతవాసస్యచ సమయే సమాప్తే ఉద్యోగపర్వణి భవిష్యతో యుద్ధస్య కృతే ఉద్యోగస్య ప్రారభ్యమాణత్వాదస్య పర్వణో నామ ఉద్యోగ ఇతి సర్వథాసార్థకం వర్తతే। ఇదంచ పర్వ దశసు ఉపపర్వసు విభక్తం వర్తతే। యథా - 1. సేనోద్యోగపర్వ 2. సంజయయానపర్వ 3. ప్రజాగరపర్వ 4. సనత్సుజాతపర్వ 5. యానసంధిపర్వ 6. భగవద్యానపర్వ 7. సైన్యనిర్యాణపర్వ 8. ఉలూకదూతాగమనపర్వ 9. రథాతిరథ సంజ్ఞాన పర్వ తథా 10. అంబోపాఖ్యానపర్వ చ। అస్య పర్వణః కించిద్విశిష్టం మహత్త్వం వర్తతే। అత ఏవ మహాభారతస్య వ్యాఖ్యాకారేణ శ్రీ నీలకణ్ఠేన యదుక్తం 'భారతే సారముద్యోగం' ఇతి తత్ ఉద్యోగపర్వణః

కతిపయ ప్రసంగానామవలోకనేన యథార్థమేవ ప్రతిభాతి। విదురస్య లౌకిక నీతీనాముపదేశః, మహర్షిసనత్సుజాతస్య ఆధ్యాత్మిక తత్త్వోపదేశః। సంజయస్య భగవతః శ్రీకృష్ణస్య ఉలూకస్య చ దౌత్యప్రసంగే శత్రు మిత్ర - యుద్ధసంధి - జయపరాజయాది విషయాణాం విస్తృతాచర్చా, సంజయ యుధిష్ఠిరసంవాదే విస్తృతం ధర్మాధర్మ వివేచనం, కుంతీ, గాంధారీ, ద్రౌపదీ - విదులా ప్రభృతీనాం నారీపాత్రాణాం వైదుష్యపూర్ణం హృదయోద్వేలకం చ కథోపకథనం, స్వాగత సత్కార - కుశలప్రశ్న - సభాసమితి వ్యవస్థాది వ్యావహారిక విషయాణాం మార్గదర్శకం, మనోహారి, ఉత్కృష్టసభ్యతా సూచకం వర్ణితంచేతి సర్వమపి ఉద్యోగపర్వణః సుష్ఠు మహత్త్వం సూచయతి. కిమధికం, ఉద్యోగపర్వ ఇతి నామాపి మనసః శరీరస్యచ శైథిల్యమపనీయ మానవం కర్మసు ప్రవర్తితుం ప్రేరణాం ప్రదదాతి।

ఏతస్య భారతీయ వాఙ్మయే మూర్ధన్యభూతస్య మహాగ్రంథస్య ఆంధ్ర భాషానువాదకర్తారః స్వనామధన్యాః శ్రీ కె. లక్ష్మణశాస్త్రిణః సన్తి యే అస్మాకం దౌర్భాగ్యవశాత్ సంప్రతి స్మృతిశేషతాం గతా వర్తన్తే। శ్రీమన్తః శాస్త్రిమహాభాగాః ప్రాచీన పరిపాట్యా ప్రాప్తేన వ్యాకరణ - సాహిత్య - దర్శనాది వివిధ శాస్త్రాణా మప్రతిమేన పాండిత్యేన, సరస సారగర్భిత - వక్తృత్వ కౌశలేన, ప్రసన్న - మధుర - గద్య పద్య రచనా చమత్కారేణ, లలిత గంభీర స్వరలహరీ సమలంకృతేన గద్య పద్య పాఠేన, ఆంధ్ర-సంస్కృత-ఆంగ్లభాషాతిరిక్తం హిందీ-ఉర్దూ-తమిళ-మరాఠీ ప్రభృత్యనేక భాషాణాం పరిజ్ఞానేన, సర్వజనాకర్షకక్షమేణ వ్యవహారేణచ న కేవలం స్వకీయే ప్రదేశే ప్రత్యుత సమస్తే భారతే భూయిష్ఠం లబ్ధ ప్రతిష్ఠాః, అనేక సంస్థాభిః సమర్పితానేక సమ్మానోపాధి విభూషితాః ప్రభూతైశ్చ సామాజికైర్గణ్యమాన్య జనైః సమ్మానితా ఆసన్। సంస్కృత ప్రచారార్థం దక్షిణ భారతయాత్రా ప్రసంగేన 1959 క్రీ. సంవత్సరే హైదరాబాదం గతవతోమమ సర్వ ప్రథమ మేతేషాం సాక్షాత్పరిచయః సంవృత్తః. తదానీం శాస్త్రిమహాభాగాః రాజ్యస్య సూచనావిభాగే అధికారిణః పదే విరాజమానా ఆసన్। తస్మిన్నవసరే కార్యాలయే ఏవ యః ఖలు అల్పకాలికః పరిచయోజాతః స ఏవ శనైః శనైః ఘనిష్ఠే సౌహార్దే పరిణతోఽభూత్। పునశ్చ యదాతే ఆంధ్రప్రదేశ్ ఉచ్చ సంస్కృత శిక్షాయా విశేషాధికారిపదే విరాజమానా ఆసన్ తదా నైకవారం తేషాం పరివారే నివాసస్య, తైః సహ సంపూర్ణే ఆంధ్ర

ప్రదేశే భ్రమణస్య తథావివిదేషు సభాసమారోహేషు భాగగ్రహణస్య అనేకధా సౌభాగ్యమధిగతమ్। తేషాం వ్యక్తిత్వం బహువిధానాం స్పృహణీయ గుణానాం సంగమ భూమి రాసీత్। తేషా మాకర్షకస్య వ్యక్తిత్వస్యయద్ దివ్యం చిత్రం మయా ప్రథమ సాక్షాత్కారే ప్రత్యక్షీకృతం తన్మయాతదానీమేవ ఏకస్మిన్ పద్యే ఉపనిబద్ధం యదధస్తా దుల్లిఖ్యతే—

మూర్తిర్మత్త గజేంద్ర గర్వదళనీ వాణీ వినోద ప్రియా
వ్యాఖ్యా-లేఖ-కవిత్వ-కౌశలకలా పారంగతా శేముషీ।
శక్తిః సంస్కృత భాషణేఽ ప్యనుపమావిద్వజ్జనేష్వాదరః
శ్రీ మల్లక్ష్మణ శాస్త్రిణాం గుణగణాః కేషాం నతోషావహాః॥

శ్రీ శాస్త్రి మహోదయా ఏకేన వ్యాధినా పీడితా అసమయ ఏవ దివంగతాః తేషామభావేన-న కేవలం తేషాం పరివారస్య అపితు మమాఽపి మహత్కష్టం జాతం మమ సంస్థాయాశ్చాపి అపూరణీయా క్షతిః జాతా। తైర్లిఖితానాం గ్రంథానాం ప్రకాశనేఽపి సుమహానవరోధః సముత్పన్నః। తథాపి ఇదం సుదృఢ మాశాసే యత్ తేషాం జ్యేష్ఠా ఆత్మజా, విద్యాయాం విద్వత్సమాజే చ లబ్ధాధిక సమాదరా డా॥ కె. కమలా, తేషామాత్మజా ప్రభాకర శ్రీకృష్ణా, తేషాం ధర్మపత్నీ అన్నపూర్ణమ్మా చ తేషామవశిష్టాని కార్యాణి పరిపూరయిష్యన్తి తథాతేషాం బాలసఖాయో విద్వద్వరేణ్యాః శ్రీ తిరుమల రామచంద్ర మహాభాగాః అపి స్వకీయేన సహయోగేన శాస్త్రిమహోదయానాం యశశ్శరీరం చిరస్థాయి విధాస్యన్తీతి, అంతే అహం పద్యేనైకేన తేభ్యః హార్దికస్మృతి ప్రసూనాంజలిం సమర్పయన్ లఘ ప్రాస్తావికం వక్తవ్యమిదం సమాపయామి।

సౌభాగ్యమాంధ్ర సుభువో బుధ మౌళిరత్నం సద్గద్య పద్యరచనా
ప్రవరం కవీంద్రమ్।
మజ్జీవనైక సుహృదం హృదయం ద్వితీయం శ్రీలక్ష్మణార్యమహ
మశ్రుముఖః స్మరామి॥

భావ నామ సంవత్సర
మకర సంక్రాంతిః - 1995

శ్రీ వాసుదేవ ద్వివేదీ శాస్త్రి
సార్వభౌమ సంస్కృత ప్రతిష్ఠానమ్
వారాణసీ

భారతం – భారతోపమమ్

(తెలుగు అనువాదము)

సంస్కృతములో ప్రచారములోనున్న 'గగనము-గగనాకారము, సాగరము-సాగరోపమము' అను సూక్తి అన్ని విధాలుగా యథార్థమే. అలాగే ఒకవేళ 'భారతానికి భారతమే సాటి' అన్నచో, అది కూడా అన్నివిధాల యథార్థమే కాగలదని నా బలమైన ధారణ.

నిజానికి మహాభారతము విశ్వసాహిత్యము యొక్క 'అన్నింటినీ అతిశయించే సాటిలేని' గ్రంథరత్నము. ఇది అనుపమేయమనుటలో పెక్కు హేతువులు గలవు. అవన్నియు చాలావరకు మహాభారతములోనే ఉల్లేఖింపబడినవి.

'యదిహాస్తి తదన్యత్ర యన్నేహాఽస్తి న తత్ క్వచిత్'

స్వర్గారోహణ పర్వ

(ఏది ఇందున్నదో అది వేరొకచో నున్నది. ఏది ఇందు లేదో అది ఎక్కడనూ లేదు)

'అర్థశాస్త్ర మిదం ప్రోక్తం ధర్మశాస్త్ర మిదం మహత్।
కామశాస్త్ర మిదం ప్రోక్తం వ్యాసేనామిత బుద్ధినా॥ 83
శ్రుత్వాత్విదము పాఖ్యానం శ్రావ్యమన్యన్న విద్యతే।
పుంస్కోకిలగిరం శ్రుత్వా రూక్షా ధ్వాంక్షస్య వాగివ॥ 84

ఆదిపర్వణి. ద్వితీయోఽధ్యాయః

సామాన్యంగా మహాభారతము కౌరవ పాండవుల యుద్ధము యొక్క ఇతిహాసరూపముగా ప్రసిద్ధమైననూ సమగ్రంగా, గంభీరంగా అధ్యయనం చేయగా, ఈ గ్రంథము చాలాకాలమునుండి ప్రాచీన ఋషిమహర్షులచేత చేయబడిన జ్ఞానవిజ్ఞానసాధనకు విశ్వకోశముగా తోచును. ఈ గ్రంథములో యుద్ధ విషయకమైన అనేక ప్రసంగములేకాక, అన్ని పర్వములయందు ఎంతో కొంత

ధర్మార్థకామమోక్షముల, వర్ణాశ్రమ - ధర్మ-రాజనీతి-సామాన్యనీతి-మానవధర్మ-పాప-పుణ్యాది విషయములకు సంబంధించిన ఏ విచారములు మరియు సిద్ధాంతములు విశదంగా ప్రతిపాదించబడినవో అవి వేరే ఒక గ్రంథములో కనబడుట అన్ని విధాల సుదుర్లభమే! అందుకే, ఈ గ్రంథములోని శ్లోక సంఖ్య కూడా కేవలం భారతదేశానికి చెందినవేకాక విశ్వానికి చెందిన కావ్యగ్రంథాలను అతిశయించును. పాశ్చాత్య దేశాలలో గ్రీకుదేశమునకు చెందిన సుప్రసిద్ధ మహాకవి 'హోమరు' మహోదయుని 'ఒడిసీ-ఇలియడ్' అను రెండు కావ్యములలోని మొత్తము శ్లోక సంఖ్యకంటె మహాభారతములోని శ్లోకముల సంఖ్య ఎనిమిదిరెట్లు ఎక్కువ వుండునని 'మెక్‌డోనెల్' మహాశయుడు తను రచించిన 'సంస్కృత సాహిత్య ఇతిహాస'మను గ్రంథమున వ్రాసెను. (హిందీ. అను. పుట 264.)

మహాభారతము యొక్క మరియొక గొప్పతనమేమంటే - మహాభారత రచన ప్రాచీనమాన్యత ననుసరించి వేదాధ్యయనమునందు అధికారములేని స్త్రీలు, శూద్రులు, ద్విజబంధువులు మొదలయిన సామాన్య జనులకు వేదములో ప్రతిపాదింపబడిన అర్థమును తెలియజేయుటకొఱకు మరియు దానిద్వారా వారికి అన్నిరకాల శుభము సాధించుటకు భగవత్ వేదవ్యాసులచే చేయబడినది- శ్రీమద్భాగవతములోని చతుర్థ స్కంధములో-

'స్త్రీ శూద్రద్విజ బంధూనాం త్రయీనశ్రుతి గోచరా।
ఇతి భారతమాఖ్యానం కృపయా మునినాకృతమ్॥

భారత వ్యపదేశేన అమ్నాయార్థశ్చ దర్శితః

(స్త్రీ, శూద్ర, ద్విజబంధు మొదలగువారికి వేదము నందధికారములేదు. అందుకని దయతో మునిచేత భారతమను ఆఖ్యానము రచియింపబడినది. భారత నెపముతో వేదార్థము చూపబడినది.)

అట్టి ఈ భారతము జనసాహిత్యమని, లోకసాహిత్యమని, సామాజిక సాహిత్యమని కూడా అన వీలున్నది.

ఇంకా ధర్మ, అధ్యాత్మదర్శన, రాజనీతి మొదలైన గంభీర విషయముల వలె సర్వసాధారణముగా ఉపయోగపడునవి, తెలియదగినవీ అగు విషయములు

కూడా మహాభారతములో సువిశాలముగా గ్రహింపబడినవి. దీనిని అక్కడక్కడా అభ్యాసములుగా, ప్రశ్నోత్తరములుగా ఉల్లేఖింపబడుటను చూడవచ్చును. సర్వసామాన్య జనుల లౌకిక జీవనములోని కల్యాణానికి, సమృద్ధికి, సఫలతకు, ఆనందానికి చాలా ఉపయోగపడే ఇలాంటి పుస్తకాలు అనేకంగా పాశ్చాత్య పండితులచే ఆంగ్లభాషలో రచింపబడినాయి. అట్టి లోకోపకారకములైన పుస్తకాలు ఎక్కువ సంఖ్యలో సంస్కృతంలో లభించడంలేదని సంస్కృత అభిమానులు కూడా ఆక్షేపించుచున్నారు. కాని, ఒక్క మహాభారతంలోనే అన్ని పర్వములలో, విశేషంగా శాంతి-అనుశాసన-వన-ఉద్యోగ పర్వములలో ఏవైతే లోకోపకారకములైన విషయాలు నిరూపించబడినాయో అవన్నీ కూడా ఒకవేళ విడివిడిగా చిన్నచిన్న పుస్తకాలలో అనువాదంతో సహా ప్రకాశింపబడితే, సంస్కృత సాహిత్యము యొక్క ఒక గొప్ప లోటు పూరింపబడగలదు. ఇక్కడ ఒక ఉదాహరణాన్ని ఇవ్వాలనుకుంటున్నాను. ఆంగ్లభాషలో 'డేల్‌కార్‌నేగీ' మహోదయుని 'How to win friends & influence people' అను పుస్తకంలో - సమాజంలో సమ్మానప్రాప్తికై మరియు ప్రభావాన్ని విస్తరింపచేసుకొనుటకై ఏ ఉపాయాలైతే వర్ణింపబడినాయో అవన్నీ శాంతిపర్వంలో సంక్షేపంగా లభిస్తాయి. అక్కడ 'తస్మాత్ సర్వత్ర పూజితః' అను వాక్యముతో ముగిసే చాలా శ్లోకాలలో, ముని నారదునిచే అంతటా తనకు సమ్మానము లభించుటకు కారణాలు నిర్దేశింపబడినాయి. ఇలాంటి వందలకొద్ది శిక్షనిచ్చు ప్రసంగాలు లభిస్తాయి. వీనిని సమాజ హితముకొఱకు సంస్కృత ప్రచార దృష్ట్యాకూడా విడివిడి పుస్తకాలుగా ముద్రించుట అత్యవసరము.

భేదములేకుండా మానవులందరు శ్రేష్ఠులేనని ఉద్ఘోషించుట, సర్వ ధర్మములలోని ఆచారములను సమాదరించుట, ఏ ఒక్క ధర్మము గొప్పదను భావము లేకుండుట, ఆపత్తికాలములో అవసరము ననుసరించి ధర్మాలను కొలదిగా సవరించుట, అన్ని వర్ణములూ సమానమని ప్రతిపాదించుట, ధర్మవ్యాధుని కూడా ఋషిపదముతో సన్మానించడం, నాలుగు వర్ణములలోనూ పరస్పరం భోజనపానాదులలో భేదభావాన్ని విడనాడడం - మొదలయిన సిద్ధాంతాలేవైతే ఉద్బోధింపబడ్డాయో ఇవన్నీ ఇప్పటి వివిధ - జాతీయ - సాంప్రదాయిక భేదభావముచే జనించిన ద్వేష, సంఘర్షణ, అసహ్యము మొదలైన దోషములతో

కూడిన సమాజంలో సద్భావనను శాంతినీ నెలకొల్పి మానవ సమాజానికి మరియు రాష్ట్రానికి కూడా మేలును సాధించగలవు ఇలాంటి చాలా విషయాలు కేవలం భారతదేశంలోనో, లేదా ఆసియాద్వీపంలోనో కాదు - మొత్తం సభ్యసమాజంలో, విద్వత్సమాజంలోనూ చర్చా విషయాలయినాయి. వాటన్నిటిని ఇక్కడ విస్తరంగా నిరూపించడం ఈ స్థానంలో తగనిదని ఇంతటితో విరమిస్తున్నాను.

పద్దెనిమిది పర్వాలలో కూర్చబడిన ఈ గ్రంథముయొక్క తెలుగు భాషా అనువాదము నాలుగు పర్వాల ముద్రణ తరువాత ఇపుడు ఉద్యోగపర్వమనే అయిదవ పర్వముతో ప్రకాశింపబడుతున్నది. విరాటపర్వములో పాండవుల నిర్దిష్ట ప్రవాసకాలము మరియు అజ్ఞాతవాస సమయము ముగిసిన తరువాత ఉద్యోగ పర్వమునందు జరుగబోవు యుద్ధముకొఱకు 'ఉద్యోగము' మొదలు కాబోవుచున్నందున ఈ పర్వానికి 'ఉద్యోగ పర్వమను' పేరు పూర్తిగా సార్థకము. ఈ పర్వము పది ఉపపర్వాలుగా విభజింపబడినది. అవి- 1. సేనోద్యోగ పర్వము 2 సంజయయాన పర్వము 3 ప్రజాగర పర్వము 4. సనత్సుజాత పర్వము 5. యానసంధి పర్వము 6. భగవద్యాన పర్వము 7. సైన్యనిర్యాణ పర్వము 8. ఉలూకదూతాగమన పర్వము 9. రథాతిరథసంఙ్ఞానపర్వము మరియు 10. అంబోపాఖ్యానపర్వము. ఈ ఉద్యోగపర్వమునకు విశిష్టత మరియు గొప్పతనము గలదు. అందుకే మహాభారత వ్యాఖ్యాకారుడైన శ్రీ నీలకణ్ఠులచే 'భారతములో సారము ఉద్యోగపర్వము' అను మాట అనబడినది. ఉద్యోగపర్వములోని కొన్ని ప్రసంగాలను పరిశీలించుటచే ఇది సత్యమని తేలును. విదురునిచే లౌకికనీతుల ఉపదేశము, మహర్షి సనత్సుజాతునిచే ఆధ్యాత్మిక తత్త్వముల ఉపదేశము, సంజయుని, భగవంతుడైన శ్రీకృష్ణుని, ఉలూకుని దౌత్యప్రసంగములో శత్రుమిత్ర - యుద్ధ సంధి - జయపరాజయాది విషయాల విస్తృతచర్చ, సంజయ యుధిష్ఠిర సంవాదంలో విస్తృతమైన ధర్మాధర్మ వివేచనం, కుంతీ, గాంధారి, ద్రౌపది, విదుల మొదలైన నారీ పాత్రల పాండిత్యపూర్ణము, హృదయోద్వేలకమునైన కథోపకథనం, స్వాగత సత్కార - కుశల ప్రశ్న - సభాసమితి వ్యవస్థాది వ్యావహారిక విషయాల మార్గదర్శకం మనోహరము, ఉత్కృష్ట సభ్యతా సూచకము అగుట ఉద్యోగపర్వము యొక్క గొప్పతనాన్ని సూచించును. అంతెందుకు, ఉద్యోగపర్వమును పేరే మనస్సు యొక్క శరీరముయొక్క శైథిల్యాన్ని తొలగించి, మానవుని కర్మలయందు ప్రవర్తించుటకు ప్రేరణనిచ్చును.

భారతీయ వాఙ్మయములో మూర్ధన్యభూతమైన ఇట్టి మహాగ్రంథము యొక్క ఆంధ్రభాషానువాదకర్తలు స్వనామముచే ధన్యులైన శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు. మన దౌర్భాగ్యవశాత్తు వీరిపుడు స్మృతి శేషులయినారు. శ్రీ శాస్త్రి మహోదయులు ప్రాచీన పరిపాటి ద్వారా పొందిన వ్యాకరణ - సాహిత్య - దర్శనాది వివిధ శాస్త్రాల యందలి సాటిలేని పాండిత్యముచే, సరస-సారగర్భిత - వక్తృత్వకౌశలముచే, ప్రసన్న - మధుర - గద్యపద్యరచనా చమత్కారముచే, లలితము గంభీరమునైన స్వరలహరితో కూడిన గద్యపద్య పఠనచే, ఆంగ్ల - సంస్కృత - ఆంధ్రభాషలేకాక హిందీ, ఉర్దూ - తమిళ - మరాఠీ మొదలైన భాషల పరిజ్ఞానముచే, సర్వజనాకర్షక సమర్థమైన వ్యవహార ముచే కేవలం తమ ప్రదేశములోనే గాక సమస్త భారతదేశములో మిక్కిలి ప్రతిష్ఠను పొందినారు. అనేక సంస్థలచే పెక్కు సన్మాన, ఉపాధులచే గౌరవింపబడినారు, అనేకులైన గణ్యులు మాన్యులును అగు వ్యక్తులచే సన్మానింపబడినారు. సంస్కృత ప్రచారానికై దక్షిణభారతదేశయాత్ర చేయునపుడు క్రీ.శ. 1959 సంవత్సరములో హైదరాబాద్ వెళ్ళిన నాకు మొదటిసారిగా వీరి సాక్షాత్పరిచయము కలిగినది. అపుడు శ్రీ శాస్త్రి మహోదయులు ప్రభుత్వసూచనా విభాగములో అధికారి పదము నలంకరించి వుండిరి. ఆ సందర్భంగా కార్యాలయములో కలిగిన ఆ కొద్దిసేపటి పరిచయము మాత్రము మెలమెల్లగా గట్టి స్నేహముగ మారెను. మరల, వారు ఆంధ్రప్రదేశములోని ఉచ్చసంస్కృత శిక్షయొక్క విశేషాధికారి పదమునలంకరించి వుండగా, పెక్కు పర్యాయములు వారి పరివారముతో కూడి నివసించు భాగ్యము, వారితో సంపూర్ణ ఆంధ్రదేశమున పర్యటించు భాగ్యము, అలాగే వివిధ సభాసమారోహములలో భాగము వహించు భాగ్యము కలిగినది. వారి వ్యక్తిత్వము అనేక రకాలైన స్పృహణీయ గుణాలకు సంగమ భూమిగ ఉండెడిది. మొదటిసారి వారిని కలిసినపుడు వారి ఆకర్షించు వ్యక్తిత్వము యొక్క ఏ దివ్యచిత్రము నాకు ప్రత్యక్షమైనదో దానిని అపుడే ఒక పద్యములో కూర్చియుంటిని. అది క్రింద ఇవ్వబడినది.

'మూర్తిర్మత్త గజేంద్ర గర్వదళనీ వాణీ వినోద ప్రియా
వ్యాఖ్యా-లేఖ-కవిత్వకౌశలకళా పారంగతా శేముషీ।
శక్తిః సంస్కృతభాషణేఽప్యనుపమావిద్వజ్జనేష్వాదరః
శ్రీ మల్లక్ష్మణశాస్త్రిణాం గుణగణాః కేషాం న తోషావహాః॥'

ఒకానొక వ్యాధిచే పీడింపబడి శ్రీ శాస్త్రిగారు అకాలముగనే దివంగతులయినారు. వారు లేకపోవడం వారి కుటుంబానికి కాదు - నాకు కూడా గొప్ప బాధను కలగించింది. మా సంస్థకు కూడా పూడ్చలేని లోటును కలిగించింది. వారు రచించిన గ్రంథాలను ముద్రించుటలో కూడా గొప్ప అడ్డంకు ఏర్పడింది. అయినప్పటికీ, వారి పుత్రిక - విద్యలో, విద్వత్సమాజములోనూ అధిక సమాదరమును పొందిన - డా॥ కె. కమల, డా॥ శాస్త్రిగారి తనయులగు ప్రభాకర, శ్రీకృష్ణులు, శాస్త్రిగారి ధర్మపత్ని అన్నపూర్ణమ్మగారు - శాస్త్రిగారి మిగిలిన పనులను పూర్తిచేయగలరనీ, అలాగే శాస్త్రిగారి బాల్యమిత్రులైన విద్వద్వరేణ్యులు శ్రీ తిరుమల రామచంద్రగారు కూడా తమ చేయూతతో శ్రీ లక్ష్మణశాస్త్రిగారి యశశ్శరీరమును చిరస్థాయిగా చేయగలరని దృఢముగా ఆశించుచున్నాను, చివరగా, ఒక పద్యము ద్వారా వారికి నా హార్దికస్మృతి పుష్పాంజలిని సమర్పిస్తూ. ఈ చిన్ని ప్రస్తావనను ముగిస్తున్నాను.

'సౌభాగ్యమాంధ్ర సుభువో బుధ మౌళిరత్నం సద్గద్యపద్యరచనాప్రవరం
కవీంద్రమ్,
మజ్జీవనైక సుహృదం హృదయం ద్వితీయం శ్రీ లక్ష్మణార్యమహమశ్రు
ముఖః స్మరామి॥

(ఆంధ్రదేశముయొక్క సౌభాగ్యము, పండితుల మౌళిరత్నము, చక్కని గద్యపద్యరచన చేయడంలో దిట్ట, కవీంద్రుడు, నా జీవనైకమిత్రుడు, నా రెండవ హృదయము అగు శ్రీ లక్ష్మణార్యుని అశ్రుముఖుడనై నేను స్మరిస్తూవున్నాను.)

—శ్రీ వాసుదేవ ద్వివేదీ శాస్త్రి
సార్వభౌమ సంస్కృత ప్రతిష్ఠానము
వారాణసి

భావ సంవత్సర
మకర సంక్రాంతి, 1995.

లక్ష్మీపతి యశస్తిలకము

వేదమాత లలాట ప్రాంతములో మెరయు కాశ్మీర తిలకము రామాయణ భారతాత్మకము - ఆ తిలక ప్రభను వేదవ్యాస, వాల్మీకి ఋషిపుంగవులు తీర్చి దిద్దగా వివిధ భారతీయ భాషలలోనికి ఈ గ్రంథముల ననువదించిన కవి పండిత వరేణ్యులు ఈ తిలకము చెదరకుండగా కాపాడి యశఃకాయులైనారు.

కీర్తిశేషులు శ్రీ కప్పగంతుల లక్ష్మణ శాస్త్రిగారు ఈ తిలకరచనను చేసిన ఆంధ్ర కవులలో అగ్రగణ్యులు. వారు దిద్దిన తిలకము తెలుగింటి ఆడపడుచు నుదుట రూపాయి బొట్టంత మెరయు అలంకారము . సంస్కృతాంధ్ర సాహిత్య లోకమునకు వారు సుపరిచితులు. 10-1-81 నాడు వారు దివంగతులయిన తరువాత వారి సతీమణి శ్రీమతి కప్పగంతుల అన్నపూర్ణమ్మగారు వారు తెలుగు వచనములో వెలయించిన మహాభారతమును ప్రకాశింపజేయ సమకట్టి 1990 సంవత్సరమున ఆది, సభాపర్వములు. 1991 సంవత్సరమున విరాటపర్వము, 1992 సంవత్సరమున అరణ్య పర్వమును ముద్రింపజేయగా ఆ గ్రంథములు ఆంధ్ర సహృదయుల అభిమానమును చూరగొన్నవి. ఇప్పుడు అయిదవదగు ఉద్యోగ పర్వము పాఠకలోకమున కందజేయ గలిగినందులకు చాలా సంతోషముగా నున్నది.

మహాభారతములోని ప్రతి పర్వమును సారవంతమే అయినప్పటికిని, ఉద్యోగపర్వమును ప్రశంసించుచు, భారత వ్యాఖ్యాత నీలకంఠపండితుడు "భారతే సారముద్యోగమ్" అని పలుకుట యుక్తమే, ఈ పర్వములో బ్రహ్మమానస పుత్రుడగు సనత్సుజాత మహర్షి విదురుని విజ్ఞాపనము మేరకు ధృతరాష్ట్రునకు ధర్మోపదేశమును చేయుచు మృత్యుస్వరూపమును నిరూపించుట, శ్రీకృష్ణ భగవానుడు దూతగా వెళ్ళి విశ్వరూపమును చూపించుట వంటి విశేషాంశములు కథ వేదోపబృంహణమును చేయుటను నిరూపించుచున్నవి.

ఉద్యోగపర్వముతో మహా భారతమునకు నారాయణ కథ అను పేరు సార్థకమయినది.

వేదాంత ప్రస్థానత్రయముగా ఉపనిషత్తులు (శ్రుతి) బ్రహ్మసూత్రములు (స్మృతి) భగవద్గీత (పురాణము) ప్రసిద్ధములు. సనత్సుజాతీయము (ఉద్యోగ

పర్వాంతర్గతము), భగవద్గీత (భీష్మపర్వాంతర్గతము), విష్ణుసహస్రనామము (అనుశాసనపర్వాంతర్గతము) ఈ మూడును మహాభారత ప్రస్థానత్రయము అని తెలిసికొనవచ్చును - ఈ మూడింటికిని ఆది శంకరులు భాష్యమును ప్రవచించుట విశేషము. సనత్సుజాతీయము జ్ఞానబోధకము, భగవద్గీత జ్ఞాన కర్మసముచ్చయము భక్తియుక్తము అని విష్ణుసహస్రనామము కలియుగములో నామసంకీర్తన ప్రాశస్త్యమును ప్రవచించు భక్తి గ్రంథము అని తోచును.

ఈ ఉద్యోగపర్వ ప్రచురణముతో ఆది పంచక ప్రచురణము ముగిసినది. ఆది పంచకమునైననూ గ్రంథరూపములో చూడవలెనను శ్రీ లక్ష్మణశాస్త్రిగారి కోరిక ఇప్పుడు నెరవేరినది. స్వర్గమునుండియే వారు తమ బాష్పాంబుపూరములతో శ్రీకృష్ణభగవానుని అభిషిక్తుని గావించియుందురు కాబోలును. ఇక అభిషిక్తుడయిన, ఆ పరమాత్ముడు రథసారథ్యమును వహించి అనతికాలములోనే భగవద్గీతను ప్రవచించు భీష్మపర్వము యొక్క ప్రచురణకు అనుగ్రహించుగాక!

శ్రీకృష్ణ దౌత్యమును వర్ణించుచు భాసమహాకవి "దూతవాక్యము" అను సంస్కృత నాటకమును రచించెను. వేణీ సంహార నాటకములో ప్రసంగవశమున భట్టనారాయణ కవి శ్రీకృష్ణదౌత్యమును స్పృశించెను శ్రీకృష్ణునంతనివాడు ప్రయత్నించినను సంధిపొసగకుండుట విధినిర్ణయము కదా!

శ్రీ లక్ష్మణశాస్త్రిగారి వచన రీతి అలతి అలతిగా చేసిన పదబంధముతో ప్రామాణికమగు అనువాదముతో శాంత ప్రసన్నమగు వాహినిని తలపించును. ఎన్నిమార్లు చదివినప్పటికిని తనివితీరనిది భారత కథ. ఆ పట్టును సడలించక గంభీర రచన చేసిన శ్రేయస్సు శాస్త్రిగారికి దక్కినది. ఈ రచనలోని స్పష్టత చదువరులకు కొట్టవచ్చినట్లు కనిపించును.

వారి పద గుంభనము మల్లెమాలవలె, చామంతుల బంతివలె సుగంధ భరితము సువర్ణయుక్తము అయి ఇంద్రధనుస్సును తలపించును. సంస్కృతాంధ్రముల రచనములో సిద్ధహస్తులయిన ప్రాచీన కవుల మార్గమును వీరు అనుసరించిరి. ఇచ్చట యుద్ధవర్ణనము, ఉపదేశ కథనమును యథోచితము ఓజః ప్రసాదగుణములను మేళవించుకొన్నవి.

ఈ ఉద్యోగపర్వమునకు శ్రీ లక్ష్మణశాస్త్రిగారి సుహృద్వరేణ్యులు, వారికి రెండవ హృదయమును అగు శ్రీ వాసుదేవ ద్వివేదిశాస్త్రిగారు ఉపోద్ఘాతమును వ్రాసిపంపుట సువర్ణమునకు తావి అబ్బినట్లయినది. శ్రీ ద్వివేదిగారు తమ జీవనమును సంస్కృత ప్రచారమున కంకితము చేసిన ఋషివరేణ్యులు. దేశవిదేశములలో వీరి సంస్కృతదీక్ష ప్రశంస నందుకున్నది. వారు సంస్కృతములో మధుర కవులు. బాలసంస్కృత సాహిత్యమునకు బాటలు వేయుటయేగాక, వివిధ ప్రక్రియ

లను చేబట్టి రచనలు చేసిన ఘనులు. కవితలోని,మాధుర్యము గాంభీర్యము, వైదుష్యము వారి సంస్కృత వక్తృత్వములోనూ కనిపించును. సంస్కృతాన్యములగు భాషలలో వారు భాషించుట అరుదు. కింబహునా వారు సంస్కృతైక జీవులు. మహాభారతములోని వివిధ ఘట్టములను చిన్న చిన్న స్వతంత్ర పుస్తకముల రూపములో ప్రకాశింపజేసినచో (ప్రసిద్ధ ప్రచురణలకన్న భిన్నములైనవి) అవి వ్యక్తి వికాసమున కుపకరించునని వారు చేసిన సూచన విలువైనది మల్లెలను మంజూషములో బంధించక విరజిమ్మితే వాని ఆమోదము జనామోదమును పొందును కదా! వారికి మా కృతజ్ఞతాపూర్వక ప్రణామములు.

విరాటారణ్య పర్వములను వ్యత్యస్తముగా మొదట విరాటపర్వమును ఆ తరువాత అరణ్యపర్వమును ప్రచురించుట జరిగినది. ఆ తరువాత పుస్తకముల అమ్మకము కొంత వెనుకబడినందున ఉద్యోగపర్వ ప్రచురణమునకు జాగైనది. అట్టిస్థితిలో ఆంధ్ర విశ్వవిద్యాలయము భౌతికశాస్త్ర శాఖలో రీడరుగా పనిచేయుచున్న శ్రీ లక్ష్మీపతిరావుగారితో శ్రీ కప్పగంతుల కృష్ణమూర్తి (శాస్త్రిగారి పుత్రుడు) కలిసి, ఈ విషయమును ప్రస్తావించగా-వారు అప్పటికప్పుడే ఇరువది అయిదువేలరూపాయలకు చెక్కును వ్రాసియిచ్చి గ్రంథప్రచురణ జరుగుటకు తోడ్పడిరి.

శ్రీ లక్ష్మీపతిరావువంటి వదాన్యులను ఏమని పొగడగలము? ఏవిధంగా కృతజ్ఞతలు చెప్పుకొనగలము? వారి యశస్సు ఉద్యోగపర్వ ప్రచురణముతో పెనవేసుకున్న మాధవీలత-

పాండవ పక్షపాతియగు శ్రీకృష్ణపరమాత్మ శ్రీ లక్ష్మీపతిరావుగారిని ధర్మానురక్తులనుగా స్థిరముగా నిలుపుగాకయని వేడుకొనుచు, లక్ష్మీపతి యశస్తిలకమగు ఈ ఉద్యోగపర్వము పాఠకుల ఆదరము పొందగలదని, మునుముందు పర్వముల ప్రచురణమునకిది దోహదము కలిగించగలదని ఆశిస్తున్నాము.

మహాభారతములోని తొలి నాలుగు పర్వములతోబాటు అయిదవదగు ఉద్యోగపర్వమును ముద్రించిన పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్ వారికి మా కృతజ్ఞతలు.

ఇట్లు

ప్రకాశకులు

వేదవ్యాసకృత మహాభారతము

ఉద్యోగ పర్వము

విషయ సూచిక

1. సేనోద్యోగ పర్వము — పుట సంఖ్య

విరాట సభలో శ్రీకృష్ణుని ప్రవచనము 1
పాండవులు మిత్రులతో సంప్రదించుట 2
బలరాముని యభిప్రాయము 4
సాత్యకి బలరాముని నధిక్షేపించుట 6
ద్రుపదుని యభిప్రాయము 8
శ్రీకృష్ణుని యభిప్రాయము 9
రాజులు పాండవ పక్షములో చేరుటకు వచ్చుట 10
ద్రుపదుడు పురోహితుని కౌరవులకడకు పంపుట 10
అర్జున దుర్యోధనులు కృష్ణ సహాయము కోరుట 12
శల్యుడు పాండవులకడకు పోవుట 15
దుర్యోధనునకు శల్యుడు సహాయ పడుటకు అంగీకరించుట 16
పాండవులకు హితము చేయ శల్యుడంగీకరించుట 18
శల్యుడు త్రిశిరోవధ, వృత్రాసురోత్పత్తి, వృత్రేంద్ర యుద్ధం, దేవ పరాజయాదులను వర్ణించుట 19
దేవతలు విష్ణువుకడకు పోవుట 24
విష్ణువు వృత్రవధోపాయము చెప్పుట 25
వృత్రవధ 27
ఇంద్రుడు బ్రహ్మహత్యా దోషము చేత జల ప్రవేశము చేయుట 28
నహుషుడు ఇంద్రుని భార్యను కోరుట 29
బృహస్పతి శచీదేవికి అభయమిచ్చుట 31
శరణాగత రక్షణఫలము 31
నహుషుడు శచీ ప్రార్థనను అంగీకరించుట 32
ఇంద్రునకు బ్రహ్మహత్యా సముద్ధారము 33
శచీదేవి రాత్రిదేవిని ఉపాసించుట 34

ఉపశ్రుతి సహాయము చేత శచీదేవి యింద్రుల సమాగమము 34
శచీదేవి కోరికచేత నహుషుడు మహర్షులను వాహనములనుగా చేసికొనుట 36
అగ్ని - బృహస్పతుల సంవాదము 37
బృహస్పతి అగ్నిని, ఇంద్రుని స్తుతించుట 38
బృహస్పతి లోకపాలుడు ఇంద్రునితో సంభాషించుట 40
అగస్త్యుడు ఇంద్రునకు నహుషపతన వృత్తాంతము చెప్పుట 41
ఇంద్రుని స్వర్గ రాజ్యపాలనము - అంగిరసుని సమాగమము - శల్యుడు దుర్యోధనుని కడకు పోవుట 43
యుధిష్ఠిర - దుర్యోధనుల సహాయము కొరకు వచ్చిన రాజుల వర్ణనము 44

2 సంజయయాన పర్వము
పురోహితుని రాయబారము 46
పురోహితుని మాటలు అనుమోదించి భీష్ముడు అర్జునుని ప్రశంసించుట 48
కర్ణుడు పురోహితుని ఆక్షేపించుచు మాట్లాడుట 48
భీష్ముడు కర్ణుని అధిక్షేపించుట 49
భీష్ముని స్మరించుచు ధృతరాష్ట్రుడు పురోహితుని సన్మానించి పంపుట 49
సంజయుని రాయబారము - ధృతరాష్ట్రుడు పాండవుల ప్రతిభను వర్ణించుట 50
సంజయ - యుధిష్ఠిరుల పరస్పర కుశల ప్రశ్నము 55
యుధిష్ఠిరుని ప్రశ్నములకు ఉత్తరము చెప్పి, సంజయుడు ధృతరాష్ట్ర సందేశము చెప్పుటకు పూనుట 57
సంజయుడు ధృతరాష్ట్ర సందేశమును ధర్మజునకు వినిపించుట - యుధిష్ఠిరుని శాంతింపుమని కోరుట 59
యుధిష్ఠిరుడు సంజయునకు ఇంద్రప్రస్థప్రధానము చేతనే సంధి కుదురునని చెప్పుట 61

సంజయుడు మరల బోధించుచు యుద్ధ దోషములను గూర్చి చెప్పుట 65
యుధిష్ఠిరుడు సంజయునకు ఉత్తరము చెప్పుట 68
శ్రీకృష్ణుడు తన సందేశమును సంజయునకు చెప్పుట 70
యుధిష్ఠిరుడు సంజయుని ప్రశంసించి తన సందేశము చెప్పుట 79
యుధిష్ఠిరుడు కురుముఖ్యులకు సందేశమంపుట 79
అర్జునుని సందేశము 85
సంజయుడు ధృతరాష్ట్రునకు యుధిష్ఠిరాదుల సందేశములు వినిపించుట 85
సంజయుడు ధృతరాష్ట్రుని నిందించుట ... 87

3. ప్రజాగర పర్వము
ధృతరాష్ట్ర, విదురుల సంవాదము 90
విదురనీతి 91
పండిత లక్షణము 92
మూరలక్షణము 93
సాధారణ నీతులు 94
క్షమాగుణము 95
ధృతరాష్ట్రునకు విదురుడు నీతులు చెప్పుట 103
కేశిని నిమిత్తముగా సుధన్వ-విరోచనుల వివాదము
విదురుడు చెప్పి ధృతరాష్ట్రునకు ధర్మోపదేశము చేయుట 111
దత్తాత్రేయ మహాముని సాధ్యులకు హితోపదేశము చేయుట 119
మహాకులీన లక్షణము వర్ణించి విదురుడు ధృతరాష్ట్రునకు ఉపదేశించుట 121
విదురుడు ధృతరాష్ట్రునకు హితోపదేశము చేయుట 127
విదురుడు ధృతరాష్ట్రునకు నీతిని ఉపదేశించుట 134
విరుదుడు ధర్మముయొక్క మహత్త్వమును ప్రతిపాదించుట 147
బ్రాహ్మణాది నాల్గు వర్ణముల ధర్మమును సంగ్రహముగా వర్ణించుట ....

4. సనత్సుజాత పర్వము
విదురుడు తలచగానే వచ్చిన సనత్సుజాతునితో విదురుడు ధృతరాష్ట్రునకు ఉపదేశింపుమని ఆయనను ప్రార్థించుట 151

సనత్సుజాతుని ఉపదేశము-ధృతరాష్ట్రుని ప్రశ్నములకు
సనత్సుజాతుడు బదులు చెప్పుట - మృత్యుస్వరూప
నిరూపణము 153

మౌన-తపస్త్యాగ-అప్రమాద-దమాదిగుణముల మదాది
దోషములయు నిరూపణము 159

వేదస్వరూప నిరూపణము 165

బ్రహ్మచర్య-బ్రహ్మల నిరూపణము 168

బ్రహ్మచర్య నిరూపణము 169

గుణదోషలక్షణము-బ్రహ్మవిద్యానిరూపణము 173

మైత్రీగుణములు 174

పరమాత్మ స్వరూప వర్ణనము - యోగులు చేయు
పరమాత్మ సాక్షాత్కార ప్రతిపాదనము 176

శుద్ధ పరబ్రహ్మ స్వరూప నిరూపణము 176

5. **యానసంధి పర్వము :**

పాండవులకడనుండి వచ్చిన సంజయుడు కౌరవసభలో
ప్రవేశించుట. 183

కౌరవసభలో సంజయుడు అర్జునుని సందేశము తెలుపుట 184

శ్రీకృష్ణ మహిమ అర్జునుడు చెప్పుట 193

భీష్ముడు కృష్ణార్జునుల మహిమను దుర్యోధనునకు చెప్పి
కర్ణుని నిందించుట - కర్ణుని ఆత్మప్రశంస - అతనిని
భీష్ముడు పరిహసించుట - భీష్మునిమాట ద్రోణుడు
అనుమోదించుట 199

సంజయుడు యుధిష్ఠిరుని ముఖ్య సహాయకులను గూర్చి
వర్ణించుట 204

భీముని పరాక్రమము స్మరించి ధృతరాష్ట్రుడు దుఃఖించుట 208

ధృతరాష్ట్రుడు అర్జునుని ప్రతాపము వర్ణించుట 214

కౌరవసభలో ధృతరాష్ట్రుడు యుద్ధము వలన కలుగు
భయమును గూర్చి చెప్పి శాంతి కొరకు సూచించుట 216

సంజయుడు ధృతరాష్ట్రునకు అతని దోషములను సూచించి
దుర్యోధనుని క్రమశిక్షణములో నుంచుమని చెప్పుట 217

దుర్యోధనుడు ధృతరాష్ట్రుని ఆశ్వాసించుచు స్వపరపక్షము
లోని ఉత్కర్షాపకర్షలను గూర్చి చెప్పుట 220

సంజయుడు అర్జునుని గజాశ్వాదులను ధర్మరాజాదుల
యశ్వములనున్ను గూర్చి దుర్యోధనునకు వర్ణించుట 226

సంజయుడు శత్రువుల యుద్ధ ప్రయత్నము చెప్పుట
ధృతరాష్ట్రుని విలాపము - దుర్యోధనుడు స్వపక్ష
ప్రాబల్యము చెప్పుట - దానిపై ధృతరాష్ట్రునకు
అవిశ్వాసము-సంజయుడు ధృష్టద్యుమ్న సందేశము చెప్పుట 228

ధృతరాష్ట్రుడు భీష్మాదులు యుద్ధము కోరుట లేదని చెప్పి
శాంతి ప్రయత్నము చేయుమనగా దుర్యోధనుని
అహంకార ప్రదర్శనము - అతడు పాండవులను
చంపెదనని ప్రతిజ్ఞచేయుట - ధృతరాష్ట్రుడు
ఇతర యోధులకు భయపడుట 233

మరల నడుగబడిన సంజయుడు అంతఃపురమునందున్న
కృష్ణార్జునుల సందేశము వినిపించుట 235

శ్రీకృష్ణుడు కౌరవులకు పంపు సందేశము 237

ధృతరాష్ట్రుడు స్వ-పర పక్షముల బలాబలము - గుణ
దోషములను సమీక్షించి చెప్పుట 238

తన మహిమ దుర్యోధనుడు తండ్రికి చెప్పుట 240

కర్ణుడు తన మహిమను చెప్పుట 243

భీష్ముడు కర్ణు నధిక్షేపించుట 243

కర్ణుడు భీష్ముని అధిక్షేపించి అస్త్రసన్న్యాసము చేయుట ... 244

భీష్ముడు కర్ణుని దుర్నీతిని గూర్చి మరల ఆక్షేపించుట 244

దుర్యోధనుని స్వపక్ష ప్రాబల్య వర్ణనము 245

దమమును గూర్చి విదురుని ఉపదేశము .. 246

విదురుడు జ్ఞాతి విరోధము అనర్థహేతువని చెప్పి సంధి
కొరకు ఉపదేశించుట 248

విదురుడు తేనెతెట్టె కథ చెప్పుట 249

ధృతరాష్ట్రుడు పుత్రునకు హితోపదేశము చేయుట 251

అర్జునుని సందేశమును సంజయుడు ధృతరాష్ట్రునకు
చెప్పుట 252

ధృతరాష్ట్రుని కడకు గాంధారీ వ్యాసులు వచ్చుట -
కృష్ణార్జునుల బలమును గూర్చి సంజయుని ధృతరాష్ట్రుడు
మరల నడుగుట 253

సంజయుడు ధృతరాష్ట్రునకు శ్రీకృష్ణుని సారము చెప్పుట 254

సంజయుడు శ్రీకృష్ణుని భగవద్భావనను గూర్చి చెప్పి, భగవత్ప్రాప్త్యుపాయము చెప్పుట 256

6. భగవద్యాన పర్వము

భీముడు శాంతిసందేశము కృష్ణునకు చెప్పుట 276

శ్రీకృష్ణుడు భీముని పరిహసించి యుద్ధమునకు ప్రోత్సహించుట 278

భీముడు శ్రీకృష్ణునకు తన సామర్థ్యమును గూర్చి చెప్పి శాంతి ప్రస్తావనకు కృపయే కారణమని చెప్పుట 281

శ్రీకృష్ణుడు భీముని తేజస్సు దీపింపజేయుటకే చెప్పుట యని యతనిని ఆశ్వాసించుట 283

శ్రీకృష్ణుడు దైవ - పౌరుష శక్తులను వివరించుట 283

అర్జునుని సందేశము 285

అర్జునుని మాటకు శ్రీకృష్ణుని యుత్తరము 278

నకులుని సందేశము 289

యుద్ధ ప్రయత్నమునకు సహదేవ - సాత్యకుల సమ్మతి - యోధుల సమర్థనము 290

సాత్యకి యభిప్రాయము 291

శ్రీకృష్ణుని హస్తినాపుర ప్రయాణము - యుధిష్ఠిరుడు కుంతీదేవికి కౌరవులకును సందేశము పంపుట - మార్గములో శ్రీకృష్ణునకు దివ్యమహర్షుల సందేశము 296

శ్రీకృష్ణుని రాయబారము 296

మార్గములో శుభశకునముల వర్ణనము - జనుల సత్కారము గైకొని శ్రీకృష్ణుడు వృకస్థలమునకు పోయి విశ్రమించుట 302

శుభ శకునములు 303

దుర్యోధనుడు శ్రీకృష్ణుని స్వాగత సత్కారములకు మార్గమునందు ఏర్పాట్లు చేయుట 305

ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుని ఎదుర్కొని కానుకలిచ్చి దుశ్శాసనుని భవనములో కృష్ణునకు విడిది ఏర్పరచుట 306

శ్రీకృష్ణుని యాజ్ఞను పాలింపుమని విదురుడు ధృతరాష్ట్రునకు ఉపదేశించుట 308

దుర్యోధనుడు కృష్ణునిగూర్చి తన యభిప్రాయము తెలుపుట - కుపితుడైన భీష్ముడు సభ విడిచిపోవుట 310

శ్రీకృష్ణునకు హస్తినపురిలో స్వాగతము - అతనికి ధృతరాష్ట్రు విదుర గృహములలో సత్కారము 312

శ్రీకృష్ణుడు కుంతీదేవిని దర్శించుట-తన కష్టములు తలచి దుఃఖించుచున్న కుంతిని కృష్ణుడు ఊరడించుట 314

శ్రీకృష్ణుడు దుర్యోధన గృహమునకు పోయి యతని యాతిథ్యము స్వీకరించక విదురుని యింటిలో భుజించుట 322

విదురుడు కృష్ణునకు ధార్తరాష్ట్రుల దురుద్దేశము చెప్పి యతడు కౌరవ సభకు పోవుట అనుచితమని బోధించుట 326

శ్రీకృష్ణుడు కౌరవ - పాండవులకు చేయు సంధి ప్రయత్నము ఉచితమని విదురునకు చెప్పుట 329

దుర్యోధన శకునుల ప్రార్థనపై శ్రీకృష్ణుడు కౌరవ సభకు పోవుట 331

శ్రీకృష్ణుడు కౌరవ సభలో ప్రభావవంతముగా సంధి ప్రస్తావన చేయుట 336

శ్రీకృష్ణుడు పాండవుల సందేశమును ధృతరాష్ట్రునకు వినిపించుట 339

పరశురాముడు దంభోద్భవ కథ ద్వారా నరనారాయణులైన కృష్ణార్జునుల మహిమ చెప్పుట 342

దుర్యోధనునకు కణ్వుడు శాంతికొరకు బోధించుచు మాతలి యుపాఖ్యానము చెప్పుట 349

మాతలి ఉపాఖ్యానము 350

వరాన్వేషణమునకు పోవుచున్న మాతలి నారదునితో వరుణలోకమునకు పోయి యచట వివిధాశ్చర్యములను చూచుట 350

నారదుడు మాతలికి పాతాళలోకము చూపించుట 353

హిరణ్యపుర దర్శనము - వర్ణనము 355

గరుడలోక - గరుడ సంతతుల వర్ణనము 358

సురభి - సురభి సంతతి - రసాతల సుఖముల వర్ణనము 360

నాగలోకము నందలి నాగుల వర్ణనము - నాగకుమారుడైన సుముఖునకు కన్యనిచ్చుటకు మాతలి నిర్ణయము 362

నాగలోకరాజైన ఆర్యకునితో నారదుడు మాతలి కన్యతో సుముఖుని వివాహ ప్రస్తావనము చేయుట-మాతల్యాదులు ఇంద్రునిచేత సుముఖునకు దీర్ఘాయువు ఇప్పించుట - గుణకేశ సుముఖుల వివాహము 364

శ్రీ విష్ణువు గరుడ గర్వభంగము చేయుట-దుర్యోధనుడు కణ్వుని యుపదేశమును తిరస్కరించుట 367

యమధర్మరాజు విశ్వామిత్రుని పరీక్షించుట - విశ్వామిత్రునకు గురుదక్షిణ ఇచ్చుటకు గాలవుని హఠము 371

గాలవుని చింత - గరుడుని ఊరడింపు 374

గరుడుడు గాలవునకు పూర్వదిక్కును వర్ణించి చెప్పుట 377

దక్షిణ దిగ్వర్ణనము 379

పశ్చిమ దిగ్వర్ణనము 382

ఉత్తర దిగ్వర్ణనము 384

గరుడునిపైనెక్కి తూర్పుదిక్కునకు పోవుచున్న గాలవుడు గరుడవేగముచేత వ్యాకులపడుట 388

ఋషభశిఖర మందున్న గాలవ గరుడులకు శాండిలీదేవి దర్శనము - గురుదక్షిణ విషయమై విచారించుట 390

గరుడ గాలవులు యయాతి యింటికిపోయి గురుదక్షిణ కొరకు అశ్వములను యాచించుట 392

యయాతి చరిత్ర 393

యయాతి గాలవునకు తన కన్య నిచ్చుట - ఆమెతో గాలవుడు అయోధ్యరాజుకడకు పోవుట ... 394

రెండునూర్ల శ్యామ కర్ణాశ్వములిచ్చి హర్యశ్వుడు యయాతి బిడ్డ వలన వసు మనసుని కనుట - గాలవుడా కన్యకతో మరియొక చోటికిపోవుట 396

దివోదాసుడు యయాతి కన్యక యందు ప్రతర్దనుని కనుట 399

ఉశీనరుడు మాధవియందు శిబిని కనుట - అక్కడి నుండి పోవుచున్న గాలవునకు మార్గములో గరుడుని దర్శనము 400

గాలవుడు అరునూర్ల అశ్వములను మాధవినిన్ని విశ్వామిత్రుని కిచ్చుట - విశ్వామిత్రుడు మాధవి వలన అష్టకుని కనుట - గాలవుడా కన్యతో ఆమె తండ్రి యింటికి పోవుట 402

మాధవి వనములో తపస్సు చేయుట - యయాతి స్వర్గ సుఖమనుభవించి మోహముతో తేజోహీను డగుట 405

యయాతి స్వర్గమునుండి భ్రష్టుడగుట - అతనికి దౌహిత్రులు, కూతురు, గాలవుడున్ను తమ పుణ్యము లిచ్చుట 407

సత్సంగము వలన, దౌహిత్రుల పుణ్యదానము వలనను, యాయతి మరల స్వర్గమునకు పోవుట 410

యాయతికి స్వర్గములో స్వాగతము - యయాతి పతనమునకు కారణము అతని యభిమానమేనని బ్రహ్మ చెప్పుట - నారదుడు దుర్యోధనునకు ఉపదేశించుట 412

ధృతరాష్ట్రుని కోరికపై శ్రీకృష్ణుడు దుర్యోధనునకు ఉపదేశించుట 415

దుర్యోధనునకు శ్రీకృష్ణుని ఉపదేశము 416

భీష్మ, ద్రోణ, విదుర, ధృతరాష్ట్రులు దుర్యోధనునకు ఉపదేశించుట 421

భీష్మ, ద్రోణులు మరల దుర్యోధనునకు ఉపదేశించుట 423

శ్రీకృష్ణునకు దుర్యోధనుడు ఉత్తరము చెప్పుట- అతడు పాండవులకు రాజ్య మియ్యనని నిశ్చయముగా చెప్పుట 425

శ్రీకృష్ణుడు దుర్యోధనుని బెదిరించుట-అతడు కోపముతో సభ విడిచి పోవుచుండగా నతనిని బంధించుటకు బోధించుట 427

ధృతరాష్ట్రుడు గాంధారిని పిలుచుట - ఆమె దుర్యోధనునకు బోధించుట 432

సాత్యకి దుర్యోధనుని దురాలోచనమును తెలుపుట - శ్రీకృష్ణుని సింహగర్జనము - ధృతరాష్ట్ర విదురులు మరల దుర్యోధనునకు బోధించుట 437

శ్రీకృష్ణుని విశ్వరూపప్రదర్శనము - ఆయన సభనుండి వెడలిపోవుట 443
శ్రీకృష్ణుని కోరికపై కుంతీదేవి పాండవులకు తన సందేశము పంపుట 446
కుంతీ విదులోపాఖ్యానము చెప్పుట - విదుల యుద్ధము నుండి పారి వచ్చిన పుత్రుని బెదిరించి మరల యుద్ధమునకు పురిగొల్పుట 451
విదుల తన పుత్రుని యుద్ధమునకు ప్రోత్సహించుట 457
విదుల ఆమె పుత్రుని సంవాదము-విదుల కార్యసాఫల్యము కొరకు శత్రువశీకరణమునకున్ను ఉపాయములు చెప్పుట 460
విదులోపదేశము చేత ఆమె పుత్రుడు మరల యుద్ధమునకు పూనుకొనుట 465
పాండవులకు కుంతి ఉపదేశము - శ్రీకృష్ణుడు ఉపప్లావ్య నగరమునకు పోవుట 468
భీష్మ ద్రోణులు దుర్యోధనునకు ఉపదేశించుట 471
ద్రోణుడు భీష్మునితో సంప్రదించి మరల దుర్యోధనునకు ఉపదేశించుట 474
పాండవ పక్షములో చేరుమని శ్రీకృష్ణుడు కర్ణునకు బోధించుట 476
కర్ణుడు దుర్యోధన పక్షముననే యుండుటకు తన నిశ్చయమును శ్రీకృష్ణునకు తెలిపి యుద్ధమును యజ్ఞరూపముగా వర్ణించుట 479
పాండవుల విజయం అవశ్యం భావియని శ్రీకృష్ణుడు కర్ణునకు చెప్పుట 485
కర్ణుడు పాండవవిజయ, కౌరవపరాజయ సూచన లక్షణములను, తన స్వప్నమునున్ను వర్ణించు 187
సుస్వప్నములు 489
విదురుని మాటలు విని కుంతి యుద్ధపరిణామముచేత బాధపడుచు, కర్ణుని కడకు పోవుట కర్ణుని కడకు కుంతీ 491

దేవి పోవుట 494
నీవు పుత్రుడవని కుంతి కర్ణునకు చెప్పి పాండవ పక్షములో చేరుమని అతనిని కోరుట 495
కుంతికి కర్ణుడు ఉత్తరము చెప్పి అర్జునుని దప్ప ఇతర పాండవులను నలుగురుని వధించనని ప్రతిజ్ఞ చేయుట 496
యుధిష్ఠిరుడు అడుగగా శ్రీకృష్ణుడు కౌరవ సభలో భీష్ముని మాటలు చెప్పుట. 500
కౌరవ సభలో ద్రోణ విదుర గాంధారుల మాటలు శ్రీకృష్ణుడు పాండవులకు చెప్పుట 504
ధృతరాష్ట్రుడు దుర్యోధనునకు ఉపదేశించుట అర్ధ రాజ్యమిచ్చుటకు ఆదేశించుట 508
కౌరవుల ఎడల సామ దాన భేదోపాయములు వ్యర్థములు కనుక దండనీతినే ఉపయోగించవలెనని శ్రీ కృష్ణుడు ప్రతిపాదించుట 511

7. సైన్యనిర్యాణ పర్వము :

పాండవ పక్షమున సేనాపతి నిర్ధారణము - పాండవ సేన కురుక్షేత్రమునకు పోవుట 515
యుధిష్ఠిరుని సేనానివేశ శిబిరములు 521
దుర్యోధనుడు రాజులతో మంతనము చేయుట 523
దుర్యోధనుని సేనారచన 527
దుర్యోధనుడు భీష్ముని సర్వసేనాధిపతిగా పట్టాభిషిక్తుని చేయుట 530
సేనాపతి ప్రాధాన్యము 531
యుధిష్ఠిరుడు సేనాపతులను నియమించుట 534
బలరాముడు పాండవులకడకు వచ్చుట 535
రుక్మి సహాయమును అర్జునుడు దుర్యోధనుడును నిరాకరించుట 536

8.	ఉలూకుని రాయబారము :	....	541
	బిడాలోపాఖ్యానము	....	543
	ధార్తరాష్ట్రుల సేనలోని వీరులను గూర్చి భీష్ముడు చెప్పుట	....	572
	భీష్మ కర్ణులకు సంవాదము	....	580
	భీష్ముడు తన శక్తిని గూర్చి చెప్పుట	....	583
	భీష్ముడు పాండవ పక్ష వీరుల బలము పరీక్షించుట	....	584
	అర్జునుని శౌర్యమును భీష్ముడు వర్ణించుట	....	586
9.	అంబోపాఖ్యానము :	....	593
	భీష్మ పరశురాముల యుద్ధము	....	618
	భీష్మునకు అష్టవసువులు ప్రస్వాపనాస్త్రమిచ్చుట	....	628
	భీష్మ పరశురాముల యుద్ధసమాప్తి	....	631
	అంబ తపస్సు	....	631
	అంబ పునర్జన్మము	....	638
	శిఖండి జన్మ వృత్తాంతము	....	640
	శిఖండి వివాహము	....	641
	శిఖండిని పురుషుడుగా మారుట	...	645
	కుబేరుడు స్థూణాకర్ణునకు శాపమిచ్చుట	....	640
	కౌరవసేనల బలాబలములను గూర్చి భీష్ముడు చెప్పుట	....	653
	పాండవ సేనలోని వీరులను గూర్చి అర్జునుడు చెప్పుట	....	655
	కౌరవ సేనాదళముల వివరము	....	656
	పాండవుల సేనాదళముల వివరము	....	657

శ్రీ

శ్రీ మహాగణపతయే నమః

శ్రీ శారదాయై నమః

శ్రీ వేదవ్యాసకృత మహాభారతము

యథా మూలాంధ్ర గద్యానువాదము

(ఉ ద్యో గ ప ర్వ ము)

(సేనోద్యోగ పర్వము)

"శ్రీదము వేంకటగిరిపతి
పాదయుగము నాశ్రయించి వ్రాయఁ గడఁగెదన్
వేదవ్యాసునిభారత
మాదృతి 'నుద్యోగపర్వ' మాంధ్రమునందున్."

శ్లో. నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమం।
దేవీ సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్॥

శ్రీమన్నారాయణుఁడైన కృష్ణమూర్తిని, మానవులలో ఉత్తముఁడైన అర్జునుని, సకలవిద్యాధిష్ఠాత్రి యైన సరస్వతీదేవిని, మహాభారత గ్రంథకర్త యగు వేదవ్యాస మహామునిని తలచి నమస్కరించి "జయము" అను పేరు గల మహాభారత గ్రంథమును పఠించవలెను.

విరాటసభలో శ్రీకృష్ణుని ప్రవచనము

"విరాటరాజు ఉత్తరాకుమారిని అభిమన్యున కిచ్చి వైభవోపేతముగ వివాహము చేసినతరువాత యుధిష్ఠిరమహారాజు మిక్కిలి సంతుష్టుడై తన కుమారునివివాహమునకు వచ్చినయనేక బ్రాహ్మణులకు, వేలకొలది గోవులు, రత్నములు, వివిధవస్త్రములు అనేకభూషణాదులు నిచ్చి రుచ్యములైనభోజన

ములచేత వారిని సంతుష్టిపరచెను ధనాదులైన వస్తువులను భగవంతుడైన శ్రీకృష్ణమూర్తి బ్రాహ్మణుల కిచ్చుటకుగాను యుధిష్ఠిరునకు తెచ్చి యిచ్చెను. ఆ మహోత్సవముచేత విరాటరాజు పట్టణము మిక్కిలి శోభాయమానముగ నుండెను."

ఇట్లు వైశంపాయనమహాముని జనమేజయమహారాజునకు చెప్పి, ఉద్యోగ పర్వకథను ఈవిధముగా చెప్పదొడగెను:-

పాండవులు మిత్రులతో సంప్రదించుట

జనమేజయమహారాజా! కురువీరులైన పాండవులు అభిమన్యుకుమారుని వివాహము చేసి తమవారితోబాటు మిక్కిలి సంతోషపడిరి. వివాహము చేసిన రాత్రి విశ్రమించి మరునాటియుదయమున మేల్కొని విరాటసభకు పోయిరి. విరాటమహారాజు సభ మణితోరణములతో కూడినదై, యనేక రత్నములచేత చిత్రింపబడినదై, వివిధములైన పీఠములు వేయబడి, పుష్పమాలికలు - సుగంధద్రవ్యములున్ను అన్నిచోట్ల పరిమళములు వెదజల్లుచుండగా, మిక్కిలి సంపన్నముగా నుండెను.

ఆ సభకు పురజనులు, రాజులు, వృద్ధులున్ను వచ్చి యుండిరి. వారందరు తమ - తమ యుచితాసనములపై కూర్చొని యుండిరి. సభలో ముందు భాగమునందు విరాటరాజు ద్రుపదరాజున్ను కూర్చొని యుండిరి. ఆ వృద్ధరాజులిద్దరు, వసుదేవుడు, కృష్ణబలరాములున్ను ఆ సభలోని రాజులందరికి పూజనీయులు. ద్రుపదరాజుకడ సాత్యకి, బలరాముడు; విరాటరాజునొద్ద కృష్ణుడు, యుధిష్ఠిరుడున్ను కూర్చొని యుండిరి. ద్రుపదరాజు పుత్రులు, భీమార్జున నకుల సహదేవులు, యుద్ధవీరులైన ప్రద్యుమ్న- సాంబులు, విరాటపుత్రులు, అభిమన్యు కుమారుడు-వీరందరు సభ నలంకరించి యుండిరి. బలములోను, రూపములోను, శౌర్యములోను, వీరందరు తమ-తమ తండ్రులతో సమానులు. ద్రౌపదీ కుమారులు బంగారు ఆసనములందు కూర్చుని యుండిరి.

ప్రకాశమానములైన వివిధ రత్నాభరణములతో ఈ మహారథికులందరున్ను ఆ సభలో కూర్చొని యున్నపుడు ఆసభ స్వచ్ఛములైన గ్రహనక్షత్రములతో ప్రకాశించుచున్నయాకాశమువలె దీప్తిసంపన్నమై యుండెను. వారు పరస్పరము విడి-విడిగా అనేకవృత్తాంతములను మాట్లాడుకొనుచు కొంతకాలము

గడిపిన తరువాత, అందరున్ను కృష్ణునిపై చూపు నిలిపి యుండిరి. ఆ రాజులనందరిని శ్రీకృష్ణుడు, పాండవుల కార్యము నిర్వహించుటకుగాను, ఒకచోట సమావేశపరచి యుండెను. వారిని ఉద్దేశించి శ్రీకృష్ణుడు అర్థగంభీరములు, శుభకరములునైన మాటలను ఈవిధముగా చెప్పదొడగెను:

"రాజకుమారులారా! యుధిష్ఠిరమహారాజు శకునిచేత జూదమునందు మోసముతో ఓడింపబడుట, అతని రాజ్యము అపహరింపబడుట, వనవాసము-అజ్ఞాతవాసమున్ను వారికి జూదముద్వారా నియమింపబడుటయు మీకందరికి తెలిసిన విషయమే. పాండుపుత్రులు అందరినిగూడా జయింప గలిగి, తమ రాజ్యమును సంపాదింప గలశక్తి గలవారైనను సత్యమార్గమునందు నడచుచున్నవారు కాబట్టి, పన్నెండు సంవత్సరములు అతి ఘోరమైన వనవాస వ్రతమును ఆచరించిరి. పదుమూడవయేడు ఇతరులకు వారు తెలియబడకుండ నుండు దుస్తరమైన యజ్ఞాతవాస క్లేశమును విరాటరాజు యొక్క అండలో సుఖముగా గడపికొనిరి. దుస్సహములైన వివిధ క్లేశములను సహించుచు ఈ మహాత్ములు వనవాసము చేసిరి. పదుమూడవ యేట ఇతరులకడ సేవకవృత్తినాశ్రయించి జీవితము గడపిరి.

కనుక రాజులారా! వంశపరంపరగా వచ్చిన రాజ్యము పొందుటకు ఇప్పుడు ధర్మసుతుడు అర్హుడు. ఈవిషయములో దుర్యోధనునకుగూడ హితమైన పద్ధతిని మీరు మనస్సులో నుంచుకొని ఈ యుభయ వర్గములకు చెందిన కురుశ్రేష్ఠులకు ధర్మయుక్తము, సముచితము, కీర్తికరము నగునుపాయమును బాగుగ విచారించి నిర్ణయించగలరు.

ధర్మరాజు అధర్మయుక్తమైన స్వర్గరాజ్యాధిపత్యమునుగూడ కోరడు. ధర్మార్థయుక్తమైన రాజత్వమును చిన్నగ్రామమందైనను యుధిష్ఠిరుడు కోరును. తండ్రితాతల కాలమునుండి వచ్చిన రాజ్యమును ధృతరాష్ట్రపుత్రులు వీరినుండి తీసికొన్నారని మీకందరికి తెలియును. యుధిష్ఠిరునకు దుర్యోధనాదులు అనేకములైన యసత్యోపచారములు చేసి బూటకముతో సహింపరాని మహాకష్టములను కలిగించిరి. యుద్ధములో అర్జునుని తమ పరాక్రమముతో వారు జయించ లేరు.

ఇన్ని కష్టములు, అన్యాయములున్ను దుర్యోధనాదులవలన కలిగినను యుధిష్ఠిరమహారాజు, ఆయన అనుయాయులున్ను దుర్యోధనాదుల క్షేమమునే కోరు చున్నారు. పాండవులు శత్రుజయమును సాధించి సంపాదించిన రాజ్యమునే కోరు చున్నారు. అనేకము లైన యుపాయములచేత, బాల్యములో నున్న వీరిని హతమార్చుటకుగూడ వారు ప్రయత్నించిరి.

రాజ్యకాంక్షతో దుర్యోధనాదులు చేసిన ఈ యన్యాయము లన్నియు మీ కందరికి తెలియును. వారలకు దిన-దినము పెరుగుచున్న లోభమును, యుధిష్ఠిరునకు సహజముగా నున్న ధర్మజ్ఞతను గూడా మీ రెరుగుదురు. ఈ రెండు వర్గములకు సోదర భావమును శాశ్వతముగా నిలబెట్టుటకై మీ రందరున్ను విడి-విడిగ సమాలోచనము చేసి నిర్ణయించ గలరు. జూదములో దాయాదులు నిర్ణయించిన పందెము సక్రమముగా సత్యవంతులైన వీరు నెరవేర్చిరి.

యుద్ధమునందు ధృతరాష్ట్రపుత్రులను హతమార్చుటకు పాండవులు సమర్థులు. దుర్యోధనాదులు అపకారము తలపెట్టి శాంతియుతముగ సంధి చేసికొననిచో యుద్ధము తప్పదు. ఈ యిరు వర్గముల వారికి చెందిన మిత్రులు, బంధువులున్ను యుద్ధములో వారితో చేరి చంపుట, చచ్చుటయు జరుగును. అయినను పాండవులు అతి సమర్థులు. యుద్ధములో వారికి తప్పక జయము కలుగును. వీరు అందరు ఏకమై మిత్రులతో కలిసి, దుర్యోధనాదులను తప్పక హతమార్చ గలరు.

ఈ విషయంలో దుర్యోధనుని నిక్కమైన యభిప్రాయము, అత దేమి చేయ నున్నదియు తెలియుట లేదు. శత్రువుయొక్క అభిప్రాయము తెలియక మనము ఏ పనిన్ని ఆరంభించుటకు వీలు పడదు కదా! కాబట్టి, ధర్మాత్ముడు, పరిశుద్ధ వర్తనుడు, సత్కుల సంజాతుడు, అతి జాగరూకుడు, సమర్థుడునైన యొక దూతను దుర్యోధనాదుల యొద్దకు, వారిని శాంతిపరచుటకు వారు యుధిష్ఠిరునకు అర్థరాజ్య మిచ్చునటుల చేయుటకున్ను పంప వలెను."

బలరాముని యభిప్రాయము

ధర్మార్థయుక్తము, మధురము, పక్షపాతరహితము నయిన శ్రీకృష్ణుని మాటను బలరాముడు విని, ఈ విధముగా అనెను :

"రాజులారా! గదాగ్రజు డైన శ్రీకృష్ణుడు ధర్మయుక్తము, ఉపయోగకరము, రెండు వర్గముల వారికిన్ని హితము నయిన మాటను చెప్పెను. సగము రాజ్యమును కుంతీసుతుడు పొంది, కడమ సగమును దాయాదులకు వదిలి సుఖముగ కాలము గడప దలచు చున్నాడు. దీనికి అంగీకరించిన యెడల, దుర్యోధనుడు సుఖముగా మనయందరితో కలిసి ఉండ గలడు. దీనివలన, ఇద్దరికిన్ని శాంతి-సౌఖ్యములు, ప్రజలకు హితమును చేకూర గలవు. కనుక, యుధిష్ఠిరుని మాటలను దుర్యోధనునకు చెప్పి యతని యభిప్రాయమును తెలిసికొని కురుపాండవులకు శాంతిని చేకూర్చ గలవా డొకడు ఇప్పు డక్కడకు పోవుట మంచిది. ఇది నాకు సమ్మతమైన యభిప్రాయము. అక్కడకు పోవు రాయబారి భీష్ముని, ధృతరాష్ట్రుని, ద్రోణుని, అశ్వత్థామను, విదురుని, కృపాచార్యులను, శకునిని, కర్ణుని, ఇతర ధృతరాష్ట్ర పుత్రులనున్ను కలిసికొనవలెను. వా రందరున్ను బలమునందు, శాస్త్రమార్గమునందు, తమ - తమ ధర్మము లందునున్ను నిష్ఠగా ఉండు వీరులు. అక్కడ, కాలమును, శాస్త్రమునున్ను బాగుగా తెలిసిన వృద్ధవీరులుగూడ నున్నారు. ఈ కురు వీరులేకాక, పౌరులు, పౌర వృద్ధులుగూడ చేరి యున్న మహాసభకు ఈ రాయబారి పోయి అందరికిన్ని నమస్కరించి, ప్రయోజనకరము లైన యుధిష్ఠిర వాక్యములను వారి కందరికి చెప్పుగాక!

ఏ పద్ధతిలోను వారికి కోపము కలిగించు మాట రాయబారి ఆ సభలో పలుక గూడదు. వా రందరు ఇప్పుడు అధికార బలముతో నున్నారు. పూర్వము ప్రేమ నటించుచు జూదములో యుధిష్ఠిరుని రాజ్యము హరించినారు. మిత్రు లెందరు నివారించినను దుర్యోధనుడు ఆనాడు ద్యూతప్రసక్తి విడువ లేదు. ధర్మరాజుగూడ వారి కపటము నెరుగక అసూయకు డై, జూదములో దిగెను. అక్షర విద్యలో అతి నిపుణుడు, తన యిష్టప్రకారము పాచికలు వేయ గల వాడును అయిన శకునితో జూద మాడి ఓడి పోయెను. ధర్మరాజు దుర్యోధనుని, కర్ణుని జూదములో చతురు లైన యనేకులనున్ను జయించ గలవా డైనను, వారి నందరిని విడిచి శకునినే జూదమునకు ఆహ్వానించి, అతని చేతిలో ఓడి పోయెను. ఆడునపుడు ధర్మరాజు వేయు పాచిక లన్నియు ఆయనకు వ్యతిరేకముగనే పడు చుండెను. ఇందులో శకుని యపరాధము ఏమియు లేదు. ఎందు కనగా, అపజయము కలుగు కొలది ధర్మరాజు తొందరపాటుతో ముందుకు సాగి ఓడి

పోయెను. అందువలన ధృతరాష్ట్రుని యొద్ద అతిశాంతముగా ఈ రాయబారి నమస్కార పూర్వకముగ పలుక వలెను. ఇంతయేకాక, దుర్యోధనుని, తన మాటలను సమ్మతించు వానినిగా చేయగల శక్తికూడ రాయబారికి ఉండ వలెను. కౌరవులతో యుద్ధమును కాంక్షించకుడు. సామోపాయముచేతనే దుర్యోధనుని ఆహ్వానింపుడు. సామముచేత సాధించిన విషయమే ఉపయోగకర మగును. యుద్ధమునందు అన్యాయము జరుగును. సామోపాయమునందు అన్యాయమునకు తావు లేదు".

సాత్యకి బలరాముని నధిక్షేపించుట

"జనమేజయా! బలరాముని మాటలు విని సాత్యకి విజృంభించి అతని మాటను తిరస్కరించుచు కోపముతో ఇట్లనెను :

"బలదేవా! పురుషుని యాత్మ, యేవిధముగా నుండునో ఆవిధముగానే మాట్లాడును. నీయంతరాత్మ యెట్టిదో, అట్లే మాట్లాడు చుంటివి ప్రపంచమునందు పురుషులు శూరులు - దుష్టులు నుందురు. ఈ ఉభయులుగూడ దృఢ మైన వారుగానే కనపడు చుందురు. ఒక కులమునందే నపుంసకులు - మహాబల శాలురున్ను పుట్టెదరు. ఒక వృక్షమునందే పండ్లు గల కొమ్మలు-ఫల రహితము లైన శాఖలు నుండు. కనుక, బలరామా! నీవు చెప్పిన మాటలపై నేను అసూయ పడను. కాని, నీవు చెప్పిన మాటలను విను చున్న యీ సభవారిపై నాకు అసూయ కలుగు చున్నది. ఈ సభలో ధర్మరాజుపై దోషారోపణము కించిత్తైనను భయము లేకుండ, ఎట్లు చేయు చుంటివి? ఇందులో ఆయన దోష మేమాత్రము లేదు.

కౌరవులు మహాత్ముడైన ధర్మరాజును జూదమునకు పిలిచిరి. వారు ద్యూత విద్యలో సమర్థులు. ధర్మరాజు ద్యూతరహస్యమును బాగుగానెరిగినాడు కాడు. అట్టివానిని శ్రద్ధతో పిలిచి కపట ద్యూతములో నోడించిరి అట్టివారికి 'ధర్మజయము' అను మాట యెక్కడిది? ఒకవేళ, ధర్మరాజు తన యింటిలో సోదరులతో కలిసి జూదమాడు చుండగా వారు ఆయన యింటికి వచ్చి ఆయనతో ఆడి ఆయనను ఓడించి యుండినయెడల, అది వారి ధర్మజయ మనిపించు కొనును క్షత్రియధర్మాసక్తుడైన ధర్మరాజును ఆహ్వానించి కౌరవులు కపటముతో జయించిరి. అట్టివారికి శుభములు కలుగుట కల్ల. అయినను, ధర్మముగా

పందెము మేరకు వనవాసము చేసి తిరిగి వచ్చి ధర్మరాజు, తండ్రి, తాతల సంపదను స్థానమునున్ను కోరు చున్నాడు. ఈ యుధిష్ఠిరుడు పాప ధనమును కోరడు. శత్రువుల నెప్పుడు గూడ యాచించడు ధర్మాత్ములైన పాండవులు తమ రాజ్యభాగమును తీసికొన గోరక యెట్లు ఉండెదరు? కౌంతేయులను దేశ భ్రష్టులను చేసినవారు విజ్ఞు లెట్లగుదురు? భీష్మ - ద్రోణ - విదురాదుల చేత బోధింపబడియు కౌరవులు పాండవులకు చెందవలసిన పైతృక రాజ్యభాగమును ఇచ్చుటకు ఇష్టపడుట లేదు

కనుక, నేను వాడి బాణములచేత యుద్ధమునందు వారికి బుద్ధి చెప్పి, అణచి, మహాత్ముడైన ధర్మరాజు పాదములపైన వారు పడునట్లు చేసెదను. ఒకవేళ వారు ఆయన కాళ్ళపై పడనియెడల మంత్రులతోపాటు వారు అర్జునుని బాణములకు గురియై యమలోకమునకు పోయెదరు. ఆర్భాటముతో యుద్ధము చేయుచున్న యర్జునుని బాణ వేగమును వారు సహింప జాలరు. ఇంద్రుని వజ్రాయుధము దెబ్బలు పర్వతములు సహింప గలుగునా?

గాండీవ ధనుస్సును ధరించిన యర్జునుని, చక్రధారియైన శ్రీకృష్ణుని, క్రోధావిష్టుడనైన నన్ను, శత్రువులకు లొంగని మహా బలసంపన్నుడైన భీమసేనుని, దృఢ ధనుస్సులను ధరించి ప్రళయకాలదీప్తితో వెలుగొందు నకుల - సహదేవులను, వీరులై ప్రళయ కాలయమునివలె జ్వలించు చుండు ద్రుపద - విరాటులను, ద్రుపద పుత్రుడైన ధృష్టద్యుమ్నుని, పాండవులతో సమానబలము గలిగి ద్రౌపదీకీర్తివర్ధనులైన అయిదుగురు పాండవపుత్రులను, దేవతలకుగూడ అసాధ్యుడైన అభిమన్యుని, యముని వంటి గదుని, సూర్యునివంటి ప్రద్యుమ్నుని, అగ్నివంటి సాంబుని, ఇంకను అనేక వీరులనున్ను జీవింప దలచిన వారు ఎవరు సమీపించి యెదుర్కొన గలరు?

ఈ మే మందరము యుద్ధమునందు శకునిని, ధృతరాష్ట్రపుత్రులను, కర్ణునిన్ని చంపి పాండుపుత్రుడైన ధర్మరాజునకు రాజ్యపట్టాభిషేకము చేసెదము. పైబడి వచ్చుదుష్టశత్రువులను చంపుట అధర్మము కాదు. శత్రువులను యాచించుట అధర్మమేకాక, కీర్తి నాశకరము గూడ నగును. ధర్మరాజు మనస్సులో నున్న కోరికను మీ రందరు నెరవేర్చుడు. ధృతరాష్ట్రు డిచ్చిన రాజ్యమును ధర్మరాజు పొందుగాక! అదియే ఆయన కోరిక. యుధిష్ఠిరుడు నేడు రాజ్యము నైనను పొందగలడు. లేదా, శత్రువుల నందరిని యుద్ధమునందు హత

మార్చి యుద్ధభూమిలో వారికి శాశ్వతముగా సుఖశయన మైనను కలిగించ గలడు. ఈ రెండే మార్గములు. సామోపాయము కుదురనప్పుడు దండోపాయము తప్పదు."

ఇట్లు సాత్యకి చెప్పిన మాటలు విని ద్రుపదు డిట్లనెను :

ద్రుపదుని యభిప్రాయము

"సాత్యకి చెప్పిన మాటలు సరి యైనవి. అందులో సంశయము లేదు. తియ్యని మాటలతో దుర్యోధనుడు రాజ్య మీయడు. పుత్రప్రేమతో ధృతరాష్ట్రుడు గూడ నతని మాటనే యనుసరించును. దైన్యము వలన భీష్మ-ద్రోణులు, మూర్ఖత్వము వలన కర్ణ-శకునులున్ను, దుర్యోధనుని యిష్టప్రకారమే నడుచుకొనెదరు. బలరాముడు చెప్పిన మాట నా కేమీయు నచ్చలేదు. నీతికోవిదు డైన పురుషుడు మొట్టమొదట చేయ వలసిన కార్యము ఏది యని యోచించ వలెను. మెత్తగా మాట్లాడు ధృతరాష్ట్రుని నిందించి ప్రయోజనము లేదు. పాప బుద్ధిగల యతనిని మృదుత్వముతో సాధించుటకు వీలు పడదని నా యభిప్రాయము. పాపాత్ము డైన దుర్యోధనునకు మృదు వచనములను బోధించుట, గాడిద యందు మృదుత్వమును, గోవుయందు కాఠిన్యమును చూపించి నట్లగును. దుర్యోధనుడు మృదువుగా మాట్లాడువానిని శక్తిహీనునిగ భావించి తన కార్యము సులభముగా నెరవేర్చుకొనవచ్చునని భావించును. కనుక, అతని యెడల మెత్తదనము చూపుట పనికిరాదు.

కనుక నేను చెప్పు నుపాయము విని అలాగు చేయుడు. మన మిత్రులను పిలిపించుకొందము: శల్యుడు, ధృష్టకేతుడు, జయత్సేనుడు, కేకయులు - ఈ మొద లైన వారిని నలుదిక్కుల మన మిత్రులనున్ను సమీకరించుటకు గాను దూతలను వంపుదము. దూతలు శీఘ్రగాములుగా నుండ వలెను.

దుర్యోధనుడు గూడ తన హితులను పిలిపించుకొనుటకు అన్ని వైపుల దూతలను తప్పక పంపగలడు. అతనికి పూర్వము నుండియే హితు లైనవారు చాలామంది ఉన్నారు. వారి నందరిని దుర్యోధనుడు ఆహ్వానించు చుండును. కనుక, మనము అంతకు పూర్వమే రాజు లందరి యొద్దకు, మనకు సహాయము చేయుటకు గాను రాయబారిని త్వరగా పంప వలెను. మనము నిర్వహించవలసిన కార్యము చాల గొప్పది. శల్యుడు, భగదత్తుడు, - అంధకులు - మున్నగు

ననేక రాజులకు వెంటనే ఆహ్వానములు పంప వలెను. ఇది నా నిశ్చిత మైన యభిప్రాయము. రాజా! ఈ నా పురోహితు డైన బ్రాహ్మణుడు మంచి విద్వాంసుడు. ఇతనిని ధృతరాష్ట్రునికి కడకు పంపుదము. ఇతని ద్వారా దుర్యోధనునకు, భీష్మపితామహునకు, ధృతరాష్ట్రునకు, ద్రోణాచార్యునకున్ను చెప్ప వలసిన మాటలు గూడ చెప్పి పంపుడు."

ద్రుపదుడు చెప్పిన మాటలు విని శ్రీ కృష్ణుడిట్లనెను:-

శ్రీకృష్ణుని యభిప్రాయము

"ద్రుపదుడు చెప్పిన మాటలు సమంజసముగా నున్నవి. ఇవి ధర్మరాజు కార్యమునను ప్రయోజనకరములుగా నుండును. నీతిని కోరు చున్న మనము ఈ పనిని మొట్టమొదట చేయ వలెను. దీనికి వ్యతిరేకముగా చేసిన యెడల మనము మూర్ఖుల మగుదుము. ఇందులో ఒక ముఖ్యమైన విషయము మనము గమనించ వలసి యున్నది. మనము కౌరవ-పాండవులకు సమాన బంధువులము. అభిమన్యుని వివాహమునకు ఆహూతుల మై వచ్చినాము. వివాహము ముగిసినది. సంతోషముతో మన-మన యిండ్లకు పోవుదము.

ద్రుపదరాజా! నీవు రాజు లందరిలో వృద్ధుడవు మంచి నీతిశాస్త్రకోవిదుడవు. మేము అందరము నీకు శిష్యులముగా నుండెదము. నీపైన ధృతరాష్ట్రునకు మంచి గౌరవము కలదు. కృపాచార్యునకు ద్రోణాచార్యునకున్ను మిత్రుడవు. కనుక నీవు కౌరవులకు హిత మైన రీతిలో సందేశము పంపుము నీ మాటకు మే మందరము సమ్మతించెదము నీ మాటపైన దుర్యోధనుడు శాంతించి, న్యాయమార్గములో సంధికి ఒడంబడినయెడల, కౌరవ పాండవులకు సోదర భావము నిలిచి, వారికి నాశము కలుగకుండ గలదు. ఒకవేళ, దుర్యోధనుడు దర్పముచే గర్వించి నీ మాటలు లెక్క చేయనియెడల, మూర్ఖు డైన యతడు తన మంత్రిబాంధవులతోగూడ గాండీవధారి యైన యర్జునుని బాణపరంపరలకు వశము కా గలడు. ఇతరు లందరిని పిలిపించిన తరువాత మమ్ము రప్పింపుము."

జనమేజయా! ఈ విధముగా చెప్పిన శ్రీకృష్ణుని మాటలు విని విరాటరాజు శ్రీకృష్ణుని సత్కరించి బంధు-మిత్రసహితముగా ద్వారకకు పంపెను.

శ్రీకృష్ణుడు వెడలినతరువాత యుధిష్ఠిరాదులు, విరాటరాజున్ను యుద్ధ సన్నాహములను చేయు చుండిరి. తరువాత విరాటరాజు, పెండ్లికి వచ్చినరాజుల నందరిని యథోచితముగా సత్కరించి, సపరివారముగా వీడ్కొల్పెను.

రాజులు పాండవ పక్షములో చేరుటకు వచ్చుట

పాండవ-ద్రుపద - విరాటుల యాహ్వానముపైన రాజు లందరు మిక్కిలి సంతసించుచు వచ్చిరి. ఈవిధముగా పాండవులు అనేక రాజులను సమకూర్చుకొనిన సంగతి విని దుర్యోధనాదులుగూడ తమకు హితు లైన యనేక భూపతులను యుద్ధసహాయార్థమై పిలిపించుకొనిరి. ఈవిధముగా కౌరవ-పాండవులు పిలిపించిన రాజసమూహము కారణముగా భూమియం దంతయు మిక్కిలి సందడి ఆయెను. ఆ రాజవీరుల చతురంగబలములు భూమిపైన ప్రయాణము చేయు చుండగా నవి నదీ-నద-పర్వతసహిత మైన సమస్త భూమండలమును కంపింప జేయు చున్నవా యనున ట్లుండెను తరువాత బుద్ధిలో, వయస్సులోను వృద్ధు డైన ద్రుపదరాజు యుధిష్ఠిరుని యిష్టముప్రకారము తన పురోహితుని కౌరవులనొద్దకు పంపుటకు పిలిపించి అతనితో నిట్లనెను:

ద్రుపదుడు పురోహితుని కౌరవులకడకు పంపుట

''విప్రోత్తమా! భూతములలో ప్రాణులు శ్రేష్ఠములు. వానిలో బుద్ధి కలవి శ్రేష్ఠములు. బుద్ధిమంతులలో మనుష్యుడు ఉత్తముడు. మనుష్యులలో బ్రాహ్మణులు, వారిలో వైద్యులు, వారిలో బుద్ధిశాలురు, వారిలో కార్యశూరులు, వారిలో బ్రహ్మజ్ఞులు శ్రేష్ఠులు. పైన చెప్పబడిన యందంలోను నీవు ప్రధానుడవు. ఉత్తమ కులసంభూతుడవు. వయోజ్ఞాన వృద్ధుడవు బుద్ధిలో బృహస్పతికి, శుక్రాచార్యునకును సమానుడవు. దుర్యోధనుడు ఎటువంటి ప్రవర్తన కలవాడో నీకు బాగుగా తెలియును. ధర్మరాజు ఎట్టివాడోకూడ నీకు తెలియును.

పాండవులు శత్రువులచేత వంచితు లైనా రను విషయము ధృతరాష్ట్రునకు తెలిసినను, అతడు విదురునిచేత బోధింప బడినను, పుత్రప్రేమచేత కొడుకు మార్గమునే అవలంబించు చున్నాడు. క్షత్రియ ధర్మములో నడచుకొను చుండి ద్యూతవిద్యలో నైపుణ్య మంతగా లేని ధర్మరాజును, తన ఇష్టము వచ్చిన రీతిని పాచికలను వేయగలిగి, అక్షవిద్యానిపుణుడు, దుష్టబుద్ధియు నైన శకుని, బుద్ధిపూర్వకముగా పిలిపించి వంచించిన సంగతి నీకు తెలియును. కనుక, వారు ఎట్టి పరిస్థితిలోను రాజ్య మీయరు. నీవు అక్కడికి పోయి ధర్మయుక్తము లైన మాటలు ధృతరాష్ట్రునకు చెప్పి, అతని మనస్సును, అతని యోధుల మనస్సుల నున్న తప్పక త్రిప్ప గల వని నాకు విశ్వాసము కలదు. నీ మాటనే విదురుడు

గూడ అంగీకరించి కార్యము సాధించ గలడు. అతడు భీష్మ-ద్రోణ-కృపాదుల మనస్సులలో దుర్యోధనుని యెడల భేద భావము కలిగించ గలడు.

మంత్రులు-యోధులున్ను భేదభావము వహించి విముఖులైన తరువాత, వారి నందరిని ఒకచో చేర్చి ఏకాభిప్రాయమునకు తీసికొని వచ్చుట కష్టసాధ్యమగును. దీని కంతటికిని కొంతకాలము పట్టును. ఈ యవధిలో పాండవులకు ఏకాగ్రబుద్ధితో సేనాకార్యక్రమము, ద్రవ్యములను చేకూర్చుకొనుట మొద లగు వానికి అవకాశము లభించ గలదు. తనవారు భేద భావముతో నుండగా, నీ వక్కడ కార్యసాధనకై అంటిపెట్టుకొని యుండగా, దుర్యోధనాదులు సేనా కార్యము గాని, ద్రవ్యసంగ్రహము గాని త్వరగాను, బాగుగాను చేసికొన జాలరు. ప్రధానముగా మన ప్రయోజనము నెరవేర గలదు.

ఇంతియేకాక, నీవు ప్రత్యక్షముగా ధృతరాష్ట్రుని యొద్దకు పోయి యుక్తాయుక్తముగా ధర్మవచనములు చెప్పినయెడల, తప్పక యతడు ధర్మమార్గమును అవలంబింప వచ్చును. నీవు ధర్మాత్ముడవు. వారియెడల ధర్మయుక్తముగా వ్యవహరించి, వారిలో దయాళువు లైన వారికి పాండవుల క్లేశములను వివరించి చెప్పి, కురువృద్ధులకు కులధర్మమును తెలిపి, వారి మనస్సులలో దుర్యోధనాదులయెడల తప్పక భేదభావమును కలిగించ గల వని నా దృఢ విశ్వాసము. నీవు వేదవిదుడ వైన బ్రాహ్మణుడవు. కాబట్టి, వారివలన నీకు భయము లేదు. విశేషించి, యిప్పుడు నీవు దూతకార్యములో నియోగింప బడి యున్నావు. వృద్ధుడవు. కనుక, నీకు ఏలాటి భయము వారివలన ఉండదు. నీవు పుష్యనక్షత్రయుక్త మైన *జయముహూర్తమునందు యుధిష్ఠిరుని కార్యసిద్ధికిగాను ధార్తరాష్ట్రుల యొద్దకు త్వరగా ఇప్పుడే బయలుదేరి పొమ్ము."

జనమేజయ మహారాజా! ద్రుపదరాజుచేత ఆ విధముగా ఆజ్ఞాపింప బడినవా డై సమస్త నీతి శాస్త్రవ్యవహారములను బాగుగా నెరిగిన యా పురోహితుడు శిష్యులతో పరివృతు డై పాండవులకు హితము చేయు తలంపుతో హస్తినాపురములో నున్న ధార్తరాష్ట్రులయొద్దకు పోయెను "

* పగటిగడియలు పదునైదుభాగములుగ విభజించి, వానిలో అరవభాగము జయముహూర్తము.

జనమేజయా! పాండవులు ద్రుపద పురోహితుని హస్తిపురికి పంపిన తరువాత, వివిధ రాజుల యొద్దకు దూతలను పంపిరి.

అర్జున-దుర్యోధనులు కృష్ణ సహాయము కోరుట

తరువాత అర్జునుడు శ్రీకృష్ణుని చూచుటకై ద్వారకాపురికి బయలు దేరెను. అక్కడికి పోయిన అర్జునునకు కృష్ణ - బలరాములు ఇతర యాదవు లందరు స్వాగతము చెప్పిరి. అర్జునుడు విరాటనగరమునందు పాండవులు చేసిన నిర్ణయమును కృష్ణ-బలరామాదులకు తెలిపెను.

అర్జునుడు శ్రీకృష్ణుని సహాయమును కోరి ద్వారకాపురికి పోయిన సమాచారమును దుర్యోధనుడు గూఢచారుల ద్వారా తెలిసికొని, తానుగూడ వడిగా బయలుదేరి ద్వారకాపురి చేరెను. ఆనాడే అర్జునుడుగూడ ద్వారక చేరి యుండెను. అర్జున-దుర్యోధను లిరువురు, నిద్రించి యున్న శ్రీకృష్ణుని యొద్దకు పోయిరి. దుర్యోధనుడు శ్రీకృష్ణుని శిరస్సువైపు ఉత్తమాసనమునందు ఉపవిష్టు డాయెను. తరువాత అర్జునుడు శ్రీకృష్ణుని శయనమందిరములో ప్రవేశించి వినతు డై, అంజలి బంధించి కృష్ణుని పాదములకడ నిలిచెను.

తరువాత మేలుకొనిన శ్రీకృష్ణుడు తొలుత అర్జునుని చూచెను. పిదప దుర్యోధనుని చూచెను. ఆ యిరువురికిన్ని స్వాగతము చెప్పి సన్మానించెను. వారి యాగమనకారణము అడిగిన కృష్ణునకు దుర్యోధనుడు నవ్వుచు ని ట్లనెను

"కృష్ణా! ఇప్పుడు కౌరవ-పాండవులకు జరుగ బోవు యుద్ధమునందు నాకు నీవు సహాయము చేయ వలెను. నీకు నాయెడల, అర్జునుని యెడలను సమాన మైత్రి కలదు. బాంధవ్యమున్ను సమానమే. మా యిరువురిలో నీకడకు తొలుత నేను వచ్చితిని. కనుక, తొలుత వచ్చిన వారిని ఆదరించుట, వారి కోర్కెలు తీర్చుట నీవంటి శ్రేష్ఠు లైన సత్పురుషుల కర్తవ్యము. అందరికిని సర్వదా సమ్మత మైన సత్పురుషుల సంప్రదాయమును నీవు పాటింపుము."

జనమేజయా! దుర్యోధనునిమాటలు విని కృష్ణుడు అతనితో ని ట్లనెను:

"దుర్యోధనా! నీవు నాయొద్దకు తొలుత వచ్చితివి. ఇందులో సంశయము లేదు. కాని, నేను తొలుత ధనంజయుని చూచితిని. నీవు తొలుత వచ్చుటవలన, నేను అర్జునుని తొలుత చూచుటవలనను మీ యిరువురికిని సహాయము చేసెదను.

కాని, దీనిలో ఒక ధర్మ సూక్ష్మము కలదు ఏమనగా, అర్జునుడు నీకన్న వయస్సులో చిన్నవాడు కాబట్టి మొదట చిన్నవాడు కోరుకొన వలెను. ఇది వేద విహిత మైన సంప్రదాయము. కనుక, మొదట కోరుకొనుటకు అర్హత అర్జునునకు గలదు. కనుక, నేను ఇప్పుడు రెండు మార్గములు చూపెదను. ఆ రెంటిలో ఒక దానిని కోరుకొనుటకు తొలుత చిన్నవా డైన అర్జునుడు అర్హుడు.

నాతో సమానముగ యుద్ధము చేయ గల గోపాలకులు అర్బుద (కోటి) సంఖ్యలో నున్నారు. వారికి 'నారాయణులు' అను ప్రసిద్ధనామము కలదు. అందరును యుద్ధ పండితులే వా రందరు ఒకవైపున ఉండెదరు. అస్త్ర - శస్త్రములు విడిచి యుద్ధము చేయక యుండు నే నొక్కడనే ఒకవైపు ఉండెదను. ఈ రెంటిలో అర్జునా! నీకు ఏది ఇష్టమో, దానిని కోరుకొనుము. నీవు చిన్నవాడవు కాబట్టి, ధర్మము ప్రకారము, మొదట కోరుకొను నర్హత నీకు ఉన్నది."

జనమేజయ మహారాజా! శ్రీకృష్ణుడు చెప్పిన మాటలను ధనంజయుడు విని యుద్ధమునందు ఏమాత్రము పోరాడని శ్రీకృష్ణునే తనకు సహాయకునిగా కోరుకొనెను. ఎందు కనగా, శ్రీకృష్ణుడు సాక్షాత్తు నారాయణుని యవతారము, శత్రుసంహారకుడు, తన యిచ్ఛతో భూలోకమునందు అవతరించిన దేవుడు, జనన - మరణ రహితుడునని అర్జునునకు తెలియును. కాబట్టి, అతడు పరమాత్మునే కోరుకొనెను. తరువాత దుర్యోధనుడు, రెండవ భాగ మైన సైన్యమును తీసికొని, కృష్ణుడు తన యెడల కుట్ర పన్నినను తానే గెలిచితిని అని యా మూర్ఖుడు భావించి సంతోషించెను.

జనమేజయా! ఆ సైన్యము నంతటిని వెంట బెట్టుకొని, దుర్యోధనుడు భీమబలు డైన బలరాముని యొద్దకు పోయి, తాను వచ్చిన కార్యమును అతనికి తెలిపెను. ఆమాట విని బలరాముడు దుర్యోధనునకు ఈ విధముగా బదులు చెప్పెను:

"దుర్యోధనా! పూర్వము నేను విరాటనగరము నందు అభిమన్యుని వివాహానంతరము జరిగిన సమావేశములో చెప్పిన మాటల ప్రకారమే జరుగును. నీ కొరకు నేను కృష్ణుని నిగ్రహించి మాట్లాడితిని. మీ యిరువురికి, నాకున్ను గల సంబంధము సమానము అనికూడ చెప్పితిని. నేను చెప్పిన మాటలు కృష్ణునికి రుచించ లేదు. కాని, కృష్ణుడు లేకుండ ఒక్క క్షణ మైనను ఉండుటకు నేను

ఇష్టపడను అర్జునునకు గాని, దుర్యోధనునకు గాని సహాయకుడనుగా నేను ఉండను అని నిశ్చయముగా ఇదివరకే చెప్పితిని. కనుక, నన్ను 'యుద్ధములో సహాయము చేయు' మని కోరకుము. సమస్త రాజపూజితమైన భరత వంశము నందు నీవు జనించిన వాడవు. క్షత్రియ ధర్మముతో యుద్ధము చేయుము - పొమ్ము."

''జనమేజయా! బలరాముడు చెప్పిన మాటలను విని దుర్యోధనుడు అతనిని ఆలింగనము చేసికొని, యుద్ధములో తనకు గోపాలకుల సహాయముతో తప్పక జయము కలుగునని నిశ్చయించుకొని, కృతవర్మ యొద్దకు పోయెను. కృతవర్మ దుర్యోధనునకు ఒక* అక్షౌహిణీ సేనను ఇచ్చెను. లోక భయంకరము లైన ఆ సేనలతో దుర్యోధనుడు సంతోషించి, తన మిత్రులను గూడ సంతోషపరచెను.

తరువాత ప్రపంచ సృష్టి కర్తయైన శ్రీకృష్ణుడు అర్జునునితో, "అర్జునా! యుద్ధము చేయని నన్ను ఎందుకు కోరుకొంటివి?" అని అనెను. ఆ మాటకు అర్జునుడు ఇట్లనెను:

"కృష్ణా! శత్రువుల నందరిని నీవే చంపుటకు సమర్థుడవు. నీ శక్తి నాకు తెలియును. నేను గూడ ఒక్కడనే వారి నందరిని చంప గలను. కనుక, నీవే యుద్ధములో శత్రు సంహారము చేసినచో, ఆ కీర్తి యంతయు నీకే దక్కి, నీవు కీర్తిమంతుడవుగా లోకములో ప్రసిద్ధుడ వయ్యెదవు. ఆ యశస్సు నాకు రావలెనని కోరినాను కాబట్టి, నిన్ను వరించితిని. నీవు నా తేరు నడుపుచు నాకు సారథ్యము చేయ వలె నని కోరిక ఉండెను. చాల కాలము తరువాత, ఇప్పటికి నా కోరిక నెరవేరినది. కనుక, యుద్ధములో నీవు నాకు సారథివి కమ్ము."

ఆ మాటకు కృష్ణుడు "అర్జునా! నాతో నీవు స్పర్థ(పోటీ)పడుట ఎంతయో సమంజసముగా నున్నది. కాబట్టి, నీకు సారథ్యము చేసెదను. దానివలన నీ చిర కాల వాంఛితము నెరవేరుగాక!" అని యనెను.

---

* 21 870 రథములు, అన్నియే యేనుగులు, 65,610 అశ్వములు, 10,9,350 కాల్బలము, ఇవి యన్నియు కలిసిన సైన్యము ఒక అక్షౌహిణి యన బడును. ఈ వివరము ఆదిపర్వములో చెప్ప బడినది,

జనమేజయా! కృష్ణుని మాటలకు అర్జునుడు మిక్కిలి సంతసించి సపరివారముగా మరల యుధిష్ఠిరుని యొద్దకు పోయెను

శల్యుడు పాండవులకడకు పోవుట

"జనమేజయా! పాండవులు పంపిన సందేశము దూత వలన తెలిసికొనినవాడై శల్యుడు గొప్ప సైన్యముతో, మహారథు లైన పుత్రులతోను పాండవుల యొద్దకు పోవుటకు బయలుదేరెను. అతని సేన అర్థ యోజనమునకు మించిన మార్గమును ఆవరించి యుండెను. అంత గొప్ప సైన్యము శల్యునకు ఉండెను. అతడు మహా బల - పరాక్రమములు గలవాడు. అక్షౌహిణీపతి. అతని సైనికులందరు శూరులు. చిత్ర విచిత్రము లైన కవచములను. టెక్కెములను (ధ్వజములను) ధనుస్సులను, ఆభరణములను, వాహనములను, పుష్పమాలికలను, వస్త్రములను, తమ - తమ దేశములకు తగిన వేషములనున్ను ధరించిన వారు, లక్షలకొలది ఉండిరి. అతని సేనా నాయకులు క్షత్రియోత్తములుగా నుండిరి. ఆ సైనికు లందరు సమస్త ప్రాణులను భయపెట్టు చున్నట్లుగా. భూమిని కంపింప జేయుచున్నట్లుగాను మహా సంరంభముతో నుండిరి.

"శల్యుడు సమస్త సైనికులను ఒక్కచోట విశ్రమింప జేసి, పాండవుల యొద్దకు పోవుటకు బయలుదేరెను. ఆ విషయము దుర్యోధనుడు తెలిసికొని, పాండవుల కడకు పోవు చున్న శల్యునకు ఎదురుగా పోయి అతనిని పూజించి, సన్మానించుటకు అనేక సభలు గూడ ఏర్పరచెను. ఆ సభామండపములను సర్వాంగ సుందరములుగా రత్నములతో, వివిధ శిల్పములతో, క్రీడాంగణములతో, వస్త్రమాల్యములతోను అలంకరించెను దుర్యోధనుడు భక్ష్యద్రవ్యములతో, పాన ద్రవ్యములతోను శల్యుని సత్కరించెను. ఆ సభకు పరిసరములలో, వివిధము లైన నూతులు, మనోహరము లైన నడబావులు, ఉత్తమము లైన పందిళ్ళున్ను ఏర్పరచెను. మహా వైభవోపేతములైన యా సభలలో ప్రవేశించుచు శల్యుడు ఇంద్రునివలె భాసిల్లెను. అతనిని దుర్యోధనుని మంత్రులు అడుగడుగున పూజించిరి. దేవతల గృహమువలె ప్రకాశించు చున్న మరియొక సభకు అతడు పోయెను. ఆ సభలో అనేక మంగళ వస్తువులు అమర్చబడి యుండెను. దానిలో ప్రవేశించుచు శల్యుడు ఇంద్రుని కంటె తాను గొప్పవాడుగా భావించెను.

దుర్యోధనునకు శల్యుడు సహాయపడుటకు అంగీకరించుట

అప్పుడు శల్యుడు అక్కడ నున్న సేవక జనముతో 'యుధిష్ఠిరుని జనము ఎవరు ఇక్కడ ఈ సభలు ఏర్పరచినారో వారిని తోడుకొని రండు. వారికి కానుకలు ఇవ్వవలసియున్నది' అని యనెను. ఆ మాటలు అక్కడివారు దుర్యోధనునకు చెప్పిరి.

శల్యుడు సంతోషించినప్పుడు జీవితమును గూడ కానుకగా ఇవ్వ దలచును. కనుక, రహస్యముగా దుర్యోధనుడు మేనమామ యగు శల్యుని దర్శించెను. మద్రరాజైన శల్యుడు దుర్యోధనుని చూచి ఈ సభా ప్రయత్నము లన్నియు అతడే చేసినాడని తెలిసికొని సంతోషించి, అతనిని కౌగిలించుకొని, అతని యెడల ప్రీతుడై, నీ కిష్టమైనది కోరుకొనుము, ఇచ్చెద ననెను. అప్పుడు శల్య - దుర్యోధనులకు ఈ విధముగా సంవాదము జరిగెను:

దుర్యో : మహాత్మా! నీవు సత్యవాక్కు కలవాడవు. మాట దప్పకుము. నాకు సర్వసేనా నాయకుడవుగా ఉండుటకు వరము ఇమ్ము. నీకు పాండవు లెట్లో, నేనును అట్లే నీచేత ఆదరింపబడి పాలింప దగు భక్తుడనైన నాతో నీవు యుద్ధమునందు చేరుము.

శల్య : మహారాజా! నీవు కోరినట్లే కానిమ్ము. ఆ వరము నీ కిచ్చితిని, ఇదిగాక, మరియేమైన కోరుము.

దుర్యో : మహాత్మా! ఈ మాత్రము వరము నాకు చాలును.

శల్య : దుర్యోధనా! నీవు నీ నగరమునకు పొమ్ము నేను యుధిష్ఠిరుని చూచుటకు పోయెదను. అతనిని కలిసికొని త్వరగా వచ్చెదను. తప్పక నేను ధర్మరాజును ఇప్పుడు చూడ వలెను.

దుర్యో : రాజోత్తమా! ధర్మరాజును చూచి త్వరగా రమ్ము. నిన్ను నమ్ముకొనియే యున్నాను. నా కిచ్చి వచ్చిన వరమును జ్ఞప్తియందుంచుకొనుము. సర్వము నీ యధీనము.

శల్య : దుర్యోధనా! నేను త్వరగా వచ్చెదను. నీకు మంగళ మగుగాక! నీ పట్టణమునకు పొమ్ము.

జనమేజయా! ఈ విధముగా వా రిరువురు మాట్లాడుకొని, పరస్పరము కౌగిలించుకొనిరి. శల్యుని యొద్ద సెలవు తీసికొని తన పట్టణమునకు దుర్యోధనుడు పోయెను.

శల్యుడు దుర్యోధనుడు చేసిన సత్కారము లన్నియు పాండవులకు చెప్పుటకు ఉపప్లవ్య నగరమునకు పోయి, పాండవులను కలిసికొనెను. వారు శల్యుని అర్ఘ్యపాద్యాదులతో పూజించి యతనికి స్వాగతము చెప్పిరి. శల్యుడు కుశల ప్రశ్నములు చేసి ప్రీతిపూర్వకముగా ధర్మరాజును ఆలింగనము చేసికొనెను. భీమార్జునులను, మేనల్లుండ్రైన నకుల- సహదేవులను సమాదరించెను. ద్రౌపది, సుభద్ర, అభిమన్యుడున్ను శల్యునకు నమస్కరించిరి. ధర్మరాజు శల్యునితో సాంజలియై 'మహారాజా! నీకు స్వాగతము. ఈ పీఠమును అలంకరింపుము' అని చెప్పెను.

తరువాత శల్యుడు బంగారు పీఠమునందు కూర్చొనెను. ధర్మరాజు అతనిని కుశల ప్రశ్నలు చేసెను. వా రందరు తనచుట్టు కూర్చొనియుండగా శల్యుడు ధర్మరాజును ఈ విధముగా నడిగెను:

"రాజా! మీ రందరు క్షేమముగ నున్నారా? అరణ్యవాస క్లేశమునుండి అదృష్టవశమున నీవు విముక్తుడవైతివి. నిర్జన వనములో తమ్ములతో, భార్యతోను అతి కష్టముతో కాలము గడపితివి. అంతకంటే మించి దుష్కర మైన అజ్ఞాతవాస క్లేశమును గూడ సహించితివి. నాయనా! రాజ్యభ్రష్టుడవైన నీకు దుఃఖమే కాని సుఖ మెక్కడిది? దుర్యోధనుడు కలిగించిన మహా దుఃఖమునుండి విముక్తుడవై ఇప్పుడు నీవు శత్రుసంహారము చేసి రాజ్యసుఖములు పొంద బోవుచున్నావు.

రాజా! నీకు లోకతంత్రము బాగుగా తెలియును. కనుక, లోభిత్వమునకు నీవు ఎప్పుడు గూడ లొంగవు. ప్రాచీన రాజర్షుల మార్గమును అనుసరింపుము. దానమును, తపస్సును, సత్యవ్రతమునున్ను అనుష్ఠించుము. ఓర్పును, ఇంద్రియ నిగ్రహమును, అహింసనున్ను ఆశ్రయించుము. నీ యందే లోకము నిలిచి యున్నది. నీవు బ్రహ్మజ్ఞాన సంపన్నుడవు, దాతవు, ధర్మాత్ముడవు, మెత్తని మనస్సు కలవాడవు. అనేక లోక ధర్మములను ఎరిగినవాడవు. సమస్త జగత్తు

యొక్క తత్త్వమును బాగుగా తెలిసికొనినవాడవు. కనుకనే, అదృష్టవశాత్తు నీవు అతి కఠినములైన క్లేశములను తరించితివి. ధర్మాత్ముడవైన నిన్ను నేను చూడగల్గితిని. ధర్మమే నీ స్వరూపముగా నాకు కనపడుచున్నది."

జనమేజయా! ఇట్లు చెప్పి, శల్యుడు తనకు, దుర్యోధనునకును కలిగిన సమాగమమును, అతనికి తాను ఇచ్చిన వరమును గూడ చెప్పెను. ఆ మాట విని ధర్మరాజు శల్యునితో నిట్లనెను:

పాండవులు శల్య సహాయము కోరుట

"మహాత్మా! దుర్యోధనుని సేవలకు సంతుష్టుడవై అతనికి నీవు మాట ఇచ్చుట చాల మంచిది. మంచి పని చేసితివి. కాని, నిన్ను ఒక్క కోరిక నేను కోరెదను. అది దయచేసి నెరవేర్చుము. రాజా! చేయ వీలుపడని పని గూడ చేయుటకు నీవు శక్తుడవు. నా విజ్ఞాపనము ఒక్కటి వినుము. నీవు సారథ్యములో వాసుదేవునితో సమానుడవు. కర్ణార్జునులకు యుద్ధము కలిగినప్పుడు కర్ణునకు నీవు రథసారథిగా నుండి అర్జునుని రక్షించవలెను. నాకు హితము చేయ గోరినచో నీవు ఈ కార్యము చేయవలెను. కర్ణునకు సారథిగా నుండి అతని పరాక్రమ భంగము నీవు చేయవలెను. దానిచేత, నతడు ఖిన్నుడగును. అది మాకు జయము చేకూర్చును. ఈ కార్యము నీవు చేయ గూడనిదే, ఐనను, మామా! మా హితమును కోరి నీవు చేయవలెను."

అట్లు ధర్మరాజు అడుగగా, శల్యుడిట్లు బదులు చెప్పెను:

పాండవులకు హితము చేయ శల్యు డంగీకరించుట

"పాండవోత్తమా! నీకు మేలగు గాక! కర్ణుని పరాక్రమ భంగము చేయుమని నన్ను కోరితివి యుద్ధములో అతనికి రథ సారథిగా నే నుండుట తథ్యము. శ్రీకృష్ణుని గౌరవించినట్లుగా నన్ను కర్ణుడు గౌరవించును. కనుక, నా మాట నతడు తప్పక విశ్వసించును. అతనికి వ్యతిరేకములైన అహిత వచనములను యుద్ధమునందు తప్పక చెప్పెదను. నా మాటలచే అతడు గర్వము ఉడిగి, పరాక్రమహీనుడై పోవును. అట్టి సమయమునందు అతనిని సులభముగా అర్జునుడు చంపవచ్చును. ఇది సత్యము. నీవు కోరినట్లుగా ఈ పని నేను తప్పక చేసెదను. ఇంతయే కాక, నాకు చేతనైనంత వరకు మీకు హితకరములైన యితర సహాయములను గూడ చేయుచుండెదను.

"ధర్మరాజా! మాయ జూదమునందు ద్రౌపదితో పాటు మీరు అనుభవించిన దుఃఖము, కర్ణుడు మిమ్ము గూర్చి మాట్లాడిన పరుష వాక్యములు, బకాసురుడు, కీచకుడును మీకు కల్గించిన కష్టములు, ద్రౌపదికి పూర్వము దమయంతికి కలిగినన్ని కష్టములున్ను నాకు తెలిసినవి. ఆ కష్టములన్నియు భవిష్యత్తులో సుఖము కొరకే ఏర్పడినవిగా భావింపుము. ఈ విషయములో నీవు దుఃఖపడకుము. దైవము బలవత్తరము కదా! దానిని దాటుటకు ఎవరికిని శక్యము కాదు. యుధిష్ఠిరా! మహాత్ములకే దుఃఖములు సంభవించును దేవతలకు గూడ అనేక దుఃఖములు కలిగెను. దేవరాజైన ఇంద్రుడు, అతని భార్యయు పూర్వము అనేక దుఃఖములు అనుభవించిరి."

ఆ మాట విని యుధిష్ఠిరుడు "రాజేంద్రా! మహాత్ముడయిన యింద్రునకు, అతని భార్యకున్ను ఘోరదుఃఖము ఎట్లు సంప్రాప్తించెను?" అనగా ఆ ప్రశ్నమునకు శల్యుడు యుధిష్ఠిరునితో, "రాజా! ఇంద్రుడు భార్యతోబాటు అనుభవించిన దుఃఖమునుగూర్చి ప్రాచీనమైన యితిహాసము కలదు. చెప్పెద వినుము:

శల్యుడు త్రిశిరోవధ, వృత్రాసురోత్పత్తి, వృత్రేంద్రయుద్ధం దేవపరాజయాదులను వర్ణించుట

"మహాతపస్సంపన్నుడు దేవశ్రేష్ఠుడునైన త్వష్ట యను ప్రజాపతి యుండెను. అతడు, ఇంద్రునకు ద్రోహము తలపెట్టిన 'త్రిశిరసుడు' అను తన పుత్రుని త్యజించెను. విశ్వరూపుడు, మహాతేజస్సంపన్నుడునైన త్రిశిరసుడు ఇంద్రుని స్థానమును ఆక్రమింప గోరెను. సూర్యచంద్రాగ్నులతో సమానములైన తన మూడు ఘోర ముఖములలో ఒకదానితో వేదములను చదువుచు, రెండవదానితో సురాపానము చేయుచు, మూడవ ముఖముతో సమస్త దిక్కులను అపోశనము పట్టువానివలె చూచుచునుండెను. అతడు తపస్వి, మృదువు, ఇంద్రియనిగ్రహము కలవాడునై ధర్మమార్గములో తపస్సు చేయుచుండెను.

రాజా! అతడు చేయుచున్న మహాతీవ్రతపస్సు ఇతరులకు సాధ్యము కాదు. అమిత తేజస్సంపన్నుడైన యతని తపశ్శక్తిని, సత్యమును చూచి యింద్రుడు 'తన స్థానమును ఆక్రమించుట కితడు తపస్సు చేయుచున్నా' డని మిక్కిలి దుఃఖించెను. 'ఇతడు కామభోగముల యందు ఆసక్తుడైనచో ఈ మహా తపస్సును విడువ గలడు. అట్లు కాకున్నచో, ఈ విధముగనే

త్రిశిరసుడు దినదినము తపశ్శక్తిచే వృద్ధిపొందుచు సమస్త భువనములనే మ్రింగ గలడు' అని పరిపరి విధముల చింతించి యింద్రుడు త్వష్టపుత్రుని ప్రలోభింప జేసి మోహపరచుటకుగాను అప్సరసలను పిలిచి వారితో నిట్లనెను:

'త్రిశిరసుడు కామభోగముల యందు త్వరగా విశేషాసక్తు డగునట్లు చేయుడు. అతసిని ప్రలోభింప జేయుడు. జాగు చేయక పొండు. మంచి కటి భారము కల మీరు అందరును మనోహర రత్నహారములు, ముక్తాహారములున్ను ధరించి శృంగార వేషముతో సౌందర్య శోభిత లై మీ హావభావములతో అతనిని మోహింప జేయుడు. మీకు మేలు కలుగుగాక! అతని తపస్సు వలన కల్గిన నా భయమును శమింప జేయుడు. నా మనస్సు అస్వస్థముగ నున్నది.'

ఇంద్రుని మాటలు విని అప్సరస్త్రీలు ఇట్లనిరి:

'మహేంద్రా! త్రిశిరసుని వలన నీకు ఎప్పటికిని భయము కలుగ కుండులాగున అతనిని మోహపరచుటకు ప్రయత్నించెదము. అతడు కన్నులతో నితరులను దహించు చున్నట్లు ఉన్నాడు. అట్టి గొప్పతపోనిధిని ప్రలోభింప చేయుటకు మే మందరము ఏకముగా కలిసి అతనియొద్దకు పోయి అతనిని వశ వరచుకొనుటకును నీ భయము పోగొట్టుటకున్ను తప్పక ప్రయత్నించ గలము'

శల్యుడు ధర్మరాజునకు తరువాతి వృత్తాంత మిట్లు చెప్ప దొడగెను:

"యుధిష్ఠిరా! ఆ విధముగా అప్సరస్త్రీలు ఇంద్రుని యాజ్ఞబడసి త్రిశిరసుని యొద్దకు పోయిరి. అక్కడ అతనిని వివిధహావభావవిలాసములచేత ప్రలోభపరచుచు ఆ స్త్రీలు తమ యవయవముల సౌందర్యమును అతనికి చూపించు చుండిరి. మహాతపశ్శాలి యైన త్రిశిరుసుడు ఆ స్త్రీలను చూచి ప్రలోభ పడ లేదు. ఇంద్రియములను తన వశమునందు ఉంచుకొని సముద్రమువలె గంభీరముగా నుండెను. ఎన్ని ప్రయత్నములు చేసినను ఆ మునిని వశపరచు కొన జాలక అప్సరస్త్రీలు నిరాశచెంది తిరిగి యింద్రుని యొద్దకు పోయి, 'దేవా! త్రిశిరసుని ధైర్యమును సడలించుటకు మాకు శక్తి చాల కున్నది. అతనిని ఏవిధముగగూడ చెనకుటకు మాకు సాధ్యము గాదు. కనుక అనంతర కార్యమును నీవే నిర్ణయించుకొని చేయుము. మా చేతకాదు.' అని యనగా అప్సరసలు చెప్పిన మాటలు విని యింద్రుడు వారిని సత్కరించి పంపెను.

"ధర్మరాజా! తరువాత ఇంద్రుడు త్రిశిరసుని వధోపాయములను చింతించు చుండగా నతని మనస్సునకు ఒక యుపాయము తోచి, అతనిపై వజ్రాయుధము ప్రయోగించెదను, వెంటనే అతడు మరణించును అని నిశ్చయించెను. ఎంత దుర్బలు డైన శత్రువు నైనను బలవంతుడు ఉపేక్షించకూడదు అను నీతి శాస్త్రము ప్రకారము యోచించి యింద్రుడు అతనిని వధించుటకే దృఢముగా నిశ్చయించెను.

"తరువాత ఇంద్రుడు అతి క్రూరు డై, అగ్నితో సమానముగా ఘోర రూపముతో నున్న వజ్రాయుధమును త్రిశిరసునిపైన విడిచెను. ఆ వజ్రాయుధము దెబ్బచేత త్రిశిరసుడు, పర్వత శిఖరము భూమిపైన పడునట్లుగా, క్రింద పడి చచ్చెను. అట్లు వజ్రహతు డై పర్వతమువలె భూతలమునందు పడి యున్నప్పటి కిన్ని, అతని దీప్త మైన తేజస్సును చూచి బెదరిన యింద్రునకు సుఖము - శాంతియు కలుగ లేదు. అతడు చచ్చి పడియున్నను బ్రతికి యున్నవానివలె దీప్తతేజస్సుతో ప్రకాశించుచు కనవడెను. చచ్చిన యతని మూడు తలలు జీవించి నట్లుగా నుండుట చూచి యింద్రుడు ఆ యద్భుతమునకు భయపడుచు కంపిత శరీరు డై చింతించు చుండెను. అప్పు డచటికి గండ్రగొడ్డలిని భుజముపై ధరించిన యొక వడ్రంగి వచ్చెను. ఆ వచ్చిన వడ్రంగము వానిని చూచి యింద్రుడు త్రిశిరసునకు మిక్కిలి భయపడుచు నతనితో "అయ్యా! వెంటనే యితని శిరస్సులను మూడింటిని ఛేదించుము. నా యాజ్ఞ నెరవేర్చుము" యనెను.

అప్పుడు ఆ యిరువురికి నిట్లు సంవాదము జరిగెను:

వడ్రం : ఇతడు మహా భుజబల సంపన్నుడు. ఈ గండ్రగొడ్డలి యితనిని ఛేదింప జాలదు. ఇదిగాక, సత్పురుషులు గర్హించు పని నేను చేయ జాలను.

ఇంద్రు : నీవు భయపడకుము శీఘ్రముగా నా యాజ్ఞ నెరవేర్చుము. నా అనుగ్రహముచేత నీ శస్త్రము వజ్రాయుధముతో సమానము కా గలదు.

వడ్రం : ఈ ఘోర కార్యమును చేయు చున్న నీ వెవ్వడవు? నిక్కముగా చెప్పుము.

ఇంద్రు : వడ్రంగీ! నేను దేవతలకు రా జైన యింద్రుడను, నీవు ఏమాత్రము వెనుకాడక నా యాజ్ఞ నెరవేర్చుము.

వజ్రదం : ఇంద్రా! అతిక్రూర మైన యీ కార్యము చేయు చున్న నీకు సిగ్గు లేదా? ఋషికుమారు డైన యతనిని చంప దలచు చున్నావే! నీకు బ్రహ్మహత్యా భయము లేదా?

ఇంద్రు : బ్రహ్మహత్యా దోషము నివారించుకొనుటకు అతి దుష్కర మైన ధర్మము నాచరించెదను. ఇతడు మహాబల సంపన్ను డైన నా శత్రువు. నా వజ్రాయుధముచేత ఇతనిని చంపితిని. కాని, యితనిని చూచుచు నేను ఇప్పటికిని భయపడుచు ఉద్వేగము చెందు చున్నాను. వెంటనే యతని శిరస్సులను ఖండించుము. నిన్ను నేను అనుగ్రహించి నీకు కావలసిన శుభములు చేకూర్చెదను. మానవులు యజ్ఞములందు నీకు యజ్ఞ భాగముగా పశువు యొక్క శిరస్సు ఇచ్చునట్లు చేసెదను. వజ్రదంగీ! ఇది నేను నీ కిచ్చు వరము. కనుక, వెంటనే యతని శిరస్సులను చేదించి నాకు ప్రీతి కలిగించుము.

ధర్మరాజా! యట్లు ఇంద్రుడు చెప్పినతోడనే ఆ వజ్రదంగి త్రిశిరసుని శిరస్సులను గండ్రగొడ్డలితో ఖండించెను. వెంటనే అతని మూడు శిరస్సులనుండి మూడు పక్షి జాతి విశేషములు పుట్టెను. అవి అంతటను వ్యాపించెను. వేదములు చదువుచు, సోమపానము చేయు చున్న అతని ఒక ముఖమునుండి కపింజలములు (కముజు పక్షులు) పుట్టెను. అన్ని దిక్కులను కబళించు చున్నట్లుగా చూచు చున్న యతని రెండవ ముఖము నుండి తిత్తిర పక్షులు (తీతువు పిట్టలు) పుట్టెను. ఎప్పుడును సురాపానము చేయునట్టి యతని మూడవ ముఖము నుండి కలవింక పక్షులు (ఊరబిచ్చుకలు), శ్యేనములున్ను (డేగలు) పుట్టెను. అంతటితో ఇంద్రుడు భయము వీడి స్వర్గమునకు పోయెను.

ధర్మరాజా! ఆ వజ్రదంగి గూడ తన యింటికి పోయెను. కాని, ఆ వజ్రదంగి యెవరితోను కలియ లేదు. మాట్లాడలేదు. ఒక సంవత్సరము దాక గ్రామస్థు లెవరు గూడ అతనిని కనుగొన లేదు. అట్లు ఒక సంవత్సరము గడచిన పిదప పరమేశ్వరుని భూతము లన్నియు "మా ప్రభు వైన దేవేంద్రుడు బ్రహ్మహత్య చేసిన పాపాత్ముడు", అని విశేషముగా గోలపెట్టి అల్లరి చేసెను.

తరువాత ఇంద్రుడు ఘోర మైన తపస్సు చేసి గొప్పగా తపోవ్రత బల సంపన్ను డైనాడు. దేవతల సహాయముతో, మరుద్గణ సహాయముతో, తన

తపోవ్రత బలముతోను ఇంద్రుడు తన బ్రహ్మహత్యా దోషమును సముద్రములందు, భూమియందు, వృక్షములందు, స్త్రీలయందును సమభాగములలో విభజించి యిచ్చి వానికి వరములు కూడ ఇచ్చెను.*

ఈ విధముగా నింద్రుడు తన బ్రహ్మహత్యా దోషము ఆ నాల్గింటియందు విడిచి పరిశుద్ధు డై దేవతలచేత సర్వలోకములచేతను పూజింప బడెను. మహర్షుల ప్రశంసలు గొనుచు నతడు తిరిగి యింద్ర పదవిని పొందెను.

ధర్మరాజా! ఆ విధముగా నింద్రుడు శత్రువును సంహరించి తాను కృతార్థు డైనట్లు తలచెనుగాని, ప్రజాపతి యైన త్వష్ట తన కొడుకును ఇంద్రుడు చంపినాడని విని మిక్కిలి కోపించి కన్ను లెఱ్ఱ జేసి యి ట్లనెను:

"సర్వదా తపస్సు చేసికొనుచు, క్షమాగుణసంపన్ను డై, యింద్రియ నిగ్రహము గలిగి, యేలాటి యపరాధము చేయక యుండు నా పుత్రుని నిష్కారణముగా చంపిన యింద్రుని సంహరింప గల వృత్రాసురుని పుట్టించెదను. నా మహా తపోబలమును, పరాక్రమమును సర్వలోకములు చూచుగాక! దురాత్ముడు, పాపిష్ఠుడు నైనయింద్రుడుగూడ నా శక్తిని చూచు గాక!"

అట్లు చెప్పి మహా తపశ్శాలి యైన త్వష్ట అగ్నియందు హోమము చేసి వృత్రాసురుని పుట్టించెను. ఘోర రూపముతో నున్న ఆ రాక్షసునితో, "హే ఇంద్రశత్రో! నా తపోమహిమ వలన నీవు వృద్ధిపొందుము"అని చెప్పెను. వెంటనే వృత్రాసురుడు సూర్యాగ్నులవలె ప్రకాశమాను డై ఆకాశమును స్తంభింప జేయుచు ప్రళయకాలసూర్యునివలె నిలిచి, "ఏమి యాజ్ఞ?" అని త్వష్టను అడిగెను. "ఇంద్రుని చంపుము" అని త్వష్ట చెప్పెను. వెంటనే వృత్రుడు స్వర్గమునకు పోయి యింద్రునితో యుద్ధము చేయ నారంభించెను.

ఆ యిరువురికిన్ని మహా ఘోర మైన యుద్ధము జరిగెను. ఇద్దరున్ను అతి క్రుద్ధు లై యుద్ధము చేసిరి. వృత్రుడు ఇంద్రుని త్రిప్పి నోటిలో వేసికొని,

* బ్రహ్మహత్యను ఈ నాలుగింటి పైన విడిచి యింద్రుడు వానికి వరములు ఇచ్చిన సంగతి గోరఖ్‌పూర్ మహాభారతమునందు ప్రక్షిప్తపాఠము నం దున్నది. కాని, ఆ నాల్గింటికి ఏయే వరము లిచ్చినదియు ఆ పుస్తకమునందు లేదు.

మింగెను. ఇట్లు ఇంద్రుడు వృత్రునిచేత మింగ బడుట చూచి, దేవత లందరు అతిసంభ్రాంతు లై వృత్రనాశక మైన 'జృంభిక' (అలసతను - ఆవులింతను కలిగించు శక్తి) అను శక్తిని ప్రయోగించిరి. జృంభికా ప్రయోగముచేత కలిగిన అలసతచేత వృత్రాసురుడు ఆవులించెను. ఆవులించునపుడు తెరచుకొనిన వృత్రుని నోటినుండి యింద్రుడు తన అవయవములను ముడుచుకొని చిన్న శరీరముతో ఈవలకు వచ్చెను. అప్పటినుండి జృంభిక ప్రాణములను ఆశ్రయించి యుండు ఆవులింతగా ప్రఖ్యాతి చెందెను. ఇంద్రుడు అట్లు ప్రాణాపాయమునుండి తప్పించుకొని వచ్చినందుకు దేవతలందరు మిక్కిలి సంతోషపడిరి.

తరువాత ఇంద్ర-వృత్రులు ఘోరముగా యుద్ధము చేసిరి. ఆ యుద్ధమునందు త్వష్టయొక్క బలపరాక్రమములుగూడ వృత్రుని ఆవహింపగా నతడు మహా బలసంపన్ను డై ఇంద్రుని మించి విజృంభించుచు యుద్ధము చేసెను. వృత్రుని ధాటికి తాళ జాలక యింద్రుడు యుద్ధమును వీడి తిరిగి వచ్చెను.

అట్లు అపజయము పొందిన దేవరాజును చూచి దేవతలు మిక్కిలి దుఃఖించిరి. ఇంద్రాదిదేవతలు త్వష్టయొక్క పరాక్రమముచేత మోహితు లై మహర్షులతో గూడుకొని వృత్రవధోపాయమును చింతించుచు నేమియు చేయుటకు తోచక అందరున్ను మందరపర్వతాగ్రము చేరి భగవంతు డైన శ్రీమన్నారాయణమూర్తిని మనసార ధ్యానించు చుండిరి. అప్పుడు ఇంద్రుడు దేవతలతో ని ట్లనెను.

దేవతలు విష్ణువుకడకు పోవుట :

"దేవతలారా! సమస్త ప్రపంచములోను వృత్రాసురుడు వ్యాపించి యున్నాడు. అతనిని ఎదుర్కొని సంహరింప దగిన శక్తి యెక్కడను లేదు. నేను పూర్వము సమర్థుడనుగా నుంటిని గాని, యిప్పుడు అసమర్థుడ నైతిని. అతడు అసాధ్యు డని నాయభిప్రాయము. అతడు మహాపరాక్రమశాలి. ఉగ్రతపస్సంపన్నుడు. మహాత్ముడు. యుద్ధమునందు అమిత బల - పరాక్రమములు గలవాడు. దేవ-దానవ లోకములు మూడింటిని మింగ గలవాడుగా నున్నాడు. కనుక, ఇప్పుడు మీ రందరు నా నిశ్చయము వినుడు. మన మందరము కలిసి వైకుంఠమునకు పోయి శ్రీమహావిష్ణువును శరణు వేడుదము. వృత్రుని వధోపాయమును ఆయననుండి తెలిసికొందము."

యుధిష్ఠిరా! ఇంద్రునిమాటలు విని దేవత లందరు ఋషిగణములతో పాటు విష్ణుమూర్తి శరణు జొచ్చుటకు వైకుంఠమునకు పోయి ఆ దేవునితో ఇట్లు చెప్పదొడగిరి:

దేవా! నీవు త్రివిక్రమావతారము (వామనావతారము)లో మూడు లోకములను మూడడుగులతో నాక్రమించుకొన్నావు. అమృతమును తెచ్చితివి. రాక్షసులను సంహరించితివి. రాక్షసాధిపతి యైన బలిచక్రవర్తిని బంధించి యింద్రుని దేవలోకాధిపతిని చేసితివి. సర్వదేవతలకును నీవు ప్రభువుగ నున్నావు. సమస్త ప్రపంచమునందు వ్యాపించి యున్నావు. సర్వలోక నమస్కారము లందుకొనుచున్న దేవదేవుడవు. ప్రపంచమంతటను తన శక్తితో వ్యాపించి యున్న వృత్రాసురుని వలన అందరమున్ను భయపడి యున్నాము. అప్పుడు మా కందరకున్ను నీవే గతి."

ఆ మాటలకు విష్ణుమూర్తి దేవలతో ని ట్లనెను:

విష్ణువు వృత్రవధోపాయము చెప్పుట

"దేవతలారా! మీకు హిత మైన కార్యము నేను తప్పక చేయ వలెను. దానికి మీ కొక యుపాయము చెప్పెదను. నేను చెప్పినట్లు మీరు చేసినచో, తప్పక వృత్రుడు నశించ గలడు. మీ రందరు ఇప్పుడు ప్రపంచమంతటను వ్యాపించి యున్న వృత్రాసురునియొద్దకు పోయి అతనితో సామోపాయమున మైత్రి చేయుడు. స్నేహముతోనే అతనిని మీరు జయించగలరు. నా తేజస్సుచేత ఇంద్రునకు జయము కలుగునట్లు చేసెదను. నేను అదృశ్యుడనుగా, ఇంద్రుని వజ్రాయుధములో ప్రవేశించెదను. అప్పు డా ఆయుధము వృత్రుని చంపగలదు. కనుక, మీ రందరున్ను వెంటనే వృత్రునియొద్దకు పోయి అతనితో చెలిమి చేసి యుండుడు."

రాజా! విష్ణుమూర్తి యాజ్ఞప్రకారము ఋషులు, దేవతలున్ను ఇంద్రుని ముందిడుకొని, వృత్రునికడకు పోయిరి. అక్కడ తన మహాతేజస్సుచేత మూడు లోకములను మింగు చున్నాడా యనున ట్లున్నవృత్రాసురుని వా రందరు చూచిరి. అతనితో ఋషులు ఇ ట్లనిరి:

"వృత్రా! దుర్జయుడ వైన నీ తేజస్సు లోకమంతట వ్యాపించి యున్నది. నీవు ఇంద్రుని జయించ జాల కున్నావు. మీ రిద్దరు యుద్ధము చేయు చుండగా,

నెంతయో కాలము గడచెను. దేవ-దానవ-మానుష్యలోకములలోని ప్రజ లందరున్ను పీడితు లై యున్నారు. యుద్ధము చాలించి మీ రిద్దరు స్నేహభావముతో నుండుడు. నీకు సుఖము, ఇంద్రలోకమున్ను శాశ్వతముగా లభించును."

యుధిష్ఠిరా! యట్లు ఋషులు చెప్పినమాటలు విని వృత్రాసురుడు వారికి నమస్కరించి యి ట్లనెను:

"మహర్షులారా! మీ రందరు మహానుభావులు. మీమాట లన్నియు వింటిని. నేను చెప్ప బోవుమాటలుగూడ వినుడు. నాకు, ఇంద్రునకున్ను సంధి ఎట్లు కుదురును? మాయిరువురి తేజస్సులకున్ను సఖ్యము కుదురుట అసంభవము. ఇది ఎప్పటికిన్ని సాధ్యము కాదు.

ధర్మరాజా! ఆ మాటలకు ఋషు లి ట్లనిరి :

"వృత్రా! సత్పురుషులతో సాంగత్యము ఒక్కసారి కోరుకొన వలెను. తరువాత అది క్రమముగా శుభమునే కలిగించు చుండును. సత్పురుష సాంగత్యమును విడువ గూడదు. కనుక, దానిని తప్పక పొంద వలెను. దానివలన మంచి ప్రయోజనములు కలుగును. కనుక, సజ్జను నెప్పుడుగూడ చంప దలప గూడదు. ఇంద్రుడు సత్పురుషులకు సమ్మత మైనవాడు. మహాత్ములకు ఆశ్రయ దాత. సత్యశీలుడు, ధర్మాత్ముడు, పూజ్యుడు. కనుక, అట్టి యింద్రునితో నీకు శాశ్వత మైన సంధి యగుగాక! మా మాట విశ్వసింపుము. అన్యథా తలంచకుము."

రాజా! మహర్షుల వచనములు విని వృత్రాసురుడు వారితో "మహాత్ములారా! మీరు నాకు మిక్కిలి మాననీయులు. తపస్వులు. నేను చెప్పబోవు ప్రకారముగా దేవతలు నడచుకొనినయెడల నేను మీరు చెప్పినమేరకు దేవతలతో సఖ్యము చేసెదను" అని చెప్పి మరల ని ట్లనెను:

"మహర్షులారా! ఎండిన వస్తువు, పచ్చివస్తువు, కొయ్య, రాయి, శస్త్రము, అస్త్రము మున్నగువానిలో దేనితో గాని, రాత్రి గాని, పగలు గాని, యింద్రాదిదేవతలకు నేను వధ్యుడనుగాకుండ నుండ వలెను. అట్లైన యెడల ఇంద్రునితో నేను సంధి చేసికొనెదను."

ఆ మాటలకు ఋషీశ్వరులు సమ్మతించిరి. జనమేజయా! యిట్లు శల్యుడు ధర్మరాజునకు చెప్పి తరువాతి వృత్తాంత మిట్లు చెప్ప దొడగెను :

"ధర్మరాజా! ఈ విధముగా ఇంద్రవృత్రులకు సంధి కుదిరిన తరువాత వృత్రాసురుడు సంతసించెను ఇంద్రుడుగూడ శాంతించి సంతుష్టు డాయెను. ఇట్లు వృతునితో స్నేహపూర్వకముగా వ్యవహరించుచునే యింద్రుడు వృత్రవధోపాయమును గూర్చి చింతించు చుండెను. దానికిగాను అవకాశము నన్వేషించు చుండెను.

వృత్రవధ

''అ ట్లుండగా నొకప్పు డింద్రుడు సముద్ర తీరమునందు వృత్రాసురుని చూచి యిట్లు చింతించెను:-

'ఇది సంధ్యాసమయము. ఈ ముహూర్తముగూడ అతిభయంకరము. ఇది రాత్రి కాదు, పగలును గాదు. కావున ఈ సమయమే వృత్రవధకు తగినది. వృత్రుని కిచ్చిన వరములలో నిది చేరదు. నా సర్వస్వమును హరించిన వృత్రాసురుని సంహరించుటకు ఇదియే మంచి సమయము. ఒకవేళ ఇప్పుడు వృత్రాసురుని సంహరించ కుండినచో నాకు శ్రేయస్సు కలుగదు. అతడు మహాబల పరాక్రమ సంపన్నుడు, మహాకాయుడు. కనుక, ఈ సమయము మించినచో, నాకు అతడు అసాధ్యు డగును.'

''అట్లు చింతించుచునే యింద్రుడు విష్ణువును ధ్యానించి, సముద్రతీరమునందున్న నురుగును చూచెను. అది పర్వతమువలె నెత్తుగా నుండెను. దానిని చూచి ఈ నురుగు శుష్కము గాదు - అర్ద్రమున్ను గాదు. ఇది శస్త్రముగూడ కాదు. 'ఈ సమయము రాత్రి గాదు - పగలు కాదు. కనుక, ఈ నురుగును వృత్రాసురునిపైన విడిచెదను. దీనితో నతడు తప్పక నశించ గలడు.' అట్లు అని నిశ్చయించుకొని యింద్రుడు ఆ నురుగుతో చేర్చిన వజ్రాయుధమును వృత్రునిపైన విసరెను. ఆ నురుగులో విష్ణువు ప్రవేశించి యుండి వృత్రుని నశింపజేసెను.''

ధర్మరాజా! వృత్రాసుర సంహారము తరువాత దిక్కులన్నియు స్వచ్ఛము లయ్యెను. సుఖముగా వాయువు వీచెను. ప్రజలు హర్షించిరి. దేవతలు, మునులు అందరు దేవేంద్రుని స్తుతించిరి. ఇంద్రు డందరి నమస్కారములను స్వీకరించి యందరిని ఓదార్చెను. దేవగణముతో కలిసి శ్రీ మహావిష్ణువును పూజించెను.

ఇంద్రుడు బ్రహ్మహత్యా దోషముచేత జలప్రవేశము చేయుట

"రాజా! లోకభయంకరు డైన వృత్రాసురుడు చచ్చిన తరువాత ఇంద్రుడు త్రిశిరసునిచేత పరిభవింప బడి బ్రహ్మహత్యాదోషము తనకు సంక్రమించుటచేత, వృత్రాసురునివిషయమై తాను అసత్య మాడినందు చేతను మిక్కిలి వికల మైన మనస్సు గలవా డై లోకముల యొక్క చివరి చేరి, స్మృతి దప్పి, అచేతను డై తన పాపముల చేత అభిభూతు డై యేమియు తెలిసికొన జాలక నిగూఢముగా జలమునుండు కదలాడుచున్న సర్పమువలె నుండెను.

యుధిష్ఠిరా! దేవేంద్రు డిట్లు బ్రహ్మహత్యాభయముచేత విసంజ్ఞు డై అదృశ్యుడు కాగా, భూమండల మంతయు తేజోహీన మై, వృక్షములు లేక యెండిన అడవి వలె, నదులు ప్రవాహరహితముగా, సరస్సులు జలరహితములు గాను ఉండెను. అనావృష్టివలన సమస్త ప్రాణులకు సంక్షోభము గలిగెను. దేవతలు, మహర్షులున్ను మిక్కిలి భయము చెందిరి. జగత్తు అంతయు అరాజకమై ఉపద్రవములు చెలరేగెను. అప్పుడు దేవతలు భీతిల్లి 'మనకు ఎవడు రాజుగా నుండ గలడు?' అని చింతించిరి. దేవరాజు లేనందున స్వర్గము నందలి దేవర్షు లందరు విచారపడిరి. ఎవడుగూడ దేవరాజ్యాధిపత్యమును వహించుటకు ఇష్టపడ కుండెను.

నహుషుని దేవరాజ్యాధిపతిని చేయుట

"ధర్మరాజా! అప్పుడు ఋషులు దేవతలును యోచించి దేవరాజ్యాధిపత్యమునకు 'నహుషుడు అర్హుడు' అని నిర్ణయించి, 'అతనికి రాజ్యపట్టాభిషేకము చేయుట మంచిది. అతడు తేజస్వి, కీర్తిమంతుడు, ధార్మికుడు' అని వారు నహుషుని యొద్దకు పోయి 'రాజా! నీవు మాకు రాజుగా నుండుము' అని వేడుకొనగా, నహుషుడు వారితో 'నేను దుర్బలుడను, రాజ్యపాలన శక్తి నాకు లేదు. రాజు బలవంతుడుగా నుండ వలెను. అట్టి బలము ఇంద్రునకు కలదు అని యనెను.

ఆ మాటకు వారు ఇ ట్లనిరి :

"రాజా! సంపన్నుడ వైన నీవు మాకు రాజుగా నుండి స్వర్గరాజ్యమును పరిపాలించుము. నీవు రాజ్యాభిషిక్తుడవు కమ్ము. నీకు ఎదురుగా కనపడు చున్న

దేవ-దానవ-యక్ష-ఋషి-గంధర్వ-పితృ-భూతాదులు తమ తమ తేజస్సును నీ కిచ్చెదరు. దానిని తీసుకొని నీవు బలవంతుడ వయ్యెదవు. స్వర్గరాజ్యాధిపతి వై అందరిని పరిపాలించుము."

యుధిష్ఠిరా! అప్పుడు నహుషుడు ధర్మమార్గములో స్వర్గరాజ్యాధిపత్యమును స్వీకరించి పట్టాభిషేకము చేసికొనెను. సర్వదా ధర్మాత్ముడుగా నుండి దుర్లభసుఖములను అనుభవించు చుండెను.

ఇట్లుండగా కొన్నినాళ్ళ కతడు కామ మోహితు డై నందనము మున్నగు నుద్యానములందు కైలాసము, హిమాలయము మొదలగు పర్వతము లందును నదీసముద్రతీరములందును దేవకన్యలు-అప్సరస్త్రీలున్ను పరివేష్టించి యుండగా కామక్రీడలను సలుపుచు నుండెను. దివ్యము లైన కథలను, వాద్యములను, మధురగానములను వినుచు దేవరా జైన నహుషుడు విహరించు చుండెను. విశ్వావసువు, నారదుడు, గంధర్వులు, అప్సరసలు అతనిని సేవించు చుండిరి. ఆరు ఋతువులు మూర్తిమంతము లై సేవించు చుండెను. సుఖస్పర్శ గల సుగంధివాయువు అతనికడ సర్వదా వీచు చుండెను.

నహుషుడు ఇంద్రుని భార్యను కోరుట

ధర్మరాజా! ఆ విధముగా క్రీడించు చున్న నహుషునకు ఒకనాడు ఇంద్రునిభార్య యైన శచీదేవి కనపడెను. ఆమెను చూచి దుర్బుద్ధి గలవా డై నహుషుడు సభాసదులతో 'దేవతలారా! నే నిప్పుడు దేవతలకు, మూడులోకములకున్నురా జైన యింద్రుడను. కనుక, ఇంద్రుని భార్య నా యింటికి ఏల రాదు?" అని యనెను. ఆ మాటలు వినిన శచీదేవి మనస్సు వికల మై బృహస్పతితో "మహాత్మా! నీశరణు జొచ్చితిని, నన్ను నహుషునినుండి రక్షింపుము. పూర్వము 'నీవు సర్వలక్షణసంపన్నురాలవు, సుఖవంతురాలవు, వైధవ్యరహితవు, పతివ్రతవు' అని నీవు నన్ను ప్రశంసించు చుంటివి. ఇప్పుడు ఆ నీ మాటలను సత్యము చేయుము. భగవాన్! నీవు ఎప్పుడుగూడ వ్యర్థముగా మాట్లాడ లేదు. కనుక, నీ మాట యిప్పుడు సత్యము కావలెను' అనెను.

ఆ మాటకు బృహస్పతి శచీదేవితో 'దేవీ! నిన్నుగూర్చి నేను చెప్పినమాటలన్నియు తప్పక తథ్యములు కా గలవు. తొందరలోనే యింద్రుడు రా గలడు. నీవు నహుషునికి భయపడ వలసినయవసరము లేదు. నా మాట సత్యము.

త్వరలోనే నీకు ఇంద్రునితో సమాగమము కల్పించెదను' అని చెప్పి ఆమెను ఓదార్చెను.

శచీదేవి బృహస్పతిని శరణు జొచ్చిన సంగతి తెలిసి నహుషుడు మిక్కిలి క్రుద్ధు డయ్యెను. యుధిష్ఠిరా! కోపముతో నున్న నహుషునితో దేవతలు ఋషులు, "దేవరాజా! క్రోధమును విడుము నీవు కోపించిన యెడల సమస్త ప్రపంచము భయపడును. నీవంటివారు కోపపడ కూడదు. శచీదేవి పరస్త్రీ. పరదారగమన పాపము చేయకుము. నీవు త్రిలోకాధిపతివి. ఇట్టి పాపకార్యము నీకు తగదు. ప్రజలను ధర్మమార్గములో పాలించుము" అని యనిరి.

యుధిష్ఠిరా! ఇంతగా చెప్పినను నహుషుడు కామమోహితు డై దేవతల మాటలు లెక్క చేయక వారితో ని ట్లనెను:

"పూర్వ మింద్రుడు బ్రహ్మర్షిపత్ని యైన అహల్యను ఆమె పతి జీవించి యుండగానే మోసగించి చేపట్ట లేదా? అప్పుడు మీ రాతనిని ఏల నివారించ లేదు? ఇంతియేకాక, పూర్వ మింద్రుడు అనేక క్రూరకార్యములు చేసెను. అనేక ధర్మరహితకార్యములు, కపటకృత్యములున్ను చేసెను. అప్పు డతనిని మీ రేల నివారించ లేదు? ఇప్పుడు నే నింద్రుడను. కనుక శచీదేవి నాయొద్దకు రావలి సినదే. దానివలన ఆమెకు హితము, మీకు శుభమున్ను కలుగును."

నహుషుని మాటలు విని, దేవతలు అతనితో "రాజా! శచీదేవిని నీయిష్టము మేరకు నీ యొద్దకు తీసికొని వచ్చెదము. క్రోధము విడిచి ప్రీతుడవు కమ్ము'' అని యనిరి.

ధర్మజా! దేవత లప్పుడు బృహస్పతి యొద్దకు పోయి ''ఆర్యా! నీవు శచీదేవికి ఈ శుభవార్త చెప్పుము. ఆమె నీశరణు జొచ్చి నీ యింట నున్న దని మాకు తెలియును. నీవు ఆమెకు అభయ మిచ్చితి వనికూడ మాకు తెలియును. దేవతలు, ఋషులున్ను నిన్ను వేడుకొను చున్నారు. కనుక, నీవు శచీదేవిని నహుషుని కడకు పంపుము. దేవరా జైన నహుషుడు ఇంద్రునికన్న శ్రేష్ఠుడు. కనుక, శచీదేవి యతనిని పతిగా కోరుకొనుగాక!'' అని యనిరి. ఆ మాటలు విని శచీదేవి బిగ్గరగా నేడ్చుచు దీనురా లై బృహస్పతితో "దేవర్షిసత్తమా! నేను నహుషుని పతిగా ఇచ్చగించను. నీ శరణు జొచ్చితిని. ఈ మహాభయమునుండి నన్ను రక్షింపుము" అని యనగా బృహస్పతి శచీదేవితో నిట్లనెను:

బృహస్పతి శచీదేవికి అభయ మిచ్చుట

"ఇంద్రాణీ! నా శరణు జొచ్చిన నిన్ను విడుపను. ఇది నా నిశ్చయము నీవు ధర్మాత్మురాలవు, సత్యశీలవు. కనుక, నిన్ను విడువనే విడువను. విశేషించి నేను బ్రాహ్మణుడను, కాబట్టి, ఇటువంటి నీచకార్యమును చేయను "

అట్లు చెప్పి బృహస్పతి ఆమె నోదార్చి. దేవతలతోగూడ ఆ మాటనే చెప్పి "యీ విషయములో పూర్వము బ్రహ్మదేవుడు చెప్పిన మాటలు చెప్పెదను వినుడు" అని దేవతలకు బ్రహ్మవాక్యముల నిట్లు బృహస్పతి చెప్పదొడగెను:

శరణాగత రక్షణ ఫలము

"తన శరణు జొచ్చి అభయము వేడినవానిని శత్రువుకు ఒప్పగించిన వానిచేలలో నాటిన బీజములు మొలకెత్తుకాలములో మొలవవు. అట్టివా డెపుడైన భీతు డై యితరుని శరణు వేడినయెడల ఎవడుగూడ నతనికి అభయ మీయడు. అతడు దైన్యవృత్తితో అన్నము సంపాదించి తినును. జ్ఞానశూన్యు డై చేష్ట లుడిగి స్వర్గమునుండి భ్రష్టు డై క్రింద పడును. శరణాగతరక్షణము చేయనివా డిచ్చిన హోమద్రవ్యములను దేవతలు గ్రహింపరు. అతని సంతానము అకాల మరణము నందును. అట్టివాని తలిదండ్రులు అతనిని విడిచి దూరదేశమునకు పోయెదరు. భీతితో శరణు జొచ్చిన వానిని, అతని శత్రువునకు ఒప్పగించినట్టి పాపాత్ముని ఇంద్రాది దేవతలు వజ్రాయుధముతో కొట్టెదరు."

ఇట్లు బ్రహ్మ వాక్యములు చెప్పి బృహస్పతి దేవతలతో నిట్లనెను:

"సురశ్రేష్ఠులారా! ఈ ధర్మవచనము లన్నియు తెలిసినవాడను గాబట్టి, నా శరణుజొచ్చిన శచీదేవిని నహుషున కొప్పగించను. ఈమె లోకమునందు సుప్రసిద్ధురాలు. ఇంద్రునికి ప్రియ మైన పట్టపుదేవి. కనుక నే నీయను. ఈమెకు హిత మైన మార్గమును యోచించి, యేది ఉచితమో అట్లు చేయుడు. శచీదేవిని మాత్రము నేను నహుషున కీయను."

ఆ మాటలు విని దేవగంధర్వాదులు బృహస్పతితో "మహాత్మా! ఇప్పుడు అనుసరించ దగిన ఉచిత మార్గమును నీవే యోచించి చెప్పుము" అనిరి.

ఆ మాటలకు బృహస్పతి యి ట్లనెను:

"దేవతలారా! శచీదేవి నహుషుని యొద్దకు పోయి కొంత కాలవ్యవధి కోర వలెను. దానిచేత మనకు హితము కలుగును. ఎందు కనగా, కాలము గడచుకొలది ఆ కార్యమునకు ఎన్నియో విఘ్నములు కలుగ వచ్చును. మీ పరప్రభావముచేత గర్వితు డై యున్న నహుషుని యముని కడకు కాలమే చేర్చగలదు."

ధర్మజా! బృహస్పతి మాటలతో దేవతలు సంప్రీతు లై బృహస్పతితో - "మహాత్మా! సమస్త దేవతలకున్ను హిత మైన మాట చెప్పితివి. ఈ విషయము చెప్పి శచీదేవిని గూడ ప్రసన్నురాలిని చేసెదముగాక!" అని వారు శచీదేవి కడకు పోయి ఆమెతో ని ట్లనిరి:

"దేవీ! స్థావరజంగమాత్మక మైన ప్రపంచమున కంతటికిని నీవు ఆధార భూతురాలవు, మహాపతివ్రతవు, సత్యశీలురాలవు. కనుక, నీవు నహుషుని యొద్దకు పొమ్ము. నిన్ను కామించిన ఆ పాపాత్ముడు త్వరలోనే నశించగలడు. ఇంద్రుడు తప్పక తిరిగి స్వర్గరాజ్యాధిపత్యము పొంద గలడు. నీకు ఏలాటి అపాయము కలుగబోదు."

ఆ మాటలు విని యింద్రాణి కార్యసిద్ధికొరకు నిశ్చయించుకొని ఘోర రూపు డైన నహుషునియొద్దకు లజ్జతో పోయెను. అట్లు వచ్చిన వయోరూప సౌందర్యవతి యైన శచీదేవిని చూచి కామమోహితుడు, దురాత్ముడు నైన నహుషుడు సంతోషించెను.

యుధిష్ఠిరా! అప్పుడు నహుషుడు శచీదేవితో "సుందరీ! నేను త్రిలోక నాథు డైన యింద్రుడను, నన్ను పతిగా వరించుము" అని యనగా పతివ్రత యైన శచీదేవి భయపడుచు, సుడిగాలిలో అరటిచెట్టువలె కంపించుచు బ్రహ్మ దేవునకు మనసా నమస్కరించి, క్రూరరూపము గల నహుషునితో ని ట్లనెను:

నహుషుడు శచీ ప్రార్థనను అంగీకరించుట

''దేవరాజా! దేవేంద్రుడు ఎక్కడకు పోయినది తెలియలేదు. ఆయన యే మైనదిగూడ తెలియ లేదు. అందలి వాస్తవమును తెలిసికొన వలెను గదా! ఆయన సంగతి యేమియు తెలియక, యిక రా డని నిశ్చయించినప్పుడు నీ యొద్దకు

వచ్చెదను. ఈ నా మాట సత్యము. ఇంద్రుని సమాచారమునుగూర్చి సమగ్రముగా తెలిసికొనుటకు కొంతకాలము వేచి యుండుట అవసరము. కనుక, కొంత కాలము నీవు ఓపికపట్టి యుండు మని వేడు చున్నాను.''

ఆ మాటకు నహుషుడు సంతసించుచు నామెతో ని ట్లనెను:

''సుందరీ! నీ విప్పుడు చెప్పినట్లే కానిమ్ము. నిక్కము తెలిసికొని తప్పక నీవు రావలెను. జ్ఞాపక ముంచుకొనుము ఇక నీవు పోయిరమ్ము.''

తరువాత ఆమె తిరిగి బృహస్పతి యింటికి పోయెను. నహుషునితో జరిగిన సంభాషణమును ఆమె దేవతలకు, బృహస్పతికిన్ని చెప్పగా, ఆమె మాటలు విని తరువాతి కార్యక్రమమునుగూర్చి దేవతలు విచారింప దొడగిరి.

ధర్మజా! దేవతలు ఇంద్రుని కొరకు విశేషముగా విచారించి అగ్నిదేవుని ముందిడుకొని, దేవదేవు డైన విష్ణువు కడకు పోయి ఆయనతో ని ట్లనిరి:

ఇంద్రునకు బ్రహ్మహత్యా సముద్ధారము

'దేవా! దేవేంద్రుడు బ్రహ్మహత్యాపాపముచేత ఖిన్ను డై యెక్కడకో పోయెను. నీవు ప్రపంచమున కంతటికిన్ని ప్రభు వై యున్నావు. మా కందరికిన్ని నీవే గతి. సర్వభూత రక్షణార్థమై విష్ణుపదవిని పొందితివి. నీ శక్తిచేత వృత్రాసురుడు సంహరింప బడగా నింద్రుడు బ్రహ్మహత్యాదోషముచేత అదృశ్యుడయ్యెను. ఆ కారణముచేత దేవరాజ్యాధిపత్యమునకై తిరిగి అతనినే కోరు చున్నాము. ఇప్పు డతనికి విముక్తిని కలిగింపుము.''

ఇట్లు వేడుకొను చున్న దేవతలతో శ్రీ మహావిష్ణు వి ట్లనెను:

''దేవతలారా! ఇంద్రు డిప్పుడు నన్నుగూర్చి యజ్ఞము చేయుగాక! అతనిని నేను పవిత్రుని చేసెదను. అశ్వమేధయాగ పుణ్యముచేత నతడు మరల తన స్థానము పొంద గలడు. నహుషుడు తన దుష్కర్మఫలితముగా నశించ గలడు. కొంతకాల మిట్లే మీరు ఈ కష్టమును ఓర్చుకొన వలెను.''

ధర్మరాజా! శ్రీ మహావిష్ణువు చెప్పిన అమృతోపమాన మైన మాట విని దేవతలు, ఋషులున్ను భయముచేత దాగి యున్న యింద్రుని యొద్దకు పోయి, అక్కడ ఇంద్రునికి సంభవించిన బ్రహ్మహత్యాదోషము పోగొట్టుటకై అశ్వమేధ

యాగము చేసిరి. ఆ యాగ ప్రభావముచేత ఇంద్రుడు దోషవిముక్తు డై బ్రహ్మ హత్యను నాలుగుగా విభజించి వృక్షములయందు, నదులయందు, పర్వతములు-భూమియందు, స్త్రీలయందున్ను విడిచెను. అంతటితో నింద్రునకు బ్రహ్మహత్యా దోషము పోయెను.

యుధిష్ఠిరా! యింద్రుడు దోషవిముక్తు డైనను, నహుషుని పరాక్రమ విశేష మధికముగా నుండుటచే నతనిని ఇంద్రపదమునుండి అది కదిలించ లేక పోయెను. నహుషుడు వరబలముతో సమస్త భూతముల తేజస్సును హరించుచు దుస్సహుడుగా నుండెను. అప్పుడు ఇంద్రుడు మరల అదృశ్యు డై మంచి కాలమునకై యెదురుచూచుచు నిగూఢముగా సంచరించు చుండెను.

శచీదేవి రాత్రిదేవిని ఉపాసించుట

అట్లు ఇంద్రుడు మరల అదృశ్యు డై పోవగానే, శచీదేవి మిక్కిలి దుఃఖించుచు నిట్లు తలచెను:

"నేను మంచి దానములు, హోమములు, గురుసేవలున్ను చేసిన దాన నైనచో, నా యందు సత్యమే ఉండినచో, నాకు ఏక భర్తృత్వమే ఉండుగాక! ఇప్పుడు ఉత్తరాయణ పుణ్యకాలము నందు వచ్చిన పవిత్ర మైన రాత్రిదేవిని పూజించి నమస్కరించెదను. దానిచేత నా మనోరథము సిద్ధించుగాక!"

తరువాత శచీదేవి నియమ నిష్ఠలతో అక్కడ దేవతా స్వరూపురా లైన ఉత్తరాయణి రాత్రి దేవిని సేవించి ప్రార్థించెను. ఇంద్రాణి పతివ్రత గనుక, రాత్రికి అధిష్ఠాన దేవత యైన 'ఉపశ్రుతి' అను దేవి దర్శన మీయగా, ఆమెను నా పతి యున్నచోటు చూపుము, అని శచీదేవి కోరగా, 'నీ సత్యవ్రతము చేతనే నీ పతిని కనుగొనెదవు. ఇది సత్యము' అని చెప్పి ఆ ఉపశ్రుతి దేవి సాకారయై శచీదేవికి కనపడెను.

ఉపశ్రుతి సహాయముచేత శచీదేవి యింద్రుల సమాగమము

ధర్మరాజా! అట్లు సుందర శరీరధారిణి, యై కనపడు చున్న ఉపశ్రుతి దేవిని చూచి శచీదేవి ఆమెను పూజించి సంతోషముతో "దేవీ! ఎవరవో నీవు తెలుపుము" అని యనగా, ఉపశ్రుతి యిట్లు చెప్ప దొడగెను:

"దేవీ! నేను ఉపశ్రుతి యనుదానను. నీవు పతివ్రతవు. యమ - నియ మాదులు గలదాన వైన నీ దర్శనము చేయుటకు వచ్చితిని, ఈ నా మాట సత్యము. వృత్రాసుర సంహారకు డైన నీ పతి యింద్రుని చూపించెదను. వెంటనే నాతో రమ్ము,"

ఉపశ్రుతి మాటలు విని శచీదేవి ఆమెను అనుసరించి పతిదర్శనా ర్థమై పోయెను. ఆ యిరువురు అనేక పర్వతములు, అరణ్యములు. హిమాలయ మున్ను దాటి ఉత్తర దిశగా పోయింది. అట్లు పోయి అతి విస్తృత మైన సము ద్రమును చేరిరి. సముద్ర మధ్యమునుండు అనేక వృక్షలతాదులతో అవరింప బడిన ఒక మహాద్వీపమును చేరిరి. ఆ దీవియందు వారు అనేక పక్షిగణములతో, ఐదు రంగులు, భ్రమరధ్వనులున్ను గలిగి, వికసించి యున్న దివ్యము లైన వేలకొలది కమలములతో ప్రకాశించు చున్న ఒక సరస్సును చూచిరి. అది అనేక యోజనముల ఆమడలు వెడల్పు, పొడవున్ను గలది యై యుండెను. ఆ సరస్సు మధ్యమునందు తెల్లని నాళము గల యొక పెద్ద కమల లతను, దాని కొనకు పెద్ద కమల పుష్పమున్ను వారు చూచిరి. పద్మనాళమును ఛేదించి అందులో దూరి పోయి, అక్కడ కమలనాళ తంతువులో సూక్ష్మరూపముతో దాగి యున్న యింద్రుని కడకు ఉపశ్రుతి - శచీదేవి యిరువురు గూడ సూక్ష్మ రూపములను ధరించి పోయిరి.

ధర్మరాజా! అక్కడ ఇంద్రుని చూచినతోడనే శచీదేవి మిక్కిలి సంతో షించి స్తుతించెను. ఆ స్తోత్రమునకు సంతసించి యింద్రుడు ఆమెతో "దేవీ! నీవి క్కడి కెందుకు వచ్చితివి? ఎట్లు వచ్చితివి? ఇక్కడ నేనున్న సంగతి నీకు ఎట్లు తెలిసెను?" అని యనగా, శచీదేవి యిట్లు చెప్పెను:

"దేవా! నీవు అదృశ్యుడ వైన పిదప దురాత్ముడు నహుషుడు ఇంద్ర పదమును చేపట్టి త్రిలోకాధిపతి యై, బలపరాక్రమశాలి యై, నా యెడల కామ మోహితు డై నన్ను తన యొద్దకు రమ్మని శాసించెను. నా కోరికపైన కొంత గడువుగూడ ఇచ్చెను. ప్రియా! నీవు నన్ను రక్షింపకుండిన యెడల ఆ క్రూరుడు నన్ను తప్పక తన బల దర్పములతో వశములోకి తీసికొనును. ఆ భయము చేత నేను త్వరగా నీ కడకు ఈ ఉపశ్రుతి సహాయముతో వచ్చితిని. పాపపు తలంపు గలిగి అతి రౌద్రాకారముతో నున్న నహుషుని చంపుము. నీవు ప్రకాశముగా

బయటికి వచ్చి, తిరిగి నీ పరాక్రమమును, తేజస్సునున్ను పొంది దేవరాజ్యమును ఏలుము."

ధర్మరాజా! శచీదేవి మాటలు విని యింద్రుడు శచీదేవితో నిట్లనెను:

"దేవీ! నేను పరాక్రమము చూపుటకు ఇది కాలము కాదు. నహుషుడు చాల బలవంతుడు. ఋషులు చేసిన హవ్య - కవ్య కర్మల వలన ఆతడు మిక్కిలి పెచ్చుపెరిగి యున్నాడు. కనుక నే నొక్క యుపాయము చెప్పెదను. అట్లు చేయుము. నేను చెప్పునది రహస్యము. ఆ పని నీవు చేయ వలసినదే కాని, ఎవరికిని చెప్పకూడదు.

"నీవు నహుషుని యొద్దకు ఏకాంతమున పోయి అతనితో 'ఋషులు మోసిన దివ్య వాహనములో నీవు నా యొద్దకు వచ్చినచో నీ యెడల నేను ప్రీతితో నడచు కొనెదను' అని చెప్పుము."

యుధిష్ఠిరా! ఇంద్రుని మాటలు శచీదేవి అంగీకరించి, నహుషుని యొద్దకు పోయెను. నహుషుడు సంతోషించి, ఆమెకు స్వాగతము చెప్పి "దేవీ! నీ మనోరథము చెప్పుము. తీర్చెదను. కల్యాణీ! నేను నీకు భక్తుడను. నన్ను నీవు ఆశ్రయింపుము. నీవు చెప్పిన పని చేసెదను. లజ్జపడకుండ చెప్పుము. నన్ను నమ్ముము, నా మాట సత్యము. నీ కోరిక చెల్లించెద నని నీపైన ఒట్టు పెట్టుకొని చెప్పు చున్నాను," అని యనగా, ఇంద్రాణి నహుషునితో ని ట్లనెను:

శచీదేవి కోరికచేత నహుషుడు మహర్షులను వాహనములనుగా చేసికొనుట

"దేవరాజా! నేను నిన్ను కోరిన గడువు ముగిసిన తర్వాత నాకు నీవే భర్తవుగా ఉండెదవు. నా కోరికను తెల్పెద వినుము, నీకు నా యెడల ప్రీతి యుండి, నేను కోరిన పని చేసెద నని నీవు మాట ఇవ్వ వలెను. అప్పుడే నా కోరిక నీకు తెలిపెదను. ప్రీతి పూర్వకముగా ఆ పని నీవు చేసినచో నేను నీవశు రాలనయ్యెదను. ఇంద్రుని వాహనములు అశ్వములు, గజములు, రథములు, నుండెను. అవి గాక, నిన్ను నే నొక అపూర్వ మైన వాహనమును కోరుచు న్నాను. నేను కోరు వాహనము విష్ణువుకు గాని, శివునకు గాని, బ్రహ్మకు గాని, దేవ రాక్షసులకు గాని దుర్లభము. అది ఏ మనగా, ఋషులందరు ఏక మై నీ పల్లకీని మోయ వలెను. ఇది నా యిష్టము, అప్పుడు దేవ దానవులలో నీ సమా

నుడు మరియొకడు ఉండును. నీ యెదుట నున్నవారి తేజస్సును నీవు ఆకర్షించు కొనెదవు. ఏ బలవంతుడు కూడ నీ యెదుట నుండ జాలడు."

ఆ మాటలు విని మిక్కిలి సంతోషించి నహుషుడు ఆమెకు ఈ విధ ముగా బదులు చెప్పెను:

"దేవీ! నీవు చెప్పిన వాహనము మిక్కిలి అపూర్వము. నీ మాట నాకు నచ్చినది. నేను నీకు వశుడను. మునులను వాహనములుగా చేసికొనువాడు అల్ప శౌర్యము కలవాడు కాడు. నేను తపస్విని, బలవంతుడను, ప్రపంచ ప్రభువను, ప్రపంచము నాయందు ప్రతిష్ఠిత మై యున్నది. నేను కోపించినచో దేవ-దానవ-గంధర్వ-కిన్నర ఉరగులు, సమస్త లోకములున్ను నాముందు నిలువ జాలవు. ఎవనిని నేను చూచెదనో వాని తేజస్సును హరించెదను. దేవీ!నీ మాట ప్రకారము తప్పక చేసెదను. ఏమాత్రము సంశయింపకుము. సప్తఋషులు - బ్రహ్మర్షులు-అందరు నన్ను మోసెదరు. నామహిమను, అభివృద్ధిని చూడుము."

యుధిష్ఠిరా! బ్రాహ్మణద్వేషి, బలవంతుడు, దర్పము చేత మత్తిల్లిన వాడు, కామాంధుడు నైన దుష్ట నహుషుడు తపో నియమము లందున్న ఋషు లను తన విమానమునకు కట్టి మోయించెను.

నహుషుని నుండి విడివడి శచీదేవి బృహస్పతి యొద్దకు పోయి ఆయనతో "మహాత్మా! నేను నహుషుని నుండి తీసికొనిన గడువు కాలము కొంచెము మాత్రమే మిగిలి యున్నది.నీ భక్తురాలైన నాయందు దయ యుంచి శీఘ్రముగా నింద్రుని వెదకుము" అని యనగా, బృహస్పతి యంగీకరించి శచీదేవితో, "దేవీ! నహుషుని వలన నీకు భయములేదు.ఆ దుష్టాత్ముడు ఇంక చాలా కాలము జీవించి యుండడు, అతడు పోయినా డనియే తెలిసికొనుము. ఎందు కనగా, అతడు మహర్షులను తన వాహనములుగా జేసికొనిన ధర్మహీనుడు.ఆ దురాత్ముని వినాశము కొరకు నేను యాగము చేసెదను ఇంద్రుని తప్పక తెచ్చెదను. నీవు భయ పడకుము. నీకు మంగళములు కలుగు గాక!" అని యనెను.

అగ్ని-బృహస్పతుల సంవాదము

"ధర్మరాజా! తరువాత మహా తేజశ్శాలి యైన బృహస్పతి యింద్రుని కను గొనుటకై శాస్త్రోక్తముగా నగ్నిని ప్రజ్వలింప జేసి, యందు హోమము చేసి, అగ్నిదేవుని ఆహ్వానించి ఇంద్రుని వెదకు మని కోరెను. అప్పుడు అగ్ని

భగవానుడు బృహస్పతి కోరిక నేరవేర్చుటకు స్త్రీవేషము ధరించి అంతర్ధానము చెంది యన్ని దిక్కులను, పర్వతములను, వనములను, భూమ్యాకాశములను ఇంద్రునికై వెదకి యెక్కడ గూడ నతనిని గానక, తిరిగి బృహస్పతి దగ్గరకు వచ్చి "మహాత్మా! యింద్రుని కొరకు నేను పోవదగిన చోట్లన్నియు వెదకితిని. నీటిలో మాత్రము వెదకలేదు. నేను నీటిలో దూరజాలను. జలములో నాగమనము కుంటువడి పోవును. కనుక, మరియేమి చేయుదునో తెలుపుము" అని యనగా బృహస్పతి "అగ్నిదేవా! నీవు జలములో గూడ ప్రవేశించి చూడుము" అని యనగా అగ్ని యిట్లనెను :

"మహాత్మా నేను జలములో ప్రవేశింప జాలను, అందులో ప్రవేశించిన వెంటనే నశించి పోయెదను. ఎందు కనగా, నీటినుండి అగ్ని, బ్రాహ్మణుని నుండి క్షత్రియుడు, శిలనుండి యినుమున్ను, పుట్టినవి. ఈ మూడింటి పరాక్రమము ప్రపంచమంతటను ఎదురులేకుండును. కాని, యవి తమ జన్మస్థానములైన జల-బ్రాహ్మణ-పాషాణములందు తమ తేజస్సును చూపించ జాలవు. అక్కడ అవి కుంఠితము లగును. కనుక, మహాత్మా! నీ శరణు వేడితిని. నన్ను క్షమింపుము."

ఆ మాటకు బృహస్పతి అగ్నిదేవునితో నిట్లనెను :

బృహస్పతి అగ్నిని, ఇంద్రుని స్తుతించుట

"అగ్నిదేవా! నీవు సర్వదేవతలకు ముఖము. సమస్త హోమద్రవ్యములను వహించువాడవు. అన్ని భూతములలోపల సాక్షి భూతుడవై గూఢముగా సంచరించు చుందువు. ఒకడవే అయికూడ మూడు విధములుగా నున్నావని పండితులు చెప్పుదురు. నీవు లేకున్నచో ప్రపంచమంతయు నశించును. బ్రాహ్మణులు నీకు నమస్కారము చేసి నీయందు యాగాది కర్మలు చేసి, తమ కర్మలకు తగిన శాశ్వత పుణ్యలోకములకు పత్నీ పుత్రులతో పోయెదరు. హోమద్రవ్యములను వహించు నగ్ని, హోమద్రవ్యములున్ను నీవే. మహాయజ్ఞములందు నిన్నే పూజించెదరు.

అగ్నిదేవా! నీవు మూడు లోకములను సృజించి, ప్రళయ కాలమునందు విజృంభించి, అన్ని లోకములను నశింప జేయుదువు. ప్రపంచ సృష్టికర్తవై ప్రపంచమును రక్షించువాడవు గూడ నీవే. నిన్నే మేఘములని, విద్యుత్తులనియు

విద్వాంసులు చెప్పెదరు. నీనుండి శస్త్రాస్త్రాయుధములు పుట్టి సమస్త భూతములను దహించును. నీయందే అన్ని జలములు, సమస్త ప్రపంచమున్ను దాగి యున్నవి. మూడు లోకములందు నీకు తెలియనిది ఉన్నదా? సర్వము అగ్ని దేవా! తన జన్మస్థానమును చెందును. కనుక, నీవు నీ జన్మస్థానమైన జలములో ప్రవేశింపుము. నీకేమైన కష్టము కలిగినచో, సనాతనములైన నా బ్రాహ్మ మంత్రముల ప్రభావముచే నిన్ను వృద్ధి పొందించెదను."

ధర్మరాజా! ఈ విధముగా బృహస్పతి అగ్నిదేవుని ప్రశంసింపగా నతడు సంతుష్టుడై "మహాత్మా! ఇంద్రుని తప్పక నీకు చూపించెదను, ఇది సత్యము" అని చెప్పెను.

ధర్మరాజా! తరువాత అగ్నిదేవుడు సముద్రములలో చిన్న చిన్న సరస్సులలోను దూరి యింద్రుని వెదకుచు, సముద్ర మధ్యములో నింద్రుడున్న సరస్సును చేరెను. అ సరస్సులో నున్న పద్మము లన్నియు వెదకుచు నందొక పద్మనాళములో నున్న యింద్రుని చూచి, వెంటనే తిరిగి బృహస్పతికడకు పోయి యతనితో నగ్ని యిట్లనెను: "మహాత్మా! కమల నాళములో నున్న తంతువును ఆశ్రయించి, అణుమాత్ర శరీరముతో నింద్రుడున్నాడు."

తరువాత బృహస్పతి దేవర్షి - గంధర్వాదులతో నింద్రు డున్న చోటికి పోయి, యింద్రుడు పూర్వము చేసిన శూరకృత్యములను వర్ణించుచు నిట్లు స్తుతించెను :

"దేవా! అతి భయంకరుడైన నముచి మహాసురుని, క్రూర పరాక్రములైన బల - శంబరాసురులనున్న సంహరించితివి. నీవు సరోత్కర్షతో వర్ధిల్లుము. శత్రు సంహారము చేయుము. దేవా! లెమ్ము, నిన్ను చూచుటకు వచ్చిన యీ దేవర్షులను చూడుము. మహేంద్రా! పూర్వము నీవు రాక్షసులను సంహరించి లోకములను రక్షించితివి. విష్ణుతేజస్సుచేత దర్పితుడై యున్న వృత్రాసురుని దుర్బలమైన శుష్క ఫేనముతో చంపితివి, సర్వభూతములకు శరణ్యుడవు, అందరికిని స్తుత్యుడవు నీతో సమానమైన ప్రాణి యేదియు లేదు, సర్వభూతములను భరించు చున్నావు. దేవతలకు మహిమ చేకూర్చితివి. దేవా! నీవు బలమును తిరిగి పొంది సర్వలోకములను రక్షింపుము."

ధర్మరాజా! ఈ విధముగా బృహస్పతిచేత స్తుతింప బడుచున్న యింద్రుడు సూక్ష్మ శరీరమునుండి మెల్లమెల్లగా వర్ధిల్లుచు పూర్వశరీరమును పొంది, పూర్వ బలముతో, శోభిల్లి బృహస్పతితో నిట్లనెను:

"మహాత్మా! త్వష్టకొడు కైన త్రిశిరసుని, లోకనాశకుడు, మహాసురుడు నైన వృత్రునిన్ని సంహరించితినిగదా! ఇక నాతో నిపుడు ఏమి పని యున్నది?

ఆ మాటకు బృహస్పతి "రాజా! మనుష్య డైన నహుషుడు దేవర్షుల తేజస్సుచేత దేవరాజ్యాధిపత్యమును పొంది మమ్మ అందరిని మిక్కిలి బాధించు చున్నాడు" అని యనగా ఇంద్రుడు "మహాత్మా! దుర్లభ మైన దేవ రాజ్యమును నహుష డెట్లు పొందెను? అతడు ఏ తపస్సు చేసి, యెట్టి బలపరాక్రమములు గలిగి యింద్ర పదవిని పొందెను? అంతయు నాకు తెలుపుము" అని యనగా బృహస్పతి యిట్లు చెప్ప దొడగెను:

బృహస్పతి లోకపాలుడు ఇంద్రునితో సంభాషించుట :

"దేవేంద్రా! నీవు విడిచి పోయిన ఇంద్ర పదవిని చూచి దేవతలు భయపడి ఆ పదవికి ఒక రాజును కోరి, పితృదేవతలు - ఋషులు- గంధర్వులున్ను సమావేశము చేసి ఒక నిర్ణయమునకు వచ్చి అందరు కలిసి నహుషుని యొద్దకు పోయి అతనిని దేవరాజ్యాధిపత్యము వహించు మని వేడిరి. ఆ మాటకు నహుషుడు 'నేను ఇంద్ర పదవిని నిర్వహించుటకు దగిన శక్తి గలవాడను కాను. మీరు నాకు తపస్సు, తేజస్సున్ను, ప్రసాదించినచో నది సాధ్యపడును' అని యనగా, వారు తమ తమ తేజస్సును నహుషునియందు ఆవహింప జేసి మనుష్య డైనను నతనిని ఇంద్ర పదవికి పట్టాభిషిక్తుని జేసిరి.

తరువాత నహుషుడు బలదర్పితు డై ఘోర పరాక్రమముతో బాధించుచు ఋషులను తనకు వాహనములుగా జేసికొని మూడు లోకములలోను ఆ దురాత్ముడు సంచరించుచున్నాడు. అతనిలో నొక విశేష మే మనగా, అతని దృష్టిలో పడినవారి తేజస్సును హరించు విషము అతని దృష్టిలో నున్నది. ఆ దృష్టి చాల భయంకరముగా నుండును. దేవత లందరు మిక్కిలి ఆర్తి చెందుచు అతని దృష్టిని తప్పించుకొని గూఢముగా తిరుగు చుందురు. కనుక, ఇంద్రా! నీవు నహుషుని ఎప్పుడు గూడ చూడకుము."

ధర్మరాజా! ఆ విధముగా బృహస్పతి యింద్రునకు నహుషుని వృత్తాంతము చెప్పు చుండగనే యక్కడికి కుబేరుడు, సూర్యపుత్రు డైన యముడు, చంద్రుడు, వరుణుడున్ను వచ్చి, యింద్రునితో "దేవా! త్రిశిరసుడు, వృత్రుడున్ను మన భాగ్యవశమున హతు లైరి. నీవును క్షేమముగ నున్నావు"

అని యనగా ఇంద్రుడు లోక "పాలురతో" క్రూరు డైన నహుషు డిప్పుడు దేవ రా జై యున్నాడు. కనుక, అతని నోడించుటకు మీరు నాకు సహాయము చేయ వలెను" అని యనగా, వారు "నహుషుడు ఘోరరూపుడు - దృష్టియందు విషము గలవాడు గనుక, అతనికి మేము భయపడెదము. నీవు ఒకవేళ నహుషరాజును జయించినచో మేము యజ్ఞ భాగమును పొందుటకు అర్హుల మగుదుము" అని యనగా వారితో నింద్రుడు "లోకపాలకులారా! అట్లే కానిండు. వరుణుడు - కుబేరుడు - యముడున్ను యజ్ఞ భాగములను పొందుదురుగాక! నేడు - దేవత లందరితో గలిసి మనము నహుషుని జయింతము" అని యనెను. అప్పుడు అగ్ని "దేవా! నేను గూడ నహుష విజయములో సహాయము చేసెదను. నాకు గూడ యజ్ఞభాగ మిమ్ము" అని యనగా, ఇంద్రుడు "అగ్ని దేవా! నేను, నీవు కలిసి యొక భాగము పొందుదుముగాక!" అని యనెను. అప్పుడు ఇంద్రుడు కుబేరుని సర్వయక్షులకు ధనములకున్ను, యముని పితరులకున్ను, వరుణుని జలముల కున్ను అధిపతులనుగా జేసెను."

అగస్త్యుడు ఇంద్రునకు నహుషపతనవృత్తాంతము చెప్పుట

ధర్మరాజా! ఇంద్రుడు లోకపాలకులతో, దేవతలతోను కలిసి నహుష వధార్థము చింతించు చుండగా , అగస్త్యమహాముని వచ్చి వారితో "నేడు నహుషుడు దేవరాజ్య పదవినుండి భ్రష్టు డైనాడు, ఇంద్రా! నీకు మేలగుగాక!" యనెను. ఆ మాట విని అందరు సంతసించిరి. ఇంద్రుడు అగస్త్య మహామునిని అర్ఘ్య - పాద్యాదులతో పూజించి "మహాత్మా! నహుష డెట్లు స్వర్గరాజ్య భ్రష్టు డయ్యెను? చెప్పుము", అని యడుగగా, వారికి అగస్త్యుడు ఇట్లు చెప్పెను:

"ఇంద్రా! మహాత్ము లైన దేవర్షి - బ్రహ్మర్షి సత్తములు నహుష డెక్కిన పల్లకిని మోయుచు శ్రమచేత బాధపడి విశ్రాంతి తీసికొనుచు, నహుషునితో, 'రాజా! గోవుల* ప్రోక్షణము కొరకు బ్రహ్మదేవుడు చెప్పిన మంత్రములపైన నీకు ప్రమాణ బుద్ధి ఉన్నదా? లేదా? ఈ మా సంశయము తీర్చుము', అని యడిగిరి. ఆ మాటకు నహుషుడు మూఢత్వముతో "నాకు ఆ బ్రాహ్మమంత్రములందు ప్రమాణ బుద్ధి లేదు" అనెను. ఆ మాట విని ఋషీశ్వరులు 'నీవు అధర్మము

---

* యజ్ఞమునందు పశువును వధించుట.

నందు ప్రవృత్తి గలవాడవు. ధర్మమునందు నీకు గౌరవ విశ్వాసములు లేవు, పూర్వ మహర్షులచేత చెప్ప బడిన ఆ మంత్రములు మాకు ప్రమాణములు', అని నహుషునితో ననిన మాటలు ఇంద్రునకు చెప్పి అగస్త్యుడు - తరువాతి కథ యిట్లు చెప్ప దొడగెను:

"దేవా! అప్పుడు నహుషుడు ఈ విషయమున వివాదము చేయుచు తీవ్రముగా వాదించిన నన్ను తలపైన తన కాలితో తన్నెను. అట్లు నన్ను తన్నిన అధర్మముచేత పీడితు డై నహుషుడు తన తేజస్సును, సంపదనున్ను పోగొట్టుకొనెను. అప్పు డతడు అజ్ఞానాంధకారము ఆవహించి మిక్కిలి బాధపడు చుండగా, చూచి నేను అతనితో 'రాజా! పూర్వులు ఏర్పరచినట్టిది, బ్రహ్మర్షులు అనుష్ఠించినట్టిదియు నైన అదృష్ట ధర్మమును నీవు దూషించితివి, నా శిరస్సును కాలితో తన్నితివి. బ్రహ్మవిదు లైన మహర్షులను నీకు వాహనములుగా చేసికొని బ్రహ్మ సమాను లైన వారి యెడల అపచారము చేసితివి. ఈ కారణము లన్నింటి చేత నీవు తేజోహీనుడ వై, క్షీణపుణ్యుడ వైతివి. కనుక నీవు స్వర్గరాజ్య పద భ్రష్టుడ వై భూమండలమునందు సర్పరూపముతో పది వేల సంవత్సరములు పడి యుండెదవుగాక!' అని శపించితిని.

అప్పుడు నహుషుడు నా శరణు జొచ్చి వేడుకొనగా నేను అతనిని కరుణించి, యతనితో నీ వంశమునందు భవిష్యత్తులో 'అజాత శత్రుడు' అను ప్రసిద్ధి పొందిన యుధిష్ఠిరుడు జన్మించును. అతని దర్శనముతో నీకు పది వేల సంవత్సరముల శాపపుగడువు ముగియును. అప్పుడు సర్పరూపము విడిచి, మరల స్వర్గము నీవు చేరెదవు' అని శాపాంతము కూడ చెప్పితిని."

'మహేంద్రా! నహుషుడు నా శాపముచేత వెంటనే దేవరాజ్యమునుండి భ్రష్టు డయ్యెను. కనుక నీభాగ్యము పండినది. నీవు సర్వోత్కర్షతో తిరిగి స్వర్గ రాజ్యాధిపత్యమును వహించి, జితేంద్రియుడ వై శత్రుజయము చేసి, మహర్షుల చేత స్తుతింపబడుచు లోకములను పాలించుము."

ధర్మరాజా! తరువాత, దేవతలు చాల సంతోషించిరి. మహర్షులు - పితృ దేవతలు - యక్షులు - సర్పములు - రాక్షసులు - గంధర్వులు - దేవకన్యలు - అప్సరసలు - సరస్సులు - నదులు - పర్వతములు - సముద్రములు మొదలైన వా రందరు వచ్చి యింద్రుని అభినందించుచు, 'దేవా! భాగ్యవశము చేత అగస్త్యుని శాపమువలన పాపాత్ము డైన నహుషుడు చచ్చి భూమండలమునందు సర్పరూపముతో పడియున్నాడు. ఇక నీవు ఉత్కర్షతో వర్ధిల్లుము" అనిరి.

యుధిష్ఠిరా! ఆ విధముగా దేవతల చేత స్తుతింప బడుచు, బృహస్పతి-దిక్పాలకులు మొద లైన దేవగణములచేత గూడిన వా డై యింద్రుడు ఐరావతగజమును ఎక్కి శచీదేవితో స్వర్గమునకు పోయి సుఖముగా రాజ్యము నేలు చుండెను.

ఇంద్రుని స్వర్గరాజ్యపాలనము-అంగిరసుని సమాగమము-శల్యుడు దుర్యోధనుని కడకు పోవుట

యుధిష్ఠిరా! తరువాత, అంగిరసుడు అను మహాముని యింద్రుని యొద్దకు వచ్చి అథర్వ వేదమంత్రములతో నింద్రుని పూజించెను. అప్పుడు సంతుష్టు డై యింద్రుడు ఆ అథర్వాంగిరసునితో "మహాత్మా! నీవు పఠించిన యీ అథర్వ వేదముతో 'అథర్వాంగిరస' అనుపేరుతో ప్రసిద్ధుడ వయ్యెదవు. దీనికి తార్కాణముగా నీవు యజ్ఞములలో 'అథర్వాంగిరసము' అను పేరుతో నున్న యజ్ఞభాగముగూడ పొందెదవు. దీనికి నా మాటయే ప్రమాణము'' అనిచెప్పి అథర్వాంగిరసుని పూజించి పంపెను. తరువాత దేవేంద్రుడు దేవతలను, తపోధను లైన ఋషులను పూజించి సంతోషముతో ప్రజాపాలనము చేసెను.

జనమేజయా! ఈ విధముగా శల్యుడు ధర్మరాజునకు, ఇంద్రుడు భార్యతో ననుభవించిన కష్టములను చెప్పి, "ధర్మరాజా!అంతటి యింద్రునకే దుఃఖములు-అజ్ఞాతవాసము తప్ప లేదు. కనుక నీవు దుఃఖింపకుము. వృత్రుడు - నహుషుడు మొద లైన వారివలెనే, నీ శత్రువులు గూడ నశించెదరు. ఇంద్రునివలెనే నీవు గూడ తమ్ములతో, భార్యతోను సముద్రాంత మైన రాజ్యము నేలెదవు

''ధర్మరాజా! వేదసమ్మత మైన 'ఇంద్రుని విజయము' అను ఈ కథను విజయము గోరు రాజులు యుద్ధభూమిలో విన వలెను. కనుక నీకు ఈ కథను వినిపించు చున్నాను. దుర్యోధనుని యపరాధముల మూలమును, భీమార్జునుల బలముమూలమునను మహాత్ము లైన యనేక క్షత్రియులనాశము కలుగ నున్నది

''ధర్మజా! 'ఇంద్రవిజయ' మను ఈ కథను నియమముతో పఠించువారు పాపములను పోగొట్టుకొని, స్వర్గమును పొంద గలరు. వారికి ఇహ - పర సుఖములు గలుగును. శత్రుభయము ఉండదు. వారు అపుత్రకులు కారు. ఏ యాపదను పొందరు. దీర్ఘాయువును పొంద గలరు. ఎక్కడగూడ పరాజయమును పొందరు. అంతటను విజయమునే సాధించగలరు." అట్లు శల్యుడు ధర్మరాజునకు చెప్పిన యింద్రవిజయ కథను వైశంపాయన మహాముని జనమేజయ మహారాజునకు చెప్పి తరువాతి కథ యిట్లు చెప్పెను:

"జనమేజయా! శల్యునిచేత ధర్మరాజు ఈ విధముగా ఆశ్వాసింప బడి అయనను విధివత్తుగా పూజించెను. ధర్మరాజు శల్యుని మాటలు విని మనస్సు తేట పడగా సతనితో "మహాత్మా! నీవు యుద్ధమునందు కర్ణునకు రథసారథ్యము చేసెదవు. ఇది తప్పదు. కాని, నీవు సారథ్యము చేయుచు కర్ణుని పరాక్రమము నశింపజేయుటకు అర్జునుని స్తుతించుము" అని చెప్పెను.

ఆ మాటకు శల్యుడు "ధర్మరాజా! నీవు కోరినట్లే తప్పక నేను కర్ణుని నిరుత్సాహ పరచెదను. ఇదియే కాక, యింక నేమైనను చేయుటకు నాకు శక్తి యున్నచో ఆ కార్యముగూడ నీకొరకు చేయ గలను'' అని ధర్మరాజుతో చెప్పి, జనమేజయా! ఆయన పాండవులను వీడ్కొని తన సైన్యముతో దుర్యోధనునియొద్దకు, అతనికి మాట యిచ్చిన ప్రకారము పోయెను.

యుధిష్ఠిర-దుర్యోధనుల సహాయముకొరకు వచ్చిన రాజుల వర్ణనము

"జనమేజయమహారాజా! ఆ తరువాత సాత్యకి, పరశ్వథ - భిందివాల - శూల - తోమర - ముద్గర - పరిఘ - యష్టి - పాశ - కరవాల - ఖడ్గ (రెండు అంచుల కత్తి) - కార్ముక - తైలదౌత వివిధ బాణాద్యాయుధములు హస్తములందు ప్రకాశించు చున్నయనేక దేశములనుండి వచ్చిన వీరయోధులతో గూడిన రథ - గజ - తురగ - పదాతి చతురంగ సైన్యములతో పాటు ఒక అక్షౌహిణీ సేనతో పాండవులకు యుద్ధములో సహాయము చేయుటకు వచ్చెను. సువర్ణ భూషణములతో ప్రకాశించు చున్న సాత్యకి సైన్యము విద్యుత్తుతో ప్రకాశించు చున్న మేఘమాలికవలె, వెలుగు చుండెను. ఆ సైన్యము, అల్పనది మహా సాగరములో చేరినట్లు, యుధిష్ఠిర సేనాసముద్రములో చేరెను.

అటువంటి సేనాబలముతోనే, చేదిదేశాధిపతి ధృష్టకేతుడు వచ్చి పాండవ సేనతో చేరెను. అదియు నొక యక్షౌహిణీ సంఖ్యలో నుండెను. మగధదేశరాజు, జరాసంధ సుతుడైన జయత్సేనుడు ఒక అక్షౌహిణీ సేనతో వచ్చి పాండవ సైన్యమును చేరెను. అలాగే ఒక అక్షౌహిణితో సాగరదేశవాసి యగు పాండ్యరాజు యుధిష్ఠిర సైన్యమును చేరెను. ఆ సైన్యము వివిధ వేషభాషలతో మిక్కిలి దర్శనీయముగా నుండెను. ఆ విధముగానే ద్రుపదరాజు నానా దేశములనుండి కూర్చుకొనిన యొక అక్షౌహిణీ సేనతో వచ్చి ధర్మరాజు సేనలో చేరెను. ఆ సైన్యము మహారథికులైన ద్రుపద పుత్రులతో, శూర పురుషులతోను నిండి యుండెను. అలాగే మత్స్యరాజైన విరాటుడు తన సోదరులతో, సుతులతో,

పర్వతీయ సైన్యములతోను గూడిన ఒక యక్షౌహిణీ సేనతోను పాండవులను చేరెను.

ఇంకను, అనేక దేశములనుండి అనేక సైన్యములు వచ్చి పాండవులను చేరెను. ఈయన్ని సైన్యములు కలిసి ఏడు అక్షౌహిణు లాయెను. వారందరున్ను యుద్ధోత్సాహముతో నుండి పాండవులను సంతోషపరచిరి.

జనమేజయా! ఆ విధముగానే వివిధ దేశాధిపతులు తమ-తమ సైన్యములతో వచ్చి దుర్యోధనుని సేనలో చేరి అతని యుత్సాహము, సంతోషమున్ను వృద్ధి పొందించిరి.

వారు ఎవరనగా, ఒక అక్షౌహిణితో భగదత్తుడు వచ్చెను. ఆ సేనలో, బంగారుకాంతులతో ప్రకాశించు చైనాదేశీయులు కిరాతులు నుండిరి. ఆ భగదత్త సైన్యము, వికసించిన కర్ణికార (కొండగోగు) వనమువలె నుండి, యెవరికిని చెనక రానిదిగా నుండెను. భూరిశ్రవసుడు, శల్యుడును ఒక్కొక్కయక్షౌహిణీ సేనతో వచ్చి కురుసైన్యములో చేరిరి. భోజ-అంధక-కుకురుల ఒక అక్షౌహిణీ సేనతో (యాదవ) హార్దిక్యుడైనకృతవర్మ దుర్యోధనునకు బాసటగా వచ్చెను. అతనిసైన్యములు వనమాలికలు ధరించి, మదముతో క్రీడించు చున్నవనగజ సమూహమువలె ప్రకాశించు చుండెను, సైంధవుడు మొదలైన సింధు-సౌవీర దేశీయరాజులు వచ్చిరి. వారిసేన ఒక అక్షౌహిణీసంఖ్యలో నుండెను. అది కదలి వచ్చు చున్నప్పుడు భూమి కంపించు చున్నదా యనునట్లుండెను. అది అనేక రూపములతో, కదులు చున్న మేఘమువలె, నుండెను.

కాంబోజరాజైన సుదక్షిణుడు ఒక అక్షౌహిణిసంఖ్యలో నున్నయవన-శక సైన్యములతో వచ్చి దుర్యోధనసేనతో కలిసెను. ఆ సేన, మిడుతలదండువలె, అసంఖ్యాకమై ప్రకాశించు చుండెను. మాహిష్మతీరాజైనీలుడు, దక్షిణ దేశీయులు, మహావీరులు, నీలాయుధధారులునైనఒకఅక్షౌహిణీసైనికులతో వచ్చి దుర్యోధనుని సేనలో చేరెను. ఒక అక్షౌహిణి మహావీరసైన్యముతో అవంతీవాసులైనయిద్దరు విందానువిందులు అనుసోదరరాజులు కౌరవసేనలో చేరిరి. కేకయ దేశరాజులైన అయిదుగురు సోదరులు ఒక అక్షౌహిణీసేనతో వచ్చి దుర్యోధనుని సేనలో చేరిరి. ఇంకను, అనేక దేశములనుండి మహావీరులైన మహారాజులు అనేకులు తమ-తమ సేనతో వచ్చి కౌరవ సైన్యములో చేరిరి. అవి మొత్తము మూడు అక్షౌహిణులసంఖ్యలో నుండెను.

(సేనోద్యోగపర్వము సమాప్తము)

సంజయ యానపర్వము

"జనమేజయా! ఈవిధముగా పదకొండుఅక్షౌహిణీసేనలు దుర్యోధనునకు చేరెను. ఆ సైనికు లందరు యుద్ధోత్సాహముతో నుండిరి. హస్తినాపురము అప్పుడు, స్వీయ సేనలతో, వచ్చినసేనలతోను క్రిక్కిరిసి యుండెను. అప్పుడు వారి కందరికిని దుర్యోధనుడు తగినస్థలములలో విడుదులు ఏర్పరచెను. ఆ మహా సైన్యముచేత పంచనద - కురుజాంగల - రౌహితకారణ్య - మరుభూమి (నిర్జల ప్రదేశము) - అహిచ్ఛత్ర-కాలకూట-గంగాకూల - వారణ-వాటధాన - యామున. పర్వతదేశములు వ్యాపించెను. ఆప్రదేశములు మిక్కిలి విస్తీర్ణముగా, అనేక ధన ధాన్యసంపన్నములుగాను నుండెను. అవి కౌరవులకు సంబంధించిన సేనలతో నిండి యుండెను.

జనమేజయా! అచ్చట అవిధముగా చేరి యున్నమహాసైన్యమును, ద్రుపదరాజుచేత కౌరవులయొద్దకు పంపబడిన పురోహితబ్రాహ్మణుడు చూచి, ధృతరాష్ట్రమహారాజువద్దకు పోయెను. అతనిచేత, భీష్మ - విదురులచేతను ఆ సభలో సత్కరింపబడి ఆ బ్రాహ్మణుడు పాండవాదులక్షేమముతొలుత తెలిపి, కౌరవాదుల కుశలవార్త విచారించి, సేనాపతు లందరు నున్నఆ సభలో నిట్లు చెప్పెను:

పురోహితునిరాయబారము

"మహాత్ములారా! మీ కందరకు రాజధర్మము తెలియును. అయినను, ఏదో మాటవరుసకు చెప్పు చున్నాను. ధృతరాష్ట్ర-పాండురాజులు ఒక తండ్రి కొడుకులే కదా! వా రిద్దరికిని పైతృక మైన ధనము సమానముగా రావలె ననుటలో సందేహము లేదు. ధృతరాష్ట్రసుతులు పైతృకధనమును పొందిరి. పాండుపుత్రులు తమపైతృకమును ఏల పొందలేదు?

పూర్వము ప్రాణాపాయకరము లైన దుష్టోపాయములతో ధార్తరాష్ట్రులు పాండవులను బాధించినప్పటికిన్ని వారు పుణ్యవశముచేత బ్రతికి తమ రాజ్య భాగమును తమ బలముతో పొంది యున్నను, మరల కపటముచేత, నీచులైన

శకుని-ధార్తరాష్ట్రులు అపహరించిరి. ఇంత యైనను, పాండవులు ఓర్పుతోనే యుండిరి. ఈ యనుచిత కార్యము లన్నియు ధృతరాష్ట్రుడు అనుమతించెను. పాండవులకు అతనికొడుకులు, అరణ్యవాసాజ్ఞాతవాసములు కల్పించి బాధించిరి. రాజసభలో పాండవులకు, వారిభార్యకును అనేకక్లేశములు కలిగించిరి. వారు అరణ్యములో నున్నప్పుడు, అజ్ఞాతవాసములోను మాతృగర్భవాసక్లేశములవంటి యనేకదుర్భరక్లేశములను అనుభవించి బయట పడిరి. ఆ క్లేశము లన్నియు మీ కందరికిన్ని తెలియును. దుర్యోధనాదులు చేసినయపరాధము లన్నియు వెనుకకు త్రోసి పుచ్చి పాండవు లిప్పుడు సామోపాయముచేతనే కౌరవులతో వ్యవహరింప గోరు చున్నారు. వారిప్రవర్తనను, దుర్యోధనాదులప్రవర్తననుగూర్చి మీ రందరు మిత్రులు బాగుగా విచారించి దుర్యోధనుని సన్మార్గప్రవర్తకునిగా చేయ వలెను

పాండవులు కౌరవులతో యుద్ధము చేయరు. జననష్టము లేకుండ వారు స్వీయరాజ్యభాగమును కోరు చున్నారు. దుర్యోధనునకు యుద్ధము చేయ వలె నను కోరికకు గలకారణములనుగూడ మీరు బాగుగా విచారించి, దానికి మీరు అంగీకరించ గూడదు ఎందుకనగా, పాండవులు వీరికంటే బలవంతులు. ధర్మరాజువొద్ద చేరి యున్న సేనలు ఏడు అక్షౌహిణులే యైనను, వారు మిక్కిలి యుద్ధోత్సాహముతో కౌరవులతో పోరాడుటకై ధర్మజునాజ్ఞకు ఎదురుచూచుచు, విజృంభించు చున్నారు. వారేకాక, సాత్యకి, భీమసేనుడు. మహాబలశాలు రైన నకుల.సహదేవులుగూడ నున్నారు, వారు ఒక్కొక్కరే వేయిఅక్షౌహిణీసేనలతో సమానులు.

ఇటువైపు ఉన్న పదకొండు అక్షౌహిణీ సైనికులు ఒక యెత్తు-అనేక ప్రక్రియలలో యుద్ధము చేయ గలిగిన మహాబలశాలి యైన అర్జును డొక్కడే ఒక యెత్తుగా మీరు భావింపుడు. అతడు మీ సేనలన్నిటిని మించిన బలపరాక్రమములు గలవాడు. ఈ విషయము మీకు తెలియనిది కాదు. అన్నింటికి మించి, వారికి శ్రీకృష్ణుడు సహాయకుడుగా నున్నాడు. అతడు మహా మహిమ సంపన్నుడు గదా! కనుక, పాండవులకు ఉన్న సేనా బాహుళ్యమును, అర్జునుని పరాక్రమమును- శ్రీకృష్ణుని బుద్ధిమత్త్వమునున్న తెలిసిన వీరు డెవడు గూడ వారితో యుద్ధమునకు దిగడు. ఈ విషయము లన్నియు బాగుగా తెలిసికొనిన మీరు ధర్మ ప్రకారముగా, పాండవులకు మీరు విధించిన సమయము (ప్రతిజ్ఞ) ప్రకా

రముగాను, వారికీయ వలసిన రాజ్యభాగమును ఈయగలరు. ఈ విషయములో కాలయాపన చేయుట శుభము గాదు."

పురోహితుని మాటలు అనుమోదించి భీష్ముడు అర్జునుని ప్రశంసించుట

"జనమేజయా! ఆ పురోహితుని మాటలు విని మహాబల పరాక్రమ సంపన్నుడు, వయోజ్ఞాన వృద్ధుడు నైన భీష్మపితామహుడు అతనిని పూజించి ఆ సమయమునకు దగినట్లుగా నిట్లనెను:

''బ్రాహ్మణోత్తమా! భాగ్యవశమున, శ్రీకృష్ణునితోపాటు పాండవులందరు క్షేమముగ నున్నారు. వారు సైన్య సహాయము పొందుట, ధర్మరతులై యుండుట, కౌరవులతో సంధిని కోరుట, యుద్ధము చేయ గోరకుండుటయు మహాభాగ్యము. నీవు చెప్పిన మాట లన్నియు నిస్సంశయముగా సత్యములే. నీవు సహజ మైన బ్రాహ్మణత్వముచేత పలికిన మాటలు కొంత కటువుగా నున్నను, పాండవు లిక్కడ, వనమునందున్న బాధింప బడినా రనుటలో సంశయ మేమాత్రము లేదు. ధర్మము ప్రకారము వారు పితృ భాగమును పొందినారు. ఇందులో సందేహము లేదు. అర్జునుడు మహా బలవంతుడు, మహా రథికుడు, విశేషించి, అస్త్రవిద్యలో నిపుణుడు. అతనిని యుద్ధమునందు ఎవరు ఎదిరించగలరు? అది యింద్రునకే అసాధ్య మనగా, నితరుల లెక్క యెంత? మూడు లోకములలోను నర్జునుడు ఒక్కడే సమర్థు డని నా నిశ్చయము.''

కర్ణుడు పురోహితుని ఆక్షేపించుచు మాట్లాడుట

"జనమేజయా! ఈ విధముగా భీష్ముడు పలుకు చుండగా కర్ణు డాయనను కోపముతో నిర్లక్ష్యముగా తిరస్కార భావముతో చూచుచు, దుర్యోధనుడు చూచు చుండగా, పురోహితునితో నిట్లనెను :

''బ్రాహ్మణోత్తమా! కడచిన విషయమును గూర్చి మాటి - మాటికి నిపుడు చెప్పిననేమి లాభము? పూర్వము శకుని దుర్యోధనుని కొరకు జూద మాడి గెలిచెను. ధర్మరాజు ఓడెను. పందెము ప్రకారము యుధిష్ఠిరుడు అడవికి పోయెను. ఇప్పుడు అతడు పందెము సమయము గడచినది గదా! యని తను తన తండ్రి రాజ్య భాగము కోరుట లేదు. విరాట - ద్రుపదుల బలముల నాశ్రయించి తాను శత్రువులను గెలుచు ధైర్యముతో రాజ్యము గోరుచున్నాడు,

వారికి భయపడి దుర్యోధనుడు ఒక పాదము మోపు భూమినిగూడ పాండవుల కీయడు. అతడు ధర్మము ప్రకారము శత్రువుకైనను సమస్త భూమండలమును ఇచ్చును. ఒకవేళ, వారు తమ తండ్రి-తాతల రాజ్యమును కోరిన యెడల, ప్రతిజ్ఞ ప్రకారము మరల వనవాసము చేయ వలెను. ఆ తరువాత దుర్యోధనుని అండ చేరి నిర్భయముగా నుండెదరుగాక! అధర్మ మైన బుద్ధిని వారు మూర్ఖత్వముచేత అవలంబించగూడదు. ఒకవేళ, ధర్మమును విడిచి పాండవులు యుద్ధమునే కోరినచో ఈ కౌరవ శ్రేష్ఠులను యుద్ధములో నెదుర్కొని, నేను నేడు చెప్పిన యుపదేశమును తలంపునకు తెచ్చుకొనెదరు.''

"జనమేజయా! కర్ణుని మాటలు విని భీష్ము డతనితో నిట్లనెను:

భీష్ముడు కర్ణుని అధిక్షేపించుట

"రాధేయా! నిరర్థక ప్రసంగముతో నుపయోగ మేమి? అర్జునుడు ఏకాకిగా నుండి కూడ మొన్న ఉత్తర గోగ్రహణ యుద్ధములో మన యార్గురు రథికులను జయించెను. అది స్మరించుకొనుము. అతని దెబ్బకు తట్టుకొన జాలక యున్న నీ శూరకర్మ చూచితిమి. ఇప్పుడు బ్రాహ్మణుడు చెప్పినట్లు మనము చేయకున్నచో, తప్పక యుద్ధములో మనము అర్జునునిచే హతులమై దుమ్ము గరచెదము."

భీష్ముని సమర్థించుచు ధృతరాష్ట్రుడు పురోహితుని సన్మానించి పంపుట

"జనమేజయా! ధృతరాష్ట్రుడు భీష్ముని మాటలకు సమ్మతించి, అతనిని ప్రసన్నుని చేసి కర్ణుని గద్దించుచు నిట్లనెను:

"కర్ణా! భీష్ముడు మనకు హితమైన మాట చెప్పెను. పాండవులకు, సమస్త జగత్తునకున్ను ఆయన మాటలు హితములుగ నున్నవి. అన్ని విషయములను సమగ్రంగా ఆలోచించి మనము సంజయుని పాండవుల యొద్దకు పంపుదము."

ఇట్లు చెప్పి ధృతరాష్ట్రుడు పురోహితుని సత్కరించి పాండవుల యొద్దకు తిరిగి పంపి సభకు సంజయుని పిలిపించి యతనితో యి ట్లనెను:

సంజయుని రాయబారము - ధృతరాష్ట్రుడు పాండవుల ప్రతిభను వర్ణించుట

"సంజయా! పాండవులు ఉపప్లవ్య నగరమునకు వచ్చి యున్నట్లు తెలిసినది. నీవు వారి యొద్దకు పోయి, వారి క్షేమమును విచారించి, ధర్మరాజును ఆదరించి, అతనితో 'భాగ్యవశమున నీవు తిరిగి స్వస్థానమును చేరితివి. సంతోషము అని యనుము. మే మందరము కుశలముగ నున్నా మని చెప్పుము. పాండవులు మిథ్యావాదులు కారు, పరోపకారము చేయు సజ్జనులు. వనవాసమునకు యోగ్యులు కా కున్నను వారు కష్టపడి నియమ పూర్వకముగా వనవాస వ్రతమును పూర్తి చేసిరి. మా వలన ఎన్నియో కష్టములు కలిగినను వారికి మా పైన క్రోధము లేదు. శాంతముగ నున్నారు. వారు ఎప్పుడు గూడ అసత్య ప్రవర్తనలో లే రని నాకు తెలియును. తమ పరాక్రమముతో సంపాదించిన రాజ్యమును గూడ వారు నా యధీనము చేసినారు. నేను ఎంత వెదికినను వారియందు లేశమైనను దోషము కనపడలేదు. అందువలన ఎప్పుడుగూడ వారు నా దృష్టిలో నిందార్హులు కాలేదు. వారు ఎల్లప్పుడును ధర్మార్థముల కొరకే కర్మము చేయు చుండిరి. కామ వశు లై వారు సుఖమునందు - ప్రియు లైన స్త్రీ పుత్రాదులయందున్ను తమకము కలిగి యుండలేదు. కామ భోగాసక్తు లై వారు ధర్మమును పరిత్యజించ లేదు.

"పాండవులు శీతోష్ణములను, ఆకలిదప్పులను, నిద్రను, సోమరితనమును, క్రోధ హర్షములను, ఏమరు పాట్లను ధైర్యముతో, వివేకపూర్ణ మైన బుద్ధితోను జయించి, సర్వదా ధర్మార్థముల కొరకే ప్రయత్నించు చుండెదరు. వాను సమయము వచ్చినపుడు మిత్రులకు ధన సహాయము చేసెదరు. మిత్రులు వారి నుండి యెంతకాలము విడిపోయినను వారి మైత్రి క్షీణించదు. వారు ఇతరులను అర్హతనుబట్టి గౌరవించు చుందురు. మందబుద్ధి, అధర్మపరుడు, పాపియు నైన దుర్యోధనుడు, నీచ స్వభావము గల కర్ణుడున్ను తప్ప, మా అజమీఢ వంశములో పుట్టిన వా రెవరుగూడ పాండవులను ద్వేషించువారు లేరు. సంజయా! దుర్బుద్ధి గల దుర్యోధనుడు మృత్యు వశములో పోయినాడు. మూర్ఖు డైన యతడు పరాక్రమవంతు లైన పాండవుల రాజ్యభాగమును హరించుటకు ప్రయత్నించు

చున్నాడు. సుఖమునకు, ప్రియబంధు జనమునకున్ను దూరమై మహాత్ము లైన పాండవుల మనస్సులో కర్ణ దుర్యోధను లిద్దరే క్రోధము గలిగించు చున్నారు.

"సంజయా! దుర్యోధనుడు సుఖములోనే పుట్టి పెరిగినవాడు గాబట్టి, ఆరంభశూరుడుగా నున్నాడు. చివరదాక ఆ శౌర్యము చూప జాలడు. ఆ మూర్ఖుడు పాండవులు జీవించి యుండగనే వారి రాజ్యభాగమును హరించుట సులభ మనుకొను చున్నాడు. తాను చేయు దుష్టకర్మలను ఉత్తమకర్మలుగా భావించు చున్నాడు. ఎంతమూర్ఖు డతడు? అర్జునుడు, శ్రీకృష్ణుడు, భీమసేనుడు, సాత్యకి నకుల-సహదేవులు, సృంజయవంశవీరులు-వీ రందరు ధర్మరాజునకు బాసటగా నిలిచి యున్నారు. కనుక, నతనిరాజ్యభాగమును యుద్ధమునకు పూర్వమే యిచ్చి యుండినచో, దుర్యోధనునకు శ్రేయస్సు కలిగి యుండెడిది. గాండీవధన్వియు, సవ్యసాచియు నైన అర్జునుడు రథమునందు కూర్చొని ఏకాకిగానే సమస్త భూమండలమును జయించ గలడు. ఇ ట్లుండగా, సర్వలోకాధిపతియైన శ్రీకృష్ణ భగవానుడు అతనికి సహాయకుడుగా నిలిచి యున్నాడు. కనుక, అర్జునుడు శ్రీకృష్ణ సహాయముతో మూడు లోకములను గూడ జయించ గలడు. మేఘ గర్జనమువలె గంభీరముగా ధ్వని చేయుచు, మిడుతల దండువలె నసంఖ్యాకము లైన యితని బాణముల వర్షవేగముముందు ఎవడు నిలువ గల్గును?

"సంజయా! అర్జునుడు గాండీవధారి యై, ఉత్తర దిక్కును, ఉత్తర కురు దేశములనున్ను ఏకమాత్ర రథారూఢు డై, జయించి వారి ధనములను హరించెను. ద్రవిడుల నోడించి వారిని తన యనుచరులుగా చేసికొనెను. అతడు ఖాండవ వన దహనకాలమునందు ఇంద్రాదిదేవతలను ఓడించి అగ్నిదేవునకు ఖాండవవనమును ఆహారముగా నిచ్చి, పాండవుల కీర్తిగౌరవమును పెంపొందింప జేసెను. ఈ భూమండలమునందు గదాధరులలో భీసేనునితో సమానులు మరియెవరును లేరు. అతనితో సమానముగా గజమును నడపువారున్ను లేరు. రథ యుద్ధమునందు గూడ భీముడు అర్జునునకు ఏమాత్రము తీసిపోవడు. బాహుబలమునం దన్ననో అతడు పదివేల ఏనుగులబలము గలవాడు. భీముడు అస్త్రవిద్యగూడ బాగుగా నేర్చినవాడు. మంచివేగము గల వీరుడు. అతనితో నా కొడుకులు వైరము తెచ్చి పెట్టికున్నారు క్రుద్ధు డైన భీమునితో నా పుత్రులకు యుద్ధము సంభవించిన యెడల, అతడు క్రోధాగ్ని చేత వీరిని భస్మము చేయగలడు. సాక్షాత్తు ఇంద్రుడు వచ్చినను భీముని నోడింప జాలడు. నకుల-సహదేవులు మహాబలశాలురు. అతి

శీఘ్రముగా నాయుధ సంచాలనము చేయ గలవారు. అర్జునుడు స్వయముగా తన తమ్ములకు యుద్ధవిద్యను బాగుగా నేర్పినాడు, రెండు దేగలు పక్షులను నశింప జేయ గలిగినట్లే అయిరువురు మన సైనికులలో ఒక్కడుకూడా మిగులకుండ హతమార్చ గలరు.

"సంజయా! మన సేనకూడ అన్ని విధముల పరిపూర్ణముగా ఉన్న దనుటలో సందేహము లేదు. కాని, యది పాండవుల నెదుర్కొన వలసివచ్చినపుడు లేని దానితో సమాన మని విశ్వసించు చున్నాను. వారి పక్షములో సోమకవంశీయుడైన ధృష్టద్యుమ్నుడు ఉన్నాడు. అతడు తన మంత్రులతో పరివారముతోను పాండవులకొరకు ఆత్మార్పణము చేసినా డని వినినాను. వృష్ణివంశభూషణుడు శ్రీకృష్ణుడు అగ్రగామిగా ఉన్న అజాతశత్రువును ఎవడు సహించి నిలువరించ గలడు?

"మత్స్యదేశరాజైన విరాటుడుగూడ తన పుత్రులతోపాటు పాండవులకు సహాయము చేయుటకు సర్వదా సన్నద్ధుడై ఉన్నాడు. అతడు యుధిష్ఠిరునకు పరమ భక్తుడు. కారణ మే మనగా, పాండవుల యజ్ఞాతవాస కాలములో విరాటుడు ధర్మరాజుతో నొకసంవత్సరము కూడి యున్నాడు. అతని గోధనమును ధర్మరాజు రక్షించినాడు, విరాటుడు వయస్సులో వృద్ధుడైనను యుద్ధములో నవయువకుడువలె కనపడును. కేకయ దేశ రాజకుమారులు ఐదుగురు సోదరులు గొప్పధనుర్ధారులు, మహారథికులు నైన వీరులు. వారు పాండవుల సహాయముతో కేకయరాజులనుండి తమ రాజ్యమును తిరిగి సంపాదించ దలచుచున్నారు. కనుక, వారు పాండవుల పక్షమున పోరాడుటకు సంసిద్ధులై యున్నారు. ఈ రాజవీరు లందరున్ను పాండవులకు సహాయము చేయ వలె నని వచ్చి వారి సేవాశిబిరములో నున్నారని వినినాను. వారందరు యుధిష్ఠిరుని భక్తులు.

"మహావీరులు-సత్కులసంజాతులు నైన పర్వతీయులు, దుర్గవాసులు నైన యోధులు, అనేకాయుధధారులైన మ్లేచ్ఛవీరులున్ను పాండవ సహాయార్థమై వచ్చినారు. యుద్ధమునందు ఇంద్రసమానవీర్యము గల పాండ్యరాజు అనేక యుద్ధవీరులతో పాండవులకొరకు వచ్చినాడు. అతడు అసమాన బలపరాక్రమ సంపన్నుడు.

"ద్రోణాచార్య-అర్జున-వాసుదేవ-కృప-భీష్ముల నుండి అస్త్రవిద్యాభ్యాసము చేసిన సాత్యకి పాండవులతో నున్నాడు. అతడు శ్రీకృష్ణునికొడుకగు ప్రద్యుమ్నునితో సమానుడైన వీరుడు. యుధిష్ఠిరుడు చేసిన రాజసూయ యాగమునందు చేది కరూష దేశరాజులు పూర్తిగా యుద్ధసన్నద్ధులై వచ్చి యుండిరి. ఆ యందరి మధ్య చేదిరాజైన శిశుపాలుడు సూర్యునివలె దివ్యతేజస్సుతో ప్రకాశించు చుండెను. యుద్ధమునందు అతని వేగము నెవరుగూడ నరికట్ట జాల కుండిరి. అతడు ప్రపంచ ధనుర్ధారులలో శ్రేష్ఠుడు. శిశుపాలుని బలపరాక్రమము లెరిగినవాడు కాబట్టి శ్రీకృష్ణుడు చేదిదేశవీరుల యుత్సాహము నంతయు నష్టపరిచి, శిశుపాలుని సంహరించెను. కరూషరాజాదులు సమ్మానపూర్వకముగా చూచు చుండిన శిశుపాలుని శ్రీకృష్ణుడు హతమార్చి, కరుషాదుల యుత్సాహమును పోగొట్టి పాండవుల కీర్తిప్రతిష్ఠలు నిలిపెను.

''సంజయా! శైబ్య- సుగ్రీవ- మేఘపుష్ప- వలాహకములు అను పేర్లు గల నాలుగుఅశ్వములతో గూడిన రథముపై విరాజిల్లు చున్న శ్రీకృష్ణునిధాటికి తట్టుకొన జాలక శిశుపాలు డొక్కడు దప్ప తక్కిన వీరు లందరు, సింహమును జూచి యితరమృగములు వలె పారి పోయిరి. ద్వైరథుడు రెండు రథముల నుండి యుద్ధము చేయువాడు అను ప్రసిద్ధి గల శిశుపాలుడు, విజయేచ్ఛతో శ్రీకృష్ణుని ఎదుర్కొని, వేగముతో దాడి చేసి, కృష్ణునిచేత మరణించి, సుడిగాలిదెబ్బకు కర్ణికార (కొండగోగు) వృక్షము భూమిపై పడినట్లు, పడెను. ఆనాడు శిశుపాల యుద్ధములో, పాండవులకొరకు, మహాపరాక్రమము చూపిన శ్రీకృష్ణునిశక్తి గూఢచారులవలన నేను వినినాను. ఆనాటి శ్రీకృష్ణుని పరాక్రమమును మాటిమాటికిని తలచి నాకు శాంతి లభించుట లేదు.

"సంజయా! శ్రీకృష్ణుని ముందిడుకొని యుద్ధము చేయు పాండవులను ఆక్రమించు శక్తి ఎప్పుడు గూడ నెవరికిన్ని ఉండదు. కృష్ణార్జును లిద్దరున్ను ఒకే రథముపైన యుద్ధమునం దున్నా రని తెలిసినప్పటి నుండి నా హృదయము భయముతో కంపించు చుండును. ఒక వేళ, మందబుద్ధియైన నా కొడుకు కృష్ణార్జును లిరువురితో యుద్ధము చేయుటకు పోవ కున్నచో, చాల అదృష్టము. అట్లు కాకున్న, ఆ యిద్దరు కురుసేనను, ఇంద్ర విష్ణువులు రాక్షస సేనను ధ్వంసము చేసినట్లు, నశింప జేయగలరు.

"సంజయా! ఇంద్ర సమానుడైన అర్జునుని వలన వృష్ణివంశ వర్ధనుడైన శ్రీకృష్ణుని వలనను నా కంత భయము లేదు. భీమ - నకుల - సహదేవుల వలన గూడ నాకు భయము లేదు. కాని, యుధిష్ఠిరుడు ధర్మాచరణ శీలుడు. అతడు లజ్జాభిమానములు గల బలవంతుడు. అతని మనస్సునందు ఎప్పుడు గూడ, ఎవరి మీదనూ శత్రుభావము కలుగదు. అతనికి శత్రుభావమే మనస్సునందుండిన యెడల, నా పుత్రులు వారికి చేసిన యపచారములకు, కపట కృత్యములకున్ను ఎప్పుడో యుధిష్ఠిరుడు వారిని దహించి భస్మము చేసి యుండెడివాడు. కనుక, శాంతమూర్తియైన ధర్మరాజు కోపించినచో మావారు అతని యెదుట నిలువ జాలరు. కాబట్టి క్రుద్ధుడైన ధర్మరాజునకే నేను భయపడుచుందును. ఎందు కనగా, నతడు గొప్ప తపశ్శాలి. బ్రహ్మచర్యావ్రత నిష్ఠుడు, కనుక, అతని మనస్సులో కలిగిన సంకల్పము తప్పక సిద్ధించును.

''సంజయా! నేను పాండవుల క్రోధము చూచి, ఆ క్రోధము ఉచిత మని కూడ తలచుకొనుచు, నేడు చాల భయపడుచున్నాను. కనుక, నీవు వెంటనే రథములో అక్కడికి పోయి ద్రుపదుని సేనా శిబిరమునందున్న యుధిష్ఠిరునితో మిక్కిలి ప్రేమ పూర్వకముగా మాట్లాడి అతని క్షేమ సమాచారము నడుగుము. భగవంతుడయిన శ్రీకృష్ణుని గూడ దర్శించి యతని క్షేమ మడిగి, అతనితో, 'ధృతరాష్ట్రుడు పాండవులతో శాంతి పూర్వకముగా వ్యవహరింపదలచుచున్నాడు. యుధిష్ఠిరుని మాటగాని నీమాట గాని ధృతరాష్ట్రుడు ఎప్పుడు కూడా త్రోసిపుచ్చజాలడు' యనుము. ఎందుకనగా, కృష్ణుడు అర్జునునికి ఆత్మసమాన ప్రియుడు, అందువలన శ్రీకృష్ణుడు సర్వదా పాండవులకు హితమైన కార్యమునే చేయుచుండును.

"సంజయా! ఉపప్లవ్యనగరమునందు, పాండవులు, సృంజయ వంశీయులైన రాజులు, శ్రీకృష్ణుడు సాత్యకి, విరాటరాజు, ద్రౌపదీ పుత్రులైదుగురు - వీరందరు ఒక చోట నుండగా నా పక్షమున నీవు వారి క్షేమసమాచారము నడుగుము. తర్వాత, భరతవంశీయుల హితమునకు ఏది ఉచితమని నీకు తోచునో ఆ మాటను పాండవులకు చెప్పుము. అక్కడి రాజులకు కోపము వచ్చునట్లు యుద్ధకారణమగు ఏ మాటను గూడ నీవు పలుకగూడదు."

"జనమేజయా! ధృతరాష్ట్రుడు సంజయునకు చెప్పిన మాటలను, సంజయుడు పాండవులకు చెప్పుటకు ఉపప్లవ్య నగరమునకు పోయి, యుధిష్ఠిర మహారాజునకు నమస్కరించి, ఆయనకు ఇట్లు చెప్పుట కారంభించెను;

సంజయ-యుధిష్ఠిరుల పరస్పర కుశల ప్రశ్నములు

"మహారాజా! నీవు భాగ్యవశమున ఆరోగ్యముతో నున్నట్లు, నీకు సహాయ సంపత్తి బాగుగా చేరినట్లున్ను ధృతరాష్ట్రుడు తెలిసికొని సంతసించెను. అతడు మీ సోదరుల క్షేమము, రాజపుత్రి ద్రౌపది క్షేమము, ఆమె పుత్రుల కుశలము, నీ పరివారము వారు, నీ యాత్మీయులు, బంధుజనము - వీరందరి క్షేమమున్ను అడుగు మని నన్ను పంపినాడు."

సంజయుని మాటకు యుధిష్ఠిరుడు ఇట్లనెను:

"గావల్గణీ! (గవల్గణ కుమారుడు, సంజయుడు) నీకు స్వాగతము! నిన్ను చూచుట చేత మేము సంతోషించుచున్నాము. నేను, తమ్ములు, బంధుమిత్రులతో బాటు క్షేమముగా నున్నాము. చాల కాలమునకు మహారాజైన ధృతరాష్ట్రుని క్షేమము తెలిసి చాల సంతోషము కలిగి, ఆయనను ప్రత్యక్షముగా చూచినట్లే యానందించుచున్నాను. మా పితామహుడు, కురు వృద్ధుడు, మహాప్రాజ్ఞుడు, సమస్త ధర్మశాస్త్ర కోవిదుడునైన భీష్ముడు క్షేమముగా నున్నాడా? మా యెడల ఆయనకు పూర్వము వలెనే స్నేహభావమున్నదా? ధృతరాష్ట్రుడు సపుత్రకుడుగ క్షేమముగ నున్నాడా? బాహ్లికుడు కుశలియా? సోమదత్తుడు, భూరిశ్రవసుడు, సత్యసంధుడైన శల్యుడు, ద్రోణుడు, ఆయన పుత్రుడు అశ్వత్థామ, మహాధనుర్ధారియైన బ్రాహ్మణోత్తముడు కృపాచార్యుడు - వీరందరున్ను క్షేమముగా వున్నారా?

"సంజయా! భూమండలమునందు వీరులు, బుద్ధిమంతులు, సమస్తశాస్త్రజ్ఞాన సంపన్నులు, శూరాగ్రేసరులునైన కౌరవుల యెడల రాజులందరు స్నేహముతో నున్నారా? వీరులందరికిన్ని గౌరవాదరములు లభించుచున్నవా? ధృతరాష్ట్రుని వైశ్యా పుత్రుడైన యుయుత్సుడు కుశలియా? మందబుద్ధియైన దుర్యోధనుడు ఎవనిని మంత్రిగా భావించి విధేయుడైయున్నాడో అట్టి కర్ణునకు క్షేమమా? భరత వంశములో నున్న వృద్ధమాతలు, వృద్ధస్త్రీలు, వంటచేయు స్త్రీలు, దాసీజనము, కోడండ్రు, పుత్రులు, మేనల్లుండ్రు, సోదరీమణులు, దౌహిత్రులు (కూతురి సంతానము,) వీరందరు నిష్కపట భావముతో నున్నారా?

"సంజయా! దుర్యోధనుడు పూర్వము వలెనే బ్రాహ్మణుల యెడల గౌరవముతో మెలుగుచున్నాడా? మేము బ్రాహ్మణుల కిచ్చిన సంపదను అతడు అపహరించకుండ ఉన్నాడా? బ్రాహ్మణులకు దుర్యోధనుడు చేయు నపరాధములను

ధృతరాష్ట్రుడు ఉపేక్షించు చున్నాడా? బ్రాహ్మణులకు శాశ్వతముగా ఇవ్వబడిన సంపద స్వర్గమును చేరుటకు మార్గము గదా! అందువలన ఆ రాజు వారి వృత్తులను చక్కగా నడపు చున్నాడా? బ్రాహ్మణులకు దత్తము చేయబడిన జీవికా వృత్తిని రక్షించుట పరలోక మార్గమును ప్రకాశింపజేయు నుత్తమజ్యోతి వంటిది. ఈ లోకములో గూడ అట్టివారి కీర్తి సర్వత్ర వ్యాపించును. ఈ నియమము ప్రజాహితము కొఱకు బ్రహ్మ దేవుడు చేసినాడు. ఒక వేళ, మందబుద్ధి గల కౌరవులు లోభము చేత బ్రాహ్మణుల జీవికా వృత్తిని అపహరించినచో, అది కురుకులమునకే వినాశ హేతు వగును.

''సంజయా! ధృతరాష్ట్రుడు మంత్రులకుగూడ జీవన నిర్వాహమునకుగాను వృత్తులను ఇవ్వ దలచినాడా? మంత్రులు తమ జీవనము గడపికొనుటకు భేదోపాయమును (శత్రువులకు తమ రాజ్యపు గుట్టులను తెలిపి వారి వలన ధనము సంపాదించుట) లేదు కదా! మంత్రులు, పైకి మంత్రులుగా ఉండి అంతరంగములో శత్రుభావముతో నుండుట లేదు కదా!

''సంజయా! యెప్పుడైన కౌరవు లందరు, సపుత్రకు డైన ధృతరాష్ట్రుని యొద్దకు పోయి మాకు రాజ్య మి మ్మని చెప్పు చున్నారా? రాజ్యములో దొంగల సంఘమును చూచి, వారిని అణచునటువంటి యుద్ధవీరు డైన అర్జునుని ఎప్పుడైన ప్రజలు తలచుకొను చుందురా? గాండీవ ధనుస్సు నుండి మేఘ గర్జనము వంటి ధ్వనితో విడిచిన అర్జునుని బాణములను కౌరవులు ఎప్పు డైనను తలచు చుందురా? నేను అర్జునునితో సమాను డైన వీరుని భూమండలములో నెక్కడను చూడ లేదు. అతని ధనుస్సు నందు ఒక్కసారి బాణమును ఎక్కుపెట్టినచో ఆ శరమునుండి పదునైన అరువదియొక్క బాణములు బయలువెడలును.

''సంజయా! మదోదకము స్రవించు చున్న గజము, జమ్ము గల ప్రదేశము లలో విచ్చలవిడిగా తిరుగు చున్నట్లు, గదాపాణి యై శత్రుసేనలో సంచరించుచు శత్రువులను యుద్ధమునందు కంపింప జేయుచు నుండు భీమసేనుని ఎప్పు డైనను కౌరవులు స్మరించు చుందురా?

"సంజయా! శత్రుభయంకరు లైన కళింగులను సహదేవుడు జయించెను. కుడి-యెడమ చేతులచేత బాణవర్షమును అతడు కురిపించ గలడు. అట్టివానిని కౌరవులు తలచు చున్నారా? అట్లే, పూర్వము రాజసూయయాగ సమయము

నందు మీ సమక్షములోనే శిబి దేశ వీరులను, త్రిగర్త దేశ వీరులనున్ను జయించుటకు నకులుడు పంప బడెను గదా! కాని, అతడు సమస్త పశ్చిమ దిక్కును జయించి నాకు వశపరచెను. అట్టి మాద్రీసుతు డైన నకులుని కౌరవు లెప్పుడైన స్మరింతురా?

"సంజయా! మేము అరణ్యవాసముచేయు చున్నప్పుడు ద్వైతవనమునందు ఘోషయాత్ర జరిపిన మూర్ఖులు దుర్యోధనాదులు శత్రువశు లై పోయిరి. అట్టి వారిని భీమార్జునులు బంధమునుండి విముక్తులను జేసిరి. అప్పుడు దుర్యోధనాదులకు గలిగిన పరాజయమును గూర్చి కౌరవులు జ్ఞప్తికి తెచ్చుకొను చుందురా? ఆ ఘోషయాత్రా యుద్ధమునందే నేను వెనుక వైపుండి అర్జునుని రక్షించితిని. భీమసేనుడు నకుల-సహదేవులను రక్షించెను. గాండీవధారి యైన అర్జునుడు, శత్రుసమూహమును కొట్టి క్రింద పడవేసి తాను క్షేమముగా తిరిగి వచ్చెను. అట్టి సంఘటనమును కౌరవులు తలచుకొందురా? దుర్యోధనుని ఒక సామోపాయము చేతనే జయించుట శక్యము కాదుగదా!

"ఈ మాటలకు సంజయుడు యుధిష్ఠిరునితో ని ట్లనెను:

యుధిష్ఠిరుని ప్రశ్నములకు ఉత్తరము చెప్పి సంజయుడు ధృతరాష్ట్రి సందేశము చెప్పుటకు పూనుట

"పాండునందనా! నీవు చెప్పిన దంతయు సత్యమే, కౌరవు లందరు క్షేమముగా నున్నారు. దుర్యోధనునియొద్ద మంచివారు, చెడ్డవారు నున్నారు. వృద్ధులైన సత్పురుషులున్ను ఉన్నారు. అతడు శత్రువులకు గూడ ధనమును విరివిగా నిచ్చును. అట్టివాడు బ్రాహ్మణుల జీవితము ఎట్లు నష్టము చేయగలడు? మీరు దుర్యోధనుని యెడల ఎప్పుడుగూడ ద్రోహభావముతో నుండ లేదు. అయినను, అతడు మీయెడల క్రూరముగా. ద్రోహిగాను, వ్యవహరించుచు. ఇది అతనికి ఉచితము కాదు. మీవంటి సత్పురుషులను ద్వేషించు చున్న ధృతరాష్ట్రుడు అతని పుత్రులున్ను మిత్రద్రోహులుగానే తలచ బడు చున్నారు.

ధర్మనందనా! మిమ్ము ద్వేషింపు డని ధృతరాష్ట్రుడు పుత్రులకు చెప్పడు. మిమ్ము గూర్చిన ద్రోహపుమాటలు వినినప్పు డతడు మనస్సులోనే పరితపించుచు, దుఃఖించు చుండును. ఎందు కనగా, అతడు తనయొద్దకు వచ్చు

చున్న బ్రాహ్మణులవలన మిత్రద్రోహము అన్ని పాపములకన్నను మించినది అని విను చుండును.

"రాజా! వారు యుద్ధచర్చ చేయు చున్నప్పుడు నిన్ను,వీరు డైన అర్జునుని తలచు చుందురు. యుద్ధకాలమునందు దుందుభి ధ్వనులు, శంఖధ్వనులున్ను వినినప్పుడు, వారు గదాపాణి యైన భీమసేనుని, యుద్ధమునందు అన్ని దిక్కులకు సంచరించుచు సేనలపై బాణవర్షము కురిపించుచు, ఎవ్వరికిని ఎదిరింప శక్యము గాకున్న నకుల సహదేవులను కూడా సర్వధా స్మరించుచుందురు.

"పాండునందనా! మనుష్యునకు అపద వచ్చు వరకు దానినిగూర్చి అతని కేమియు తెలియదు ఎందు కనగా, నీవంటి సర్వధర్మములు తెలిసిన పురుషుడు గూడ అత్యంత భయంకర క్లేశములలో పడి పోయెను. కాబట్టి, ఇన్ని సంకటములలో నీవు పడియున్నను చలించకుండ, నీ బుద్ధితో విచారించి ఈ జగడమును శాంతింప జేయుటకు ఏదైన నొక సరళ మైన యుపాయమును నీవే వెదకుము. పాండు పుత్రులందరు పరాక్రమములో ఇంద్రునితో సమానులు. వా రెప్పుడు గూడ స్వార్థసాధనకు ధర్మమును విడువరు. ధృతరాష్ట్రుని పుత్రులు, పాండు పుత్రులు, సృంజయ వంశ రాజులున్ను, ఈ సేనా శిబిరములలో చేరి యున్న యితర రాజు లందరు క్షేమముగా, సుఖముగాను ఉండు విధమును చూచి, ధర్మాత్ముడ వైన నీవే ఈ సమస్యను పరిష్కరించి, అందరికిన్ని శాంతి కలుగు నట్లు చూడుము. మీ పెదతండ్రి ధృతరాష్ట్రుడు గతరాత్రి మీకొరకు చెప్పిన సందేశమును మంత్రులు, పుత్రులతో పాటు మీరు వినుడు. ఆయన నాకు చెప్పిన మాటలనే మీకు వినిపించబోవు చున్నాను."

ఈ విధముగా సంజయుడు చెప్పిన మాటలు విని యుధిష్ఠిరు డిట్లు అనెను:

''గావల్గణీ! ఈసభయందు పాండవులు, సృంజయులు, శ్రీకృష్ణుడు, సాత్యకి, విరాటరాజు మొద లైనవారు సమావిష్టులై యున్నారు. ధృతరాష్ట్ర మహారాజు నీతో పంపిన సందేశమును చెప్పుము."

ఈ మాట విని సంజయుడు ధృతరాష్ట్రసందేశమును ఇట్లు వారికి వినిపింప దొడగెను:

సంజయుడు ధృతరాష్ట్ర సందేశమును ధర్మజునకు వినిపించుట - యుధిష్ఠిరుని శాంతింపు మని కోరుట

"మహారాజా! నేను యుధిష్ఠిర - భీమ - అర్జున - నకుల - సహదేవులను, భగవంతు డైన శ్రీకృష్ణుని, సాత్యకి - చేకితాన - విరాటులను, పాంచాలదేశవృద్ధ రాజు లైన ద్రుపదుడు మొద లైనవారిని, ధృష్టద్యుమ్నుని సంబోధించుచు చెప్పు చున్నాను. నేను కౌరవుల మేలు కోరుచు చెప్పు విషయములు మీరు అందరు వినగలరు.

"రాజా !ధృతరాష్ట్రుడు శాంతినే ప్రేమించు చున్నాడు. యుద్ధమును కోరుటలేదు. అతడు మిక్కిలి త్వరపడుచు రథముపైన నన్నిక్కడకు పంపెను. సోదరులు, కుమారులు, ఇతర బంధుజనులతోపాటు మీకు ధృతరాష్ట్రుడు పంపిన శాంతి సందేశము రుచించి, రెండు పక్షములకు సంధి ఏర్పడుగాక!

కుంతీ పుత్రులారా! మీరు దయాళువులు, దివ్య శరీర సంపన్నులు, మృదు స్వభావము కలవారు, నిష్కపటముగా ప్రవర్తించువారు. ఈ గుణములన్నింటికన్న మించి, మీరు ఉత్తమ ధర్మగుణము సంపూర్ణముగా కలవారు. సత్కులములో జన్మించిన మీయందు ఏ మాత్రము క్రూరత్వము లేదు. మీరు ప్రేమ లజ్జయు కలిగి చేసిన కర్మల పరిణామమును తెలిసికొన దలచిన వారలు. మీయొద్ద అతి భీకర మైన సైన్యము చేరియున్నది. మీరు సత్త్వగుణ సంపన్నులు. ఎప్పుడుగూడ నీచకార్యము చేయ జాలరు.

కనుక అట్టి మీయందు ఏదైన నొకచిన్నదోషము కలిగినచో అది స్వచ్ఛ మైన తెల్లటివస్త్రమునందు నల్లనిమరకవలె, స్పష్టముగా కనపడును. అది దాగి యుండదు. అందరి వినాశమునకు దారి తీసి పాపమునకు, నరకమునకును, హేతు వై, అంతమునందు నాశమే కలిగించునదయి, జయపరాజయములు రెండును సమానములుగా నున్న యుద్ధమువంటిక్రూరకర్మను బుద్ధిమంతుడయిన యెవడుగూడ చేయుటకు తలపెట్టడు. అట్టి కర్మను వివేకవంతు డెవడయినను చేయునా? తనజాతికి, తనకుటుంబమునకు హిత మైన కార్యమును సాధించువారు ధన్యులు. అట్టివారే పుత్రులు, మిత్రులు, బంధువులు ననిపించుకొనుటకు యోగ్యులు. కౌరవులు చెడ్డపనులు విడువ వలెను. దానిచేత కౌరవకులమునకే అభ్యుదయము అవశ్యముగా కలుగును.

పాండుకుమారులారా! కౌరవులను మీరు మీ శత్రువులుగా భావించి ఒక వేళ వారిని దండించి, చెరసాలలో పెట్ట వచ్చును. లేక, వారిని వధించ వచ్చును. అట్టి పరిస్థితిలో మీకు కలుగ బోవు రాజ్యజీవనము కుటుంబజనులవధవలన ఏర్పడునది కాబట్టి, అది మీకు శ్రేయస్కర మైనదిగా భావించ బడదు. అట్టి నిందితజీవనము మీకు మృత్యువుతో సమాన మైనది. కనుక, మీకు శ్రీకృష్ణుడు, సాత్యకి, చేకితానుడున్ను సహాయకులుగా నున్నారు. ద్రుపద మహారాజుయొక్క బాహు బలము చేత మీరు సురక్షితులుగా నున్నారు. కనుక, ఇంద్రాది దేవతల సహాయముతో వచ్చినను మిమ్ము ఓడించుటకు ఎవరు సాహసింప గలరు?

"రాజా! ఈ విధముగానే ద్రోణ - భీష్మ - అశ్వత్థామ - శల్య - కర్ణ — కృపాచార్యాదివీరులచేత, ఇతరరాజవీరులచేతను సురక్షితులుగా నున్న కౌరవులను యుద్ధమునందు జయించుటకు ఎవడు సమర్థు డగును? దుర్యోధనునితో పెద్ద సేన చేరి యున్నది. అట్టిసేనను నశింప జేయుటకు బ్రతుకదలచినవా డెవడు సమర్థు డగును? ఏ పక్షమునకు జయపరాజయములు కలిగినను అది మంగళకర విషయము కాదు. నీచకులోత్పన్ను లైనవారితో కుంతీపుత్రు లెట్లు సమానులగుదురు? వారు నిందిత మైనకర్మను ఎట్లు చేయ జాలుదురు? అట్టికర్మవలన ధర్మార్థములు సిద్ధింపవు.

"రాజా! మీవైపు శ్రీకృష్ణభగవానుడు, వృద్ధు డైన ద్రుపదరాజు నున్నారు. మీ రందరికి నేను నమస్కారము చేయు చున్నాను. నేను అంజలి బద్ధుడ నై మీ శరణు వేడు చున్నాను. మీ రందరు కౌరవ—సృంజయ వంశములకు శ్రేయస్సు కలుగు విషయమునుగూర్చి స్వయముగ విచారించి నిర్ణయించ గలరు.

శ్రీకృష్ణభగవానుడు కాని, అర్జునుడు కాని, నేను ప్రార్థనాపూర్వకముగా చెప్పు చుండు ఈ మాటను నిరాకరింప జాల రని నాకు విశ్వాసము కలదు. ఇంతయేకాక, నా కోరికపై అర్జునుడు తనప్రాణములనుగూడ నీయగలడు. ఇట్లుండగా నేను కోరిన యితరవస్తువులవిషయములో చెప్ప వలసిన దే మున్నది?

మహారాజా! నేను సంధికార్యము సిద్ధింప జేయుటకొరకే ఈ మాటలన్నియు చెప్పు చున్నాను. భీష్మపితామహునకు, ధృతరాష్ట్ర మహారాజునకున్ను ఇదియే అభిమతము. దీనివలననే మీయందరికిన్ని శాంతి లభించ గలదు."

సంజయునిమాటలు విని ధర్మజు డిట్లనెను.

యుధిష్ఠిరుడు సంజయునకు ఇంద్రప్రస్థప్రదానముచేతనే సంధి కుదురు నని చెప్పుట

"సంజయా! నేను యుద్ధమును కోరు చున్నట్లుగా నీవు నేను చెప్పిన యే మాటలవలన నిర్ణయించితివి? నీవు యుద్ధము జరుగ గల దని ఎందుకు భయ పడు చున్నావు? యుద్ధము చేయకపోవుటయే శ్రేష్ఠము. యుద్ధము లేకయే కార్యసిద్ధి కలిగినప్పుడు యుద్ధమునకు ఎవడు ప్రవర్తిల్లును? పని చేయకుండనే సంకల్పసిద్ధి యేర్పడినప్పుడు, అతడు కోరినవస్తువు లన్నియు దొరకినప్పుడు అతడు ఎప్పుడుకూడ పని చేయడుకదా! ఇది నాకు బాగుగా తెలియును. యుద్ధము లేకుండ కొద్దిలాభము కలిగినను అట్టి అల్పలాభము అధికలాభముగా తలచ వలెను. మనుష్యుడు యుద్ధము చేయుటకు ఇష్టపడ కుండుటకు కారణమేమి? యుద్ధమునకు చేయుటకు దేవతలుకూడా ఇష్టపడరు. దేవతల శాపము గలవాడే యుద్ధమును కోరును. అట్లు కానివాడు తెలిసి — తెలిసి యుద్ధమును వరించడు.

"సంజయా! కుంతీపుత్రులు ధర్మవిరుద్ధము కానట్టిది, అందరికిన్ని శ్రేయస్సు కలుగునట్టిదియు నగుకార్యమునే సుఖేచ్ఛచేత చేయుదురు. ధర్మము కలిగించునట్టిసుఖమునే మేము కోరుదుము. 'ఇంద్రియములే ప్రియములు' అని తలచి విషయముల వెంట బడువాడు సుఖమును పొందుట కొరకు, దుఃఖమును పోగొట్టుకొనుటకున్ను కార్యము చేయును, అట్టి యింద్రియ సుఖములందు ఇచ్ఛ గలవాడు చేయు ధర్మము వాస్తవముగా దుఃఖరూపమే యగును. ఎందు కనగా, అట్టి కార్యము కష్టదాయకము లైన ఉపాయముల చేతనే సాధ్య మగును.

"సంజయా! ఇంద్రియ విషయములను గూర్చి సర్వదా విచారించుట శరీరమునకు బాధ కలిగించును. అట్టి విషయ చింతనమును విడచిన వానికి ఎప్పుడు గూడ దుఃఖానుభవము కలుగదు. జ్వలించు చున్న యగ్నిలో ఇంధనములు వేయుట చేత ఆ యగ్ని అధికముగా వృద్ధి చెందును. ఆ విధముగానే విషయోపభోగములు, ధన లాభములున్ను అధికముగా కలుగు కొలది మనుష్యులకు తృష్ణ అత్యధికముగా వృద్ధి చెందును. నెయ్యి పోయు కొలది జ్వలించు నగ్ని శాంతి చెందనట్లు, మానవుడు విషయోప భోగములచేత, ధనలాభము చేతను తృప్తి చెందడు. మాకు, ధృత రాష్ట్రునకున్ను ఈ విషయోపభోగములు అధిక

ముగా సంచితము లై యున్నవి. కాని, యివి యన్ని లభించినను, వానియెడల తృప్తి కలుగదు. పుణ్యము చేయనివాడు యుద్ధములో జయము పొందడు. అట్టివాడు తన కీర్తి గానము విన జాలడు. పుణ్యాత్ముడు గంధమాల్య చందనాదులను ఉపయోగించడు, మంచి వస్త్రములను గూడ కట్టుటకు ఇచ్ఛ పడడు.

"సంజయా! ధృతరాష్ట్ర మహారాజు పుణ్యవంతుడే అయినచో మమ్ము ఎందుకు కురుదేశముల నుండి దూరముగా పంపెను? సాధారణముగా అంతఃకరణమునకు పీడ కలిగించునట్టి భోగ తృష్ణ అజ్ఞాను లైన దుర్యోధనాదులకే యిష్ట మగును కనుక, వారి వశములో నున్న ధృత రాష్ట్రుడు అట్లు చేసెను. ధృతరాష్ట్రుడు, స్వయముగానే చెడు మార్గములో వ్యవహరించువాడు. ఇట్లుండియు నితరులు మంచి మార్గములో వ్యవహరించ వలెనని కోరుచున్నాడు. ఇది మంచిది కాదు. అతడు తన వలెనే యితరులను గూడ చూడ వలెను.

''సంజయా! ఎండాకాలము నందొకడు, మధ్యాహ్నమున ఎండుగడ్డి వనములో అగ్నిని రగిలించి, గాలిచేత అన్ని వైపుల అగ్నిజ్వాలలు వ్యాపించినప్పుడు ఆత్మ సంరక్షణము కొరకు తన క్షేమము కోరుచు మాటిమాటికి ఏడ్చుచుండును. ఆ విధముగానే నేడు ధృతరాష్ట్రుడు సమస్త రాజ్యము, ఐశ్వర్యమున్ను తన అధికారములో తీసికొని, దుర్బుద్ధి, ఉద్ధతుడు, అదృష్టహీనుడు, మూర్ఖుడు, మంచి మంత్రుల సలహా ప్రకారము నడవనివాడు ఐన దుర్యోధనుని పక్షమును అవలంబించి, యిప్పుడు దీనునివలె ఏల దుఃఖించు చున్నాడు? అతడు దుర్యోధనునకు ప్రియము చేయ దలచి, తనకు అందరికంటే అధిక విశ్వాస పాత్రు డయిన విదురుని మాటలను వినక, అతనిని నిర్లక్ష్యము చేసి, తెలిసి - తెలిసి, అధర్మ మార్గమునే ఆశ్రయించి నడచు చున్నాడు.

"సంజయా! బుద్ధిమంతుడు, కౌరవుల హితమును కోరువాడు, నీతి శాస్త్ర విద్వాంసుడు, మంచి వక్త, ఉత్తమ శీల సంపన్నుడు నైన విదురుని హితవచనములను ధృతరాష్ట్రుడు పుత్ర స్నేహముచేత ఆదరించలేదు.

"సంజయా! ఇతరుల గౌరవమును మాత్రమే కోరువాడు, ఈర్ష్యాసూయలు గలవాడు, క్రోధావిష్టుడు, ధర్మార్థములను ఉల్లంఘించువాడు, కఠిన వాక్యములను పలుకువాడు, దైన్యమునకు లోబడినవాడు, సుఖోప భోగములందు ఆసక్తి గలవాడు, పాపిష్ఠులచేత పొగడు బడువాడు, మంచి మార్గములో పెట్ట

దగినవాడు, మిత్ర ద్రోహి, పాపబుద్ధియు నైన దుర్యోధనునకు ప్రియము కోరు ధృత రాష్ట్ర మహారాజు అన్ని తెలిసికూడ. ధర్మ - కామములను విడిచెను.

"సంజయా! జూదమాడు చున్నప్పుడే విదురుడు శుక్రనీతి ప్రకారము యుక్తి యుక్తముగా మాటలాడు చుండెను. అయినను, దుర్యోధనుడు కొంచెము గూడ నతనిని ప్రశంసించలేదు. అప్పుడే నేను 'కౌరవులకు వినాశకాలము సంభవించినది' అని తలచితిని. ఎంతవరకు కౌరవులు విదురుని యుపదేశము ప్రకారము వ్యవహరించి యుండిరో, అంతవరకు వారి రాజ్యము అభివృద్ధి చెందు చుండెను. విదురుని యుపదేశమును విడిచిన నాటినుండి కౌరవులకు ఆపదలు మూడెను.

''సంజయా! దుర్యోధనుడు ఎంతటి మూర్ఖుడో చూడుము. ధనలోభము చేత అతడు తనకు మంత్రులనుగా ఉపదేశకులుగాను, దుశ్శాసన- శకుని- కర్ణులను చేర్చుకొనెను. నేను ఎంతగా విచారించినను, కౌరవ సృంజయ వంశములకు శ్రేయస్సు కలుగు నుపాయము నాకు కనపడుట లేదు.

''సంజయా! శత్రువులుగా భావింపబడు చున్న మానుండి ధృతరాష్ట్రుడు రాజ్యము, ఐశ్వర్యమును లాగుకొని దూరదర్శియైన విదురుని దేశమునుండి బహిష్కరించి, తన పుత్రులతో కూడుకొని సమస్త భూమండల సామ్రాజ్యమును నిష్కంటకముగా ఏలుటకు ఆశించు చున్నాడు. అట్లు లోభము గల ధృత రాష్ట్ర రాజుతో యుద్ధము చేయకుండ, సంధి చేసికొనుట అసంభ మని నాకు తోచు చున్నది. ఎందుకనగా, మేము అడవికి పోయిన తర్వాత మా సమస్తధన సంపదను అతడు తనదిగానే భావించి యున్నాడు. కర్ణుడు, 'యుద్ధమునందు అర్జునుని సులభముగా జయించ గలడు!' అని తలచు చున్నాడు. అది అతని పొరపాటేయగును. పూర్వము గూడ పెద్ద పెద్ద యుద్ధములు జరిగెను. అప్పుడు ఈ కర్ణుడు కౌరవులకు ఆశ్రయ మిచ్చి, వారిని ఎందుకు కాపాడ జాలక పోయెను?

"సంజయా! కర్ణుడు, దుర్యోధనుడు, ద్రోణాచార్యుడు, భీష్మపితామహుడు, ఇతర కురువీరులున్ను, అర్జునుని మించిన ధనుర్ధారి మరియొకడు లేడని బాగుగా తెలిసినవారే. సమస్త కౌరవులు, ఇతర రాజులు గూడ 'వీరుడైన యర్జునుడు ఉండగా, దుర్యోధనుడు ఎట్టి యుపాయములు పన్ని, పాండవుల రాజ్యమును హరించెను?' అను విషయమును బాగుగా నెరిగి యున్నారు. అనగా, కౌరవులు శౌర్యముతో కాక, మా యపరాధముచేత మా రాజ్యమును తీసికొని నారు అను విషయము అందరికిన్ని తెలియును- అని భావము.

"సంజయా! దుర్యోధనుడు, పాండవులకు రాజ్యసంపదపైన ఉన్న మమకారము (అధికారము) హరించుట సులభ సులభమనుకొను చున్నాడు కాబోలు? దానికొరకతడు, సర్వధనుర్వేదవిద్వాంసుడు, గాండీవధనుర్ధారియు నైన యర్జునునితో యుద్ధము చేయుటకు సంసిద్ధుడై యుండ వలెను.

"సంజయా! ధృతరాష్ట్రపుత్రులు, యుద్ధము నందు అర్జునుని గాండీవధనుష్టంకారవమును వినననంతవరకు, క్రుద్ధుడైన సేనని చూడనంతవరకు, తాము రాజ్యమును సంపాదించుకొను మనోరథము సిద్ధించినట్లు తలచెదరు. భీమార్జుననకుల సహదేవులు జీవించి యున్నంతవరకు దేవేంద్రుడుగూడ మారాజ్యసంపదను అపహరింప జాలడు. 'పాండవులకు రాజ్య మీయకుండినయెడల తనకు శ్రేయస్సు కలుగును' అని యొకవేళ ధృతరాష్ట్రుడు తలచినచో, నతని పుత్రులందరుగూడ యుద్ధ భూమిలో పాండవుల క్రోధాగ్నిచే దహింప బడి నశించ గలరు.

"సంజయా! మాకు, పూర్వము దుర్యోధనాదులు చేసినయపకారములు, మే మనుభవించిన క్లేశము లన్నియు నీకు బాగుగా తెలియును. వాని నన్నిటిని, నీముఖము చూచి నీయందలి యాదరముతో క్షమించు చున్నాము. దుర్యోధనాదులు మాయెడల ఎట్లు వ్యవహరించినది, వారియెడల మా వ్యవహారమున్ను నీకు బాగుగా తెలియును.

"సంజయా! ఇప్పుడుగూడ మేము వారియెడల, నీకోరికప్రకారమే, శాంతిపూర్వకముగా వ్యవహరించెదము; కాని, మేము పూర్వమువలె ఇంద్రప్రస్థ రాజ్యమును ఏలుకొనుటకు దుర్యోధనుడు మా రాజ్యము మాకు ఈయ వలెను.''

"జనమేజయా! యీ విధముగా ధర్మరాజు చెప్పినమాటలు వినిసంజయుడు డిట్లనెను :

సంజయుడు మరల బోధించుచు యుద్ధ దోషములను గూర్చి చెప్పుట

"ధర్మరాజా! మీరు అన్ని పనులను సర్వదా ధర్మము ప్రకారమే చేయుచుందురని లోకమునందు ప్రసిద్ధమే. అలాగే మీ కార్యములుగూడ కనబడుచున్నవి. ఈ జీవితము అనిత్యమైనను, ఈ మీ ధర్మప్రవర్తనచేత ప్రపంచమునందు మీ కీర్తి చిరస్థాయిగా నిలచియుండును. కనుక మీరు జీవితము అనిత్యమని దృష్టియందుంచుకొని, నిత్యమైన మీ కీర్తిని నష్టపరచ గూడదు.

"ధర్మజా! ఒకవేళ కౌరవులు మీకు రాజ్యమును, యుద్ధము చేయకుండ నిచ్చుటకు ఇష్టపడకుండినయెడల, మీరు వృష్ణి అంధక వంశముల రాజ్యములో బిచ్చ మెత్తుకొనియైన జీవించుట మీకు మంచిది. కాని, యుద్ధము చేసి రాజ్యమును పొందుట మీకు మంచిది కాదు. మానవుని జీవితము అత్యల్పము. అకొద్దిదిగూడ అతిదుఃఖమయము చంచలము నైనది. ఈ యల్పజీవనములో మహారాజా, పాపరూపమైన యుద్ధమును చేయకుము. అది మీ సత్కీర్తికి తగినది గాదు. కోరికలు మానవుని తనవైపు లాగుకొనుటచేత ధర్మాచరణమునకు విఘ్నములు కలుగుచుండును. అందువలన బుద్ధిమంతుడు తొలుత తన కోరికలను చంపికొనును. తరువాత నతడు ప్రపంచమునందంతటను ప్రశంసింపబడును.

"ధర్మరాజా! ప్రపంచమునందు ధనాశయే బంధనములలో మానవుని పడవేయును. అప్పుడతనిధర్మముగూడ నశించును. కనుక, ధర్మమును కోరువాడే జ్ఞాని యగును. భోగాసక్తుడు ధనతృష్ణచేత ధర్మభ్రష్టుడగును. ధర్మార్థకామములలో ధర్మమునకే ప్రాధాన్యము నిచ్చువాడు, మహాప్రతాపశాలియై, సూర్యునివలె భూమండల సామ్రాజ్యమును పొందికూడ, కష్టములనే అనుభవించుచుండును.

"యుధిష్ఠిరా! నీవు, పరలోకమునందు విశ్వాసము ఉంచి వేదాధ్యయనమును, బ్రహ్మచర్యపాలనమును, యజ్ఞానుష్ఠానమును, బ్రాహ్మణులకు దానములనున్ను చేసినావు. ఇంతయేకాక, అనంతకాలము పరలోకసుఖప్రాప్తికొరకు నీవు ఆత్మార్పణము చేసితివి. ఎవడు సుఖాసక్తుడై, ప్రియులైన పుత్రకళత్రా

దులను సేవించుచునే యుండి యోగాభ్యాసాదికర్మలు చేయడో, అట్టివాడు, తన ధనము నశించినపిదప, సుఖములకు దూరుడై, కామములను విడువ జాలక, క్షోభము చెందుచు సర్వదా దుఃఖశయ్యపైననే పడి యుండును. బ్రహ్మచర్యమును పాలించక, ధర్మమును విడిచి, అధర్మములను ఆచరించుచు, మూర్ఖుడై పరలోకమునందు విశ్వాసము లేక యుండు దురదృష్టవంతుడు, మానవ శరీరము విడిచినతరువాత, పరలోకమునందు అనేక ఘోరకష్టములపాలగును.

"ధర్మజా! పుణ్యపాపకర్మలు పరలోకమునందు నశించవు. తాను ఈ లోకమునందు చేసిన పుణ్యపాపకర్మలు తనకన్న తొలుతనే పరలోకమునకు పోవును. తరువాత కర్త తనకర్మలను అనుసరించి పోవును. నీవు 'న్యాయముగా బ్రాహ్మణులకు దానము చేసితివి. రుచికరమైన అన్నమును శ్రద్ధతో వారికి పెట్టితివి" అని లోకమునందు ప్రసిద్ధి చెంది యున్నావు. ఈ శరీరముతోనే యిక్కడ కర్మలు ఆచరించ వలెను, మరణించినతరువాత ఏ కార్యముగూడ చేయుటకు సాధ్యము కాదు. 'నీవు పరలోకమునందు సుఖము కలిగించునట్టి గొప్పసత్కర్మలు ఇక్కడ చేసితివి' అని సత్పురుషులు నిన్ను ప్రశంసించు చుందురు. పుణ్యాత్ముడు స్వర్గమునకు పోయినతరువాత, అతనికి జరామరణములు, భయము, ఆకలిదప్పులుగూడ నుండవు. పరలోకమునందు ఇంద్రియ సుఖములను అనుభవించుటతప్ప, ఇతరకర్మ లేవియు చేయ వలసిన యవసరము ఉండదు.

"దేవయోని భోగయోనియే కాని, కర్మయోని కాదు. అక్కడ క్రొత్తగా కర్మలు చేయ వలసిన బాధ్యత ఉండదు.

''రాజేంద్రా! ఈ విధముగా మనస్సునకు ప్రియమైన కర్మ ఫలమును కోరగూడదు. నీవు, క్రోధము వలన కలుగు నరకమునకు గాని, హర్షము వలన గలుగు స్వర్గమునకు గాని ఎప్పుడు గూడ పోవకుము. సనాతనమైన మోక్ష సుఖము కొరకు నిష్కామ కర్మ సాధనము లేక, జ్ఞాన యోగ సాధనము చేయుము. ఈ విధముగా, నీవు జ్ఞానాగ్నిచేత కర్మములు దహించి 'సత్యము - ఇంద్రియనిగ్రహము - ఋజుభావము - దయ' మొదలగు సద్గుణములను ఎప్పుడు గూడ విడువకుము. అశ్వమేధ - రాజసూయాది యజ్ఞ కర్మలను గూడ విడువకుము. కాని, యుద్ధము వంటి పాపకర్మల చెంతకు గూడా నీ వెప్పుడును పోవక ఉండుము. మీ రొకవేళ రాజ్యము కొరకు చిరకాల ద్వేషము చేత యుద్ధ

మనెడు పాపకర్మమునే చేయ వలసినచో, ఇకమీద గూడ చాలాకాలము వనవాస క్లేశమునే అనుభవించు చుండుడు. వనవాసమే మీ కొరకు ధర్మరూపమగును.

"రాజా! ఇప్పుడు నీ వశము నందున్న వీరులు, శ్రీకృష్ణుడు, సాత్యకి, యుద్ధకుశలులైన వీరులు, పుత్రులు, విరాటరాజు, ఇతర రాజవీరు లందరు గూడ మీరు పూర్వము జూదము ఆడునప్పుడు ఉండిరి. వీరి సహాయముతో మీరు శత్రువులను అనాడే జయించి, యరణ్యవాసము చేయకుండ ఇక్కడనే యుండెడివారు. కాని, ధర్మవశులై మీరు ఆనాడు అట్లు చేయ లేదు. ఆనాడు గూడ శ్రీకృష్ణుని సహాయముతో పోరాడి, మీరు దుర్యోధనుని పొగరు అణచ గలిగి యుంటిరి.

"పాండునందనా! నీవు ఎందుకు శత్రువుల బలము వృద్ధి నొందుటకు అవకాశము నిచ్చితివి? ఏల మీ సహాయకులను దుర్బలులుగా చేసితివి? ఎందుకు పన్నెండేండ్లు వనవాసము చేసితివి? పూర్వము నీకు ఉన్న అనుకూల పరిస్థితులు గడచి పోయిన తరువాత, నీ కిప్పుడు యుద్ధము చేయ వలెనను నిచ్ఛ యెందుకు కలిగినది? అజ్ఞాని, పాపిష్ఠుడునైన వాడే యుద్ధము చేసి సంపత్తిని పొందును. బుద్ధిమంతుడు, ధర్మజ్ఞుడునైన వాడు దైవికమైన బాధచే ఓడిపోయి సంపదను పోగొట్టుకొనును.

"కుంతీ నందనా! నీ బుద్ధి యెప్పుడు గూడ నధర్మ ప్రవృత్తికి లోబడదు. నీవు క్రోధవశుడవై కూడ నెప్పుడున్ను పాపకార్యము చేయ లేదు. ఇట్లుండగా నిపుడు నీవు సహజ ధర్మబుద్ధికి విరుద్ధముగా యుద్ధము వంటి పాప కర్మ చేయుటకు ప్రబలమైన కారణ మేది యేర్పడెను?

"రాజా! జబ్బు లేకుండగనే ఉత్పన్న మగునట్టిది, చేదుగానున్నట్టిది, శిరోవేదన కలిగించునది, కీర్తినాశకరము, పాపఫలము నిచ్చునది, సత్పురుషులచే త్రాగ దగినది, దుర్జనులు త్రాగనిదియు నగు క్రోధమును త్రాగుము. శాంతుడవు కమ్ము, పాప మూలమైన క్రోధమును ఎవరు కోరుదురు? నీకు రాజ్య సుఖముల కన్న ఓర్పు వహించుటయే మంచిది. క్రోధమే వహించి యుండినచో శాంతను పుత్రుడైన భీష్ముడు, చాపాచార్యుడైన ద్రోణుడు, సపుత్రకుడుగా హతమారి యుందురు.

"రాజా! కృప - శల్య - భూరిశ్రవస - వికర్ణ - వివింశతి - కర్ణ - దుర్యోధనాదులను వధించి, నీవు ఎట్టి సుఖమును పొంద గలవో దయ యుంచి చెప్పుము. సముద్రాంత మైన సమస్త భూమండల సామ్రాజ్యమును పొంది కూడ నీవు జరా మరణములను, ప్రియా ప్రియములను సుఖదుఃఖములను విడువ జాలవు.

''రాజా! ఈ విషయము లన్నియు నీవు బాగుగా నెరిగినవాడవు గనుక యుద్ధము విడువు మని నేను ప్రార్థించు చున్నాను. ఒక వేళ, నీవు మంత్రుల యుపదేశము ప్రకారము పాప భూయిష్ట మైన యీ యుద్ధమునకు పూనుకొని యుండినచో, నీ సర్వస్వమును ఆ మంత్రులకే యిచ్చి, వానప్రస్థాశ్రమము స్వీకరించి యుండుము. కాని, కుటుంబ నాశకర మైన యుద్ధము చేసి నీవు దేవ లోకమునకు పోవు మార్గము నుండి భ్రష్టుడవు కావద్దు.

"జనమేజయా! సంజయుడు" చెప్పిన మాటలు విని యుధిష్ఠిరు డాతనితో ని ట్లనెను :

యుధిష్ఠిరుడు సంజయునకు ఉత్తరము చెప్పుట

"సంజయా! కర్మలన్నిటి కంటెను ధర్మమే శ్రేష్ఠ మని నీవు చెప్పినది సత్యమే. అందులో సందేహము లేదు. కాని, నేను ధర్మమును అవలంబించి యున్నానా? అధర్మమునా? అని బాగుగా విచారించి నన్ను ఆక్షేపించుము. ఒకప్పుడు ధర్మము అధర్మముగాను; అధర్మము ధర్మముగాను, ధర్మమే వాస్తవ రూపములో ధర్మముగాను కనపడును. ఈ విషయమును విద్వాంసులు బాగుగా విచారించి యందలి వాస్తవము నిశ్చయించెదరు. సంజయా! ధర్మ మనునది భిన్న భిన్న లక్షణములు గలిగి యుండును. బ్రాహ్మణులకు ధర్మ ము లైన అధ్యయన - అధ్యాపనాది ధర్మకార్యములు ఇతర వర్ణముల వారికి అధర్మములుగా నుండును. అలాగే, క్షత్రియులకు ధర్మము లైన శౌర్య యుద్ధాలు, వైశ్య జాతికి ధర్మము లైన కృషివాణిజ్యాదులు గూడ నితరులకు ధర్మములు కావు. ఈ విధముగా ధర్మాధర్మములు నిశ్చితము లై యుండగా, వీనిలో ఆపద్ధర్మములు అనునవి కొన్ని యున్నవి. వాని స్వరూపమును వినుము:

"సంజయా! తన జాతికి సహజ మైన వృత్తిలో తన జీవిక నెరవేరనప్పుడు ఆపద్ధర్మముగా నితర వృత్తులను ఆశ్రయింప వచ్చును. అది వానికి అధర్మము

కాదు. ఎవడు స్వజాతి వృత్తిలోనే తన జీవమును సుఖముగా నిర్వహించ గలిగి నప్పుడు దురాశతో, అధిక లాభమును కోరి యితర వృత్తులను ఆశ్రయించునో, అట్టివాడు; ఎవడు ఆపదలలో చిక్కుకొనినప్పటికిన్ని, సమయానుకూలముగా శాస్త్రోక్త మైన జీవన సాధనమును, తన ధర్మము మేరకు చేపట్టి, తన కుటుంబ సంరక్షణము చేసికొనడో, అట్టివాడు- ఈ యిద్దరున్ను నిందనీయు లగుదురు.

"సంజయా! జీవన సాధనము స్వధర్మములో దొరకనప్పుడు, బ్రాహ్మణుడు ఇతరుల వృత్తిని ఆశ్రయించి జీవము గడపికొని నప్పుడు, అట్టి బ్రాహ్మణునకు బ్రహ్మదేవుడు ప్రాయశ్చిత్తమును విధించినాడు. అది యధర్మము కా దని నీవు తెలిసికొనుము. మేము ఆపత్కాలము నందు గూడ స్వధర్మమునే అనుసరించి యుండిన యెడల, ఆపత్కాలము లేకుండినప్పుడు గూడ మా స్వధర్మమునకు విపరీతముగా వ్యవహరించి యుండిన యెడలను, నీవు తప్పక మమ్ము ఆక్షేపించుము.

"సంజయా! బుద్ధిమంతు లైనవారు సత్వ-రజస్-తమోగుణ బంధనముల నుండి విముక్తి కోరినప్పుడు, సత్పురుషులను ఆశ్రయించుట ధర్మ మగును. బ్రహ్మవిద్యయందు శ్రద్ధ లేని అబ్రాహ్మణు లందరున్ను తమ తమ ధర్మ మును అనుసరించి అందరినుండియు తమ జీవికను గడిపికొన వలెను.

"సంజయా! తండ్రి-తాతలు, వారికన్న పూర్వులున్ను ఏ ధర్మమార్గము నందు నడచిరో, యజ్ఞాదిక్రతువులను ఆచరించు చుండిరో, వారి మార్గములోనే నేను నడచు చున్నాను. కనుక, నేను నాస్తికుడను గాను. భూలోకమునందు, దేవలోకమునందు, బ్రహ్మలోకమునందు నున్న ధన సంపద యంతయు నాకు అధర్మమార్గములో లభించినచో దానిని నేను కోరను.

"సంజయా! అనేక క్షత్రియులను, భోజవంశీయులనున్ను శాసింప గలవాడు, ధర్మప్రభువు, అతి చతురుడు, నీతికోవిదుడు, మహాబుద్ధిశాలి, బ్రాహ్మణులను ఉపాసించువాడు, రెండు పక్షముల హితము కోరువాడు నైన యీ శ్రీకృష్ణ భగవానుడు, నేను సామోపాయమును, సంధిని విడిచి నింద నీయుడ నైతి నని, యుద్ధము చేయబూని ధర్మమును ఉల్లంఘించు చున్నా ననియు చెప్పుగాక!

"సంజయా! ఈ సాత్యకి; చేది దేశీయులు, అంధక-వృష్ణి-భోజ-కుకుర-సృంజయ వంశీయు లైన క్షత్రియు లందరును ఈ కృష్ణుని యుపదేశము పైననే తమ శత్రువులను చెర బట్టి మిత్రులను ఆనందపరచు చుందురు. శ్రీకృష్ణుడు చూపిన నీతినే అనుసరించుచు వీ రందరు ఇంద్ర సమాన శక్తిని, భోగ సామగ్రినిన్ని పొంది యున్నారు. పౌండ్రక వాసుదేవుని తమ్ముడు, కాశీరాజు నైన 'బభ్రు' అనువాడు ఈ శ్రీకృష్ణునే తన ప్రభువుగా తలచి ఉత్తమ రాజ్య లక్ష్మిని పొందెను. గ్రీష్మకాలములో ప్రజాహితము కొరకు మేఘము జలమును కురియునట్లే, శ్రీకృష్ణుడు బభ్రువు యొక్క యిష్టార్థము లన్నియు వర్షించును.

"కనుక సంజయా! శ్రీకృష్ణుడు ప్రతి యొక్క కర్మకును పరిణామము నిశ్చయింప గల విద్వాంసుడు. ఇతడు అందరికన్నను విశేషముగా మా హిత మును కోరువాడు. కనుక, నేను ఇతని యాజ్ఞను ఉల్లఘించ జాలను. ఇతడు చెప్పినట్లు చేసెదను."

యుధిష్ఠిరుని మాటలు విని, సంజయునితో శ్రీకృష్ణు డిట్లనెను:

శ్రీకృష్ణుడు తన సందేశమును సంజయునకు చెప్పుట

"సంజయా! నేను ఏ విధముగా, పాండవుల హితమును కోరుచు వారికి వినాశము కలుగ కుండ, రాజ్య సంపదను ఇప్పించుటకు కోరు చున్నానో, ఆ విధముగానే దుర్యోధనాదుల యభ్యుదయమును గూడ కాంక్షించు చున్నాను. రెండు పక్షములలోను శాంతి నెలకొన వలె ననియే నా యభిలాష.

"పాండవులారా! కౌరవులతో సంధి చేయుడు. వారి యెడల శాంతితో వ్యవహరింపుడు' అనియే నేను సర్వదా పాండవులకు చెప్పు చుందును. ఇంతకు మించి వారికి వేరుగా నే నేమియు చెప్పను. యుధిష్ఠిరుడు గూడ నావలెనే చెప్పు చుండును. అదియే యుక్త మని తలచు చుండును.

"కాని, ధృతరాష్ట్రుడు, అతని పుత్రులున్ను రాజ్యమునందు ఆసక్తి గల వారై దానిని ఆక్రమింప దలచు చున్నారు. అందుచేత కౌరవ పాండవులకు యుద్ధ మెట్లు కలుగ కుండ గలదు? ఇట్టి పరిస్థితిలో రాజ్యము విషయమునందు ఈ యిద్దరి మధ్య శాంతి యేర్పడుట అతి కష్ట సాధ్యమని నా యభిప్రాయము. ఇది నా నిశ్చయము.

"సంజయా! నేను గాని, యుధిష్ఠిరుడు గాని ధర్మలోపము చేయము అని నీకు బాగుగా తెలియును. అయినను, ఉత్సాహముతో స్వధర్మమును పాలించుచు, శాస్త్రములలో చెప్ప బడిన విధముగా కుటుంబ పోషణము చేయుచు, గృహస్థాశ్రమముతో నడచు చున్న యుధిష్ఠిరుని విషయమునందు ఇంతకు పూర్వము నీవు ధర్మలోపమును ఆరోపించుట గాని, అతనిని శంకించుట గాని యే యాధారము పైన చేసితివి? గృహస్థాశ్రమమును శాస్త్రోక్తముగా నడపు చుండియు, ఆ యాశ్రమమును గ్రహించు విషయములో, త్యజించు విషయములోను వేదవిదు లైన బ్రాహ్మణులు భిన్న భిన్నము లైన యభిప్రాయములను వ్యక్తపరచినారు.

"సంజయా! కొందరు గృహస్థాశ్రమములో ఉండుచునే, కర్మయోగము ద్వారా పరలోకమునందు సిద్ధిని పొంద వచ్చును. ఈ విధముగా గృహస్థాశ్రమములో ఉండుచునే సన్యాసమును స్వీకరించుట కూడ శాస్త్రముచేతనే విధింప బడినది. అయినను నితరాశ్రమములలో పొంద బడు జ్ఞానము గృహస్థాశ్రమములో గూడ లభించవచ్చును. కాని, గృహస్థునిచేత అనుష్ఠింప బడు యజ్ఞాది పుణ్య కర్మలు ఇతరాశ్రమములందు అనుష్ఠింప బడ జాలవు. అందువలన ధర్మ ముల యొక్క పరిపూర్ణ సిద్ధి గృహస్థాశ్రమములోనే యున్నది.

"సంజయా! మరికొందరు తనువును విడిచి, జ్ఞానము ద్వారా మాత్రమే సిద్ధిని (మోక్షము) పొంద వచ్చు నని ప్రతిపాదించు చున్నారు. విద్వాంసులు గూడ ప్రపంచమునందు భోజ్య పదార్థములను తినక తృప్తి పడరు. అందుచేతనే, విద్వాంసు లైన బ్రాహ్మణులకు గూడ ఆకలిని పో గొట్టుకొనుటకు భోజనము విధింప బడినది. ఏ విద్యలైతే కర్మానుష్ఠానమును బోధించు చున్నవో, వాని ఫలము కనపడు చున్నది. ఇతర విద్యలకు అట్లు కాదు. జ్ఞాన కర్మల ఫలము లలో గూడ కర్మఫలమే, ప్రత్యక్షముగా అనుభవింప బడుచున్నది. ఎట్లనగా, దప్పి గొన్నవాడు జలపానము చేసియే శాంతిల్లును. జలజ్ఞానము మాత్రముచేత దప్పి శాంతిల్లదు. అందువలన గృహస్థాశ్రమములో ఉండుచునే సత్కర్మ చేయుట శ్రేష్ఠము.

"సంజయా! జ్ఞానము కర్మ సహితముగానే విధింప బడినది. అందుచేత జ్ఞానమునందు గూడ కర్మము ఉన్నది. 'కర్మకంటే వే రైనది శ్రేష్ఠము' అని తలచు దుర్బలుని గూర్చి ప్రసంగించుట వ్యర్థము. దేవతలు కర్మముచేత స్వర్గమునందు ప్రకాశమానులగుదురు. వాయుదేవుడు కర్మముచేతనే ప్రపంచ

మంతటను సంచరించును. సూర్యుడు సోమరితనమును విడిచి కర్మముచేతనే రాత్రింబగళ్ళను విభజించుచు ప్రతి దినము ఉదయించు చుండును, చంద్రుడు గూడ సోమరి కాకుండ కర్మముచేతనే మాసములు, పక్షములు, నక్షత్రముల యొక్క సంబంధమున్ను పొంది యుండును. అగ్నిదేవుడు సోమరి కాక యుండి ప్రజలకొరకు కర్మ చేయుచునే జ్వలించుచు దాహక్రియను చేయును. భూదేవి గూడ అలసత్వము వీడి కర్మమునందు ఆసక్తి కలిగి బలముతో ప్రపంచ మహా భారమును మోయు చున్నది. నదులు, అలసత్వ రహితము లైన కర్మచేతనే ప్రాణు లందరికి తృప్తిని కలిగించుచు జలము ప్రవహించు చుండును. దేవతలలో శ్రేష్ఠ స్థానమును పొందగోరి సోమరితనము విడిచి, బ్రహ్మచర్యవ్రతమును ఆచరించి, మహా తేజస్వి యైన యింద్రుడు గూడ కర్మ యం దాసక్తితో మేఘ గర్జనముద్వారా ఆకాశమును, దశదిక్కులను, ధ్వనింప చేయుచు అప్పుడప్పుడు జలమును వర్షించు చుండును. ఇంద్రుడు మనస్సునకు ప్రియ మైన వస్తువులను, సుఖమును విడచి సత్కర్మ బలముతోనే దేవతలలో ఉన్నత స్థానమును పొందెను. అతడు శ్రద్ధగా సత్యము, ధర్మము, ఇంద్రియ నిగ్రహము, ఓర్పు, సమదృష్టి, అందరకు ప్రియ మగు మార్గములో మంచిగా వ్యవహరించుట - మొద లైనవి అనుష్ఠించెను ఈ సద్గుణములను అనుసరించుటవలననే యింద్రునికి శ్రేష్ఠ మైన దేవసామ్రాజ్య పదము ప్రాప్తించెను.

"సంజయా! దేవగురు వైన బృహస్పతి గూడ నియమ పూర్వకముగా సమాధిలో ఉండి మనస్సును అదుపులో పెట్టుకొని సుఖమును విడిచి యింద్రియములను వశములో నుంచుకొనుచు బ్రహ్మచర్య వ్రతమును పాలించెను. ఈ సత్కర్మ ప్రభావముచేతనే బృహస్పతి మాననీయ మైన దేవగురు స్థానమును పొందెను. ఆకాశమునందలి నక్షత్రము లన్నియు సత్కర్మ మహిమ చేతనే పరలోకమునందు ప్రకాశించు చున్నవి రుద్ర-ఆదిత్య-వసు-విశ్వేదేవ గణములు గూడ కర్మబలముతోనే గొప్ప తనువులు పొందెను. యముడు, కుబేరుడు, గంధర్వులు, యక్షులు, అప్సరసలు-వీ రందరుగూడ తమ-తమ కర్మల మహిమలచేతనే స్వర్గమునందు విరాజమాను లై యున్నారు. బ్రహ్మచర్యమును, బ్రహ్మజ్ఞానమునున్ను అలవరచుకొని యున్న మహర్షులుగూడ కర్మబలము చేతచే పరలోకమందు ప్రకాశించు చున్నారు.

"సంజయా! నీవు శ్రేష్ఠ బ్రాహ్మణులను, క్షత్రియులను, వైశ్యులను, సప్తలోకములలో ఉన్న సుప్రసిద్ధ ధర్మములనున్ను తెలిసి యున్నావు. నీవు జ్ఞానులలోగూడ నుత్తమజ్ఞాని వైనను, కౌరవులస్వార్థమును సిద్ధింప జేయుట కొరకు ఎందుకు ఇంతగా వాచాలుడ వై మాట్లాడు చున్నావు? యుధిష్ఠిరుడు వేద-శాస్త్రములతో నిత్యసంబంధము కలిగి యున్నాడు. అశ్వమేధ-రాజసూయాది యాగములందుగూడ సర్వదా ఆసక్తి కలవా డై యున్నాడు. ధనుస్సును, కవచమును ధరించి యుద్ధము చేయ గలడు. గజాశ్వాదివాహనములు, రథములు, శస్త్రాస్త్రములుగూడ అతనియొద్ద దండిగా నున్నవి.

"సంజయా! పాండవులు, కౌరవులను వధించకుండనే తమ రాజ్యమును పొందుటకు వే రైనయుపాయములు తెలిసి యుండినచో, భీమసేనుని పెద్దల ద్వారా బలవంతముగా శాంతిమార్గములో దింపి, ధర్మరక్ష అనెడు పుణ్యమును సంపాదించుకొన గలరు అని నీవు బాగుగా తెలిసికొనుము. పాండవులు తమ తండ్రితాతలు అనుసరించిన యుద్ధము మొద లైన క్షత్రియధర్మములందు ప్రవర్తించి శక్తికొలది తమ కర్తవ్యమును నెరవేర్చుచు, ఒకవేళ దైవవశమున వారికి మృత్యువే సంభవించినయెడల దానినిగూడ ఉత్తమముగానే భావించెదరు. ఒకవేళ వారు శాంతితోనుండుటయే మంచి దని నీవు తలంచినచో, యుద్ధము చేసి రాజ ధర్మమును పాటించుట యుక్తమా? లేక, యుద్ధము విడిచి పారి పోవుట యుక్తమా? నీవే చెప్పుము. క్షత్రియధర్మమును బాగుగా విచారించి నీవు ఏ మాట చెప్పినను దానిని వినుటకు నేను సిద్ధముగా నున్నాను.

"సంజయా! నీవు బ్రాహ్మణాదు లైన నాలుగు వర్ణములకు విడి-విడిగా ఏర్పడిన ధర్మములను చూడుము. తరువాత పాండవు లిప్పుడు అనుసరించు చున్న కర్మమునుగూడ చూడుము. తరువాత నీవు ఏది మంచిదో వివేకముతో విచారించి, వా రిప్పుడు చేయు చున్నపని మంచి దని తోచినచో వారిని ప్రశంసించుము. లేకున్న నిందించుము.

"సంజయా! బ్రాహ్మణుడు వేదాధ్యయనము, యజ్ఞానుష్ఠానము, దానము లున్ను చేసి, ముఖ్యము లైన తీర్థయాత్రలు చేసి, శిష్యులకు విద్య నేర్పి, యజమానులతో యజ్ఞములు చేయించి, శాస్త్రవిహిత మైన దానమును స్వీకరించ వలెను. క్షత్రియుడు వేదాధ్యయనము, యజ్ఞము, దానము చేయ వచ్చును. ఏ వస్తువును గూడ ఎవరినుండికూడ యాచించ కూడదు. అతడు యజ్ఞమును చేయించుట

గాని వేదము నేర్పుట గాని చేయ గూడదు. ఇదియే క్షత్రియుల ప్రాచీనధర్మము అని ధర్మశాస్త్రములలో చెప్ప బడినది. సంజయా! ఇంతయేకాక, క్షత్రియుడు తన ధర్మము ననుసరించుచు జాగ్రత్తగా ప్రజలను రక్షించవలెను; దానము చేయ వలెను; యజ్ఞము చేయవలెను; అన్ని వేదములను చదువ వలెను; తరువాత, వివాహము చేసికొని పుణ్యకర్మలను అనుష్ఠించుచు గృహస్థాశ్రమమునం దుండ వలెను. ఈవిధముగా ధర్మాత్ము డయిన క్షత్రియుడు, ధర్మమును పుణ్యము నున్ను సంపాదించుకొని తాను కోరినవిధముగా బ్రహ్మలోకమునకు పోవును.

"సంజయా! వైశ్యుడు వేదాధ్యయనము చేసి, కృషికర్మ (వ్యవసాయము), గోరక్షణము, వ్యాపారము - వీనిద్వారా ధనము సంపాదించుచు జాగ్రత్తగా దానిని కాపాడవలెను. బ్రాహ్మణులకు, క్షత్రియులకు ప్రీతి కలిగించుచు ధర్మ శీలుడుగా నుండి వైశ్యుడు పుణ్యాత్ము డై గృహస్థాశ్రమములో నుండ వలెను. శూద్రుడు బ్రాహ్మణులను సేవించుచు, వారికి వందనము చేయ వలెను. అతడు వేదాధ్యయనము చేయ గూడదు. అతనికి యజ్ఞము చేయునధికారముగూడ లేదు. అత డెప్పుడుగూడ ప్రయత్నశీలు డై సోమరితనము లేక తన శ్రేయస్సుకొర కై పనులు చేయు చుండవలెను. ఈవిధముగా శూద్రులకర్మలనుగూర్చి ప్రాచీన ధర్మశాస్త్రము చెప్పు చున్నది.

"సంజయా! రాజు జాగరూకు డై తక్కినవర్ణము లన్నిటిని పరిపాలించుచు, వారితో, వారి-వారి వర్ణధర్మములను సక్రమముగా ఆచరింప జేయుచు నుండ వలయును. అతడు కామభోగములం దాసక్తుడు గాక ప్రజలందరియెడల సమాన భావముతో వ్యవహరించుచు పాపపు పనులకు, పాపేచ్ఛలకున్ను దూరముగా నుండ వలయును. రాజు తన రాజ్యమందు ఎవ డైన సర్వధర్మములును ఆచ రించుచు, శ్రేష్ఠుడుగా నుండినచో, అతనినే ప్రజలగుణదోషముల నిర్ణయమునకు, పరిశీలనకున్ను నియోగించ వలయును. అతని ద్వారా తన రాజ్యములో, పాప కర్మలు చేయువారు ఉన్నది లేనిదిగూడ తెలిసికొను చుండ వలయును. ఎవ డైన క్రూరుడు ఇతరుల ధనసంపదను అపహరించ దలచినప్పుడు, పరపీడనము చేయుటకు సేనను గూర్చుకొనినప్పుడున్ను రాజులు వారికి వ్యతిరేకముగా యుద్ధము చేయ వలసి యుండును. ఇట్టి యుద్ధముల కొరకే శస్త్రాస్త్రములు, కవచము, ధనుస్సు- ఇత్యాదులు ఉత్పన్నము లైనవి. చోరుల వధకొరకే ఇంద్రుడు పూర్వము కవచము, శస్త్రాస్త్రములు, ధనుస్సున్ను ఉత్పన్నములు చేసెను. చోరులను వధించుట చేత రాజులకు పుణ్యము కలుగును.

"సంజయా! కౌరవులలో చోరత్వ దోషము తీవ్రముగా నున్నది. అది మంచిది కాదు. వారు పూర్తిగా అధర్మమునందు పండితులుగ నున్నారు. ధర్మమ్ము అను మాట ఏమాత్రము ఎరుగరు. ధృతరాష్ట్ర మహారాజు తన పుత్రులతో కలిసి పాండవులకు ధర్మము ప్రకారము ప్రాప్తించిన పైతృక మైన రాజ్యమును అపహరించుటకు సంసిద్ధుడుగా నున్నాడు. కౌరవు లందరు కూడ అతని మార్గమునే అనుసరించు చున్నారు. వా రెవరు గూడ ప్రాచీన ధర్మము వైపు చూచుట లేదు. దొంగ దాగి యుండి ధనము దొంగిలించును. లేదా, ఎదురుగా వచ్చి ప్రత్యక్షముగా దోచుకొనును. ఈ రెండు విధములుగా నున్న దొంగలు నిందకు పాత్రులే యగుదురు.

''సంజయా! దుర్యోధనునకు దొంగలకున్ను భేద మే మున్నది - నీవే చెప్పుము? దుర్యోధనుడు క్రోధవశు డై క్రోధము ననుసరించి నడచు చుండును. లోభము చేత రాజ్యమును అపహరింప గోరు చున్నాడు. అది ధర్మ మని అతడు తలచు చున్నాడు. కాని, పాండవుల భాగము అతనియొద్ద న్యాసముగా (ఇల్లడగా) ఉంచ బడినది. కనుక, ఆ భాగమును అతడు శత్రుత్వముతో ఎట్లు హరింప గలడు? ఇట్టి రాజ్యభాగమును పొందుటకు యుద్ధము చేయుచు పాండవులు వధింప బడినను, అట్టి వధ కోర దగినదిగానే యుండును. ఇతరుల రాజ్యము కన్నను తండ్రి తాతల రాజ్యము శ్రేష్ఠ మైనది.

''సంజయా! నీవు రాజ సంఘములో ఈ ప్రాచీన రాజ ధర్మమును కౌరవుల సమక్షములో వివరించ వలెను. తన పక్షమున యుద్ధము చేయుటకు దుర్యోధనుడు పిలిచిన రాజులు మూర్ఖులు. వారు బల గర్వముల చేత మోహితులై మృత్యుముఖములో చిక్కుకొని పోయినారు. అతి పాప కర్మ చేసిన కౌరవుల యొక్క దురాచారమును నీవు నిండు సభలో వివరించుము.

''సంజయా! పాండవుల పత్నియైన ద్రౌపది శీలము, సత్ప్రవర్తనమును కలది. రజస్వలగా నున్న యామె సభా మధ్యమున తేబడు చుండగా భీష్మాదు లైన పెద్దలు కూడా ఆ చెడ్డ కర్మను ఉపేక్షించుచు, చూచు చుండినారు. ఒకవేళ అప్పుడు బాలురు, వృద్ధులు అందరున్ను కలిసి దుశ్శాసనుని ఆ దుష్ట కర్మ నుండి ఆపి యుండినచో, ధృతరాష్ట్రుడు నాకు ప్రియము చేసి యుండెడివాడు. అతని పుత్రుల కోరిక కూడ సిద్ధించి యుండెడిది. దుశ్శాసనుడు మితి మీరి ద్రౌపదిని సభా మధ్యమున, అత్తమామల సమక్షమునందు ఈడ్చుకొని

వచ్చెను. ద్రౌపది అక్కడికి పోయి భయముతో నలువైపుల శోక దృష్టితో చూచెను. కాని, అక్కడ ఆమెకు తన రక్షకుడుగా విదురుడు తప్ప మరియెవ్వరు కనపడ లేదు.

''సంజయా! అప్పుడు సభయందు రాజులు సమావిష్టులై యుండిరి. కాని, వారందరు హృదయ దౌర్బల్యము చేత ఆ యన్యాయమును ప్రతిఘటింప జాలకుండిరి. ఒక్క విదురుడు మాత్రమే అన్యాయమును ప్రతిఘటించుట తన ధర్మమని తలచి మందబుద్ధి యైన దుర్యోధనునితో ధర్మ వచనములు పలికి, అతని అధర్మ కార్యమును విరోధించెను.

''సంజయా! ద్యూత సభలో జరిగిన యన్యాయమును మరపింప జేయుచు నీవు యుధిష్ఠిరునకు ధర్మోపదేశమును చేయగోరు చున్నావు. ద్రౌపది ఆ దినము సభలో పోయి అతి దుష్కరము, పవిత్రము నైన కార్యము చేసెను. ఆమె పాండవులను, తనను మహా సంకటము నుండి, లోతైన సముద్ర జలమునందు మునుగుచున్న నౌకను రక్షించినట్లే రక్షించెను. ఆ సభయందు ద్రౌపది అత్తమామల యొద్ద నిలిచి యుండినప్పటికిన్ని కర్ణుడు ఆమెను అవమానించుచు, 'ద్రౌపదీ! నీ కిప్పుడు వేరు గతి లేదు. నీవు దాసిగా దుర్యోధనుని మేడలో పొమ్ము, పాండవులు జూదము నందు తమను ఓడిపోయిరి. అందుచేత వారు నీకు పతులుగా లేరు. ఇప్పుడు నీవు మరియొకని నీ పతిగా వరించుకొనుము' అని అనెను. కర్ణుని నోటినుండి వెడలిన అతి ఘోర - కటు వచనముల రూపములో నున్న బాణములు మర్మములను గాయ పరుచునవిగా నుండెను. ఆ మాటలు అర్జునుని కర్ణముల మార్గము నుండి లోపల ప్రవేశించి ఎముకలను ఛేదించుచు అతని హృదయములో గ్రుచ్చు కొనెను. పదునైన ఆ వాగ్బాణములు నేడు గూడ అర్జునుని హృదయములో పాతుకొని పోయి యున్నవి. అవి అప్పుడప్పుడు గొంతుకు తగులు చున్నవి.

"సంజయా! పాండవులు వనవాసమునకు పోవుటకు కృష్ణాజినము (లేడి చర్మము)లను ధరించుచుండగా, దుశ్శాసనుడు 'ఈ నపుంసకు లందరు నశించినారు. దీర్ఘ కాలము వరకు నరకమునందు పడి పోయినారు' అని అనెను కదా! శకుని జూద మాడునప్పుడు యుధిష్ఠిరునితో కపటముగా, 'ఇప్పుడు నీ చిన్న తమ్ముని గూడ ఓడిపోతివి. నీ దగ్గర ఇప్పుడేమి మిగిలియున్నది? అందువలన, నీవు ఈ సమయమునందు ద్రౌపదిని పందెముగా ఒడ్డి జూద మాడుము' అని

యనెను కదా? సంజయా! జూద మాడునప్పుడు ఎన్నియో నింద్యములైన మాటలు అనేక విధములుగా వారనిరి. అవి యన్నియు నీకు తెలియును కదా! ఇంతయైనను, చెడిపోయిన యీ కార్యమును చక్కబరచుటకు నేను స్వయముగా హస్తినాపురమునకు పోవ దలచుచున్నాను.

''సంజయా! పాండవుల స్వార్థము చెడకుండనే నేను కౌరవులతో సంధి జరుపుటతో సఫలుడను కాగలిగిన యెడల, నాచేత పరమ పవిత్రము, అభ్యుదయకరము నైన కార్యము నెరవేర గలదు. దీనివలన కౌరవులు గూడ మృత్యుముఖమునుండి విముక్తులు కా గలరు. నేను అక్కడి పోయి శుక్రనీతి ప్రకారము ధర్మార్థ సహితములైన మాటలను పలికెదను. అవి హింసావృత్తిని అణచివేయ గలవు. నేను మాట్లాడబోవు పలుకులను ధృతరాష్ట్ర పుత్రులు వివేకముతో విచారించెదరా? నే నక్కడికి పోయినప్పుడు వారు నన్ను గౌరవించెదరా?

"సంజయా! ఒక వేళ కౌరవులు నా తలంపునకు విపరీత భావమును కనపరచినచో, రథారూఢు డైన అర్జునుడు, యుద్ధ సన్నద్ధు డైన భీమసేనుడున్ను కౌరవులను ఓడించి, పాపాత్ము లైన ధృతరాష్ట్ర పుత్రుల నందరిని దగ్ధము చేయ గలరు. జూదములో పాండవులు ఓడిపోయినప్పుడు దుర్యోధనుడు మిక్కిలి భయంకరము లైన కటువాక్యములను మాట్లాడి యుండెను. అందుచేత భీమసేనుడు దుర్యోధనునితో యుద్ధము చేయుటకు సర్వదా జాగరూకుడై గదను ధరించి దుర్యోధనుడు ఆనాడు ఆడిన మాటలను యుద్ధరంగమునందు అతనికి జ్ఞప్తికి తే గలడు.

"సంజయా! దుర్యోధనుడు కోప స్వరూపమైన ఒక మహా వృక్షముతో సమానుడు. కర్ణుడు ఆ వృక్షమునకు బోదెవంటి వాడు. శకుని శాఖవంటివాడు. దుశ్శాసనుడు ఆ వృక్షమునందు బాగుగా పూచి, పండిన పుష్పఫలముల వంటివాడు. తెలివి లేని ధృతరాష్ట్రుడే ఆ చెట్టునకు వేరు వంటివాడు. ఇది కౌరవ వృక్షము. ఇక పాండవ వృక్షమును గూర్చి వినుము. ధర్మరాజు ధర్మస్వరూపమైన వృక్షము, దానికి అర్జునుడు బోదెవంటివాడు. భీమసేనుడు కొమ్మ. నకుల. సహదేవులు పరిపూర్ణ ఫలపుష్పములు. ఆ పాండవ వృక్షమునకు నేను, వేదములు, బ్రాహ్మణులే మూలము (వేరు)గా నున్నాము.

"సంజయా! ధృతరాష్ట్ర మహారాజు సపుత్రకుడుగా ఒక మహావనము. ఆ యడవిలో నివసించు వ్యాఘ్రములే పాండవులు, సింహ వ్యాఘ్రములచే రక్షింపబడిన యడవి నశించదు. అలాగే వనములో నున్న సింహములు గూడ సురక్షితముగా నుండి నశించవు. కనుక, పరస్పరము రక్షకము లైన కౌరవ పాండవ వంశములను నశింప జేయకుము. ఎందు కనగా, వనము నుండి బయటకు వచ్చిన సింహము రక్షణము లేక చంప బడును. అలాగే, సింహము లేని వనమును గూడ అందరును అవలీలగా, నిర్భయముగాను నరకెదరు. అందువలన సింహము వన రక్షణము, వనము సింహరక్షణమున్ను చేయవలెను.

"సంజయా! ధృతరాష్ట్ర పుత్రులు లతలతో సమానులు. పాండవులు మద్ది చెట్లతో సమానులు. ఏ లత గూడ మహావృక్షమును ఆశ్రయించక అభివృద్ధి పొంద జాలదు. అందువలన, పాండవులను ఆశ్రయించియే, ధృతరాష్ట్ర పుత్రులు అభివృద్ధి పొంద గలరు. పాండవులు ధృతరాష్ట్రునకు సేవలు చేయుటకు గూడ సంసిద్ధులై యున్నారు. వీరు లై యుద్ధము చేయుటకు గూడ సిద్ధముగ నున్నారు. కనుక, ఇప్పుడు ధృతరాష్ట్ర మహారాజు వీరితో సేవలు చేయించుకొనునో, లేక, వీరికి యుద్ధమునకే అవకాశ మిచ్చునో- ఈ రెండు విషయములలో ఆయన తన కర్తవ్యమును నిర్ణయించుకొన వలసి యున్నది. సంజయా! ధర్మాత్ములు, మహాత్ములు నైన పాండవులు శాంతికిని సంసిద్ధు లై యుద్ధమునకు సమర్థులైయున్నారు. ఈ రెండు విషయములను బాగుగా తెలిసికొని నీవు ధృతరాష్ట్రునకు ఉన్న దునట్లు చెప్పుము."

''జనమే జయా! శ్రీకృష్ణుని మాటలు విసిన తరువాత సంజయునకు యుధిష్ఠిరుడు వీడ్కోలు చెప్పెను. అప్పుడు సంజయుడు యుధిష్ఠిరునితోని ట్లనెను:

''పాండునందనా! నీకు మేలు కలుగు గాక! మీతో సెలవు తీసికొని హస్తినాపురమునకు పోవు చున్నాను. నేను మనస్సులో బాధతో మాట్లాడినందుకు మీకు కష్టము కలుగ లేదుకదా! శ్రీకృష్ణుడు - భీమార్జునులు - నకుల - సహదేవులు - సాత్యకి - చేకితానుడు - వీరందరి యాజ్ఞ తీసికొని పోవు చున్నాను. మీ కందరికిన్ని సుఖము, శుభమున్ను కలుగుగాక! నన్ను మీరు స్నేహదృష్టితో చూడ వలెను అని ప్రార్థించు చున్నాను."

"జనయే జయా! ఆ మాటలకు యుధిష్ఠిరు డి ట్లనెను :-

యుధిష్ఠిరుడు సంజయుని ప్రశంసించి తన సందేశము చెప్పుట

''సంజయా! నేను అనుమతి యిచ్చు చున్నాను నీవు పోవచ్చును. నీకు మేలగుగాక! నీ వెప్పుడుగాని మా కీడు కోరవు. అందుచేత కౌరవులు, మేమున్ను నిన్ను పవిత్ర మనస్సు గల మధ్యస్థునిగా తలచెదము. నీవు నమ్మదగిన దూతవు. మాకు మిక్కలి ప్రియుడవు. నీ మాటలు శ్రేయస్కరములు. మంచి శీలము కలిగి సర్వదా సంతోషముతో నుందువు. నీ బుద్ధి ఎప్పుడున్ను మోహము చెందదు. కఠినముగా మాట్లాడిన వారి యెడల గూడ నీ వెప్పుడున్ను కోపపడవు. నీ మాటలు కటువుగా, మర్మచ్ఛేదకములుగాను ఎప్పుడు నుండవు. నీరసములు, అప్రాసంగికములున్ను అగు మాటలను నీవు మాట్లాడవు. నీ విషయవివరణము ధర్మానుకూలముగా నుండును. కనుక, మనోహరముగా, అర్థయుక్తముగా, హింసాభావ రహితముగాను అది యుండు నని మాకు బాగుగా తెలియును.

"సంజయా! నీవే మాకు అతి ప్రియుడవు. నిన్ను చూడగనే రెండవ విదురుడే మాయొద్దకు దూతగా వచ్చినట్లు అనిపించినది. ఇంతకు పూర్వము గూడ నీవు మాతో ననేక పర్యాయములు కలిసినావు. ధనంజయునకు నీవు ఆత్మసమాను డైన ప్రియతముడవు. నీవు ఇక్కడినుండి పోయిన తోడనే ఆదరణీయులు, మాననీయులు, పవిత్ర శక్తి సంపన్నులు, బ్రహ్మచర్యపాలన పూర్వకముగ వేదాధ్యనము చేసిన వారలు, సత్కుల సంజాతులు, సర్వ ధర్మ సంపన్నులు నైన బ్రాహ్మణులకు మా నమస్కారములను నివేదించుము.

యుధిష్ఠిరుడు కురుముఖ్యులకు సందేశ మంపుట

"సంజయా! వేద విదు లైన బ్రాహ్మణులు, సన్యాసులు, వనవాసు లైన తపోధనులు, పెద్దలు, వృద్ధులు- వీ రందరికిన్ని మా ప్రణామమును తెలుపుము. ఇతరులకు కుశల సమాచారమును గూడ మా పక్షమున అడుగుము సంజయా! ధృతరాష్ట్ర పురోహితుడు, ఆచార్యుడు, ఋత్విక్కులు- వీరికి గూడ మా కుశలము తెలిపి, మేము వారి క్షేమమును విచారించినట్లు తెలుపుము. అశ్రోత్రియుల (శూద్రులు) లో వృద్ధ పురుషులు, శీలవంతులు, బలవంతులు, హస్తినాపురములో నున్న వీ రందరు యథాశక్తి ధర్మాచరణము చేయుచు మా యెడల శుభ

చింతనము కలవారై మమ్ము మాటిమాటికి తలచుచుందురు అట్టివా రందరికి మా పక్షమున క్షేమ సమాచార మడిగినట్లు చెప్పుము. కౌరవ రాజ్యము నందు వ్యాపార జీవనము, పశుపాలనము, కృషి కర్మ (వ్యవసాయము) యు చేయునట్టి వైశ్యు లందరి యొక్క క్షేమ సమాచాము మా పక్షమున అడుగుము.

"సంజయా! వేదాధ్యయనము చేయుటకు బ్రహ్మచర్య వ్రతమును పాలించి తరువాత, ప్రయోగోప సంహారముల పూర్వకముగా అస్త్రవిద్యను నేర్చుకొని అందరికి ప్రియుడై, నీతిమంతుడై ప్రసన్నచిత్తుడునై యుండు ద్రోణాచార్యులకు మానమస్కారమును తెలుపుము. ఆయన అందరికిన్ని వందనీయుడు. తండ్రివంటివాడు, అన్ని సద్గుణములు, సదాచారములు, సామర్థ్యములున్ను గలిగి గంధర్వ కుమారునితో సమానుడైన ఆచార్యపుత్రుడు అశ్వత్థామ యొక్క క్షేమ సమాచారముగూడ మా పక్షమున అడుగుము. ఆత్మజ్ఞాన సంపన్నుడు, మహారథికుడునైన కృపాచార్యుని యింటికి పోయి, నా పేరు ఆయనకు చెప్పుచు నీ చేతులతో ఆయన చరణ స్పర్శ పలుసార్లు చేయుము. వీరత్వము, దయ, తపస్సు, బుద్ధి, మంచి శీలము, శాస్త్ర జ్ఞానము, సత్వగుణము, ధైర్యము మొదలైన సద్గుణములతో శోభిల్లుచు, కురుశ్రేష్ఠుడునైన భీష్మపితామహుని రెండు పాదములను పట్టుకొని నేను ప్రణామము చేసితి నని నివేదించుము. కౌరవ నాయకుడు, ప్రజ్ఞాచక్షువు (అంధుడు), శాస్త్రజ్ఞాన సంపన్నుడు, వృద్ధులను సేవించువాడునైన ధృతరాష్ట్ర మహారాజునకు నా యారోగ్యము, నా నమస్కారమున్ను తెలుపుము.

"సంజయా! మందబుద్ధి, మూర్ఖుడు, కుట్రలు చేయువాడు, పాప స్వభావుడు, భూమండల మంతట అపకీర్తిపాలైనవాడునైన దుర్యోధనుని కుశలము అడిగినా ననుము ఈ దుష్టస్వభావము లన్నియు గలిగిన దుశ్శాసనునిగూడ కుశలము అడిగినాననుము. భారతవంశీయుల శాంతిని సర్వదా కోరుచున్న విజ్ఞానవంతుడు, సాధుశీలుడునైన బాహ్లీకునకు నానమస్కారములు తెలుపుము. అనేక సద్గుణ సంపన్నుడు, మృదుస్వభావుడు, కోపమును సహించువాడునైన సోమదత్తునకు నమస్కారములు తెలుపుము. అనేక సద్గుణ సంపన్నుడు, మాసోదరునివంటివాడు, మిత్రుడు, మహారథికుడు, కురుశ్రేష్ఠుడునైన సోమదత్త కుమారుడు - భూరిశ్రవసుని కుశల మడిగినా ననుము. కురుముఖ్యులైన యితరు లందరికిన్ని, ఎవ రెవరికి ఏవిధముగా చెప్పవలెనో, వా రందరితో

నేను కుశల మడిగినా ననుము కౌరవ పక్షమును చేరి పాండవులతో యుద్ధము చేయుటకు వచ్చిన వశాతి-శాల్వ-కేకయ-అంబష్ఠ-త్రిగర్తాదులైన పూర్వ-ఉత్తర-దక్షిణ దేశరాజవీరులు, పడమటి దేశవాసులు, పర్వత ప్రాంతీయులునైన రాజవీరులందరున్ను శాంతులు, మంచి స్వభావమున్ను గలవారు. వారి కుశల మడిగినా ననుము.

"సంజయా! రథ-గజ-తురగ-పదాతి దళముల వా రందరికి మా కుశలము తెలిపి వారి క్షేమ మడిగినా ననుము. మంత్రులు, ద్వారపాలకులు, సేనానాయకులు, ఆయ వ్యయముల లెక్కలు చేయు గణకులు - మొదలైన వారి క్షేమము విచారించినా నని చెప్పుము. కురుశ్రేష్ఠుడు, ప్రజ్ఞావంతుడు, సర్వధర్మములు తెలిసినవాడు, ఎప్పుడుగూడ యుద్ధమును కోరనివాడునైన ధృతరాష్ట్రుని వైశ్యాపుత్రుడు బృందారకుని (యుయుత్సుని) కుశలమును నే నడిగినా నని చెప్పుము. ధనాపహరణమునందు, ద్యూత క్రీడయందు నసమానుడు, కపటత్వమును కప్పిపుచ్చి, నిపుణముగా జూద మాడువాడు, పాచికలు వేయుకళలో ప్రవీణుడు, యుద్ధము నందు దుర్జయుడునైన చిత్రసేనుని కుశలము నడిగితి నని చెప్పుము. అలాగే, జూద మాడి యితరుల ధనము నపహరించుటలో నతిచతురుడు, పర్వత ప్రాంతవాసి, దుర్యోధనుని సర్వదా సన్మానించు గాంధార రాజైన శకుని క్షేమ మడిగితి ననుము. జయించ బడుటకు అశక్యులైన పాండవులను ఏక రథము చేతనే జయించుటకు ఉత్సహించుచు, మొదటనే మోహము నందున్న దుర్యోధనాదులను అధిక మోహమునందు పడ వేయుచున్న సూర్యపుత్రుడు కర్ణుని క్షేమ మడిగితి ననుము.

"సంజయా! అగాధము, అనంతమునైన బుద్ధిశక్తి గలవాడు, దూరదృష్టి గలవాడు, మాయందు ప్రేమగలవాడు, మా గురుతుల్యుడు, మా సంరక్షకుడు, మా తలిదండ్రుల వంటివాడు. మా మిత్రుడు, మాకు మంత్రియునైన విదురుని నీవు విశిష్టముగా మా పక్షమున క్షేమ సమాచారము నడుగుము. గుణవంతులు, మాతృతుల్యులునైన వృద్ధస్త్రీ లందరకున్ను మాయభివాదము తెలిపి, వారితో, 'తల్లులారా! మీ పుత్రులు మీతో మంచిగా వ్యవహరించు చున్నారా? వారిలో క్రూరత్వము రాలేదు గదా! వా రందరికిన్ని దీర్ఘాయుష్మంతులైన

పుత్రులు కలిగినారా? మీ పుత్ర సమానుడు అజాతశత్రువు పుత్రమిత్రసోదర సహితుడుగా కుశలి యై యున్నాడు' అని యనుము.

"సంజయా! అక్కడ మా సోదరుల భార్యలకు మిత్రురాం డ్రైన స్త్రీలతో 'అమ్మలారా! మీరు క్షేమముగా నున్నారా? మీరు సుగంధ ద్రవ్య శోభితలుగా, నిర్దోషలుగా, ఇండ్లలో నేలాటి పొరపాట్లు జరుపకుండు వారుగా, అత్త మామల యందు సత్ప్రవర్తన కలవారుగా, మీ యందు వారి ప్రేమ సంపాదించు వారుగా పతులకు అనుకూల ప్రవర్తనగలవారుగా నునున్నారా?" యని యనుము కోడండ్ర వావిలో నున్న స్త్రీలు సత్కులముల నుండి వచ్చిన వా రున్నారు గదా! వారితో 'అమ్మలారా! మీరు క్షేమముగా నున్నారా? మీరు పతులతో ప్రేమతో నున్నారా!' యని యనుము. రాజభవనము నందున్న చిన్న చిన్న కన్యకలను మా పక్షమున ఆలింగనము చేసి వారి కుశల వార్త విచారించితి మనుము. వారికి మంచి పతులు లభించి, ఆపతులతో నన్యోన్యము ప్రేమగా నుండునట్లు మేము వారి సందరిని ఆశీర్వదించితి మని చెప్పుము. అనేక విచిత్ర వేష - భూషలతో, స్వర్ణాభరణాంబరాదులతోను మనోహారిణులుగా, సత్రివర్తకు రాండ్రుగాను నున్న వేశ్య స్త్రీలను వారి కుశల మడిగితి మనుము. అక్కడి దాసదాసీజనముమ, వారియొద్దనున్న గూని - పొట్టి - కుంటి వారి క్షేమ మడిగితి మని చెప్పుము.

"సంజయా! అంగవిహీనులను, దిక్కు లేనివారిని, వామనులను (పొట్టి వారు)న్ను కష్టపెట్టకుండ ధృతరాష్ట్రుడు బాగుగా చూచు చున్నాడా? దుర్యోధనుడు వారివారి ప్రాచీన జీవనోపాధులకు భంగము లేకుండ నడుపు చున్నాడా? అని మా పక్షమున నడుగుము. ఏనుగుల మావటివాండ్రను, అంధులను, వృద్ధులను క్షేమ మడిగి, మా క్షేమము వారికి తెలుపుము. ఈ కష్టజీవనము - దుఃఖమున్ను వారికి పూర్వజన్మ పాపమువలన గలిగినది. వారు భయపడ వలసిన యక్కర తేదు. మేము త్వరలోనే శత్రుసంహారము చేసి వచ్చి, వా రందరికిని సుఖశాంతులు కలిగించెదమని వారితో చెప్పుము.

"సంజయా! నీవు దుర్యోధనునితో నా మాటగా, 'దుర్యోధనా! మేము బ్రాహ్మణుల కిచ్చిన జీవన వృత్తులను, మీ సేవకులు సరిగా నడుపుట లే దని ఖేదపడు చున్నాము, నీవు వారికి పూర్వమువలెనే వారి వృత్తులను సరిగా నడుపుము' అని చెప్పుము. అనాథులు - దుర్బలులు - సర్వదా 'తమ శరీర పోషణమునందే ప్రయత్నము కలవారునై యున్న దీనుల క్షేమమునుగూడ నేను

విచారించినా నని చెప్పుము. వేరు దిక్కులనుండి వచ్చి దుర్యోధనాదులను ఆశ్రయించి యున్న పూజ్యులను మేము క్షేమ మడిగితి మని చెప్పుము. సర్వదిక్కుల నుండి అక్కడికి రాజదూతలుగా వచ్చినవారి నందరిని నీవు చూచి వారి క్షేమ మడిగితి మని చెప్పి, మా క్షేమము వారికి తెలుపుము.

"సంజయా! దుర్యోధనునకు యుద్ధమునందు సహాయము చేయుటకు వచ్చిన యుద్ధవీరులతో సమానులు వే రెవరుగూడ లేరు. అయినను, నన్నిటి కన్న ధర్మము నిత్యము. నాయొద్ద శత్రువులను నశింప జేయుటకు అన్నిటికన్న గొప్ప దైన ధర్మబల మున్నది.

"సంజయా! చివరకు దుర్యోధనునితో నా మాటగా ని ట్లనుము:

'కౌరవ రాజ్యమును నిష్కంటకముగా నేల వలె నని నీ మనస్సులో అభిలాష కలదు. అది నీ మనస్సుకు బాధ మాత్రమే కలిగించును. కాని, అది సిద్ధించుటకు నీయొద్ద ఉపాయ మేదియు లేదు. నీవు కోరు చున్న యీ రాజ్యాపహరణ కార్యము నెరవేర నిచ్చుటకు మే మంత పౌరుషహీనులము కాము. మా యింద్రప్రస్థపురమును మాకు తిరిగి యిమ్ము. లేదా, యుద్ధమునకు సన్నద్ధుడవు కమ్ము.'

"సంజయా! సత్పురుషుని గాని, అసత్పురుషుని గాని, బాలుని గాని, వృద్ధుని గాని, బలవంతుని గాని, దుర్బలుని గాని - అందరిని విధాత తన వశములో తీసికొనును. పూర్వజన్మ కర్మవశము చేత విధాతయే పండితుని అపండితునిగా, అపండితుని పండితునిగాను చేయును. ధృతరాష్ట్రాదులు, మా సేనాబలమును గూర్చి యడిగినచో, నున్న దున్నట్లుగా చెప్పుము. వారు యథాతథముగా మనసంగతి తెలిసికొని, పరస్పరము యోచించుకొని, వారి కర్తవ్యమును నిశ్చయించుకొనెదరుగాక!

"సంజయా! నీ వక్కడికి పోయి ధృతరాష్ట్రునకు నా నమస్కారములు తెలిపి, ఆయన క్షేమము నడిగితి ననుము. సపరివారు డై కూర్చుని యున్న యతనితో నామాటగా ని ట్లనుము:

'రాజా! నీ బలముతోనే పాండవులు జీవించుచున్నారు. నీ యనుగ్రహము చేతనే వారికి పూర్వము రాజ్యము లభించెను. ఇప్పుడు మరల రాజ్యమునందు వారిని స్థాపింపుము. మాకు ఇవ్వ బోవు రాజ్యము ఒక్కనికొరకు చాలదు. మా

యందరికి సుఖజీవనము గడపు రాజ్యము నీయ వలెను. శత్రువుల వశమునందుండక, నీవు స్వతంత్రించి యీ పని చేయుము.'

'సంజయా! అట్లే భరతవంశ పితామహు డైన భీష్మునకు నీవు నా నామోచ్చారణము చేసి నమస్కరించి ఆయనతో నామాటగా ని ట్లనుము:

''తాతా! నీవు శంతను వంశము విచ్ఛిన్న మగు చుండగా, దానిని ఉద్ధరించుటకు జన్మించితివి. ఇప్పుడుగూడ మాయందరిని యుద్ధప్రసక్తి నుండి కాపాడి వంశోద్ధారము చేయుము. మాయందు ప్రీతిచేత మే మందరము క్షేమముగా జీవించి యుండులాగు చూడుము.'

''సంజయా! ఇట్లే, నీవు కౌరవులకు మంత్రి, నాయెడల హితము కోరువాడు వైన విదురునితోగూడ 'యుద్ధము లేకుండునట్లు ఉపదేశము చేయుము' అని నా మాటగా చెప్పుము.

''సంజయా! కౌరవుల మధ్య కూర్చొని, క్రోధావిష్టు డైన దుర్యోధనునితో గూడ, అతనిని మాటిమాటికి అనునయించుచు ని ట్లనుము:

'దుర్యోధనా! నీవు ఏ యపరాధము చేయని ద్రౌపదిని సభా మధ్యమునందు అధర్మముగా నవమానపరచితివి. కౌరవుల వధ ఆనాడు చేయ వలసి వచ్చినను, ఆ దుఃఖమును మేము మాలోనే అణచుకొని ఓర్చి యుంటిమి. పూర్వము, ఆ తరువాతను మీరు మాకు చేసిన యపకారములను మేము బలవంతుల మై యుండి కూడ క్షమించితిమి. ఈ సంగతి యంతయు కౌరవులకు బాగుగా తెలియును. మమ్ము కృష్ణాజిన ధారులనుగా చేసి వనవాసమునకు పంపిన దుఃఖమును కూడ ఓర్చితిమి. కాని, కౌరవులను వధించలేదు. నీ యనుమతిచేత దుశ్శాసనుడు, కుంతీదేవిని గూడ నిర్లక్ష్యము చేసి, ద్రౌపది కొప్పు పట్టి యీడ్చెను. దానిని గూడ మేము ఉపేక్షించితిమి. మాకు అర్హమైన భాగమును మేము తప్పక పొందెదము. పరద్రవ్యమునందు దురాశాపూర్వక మైన బుద్ధిని నీవు విడువుము. ఈ విధముగా చేసినచో శాంతి, పరస్పర ప్రేమయు కలుగును. శాంతిని గోరు మాకు రాజ్యములో నొక కొంత భాగ మైనను ఇమ్ము.

'అవి స్థలము - వృకస్థలము - మాకంది-వారణావతము-ఈ నాలుగు గ్రామములు. అయిదవది నీ కిష్ట మైన గ్రామ మే దైనను ఇమ్ము. దీనితో మనకు యుద్ధము జరుగదు. దుర్యోధనా! మా యైదుగురు సోదరులకు నైదు గ్రామముల నిమ్ము.'

జనమేజయా! యిట్లు సందేశము పంపి ధర్మరాజు సంజయునితో మరల నిట్లనెను:

"సంజయా! జ్ఞాతులతో మాకు సంధి యగుగాక! సోదరుడు సోదరునితో, తండ్రి కొడుకుతో, పాంచాలురు కౌరవులతోను సంతోషముతో కలియ గలరు. కౌరవ-పాంచాలురు క్షతగాత్రులు గాకుండ నుండునట్లు చూడ గోరు చున్నాను. ఈ విధముగా జరిగినచో మే మందరము సౌమనస్యముతో శాంతిపూర్వకముగా నుండ గలము. సంజయా! నేను శాంతితో నుండుటకు, యుద్ధము చేయుటకున్ను సమర్థుడనే. ధర్మార్థ విషయములను గూర్చి నాకు బాగుగా తెలియును. నేను సమయాను సారముగా మృదువుగా, కఠినముగాను వ్యవహరించ గలను."

''జనమేజయా! ధర్మరాజు మాటలు విని అర్జునుడు సంజయునితో నిట్లనెను:

అర్జునుని సందేశము

''సంజయా! యుద్ధములో దుర్యోధనునకు సహాయకులుగా నక్కడ చేరి యున్న భీష్మ, ద్రోణ, ధృతరాష్ట్రాదులతో, భగదత్తాది రాజులతోను వారి వారికి తగినట్లుగా నా వందములు కుశల ప్రశ్నలున్ను చేసి, అందరి సమక్షములో, ధృతరాష్ట్రునకు భయము కలుగునట్లుగా, అక్కడ సభవారికి సంతోషము కలుగు నట్లుగాను పాపాత్ములలో ముఖ్యమయిన దుర్యోధనునితో ఈ మాటలు చెప్పుము.''

సంజయుడు ధృతరాష్ట్రునకు యుధిష్ఠిరాదుల సందేశములు వినిపించుట

"జనమేజయా! పాండవుల యొద్ద సెలవు దీసికొని సంజయుడు హస్తినాపురమునకు పోయెను. అక్కడ రాజభవనమునందు అంతఃపురమునకు పోయి ద్వారపాలకునితో 'సంజయుడు పాండవుల యొద్దనుండి వచ్చినాడు అని, ధృతరాష్ట్ర మహారాజుతో, ఆయన మేల్కొని యుండినచో చెప్పి, నా నమస్కారము ఆయనకు తెలుపుము' అని యనెను. వెంటనే ద్వారపాలకుడు రాజునొద్దకు పోయి 'మహారాజా! సంజయుడు దూతగా పాండవులయొద్దకు పోయి తిరిగి వచ్చి

తమ దర్శనము చేయ గోరు చున్నాడు. ఏమి ఆజ్ఞ? అని నమస్కార పూర్వకముగా చెప్పెను. ఆ మాట విని ధృతరాష్ట్రుడు 'ద్వారపాలా! నేను కుశలముగా నున్నాను. సంజయుని త్వరగా లోపలికి ప్రవేశ పెట్టుము. సంజయుడు నా యొద్దకు వచ్చుటకు ఎప్పుడుగూడ ఏ యాటంకము అతనికి నుండదు. ద్వారము నందే యేల నా యాజ్ఞకై వేచి యున్నాడు?' అని చెప్పి పంపెను. అప్పుడు సంజయుడు ద్వారపాలకుని మాట విని అంతఃపురములోకి పోయి అక్కడ సింహాసనముపైన కూర్చొని యున్న రాజునకు నమస్కరించి యిట్లనెను:

'రాజా! నేను సంజయుడను. పాండవుల కడకు పోయి వచ్చినాను. యుధిష్ఠిరుడు నీకు నమస్కారము చేసి నీ క్షేమ మడిగెను. అతడు 'నీ పుత్రులతో మనుమలతో, మిత్రులతోను ప్రీతితో నీవు ఉన్నావా?' యని, 'వారు నీ యందలో సుఖముగా జీవితము గడుపు చున్నారా?' యనియు నడిగెను. ఆ మాటకు ధృతరాష్ట్రుడు 'సంజయా! యుధిష్ఠిరుడు పుత్ర - సోదర - కళత్ర - మంత్రులతోపాటు సుఖముగా నున్నాడా?' యని యడుగగా సంజయుడు ధృతరాష్ట్రునితో నిట్లనెను.

'మహారాజా! యుధిష్ఠిరుడు తనవా రందరితోను సుఖముగా నున్నాడు. పూర్వము అతని కున్న రాజ్యమును నీ సమక్షమునందే తిరిగి తీసుకొన గోరు చున్నాడు. అతనికి నితర ధర్మము లన్నిటికన్నను దయాధర్మమే ముఖ్యమైనది. అతడు ధనమునకన్న ధర్మమే శ్రేష్ఠ మని తలచు చున్నాడు. ధర్మహీనము, నిష్ప్రయోజనము నైన సుఖమును, ప్రియవస్తువునుగూడ నతడు కోరుట లేదు.

'మహారాజా! దారములో దూర్చ బడిన కొయ్యబొమ్మ ఇతరులు ఆడించగా ఆడినట్లే, మనుష్యుడు పరమాత్మయొక్క ప్రేరణచేతనే ప్రతికార్యమున్ను చేయుటకు ప్రయత్నించును. పాండుపుత్రుల కష్టములను చూచి నేను, మనుష్యునకు పౌరుషముకన్న దైవమే బలీయ మైనది అని తలచితిని. రాజా! నీ కర్మదోషము అతిభయంకరము, అవర్ణనీయము, భవిష్యత్తులో పాపమును, దుఃఖమునున్న కలిగించునదిగా నున్నది. ఇది చూచికూడ నేను పౌరుషముకన్న దైవబలమే గొప్పది అను నిశ్చయమునకు వచ్చితిని. పరమాత్ముడు కోరు చున్నంత దాకానే,మనుష్యుడు ఒక నియమితకాలమువరకు ప్రశంసాపాత్రుడుగా నుండును. యుధిష్ఠిరుడు, సర్పము ప్రాత కుబుసము శరీరమునం దుండుటకు నిరూపయోగమని దానిని విడిచి ప్రకాశించు చుండునట్లే, తన పాపమును విడిచి నీయందు పడవైచి, స్వాభావిక మైన తేజస్సుతో వెలుగు చున్నాడు.

సంజయుడు ధృతరాష్ట్రుని నిందించుట

'రాజా! ధర్మార్థయుక్తు డైన ఉత్తమపురుషునివలె నీవు వ్యవహరించక దానికి విపరీతముగా వ్యవహరించు చున్నావు. ఈ కారణముచేతనే నీవు ఈలోకమున నిందింప బడు చున్నావు. పరలోకములోగూడ నీవు పాపమయ మైన నరక దుఃఖమును అనుభవింప వలసి వచ్చును. నీవు పుత్రులకు వశుడ వై, సంశయాస్పద మైన యీ రాజ్యసంపదను పాండవులకు పంచి యీయకుండ నీ వొక్కడవే అనుభవింప దలచు చున్నావు. ఈ నీ కోరిక ఫలించుటలో సంశయము కలదు. ఒకవేళ నీవు సఫలుడ వైనను, ఈ భూమండలమునందు నీ యధర్మము కారణముగా నీకు గొప్ప నింద వచ్చును. కనుక ఈ కార్యము నీకు ఎప్పటికిన్ని యోగ్యము కాదు.

'రాజా! బుద్ధిహీనుడు – నీచకులోత్పన్నుడు – క్రూరుడు–దీర్ఘకాలము వరకు వైరము కలవాడు–క్షత్రియవిద్య తెలియనివాడు–పరాక్రమరహితుడు–అశిష్టుడు మొద లైన దుర్గుణులే ఆపదలను పొందెదరు.

'రాజా! సత్కులమున పుట్టినవాడు - బలవంతుడు - కీర్తికాముడు – అనే శాస్త్రపండితుడు సుఖజీవనము గడుపువాడు - మనోనిగ్రహము గలవాడు - ధర్మాధర్మవివేకము గలవాడే అదృష్ట వశమున కోరినసంపదను పొంద గలడు.

'మహారాజా! నీకు మంత్రుల యుపదేశము - బుద్ధి - ఆపదలలో ధర్మార్థములను సముచితముగా నుపయోగించుశక్తి - అన్ని విధము లైన యుపదేశములు ఇచ్చువారున్ను ఉన్నారు. ఇన్ని యుండిన నీవు ఈ క్రూరకర్మను ఎట్లు చేయగలవు? కార్యమునందు ఆసక్తి గలవా రై, మంత్రాలోచనమునందు సమర్థులైన నీ మంత్రులు సర్వదా సమావేశములు జరుపు చుందురు. ఈ మంత్రాలోచనములద్వారా వీరు చేయు నిర్ణయములు తప్పక మీ కౌరవ వంశనాశనమునకు కారణము లయ్యెను.

'రాజా! యుధిష్ఠిరుడు ఒకవేళ, నీయందే పాపదోషములభారమును విడిచి, నిన్ను పాపిగా, దోషిగాను నిర్ణయించి, నీవు చేసిన పాపములకు నతడు

ప్రతిక్రియ చేయుటకు కోరి యుండినయెడల కురువంశ మంతయు నకాల మృత్యువు పాలు అయి యుండెడిది. లోకమునందు నీకు నిందయు కలిగి యుండెడిది.

'రాజా! లోకపాలుర యధికారమును దాటి, ఏ వస్తువు ఉండును? అందు చేతనే అర్జునుడు ఇంద్రకీలపర్వతమునందు లోకపాలకులతో కలిసి, వారినుండి అస్త్రములను పొంది భూలోక-భువర్లోకములను దాటి స్వర్గమును చూచుటకు పోయెను. అర్జునుడు లోకపాలకులచేత గౌరవింప బడియు, ఈవిధముగా కష్టములు అనుభవించు చున్నా డనగా, దైవబలముముందు మానవుని పౌరుషము ఏమాత్రము పనికిరా దని నిస్సందేహముగా చెప్ప వచ్చును.

'రాజా! ఈ శౌర్యాదిగుణములు పూర్వకర్మ ననుసరించి వచ్చును. ప్రాణులకు ఇప్పుడు ఏర్పడు చున్న యున్నతి - అవనతి ఈ - రెండున్ను అనిత్యములే. ఇది యంతయు విచారించి యే బలిచక్రవర్తి, కర్మను దాట జాలక, ఈ విషయము నందు దైవమే కారణము, మరియొకటి కా దని నిశ్చయించుకొనెను.

'కన్నులు చెవులు - ముక్కులు- చర్మము-నాలుక- ఈ యైదు జ్ఞానేంద్రియములు, వానికి ఆకర్షక విషయము లైన రూప-శ్రవణ-ఘ్రాణ-స్పర్శ-రసములను అనుభవించుటకు ఆవేశపడు చుండును విషయముల యందు ఆశయే లేకున్నచో నింద్రియములు తమంతనే తాము ప్రశాంతిని పొందును.

'అన్నిటికిని తృష్ణయే మూలము కనుక, మనుష్యుడు బాధ, దుఃఖమున్ను లేనివా డై, ఆశలను నివారించుటకు ఇంద్రియములను తన వశమునందు ఉంచుకొన వలెను. పురుషుడు ప్రయత్నించి కర్మలను చక్కగా చేసినచో, వాని నుండి మంచి ఫలములు కలుగును. ఎ ట్లనగా, 'తల్లి-దండ్రులు కన్న బిడ్డలను భోజనాదులచే చక్కగా పోషించినచో ఆ పిల్లలు బాగుగా వృద్ధి చెందెదరు గదా!' అని లోకములో చాల మంది యభిప్రాయము. కాని, అది సరి కాదు. ఈ విషయములో దైవమే ప్రధాన మని నా విశ్వాసము. రాజా! లోకములో ప్రియాప్రియములు - సుఖ దుఃఖములు నిందా - ప్రశంసలు ప్రాప్తించుచునే యుండును. మంచిపనులు చేయువారిని ప్రశంసించెదరు చెడుపనులు చేయు వారిని నిందించెదరు.

'ధృతరాష్ట్ర మహారాజా! నీవు భరత వంశము నందు విరోధమును వ్యాపింప జేయు చున్నావు. కనుక నేను నిన్ను నిందించెదను. ఎందు కనగా, కౌరవ పాండవ విరోధము వలన నిశ్చయముగా సమస్త ప్రజానాశనము కలుగును. కనుక, నీవు నేను చెప్పినట్లు చేయకుండిన యెడ, నీ యపరాధము మూలముగా, అర్జునుడు సమస్త కౌరవ వంశమును- అగ్ని గడ్డివామిని దహించు నట్లు- దహించును.

'రాజా! ప్రపంచంలో విచ్చలవిడిగా దిరుగు చున్న 'పుత్రుని ప్రశంసించుచు అతనికి వశుడ వై జూద మాడునప్పుడు అతనిని పొగడితివి. రాజ్యలోభమును విడిచి శాంతుడవుగా నుండలేక పోయితివి. నీవు చేసిన ఆయపరాధమున కిప్పుడు భయంకర మైన పరిణామమును ప్రత్యక్షముగా చూచెదవుగాక! రాజా! ఆప్తులు కాని వారిని దగ్గర చేర్చుకొని, ఆప్తులను దూరము చేసి దండించితివి. ఈ కారణము చేత నీ మనస్సు దుర్బల మైనది. అందువలన నీవు ఈయనంత భూమండలమును రక్షించుటకు సమర్థుడవు కా కున్నావు.

రాజా! నేను ఇప్పుడే ఉపప్లవ్య నగరము నుండి వచ్చితిని, రథవేగము వలన నా శరీరము మిక్కిలి అదురుట చేత చాల అలసి యున్నాను. నీవు ఆజ్ఞ యిచ్చినచో పోయి నిద్రించెదను. రేపు ఉదయము సభలో కౌరవు లందరు చేరి యున్నప్పుడు యుధిష్ఠిరుడు నాతో చెప్పి పంపిన మాటలు అందరు వినగా చెప్పెదను.''

"ఆ మాటకు ధృతరాష్ట్రుడు సంజయునితో ని ట్లనెను:

''సంజయా! నీ మాటకు సమ్మతించితిని. నీకు ఆజ్ఞ యిచ్చితిని. నీవు ఇంటికి పోయి శయనించుము. ప్రాతఃకాలమునందు సభామధ్యమునందు కౌరవు లందరు నొకచోట చేరి, ధర్మరాజు పంపిన సందేశమును నీ ముఖమునుండి విన గలరు.'

"జనమేజయా! యిట్లు చెప్పి ధృతరాష్ట్రుడు సంజయుని పంపెను.

సంజయయానపర్వము సమాప్తము.

ప్రజాగరపర్వము

ధృతరాష్ట్ర - విదురుల సంవాదము

"జనమేజయా! అట్లు ధృతరాష్ట్రుడు సంజయుని పంపిన తరువాత ద్వారపాలకునితో 'విదురుని చూడ గోరు చున్నాను. అతనిని తోడ్కొని రమ్ము' అని చెప్పెను. వెంటనే ద్వారపాలకుడు విదురుని కడకు పోయి 'మహాత్మా! ధృతరాష్ట్ర మహారాజు నిన్ను ఇప్పుడే చూడ గోరు చున్నాడు,' అని చెప్పగనే విదురుడు రాజభవనమునకు పోయి, తాను వచ్చిన సంగతి ద్వారపాలకునిద్వారా లోపలికి చెప్పి పంపెను. ద్వారపాలకుడు లోనికి పోయి ధృతరాష్ట్రునితో ని ట్లనెను:

'మహారాజా! విదురుడు వచ్చి ద్వారమునందు నిలిచి యున్నాడు. నీ పాద దర్శనము చేయ గోరు చున్నాడు.'

అప్పుడు ధృతరాష్ట్రుడు 'నా యింటిలోకి వచ్చుటకు విదురునకు ఎప్పుడు గూడ నెలాటి యాటంకమున్ను లేదు. వెంటనే ప్రవేశపెట్టుము' అని యనెను.

"ఇట్లు ధృతరాష్ట్రుడు అజ్ఞ యిచ్చినతోడనే ద్వారపాలకుడు ద్వారము యొద్ద నిలిచి యున్న విదురునితో 'మహాత్మా! నీవు రాజదర్శనము చేయుటకు ఎప్పు డైనను రావచ్చును. ఏ యాటంకము నీకులేదు' అని మహారాజు అనెను. కనుక వెంటనే లోపలికి పొమ్ము' అని పంపెను.

''అంతట విదురుడు లోపలికి పోయి, అక్కడ మిక్కిలి చింతతో నున్న రాజును చూచి యి ట్లనెను :

'రాజా! నేను విదురుడను. మీ యాజ్ఞచే వచ్చినాను. నేను చేయ వలసిన పని యే మైన ఉన్నచో నాజ్ఞాపింపుము.'

''ఆమాట విని ధృతరాష్ట్రుడు ఇ ట్లనెను :

'విదురా! సంజయుడు వచ్చి నన్ను నిందించి పోయెను యుధిష్ఠిరుని సందేశము నతడు రేపు సభామధ్యమునందు చెప్ప గలడు. అజాతశత్రుడు చెప్పి

పంపిన మాటలు నాకు నేడు తెలియలేదు. అందుచేత నిప్పుడు నా శరీరము మనస్సు తపించు చున్నవి. నిద్ర రా కున్నది. ఇట్లు మేల్కొని యున్న నాకు ఇప్పుడు ఏది శ్రేయస్సో చెప్పుము. నీవు ధర్మార్థ కుశలుడవు. ఈ నా సంకటమును నీవే తీర్చగలవు.'

'సంజయుడు పాండవుల యొద్దనుండి వచ్చినప్పటినుండి, నామనస్సునకు శాంతి లభింప కున్నది. నాయింద్రియము లన్నియు వికలము లై యున్నవి. రేపు సంజయుడు సభలో నేమి చెప్పునో యను విషయమును గూర్చి యిపుడు నా మనస్సు చింతతో మిక్కిలి బాధపడు చున్నది.'

"ధృతరాష్ట్రుని మాటలు విని విదురు డిట్లనెను:

'రాజా! బలవంతునితో విరోధము కలిగిన వానికి, సాధనము లన్నియు పోయి దుర్బలు డైన వానికి, సర్వస్వము పోగొట్టుకొనిన వానికి, కాముకునకు, చోరునకున్ను రాత్రి నిద్ర రాదు. రాజా! ఈ మహాదోషములు నిన్ను అంటుకొనెనా? లేక పరధనముల యందు ఆశపడు చున్నావా? ఈ కారణముల చేత పరితపించుట లేదు కదా?'

"ఈ మాటలు విని ధృతరాష్ట్రుడు విదురునితో నిట్లనెను:

'ఆర్యా! ధర్మయుక్తములు, శ్రేయస్కరములు నైన నీ మాట లిపుడు విన గోరు చున్నాను. ఈ రాజర్షి వంశమునందు నీ వొక్కడవే విద్వాంసులకు మాననీయుడవు.'

"అప్పుడు విదురుడు ధృతరాష్ట్రునకు ఈ విధముగా నీతిని ఉపదేశించెను :

విదుర నీతి

'మహారాజా! యుధిష్ఠిరుడు రాజ లక్షణ శోభితుడు. నీ యాజ్ఞను శిరసా వహించుచు కార్యములు నెరవేర్చువాడు, మూడు లోకములకున్ను రాజు-కా దగినవాడు, అట్టివానిని అన్యాయముగా నీవు అడవికి పంపితివి. రాజా! నీవు సకల ధర్మ విదుడవు. అయినను, నీ కన్నుల తేజస్సు లోపించుటచేత పాండవులను తెలుసుకొన లే కున్నావు. ఇందు చేతనే యింత వైపరీత్యము గలిగినది. వారి రాజ్యభాగమును వారికి ఇచ్చుటకు సమ్మతించ జాల కున్నావు. కర్ణ - శకుని - దుశ్శాసన - దుర్యోధనుల యందు నీవు రాజ్య భారమును ఉంచితివి. ఇట్టి నీకు శ్రేయస్సు కలుగు టెట్లు?

పండిత లక్షణము

'తన స్వరూప జ్ఞానము - మంచి ప్రయత్నము - దుఃఖమును సహించు శక్తి - ధర్మపాలనమునందు స్థైర్యము - ఈ గుణము లున్న మనుష్యుడు పురుషార్థములను పొంద గలడు. అవి వానిని వీడి పోవు. అట్టివాడే, పండితు డనిపించుకొనును. మంచి కర్మలను సేవించువాడు. నిందితకర్మలను విడుచువాడు, నాస్తికుడు కానివాడు, శ్రద్ధకలవాడు, కోప - సంతోష - గర్వ - లజ్జా - ఉద్ధతత్వములు, తనను పూజ్యుడుగా తలచుట - ఈ గుణములు ఎవనిని పురుషార్థములనుండి దూరము చేయవో, యతడు పండితుడు. ఎవని కృత్యమును మంత్రాలోచనమున్ను ఇతరులు తెలిసికొనక, అతని కార్యమును మాత్రమే తెలిసికొనెదరో, అతడు, ఎవని శీతోష్ణ-భయ-ప్రేమ సంపదాపదలను ఇతరులు తెలిసికోన జాలరో, అతడు, ఎవని లౌకికబుద్ధి ధర్మార్థములనే అనుసరించుచుండునో, ఎవడు సుఖ-భోగములను విడిచి పురుషార్థములనే కోరుచుండునో యతడున్ను పండితు డనిపించుకొనును.

'రాజా! వివేకము గల పురుషుడు తన శక్తిననుసరించి పని చేయును. ఏ వస్తువునుగూడ తుచ్ఛముగా తలచి, నిర్లక్ష్యము చేసి, అవమానము పాలు చేయడు. అట్టివాడే పండితుడు. ఏ విషయమును నైనను, చిరకాలము వరకు వినుచుండి బాగుగా విచారించి, త్వరగా దాని తత్త్వమును గ్రహించి, కర్తవ్య బుద్ధితో పురుషార్థములందు ప్రవృత్తి గలిగి, దానిని కామనా రహితముగా సేవించువాడు పండితుడు. అతడు, తనను ఇతరులు అడుగనిదే వారి విషయమునందు ప్రవృత్తి (జోక్యము) కలిగించుకొని, ఏ మాటయు వ్యర్థముగా చెప్పడు. ఇట్టి స్వభావము గలవానిని పండితుడుగా నిశ్చయించ వలెను.

'రాజా! పండిత బుద్ధి గలవారు. తాము పొంద దగని వస్తువును పొందగోరరు. నష్ట మైన దానిని గూర్చి శోకింపరు. ఆపదలలో మోహము చెందరు. మొదటనే బాగుగా విచారించి పని చేయుటకు ఆరంభించెదరు. కార్యమధ్యమునందు దానిని విడువరు. సమయమును వ్యర్థము చేయరు. మనసును తమ యధీనమునందు ఉంచుకొనెదరు పండితులు మంచి కర్మలు చేయుటయందు ఆసక్తి కలవారై ఉందురు. అభివృద్ధికర కార్యములు చేసెదరు. తమకు మేలు చేయువారి యందు దోషము లెంచరు. తమకు సమ్మానము జరిగినప్పుడు సంతోషముతో

నుప్పొంగరు. అవమానము కలిగినప్పుడు పరితపించరు గంగా నదిలోని గుంటవలె క్షోభ చెంద కుందురు. సర్వభూతముల తత్త్వమును, అన్ని కార్యములను చేయు పద్ధతి, అందరికంటెను నెక్కువ ఉపాయములనున్ను నెరిగినవాడు పండితు డనిపించుకొనును.

'ధారావాహికముగా మాట్లాడువాడు, విచిత్రముగా మాట్లాడ నేర్చినవాడు, తర్కించుటలో నిపుణుడు, ప్రతిభ (సమయానుసారముగా నెప్పటి కప్పుడు ఉపాయములు తోచు బుద్ధి) గలవాడు, గ్రంథములోని తాత్పర్యమును త్వరగా చెప్ప గలవాడున్ను పండితు డన బడును.

'ఎవని శాస్త్రవిద్య బుద్ధి ననుసరించి సాగునో, బుద్ధి విద్య ననుసరించి ప్రసరించునో, ఎవడు శిష్ట పురుషులు ఏర్పరచిన నియమములను ఉల్లంఘించకుండ నడచుకొనునో, అట్టివాడు పండితుడు అను పేరు ప్రఖ్యాతియు పొందును. బహుళముగా ధనము, విద్య, ఐశ్వర్యమున్ను పొందికూడ ఉద్ధతుడుగా వ్యవహరించనివాడు పండితు డనిపించుకొనును.

మూర్ఖ లక్షణము

'రాజా! చదువు నేర్వకున్నను గర్వపడువాడు, దరిద్రు డై యుండియు పెద్ద పెద్ద కోర్కెలు గలవాడు, ఏ పని చేయకుండ ధనము కోరువాడు, తన కర్తవ్యమును విడిచి యితరుల కర్తవ్యములను చేయువాడు, మిత్రునితో అసత్యముగా వ్యవహరించువాడు, తనను ఇష్టపడువారిని విడిచి, యిష్టపడని వారిని కోరువాడు, తనకన్న బలవంతుని ద్వేషించువాడు—

'శత్రువును మిత్రునిగా, మిత్రుని శత్రువునుగాను చూచువాడు, దుష్టకర్మ చేయువాడు, తన కర్మలను నిరుపయోగముగా పెంచువాడు, అన్ని విషయముల యందు సందేహించువాడు, శీఘ్రముగా నగు పనులుగూడ విలంబముగా చేయువాడు, తలిదండ్రులకు శ్రాద్ధాదులు చేయనివాడు, దేవపూజ చేయనివాడు, మంచి మిత్రులతో చేరనివాడు, పిలువ బడకయే ఒక యింటిలో దూరువాడు—

'అడుగ బడకయే అధికముగా మాట్లాడువాడు, నమ్మ దగని వానిని నమ్మువాడు, తాను దోషి యైకూడ తన దోషమును ఇతరులపై పడ వేయువాడు, తాను అసమర్థు డయియు వ్యర్థముగా కోపపడువాడు, తన శక్తిని తెలిసికొన

కుండ, ఏ పనియు చేయక ధర్మార్థ విహీనము - అలభ్యము నైన వస్తువును కోరువాడు, తనకు శిష్యుడు కాని వానిని శాసించువాడు, శూన్యమును ఉపాసించు వాడు, నీచుని ఆశ్రయించు వాడు" - ఇట్టివానిని పండితులు మూర్ఖునిగా భావించెదరు.

సాధారణ నీతులు

'తాను పోషించవలసిన వ్యక్తులకు పంచి యీయక తా నొక్కడే మంచి భోజనము చేయుచు, మంచి వస్త్రములను ధరించుచు నున్న వానికంటె, క్రూరు డెవడు ఉండును? మనుష్యు డొక్కడే పాపములు చేసి ధనము సంపాదించును. ఆ ధనమును అనేకులు అనుభవించెదరు. ఆ పాపదోషము ఆ ధనమును అనుభవించువారిని చెందదు. అది ఆ దోషము చేసినవానినే పొందును.

'ధనుర్ధరుడు విడిచిన బాణము ఒకనిని చంపును. లేదా, తప్పిపోవును. కాని, బుద్ధిమంతుడు ప్రయోగించిన బుద్ధి రాజుతోపాటు అతని రాష్ట్రమునే నశింప జేయును.

'రాజా! ఒకదాని (బుద్ధి)చేత రెండు (కర్తవ్యము - అకర్తవ్యము) నిశ్చయించి, నాలుగు (సామ-దాన - భేద - దండములు - ఈ చతురుపాయములతో) మూడు (శత్రు - మిత్ర - ఉదాసీనులను) వశపరచుకొనుము.

'అయిదు (కన్ను - ముక్కు - చెవి - చర్మము - నాలుక) ఈ పంచ జ్ఞానేంద్రియములను జయించి, ఆరు (సంధి- విగ్రహ . యాన - ఆసన - ద్వైధీభావ - సమాశ్రయములు అను షడ్ గుణములు) తెలిసికొని, ఏడు (స్త్రీ - జూదము - వేట - మద్యము - కఠిన వచనము- కఠిన దండనము - అన్యాయము చేత ధనోపార్జనము - ఈ సప్తవ్యసనములను) విడిచి మనుష్యుడు సుఖపడును.

'రాజా! విషరసము - శస్త్రమున్ను ఒకనినే చంపును. కాని, రహస్య మంత్రాలోచనము వలన కలుగు విప్లవము రాజ్యముతో, ప్రజలతో పాటున్ను రాజును హత మార్చును. రుచికర పదార్థములను ఒక్కడే భుజించ గూడదు. ఏ విషయ మైనను ఒక్కడే విచారించుకొని నిశ్చయించగూడదు. ఒక్కడే త్రోవ నడవ గూడదు. అందరు నిద్రించు చుండగా నొక్కడు మేల్కొని యుండ గూడదు. రాజా! సముద్రము దాటుటకు నౌక మాత్రమే సాధన మగు

నట్లుగా, స్వర్గ ప్రాప్తికి సత్య మొక్కటే సోపానము (మెట్టు) అగును. రెండవది యేదియు కా జాలదు. కాని ఇది నీ వెరుగవు.

క్షమాగుణము

'ఓర్పుగల వారిపైన అసామర్థ్య దోషము తప్ప మరియొక దోష మేదియు జనులు ఆరోపించుటకు వీలు కాదు. అది యతని దోషముగా తలచ గూడదు. ఓర్పే మానవునికి శ్రేష్ఠ మైన బలము. అసమర్థులకు ఓర్పు గుణ మయితే, సమర్థులకు భూషణ మగును. ప్రపంచము నందు క్షమ ఓర్పు యనునది వశీకరణ శక్తిగా భావించవలెను. క్షమచేత సాధింప రాని దేదియు లేదు. ఎవని చేతిలో శాంతి యనెడు ఖడ్గము ఉండునో యతనిని దుర్జనుడేమి చేయగలడు? ఎండు గడ్డి లేనిచోట పడిన అగ్ని స్వయముగానే ఆరిపోవును. క్షమారహితుడు తనతో పాటు ఇతరులను గూడ దోష భాజనులను జేయును.

'ఒక్క ధర్మమే శ్రేయస్సును కలిగించును. ఒక్క క్షమయే ఉత్తమశాంతి. ఒక్క విద్యయే పరమ తృప్తి. ఒక్క అహింసయే సుఖకరము.

'ధృతరాష్ట్ర మహారాజా! కర్మముల నాచరించని గృహస్థుడు, కర్మాచరణము చేయు సన్యాసియు లోకమునందు అధమ పురుషులు.

'శత్రువులను విరోధించని రాజును, ఇతర దేశయాత్రలు చేయని బ్రాహ్మణునిన్ని, బిలములో నున్న జంతువులను సర్పము తినినట్లు, భూమి మ్రింగును.

'పరుష వాక్యములను పలుకుట, అసత్పురుషులను అర్చించుటయు చేయని వాడే లోకమునందు ప్రకాశమాను డగును.

'తమను కామించు పురుషుని గోరు స్త్రీలను, తమను సమ్మానించువానిని పూజించు పురుషులనున్ను నమ్మ వచ్చును.

'కోరికలను పెంచుకొను ధనహీనుడు - కోపమును పెంచుకొను శక్తి హీనుడున్ను శరీరమును శోషింప జేయు పదు నైన కంటకములు (ముండ్లు) అని యెరుగ వలెను.

'రాజా! సమర్థు డైయుండియు నోర్పు వహించినవాడు దరిద్రు డయియు దానము చేయువాడున్ను స్వర్గము కన్నను పైస్థానమును పొందెదరు.

'న్యాయ మార్గములో సంపాదింప బడిన ద్రవ్యమునకు రెండే దురుపయోములు: ఒకటి అయోగ్యులకు దానము చేయుట; రెండవది - యోగ్యులకు దానము చేయకుండుట యని తెలియ వలెను.

'దానము చేయని ధనవంతుని - కష్టము సహించని దరిద్రునిన్ని దృఢమైన శిలను మెడకు కట్టి నీటిలో ముంచ వలెను.

'యోగాభ్యాసము చేసిన సన్యాసి, యుద్ధమునందు శత్రువుల నెదుర్కొని చచ్చువాడున్ను సూర్యమండలమును ఛేదించుకొని ఊర్ధ్వలోకమునకు పోయెదరు.

'రాజా! ఉత్తమ - మధ్యమ - అధమములు అను మూడు న్యాయములు మనుష్యులకు ఉన్న వని వేదవిదులు చెప్పెదరు. కనుక, ఈ మూడు విధములైన పనులను యథాయోగ్యముగా అనుత్తమ - మధ్యమ - అధమ పురుషులకు అప్పగించ వలెను.

'రాజా! భార్య, సుతుడు, దాసుడు' ఈ ముగ్గురు సంపాదించిన ధనమునకు అధికారి భర్త - తండ్రి - యజమానుడు నగుదురు కాని అ ధనముపైన అధికారము ఆ భార్యాదులకు ఉండదు.

'పరధనమును అపహరించుట, పరుల భార్యను పొందుట, మిత్రులను విడుచుట, ఈ మూడు దోషములు నాశమునకు కారణము లగును

'కామ - క్రోధ -లోభములు అను నీ మూడు నరకమునకు ద్వారములు. కనుక, ఈ మూడింటిని విడువ వలెను

వరమును పొందుట - రాజ్యలాభము - పుత్రజన్మ'' ఈ మూడు ఒక యెత్తు, శత్రువును కష్టమునుండి విడిపించుట ఒక యెత్తు. అ మూడును - ఈ ఒక్కటితో సమానములు.

'భక్తుడు - సేవకుడు - 'నీ వాడనే, నాకు అన్యథా శరణము లేదు' అను వాడు - ఈ ముగ్గురు శరణు వేడినప్పుడు, ఎన్ని సంకటములు ప్రాప్తించినను వారిని విడువ గూడదు.

''మహారాజా! 'అల్పబుద్ధి గల వారితో - విలంబముగా కార్యము చేయు వారితో - తొందరపాటు గలవారితో - స్తోత్రపాఠకులతోను' రహస్యమంత్రాలోచనము చేయ గూడదు. ఈ నలుగురిని బలవంతు డైన రాజు విడువ వలెను. పండితుడు ఇట్టివారిని తెలిసికొని మెలగ వలెను.

''రాజా! గృహస్థధర్మమునం దున్న నీయొక్క సంపన్న గృహమునందు నాలుగు విధము లైన వారు సర్వదా ఉండ వలెను. ఎవ రనగా, కుటుంబ వృద్ధుడు - సంకటములలో చిక్కుబడిన సత్కులీనుడు - ధనహీను డైన మిత్రుడు - సంతతిలేని సోదరి.

''రాజా! ఇంద్రుడు బృహస్పతిని సద్యస్కాలములో ఫలజనకము లేవి యని యడిగినప్పుడు బృహస్పతి - 'దేవతల సంకల్పము - బుద్ధిమంతుల ప్రభావము - విద్వాంసుల వినయము - పాప కర్మ చేసిన వారి వినాశము - ఈ నాలుగు తత్ క్షణమునందే ఫలము నిచ్చును' అని చెప్పెను. ఇంకను బృహస్పతి, భయమును పోగొట్టు కర్మలు గూడ నాలు గున్న వని వానిట్లు చెప్పెను:

''అగ్నిహోత్ర కర్మ చేయుట - మౌనపాలనము - వేదాధ్యయనము - యజ్ఞానుష్ఠానము' ఈ నాలుగు కర్మలు శ్రద్ధతో చేయ వలెను. అవియే సరిగా చేయనిచో భయమును కలిగించును.

''మహారాజా! తల్లి-తండ్రి-అగ్ని-ఆత్మ-గురువు' ఈ యైదుగురు పంచాగ్నులన బడుదురు. ఈ యైదుగురిని మిక్కిలి శ్రద్ధతో సేవించ వలెను. 'దేవతలు-పితరులు-మనుష్యులు-సన్యాసులు-అతిథులు'-ఈ యైదుగురిని పూజించినవారికి యశస్సు కలుగును.

''నీవు పోవుచోట్లనెల్ల 'మిత్రులు-శత్రువులు-మధ్యస్థులు(ఉదాసీనులు)-నీకు ఆశ్రయ మిచ్చువారు-నీచేత ఆశ్రయము పొందినవారు'-ఈయైదుగురు నిన్ను అనుసరించు చుండెదరు (మనుష్యుడు ఎక్కడికి పోయి ఉన్నను ఈ అయిదు విధము లైనవారు అతనికి ఏర్పడెదరు అని భావము).

''పురుషునకుగల అయిదు జ్ఞానేంద్రియములతో ఏయొక్కటి లోపించినను దానినుండి అతని బుద్ధి రంధ్రము గల తోలుతిత్తినుండి నీరువలె బయటకు పోవును.

"మహారాజా! అభివృద్ధిని గోరువాడు 'నిద్ర-తూగుట-భయము-క్రోధము సోమరితనము-త్వరగా అగుపనిని విలంబముగా చేయుట' ఈ యారింటిని విడువ వలెను.

''ఉపదేశము చేయనిఆచార్యుడు-అధ్యయనము చేయనిఋత్విజుడు-రక్షించని రాజు-ప్రియముగా మాట్లాడని భార్య-గ్రామమునందు ఉండగోరు గొల్లవాడు-వనమునందు నివసించ గోరు మంగలివాడు - ఈఆరుగురిని, సముద్రమునందు రంధ్రము పడిన నావనువలె, విడువ వలెను,

"సత్యము-దానము-జాగరూకత-అసూయ లే కుండుట-ఓర్పు-ధైర్యము-ఈ యారు గుణములను పురుషు డెప్పుడుగూడ విడువ గూడదు.

"రాజా! ధనప్రాప్తి-సర్వదా ఆరోగ్యము-ప్రియభార్య-తన వంశమునందు ఉన్న పుత్రుడు-ధన సంపాదన కలిగించు విద్య-ఈ యారున్ను మనుష్యునకు సుఖము కలిగించును.

"మనస్సునందు సర్వదా ఉన్నట్టి 'కామ క్రోధ-లోభ-మోహ-మద-మాత్సర్యములు' అను ఆరు అంతఃశత్రువులను వశమునందు ఉంచుకొనిన జితేంద్రియునకు పాపము అంటదు. వానివలన అనర్థములు కలుగనే కలుగవు.

"ఏమరుపాటు గలవానివలన చోరులు-రోగులవలన వైద్యులు-కాముకుల వలన కామోన్మత్తస్త్రీలు-యజమానునివలన యాజకులు (పురోహితులు)-జగడమాడువారివలన రాజులు-మూర్ఖులవలన విద్వాంసులున్ను - ఈ యారుగురివలన ఆ యారుగురు జీవింతురు.

"గోవులు- సేవకవృత్తి-కృషికర్మ-భార్య-విద్య-శూద్రులసాంగత్యము" ఈ యారున్ను ఒక్కముహూర్తకాలముగూడ జాగ్రత్తతో చూడ కుండిన నశించ గలవు. (ముహూర్త మనగా రెండు గడియలకాలము. ఒక్కొక్కగడియకు 24 నిమిషముల కాలము.)

"తనకు పూర్వము ఉపకారము చేసిన గురువును శిష్యులు, పెండ్లి చేసికొనిన తరువాత తల్లిని కొడుకుకామేచ్ఛ తగ్గినవారు భార్యను,తనఅవసరము తీరిన తరువాత ఉపకారిని, నదీప్రవాహము దాటిన తరువాత నావను, ఆరోగ్యము కలిగిన తరువాత వైద్యుని-ఈ యారుగురిని ఉపకారము పొందిన ఆరుగురు అవమాన పరచెదరు.

"రాజా! ఆరోగ్యము - అప్పులపాలు గా కుండుట - పరదేశవాసము లే కుండుట-సజ్జన సాంగత్యము-తన కులవృత్తిలో జీవనము చేయుట-నిర్భయముగా నుండుట-ఈయారున్ను మనుష్యునకు సుఖము నిచ్చును.

"ఈర్ష్యా-అసూయ-అసంతుష్టి-క్రోధము-అడుగడుగున సందేహము-ఇతరుల భాగ్యమువలన జీవనము గడుపుట- ఈయారు గలవారు సర్వదా దుఃఖమును అనుభవించు చుందురు.

"రాజా! స్త్రీలయందు ఆసక్తి-జూదము-వేట-మద్యపానము-కటువుగా మాట్లాడుట-అతికఠినమైన దండనము నిచ్చుట-ధనమును దురుపయోగపరచుట-ఈ యేడు వ్యసనములు గొప్ప దోషములు. రాజులు ఈ సప్త వ్యసనములను విడువ వలెను. వీనివలన రాజు ఎంత సాధన సంపత్తి-రాజ్యమూలములున్ను గలవా డైనను తరచుగా నశించును.

"రాజా! బ్రాహ్మణులను ద్వేషించుట-వారిచేత విరోధింప బడుట-బ్రాహ్మణుల ధనమును అపహరించుట-వారిని చంపగోరుట-బ్రాహ్మణ నిందచేత ఆనందించుట-వారి ప్రశంసను అభినందించ కుండుట-యజ్ఞాది కృత్యములయందు బ్రాహ్మణులను స్మరింప కుండుట-వారు యాచించినప్పుడు వారియెడల దోషారోపణము చేయుట- ఈ ఎనిమిది దోషములు వినాశనమును పొంద బోవువానికి పూర్వమే తోచు నిమిత్తములు (చిహ్నములు). బుద్ధిమంతుడు ఈ ఎనిమిది దోషములను తెలిసికొని విడువ వలెను.

"మిత్ర సమాగమము-అధిక ధనప్రాప్తి-పుత్రాలింగనము-మైథునము-సమయము వచ్చినప్పుడు ప్రియముగా మాట్లాడుట-తన సాటివారిలో ఉన్నతి-తాను కోరిన వస్తువు లభించుట-జనసమాజములో సమ్మానము ఈ యెనిమిది సంతోషమును కలిగించునవి. ఇవియే తన లౌకిక సుఖమునకు సాధనములుగా నుండును.

"బుద్ధి-సత్కులజననము-ఇంద్రియనిగ్రహము-శాస్త్రజ్ఞానము-పరాక్రమము-మితముగా మాట్లాడుట-శక్తి ననుసరించి దానము చేయుట-కృతజ్ఞత- ఈ యెనిమిది గుణములు పురుషునకు ఖ్యాతి తెచ్చును.

''రాజా! కన్నులు 2 - ముక్కులు 2 - చెవులు 2 - నోరు 1 - మూత్రస్థానము 1 - గుదస్థానము 1, ఈ తొమ్మిది ద్వారములుగా, 'సత్త్వ-రజస్-తమస్' అను మూడు గుణములు స్తంభములుగా, 'ముక్కు-కన్ను-చెవి-చర్మము-జిహ్వ'

ఈ అయిదు జ్ఞానేంద్రియములే సాక్షులుగాను నున్న యీ శరీరము అనెడు గృహమును వాస్తవముగా తెలిసికొనిన ఆత్మజ్ఞాన సంపన్నుడగు పండితుడు చాల గొప్ప జ్ఞాని యన బడును.

''ధృతరాష్ట్ర మహారాజా! పది విధములుగా నున్న ధర్మముయొక్క స్వరూపమును తెలిసికొనిన వారలు లేరు. వాని స్వరూపమును తెలిపెద వినుము:

1. మద్యపానము, 2. ఏమరుపాటు, 3. పిచ్చి, 4. అలసి ఉండుట, 5. క్రోధము, 6. ఆకలి, 7. తొందరపాటు, 8. లోభము, 9. భయము, 10. కామము - ఈ పది దుర్గుణములు చాల అపాయకరములు గనుక, పండితుడైన వాడు ఈ పదింటియందు ఆసక్తి పడ గూడదు. ఈ విషయములోనే రాక్షసరాజు ప్రహ్లాదుడు సుధన్వునితో తన పుత్రుని గూర్చి ఉపదేశవాక్యములు చెప్పెను. నీతి శాస్త్రకోవిదులు ఆ యితిహాసమును ఉదాహరణముగా ఈ విషయములో చెప్పెదురు.

''కామ - క్రోధములను విడుచువాడు, సత్పాత్ర దానము చేయువాడు, విశేష విషయములు తెలిసినవాడు - శాస్త్ర పండితుడు - తాను చేయవలసిన పని త్వరగా చేయువాడునైన రాజు చెప్పెడు మాటలను, అతని ప్రవర్తననున్ను ప్రజలు ప్రమాణముగా తీసికొనెదరు.

"మనుష్యులకు విశ్వాసము కలిగింప దెలిసినవాడు - అపరాధము రుజువైన తరువాత అపరాధిని దండించువాడు - దండనము విధించుటలో హెచ్చు తగ్గులను తెలిసి క్షమించ దగినవారిని క్షమించువాడునైన రాజునకు సమస్త రాజ్య సంపదలు చేకూరును.

"దుర్బలుని అవమానపరచనివాడు - ఎల్లప్పుడును జాగరూకతతో ఏమరుపాటు లేకుండ వ్యవహరించువాడు - బలవంతులతో యుద్ధమును కోరనివాడు- సమయము వచ్చినప్పుడు తన పరాక్రమమును చూపువాడునైన వ్యక్తి ధైర్యశాలి యనిపించుకొనును.

"ఆపదలను పొందియు బాధపడనివాడు - అప్రమత్తుడై ఆపదలను తొలగించుకొనుటకు ప్రయత్నములు చేయువాడు - దుఃఖము గలిగినప్పుడు ఓర్చుకొనువాడునైన మహాత్మునకు శత్రువులు లొంగియుందురు.

"వ్యర్థముగా ఇల్లు విడిచి దేశాంతరము పోవుట - పాపుల సంగతిలో నుండుట - పరస్త్రీ సంగమము చేయుట - దంభాచారము - దొంగతనము - కొండెములు చెప్పుట - మద్యపానము - ఈ దురభ్యాసములు లేనివాడు సర్వదా సుఖముతో నుండును.

"రాజా! వేగిరపాటుతో 'ధర్మ-అర్థ కామములు' అను త్రివర్గమును ఆరంభించకుండుట - అడిగినప్పుడు సత్యము చెప్పుట - మిత్రులతో వివాదపడకుండుట-సన్మానించ లేదని కోపపడ కుండుట - అసూయపడ కుండుట - దయ గలిగి యుండుట - దుర్బలుడుగా నుండి యితరులకు పూచీపడ కుండుట - అతిగా మాట్లాడ కుండుట - వివాదమును ఓర్చుకొని యుండుట - ఈ సద్గుణములు గలవాడు అంతటను ప్రశంసాపాత్రుడగును.

"ఉద్దండ వేషము వేయ కుండుట - ఇతరుల యెదుట తన పౌరుషము వర్ణించుచు, ఆత్మస్తుతి చేయ కుండుట - క్రోధముచేత వ్యాకులుడయియు, కటు వచనములు పలుక కుండుట - ఈ మంచి గుణములు గల వానిని లోకులు ప్రీతితో చూచెదరు.

"శాంతించిన వైరమును మరల రెచ్చగొట్టుట - గర్వము హీనత్వము చూపుట - 'నేను ఆపదలో చిక్కుపడినాను,'అని అనుచిత కార్యములు చేయుట- ఈ దుర్గుణములు లేని పూజ్యుడు సర్వోత్తముడని ఆర్యులు ప్రశంసించెదరు.

"తనకు సుఖము కలిగినప్పుడు హర్షపడనివాడు - ఇతరులకు దుఃఖము సంభవించినపుడు హర్షించువాడు - దానము చేసిన తరువాత పరితపించనివాడు - ఇట్టి పూజ్య స్వభావములు గలవాడు సత్పురుషుడుగా పొగడ బడును.

"దేశాచారములను, సమయములను, జాతి ధర్మములనున్ను తెలిసినవాడు, ఉత్తమ - మధ్యమ - అధమ జ్ఞానమున్ను గల లోకజ్ఞుడు ఎక్కడికి పోయినను గొప్ప ప్రజా నాయకుడై యాధిపత్యము వహించును.

"దంభాచారము - మోహము - మాత్సర్యము - పాపకార్యము - రాజద్వేషము - కొండెములు చెప్పుట - సమాజ వైరము - మద్యపానమత్తులతో, పిచ్చి వారితో, దుర్జనులతోను వాదించుట- ఇవి విడిచిన ప్రాజ్ఞుడు శ్రేష్ఠుడుగా పూజింప బడును.

"రాజా! 'దానము - - హోమము - దేవ పూజ - మంగళ కార్యములు - తాను చేసిన దోషములకు ప్రాయశ్చిత్తము - వివిధ లౌకికాచారములు - ఈ కార్యములు సర్వదా చేయువానికి దేవతలు అన్ని అభ్యుదయములను చేకూర్చెదరు.

తనకు సమానులతో వివాహము - మైత్రి - వ్యవహారము-సంభాషణమున్ను చేయుచు, హీన పురుషులతో అవి చేయనివాడు గుణవంతులను ముందిడుకొనిన వాడు నైన విద్వాంసుడు- ఇట్టివారు అవలంబించు నీతియే నీతి యన బడును.

"తనను ఆశ్రయించిన వారికి అమితముగా భోజనము విభజించి యిచ్చుచు తాను మితముగా భుజించుట-అమితముగా పని చేయుచు మితముగా నిద్రించుట- శత్రువులుగూడ యాచించినచో వారికి ఇచ్చుట - ఈ సద్గుణములు గల మనస్వి యైన పురుషునకు ఏ యనర్థములుగూడ మూడవు.

"ఎవడు తనకు ఇష్టము లైన పనులు చేయుట గాని, యితరుల యిచ్ఛకు ప్రతికూలముగా పనులు చేయుట గాని, యితరు లెవరుగూడ తెలిసికొన కుండ చేయునో, యెవడు తన ఆలోచనమును గుప్తముగా ఉంచి, తాను కోరిన పనులు ఇతరు లెవరుకూడ తెలిసికొన కుండ చేయునో, అట్టివాడు చేయుపనులు బాగుగా నెరవేరును గనుక, ఆ పను లేవియు చెడిపోవు.

''సర్వ భూతములకు శాంతిని గూర్చుట యందు ఆసక్తుడు - సత్యవంతుడు - మృదు స్వభావము గలవాడు - ఇతరులను గౌరవించువాడు - పవిత్ర హృదయము గలవాడున్ను మంచి గనినుండి ఉత్పన్న మైన జాతిరత్నమువలె ప్రకాశవంతు డై, తన జాతి వారిలో ప్రసిద్ధు డగును.

"స్వయముగా లజ్జా స్వభావము గలవాడు ప్రజలలో శ్రేష్ఠు డగును. అతడు అనంత తేజస్సు - పవిత్ర హృదయము - ఏకాగ్ర మనస్సున్ను గలవా డగుట చేత ప్రపంచములో సూర్యుని వలె తేజరిల్లును.

"అంబికా నందనా! మృగరూపధారి యైన కిందమ ముని శాపము చేత దగ్ధు డైన పాండు రాజు యొక్క అయిదుగురు ఇంద్ర సమాను లైన పుత్రులు వనము నందు జన్మించిరి. అట్టివారిని నీవే నగరమునకు తెచ్చి, పెంచి, విద్యాబుద్ధులు నేర్పితివి. నీ యాజ్ఞను పాండవులు శిరసా వహించి పాలించు చున్నారు. కనుక, అట్టివారికి న్యాయముగా చెందవలసిన రాజ్య భాగమును ఇచ్చి నీవు నీ పుత్రులతోపాటు ఆనంద పూర్వకముగా జీవించుచు సుఖము అనుభవించుము,

రాజా! నీవు ఇట్లు చేసిన యెడల, దేవతలు మనుష్యులున్ను నిన్ను విమర్శించ కుండ నుండెదరు."

ఇట్లు నీతి బోధ చేసిన విదురునితో ధృతరాష్ట్రు డిట్లనెను:

ధృతరాష్ట్రునకు విదురుడు నీతులు చెప్పుట

''నాయనా! నేను చింతతో జ్వలించుచు నింత దాక జాగరణము చేయుచున్నాను. ఇప్పుడు నేను చేయదగిన పని చెప్పుము. మాలో నీవే ధర్మార్థ కుశలుడవు. నీవు బాగుగా బుద్ధిలో విచారము చేసి నాకు మంచి యుపదేశము చేయుము. యుధిష్ఠిరునకు, కౌరవులకున్ను శ్రేయస్కరము లైన మాటలన్నియు నవశ్యముగా చెప్పుము.

"విదురా! నా మనస్సు నందు అనిష్ట సూచనలు తోచు చున్నవి. అందుచేత నేను అంతటను అనిష్టమునే చూచు చున్నాను. కనుక, అజాత శత్రువు కోరు చున్న దేమో యది అంతయు చెప్పుము."

ఆ మాటకు విదురు డిట్లనెను:

"రాజా! తాను ఎవని పరాజయము కోరడో, అట్టివాడు తనను అడుగ కుండనే, అతనికి మంచి దేదో, చెడ్డ దేదో, శ్రేయస్కర మేదో, ముప్పు దెచ్చున దేదో చెప్పవలెను. కనుక, రాజా! కౌరవులకు హిత మేదో, శ్రేయస్కర మేదో, ధర్మయుక్త మైన దేదో ఆ మాట చెప్పెదను. సావధానముగా వినుము.

"అసత్యము లైన ఉపాయములు, యుద్ధ - ద్యూతాదులు, వాని ద్వారా కపటముగా సాధించిన కార్యములున్ను మంచివి కావు. అట్టి పనులందు రాజా, నీవు మనస్సు పెట్టకుము. అట్లే మంచి ఉపాయముల చేత జాగ్రత్తగా చేయబడిన పని యొక వేళ సిద్ధించ కున్నను, దాని వలన బుద్ధిమంతుడు గ్లాని చెంద గూడదు. ఒక ప్రయోజనము నుద్దేశించి చేయబడు పనులలో తొలుత ఆ ప్రయోజనము నెరవేరునా అని తెలిసికొన వలెను; బాగుగా విచారించ వలెను. తొందరపాటుతో ఏ పనిగూడ ఆరంభించ గూడదు.

"ధీరు డైనవాడు, పండితుడు తన కార్యము యొక్క ప్రయోజనమును' దానివలన కలుగు పరిణామమునున్ను బాగుగా యోచించి, ఆ కార్యము చేయుటయో, చేయకుండుటయో నిర్ణయించుకొన వలెను.

"స్థితి-లాభము-నాశనము-ధనాగారము-దేశము- దండనము - ఈ విషయముల స్వరూపము తెలియని రాజు తన రాజ్యము నందు స్థిరముగా నిలువ జాలడు. ఈ చెప్పబడిన వాని స్వరూప-ప్రమాణములను బాగుగా తెలిసికొని ధర్మార్థ జ్ఞానమునందు చిత్తము నుంచిన రాజు, రాజ్యమును పొంద గలడు.

"తనకు రాజ్యము లభించినది కదా అని సంతుష్టుడై అనుచితముగా వ్యవహరించ గూడదు అతని అవినయము వలన రాజ్య సంపద, ముసలితనము వలన రూపము వలె నశించును.

"మంచి ఆహార వస్తువు చే కప్ప బడిన యినుప గాలమును తెలియక చేప తిండి యందలి లోభము చేత, దాని పరిణామ మెరుగక మ్రింగును. అందు చేతనే ఆ చేప మరణించును. కనుక, తన అభివృద్ధిని గోరువారు, ఏ వస్తువు తినుటకు యోగ్యమో, ఏది తినగలమో. తినిన తరువాత జీర్ణ మై అది తమకు హితమును కూర్చునా యను విషయము లన్నియు తొలుత బాగుగా విచారించి, దాని పరిణామము నెరిగి ఆ వస్తువును తినవలెను.

"రాజా! చెట్టునందు పండని పండును కోసి తెచ్చినవాడు ఆ పండు రసమును ఆస్వాదించ జాలడు. అంతయే కాక, దాని బీజమును గూడ నశింప జేయును. సకాలములో పండిన పండును గ్రహించినవాడు, పండు యొక్క రసము పొందుటయే గాక, దాని బీజము నుండి మరియొక వృక్షము పుట్టి దండిగా పండ్లు పండుటకు గూడ తోడ్పడును.

"పూవును చెరచకుండా అందలి తేనెను మాత్రము తుమ్మెద గ్రహించు నట్లుగా, రాజు ప్రజలను హింసించకుండా వారినుండి ధనమును తీసి కొనవలెను. తోటమాలి తోట లోని పువ్వులను ఒకటొకటిగా చెట్టుయొక్క మూలమును ఛేదించకుండా, కోయునట్లు రాజు ప్రజలనుండి ధనమును గ్రహించవలెను. కాని, బొగ్గుల కొరకు చెట్టును మూలచ్ఛేదముగా బొగ్గులవాడు నరుకునట్లు, ప్రజల సంపత్తి నంతయు రాజు లాగుకొన గూడదు. ఈ పని చేయుట వలన నాకు ఏమి లాభము, చేయనిచో నేమి నష్టము కలుగును అని విచారించి, ఆ పని చేయుటయో చేయకుండుటయో నిర్ణయించు కొనవలెను.

"రాజా! అప్రయత్నముగానే కొన్ని వస్తువులు తమంతట వచ్చి చేరు చుండును. కనుక, వాని విషయములో చేయు పురుష ప్రయత్నము వ్యర్థము.

ఎవని అనుగ్రహము, క్రోధము నిష్ప్రయోజనములో, అట్టివానిని ప్రజలు రాజుగా నపుంసకుని స్త్రీలు వలె కోరరు. కొన్ని కార్యములు చేయుటకు సాధనములు చిన్నవి. వాని ఫలములు పెద్దవి. అట్టి పనులు ప్రాజ్ఞు డైనవాడు త్వరగా నారంభించును. వానికి మధ్యమధ్య విఘ్నములు కలుగకుండా చూచుకొనును.

"మహారాజా! ఏ రాజు సమస్తమును వక్రదృష్టి లేకుండ కన్నులతో పానము చేయుచున్నాడా యనునట్లు ప్రేమ పూర్వకముగా చూచునో, అట్టి రాజు ఊరక కూర్చొని నప్పటికి, అతని యెడల ప్రీతితో నందరు నుండెదరు. రాజు వృక్షమువలె బాగుగా పుష్పించియు (ప్రసన్ను డై యుండియు) ఫలించక యుండ వచ్చును. (అధికముగ నిచ్చువాడు కాక పోవచ్చును.) ఒకవేళ నిండుగా ఫలములు ఉన్నను (ఇచ్చువా డైనను) (ఆ చెట్టుపైన ఎక్కుటకు వీలు గాక పోవచ్చును) (అతనియొద్దకు పోవుటకు ప్రజలకు వీలు పడక పోవచ్చును.) పచ్చికాయలు ఉన్నప్పటికిని (శక్తి హీను డైనను) అవి పండిన వాని వలె (శక్తి సంపన్నుని వలె) మనకు కనపడ వచ్చును. ఈ విధముగా మెలగిన రాజు నష్టపడడు. కన్నుల చేత - మనస్సుచేత - వాక్కుచేత - కర్మ చేతను ప్రజలను ప్రసన్నులను చేయు రాజునెడల ప్రజలు గూడ ప్రసన్నులుగా నుందురు.

"రాజా" వేటాడు వ్యాధునకు మృగములు భయపడునట్లు, రాజునకు సర్వ ప్రాణులు భయపడినచో నట్టి రాజు సాగరాంత భూమికి చక్రవర్తి యైనను నతనిని ప్రజ లందరు విడచెదరు. అధర్మపరు డైన రాజు, తన తండ్రి తాతల రాజ్యమును పొందినప్పటికిని, తన దుష్కర్మలు దానిని, వాయువు మేఘమును ఛిన్నాభిన్నము చేసినట్లు- భ్రంశము చేయును. ప్రాచీన సత్పురుషులచేత నాచరించ బడిన ధర్మము నాచరించు రాజు యొక్క పాలనములో నున్న భూమండలము ధన సంపూర్ణముగా - సంపదను పెంచునదిగాను నుండును. ధర్మమును విడిచి అధర్మమును ఆచరించు రాజు యొక్క రాజ్యము మండు చున్న అగ్నిపైన గప్పిన చర్మము వలె సంకుచిత మగును. శత్రువుల రాష్ట్రమును అణచుటకు చేయు యత్నము వలెనే, తన రాష్ట్రమును అభివృద్ధి పరచుటకు గూడ మిక్కిలి ఆసక్తితో ప్రయత్నించు చుండ వలెను.

"రాజా! ధర్మమార్గములో రాజ్యమును పొంది, ఆ మార్గములోనే పాలించు చుండ వలెను. ధర్మము ద్వారా పొందిన రాజ్యమును రాజు విడువడు. రాజ్యము గూడ నతనిని విడువదు. పిచ్చివాని నుండి, వ్యర్థముగా ప్రలాపములు పలుకు

వానినుండి, బాలకుని నుండి, వదరుబోతునుండి కూడను సారభూతమైన మాటను, పాషాణములలో నుండి బంగారమును తీసికొను విధముగా- గ్రహింపవలెను. పైరులు కోసిన మళ్లలో రాలి పడిన వెన్నులను ఏరికొని దాని ధాన్యముతో జీవనము గడుపువాడు (శిలవృత్తి చేయువాడు), ఆ పైరు వెన్నులను ఏవిధముగా నేరికొనునో, అట్లే, ధీరపురుషుడు (పండితుడు) గూడ అక్కడక్కడ వినిన యభిప్రాయపూర్ణములైన మాటలను - మంచి సూక్తులను - మంచివారు చేయు సత్కర్మలనున్ను సేకరించుకొను చుండవలెను.

"రాజా! గోవులు వాసన చేత, బ్రాహ్మణులు వేదముల చేత, రాజులు గూఢచారుల చేత, సామాన్య జనులు కన్నుల చేతను చూచెదరు. అతి కష్టము మీద పాలు పిదుక నిచ్చు గోవు మిక్కిలి కష్టములను పొందును. సులభముగా పిదుకనిచ్చు దానిని ప్రజలు కష్టపెట్టరు. కాచకుండనే స్వయముగా వంగిన లోహమును అగ్నిలో తపింప జేయరు. అలాగే స్వయముగా వంగిన కొయ్యను ఎవరును వంచరు. ఈ దృష్టాంతములను బట్టి, బుద్ధిమంతుడు అధిక బలవంతుని యెదుట వంగి ఉండవలెను. బలవంతుని యెదుట వంగినవాడు ఇంద్రునకు గూడ నమస్కారము చేయును. పశువులకు రక్షకుడు మేఘము, రాజులకు బంధువు (సహాయకుడు) మంత్రి, స్త్రీలకు బంధువు (రక్షకుడు) పతి, బ్రాహ్మణులకు బాంధవులు - వేదములు.

"రాజా! సత్యముచేత ధర్మము - యోగము (సంతత పఠనము) చేత విద్య, స్నానాదులు చేసి పరిశుద్ధముగా నుంచ బడుటచేత రూపము, సత్ప్రవర్తన చేత కులము నున్ను రక్షింప బడును. మంచి జాగ్రత్తతో నుంచుటచేత ధాన్యము, తిరుగుటచేత అశ్వములు, మాటిమాటికి జాగ్రత్తతో చూచుటచేత గోవులు, మురికిగా నుండు అల్పమూల్యవస్త్రములచేత స్త్రీలున్ను రక్షింప బడుదురు. మంచి ప్రవర్తనము లేని వానికి, అతడు పుట్టిన గొప్పకులము గౌరము కలిగించదు. ఎందు కనగా, నీచకులమునందు జన్మించినవాడు గూడ తన సత్ప్రవర్తనతో శ్రేష్ఠు డనిపించుకొనును. ఎవడు ఇతరుల ధన - రూప - పరాక్రమ - కుల-సుఖ - సౌభాగ్య - సన్మానములను జూచి అసూయ చెందునో, అది అతనికి ఎడతెగని దీర్ఘవ్యాధి యని యెరుగ వలెను.

"రాజా! చేయ దగని పనులు చేయుటకు, చేయ దగిన పనులు ప్రమాదము (ఏమరుపాటు) చేత విడుచుటకు, కార్యములు నెరవేరుటకు ముందే మంత్రా

లోచనను వ్యక్తపరచుటకున్ను భయపడ వలెను. మత్తు గలిగించు మాదక ద్రవ్యములను త్రాగ గూడదు. విద్యాగర్వము - ధనగర్వము - గొప్ప కులము నందు పుట్టినా నను గర్వము - ఈ మూడున్ను పొగరుబోతులకు దర్పము పెంచును. ఈ గుణములే సత్పురుషులు అణగి యుండుటకు కారణము లగును. సజ్జనులు ఎక్కడనైనను, ఎప్పుడైనను ఆ సత్పురుషుని ఏదైన కోరినప్పుడు, అతడు స్వయముగా దుర్జనుడైనను, అప్పుడు తనను తాను సజ్జనునిగా భావించుకొనును. మనస్వి - సజ్జనుడు - అసజ్జనుడు - ఈ మూడు తరగతుల వారికిన్ని సత్పురుషుడు సహాయకుడు నుండును. కాని, దుష్టు డెప్పుడు గూడ సజ్జనులకు సహాయకుడు కాడు.

"రాజా! మంచివస్త్రములు ధరించినవాడు సభను జయించును (సభలో నాదరింపబడును). గోవులు గలవాడు మధురాహారమును జయించగలడు (పాలు-వెన్న - నేయి తృప్తిగా భుజించగలడు). ప్రయాణ సాధనములు గలవాడు మార్గమును జయించును. (వాహనములతో త్వరగా గమ్యస్థానము చేరుకొనగలడు). మంచి స్వభావము గలవాడు అందరిపైనను విజయము సాధించగలడు. (అందరు అతనికి లోబడి యుందురు). కనుక, మనుష్యునకు మంచి స్వభావము ఉండుట ముఖ్యము. అది నశించిననాడు అతనికి ఈ ప్రపంచమందు జీవితముతో, ధనముతో, బంధువులతోను ఏమాత్రము ప్రయోజనము లేదు. (అవి యుండినను వాని వలన అతనికి ఉపయోగము-దుశ్శీలత్వము మూలముగా ఉండదని భావము.)

"రాజా! ధనవంతులకు మాంసము - మధ్యమశ్రేణి వారికి గోరసము దరిద్రులకు తైల సంబంధము నగు భోజనము ప్రధానముగా నుండును. దరిద్రులు సర్వదా విలువ గల రుచికరమైన భోజనమునే చేయుదురు. ఎందు కనగా, ఆకలియే భోజనము నందు విలువను, రుచిని గలిగించును. ధనవంతులకు ఆకలి దుర్లభము. తరచుగా ధనవంతులకు లోకమునందు భుజించి అరగించుకొను శక్తి యుండదు.

"రాజా! అధములకు జీవికా నిర్వహణము గూర్చి భయము, మధ్యమశ్రేణి వారికి మృత్యువు వలనను భయము కలుగును కాని, ఉత్తములకు అవమానము నుండి భయము కలుగును. త్రాగుడుచేత కలిగిన మదములు మత్తును మాత్రమే కలిగించును. మదములు కొన్ని ఐశ్వర్యమదము చేత అతిపాపిష్ఠము లగును.

ఎందు కనగా, ఐశ్వర్యమదము చేత మత్తిల్లినవాడు సోలి క్రింద పడకుండనే తనను తాను మరచి జాగరూకత లేక యుండును. ఇంద్రియములకు విషయములైన శబ్దస్పర్శాదులందు తగులుకొని, వశము దప్పిన యింద్రియములచేత ఈ ప్రపంచము, సూర్యాది గ్రహములచేత నక్షత్రములువలె, బాధింప బడును.

"రాజా! జీవాత్ములను ఆకర్షించు సహజములైన పంచేంద్రియములకు లొంగి పోయిన వానికి ఆపదలు, శుక్లపక్షమునందు చంద్రుడువలె, వృద్ధి చెందుచుండును.

''ఇంద్రియములను మనస్సునున్ను జయించక మంత్రులకు అణచి తన యధీనములో తీసికొన గోరు అజితేంద్రియుని అందరున్ను విడిచి పెట్టెదరు. మొదట శత్రువు లగు ఇంద్రియములను, మనస్సునున్ను జయించి, పిదప మంత్రులను, శత్రువులనున్ను జయింప గోరువారికి జయము తప్పక కలుగును. అతని ప్రయత్నము వ్యర్థము కాదు. ఇంద్రియములను, మనస్సునున్ను వశపరచుకొనిన వానిని, అపరాధులను దండించువానిని, బాగుగా పరీక్షించి వివేకముతో కార్యము చేయు ధీరుని లక్ష్మి (సంపద) అధికముగ సేవించును.

''రాజా! పురుషునకు రథము శరీరము, ఆత్మ సారథి, ఇంద్రియములు అశ్వములు. ఇంద్రియములను వశమునం దుంచుకొనిన చతురుడైన ధీర పురుషుడు అశ్వములను వశమునం దుంచుకొనిన సారథివలె, సంసారమార్గమును సుఖముగా దాట గలడు. వశమునందు ఉంచుకొన బడక అశిక్షితములైన అశ్వములు సారథిని క్రింద పడ గొట్టునట్లే, నిగ్రహింప బడని యింద్రియములు పురుషుని పతితుని జేయ గలవు. ఇంద్రియ నిగ్రహము లేనివాడు అసత్య వస్తువును సత్యముగా, సత్యమును అసత్యపదార్థముగాను తలచి అజ్ఞానియై తనకు మూడిన గొప్ప దుఃఖమును గూడ సుఖ మని తలచును.

''రాజా! ధర్మరార్థములను విడిచి యింద్రియములకు వశుడై యున్నవాడు, ఐశ్వర్య - ప్రాణ - ధన - భార్యలనుండి త్వరగా విడిపోవును. అధికైశ్వర్య సంపన్నుడు ఇంద్రియ నిగ్రహము గలవాడుగా కున్నయెడల, ఆ కారణముచేత నతడు ఐశ్వర్యమునుండి భ్రష్టు డగును. మనస్సు - బుద్ధి - ఇంద్రియములున్ను వశమునం దుంచుకొని, తానే తన యాత్మను తెలిసికొనుటకు ఇచ్ఛయింప వలెను. ఎందు కనగా, ఆత్మయే తన బంధువు - తన శత్రువుకూడనగును. స్వయముగా తాను తన ఆత్మను జయించిన వానికి ఆత్మయే తనకు బంధు వగును. అట్లు జయింపని వానికి ఆత్మయే తన శత్రు వగును.

''రాజా! చిన్న - చిన్న గండ్లు గల వలలో చిక్కుకొన్న పెద్ద చేపలు రెండు కలిసి వలను ఛేదించునట్లే, కామ - క్రోధములు, విజ్ఞానమును (వివేకమును) లోపింప జేయును. లోకమునందు ధర్మార్థములను బాగుగా విచారించి సాధన సామగ్రిని సేకరించుకొనినవాడు, ఆ సామగ్రి గలిగి యుండుట చేత, సుఖమయమైన అభివృద్ధిని పొంద గలడు. మనస్సును కలత పెట్టు ఐదు ఇంద్రియములు అనెడు అంతశ్శత్రువులను జయించకుండనే యితర బాహ్య శత్రువులను జయింప గోరు వానిని శత్రువులు ఓడించెదరు. ఇంద్రియ వశము లేనందు వలన గొప్ప గొప్ప సాదువులు - మహాత్ములు గూడ తమ కర్మముల బంధములలో, రాజులు రాజ్య సుఖవిలాసములలోను చిక్కుపడుదురు.

''రాజా! పాపము చేసిన వారితో సంబంధము చేయుటవలన, వారితోపాటు అపాపులు కూడ, ఎండు కట్టెలతో కలిసి పచ్చి కట్టెలు అగ్నిలో దహింప బడినట్లు, దండింపబడుదురు. శబ్దస్పర్శాది పంచవిషయములవైపు పరుగెత్తు చక్షురాది పంచేంద్రియములను మోహముచేత వశపరచుకొనినవాడు ఆపదలకు లోనగును.

''రాజా! అసూయా రహితత్వము - సరళత్వము - పవిత్రత్వము - సంతోషము - ప్రియవాదిత్వము - ఇంద్రియ నిగ్రహము - సత్యము - అయాసము లేకుండుట - ఈ సద్గుణములు దుర్జనులలో నుండవు. ఆత్మజ్ఞానము - అక్రోధము - ఓర్పు - ధర్మపరత్వము - మాట నిలిపికొనుట - దానము - ఈ మంచి గుణములు అధమశ్రేణికి చెందినవారిలో నుండవు. మూర్ఖులు విద్వాంసులకు ఆక్రోశముచేత, నిందచేతను కష్టము కలిగింతురు. నిందించువాడు పాపమును పొందును. ఓర్పుకొనువాడు పాపమునుండి విముక్తు డగును.

"దుర్జనులకు హింస బలము - దండించుట రాజులకు బలము - స్త్రీలకు శుశ్రూష (సేవ) బలము - గుణవంతులకు ఓర్పు బలము. రాజా! వాక్కును అదుపులో నుంచుట చాల కఠినము. కాని, విశేషార్థము కలిగి, చమత్కారపూర్వకమైన మాటకూడా ఎక్కువ పలుకుట అశక్యము. అందువలననే, అతి దుష్కరమైనను వాక్కును నియమించుటయే ఉచితము. రాజా! మంచిగా

మాట్లాడుట అనేక శుభములను గలుగ చేయును. అట్లే చెడుమాట అనర్థము (చేటు)ను కలిగించును. బాణములచేత, గండ్రగొడ్డలి చేతను ఛేదింప బడిన వనమునందు మరల మొలకలు పుట్టును. కాని, కటువచనముల చేత మనస్సునకు గలిగిన గాయము మాన జాలదు కర్ణి-నాళీకము - నారాచము అను బాణములను గూడ శరీరమునుండి పెరక వచ్చును. కాని, హృదయమునందు నాటుకొని పోయిన వాగ్బాణములను ఊడ బెరకుట అసాధ్యము. వాగ్బాణములు ముఖము నుండి వెలువడి యితరుల మర్మ స్థానములందే పడి గాయపరచును. ఆ దెబ్బ తినినవాడు రాత్రింబగళ్లు దుఃఖించును. అందుచేత పండితుడు ఇతరులపైన కటువాక్కులను విసర రాదు. దేవతలు ఎవనిని ఓడింప దలచెదరో, వాని బుద్ధిని తొలుత అపహరించెదరు. దానిచేత నతడు నీచకర్మలే యెక్కువ చేయుచుండును. వినాశ కాలము సంప్రాప్త మైనపుడు బుద్ధి మలిన మగును. అందుచేత న్యాయముగా తోచు అన్యాయము మనస్సు నుండి తొలగిపోదు.

''మహారాజా! నీ పుత్రుల బుద్ధి పాండవుల విషయములో విరుద్ధముగా నున్నది. నీవు వీరిని తెలిసికొన జాల కున్నావు. సర్వరాజ లక్షణ సంపన్నుడు కావున, యుధిష్ఠిరుడు మూడు లోకములకు గూడ రాజు కా గలవాడు. నీ యాజ్ఞను శిరసా వహించి నెరవేర్చు యుధిష్ఠిరుడే ఈ భూమండలమునకు శాసకు డగుటకు యోగ్యుడు. అతడు ధర్మార్థ తత్త్వములను బాగుగా తెలిసినవాడు. పరాక్రమము - సద్బుద్ధియు గలవాడు. పరిపూర్ణ సౌభాగ్యశాలి. నీ పుత్రులందరిని, అన్ని సద్గుణములలో మించినవాడు. రాజేంద్రా! ధర్మాత్ములలో శ్రేష్ఠు డయిన ధర్మరాజు, దయా - అక్రూరత్వము - నీ యెడల గౌరవభావమున్ను కలవా డగుటచేత అనేక కష్టములను సహించు చున్నాడు.''

"జనమేజయా! ఈ విధముగా విదురుడు చెప్పిన నీతి వచనములు విని ధృతరాష్ట్రుడు తృప్తి చెందక యింకను విన గోరి విదురునితో ని ట్లనెను: "మహాబుద్ధిశాలీ! ధర్మార్థ సహితము లైన మాట లింకను చెప్పుము. ఇన్ని విన్నను, నాకు ఇంకను తృప్తి దీర కున్నది. ఈ విషయములో నీవు విచిత్రములు - విలక్షణములు నైన మాటలు చెప్పు చున్నావు."

ఆ మాటకు విదురుడు ధృతరాష్ట్రునకు ఇంకను నీతి వచనములు ఇట్లు చెప్ప దొడగెను:

కేశిని నిమిత్తముగా సుధన్వ - విరోచనుల వివాదము విదురుడు చెప్పి ధృతరాష్ట్రునకు ధర్మోపదేశము చేయుట

"రాజా! సర్వపుణ్య తీర్థములందు స్నానము చేయుట, సర్వ ప్రాణుల యెడల ఋజువు (సరళము)గా వ్యవహరించుట - ఈ రెండును సమానములు. ఈ రెండింటిలోను భూతములయందు ఋజు ప్రవర్తనమే విశేష మహత్త్వము గలది. కనుక, రాజా! పుత్రుల యెడల ఋజు భావముతోనే వ్యవహరింపుము. దానివలన ఈ లోకమునందు కీర్తి, పరలోకమునందు స్వర్గ సుఖము ననుభవించ గలవు. మరణించిన తరువాత ఎంత దాకనైతే, అతని కీర్తి లోకమునందు వ్యాపించి యుండునో అంతవరకు నతడు స్వర్గలోకమునందు నిలిచి యుండును. ఈ విషయము నం దొక యితిహాసము చెప్పెద వినుము. అందులో, కేశిని కొరకు సుధన్వునితో విరోచనునకు జరిగిన సంవాదము వర్ణించ బడినది.

''రాజా! అసమాన సౌందర్యవతి యైన 'కేశిని' అను కన్యక సర్వ శ్రేష్ఠుడైన పతిని వరించుటకు స్వయంవరములో నిలిచెను. అక్కడికి ప్రహ్లాద పుత్రుడైన 'విరోచనుడు' అను రాక్షస రాజు స్వయంవరమునందు ఆ కన్యను పొందుటకు వచ్చెను అప్పు డతనికి కేశినికి నిట్లు సంవాదము జరిగెను:

కేశిని : విరోచనా! బ్రాహ్మణులు శ్రేష్ఠులా? రాక్షసులా? బ్రాహ్మణుడే శ్రేష్ఠుడైనచో నా శయ్యపైన సుధన్వుడే యేల కూర్చొన రాదు? (నేను సుధన్వునితోనే పెండ్లి చేసికొనెద నని భావము.)

విరో : కేశినీ! మేము ప్రజాపతి సంతానము. అందువలన మేము అందరి కన్న నుత్తములము. సమస్త ప్రపంచము మాదే. మా యెదుట దేవతలు - బ్రాహ్మణులు ఎంతటివారు?

కేశిని : విరోచనా! మనము ఇక్కడనే సుధన్వుని కొరకు ఎదురుచూచు చుందుము. రేపు ఉదయము సుధన్వుడు వచ్చును మీ యిద్దరు ఒకచోట నుండగా చూచెదను.

విరో : కల్యాణీ! నీవు చెప్పినట్లే కానిమ్ము. మా యిరువురిని రేపు చూడ గలవు."

తరువాత విదురుడు ధృతరాష్ట్రునితో ని ట్లనెను:

"రాజా! ఆ రాత్రి గడచిన తరువాత మరునాటి యుదయమున అంగిరసుని పుత్రుడు. బ్రాహ్మణోత్తముడు నైన సుధన్వుడు వచ్చెను. అతడు ప్రహ్లాద పుత్రు డైన విరోచనునితో, కేశినితోను కలిసికొనెను. కేశిని సుధన్వునికి స్వాగతము చెప్పి, అర్ఘ్యపాద్యాసనములతో పూజ చేసెను.

విరోచన సుధన్వుల కిట్లు సంవాదము జరిగెను:

సుధ : ప్రహ్లాదనందనా! నీవు కూర్చొని యున్న యీ సువర్ణాసనమును కేవలము స్పృశించెదను. నీతోగూడ ఈ యాసనమునందు కూర్చొన జాలను, కూర్చొనినచో మన మిరువురము సమానుల మగుదుము.

విరో : సుధన్వా! నీకు కూర్చొనుటకు పీట - చాప - దర్భాసనము - ఇవియే అర్హములు. నీవు నాతో సమానముగా ఈ సువర్ణాసనమునందు కూర్చొనుటకు అర్హుడవు కావు.

సుధ : విరోచనా! తండ్రి కొడుకులు-బ్రాహ్మణు లిద్దరు, క్షత్రియు లిద్దరు-వృద్ధు లిద్దరు-వైశ్యు లిద్దరు-శూద్రు లిద్దరు గూడ ఏకాసనమునందు కలిసి కూర్చోనవచ్చును. కాని ఇతర వ్యక్తు లెవరు గూడ నిద్దరు నొక యాసనమునందే కూర్చొన గూడదు. నీ తండ్రి ప్రహ్లాదుడు నన్ను ఉన్నతాసనముపైన కూర్చొనబెట్టి తాను క్రింద కూర్చొని నాకు సేవలు చేయు చుండును. నీవు బాలకుడవు. ఇంటిలో సుఖముగా పెరిగినావు. అందు చేత, నీకు ఈ విషయము లేవియు తెలియవు.

విరో : సుధన్వా! రాక్షసులయొద్ద నున్న బంగారము - గోవులు - అశ్వములు మొద లైన ధన మంతయు నేను పందెము పెట్టెదను. మన మిరువురము ఈ విషయము తెలిసిన వారియొద్దకు పోయి వారిని మన యిద్దరిలో నెవరు శ్రేష్ఠులో అడుగుదము.

సుధ : విరోచనా! సువర్ణాది ధనములు నీయొద్దనే ఉండ నిమ్ము. మన మిద్దరము మన ప్రాణములను పందెము పెట్టి యీ విషయము తెలిసిన వారియొద్దకు' పోయి అడుగుదము.

విరో : సుధన్వా! ప్రాణము లొడ్డిన తరువాత మనమెవరి యొద్దకు పోవుదము? నేను దేవతలయొద్దకు గాని, మనుష్యులుయొద్దకు గాని- యీ నిర్ణయము కొరకై రా జాలను.

సుధ : విరోచనా! మనము పందెములుగా మన ప్రాణము లొడ్డిన తరువాత నీ తండ్రియొద్దకే పోవుదము. ప్రహ్లాదుడు తన పుత్రుని ప్రాణ రక్షణము కొరకు అసత్యము చెప్పడని నాకు విశ్వాసము కలదు.

"మహారాజా! అట్లు విరోచన-సుధన్వులు క్రుద్ధు లై ప్రహ్లాదుని యొద్దకు పోయిరి. వారిని చూచి ప్రహ్లాదుడు తన మనస్సులోనే, 'ఒకటిగా నెప్పుడుగూడ నడవని యీ యిరువురు కోపముతో నున్న సర్పములువలె ఒక మార్గములోనే కలిసి వచ్చు చున్నారు' అనుకొని విరోచనుని చూచి యి ట్లనెను:

"నీవు సుధన్వునితో మైత్రి చేసితివా? మీ యిద్దరు కలిసి ఒక్కటిగా ఎట్లు వచ్చు చున్నారు? పూర్వము మీ రెప్పుడు గూడ ఒక్కటిగా నడచు చుండ లేదు."

ఆ మాటలకు విరోచనుడు ఇ ట్లనెను:

"తండ్రీ! సుధన్వునితో నాకు మైత్రి కలుగ లేదు. మే మిరువురము మా ప్రాణములను పందెముగా నొడ్డి మీ యొద్దకు వచ్చినాము. నేను మీతో యథార్థము నడిగెదను. మీరు నా ప్రశ్నమునకు అసత్య మైన ఉత్తరమును ఈయకుడు."

"తరువారు ప్రహ్లాదుడు సేవకులకు 'సుధన్వుని కొరకు జలమును గాని, మధుపర్కము (పెరుగుతో గలిసిన తేనె)ను గాని, తీసికొని రండు" అని ఆజ్ఞ యిచ్చి, సుధన్వునితో ని ట్లనెను:

"బ్రాహ్మణోత్తమా! నీవు నాకు పూజ్యు డైన అతిథివి. నీకు దానము చేయుటకు బాగుగా బలిసిన తెల్లగోవును ఉంచినాను."

"అప్పుడు ప్రహ్లాద సుధన్వులకు ఇట్లు సంభాషణము జరిగెను:

సుధ : ప్రహ్లాదా! జలము - మధుపర్కమున్ను నాకు దారిలోనే లభించెను. నీ విప్పుడు నేను అడుగ బోవు ప్రశ్నమునకు సరిగా నుత్తరము చెప్పుము. బ్రాహ్మణుడు శ్రేష్ఠుడా? లేక విరోచనుడా?

ప్రహ్లా : బ్రాహ్మణా! నాకు ఒక్కడే పుత్రుడు. నీవు సాక్షాత్తుగా వచ్చి యున్నావు. మీ యిరువురి వివాదములో నావంటి వా డెట్లు నిర్ణయించ గలడు?

సుధ : మతిమంతుడా! గోవు - నీయొద్ద నున్న యితర ధనములు అన్నియు నీ పుత్రునకే యిమ్ము. మా యిరువురి వాదములో నీవు సరిగా తీర్పు చెప్ప వలెను.

ప్రహ్లా : సుధన్వా! ని న్నొక ప్రశ్నము నడిగెదను చెప్పుము. సత్యమును చెప్ప కుండ అసత్యమునే నిర్ణయించు దుష్టవక్తకు ఎట్టి పరిస్థితి యేర్పడును?

సుధ : సవతి గల స్త్రీ-జూదమునందు ఓడినవాడు-బరువు మోయుటచేత నొప్పి గల శరీరము గలవాడు - ఈ ముగ్గురికి రాత్రులందు ఏ స్థితి యుండునో అట్టి పరిస్థితియే, అధర్మముగా అన్యాయపు తీర్పు చెప్పినవానికి గూడ కలుగును. అలాగే, ఒక పట్టణమునందు చెర బెట్ట బడి నగర బహిర్ద్వారమునందు ఆకలితో బాధపడు చున్న రాజు శత్రువుల ననేకులను చూచి యెట్టి బాధ ననుభవించునో అట్టి బాధనే అసత్యసాక్ష్యము చెప్పినవాడు అనుభవించును.

స్వార్థము కొరకు, పశువుల విషయమై అసత్యము చెప్పువాడు, అయిదు తరముల వరకును గోవుల విషయమై, పది తరముల వరకు అశ్వముల విషయమై నూరు తరముల వరకు - మనుష్యుని విషయమై అనృతము చెప్పువాడున్ను వేయితరముల వరకును (తన వంశము వారిని) నరకమునందు పడవేయును.

బంగారము కొరకు అసత్య మాడినవాడు తన వంశమునందు తనకు పూర్వము-తన తరువాత జన్మించువారినిన్ని నరకములో పడ వేయును.

భూమికొరకు, స్త్రీ కొరకున్ను అసత్య మాడు నట్టివాడు తనను సర్వ నాశము చేసికొనును. కనుక, భూమికొరకు స్త్రీ కొరకున్ను అసత్యము మాటాడకుము.

ప్రహ్లా-విరోచనా! సుధన్వుని తండ్రి అంగిరసుడు నాకన్న శ్రేష్ఠుడు. సుధన్వుడు నీకన్న శ్రేష్ఠుడు. ఇతని తల్లి నీ తల్లికన్న శ్రేష్ఠురాలు. కాబట్టి, నీవు నేడుసుధన్వుడిచేత ఓడింప బడితివి. కనుక, విరోచనా! ఇప్పుడు సుధన్వుడు నీ ప్రాణములకు అధిపతి.

సుధన్వా! నీవు విరోచనుని ప్రాణరక్షణము చేసి నాకు ఇచ్చినచో నేను విరోచనుని తిరిగి పొంద గోరు చున్నాను.

సుధ : ప్రహ్లాదా! నీవు ధర్మమునే వరించితివి. స్వార్థవశుడవై అసత్యమును చెప్పెద వనుకొంటిని. అట్లు నీవు చేయ లేదు. కాబట్టి, దుర్లభుడైన యీ నీ కొడుకును తిరిగి నీకు ఇచ్చుచున్నాను. ప్రహ్లాదా! ఇదిగో

నీ కొడుకు, నేను నీకు ఇచ్చితిని. కాని, యితడు ఈ కుమారి కేశిని సమక్షమునందు నా పాదములను కడుగవలెను."

ఈ యితిహాసమును విదురుడు ధృతరాష్ట్రునకు చెప్పి యతనితో తరువాత ని ట్లనెను:-

''మహారాజా! రాజ్యము కొరకు నీవు అసత్య మాడకుము. పుత్రుని స్వార్థమును నెరవేర్చ దలచి అసత్య వచనములు పలికి, మంత్రి పుత్ర బంధు సహితముగా నరకమునకు పోవకుము. దేవతలు పశుపాలకులకువలె, దండమును చేత బట్టుకొని మానవులను చెడు మార్గమునుండి రక్షింపరు. వారు రక్షింప దలచిన వారికి మంచి బుద్ధిని ప్రసాదించెదరు. పురుషుడు మంచి పనులలో తన బుద్ధిని ఉపయోగించుకొలది అతనికి అన్ని యిష్టార్థములు సమకూర గలవు. ఇందులో ఏమాత్రము సంశయము లేదు. కపట ప్రవర్తన గలవానిని వేదములు పాపములనుండి విముక్తుని జేయవు. రెక్కలు రాగానే పక్షులు తమ గూండ్లను విడచి పోవునట్లు చివరకు వేదములే పాపాత్ముని విడుచును.

''రాజా! మద్యపానము- కలహము. సమాజముతో వైరము- భార్యా భర్తలలో, జ్ఞాతులలోను భేదము గలిగించుట - రాజును ద్వేషించుట- స్త్రీ పురుషుల మధ్య వివాదము గలిగించుట- చెడ్డ మార్గము- ఇవి యన్నియు విడువ వలెను.

"రాజా! హస్త సాముద్రికుడు - దొంగతనము చేసి వ్యాపారము చేయువాడు- జూదరి- వైద్యుడు- శత్రువు- మిత్రుడు- వర్తకుడు- ఈ యేడుగురిని సాక్ష్యమునకు తీసికొన గూడదు. అగ్నిహోత్రము (హోమము) - మౌనవ్రత పాలనము - వేదాధ్యయనము- యజ్ఞానుష్ఠానము- ఈ నాలుగు ఆదర పూర్వకముగా చేసినచో భయమును కలిగించవు. ఇవియే సక్రమముగా చేయని యెడల, భయమును గలిగించును.

''రాజా! ఇండ్లకు నిప్పు అంటించువాడు- విషము నిచ్చువాడు- తాను బ్రతికి యుండగా భార్య జార పురుషునివలన కనిన సంతానము యొక్క సంపాదన చేత జీవించు భర్త- యజ్ఞోపయోగి సోమరసమును అమ్మువాడు- శస్త్రములు చేయువాడు- కొండెములు చెప్పువాడు- మిత్రద్రోహి- పరస్త్రీలయందు ఆసక్తి గలవాడు- భ్రూణహత్య (స్త్రీ గర్భ పాతము) చేయువాడు- గురు భార్య సంగమము చేయువాడు- మద్యపానము చేయు బ్రాహ్మణుడు- అతి కఠిన

స్వభావము గలవాడు- కాకివలె కాకా అని కూయువాడు (దుష్టుడు) నాస్తికుడు- వేద నిందకుడు- గ్రామ పురోహితుడు- వ్రాత్యుడు (ఉప నయనము -వడుగు- లేని తండ్రికి పుట్టినవాడు - ఉపనయన కాలము గడచినను ఉప నయనము కాని వాడు- వివాహ మైనను వడుగు కానివాడు అని వ్రాత్యులు మూడు విధములుగ నుందురు- వ్రాత్య డనగా 'సంస్కారహీనుడు' అని సాధారణముగా నర్థము.) - క్రూరుడు- 'నన్ను రక్షింపు' అని శరణు వేడినవానిని, రక్షించు శక్తి యుండియు వధించువాడు- వీ రందరున్ను బ్రహ్మహత్య చేసినవారితో సమానులు.

''రాజా! జ్వలించు నగ్ని యందు బంగారమును- మంచి ప్రవర్తనచేత సత్పురుషుని- నడవడికచేత ఉత్తముని - భయకాలమునందు శూరుని- ఆర్థిక పరిస్థితి చెడినప్పుడు ధీరుని - గొప్ప యాపద వచ్చినప్పుడు శత్రు మిత్రులను పరీక్షించి తెలిసికొన వచ్చును.

''రాజా! ముసలితనము (సుందర) రూపమును- ఆశ ధైర్యమును- మృత్యువు ప్రాణములను- అసూయ (గుణములను దోషములుగా జూచు స్వభావము) ధర్మాచరణమును- క్రోధము సంపత్తిని- నీచపురుషులసేవ మంచి స్వభావమును- కామము లజ్జను- స్వాభిమానము సర్వస్వమును నష్టపరచును.

''రాజా! శుభకార్యముల వలన సంపద గలుగును- ప్రతిభవలన సంపద వృద్ధి పొందును చాతుర్యమువలన సంపద సమూలముగా గట్టిపడును. నిగ్రహము (సంయమము) వలన సంపద సురక్షిత మగును.

''రాజా! బుద్ధి - సత్కులీనత్వము- ఇంద్రియ నిగ్రహము- శాస్త్రపాండిత్యము- పరాక్రమము- మితభాషిత్వము- యథాశక్తి దానము చేయుట-కృతజ్ఞత- ఈ యెనిమిది గుణములు పురుషుని శోభింప జేయును.

"రాజా! మనుష్యుని సత్కార పూర్వకముగా గౌరవించుట'' అను నొక్క గుణము ఉండినచో తక్కిన అన్ని గుణములు నున్నట్లేయగును.

''రాజా! యెనిమిది గుణములు మనుష్యుని స్వర్గమునకు తీసికొని పోవును. వీనిలో నాలుగు గుణములు సర్వదా సత్పురుషులకు ఉండును. అవి, యజ్ఞ- దాన- శాస్త్రాధ్యయన- తపస్సులు. ఇంద్రియ నిగ్రహము- సత్యము- సరళత్వము- అక్రూరత్వము- ఈ నాలుగు సద్గుణములను సాధువులు అనుసరించెదరు. యజ్ఞ- వేదాధ్యయన- దాన- సత్య- క్షమా- దయా- లోభరహితత్వ-

తపస్సులు- ఈ యెనిమిది ధర్మసాధనమునకు మార్గములని చెప్పబడినని. వీనిలో యజ్ఞాధ్యయన దాన తపస్సులు డంబముకొరకైనను చేసెదరు. కాని, తక్కిన నాలుగు గుణములు మహాత్ములే అవలంబించెదరు.

''రాజా! అనుభవజ్ఞులైన వృద్ధులు లేని సభ సభ కాదు. ధర్మనిర్ణయము చేయని వృద్ధులు వృద్ధులు కారు. సత్యహీన మైన ధర్మము ధర్మము కాదు. కపటముతో గూడిన సత్యము సత్యము కాదు. 'సత్య - సౌందర్య - శాస్త్రజ్ఞాన - విద్యా - సత్కులీనత్వ - సత్స్వభావ - బల - ధన - శౌర్య - చమత్కార పూర్వక సంభాషణము' నను నీ పదియు స్వర్గహేతువు లగును.

''రాజా! పాపకీర్తి గలవాడు పాపమే చేయుచు పాపఫలమునే పొందును. పుణ్యకీర్తి గలవాడు పుణ్యమునే చేయుచు అతి పుణ్యమును పొందును. కాబట్టి, ప్రశంసనీయ మైన ఆచరణ గల పురుషుడు పాపమును చేయ గూడదు. మాటి మాటికి చేయ బడు పాపము బుద్ధిశక్తిని నష్టపరచును. అట్టివాడు సర్వదా పాపమునే ఆచరించును. పుణ్య కార్యమును మాటి-మాటికి ఆచరించుట వలన బుద్ధిశక్తి వృద్ధిపొందు చుండును. అట్టివాడు సర్వదా పుణ్యమునే చేయుచు పుణ్య లోకమునకు పోవును. కనుక, శ్రద్ధగా పుణ్యమునే సేవించ వలెను.

"రాజా! 'అమాయకుడు (గుణముల యందు దోషము లారోపించువాడు) - రాక్షసత్వము గలవాడు . దయారహితుడు , వైరమును చేయువాడు - గూఢముగా నపకారమును చేయువాడు - వీరు పాపముల నాచరించుచు త్వరలోనే అతి కష్టములను అనుభవింతురు. అసూయ లేనివాడు - ప్రజ్ఞావంతుడు - సర్వదా శుభకర్మలు చేయువాడున్ను కష్టము లనుభవించక అంతటను సన్మానము పొందెదరు. బుద్ధిమంతుల సాంగత్యముతో మంచిబుద్ధి పొందువాడే పండితుడు - అట్టిప్రాజ్ఞుడు ధర్మార్థములను పొంది సుఖమును వృద్ధి చేసికొన గలుగును.

"రాజా! సత్కార్యమును పగటియందే చేయ వలెను. దానిచేత రాత్రి యందతడు సుఖముగా నుండగలడు. సత్కార్యములను ఎనిమిది నెలలలో పూర్తి చేయ వలెను అందుచేత నతడు వర్షాకాలము నాలుగు నెలలు సుఖముగా నుండ గలడు. పూర్వ వయస్సులో మంచికార్యములను చేయ వలెను. అందు వలన వృద్ధాప్యమునందు సుఖముగా నుండగలడు. జీవించి యున్నంతకాలము విడువకుండ సత్కార్యములు చేయ వలెను. దానివలన నతడు మరణించిన తరువాత పర లోకమునందు సుఖముగా నుండ గలడు.

"రాజా! జీర్ణించిన ఆహారమును, నిష్కళంక యౌవనమును గడపిన స్త్రీని, యుద్ధమునందు జయము సంపాదించిన శూరుని, (సంసార) సముద్రమును దాటిన తపస్విని, సజ్జనులు ప్రశంసించెదరు. అధర్మ మార్గమునందు సంపాదించిన ధనములచేత, తాను చేసిన దోషములను కప్పినచో, ఆ దోషములు కప్పబడవు. అంతయేకాక, ఆ దోషములను ఆచ్ఛాదించినందువలన వేరుగా క్రొత్త దోషములు వెల్లడి యగును.

"రాజా! ఇంద్రియములను, మనస్సునున్ను వశములో నుంచుకొనిన శిష్యులకు గురువు - దుష్టులకు రాజు - రహస్యముగా పాపములను చేయువారికి యముడున్ను శాసకులగు దురు. ఋషులు - నదులు - వంశము - మహాత్ములు - స్త్రీల చెడు ప్రవర్తనము - వీని మూలమును తెలిసికొన గూడదు. (అది వీలు కాదని భావము.) బ్రాహ్మణ సేవాపూజాదుల యందాసక్తి గలిగి, దానశీలుడై, జ్ఞాతుల (కుటుంబ వ్యక్తులు)యెడ సరళముగా, కపటిగాక ప్రవర్తించుచు, మంచి స్వభావము గల రాజు చాలకాలము భూమండలమును పాలించ గలడు.

"రాజా! శూరుడు - విద్వాంసుడు - సేవా ధర్మముతో సేవించువాడు - ఈ ముగ్గురు భూమి యనెడు లతనుండి సువర్ణము అనెడు పుష్పములను ఏరుకొన గలరు. (ఈ ముగ్గులే ధనము సంపాదించ గలరని భావము.)

"రాజా! బుద్ధికౌశల బలముతో చేయు పనులు ఉత్తమములు-బాహు బలము (క్షత్రియ బలము)తో చేయునవి మధ్యమములు - పిక్క బలముతో చేయు కార్యములు అధమములు. బరువును మోయు పని అధమాధమము.

"రాజా! మూర్ఖులైన కర్ణ - శకుని - దుశ్శాసన - దుర్యోధనులందు రాజ్య కార్యభారమును ఉంచి నీవు ఉన్నతి నెట్లు కోరుచున్నావు? సర్వగుణ సంపన్నులైన పాండవులు నీ యెడల పితృ భావముతో నున్నారు. నీవును వారి యెడల పుత్రప్రేమతో నుండి, సుఖమును పొందుము.

''మహారాజా! ఈ విషయము నందు నీ కొక పురాతన కథను చెప్పెదను వినుము. ఆ యితిహాసము పూర్వము ఆత్రేయమునికి సాధ్యులకున్ను గలిగిన సంవాద రూపము'' అని విదురుడు ధృతరాష్ట్రునకు ఆ యితిహాసమిట్లు చెప్ప దొడగెను:

"ధృతరాష్ట్ర మహారాజా! పూర్వము ఉత్తమ తపోనిష్ఠ గలిగి మహాబుద్ధిమంతుడైన దత్తాత్రేయమహాముని హంస (పరమహంస) రూపముతో సంచరించుచుండగా, సాధ్యులు అనబడు దేవగణమువారు ఆ మునితో నిట్లనిరి:

దత్తాత్రేయ మహాముని సాధ్యులకు హితోపదేశము చేయుట

''మహామునీ! మేము సాధ్యులము నిన్ను చూచినంత మాత్రము చేత ఊహించి నీ విషయములు తెలిసికొన లేకున్నాము. నీవు శాస్త్రజ్ఞానము - ధీరత్వము (పాండిత్యము) - బుద్ధిశాలితనమున్ను గలవాడవుగా తోచుచున్నావు. కనుక, నీవు మాకు నీ పాండిత్య పూర్ణ దివ్యవాక్కులను వినిపింపుము."

"ఆ మాటలను విని ఆహింస (దత్తాత్రేయముని) యిట్లు బదులు చెప్పెను:

"సాధ్యదేవతలారా! ధైర్యము చిక్కబట్టుకొని, మనో నిగ్రహము చేసి, సత్య - ధర్మములను పాలించు చుండుట మానవ కర్తవ్యము. వీనిద్వారా హృదయ గ్రంథిని విడదీసి ప్రపంచమునందలి ప్రియా ప్రియములను తన ఆత్మకు సమానముగా తలచ వలెను' అను విషయము నేను విన్నాను. ఇతరులు మనను క్లేశ పరచిన మనము వారిని బాధపరచ గూడదు. అట్లు క్లేశమును సహించువారు అణచుకొనిన క్రోధమే క్లేశపెట్టినవారిని దహించును. వారి పుణ్యమున్ను తీసికొనును. ఇతరులను నిందించ గూడదు. అవమానపరచ గూడదు. మిత్రద్రోహము, నీచపురుష సేవయు చేయగూడదు. మంచి ప్రవర్తనను విడువ గూడదు. ఆత్మాభిమాని కా గూడదు. కటువు రోషయుక్తము నైన మాట పలుక గూడదు. ప్రపంచమునందు కటువాక్కులు మనుష్యుని మర్మస్థానములను(కీళ్ళు) హృదయమును, ప్రాణములనున్ను దహించి వేయును. ధర్మానురాగము గల పురుషుడు, దాహకములైన రూక్షవచనములను సర్వదా విడువ వలెను. కటు వచనములు - కఠిన స్వభావము - మర్మభేద వాక్యములు - వాగ్బాణముల చేత బాధ గలిగించుట - ఇవి గలవాడు దరిద్రత్వమును - మరణమునున్ను ముఖమునందు కట్టి ఉంచుకొనినవాడని తెలియ వలెను. సూర్యునితో, అగ్నితోను సమానముగా జ్వలించు చున్న తీక్ష్ణ బాణముల చేత నితరుడు తనను గట్టిగా కొట్టినప్పుడు, తాను, ఆ విధముగా కొట్టబడి దహింప బడుచు గూడ నితరుడు తనకు పుణ్యమును పెంచు చున్నాడని తెలిసికొన వలెను.

"సాధ్యులారా! వస్త్రము ఏ రంగులో అద్దిన నారంగే దానికి అంటుకొనునట్లు, మనుష్యుడు, సజ్జనునితో తపశ్శాలితో, చోరునితోను సాంగత్యము చేసినప్పుడు, వారికి వశుడై, వారి వారి స్వభావములే యతనికి సంక్రమించును. ఇతరులను దూషించకుండా దూషింప జేయకుండను నున్నవాడు - తనను ఇతరులు కొట్టినప్పుడు తాను ఇతరులను కొట్టక, కొట్టించక యుండి, తాను దెబ్బ తినియు కొట్టిన వానిని తిరిగి కొట్టుటకు ఇచ్ఛయించని వానిరాక కొరకు దేవతలు స్వర్గమునందు ఎదురుచూచు చుండెదరు.

"మాటాడుటకన్న మాటాడకుండుట మొదటి విశేషము. మాటాడినచో సత్యము పలుకుట రెండవ విశేషము. సత్యము - ప్రియమున్ను పలుకుట మూడవ విశేషము. సత్యముతో - ప్రియముతోపాటు ధర్మ సమ్మతముగా మాటాడిన యెడల నది నాలుగవ విశేషము. వీనిలో నుత్తరోత్తరము శ్రేష్ఠము.

''మనుష్యుడు ఎవరితో కలియునో, ఎటువంటివారిని సేవించునో, యెట్లు కా దలచునో యట్లే, వారి వలెనే యగును. మనుష్యుడు ఏయే విషయముల నుండి మనస్సును దూరము చేయ దలచుకొనునో, వాని నుండి యతనికి విముక్తి కలుగును. ఈ విధముగా నతడు అన్నిటినుండి విముక్తుడైనచో నతనికి లేశ మాత్రము గూడ దుఃఖము ఎప్పుడు గూడ గలుగదు. ఎవనిచేతను ఓడింప బడక ఎవరిని గూడ జయింప నిచ్చ లేక, ఎవరితోను శత్రుత్వము చేయక, ఇతరులను బాధ పెట్టక, నిందా - ప్రశంసలను సమానముగా తలచువాడు హర్ష - శోకముల నుండి విముక్తుడగును. అందరి మేలుగోరుచు, ఎవరికిని కీడు కోరక, సత్యవాదియై మృదు స్వభావము - ఇంద్రియ నిగ్రహమున్ను గలిగి యున్నవాడు ఉత్తముడన బడును.

"సాధ్యులారా! అసత్యముగా ఆశలు కల్పించి యూరడింపక, ఇచ్చెద నని చెప్పిన వస్తువు తప్పక యిచ్చి, ఇతరుల దోషములను గ్రహించువాడు మధ్యముడు, అతి కఠినమైన శాసనము చేయుచు, అనేక దోషములు, కళంకములున్ను గలిగి, క్రుద్ధుడై ఇతరులను బాధించుచు, కృతఘ్నుడై, ఎవనితోను మైత్రి లేకున్నవాడు అధముడు. ఇవియే అధముని లక్షణములు. ఎవడు ఆత్మవిశ్వాసము లేకుండుట చేత, ఇతరులు తనకు మేలు చేయుదు రను విశ్వాసము గూడ లేనివాడై మిత్రులను గూడ దూరము చేసికొనునో అతడే అధమ పురుషుడు. లోకములో తనకు మేలు కోరుకొనువాడు ఉత్తములనే సేవించ వలెను. సమ

యము వచ్చినప్పుడు మధ్యమ పురుషులను గూడ నాశ్రయింప వచ్చును. కాని, అధములను మాత్రము సేవించ గూడదు.

"సాధ్యులారా! మనుష్యుడు, దుర్జనుల బలముతో, ఎడతెగని ప్రయత్నముతో, బుద్ధితో, పౌరుషముతోను ధనము సంపాదించ వచ్చును గాక! అతనికి, ఉత్తములు - కులీనులు నైన పురుషుల నుండి సన్మానము - సత్ప్రవర్తనము ఎప్పుడున్ను పరిపూర్ణముగా లభించవు.''

ఈ మాటలు విని ధృతరాష్ట్రుడు విదురునితో నిట్లనెను:

"విదురా! ధర్మార్థములను అనుష్ఠించుటలో నాసక్తి గలిగి, బహుశాస్త్ర కోవిదులైన దేవతలు గూడ నుత్తమకుల సంజాతులను కోరెదరు. కనుక, ఉత్తమ కులము నందు జన్మించిన వా రెవరో తెలుపుము."

ఈ మాటకు విదురు డిట్లనెను:

మహాకులీన లక్షణము వర్ణించి విదురుడు ధృతరాష్ట్రునకు ఉపదేశించుట

''మహారాజా! 'తపస్సు - ఇంద్రియ నిగ్రహము - వేదాధ్యయనము - యజ్ఞములు - పవిత్ర వివాహము - సతతాన్న దానము - మంచి నడవడిక" ఈ యేడును ఎవరియం దున్నవో, వారు ఉత్తమ కులీనులు. ఏ మనుష్యులు మంచి నడవడిక గలవారై తల్లిదండ్రులను బాధించ కుందురో, ప్రసన్న చిత్తముతో ధర్మము నాచరించు చుందురో, అసత్యములను విడుతురో, తమ కులమునకు విశేషకీర్తి కోరుదురో అట్టివారు మహాకులము నందు పుట్టిన వారుగా భావింప వలెను.

"రాజా! యజ్ఞము చేయకుండుట చేత - నిందిత కులమునందు వివాహము చేసికొనుట చేత - వేదములను విడుచుటచేత - ధర్మమును ఉల్లంఘించుట చేత - దేవతల ధనమును నశింప జేయుటచేత - బ్రాహ్మణ ధనమును అపహరించుటచేత - బ్రాహ్మణులను అతిక్రమించుట చేత - వారిని అవమానపరచుట చేత - వారిని నిందించుట చేత - వారు దాచుటకు తమయొద్ద ఉంచిన వస్తువు న్యాసమును అపహరించుట చేతను ఉత్తమకుల సంజాతులు గూడ అధమ కులీను లగుదురు.

"గోవులు - మనుష్యులు - ధనమున్ను సమృద్ధిగా నున్నప్పటికిని, మంచి నడవడిక లేని కులములు సత్కులముల లెక్కలో రా జాలవు. సత్ప్రవర్తన గలిగిన కులములు నిర్ధనము లైనను సత్కులముల లెక్కలో పరిగణింపబడి యశస్సును గడించును.

"కనుక, రాజా! ప్రయత్న పూర్వకముగా మనుష్యుడు మంచి ప్రవర్తనను రక్షించుకొన వలెను. ధనము వచ్చుచు పోవుచు నుండును. ధనము లేకున్నను మంచినడత గలవారు దరిద్రు లనిపించుకొనరు. నడవడిక చెడినవాడు అన్ని విధములను భ్రష్టు డై నశించు నని తెలిసికొన వలెను. గోవులు - పశువులు - అశ్వములు - మంచి కృషికర్మ (వ్యవసాయము) ఇవి యన్ని యున్నను మంచి పవర్తన లేని కులములు అభివృద్ధి పొందజాలవు.

''రాజా! శత్రుత్వము చేయువాడు - ఇతరుల ధనము నపహరించువాడు - రాజు - మంత్రి - మిత్రద్రోహి - కపటి - అసత్యవాది - పితురులకు, దేవతలకు, అతిథులకున్ను సమర్పించుటకు పూర్వమే భోజనము చేయువాడు - వీరు మా కులమునందు పుట్ట కుందురుగాక యని కోరుకొన వలెను. బ్రాహ్మణహత్య-బ్రాహ్మణద్వేషము - పితరులకు తర్పణ శ్రాద్ధాదులున్ను చేయకుండుట" - ఇవి మా సమాజములో నుండ కండుగాక యని కోరుకొన వలెను. సజ్జనుల యిండ్లలో దర్భాసనము - భూమి - ఉదకము - మధుర మైన సత్యభాషణము - ఈ నాలుగింటికి కొదువ యుండదు.

''రాజా! పుణ్యకర్మలు చేసిన ధర్మాత్ముల యిండ్లలో పైన జెప్పబడిన నాలుగున్ను శ్రద్ధతో సత్కరించుటకు కూర్చుకొన బడును.

''రాజా! రథము చిన్నదైనను బరువు మోయగలదు. చిన్న వృక్షములు అట్లు గాదు. అవి బరువు మోయజాలవు. అలాగే ఉత్తమ కులమున పుట్టినవాడు ఎంత బరువు నైనను సహించ గలడు. తదితరులు అట్లు కాదు. తన కోపమునకు భయపడువాడు-సందేహించుచు (భయపడుచు) సేవ చేయువాడున్ను మిత్రుడు కా జాలడు. ఎవనిని తండ్రినివలె విశ్వసింప వచ్చునో అతడే మిత్రుడగును. ఇతర మిత్రులను కేవలము తనతో కలిసి తిరుగువారినిగానే భావించ వలెను. పూర్వమునుండి యేలాటి సంబంధము లే కున్నప్పటికిని తనతో మైత్రి చేయు వానిని బంధువుగా, మిత్రుడుగా, ఏడుగడగా, ఆశ్రయుడుగాను తలంచ వలెను.

చంచల చిత్తుడు-వృద్ధులను సేవించనివాడు-సదా అనిశ్చిత మైన బుద్ధి గలవాడును. చేయు మిత్రసంగ్రహము (మిత్రులను సేకరించుకొనుట) స్థిరము కాదు.

''రాజా! చంచలచిత్తుడు-అజ్ఞాని-ఇంద్రియములకు బానిస యైనవాడు- వీరి నుండి అర్థములు, ఎండినసరస్సును హంసలు విడుచునట్లు విడిపోవును. దుష్టుల స్వభావము చలించుచున్న మేఘమువంటిది. వారికి అకస్మాత్తుగా కోపము సంతోషమున్ను కలుగు చుండును.

"మిత్రుల సత్కారమును పొందియు- వారి సహాయమువలన తమ కార్యములను నెరవేర్చుకొనియు - నిష్కపట మైత్రితో ప్రవర్తించని కృతఘ్నులు చచ్చిన తరువాత మాంసభోజనము చేయు జంతువులు గూడ వారి శవములను ముట్టవు.

'మిత్రుడు ధనవంతు డైనను-దరిద్రు డైనను ధనమును ఆశించక అతనిని పూజించ వలసినదే, మిత్రులసారమును-అసారమునున్ను పరీక్షించగూడదు.

''సంతాపమువలన రూప-బల-జ్ఞానములు నశించి రోగమును పొందును. శోకించినంత మాత్రముచేత పొంద దగిన వస్తువు లభించదు. శోకముచేత శరీరము తపించును. అందుచేత శత్రువులు సంతోషించెదరు. కనుక శోకింపకుము.

''మనుష్యునకు మాటిమాటికి జనన-మరణములు హానివృద్ధులు సంప్రాప్తము లగుచునే యుండును. అలాగే, తనను ఇతరులు యాచించు చుందురు. తానుగూడ అన్యుల నడుగు చుండును. అట్లే ఇతరులకొరకు తాను దుఃఖపడుట, ఇతరులు తనకొరకు దుఃఖించుటయు జరుగుచునే యుండును.

"సుఖ-దుఃఖములు, శుభాశుభములు, లాభాలాభములు-జననమరణములు- ఇవి క్రమముగా నొకటి వెనుక నొకటి అందరికిని ప్రాప్తించు చుండును. అందుచేత వానివలన సంతోషమును, శోకమును చెంద గూడదు.

''ఆరు ఇంద్రియములు (కన్ను, ముక్కు-చెవి-నాలుక-చర్మము-మనస్సు) చంచలములు. వీనిలో ఏయే యింద్రియము ఏయే విషయము వైపు (కన్ను-రూపమువైపు, ముక్కు-గంధమువైపు, చెవి-శబ్దమువైపు, నాలుక-రుచివైపు, చర్మము-స్పర్శమువైపు, మనస్సు-ఈయన్నిటి ద్వారామున నన్నివైపులు) సాగిపోవు చుండునో, అక్కడక్కడ బుద్ధి రంధ్రముల గలకడవ నుండి నీరు జారిపోవునట్లు, క్షీణించు చుండును."

ఈ మాటలు విని ధృతరాష్ట్రుడు విదురునితో ని ట్లనెను :

"విదురా! నన్ను అనుసరించువాడు అగ్నివలె పవిత్ర ధర్మాత్ముడు నైన యుధిష్ఠిరుని నేను అసత్యవ్యవహారముతో దూరము చేసితిని. అతడు మూర్ఖులైన నా పుత్రులను నశింప జేయును. దీనిచేత నా మనస్సు సర్వదా భయము-ఉద్వేగము(సంతాపము)న్ను చెందు చున్నది. ఈ తాపము పోయి శాంత మైన స్థానమును నాకు ఉపదేశింపుము."

ఆ మాటకు విదురు డి ట్లనెను:

''ధృతరాష్ట్ర మహారాజా! విద్య-తపస్సు-ఇంద్రియ నిగ్రహము - లోభత్యాగము-ఇవిదప్ప నీమనస్సుకు శాంతిని గలిగించునవి మరి యేమియు లేవు.

''మనుష్యుడు బుద్ధిచేత భయము పోగొట్టుకొనును. తపస్సుచేత మహాస్థానమును, గురుశుశ్రూష (సేవ) చేత జ్ఞానమును, యోగము (చిత్తవృత్తి నిరోధము) చేత శాంతిని పొందును.

''మోక్షమునందు ఇచ్ఛగలవారు దానము, వేదములు-ఈ రెంటివలన గలుగు పుణ్యమును ఆశ్రయింపక, రాగ-ద్వేషములనుండి విముక్తులై నిష్కామ భావముతో ఈ లోకమునందు సంచరించు చుందురు.

''సక్రమ వేదాధ్యయనము - ధర్మయుద్ధము - పుణ్యకర్మ-బాగుగా చేసిన తపస్సు-వీని అంతమునందు సుఖము వృద్ధి చెందును.

"'తమలో తమకు భేదభావము గలిగినప్పుడు అట్టివారు మంచి పరుపుపైన పండుకొనినను సుఖముగా నిద్రించ జాలరు. స్త్రీలతో నున్నను, వందిమాగధుల స్తోత్రపాఠములు విన్నను ప్రసన్నులుగా నుండరు. అట్టివారు ఎప్పుడుగూడ ధర్మము నాచరించరు. సుఖమును గౌరవమును పొందరు. శాంతిగూడ వారిని సమాధానపరచదు. వారికి చెప్పబడిన హితవాక్కు రుచించదు. యోగ-క్షేమములు సిద్ధించవు. రాజా! అట్లు భేదము పుట్టినపుడు వారికి వినాశనముకన్న వేరు గతి లేదు

"రాజా! గోవులయందు పాలు-బ్రాహ్మణులయందు తపస్సు-స్త్రీలయందు చంచలత్వమున్ను ఎట్లు సంభవమో అట్లే జ్ఞాతులనుండి భయముగూడ సహజముగా సంభావ్య మగును.

''సన్నని లతలు ప్రతిదినము తడుపబడి ఉబ్బి-ఊరి గట్టిపడి అనేకవిధములైన భారములను-ఊగుటను సహింపజాలునట్లు సత్పురుషులుగూడ దుర్బలులైనను సామూహిక శక్తిచేత బలవంతు లగుదురు అని తెలిసికొన వలెను.

"ధృతరాష్ట్ర మహారాజా! మండు చున్న కట్టెలు విడివిడిగా నుంచ బడినప్పుడు పొగలు విడుచును. వాటినే ఒకటిగా చేర్చినప్పుడు అవి జ్వలించును. ఈ విధముగానే, జాతిబంధువులు గూడ ఒండొరులు విడిపోయినప్పుడు దుఃఖమును అనుభవించెదరు, ఒకటిగా నున్నప్పుడు సుఖపడెదరు.

"రాజా! బ్రాహ్మణుల యందు - స్త్రీల యందు - జ్ఞాతుల యందున్ను శౌర్యమును చూపువారు, బాగుగా మాగిన పండు తొడిమనుండి ఊడి పడునట్లు, క్రింద పడుదురు.

''వృక్షము మంచి బలము గలిగి, వేళ్ళు బాగుగా నాటుకొని యుండి చాలా పెద్దదిగా నున్నను, అది ఒక్కటిగా నున్నప్పుడు సుడిగాలి చేత కొమ్మలతో పాటు క్రింద పడిపోవును, వృక్షము లన్నియు నొకచోట గుంపుగా నుండిన యెడల నవి ఒండొంటి సహాయముతో వేగముగా వీచు చున్న ఉప్పెన గాలికి కూడ తట్టుకొని నిలువ గలవు.

"ఇట్లే, ఎన్ని గుణములు గలవా డైనను ఒంటరిగా నున్న మనుష్యుని, ఏకాకిగా నున్న చెట్టును వాయువు వలె, శత్రువులు ఓడింప వచ్చు నని తలచెదరు. జ్ఞాతులు పరస్పరము కలిసి-మెలసి యుండుటచేత. పరస్పరము ఆశ్రయించుట చేతను, సరస్సు నందు కమలములు వలె, వృద్ధి చెందెదరు.

"రాజా! బ్రాహ్మణులు - గోవులు - జ్ఞాతులు - శిశువులు - స్త్రీలు - అన్నదాతలు - శరణాగతులున్ను వధింప దగినవారు కారు.

"మనుష్యునకు ధనము-ఆరోగ్యము-ఈ రెండిటి కన్న మించినది లేదు. రోగులు చచ్చిన వానితో సమానులు.

"రాజా! క్రోధ మనునది-రోగము లేకయే పుట్టును. చేదుగా నుండును, తలనొప్పి గలిగించును, అది పాపముతో గూడినది-కఠోర మైనది, తీక్ష్ణమైనది ఉష్ణము నైనది. అట్టి క్రోధమును సజ్జనులు పానము చేసెదరు. లోపలనే అణచుకొనెదరు. దుర్జనులు మ్రింగ జాలరు.

"రాజా! నీవు అట్టి క్రోధమును మ్రింగి శాంతు డ వగుము రోగపీడితులు మధుర ఫలములను కోరరు-విషయసుఖము లైన వనితాదుల యందు వారికి సుఖము లభించదు, రోగులు సర్వదా దుఃఖితులై యుందురు. ధన భోగములను సుఖములనున్ను తెలిసికొని అనుభవించ జాలరు.

''మహారాజా! జూదము నందు జయింప బడిన ద్రౌపదిని చూచి నేను నీతో 'ద్యూతక్రీడ యందు అసక్తు డైన దుర్యోధనుని వారింపుము. పండితులు జూదమును వర్జించెదరు' అని పూర్వమే యెంతయో చెప్పితిని. కాని, నా మాట పెడచెవిని బెట్టితివి.

''మృదు స్వభావము గలవానితో విరోధము తెచ్చు బలము బలము గాదు సూక్ష్మ మైన ధర్మమును త్వరగా సేవించ వలెను. క్రూరత్వముచేత సంపాదించ బడిన సంపద నశించుసదిగా నుండును. సంపద మృదుత్వము ద్వారా సంపాదింవ బడిన దై న యెడల, అది పుత్ర-పౌత్రపారంపర్యముగా స్థిరపడి యుండును.

"ధార్తరాష్ట్రులైనను పాండవులను పాలింతురుగాక పాండవులైనను ధార్త రాష్ట్రులను పాలింతురు గాక వీరిమిత్రులు వారికి మిత్రులుగాను - వీరి శత్రువులు వారికి శత్రువులుగాను ఉండి పరస్పరము ఏక కార్యాసక్తులై, సుఖ సమృద్ధులతో జీవించి యుందురుగాక.

''అజమీఢకుల నందనా! ఇప్పుడు నీవే కౌరవులకు ఆధార స్తంభముగా నున్నావు. కురువంశము నీయధీనము నందే యున్నది. కుంతీపుత్రులు నీబాలకులు వనవాసక్లేశము ననుభవించినవారు. వారిని రక్షింపుము. నీ కీర్తిని గూడ రక్షించు కొనుము.

''కురురాజా! పాండవులతో సంధి చేసికొనుము. దానిచేత శత్రువులు మీ రంధ్రాన్వేషణము చేయ జాలరు. పాండవు లందరు సత్యమునందు దృఢముగా నిలిచి యున్నారు. ఇప్పుడు నీవు దుర్యోధనుని యుద్ధమునుండి ఆపివేయుము.''

ఇట్లు చెప్పి విదురుడు ఇంకను నీతి వాక్యములు ధృతరాష్ట్రునితో నీ విధముగా చెప్పదొడగెను:

విదురుడు ధృతరాష్ట్రునకు హితోపదేశము చేయుట

"రాజేంద్రా! ఆకాశమును పిడికిళ్ళతో కొట్టువారు-వంచ బడుటకు అశక్య మైన యింద్రధనుస్సును వంచుటకు ప్రయత్నించువారు - పట్టువడని సూర్య కిరణములను పట్టుకొనుటకు ప్రయాసపడువారు నైన పదునేడు విధము లైన పురుషులను గూర్చి స్వాయంభువ మనువు చెప్పెను. (ఈ యందరి ప్రయత్న ములు నిష్ఫలము లని చెప్పెను.)

1. శాసింప దగని పురుషులను శాసించువారు 2. మితి మీరి ప్రవర్తించుట చేత సంతుష్టి చెందు వారు 3. శత్రువును సేవించువారు 4. రక్షింప దగని స్త్రీ లను రక్షించుటకు ప్రయత్నించుచు దానిచేత తమకు శుభము కలుగు నని తలంచువారు 5. యాచించ దగని పురుషులను యాచించువారు 6, అందుకు తమను ప్రశంసించు కొనువారు 7. ఉత్తమ కులమునందు పుట్టియు నీచకర్మ చేయువాడు 8 దుర్బలు లయ్యు బలవంతునితో శత్రుత్వము చేయువారు 9. శ్రద్ధ లేనివారికి ఉపదేశము చేయువారు 10. కోర దగని శాస్త్ర నిషిద్ధ మైన వస్తువును కోరువారు 11. కోడలితో ప్రేమ పరిహాసము చేయువారు 12. ఆమెతో ఏకాంత వాసము చేసియు నిర్భయు లై సంఘము నందు తమకు గౌరవము కోరువారు 13. పరస్త్రీ సంగమము చేయువారు 14. విశేషముగా స్త్రీని నిందించువారు 15. ఎవని నుండి యైనను ఒక వస్తువు తీసుకొని 'నాకు జ్ఞాపకము లేదు' అని గద్దించువారు 16 అడిగినప్పుడు దానము చేసి, దాని కొరకు తమను శ్లాఘించు కొనువారు 17 అసత్యము సత్యముగా రుజువు చేయుటకు ప్రయత్నించువారు. ఈ పదునేడుగురిని పాశహస్తు లైన యమదూతలు నరకమునకు తీసికొని పోయె దరు.

"రాజా! ఎవడు తనతో ఎలాగు వ్యవహరించునో, తాను గూడ అట్లే వానితో వ్యవహరించ వలెను. కపటితో కపటిగానే, సజ్జనునితో సజ్జనుడుగానే వ్యవహరించుట ధర్మము.

''ముసలితనము రూపసౌందర్యములను, ఆశ ధైర్యమును, మృత్యువు ప్రాణమును, అసూయ ధర్మాచరణమును, కామము లజ్జను, దుర్జనులను సేవించుట మంచి నడవడిని, క్రోధము సంపదను, స్వాభిమానము సర్వమునున్ను హరించును.

ఆ మాటలు విని ధృతరాష్ట్రుడు విదురునితో నిట్లనెను:

"విదురా! సర్వ వేదముల యందున్ను పురుషునకు నూరేండ్లు ఆయుస్సు ఉండు నని చెప్ప బడినది. కాని, ఆ పూర్ణా యుస్సును పురుషుడు పొందుట లేదు, కారణ మేమి?"

ఆ మాటకు విదురు డిట్లు బదులు చెప్పెను:

"రాజా! మిక్కిలి అభిమానము-మితి మారి మాటాడుట - త్యాగము చేయ కుండుట-క్రోధము - తన ఉదరపోషణమే ప్రధానముగా చూచుకొనుటకు చింతించుట-మిత్రద్రోహము-ఈ యారున్ను పదు నైన కత్తుల వంటివి. ఇవి దేహధారుల ఆయుస్సును హరించును. మానవుల నివియే చంపును. కాని, మృత్యుదేవతకాదు.

"తనను విశ్వసించినవాని భార్యను పొందువాడు- గురు భార్యా సంగమము చేయువాడు - శూద్ర స్త్రీకి పతి యైన ద్విజుడు - మద్యపానము చేయువాడు - బ్రాహ్మణునిపైన ఆజ్ఞను నడుపువాడు - బ్రాహ్మణుల జీవన వృత్తికి భంగము కలిగించువాడు - బ్రాహ్మణునితో సేవలు చేయించుకొనువాడు - శరణు జొచ్చిన వానిని హింసించువాడు-వీ రందరు గూడ బ్రహ్మహత్య చేసిన వారితో సమానులు. వీరితో సాంగత్యము జరిపిన వారు ప్రాయశ్చిత్తము చేసికొన వలెను. ఇది వేదముల యాజ్ఞ.

"రాజా! పెద్దల యాజ్ఞను గౌరవించువాడు-నీతికోవిదుడు - దాత - యజ్ఞములో మిగిలిన యన్నమును తినువాడు-అహింసకుడు-కీడు తెచ్చు పనులనుండి దూరముగ నుండువాడు - కృతజ్ఞుడు - సత్యవాది - మృదు స్వభావము గల పండితుడు - వీరు స్వర్గమునకు పోవుదురు.

"రాజా! ఎల్లప్పుడు ప్రియములను మాటాడు పురుషులు తేలికగా లభించెదరు. అప్రియములుగా నుండి, హిత వాక్యములను మాటాడువారు, అట్టి మాటలను వినువారన్ను దుర్లభులు.

"ధర్మమును ఆశ్రయించి, యజమానునకు తన మాట ప్రియము అగునో అప్రియ మగునో అని విచారించక తన మాట యజమానునకు అప్రియ మైనను అతనికి హిత మైన మాటను చెప్పువాడు రాజునకు నిక్క మైన సహాయము చేయును.

"ఒక కులము హితము కొరకు పురుషుని-ఒక గ్రామము హితము కొరకు కులమును-దేశము హితము కొరకు గ్రామమును - తన హితము కొరకు సమస్త భూమండలమునున్ను విడువ వలెను.

"ఆపదలలో ఉపయోగపడుటకు ధనమును - ధనమును వెచ్చించి యైనను భార్యను - ధనముచేత, భార్యచేతను (ఈ రెంటిని విడిచి యైనను) తనను (ఆత్మను) రక్షించుకొన వలెను. (ఆత్మ యొక్క ఉన్నతికై ముక్తిని సాధించువాడు ధన - భార్యాది సంసారమును విడువ వలె నని భావము).

"రాజా! పూర్వకాలమునందు జూద మాడుటవలన మనుష్యులతో వైరము కలిగెను. అందుచేత బుద్ధిమంతుడు ద్యూతమును విలాసమున కైనను, హాస్యము కొర కైనను ఆడ గూడదు.

"రాజా! పూర్వము ద్యూతకాలమునందు గూడ ఇది యుక్తము కా దని నేను చెప్పితిని. నా మాట, రోగికి ఔషధము - పథ్యమున్ను రుచించనట్లు, నీకు రుచించ లేదు.

"చిత్ర విచిత్రము లైన పింఛములు గల నెమళ్ళను కాకులచేత ఓడింప జేసినట్లు, దుర్యోధనాదులచేత పాండవులను జయింప జేసితివి. సింహములను విడిచి, నక్కలను, వాని కుట్రలను కప్పిపుచ్చి, రక్షించు చున్నావు. సమయము వచ్చినప్పుడు, దానికై నీవు పశ్చాత్తాపపడ వలసి యుండును.

"భృత్యునిపైన - భక్తునిపైన - హితము గోరువానిపైన ఎప్పుడు గూడ కోపగించని ప్రభువుపైనను ఆ భృత్యాదులు ఎల్లకాలము విశ్వాసము ఉంచుదురు. వారిని ఆ పత్సమయములందు విడువరు.

"భృత్యుల జీవికకు భంగము చేసి యితరుల ధన- రాజ్యములను అపహరించుటకు ప్రయత్నము చేయ గూడదు. భృత్యులు తమ జీవికను లాగుకొనుటచేత సుఖములకు దూర మై పూర్వపు మంత్రులు గూడ విరోధు లై రాజును విడిచెదరు.

"మొదటనే, చేయ వలసిన పని, ఆయ-వ్యయములు, తగిన వేతనములు-మొద లైనవానిని నిశ్చయించుకొని, తరువాత యోగ్యు లైన సహాయకులను

కూర్చుకొన వలెను. కఠినాతికఠినము లైన పనులు గూడ సహాయకులద్వారా నెరవేర గలవు.

"ప్రభువు యొక్క అభిప్రాయానుసారముగా మెలగుచు, సోమరి గాక అన్ని కార్యములను చేయుచు, హితవాక్యములను పలుకుచు, ప్రభు భక్తి గలవాడై, సజ్జనుడుగా నుండి, రాజు యొక్క శక్తిని తెలిసికొని కార్యము నిర్వహించు సేవకుని తనతో సమానునిగా తలచి అతని యెడల దయ జూప వలెను.

ప్రభువు యొక్క ఆజ్ఞను ఆదరించక, ఒప్పగించిన పనిని ఒప్పుకొనక, తాను బుద్ధిశాలి నని గర్వించుచు, తనకు ప్రతికూలముగా మాటాడు భృత్యుని తక్షణమే విడువ వలెను.

అహంకార రహితుడు, సోమరి కానివాడు, విలంబముగా పని చేయని వాడు, దయ గలవాడు, పరిశుద్ధ మనస్సు గలవాడు, ఇతరుల దుర్బోధలకు లొంగనివాడు, ఆరోగ్యవంతుడు, ఉదారము మాట్లాడువాడు - ఈ యెనిమిది విధములచేత దూత గుణవంతుడుగా పేర్కొన బడును. ఇట్టివానినే దూతగా నియమించుకొన వలెను.

''రాజా! జాగ్రత్త గల మనుష్యుడు అసమయమునందు ఇతరుల యిండ్లకు నమ్మకముతో పో గూడదు. రాత్రులలో చత్వరము (నాలుగు త్రోవలు గలియు చోట) నందు నిలువ గూడదు. రాజు కామించిన స్త్రీని కోర గూడదు. దుష్టులైన సహాయకులు గల రాజు, అనేకులతో మంత్రాలోచన సమావేశమునందు గూర్చొని సభ్యుల యభిప్రాయములను తీసికొను చున్నప్పుడు, ఆయన మాటను ఖండించ గూడదు. 'నాకు నీ యందు విశ్వాసము లేదు' అని కూడ అన గూడదు. కాని, సకారణ మైన సాకు చెప్పి ఆ సమావేశము నుండి వెడలి పో వలెను. అది బుద్ధిశాలి లక్షణము.

"మిక్కిలి దయ గల రాజు - వ్యభిచారిణి యైన స్త్రీ - రాజభృత్యుడు - పుత్రుడు - సోదరుడు - చిన్న పిల్లలు గల విధవాస్త్రీ - సైనికుడు - అధికారము నుండి తొలగింప బడినవాడు - వీ రందరితో ఇచ్చి పుచ్చుకొను వ్యవహారము చేయ గూడదు.

"బుద్ధి - సత్కులీనత్వము - శాస్త్రాభ్యాసము - ఇంద్రియ నిగ్రహము - పరాక్రమము - మిత భాషిత్వము - యథా శక్తిదానము చేయుట - కృతజ్ఞత -

ఈ యెనిమిది సద్గుణములు పురుషుని ప్రకాశింప జేయును. ఈ యన్నింటిని మించిన సద్గుణము సత్పురుషుని సత్కరించుట.

''బలము - రూపము - మధుర స్వరము - పరిశుద్ధ మైన వర్ణము - కోమలత్వము - సుగంధము - పవిత్రత్వము - శోభ - సౌకుమార్యము - సుందర స్త్రీలు - ఈ పది విధములైన లాభములు ప్రతి దినము స్నానము చేయు మనుష్యునకు కలుగును.

''ఆరోగ్యము - ఆయుస్సు - బలము - సుఖము - ఉత్తమ సంతానము - ఈ గుణములు మితముగా భోజనము చేయు మనుష్యునకు గలుగును. ఇంతయే కాక, 'ఇతడు చాల తినువాడు' అని కూడ లోకులు అతనిని ఆక్షేపింపక యుండెదరు.

"పని చేయని స్వభావము గలవాడు - ఎక్కువ తినువాడు - అందరితో ద్వేషము చేయువాడు - అనేక కపట కృత్యములు చేయువాడు- క్రూరుడు - దేశ కాలజ్ఞానము లేనివాడు - అసహ్య వేషధారణము చేయువాడు నైన మనుష్యుని తన యింటిలో నెప్పుడు గూడ ఉండ నీయ గూడదు.

''మహారాజా! పిసినిగొట్టు - నిందావాక్యములను వదరు చుండువాడు - శాస్త్రజ్ఞానము లేనివాడు- వనవాసి - ధూర్తుడు - నీచులను సేవించువాడు - దయ లేనివాడు - వైరము గలవాడు - కృతఘ్నుడు - వీరిని ఎన్ని కష్టములలో చిక్కుపడినను ఒకప్పుడు గూడ యాచించ గూడదు.

"క్లేశము గలిగించు కర్మలు చేయువాడు - మిక్కిలి యేమరుపాటు గల వాడు - ఎల్లప్పుడు అసత్యము లాడువాడు - అస్థిర మైన భక్తి గలవాడు - స్నేహము లేనివాడు - తాను చతురుడ ననుకొనువాడు - నరాధము లైన యీ ఆరుగురిని సేవించ గూడదు.

''ధన ప్రాప్తి సహాయకునివలన కలుగును. సహాయకుడు ధనము వలన లభించును. కనుక ఈ రెండున్ను పరస్పరము ఆశ్రయించి యున్నవి. ఇవి సిద్ధించుటకు అన్యోన్య సహకారము ఆవశ్యకము.

''రాజా! పుత్రులను కని, వారికి ఋణము లేకుండ చేసి, వారికి ఒక జీవికా వృత్తిని ఏర్పరచి, తన కన్యకలకు యోగ్యు లైన వరులతో వివాహము

చేయ వలెను. ఆ తరువాతనే వానప్రస్థాశ్రమము నాశ్రయించి, మునివృత్తితో అడవియందు ఉండ వలెను.

''సర్వప్రాణులకు హితము - తనకు సుఖకరము నైన ఈశ్వరార్పణ బుద్ధిచే చేయ వలెను. పరిపూర్ణసిద్ధికి ఇదియే మూలము.

''వృద్ధి పొందు శక్తి - ప్రభావము - తేజస్సు - బలము - ప్రయత్నము- కర్తవ్య నిశ్చయము - ఇవి గలవానికి జీవిక కొరకు భయపడ వలసిన యవసరమే మున్నది?

''రాజా! పాండవులతో యుద్ధము చేయుటలో గల దోషములను విచారించుము. వారితో యుద్ధము మొదలైన తరువాత ఇంద్రాది దేవతలు గూడ కష్టపడ వలసి వచ్చును. ఇదిగాక, పుత్రులతో వైరము వలన, సర్వదా ఉద్వేగ (భయము) పూరిత మైన జీవనము - కీర్తి నాశము - శత్రువులకు ఆనందము గూడ కలుగును.

''రాజా! భీష్మునియొక్క - నీయొక్క - ద్రోణుని యొక్క - యుధిష్ఠిరుని యొక్కయు కోపము వృద్ధి పొందినచో నది, ఆకాశమునందు అడ్డముగా పుట్టిన ధూమకేతువు వలె, ప్రపంచమునందు అశాంతిని, పీడను గలిగించి నశింప జేయును.

''నీ నూర్గురు పుత్రులు - కర్ణుడు - పాండవులు - వీరందరు కలిసి సముద్ర ముద్రిత మైన సమస్త భూమండలమును శాసించ గలరు.

''నీ పుత్రులు వనము, పాండవులు అందులో నివసించు వ్యాఘ్రములు. పాండవులను వనమునుండి వెడల గొట్టి కౌరవ వనము ఛేదింపకుము. వనము లేకుండ వ్యాఘ్రములు - అవి లేకుండ వనమున్ను మన జాలవు. వనము వ్యాఘ్రములను - అవి వనమును రక్షించును.

''రాజా! పాపపు మనస్సు గలవారు ఇతరుల చెడు గుణములను కనుగొనుటకు చూపు ఇచ్చును, మంచి గుణములయెడల చూపరు. అర్థసిద్ధిని పూర్తిగా కోరువాడు ఆదినుండియే ధర్మమును ఆచరించును. స్వర్గలోకమునుండి అమృతము వేరుకానట్లు, ధర్మమునుండి అర్థము గూడ వేరు గాదు.

''పాపము మానుకొని - పుణ్యమునందే మనస్సు గలవాడు ప్రపంచములో నున్న ప్రకృతి - వికృతుల నన్నిటిని బాగుగా తెలిసికొన గలడు.

''ధర్మ - అర్థ - కామములను కాలానుగుణముగా సేవించువాడు ఇహ - పరలోకములలో ధర్మార్థకామములను పొందును.

''రాజా! యెవడు క్రోధ - సంతోషముల వేగమును అణచి యుంచునో - ఆపదలలో మోహము చెందడో అట్టివాడే రాజలక్ష్మికి అధికారి కా గలడు.

''బలములు అయిదు (1) బాహుబలము - (ఇది నికృష్ట బలము) (2) అమాత్యలాభము (3) ధనబలము (4) సహజముగా తండ్రి తాతలనుండి వంశపారంపర్యముగా సంక్రమించిన బలము - అది అభిజాతబల మనబడును. రాజా! ఈ నాలుగు బలములను సంపాదించునటువంటి బలము బుద్ధిబలము. ఇది అయిదవది. ఇది అన్నిటికన్న శ్రేష్ఠ మైనది.

''గొప్ప అపకారము చేయగల వానితో శత్రుత్వము పెట్టుకొని, 'వాని నుండి నేను దూరమగు చున్నాను. అతడు నన్ను ఏమియు చేయ జాలడు' అను విశ్వాసముతో నిశ్చింతుడవుగా నుండకుము.

''రాజా! స్త్రీలు - రాజులు - సర్పములు-చదివిన పాఠములు - సమర్థులు - శత్రువులు - సుఖములు - ఆయుస్సు - వీనియందు విశ్వాసమును ఉంచు బుద్ధిమంతుడు ఎవడు ఉండును?

''రాజా! బుద్ధి యను బాణముచేత కొట్టబడిన ప్రాణిని కాపాడుటకు వైద్యుడు, మందు, హోమము, మంత్రము, శుభకార్యములు, అథర్వ వేదోక్త ప్రయోగములు, వనమూలికలు - ఇవి యేమియు నుపయోగపడవు.

''రాజా! 'సర్పము - అగ్ని - సింహము - తన కులమునందు పుట్టిన పుత్రుడు' - వీరందరు మిక్కిలి తేజస్సు (శక్తి) గలవారు గనుక, వీరిని అనాదరము చేయ గూడదు.

''ప్రపంచమునందు అగ్ని యొక గొప్ప తేజస్సు - అది కట్టెయందు గూఢముగా నుండును. కాని, ఇతరులు అగ్నిని జ్వలింప జేయువరకు, అగ్ని ఆ కొయ్యను గూడ కాల్చదు. ఆ యగ్నియే కొయ్యను చిలికి దానినుండి వెలికి తీయ బడినప్పుడు తన జన్మస్థాన మైన కాష్ఠమునేకాక, యితరము లైన వనాదులను గూడ దహించును.

''ఈ విధముగనే, నీ కులమునందు పుట్టిన పాండవులు అగ్నితో సమాన మైన తేజస్సు గలవారు. వారికి ఓర్పు గలదు. వారు ఏ వికారము లేని కాష్ఠము

నందు దాగియున్న అగ్నివలె, గుప్తముగా తమ గుణములను, మహిమనున్ను తమలో దాచుకొని యున్నారు.

''నీవు నీ పుత్రులున్ను లతలవంటివారు. పాండవులు గొప్ప మద్దిచెట్టుల వంటివారు. పెద్ద వృక్షముల యొక్క ఆశ్రయము లేక తీగలు ఎప్పుడుగూడ వృద్ధి పొంద జాలవు. కనుక రాజా! నేను చెప్పినట్లు వనమువంటి కౌరవులతో సింహము వంటి పాండవులు చేరి యున్నప్పుడు వానికి పరస్పర రక్షణము కలుగును.''

ఈ మాటలు చెప్పి విదురుడు ఇంకను నిట్లు నీతి బోధ ధృతరాష్ట్రునకు చేసెను:

విదురుడు ధృతరాష్ట్రునకు నీతిని ఉపదేశించుట

"రాజా! ఎవ డైన పూజ్య వృద్ధ పురుషులు సమీపమునకు వచ్చినపుడు యువకుని ప్రాణములు పైకి లేచి పోవు చుండును. అప్పు డా వృద్ధునకు యువకుడు స్వాగతము చెప్పి నమస్కరించిన యెడల తిరిగి ఆ ప్రాణములు వాస్తవస్థితికి చేరుకొనును.

''అతిథిగా వచ్చిన సాధుపురుషునకు పీటవేసి, పాదములు గడిగి, కుశల ప్రశ్న చేసి, తన స్థితిని తెలుప వలెను. తరువాత అతిథి యావశ్యకతను బట్టి భోజనము పెట్టవలెను. వేదవేత్త యైన బ్రాహ్మణుడు అతిథిగా వచ్చి, గృహస్థుని లోభము, భయము, పిసినిగొట్టుతనమున్ను కారణముగా జలమును, మధుపర్కము (తేనె గలిపిన పాలు)ను, గోవునున్ను స్వీకరింపక పోయిన యెడల, అట్టి గృహస్థుని జీవితము వ్యర్థ మని పెద్దలు చెప్పెదరు.

''వైద్యుడు - శల్య చికిత్సకుడు - బ్రహ్మచర్యభ్రష్టుడు - చోరుడు - క్రూరుడు - మద్యపానము చేయువాడు - భ్రూణ (గర్భము) హత్య చేసినవాడు - సైనికుడు - వేద విక్రయము చేయువాడు - వీరు ఇంటికి అతిథులుగా వచ్చినపుడు వారు కాళ్లు కడుగ బడుటకు అర్హులు గా కున్నను - వారికి ఆదరపూర్వకముగా స్వాగతము చెప్పి సత్కరించ వలెను.

"రాజా! 'లవణము - వండబడిన యన్నము - పెరుగు - పాలు . తేనె - నూనె - నేయి - నూవులు - మాంసము - ఫలములు - మూలములు (వ్రేళ్ళు,

దుంపలు) - కూరలు - ఎఱ్ఱని వస్త్రము - అన్ని విధము లైన గంధ ద్రవ్యములు - బెల్లము' - ఇవి అమ్మ బడుటకు యోగ్యములు కావు.

''రాజా! క్రోధరహితుడు - మంచి చెడ్డ, బంగారము రెండు సమానముగా జూచువాడు - శోకరహితుడు, సంధి - విగ్రహములు (మైత్రీ - ద్వేషములు) లేనివాడు - నింద, ప్రశంస ఈ రెండున్ను లేనివాడు - ప్రియమును, అప్రియమును రెంటిని విడిచినవాడు - ఉదాసీనుడు (దేనితో సంబంధములేని వాడు) ఇట్టివాడు, భిక్షుకుడు (సన్యాసి) యన బడును.

'నివ్వరిధాన్యము (అడవిబియ్యము) - కందమూలములు - ఇంగుదీఫలములు (గార పండ్లు) - శాకములు ఇవి తిని జీవనము గడుపువాడు, 'మనో నిగ్రహము గలవాడు - అగ్నిహోత్రము (హోమము) చేయువాడు - వనవాసి యైనను అతిథి సేవలు సర్వదా చేయువాడు - పుణ్యాత్ముడు నైన ముని' ఇప్పుడు వానప్రస్థుడు అన బడును.

''రాజా! బుద్ధిమంతునకు అపకారము చేసి, 'దూరముగా నున్నాను నా కేమి?' యని విశ్వాసముతో నుండ గూడదు. బుద్ధిమంతుని బుద్ధి యను భుజములు చాల పొడ వైనవి - అతడు వానిచేత ఎంత దూరమం దున్న అపకారి నైనను హింసింప గలడు. అతడు విశ్వాసపాత్రుడుకాని వ్యక్తిని విశ్వసించనే విశ్వసింపడు. విశ్వాసపాత్రుని గూడ అధికముగా నమ్మడు. విశ్వసించినవానికి చేయ బడు ద్రోహము సమూలముగా ద్రోహిని నశింప జేయును.

''ఈర్ష్య లేనివాడు - భార్యారక్షకుడు - సంపదను న్యాయపూర్వకముగా విభజించువాడు - ప్రియములు పలుకువాడు - పరిశుద్ధ స్వభావుడుగా నుండవలెను.

"స్త్రీలతో మధురముగా మాటాడ వలెను. కాని,వారికి వశుడు కా గూడదు. స్త్రీలు గృహలక్ష్ములు, సౌభాగ్యవంతులు, ఆదరింపదగిన వారు, పుణ్యవతులు, ఇంటికి శోభను గూర్చువారు. అందుచేత స్త్రీలను ముఖ్యముగా రక్షించ వలెను. అంతఃపుర రక్షణము తండ్రికి, వంటయింటి రక్షణము తల్లికి, గోవుల రక్షణము తనకు సమాను డైన వ్యక్తికి ఒప్పగించవలెను. కార్యము (వ్యవసాయము) తాను స్వయముగా చేయ వలెను. ఇట్లే సేవకులద్వారా వ్యాపారము, పుత్రులద్వారా బ్రాహ్మణ సేవయు చేయించ వలెను.

''రాజా! జలమునుండి అగ్ని - బ్రాహ్మణునినుండి క్షత్రియుడు - పాషాణమునుండి యినుము పుట్టును. ఈ మూడింటిశక్తి అంతటను ఉపయోగ పడును. కాని, తన-తన జన్మస్థానమునందు వాని శక్తి కుంటుపడును.

"సత్కులమునందు పుట్టిన అగ్నిసమానులైన సత్పురుషులు ఓర్పుగలవారై తమ ఆకారము తెలియబడకుండ కొయ్యయందు అగ్నివలె గూఢముగా నుందురు.

"అంతరంగికులు - బయటివారు గూడ నెవని మంత్రాలోచనము తెలిసికొన జాలరో, అట్టి రాజు అన్ని వైపుల దృష్టి పెట్టి వ్యవహరించు చుండి, చాల కాలము ఐశ్వర్యమును అనుభవించును.

''తాను చేయ బోవు ధర్మార్థములను ఇతరులకు తెలుపకుండ, చేసిన వానినే తెలుప వలెను. అట్టివాని మంత్రాలోచనము బయటపడదు.

''పర్వత శిఖరము-మేడ యుపరిభాగము - ఏకాంతస్థానము - తృణాదుల చేత కప్పబడని అడవి- వీనియందు రహస్యమంత్రాలోచనము చేయ వలెను.

''రాజా! శత్రువు - అపండితుడైన మిత్రుడు - పండితమిత్రుడైనను మనోనిగ్రహము లేనివాడున్ను రహస్య మంత్రాలోచనమును తెలిసికొనుటకు అర్హుడు కారు.

''ధన ప్రాప్తి - రహస్య రక్షణము ఈ రెండు భారములు మంత్రిపైననే యుండును గాబట్టి, రాజు బాగుగా పరీక్షింపక మంత్రిని నియమింప గూడదు.

''ఏ రాజు ధర్మార్థకామ సంబంధములైన కార్యములు చేసిన తరువాతనే పారిషదుల (మంత్రిమండలి) కు అవి తెలుపునో, అట్టి రాజు, రాజులందరి లోను శ్రేష్ఠుడగును. తన రహస్యమును గూఢముగా నుంచు రాజునకు కార్య సిద్ధి కలుగు ననుటలో సందేహము లేదు.

''రాజా! శాస్త్రనిషిద్ధములైన కార్యములు మోహముచేత చేయు వాని పనులు చెడిపోవును. దాని ఫలితముగా అతని జీవితమునకే నాశము కలుగును.

''బ్రాహ్మణుడు వేదములు చదువకయే శ్రాద్ధకర్మలు చేయుటకు అర్హుడు కానట్టే, 'సంధి-విగ్రహ-యాన-ఆసన-ద్వైధీభావ-సమాశ్రయములు' అన బడు షడ్గుణములు లేనివాడు రహస్యరక్షణము చేయుటకు అర్హుడు కాడు. ఈ షడ్గుణ ములను బాగుగా తెలిసికొని, స్థితి-వృద్ధి-నాశములను గుర్తెరిగి, లోకమునందు

ఏ యవమానమును పొందక ప్రశంసనీయుడుగా ప్రసిద్ధి పొందిన రాజునకే భూమి స్వాధీనమగును.

''కోప-సంతోషములు వ్యర్థములు గాక, ఆవశ్యక కార్యములను స్వయముగా చూచుకొనుచు, ధనాగారము యొక్క పరిస్థితినిగూడ తానే చూచుకొనుచు నుండు రాజునకు సమస్త భూమి ధనోత్పత్తిని చేయు చుండును. 'రాజు' అను పేరుచేత ఛత్ర చామరాది రాజలాంఛనములచేత మాత్రమే సంతృప్తి చెందక, తన ధనమును సేవకుల యొక్క, ప్రజల యొక్కయు సౌఖ్యము కొరకు వెచ్చించ వలెను. తా నొక్కడే ధనమంతయు హరించగూడదు.

''బ్రాహ్మణుని బ్రాహ్మణుడు, మంత్రిని రాజు, స్త్రీని పతి, రాజును రాజే తెలిసికొనును.

''వధార్హుడైన శత్రువు తన చేజిక్కినప్పుడు అతనిని విడువ గూడదు. ఒకవేళ శత్రువు బలము తన బలముకన్న అధికమైన యెడల అతనికి నమ్రుడై కాలము గడప వలెను. తనకు బలము అధికమైనప్పుడు అతనిని చంపవలెను. ఎందుకనగా, శత్రువు చంపబడనిచో,వానివలన భయము త్వరగా కలుగగలదు.

''దేవతలు - రాజులు - బ్రాహ్మణులు - వృద్ధులు - బాలురు - రోగులు వీరియందు అతిప్రయత్నముతో నైనను కోపమును అరికట్ట వలెను.

''మూర్ఖులతో గలిగిన వ్యర్థకలహమును బుద్ధిమంతుడు విడువ వలెను. దానిచేత,లోకమునందు కీర్తి కలిగి, ముప్పునుండి దూర మగును.

''కోపానుగ్రహములు నిరర్థకములుగా చేయు రాజును, స్త్రీలు నపుంసక పతిని కోరనట్లు తమ రాజుగా ప్రజలు కోరరు.

''బుద్ధివలన ధనలాభము - మూర్ఖత్వముచేత దరిద్రత్వమున్ను కలుగు నను నియమమేమియులేదు. సంసార (ప్రపంచ) చక్రము యొక్క వృత్తాంత మును విద్వాంసులే తెలుసుకొన గలరు. ఇతరులు తెలియ జాలరు.

''రాజా! మూర్ఖుడు,విద్య-స్వభావము-వయస్సు-బుద్ధి-ధనము-సత్కులము-వీనిలో పెద్దలను సర్వదా అవమానపరచును.

"నింద్యమైన ప్రవర్తన - మూర్ఖత్వము- అసూయ - అధార్మికత్వము - చెడ్డగా మాట్లాడుట - క్రోధము - ఇవి గల వారికి త్వరగా సంకటములు ప్రాప్తించును.

''వంచన చేయకుండుట - దానము చేయుట - ప్రతిజ్ఞను ఉల్లంఘించకుండుట - ప్రాణులకు హిత మైన మంచిమాట లాడుట - ఈ సద్గుణములు గలవాడు సమస్త ప్రాణులను తనకు లోబరచుకొన గలడు.

''వంచకుడు గానివాడు - సమర్థుడు - కృతజ్ఞుడు - బుద్ధిమంతుడు - సరళుడు నైన రాజుయొక్క ధనాగారము క్షీణించినను సహాయకులను పొంద గలడు.

"రాజా! ఎవడు స్వయముగా దోషియై యుండియు, నిర్దోషు లైన ఆత్మీయులపై దోషములు మోపి, వారిని కోపింప జేయునో, అట్టివాడు, సర్పములు గల యింటిలోవలె రాత్రి సుఖముగా నిద్రపోవడు. అట్లు దోషా దోషము చేయబడిన వారికి యోగక్షేమములు లోపించి, వారు బాధపడు చున్నప్పుడు, దేవతలనువలె, వారిని ప్రసన్నులను చేయ వలెను.

"రాజా! ధనము మొదలైన వస్తువులను స్త్రీలకు, ఏమరుపాటు గల వారికి, చెడుప్రవర్తనలచేత పతితు లైనవారికి, నీచపురుషులకున్ను వశపరచిన యెడల అవి సంశయాస్పదములై పోవును.

"స్త్రీ - జూదరి - బాలకుడు - వీరు పాలించు దేశమునందలి ప్రజలు, రాతిపడవయందు కూర్చున్న వారివలె, వశము దప్పి ఆపద యనెడు సముద్రమునందు మునిగి పోయెదరు.

"అవసరమైన పనులు మాత్రమే చేయుచు, అనవసరముగా ఎక్కువ పనులను చేయనివారు పండితులన బడుదురు ఎందు కనగా, అనవసర కార్యము లలో జోక్యము కలిగించుకొనువారు అధిక ప్రసంగు లగుదురు. దానిచేత సంఘర్షము కలుగును.

"ఎవనిని జూదరులు - నర్తకులు - వేశ్యాస్త్రీలు మాత్రమే ప్రశంసించెదరో, అట్టి మానవుడు జీవన్మృతునితో సమానుడు.

"ధృతరాష్ట్రమహారాజా! అతి పరాక్రమశాలురు - మహాధనుర్ధారులు నైన పాండవులను విడిచి నీవు దుర్యోధనునిపై గొప్ప యైశ్వర్య భారమును ఉంచితివి. అందుచేత, నీవు త్వరలోనే, ఐశ్వర్యమదముచేత మూర్ఖు డైన దుర్యోధనుని, త్రిలోక సామ్రాజ్యము నుండి భ్రష్టుడైన బలిచక్రవర్తివలె, రాజ్య భ్రష్టునిగా జూడ గలవు."

జనమేజయా! విదురుని నీతి వచనములు విని ధృతరాష్ట్రుడు ఇట్లనెను:

"విదురా! పురుషుడు ఐశ్వర్యము పొందుటకు గాని నశింప జేయుటకు గాని స్వతంత్రుడు కాడు. బ్రహ్మదేవుడు, దారము కట్టి ఆడించు కొయ్య బొమ్మనువలె, పురుషుని అతని ప్రారబ్ధకర్మకు అధీనునిగా చేసి యుంచినాడు. అందుచేత నీవు నీతులను చెప్పు చుండుము నేను వినుటకు ధైర్యముతో కూర్చొని యున్నాను."

ఇట్లు విదురుని ధృతరాష్ట్రుడు అడుగగా, విదురు డిట్లు చెప్పదొడగెను :

ధృతరాష్ట్రునకు విదురుడు నీతి నుపదేశించుట :

"మహారాజా! వర్తమాన సమయమునకు విపరీతముగా బృహస్పతి యంత వాడు మాటాడినను, అతనికి అవమానము కలుగును అతని బుద్ధి పరిహాస పాత్రము నగును.

"ప్రపంచమునందు కొందరు దానముచేత, మరికొందరు ప్రియవచనముల చేత, ఇంక కొందరు మంత్రబలముచేత, - ఔషధములచేతను ప్రియు లగుదురు. వాస్తవముగా ఏ కారణము లేకుండ ప్రియు డైనవాడు ఎల్లప్పుడు ప్రియుడుగానే ఉండును.

''శత్రువు యొక్క సాధుత్వము - మేధ - పాండిత్యమున్ను చెడ్డవిగానే తోచు చుండును. మిత్రునకు ఉన్న ఆ గుణములే మంచివిగా కనబడును. కనుక మంచి - చెడ్డ గుణములు నియమితములు గావు.

"రాజా! నేను దుర్యోధనుని, అతని బాల్యమునందే, 'అతనిని విడువు' మని చెప్పినాను. 'ఆ ఒక్క కొడుకును విడిచినచో ఇతర పుత్రశతకమునకు అభివృద్ధి, విడువనిచో నాశము కలుగు' నని కూడ చెప్పితిని.

"భవిష్యత్తులో నాశము కలిగించు వృద్ధికి, అభ్యుదయము కలిగించు క్షయమునకును ప్రాధాన్యమీయగూడదు. రాజా! వృద్ధికి కారణ మగు నాశమును నాశముగా భావించరాదు. ఇప్పుడు పొందిన వృద్ధివలన అధిక నాశము కలిగి నచో, అట్టి వృద్ధిని నాశముగా భావించ వలెను.

రాజా! కొందరు గుణములచేత, కొందరు ధనముచేతను సంపన్నులుగా కనపడెదరు. గుణహీనులైన ధనవంతులను విడిచిపెట్టుము."

ఈ మాటలు విని ధృతరాష్ట్రుడు విదురునితో ని ట్లనెను :

''విదురా! నీ మాట లన్నియు భవిష్యత్తులో సత్ఫలములు గలిగించునవి గానే యున్నవి. ఇదిగాక, 'ధర్మమువైపు ఉండు వారికి విజయము తప్పదు' అను విషయము గూడ తథ్యమే. అయినను, నా పుత్రుని విడువ జాలకున్నాను.

ఆ మాటకు విదురు డిట్లు బదులు చెప్ప దొడగెను :

''మిక్కిలి గుణవంతుడు - వినయశీలుడు నైనవాడు ఎప్పుడు గూడ ప్రాణులకు ఏ కొంచెము హింసను గూడ నిర్లక్ష్యము చేయ జాలడు.

"రాజా! ఎల్లప్పుడును పరనింద చేయుచు, పరులకు దుఃఖము, వారిలో మిత్రభేదమున్ను కలిగించుటకు ఆసక్తుడై యుండు వాని దర్శనము - వానితో కలిసి యుండుటయు అతి భయంకరములు, అశుభప్రదములు నగును. వారికి ధనము ఇచ్చుట, వారినుండి పుచ్చుకొనుట కూడ అపాయకరము.

''మిత్రభేదము - కామము - నిర్లజ్జ - గుప్తముగా నపకారము చేయుట - ఇవి కలవారు పాపము చేయుటలో ప్రసిద్ధులు - ఇట్టి వారితో కలిసి నివసింప గూడదు. ఇవియేకాక, ఇతర మహాదోషములు గలవారిని గూడ విసర్జించ వలెను.

"నీచుని మైత్రి పోయిన తరువాత, వానికి తనకున్న పరస్పరప్రీతి నశించును. ఆ దుష్టమైత్రిచే గలిగిన ఫలము సుఖము గూడ నశించి పోవును. అట్టి నీచులు నిందారోపణమునకు ఫలము, అపకారమున్ను, కొద్దినైనను మోహముచేత నశింప జేయుటకు ప్రయత్నము చేయుదురు. అతనికి కొంచెము గూడ శాంతి యుండదు. అటువంటి నీచులతో, క్రూరులతో, అజితేంద్రియులతోను సాంగత్యమును బాగుగా విచారించి విద్వాంసుడు, దూరముగా విడువ వలెను.

''రాజా! తన కుటుంబము వారిని, దరిద్రులను, దీనులను (దిక్కులేని వారిని), రోగపీడితులనున్ను ఆదుకొనువాడు - అనంత మైన పుత్ర - పశు - శ్రేయస్సుల యభివృద్ధిని పొందును. తనకు శుభములను గోరువాడు తన కుటుంబ వ్యక్తులను అభివృద్ధిలోకి తే వలెను. దానివలన కులవృద్ధిని బాగుగా చేయును. కుటుంబ జనులను సత్కరించువానికి శ్రేయస్సు కలుగును.

"రాజా! కుటుంబ వ్యక్తులు గుణహీను లైనను వారిని రక్షింప వలెననగా, గుణవంతులు, నీ యనుగ్రహమును కాక్షించువారు నైన జ్ఞానులను రక్షించు విషయములో చెప్ప వలసిన దే మున్నది?

రాజా! వీరు లైన పాండవుల యెడల అనుగ్రహము చూపుము. వారి జీవికకై కొన్ని చిన్న గ్రామముల నైనను ఇమ్ము. ఇట్లు చేసినచో రాజా! నీకు లోకమునందు కీర్తి ప్రాప్తించును. నీవు వృద్ధుడవు గాబట్టి, పుత్రులను ఏలుకొనుము. నేను నీకు హితమునే చెప్ప వలెను నీ హితము కోరువాడనుగా నన్ను తెలిసికొనుము.

''రాజా! తనకు శుభము కోరుకొనువాడు జ్ఞాతులకు విరోధము చేయ గూడదు. తనకు గలిగిన సుఖములను జ్ఞాతులతో గూడి అనుభవించ వలెను. జ్ఞాతులతో గలిసి మెలసి భోజనము - సంభాషణము - ప్రేమపూర్వకముగా పరస్పరము జరుప వలెను. వారితో విరోధము ఎప్పుడు గూడ చేయ రాదు. మంచి నడవడిక గల జ్ఞాతులు కులమును తరింప జేయుదురు. దుష్టవర్తన గలవారు ముంచెదరు.

"కనుక, రాజా! పాండవుల యెడల నీవు సత్ప్రవర్తనతో వ్యవహరింపుము. వారిచేత సురక్షితుడ వైన నిన్ను శత్రువులు కన్నెత్తి యైన చూడ జాలరు. సిరిసంపదలు గల జ్ఞాతి యుండికూడ, అతని కుటుంబ వ్యక్తి యొకడు అతని యొద్దకు పోయి దుఃఖపడు చున్నచో, విషము పూయ బడిన బాణము చేత బట్టుకొని యున్న వ్యాధుని యొద్దకు పోయిన మృగమువలె, కష్టమును అనుభవించ వలసి యుండును. ఆ పాపము ఆ కుటుంబములో ధనవంతుని పొందును.

"రాజా! పాండవులు గాని, నీ పుత్రులు గాని హతు లైన సంగతి తెలిసిన తరువాత నైనను నీకు సంతాపము తప్పదు.

"ఈ జీవితము శాశ్వతము కాదు. కనుకనే, పాపకర్మలు చేసి చివరకు మరణశయ్యపై పడుకొనినప్పుడు తన పూర్వకర్మలను గూర్చి పశ్చాత్తాపము చెంద వలసి వచ్చు నని తెలిసికొని తొలుత నుండియే ఆ పాపకర్మలు చేయక ఉండవలెను.

''రాజా! ఒక్క శుక్రాచార్యుడు మాత్రమే నీతిని పాటించినవాడు. తదితరుడు కానరాడు. కడచిన దేదో కడచి పోయినది. ఇప్పుడు మిగిలిన కర్త

వ్యమును నీ వంటి బుద్ధిమంతులు బాగుగా విచారించి చేయ వలెను. దుర్యోధనుడు పూర్వము పాండవులయెడ చేసిన పాపకార్యములను నీవు కులవృద్ధుడవు కనుక, సరిదిద్ద వలెను. కనుక, రాజా! పాండవులను మరల నీవు వారి స్థానమునందు ప్రతిష్ఠించి పాపములను పోగొట్టుకొనుము. అట్లు చేయుటచేత లోకమునందు నిన్ను బుద్ధిమంతులు పూజించెదరు.

''రాజా! ధీర (పండిత) పురుషుల మాటలను కార్యరూపమునందు పెట్టిన వాడు చాలాకాలము యశస్సుతో వర్ధిల్లును. అతినిపుణు లైన విద్వాంసుల యుప దేశములను పాలించ వలె నను జ్ఞానము లేనప్పుడు, అథవా, జ్ఞానము కలిగినను దానిని ఆచరణలో పెట్టినప్పుడు, విద్వాంసుల యుపదేశము వ్యర్థ మగును. పాప ఫలమును కలిగించు పని చేయనివాడు వృద్ధి చెందును. పూర్వజన్మకృత పాపమును తెలిసికొన జాలక, దానినే అనుసరించువాడు లోతైన బురద గల ఘోరనకరమునందు పడును.

"మంత్రాలోచనము బయలుపడుటకు అరు మార్గము లున్నవి:- అవి: మత్తుపదార్థములను సేవించుట - నిద్ర - ఆవశ్యకము లైన విషయములను తెలిసికొనకుండుట - తన కన్నులలో, ముఖములోను ఏలాటి వికారము కన బరచకుండుట - దుర్మంత్రులను విశ్వసించుట - పనిచేయుటలో అసమర్థు డైన సేవకునిపై నమ్మకము కలిగి యుండుట - వీనిని ధనమును రక్షించుకొనగోరు వాడు సర్వదా విడువ వలెను.

"శాస్త్రమును తెలిసికొనక, అథవా, వృద్ధులను సేవించక యున్నవాడు బృహస్పతి యంతటివా డైనను ధర్మార్థములను తెలిసికొన జాలడు. సముద్రము నందు పడిన వస్తువు - విననివానికి చెప్పిన హితవచనము- అజితేంద్రియునకు ఉన్న శాస్త్రజ్ఞానము-బూడిదలో హోమము చేయుట-ఇవి యన్నియు నష్టములుగా భావించ వలెను.

"రాజా! బుద్ధిమంతుడు ఇతరునితో స్నేహము చేయు విషయములో మొదట బుద్ధితో పరీక్షించి, తన యనుభవముతో మాటిమాటికి విచారించి, అతని యర్హతను నిర్ణయించవలెను. ఇతరులవలన విని, స్వయముగా చూచి, తెలిసికొని విద్వాంసులతో మైత్రి చేయ వలెను. వినయము అకీర్తిని, పరాక్రమము కీడును, ఓర్పు క్రోధమును, మంచినడవడిక చెడులక్షణమునున్ను పోగొట్టును. పరిజనము-

తల్లి - ఇల్లు - అతిథిని సేవ చేయు పద్ధతి - భోజనము - వస్త్రములు - వీనిని చూచి కులమును నిర్ణయించ వచ్చును. దేహాభిమానములేని విరాగిగూడ తన యొద్ద ఉంచ బడిన అనుభవయోగ్యవస్తువును నిరాకరించడనగా కామాసక్తుని గూర్చి చెప్ప వలసిన దే మున్నది?

"రాజా! విద్వాంసులసేవ చేయువాడు - వైద్యుడు - ధర్మాత్ముడు - సుందరుడు - మిత్రులు గలవాడు - మధుర భాషియు నగు మిత్రుడు - వీరిని రక్షింప వలెను. దుష్కులమువా డైనను సత్కులమువా డైనను నీతినియమములు దాటక ధర్మమునం దిచ్చ, మృదుస్వభావము - లజ్జ గలవాడు నూర్గురు సత్కులీసులకన్న శ్రేష్ఠుడు. ఏ యిద్దరి మనస్సులు - రహస్యములు-బుద్ధులున్ను కలిసి ఏకాభిప్రాయముతో నుండునో, ఆ యిద్దరిస్నేహము ఎప్పుడుగూడ విడి వోదు. దుర్బుద్ధిమైత్రిని, విచారించుశక్తిలేనివానిమైత్రినిన్ని గడ్డితో కప్పబడిన నూతివలె బుద్ధిమంతుడు విడువ వలెను. ఎందుకనగా, అట్టివానితో చేయు మైత్రి నశించి పోవును. గర్విష్ఠులు - మూర్ఖులు - రౌద్రస్వభావము గలవారు - అతి సాహసికులు - అధర్మపరులు నైనవారితో విద్వాంసుడు మైత్రి చేయ గూడదు. కృతజ్ఞుడు - ధార్మికుడు - సత్యసంధుడు - ఉదారుడు - దృఢమైన భక్తి గల వాడు- జితేంద్రియుడు - తన కట్టుబాట్లలో నుండువాడు- మైత్రిని విడువనివాడు నైనవానితో మైత్రి చేయ గోర వలెను.

"రాజా! ఇంద్రియములను పూర్తిగా జయించ గలుగుట మృత్యువును ఆపుటకంటె కఠిన మైన పని. అట్లని, వారిని పూర్తి విచ్చలవిడిగా విడుచుట దేవతలంతవారినిగూడ నశింపజేయును. మృదుస్వభావము - అసూయ లేకుం కుట - ఓర్పు - ధైర్యము - మిత్రులను అవమానపరచకుండుట - ఇవి ఆయు స్సును వృద్ధిపరచు నని పండితులు చెప్పెదరు. స్థిరబుద్ధి గలవానిని ఆశ్రయించి నచో నతడు నశించినధనమును నీతితో తిరిగి సంపాదించుటలో సహాయకుడుగా నుండ గలడు. అట్టిమిత్రుని యాచరణము వీరపురుషులవంటిదిగా నుండును.

"భవిష్యత్తులో కలుగ బోవుదుఃఖమును, ఆపుటకు ఉపాయమును తెలిసిన వాడు, వర్తమానకాలమునందు చేయవలసిన పని విషయమునందు దృఢనిశ్చ యము గలవాడు, కడచిన కాలమునందు మిగిలిపోయినకార్యమునుగూర్చి తెలిసిన వాడున్ను ఎప్పుడుగూడ అర్థహీనుడు గాడు. తాను, మనోవాక్కాయ కర్మలచేత శ్రద్ధగా చేయబడు పనులవైపు పురుషుడు సాధారణముగా ఆకర్షింప బడును.

కనుక, నతడు మంచి పనులనే చేయుచు వానిచేతనే అకృష్టుడైనచో మేలు కలుగును.

"రాజా! శుభకరములైన విషయముల సంబంధము - చిత్తవృత్తి నిరోధము (యోగము) - శాస్త్రాభ్యాసము-ప్రయత్నశీలత్వము - తరచు సత్పురుషులను దర్శించుట - ఇవి యన్నియు శ్రేయస్కరములు. నిరుత్సాహిగా నుండ గూడదు. సర్వదా ప్రయత్నశీలుడై యుండినవానికి, ధనములు, శుభములు, శ్రేయస్సులున్ను కలుగును. అట్టివాడు గొప్పవాడై, అనంత సుఖము ననుభవించ గలడు.

"రాజా! సమర్థుడైన పురుషునకు అంతటను, అన్ని కాలములయందును క్షమ (ఓర్పు)తో సమానమైన హితము లేదు. అసమర్థుడు అన్నియెడలను ఓర్పుతోనే యుండును. కాని, సమర్థుడు ధర్మముకొరకు ఓర్పు వహించ వలెను. అర్థానర్థములు రెండున్ను సమానముగా జూచువాడుగూడ సర్వదా ఓర్పు వహించ వలెను. మనుష్యుడు ఏ సుఖమును సేవించుచుగూడ ధర్మార్థములనుండి భ్రష్టుడు కాడో, అట్టి సుఖమును పూర్తిగా అనుభవించవచ్చును. కాని, అతడు మూఢ వ్రతుడు (నిద్ర - సోమరితనము మొదలైనవి కలిగి యుండువాడు) కా గూడదు.

"రాజా! దుఃఖపీడితులు ఏమరుపాటు గలవారు - నాస్తికులు-సోమరులు - ఇంద్రియ నిగ్రహము లేనివారు- ఉత్సాహరహితులు" - ఇట్టివారి యొద్ద సంపద ఉండదు. దుర్బుద్ధి గలవారు, సరళుడు - సరళత్వకారణముగా లజ్జాశీలుడునైన మనుష్యుని అసమర్థుడని తలచుచు తిరస్కరించెదరు. మిక్కిలి ఉత్తముని - అతిశయముగా దానము చేయువానిని - అతిశూరుని - అధికవ్రతనియమములను పాలించువానిని - బుద్ధిమంతుడ నను గర్వముతో నున్నవానినిని చూచి లక్ష్మి భయపడి యతనియొద్దకు చేరదు. అధిక గుణవంతునియందు గాని, గుణహీనుని యందు గాని లక్ష్మి అనురక్తురాలు కాదు. ఎందు కనగా, గుణములను గాని - అగుణములను గాని ఆమె కోరదు. లక్ష్మి ఉన్మాదము చెందిన గోవువలె అంధత్వము గలదై యొక్కొక్క చోటనే నిలుచును.

"రాజా! అగ్నిహోత్రమే (హోమము) ఫలముగా గలవి వేదములు-సత్స్వభావము, సత్ప్రవర్తనలే ఫలములుగా గలది శాస్త్రాధ్యయనము - రతిసుఖము, పుత్రసంతతి-యివియే ఫలములుగా గలది స్త్రీ. దానము, అనుభవించుట యివియే

ఫలములు గాగలది ధనము. అధర్మమార్గములో సంపాదించిన ధనములచే పరలోక కర్మలు చేసినవాడు చనిపోయినతరువాత దుష్టమార్గమునందు సంపాదించిన ధనముయొక్క ఫలమును అనుభవించును.

"ఆత్మబలసంపన్నులైనపురుషులకు, అడవిలో - దుర్గమమార్గములలో - ప్రాణాపాయకరములైన యాపదలలో - సంభ్రమ (బెదరుట)మునందు-తనను చంపుటకు శస్త్రము నెత్తినపుడున్ను భయము ఉండదు. ప్రయత్నము - నిగ్రహము - సామర్థ్యము - జాగ్రత్త - ధైర్యము - స్మరణము జ్ఞాపకశక్తి) - వివేకముతో విచారించి పని యారంభించుట-ఇవి అభివృద్ధికారణములుగా తెలియుము.

''రాజా! మునులకు బలము తపస్సు - వేదవిదులకు బలము వేదము - దుష్టులకు హింస బలము - గుణవంతులకు ఓర్పు బలము. 'జలము - మూలము (వేళ్ళు - దుంపలు) - పండ్లు - పాలు - హవిస్సు (హోమశేషము) - బ్రాహ్మణకామ్య - బ్రాహ్మణునకు వ్రతభంగ మగునపుడు అతని యిచ్ఛను నెరవేర్చి భుజించుట) - గురు వచనముచేత చేయు భోజనము - ఔషధము' ఈ యెనిమిది ఉపవాసాది వ్రతములకు భంగములు కావు. తనకు ప్రతికూలములుగా తోచినవి యితరులకు గూడ చేయ గూడదు.

''రాజా! సంగ్రహముగా ఈ ధర్మములు చెప్ప బడినవి. వీనికి విపరీతముగా కామాదుల చేత చేయ బడునవి అధర్మములుగా భావించ వలెను.

''రాజా! అక్రోధముచేత క్రోధమును మంచిగా వ్యవహరించుటచేత అసాధువును - దానము చేత పిసినిగొట్టును - సత్యముచేత అసత్యమునున్ను జయించ వలెను. స్త్రీ వ్యసనము - సోమరితనము - భయశీలత్వము - క్రోధము - తన పౌరుషమునందు అభిమానము - దొంగతనము - కృతఘ్నత - నాస్తికత్వము - ఇవి కలవారియందు విశ్వాసము ఉంచ గూడదు. నిత్యము గురువులకు నమస్కారము చేయువారిక, వృద్ధులను సేవించువారికిన్ని కీర్తి (ప్రతిష్ఠ) వ్యాప్తి- ఆయుస్సు - యశస్సు - బలము - ఈ నాలుగు వృద్ధి చెంద గలవు. అతి కష్టముచేత - ధర్మమును ఉల్లంఘించుటచేత - శత్రువునకు లొంగి 'దాసోహం' అనుట చేతను అర్థములను సంపాదింప దలచగూడదు.

''రాజా! విద్యలేని పురుషుడు - సంతానము కలుగని మైథునము - ఆహారము లేని ప్రజలు - రాజు లేని రాజ్యము - ఇవి శోకింప దగినవి. దేహధారులకు ఎక్కువగా దారి నడుచుట - పర్వతములకు ఎడతెగని జలపాతము - స్త్రీలకు సంభోగము లేకుండుట - మనస్సునకు శల్యములవంటి మాటలు - ఇవి జర (ముసలి తనము)ను గూర్చును. అభ్యాసము లేకుండుట వేదములకు మలము - బ్రాహ్మణోచిత నియములను పాటింపకుండుట బ్రాహ్మణులకు మలము - భూమండలమునకు బాహ్లీక (బుఖారా) దేశము మలము - పురుషునకు అసత్యము మలము - పతివ్రతాస్త్రీకి క్రీడా, హాస, పరిహాసములు మలము - స్త్రీలకు పతిలేకుండ పరదేశమునందు నివసించుట మలము - సువర్ణమునకు వెండి - వెండికి తగరము - దానికి సీసము - సీసమునకు మురికి బట్టుట మలము.

"కాబట్టి, ఆయా వస్తువులకు మాలిన్యము లేకుండుటకు, ఆ మలిన వస్తువులు వానికి కలుగకుండ చూడ వలె నని భావము.)

''రాజా! అధికముగా నిద్రించి నిద్రను - కామోపభోగము చేత స్త్రీని - ఇంధనము చేత అగ్నిని - త్రాగుడు చేత మద్యమును జయించుటకు ప్రయాస పడ గూడదు. దానముచేత మిత్రుని - యుద్ధముచేత శత్రువులను - అన్నపానములచేత భార్యనున్ను జయించినవాని జీవితము సఫల మగును.

"రాజా! వేల ధనము-నూర్లధనమున్ను కలవారు జీవించుచునే యున్నారు. అధిక ధనముకొరకు ఆశపడకుము. ఏదోవిధముగా జీవితము తప్పక కడచును. ఇందులో సందేహము లేదు. దేశమునందలి వడ్లు - యవలు - బంగారు - పశువులు - స్త్రీలు - ఇవి యన్నియు ఒకనికి గూడ చాలవు 'అవి యెన్ని యున్నను తృప్తి దీరదు' అని విచారించువాడు మోహము పొందడు.

''రాజా! నీ పుత్రులయందు, పాండవులయందున్ను సమానభావము ఉన్నయెడల అందరియెడల సమానభావముతో మంచిగా వ్యవహరించు మని నేను నీకు మాటి మాటికి చెప్పు చున్నాను.

విదురుడు ధర్మము యొక్క మహత్త్వమును ప్రతిపాదించుట - బ్రాహ్మణాది నాలుగు వర్ణముల ధర్మమును సంగ్రహముగా వర్ణించుట :

''రాజా! సత్పురుషుల యాదరమును పొంది, తనశక్తిని అనుసరించి న్యాయపూర్వకముగా, అర్థసాధనమును ఆసక్తిరహితు డై చేయుపురుషునకు మంచి యశస్సు త్వరగా ప్రాప్తించును. ఎందు కనగా, సజ్జనులు ఎవనిని అనుగ్రహించెదరో, అతడు ఎల్లప్పుడు సుఖముగా నుండును. చాల గొప్పధనమైనను, అది అధర్మమార్గము నందు సంపాదింప బడిన దని తలచి దానిచేత ఆకర్షింప బడక, దానిని, సర్పము ప్రాతకుబుసమును విడుచునట్లు, విడిచినవాడు దుఃఖములనుండి విముక్తు డై సుఖనిద్ర చెందగలడు

"రాజా! అసత్యము లాడి అభివృద్ధి నందుట - రాజుకథ జేరి కొండెములు చెప్పుట - గురువుపై అసత్యదోషములను ఆరోపించుటకు పూనుకొనుట - ఇవి బ్రహ్మహత్యా సమానములు. అసూయ చెందుట మృత్యువుతో సమానము. నిందించుట లక్ష్మిని వధించినట్లే యగును. సేవ చేయకుండుట - తొందరపాటు-ఆత్మస్తుతి - ఈ మూడున్ను విద్యకు శత్రువులుగా భావించ వలెను.

''రాజా! సోమరితనము - పొగరుతో మోహము చెందుట - చాపల్యము - వ్యర్థముగా గోష్ఠులు జరుపుట - ఉద్దండత్వము (ఎవనికిని) లొంగక గర్వముతో నుండుట) - ఆత్మాభిమానము - స్వార్థత్యాగము లేకుండుట - ఈ యేడు దుర్గుణములు విద్యార్థులకు ఉండ గూడదు.

"సుఖము గోరువానికి విద్య - విద్య గోరువానికి సుఖమున్ను ఉండదు గనుక, సుఖార్థి విద్యనైనను, విద్యార్ధి సుఖము నైనను విడువ వలెను.

''ఎన్నికట్టెలు వేసినను అగ్నికి - ఎన్ని నదులు చేరినను సముద్రమునకు - ఎన్ని ప్రాణులు చేరినను యమునకు - ఎందరు పురుషు లున్నను కులటా స్త్రీకిని తృప్తి కలగదు.

''ఆశ ధైర్యమును - యముడు అభివృద్ధిని - క్రోధము సంపదను పిసినిగొట్టుతనము కీర్తిని - సరియైన రక్షణ లేకుండుట పశువులను - ఒక్క బ్రాహ్మణుడు కోపించుట సంపూర్ణ రాష్ట్రమునున్ను నశింప జేయును.

''రాజా! మేకలు - కంచుపాత్రలు - వెండి - తేనె - ధనుస్సు - పక్షి - వేదజ్ఞు డైన బ్రాహ్మణుడు - కుటుంబ వృద్ధుడు - ఆపదలో చిక్కుకొనిన సత్కులీనుడు - వీ రందరు నీ యింటిలో సర్వదా ఉండవలెను.

''రాజా! 'మేక - ఎద్దు - చందనము - వీణ - దర్పణము (అద్దము) - తేనె . నేయి - జలము - రాగిపాత్ర - శంఖము - సాలగ్రామము - గోరోచనము' - ఈ వస్తువు లన్నియు, దేవ - బ్రాహ్మణ - అతిథులను పూజించుటకు గాను ఇంటిలో నుండ వలె నని మనువు చెప్పినాడు.

''మహారాజా! ఇప్పుడు నేను నీకు అన్నిటికన్న ఎక్కువ పుణ్యకరము, మిక్కిలి గొప్పదియు నైన విషయము చెప్పెదను. అది యే మనగా, నీవు కామము చేత గాని, భయము చేత గాని, లోభము చేత గాని, తుదకు ఈ జీవితము కొరకు గాని ఎప్పుడుగూడ ధర్మమును విడువ గూడదు. ధర్మము నిత్యము - సుఖదుఃఖములు అనిత్యములు. జీవుడు నిత్యుడు. ఇతనికి గలిగిన యీ జన్మకు కారణభూతము లైన కర్మలు అనిత్యములు. కనుక, రాజా! నీవు అనిత్యములను విడిచి, నిత్యములనే స్థిరముగా ఆశ్రయించి, సంతోషించుచుండుము. సంతోషమే అన్నిటికన్న గొప్పలాభ మని యెరుగుము.

''రాజా! ధనధాన్యములతో తులదూగు చుండిన సమస్త భూమండలమును పరిపాలించి, చివరకు సర్వరాజ్యమును, భోగములనున్ను ఇక్కడనే విడిచి, యముని యొద్దకు పోయిన గొప్ప గొప్ప బలవంతులు - మహానుభావులు నైన రాజుల పరిస్థితి యే మైనదో గమనించుము.

"రాజా! మిక్కిలి శ్రమపడి ప్రేమతో రక్షింపబడిన పుత్రుడు మరణించిన తోడనే మనుష్యులు ఆ పుత్రుని శవమును యింటి బయట వేయుదురు. తొలుత జుట్టు విరియ బోసికొని అతిగా దుఃఖించి, తరువాత ఆ శరీరమును చితి మధ్యలో నొక కట్టెను వేసినట్లు వేసి తగుల బెట్టెదరు. మరణించిన వాని ధనమును ఇతరులు అనుభవించెదరు. మృత శరీరమునందలి రక్తమాంసాది ధాతువులను పక్షులు గాని, అగ్ని గాని భక్షించును. అతనిని అనుసరించి వెంట బోవునవి పుణ్య పాపములు రెండే యని తెలియుము. అతని బంధుమిత్రాదులు అతనిని, ఫలపుష్పరహిత మైన వృక్షమును పక్షులు విడిచినట్లు, విడిచి పోవుదురు. అగ్నియందు వేయ బడిన పురుషుని, అతడు చేసిన కర్మ అనుసరించును. అందుచేత,

పురుషుడు అతిప్రయత్నము చేసియైనను, మెల్లమెల్లగా ధర్మమును చేకూర్చుకొన వలెను.

''రాజా! ఈ లోకమునకు పైన - క్రిందను అంతటను అజ్ఞాన (మాయ) రూప మైన గొప్ప యంధకారము వ్యాపించి యున్నది. అది యింద్రియములను మిక్కిలి మోహింప జేయును - అని తెలిసికొని, ఆ యజ్ఞానాంధకార స్పర్శము నీకు లేకుండ దూరముగ నుండుము. రాజా! నేను చెప్పిన యీ నీతివాక్యములను నీవు బాగుగా విని, సరిగా తెలిసికొనిన యెడల, ఈ లోకమునందు నీకు గొప్ప కీర్తి కలుగును. ఈ లోకమునందు - పరలోకమునందున్ను నీకు భయము ఉండదు.

''రాజా! ఈ జీవాత్మ యొక నది. ఇది పుణ్య క్షేత్రము. ఇందలి జలము సత్యము. ధైర్యము నదీతీరములు. దయయే అలలు. ఈ పుణ్యనదియందు స్నానము చేసిన పుణ్యాత్ముడు పవిత్రు డగును. ఎందు కనగా, లోభరహిత మైన ఆత్మ సర్వదా పవిత్రము. కామ - క్రోధము లనెడు మొసళ్ళు - పంచేంద్రియము లెనెడు జలము గల యీ సంసార నదియొక్క జనన - మరణ రూప దుర్గమ ప్రవాహమును, ధైర్య మను నౌకతో దాటుము.

''బుద్ధి - ధర్మము - విద్య - వయస్సు - వీనిలో వృద్ధుడైన తన బంధువును ఆదరసత్కారములతో ప్రసన్నుని చేసి, అతనినుండి కర్తవ్యాకర్తవ్య (చేయ వలసిన - చేయ గూడని పనులు) ములను బాగుగా అడిగి తెలిసికొను వాడు ఎప్పుడు గూడ మోహమును పొందడు.

''ధైర్యము చేత స్త్రీ సంగమ వ్యసనమును - ఉదర వ్యసనము (దొరికిన వస్తువుల నెల్ల తిన వలెను తమకము)నున్ను సహింప వలెను. ఇట్లే, హస్తపాదములను నేత్రముచేత - నేత్రమును - కర్ణమునున్న మనసుచేత - మనస్సును, వాక్కును సత్కర్మాచరణము చేతను రక్షించుకొన వలెను.

''రాజా! ప్రతి దినము జలమునందు స్నాన సంధ్యాదు లైన అనుష్ఠానములను చేయుచు, సర్వదా యజ్ఞోపవీతమును ధరించుచు, ఎల్లప్పుడు వేదాధ్యయనము చేయుచు, ధర్మభ్రష్టులు కులభ్రష్టులు నైన పతితుల యన్నమును పరిత్యజించుచు, సత్యమును పలుకుచు, గురుసేవ చేయుచు నున్న బ్రాహ్మణుడు ఎప్పుడుగూడ బ్రహ్మ లోకమునుండి భ్రష్టుడు కాడు (జారిపడడు).

"రాజా! వేదములను చదివి, అగ్నిచుట్టు నలువైపుల దర్భలు పరచి, యజ్ఞములు చేసి, ప్రజలను పాలించి, గో-బ్రాహ్మణుల హితము కొరకు యుద్ధమునందు పవిత్రమైన శస్త్రమరణమును పొందిన క్షత్రియుడు స్వర్గమునకు పోవును.

"రాజా! వేదశాస్త్రములను చదివి, బ్రాహ్మణ - క్షత్రియులకు, ఆశ్రిత జనులకున్ను, అవసర మైనప్పుడు ధనము నిచ్చుచు సహాయము చేయుచు, యజ్ఞములద్వారా పవిత్రము లైన మూడు (గార్హపత్యాగ్ని - దక్షిణాగ్ని - ఆహవనీయాగ్ని) అగ్నులనుండి వెడలు పవిత్రధూమము యొక్క సుగంధమును ఆఘ్రాణించుచు నుండిన వైశ్యుడు చనిపోయిన తరువాత స్వర్గసుఖమును అనుభవించును.

"రాజా! బ్రాహ్మణ - క్షత్రియ - వైశ్యులను క్రమముతో న్యాయముగా సేవించుచు సంతోషపరచిన శూద్రుని పాపము లన్నియు దహింపబడి, మరణించిన తరువాత స్వర్గసుఖములను అనుభవించ గలడు.

"రాజా! నాలుగు వర్ణముల ధర్మములను చెప్పితిని, ఇట్లు చెప్పుటకు కారణమును వినుము. పాండుపుత్రుడు నీ కారణముగా క్షత్రియధర్మమునుండి విడిపోవుచున్నాడు. అతనిని నీవు రాజధర్మమునందు నియోగించుము." జనమేజయా! విదురుడు చెప్పిన నీతివాక్యములను విని ధృతరాష్ట్రు డతనితో నిట్లనెను:

"విదురా! నీవు ప్రతిదినము నాకు చేయు నుపదేశము చాల బాగుగ నున్నది. నీవు చెప్పినట్లే చేయ వలె నని నాకు గూడ బుద్ధి పుట్టు చున్నది. పాండవుల విషయములో నేను సర్వదా యిట్టి బుద్ధితోనే యోచించుచు వారికి మేలు చేయ దలచెదను. కాని, నేను దుర్యోధనునితో కలిసి మాటాడినప్పుడు ఈ బుద్ధి మరల పోవు చుండును. ప్రారబ్ధకర్మను ఉల్లంఘించుటకు ఏ ప్రాణికిని సాధ్యము కాదు. నేను ప్రారబ్ధమే అచంచల మైన దని తలచెదను. దాని ముందు పౌరుషము ఏ మాత్రము పనికిరాదు." ఇట్లు చెప్పి, యింకను నిట్లు ధృతరాష్ట్రుడు విదురుని అడిగెను:

ప్రజాగరపర్వము సమాప్తము.

సనత్సుజాత పర్వము

విదురుడు తలచగానే వచ్చిన సనత్సుజాతునితో విదురుడు ధృతరాష్ట్రునకు ఉపదేశింపుమని ఆయనను ప్రార్థించుట :

"విదురా! ఇంతదాక చెప్పిన వానికన్న ఇంకను ఏ వైన నీతి వచనము లున్నయెడల నాకు చెప్పుము. నీవు నీతులు చెప్పు పద్ధతి అతి విలక్షణముగా నున్నది."

అప్పుడు విదురునకు ధృతరాష్ట్రునకు నిట్లు సంవాదము జరిగెను:

విదు - రాజా! బ్రహ్మపుత్రు డైన "సనత్సుజాతుడు" అను పేరు గల పరమ ప్రాచీన సనాతన మునీశ్వరుడు ఒకనాడు "మృత్యువు లేనే లేదు" అని చెప్పెను. సమస్త బుద్ధిమంతులలో నుత్తము డైన సనత్సుజాతుడే నీ మనస్సులో నున్న స్ఫుటాస్ఫుటము లైన అన్ని ప్రశ్నములకు బదులు చెప్ప గలడు.

ధృత - విదురా! సనత్సుజాతముని చెప్ప బోవు తత్త్వములను నీ వెరుగవా? ఈ విషయములో నీ బుద్ధి ఏ మాత్రము ప్రసరించు చున్నను నీవే నాకు ఆ తత్త్వబోధ చేయుము.

విదు - రాజా! నేను శూద్ర యోనియందు జన్మించినవాడను గనుక నింత కన్న నెక్కువ చెప్పుటకు నాకు సాహసము చాల కున్నది. సనత్సుజాతుని బుద్ధి అతి సనాతన మని నాకు తెలియును. ఆయన బ్రాహ్మణయోనిలో జన్మించినవాడు కనుక, అతిగుహ్య విషయములను గూడ ఆయన నీకు చెప్పినచో దేవతలనిందకు ఆయన పాత్రుడుగాడు. ఆయనకు అన్ని విషయములు తెలియును. అందుచేతనే నేను నీకు ఇట్లు చెప్పుచున్నాను.

ధృత - విదురా! ఆ పరమ ప్రాచీన సనాతనమహాముని యైన సనత్సుజాతుని గూర్చి పూర్తిగా నాకు తెలుపుము. ఈ దేహముతోనే యిక్కడనే ఆయనతో కలియుట నాకు ఎట్లు సంభవించును?

జనమేజయమహారాజా! ధృతరాష్ట్రు డిట్లు విదురుని అడిగిన తరువాత విదురుడు, ప్రశంసనీయ మైన తపోవ్రతమునందు నిష్ఠగల సనత్సుజాతమహాముని ని ధ్యానించిన వెంటనే ఆ మహాముని, 'విదురుడు తనను స్మరించు చున్నాడు' అని తెలిసికొని అక్కడికి వచ్చి, ప్రత్యక్ష మాయెను. విదురు డా మహామునికి శాస్త్రోక్త విధముగా. అర్ఘ్య-మధుపర్కాదులను సమర్పించి, పూజించి నమస్కరించి స్వాగతము చెప్పెను. ఆ మహాముని విశ్రాంతి తీసికొను చుండగా విదురు డాయనతో ని ట్లనెను:

"భగవన్! ధృతరాష్ట్రుని మనస్సులో నొక సంశయము కలదు. దానిని తీర్చుటకు నాకు శక్తి చాలదు. నీవే యా విషయమును నిరూపించి చెప్పుటకు యోగ్యుడవు. నీ మాటలు విని, యీ మహారాజు సమస్త దుఃఖములను దాటి, లాభ - అలాభ, ప్రియ - అప్రియ, జరా - మరణములు అనుద్వంద్వముల నుండి విముక్తుడు కాగలడు. ఇంతయేకాక, నీ మాటలు విని యీ మహారాజు, సర్వ దుఃఖముల నుండి విముక్తు డై, భయ - క్రోధములు, ఆకలిదప్పులు, మద - ఐశ్వ ర్యములు, చింతా - అలస్యము (సోమరితనము)లు కామ - క్రోధములు, అభివృద్ధి- వినాశములు - వీటినుండి కూడ విముక్తుడు కా గలడు."

ఇట్లు వైశంపాయన మహాముని విదురుని మాటలను జనమేజయునితో చెప్పి తరవాతి కథ యిట్లు చెప్ప దొడగెను:

"జనమేజయా! తరువాత, ధృతరాష్ట్రుడు విదురుని మాటలు విని అతనిని మిక్కిలి ఆదరించి, ఉత్తమ జ్ఞానము సంపాదించు నిచ్ఛతో ఏకాంతమునందు సనత్సుజాత మహామునిని పూజించి యిట్లనెను:

"మహాత్మా! మృత్యువే లే దని నీ సిద్ధాంత మని నేను విను చుందును. ఇంతయేకాక, దేవతలు, రాక్షసులున్ను మృత్యువును తప్పించుకొనుటకు బ్రహ్మ చర్యావ్రతమును పాలించినారు అనికూడ వినినాను. ఈ రెండు విషయములలో నేది సత్యము?"

ఆ ప్రశ్నమునకు సనత్సుజాత మహాముని యిట్లు బదులు చెప్ప గొడగెను:

సనత్సుజాతుని ఉపదేశము ధృతరాష్ట్రుని ప్రశ్నములకు సనత్సుజాతుడు బదులు చెప్పుట మృత్యుస్వరూప నిరూపణము :

"రాజా! ఈ విషయమునందు రెండు పక్షము లున్నవి. 'మృత్యువు ఉన్నది. అది బ్రహ్మచర్యాపాలన రూప మైన కర్మతో నశించును.' ఇది ఒక పక్షము. 'మృత్యువు లేనే లేదు' అనునది రెండవ పక్షము. ఈ రెండు పక్షముల తత్త్వమును గూర్చి నీకు చెప్పెదను:-

"రాజా! ఈ రెండు పక్షములు సత్యములే:- కొందరు విద్వాంసులు మోహవశు లై మృత్యువు యొక్క ఉనికిని స్వీకరించినారు. కాని, 'ఏమరుపాటే మృత్యువు' అని, జాగ్రత్తగా నుండుటయే 'అమృత్యువు' అని నా యభిప్రాయము. పొరపాట్లు చేయుట చేతనే అసురసంపత్తి గల రాక్షసగణము మృత్యువుచేత జయింప బడినారు. పొరపాట్లు చేయక జాగ్రత్తతో మెలగిన దైవీసంపత్తి గల దేవగణము బ్రహ్మస్వరూపులు అయినారు. మృత్యువు సింహమువలె, ప్రాణులు కన బడగనే భక్షించునది కాదు. ఎందు కనగా, మృత్యువు యొక్క స్వరూపము మనకు కన బడదు. కొందరు 'ఏమరుపాటు కంటే వేరుగా, యముడే మృత్యువు' అని యనెదరు. 'దృఢ సంకల్పముతో బ్రహ్మచర్యాపాలనము చేయుటచేతనే అమృతత్వము సిద్ధించును'. అని వారు తలచెదరు.

"రాజా! యమరాజు పితృలోకమునందు రాజ్యశాసనము చేయును. అతడు పుణ్యాత్ములకు మంగళకరుడుగాను, పాపాత్ములకు అమంగళకరుడు గాను ఉండును. యముని యాజ్ఞచేతనే కోపము, ఏమరుపాటు, లోభరూప మైన మృత్యువు మనుష్యుల వినాశమునకు పూనుకొనును. అహంకారవశు డై విపరీత మార్గమునందు నడచు మనుష్యు డెవ డైనను పరమాత్మ సాక్షాత్కారము చేయ జాలడు. మనుష్యుడు పైదోషములచేత మోహము చెంది అహంకారమునకు లోబడి ఈ లోకమును విడిచి పోయి మాటి-మాటికి జనన-మరణ చక్రమునందు పడిపోవును. చనిపోయిన తరువాత అతనితోడనే యింద్రియములు ప్రాణములు గూడ పోవును. శరీరమునుండి ప్రాణ స్వరూపము లయిన యింద్రియములు విడిపోవుటచేత మృత్యుదేవుడు 'మరణము' అను పేరును పొందును.

''రాజా! పూర్వజన్మకర్మలు కలిగినపుడు, కర్మఫలమునందు ప్రేమ గలవారు దేహము త్యజించి పరలోకమునకు పోయెదరు. ఇందుచేతనే వారు మృత్యువును తరింప జాలరు. దేహమునందు అభిమానము గల జీవుడు పరమాత్మ సాక్షాత్కారమునకు ఉపాయమును తెలిసికొన కుండుటచేత ప్రాపంచిక విషయములను అనుభవించుటకుగాను అనేక గర్భముల యందు పడి అన్ని దిక్కుల దారి తప్పి తిరుగు చుండును. విషయసుఖానుభవము ఇంద్రియములను మహా మోహమునందు పడ వేయును.

''రాజా! ఈ అసత్య విషయములందు ప్రేమ గల మనుష్యుల ప్రవృత్తి విషయముల వైపు మరలుట స్వాభావికము. అసత్యము లయిన విషయ సుఖములందు ప్రేమ కలిగి యుండుటచేత అంతఃకరణమునందలి జ్ఞానశక్తి నశించిన వారు అన్ని యెడలందును ఆ విషయ చింతనము చేయుచు మనస్సులోనే విషయ సుఖములను ఆస్వాదించు చుందురు. అన్నిటికంటే మొదట విషయములను గూర్చి చింతించుటయే ప్రజలను చంపి వేయును. పిదప విషయ చింతనము కామ-క్రోధములను వెంట తీసికొని ఆ వ్యక్తిని మాటి-మాటికి అతి త్వరగా కొట్టు చుండును. ఈ విధముగా కామక్రోధరూప మయిన విషయ చింతనమే అవివేకు లయిన మనుష్యులను మృత్యుసమీపమునకు కొనిపోవును. కాని, స్థిర మైన బుద్ధి గలవారు ధైర్యముతో మృత్యువును దాట గలరు.

''అందుచేత రాజా! మృత్యువును జయింప గోరువాడు పరమాత్మ ధ్యానము చేసి 'ప్రాపంచిక విషయములు తుచ్ఛములు' అని తెలిసికొని, వాటిని ఏమాత్రము లెక్క చేయక, విషయములందు ఇచ్ఛ పుట్టగనే దానిని తొడిమ లోనే నశింప జేయ వలెను. ఈ విధముగా విషయేచ్ఛను త్రుంచి వేసిన విద్వాంసుని సామాన్య వ్యక్తులమవలె మృత్యువు హరింపదు. (అతడు జనన మరణముల నుండి విముక్తు డగు నని భావము.)

"రాజా! కోరికల వెంట బడి తిరుగువాడు ఆ కోరికలలోనే నశించి పోవును. కోరికలను విడిచిన జ్ఞాని జననమరణరూప దుఃఖముల నన్నింటిని నశింప జేయగలడు. కామమే సమస్త ప్రాణులను మోహింపజేయునది. కనుక అది అంధకారమయము, అజ్ఞానరూపము నై ఉండును. 'కామము నరకముతో సమాన మైన దుఃఖమును కలిగించునదిగా నుండును. మద్యపానమత్తుడు నడచుచు గోతి వైపు పరుగెత్తి అందులో బడినట్లు కాముకుడు గూడ ప్రాపంచిక విషయ

సుఖములు నిక్క మైన సుఖములుగా భావించి వానివైపు పరుగెత్తి నరకకూపముతో పడిపోవును. విషయ సుఖముల నుండి విరక్తుడయిన జ్ఞానవంతుని మృత్యువు, గడ్డితో చేయ బడిన వ్యాఘ్రమువలె, ఏమియు చేయ జాలదు. అందుచేత, రాజా! విషయ సుఖములకు మూలకారణ మైన అజ్ఞానమును నశింప జేయు కోరికతో సంసారవస్తువులలో దేనిని గూడ ఏ మాత్రము లెక్క చేయక వానిని తలచుటగూడ విడువ వలెను.

"రాజా! ఈ నీ శరీరములో ఉన్న అంతరాత్మ మోహమునకు లోబడి క్రోధ-లోభ - ప్రమాద (ఏమరుపాటు) - మృత్యురూపములో మారిపోవును. ఇట్లు మృత్యువు మోహము వలన కలుగు నని తెలిసికొని జ్ఞాన నిష్ఠ డైన వాడు ఈ లోకమునందు మృత్యువునకు ఎప్పుడును భయపడడు. అతనియొద్దకు వచ్చిన మృత్యువు, దాని వశములో చిక్కిన మనుష్యునివలె, నశించును."

మహాజ్ఞానియైన సనత్సుజాతుని ఉపదేశము వినిన ధృతరాష్ట్రునకు, సనత్సుజాతునకు నిట్లు సంవాదము జరిగెను:

ధృత - మహాత్మా! ద్విజాతులకు యజ్ఞముల ద్వారా అతి పవిత్రము లయిన సనాతన పుణ్యలోకములు ప్రాప్తించు నని చెప్పెదరు. ఆ పుణ్యలోకములే పురుషార్థము లని వేదములు చెప్పు చున్నవి. అది తెలిసిన విద్వాంసుడు పురుషార్థసాధకము లైన ఉత్తమ కర్మలను ఎందుకు ఆచరించడు?

సన - రాజా! అజ్ఞాని, యీ విధముగా వేరు - వేరు లోకములందు తిరుగు చుండుచు వేదములు, కర్మలవలన అనేక ప్రయోజనములు కలుగు నని చెప్పు చుండును. కాని, నిష్కాము డైన పురుషుడు, జ్ఞానమార్గముచేత, ఇతర మార్గము లన్నియు విడిచి, పరమాత్మస్వరూపు డగుచునే, పరమాత్మను పొందును.

ధృత : పరమాత్మయే క్రమముగా, సంపూర్ణ ప్రపంచరూపములో ప్రకటితు డైన యెడల, జననరహితుడు పురాతనుడు నైన పరమపురుషునిపైన ఏలుబడిని ఎవడు సాగించ గలడు? ఆ పరమాత్మ ప్రపంచములో వచ్చుటకు ఆయనకు అవసరమేమి? ఇందులో ఆయనకు ఎట్టి సుఖము కలుగును? ఈ విషయము లన్నియు నాకు సరిగా తెలుపుము.

సన :- జీవబ్రహ్మలకు అత్యంత భేదము కలదని అంగీకరించినయెడల 'వేద విరోధము' అను మహా దోషము కలుగును. అందుచేత, అనాది యైన మాయయొక్క సంబంధముచేత జీవులకు కామసుఖాదులతో సంబంధ మేర్పడును. అట్లైనను, జీవుని మహత్త్వము నశింపదు. ఎందు కనగా, మాయాసంబంధముచేత జీవునకు దేహాదులు మరల పుట్టు చుండును. నిత్యు డైన భగవంతుడే పరబ్రహ్మ మనబడును. పరబ్రహ్మమే మాయ సహాయముచేత ఈ బ్రహ్మాండ సృష్టి చేయును. మాయ పరబ్రహ్మ శక్తియే యని పెద్దలు అంగీకరించినారు. ఈ విధమైన యర్థమును ప్రతిపాదించుటకు వేదములే ప్రమాణములు.

ధృత : భగవన్! ప్రపంచమునందు ధర్మమును ఆచరించువారు, ఆచరించనివారు గూడ ఉన్నారు. పాపముచేత ధర్మము నష్టమగునా? లేక, ధర్మమే పాపమును నశింప జేయునా?

సన : రాజా! ధర్మమునకు పాపమునకు వేరు - వేరు ఫలములు కల్గును. ఆ రెండు విధములయిన ఫలములుగూడ అనుభవించ వలసి యుండును. కాని, పరమాత్మయందు మనస్సును లగ్నము చేసిన విద్వాంసుడు పరమాత్మజ్ఞానము చేత తాను పూర్వజన్మములందు చేసిన పాపపుణ్యకర్మములు రెండిని నశింప జేయును. ఇది ప్రపంచ ప్రసిద్ధ మయిన విషయము. ఇట్టి స్థితి లేకుండిన యెడల, దేహాభిమానము గల మనుష్యుడు ఒకప్పుడు పుణ్యఫలమును పొందును. మరియొకప్పుడు పూర్వజన్మ సంపాదిత మైన పాపఫలమును అనుభవించును.

"రాజా! ఈ విధముగా పుణ్యపాపముల వలన కలుగు స్వర్గనరకఫలములు రెండుగూడ అస్థిరములు. ఆ ఫలములను పరలోకమునందు అనుభవించి, మరల ప్రపంచమునందు పురుషుడు జన్మించి కర్మములయందు తగులుకొనును. కాని, కర్మములయొక్క తత్త్వమును తెలిసికొనిన పురుషుడు నిష్కామకర్మ రూపమైన ధర్మమును అచరించుటచేత తన పూర్వజన్మ సంపాదిత పాపమును ఇక్కడనే నశింప జేసికొనును. ఈ విధముగా అన్నిటికన్న ధర్మమే మిక్కిలి బలము గలది. ఇందుచేత నిష్కామభావముచేత ధర్మాచరణము చేయువారికి అయా సమయములలో తప్పక సిద్ధి కలుగును.

ధృత : మహాత్మా! 'పుణ్య కర్మలను చేయు ద్విజాతులకు వారి వారి ధర్మమునకు ఫలముగా పరలోకములు కలుగును' అని చెప్పెదరు. కనుక, వాని క్రమమును గూర్చి చెప్పుము. అధర్మాచరణము చేయువారు పొందు అన్యాయ లోకములను గూర్చి కూడ చెప్పుము. ఇప్పుడు సకామ కర్మలను గూర్చి నేను తెలిసికొన గోరుట లేదు.

సన : రాజా! బలవంతు లయిన వీరులు తమ - తమ బలములను పెంచుకొన వలె నని ఒకరితో నొకరు స్పర్థ (పోటీ) పడు చుందురు. ఆ విధముగానే నిష్కామ భావముచేత యమనియమాదులను అనుష్ఠించు బ్రాహ్మణులు ఇతరులను మించ వలె నని ప్రయాసపడు చుందురు. అట్టివారు మరణించి యిక్కడినుండి పోయిన పిదప బ్రహ్మలోకమునందు తమ వెలుగును వ్యాపింప జేయుదురు. ధర్మరక్షణమునందు స్పర్థ గలవారికి ఆ ధర్మము జ్ఞాన సంపాదనకు సాధన మగును. కాని, వారు చేయు కర్మ సకామ మైనచో చనిపోయిన తరువాత ఇక్కడ నుండి స్వర్గమునకు పోవుదురు.

"రాజా! మంచి ప్రవర్తన గల బ్రాహ్మణుని వేదజ్ఞులు ప్రశంసించెదరు. కాని, బాహ్యాడంబరములతో ధర్మమును చేయు వారిని గొప్పవారుగా భావించ గూడదు. నిష్కామ భావముతో ధర్మమును రక్షించుచు అంతర్ముఖు డైన వానిని శ్రేష్ఠునిగా తలంచ వలెను.

"రాజా! వర్షా కాలమునందు గడ్డి, చెట్లున్ను సమృద్ధముగా నున్నట్లుగానే, అన్నపానాదులు సమృద్ధముగా ఉన్న దేశములో బ్రాహ్మణుడు నివసించి జీవనమును గడపికొన వలెను. క్షుత్పిపాసలచేత తాను బాధపడ గూడదు. కాని, ఎవడు, తన మహిమను ప్రకటించుకొననిచోట తనకు భయము, అశుభము కలుగునో, అట్టి చోటనే అతడు నివసించుచు తన మహిమవిశేషమును ప్రకటించకుండ నుండు పురుషుడే శ్రేష్ఠు డగును. ఇతరుడు కాడు.

"ఆత్మ ప్రశంస చేసికొనువానిని చూచి తపించక సహించువాడు, బ్రాహ్మణ ధనమును అనుభవించనివాడు - ఈ ఇద్దరు పెట్టిన అన్నమును స్వీకరించ వలె నని సత్పురుషులు చెప్పినారు. ఏలాగైతే, కుక్క తాను వమనము చేసిన వస్తువును గూడ తినునో, అట్లే, తన బ్రాహ్మణత్వ ప్రభావమును ప్రదర్శించి జీవనము గడపికొను బ్రాహ్మణుడు వమనము చేసిన దానిని భుజించిన

వాడుగా నగును. దానిచేత ఆ బ్రాహ్మణునకు సర్వదా నీచత్వము కలుగును. తమ కుటుంబము వారితో జీవించు చుండియు తమ బ్రాహ్మణత్వ సాధనమును రహస్యముగా జరుపుటకు ప్రయత్నించు బ్రాహ్మణులనే విద్వాంసులు బ్రాహ్మణులుగా పరిగణించెదరు.

"రాజా! ఈ విధముగానే భేద రహితము, చిహ్న (గుర్తు) రహితము, చలన రహితము, పరిశుద్ధము నయిన ఆత్మ, ద్వైత భావ రహితముగా నుండును. అట్టి ఆత్మ స్వరూపమును తెలిసికొనిన, బ్రహ్మవేత్త, యే ఆత్మ వ్రతమును కోరును.

"రాజా! అందువలన పైన జెప్ప బడిన విధముగా జీవనమును నడిపికొను క్షత్రియుడు గూడ పరబ్రహ్మ స్వరూపమును అనుభవించి బ్రహ్మను పొంద గలడు. ఈ విధముగా ఆత్మను తెలిసికొనక దానికి విపరీతముగా తెలిసికొను వాడు, ఆత్మను అపహరించిన దొంగ యగును. అట్టివాడు మహా పాపమును చేసినవాడుగా నగును.

"రాజా! ఎవడు, బ్రాహ్మణత్వ కర్తవ్య పాలనమునందు ఎప్పుడు కూడ అలసిపోక, దానము గ్రహించక, సత్పురుషులచేత గౌరవింపబడి, ఏ యుపద్రవములు లేక, తాను శిష్టు డైనను తన శిష్టత్వమును ప్రకటించకుండ ఉండునో, అట్టి బ్రాహ్మణుడే బ్రహ్మవేత్త, విద్వాంసుడు నగును.

"రాజా! ఎవరు లౌకిక ధనము లేనందువలన, దరిద్రు లై కూడ, దైవ సంపదచేత, యజ్ఞోపాసనాదులచేతను సంపన్ను లగుదురో, అట్టివారు ఎవరికిని అణగి యుండరు. వారు ప్రాపంచిక విషయములయందు బుద్ధిని ప్రవేశింప జేయరు. అట్టి ఉత్తమ వ్యక్తిని సాక్షాత్తు పరబ్రహ్మమునుగానే తెలిసికొన వలెను

"రాజా! లోకమునందు తన కోరికలను సిద్ధింప జేయు దేవతలను కొలిచిన వాడు, తన కోరికల సిద్ధికొరకుగానే ప్రయత్నించు చుండును. కావున, ఎప్పుడు గూడ అతడు బ్రహ్మవేత్తకు సమానుడు కా జాలడు. ఇతరులవలన సన్మానమును పొందినను, అభిమానము లేకుండ నుండువాడు, మాన్యులను చూచి అసూయచేత తపించనివాడు, తన ప్రయత్నము లేకుండనే విద్వాంసుల యాదరమును పొందు వాడున్ను నిక్కముగా సమ్మానింప దగినవాడు. తనను విద్వాంసులు గౌరవించి నప్పుడు, తాను సత్పురుషుల యొక్క 'ఇది కన్నులు ముడుచుకొనుట - తెరుచు

కొనుటవంటి స్వాభావికపు వృత్తి' అని తలచవలెను. (సత్పురుషులు సహజముగానే యితరులను గౌరవించు చుందురు అని భావము.)

"రాజా! ప్రపంచము నందు అధర్మమును ఆచరించుటలో నిపుణులు, కపటముగా మోసముతో వ్యవహరించుటలో నేర్పరులు, మాననీయులను అవమానపరుచు వారున్ను పూజనీయులను ఆదరించరు.

"రాజా! మానముచేత ఈ లోకమునందు సుఖము, మౌనముచేత పరలోక సుఖము కలుగును. కాబట్టి మాన-మౌనములు రెండు ఒకచోట నుండవు. ఇవె నిశ్చయము. జ్ఞానులకు ఈ విషయము తెలియును.

"రాజా! లోకమునందు ఐశ్వర్యలక్ష్మి సుఖమును కలిగించును. కాని, ఆ లక్ష్మియే బ్రహ్మజ్ఞాన సాధన మైన మార్గమునందు విఘ్నకారిణి యగును. బ్రహ్మస్వరూప మైన లక్ష్మి జ్ఞాన హీనులకు దుర్లభము. సత్పురుషులు అట్టి బ్రహ్మజ్ఞాన ప్రదాయిని అయిన లక్ష్మిని పొందుటకు అనేక ద్వారములు తెలిసికొని యున్నారు. ఆ ద్వారములు మోహమును పెంపొందించవు. వానిని అవలంబించుట అతికష్టము. ఆ ద్వారములు - సత్యము, ఋజుత్వము (సరళత్వము), లజ్జ, ఇంద్రియ నిగ్రహము, మనశ్శుద్ధి, విద్య (జ్ఞానము)."

మౌన-తపస్త్యాగ-అప్రమాద - దమాదిగుణముల - మదాది దోషములయు నిరూపణము :

ధృత : మహాత్మా! మౌన మనగా నేమి? (వాక్కును అరికట్టుటయా? లేక పరమాత్మ స్వరూమా ?) ఈ రెంటిలో ఏ మౌనమును గూర్చి నీవు చెప్పుచున్నావు? మౌనభావమును గూర్చి వర్ణింపుము. విద్వాంసుడు వాక్కు యొక్క మౌనము ద్వారా మౌన స్వరూపు డయిన పరమాత్మను పొంద గలుగునా? మహామునీ! ప్రపంచమునందు ప్రజలు మౌనమును ఏ విధముగా నాచరించెదరు?

సన : రాజా! మనస్సు* వాగ్రూప మైన వేదములున్ను, ఏ పరమాత్మ సమీపమునకు పోజాలవో అట్టి పరమాత్మ మౌనమన బడును. అందుచేత

* 'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' అని శ్రుతి ప్రమాణము.

ఆ పరమాత్మయే మౌనస్వరూపుడు. వైదిక - లౌకిక శబ్దములు ఏచోటి నుంచి పుట్టునో ఆ పరమేశ్వరుడు తన్మయముతో ధ్యానము చేయు వారికి ప్రకటితుడగును.

ధృత : మహాత్మా! ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదమున్ను, చదువుకొన్న పండితుడు పాపము చేసినచో, అతనికి ఆ పాపము అంటుకొనునా? లేదా?

సన : రాజా! ఋక్-యజుస్-సామవేదము లేవి కూడా పాపము చేయు అజ్ఞానిని పాపమునుండి రక్షింప జాలవు. కపట పూర్వకముగా ధర్మము నాచరించు మిథ్యావాదిని వేదములు పాపముల నుండి ఉద్ధరించ జాలవు. రెక్కలు విచ్చుకొనిన పక్షి తన గూటిని విడిచి పోవునట్లుగానే నాశకాలము నందు వేదములు గూడ ఆ పాపాత్ముని పరిత్యజించును.

ధృత : మహాముని! ధర్మము లేకుండ వేద రక్షణమును చేయుటకు సమర్థులు కానట్టి వేద విదులైన బ్రాహ్మణులు పవిత్రులగుదురను నిరర్థక మైన మాటలు చాలాకాలము నుండి ఎందుకు విన బడుచున్నవి?

ఋగ్యజుస్సామభిః పూతో బ్రహ్మలోకే మహీయతే'' - ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము - ఈ వేదత్రయములచేత పవిత్రుడైన బ్రాహ్మణుడు బ్రహ్మలోకమునందు విరాజమానుడగును. ఈ మొదలైన వేద వచనములు వేదము చదివిన బ్రాహ్మణులు పాపరహితులై పవిత్రులగుదురను మాట చెప్పుచున్నవి.

సన : మహారాజా! 'పరబ్రహ్మ, పరమాత్మ' ఇత్యాది నామములతోనే ఈ జగత్తు ప్రకటిత మగుచున్నది. ఈ విషయమును వేదము స్పష్టముగా తెలుపుచున్నది. కాని, వాస్తవములో పరమాత్మ స్వరూపము ఈ ప్రపంచమునకన్న విలక్షణ మైనదని చెప్ప బడుచున్నది.

రాజా! అట్టి పరమాత్మను పొందుటకు తపస్సు-యజ్ఞములున్ను చేయవలెనని వేదమునందు చెప్ప బడియున్నది. ఈ తపో యజ్ఞముల ద్వారా వేదవేత్తకు పుణ్య ప్రాప్తి యగును. అట్టి నిష్కామ కర్మ రూప మైన పుణ్యముచేత పాపము పోగొట్టుకొనిన పిదప అతని యంతఃకరణము జ్ఞానముచేత ప్రకాశించును. అప్పుడు ఆ వేద విద్వాంసుడు జ్ఞానముచేత పరమాత్మను పొందగలడు.

కాని, దీనికి వ్యతిరేకముగా సుఖమును గోరు పురుషుడు ధర్మార్థ కామములు అను త్రివర్గముయొక్క ఫలమును కోరిన యెడల అతడు ఈ లోకమునందు చేసిన కర్మములతోబాటు పరలోకమునకు పోయి అక్కడ ఆ కర్మ ఫలమును అనుభవించి, అది ముగిసిన తరువాత, ప్రపంచమార్గము నందు తిరిగి వచ్చును. ఈ లోకము నందు కోరికలతో చేయ బడిన తపస్సు యొక్క ఫలము పరలోకము నందు అనుభవింప బడును. ఈ లోకము నందు నిష్కామభావముతో గొప్ప తపస్సు చేసినట్టి బ్రహ్మోపాసకుడు ఇక్కడనే తత్త్వజ్ఞాన స్వరూప మైన ఫలమును పొంది జీవన్ముక్తుడగును. ఇట్టి తపస్సు 'ఋద్ధము-సమృద్ధము' అని రెండు విధములుగ నుండును.

ధృత : భగవన్! విశుద్ధ మనస్సుతో చేయ బడిన తపస్సు 'సమృద్ధము-అసమృద్ధము' అని రెండు విధములుగ నెట్లగును? దానిని మనము ఏట్లు తెలిసికొన వలెను?

సన : రాజా! ఈ తపస్సు నిర్దోష మైనది. ఇందులో భోగవాసనాదోషము ఉండదు. అందుచేత ఇది విశుద్ధ తపస్సు అనబడును. ఇది సకామ తపస్సుకంటె ఫలప్రాప్తి విషయములో మిక్కిలి అధిక మైనది. రాజా! నీవు అడుగుచున్న తపస్సే సమస్త జగత్తునకు మూలము. వేదజ్ఞులైన విద్వాంసులు ఈ నిష్కామ తపస్సు చేతనే అమృత స్వరూప మయిన మోక్షమును పొందెదరు.

ధృత : సనత్సుజాతా! నీవలన దోషరహిత మైన తపస్సును గూర్చి విన్నాను. ఇప్పుడు తపస్సునకు సంక్రమించు దోషములు ఏవి? వానిని తెలుపుము. దానిచేత నేను సనాతన మైన బ్రహ్మతత్త్వమును తెలిసికొనెదను గాక!

సన : రాజా! తపస్సుకు క్రోధము మొదలైన పన్నెండు దోషములు, పదుమూడు విధములుగ క్రూర జనులును ఉండెదరు. వేదములయందు చెప్ప బడిన బ్రాహ్మణ ధర్మములు పన్నెండు సుప్రసిద్ధగుణములుగ నున్నవి.

''రాజా! కామ-క్రోధ-లోభ-మోహ-చికీర్షా (చేయవలెనను కోరిక) - నిర్దయత్వ - అసూయా - అభిమాన - శోక - స్పృహా (ఆశ) - ఈర్ష్యా - నిందలు

అను పన్నెండు మనుష్యుల యందున్న దోషములు. వీనిని సర్వదా విడువ వలెను. వ్యాధుడు మృగములను పట్టి చంపుటకు అవకాశము కనిపెట్టుచు అడవిలో చూచు చుండునట్లు పై దోషములలో ఒక్కొక్కటిగూడ అవకాశమును కనిపెట్టుచు మనుష్యులపైన ఆక్రమణము చేయు చుండును.

''రాజా! ఆత్మస్తుతి పరుడు - ఆశాపరుడు - కొద్దిపాటి అవమానమును కూడ సహించనివాడు- నిరంతరము కోపిష్ఠుడుగా నుండువాడు - చపలచిత్తుడు - ఆశ్రితులను రక్షించనివాడు - ఈ యారుగురు పాపిష్ఠు లన బడుదురు. ఎన్ని సంకటావస్థలు వచ్చినను వీరు నిర్భయముగా ఈ పాపకర్మలను ఆచరించు చుందురు.

"స్త్రీ సంభోగమునందే మనస్సు లగ్నము చేసినవాడు - వైషమ్యము కలవాడు - దానము చేసి పశ్చాత్తాపము వొందువాడు - పిసినిగొట్టు - అర్థకామములను ప్రశంసించువాడు - స్త్రీలను ద్వేషించువాడు- ఈ ఏడుగురు పైన చెప్పబడిన ఆరుగురున్ను వెరసి పదుముగ్గురున్ను క్రూరు లన బడుదురు.

''రాజా! ధర్మము-సత్యము-ఇంద్రియ నిగ్రహము-తపస్సు-మాత్సర్యము లేకుండుట - లజ్జ-ఓర్పు - ఇతరులయెడల దోషాన్వేషణము చేయ కుండుట - యజ్ఞము-దానము-ధైర్యము- శాస్త్రజ్ఞానము- ఈ పన్నెండు గుణములు బ్రాహ్మణులకు (బ్రహ్మజ్ఞాన సంపన్నులకు) ఉండు నియమవ్రతములు. ఈ పన్నెండు గుణములపైన అధికారము గలవాడు సమస్త ప్రపంచ మానవులను తన వశములో నుంచుకొన గలడు. వీటిలో రెండు - మూడు గుణములు ఉన్నవా డైనను అతని యొద్ద అన్నివిధము లయిన ధనములు ఉన్నట్లుగా భావించ వలయును.

''ఇంద్రియ నిగ్రహము-త్యాగము-ఏమరుపాటు లేకుండుట - ఈ మూడు గుణములు అమృతత్వమునకు నివాసములు. ఈ గుణముల ముఖములు పరమాత్మవైపే ఉండును. (ఇవి 'పరమాత్మ ప్రాప్తికి సాధనములు' అని భావము) అని బుద్ధిమంతు లయిన బ్రహ్మవేత్తలు చెప్పెదరు.

''రాజా! ఇంద్రియ నిగ్రహము,పదునెనిమిది దోషములు లేనిది యగును. అవి యే వనగా - (1) కార్యమును అకార్యముగాను, అకార్యమును కార్యముగాను తలచుట, (2) అసత్యభాషణము, (3) గుణములయందు దోషదృష్టి, (4) స్త్రీలయందు ఇచ్ఛ, (5) సర్వదా ధన సంపాదనమునందే నిమగ్ను డై యుండుట,

(6) సుఖములందు ఇచ్ఛ, (7) క్రోధము, (8) శోకము, (9) తృష్ణ (ఆశ), (10) లోభము, (11) కొండెములు చెప్పు అలవాటు, (12) మాత్సర్యము, (13) హింస, (14) సంతాపము, (15) శాస్త్రమునందు అనాసక్తి, (16) కర్తవ్యమును మరచుట, (17) అధికముగా వదరుట, (18) తనను గొప్పగా తలచుకొనుట - ఈ పదునెనిమిది దోషములు లేని సత్పురుషుడు జితేంద్రియు డన బడును. ఈ దోషములను పూర్తిగా విడువ వలెను.

"రాజా! మదమునందు పదునెనిమిది దోషములు ఇమిడి యున్నవి. పైన ఇంద్రియ నిగ్రహమునకు సూచింప బడిన పదునెనిమిది విపరీత దోషములే మదము కలుగుటకుగూడ కారణము లగును అని చెప్పబడెను.

''త్యాగము ఆరు విధములుగ నుండును. ఈ షడ్విధ త్యాగమును విడుచుట మిక్కిలి ముఖ్యము. కాని, వీనిలో మూడవ దైన కామత్యాగము అతి కఠినమైనది. కామత్యాగముచేత మనుష్యుడు ఆధ్యాత్మిక - అధిదైవిక - అధిభౌతిక త్రివిధ దుఃఖములను తప్పకుండ దాట గలడు. కామమును విడిచిన తరువాత అన్నిటిని అతడు జయించగలడు.

"రాజా! ఆరువిధము లయిన త్యాగములు ఏవి - యనగా 1) సంపదను పొంది హర్షింపకుండుట - ఇది మొదటి త్యాగము.

2) యజ్ఞహోమాదులు చేయుట, కూప - తటాక - ఉద్యానాదులను నిర్మించుటయందు ధనము వెచ్చించుట - రెండవ త్యాగము.

3) ఎల్లప్పుడును వైరాగ్యముతో నుండి కామమును విడుచుట - ఇది మూడవ త్యాగము. మహర్షులు ఈ త్యాగము మోక్షమునకు ఉపాయ మని చెప్పెదరు. అందువలన ఈ మూడవత్యాగము విశేషగుణ మని తలచ బడినది. వైరాగ్యపూర్వకముగ పదార్థములను త్యజించుటచేత కలుగు నిష్కామత్వము - స్వేచ్ఛాపూర్వకముగా ఆ పదార్థములను అనుభవించుటచేత కలుగదు. అధిక ధన సంపదల సంగ్రహముచేత నిష్కామత్వము సిద్ధించదు. తన కామనాపూర్తి కొరకు ధనోపభోగము చేయుటకూడ కామమును త్యజించుట కాదు.

4) సర్వగుణసంపన్ను డై ధనవంతు డైనపురుషుడు చేసిన కర్మలు ఫలసిద్ధిని ఇవ్వ జాలనిచో, దానికొరకు అతడు దుఃఖమును, బాధనున్ను చెందగూడదు. తనకు ఏ దైన అప్రియము ఘటించినప్పుడు గూడ బాధపడగూడదు. ఇది నాల్గవ త్యాగము.

5) తనకు ఇష్టము లయిన స్త్రీ - పుత్ర - ధనాదులను ఎప్పుడును కోర గూడదు. ఇది ఐదవ త్యాగము.

6) యోగ్యు డైన యాచకుడు వచ్చినప్పుడు అతనికి దానము చేయవలెను. ఇది ఆరవ త్యాగము.

''రాజా! యీ త్యాగము లన్నిటివలన శ్రేయస్సు చేకూరగలదు.

''రాజా! త్యాగమయము లయిన ఈ గుణములచేత మనుష్యునకు ఎప్పుడు గూడ ప్రమాదము (ఏమరుపాటు) కలుగదు. ఈ అప్రమాదమునకుగూడ, 'సత్యము - ధ్యానము - అధ్యాత్మవిచారము - మనస్సునకు సమాధానము - వైరాగ్యము - దొంగతనము చేయకుండుట - బ్రహ్మచర్యము - దానమును గ్రహించకుండుట'- ఈ యెనిమిదిగుణములు చెప్పబడినవి. ఈ యెనిమిది గుణములు త్యాగము, అప్రమాదము - ఈ రెండింటికే ఉండు నని తెలిసికొన వలయును.

''రాజా! ప్రమాదమునకు (ఏమరుపాటునకు) ఉన్నయెనిమిది దోషములను గూడ విడువ వలయును. అవి—పంచజ్ఞానేంద్రియములు, ఆరవది మనస్సు - ఈ ఆరు ఇంద్రియములు తమ-తమ విషయములను అనుభవించుటకు ముందుకు సాగుచుండును. ఈ ఆరే ప్రమాదవిషయములయిన దోషములు.

''కడచిన కాలమును గూర్చిన చింత భవిష్యత్తును గూర్చిన ఆశ - యీ రెండును దోషములే. వెరసి ఈ ఎనిమిది దోషములనుండి విముక్తు డయిననాడు సుఖమును పొందును.

''రాజేంద్రా! నీవు సత్యస్వరూపుడవు కమ్ము. సత్యమునందే లోకము లన్నియు నిలిచి యున్నవి. ఇంద్రియ నిగ్రహము - త్యాగము - అప్రమాదము- ఈ మొద లైన గుణములుగూడ సత్యస్వరూపు డయిన పరమాత్మను పొందించ గలవు. అమృతత్వముగూడ సత్యమునందే యున్నది. దోషములను తొలగించిన తరువాతనే ఈ లోకమునందు తపస్సు -నియమమున్ను ఆచరించవలయును. ఇది బ్రహ్మదేవుని నిర్ణయము. సత్యమే శ్రేష్ఠపురుషులకు వ్రతము.

"రాజా! మనుష్యుడు పైన జెప్ప బడినదోషములు లేకుండ గుణములతో గూడి యుండ వలయును. అట్టి పురుషుడు చేసిన పరిశుద్ధ తపస్సే మిక్కిలిగ వృద్ధి చెందును.

"రాజా! నీవు నన్నడిగిన ప్రశ్నలకు సమాధానములు సంగ్రహముగా చెప్ప బడినవి. తపస్సు అనునది 'జన్మ - మృత్యు - వృద్ధావస్థల' యందు కలుగు కష్టములను తొలగించి పాపములను పోగొట్టి పరమపవిత్ర మై యుండును."

జనమేజయా! సనత్సుజాత మహాముని చెప్పిన బ్రహ్మోపదేశమును వినుచు ధృతరాష్ట్రుడు ఆ మహామునిని తిరిగి యిట్లు ప్రశ్నించెను :

"మహామునీ! ఇతిహాసపురాణములలో ఐదవది, అన్ని వేదములచేత గూడినదియు నైన గ్రంథమును ప్రజలు విశేషముగా ప్రశంసించెదరు. అట్టివారు 'పంచవేదులు' అన బడెదరు. తదితరులు - చతుర్వేదులు - త్రివేదులు - ఏక వేదులు - అనృచులు (ఋగ్వేదాదులను అధ్యయనము చేయనివారు) అని వేర్వేరుగా అన బడుదురు. 'వీరిలో బ్రాహ్మణులు ఎవరు' అని నేను తెలిసికొన గలుగుదును?"

ఆ మాటలకు సనత్సుజాతు డిట్లు బదులు చెప్పెను :

వేదస్వరూప నిరూపణము :

"రాజా! సృష్ట్యాదియందు వేదము ఒకటిగానే యుండెను. అందువలన దానిని తెలిసికొనుటకు వీలు గాకుండుటచేత అది అనేక విభాగములుగా చేయ బడెను. సత్యరూప మైన సమగ్రవేదము యొక్క సారమైన తత్త్వము పరమాత్మ యందు ఉన్నది. ఇట్టి వేదతత్త్వమును తెలిసికొనకున్నను కొందరు 'నేను విద్వాంసుడను' అని అనుకొను చుందురు. వారికి దానము, అధ్యయనము, యజ్ఞాదులు - మొదలైన ప్రపంచ సుఖము కలిగించు ఫలములం దాశచేత అట్టి కర్మలయందు ప్రవృత్తి కలుగును. వాస్తవములో సత్యస్వరూపు డయిన పరమాత్మనుండి ప్రచ్యుతుడు (జారి పోయినవాడు) అయిన వానికి సంకల్పము గూడ అట్లే యుండును. తరువాత అతడు సత్యస్వరూపమయిన వేదము యొక్క ప్రామాణ్యమును నిశ్చయించుకొని వేదముల ద్వారా యజ్ఞములు అనుష్ఠించును.

''రాజా! కొందరు మనస్సుచేత, మరికొందరు వాక్కుచేత, ఇంక కొందరు క్రియలచేతను యజ్ఞములను అనుష్ఠించెదరు. సంకల్పసిద్ధు డైన పురుషుడు తన సంకల్పము ననుసరించియే ఆయా లోకములను పొందును. సంకల్పము సిద్ధించనంతవరకు యజ్ఞదీక్షితుడు యజ్ఞాదికర్మలను చేయు చుండ

వలెను. (దీక్షిత శబ్దము 'మౌంఢ్య - ఇజ్యా - ఉపనయన - నియమ - వ్రతాదేశము అను అర్థము గల 'దీక్ష' అను క్రియనుండి పుట్టినది.)

"సత్పురుషులకు రాజా! సత్య స్వరూపుడయిన పరమాత్మయే అన్నింటి కంటె పెద్దది. ఎందు కనగా పరమాత్మ జ్ఞానము యొక్క ఫలము ప్రత్యక్షము. తపస్సుయొక్క ఫలము పరోక్షము అందుచేత జ్ఞానమునే ఆశ్రయించ వలయును.

''రాజా! ఎక్కువ చదువు చుండు బ్రాహ్మణుని 'బహుపాఠి' - అనేకములను చదివినవాడు అని తెలిసికొనవలయును. అందుచేత మహారాజా! విశేషముగా మాటలాడినంత మాత్రముచేత ఎవనిని గూడ బ్రాహ్మణుడు అని తలచ గూడదు. 'సత్య స్వరూపు డయిన పరమాత్మనుండి ఎప్పుడు గూడ వేరుగా ఉండని వానినే బ్రాహ్మణుడు' అని తెలిసికొనుము.

''రాజా! అథర్వమునిచేత, ఇతర మహర్షులచేతను, పూర్వకాలమందు గానము చేయ బడినదే ఛందస్సు - (వేదము). కాని సమగ్ర వేదమును చదువుకొనినప్పటికిని, వేదముల ద్వారా తెలిసికొన దగిన పరమాత్మ తత్త్వమును తెలిసికొననివాడు వాస్తవముగా వేద విద్వాంసుడు కాజాలడు.

"రాజేంద్రా! వేదములు పరమాత్మయందు స్వేచ్ఛా సంబంధములు గలవై యుండును. అనగా, అవి 'స్వతః ప్రమాణములు' - అనగా, వానికి అవే ప్రమాణములు. కాని యితర ప్రమాణములచేత వానిని తెలిసికొనవలసిన యవసరము ఉండదు. అందుచేత వేదాధ్యయనము చేసినవాడే వేద్య (తెలిసికొన దగిన) రూపుడయిన పరమాత్మ తత్త్వమును పొందగలడు.

"రాజా! వాస్తవముగా వేదతత్త్వమును తెలిసికొనినవాడు ఎవడును లేడు. అనగా, ఆ రహస్యమును తెలిసికొనినవాడు ఎవడో ఒకడు ఉండును. కేవలము వేద వాక్యములను వల్లించినవాడు వేదముచేత తెలిసికొన దగిన పరమాత్మను తెలిసికొన జాలడు. కాని, సత్యమునందే స్థిరముగా మనస్సును నిలిపినవాడు వేదవేద్యుడయిన పరమాత్మను తెలిసికొన గలడు. వేదవేత్తలలో ఎవడు గూడ వేద రహస్యములను తెలిసికొనువాడు లేడు. ఎందు కనగా, మనస్సు- బుద్ధి మొదలైన వానిద్వారా వేదరహస్యస్వరూపుడైన పరమాత్మను ఎవడును తెలిసికొన జాలడు. కేవలము యజ్ఞాది కర్మలను విధించు వేదములను తెలిసికొనినవాడు బుద్ధి

చేత తెలియబడు విషయములనే తెలిసికొనును. అట్టివాడు సకామ పురుషుడన బడును. అతడు వాస్తవ తత్త్వమైన పరబ్రహ్మమును తెలిసికొనలేడు.

''రాజా! వేదరహస్యములను తెలిసికొనిన మహాపురుషుడు వేదములచేత తెలిసికొనదగిన పరమాత్మను గూడ తెలిసికొనగలడు. అట్టి జ్ఞానిని వేద శబ్దములను మాత్రమే ఎరిగినవాడు తెలిసికొనలేడు. వానికి వేదమును గూడ తెలియదనియే చెప్పవలయును అయినను, వేదరహస్యమును తెలిసికొనిన వేద వేత్తలయిన మహాపురుషులు వేదము చేతనే వేద రహస్యములను తెలిసికొన గలుగుదురు. (అనగా వేదార్థ రహస్యమును శబ్దజ్ఞానముచేత మాత్రమే తెలిసికొన జాలడు. అనగా అందులో వర్ణింపబడిన పరమాత్మ తత్త్వము శబ్దజ్ఞానము వలన తెలియబడదు అని భావము.) పరిశుద్ధమయిన మనస్సు గల సాధకుడు కేవలము సద్గురువు యొక్క కృపచేతనో, లేక, పరమాత్మ కృషిచేతనో వేదతత్త్వమయిన పరమాత్మను తెలిసికొన గలడు.

''రాజా! 'వృక్షచంద్ర' న్యాయముచేత (సూక్ష్మమయిన చంద్రకళను చూపుటకు చెట్టుకొమ్మను సంకేతముగా చూపునట్లు) పరమాత్మ తత్త్వదర్శనమునందు వేదముల యొక్క ఉపయోగము ఉండును అని విద్వాంసులు చెప్పెదరు.

"పరమాత్మ తత్త్వమును తెలిసికొని వేదములకు యథార్థముగా వ్యాఖ్యానము చేసి, దానివలన తన సందేహమును పోగొట్టుకొనుటయేకాక, యితరుల సందేహమును గూడ పూర్తిగా పోగొట్టగలిగిన వానినే బ్రాహ్మణుడని నేను తలచెదను.

''రాజా! పరమాత్మను అన్వేషించుటకు పూర్వ - దక్షిణ - పశ్చిమ - ఉత్తర దిక్కులవైపు, ఆగ్నేయాది విదిక్కుల (మూలలు) వైపున్ను పోవలసిన యవసరముండదు. దిక్కులు,ఏ దిక్కులున్న లేని ప్రదేశములందు గూడ పరమాత్మను వెదుకవలసిన యవసరము లేదు. ఆత్మను, అనాత్మ పదార్థముల యందు ఏ విధముగ గూడ అన్వేషణ చేయ వీలు కాదు. వేదవాక్యములందు గూడ అది సాధ్యము కాదు. కేవలము తపస్సుచేతనే ప్రభు సాక్షాత్కారము కల్గును.

''రాజా! ఇంద్రియముల చేష్ట లన్నిటిని అరికట్టి, పరమాత్మను ఉపాసించ వలెను. మనస్సునుగూడ అచంచలముగా నుంచుకొన వలయును. రాజా!

నీవుగూడ నీ హృదయా కాశములో విరాజమాను డయిన పరమేశ్వరుని హృదయ పూర్వకముగా నుపాసించుము.

"రాజా! మౌనముచేత నయినను, లేక, అడవిలో నివసించినంతమాత్రము చేతను ఎవడుగూడ ముని కా జాలడు. ఆత్మ స్వరూపమును తెలిసికొనినవాడే ఉత్తము డయిన మహాముని యన బడును. అన్ని అర్థములను వివరించు జ్ఞాని వ్యాకరణ శాస్త్రజ్ఞుడు అని అనిపించుకొనును. ఈ యన్ని యర్థముల ప్రకటనము అన్నిటికిన్ని మూలభూత మయిన పరబ్రహ్మమునుండియే ఏర్పడును. అందు వలన ఆ పరబ్రహ్మమే ప్రధాన వ్యాకరణ శాస్త్రజ్ఞునిగా భావించ వలెను. విద్వాంసుడు (ఆత్మజ్ఞాని)గూడ ఈ విధముగనే అర్థముల వివరణము చేయు చుండును. కనుక, అతడుగూడ వ్యాకరణ శాస్త్రజ్ఞుడే యగును.

"రాజా! అన్ని లోకములను ప్రత్యక్షముగా చూడ గలుగు యోగి, అన్ని లోకముల యొక్క ద్రష్ట (చూచువాడు) అని అనబడును. కాని, కేవలము సత్యస్వరూప మయిన పరబ్రహ్మమునందు మాత్రమే నిష్ఠ గలిగి, బ్రహ్మవేత్త యయిన బ్రాహ్మణుడు సర్వజ్ఞు డగును. ఈ ధర్మాదులను అనుష్ఠించుటచేత, విధి విధానముగా వేదాధ్యయనము చేయుటచేతను మనుష్యులు ఈ విధముగనే పరమాత్మ సాక్షాత్కారమును చేయ గల రని నా నిశ్చయము."

జనమేజయా! అట్లు సనత్సుజాత మహాముని చెప్పిన మాటలు వినిన ధృతరాష్ట్రునకు సనత్సుజాతునకు మరల ఈ విధముగా సంవాదము జరిగెను:

బ్రహ్మచర్య - బ్రహ్మల నిరూపణము :

ధృత : మహాత్మా! నీవు సర్వోత్తమము, సర్వస్వరూపమునైన బ్రహ్మ విద్యను ఉపదేశించు చున్నావు. కామేచ్ఛ గల పురుషులకు నీ యుపదేశము దుర్లభము. కుమారా! నీవు చెప్పిన ఈ యుత్కృష్ట విషయములను మరల ప్రతిపాదించుము.

సన : రాజా! నీవు మాటి-మాటికిన్ని ప్రశ్నములు చేయుచున్నప్పుడు మిక్కిలి సంతోషించు చుందువు. ఈ విధముగా తొందరపాటు చేయుటవలన పరబ్రహ్మము లభించదు. బుద్ధియందు మనస్సును లయము చేసి సమస్త విషయ వ్యాపారములను నిరోధించు స్థితిని బోధించునదియే పరబ్రహ్మ విద్య. అది బ్రహ్మచర్యపాలనము చేతనే లభించును,

ధృత : కర్మలద్వారా పొంద యోగ్యము కానట్టిది, కార్యసమయమునందుగూడ ఆత్మలోనే యుండునట్టిదియు నైన యనంత బ్రహ్మముయొక్క సంబంధముగల సనాతన విద్యను బ్రహ్మచర్యమునుండియే పొంద యోగ్యమైన దని నీవు చెప్పు చున్నావు. నావంటివారు, బ్రహ్మ సంబంధ మయిన అమృతత్వము (మోక్షము) ను ఎట్లు పొంద గలరు?

సన : రాజా! ఇప్పుడు నేను సచ్చిదానంద ఘనము, అవ్యక్తము నయిన బ్రహ్మముతో సంబంధము గల పురాతన మయిన విద్యను నీకు తెలిపెదను. అది మనుష్యులకు బుద్ధిచేత - బ్రహ్మచర్యము చేతను ప్రాప్త మగును. దానిని పొందిన విద్వాంసుడు మరణధర్మము గల యీ శరీరమునుండి ఎల్లప్పటికిని విముక్తు డై వృద్ధు లయిన గురుజనములలో సర్వదా విరాజిల్లు చుండును.

ధృత : బ్రహ్మన్! బ్రహ్మవిద్య బ్రహచర్యము చేతనే సులభముగా తెలియ బడ గలిగినచో మొదట నాకు బ్రహ్మచర్య పాలనము చేయు విధమునే తెలుపుము.

బ్రహ్మచర్య నిరూపణము :

సన : రాజా! ఆచార్యుని ఆశ్రమమును చేరి తమ శుశ్రూషచేత ఆచార్యునకు అంతరంగ భక్తు లై బ్రహ్మచర్యమును పాలించువారు ఇక్కడనే శాస్త్ర పండితు లై, దేహత్యాగము చేసిన పిదప పరమయోగీశ్వరు లైన పరమాత్మను పొంద గలరు. ప్రపంచమునందు ఇట్టి స్థితితోనేయుండి, అన్ని కోరికలను జయించి, బ్రాహ్మ స్థితిని పొందుటకుగాను అనేక విధము లైన ద్వంద్వములను (శీతోష్ణ సుఖ దుఃఖాదులను) సహించుచు సత్త్వ గుణప్రధాను లై యున్నవారు, ఇక్కడనే, ముంజిగడ్డినుండి ముండ్లను తీసివేసినట్లు, దేహమునుండి ఆత్మను వివేకము చేత వేరు చేయుదురు.

"రాజా! తల్లిదండ్రు లిద్దరు ఈ శరీరమునకు జన్మము నిచ్చినప్పటికిని, ఆచార్యోపదేశముచేత కలిగిన జన్మము పరమ పవిత్రము, అజరామరము నైనదిగా భావించ వలెను. పరమార్థమును ఉపదేశించుటద్వారా సత్యస్వరూపమును ప్రకటించి, అమరత్వము (మోక్షము) ను ప్రసాదించుచు బ్రాహ్మణాది వర్ణములను రక్షించు ఆచార్యుని తల్లి దండ్రులనుగా భావించ వలెను. ఆచార్యుడు

చేసిన ఉపకారమును సర్వదా స్మరించుచు, ఆయన యెడల ఎప్పుడు గూడ ద్రోహము తలపెట్ట గూడదు.

"రాజా! బ్రహ్మచర్యము నం దున్న శిష్యుడు ప్రతి నిత్యము గురువునకు ప్రణామము చేయు చుండ వలెను. బాహ్యాంతరములందు పవిత్రముగా వ్యవహరించుచు, ఏమరుపాటు లేక, వేదాధ్యయనమునందు మనస్సును లగ్నము చేయ వలెను. అతనికి అభిమానము ఉండ గూడదు అతడు కోపపడ గూడదు. ఇదియే, బ్రహ్మచర్యమునకు మొదటి పాదము.

"రాజా! తన ప్రాణములను, ధనమును వెచ్చించి యైనను, మనోవాక్కాయ కర్మలతో ఆచార్యునకు ప్రియమును గూర్చుట, గురువునెడల శిష్యుడు చూపించు శ్రద్ధ గౌరవ పూర్వక మయిన వ్యవహారమే గురుపత్నీ - పుత్రులయందు గూడ చూపించ వలయును. ఇది రెండవ పాదము.

"రాజా! ఆచార్యుడు తనకు చేసిన యుపకారమును దృష్టిలో నుంచుకొని ఆయన వలన తనకు గలిగిన ప్రయోజనమును విచారించి మనస్సులోనే ప్రసన్నుడగుచు, మనస్సులోనే, శిష్యుడు ఆచార్యుని విషయమునందు గౌరవభావముతో నుండుట బ్రహ్మచర్యము యొక్క మూడవ పాదము.

"రాజా! ఆచార్యునకు గురుదక్షిణాదులు సమర్పించి సంతుష్టి పరచక, విద్వాంసు డయిన శిష్యుడు ఆయన స్థానమునుండి వేరుచోటికి పోవగూడదు. గురు దక్షిణ సమర్పించి కాని, అతనిని సేవించిన తరువాత గాని మనస్సునందు 'నేను గురువునకు ఉపకారము చేయు చున్నాను.' అని మనస్సులో తలచ గూడదు. నోటితో చెప్ప గూడదు. ఇది బ్రహ్మచర్యము యొక్క నాలుగవ పాదము.

"రాజా! సనాతన విద్యయొక్క మొదటి పాదమునందు బ్రహ్మచర్య మర్మములను మనుష్యుడు పొంద గలడు. రెండవ పాదమునందు గురు సంపర్కము చేత, మూడవ పాదమునందు తన ఉత్సాహము చేత, నాలుగవ పాదమునందు శాస్త్ర విచారము చేతను బ్రహ్మచర్యమును పొంద గలడు.

"రాజా! పూర్వము చెప్ప బడిన ధర్మాదు లయిన పన్నెండు గుణములు బ్రహ్మచర్యము చేతను, ఆచార్యుని సంపర్కము చేతను పొందిన వేదార్థ జ్ఞానము వలన సఫలము లగును. ఈ గుణములేకాక, ధర్మమునకు అంగములు, సామర్థ్యములు మొద లైనవి గూడ బ్రహ్మచారి పొంద గలడు.

"రాజా! ఇట్లు బ్రహ్మచర్య పాలనమునందు శ్రద్ధ గలిగి యుండిన బ్రహ్మచారి జీవనము గడుపుటకు (భిక్షావృత్తితో) సంపాదించిన ధనము, వస్తువులున్ను ఆచార్యునకు అర్పించ వలయును ఇట్లు చేయుట చేత సత్పురుషులు, గుణవంతులు నయిన పెద్దల ప్రవర్తనమును అలవరచుకొన గలడు. గురుపుత్రుని విషయములో శిష్యునకు ఇట్టి భావనయే యుండ వలయును.

"రాజా! ఇట్టి ప్రవర్తనతో గురుకులమునందు నివసించు శిష్యునకు ప్రపంచమునందు సర్వవిధ మయిన ఉన్నతి కలుగును. అతడు గృహస్థాశ్రమమునందు ప్రవేశించి అనేక పుత్రులను గొప్ప ప్రతిష్ఠనున్ను పొంద గలడు. ఏ వైపు వెళ్ళినను అతనికి సుఖమే నిరంతరము కలుగును. అతని యొద్ద బ్రహ్మచర్య పాలనమునకై ఇతరులు కూడ అనేకులు వచ్చి నివసించెదరు.

"రాజా! బ్రహ్మచర్య పాలనము చేతనే దేవతలకు దేవత్వము, ఋషులకు బ్రహ్మలోకమున్ను ప్రాప్తించెను. దీని మహిమ చేతనే గంధర్వులకు, అప్సరసలకున్ను దివ్య మయిన రూపము కలిగినది. బ్రహ్మచర్య తేజస్సు చేతనే సూర్యుడు సమస్త లోకములను ప్రకాశింప జేయుటకు సమర్థు డగు చున్నాడు. రసభేద స్వరూపమయిన చింతామణివలన కోరిక లన్నియు సిద్ధించునట్లే, బ్రహ్మచర్యము వలన గూడ అభీష్టము లన్నియు సిద్ధించును. ఈ విషయములను తెలిసికొనియే ఋషులు దేవతలు మొద లైనవారు బ్రహ్మచర్యమును పాలించిరి.

"రాజా! ఇట్టి బ్రహ్మచర్యమును ఆశ్రయించిన బ్రహ్మచారి యను నియమాదు లయిన తపశ్చర్యలను చేయుచు తన శరీరము నంతటిని పవిత్రముగ చేసికొన గలడు. బహ్మచర్య పాలనము చేత విద్వాంసుడు అజ్ఞాను డయిన బాలకునివలె రాగద్వేష రహితు డై చివరకు మృత్యువును గూడ జయించ గలడు. రాజా! కోరికలు గల పురుషుడు తన పుణ్యకర్మల చేత నశ్వరము లయిన స్వర్గాదిలోకములని మాత్రమే పొంద గలడు. కాని, పరబ్రహ్మచర్యమును అవలంబించిన విద్వాంసుడు జ్ఞానము ద్వారా సర్వాత్మ డయిన పరమాత్మని పొంద గలడు. మోక్ష ప్రాప్తికి జ్ఞానము దప్ప రెండవ మార్గ మేదియు లేదు."

జనమేజయా! ఇట్లు సనత్సుజాతమహాముని చెప్పిన బ్రహ్మచర్య విషయమును విని ధృతరాష్ట్రుడు మరల నిట్లు ప్రశ్నించెను:

"మహాత్మా! ఇక్కడ సత్యస్వరూపు డయిన పరమాత్మని యొక్క అమృత స్వరూపము, శాశ్వతము నయిన పరము పదమును సాక్షాత్కరించుకొను

విద్వాంసుని స్వరూపము ఎట్లు ఉండును? అతడు తెల్లగా, ఎఱ్ఱగా, నల్లగా (కాటుకవలె), (సువర్ణము వలె) పచ్చగా కనపడునా?"

ధృత రాష్ట్రుని ప్రశ్నకు సనత్సుజాతముని ఈవిధముగా ఉత్తరము చెప్పెను :

''రాజా! శ్వేత-రక్త-నీల-పీత వర్ణములతోనో, లేక, సూర్యునివలె అనేక వర్ణములతోనో, ఆ పరమ పదము తెలియు చున్నప్పటికిని, వాస్తవముగా పర బ్రహ్మముయొక్క రూపము భూమండలమునందు గాని, ఆకాశమునందు గాని లేదు. పరబ్రహ్మ స్వరూపము సముద్రజలము నందుగూడ లేదు. పరబ్రహ్మము యొక్క రూపము నక్షత్రములలో, విద్యుత్తు (మెరుపు)లో, మేఘము లలో, వాయు - దేవగణ - చంద్ర - సూర్యులలోను కనపడదు. ఋగ్ - యజుస్ - సామ - అథర్వ వేదములలో, 'రథంతర - బార్హద్రథ' నామకము లైన సామములలో, గొప్ప వ్రతములందును పరబ్రహ్మరూప దర్శనము కాదు. ఎందు కనగా, ఆబ్రహ్మ నిత్యము (శాశ్వతము). అవి అనిత్యములు.

''రాజా! పరబ్రహ్మయొక్క ఆ స్వరూపమును ఎవరుగూడ దాట జాలరు. అది అజ్ఞానాంధకారమునకు అతీత మైనది. మహాప్రళయకాలమునందు అన్ని లోకములను నాశ మొందించు యముడు గూడ అందులోనే విలీను డై పోవును. చురకత్తి అంచు వలె అది మిక్కిలి సూక్ష్మము, పర్వతముకన్న అది మిక్కిలి గొప్పది. సూక్ష్మమునకంటే సూక్ష్మతరము, మహత్తుకంటే మహత్తరము అని భావము. అన్నిటికిని అది ఆధారము, అదియే అమృతము. అదియే సమస్త లోకములు. అదియే యశస్సు. అదియే బ్రహ్మము. సమస్త భూత ప్రాణి ప్రపంచము ఆ పరబ్రహ్మ స్వరూపము చేతనే ప్రకటిత మై అందులోనే విలీన మగును.

"రాజా! కార్య రూప మయిన ఈ జగత్తు వాక్కుయొక్క వికృతి మాత్రమే. కాని, సంపూర్ణజగత్తునకు ఆధార మైన యా పరబ్రహ్మము రోగ - శోక పాపములనుండి దూరముగ నున్నది. ఆ బ్రహ్మముయొక్క యశస్సు అంతటను వ్యాపించి యున్నది ప్రపంచ కారణస్వరూప మయిన ఆ పర బ్రహ్మమును తెలిసికొనువాడు అమరు డగును. అనగా, ముక్తు డగు నని భావము. ఇట్లు విద్వాంసులు చెప్పెదరు."

రాజా! ఇట్లు బ్రహ్మచర్య - పరబ్రహ్మస్వరూపములను వివరించి సనత్సుజాత మహాముని గుణదోషముల లక్షణములను వర్ణించుచు ధృతరాష్ట్రునకు బ్రహ్మవిద్యను ఈవిధముగా ప్రతిపాదించు చున్నాడు:

గుణ-దోష లక్షణము బ్రహ్మవిద్యా నిరూపణము :

''ధృతరాష్ట్ర మహారాజా! శోకము - క్రోధము లోభము - కామము- మానము - అతినిద్ర - ఈర్ష్య - మోహము - తృష్ణ - అసూయ - సోమరి తనము - జుగుప్స - ఈ పన్నెండు మహాదోషములు మనుష్యుల ప్రాణములను నశింప జేయును. వీనిలో క్రమముగా ఒక్కటొక్కటి మనుష్యులను పొందు చుండును. ఈ దోషముల వశములో పడి మూఢు డయిన మానవుడు పాప కర్మ లను చేయును.

''రాజా! ఆశాపరుడు, ఉగ్రుడు (క్రూరుడు), పరుషములు మాట్లాడు వాడు, పిసినిగొట్టు, మనస్సులో సర్వదా క్రోధము కలవాడు, అతిగా ఆత్మ ప్రశంస చేసికొనువాడు - ఈ యారుగురు క్రూరకర్మములు చేయువారుగానే ఉండెదరు. ఇట్టివారు తమకు లభించిన సంపత్తిని తగినట్టుగా ఉపయోగించరు.

"రాజా! స్త్రీ సంభోగమునందు సర్వదా మనస్సు లగ్నము చేయుట - వైషమ్యము - ఆత్మాభిమానము - దానము చేసి తనను పొగడుకొనుట - కృప ణత్వము (పిసినిగొట్టు తనము) - అసమర్థు డయినను తనను గొప్పగా ప్రశంసిం చుకొనుట - మాననీయ పురుషులను ఎల్లప్పుడు ద్వేషించుట - ఈఏడు విధము లయిన దుర్గుణములు గలవారే పాపులు, క్రూరులు ననబడెదరు.

"రాజా! ధర్మము, సత్యము, తపస్సు, ఇంద్రియనిగ్రహము, మాత్సర్య రహితత్వము, లజ్జ, సహనశీలత్వము, ఇతరుల దోషములను చూడకుండుట, దానము, శాస్త్రజ్ఞానము, ధైర్యము, ఓర్పు - ఈ పన్నెండు సద్గుణములు గల బ్రాహ్మణులు మహా వ్రతనిష్ఠులగుదురు. ఈ పన్నెండు వ్రతములనుండి తొల గనివారు సమస్త భూమండలముపైన శాసనము చేయ గలరు ఏవేని వీనిలో ఒకటి - రెండు - మూడు గుణములు కలవాడుగూడ, తనది అని చెప్పదగిన వస్తు వేదియు లేదని తలచుచు మమకారమును విడిచి యుండ వలయును. 'ఇంద్రియ నిగ్రహము, త్యాగము, ఏమరుపాటు లేకుండుట - ఈ మూడింటి యందు అమృతత్వస్థితి యుండును. పరబ్రహ్మ మొక్కడే ప్రధాన లక్ష్యముగా

పెట్టుకొనిన బుద్ధిమంతు లయిన బ్రాహ్మణులకు ఈ మూడు గుణములే పరబ్రహ్మ ప్రాప్తికి ముఖ్య సాధనములు.

''రాజా! సత్య మయినను, అసత్యమయినను, ఇతరులను గూర్చి నిందించుట బ్రాహ్మణునకు శ్రేయస్కరము కాదు. పరనింద చేయువారు తప్పక నరకములో పడెదరు. 'ప్రజా విరుద్ధము లయిన కార్యములు చేయుట - శాస్త్రములకు ప్రతికూలము లైన ఆచరణములను అనుసరించుట - గుణవంతులయందు దోషములను ఆరోపించుట-అసత్యములు మాట్లాడుట' -ఈ నాలుగు పనులు చాల చెడ్డవి. ఈ నాలుగు లోగడ చెప్ప బడిన పదునెనిమిది మద దోషములలో అతి ముఖ్యములు. అవియే ఇప్పుడు స్పష్టముగా నిరూపింప బడినవి.

"రాజా! 'కామ-క్రోధ-పరాధీనత్వ-పరదోష నిరూపణములు, ధనమును, జూదము-త్రాగుడు మొద లైన వానిలో దురుపయోగముగా నశింప జేయుట, కలహము-మాత్సర్యము-ప్రాణులను బాధించుట-ఈర్ష్య-హర్షము-అతిగా వదరుట-అసూయ'-ఈ దుర్గుణము లన్నియు మదమువలన ఏర్పడును. అందుచేత ఎవడు గూడ మదము (పొగరు)తో వ్యవహరించ గూడదు. ఈ మదమును సత్పురుషులు సర్వదా నిందించెదరు.

మైత్రీగుణములు:

"రాజా! 'మిత్రునకు మంచి కలిగినప్పుడు హర్షించుట, చెడు గలిగినప్పుడు బాధపడుట, తాను సంపాదించిన ధనమును మిత్రుడు అడిగినప్పుడు ఇచ్చుచుండుట'-ఈ మూడు గుణముల వలన మైత్రి దృఢముగా నిలుచును. మిత్రుడు అడుగని వస్తువు నైనను అవశ్యముగా ఇవ్వ వలసి యుండగా, అతడు అడిగినప్పుడు పవిత్ర భావముతో తన పుత్ర - కళత్ర - వైభవములను గూడ మిత్రుని హితము కొరకు ఇవ్వ వలెను. మిత్రునకు ధనము నిచ్చి, అతనినుండి ప్రత్యుపకారము పొందు కోరికతో అతని యింటిలో నివసించ గూడదు. ఇది మైత్రికి నాలుగవ గుణము తాను కష్టపడి సంపాదించిన ధనమును అనుభవించుట (మిత్రుని సంపాదనపై ఆధారపడకుండుట అని భావము). ఇది మైత్రీ గుణములలో ఐదవది. మిత్రునకు శ్రేయస్సు కలిగించవలసి వచ్చినపుడు దానివలన తన శ్రేయస్సుకు భంగము కలిగినను మిత్రునకు మేలు చేయు చుండుట ఆరవ మైత్రీ గుణము. ఈ ఆరు సద్గుణములు మైత్రిని శాశ్వతముగా నిలిపికొనుటకు మిక్కిలి అవశ్యకములు. కనుక, మిత్రుడు ఈ ఆరింటిని తెలిసికొన వలెను.

"రాజా! ధనవంతుడు, గుణవంతుడు, త్యాగశీలుడు, సాత్వికుడును, తన పంచ జ్ఞానేంద్రియములను వాని విషయములనుండి ఉపసంహరించుకొనును. వైరాగ్యము లేకుండుటచేత సత్వగుణము నుండి భ్రష్టు లైన మనుష్యులకు దివ్య లోక ప్రాప్తికొరకు సంపాదింప బడిన ఈ యింద్రియ నిగ్రహ రూప మైన తపస్సు సమృద్ధిగా నున్నప్పటికిని, అది కేవలము స్వర్గాదు లైన పైలోకములను పొందుటకు మాత్రమే కారణ మగును. అది ముక్తికి హేతువు కాదు. కనుక, అన్నిటికన్న సత్త్వగణమును అలవరచుకొనుట ప్రధానము. ఎందు కనగా, సత్యస్వరూప మయిన పరబ్రహ్మ జ్ఞానము లేకుండుటచేతనే ఇటువంటి సకామము లయిన యజ్ఞములు అభివృద్ధి చెందు చుండును. కొందరు వాగ్ యజ్ఞము, కొందరు మనో యజ్ఞము, కొందరు క్రియా యజ్ఞము చేసెదరు. సంకల్ప సిద్ధి గల సకామ పురుషునికన్న సంకల్ప రహితు డయిన నిష్కామ పురుషుని స్థితి ఉన్నతముగా నుండును. కాని, బ్రహ్మవేత్తయొక్క స్థితి నిష్కామ పురుషుని కన్నను విశిష్ట మైనది.

"రాజా! ఇది గాక మరియొక ముఖ్యవిషయమును తెలిపెదను వినుము:

"ఈ శాస్త్రము పరమ పురుష డయిన పరమాత్మయొక్క ప్రాప్తిని కలిగించును. ఈ శాస్త్రమును శిష్యులకు అవశ్యముగ నేర్పవలయును. 'పరమాత్మకంటే వేరుగా కనపడు ప్రపంచ మంతయు వాగ్వికారముగానే భావించ వలయును' అని విద్వాంసుల యభిప్రాయము. ఈ యోగశాస్త్రమునందు పరమాత్మ విషయక మయిన పరిపూర్ణ జ్ఞానము ప్రతిష్ఠిత మై యున్నది. ఈ శాస్త్రమును తెలిసికొనినవాడు జనన-మరణరూప సంసారమునుండి విముక్తు డై, అమరు డగును.

"రాజా! సకామముగ చేయ బడు పుణ్యకర్మలచేత సత్యస్వరూపు డయిన పరబ్రహ్మను పొంద జాలడు. యజ్ఞయాగాది క్రతువులు చేయుచు జ్ఞానహీనుడుగా నున్న పురుషుడు ముక్తిని పొంద జాలడు. చివరకు అతనికి శాంతి గూడ లభించదు. అందుచేత అన్ని కర్మలను విడిచి ఏకాంతమునందు ఉపాసన చేయుచు మనస్సులో గూడ కర్మభావమును రానీయకుండ అరికట్టుచు, రాగ-స్తుతి-నిందా-ద్వేషములను అనుసరించకుండ నుండ వలెను. రాజా! ఈ సాధనములను అవలంబించుటచేత మనుష్యుడు ఈలోకమునందే పరబ్రహ్మ సాక్షాత్కారమును పొంది, పరబ్రహ్మములో లీను డగును. వేదములను సమగ్రముగా పరిశీలించి నేను తెలిసికొనిన విషయములను నీకు తెలుపు చున్నాను."

పరమాత్మ స్వరూప వర్ణనము-యోగులు చేయు పరమాత్మ సాక్షాత్కార ప్రతిపాదనము:

జనమేజయా! ఇట్లు చెప్పి సనత్సుజాత మహాముని ధృతరాష్ట్రునకు పరమాత్మ స్వరూపమును గూర్చి యోగులచేత ప్రతిపాదింప బడిన పరబ్రహ్మ సాక్షాత్కారమును గూర్చి యిట్లు చెప్ప దొడగెను:

శుద్ధ పరబ్రహ్మ స్వరూప నిరూపణము:

''రాజా! మహా జ్యోతిస్స్వరూపము, దేదీప్యమానము, మహాయశస్స్వరూపము నయినది శుద్ధ పరబ్రహ్మము. దేవత లందరు ఆ పరబ్రహ్మమునే ఉపాసించు చుండెదరు. దాని ప్రకాశముచేతనే సూర్యుడు ప్రకాశించును. నూతన భగవత్స్వరూపమయిన యా పరబ్రహ్మమును యోగీశ్వరులు దర్శించు చుందురు.

''రాజా! పరిశుద్ధ మయిన సచ్చిదానంద పరబ్రహ్మము నుండి హిరణ్యగర్భుడు పుట్టి, అభివృద్ధిని పొందును. ఆ శుద్ధజ్యోతిర్మయ పరబ్రహ్మమే సూర్యుడు మొద లయిన సంపూర్ణ జ్యోతిస్సులలోపల ఉండి ప్రపంచము నంతటిని ప్రకాశింప జేయుచు, తపింప జేయుచు చున్నది. ఆ పరబ్రహ్మము స్వయముగా తాపము చెందక స్వయం ప్రకాశమాన మై యున్నది. యోగీశ్వరులు దర్శించు స్వరూపము అదియే.

''రాజా! జలమువలె ఏక రసాత్మక మయిన పరబ్రహ్మమునందు సూక్ష్మ రూపములో నున్న ఐదు మహాభూతముల (పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము) కంటే స్థూల మయిన పాంచ భౌతిక శరీరము యొక్క హృదయాకాశమునందు ఈశ్వరుడు, జీవుడు నను నిద్దరు దేవతలు ఆశ్రయమును గొని యుందురు సమస్త ప్రపంచమును పుట్టించు సర్వవ్యాపి యయిన పరమాత్మ సర్వదా జాగరూకు డై యుండును. అతడే భూలోకమును, స్వర్గలోకమునున్ను ధరించును. సనాతను డైన యా పరమాత్మనే యోగులు దర్శించెదరు.

''రాజా! ఇటువంటి జీవుడు - ఈశ్వరుడు నను నిద్దరు దేవతలను. పృథివిని, ఆకాశమును, సమస్త దిక్కులను, అన్ని లోకములనున్ను ఆ పరిశుద్ధ పరబ్రహ్మమే ధరించును. ఆ పరబ్రహ్మమునుండియే దిక్కులు ప్రకటితము లగును. నదులు ప్రవహించును. గొప్ప - గొప్ప సముద్రములు ప్రకటితము లగును. అట్టి భగవంతుని యోగులు దర్శించెదరు.

''రాజా! ఇంద్రియములు, మనస్సు, బుద్ధి - వీని సంఘ స్వరూప మయిన శరీరము నశించు స్వభావము కలది. శరీర కర్మలు స్వయముగా నశించునవి కావు. అట్టి మీ శరీరము రథమువంటిది. రథము యొక్క చక్రమువలె కర్మలు తిరుగు చుండును. కర్మల సంస్కారముచేత గూడిన మనస్సునకు ఇంద్రియములు అనెడు గుఱ్ఱములు కట్ట బడును. ఆ యింద్రియాశ్వములు హృదయాకాశమునం దున్న జ్ఞాన స్వరూపుడు, దివ్యుడు, అవినాశియు వయిన జీవాత్మను ఏ సనాతన పరమేశ్వరుని యొద్దకు తీసికొని పోవునో, అట్టి భగవంతుని యోగిజనులు సాక్షాత్కరించెదరు.

(ఈ రూపకము యొక్క వివరణము కఠోపనిషత్తులో మొదటి అధ్యాయమునందలి మూడవ వల్లిలో మూడు నుండి తొమ్మిదవ మంత్రము వరకు చూడవచ్చును)

''రాజా! అట్టి పరమాత్మ స్వరూపమునకు తుల్య మయిన దేదియును లేదు. మానవుడు తన చర్మ చక్షువులతో ఆయనను చూడ జాలడు, నిశ్చయాత్మక మైన బుద్ధితో, మననశీల యైన మనస్సుతో, విషయాకర్షక మయిన హృదయముతోను ఆ పరమాత్మను తెలిసికొన గలవారు అమరులయ్యెదరు. అనగా, మోక్షమును పొందెదరు. అట్టి పరమాత్మను యోగులు దర్శించెదరు.

ఈ భావమును తెలుపు మంత్రము కఠోనిషత్తు రెండవ యధ్యాయములో ఆరవ వల్లిలోని తొమ్మిదవ మంత్రము -

''న సందృశే తిష్ఠతి రూపమస్య,
న చక్షుషా పశ్యతి కశ్చనైనమ్।
హృదా మనీషా మనసాఽభి క్లృప్తో
య ఏతద్ విదురమృతాస్తే భవంతి '

అని యున్నది.

''రాజా! దశవిధము లయిన యింద్రియములు (పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు), మనస్సు, బుద్ధి - ఈ పన్నెండింటితో గూడుకొని పరమాత్మ చేత రక్షింప బడుచున్న యీ భయంకర సంసార నదియొక్క విషయము లనెడు మధుర జలమును చూచువారు, త్రాగువారున్ను ఆ నదియందే

మునుగుచు, తేలుచు నుందురు. అట్టి సంసార నదిని దాటించునట్టి యా సనాతన పరమాత్మను యోగులు సాక్షాత్కరించు చుందురు.

''రాజా! తేనెటీగ నెలలో మొదటి సగభాగము తేనెను సేకరించుకొని, తరువాతి యర్ధమాసము వరకు ఆ తేనెను త్రాగు చున్నట్లు, భ్రమణ శీలుడు, సంసారియు నైన జీవుడు ఈ జన్మమునందు చేసిన కర్మల ఫలమును ఇతర జన్మలయందు భిన్న - భిన్న గర్భములందు పుట్టి, అనుభవించు చుండును. పరమాత్ముడు సమస్త ప్రాణులకొరకు వారి - వారి కర్మలను అనుసరించి ఫలములను అనుభవించునట్టి వివిధ పదార్థములను ఏర్పరచి యున్నాడు. అట్టి సనాతన పరమాత్మ యొక్క దర్శనము యోగిజనులు చేసెదరు.

''రాజా! బంగారమువలె కన బడు చున్న విషయము లనెడి ఆకులు కలిగి యున్న సంసార మనెడు అశ్వత్థ వృక్షము (రావిచెట్టు) పైన ఎక్కి-రెక్కలు లేని జీవులు, కర్మములు అను రెక్కలు ధరించి తన పూర్వవాసనానుసారముగా వేర్వేరు గర్భములందు పడుదురు. అనగా, ఒక గర్భమునుండి వేరొక గర్భమునకు పోవు చుందురు. కాని, యోగీశ్వరులు అట్లుగాక, సనాతన పరమాత్మ సాక్షాత్కారము చేసెదరు. పరిపూర్ణు డయిన పరమేశ్వరునినుండి పరిపూర్ణము లై యున్న (స్థావర - జంగమాత్మక) ప్రాణులు ఉత్పన్నము లగును. పరిపూర్ణ స్థితియొక్క ప్రకాశమును పొందియే అవి పరిపూర్ణ ప్రాణుల చేష్టలను చేయు చుండును. తిరిగి పూర్ణమునకంటె పూర్ణ మయిన పరబ్రహ్మమునందు అవి విలీనము లగును. చివరకు పూర్ణపరబ్రహ్మ మొక్కటే మిగిలి యుండును. అటువంటి నూతన పరబ్రహ్మదర్శనమును యోగులు చేసెదరు.

''రాజా! ఆ పరిపూర్ణ పరబ్రహ్మమునుండియే వాయువుపుట్టి, ఆ బ్రహ్మమునందే కదలాడు చుండును. ఆ బ్రహ్మమునుండియే అగ్ని, సోముడున్ను పుట్టి దానియందే తమ ప్రాణములను విస్తరింప జేయు చుందురు. వాని నన్నింటిని విడి - విడిగా లెక్కపెట్టి వాని పేర్లను చెప్ప జాలము. రాజా! నీవు చరాచరాత్మక ప్రపంచ మంతయు ఆ పరమాత్ముని తేజస్సు, చేతనే ప్రకాశమాన మగు చున్నదని తెలిసికొనుము. అతి ప్రాచీను డైన భగవంతుని దర్శనము యోగులు చేసెదరు.

"రాజా! అపాన (గుదస్థానమునం దున్న) వాయువును, ప్రాణ (హృదయస్థానమునం దున్న) వాయువు తనలో లీనము చేసికొనును. ప్రాణవాయువును చంద్రుడు, చంద్రుని సూర్యుడు, సూర్యుని పరమాత్మయు తమలో విలీనము చేసికొందురు. అట్టి సనాతన పరమేశ్వరుని యోగులు సాక్షాత్కరించెదరు.

"రాజా! ప్రపంచ మనెడు నీటినుండి పైకి లేచి యున్న హంస మనెడు పరమాత్మ తన పాదము నొక్కదానిని (ప్రపంచము) పైకి లేపుట లేదు. దానిని గూడ నతడు పైకి లేపినచో, సర్వ సంసార బంధములు, మోక్షమును ఎప్పటికిని ఉండవు. అట్టి సనాతన భగవంతుని యోగులు దర్శించెదరు.

"రాజా! హృదయమునందు అంగుష్ఠ మాత్రు డై యున్న జీవాత్ముడు సూక్ష్మ శరీర సంబంధము చేత జనన - మరణములను సర్వదా పొందు చుండును. సమస్త ప్రపంచమును శాసించుచు, స్తుతియోగ్యుడై, సర్వసమర్థు డై, ప్రపంచమునకు ఆదికారణు డై, సర్వ ప్రపంచమునందు విరాజిల్లు చున్న పరమాత్మను అజ్ఞాని యయిన జీవుడు చూడ జాలడు. కాని, యోగిజనము మాత్రము ఆ సనాతన పరమేశ్వరుని దర్శించెదరు."

"రాజా! సాధన సంపత్తి గలవారు గాని, లేక, సాధన విహీనులు గాని, అందరియందున్న పరబ్రహ్మము సమానముగా కనవడు చుండును. తనవరకు తాను, పరమాత్మ బద్ధులకు- ముక్తులకున్ను సమానుడుగానే యుండును. కాని, బద్ధముక్తులలోను, ముక్తులు ఆనందరూపు డయిన పరమాత్మను పొందెదరు. బద్ధులు పొంద జాలరు. ఇదియే ఈ యిద్దరిలో భేదము. అట్టి సనాతన భగవంతుని యోగులు దర్శించెదరు.

"రాజా! జ్ఞానులు బ్రహ్మవిద్య ద్వారా ఇహలోక తత్త్వమును, పరలోక తత్త్వమునున్ను తెలిసికొని బ్రహ్మభావమును పొందెదరు. బ్రహ్మైక్యసమయమునందు వారు, అంతకు పూర్వము అగ్నియందు యజ్ఞహోమాది కర్మములు చేయకుండినను, ఆ కర్మము లన్నియు అతనికి పరిపూర్ణము లయినట్లే భావింపబడును.

''రాజా! నేను బోధించిన యీ బ్రహ్మవిద్యవలన నీయందు చులకదనము రాకుండ నీకు ఉత్కృష్టమైన బ్రహ్మ జ్ఞానము ప్రాప్తించు గాక! అట్టి బ్రహ్మజ్ఞానమునే పండితులు (ఆత్మజ్ఞాన సంపన్నులు) పొందెదరు. అట్టి బ్రహ్మవిద్య ద్వారా యోగి జనులు ఆసనాతన పరమాత్మను సాక్షాత్కరించెదరు.

"రాజా! మహాత్ములు భోక్తృత్వమును (కర్మానుభవమును) తమయందు విలీనము చేసికొని పరిపూర్ణు డయిన పరమేశ్వరుని తెలిసికొనెదరు ఈ లోకము నందు వారి ప్రయోజనము లేవియు నశించవు. (అతడు కృతకృత్యు డగును.) అట్టి సనాతన పరమాత్మను యోగులు దర్శించెదరు.

''రాజా! ఎవరైనను పది లక్షల రెక్కలు కలవారై మనోవేగముతో ఎగిరినప్పటికిన్ని చివరకు వారు తమ హృదయమునం దున్న పరమాత్మయందే వచ్చి పడి పోయెదరు. అట్టి సనాతన పరమాత్మను యోగీశ్వరులు దర్శించెదరు.

"రాజా! ఈ పరమాత్మ స్వభావము అందరికిని కనపడదు. మనస్సు పరిశుద్ధముగా నున్న వారే పరమాత్మను చూడ గలిగెదరు. అందరి హితములను కోరుచు, మనస్సు వశము నందుంచుకొని, ఎప్పుడు గూడ మనస్సునందు దుఃఖము చెందక సంసార సంబంధము లన్నియు విడిచిన వైరాగ్యవంతులే ముక్తు లయ్యెదరు. అట్టి సనాతన పరమాత్ముని యోగులు చూచెదరు.

"రాజా! సర్పములు బిలములయందు దాగి యున్నట్లే, దంభాచారము గలవారు తమ విద్యను,కపట వ్యవహారమునున్ను అడ్డము పెట్టుకొని తమ దోషములను కప్పి ఉంచెదరు. మంచి త్రోవలో నడచువారిని భయములో పడ వేయుటకు, తప్పు దారిని చూపించి మోహింప జేయు మోసగాండ్ర యందు మూర్ఖులు నమ్మకము ఉంచి, అత్యంతాజ్ఞానమునందు పడునట్లే, పరమాత్మ మార్గమునందు నడచు నటువంటివారిని గూడ దంభాచారము గల పురుషులు భయములో పడ వేయుటకు, మోహింప జేయు పనులను చేయు చుందురు. కాని, యోగిజనులు భగవంతుని కృపచేత అట్టివారి మోసములో చిక్కుకొనక ఆ సనాతన పరమాత్మనే దర్శించెదరు.

"రాజా! నన్ను ఎవరు గూడ అగౌరవపరచరు. నాకు జనన- మరణములు లేవు. ఇట్టి నాకు మోక్షము అనునది ఎక్కడిది? ఎందు కనగా, నిత్యముక్తమైన పరబ్రహ్మమనే సత్యా సత్యము లన్నియు రాగద్వేషరహిత సనాతన బ్రహ్మ మైన నా యం దున్నవి. సత్యా సత్యములకు నే నొక్కడనే జన్మ స్థానము. నా స్వరూప మయిన సనాతన పరమాత్మను యోగిజనులు చూచెదరు.

"రాజా! పరమాత్మునకు సత్కర్మల సంబంధము గాని, అసత్కర్మల సంబంధము గాని లేదు. ఈ వైషమ్యభావము దేహాభిమానము గల మనుష్యుల

యందే కన బడును. బ్రహ్మ స్వరూపము అంతటను సమానముగా నున్న దని తలచ వలెను. ఇట్టి జ్ఞానయోగముచేత కూడినవాడై ఆనంద మైన పరబ్రహ్మమును పొందుటకు కోరవలెను. అట్టి సనాతన పరమాత్మను యోగులు దర్శించెదరు.

"రాజా! బ్రహ్మవేత్తను నిందించి అతని హృదయమును తపింప జేయ గూడదు. బ్రహ్మవేత్త మనస్సులో, 'నేను వేదాధ్యయనము చేయ లేదు. యజ్ఞ హోమాదులు చేయలేదు.' - ఈ మొద లైన భావములు గూడ నీచత్వమును కలిగింపవు. బ్రహ్మ విద్య అతనికి త్వరలోనే స్థిరబుద్ధిని ప్రసాదించును. అట్టి స్థిరబుద్ధి పండితులకు మాత్రమే కలుగును. అటువంటి సనాతన పరమాత్మ దర్శనము యోగిజనులు మాత్రమే చేసెదరు.

"రాజా! ఈ విధముగా సమస్త భూతములయందు పరమాత్మనే సర్వదా చూచువానికి అట్టి సర్వాత్మ దృష్టి అలవడిన తరువాత, ఇతరము లయిన వేర్వేరు విషయ సుఖముల యందు తగులుకొనిన మనుష్యులను గూర్చి వారు ఏల దుఃఖించెదరు? అంతట పరిపూర్ణ జలముతో నిండిన పెద్ద జలాశయమును చేరిన తరువాత జలము కొరకై ఇతరత్ర పోవ వలసిన యవసరము లేనట్లే, ఆత్మ జ్ఞానికి అన్ని వేదశాస్త్రములయందు తెలిసికొన దగిన విషయము లేవియు మిగిలి యుండవు.

"రాజా! అంగుష్ఠమాత్రు డయిన పరమాత్ముడు అంతర్యామిగా అందరి హృదయముల లోపల ఉండును. కాని, అందరికిని అతడు కనపడడు. అతడు జన్మరహితుడై, చరాచరాత్మక ప్రపంచ స్వరూపుడై, రాత్రింబగళ్ళు అతి జాగ్రత్తతో మెలగు చుండును. అట్టి పరమాత్మను తెలిసికొనిన జ్ఞాని పరమాత్మానందమునందు నిమగ్నుడై యుండును.

"ధృతరాష్ట్ర మహారాజా! ప్రపంచమునకు మాతగా, పితగా, పుత్రుడుగా, ప్రపంచాత్మభూతుడుగాను నేనే యున్నాను. అంతట లేనిది, ఉన్నది కూడ నేనే. రాజా! నేనే నీ వృద్ధ పితామహుడను, నీ తండ్రిని, నీ పుత్రుడనుగా గూడ నున్నాను. మీరందరు నా ఆత్మయందే ఉన్నారు. అయినను, వాస్తవముగా మీరు నావారు కారు, నేను మీవాడను కాను. ఆత్మయే నా స్థానము. నాకు జన్మమున్ను అదియే. నేను సర్వ ప్రపంచమునందు ఓతప్రోతుడ నై పడుగు - పేకలవలె నా

యొక్క అజర మైన (నిత్య నూతన మైన) మహిమయందు ఉండెదను. నేను జన్మరహితుడను. చరాచర ప్రపంచ స్వరూపుడను. రాత్రింబవళ్ళు అతి జాగ్రత్తతో మెలగువాడను నేనే. ఇటువంటి నన్ను తెలిసికొనిన జ్ఞాని పరమ శాంతిని పొందును.

"రాజా! పరమాత్ముడు సూక్ష్మమున కంటె సూక్ష్ముడు, పరిశుద్ధ మయిన మనస్సు గలవాడు. అతడే సమస్త ప్రాణులయందు అంతర్యామిగా ప్రకాశించు చుండును. సర్వ ప్రాణుల హృదయ కమలములయందు విరాజమాను డై యున్న ఆ సర్వ ప్రపంచ పితను బ్రహ్మజ్ఞాన సంపన్ను లయినవారు తెలిసి కొనెదరు.

సనత్సుజాత పర్వము సమాప్తము.

యానసంధిపర్వము

"జనమేజయ మహారాజా! ఈ విధముగా బ్రహ్మమానస పుత్రు డయిన సనత్సుజాత మహాముని, బుద్ధిమంతు డయిన విదురునితో, ధృతరాష్ట్ర మహా రాజుతోను మాట్లాడు చుండగా వారికి ఆ రాత్రియంతయు శాంతితో గడచెను."-

అని వైశంపాయన మహాముని చెప్పి, తరువాతి కథను జనమేజయ మహా రాజునకు చెప్ప దొడగెను.

పాండవుల కడనుండి వచ్చిన సంజయుడు కౌరవ సభలో ప్రవేశించుట :

"జనమేజయా! ఆ రాత్రి గడచిన తరువాత ప్రభాతమునందు రాజు లందరు సూతపుత్రుడయిన సంజయుని చూచుటకు మిక్కిలి హర్షముతో సభకు వచ్చిరి. ధృతరాష్ట్రాది కౌరవు లందరు గూడ పాండవుల ధర్మార్థయుక్త వాక్యములను విను కోరికతో సుందర మయిన ఆ విశాల రాజసభలో ప్రవేశించిరి. ఆ సభాభవనము సున్నము పూయుట చేత మిక్కిలి యుజ్జ్వలముగా నుండెను. దానికి ఉన్న సువర్ణమయ ప్రాంగణము సభాశోభను పెంచు చుండెను. అది చంద్రుని శ్వేతకిరణముల వలె ప్రకాశించు చుండెను. అతి మనోహరమైన ఆ సభా భవనాంతర్భాగమునందు చందన జలము చల్లబడుట చేత అది మిక్కిలి సుగంధిత మై యుండెను. సువర్ణముతో, కొయ్యతో, మణులతో, ఏనుగు దంతములతోను చేయ బడిన సుందరాసనములపైన అందమైన దుప్పట్లు పరచ బడి యుండెను. భీష్మ - ద్రోణ - కృప - శల్య - కృతవర్మ - సైంధవ - అశ్వత్థామ - వికర్ణ - సోమదత్త - బాహ్లీక - యుయుత్సు-విదు రాది ప్రాజ్ఞులు, శూరులు, మహారథులు నయిన రాజులు అందరు ధృతరాష్ట్రుని ముం దిడికొని ఆ సభలో ప్రవేశించిరి.

"రాజా! దుశ్శాసన - చిత్రసేన - శకుని - దుర్ముఖ - దుస్సహ - ఉలూక - వివింశతి - కర్ణాదులు మహాహంకార భరితు డయిన దుర్యోధనుని ముం దిడుకొని, దేవతలు ఇంద్రసభలో ప్రవేశించునట్లుగా, ఆ రాజభవనమునందు

ప్రవేశించిరి. రాజా! వివిధాయుధములను ధరించి వారు ప్రవేశించు చుండగా, సింహములు ప్రవేశించుచున్న గిరి గుహవలె ఆ సభ శోభిల్లెను. మహాధనుర్ధారులు, పరాక్రమవంతులు నయిన వా రందరు సభా ప్రవేశము చేసి విచిత్రము లయిన తమ తమ ఆసనములందు కూర్చొని సూర్యతేజస్సుతో ప్రకాశించు చుండిరి. అప్పుడు సంజయుడు రథారూఢు డై వచ్చినా డని ద్వారపాలకుడు వారికి తెలిపెను. సభవారు సగౌరవముగా ఆహ్వానింపగా సంజయుడు నిండు సభలో ప్రవేశించి వారితో ని ట్లనెను:

''కౌరవ శ్రేష్ఠులారా! నేను ధృతరాష్ట్రుని యాజ్ఞచేత పాండవుల కడకు దూతగాపోయి వచ్చినాను. పాండవులు మీ యందరికి మీ మీ వయస్సుల ననుసరించి నమస్కారములను, అభినందనములను తెలుపు మనినారు. నేను పాండవులతో చెప్పిన మాటలను విని, పాండవులు, విశేషించి, కృష్ణార్జునులు నాతో చెప్పిన ధర్మయుక్త మయిన సందేశమును, మాటలను గూడ వినుడు."

ఆ మాటలను విని ధృతరాష్ట్రుడు సంజయునితో ని ట్లనెను :

కౌరవసభలో సంజయుడు అర్జునుని సందేశము తెలుపుట :

''సంజయా! యుద్ధ కోవిదుడు, దురాత్ముల జీవనమును నశింప జేయువాడు, ఉదారహృదయుడు, మహాత్ముడు నయిన అర్జునుడు మాకు ఎట్టి సందేశమును పంపెను? ఈ రాజు లందరు విను చుండగా చెప్పుము."

ఆ మాటలకు సంజయుడు ఇట్లు బదులు చెప్ప దొడగెను:

''మహారాజా! యుద్ధ సన్నద్ధు డయి యున్న అర్జునుడు యుధిష్ఠిరుని ఆజ్ఞచేత శ్రీకృష్ణుడు విను చుండగా చెప్పిన మాటలను దుర్యోధనుడు వినుగాక! బాహుబల సంపన్ను డయిన అర్జునుడు భవిష్యద్యుద్ధ సన్నద్ధు డయి నాతో ఈ మాట లనెను:

''సంజయా! యముని వాత బడుటకు సిద్ధముగా నున్న దురాత్ము డయిన కర్ణుడు విను చుండగా, అక్కడ పాండవులతో కౌరవుల పక్షమున యుద్ధమునకు పిలువ బడిన రాజులు నిండి యున్న సభలో, అందరు విను చుండగా నేను చెప్పిన మాట లన్నియు ధృతరాష్ట్రునకు దుర్యోధనునకున్ను వినిపింపుము." ఇంద్రసభలో ఇంద్రుని మాటలను దేవతలు విన గోరుచున్నట్లుగా అర్జునుడు నాతో చెప్పు చున్న మాటలను ఆ సభవారందరు శ్రద్ధగా విను చుండిరి,

"సంజయా! దుర్యోధనుడు యుధిష్ఠిరునకు రాజ్యభాగము ఇవ్వని యెడల దుర్యోధనాదులు పూర్వజన్మలో చేసిన పాపఫలము నిశ్చయముగా అనుభవించెదరు. యుధిష్ఠిరుని యాజ్ఞచేత భీమసేనాదులతో, ఇతర పాండవ యాదవులతోను కౌరవులకు యుద్ధము కలుగ నున్నది. మా పక్షమువా రందరు తలచినచో భూలోక - స్వర్గలోకములను భస్మీపటలము చేయ గలరు. మా వీరులందరితో పోరాడుటయే మంచి దని దుర్యోధనుడు తలచిన యెడల దానిచేత పాండవుల యొక్క మనోరథము పూర్తిగా సిద్ధించ గలదు. సంజయా! నీవు పాండవుల లాభము కొరకు సంధి చేయించుటకు గాని, లేక, వారికి అర్ధరాజ్యమును ఇప్పించుటకుగాని, ప్రయత్నము చేయకుము. దుర్యోధనునితో యుద్ధభూమి యందు దిగు మని నా మాటగా చెప్పుము.

''సంజయా! ధర్మాత్ము డయిన యుధిష్ఠిరుడు అడవికి పంప బడి, ఏ దుఃఖశయ్యపై శయనించెనో, దానికంటే మించి అనర్థదాయక మైన మృత్యుశయ్యపైన దుర్యోధనుడు దీర్ఘనిద్ర పోవగల డని చెప్పుము. లజ్జ, జ్ఞానము, తపస్సు, ఇంద్రియ నిగ్రహము, శౌర్యము, ధర్మరక్ష - వీనితో గూడిన పాండవులపైన అధికారమును పొందుట అధర్మశీలుడు, దురాత్ముడు నయిన దుర్యోధనునకు ఉచితము కా దని చెప్పుము. (సద్గుణముల చేతనే అందరి హృదయములను జయించ వలయును కాని, అధర్మ పరిపాలన చేత అందరి హృదయాకర్షణ అసంభవ మని భావము.)

''సంజయా! మా మహారాజు యుధిష్ఠిరుడు నమ్రత్వము, సరళత్వము, తపస్సు, ఇంద్రియ నిగ్రహము, ధర్మరక్షణము, బలము- ఈ సద్గుణము లన్నింటితోను సుసంపన్నుడు. ఆయన బహుకాలము నుండి బహువిధము లయిన కష్టములను అనుభవించు చున్నను, సర్వదా సత్యమునే పలుకును. కౌరవుల కపట ప్రవర్తనమును, దుర్భాషణములను సహించుచునే యున్నాడు. అట్టి శాంతమూర్తి యయిన యుధిష్ఠిర మహారాజు విజృంభించినచో అనేక సంవత్సరముల నుండి అణచుకొని యున్న తన భయంకర క్రోధమును కౌరవులపయిన విడువ గలడు. అప్పుడు జరగ బోవు భయంకర యుద్ధమును చూచి దుర్యోధనుడు పశ్చాత్తాప పడ వలసి యుండును.

''సంజయా! గ్రీష్మ కాలము నందు మండు చున్న అగ్ని అన్ని వైపుల జ్వాలలు ప్రసరింప జేయుచు, ఎండిన తృణవృక్షములతో నిండిన యడవిని

కాల్చి భస్మము చేయునట్లే, క్రోధముచేత కంపించు చున్న యుధిష్ఠిరుడు దుర్యోధనుని సేనను తన దృష్టి పాతముచేత దహించి భస్మము చేయును. గదాధారియై, రథమునందు కూర్చుని క్రోధమూర్ఛితు డైన భీమసేనుడు క్రోధ మనెడు విషమును గ్రక్కు చుండగా దుర్యోధనుడు చూచు చున్నప్పుడు యుద్ధ పరిణామమునకు మిక్కిలి విచారపడి పశ్చాత్తాపము చెంద వలసి యుండును. భీమసేనుడు శత్రువీరులను హతమార్చుచు అతివేగముతో శత్రుసేనయందు ముందుకు సాగుచు యమునివలె శత్రు సేనలను చంపు చుండినప్పుడు దురభిమానము గల దుర్యోధనునకు నా యీ మాటలు జ్ఞప్తికి వచ్చును.

''భీమసేనుడు శత్రువుల గజముల కుంభస్థలములను గదతో పగుల గొట్టి చీల్చి వానిని క్రింద పడగొట్టి, గజమస్తకములనుండి కడవలతో ముంచి నెత్తురును వెదజల్లు చున్నట్లు, రక్తధారలను ప్రవహింప జేయును. అప్పుడు ఆ భయంకర దృశ్యమును చూచు చున్న దుర్యోధనునకు యుద్ధమును తాను రేపినందువలన కలిగిన ఆ భయంకర సంకట స్థితికి పశ్చాత్తాప పడ వలసి యుండును. భయంకర గదా పాణి యై మీ సేనలో దూరి ధృతరాష్ట్ర పుత్రులను భీమసేనుడు, సింహము గోవులమందలో దూరి సంహరించునట్లుగా చంప గలడు. అప్పుడు దుర్యోధనుడు యుద్ధమునకు పూనుకొని నందుకుగాను పశ్చాత్తాప పడ వలసి వచ్చును.

''సంజయా! యెంతటి భయంకర పరిస్థితిలోను నిర్భయముగా నుండువాడు, సమస్త శస్త్రాస్త్ర కోవిదుడు, యుద్ధభూమి యందు శత్రువులను నిలిపి వేయగలవాడు నైన భీమసేనుడు రథమునందు గదాధారి యై, యుద్ధము చేయు చుండును. అప్పుడు అనేక రథ-పదాతి సైనికులను హతమార్చును. బోనువంటి తన సందిలిలో ఏనుగులను ఇరికించుకొని, చచ్చిన దూడలను ఈడ్చు చున్నట్లు, దుర్యోధనుని గజసైన్యమును ఛిన్న-భిన్నము చేయును. అతడు దుర్యోధనుని సేనను గండ్రగొడ్డలితో వనమును నరికినట్లు చంపు చుండినప్పుడు, దుర్యోధనుడు, తాను అనవసరముగా ఈ యుద్ధమును రేపి ముప్పు తెచ్చుకొంటినే యని పశ్చాత్తాప పడును.

''పూరి యిండ్ల గ్రామము అగ్నికి ఆహుతి యైనట్లు, భీమసేనుని క్రోధాగ్నికి ఆహుతి యై దుర్యోధనుడు, అతని తమ్ములు చత్తురు. పిడుగుపడి నశించిన పంటచేలవలె అతని సైనికులు నశింతురు. తన సేనలో వీరులు చనిపోవగా,

భయార్తు లై సైనికులు పారి పోవుచుండగా, వారిని భీమసేనుడు తరిమి చంపు చుండుటను గూడ చూచి దుర్యోధనుడు, తాను అనవసరముగా కొని తెచ్చుకొనిన యుద్ధమునకు పశ్చాత్తాపపడ గలడు.

''సంజయా! విచిత్ర యుద్ధకుశలుడు, రథిక శ్రేష్ఠుడు నైన నకులుడు, తన కుడి చేతి ఖడ్గముచేత కురు సైన్యముల యొక్క వీర యోధుల శిరస్సులను నరుకు చుండగా, దుర్యోధనుడు యుద్ధ పరిణామమును గూర్చి పశ్చాత్తాప పడ గలడు. సుఖ మనుభవించిన వీర నకులుడు చాలకాలము అడవియందు దుఃఖ శయ్యపైన పండుకొని యుండి ఆ దుఃఖమును తలచుకొనుచు యుద్ధమునందు కోపము చేత విష సర్పము వలె విషమును గ్రక్కుచుండినప్పుడు యుద్ధమును పురికొల్పినందుకు దుర్యోధనుడు పశ్చాత్తాప పడును.

''సంజయా! ధర్మరాజు పక్షమున యుద్ధము చేయుటకు వచ్చిన రాజులు, ఆయన యాజ్ఞచేత ఆయనకొరకు తమ ప్రాణములనుగూడ విడుచుటకు ఉద్యుక్తులై కౌరవ సేనపై దాడి చేసినప్పుడు దుర్యోధనుడు మిక్కిలి పశ్చాత్తాప పడును.

"సంజయా! ద్రౌపది ఐదుగురు కొడుకులు బాలకు లయినను, అతి శూరులు, శస్త్రాస్త్ర విద్యలో నేర్పరులు, నవ యువకులవలె యుద్ధము చేయ సమర్థులు, వారు ప్రాణములయందు ఆశ వదలి పోరాడు చున్నప్పుడు యుద్ధమును ప్రోత్సహించిన దుర్యోధనుడు పశ్చాత్తాపము చెందును.

''సంజయా! సహదేవుడు ఉత్తమాశ్వములను కట్టిన రథమునందు కూర్చొని యుద్ధము చేయును. ఆ రథము అతని యిష్టప్రకారము నడుచునదిగా నుండును చక్రముల ధ్వని ఏమాత్రము నుండదు. అతడు కొరవివలె తిరుగు చున్నట్లు ఉండును శత్రువుల మస్తకములను భేదించి సహదేవుడు క్రింద పడ వేయు చున్నప్పుడు అది అతి భయంకర మయిన వాతావరణమును కలిగించును యుద్ధభూమియందు గట్టిగా నిలిచి యతడు శత్రువులపైన దాడి చేయును. అట్టి సహదేవుని యుద్ధ సంరంభమును చూచి తాను రేపిన యుద్ధముయొక్క పరిణామము ఇంత ఘోరమైన దని దుర్యోధనుడు మిక్కిలి పశ్చాత్తాపము చెందును.

"సంజయా! లజ్జాశీలుడు, యుద్ధకుశలుడు, సత్యవాది, మహాబలవంతుడు, సర్వధర్మ సంపన్నుడు, చురుకుదనము గలవాడు, శీఘ్రముగా బాణప్రయోగము చేయగలవాడు నైన సహదేవుడు ఘోరముగా యుద్ధము చేయుచు శకునిని ఆక్రమించుకొని శత్రు సైనికులను సంహరించుచుండును.

"రథ యుద్ధ కళలో కౌశలము గల ద్రౌపదీపుత్రు లైదుగురు ఐదు విష సర్పములవలె శత్రువులపై దాడి సలుపుచుందురు. అప్పుడు సహదేవ ద్రౌపదేయుల ఘోరయుద్ధమును చూచి దుర్యోధనునికి మిక్కిలి పశ్చాత్తాపము కల్గును.

"సంజయా! అభిమన్యుడు భగవంతు డయిన శ్రీకృష్ణుని వంటి పరాక్రమశాలి, అస్త్ర విద్యయందు అతి నిపుణుడు. శత్రువీరులను సంహరించునంతటి సమర్థుడు. అతడు మేఘమువలె బాణములను నిరంతరము కురిపించుచు శత్రు సేనలో దూరినప్పుడు, దుర్యోధనుడు మనస్సులో తన పొరపాటును గూర్చి పరితపించగలడు. సుభద్రాకుమారు డయిన అభిమన్యుడు వయస్సులో బాలకుడైనను, పరాక్రమములో యువకులతో సమానుడు. ఇంద్ర సమాన శక్తి గలవాడు. అస్త్రవిద్యలో పండితుడు. అతడు శత్రుసేనను భయంకర ప్రళయకాల యమునివలె ఆక్రమించినప్పుడు అతనిని చూచి దుర్యోధనుడు యుద్ధమును కోరిన తన తప్పును గూర్చి మిక్కిలి పశ్చాత్తాప పడును.

"సంజయా! అస్త్ర ప్రయోగమునందు అతి వేగవంతులు, యుద్ధ విశారదులు, సింహ సమాన పరాక్రమశాలురు నైన ప్రభద్రక దేశీయ నవ యువక వీరులు సేనా సహితులై ధృతరాష్ట్ర పుత్రులను కొట్టుచు తరిమినప్పుడు దుర్యోధనుడు పశ్చాత్తాప పడగలడు.

"సంజయా! వృద్ధులు, మహారథికులు నయిన విరాట - ద్రుపద రాజులు తమ తమ సేనలతో ఆక్రమణము చేసి ధృతరాష్ట్ర పుత్రుల పైనను, వారి సైనికుల పైనను క్రోధ దృష్టి బరపినపుడు, దుర్యోధనుడు తన తప్పును తలచుకొని పశ్చాత్తాప పడును. అస్త్ర విద్యయందు నిపుణు డయిన ద్రుపదరాజు కోపముతో రథము నుండి యుద్ధభూమియందు బాణములు ప్రయోగించి శత్రు యువక వీరుల మస్తకములను ఏరిఏరి నరకుచున్నప్పుడు దుర్యోధనుడు పశ్చాత్తాప పడును.

"శత్రు వీరులను సంహరించుచున్న విరాట రాజు తన మత్స్య దేశీయ యోధులతోపాటు యుద్ధభూమియందు శత్రు సేనలో దూరినపుడు దుర్యోధనుడు పరితపించగలడు. సౌమ్యు డయిన విరాట రాజు పెద్ద కొడుకు శ్వేతకుడు మత్స్యదేశ మహారథికులలో ప్రధానుడు. అతడు పాండవుల పక్షమున పోరాడునప్పుడు దుర్యోధనుడు మిక్కిలి దుఃఖించును.

''సంజయా! కౌరవ వంశములో ప్రధాన వీరుడు, అత్యంత సాధువు నయిన శంతను నందనుడు భీష్ముడు, శిఖండిచేత యుద్ధమునందు కొట్టబడి

నపుడు, మా శత్రువు లయిన కౌరవులు మేము యుద్ధమునందు చూపబోవు వేగమును సహింపజాలరు. ఇది సత్యము. శిఖండి తన రథమును రక్షించుకొనుచు, శత్రు వీరులను కొట్టుచు, దివ్యాశ్వములు కట్టబడిన శత్రు రథములను నలగ్రొక్కుచు పోయి రథారూఢు డయిన భీష్మునిపైన దాడి సల్పినపుడు దుర్యోధనుడు తన పొరపాటుకు పశ్చాత్తా పపడును.

''సంజయా! ఆచార్య ద్రోణుని నుండి అస్త్రవిద్యలో అత్యంత రహస్యము లయిన విషయములను గూడ నేర్చుకొనిన ధృష్టద్యుమ్నుడు మిక్కిలి బుద్ధిశాలి. అతడు సృంజయ వంశ వీరుల సేనయొక్క అగ్రభాగమునందు నిలిచి యున్నప్పుడు దుర్యోధనుడు చూచి మనస్సులో మిక్కిలి పరితపించ గలడు. సోమక వంశములో ప్రధాన వీరుడు, బలవంతుడు, బుద్ధిమంతుడు నయిన ధృష్టద్యుమ్నుడు శత్రు సేనలను ఎదిరించుటలో అపరిమితమైన శక్తి గలవాడు. అతడు మాకు సేనాపతిగా నుండి బాణములచేత ధృతరాష్ట్ర పుత్రులను గొట్టుచు ద్రోణాచార్యునిపైన దాడి సల్పినప్పుడు యుద్ధ పరిణామమును గూర్చి దుర్యోధనుడు మిక్కిలి పశ్చాత్తాప పడగలడు.

"సంజయా! ధృష్టద్యుమ్నుని వలెనే సింహ సమాన పరాక్రమశాలి, మహావీరుడు నయిన సాత్యకి వృష్ణివంశ శ్రేష్ఠుడు. అతడు వృష్ణి సైనికులకు అగ్రగామిగా నుండును. అతని వేగమును శత్రువులు ఎప్పుడుగూడ సహింపజాలరు.

''సంజయా! నీవు మా మాటగా దుర్యోధనునితో 'దుర్యోధనా! నీవు ప్రపంచమునందు జీవించి యుండి రాజ్యమును అనుభవించుటకు ఇచ్చగింపకుము. మేముఅసమాన వీరుడు, మహాబలవంతుడు, నిర్భయుడు, అస్త్రవిద్యా నిపుణుడు, శిబి మనుమడు నయిన సాత్యకిని మా సహాయకునిగా ఎన్నుకొనినాము' అని చెప్పుము.

"సాత్యకి నాలుగు చేతుల పొడవైన ధనుస్సును పట్టుకొని యుండును. అతని వక్షస్థలము విశాలమైనది. భుజములు పొడవైనవి. అతడు యుద్ధమునందు శత్రువులను మథించగలడు. ఉత్తమాశ్వముల జ్ఞానము సాత్యకికి విశేషముగ గలదు. అట్టి వీర సాత్యకి మేఘమువలె బాణములు నిరంతరము కురిపించుచు ముఖ్యయోధులను బాణములచే కప్పుచుండును.

''సాత్యకి యుద్ధభూమిలో దృఢముగా నిలిచినప్పుడు సింహపువాసనచేత గోవులు భయముతో నలువైపుల పారి పోయినట్లుగ శత్రువులు అతనిని చూచి పారిపోయెదరు. అస్త్ర విద్యయందు నైపుణ్యము గల సాత్యకి పర్వతమునుగూడ చీల్చ గలడు. అతడు సమస్త లోకములను సంహరించ గల సమర్థుడు. ఆకాశము నందు సూర్యునివలె ప్రకాశించు చుండును. యుద్ధ నిపుణులు ప్రశంసించునట్టి ఉత్తమాస్త్రము లన్నియు గలవాడు సాత్యకి. అతడు అస్త్ర ప్రయోగమును చిత్ర-విచిత్రములుగ చేయుటకు అభ్యసించినవాడు. నాలుగు తెల్లని అశ్వములు కట్టిన సాత్యకియొక్క సువర్ణ రథమును దుర్యోధనుడు చూచినప్పుడు తాను యుద్ధమునకు ప్రోత్సహించి తెచ్చుకొన్న అపాయములను గూర్చి మిక్కిలి పరితపించ గలడు.

''సంజయా! నా రథము సువర్ణమణిమయ మై యుండును. దానికి నాలుగు శ్వేతాశ్వములు కట్ట బడి యుండును. దానిపైన హనుమంతుని ధ్వజము ఉండును. హనుమంతుడు రథమును కాపాడు చుండును. సాక్షాత్తు భగవంతు డయిన శ్రీకృష్ణుడు దానిమీద కూర్చొని సారథ్యము చేయు చుండును. అట్లు ఉజ్జ్వల మయిన నా రథమును చూచి దుర్యోధనుడు మనస్సులోనే మిక్కిలి సంతప్తు డగును.

''నా గాండీవ ధనుస్సునకు కట్టబడిన అల్లె త్రాటిని ఆ కర్ణాంతము నేను లాగినప్పుడు పిడుగువంటి ధనుష్టంకార శబ్దము అతి భయంకరముగా విన బడును. దుర్బుద్ధి యయిన దుర్యోధనుడు ఉగ్రమైన నా ధనుష్టంకార శబ్దమును వినును. అప్పుడు యుద్ధభూమి నా బాణ వర్షముచేత అంధకారమయ మగును. అప్పుడు, చెల్లాచెదురుగా నలువైపుల పారిపోవు గోవులవలె సైనికులు పలాయనము చిత్తగించు చుండగా తన దుష్ట మిత్రులతో, సహాయకులతోను దిగ్భ్రాంతి జెంది చూచు చుండిన దుష్టబుద్ధి దుర్యోధనుడు మనస్సులో మిక్కిలి సంతాపము చెంది పశ్చాత్తాప పడగలడు.

''సంజయా! గాండీవపు నారినుండి విడువ బడిననిశితాగ్రము లయిన నా భయంకర బాణములు, మేఘమునుండి బయలువెడలిన భయంకర విద్యుత్తు యొక్క మిణుగురులవలె నుండును. అవి శత్రువులపైన పడి, వారి యెముకలను ఛేదించుచు, కీళ్ళను చీల్చుచు, వేనవేలు సైనికులను హతమార్చు చుండును. సైనికులతోబాటు గజములను, అశ్వములను, అనేక యోధులనుగూడ నా బాణ

ములు చంపు చుండును. ఆ ఘోర మారణ హోమము చూచు చున్న దుర్యోధను డప్పుడు, తాను అవివేకముతో యుద్ధమునకు పూనుకొనినందుకుగాను మిక్కిలి పశ్చాత్తాప పడును. కౌరవ యోధులు నాపై విడిచిన బాణములను నా బాణము లెదుర్కొని మరలింపగలవు. దానితోబాటే నా యితర బాణములు శత్రువుల బాణ సమూహమును అడ్డముగా ఛేదించి ముక్కలు - ముక్కలు చేయును. అప్పుడు తాను యుద్ధములో దిగినందుకు దుర్యోధనుడు పశ్చాత్తాప పడును.

''సంజయా! నా బాహుబలముచేత ప్రయోగింప బడిన 'విపాఠ' నామక బాణములు యువక యోధుల మస్తకములను, పక్షులు వృక్షాగ్రములనుండి పండ్లను క్రిందకు రాల్చి, కుప్పబోసినట్లుగా ఖండించి, ఖండించి, కుప్ప గూల్చును. అప్పుడు దుర్యోధనుడు పశ్చాత్తాపపడును. అతని సేనలోని రథములనుండి, గజములనుండి, అశ్వములనుండియు లెక్కలేనంతమంది యోధులు నా బాణములచేత కొట్ట బడి సమరాంగణమునందు పడు చుండగా దుర్యోధనుడు చూచి పశ్చాత్తాప పడును. దుర్యోధనుని తమ్ములు శత్రువుల బాణవర్ష సమీపమునకు గూడ పోవజాలక పరాక్రమము నశించి పారి పోవుచుందురు. వారిని చూచు చున్న దుర్యోధనుడు తాను యుద్ధమును కోరి తెచ్చుకొనినందుకు మనస్సులో పశ్చాత్తాప పడును. నేను ఎడతెగక బాణములను కురిపించుచు నోరు తెరచుకొని నిలుచుకొని యున్న ప్రళయకాల యమునివలె నుండెదను. అప్పుడు నేను విడిచిన మండు చున్న బాణముల వర్షము చేత, శత్రు పక్షము నందున్న కాల్బలమువారు, రథికులును గుంపులు - గుంపులుగా ఛిన్న-భిన్నము లయ్యెదరు. అది చూచుచు దుర్యోధనుడు తాను కోరిన యుద్ధమునకు మిక్కిలి సంతాపపడును. అన్ని వైపుల పరుగెత్తింప బడు చున్న నా తేరు చక్రముల వలన క్రమ్మిన దుమ్ముచేత కప్ప బడి, సేన లన్నియు భూమిపైన బడ గలవు నా గాండీవ ధనుర్ముక్త బాణములచేత సమస్త సైన్యములు ఛిన్న-భిన్నము లై పోవును. అట్టి ఘోర దృశ్యమును చూచు చున్న దుర్యోధనుడు తన పొరపాటునకు పశ్చాత్తాప బడును.

''సంజయా! దుర్యోధనుని సేన భయముచేత నలువైపుల పరుగెత్తు చుండును. అనేక యోధుల యవయవములు ఛిన్న-భిన్నము లై పోవును. అనేక మంది సైనికులు మూర్ఛిల్లి పడిపోయెదరు. గజములు, అశ్వములు, వీరభూపతు

లున్ను చంప బడుదురు వాహనము లన్నియూ అలసి పోవును. యోధు లందరు దప్పిగొని భయముచేత పీడితు లగుదురు. అనేక మంది సైనికులు ఆర్తధ్వనితో ఏడ్చుచుందురు ఎందరో చచ్చి పడి యుందురు. ఎందరో చంప బడు చుందురు. అనేకుల కేశములు, ఎముకలు, పుఱ్ఱెలున్ను అన్ని దిక్కుల చెల్లాచెదురుగా పడి యుండును.

"సంజయా! ఇది దైవము యొక్క విధానమే అయి యుండ వచ్చును. కనుక, అది అట్లు జరిగియే తీరును. ఆ విధముగా అతి భయంకర ఘోర యుద్ధ భూమియొక్క దృశ్యమును చూచి మందబుద్ధి దుర్యోధనుడు మనస్సునందు మిక్కిలి పశ్చాత్తాపము చెంద గలడు.

"సంజయా! నా గాండీవము, నాకు సారథి యైన శ్రీకృష్ణుడు, ఆయన దివ్య మయిన పాంచజన్య శంఖము, రథమునకు కట్ట బడిన దివ్యాశ్వములు, నాకు ఉన్న అక్షయ తూణీరములు, నా దేవదత్త శంఖము - ఇన్ని సాధన సంపత్తులతో రథముపైన ఉన్న నన్ను దుర్యోధనుడు చూచినప్పుడు యుద్ధ పరిణామమును గూర్చి విచారించి మిక్కిలి సంతాపము చెంద గలడు. యుద్ధము చేయుటకు అక్కడ చేరి యున్న శత్రు దళములను సంహరించి, ప్రళయము కలిగించి, పిదప, మరియొక యుగమును ప్రవర్తింవ జేయుచు నేను అగ్నివలె జ్వలించుచు, కౌరవులను భస్మము చేయు చున్నప్పుడు ధృతరాష్ట్రునకు, అతని నూర్గురు పుత్రులకున్ను దుఃఖము కలుగును.

"సంజయా! క్రుద్ధుడు, నీచబుద్ధి, మూర్ఖుడు నయిన దుర్యోధనుడు, సోదర - భృత్య గణ - సేనా సహితముగ సకలైశ్వర్యములతో భ్రష్టుడై గడగడ వణకు చున్నప్పుడు అతని పొగరు అంతయు నుగ్గు-నుగ్గు ఐనపుడు అతడు చేసిన దుష్ట కార్యములకు స్వయముగా మిక్కిలి పశ్చాత్తాపము చెంద గలడు.

"సంజయా! పూర్వ మొకప్పుడు నేను ప్రాతఃకాలమునందు సంధ్యా వందనము, గాయత్రీ జపమున్ను చేసి ఆచమనానంతరము కూర్చొని యుంటిని. అప్పుడు ఒక బ్రాహ్మణుడు నాకడకు వచ్చి యిట్లనెను:

'అర్జునా! నీవు దుష్కర మయిన కార్యము చేయ వలసి యున్నది. నీ శత్రువులతో యుద్ధము నీకు చేయ వలసి వచ్చును. నీకు ఏమి కావలయునో,

వరము కోరుకొనుము. ఇంద్రుడు ఉచ్చైశ్శ్రవస్సు అను అశ్వముపై కూర్చొని వజ్రాయుధము చేతిలో బట్టుకొని, యుద్ధభూమియందు నీకు ముందు నడచుచు, శత్రువులను చంపుచు పోవలెనా? లేక 'శైబ్య-సుగ్రీవ-మేఘపుష్ప-వలాహకములు' అనెడు నాలుగు శ్వేతాశ్వములను గూర్చిన రథమునందు కూర్చొని శ్రీకృష్ణుడు వెనుకనుండి నీ రక్షణము చేయు చుండ వలయునా? ఈ రెండు వరములలో నీవు దేనిని కోరెదవు?'

"ఇట్లు ఏంకాతమునం దున్న నాతో నతి మధురముగా ఆ బ్రాహ్మణుడు మాటాడెను.

"ఆ మాటకు నేను ఆ బ్రాహ్మణునితో 'ఇంద్రుని సహాయము నాకు అక్కర లేదు. శ్రీకృష్ణుని సహాయమే కావలయును' అన్ని చెప్పి యుంటిని. కనుక సంజయా! ఈ విధముగా, శత్రు సంహారమునకు నాకు సహాయకుడుగా శ్రీకృష్ణుడే లభించెను. శ్రీకృష్ణుడు నాకు సహాయకుడుగా నుండు వ్యవస్థను దేవతలే యేర్పచినా రని తోచు చున్నది.

శ్రీకృష్ణమహిమ అర్జునుడు చెప్పుట

"సంజయా! భగవంతు డయిన శ్రీకృష్ణుడు యుద్ధము చేయకున్నను మనస్సునందు ఎవని విజయమును ఆయన అభినందించునో, ఆ పురుషుడు శత్రువులనే కాక, ఇంద్రాది దేవతలను గూడ జయించ గలడు. ఇట్లుండగా, మనుష్య శత్రువుల విషయములో చింతించ వలసిన యవసర మే మున్నది?

"సంజయా! కృష్ణుని ఓడింప దలచినవాడు, విశాల మై, పాషాణరాశిగా నున్న కైలాసపర్వతమును ఎవడు చేతితో కొట్టి చీల్చ దలచునో, అట్టి మనుష్యుడు తన చేతిని నఖములతోబాటు ఛిన్న - భిన్నము చేసికొనునే కాని, ఆ పర్వతమును కొంచెము గూడ చెడ గొట్ట జాలడు. అట్లే యుద్ధమునందు అతి శౌర్యసంపన్ను డయిన శ్రీకృష్ణ భగవానుని ఓడింప దలచువాడు, అనంతరము, అగాధము నయిన సముద్రమును చేతులతో ఈది దాట దలచు చున్న వాని వలె మూర్ఖు డగును.

"ఆ విధముగానే జ్వలించు చున్న అగ్నిని చేతులతో ఆర్పుటకు ప్రయత్నించు చున్న వానివలె, చంద్ర-సూర్యగమనములను ఆప దలచు చున్న వానివలె, దేవతల రక్షణములో నున్న అమృతమును మొండి పట్టుతో అపహరించుటకు ప్రయత్నించు చున్న వానివలెను, కృష్ణునిపై విజయమును సాధింప దలచినవాడు మూర్ఖు డగును.

"సంజయా! ఒక్క రథసహాయముతోనే యుద్ధమునందు భోజవంశీయులైన రాజుల నందరిని ఓడించి సౌందర్య రాశి యయిన రుక్మిణిని పత్నిగా గ్రహించి ఆమె గర్భము నుండి మహాత్ము డయిన ప్రద్యుమ్నుని కనిన కృష్ణ భగవానుని ఎవడు ఓడించ గలడు? శ్రీకృష్ణుడే కదా గాంధార యోధులను నలగ ద్రొక్కి, 'నగ్నజిత్తు' అను రాజుయొక్క పుత్రు లందరిని ఓడించెను. అక్కడ చెరసాలలో పడి 'సుదర్శనుడు' అను రాజు దుఃఖించు చుండెను. ఆ రాజు దేవతలకు గూడ గౌరవ పాత్రుడు. అట్టి రాజును శ్రీకృష్ణుడు ఆ కారాగారమునుండి విముక్తుని జేసెను.

"సంజయా! శ్రీకృష్ణుడు వాకిలి తలుపు చేతనే కొట్టి పాండ్యరాజును చంపెను. భయంకర యుద్ధమునందు కళింగ దేశీయ యోధులను అణచివేసెను. కాశీపట్టణమును కాల్చెను. దానిచేత ఆ పట్టణము అనేక సంవత్సరముల వరకు దిక్కు లేక పడి యుండెను.

"శ్రీకృష్ణ భగవానుడు ఆటవికులరా జైన ఏకలవ్యుని సర్వదా యుద్ధమునకు ప్రోత్సహించు చుండెను. ఏకలవ్యుడు ఇతరులకు జయింప నలవి కానివాడు. కాబట్టి శ్రీకృష్ణుచేత చంప బడెను.

"ఆ విధముగనే పర్వతముపై నున్న జంభు డను రాక్షసుని కొట్టి చంపెను.

"సంజయా! ఉగ్రసేన పుత్రు డయిన కంసుడు చాల దుష్టుడు. శ్రీకృష్ణుడు బలరామునితో గూడుకొని, వృష్ణి - అంధక - వంశీయ క్షత్రియులచేత నిండిన సభామధ్యమునందున కంసుని చంపి పడ గొట్టెను. మధురా రాజ్యమును కంసుని తండ్రి యైన ఉగ్రసేనునకు తిరిగి యిచ్చెను. (కంసుడు తన తండ్రి ఉగ్రసేనుని చెఱలో పెట్టి తాను రాజ్య మేలు చుండెను).

"సంజయా! శ్రీ కృష్ణుడు 'సౌభుడు' అను సాళ్వదేశరాజుతో యుద్ధము చేసెను సౌభుడు మాయచేత అతి భయంకర రూపము ధరించి ఆకాశమునందు విమానములో కూర్చొని, యుద్ధమునకు వచ్చి యుండెను. విమాన ద్వారమునందు అతడు 'శతఘ్ని' అను ఆయుధమును పట్టుకొని యుండెను. అట్టి వాని వేగమును ఎవడు సహించ గలడు? అతనిని శ్రీకృష్ణుడు చంపెను.

''సంజయా! 'ప్రాగ్జ్యోతిష' మనెడు ఒక భయంకర మయిన రాక్షసుల నగరము కోటయు నుండెను. దానిపైన శత్రువు లెవరున్ను విజయమును సాధించ జాల కుండిరి. ఆ కోటలో రాక్షస రాజైన నరకాసురుడు నివసించు చుండెను. అతడు మహాబలవంతుడు. భూదేవికి పుత్రుడు. అతడు దేవమాత యైన అదితియొక్క సుందరము లయిన మణిమయ కుండలములను అపహరించి తెచ్చి యుండెను మృత్యురహితులైన దేవతలు ఇంద్రునితోబాటు అతనిని యుద్ధములో నెదుర్కొనుటకు పోయి అతనిని జయింప జాల కుండిరి. అప్పుడు దేవతలందరు అమోఘబల సంపన్ను డయిన శ్రీకృష్ణుని పరాక్రమమును, దయాళుత్వమును, దుష్టశిక్షణ స్వభావమునున్ను తలచుకొని నరకాసురుని చంపవలసిన దని ప్రార్థించిరి.

''సంజయా! కార్యసిద్ధిని తన వశమునం దుంచుకొనిన శ్రీకృష్ణుడు ఆ దుష్కర కార్యమును నెరవేర్చుటకు పూనుకొనెను. కృష్ణు డప్పుడు 'నిర్మోచనము' అన బడు పట్టణము ఎల్లలో ప్రవేశించి ఆ నగరమును రక్షించుటకు ఉంచ బడిన పదు నైన అంచులు గల ఆరువేల ఇనుప పాశములను ఖండించెను. 'ముర' నామక రాక్షసుని వధించి, రాక్షస సమూహమును గూడ హతమార్చి, నిర్మోచన నగరమునందు ప్రవేశించెను.

''సంజయా! ఆ నగరమునందే నరకాసురునితో శ్రీకృష్ణుడు యుద్ధము చేసి అతనిని చంపెను. నరకాసురుడు, ఉప్పెనచేత పెరుక బడి నేలపై బడిన కర్ణికార (కొండగోగు) వృక్షమువలె క్రింద బడెను. అట్లు ముర, నరకాసురులను చంపి శ్రీకృష్ణుడు అక్కడినుండి మణి కుండలములను తెచ్చి దేవమాత అదితికి ఇచ్చెను. ఈ విధముగా శ్రీకృష్ణుడు విజయలక్ష్మిని చేపట్టి మహాకీర్తితో ద్వారకా నగరమునకు తిరిగి వచ్చెను.

''సంజయా! ఆ భయంకర యుద్ధమునందు పరాక్రమముచేత నరకాసురుని చంపినందుకుగాను దేవతలు శ్రీకృష్ణునకు ఈ విధముగా వరము ఇచ్చిరి:

''కృష్ణా! యుద్ధ సమయమునందు నీకు అలసట కలుగకుండుగాక! ఆకాశమందు గాని, జలమునందు గాని నీ గమనము అడ్డు లేకుండ ఉండుగాక! నీ శరీరమునందు అస్త్రశస్త్రముల గాయములు ఏమియు కలుగకుండుగాక!''

''ఇట్లు వరములను పొంది శ్రీకృష్ణుడు పరిపూర్ణముగా కృతకృత్యుడయ్యెను.

''సంజయా! అపారమయిన శక్తిగల శ్రీకృష్ణునియందు సమస్తగుణ సంపద సర్వదా విరాజమానమయి యుండును. అటువంటి శ్రీకృష్ణుని జయించవలయు నని దుర్యోధనుడు పేరాసతో నున్నాడు. సర్వదా కృష్ణునికి అపాయము చేయుటకు ఆలోచించు చుండును. కాని, శ్రీకృష్ణుడు మాత్రము మా ముఖము చూచి దుర్యోధనుని యపరాధము లన్నియు క్షమించు చున్నాడు. నాకు, శ్రీకృష్ణునకున్నూ కలహము కలిగించ వలయు నని దుర్యోధనుడు తలచు చుండును. పాండవులకు శ్రీకృష్ణుని యెడల గల మమకారము, ఆత్మీయ భావమున్ను దుర్యోధనుడు పోగొట్ట వచ్చును. కాని, కురుక్షేత్రయుద్ధ భూమిని చేరిన తరువాత అతనికి శ్రీకృష్ణుని ప్రభావము తెలియ గలదు.

''సంజయా! నేను రాజ్యసంపాదనేచ్ఛచేత, భీష్మ-ద్రోణ-కృపాచార్య-అశ్వత్థామలకు నమస్కరించి, తప్పక యుద్ధము చేసెదను పాండవులతో యుద్ధమునకు పూనిన పాపిష్ఠులు మృత్యువును సమీపించిన వా రగుదు రని నా విశ్వాసము. ఎందు కనగా, క్రూరు లైన కౌరవులు మ మ్మందరిని మాయ జూదమునందు ఓడించి పన్నెండు ఏండ్లు వనమునకు పార ద్రోలిరి. మేముగూడ రాజపుత్రులమే కదా! అట్టి మేము సుదీర్ఘ కాలము వనమునందు అనేక కష్టములను సహించి పదుమూడవ యేడు అజ్ఞాతవాసముగూడ చేసితిమి. పాండవులు జీవించి యుండగా కౌరవులు తమ పదవులందు స్థిరముగా నిలిచి ఎట్లు ఆనందమును అనుభవించగలరు? ఇంద్రాది దేవతల సహాయమును పొందికూడ దుర్యోధనుడు మమ్ము యుద్ధమునందు జయించిన యెడల 'ధర్మముకంటె పాపప్రవృత్తికే ఆధిక్యము ఉన్నది, ప్రపంచమునందు పుణ్యకర్మయే లేకుండ బోయెను' అని నిశ్చయించ వలసి యుండును.

''సంజయా! మనుష్యుడు కర్మబంధనములలో చిక్కుకొన డని దుర్యోధనుడు తలచ వచ్చును. అతడు మమ్ము తనకంటె ప్రబలులనుగా తలచక

పోవచ్చును. అట్లైనను అతడు బ్రతుక జాలడు. శ్రీకృష్ణుని సహాయముతో నేను దుర్యోధనుని బంధుమిత్రసహితముగా తప్పక చంప గల నని విశ్వసించుచున్నాను సంజయా! ధృతరాష్ట్రునితో సభలో నా మాటలుగా నిట్లనుము:

''రాజా! మనుష్యుడు చేసిన పాపకర్మలు నిష్ఫలము లైనను, అతని పుణ్యకర్మల ఫలము లభించకపోయినను, దుర్యోధనుడు చేయు చున్న పాప కర్మలను యోచించి అతనికి అపజయము తప్పక కలుగును. దానిచేతనే ప్రపంచమునకు శ్రేయస్సు ఉన్నదని నిశ్చయముగా నేను చెప్పగలను.

''కౌరవులారా! 'దుర్యోధనుడు యుద్ధభూమిలో దిగినప్పుడు బ్రతికి పోవ జాలడు' అని మీకు స్పష్టముగా చెప్ప దలచినాను. కౌరవులు యుద్ధమునుండి దూరముగ నున్నప్పుడే వారికి రక్షణము కలుగును. యుద్ధములో ఒక్కడుగూడ చావకుండ మిగిలి పోవ జాలడు.

''ఇట్లు అర్జునుడు చెప్పి ఇంకను నిట్లనె నని సంజయుడు అర్జును డన్న మాటలను చెప్ప దొడగెను:

''సంజయా! నేను కర్ణుని, నూరుగురు ధృతరాష్ట్ర పుత్రులనున్ను చంపి కురుదేశ సంపూర్ణ సామ్రాజ్యమును గెలుచుకొన గలను. కనుక ఇప్పుడే వారు మిగిలి యున్న పనులను చేసికొని, వారి వైభవానుసారముగా వారి ప్రియభార్యలతో సుఖమును అనుభవించి, వారి శరీరములకు ఇష్టము లయిన సుఖములను గూడ నిప్పుడే అనుభవించుట మంచి దని, వారు మరణమునకు సిద్ధముగా నుండ వలె ననియు చెప్పుము.''

''సంజయా! నాకడ అనేక శాస్త్రపండితు లయిన వృద్ధ బ్రాహ్మణులు ఎందరో ఉన్నారు. వా రందరు ఉత్తమ కుల సంజాతులు. ప్రతి సంవత్సరము కలుగ బోవు శుభాశుభ ఫలములను తెలిసినవారు. జ్యోతిష శాస్త్ర మర్మములను, గ్రహ నక్షత్ర యోగఫలములనున్ను నిశ్చితరూపములో తెలిసినవారు. దైవికముగా కలుగు అభివృద్ధిని, అపనతిని, తత్ఫలములనున్ను బాగుగా చెప్ప గల వారు. ఆ బ్రాహ్మణులు ప్రశ్నములకు అలౌకికము లయిన ఉత్తరములను చెప్పెదరు. ఆ ఉత్తరములచేత భవిష్యత్తులో మనకు కలుగ బోవు సంఘటనములు స్పష్టముగా తెలియ గలవు. వారు ముహూర్త శాస్త్రమునందు మహాపండితులు గాబట్టి 'సర్వతో భద్రము' మొద లైన చక్రములను పరిశీలించి, శుభాశుభ ఫల

ములను వివరించి చెప్పెదరు. వా రందరు నిశ్చయముగా చెప్పు చున్న దే మనగా- కౌరవులు, సృంజయులు అనేక సంఖ్యలో చచ్చెదరు ఈ మహాయుద్ధములో పాండవులకు విజయము సిద్ధించును అని.

"సంజయా! అజాత శత్రు వైన యుధిష్ఠిరుడు 'తాను తప్పక జయించెదను' అని తలచు చున్నాడు. శ్రీకృష్ణ భగవానునకు అన్ని విద్యలయొక్క ప్రత్యక్ష జ్ఞానము గలదు. అతడుగూడ 'మాకు విజయము సిద్ధించుటలో సందేహము లేదు' అని తలచుచున్నాడు. నేనుకూడ భవిష్యత్తులో ఈ విధముగనే కార్యసిద్ధి కలుగు నని, ఏమాత్రము ఏమరుపాటు లేని నా బుద్ధితో స్పష్టముగా చూచు చున్నాను. నా ప్రాచీన దృష్టి ఎప్పుడుగూడ మరుగుపడిపోవదు. ఆ దృష్టిచేత, నిశ్చయముగా యుద్ధభూమిలో ధృతరాష్ట్ర పుత్రు లెవ్వరుగూడ జీవింప జాల రని నేను స్పష్టముగా చెప్ప గలను.

"సంజయా! నా గాండీవ ధనుస్సు నేను స్పృశించకయే విజృంభించు చున్నది. దానియొక్క అల్లెత్రాడుగూడ నేను లాగకయే కదులు చున్నది. నా బాణములు మాటి-మాటికి అంబుల పొదులనుండి బయల్వెడలి శత్రువులవైపు పోవుటకు ఉబలాట పడుచున్నవి. సర్పము ప్రాతకుబుసమును విడిచి బయటకి వచ్చు చున్నట్లు, నా ఖడ్గము ఒరనుండి బయటకు ప్రకాశించుచు వచ్చుచున్నది.

"సంజయా! నా రథముపై నున్న ధ్వజముగూడా అర్జునా! రథము యుద్ధమునకు ఎప్పుడు సన్నద్ధమగును' అను మాట భయంకరముగా చెప్పు చుండును. రాత్రియందు నక్కలు కూయు చుండును. రాక్షసులు ఆకాశమునుండి భూమి పైన పడుచుందురు. లేళ్ళు, నక్కలు, నెమళ్ళు, కాకులు, గ్రద్దలు, కొంగలు, చిరుత పులులున్ను నా రథము కడకు పరుగెత్తి వచ్చు చున్నవి. శ్వేతాశ్వములు కట్ట బడిన నా రథమును చూచి బంగారు రెక్కలుగల పక్షులు వెనుకనుండి పడు చున్నవి.

''సంజయా! ఈ యన్నింటివలన నేను ఏకాకిగానే బాణములను గురిపించి, సమస్త శత్రురాజులను, యోధులనున్ను సంహరించ గల నని తెలియు చున్నది.

"సంజయా! అడవియందు మండుచు సాగు చున్న దావాగ్ని ఒక్క చెట్టు గూడ మిగలకుండ వనము నంతటిని కాల్చు చుండునట్లు శత్రువధకొరకు సంసిద్ధుడనై నేను ప్రయోగించిన భిన్న-భిన్న శస్త్రాస్త్రములు శత్రువులను దహించును.

"సంజయా! స్థూణాకర్ణము - మహాపాశుపతాస్త్రము- ఇంద్రుడు నా కిచ్చిన బ్రహ్మాస్త్రము - ఇంద్రాస్త్రము మొద లైన ఆయుధములను నేను ప్రయోగించుచు ఇతర బాణములనుగూడ అనేకములను వర్షించు చుండెదను. అప్పుడు యుద్ధభూమిలో శత్రువు లెవ్వరుగూడ జీవించకుండ అందరిని సంహరించెదను. అట్లు చేసి నప్పుడే నాకు శాంతి గల్గును.

"సంజయా! 'ఇది నా దృఢనిశ్చయము' అని ధృతరాష్ట్రి సభలో చెప్పుము. యుద్ధభూమియందు ఇంద్రాది దేవతలను గూడ జయించగల యీ పాండవులతో దుర్యోధనుడు మొండిపట్టు పట్టి యుద్ధము చేయదలచుచున్నాడు. అతని మూర్ఖత్వము ఎంతటిదో నీవే చూడుము.''

"సంజయా! ఇంత వాస్తవ పరిస్థితి యున్నప్పటికిన్ని 'మా వృద్ధ పితామహుడు భీష్ముడు, మా గురువులైన కృపాచార్య - ద్రోణాచార్యులు, మా సహాధ్యాయి యైన అశ్వత్థామ, బుద్ధిశాలియయిన విదురుడు - వీరందరు కలిసి ఏమాట చెప్పినను అదియే యగునుగాక! సమస్త కౌరవులు దీర్ఘాయుష్మంతు లయి యుందురుగాక!' అని నేను కోరుచున్నాను."

భీష్ముడు కృష్ణార్జునుల మహిమను దుర్యోధనునకు చెప్పి కర్ణుని నిందించుట - కర్ణుని ఆత్మ ప్రశంస - అతనిని భీష్ముడు పరిహసించుట - భీష్మునిమాట ద్రోణుడు అనుమోదించుట

జనమేజయా! అప్పుడు ఆ సభలోని రాజులందరు వినుచుండగా భీష్మ పితామహుడు దుర్యోధనునితో నిట్లనెను :

"దుర్యోధనా! పూర్వము బృహస్పతి - శుక్రాచార్యులు బ్రహ్మదేవుని యొద్దకు పోయిరి. ఆ యిరువురితో పాటు, ఇంద్రాది దేవతలు - అగ్నిదేవుడు - అష్టవసువులు - ద్వాదశాదిత్యులు - సాధ్యులు - సప్తర్షులు - విశ్వావసు గంధర్వుడు - అప్సర స్త్రీలు గూడ అక్కడికిపోయి బ్రహ్మసభలో నుండిరి.

"లోకపితామహుడైన బ్రహ్మదేవునకు దేవతలందరు నమస్కరించి ఆయన చుట్టు కూర్చొని యుండిరి. ఆ సమయమునందు, పురాతనమునీంద్రులైన నర - నారాయణులు బ్రహ్మలోకమార్గము గుండా పోవుచు, అక్కడివారి మనస్సును -

తేజస్సును తమ కాంతిచే ఆకర్షించుచు, బ్రహ్మలోకమును దాటి పోయిరి. అప్పుడు 'దేవా! నిన్ను ఉపాసించకుండ, దాటుచు పోవుచున్న ఈ యిద్దరు మునులెవ్వరు?' అని బృహస్పతి బ్రహ్మదేవుని అడిగెను. ఆ మాటకు బ్రహ్మ యిట్లు బదులు చెప్పెను:

బృహస్పతీ! వీరు మహాతపశ్శక్తి సంపన్నులు. భూమ్యాకాశములను తమతేజస్సుతో ప్రకాశింప జేయుచు, మనను దాటిపోవుచున్న యీ యిద్దరు 'నర-నారాయణులు' అను మహా మునీశ్వరులు. వీరు స్వయంప్రకాశమానులు. వీరికి ధైర్యము, పరాక్రమమున్ను అధికముగా నున్నవి. వీరు తమ తపస్సుయొక్క ప్రభావముచేత భూలోకము నుండి బ్రహ్మలోకమునకు వచ్చినారు. ఈ నర-నారాయణులు తమ సత్కర్మల చేత అన్ని లోకములలో ఆనందమును పెంపొందించినారు.

'బృహస్పతీ! ఈ యిరువురు మిక్కలి బుద్ధిమంతులు. శత్రువులను తపింపజేయగలవారు. వీరిద్దరు ఒకరైనప్పటికిన్ని శత్రువినాశము కొరకు విడి విడిగా రెండు శరీరములను ధరించినారు. దేవ-గంధర్వు లందరు వీరిని పూజించెదరు.'

"జనమేజయా! బ్రహ్మదేవుని మాటలు విని ఇంద్ర-బృహస్పత్యాది దేవతలు అందరును కలసి, ఆ నరనారాయణ మహామునులు తపస్సు చేయుచున్న చోటికి పోయిరి.

"ఆ దినములందు దేవరాక్షసులకు యుద్ధము జరుగుచుండెను. ఆ యుద్ధమునందు దేవతలకు మహా భయము సంప్రాప్త మయ్యెను. అందుచేత దేవతలు నరనారాయణులను వరము లిమ్మని కోరిరి. జనమేజయా! అప్పుడు నరనారాయణులు దేవతల ప్రార్థనను విని ఇంద్రునితో 'నీ యిష్టము వచ్చిన వరము కోరుకొనుము' అనిరి. అప్పుడు ఇంద్రుడు, 'భగవంతులారా! మీరు మాకు సహాయము చేయవలెను' అని అనెను. అప్పుడు నరనారాయణులు ఇంద్రునితో, 'దేవరాజా! నీవు ఏమి కోరెదవో అట్లే చేసెదము' అని అనిరి. అప్పుడు ఆ యిరువురు మహామునులను వెంట దోడ్కొని యింద్రుడు రాక్షసులతో యుద్ధము చేసి విజయమును సాధించెను. నరుడు ఆ యుద్ధము నందు ఇంద్ర శత్రువులయిన వేలకొలది మంది పౌలోమ - కాలఖంజ, నామక రాక్షసులను సంహరించెను.

ఆ నరుడే ఇప్పుడు అర్జునుడుగా జన్మించినాడు. నారాయణుడే కృష్ణుడుగా అవతరించినాడు. ఈ యిద్దరిని ఒకటిగానే భావించవలయును.

"జనమేజయా! ఆ యుద్ధ సమయమునందు నరరూపుడయిన అర్జునుడు రథమునందు కూర్చొని యుండెను. అప్పుడు అందరిని కబళించుచున్న 'జంభుడు' అను రాక్షసుని మస్తకమును ఒక బల్లెముచేత నరుడు నరకెను. ఆ నరుడే యుద్ధమునందు 'నివాత కవచులు' అనెడు అరువదివేల మంది రాక్షసులను ఓడించి సముద్రపు అవతలి యొడ్డున నున్న హిరణ్యపురమును గూడ నశింపజేసెను. ఆ నరరూపుడైన అర్జునుడే ఖాండవ వన దహన కాలమందు ఇంద్రాది దేవతలను జయించి అగ్నిదేవుని తృప్తి పరచెను.

"జనమేజయా! ఈ విధముగానే నారాయణుని యవతార స్వరూపుడయిన శ్రీకృష్ణుడు గూడ ఖాండవదహన సమయమునందు ప్రాణిహింస చేయు నితర జంతువులను చంపెను. నరనారాయణులు మిక్కలి పరాక్రమవంతులు."

"దుర్యోధనా! ఇప్పుడు నర నారాయణు లిద్దరు పరస్పరము కృష్ణార్జునులుగా కలిసి యున్నారు. ఆ యిద్దరు మహావీరులు - మహారథికులు. వారిని జయించుటకు ఈ మనుష్య లోకములో నెవరికి గూడ సాధ్యము గాదు. ఇంద్రాది దేవతలు, రాక్షసులు వచ్చినను వారిని జయించుట సాధ్యము గాని పని. ఆ యిరువురు ఒకటే సత్తగా నున్నారు. కాని, లోకహితము కొరకు రెండు శరీరములను ధరించి కన బడు చున్నారు. ఆ యిరువురు తమ సత్కర్మల ప్రభావము చేత అవినాశ్యులు (నాశము చెందనివారు). ధ్రువలోకమును గూడ వ్యాపించి యున్నారు. వీరు లోకహితము కొరకు ఎప్పుడెప్పుడు ఎక్కడెక్కడ యుద్ధము అవసరమగునో అప్పుడు అక్కడికి మాటిమాటికి అవతారములను ఎత్తుచుందురు. దుష్ట శిక్షణము, సాధురక్షణము, ధర్మరక్షణమే ఆ యిరువురి కర్తవ్యము"

"నాయనా, దుర్యోధనా! సనాతనులు, మహాత్ములు నయిన కృష్ణార్జునులు ఒకే రథముపైన కూర్చొని యుండెదరు. శ్రీకృష్ణుడు శంఖ - చక్ర - గదా - కౌమోదకీ - ధారియై యుండును భయంకర మైన ధనుస్సును ధరించి అర్జునుడు అనేక విధము లయిన అస్త్రములను ఎడతెగక ప్రయోగించు చుండును. అప్పుడు వారిని చూచి నీవు నా మాటలను జ్ఞప్తికి తెచ్చుకొనెదవు. నా మాటలు నీవు

ఇప్పుడు వినకున్నచో, యుద్ధములో అనేకు లయిన మన బంధువులు చనిపోయి నట్లు వినెదవు. ఎందు కనగా, కౌరవు లందరు నీ యభిప్రాయము ననుస రించియే నడచువారుగా నున్నారు.

"దుర్యోధనా! నీ వొక్కడవే అయినను పరశురాముని చేత శపింప బడిన - నీచజాతి సంజాతు డయిన సూతపుత్ర కర్ణునియొక్క; సుబలపుత్రు డయిన శకునియొక్క; నీచుడు, పాపాత్ముడు నయిన నీ తమ్ముడు దుశ్శాసనుని యొక్కయు అభిప్రాయము ప్రకారమే నీవు నడచుకొనెదవు. ఈ ముగ్గురి మతము తప్ప ఇతరుల మాటలు నీ చెవి కెక్కవు''

"అట్లు చెప్పిన భీష్ముని మాటలు విని కర్ణు డిట్లనెను:

"భీష్మ పితామహా! నీవు నన్ను గూర్చి ఆడిన మాటలు మిక్కిలి అను చితములు. నీవంటి వృద్ధ పురుషుని ముఖమునుండి యిట్టి మాటలు రా గూడదు. నేను క్షత్రియ ధర్మమునందే యున్నాను. నా ధర్మము నుండి నే నెప్పుడు గూడ భ్రష్టు డను కాలేదు. నీవు నన్ను నిందించ వలసినంత దుష్ప్రవర్తను ఏమి చేసితిని? ధృతరాష్ట్ర పుత్రు లెప్పుడు గూడ పాపములు చేసినట్లు నేను చూడ లేదు, విన లేదు. నే నెప్పుడు గూడ దుర్యోధనునకు అనిష్టమును చేయ లేదు. యుద్ధమునందు నిలిచియున్న పాండవు లందరిని నేను చంప గలను. నాకు పూర్వమునుండి విరోధు లయిన వారితో తిరిగి యిప్పుడు సంధి చేయుట ఎట్లు సంభవించును? నేను ధృతరాష్ట్ర మహారాజునకు ఏ విధముగా ప్రియమును చేయ వలెనో, ఆ విధముగనే దుర్యోధనునకు గూడ ప్రియము నాచరించుట నా ధర్మము. ఎందు కనగా, అత డిప్పుడు రాజ్యాధికారి యై యున్నాడు.''

''జనమేజయ మహారాజా! కర్ణుని మాటలు విని భీష్ముడు ధృతరాష్ట్రునితో ని ట్లనెను :

''రాజా! కర్ణుడు 'తాను పాండవులను చంప గలిగెదను' అని ప్రతిదినము జేయు చున్న ఆత్మస్తుతి నిరుపయోగ మయినది. మహాత్ములయిన పాండవుల యొక్క పదియారవ యంశముతో గూడ ఇతడు (కర్ణుడు) సమానుడు గా దని నా నిశ్చయము. రాజా! దురాత్ము లయిన నీ పుత్రులు పాండవులకు అన్యాయము చేసిరి. దాని ఫలముగా ఈ మహాసంకటము వచ్చి పడ నున్నది. ఇది యంతయు దుష్టబుద్ధి యయిన కర్ణుని దుర్బోధ మూలముననే కలిగిన దని తలచుము.

ఇతని నాశ్రయించియే మూర్ఖు డయిన దుర్యోధనుడు దేవ పుత్రు లయిన పాండ వులను అవమాన పరచెను. ఇంతకు పూర్వము పాండవులు అందరు కలిసి చేసిన దుష్కర పరాక్రమ కార్యమును గాని, లేక విడివిడిగా వా రొక్కొక్కరే చేసిన పరాక్రమ కార్యమును గాని, ఈ కర్ణుడు ఏది చేసెను? కఠిన మైన యే పురుషార్థమును ఇతడు సాధించెను?

''రాజా! విరాట నగరమందు అర్జునుడు, కర్ణుడు చూచు చుండగనే ఇతని ప్రియసోదరుని చంపెను గదా! అప్పు డీతడు ప్రత్యక్షముగా సోదర మరణమును చూచుచు గూడ అర్జునుని ఏమి చేయ గలిగెను? అర్జునుడు ఏకాకిగానే ఉత్తర గోగ్రహణ యుద్ధమునందు కౌరవులపైన దాడిసలిపి, కౌరవు లందరిని మూర్ఛిల్ల జేసి వారి వస్త్రములను లాగుకొనెను గదా! ఆ సమయమునందు ఈ కర్ణుడు పరదేశమునకు పోయి యుండెనా? అప్పు డిత డేమి చేయ గలిగెను?

"రాజా! పాండవ వనవాసమునందు జరిగిన ఘోషయాత్రలో దుర్యోధనుని గంధర్వులు చెరపట్టుకొని పోయినప్పుడు ఈ కర్ణు డక్కడనే యుండి యేమి చేయ గలిగెను? ఇప్పుడు బలిసిన కోడెవలె నిరర్థకముగా అరచు చున్నాడు. ధృతరాష్ట్ర మహారాజా! ఈ కర్ణుడు వ్యర్థముగా ఇట్లే అసత్య భాషణములను అనేకములను వదరు చుండును. ఆత్మస్తుతి అధికముగా చేసికొనును. ధర్మార్థ రహితుడుగా వ్యవహరించు చుండును.''

''జనమేజయా! ఇట్లు భీష్ముడు చెప్పిన మటలు విని మహాత్ము డయిన ద్రోణాచార్యుడు రాజలోకము విను చుండగా ధృతరాష్ట్రునితో సగౌరవముగా ని ట్లనెను:

''మహారాజా! భరతకుల శ్రేష్ఠు డయిన భీష్ముడు చెప్పినదే సత్యము. నీవు, ఆయన చెప్పిన ప్రకారమే చేయుము. అర్థకామములయందు లోభము గల వారి మాటలను నీవు అంగీకరించ గూడదు. యుద్ధమున కంటే ముందు పాండవు లతో సంధి చేసికొనుట మంచి దని నా యభిప్రాయము. అర్జునుని సందేశమును మనకు సంజయుడు వినిపించెను. నాకు అవి యన్నియు తెలియును. అర్జునుడు, తాను చెప్పినట్లే తప్పక చేసి తీరును. మూడు లోకములలోను అర్జునితో సమాను డయిన ధనుర్ధరుడు లేడు.''

''జనమేజయా! ఈ విధముగా అర్థయుక్తములు, సారవంతములు నయిన భీష్మద్రోణుల మాటలను విని కూడ, ఆ మాటలను నిర్లక్ష్యము చేయుచు ధృతరాష్ట్రుడు తిరిగి సంజయునితో పాండవుల సంగతినే అడుగ జొచ్చెను. భీష్మ-ద్రోణులతో మంచిగా మాట్లాడక యున్న ధృతరాష్ట్రుని చూచి సభలోని కౌరవులందరు తమ బ్రతుకుపైన ఆశ విడిచిరి.

"అప్పుడు ధృతరాష్ట్రుడు సంజయు నిట్లు ప్రశ్నించెను:

సంజయుడు యుధిష్ఠిరుని ముఖ్య సహాయకులను గూర్చి వర్ణించుట

''సంజయా! మా సహాయము కొరకు, మమ్ము సంతోషపరచుటకున్న హస్తినాపురమునందు అనేక సేనలు ఒకచో చేరి యున్న వని విని ధర్మరాజు ఏ మనినాడు? భవిష్యత్తులో యుద్ధము కొరకు సన్నద్ధుడై యుధిష్ఠిరుడు ఎట్టి యేర్పాట్లు చేయు చున్నాడు? ఆయన యాజ్ఞను నెరవేర్చుటకు అతని తమ్ములు, పుత్రులు నున్నారు. యుధిష్ఠిరుడు ధర్మజ్ఞుడే గాక, ధర్మాచరణమునందు గూడ ఆసక్తుడై యున్నాడు. మూర్ఖు లయిన నా పుత్రులు కపటముతో ప్రవర్తించి వారిని కోపగింప జేసినారు పాండవులలో వారిని శాంతపరచి యుద్ధము నాపుటకు ఉపదేశించువారు ఎవరెవరు ఉన్నారు?''

"ధృతరాష్ట్రుని ప్రశ్నములకు సంజయు డిట్లు బదులు చెప్పెను:

''మహారాజా! పాంచాల - పాండవ రాజు లందరు యుధిష్ఠిరుని యాజ్ఞ చేత తమ - తమ కార్యములందు నిమగ్నులై యున్నారు. యుధిష్ఠిరుడు, ఎదుట వచ్చి నిలచినప్పుడు పాండవ - పాంచాలుర రథసైన్యములు వేర్వేరు వరుసలలో నిలిచి ఆయనను అభినందించు చుందురు. ఉదయకాలమునందు ఆకాశము తేజస్వంతు డయిన సూర్యుని అభినందించినట్లు దీప్తతేజస్సుతో విరాజిల్లు చున్న యుధిష్ఠిరుని సమస్త పాంచాల గణము అభినందించు చుండును. ఆబాలగోపాలము పాంచాలురు, కేకయులు, మత్స్య దేశీయులు నయిన సామాన్య ప్రజల నుండి రాజవంశీయుల వరకు గూడ అందరున్ను యుధిష్ఠిరుని గౌరవించెదరు. బ్రాహ్మణ - క్షత్రియ - వైశ్య కన్యకలు గూడ ఆడుచు పాడుచు యుద్ధ సన్నద్ధు డయిన యుధిష్ఠిరుని జూచుటకు వచ్చు చున్నారు ''

"ఆ మాటలు విని ధృతరాష్ట్రుడు సంజయునితో, ''పాండవ ధృష్టద్యుమ్న సేనలు సోమక వంశీయుల మహా సేనలేకాక, మరి ఇంకెవరి సేనలను సహాయముగా పొంది మనతో యుద్ధము చేయుటకు వారు సంసిద్ధు లయినారు?''

''జనమేజయా! కౌరవ సభలో ధృతరాష్ట్ర మహారాజు మాటిమాటికి ఈ విధముగా సంజయుని ప్రశ్నించు చుండినప్పుడు సంజయుడు అతి దీర్ఘముగా నిశ్వాసము విడుచుచు అగాధ మయిన చింతలో నిమగ్నుడై హఠాత్తుగా ఏ విశేష కారణము లేకయే మూర్ఛిల్లి పడిపోయెను. అప్పుడు విదురుడు ఆ రాజ సభలో ధృతరాష్ట్రునితో, ''మహారాజా! సంజయుడు మూర్ఛపోయి క్రింద బడినాడు. అతని బుద్ధి, చైతన్యము లోపించి నట్లయినది. అందువలన ఇప్పు డతడు ఏమియు మాట్లాడ జాల కున్నాడు'' అని చెప్పగా, ధృతరాష్ట్రుడు ''సంజయుడు మహా రథికు లయిన పాండవులను చూచి వచ్చినాడు కనుక వారు ఇతని మనస్సును మిక్కిలి ఉద్విగ్న పరచినా రని తోచు చున్నది'' అని యనెను.

''జనమేజయా! ఇంతలోనే సంజయుడు మూర్ఛనుండి తేరుకొని ఊరడిల్లి కౌరవసభలో ధృతరాష్ట్రునితో ని ట్లనెను:

''ధృతరాష్ట్ర మహారాజా! నేను మహారథికు లయిన పాండవులను చూచితిని. వారు అజ్ఞాతవాసము నం దున్నప్పుడు విరాటరాజు ఇంటిలో దాగి యున్నందువలన మిక్కిలి బక్కచిక్కి యున్నారు. రాజా! పాండవులు ఎవరెవరి సహాయమును పొంది యుద్ధమునకు సిద్ధ మయినారో, వారినిగూర్చి చెప్పెదను వినుము:

"అన్నిటికంటె ముఖ్య మయినది వారికి మహావీరుడయిన ధృష్టద్యుమ్నుని సహాయము పూర్తిగా నున్నది. దానిచేత పాండవులు బలవంతులై నీపైన దాడి సల్ప నున్నారు.

"మహారాజా! ధర్మాత్ము డయినపురుషుడు, రోష-భయ-లోభములచేత గాని, అర్థముకొరకు గాని, మరి యేయితర కారణములచేతగాని, సత్యమును విడువజాలడు. అట్లుండగా, ధర్మాత్ము లందరిలోను శ్రేష్ఠుడై, ధర్మమును ప్రమాణముగా తీసికొనుచున్న అజాతశత్రుని ప్రభావముచేతనే పాండవులు సన్నద్ధులై యున్నారు.

"రాజా! ఎవని బాహుబలమునకు ఈ దైనవాడు భూమండలములోనే మరి యొకడు లేడో, ఎవడు ధనుస్సు మాత్రమును ధరించి యుద్ధమునందు కాశీ-అంగ మగధ-కళింగాది దేశములయొక్క రాజుల నందరిని జయించి, తన వశములోకి

తెచ్చుకొనెనో, అట్టి భీమసేనుని బలముచేత పాండవులు మీపైన దాడి సల్పుటకు ప్రయత్నించు చున్నారు. ఎవని బలపరాక్రమములచేత పాండవులు వారణావత పురమునందు లక్కయింటినుండి బయల్వెడలి భూమండలమునందు జీవించి యున్నారో, ఎవడు మనుష్యభక్షణము చేయు హిడింబ రాక్షసునినుండి తనసోదరులను రక్షించి ఆ సంకటసమయమునందు పాండవులకు ద్వీపమువలె ఆశ్రయము నిచ్చెనో, అట్టిభీమసేనునిచేత పాండవులు యుద్ధమునకు పూనుకొనినారు.

"రాజా! సింధురాజయిన జయద్రథుడు ద్రౌపదిని అవమానించినపుడు గూడ భీముడే పాండవు లందరకిన్ని ఆశ్రయదాతగా నుండెను. ద్రౌపదియందలి ప్రేమచేత అతి దుర్గమము, భయంకరము నైన గంధమాదన పర్వత భూమియందు ప్రవేశించి 'క్రోధవశులు' అను రాక్షసులను చంపినవాడు భీమసేనుడే కదా! అతని భుజములలో పదివేల ఏనుగుల బలమున్నది. అ భీమసేనుని బలముచేతనే పాండవులు మీపైన దాడిసల్ప నున్నారు.

"రాజా! ఏ వీరాగ్రేసరుడు పూర్వము భగవంతు డయిన శ్రీకృష్ణునితో పోయి అగ్నిదేవునితృప్తికొరకు పరాక్రమించి, తనతో యుద్ధము చేయు దేవేంద్రునిగూడ నోడించెనో, ఎవడు త్రిశూలధారి యైన సాక్షాత్తు పరమేశ్వరునిగూడ యుద్ధములో సంతోషపరచెనో, ఏ వీరుడు సమస్తలోకపాలకులనుగూడ నోడించి వశపరచుకొనెనో, ఆ యర్జునుని బలము నాశ్రయించియే పాండవులు యుద్ధమునందు మీతో తలపడుటకు సిద్ధముగ నున్నారు.

"మహారాజా! అనేక వేల మ్లేచ్ఛులతో నిండిన పశ్చిమదిక్కును జయించి తన యధీనములో తెచ్చుకొనినవాడు, విచిత్ర పద్ధతులతో యుద్ధము చేయు నేర్పు గలవాడు నైన నకులుడు, యుద్ధమునకు సంసిద్ధుడై యున్నాడు. మాద్రీపుత్రుడయిన నకులుడు మహాధనుర్ధరుడు. మిక్కిలి అందమయిన వీరుడు. ఆ నకులుని బలముచేతనే పాండవులు మీపైన దాడి సల్ప నున్నారు.

''రాజా! యుద్ధమునందు, కాశీ-అంగ-మగధ-కళింగదేశరాజులను జయించిన మహావీరు డైన సహదేవుని బలముచేత పాండవులు మీపైన ఆక్రమణము చేయుటకు సిద్ధముగ నున్నారు. భూమండలమునందు, అశ్వత్థామ-ధృష్టకేతు-రుక్మి-ప్రద్యుమ్నులు" మాత్రమే సహదేవునికి ఈడైన పరాక్రమశాలురు. పాండవులలో చిన్నవా డైన ఆ సహదేవునితో మీవారికి అత్యంత వినాశకర మైన యుద్ధము జరుగ నున్నది.

''రాజా! పూర్వము, పతివ్రత యైన కాశీరాజపుత్రి భీష్ముని చంపుటకు తీవ్రమైన తపస్సు చేసెను. ఆమె మరణించిన తరువాత పాంచాల రాజైన ద్రుపదునకు పుత్రికగా జన్మించెను. కాని, దైవవశమున, ఆమె మరల పురుషుడయ్యెను. అట్లు పురుషుడుగా మారిన పాంచాల రాజపుత్రుడు స్త్రీ-పురుష శరీరముల గుణములను, అవగుణములనున్ను గలిగి యున్నాడు. ఆ ద్రుపదపుత్రుడు యుద్ధోన్మాదముచేత పోరాడ బోవు చున్నాడు. అతడే కళింగ దేశీయ క్షత్రియులను జయించి యుండెను. అతని పేరు 'శిఖండి' అతనిని 'స్థూణాకర్ణుడు' అను యక్షుడు పురుషునిగా మార్చియుండెను. అతడు భీష్ముని వధకై జన్మించినాడు. అతని బలము చేత పాండుపుత్రులు యుద్ధమునకు సన్నద్ధు లై యున్నారు.

''రాజా! కేకయదేశ రాజకుమారులు అయిదుగురు సోదరు లున్నారు. వారు సర్వదా యుద్ధమునకు సిద్ధపడి యుందురు. వారు గొప్ప ధనుర్ధారు లైన వీరులు. వారి బలముతో పాండవులు యుద్ధమునకు ఉద్యుక్తు లై యున్నారు.

"రాజా! ఇంకను మీకు దీర్ఘబాహుడు, త్వరత్వరగా బాణప్రయోగము చేయువాడు, ధైర్యశాలి, సత్యపరాక్రముడు, వృష్ణివంశవీరుడు నైన యుయుధానునితో యుద్ధము చేయ వలసి యుండును మహాత్ము లైన పాండవులకు అజ్ఞాతవాసకాలమునందు ఆశ్రయ మిచ్చిన విరాటరాజుతో, మహారథికు డైన కాశిరాజుతోను మీరు యుద్ధము చేయ వలసి యుండును.

"మహారాజా! ద్రౌపదీపుత్రులు చూచుటకు బాలకులుగానే యున్నారు. కాని, యుద్ధభూమియందు వారిని జయించుటకు సాధ్యము కాదు. వారితో తలపడుట విషసర్పములను చెనకుట వంటిది. వారి బలముతో పాండవులు యుద్ధమునకు పూనుకొనినారు.

"రాజా! పరాక్రమునందు శ్రీకృష్ణునితో సమానుడు, ఇంద్రియ నిగ్రహమునందు యుధిష్ఠిరునితో తుల్యుడు నైన అభిమన్యుని సహాయముతో పాండవులు యుద్ధము చేసెదరు. అసమాన పరాక్రమశాలి, శిశుపాలపుత్రుడు, మహారథికుడు నైన ధృష్టకేతుడు యుద్ధ భూమి యందు కోపించి నిలిచినప్పుడు, శత్రువులకు సహించరానివాడుగా నుండును. అతడు ఒక అక్షౌహిణీ సేనతో వచ్చి పాండవులకు సహాయకుడుగా నిలిచినాడు. అలాగే అతని తమ్ముడు 'శరకర్షకుడు' అనువాడుగూడ అన్నతో కలిసి యుద్ధమునకు వచ్చియున్నాడు. ఆ యిద్దరు సోదరుల సహాయముతో పాండవులు మీతో పోరాడ పూనినారు.

"రాజా! జరాసంధపుత్రు లైన సహదేవ - జయత్సేనులు యుద్ధములో అసమానులు. వారు పాండవులకు సహాయము చేయుటకు వచ్చి యున్నారు. మహాపరాక్రమశాలి యైన ద్రుపదుడు పాండవుల కొరకు తన ప్రాణములను గూడ బలి యీయ దలచినాడు. అతడు గొప్ప సైన్యముతో పాండవులకు యుద్ధమునందు సహాయకుడుగా వచ్చి యున్నాడు. రాజా! వీరేకాక, తూర్పు - ఉత్తర దిక్కుల మహారాజులుగూడ నూర్లకొలదిగ వచ్చినారు. వారినందరిని ఆశ్రయించి యుధిష్ఠిరుడు యుద్ధ సన్నద్ధు డై యున్నాడు."

''జనమేజయా! ఈ విధముగా సంజయుడు పాండవ సహాయకులను గూర్చి చెప్పిన మాటలు విని ధృతరాష్ట్రుడు మరల సంజయునితో నిట్లనెను:

భీముని పరాక్రమము స్మరించి ధృతరాష్ట్రుడు దుఃఖించుట

''సంజయా! నీవు చెప్పిన వా రందరు ఉత్సాహవంతు లయిన మహా వీరులు. వీ రంద రొకయెత్తు. భీమసేను డొక్క డొకయెత్తు నాయనా! క్రుద్ధు డైన భీమసేనుని నుండియే నాకు, వ్యాఘ్రమును జూచిన లేడికి వలె మిక్కిలి భయము కలుగుచున్నది. సింహమునుండి భయపడిన యితర మృగములవలె నేను భీమసేనుని వలన భీతుడనై రాత్రియంతయు మేల్కొని వేడి నిట్టూర్పులను విడుచు చుందును. ఇంద్ర సమాన తేజస్సు గల భీమసేనునితో సమానుడు మన సేనలో ఎవడును నాకు కనబడుట లేదు. అతనిని ఎదిరించి యుద్ధమునందు సహించ గల వాడు మనలో నెవడును లేదు.

''సంజయా! భీముడు అసహన శీలుడు. వైరమును మరచిపోవక దృఢముగా జ్ఞప్తియం దుంచుకొనువాడు. అతని నవ్వులాటలు గూడ పరిహాసము కొరకు గాక, నవ్వుచు మాటాడిన మాటల ప్రకారమే సత్యముగా పని చేసి చూపును. మిక్కిలి ఉద్ధత మైన స్వభావము గలవాడు. అతడు వక్రదృష్టితో చూచుచు మిక్కిలి బిగ్గరగా గర్జించును. అతడు వేగమూ, ఉత్సాహమున్నూ గలిగి అత్యంత బాహుబల సంపన్ను డై యుండును. అతడు యుద్ధమునందు మూర్ఖు లయిన నా పుత్రుల నందరిని తప్పక చంపి తీరును.

''సంజయా! నా పుత్రులు గూడ మొండిపట్టు గలవా రగుట చేత వీరిని గదా ధారి యైన భీముడు, దండపాణి యైన యముడువలె యుద్ధమునందు చంప గలడు. స్వర్ణ వర్ణముగల భీముని ఉక్కు గదా దండము ఎనిమిది అంచులు

కలిగి బ్రహ్మదండమువలె పైకి లేచి యున్నట్లుగా నా మనో నేత్రముతో చూచు చున్నాను. బలము గల సింహము లేళ్ళ మందలో నిర్భయముగా తిరుగునట్లు, భీమసేనుడు మా సేనలో రొమ్ము విరచుకొని తిరుగ గలడు. బాల్యమునందు గూడ నా పుత్రులందరిలోను క్రూరపరాక్రముడు, అధిక భోజనుడు, అందరి కిన్ని ప్రతికూలముగా నడచువాడు, వేగశాలియు నైన భీమసేను డొక్కడే కనబడు చుండెను. అతడు నాకు జ్ఞప్తికి రాగానే నా హృదయము కంపించు చుండును. నా పుత్రులు దుర్యోధనాదులు బాల్యమునందు అతనితో ఆడుకొను చున్నప్పుడు గూడ కలహించు చుండిరి. అప్పు డతడు గజరాజువలె దుర్యోధనాదుల నందరిని మర్దించు చుండెను. నా పుత్రులు అతని పరాక్రమము చేత నెల్లప్పుడు క్లేశము నొందు చుండిరి. అన్న-దమ్ములలో భేద భావమున కంతటి కిన్ని భీమ పరాక్రము డయిన భీము డొక్కడే కారణము.

''సంజయా! భీమసేనుడు యుద్ధమునందు క్రోధముచేత ఒడలు తెలియక పదాతి-గజాశ్వసేనల నన్నింటిని యమునివలె కబళించు చున్నట్లు నాకు కనబడు చున్నాడు. అస్త్ర విద్యలో ద్రోణార్జునులతో, వేగమునందు వాయువుతో, క్రోధమునందు మహేశ్వరునితోను సమానుడుగా నున్న భీముని యుద్ధము నందు ఎవడు చంప గలడు?

"సంజయా! క్రోధఘూర్ణితు డైన భీమసేనుని సమాచార మంతయు వినిపింపుము. అతడు ద్యూత సమయమునందే నా పుత్రుల నందరిని చంప గలవా డై యుండెను. కాని, చంప లేదు. అదియే నేను గొప్ప లాభముగా తలచు చున్నాను. పూర్వము బలవంతులైన యక్ష రాక్షసులను భీమసేనుడు చంపెను, అట్టివాని వేగమును ఎవడు సహింపగలడు? సంజయా! బాల్యమునందు గూడ అతడు ఎప్పుడున్ను నా వశమునం దుండక, నా మాట వినక నా పుత్రులను మాటిమాటికి కష్టపెట్టు చుండెను. అట్టివా డిప్పుడు నా వశమునందు ఎట్లు ఉండ గలడు?

"సంజయా! అతడు భంగపాటు చెందినప్పుడు కూడ తల వంచుకొని యుండువాడు కాదు. ఎప్పుడున్ను వక్రదృష్టితోనే చూచు చుండెను క్రోధము చేత అతని కనుబొమ్మలు ఒండొంటితో ముడిపడి యుండును. అట్టి భీమసేనుడు

ఎట్లు శాంతపడును? గౌరవర్ణము (పసుపు, తెలుపు కలసిన రంగు) గలిగి, భీమసేనుడు తాటిచెట్టు ప్రమాణములో నెత్తుగా నుండును. అర్జునుని కంటె నతడు ప్రాదేశమాత్రము (జూనెడు) పొడవుగా నుండును. బలములో నతనికి సమానుడు మరియొకడు లేడు. అతడు స్పష్టముగా మాటాడడు. అతని కన్ను లెప్పుడు గూడ తేనెవలె పింగళవర్ణము కలవి యై యుండును. అతడు వేగములో గుఱ్ఱములను, బలములో గజములనున్ను మించి యుండును

"సంజయా! నేను బాల్యమునందే వ్యాసునినుండి భీమసేనుని యద్భుత రూపపరాక్రమముల వాస్తవ వర్ణనమును విని యున్నాను. రౌద్రుడు క్రూర పరాక్రమము గల వాడు నగు భీమసేనుడు యుద్ధభూమియందు కుపితు డై లోహ గదాదండముచేత మా రథములను, గజములను, కాల్బలములను, అశ్వములను గూడ నుగ్గు - నుగ్గు చేయ గలడు.

"సంజయా! సర్వదా క్రుద్ధు డై యుండు భీముడు యోధు లందరిలోను శ్రేష్ఠుడు. నా పుత్రులను పూర్వము అనేక పర్యాయములు కష్టపెట్టి అవమాన పరచుటను నే నెరుగుదును. అతని ఉక్కు గదాదండము పొడవుగా, లావుగా, పదు నైన అంచులు గలదిగా, సువర్ణ వర్ణము కలదిగాను నున్నది. అది నూర్ల కొలది పిడుగుల ధ్వనిని చేయు చుండును. ఒక్క దెబ్బతో అది నూర్లకొలది మందిని చంప గలదు అట్టి భీమసేనుని దెబ్బకు మావా రెట్లు తట్టుకొన గలరు?

"నాయనా! భీమసేనుడు ఒక అగాధమయిన అనంత సముద్రము వంటి వాడు. అట్టి సముద్రమును దాటుటకు ఏ యోడయు లేదు. శర (నీరు-బాణము) వేగముతో పారుచు, దాటుటకు అశక్య మైన భీమసేన సాగరమును మూర్ఖు లైన నా పుత్రులు దాట దలచు చున్నారు. భీమసేనుని పైకి పోవల దని నా పుత్రులకు సర్వదా చెప్పుచు గోలపెట్టు చుందును; కాని, వారు తాము యుద్ధ పండితులమను నభిమానముతో మూర్ఖు లై నా మాటలు వినరు, వారు వృక్షాగ్రమునందు ఉన్న తేనెను ఆశతో తీసికొన జూచెదరు. కాని, ఆ వృక్షాగ్రము నుండి విషమముగా క్రింద బడి అపాయము పొంద గల మని తలచరు.

"సంజయా! గొప్ప మృగము సింహముతో తలపడినట్లు, మనుష్య రూపములో నున్న యమునితో పోరాడుటకు యుద్ధభూమిలో నా పుత్రులు దిగు చున్నారు. వారిని దైవమే మృత్యువు కొరకు పురికొల్పి పంపించెనని తలచెదను.

"సంజయా! భీమసేనుని గద నాలుగు చేతుల పొడవు గల దై యున్నది. అది ఒక ఉట్టిపైన నుంచ దగినది. ఆ గదయొక్క స్పర్శయే దుఃఖదాయకము. అట్టి గదను భీముడు నా పుత్రులపై ప్రయోగించినపుడు, దాని దెబ్బను వా రెట్లు సహించ గలరు?

"సంజయా! భీమసేనుడు క్రోధాశ్రువులు రాల్చుచు, మాటి - మాటికి నాలుకతో పెదవులు తడిపికొనుచు గదను త్రిప్పుచు గజ మస్తకములను చీల్చుట కారంభించినపుడు, అతని యెదుట గర్జించుచున్న గజరాజులను గురి పెట్టి అతడు వానివైపు పరుగెత్తును. అప్పుడు ఆ గజములు భయపడి తిరిగి పారిపోవుచు బిగ్గరగా ఘీంకారము చేయును. ఆ నాదమునకు ప్రతిగా భీముడు సింహనాదము చేయుచు నా గజసేనలో దూరి వీరాగ్రేసరులను ఏరి - యేరి చంపు చుండును. ఆ సమయమునందు అగ్నివలె జ్వలించుచున్న భీముని చేతిలో నా పుత్రులు ఎట్లు జీవించి యుండ గలరు?

"సంజయా! భీముడు నా సేనలో దూరి, దానిని రెండుగా చీల్చుచు, తన రథమునకు దారి చేసికొని పోవుచు తన గదా దండము చేత నృత్యము చేయుచు, ముందుకు సాగుచున్నపుడు మహా ప్రళయ దృశ్యము అక్కడ కన బడును. మదగజము, పుష్పించి ఫలించిన వృక్షములను విరుగగొట్టుచు ముందుకు సాగు చున్నట్లు భీమసేనుడు సమర భూమి యందు నా పుత్రుల సేన నడుమ ప్రవేశించును.

"సంజయా! భీముడు రథికులను, సారథులను, అశ్వములను, ధ్వజములనున్ను నశింప జేయును. అశ్వసైనికులను గూడ భంగపరచును. గంగానది వరదలలో ఉప్పొంగి ప్రవహించుచు తన వేగముచేత తీరములందున్న అనేక వృక్షములను పడగొట్టు చుండు విధముగానే భీముడు యుద్ధభూమిలో ప్రవేశించి మా సైనికులను సంహరించ గలడు.

"సంజయా! భీమసేనుని వలన భయముచేత నా కొడుకులు, సేవకులు, నాకు సహాయకులుగ అనేక దేశముల నుండి వచ్చిన రాజులున్ను పారిపో యెదరు. బలవంతు డయిన మగధపతి జరాసంధుడు సమస్త భూమండలమును వశపరచుకొని బాధింప మొదలు పెట్టెను. అప్పుడు భీమసేనుడు శ్రీకృష్ణునితో బాటు జరాసంధుని యంతఃపురములోనికి పోయి అతనిని చంపెను.

''సంజయా! భీష్మని పరాక్రమము కారణముగా, అంధకులు, వృష్ణి వంశీయులును జరాసంధుని వశములో పడలేదు. అది కేవలము దైవయోగమే అనవచ్చును. అప్పుడు ధీరుడయిన భీముడు అతి త్వరగా అప్పటికి పోయి శస్త్రాస్త్రములు లేకయే జరాసంధుని చంపెను. ఇంతకు మించిన పరాక్రమము మరియొక టేది యుండును? సర్పము చాలకాలమునుండి కూర్చుకొని యుంచుకొనిన విషమును ఇతరులపై క్రక్కినట్లు, భీమసేనుడు చాలకాలముగా తనలో దాచుకొన్న పరాక్రమమును యుద్ధమునందు నా పుత్రులపైన ప్రయోగింపగలడు. ఇంద్రుడు వజ్రాయుధము చేత రాక్షసులను సంహరించినట్లు, భీముడు గదాదండము చేత నా పుత్రులను సంహరించ గలడు.

"సంజయా! అతనిని ఆక్రమించుట అసాధ్యము. అతని గమనమును ఎవ్వరున్ను ఆప లేరు. అతని వేగము, పరాక్రమమున్ను అతి తీవ్రము లయినవి. అతడు క్రోధముచేత కన్ను లెఱ్ఱ జేయుచు ఇటువైపే పరుగెత్తి వచ్చుచుండుటను నేను ప్రత్యక్షముగా చూచు చున్నట్లు నాకు తోచుచున్నది. అతడు గద, ధనుస్సు, కవచము, రథమున్ను విడిచి తన భుజములతోనే యుద్ధము చేసినను అతనిని ఎదిరించ గల పురుషు డెవడు? అతని బల పరాక్రమములను నా వలెనే భీష్మ-ద్రోణ కృపాచార్యులు గూడ ఎరుగుదురు. అట్లయినను ఈ శ్రేష్ఠ పురుషులు ధార్మికుల నియమములను తెలిసిన వారు గాబట్టి, యుద్ధమునందు నా పుత్రుల కొరకు ప్రాణత్యాగము గూడ చేయుటకు సంసిద్ధు లై మా సేన యొక్క పురోభాగమునందు దృఢముగా నిలిచెదరు.

"సంజయా! పురుషుని యదృష్టము అన్నిటికంటె ప్రబల మయినది. ఎందు కనగా, నాకు పాండవుల విజయము స్పష్టముగా తెలిసినప్పటికిని నేను పుత్రులను యుద్ధమునుండి ఆప లేకున్నాను. మహాధనుర్ధారు లైన భీష్మాదులు స్వర్గము నాశ్రయించి క్షత్రియ కీర్తిని రక్షించుచు ఘోర యుద్ధమునందు ప్రాణత్యాగము చేసెదరు. భీష్మాదులు మా పుత్రులయందు వలెనే పాండవులయందు గూడ సమాన ప్రేమ గలవారై యున్నారు. కౌరవ - పాండవు లిరువురున్ను భీష్మునకు ప్రేమపాత్రులు. ద్రోణ కృపాచార్యులకు శిష్యులు.

''సంజయా! భీష్మ - ద్రోణ - కృపాచార్యులు ముగ్గురు వృద్ధశ్రేష్ఠులు. అందుచేత వీరు మా ఆశ్రయమునందు ఉండి దాన యజ్ఞాది కర్మములు చేసిన వారు. వానికి ప్రత్యుపకారముగా వీరు యుద్ధమునందు దుర్యోధనుని వైపు ఉండెదరు. శస్త్రాస్త్రములు ధరించి క్షాత్ర ధర్మమును రక్షింప గోరు క్షత్రియులు, యుద్ధ మరణమే ఉత్తమ మని తలచెదరు. పాండవులతో యుద్ధము చేయ గోరు వారందరి విషయములో నాకు చాల దుఃఖము కలుగు చున్నది. విదురుడు పూర్వము ద్యూత సమయమునందు బిగ్గరగా అరచుచు సూచించిన నాశమే నేడు మాకు మూడి యున్నది.

''సంజయా! జ్ఞానము దుఃఖమును నశింప జేయ జాలదు. ప్రబల మైన దుఃఖమే జ్ఞానమును వశింప జేయు నని నాకు తోచు చున్నది. జీవన్ముక్తు లయిన మహర్షులు గూడ లోక వ్యవహారమునందు దృష్టి నుంచి సుఖ సాధనముల చేత సుఖమును, దుఃఖ సాధనములచేత దుఃఖమున్ను పొందుదురు. ఇట్లుండగా పత్నీ-పుత్ర - పౌత్ర - రాజ్య - బాంధవు లందరి యెడలను అనేక విధములుగా మోహవశు లై ఆసక్తు లైన వారి విషయమును గూర్చి చెప్ప వలసిన యవసరమే మున్నది?

''సంజయా! ఇట్టి మహా సంకటమునకు ప్రతీకారము నేను ఏమి చేయ గలను? ఎన్నిమార్లు నేను విచారించినను కౌరవుల వినాశమే నాకు గన బడు చున్నది. ఈ వినాశమునకు మొదటి కారణము జూద మాడుటయే. దానివలన కౌరవులపైన గొప్ప ఆపద రా నున్న దని తోచు చున్నది. రాజ్యైశ్వర్యము లందు ఇచ్ఛచేత మూర్ఖ దుర్యోధనుడు లోభవశు డై ఈ పాపములను చేసెను.

''సంజయా! అతి తీవ్రవేగముతో నడచు చున్న కాలము యొక్క నియమమే ఈ దుఃఖమును క్రమముగా కలిగించు చున్నది. ఈ కాలచక్రమునందు ఆకులవలె నేను అమర్చ బడి యున్నాను. అందుచేత నేను ఈ కాలచక్రమునకు దూరముగా పోవుట అసంభవము. సంజయా! ఇప్పుడు నేను ఏమి చేయుదును? ఎట్లు చేయుదును? ఎక్కడికి పోవుదును? మూర్ఖు లయిన కౌరవులు కాలవశములో చిక్కి నష్టపడబోవుచున్నారు.

''నాయనా! ఈ నా నూర్గురు పుత్రులు యుద్ధమునందు మరణించినచో నేను వశము దప్పి వీరి యనాథస్త్రీల దుఃఖధ్వనులను ఎట్లు విన గలను? హా! నాకు మృత్యువు ఎట్లు గలుగ గలదు? గ్రీష్మకాలమందు జ్వలించు చున్న అగ్ని వాయువు సహాయముతో ఎండుగడ్డిని, అడవిని గూడ కాల్చి భస్మీపటలము చేయునట్లు అర్జున సహితు డయిన భీముడు గదను ధరించి, నా పుత్రుల నందరిని చంప గలడు."

ధృతరాష్ట్రుడు అర్జునుని ప్రతాపము వర్ణించుట :

"సంజయా! ఎవని నోటినుండి ఎప్పుడు గూడ అసత్యవచనము వెడలుట నేను వినలేదో, ఎవని పక్షమునందు అర్జునుని వంటి యోధు డున్నాడో అట్టి ధర్మరాజును త్రిలోకరాజ్యముగూడ వరించ గలదు. గాండీవధారి యైన అర్జునుని యుద్ధమందు ఎదిరించ గల వీరుని ఇంతవరకు నేను జూడ లేదు. వక్షస్స్థలమును చీల్చ గల కర్ణి-నాళీకాది బాణములను ఎడతెగక వర్షించు అర్జునుని ఎవడుగూడ యుద్ధమునలదు ఎదుర్కొన జాలడు

"సంజయా! బలవంతులలో శ్రేష్ఠుడు - అస్త్ర విద్యాపండితుడు-యుద్ధముసం దెప్పుడును ఓడనివాడు - మానవాగ్ర గణ్యుడు - వీరవరుడు నైన ద్రోణాచార్యుడు, కర్ణుడున్ను అర్జునుని ఎదుర్కొనుటకు ముందుకు సాగినను వారు అర్జునుని జయింప గల రనుటలో నాకు సందేహమే. కర్ణుడు దయాళువేకాక, ఏమరు పాటున్ను గలవాడు. ద్రోణాచార్యుడు వృద్ధుడేకాక, అర్జునునకు గురువు. కనుక, నాకు విజయము లభించనే లభించదు. అర్జునుడు సమర్థుడు, బలవంతుడు, అతని ధనుస్సు గూడ దృఢ మైనది. అతనికి సోమరితనము, అలసట యుండవు. అందుచేత అతనితో ఎంత భయంకర యుద్ధమయినను అతనికే విజయము గల్గును.

"సంజయా! పాండవు లందరున్ను అస్త్ర విద్యయందు పరిపూర్ణ జ్ఞానము కలవారు. ఆ వీరులకు గొప్ప యశస్సు ఉన్నది. స్వర్గలోకైశ్వర్యమును గూడ పాండవులు విడువ గలరు గాని, తమ విజయమును విడువ లేరు. సంజయా! కర్ణుడు, ద్రోణాచార్యుడున్ను వధింప బడిన తరువాత మా పక్షమువారు శాంతించెదరు. అర్జునుని మరణము తరువాత పాండవులున్ను శాంతితో నుండెదరు. కాని, అర్జునుని వధించ గలవాడు ఎవడు గూడ లేనే లేడు అతనిని జయింప గలవాడు ప్రపంచమునందు ఎవడున్ను లేడు. మూర్ఖు లయిన నా పుత్రుల యెడల అతని హృదయమునందు కలిగిన క్రోధము ఎట్లు శాంతించును? ఇతర యోధులు గూడ అస్త్ర ప్రయోగములను ఎరుగుదురు. కాని, వారు ఒకప్పుడు ఓడెదరు, మరియొకప్పుడు గెలిచెదరు. ఎల్లప్పుడున్ను విజయమునే సాధించు వాడు అర్జును డొక్కడే.

"సంజయా! ఖాండవ వన దహన సమయమునందు ముప్పది ముగ్గురు ముఖ్యదేవతలను అర్జునుడు యుద్ధమునందు గెలిచి అగ్ని దేవునకు తృప్తి

కలిగించెను. దేవతల నందరను ఓడించెను. (ఇచ్చట 'ముప్పది మూడు సంవత్సరముల వయస్సు గడచిన తరువాత అర్జునుడు ఖాండవ వనమునందు అగ్ని దేవుని పిలిచి తృప్తి పరచినాడు' అని కూడ కొందరు పండితులు వివరించెదరు.) అర్జునునకు అపజయము కలిగినట్లు నేటివరకు మాకు తెలియదు.

"సంజయా! అర్జునితో సమాన మయిన స్వభావము - ప్రవర్తనయు గల శ్రీకృష్ణుడు అర్జునునకు రథసారథ్యము చేయ గలడు. అందుచేత నింద్రునకు వలె అర్జునునకు గూడ యుద్ధమునందు విజయము నిశ్చిత మై యున్నది. కృష్ణార్జునులు ఏక రథమునందు కూర్చొనెదరు. గాండీవధనుస్సు యొక్క అల్లెత్రాడు సంధింప బడి యుండును. ఈ మూడు తేజస్సులు ఒకటిగానే, ఒకచోటనే కూడి యున్న వని నేను వినినాను. మాకు అటువంటి ధనుస్సు గాని, యోధుడు గాని, సారథి గాని లేరు. దుర్యోధనుని వశములో ఉండి మూర్ఖు లయిన మావారు ఈ విషయమును తెలిసికొన లే కున్నారు.

"సంజయా! మండు చున్న పిడుగు తలపైన పడిన వాడుగూడ ఒకవేళ బ్రతుక వచ్చును కాని, అర్జునుని బాణము తగిలినవాడు జీవితుడుగా నుండ జాలడు. యుద్ధమునందు బాణ ప్రయోగము జేసి, యోధుల ప్రాణములను హరించుచు, బాణవర్షము ద్వారా యోధుల శరీరములనుండి మస్తకముల వరకు చీల్చు చున్నట్లుగా అర్జునుడు నాకు తోచు చున్నాడు. గాండీవ ధనుస్సునుండి వెడలిన బాణరూప మయిన తేజస్సు అన్ని దిక్కులయందు జ్వలించుచు నా పుత్రుల మహాసేనను యుద్ధమునందు కాల్చి భస్మము చేయ గలదు.

"సంజయా! శ్రీకృష్ణుడు సారథ్యము చేయు రథపు ధ్వనిని వినిన కౌరవ సైనికులు అర్జునుని వలని భయముచేత పీడితు లై అనేక విధములుగ భయార్తులగు చున్నట్లుగ నాకు స్పష్టముగ తోచు చున్నది. వాయువేగము చేత వృద్ధి జెందు చున్న అగ్ని అన్నివైపుల చుట్టు ముట్టి గడ్డివామిని కాల్చి భస్మము చేయునట్లు అర్జునుడు నా పుత్రులను దహించి వేయును. అర్జునుడు యుద్ధభూమి యందు రోషముతో బాణములను వర్షించును. ఆ సమయమునందు దైవము సృష్టించిన సర్వ సంహారక మయిన ప్రళయ కాలము సంప్రాప్తించినట్లు ఉండును. అప్పుడు అర్జునుని నుండి తప్పించుకొని పోవుట అసంభవము. అట్టి సమయమునందు నేను రాజభవనమునందు గూర్చొని కౌరవుల వివిధ దురవస్థలను గూర్చిన కథలను విను చుండెదను. ఆహా! రణముఖమునందు భరతవంశమునకు అన్ని వైపులనుండి వినాశము నిశ్చయముగా ప్రాప్తించినది కదా!"

కౌరవ సభలో ధృతరాష్ట్రుడు యుద్ధము వలన గలుగు భయమునుగూర్చి చెప్పి శాంతికొరకు సూచించుట

''సంజయా! పాండవులు పరాక్రమవంతులై విజయమును గోరుచున్నట్లు వారికి సహాయకులుగా వచ్చిన రాజులు గూడ విజయమును సాధించుటకు కంకణము కట్టుకొని, పాండవుల కొరకు తమ ప్రాణములను గూడ బలి యిచ్చుటకు సిద్ధముగ నున్నారు. సంజయా! నీవేకదా యిప్పుడు పాంచాల-కేకయ-మత్స్య-మాగధ-వత్స దేశీయ రాజులను గూర్చి నాకు జెప్పితివి? వీరందరు గూడ పాండవుల విజయమును గోరుచున్నారు. వీరేకాక, ఇచ్ఛా మాత్రముతో ఇంద్రాది దేవతలను, సమస్త లోకములను గూడ తన వశములో తెచ్చుకొనగలిగి, ప్రపంచ స్రష్టయైన శ్రీకృష్ణ భగవానుడు గూడ పాండవులకు విజయమును సాధించి యిచ్చుటకు దృఢనిశ్చయముతో నున్నాడు.

''సంజయా! శిని పౌత్రుడయిన సాత్యకి అర్జునుని నుండి సమస్త శస్త్రాస్త్ర విద్యలను అభ్యసించి యున్నాడు. అతడు గూడ యుద్ధమునందు విత్తనములను వలె, బాణములను నాటుచు పాండవ పక్షమున నిలిచి యున్నాడు. ఉత్తమాస్త్రజ్ఞానము గలిగి పరాక్రమశాలి యయిన రథికశ్రేష్ఠుడు ధృష్టద్యుమ్నుడు కూడా నా సేనలో దూరి యుద్ధము జేయును.

"నాయనా, సంజయా! నాకు యుధిష్ఠిరుని క్రోధమువలన, అర్జునుని పరాక్రమమువలన, నకుల సహదేవులవలన, భీమునివలనను చాల భయము గలుగుచున్నది. సంజయా! ఈ రాజుల చేత నా సేనామధ్యము నందు, దైవాస్త్రముల యొక్క వల పరచ బడినప్పుడు, మా సైనికులు దానిని దాట జాలక ఆ వలలో చిక్కుకొని పోయెదరు. అందుచేతనే నేను దుఃఖించు చున్నాను.

''యుధిష్ఠిరుడు అందమయిన వాడు. మననశీలుడు. లక్ష్మీసంపన్నుడు. బ్రహ్మర్షుల వంటి తేజస్సు గలవాడు. బుద్ధిమంతుడు. నిశ్చయ బుద్ధి గలవాడు, ధర్మాత్ముడు. మంచిమిత్రులు, మంత్రులున్ను గలవాడు. యుద్ధము చేయుటకు ప్రయత్నించువాడు. అనేక సైనికులు గలవాడు. మహారథికులయిన తమ్ముల చేత, వీరులయిన మామలచేతను సురక్షితుడు, ధైర్యవంతుడు, మంత్రాలోచనమును రహస్యముగ నుంచువాడు. పురుషులలో సింహసమాన పరాక్రముడు. దయ ఉదార స్వభావమున్ను గలవాడు. లజ్జాశీలుడు, సత్యపరాక్రమ సంపన్నుడు.

అనేక శాస్త్రజ్ఞాన సంపన్నుడు. మనో నిగ్రహము గలవాడు. వృద్ధులను సేవించువాడు, జితేంద్రియుడునై యున్నాడు. ఈ విధముగా సర్వసద్గుణ సంపన్నుడు, ప్రజ్వలితాగ్నివలె తపింప జేయువాడు నయిన యుధిష్ఠిరుని యెదుట యుద్ధము చేయుటకు ఏ మూర్ఖుడు పోవగలడు? చైతన్య రహితులయి మరణాసన్నులయిన ఏ మనుష్యులు మిడుతలవలె పాండవాగ్నిలో తెలిసి-తెలిసి పడి పోవుదురు?

''యుధిష్ఠిరుడు కప్పబడి అణగి యున్న సూక్ష్మాగ్నివలె నున్నాడు. నేను అసత్య వ్యవహారము చేత అట్టివానిని తిరస్కరించితిని. అందుచేత అతడు యుద్ధము చేసి నా మూర్ఖపుత్రులను తప్పక నశింప జేయును. పాండవులతో యుద్ధము కలుగకుండుటయే మంచిదని నేను తలచెదను సభాసదులారా! మీరందరు ఈ విషయమును బాగుగ తెలిసికొనుడు. యుద్ధమే యయినచో కురుకుల నాశము అవశ్యంభావి యగును. ఇదియే నా నిశ్చయము.

"దీనిచేతనే నా మనస్సుకు శాంతి కలుగును. మీ యందరికి గూడ యుద్ధము కలుగ కుండుటయే యిష్టమయినచో మనము శాంతి కొరకు ప్రయత్నించుదుము.

''సంజయా! యుధిష్ఠిరుడు యుద్ధప్రస్తావము చేత మనసు దుఃఖమునందు పడ వేయ జూచి ఉపేక్షింప జాలడు. అతడు నన్నే అధర్మ యుద్ధమునకు కారకునిగా తలచి నిందించు చున్నాడు. (అట్లుండగా నాచేతనే శాంతి ప్రస్తావము చేయ బడినప్పుడు అతడు నాతో ఏకాభిప్రాయమునకు రాకుండ నుండునా అని భావము)

"జనమేజయా! ఇట్లు చెప్పిన ధృతరాష్ట్రుని మాటలు విని సంజయుడాయనతో నిట్లు పలికెను.

సంజయుడు ధృతరాష్ట్రునకు అతని దోషములను సూచించి దుర్యోధనుని క్రమశిక్షణములో నుంచుమని చెప్పుట

''మహారాజా! నీవు చెప్పిన మాటయే మంచిది. యుద్ధమునందు గాండీవ ధనుస్సుచేత క్షత్రియ సముదాయమునకు వినాశమే కన బడు చున్నది. కాని,

బుద్ధిమంతుడ వయిన నీవు అర్జునుని బలపరాక్రమములను బాగుగ తెలిసి యున్నను, నీ పుత్రులకు వశుడ వై యెందు కున్నావో నేను తెలియ జాల కున్నాను. మహారాజా! నీవు స్వభావము చేతనే పాండవులకు అపరాధము చేయు వాడవుగ నున్నావు. కనుక, అప్పుడు నీవు మొదటి నుండియు పాండవులతో కపటముగనే వ్యవ్యహరించితివి.

"రాజా! తండ్రి స్థానమునం దుండి, మంచి స్నేహము కలిగి, మనస్సు నందు మిక్కిలి జాగ్రత్తతో వ్యవహరించు చున్నవాడు తన ఆశ్రితుల హితమునే సాధించ వలెను. ద్రోహచింత గలవాడు తండ్రి యని కాని, గురు వని కాని అనిపించుకొన జాలడు. మహారాజా! జూద మాడునప్పుడు నీవు నీ పుత్రుల నోటి నుండి 'ఈ వస్తువు జయించ బడెను. ఇది లభించెను. పాండవులకు పరాజయము కలుగు చున్నది' అను మాటలు వినుచున్నప్పుడు బాలకునివలె చిరునవ్వుతో నుంటివి. ఆ సమయమునందు పాండవులను గూర్చి యెన్నియో కఠిన వచనములు పలుక బడు చుండెను. కాని, 'నా కొడుకులు సమస్త రాజ్యమును గెలుచు చున్నారు!' అని యనుకొని నీవు నీ పుత్రులను ఉపేక్షించు చుంటివి. ఈ గెలు పంతయు నీ పుత్రుల భవిష్యద్వినాశమునకు, పతనమునకున్ను కారణ మగు నని నీవు తలచ కుంటివి. నీ దృష్టియే అటువైపు పారకుండెను.

''మహారాజా! కురు జాంగల దేశమే నీ పైతృక మయిన రాజ్యము. కాని మిగిలిన భూమండలమంతయు పాండవులే జయించిరి. దానిని నీవు పొందితివి. రాజా! పాండవులు తమ బాహుబలముచేత సంపాదించిన ఈ రాజ్యమును నీ పాదముల కడ సమర్పించిరి. కాని, అది నీవు గెలిచిన రాజ్యముగా తలచు చున్నావు. రాజా! పాండవులు అరణ్యవాసము చేయు చున్నప్పుడు, వారిని పరి హసించుటకు నీ పుత్రులు ఘోషయాత్ర యను సాకుతో అక్కడికి పోయి నప్పుడు, గంధర్వరా జైన చిత్రసేనుడు నీ పుత్రులను చెఱబట్టి తీసికొని పోయెను. వా రందరు గూడ ఓడలేని నీటిలో మునుగు చుండిరి. అప్పుడు వారిని అర్జునుడే విడిపించి తిరిగి తెచ్చెను.

''రాజా! పాండవులు ద్యూత క్రీడయందు మోసగింపబడి, ఓడిపోయి, అడవికి పోవు చున్నపుడు, నీవు బాలకుని వలె మాటిమాటికి చిరునవ్వుతో నీ సంతోషమును ప్రకటించు చుంటివి. అర్జునుడు అసంఖ్యాకము లయిన తీక్ష్ణ బాణములను వర్షించునప్పుడు సముద్రము గూడ శుష్కించి పోవును. అట్లుండగా అస్థి మాంసములతో గూడిన శరీరములనుండి పుట్టిన ప్రాణుల మాట ఎంత?

"రాజా! అర్జునుడు వీరులలో శ్రేష్ఠుడు. 'గాండీవము ధనుస్సులలో నుత్తమము సమస్త ప్రాణులలో శ్రీకృష్ణభగవానుడు శ్రేష్ఠుడు. ఆయుధములలో సుదర్శన చక్రము ఉత్తమము. ధ్వజములలో వానర ధ్వజము శ్రేష్ఠము' అని లోకమునందు స్పష్టమయిన విషయము. రాజా! ఈ సమస్త శ్రేష్ఠ వస్తువులను తన తోడ నుంచుకొని, శ్వేతాశ్వములు కట్ట బడిన రథమునందు ఆరూఢు డైన అర్జునుడు రణభూమియందు నిలిచి యున్నపుడు, అవి యన్నియు పైకి విజృం భించిన ప్రళయకాల చక్రమువలె మన నందరను తప్పక సంహరించ గలవు.

''రాజా! ఎవని వైపునుండి భీమార్జునుల వంటి యోధులు పోరాడు చుందురో, అట్టివాని యధికారమందే ఇప్పుడు సమస్త భూమండలము ఉండ గలదు. అతడే రా జగును. రాజా! నీ సేనలో చాల భాగము భీమసేనుని చేతిలోనే చావగలదు. దుర్యోధనాదులయిన కౌరవులు ఆపత్సముద్రములో మునుగుచున్న సేనను చూచుచునే తాము గూడ నశించెదరు. నీ కొడుకులు, వారిని అనుసరించిన రాజులున్ను భీమార్జునుల వలన భీతులై, ఎప్పుడు గూడ విజయమును పొందజాలరు.

''రాజా! మత్స్యదేశపు క్షత్రియులు ఇప్పుడు మిమ్ము ఆదరించరు. పాంచాల కేకయ - సాళ్వ - శూరసేన దేశీయ రాజులు, రాజకుమారులున్ను మిమ్ము అవమానపరచగలరు. వారందరున్ను అర్జునుని పరాక్రమము నెరుగుదురు. అందుచేత అతని పక్షమునందే చేరి యున్నారు.

"రాజా! ఈ రాజులందరు యుధిష్ఠిరుని యెడల భక్తిగల వారగుటచేత నీ పుత్రులను విరోధించుచుండెదరు. సర్వదా ధర్మ తత్పరులై యుండుటచేత పాండవులు వధకు, క్లేశమునకున్ను అర్హులు కారు. అట్టి వారిని సర్వదా విరో ధించుచు, దుర్యోధనుడు కష్టపెట్టుచుండెను. ఇప్పుడు గూడ ద్వేషభావముతోనే యున్నాడు. పాపిష్ఠుడయిన దుర్యోధనుని, అతని సహచరులనున్ను నీవు వశములో నుంచుకొన వలయును. నీవు మాటి మాటికి నిట్లు శోకింపకుము. జూదమాడు నప్పుడే నేను, విదురుడున్ను నీకు ఈ యుపదేశమునే చేసి యుంటిమి. కాని, నీవు వినలేదు. రాజా! నీవు పాండవుల బలపరాక్రమములను సవివరముగా తెలిసికొనియు, అసమర్థునివలె దుఃఖించు చున్నావు. ఇది యంతయు వ్యర్థము."

దుర్యోధనుడు ధృతరాష్ట్రుని ఆశ్వాసించుచూ స్వ-పర పక్షములోని ఉత్కర్షాపకర్షలను గూర్చి చెప్పుట

''జనమేజయా! ఇట్లు సంజయుడు చెప్పిన మాటలను ఆ సభలోనున్న దుర్యోధనుడు విని ధృతరాష్ట్రునకు ధైర్యము కలిగించుచు, తన ఉత్కర్షను, పాండవుల అపకర్షనున్ను గూర్చి ఇట్లు వర్ణించెను:

''మహారాజా! నీవు భయపడకుము. నీవు శోకించుట వలన మేము ఖేద పడుచున్నాము. నీకు శోకము తగదు. మేము శక్తి-సామర్థ్యములు గలవారము. యుద్ధభూమియందు శత్రువులను జయింప జాలుదుము మేము పాండవులను అడవికి పంపుచున్నప్పుడు, శత్రు రాష్ట్రములను నశింపజేయజాలు మహా సైన్యముతో శ్రీ కృష్ణుడిక్కడికి వచ్చియుండెను. అతనితోపాటు కేకయరాజపుత్రులు-ధృష్టకేతువు - ధృష్టద్యుమ్నుడు - అనేక రాజవీరులు గూడ నిక్కడికి వచ్చియుండిరి. వారందరు పాండవులకు అభిమానపాత్రులు. ఆ వీరులు శ్రీకృష్ణుని పెద్దరికములో నొక సంఘముగా చేరి వనమునందు మృగచర్మమును ధరించియున్న యుధిష్ఠిరుని యొద్దకు పోయిరి. నిన్ను బంధుమిత్ర సహితముగా మొదలంట పెరికి వేయుటకు ఇచ్ఛయించుచు, 'ధృతరాష్ట్రుని చేతినుండి రాజ్యమును తిరిగి తీసికొనుటయే మన కర్తవ్యము' అని నిర్ణయించిరి.

''మహారాజా! వారి యీ నిశ్చయమును నేను విని, మన సంబంధి-బాంధవుల వధ జరుగునని భయపడి, భీష్మ-ద్రోణ-కృపాచార్యుల కడకుపోయి వారితో నిట్లంటిని:

"మహాత్ములారా! శ్రీ కృష్ణుడు మన నందరిని పూర్తిగా నశింపజేయదలచుచున్నాడు. కాబట్టి, పాండవులు ప్రతిజ్ఞపైన కట్టుబడి స్థిరముగా నుండరని నాకు తోచుచున్నది. శ్రీ కృష్ణుడు విదురుని ధృతరాష్ట్రుని విడిచి మిమ్ము, మమ్ము కౌరవులందరిని చంపి, ఇది యంతయు నేకరాజ్యముగా చేసి దానిని యుధిష్ఠిరునకు ఇవ్వదలచుచున్నాడు. ఇట్టి పరిస్థితిలో నిపుడు మన కర్తవ్యమేమి? మనము పాండవుల పాదములపైనపడి వారి శరణము వేడవలెను. లేదా, శత్రువులకు వెన్నుచూపి పారిపోవలెను. అథవా, ప్రాణములయందు మోహము విడిచి శత్రువులను ఎదిరించవలెను. ఈ మూడింటిలో నొకదాని నిపుడు ఆశ్రయించవలెను.

"పితామహా! వారితో యుద్ధమునకు తలపడినప్పుడు మనకు తప్పక ఓటమి కలుగును. ఎందుకనగా, నిప్పుడు సమస్త రాజవీరులు యుధిష్ఠిరుని యధీనమునందు ఉన్నారు. ఈ రాజ్యమునందలి ప్రజలందరు మనను అసహ్యభావముతో చూచుచున్నారు. మన మిత్రులు గూడ మనయెడల కుపితులై యున్నారు. అందరు గూడ మనను ధిక్కరించుచున్నారు.

''తాతా! యిప్పుడు మనము తలవంచి యుండుటలో దోషము లేదు. దీని చేత మనకు ఎల్లప్పటికిన్ని శాంతి కలుగ గలదు. కాని, నా తండ్రి, ప్రజ్ఞాచక్షు (అంధుడు) వైన ధృతరాష్ట్ర మహారాజును గూర్చియే నాకు దుఃఖము కలుగుచున్నది.

"తాతా! నా కారణముచేత పాండవులకు ఎడతెగని దుఃఖము సంప్రాప్తమైనది. దానిని వారు సహించిరి. నా సోదరులు నన్ను సంతోషపరచుటకే, శత్రువులను సర్వదా బాధించిరి. ఈ విషయములన్నియు మీకు మొదటినుండియు తెలియును. ఈ కారణము చేత పాండవులు ధృతరాష్ట్ర మహారాజు కులమును, మంత్రి పుత్రసహితముగా మొదలంట నశింపజేసి, మనకు ప్రతీకారము (బదులు) చేయగలరు."

''మహారాజా! ఈ నామాటలు విని, భీష్మ-ద్రోణ కృపాశ్వత్థామలు, నేను చాలా చింతతో బాధపడు చున్నట్లు తెలిసికొని నన్ను ఊరడించుచు నిట్లనిరి:

''దుర్యోధనా! శత్రుపక్షమువారు మనయెడల ద్రోహము తలపెట్టినారని నీవు భయపడకుము. యుద్ధమునందు శత్రువులు మనను జయింప జాలరు. మాలో ఒక్కొక్కడే శత్రురాజుల నందరిని జయింపుటకు సమర్థుడు. వారిని రానిమ్ము. మా పదునైన బాణములచేత వారి పొగరు అణగించెదము. పూర్వము భీష్ముని తండ్రి శాంతను మహారాజు చనిపోయిన తరువాత, ఒక యుద్ధములో భీష్ము డొక్కడే రాజవీరుల నందరిని జయించెను. వారిలో చాలామందిని చంపెను. అప్పుడు ఆ రాజులు భయముచేత భీష్ముని శరణు వేడిరి. ఇప్పుడు భీష్ముడు మాతో గలిసి పూర్వముకన్న నెక్కువ సమర్థుడైనాడు. తప్పక ఇతడు శత్రువులను జయించ గలడు. ఇందుచేత నీవు భయపడవద్దు.''

"తండ్రీ! భీష్మాదులు పూర్వమే యుద్ధమునందు మనకు తోడ్పడుటకు దృఢనిశ్చయము చేసి యుండిరి. పూర్వము ఈ సమస్త భూమండల రాజ్యము

శత్రువుల అధీనములో నుండెను. ఇప్పుడు మన యధీనములోకి వచ్చెను. మన శత్రువులకు ఇప్పుడు యుద్ధమందు మనను జయించుటకు శక్తి చాలదు. సహాయకులు లేనందువలన పాండవులు రెక్కలు నరకబడిన పక్షులవలె పరాక్రమశూన్యులైనారు. మహారాజా! ఇప్పుడు ఈ భూమండలమంతయు మన యధికారములో నున్నది. మనము ఆహ్వానించగా వచ్చిన యీ రాజులందరూ మనతోబాటు సుఖ - దుఃఖములను పంచుకొనుటలో ప్రయోజనము గలదని అనుకొనుచున్నారు. మన సుఖదుఃఖములు తమవిగా భావించుచున్నారు.

"రాజా! ఈ వచ్చిన రాజులందరు నా విజయము కొరకుగాను మండుచున్న అగ్నిలో ప్రవేశించుటకు, సముద్రములో మునుగుటకున్ను సంసిద్ధులై యున్నారు. ఇట్లున్నప్పటికిన్ని నీవు శత్రువులను గూర్చిన అసత్య ప్రశంసలను విని ఉన్మత్తునివలె అగుచున్నావు. దుఃఖముతో, భయముతోను పలువిధములుగ బాధపడుచున్నావు. ఇది యంతయు జూచి ఈ రాజులు నిన్ను పరిహసించుచున్నారు ఈ రాజులలో ఒక్కొక్కడే పాండవులతో యుద్ధము చేయ గలనను విశ్వాసముతో నున్నాడు. అందుచేత నీకు భయపడ వలసిన యవసరము లేదు.

"రాజా! నా సైన్యము నంతటిని, ఇంద్రుడుగూడ జయింప జాలడు. దీనిని బ్రహ్మదేవుడుగూడ నశింప జేయ జాలడు. యుధిష్ఠిరుడు ఒక నగరమునుగూడ గోరక, ఐదు గ్రామములను మాత్రమే కోరుచుండుటను బట్టి అతడు నా సేనను, నా ప్రభావమును జూచి భయపడినాడు అని నిశ్చయముగా చెప్ప వచ్చును.

"రాజా! భీముడు చాల బలవంతుడని నీవు తలచుట గూడ పొరపాటే. ఎందుకనగా, నా ప్రభావమును పూర్తిగా నీవు తెలిసికొన లేదు గదా! యుద్ధమునందు భూమండలమందు నాతో సమానుడు ఎవడుగూడ ఇదివరకు లేడు, ఇప్పుడున్ను లేడు, ఇకనైనను ఉండ బోవడు. గదా యుద్ధమునందు నాకు మంచి అభ్యాసము - నేర్పు గలవు. గురుకుల క్లేశము ననుభవించి, అస్త్రవిద్య నభ్యసించి అందులో పండితుడనైనాను. కాబట్టి, భీమసేనునినుండి గాని, ఇతరులనుండి గాని మనకు భయపడ నక్కర లేదు.

"తండ్రీ! గదాయుద్ధమునందు దుర్యోధనునితో సమానుడు మరియొకడు లేడని బలరాముడు, నేను అతనియొద్ద గదా యుద్ధము నేర్చుకొన్నప్పుడు చెప్పినాడు. నేను యుద్ధమునందు బలరామునిసమానుడను. బలమునందు భూమండలములో నందరికన్న నధికుడను. యుద్ధమునందు భీమసేనుడు నా గదా ప్రహారము నెప్పుడుగూడ సహింప జాలడు. నేను భీమసేను నొక్కసారి కోపముతో గదతో కొట్టిన యెడల, ఆ దెబ్బకతడు వెంటనే యమలోకమునకు పోవ గలడు. గదా యుద్ధమునందు భీమసేనునితో తలపడవలెనని నేను చాలాకాలమునుండి కోరుచున్నాను నా గదా ప్రహారముచేత యుద్ధమునందు భీముని శరీరము ఛిన్నభిన్నమయి, యతడు ప్రాణములు విడిచి భూమిపై బడును. నా గదా ప్రహారముచేత హిమపర్వతముగూడ ఒక్కసారే చీలి పడిపోవును. ఈ విషయము భీమసేనునకు, కృష్ణార్జునులకుగూడ తెలియును. గదా యుద్ధమునందు ఈ దుర్యోధనునితో సమానుడు లేడని నిశ్చయముగ తెలిసికొనుము. అందుచేత రాజా! నేను తప్పక భీముని గదతో సంహరించ గలను. అతనివలన భయము నీకు అక్కర లేదు.

"మహారాజా! నేను భీమసేనుని జంపిన తరువాత అర్జున సమానులు అతనిని మించినవారునైన మన వీరులు పాండవులపైన బాణవర్షము గురిపించెదరు. భీష్మ - ద్రోణ - కృప - అశ్వత్థామ - కర్ణ - భూరిశ్రవస - భగదత్త - శల్య - సైంధవులలో నొక్కొక్క వీరుడే పాండవుల నందరను చంప గలవాడు. వీరందరు ఒకచో కలిసిన యెడల క్షణములో శత్రువుల నందరిని యమలోకమునకు పంప గలరు. ఒక్క అర్జునుడు మాత్రమే ఈ రాజులనందరిని ఓడించుటకు ఎట్లు సమర్థుడగును? నాకు దీనికి కారణమేదియు కనబడుట లేదు. భీష్మ ద్రోణ కృపాశ్వత్థాములు ప్రయోగించిన నూర్లకొలది బాణ సమూహములచేత కొట్టబడి అర్జునుడు వశము దప్పి మరణించును.

"రాజా! మా తాత భీష్ముడు తన తండ్రి శాంతనునికన్న అధిక పరాక్రమవంతుడు. అతడు బ్రహ్మర్షులతో సమానమైన ప్రభావముతో పుట్టినవాడు. అతని వేగమును దేవతలుగూడ సహించ జాలరు. రాజా! భీష్ముని చంప గలవారు ఎవరున్ను లేరు. ఎందుకనగా, అతనితండ్రి అతనియెడల ప్రసన్నుడయి 'నీవు నీ యిచ్ఛ లేక మరణించవు' అని వరము నిచ్చెను.

"రాజా! బ్రహ్మర్షియైన భరద్వాజముని వలన ద్రోణుడు కలశమునుండి పుట్టెను. మహారాజా! ద్రోణాచార్యునికంటె అధిక వీరుడైన అశ్వత్థామ అతనికి పుట్టి అస్త్రవిద్యలో పారంగతుడయినాడు. వీరిలో ముఖ్యుడయిన కృపాచార్యుడు గౌతమమహర్షి తేజస్సువలన రెల్లుగడ్డి వెన్నులనుండి పుట్టెను. అందు

వలన నితడు ఎవరికిని వధ్యుడు కా జాలడు. రాజా! అశ్వత్థామయొక్క తండ్రి, తల్లి, మేనమామ కృపాచార్యుడు ఈ ముగ్గురు అయోనిజులు. అశ్వత్థామగూడ మహాశూరుడు. ఈ నలుగురు మన పక్షమునం దున్నారు. వీరు దేవసమాన పరాక్రమము గలవారు. మహారథికులు. యుద్ధమునందు వీరు ఇంద్రునిగూడ పీడింప జాలుదురు. వీరిలో ఏ యొక్కరివైపుగూడ నర్జునుడు కన్నెత్తి చూడ జాలడు. కనుక ఈ నలుగురు కలిసి అర్జునుని చంప గలరు.

'"రాజా! భీష్మ-ద్రోణ-కృపాచార్యులతో సమాన పరాక్రమము గలవాడు కర్ణు డని నా యభిప్రాయము. కర్ణుడు పరశురామునియొద్ద అస్త్రవిద్యాభ్యాసము చేసెను. విద్య ముగిసిన తరువాత కర్ణుడు ఇంటికి పోవునపుడు శిష్యునికి అజ్ఞ యిచ్చుచు పరశురాముడు కర్ణునితో 'నీవు శస్త్రాస్త్రజ్ఞానములో నాకు సమాను డవు' అని చెప్పెను.

''రాజా! కర్ణుడు సహజకుండలములతో జన్మించెను. వానిచేత నతనికి శ్రేయస్సే కలుగును. కాని, దేవేంద్రుడు శచీదేవికొరకు ఆ కుండలములను యాచించెను. కర్ణుడు వానికి బదులుగా భయంకర మయిన అమోఘ 'శక్తి' యాయుధమును ఇంద్రునినుండి తీసికొని కుండలముల నిచ్చెను. ఆ శక్తి యాయుధముచేత సురక్షితుడుగా నున్న కర్ణుని యెదుట నిలిచి అర్జునుడు ఎట్లు బ్రతికి పోరగలడు? రాజా! విజయప్రాప్తి తప్పదు అని అరచేతిలోని పండువలె నాకు స్పష్టముగా కనబడు చున్నది.

"రాజా! భీష్మ పితామహుడు ప్రతిదినము పదివేల శత్రు వీరులను చంప గలడు. కాబట్టి, నా శత్రువులకు పూర్తిగా ఓటమి కలుగు నని స్పష్టముగా తెలియు చున్నది. రాజా! ద్రోణ-కృప-అశ్వత్థామలు గూడ భీష్మ సమానులు. వీరు కాక, 'సంశప్తకులు' అను క్షత్రియ సమూహము కూడ నా పక్షముననే యున్నాడు. వా రందరు 'మేము అర్జునుని గాని, లేక అర్జునుడు మమ్ము గాని చంపవచ్చును. అప్పుడే మా యుద్ధము ముగియును' అని దృఢ నిశ్చయ ముతో నున్నారు. వా రందరు అర్జునుని చంపుటకు పూర్తిగా తాము సమర్థుల మని తలచు చున్నారు. ఇట్టి పరిస్థితిలో నీవు పాండవుల వలన భయపడుచు ఎందుకు బాధపడుచున్నావు?

''రాజా! భీమార్జునులు చంప బడిన తరువాత శత్రువులలో మనతో యుద్ధము చేయ గలవా రెవ రున్నారు? అట్టి వారు నీకు తెలిసినచో చెప్పుము. ఐదుగురు పాండవులు ధృష్టద్యుమ్నుడు. సాత్యకి- ఈ యేడుగురే శత్రువులలో బలవంతులయిన వీరులు. మనలో సమర్థు లయినవారు భీష్మ ద్రోణ-కృప-అశ్వత్థామ - కర్ణ - సోమదత్త - బాహ్లీక - భగదత్త (ప్రాగ్జ్యోతిషపతి) - శల్య - వింద - అనువింద (అవంతీ రాజకుమారులు)-జయద్రథ (సైంధవ) - దుశ్శాసన- దుర్ముఖ - దుస్సహ - శ్రుతాయుస్ - చిత్రసేన - పురుమిత్ర - వివింశతి - భూరిశ్రవస - వికర్ణులు ఉన్నారు. ఇట్లు మన పక్షము నం దున్న ప్రధాన వీరుల సంఖ్య, శత్రువుల ప్రముఖ వీరుల సంఖ్య కంటె మూడురెట్లు అధికముగా నున్నది.

''రాజా! నాకు పదకొండు అక్షౌహిణీ సైన్యములు ఉన్నవి. శత్రువులకు ఏడు అక్షౌహిణీ సేనలే యున్నవి. కనుక నాకు అపజయ మెక్కడిది? 'తమ సేనకంటె శత్రువుల సేన మూడింట ఒకవంతు తక్కువగ నున్నపుడు తప్పక యుద్ధము సేయ వలయును' అని బృహస్పతి యుద్ధనీతిని గూర్చి చెప్పినాడు. ఇప్పుడు నా సేన శత్రు సేనకంటె నాలుగు అక్షౌహిణుల సంఖ్య అధికముగ నున్నది. ఈ భేదము వలన నా సంపూర్ణసేన మూడింట ఒకటికంటె ఎంతయో యధికముగ నున్నది. రాజా! శత్రుసేనలు మన సేనలకంటె యనేక విధము లుగ తక్కువగా నున్నవి. నా సేన అన్ని విధముల మిక్కిలి శ్రేష్ఠముగా నున్నది. రాజా! ఈ విషయము తెలిసికొని నీవు వ్యాకులత్వము చెంది ధైర్యము విడువకుము."

"జనమేజయా! దుర్యోధనుడు ఈ విధముగా చెప్పి శత్రువుల పరిస్థితిని తెలిసికొనిన తరువాత, సమయోచితముగ చేయ వలసిన పనిని తెలిసికొనుటకు సంజయునితో, 'సంజయా! ఏడు అక్షౌహిణుల సైన్యము కలిగిన యుధిష్ఠిరుడు యుద్ధము చేయుటకు ఇప్పుడు ఎట్టి ప్రయత్నములను చేయు చున్నాడు?' అని ప్రశ్నింపగా సంజయు డిట్లు బదులు చెప్పెను:

సంజయుడు అర్జునుని గజాశ్వాదులను, ధర్మరాజాదుల యశ్వములనున్ను గూర్చి దుర్యోధనునకు వర్ణించుట :

"రాజా! యుధిష్ఠిరుడు యుద్ధము చేయ గోరుచు ప్రసన్నుడై యున్నాడు. అతని తమ్ములు భీమార్జున నకుల సహదేవులు గూడ భయపడుట లేదు. అర్జునుడైతేనో, అస్త్రప్రయోగమంత్రముల మహిమను పరీక్షించుటకుగాను దివ్య కాంతుల చేత సమస్త దిక్కులను ప్రకాశింప జేయుచున్న తన రథమును సిద్ధము చేసినాడు. మెరపుతో మెరయు చున్న మేఘము వలె ఆ రథము కనిపించు చున్నది. అతడు దివ్యాస్త్ర మంత్రములను జపించుచు నాతో, 'సంజయా! మేము యుద్ధమునందు తప్పక విజయమును సాధించెదము. ఆ విజయమునకు పూర్వచిహ్నము (సూచన) ఇప్పటినుండియే ప్రకటిత మగు చున్నది. చూడుము!' అని సంతసించుచు చెప్పెను. రాజా! అర్జునుడు సత్య మని చెప్పినది నేను గూడ ఆ రథమును చూచి తెలిసికొని నాను."

"ఆ మాట విని దుర్యోధనుడు, 'సంజయా! జూదములో ఓడిన పాండవులను అభినందించుచు మిక్కిలి, ప్రశంసించు చున్నావు. అర్జునుని రథమునకు ఎటువంటి అశ్వములు, ఎట్టి ధ్వజమున్ను కట్ట బడినవో చెప్పుము' అని యడుగగా, దానికి సంజయు డిట్లు బదులు చెప్పెను :

"రాజేంద్రా! విశ్వకర్మ యైన త్వష్ట - ప్రజాపతి యిద్దరు ఇంద్రునితో గూడి అర్జున రథ ధ్వజమునందు చిత్రవిచిత్రము మైన అనేక రూపములను రచియించినారు. ఆ ముగ్గురు, దేవమాయచేత ఆ ధ్వజమునందు బహుమూల్యములైన దివ్య విగ్రములను నిర్మించిరి అవి చిన్నవి కొన్ని, పెద్దవి కొన్నియు నున్నవి. వాయుపుత్రుడు హనుమంతుడు, అర్జునుని రథమును రక్షించుటకుగాను, యుద్ధ సమయమునందు ఆ ధ్వజమునందు తన స్వరూపమును స్థాపించ గలడు. ఆ ధ్వజము ఒక్క యోజనము (ఆమడ) వరకు అన్ని దిక్కుల యందు, పార్శ్వములయందు, ఆకాశమునందున్ను వ్యాపించి యున్నది. ఆ ధ్వజమును వృక్షములు కప్పికొనెను, అవి అడ్డుగా వచ్చినను, అది యెక్కడ గూడ తగుల్కొన కుండునట్లును విశ్వకర్మ మాయను దానిపైన ఆవహింప జేసి యున్నాడు. ఆకాశమునందు వివిధ వర్ణములతో ప్రకాశించునట్టి ఇంద్రధనుస్సువలె ఆ ధ్వజము ప్రకాశించు చుండును. దాని రూపము అనేక విధములుగ కనపడు చుండును.

అగ్నితో గలిసిన ధూమము విచిత్ర తేజస్సు - రంగులున్ను గలదై అన్నివైపుల వ్యాపించి అకాశము వైపు సాగుచు పోవు చున్నట్లు విశ్వకర్మ ఆ ధ్వజమును నిర్మించెను. అందుచేత రథముపైన దాని బరువు పడకుండ నుండును. రథ గమనములో గూడ ఎట్టి అటంకము గలుగదు,

"రాజా! అర్జునుని రథమునందు వేగవంతము లయిన దివ్య శ్వేతాశ్వములు కట్టబడి యుండును. వానిని గంధర్వరాజైన చిత్రరథుడు అర్జునుని రథమునకుగాను ఇచ్చి యుండెను. రాజా! భూమ్యాకాశములు, స్వర్గాది లోకములేకాక మరి యెక్కడ నైనను ఆ యశ్వముల గమనము క్షీణించుట గాని, అడ్డగింప బడుట గాని యుండదు. అ రథమునందు నూరు గుఱ్ఱములు సర్వదా అమర్చ బడి యుండును. వానిలో ఏ యొక్కటి మరణించినను, పూర్వపు వరప్రభావముచేత దాని స్థానమునందు క్రొత్త గుఱ్ఱము పుట్టును.

"రాజా! యుధిష్ఠిరుని రథమునందు గూడ శక్తి గల శ్వేతవర్ణాశ్వములు, అటువంటివే కట్ట బడి యుండును. భీమసేనుని రథాశ్వముల రంగు ఎలుగుబంటి రంగువలె నల్లగా నుండును. భీముని రథమునందు అవి కట్ట బడినప్పుడు వాయు వేగము గలవై అతి తీవ్రముగా పరుగెత్తును.

"రాజా! అర్జునుడు ప్రసన్నుడై తన చిన్న తమ్ముడు సహదేవునకు ఇచ్చిన అశ్వముల యవయవములు విచిత్ర వర్ణములతో ప్రకాశించు చుండును. వాని పృష్ఠభాగము గూడ తిత్తిరి పక్షి (తీతువు పిట్ట) ఆకారముతో విచిత్రముగ నుండును. అవి అర్జునుని అశ్వములకన్నను ఉత్తమములు. అట్టి ఉత్తమాశ్వములను మిక్కిలి ప్రసన్నతతో సహదేవుని రథమునకుగాను అర్జునుడు ఇచ్చెను.

"రాజా! దేవేంద్రు డిచ్చిన ఆకుపచ్చ రంగు గల ఉత్తమాశ్వములు నకులుని రథభారమును వహించును. అవి వాయువువలె అతిబలము - వేగమున్ను కలవి. అవి వృత్రాసుర సంహారమునందు దేవేంద్రుని రథమునకు కట్ట బడిన గుఱ్ఱములవలె నుండును. వయస్సులో, బలపరాక్రమములలోను అవి పైన చెప్ప బడిన అశ్వములతో సమానములు. శీఘ్రముగా పరుగెత్తునవి. విచిత్ర రూపములు వర్ణములున్ను కలవి, ఉత్తమ జాతికి చెందినవియు నైన పెద్ద గుఱ్ఱములు అభిమన్యుని రథమునకు, ద్రౌపదీ పుత్రుల రథములకున్ను కట్ట బడి యున్నవి. అవి గూడ దేవత లిచ్చిన అశ్వములే."

సంజయుడు శత్రువుల యుద్ధ ప్రయత్నము చెప్పుట-ధృతరాష్ట్రుని విలాపము-దుర్యోధనుడు స్వపక్ష ప్రాబల్యము చెప్పుట-దానిపై ధృతరాష్ట్రునకు అవిశ్వాసము-సంజయుడు ధృష్టద్యుమ్న సందేశము చెప్పుట

''అట్లు సంజయుడు దుర్యోధనునకు చెప్పిన మాటలను విని ధృతరాష్ట్రుడు సంజయునితో 'సంజయా! పాండవుల హితమునకుగాను నా పుత్రునితో పోరాడుటకై వచ్చిన రాజులను ఎవరెవరిని చూచితివి?' అని యడుగగా, సంజయు డిట్లు బదులు చెప్పెను :

"రాజా! అంధక - వృష్ణి వంశముల సేనలతో శ్రీకృష్ణుడు అక్కడకు వచ్చి నిలిచి యున్నాడు. అతనితో ఆ వంశపు చేకితాన - యుయుధాన - సాత్యకులు గూడ వచ్చి యున్నారు. ఆ యిద్దరు తమతో నొక్కొక్క అక్షౌహిణీ సేన తీసికొని వచ్చినారు. పాంచాల రాజైన ద్రుపదుడు, ధృష్టద్యుమ్న, సత్యజిత్తు మొదలైన పదుగురు వీరపుత్రులతో, శిఖండిచేత సురక్షితు డై ఒక అక్షౌహిణీసేనతో సంసిద్ధు డై యుధిష్ఠిరునకు సహాయము చేయుటకు వచ్చినాడు.

"రాజా! విరాటరాజు, 'శంఖుడు - ఉత్తరుడు' అను తన పుత్రులతో, 'సూర్యదత్త - మదిరాక్షాది' సోదరులతో, ఇతర పుత్రులతో, ఒక అక్షౌహిణీ సేనతోను, యుధిష్ఠిరునకు సహాయము చేయుటకు వచ్చి యున్నాడు. జరాసంధుని కొడుకు సహదేవుడు, చేది దేశరాజు ధృష్టకేతుడున్నూ వేర్వేరుగా ఒక్కొక్క అక్షౌహిణీసేనతో వచ్చి యున్నారు. రక్తధ్వజములు గల కేకయరాజపుత్రులైదుగురు సోదరులు ఒక అక్షౌహిణీ సైన్యముతో వచ్చియున్నారు. పాండవుల పక్షమున ధార్తరాష్ట్రులతో పోరాడుటకు వచ్చిన యీ రాజులను నేను చూచినాను.

"రాజా! మనుష్య - దేవ - గంధర్వ - రాక్షసుల సేనా వ్యూహముల రచన నెరిగిన ధృష్టద్యుమ్నుడు పాండవుల సేనాముఖమునందు సేనాపతిగా నుండును. రాజా! శాంతను పుత్రుడైన భీష్ముని వధను శిఖండికి ఒప్పగించినారు. ఆ శిఖండికి సహాయకుడుగా విరాటరాజు, మత్స్యదేశీయ యోధులతో శిఖండి ననుసరించి యుండును.

"రాజా! మద్రదేశాధిపతి యైన శల్యుని వధించుట పాండవజ్యేష్ఠు డైన యుధిష్ఠిరునకు ఒప్పగించ బడినది. వారిద్దరు మాత్రమే ద్వంద్వ యుద్ధము

చేసెదరు. వా రిద్దరు సమానశక్తి కలవారు కారని అక్కడివారు కొందరు చెప్పుచున్నారు. సుయోధనుని, అతని నూర్గురు సోదరులను, అతని పుత్రులను, పూర్వ - దక్షిణ దిక్కులందలి కురుసేనలను గూడ వధించుట భీమసేనునకు ఒప్పగించబడినది.

"రాజా! అర్జునుని భాగము కర్ణుడుగా వారు నిర్ణయించినారు. కర్ణునివధయే కాక, అశ్వత్థామ - వికర్ణ - సైంధవాదులు అశక్యశక్తిసంపన్నులు. ఈ వీరు లందరివధ గూడ అర్జునునకు అప్పగింప బడినది. కేకయరాజు కొడుకులు అయిదుగురు సోదరులు తమ విరోధులను కేకయ దేశవీరులను వధించవలెనని నిర్ణయింప బడినది. మాలవ - సాళ్వ - త్రిగర్తదేశ సైనికులను, సంశప్తకులలో నిద్దరు ముఖ్యులను గూడ నర్జునుడు సంహరించ వలె నని నిర్ణయించ బడినది.

"రాజా! అభిమన్యుని భాగముగా, దుర్యోధన - దుశ్శాసనుల పుత్రులు, బృహద్బలరాజున్ను నిర్ణయింప బడినారు. సువర్ణధ్వజములు గల ద్రౌపదీ పుత్రులు, ధృష్టద్యుమ్నుడున్ను ద్రోణాచార్యులతో పోరాడెదరు. చేకితానుడు - సోమదత్తుడున్ను ద్వైరథ యుద్ధములో, సాత్యకి, భోజవంశీయ కృతవర్మతోను పోరాడెదరు. రాజా! నీ శ్యాలకు డైన శకునితో, ఇంద్రసమాన పరాక్రమశాలి సహదేవుడు యుద్ధము చేయును. శకునికొడుకు జూదరి యైన ఉలూకునితో, సారస్వత దేశీయ సైనికులతో నకులుడు పోరాడును. మీ పక్షమున యుద్ధము చేయుటకు వచ్చిన యితర వీరులతో పోరాడుటకుగాను పాండవులు తమలోని వీరులను వేర్వేరుగా పేర్కొని యుంచినారు. రాజా! ఈ విధముగా పాండవుల సేన వేరువేరుగా శత్రువధార్థమై విభజింప బడి యున్నది. ఇట్టి పరిస్థితిలో నీవు, నీ పుత్రులున్ను తీసికొనవలసిన చర్యలను జాగు చేయక తీసికొన వలెను."

"జనమేజయా! ఈ విధముగా సంజయుడు చెప్పిన మాటలు విని ధృతరాష్ట్రుడు మరల సంజయునితో నిట్లనెను :

"సంజయా! యుద్ధభూమిలో భీమసేనునితో యుద్ధము చేయ బోవుచున్న మూర్ఖులు, జూదరులు నైన నా కొడుకు లందరున్ను లేనివారితో సమానులు. భూమండలమునందలి సమస్త రాజులు యమునిచేత ప్రోక్షితులు (యజ్ఞమునందు బలి యిచ్చుటకు సిద్ధము చేయ బడిన పశువులు)గా చేయ

బడినారు. వా రందరు యుద్ధ మనెడు యజ్ఞమునందు గాండీవధనుస్సు అనెడు అగ్నిలో మిడుతలవలె పడి చచ్చెదరు. సంజయా! మనకు శత్రువు లైన పాండవులు సమరాంగణమునందు, అతి విశాల మైన మన సేనను కొట్టి పారద్రోలెదరు. అట్లు తరుమబడిన మన సేనను అనుసరించి, వారితో సహకరించి పోరాడ గల వారు మనలో నెవ రున్నారు?

''సంజయా! పాండవు లందరున్న అతిరథులు "అనేక ధనుర్ధారులతో యుద్ధము చేయ గలవారు,) శూరులు, కీర్తిమంతులు, ప్రతాపవంతులు, సూర్యాగ్నులతో సమాన మైన తేజస్సు గలవారు, యుద్ధమునందు విజయము సాధించువారు నై యున్నారు. వారికి నాయకుడు యుధిష్ఠిరుడు, శ్రీకృష్ణుడు సంరక్షకుడు, భీమార్జునులు ప్రముఖ యోధులుగా నున్నారు. వీరేకాక, నకుల - సహదేవ - ధృష్టద్యుమ్న - సాత్యకి - ద్రుపద - ధృష్టకేతు - సుకేతులు పాంచాల దేశీయు డైన ఉత్తమౌజుడు, దుర్జయు డైన యుధామన్యుడు, శిఖండి. క్షత్రదేవుడు, విరాట రాజకుమారుడు ఉత్తరుడు, కాశీ - చేది - మత్స్యదేశ సైనికులు, సృంజయవంశీయులైన క్షత్రియులు- విరాట కుమా డైన బభ్రుడు, పాంచాల దేశీయు లైన ప్రభద్రకగణమువారు గూడ పాండవుల పక్షమునందు ఉన్నారు.

''సంజయా! ఇట్టి యుద్ధసాధన సంపత్తి గల పాండవుల యిచ్ఛ లేక దేవేంద్రుడు గూడ ఈ భూమండలమును అపహరింప జాలడు. వీరులు - రణధీరులు - పర్వతములను గూడ ఛేదించ గలవారు - దేవసమాన ప్రతాపము గలవారు - సమస్త సద్గుణ సంపన్నులు నైన పాండవులతో పోరాడుటకు దుష్టు డైన దుర్యోధనుడు కోరు చున్నాడు. నేను అరచుచు నెంత గోల చేసినను వినకున్నాడు.''

''జనమేజయా! ఈ మాటలు విని దుర్యోధనుడు తండ్రితో ని ట్లనెను;-

''నాయనా! కౌరవపాండవుల మిద్దరము ఏకజాతివారమే. ఈ భూమి యందే యుండువారమే. ఇ ట్లుండగా పాండవులకు మాత్రమే విజయము కలుగునని నీవెట్లు నిశ్చయించు చున్నావు? భీష్మపితామహుడు - ద్రోణాచార్యుడు- కృపాచార్యుడు - దుర్జయవీరు డైన కర్ణుడు - సైంధవుడు - సోమదత్తుడు - అశ్వత్థామ - వీ రందరు పరాక్రమవంతులు, ఉత్తమ ధనుర్ధరులు. దేవ సైన్యముతో నింద్రుడు వచ్చినను వీరిని ఓడింప జాల రనగా వీరికి పాండవు లెంత?

"తండ్రీ! యీ రాజవీరు లందరు నా హితమును గోరుచు పాండవులను ఓడింప జాలుదురు. నా పక్షము నందలి వీరులను పాండవులు కన్నెత్తియైన చూడ జాలరు. ఇట్టి నేను సపుత్రకులైన పాండవులతో తలపడి పోరాడ జాలుదును. నాకు ప్రియము చేయ దలచి వచ్చిన రాజవీరులు పాండవులను, లేళ్ళ కూనలను వలలో బంధించినట్లు బంధించి వేయ గలరు నా రథసేన చేత, నా సైనికుల బాణ పరంపరచేత, పాంచాల - పాండవులు తరుమ బడి పారిపోవుదురు.

''జనమేజయా! దుర్యోధనుని మాటలు విని ధృతరాష్ట్రుడు సంజయునితో ని ట్లనెను:

''సంజయా! నా కొడుకు పిచ్చివానివలె వదరు చున్నాడు. ఇతడు యుద్ధములో యుధిష్ఠిరుని ఎప్పుడు గూడ జయించ జాలడు. ధర్మజ్ఞులు-మహాత్ములు నైన పాండవులను గూర్చి, వారి పుత్రులను గూర్చి, వారి బలమును గూర్చియు భీష్ముడు బాగుగా నెరుగును. అందుచేతనే, పాండవులతో యుద్ధము చేయుటకు భీష్ముడు ఇష్టపడ కున్నాడు. సంజయా! నీవు మరల పాండవుల యుద్ధ చర్యలను గూర్చి నాకు చెప్పుము. వేగవంతుడు - పరాక్రమవంతుడు - మహాధనుర్ధరు డై అగ్నిలో నేయి పోయుచు ప్రజ్వలింప జేయు చున్నట్లు, పాండవులను మాటి మాటికి ఉత్తేజపరచు చున్న ఆ వీరు డెవడో చెప్పుము.''

ఈ మాటలకు సంజయుడు ధృతరాష్ట్రునితో, ''రాజా! ధృష్టద్యుమ్నుడు సర్వదా పాండవులతో-

"పాండు పుత్రులారా! మీరు యుద్ధము చేయుడు. యుద్ధమువలన భయపడవద్దు. దుర్యోధనుని పక్షమున మీతో పోరాడుటకు వచ్చిన వీరుల నందరిని, వారి బంధుమిత్ర సహితులనుగా, నే నొక్కడనే, మహామత్స్య మైన 'తిమి' చిన్న - చిన్న చేపలను మ్రింగినట్లు, నా యధీనములో తెచ్చుకొనెదను. భీష్మ-ద్రోణ - కృప - కర్ణ - శల్య - సుయోధనాశ్వత్థామలను, తీరము సముద్రమును ఆపినట్లు ఆపివేసెదను'' అని చెప్పుచు వారిని ఉత్తేజపరచు చుండును.

''రాజా! ఇట్లు చెప్పుచున్న ధృష్టద్యుమ్నునితో యుధిష్ఠిరుడు ఇట్లనెను:

''వీరాగ్రేసరా! మేము - పాంచాలురు - ఇతర వీరు లందరున్న నీ ధైర్యపరాక్రమముల నాశ్రయించియే యుద్ధమునకు సన్నద్ధుల మైనాము. కాబట్టి

నీవే యీ యుద్ధమునుండ మ మ్మందరిని ఉద్ధరింపుము. నీవు క్షత్రియధర్మము నందు స్థిరముగా నిలిచి యున్నావు. యుద్ధము చేయ గోరి నీ యెదుట వచ్చిన కౌరవుల నందరిని నీ వొక్కడవే చెరబట్టుటకు సమర్థుడ వని నాకు బాగుగా తెలియును. నీవు చేయ వలసిన కార్య మంతయు మా మేలుకొరకే కా గలదు. పోరాడ జాలక పారి పోవు చున్న శత్రు వీరులలో నెవడు యుద్ధభూమిలో తన యెదుట నిలిచి శరణు వేడునో యట్టివాని భయము పోగొట్టి, యతనికి వేలకొలది సంపద యిచ్చి యైనను, నతనిని కొన వలెను. (తన పక్షములో చేర్చుకొన వలెను.) ఇది నీతి శాస్త్రజ్ఞులమతము. నరశ్రేష్ఠా! నీవు శూరుడవు, పరాక్రమవంతుడవు, యుద్ధములయందు భయార్తులను రక్షించువాడవు ననుటలో సందేహము లేదు."

''ధృతరాష్ట్ర మహారాజా! ఈ విధముగా యుధిష్ఠిరుడు చెప్పుచుండగానే, ధృష్టద్యుమ్నుడు నిర్భయముగా తన సందేశమును మీకు పంపుచు నాతో నిట్లనెను:

''సంజయా! దుర్యోధనుని పక్షమున యుద్ధము చేయుటకు వచ్చిన సమస్త దేశీయ రాజ వీరులతో, బాహ్లీక - కురువంశీయులతో, భీష్మ - ద్రోణాదివీరులతో, దుర్యోధనుని తోను నా యీ సందేశమును నీవు త్వరగా పోయి యిట్లు చెప్పుము :

''కౌరవులారా! సత్ప్రవర్తన చేత యుధిష్ఠిరుని వశపరచుకొనవలెను. (యుద్ధముతో కాదు.) దేవతలచేత రక్షింప బడు చున్న వీరాగ్రేసరు డైన అర్జునుడు మిమ్ము వధించునట్టి యవకాశము అతనికి రానీయకుడు. యుధిష్ఠిరునకు త్వరగా నతని రాజ్యభాగమును అర్పింపుడు. క్షమింపు మని, ప్రపంచ ప్రసిద్ధ వీరాగ్రేసరు డైన అర్జునుని వేడుకొనుడు.

"భూమండలమునందు అర్జునునితో సమాను డైన పరాక్రమవంతుడు మరి యొకడు లేడు. అతడు సత్యపరాక్రముడు. అతని రథమును దేవతలు సర్వదా రక్షించు చుందురు. ఏ మనుష్యుడు గూడ అర్జునుని జయింప జాలడు. కాబట్టి మీరు యుద్ధప్రసక్తి తలంపకుడు.''

ఇట్లు సంజయుడు చెప్పిన ధృష్టద్యుమ్నుని సందేశము విని ధృతరాష్ట్రుడు సంజయునితో మరల నిట్లనెను:

ధృతరాష్ట్రుడు భీష్మాదులు యుద్ధము కోరుట లేదని చెప్పి శాంతిప్రయత్నము చేయుమనగా దుర్యోధనుని అహంకార ప్రదర్శనము- అతడు పాండవులను చంపెదనని ప్రతిజ్ఞ చేయుట-ధృతరాష్ట్రుడు ఇతర యోధులకు భయపడుట

''సంజయా! యుధిష్ఠిరుడు క్షత్రియ తేజస్సంపన్నుడు కౌమార వయస్సు (బాల్య యౌవనముల మధ్య వయస్సు) నుండియే విధిపూర్వకముగా బ్రహ్మచర్యమును పాలించు చున్నాడు. మూర్ఖు లైన నా పుత్రులు, దుఃఖించు చున్న నన్ను గమనింపక, అట్టి యుధిష్ఠిరునితో యుద్ధము చేయ తలపెట్టు చున్నారు.

''దుర్యోధనా! నీవు యుద్ధము చేయకుము. ఉత్తము డెప్పుడు గూడ యుద్ధము మంచి దని చెప్పడు. నీవు నీ బంధుమిత్ర మంత్రులతో సుఖముగా ననుభవించుటకు భూమండల రాజ్యములో సగము చాలును. తక్కిన సగము యుధిష్ఠిరునకు అర్పింపుము. నీవు పాండవులతో శాంతి - సౌఖ్యములతో నుండుటయే ధర్మ మని కౌరవు లందరు తలచు చున్నారు. పుత్రా! ఈ నీ సేన, నీ వినాశకాలమునకే సంప్రాప్తించినది చూడుము. ఈ విషయమును నీవు మూర్ఖత్వముచేత తెలిసికొన జాల కున్నావు.

''కొడుకా! నేను, భీష్ము డెవ్వరున్ను యుద్ధమును ఇచ్ఛయించుట లేదు. కౌరవ సైనికుల యభిప్రాయము గూడ అదియే. వారిమాట వినుము. యుద్ధమును నీ యిష్టముతో చేయుట లేదు. కర్ణ - శకుని - దుశ్శాసనులు నీతో చేయించుచున్నారు. వారు పాపాత్ములు. వారిమాట వినకుము.

ఈ మాటలకు దుర్యోధనుడు తండ్రితో ని ట్లనెను :

''తండ్రీ! భీష్మద్రోణాదులయందు గాని, యితర యోధులయందు గాని, యుద్ధ భారము వైచి పాండవులను యుద్ధమునకు నేను ఆహ్వానించలేదు. నేను, కర్ణుడు ఇద్దరమే ఈ ఈ యుద్ధ యజ్ఞమును ప్రారంభించి, యిందులో యుధిష్ఠిరుని యజ్ఞపశువును చేయ దలచినాము. ఈ యజ్ఞమునందు వేదిక రథము; స్రువము (యజ్ఞమునందు నేయి మున్నగు హోమ ద్రవ్యములను ఉంచి హోమము చేయుటకు వాడ బడుచిన్న కొయ్య గరిటె) ఖడ్గము; స్రుక్కు (ఇది గూడ హోమ ద్రవ్యములను ఉంచి హోమము చేయు కొయ్యగరిటె) గద; వృగ

చర్మము కవచము; రథ భారమును మోయు నా నాలుగు గుఱ్ఱములు నలుగురు హోతలు (హోమము చేయువారు); దర్భలు బాణములు; మా కీర్తియే హవిస్సు (హోమము చేయబడు ద్రవ్యము).

"రాజా! మే మిద్దరము యుద్ధభూమియందు ఈ యజ్ఞముచేత యముని తృప్తిపరచెదము ఇందులో విజయలక్ష్మితో మేము తిరిగి రాజధానికి వచ్చెదము. తండ్రీ! నేను, కర్ణుడు, దుశ్శాసనుడున్ను కలిసి యుద్ధమునందు పాండవులను సంహరించెదము. ఈ రాజ్యమునకు శాసకుడ నయ్యెదను లేదా, నన్నైనను చంపి పాండవులు ఈ రాజ్యభోగమును అనుభవించెదరు. రాజా! నేను జీవనమును - రాజ్యమును - ధనమునైనను విడువ జాలుదును గాని, పాండవులతో కలిసి యెప్పుడుగూడ నుండ జాలను సూదిమొన మోపినంత మేర భూమిగూడా నేను పాండవుల కీయను."

దుర్యోధనుని మాటలు విని సభాసదులతో ధృతరాష్ట్రుడిట్లనెను :

"నాయనలారా! నేను దుర్యోధనుని విడిచినాను. కాని, యమలోకమునకు పోవు చున్న ఆ మూర్ఖుని అనుసరించి పోవు మీలో కొందరినిగూర్చి దుఃఖించు చున్నాను. వ్యాఘ్రము లేళ్ళమందలో ప్రవేశించి పెద్ద - పెద్ద జింకలను పట్టి చంపునట్లే, యోధాగ్రగణ్యులైన పాండవులు, కౌరవులలో ప్రధానులను పట్టి సంహరించ గలరు. పతి చేత తిరస్కరింప బడిన భార్యను, దీర్ఘ బాహువులు గల పర పురుషుడు పట్టుకొని తన వశురాలిని చేసికొని నలిపినట్లు, దిక్కులేని యీ సేనను సాత్యకి, తన బాహుబలము చేత అధికారములో తీసికొని మర్దించె నని, ఆ సేన, నలుప బడినస్త్రీవలె మర్దింప బడి చెల్లాచెద రై యెదురు దిక్కుగా పారిపోవ జేయ బడుచున్నట్లున్ను నాకు తోచు చున్నది. మధువంశీయు డైన సాత్యకి యుధిష్ఠిరుని పరిపూర్ణబల వైభవములను ఇంకను పెంచుచు, కృషీ వలుడు చేలలో బీజములను నాటినట్లు, యుద్ధభూమిలో బాణములను నాటుచు నిలిచి యుండ గలడు.

"రాజవీరులారా! సేనయందు యోధుల యగ్రభాగమునందు భీమసేనుడు నిలుచును. యోధు లందరు నిర్భయముగా నతని యాశ్రయమునందు ఉండెదరు. భీముడు గజముల దంతములను విరిచి, కుంభస్థలములను పగులగొట్టి, నెత్తురు కారు చుండగా పడ గొట్టిన పర్వతములవంటి యేనుగులను చూచి

నప్పుడు దుర్యోధనా! నీవు, భీముని తాకుటకు గూడ భయపడుచు, నే నిప్పుడు చెప్పిన మాటలు తలచెదవు భీమునిచేత దహింప బడిన మన చతురంగ (రథ-గజ-తురగ-పదాతి) సైన్యములను, భీముడు మండు చున్న అగ్ని సాగినట్లు అతివేగముతో ముందుకు సాగు చున్నప్పుడు నా మాట నీకు జ్ఞప్తికి వచ్చును. మీకు చాల గొప్పభయము కలుగనున్నది. భీమునితోమీరు యుద్ధము చేయుటనాకు ఇష్టము లేదు. అతనితో మీకు యుద్ధమే సంభవించిన యెడల నతని గదా దండ మునకు మీరు ఆహుతి యై, యెల్లప్పటికిన్ని పరమశాంతితో దీర్ఘనిద్ర చెందెదరు. నరకి పడ వేయ బడిన మహా వనమువలె, భీమసేనుని చేత కొట్టి క్రింద పడవేయ బడిన కౌరవసేనను నీవు చూచినప్పుడు దుర్యోధనా! నా యీ మాటలను స్మరించెదవు."

జనమేజయా! యీ విధముగా ధృతరాష్ట్రుడు సభలో నున్న దుర్యోధనునకు, రాజులందరికిన్ని చెప్పి వారిని సమాధానపరచి, మరల సంజయునితో, "సంజయా! శ్రీకృష్ణ భగవానుడు, అర్జునుడున్ను చెప్పినమాటలు నాకు చెప్పుము. నేను నీ నోటినుండి వారి సందేశమును విన గోరు చున్నాను." అని యనగా సంజయు డిట్లు బదులు చెప్పెను:

మరల నడుగ బడిన సంజయుడు అంతఃపురమునం దున్న కృష్ణార్జునుల సందేశము వినిపించుట

"రాజా! కృష్ణార్జునులను నేను చూచిన విధమును, వారు మీకు పంపిన సందేశమునున్ను చెప్పెదను వినుము:

"నేను నీ సందేశమును వారికి వినిపించుటకుగాను వినయముతో తల వంచి నా పాదాంగుష్ఠములపై దృష్టి నిలిపి మెల్లగా అంతఃపురమునందు ప్రవేశించితిని. కృష్ణార్జునులు - సత్యభామా ద్రౌపదులు నున్న చోటికి అభిమన్యు కుమారుడు, నకుల-సహదేవులు గూడ పోవరు. ఆ యిరువురు మధుసేవ చేసి ఆనందముతో నుండిరి. చందన చర్చ చేసికొని యుండిరి. పుష్పమాలికలు - శ్వేతవస్త్రములు - దివ్యాభరణములున్ను అలంకరించుకొని యుండిరి, అనేక విచిత్ర రత్న భూషిత మైన, బంగారు సింహాసనము మీద కూర్చొని యుండిరి అక్కడ వివిధము లైన ఆస్తరణములు (పరుపులు) పరువ బడి యుండెను.

శ్రీకృష్ణుని పాదద్వయము అర్జునుని యొడిలో నుండెను. అర్జునుని ఒక పాదము ద్రౌపది యొడిలో, మరియొక చరణము సత్యభామయొడిలోను నుండెను.*

"రాజా! నే నక్కడికి పోవగనే యర్జునుడు, బంగారు పాదపీఠమునందు నన్ను కూర్చొను మనెను. దానిని నేను చేతితో తాకి భూమిపైన కూర్చుంటిని. పాదపీఠమునుండి తీయ బడిన యర్జునుని రెండు పాద తలములు (అరికాళ్ళు) శుభ లక్షణములు గలవిగా నుండెను. వా రిరువురు శ్యామవర్ణము గలవారు, అజానుబాహువులు యువకులు. మద్దిచెట్లబోదెలవలె వారి మూపులు ఎత్తుగా నుండెను. ఇరువురు ఒకే యాసనమునందు కూర్చొని యుండిరి. వారిని చూచిన తోడనే నాకు చాల భయము గలిగెను.

"రాజా! కృష్ణార్జునులు ఇంద్ర - విష్ణువుల వలె నుండిరి. మందబుద్ధి గల దుర్యోధనుడు భీష్మ - ద్రోణులయాశ్రయముచేత - కర్ణుని స్తుతుల చేతను వారిని తెలిసికొన జాల కున్నాడు. ఆ మహాత్ము లిరువురు నెవని యాజ్ఞను పాలించుటకు సర్వదా సంసిద్ధు లై యున్నారో, అట్టి యుద్ధిష్ఠిరుని మానసిక సంకల్పము తప్పక సిద్ధించు నని అప్పుడు నేను నిశ్చయించుకొంటిని. అన్న - పానాదుల చేత వారు నన్ను సత్కరించిరి. పిదప నేను తలపై దోసిలి ఉంచుకొని మీ సందేశము నంతయు వినిపించితిని, ధనుస్సుయొక్క అల్లెత్రాడు ఒరసికొనుటచేత కాయలు కాసిన హస్తములచేత అర్జునుడు శుభలక్షణ శోభితము లైన శ్రీకృష్ణుని పాదముల నొత్తుచు, నేను వినిపించిన నీ సందేశమునకు ఉత్తరము చెప్పు మని శ్రీకృష్ణుని ప్రోత్సహించెను.

"రాజా! వెంటనే కృష్ణభగవానుడు ఇంద్రధ్వజమువలె లేచి కూర్చొనెను. ఇంద్ర సమాన పరాక్రము డైన శ్రీకృష్ణు డప్పుడు సర్వాభరణ భూషితు డై భవ్యముగా వెలుగొందు చుండెను. ఆయన నా మనస్సునకు ఆహ్లాద కరముగా మృదు వైన మాటలతో పలుకరించి, మాట్లాడ మొదలిడెను. ఆ మాటలు నీ పుత్రులకు భయము కలిగించునవిగా నుండెను. శ్రీకృష్ణుని వాక్కు విన గలిగి

* ఇచట అర్జునుని పాద మొకటి ద్రౌపది యొడిలో, మరియొకటి సత్యభామ యొడిలోను నున్నట్లు వ్యాసుడు-
"అర్జునోత్సంగగౌ పాదౌ కేశవస్యోపలక్షయే।
అర్జునస్య చ కృష్ణాయాం సత్యాయాం చ మహాత్మనః॥" అని వ్రాసెను.

తిని. ధన్యుడనైతిని. ఆ మాటలలో నొక్కొక్క అక్షరముగూడ విజ్ఞానదాయక మై యున్నది. ఆ మాటలు మన యభీష్ట మైన యర్థమును ప్రతిపాదించునవిగా, మనస్సునకు మోహము కలిగించునవిగాను నున్నవి.

"రాజా! శ్రీకృష్ణ భగవాను డిట్లు నాతో చెప్పెను:

శ్రీకృష్ణుడు కౌరవులకు పంపు సందేశము

"సంజయా! నేను చెప్ప బోవు మాటలను ధృతరాష్ట్రునకు, భీష్మద్రోణులు విను చుండగా చెప్పుము. మా యిరువురి నమస్కారములు పెద్దలకు, మా కుశల ప్రశ్నము పిన్నలకున్ను తెలిపి, నీ మాటలకు నా ఉత్తరములను వారికి ఇట్లు వినిపింపుము:

''కౌరవులారా! మీకు మహాభయము వచ్చి యున్నది. కాబట్టి, యిప్పుడే వివిధ యజ్ఞములను చేయుడు. బ్రాహ్మణులకు విరివిగా దక్షిణలు సమర్పింపుడు. పత్నీ పుత్రులతో కలిసి ఆనందమును అనుభవింపుడు. సత్పాత్రులకు ధనదానము చేయుడు. మీ యిచ్ఛాపూర్తిగా పుత్రోత్పాదనము చేయుడు. మీ ప్రియ జనము లకు ప్రియ మైన పనులు ఇప్పుడే చేసికొనుడు. ఎందు కనగా, యుధిష్ఠిర మహా రాజు మిమ్ము జయించుటకు ఉబలాటపడు చున్నాడు.

''ద్రౌపదీ వస్త్రాపహరణ సమయమునందు- పూర్వము నేను చాల దూరమునందు ఉంటిని. అప్పుడు ద్రౌపది ఆర్తిచేత వివశురా లై 'గోవిందా!' అని పిలిచి నాతో మొర పెట్టుకొనెను. ఆ ఋణ భారము నాపై పడి యున్నది. ఆ ఋణము దినదినము పెరుగు చున్నది అపరాధు లైన కౌరవులను సంహరించక ఆ ఋణభారము నా హృదయమునుండి తొలగి పోవజాలదు.

"అజేయము - ప్రకాశమానము నైన గాండీవ ధనుస్సు గలిగి నాతో గలిసి యున్న అర్జునునితో మీరు వైరము తెచ్చి బెట్టుకుంటిరి. ఇంద్రునంతటివా డైనను వినాశకాలము సంప్రాప్తించి యున్ననాడే నాతో కలిసి యున్న అర్జునుని జయింప దలచును. అర్జునుని జయించుటకు పూనుకొనువాడు తన భుజములతో భూమిని పైకి ఎత్త జాలును. కుపితు డై సమస్త ప్రజలను భస్మము చేయ జాలును, సమస్త దేవతలను స్వర్గమునుండి క్రింద పడ వేయ జాలును. (అట్టి సమర్థుడే యర్జునుని జయింప గల డని భావము.)

"దేవ - రాక్షస - మనుష్య - యక్ష - గంధర్వ - సర్పములలోను యుద్ధమునందు అర్జునుని ఎదుర్కొన జాలినవానిని నేను ఇంతవరకు చూడ లేదు. ఈ విషయము మొన్న మొన్ననే విరాట నగరమునందు ఉత్తరగోగ్రహణయుద్ధ సమయములో అర్జునుడొక్కడే అనేకమంది వీరులను ఓడించిన విషయము వలన స్పష్టమయి యున్నది.

''బలము - వీర్యము - తేజస్సు - త్వరగా పని చేయునేర్పు - హస్తలాఘవము - దుఃఖరహితత్వమున్ను - అర్జునునిలో తప్ప ఇతరులయందు ఇన్ని సద్గుణములు కలిసి యుండుట దుర్లభము ''

"రాజా! ఇట్లు శ్రీకృష్ణుడు చెప్పిన మాటలు ఆకాశమునందు గర్జించు చున్న మేఘము (ఇంద్రుడు) వర్షించు చున్నట్లు ఉండెను. ఆయన చెప్పు చున్నప్పుడు అర్జునుడు సంతోషించు చుండెను. అర్జునుడు గూడ శ్రీకృష్ణుని మాటలనే సమర్థించుచు రెండవసారిగూడ వానినే తాను చెప్పెను."

''జనమేజయా! సంజయుని మాటలు విని ధృతరాష్ట్రుడు సంజయుని మాటలోని గుణదోషముల నిట్లు వివేచనము చేయ మొద లిడెను:

ధృతరాష్ట్రుడు స్వ - పర పక్షముల బలాబలము గుణ దోషములను సమీక్షించి చెప్పుట

"తన పుత్రుల విజయమును కోరు చున్న ప్రజ్ఞాచక్షువు తన బుద్ధిచేత, సంజయుని మాటలలోని గుణదోషములను అతి సూక్ష్మముగా సమీక్షించి యిరు పక్షముల సబలత్వ - దుర్బలత్వముల నిర్ణయము ఉన్న దున్నట్లుగా నిశ్చయించు కొనెను. తరువాత, గుణదోషముల దృష్ట్యా శ్రీకృష్ణుని మాటలు సర్వోత్కృష్టము లని తనకు విశ్వాసము గలిగినప్పుడు ఆ రాజు మరల కౌరవ పాండవుల శక్తిని గూర్చి యిట్లు విచారించుటకు ప్రారంభించెను:

"జనమే జయా! 'దైవ, మానవశక్తిచేత, తేజస్సు చేతను పాండవులు ఉత్కృష్టులని, కౌరవులు అల్పశక్తి గలవా రనియు, తెలిసినది' అని చెప్పి ధృతరాష్ట్రుడు దుర్యోధనునితో మరల ని ట్లనెను:

"దుర్యోధనా! నీ పక్షములు దుర్బల మైనందున నాకు గలిగిన చింత తొలగి పోవకున్నది. ఈ మాట అనుమానముతో నేను చెప్పుట లేదు. ప్రత్యక్షముగా చూచు చున్నాను గనుక నిదియే సత్య మని నిశ్చయించు చున్నాను.

"భూమండలమునకు నాశము కలిగించునట్టి దురాగ్రహము (మొండిపట్టు) చేయు చున్నావు - ఈ పని ధర్మవిరుద్ధము, దుష్కీర్తికరము, క్రూరత్వముతో నిండినది.

''నాయనా! పాండవులతో నీవు పోరాడుట నాకు ఏమాత్రము మంచిదిగా తోచుట లేదు. ప్రపంచమునందు ప్రాణు లందరున్ను తను పుత్రుల యెడల మిక్కిలి స్నేహముతో నుండెదరు. తమ శక్తి ననుసరించి తమ సంతానమునకు ప్రియము - హితమున్ను తండ్రులు చేకూర్చు చుండెదరు.

''ఈ విధముగానే తరుచుగా సత్పురుషులు తమకు ఉపకారము చేసిన వారికి ప్రత్యుపకారము చేసి, వారి యుపకార ఋణము తీర్చుకొనుటకు, వారికి మాటిమాటికి ప్రియము గలిగించు చుండెదరు.

"ఖాండవ వన దహనకాలము నందు అర్జునుడు తనకు చేసిన సహాయమునకు ప్రత్యుపకారముగా అగ్నిదేవుడు, భయంకర మైన కురు పాండవ యుద్ధము నందు తప్పక పాండవులకు సహాయము చేయును.

''పాండవుల పుట్టుక అనేక దేవతలవలన కలిగినది. కాబట్టి, దేవత లైన వాయు-ఇంద్ర-అశ్వినులు- సహాయము చేయుటకు పాండవులు వారిని పిలిచి నప్పుడు తప్పక వచ్చెదరు.

''భీష్మ ద్రోణ కృపాదుల వలని భయముచేత, పాండవులను రక్షింప గోరుచు దేవతలు భీష్మాదులయందు పిడుగువంటి భయంకర క్రోధము చూపెద రని నేను విశ్వసించు చున్నాను.

''దేవతలతో గూడిన పాండవులను ఎవరు గూడ కన్నెత్తి యైనను చూడ జాలరు. వారు సహజముగానే అస్త్ర విద్యాపారంగతులు-పరాక్రమవంతులు, అట్టి వారికి దేవతల సహాయము గూడ లభించినచో, ఇక చెప్ప వలసిన దే మున్నది?

''నాయనా! అర్జునునకు ఉత్తమ మైన గాండీవ ధనుస్సు, వరుణదేవు డిచ్చిన రెండు అక్షయ తూణీరములు, ఎక్కడగూడ అడ్డులేని వానర ధ్వజము అతని రథము ధూమమువలె అడ్డులేని గమనముతో అన్ని దిక్కులకు సముద్ర పర్యంతము సమస్త భూమండలమునందు సంచరించ గలదు. దానికి సమాన మైనది మరియొక రథము లేదు. దాని చక్రధ్వని మహామేఘ గర్జనమువలె విన పడును. ఆ ధ్వని పిడుగు చప్పుడువలె శత్రువుల మనస్సునందు భయము కలిగించును.

''అర్జునుడు అలౌకిక పరాక్రమ సంపన్ను డని అందరున్ను తలచెదరు. రాజు లందరు, అర్జునుడు దేవతలను గూడ యుద్ధమునందు జయించుటలో సమర్థుడు అని తలచెదరు అర్జునుడు రెప్పపాటు కాలములో అయిదునూర్ల బాణములను సంధించి, ప్రయోగించి, దూరమునం దున్న లక్ష్యములను గూడ కొట్టి పడ వేయ గలడు. కాని, అతని బాణములను సంధాన-ప్రయోగ-లక్ష్య పాతనముల సమయము లందు ఎవరుగూడ అంతరమును చూడ జాలరు.

''అర్జునుని విషయములో భీష్మ-ద్రోణ-కృప-అశ్వత్థామ-శల్యులు, ఇతరులున్ను, 'యుద్ధమునందు నిలిచి యున్న అర్జునుని జయించుట, మానవాతీత శక్తి గల రాజులకు గూడ అసంభవము' అని చెప్పుచుందురు. అర్జునుడు ఏక వేగముతో నైదునూర్ల బాణములను ప్రయోగించ గలడు. అతడు బాహుబలంబున కార్తవీర్యార్జునితో సమానుడు. ఇంద్ర-విష్ణు సమాన పరాక్రమశాలి యైన యర్జునుడు ఈ మహాయుద్ధము నందు శత్రుసేనలను సంహరించు చున్నట్లుగా నేను చూచు చున్నాను.

''నాయనా, దుర్యోధనా! ఈ విషయములోనే చింతించుచు - నాకు నిద్ర రా కున్నది. 'ఈ కురువంశము నందు శాంతి యెట్లు ఏర్పడును?' అను ఆ చింతతో నాకు సుఖము నశించి పోయినది. కౌరవులకు వినాశకాలము సంప్రాప్తమై యున్నది.

''నాయనా! ఈ యుద్ధమును నివారించుటకు సంధి తప్ప, వేరు ఉపాయము లేకున్నచో సంధి మాటయే మంచి దని నాకు తోచు చున్నది. పాండవులతో పోరాడుట మంచిది కాదు. పాండవులు కౌరవులకన్నను అధిక శక్తి గల వా రని నేను ఎల్లప్పుడున్ను అంగీకరించెదను.''

జనమేజయా! ఇట్లు తండ్రి చెప్పినమాటలు విని, మిక్కిలి అసహనశీలుడైన దుర్యోధనుడు మనస్సులో కోపపడుచు తండ్రితో నిట్లనెను:

తన మహిమ దుర్యోధనుడు తండ్రికి చెప్పుట

''రాజా! దేవతలు పాండవులకు సహాయకులుగా నున్నారు. కాబట్టి, వారిని జయించుట అసంభవ మని నీవు తలచుట మంచిది కాదు. నీ మనస్సు నుండి యిట్టి భయము తీసి వేయ వలెను.

"తండ్రీ! కామ (రాగ)-ద్వేష-మమకార-లోభ-ద్రోహము లనెడు దోషములు, దుష్టభావములున్ను లేనివా రగుట చేత దేవతలు దేవత్వమును పొందినారు. ఈ విషయమును పూర్వము వేదవ్యాసుడు-నారదుడు- పరశురాముడున్ను మనకు చెప్పియుండిరి. దేవతలు మనుష్యులవలె కామ-క్రోధ-లోభ-ద్వేష భావములతో ఎప్పుడు గూడ ప్రవర్తించరు. అగ్ని - యమ - వాయు - ఇంద్ర - అశ్వినుల వంటి దేవతలుగూడ కోరికలకు వశు లై అన్ని కార్యములయందు ప్రవర్తిల్లు వారైనచో, పాండవులకు దుఃఖము అనుభవించ వలసిన అవసరమే రాకుండెడిది. కాబట్టి నీవు చింత విడువుము. దేవతలు సర్వదా శమదమాది దివ్యభావములతో నుండెదరు గాని, కామక్రోధాదులైన రాక్షసభావములు దేవతలకు ఉండవు. ఐనను, ఒకవేళ దేవతలతోగూడ కామవశముచేత ద్వేషలోభాదులు కనపడిన యెడల, వారినుండి దేవత్వము తొలగి పోవును గాబట్టి. వారి శక్తి మనపైన ఏలాటి ప్రభావము చూప జాలదు.

"తండ్రీ! దేవతలలో దేవత్వమునకే కదా ప్రాధాన్యము ఉండును? నాకు గూడ దైవబలము ఉన్నది. సర్వదా సమస్త లోకములను దహించి భస్మము చేయుచు చుండు చున్న అగ్ని, నేను అభిమంత్రించినచో అన్నివైపుల నశించి చల్లారి పోవును. ఇదిగాక, దేవతలకు ఏదియో ఉత్కృష్టశక్తి ఉన్న దని తలిచినచో, అట్టిశక్తి వారికండె ఎక్కువ నాకు నున్న దని తెలిసికొనుము.

''చీలు చున్న భూమిని, పడిపోవు చున్న పర్వతశిఖరములనుగూడ నా మంత్రశక్తిచేత పూర్వస్థితిలో నుంచ గలను. స్థావర-జంగమరూప మైన సమస్త ప్రపంచమును నశింప జేయ గల శిలావృష్టి - సుడిగాలియు భయంకరముగా సంభవించినపుడు, అందరు చూచు చుండగా వానిని, ప్రజల యందలి దయచేత శాంతింప జేయ జాలుదును. నేను జలమును స్తంభింప జేసి, దానిపైన నా రథాశ్వగజాది సైన్యములను నడపింప జాలుదును. నేనొక్కడనే దైవాసుర శక్తులను రెంటిని గూడ ప్రకటింప గలుగుదును.

"అక్షౌహిణీసేనలతో నేను పోవదలచుకున్నచోట్లకు ఏ యాతంకము లేకుండ ఎక్కడికైనను, నా రథాశ్వాది సేనలు త్రోవ చేసికొని నా మంత్రప్రభావముచేత పోవ గలవు. నా రాజ్యమునందు భయంకర విష సర్పాదులు లేవు.

అట్టివి ఉన్నను, నా మంత్ర శక్తిచేత అవి యెప్పుడుగూడ జంతుహింస చేయ జాలవు. నా రాజ్య ప్రజలు సుఖముగా నుండెదరు. సకాలములో వానలు కురియును. ప్రజలు ధర్మ తత్పరు లై యుందురు. నా రాష్ట్రమునందు అతివృష్టి - అనావృష్టివంటి యీతిబాధలు ఉండవు.

‘‘రాజా! అశ్వినులు - వాయువు - అగ్ని - ఇంద్రుడు - సమస్త దేవతలు - యముడుగూడా, నా శత్రువులను రక్షింప జాలరు. ఒకవేళ ఈ దేవతలు నా శత్రువులను రక్షింప జాలి యుండినచో, పాండవులు పదమూడేండ్లు అరణ్యాజ్ఞాతవాస దుఃఖములను అనుభవించి యుండెడివారు కారు. నేను ద్వేషించినవానిని, దేవ - రాక్షస - గంధర్వాదు లెవ్వరుగూడ రక్షింప జాలరు. సత్యముగా చెప్పుచున్నాను. నేను నా శత్రు మిత్రుల విషయమునందు శుభా శుభములను తలచినప్పుడు, నా తలంపు పూర్వమెప్పుడుగూడ నిష్ఫలము కాలేదు. భవిష్యత్తు విషయములో గూడ నేను ‘ఇది యిట్లు జరుగును’ అని చెప్పినచో అది తప్పక యట్లే జరుగుచు వచ్చెను. కనుక నేను సత్యహక్కు గలవాడ నని అందరికిన్ని తెలియును.

‘‘రాజా! ఇప్పుడు నేను చెప్పిన విషయము లన్నియు ప్రజల కన్నుల యెదుట జరిగిన సత్యములు. నలువైపులందు ఈ నా శక్తి ప్రసిద్ధమై యున్నది. రాజా! నీకు ఊరట కలుగ వలె ననియే యిప్పుడు ఈ చర్చ చేసినాను. కాని, ఆత్మ ప్రశంసకొరకు గాదు. ఇంతకు ముందు ఎప్పుడుగూడ నేను ఆత్మ ప్రశంస చేసికొన లేదు. ఆత్మ ప్రశంస సత్పురుష లక్షణము కాదుగదా?

“రాజా! పాండవులు - మాత్స్యులు - పాంచాలురు - కేకయులు - సాత్యకి - శ్రీకృష్ణుడు - వీరందరు నాచేత జయింప బడినట్లు నీవు విన గలవు. నదు లన్నియు సాగరమును చేరి కలిసి పోవునట్లు, వీ రందరు బంధుమిత్రకళత్రాది పరివారములతోపాటు నా యెదుటికి వచ్చినప్పుడు నశించ గలరు. నా బుద్ధి, తేజస్సున్ను ఉత్తమములు, నా బలపరాక్రమ విద్యలు అధికములు, నా ప్రయత్నము పెద్దదియే. ఇవి యన్నియు నాకు పాండవులకన్న అధికములుగా నున్నవి. భీష్మ - ద్రోణ - కృప - శల్యాది వీరులకు గల శస్త్రాస్త్ర విద్యా పరిజ్ఞాన మంతయు నాకుగూడ నున్నది.”

జనమేజయా! యిట్లు దుర్యోధనుడు చెప్పిన మాటలు వినిన తరువాత, ధృతరాష్ట్రుడు, దుర్యోధనుని యభిప్రాయము యుద్ధేచ్ఛ గల దై యున్నదని

తెలిసికొనెను. ధృతరాష్ట్రుడు పూర్వమువలెనే అర్జునుని గూర్చిన ప్రశ్నమే మాటిమాటికి సంజయుని అడుగు చుండగా, కర్ణుడు ధృతరాష్ట్రుని లక్ష్య పెట్టక, దుర్యోధనుని సంతోషపరచుటకుగాను, కౌరవసభలో దుర్యోధనునితో ని ట్లనెను:

కర్ణుడు తన మహిమ చెప్పుట

‘‘రాజా! నేను పూర్వము పరశురామునితో బ్రాహ్మణుడ నని అసత్యము చెప్పి బ్రహ్మాస్త్రమును పొందితిని. అతని యొద్ద విద్యాభ్యాసముచేసి వచ్చునప్పుడు బ్రాహ్మణుడను కా నని తెలిసి, కోపించి ఆయన నాతో ‘కర్ణా! యుద్ధపు చివరి కాలమునందు బ్రహ్మాస్త్రము నీకు స్మృతికి రాకుండుగాక!’ అని యనెను. ఆ బ్రహ్మర్షి యొద్ద నేను మహాపరాధము చేసినప్పటికిన్ని, ఆ నా గురుదేవుడు నా యెడల గల మహానుగ్రహముచేత నాకు శాప మీయ లేదు. అట్లు కాకున్న ప్రచండ పరాక్రమశాలి యైన ఆ మహాముని సముద్రముద్రిత సమస్త భూమండలమును దగ్ధము చేసి యుండెడివాడు. నేను నా శుశ్రూషచేత, పౌరుషముచేతను ఆయన మనస్సు ప్రసన్నము చేసి యుంటిని. ఆ బ్రహ్మాస్త్రము ఇప్పుడు గూడ నాయొద్ద యున్నది. నా ఆయుస్సు గూడ నింకను మిగిలి యున్నది. కాబట్టి నేను పాండవులను జయించుటకు సమర్థుడను. కనుక, నీ యుద్ధభార మంతయు నాపైన నీవు మోపవలెను.

‘‘రాజా! నేను పరశురామ మహాముని యనుగ్రహముచే కనురెప్పపాటు కాలములో పాంచాల - కరూష - మత్స్యదేశీయ యోధులను, పుత్ర - పౌత్ర - సహితులనుగా పాండవులనున్ను సంహరించి శస్త్రవిద్యా ప్రభావముచే సశరీర స్వర్గసుఖమును అనుభవించెదను. భీష్మ పితామహుడు - ద్రోణాచార్యుడు - ముఖ్యు లైన యితర రాజవీరులున్ను నీయొద్దనే యుండ నిమ్ము. నేను నా సేనలతో పోయి యొక్కడనే కుంతీపుత్రు లందరిని చంపి వేయ గలను. ఈ భారము నాపైన విడువుము.”

జనమేజయా! యిట్లు చెప్పు చున్న కర్ణునిఅధిక్షేపించుచు భీష్ము డి ట్లనెను:

భీష్ముడు కర్ణు నధిక్షేపించుట

‘‘కర్ణా! నీ శౌర్యమును నీవే యేల ఇట్లు పొగుడుకొను చున్నావు? వినాశ కాలము నీ బుద్ధిని మ్రింగిన దని తోచు చున్నది. యుద్ధమునందు ప్రధానవీరుడ

నైన నేను మరణించిన తరువాత, ధృతరాష్ట్రపుత్రు లందరున్ను మృతప్రాయు లయ్యెద రని నీకు తెలియకున్నది.

"కర్ణా! శ్రీకృష్ణునితో కలిసి యర్జునుడు ఖాండవ వనమును దహించు నప్పుడు చూపిన పరాక్రమమును వినిన తరువాత నైనను, నీవు బంధుమిత్ర సహితముగా మనస్సును అణచుకొన వలసి యుండెను. నీకు ఇంద్రుడిచ్చిన శక్తి యాయుధము, యుద్ధమునందు శ్రీకృష్ణుని చక్రాయుధముచేత భిన్నమై భస్మ మగుట నీవు కనులారా చూచెదవు. నీవు ప్రతి దినము గంధపుష్పాదులచే పూజించుచు, యుద్ధ సమయమునందు ప్రకటిత మగు నని తలచుచు నీయొద్ద నుంచుకొనిన సర్పముఖబాణము అర్జునుని బాణసమూహములచే ఛిన్న భిన్న మై నీయొద్దనే అది నశించును. నీవంటివారిని, నీకంటే ప్రబల వీరులనున్ను యుద్ధము నందు సంహరించగలిగి, బాణాసురుని, భూపుత్రు డైన నరకాసురునిన్ని వధించ గలిగిన శ్రీకృష్ణభగవానుడు అర్జునుని రక్షించ గలడు.''

"ఆ మాటలు విని కర్ణుడు ఇట్లనెను:

కర్ణుడు భీష్ముని అధిక్షేపించి, అస్త్ర సన్యాసము చేయుట

''రాజా! వృష్ణికులస్వామి యైన శ్రీకృష్ణభగవానుని మహిమను గూర్చి చెప్పబడినది సత్యము. ఇంతయేకాక, అతడు ఇంతకంటెను అధిక ప్రభావము గలవా డనుటలో సందేహము లేదు. కొన్ని, నన్ను గురించి భీష్మపితామహుడు చెప్పిన కటు వచనముల పరిణామమును గూర్చి ఆయన వినుగాక! ఇప్పుడే నేను నా యస్త్రశస్త్రములను ఇక్కడనే ఉంచి పోయెదను భీష్ముడు, ఈ సభయందు గాని, యుద్ధభూమియందు గాని, నన్ను చూడ బోవడు. భీష్మా! నీవు శాంతించిన పిదపనే, రాజవీరు లందరు యుద్ధభూమియందు నా ప్రభావమును చూడ గలరు.''

జనమేజయా! మహాధనుర్ధరు డైన కర్ణు డిట్లు చెప్పి సభ విడిచి పోయెను. అప్పుడు భీష్మడు కర్ణుని పరిహసించుచు దుర్యోధనునితో నిట్లనెను:

భీష్ముడు కర్ణుని దుర్నీతిని గూర్చి మరల ఆక్షేపించుట

''దుర్యోధనా! చూచితివా, కర్ణు డెంతటి సత్యప్రతిజ్ఞుడో? తొలుత యుద్ధ భార మంతయు తానే భరించెద నని, పాండవులను జయించెద ననియు ప్రతిజ్ఞ

చేసి యిప్పుడు తోక ముడుచుకొని, పారి పోయెను. అంతటి మహాయుద్ధమును అత డొక్కడే యెట్లు భరించ గలడు?

"ఇప్పుడు మీ సేనతో పాండవులను ఎదుర్కొనుటకు మీ సేనను వ్యూహములుగా పన్ని యుద్ధము చేయుడు. వారు ఒండొరుల తలలు పగుల గొట్టుకొనెదరు. భీమసేనుని చేతిలో జరుగు సమస్త ప్రపంచ సంహారమును గూడ చూడుడు. 'అవంతీరాజు - కళింగరాజు - జయద్రథుడు (సైంధవుడు) - చేదిరాజు బాహ్లీకుడు - వీరందరు ఉండినను, నేనొక్కడనే వేనవేలు, అయుత (పదివేలు) యోధులను సంహరించెదను' అని కర్ణుడు చెప్పియుండెను. భగవంతుడు - అనింద్యుడునైన పరశురామునకు 'నేను బ్రాహ్మణుడ'నని అసత్యము చెప్పి బ్రహ్మాస్త్రమును అభ్యసించినప్పుడే ఆ నరాధముడైన కర్ణుని ధర్మము - తపస్సున్ను నష్టమైనవి."

జనమేజయా! కర్ణుడు ఆయుధములను విడిచి వెడలిపోవుట భీష్ము డిట్లు చెప్పుటయు జరిగినప్పుడు, మందబుద్ధియైన దుర్యోధనుడు భీష్మునితో నిట్లనెను:

దుర్యోధనుని స్వపక్ష ప్రాబల్య వర్ణనము :

"పితామహా! మేము, పాండవులున్ను విద్యాభ్యాస దృష్ట్యా సమానులము. ఇట్లుండగా నీవు పాండవులకు మాత్రమే జయము కలుగునని యెట్లు తలంచు చున్నావు? మేము వారున్ను బలపరాక్రమములలో, వయస్సులో, ప్రతిభలో, శాస్త్రపాండిత్యములలో, అస్త్రబలములలో, యోధులను చేకూర్చుకొనుటలో, వేగ ములో, హస్తలాఘవములో, జాతిలోను సమానులము. అందరము మనుష్యయోని సంభూతులమే. అట్లుండగా, పితామహా! పాండవులే జయము సాధించగలరని యెట్లు తెలిసికొన్నావు? నీవు - ద్రోణాచార్యుడు - కృపాచార్యుడు - బాహ్లీకుడు- ఇతర రాజవీరులు - వీరందరి పరాక్రమమునందు నేను విశ్వాసముంచి యీ యుద్ధమును ఆరంభించలేదు.

"మహారాజా! నేను - కర్ణుడు - దుశ్శాసనుడున్ను మా నిశిత (పదునైన) బాణములచేత పంచ పాండవులను సంహరించగలము. తరువాత, నేను వివిధ యజ్ఞములు చేసి, గోవులు - అశ్వములు - ధనములు - మొదలైన భూరిదక్షిణలు ఇచ్చి బ్రాహ్మణులను తృప్తిపరచెదను. లేళ్ళకూనలను వ్యాధుడు (కిరాతుడు) వలలో బంధించి యీడ్చుకొని పోవునట్లు, కర్ణధారుడు లేని నౌక, నావలో

నున్నవారిని జలప్రవాహములో ముంచునట్లున్ను, నా సైనికులు తమ బాహు బలముతో పాండవులను పీడించినప్పుడు, నా చతురంగ బలమును పాండవులు శ్రీకృష్ణుడున్ను చూచుచు తమ యహంకారమును విడిచెదరు."

దుర్యోధనుని యీ మాటలు విని విదురుడిట్లనెను :

దమమును గూర్చి విదురుని యుపదేశము :

"మహారాజా! దమమే (ఇంద్రియ నిగ్రహమే) శ్రేయస్సు పొందుటకు ముఖ్యసాధనము. 'దమము విశేషించి బ్రాహ్మణులకు ముఖ్యము, అదియే సనాతన ధర్మము' అని తత్వజ్ఞులైన వృద్ధులు చెప్పెదరు. దమము కలవానికే దానము-క్షమ - సిద్ధి - యివి కలుగును. ఎందుకనగా, దమ మొక్కటే 'దాన - జ్ఞాన - అధ్యయన - తపస్సులు' - ఈ యన్నిటిని సంపాదించి యిచ్చును. దమము తేజస్సును పెంచును. దమమే పవిత్రమైన సాధనము. దమముచేత పురుషుడు పాపరహితుడై, తేజోవృద్ధిని పొంది, చివరకు పరమాత్మ ప్రాప్తిని సాధించగలడు. హింసించు మృగములను జూచి సర్వప్రాణులు భయపడునట్లు, దమములేని పురుషుని జూచినప్పుడు గూడ ప్రాణులందరికి భయము కలుగును.

''రాజా! అట్టి దమరహితులు చేయు హింసలు మొదలైన దుష్కర్మల నుండి రక్షించుటకు బ్రహ్మదేవుడు క్షత్రియజాతిని సృష్టించెను. బ్రహ్మచర్య-గృహస్థ-వానప్రస్థ-సన్న్యాసము లనెడు నాలుగు ఆశ్రమముల వారికిన్ని 'దమమే ఉత్తమవ్రతము' అని చెప్పబడినది.

"రాజేంద్రా! క్షమ - ధైర్యము - అహింస - సమత్వము - సత్యము - సరళ స్వభావము - ఇంద్రియ జయము - మైత్రదనము - లజ్జ - స్థిరత్వము - లోభరహితత్వము (ఉదారత్వము) - అక్రోధము - సంతోషము - శ్రద్ధ - ఈ సద్గుణములు గలవాడే (ఇంద్రియ జయమును సాధించినవాడు) పురుష డనిపించుకొనును.

''కామ-లోభ - గర్వ-కోప-నిద్రా - ఆత్మప్రశంసా - అభిమాన-అసూయా-శోకాదులు లేనివాడే దాంతుడు (దమము గలవాడు) అనిపించుకొనును. కుటిలత్వము - శఠత్వము (గుప్తముగా నపకారము చేయుట) - ఇవి లేకుండ మనశ్శుద్ధితో నుండుట దాంతుని లక్షణము. లోభరహితుడు - తక్కువకోరువాడు - కామభోగాదులను చింతించకుండువాడు - సముద్రమువలె గంభీరముగా మనోభావములను ముఖమునందు ప్రకటించక లోతైన మనస్సు గలవాడు నైన పురుషుడు దాంతుడు (ఇంద్రియ నియమము గలవాడు) అని చెప్పబడినది.

"రాజా! 'సత్ప్రవర్తన - మంచి స్వభావము - ప్రసన్నచిత్తము - ఆత్మజ్ఞానము' - ఈ ఉన్నతగుణములు గల విద్వాంసుడు (ఆత్మజ్ఞాన సంపన్నుడు) లోకము నందు సన్మానము పొంది మరణించిన పిదప ఉత్తమ లోకములకు పోవును. తనకు సర్వభూతములనుండి అభయము - తననుండి వానికన్ని అభయము ఉండునట్లు మెలగుచు పరిపక్వబుద్ధి గలవాడే మానవులలో నుత్తము డనిపించుకొనును. సమస్త ప్రాణుల హితము కోరువాడు - అందరితోను మిత్రత్వముతో మెలగువాడు నైన యే పురుషునకుగూడ ఉద్వేగము (భయము) ఉండదు. సముద్రమువలె గంభీరు డై, ఉత్కృష్ట జ్ఞానామృతము చేత తృప్తి చెందిన పురుషునకు పరమ శాంతి (మోక్షము) లభించును.

"రాజా! కర్తవ్యము లైన (విధిగా చేయవలసిన) కర్మముల ద్వారా ఆచరింప బడినవి - సత్పురుషులచేత ఆచరింప బడినట్టివియు నైన సత్కర్మలను ఆచరించుచు శమ (మనోనిగ్రహము) - దమ (బహిరింద్రియనిగ్రహము) ములచేత కూడిన పురుషుడు సర్వదా ఆనందమును అనుభవించు చుండును. జ్ఞానముచేత సంతృప్తు డై, జితేంద్రియు డైన పురుషుడు, కర్మరహితభావమును ఆశ్రయించి కాలమును ఎదురుచూచుచు దేని యందుగూడ ఆసక్తి లేకుండ ప్రపంచమునందు సంచరించు చుండు పురుషుడు మోక్షమును పొందును.

''రాజా! ఆకాశమునందు సంచరించు పక్షులయొక్క అడుగుల గుర్తులు కనపడనట్లే, జ్ఞానానందముచేత తృప్తి చెందిన మునీశ్వరుల మార్గముగూడ కనపడదు. వారు సంచరించు దివ్యమార్గములేవో మనకు తెలియవు. గృహ - దార-పుత్రాదులచేత కలుషిత మైన గృహస్థాశ్రమములను విడిచి, వైరాగ్యముచేత మోక్షమునే ఆదరించి కోరువానికొరకు దీనియందు తేజోమయ మైన శాశ్వత మోక్షముయొక్క ద్వారములు తెరచి యుంచ బడును."

జనమేజయా! యిట్లు విదురుడు దాంతపురుష మహిమను వివరించి, మరల దుర్యోధనునితో నిట్లనుచున్నాడు :

విదురుడు జ్ఞాతివిరోధము అనర్థహేతు వని చెప్పి సంధి కొరకు ఉపదేశించుట

"రాజా! పూర్వులు చెప్పిన యొకనీతిని చెప్పెద వినుము: పక్షులను కొట్టి వలలో బంధించుటకుగాను భూమిపైన నొక వల పన్న బడి యుండెను. ఒకటిగా కలిసి తిరుగు చున్న రెండు పక్షులు ఆ వలలో పడి చిక్కుకొనెను. అప్పు డాపక్షు లావలను ఎత్తుకొని యాకాశమున పరుగెత్తి పోయెను. అట్లు పోవు చున్న పక్షులను చూచి పక్షులను పట్టు వ్యాధుడు ఖేదము చెందకుండ ఆ పక్షులు ఏయే మార్గము బట్టి యాకాశమునందు వోవు చుండెనో, వాడును భూమియందు ఆ మార్గమును బట్టి క్రింద పరుగెత్తుచు పోవు చుండెను. అట్లు వెన్నంటి పోవు చున్న వేటకానిని, అక్కడ నొక యాశ్రమమునం దున్న మునీశ్వరుడు, తన నిత్యానుష్ఠానమును ముగించుకొని, చూచి, అతనితో ఇ ట్లనెను :

"వేటకాడా! ఇది చాలా విచిత్రముగా నున్నది. అకాశమునందు పరుగెత్తి వోవు చున్న పక్షులను, పాదచారి వై భూమియందు పోవుచు వానిని అనుసరించు చున్నావు. ఇది నీకు సాధ్యమా?''

"ఆ మాటకు వేటగాడు ఇ ట్లనెను :

"మునీశ్వరా! ఈ రెండు పక్షులు ఒండొంటితో కలిసి యున్నవి కాబట్టి, వలను ఎత్తుకొని పోవు చున్నవి. ఇప్పు డీపక్షులు అకస్మాత్తుగా కలిసినట్లే, ఎప్పుడైనను, జగడ మాడినప్పు డావల క్రింద పడి అవి నా చేతికి చిక్క గలవు."

జనమేజయా! ధృతరాష్ట్రునితో విదురుడు అట్లు పక్షి వృత్తాంతము చెప్పి యి ట్లనెను :

''రాజా! తరువాత, కొంచెము సేపటిలోనే కాల (మృత్యువు) వశముచేత నా పక్షులు దుర్బుద్ధిచేత పరస్పరము జగట మాడుచు క్రింద పడెను. మృత్యుపాశమునందు తగులుకొనిన ఆ పక్షులు మిక్కిలి కోపముతో పరస్పరము పోట్లాడు చుండెను ఆ సమయమునందే వ్యాధుడు వానియొద్దకు పోయి వానిని పట్టి బంధించెను.

''కనుక, రాజా! ఈ విధముగానే, కుటుంబములోని వారు ధన సంపత్తి కొరకు ఒండొరులు కలహించి, ఆ పక్షులవలె శత్రువుల వశమునందు పడెదరు,

'సహభోజనము, ప్రేమతో సహవార్తాలాపము, పరస్పర సుఖదుఃఖములను గూర్చి యడుగుట సర్వదా కలిసి మెలసి యుండుట' - ఇవియే బంధు సోదరులు చేయవలసిన కార్యములు. ఒండొరులు విరోధించుట యెప్పుడు గూడ తగదు.

''రాజా! అప్పుడప్పుడు పెద్దలను కలిసికొనుచు, వారిని సేవించుచు నుండు పరిశుద్ధ హృదయులు, సింహరక్షిత మైన వనమువలె నితరుల యాక్రమణమునకు గురికారు. శత్రువులు అట్టి వారియొద్దకు వచ్చుటకు ధైర్యము చేయజాలరు. ధనమును సంపాదించినప్పటికిన్ని సర్వదా దీనులవలె ఆశా పీడితు లై యుండువారు ఒండొరులు కలహించి, తమ సంపదను శత్రువులయధీనము చేసెదరు. మండు చున్న కట్టెలు వేరుగా నుండి నప్పుడు మండక ధూమమును విడచును. అవి చేరి యున్నప్పుడు మండు చున్నట్లే. ఒక కుటుంబమువారు, పరస్పర విరోధకారణము చేత విడివిడిగా నున్నయెడల అసమర్థు లగుచు, అందరు కలిసి, యేకముగా నున్నప్పుడు, బలపరాక్రమవంతు లగుదురు.

విదురుడు తేనెతెట్టె కథ చెప్పుట

''రాజా! నీకు ఈ విషయములో మరియొక కథ చెప్పెదను వినుము ఆ తరువాత నీకు ఏది శ్రేయస్కరమో దానిని చేయుము.

''రాజా! మే మొకసారి కిరాతులతో, దేవసమాను లైన బ్రాహ్మణులతోను గలిసి, ఉత్తరదిక్కునం దున్న 'గంధమాదన' పర్వతమునకు పోయితిమి. ఆ బ్రాహ్మణులకు, మంత్ర - యంత్ర - ఓషధులు మొద లైన సాధనముల (జంభక) విద్యయందు మిక్కిలి ప్రీతి యుండెను. గంధమాదన పర్వతము అన్నివైపులనుండి పెద్ద పొదలు (కుంజములు) గలదిగా కనపడు చుండెను. అక్కడ దివ్యౌషధములు ప్రకాశించు చుండెను. సిద్ధ - గంధర్వాదు లా పర్వతమునందు నివసించు చుండిరి.

''రాజా! అక్కడ దుర్గమ మైన పర్వతగుహలో నొక తేనె తెట్టె యుండెను. దాని సమీపమునందు ఒక ఆధార మేదియు లేనందున చేత ఆ తేనె పెర యెప్పు డైనను క్రింద పడు నని సంభావింప వచ్చును. ఆ తేనె తెట్టె తేనెటీగలు సిద్ధము చేసినది కాదు. దాని రంగు బంగారమువలె పచ్చగా నుండెను. అది యొక కడవవలె కనబడు చుండెను. అది కుబేరునకు అతి ప్రియ మైనది. దానిని చూచి, మాతో వచ్చిన మాంత్రిక బ్రాహ్మణులు ఇట్లనిరి:

''ఈ తేనెను త్రాగినచో మరణ ధర్మము గల మానవులు గూడ అమరత్వము (మరణ రహితత్వము)ను పొంద గలరు. ఈ తేనె త్రాగినచో గ్రుడ్డివారికి కన్నులు కనపడును, వృద్ధులు యువకు లయ్యెదరు.''

''మహారాజా! ఆ మధువు యొక్క అద్భుత మైన గుణమును విని మాతో వచ్చిన కిరాతులు ఆ తేనెను తీసికొనుటకు తేనె తెట్టె యొద్దకు, సర్పములు నిండి యున్న ఆ పర్వత గుహలోకి పోయి సర్పములచే నందరును నశించిరి.

''రాజా! అ విధముగానే నీ కొడు కొక్కడే సమస్త భూమండల సామ్రాజ్యమును అనుభవించ గోరు చున్నాడు. ఇతడు మోహము చేత తేనెను మాత్రమే చూచు చున్నాడు. దానివలన భవిష్యత్తులో కలుగ బోవు పతనమువైపు, వినాశము వైపున్ను ఇతని దృష్టి పారుట లేదు. అర్జునునితో యుద్ధమునందు దుర్యోధనుడు పోరాడ దలచు చున్నాడు. కాని, అర్జునునకు ఉన్న బలపరాక్రమము లితనికి లేవు. అర్జును డొక్కడే రథారూఢు డై భూమండల మంతటను తిరిగి విజయమును సాధించెను. విరాట నగరము పైన ఉత్తర గోగ్రహణయుద్ధ సమయమునందు దాడి చేసిన భీష్మ - ద్రోణాదులవంటి మహావీరాగ్రేసరులను గూడ నొక్కడే భయపెట్టి పార ద్రోలెను. అట్టి అర్జునుని యెదుట నీ పుత్రుడు ఎట్టి పరాక్రమమును చూపగలడు? నేడు గూడ ఆ వీరుడు మైత్రీ పూర్ణ మైన మీ దృష్టిని ఎదురు చూచు చున్నాడు. రాజా! నీ యాజ్ఞ యైనచో, ఆ వీరార్జునుడు నీ పుత్రుల నందరను క్షమించ గలడు.

''రాజా! ద్రుపదుడు - విరాటరాజు - అర్జునుడున్ను కలిసి, వాయు ప్రేరిత మైన అగ్నిత్రయమువలె యుద్ధభూమి యందు ఆక్రమణము చేసినప్పుడు వారిపై ఎవరు వచ్చినను వారు విజయము సాధింపక విడువరు.

''ధృతరాష్ట్ర మహారాజా! నీవు యుధిష్ఠిరుని నీ యొడిలో కూర్చొనబెట్టికొని నీ పక్షమున చేర్చుకొనుము. లేకున్న యెడల, ఇరుపక్షములందు యుద్ధము కలిగినప్పుడు ఎవరికి జయము సిద్ధించునను విషయము నిశ్చయించి చెప్పుటకు వీలు ఉండదు.''

జనమేజయా! విదురుడు చెప్పిన నీతి వాక్యములను విని ధృతరాష్ట్రుడు దుర్యోధనునితో ని ట్లనెను;

ధృతరాష్ట్రుడు పుత్రునకు హితోపదేశము చేయుట

''కొడుకా! నేను చెప్ప బోవు మాటలను శ్రద్ధగా వినుము.

''నాయనా! త్రోవ దెలియని బాటసారి దారి దప్పి, తప్పుత్రోవలో నడుచుచు, నదియే సన్మార్గ మని తలచునట్లు నీవుగూడ తలచు చున్నావు. ఎందు కనగా, సమస్త లోకములకు ఆధారము లైన పంచ మహాభూతము లైన పృథివి - జలము - వాయువు - ఆకాశము - అగ్నివంటి పంచపాండవుల తేజమును అపహరించ గోరు చున్నావు యుధిష్ఠిరుడు సర్వోత్తము మైన ధర్మమును ఆశ్రయించి యున్నాడు. నీవు మరణించక యతనిని జయించి బయట పడ దలచుట సర్వథా అసంభవము పుత్రా! భీమసేనుని తోసమాను డైన బలశాలి మరి యొకడు లేడు. యుద్ధభూమియందు యమునివలె నుండు నతనిని నీవు బెదరింప జూచుట, మహావాయువును వృక్షము ఎదిరించిన ట్లగును.

''పుత్రా! సమస్త శస్త్రాస్త్ర విద్యలలో పండితుడు, పర్వతములలో మేరు పర్వతము వంటివాడు నైన గాండీవధారిని యుద్ధమునందు గెలువ జూచు బుద్ధిమంతు డెవ డున్నాడు? దేవేంద్రుడు వజ్రాయుధము విడుచునట్లు, బాణప్రయోగము చేయు ధృష్టద్యుమ్నుని ఎవడు ఓడించ గలడు? అంధక - వృష్ణివంశీయులకు ఆప్తు డైన సాత్యకిని ఎవరు గూడ చెనక జాలరు. అతడు నీ సేనను ధ్వస్తము చేయ గలడు. అతడు పాండవుల హితమునే సర్వదా కోరువాడు. త్రిలోకములందును అసమానప్రభావ సంపన్ను డైన శ్రీకృష్ణునితో బుద్ధిమంతు డెవడు పోరాడ గలడు? శ్రీకృష్ణునకు, భార్యా - పుత్ర - బాంధవాది సమస్త భూమండల మొక యెత్తు, అర్జును డొక్కడే యొక యెత్తు. అర్జునుని కొరకు కృష్ణుడు, ఇతరము లన్నియు విడుచును. మనస్సును - ఇంద్రియములను నిగ్రహించుకొని, ఎవరికిన్ని ఓడింప శక్యము గానట్టి యర్జునుడున్నచోటనే, శ్రీకృష్ణుడు గూడ నున్నాడు. యుద్ధములో నున్న శ్రీకృష్ణుని వేగము మిక్కిలి సహింప రానిది సుమా!

''నాయనా! నీ హితము గోరు సత్పురుషుల యుపదేశము ప్రకారముగా నడుచుకొనుము. భీష్ముడు నీ పితామహుడు. నేను - ఆయన - మే మిరువురము చెప్పిన ప్రతి మాటను నీవు సహనముతో వినుము. నేను కురువంశహితము కోరువాడను. ద్రోణ - కృప - వికర్ణ - బాహ్లిక రాజాదులు గూడ నీ హితమును

కాంక్షించువారే. కనుక, నీవు నన్ను వలెనే వారిని గూడ గౌరవించ వలెను. నాయనా! వీరందరు ధర్మమును బాగుగా నెరిగినవారు. ఇరు పక్షములయందున్ను సమాన స్నేహభావము గలవారు.

"పుత్రా! ఉత్తర గోగ్రహణ యుద్ధసమయమునందు విరాటనగరములో మీ సోదరు లందరు సేనలతో పోయి యుండిరి గదా! అక్కడి గోవులను విడిచి నీ సేన భయపడి, నీవు చూచు చుండగానే పారి పోయెను గదా! అప్పుడు అర్జునొక్కడే అనేక సేనలతో అద్భుతముగా పోరాడినా డని వినినాను. ఈ ఒక్క దృష్టాంతమే అర్జునుడు అజేయుడు - ప్రబలుడు ననుటకు చాలును. నాయనా! చూడుము. అర్జును డొక్కడే ఆనాడు అంతటి యద్భుత కార్యము చేసినప్పుడు, అయిదుగురు సోదరులు ఏక మైనప్పుడు, వారు ఏ కార్యము చేయ జాలరు? అందుచేత నీవు పాండవులను నీ సోదరులనుగా నెరుగుము. వారి రాజ్యభాగమును వారికి ఇచ్చి, వారితో సోదరభావమును పెంపొందించుకొనుము."

జనమేజయా! దుర్యోధనునకు ధృతరాష్ట్రు డిట్లు బోధించి, సంజయునితో మరల, "సంజయా! శ్రీకృష్ణభవానుడు సందేశ మిచ్చిన తరువాత, అర్జునుడు చివరిసారిగా పంపిన సందేశ మేమి? దానిని వినుటకు కుతూహలపడు చున్నాను" అని యనగా, సంజయుడు ఇట్లు బదులు చెప్పెను:

అర్జునుని సందేశమును సంజయుడు ధృతరాష్ట్రునకు చెప్పుట

"రాజా! శ్రీకృష్ణుని మాటలు విని యర్జునుడు సమయోచితముగా నాతో నిట్లనెను:

"సంజయా! నీవు భీష్మ - ద్రోణ - కృపాశ్వత్థామాది మహావీరులకు, కౌరవులకు ప్రియము గూర్చుటకై అక్కడికి వచ్చిన రాజవీరులకున్ను యథా యోగ్యముగా నా ప్రణామములు తెలుపుము. ఆ రాజవీరు లందరికి మృత్యువు ఆసన్న మైనది. దుర్యోధనుడు వారిని పాండవాగ్నిలో హోమము చేయుటకు పిలిచెను. వా రందరి క్షేమ మడుగుము. అందరి సమక్షములోనే పాపాత్ముడు, దురభిమాన - దుర్గర్వములు కలవాడు నైన దుర్యోధనునకు నా మాట లన్నియు విన్నపింపుము రాజా! ఇట్లు చెప్పి నాకు హస్తినాపురమునకు పోవుటకు అనుజ్ఞ నిచ్చి, శ్రీకృష్ణుని చూచి అర్జునుడు నాతో ధర్మార్థయుక్తముగా నిట్లు చెప్పెను:

"సంజయా! శ్రీకృష్ణభగవానుడు నీతో చెప్పిన మాటలే మాయందరి యభిప్రాయ మని, నీవు విన్నది విన్నట్లుగా కౌరవులతో అక్కడ చేరి యున్న రాజులతోను నా మాటగా నిట్లనుము:

"రాజవీరులారా! యుద్ధ మనెడు మహా యజ్ఞము సంభవించ నున్నది. దానిలో బాణములు ఒండొంటిని ఒరసికొనుట చేత పుట్టిన అగ్నినుండి ధూమము వ్యాపించు చుండును రథముల ఘర్ఘర ధ్వనియే వేద మంత్రము లగును. అస్త్ర బలము గల ధనుస్సు అనెడు స్రువము (హోమ ద్రవ్యమును ఉంచి హోమము చేయు కొయ్యగరిటె) చేత కౌరవ సైన్య మనెడు హవిస్సును నేను హోమము చేయ నున్నాను. ఆ యవకాశము నా కీయకుండ మీ రందరు దయచేసి ప్రయత్నించుడు. మీరు శత్రుహంతకు డైన యుధిష్ఠిరునకు, అతనికి చేర వలసిన రాజ్యభాగము ఇవ్వనియెడల, నా పదు నైన బాణములచేత రథ - గజాది చతురంగబలమును యమలోకమునకు పంపెదను."

"రాజా! ఇట్లు అర్జునుడు నాకు సందేశ మిచ్చిన తరువాత, అతనినుండి అజ్ఞ తీసికొని, శ్రీకృష్ణభగవానునకు ప్రణామము చేసి, వా రిరువురు నిచ్చిన ఆ ముఖ్య సందేశమును మీకు అందించుటకై అతి వేగముగా నిచ్చోటికి వచ్చితిని."

జనమేజయా! దుర్యోధనుడు కృష్ణార్జునుల సందేశమును ఏ మాత్రము ఆదరించ లేదు. సభవా రందరు నిశ్చేష్టు లై యూర కుండిరి. వారందరు సభ విడిచి వెడలి పోయిరి. తరువాత ధృతరాష్ట్రుడు, ఏకాంతమునందు, తమ వారియొక్క, యితరులయొక్క, పాండవుల యొక్కయు జయాపజయములను గూర్చి సంజయుని నిశ్చిత మైన యభిప్రాయము తెలిసికొన దలచి యతనిని మరల ఈ విధముగా నడుగ జొచ్చెను:-

ధృతరాష్ట్రునికడకు గాంధారి - వ్యాసులు వచ్చుట-కృష్ణార్జునుల బలమునుగూర్చి సంజయుని ధృతరాష్ట్రుడు మరల నడుగుట

"సంజయా! యిక్కడ మన సైన్యములో నున్న ప్రబలత్వ - దుర్బలత్వములను గూర్చి వర్ణించి చెప్పుము. అ విధముగానే పాండవుల యొక్క అన్ని విషయములు నీకు బాగుగా తెలియును గాబట్టి, వారు ఏయే విషయ

ములలో నధికులుగా నున్నారు? వేనిలో వారికి దోషములు ఉన్నవి? చెప్పుము. సంజయా! యీ యిరుపక్షముల బలాబలములను గూర్చి నీవు ఎరిగినవాడవు. సర్వదర్శివి. ధర్మార్థ జ్ఞానమునందు నిపుణుడవు. నిశ్చిత మైన తత్త్వము నెరిగిన వాడవు. కనుక, నా ప్రశ్నములకు ఉత్తరములను స్పష్టముగా చెప్పుము. యుద్ధ మారంభించిన తరువాత, ఏ పక్షమునందలి వారు జీవించి యుండరో యది గూడ చెప్పుము "

ఆ మాటలకు సంజయు డిట్లు బదులు చెప్పెను:-

"రాజా! ఏకాంతమునందు నేను నీకు ఏ మాటగూడ చెప్పను. ఎందు కనగా, నీ హృదయమునందు నా యెడల అసూయ కలిగి, నేను దోషములను మాత్రమే పేర్కొను చుందు నను భావము ఏర్పడును. కనుక, రాజా! నీవు నీ తండ్రి యైన వేదవ్యాసమహామునిని, నీ ధర్మపత్ని యైన గాంధారీదేవినిన్ని ఇక్కడికి పిలుపుము. రాజా! వా రిద్దరున్ను ధర్మము, నిశ్చిత తత్త్వమునున్ను బాగుగా నెరిగిన నిపుణులు. కాబట్టి, వారు నీ యసూయను, దోష దృష్టినిన్ని నివారించ జాలుదురు వా రిరువురి సమక్షమునందు నేను కృష్ణార్జునుల సందేశమును నీకు పరిపూర్ణముగా వివరించెదను."

జనమేజయా! సంజయు డిట్లు చెప్పిన మీదట, ధృతరాష్ట్రుని ప్రేరణ చేత విదురుడు గాంధారీ - వేదవ్యాసులను అక్కడికి తోడ్కొని వచ్చెను. తరువాత వ్యాసమహాముని సంజయ ధృతరాష్ట్రుల యభిప్రాయమును కనుగొని, సంజయునితో, "సంజయా! ధృతరాష్ట్రుడు నీనుండి తెలిసికొన గోరు విషయము లన్నియు యథార్థముగా నతనికి చెప్పుము" అని యనెను.

అప్పుడు సంజయుడు ధృతరాష్ట్రునితో నిట్లు చెప్ప దొడగెను:

సంజయుడు ధృతరాష్ట్రునకు శ్రీకృష్ణునిసారము చెప్పుట

"రాజా! కృష్ణార్జును లిద్దరున్ను మాననీయ ధనుర్ధరులు. వారు, ఎల్లప్పటికిన్ని కలిసి యుండు నర-నారాయణు లైనప్పటికిన్ని, లోక కల్యాణమును గోరుచు వేరువేరుగా నవతరించి యున్నారు. వారు తలచిన దే దైనను చేయుటకు సమర్థులు.

"రాజా! శ్రీకృష్ణ భగవానునియొద్ద సుదర్శన చక్రము, ఇతరులకు కనపడకుండ సర్వదా ఉండును. ఆ చక్రపు మధ్య భాగపు విస్తీర్ణము. దాదాపు

మూడున్నర చేతుల పరిమాణము గల దై యుండును. అది ఆ భగవానుని సంకల్పానుసారముగా విశాలము-తేజోవంతము నైన రూపమును ధరించి, శత్రు సంహారము కొరకు ప్రయోగింప బడు చుండును. దాని ప్రభావము కౌరవులకు తెలియదు. పాండవులకు అది మిక్కిలి ప్రియ మైనది. అది అందరి బలాబలములను తెలిసికొన జాలినది. అది సర్వదా, తేజస్సమూహముచేత ప్రకాశించు చుండును.

"రాజా! శ్రీకృష్ణపరమాత్ముడు ఆ సుదర్శన చక్రాయుధము చేత, అతి భయంకరు లైన నరకాసుర-శంబరాసుర-కంస-శిశుపాలాదులను అవలీలగా జయించెను. శ్రీకృష్ణభగవానుడు ఆ చక్రాయుధము చేత భూమ్యాకాశములను-స్వర్గాది లోకములను గూడ తన యధీనము చేసికొన జాలును.

"రాజా! నీవు మాటిమాటికి నన్ను పాండవుల బలాబలముల విషయమై యడుగు చుందువు. అవి యన్నియు సంగ్రహముగా నీకు చెప్పెదను వినుము:

"రాజా! ఒకవైపు సమస్త జగత్తు, మరియొకవైపు శ్రీకృష్ణుడు నున్నచో సారభూత మైన బలముల దృష్ట్యా శ్రీకృష్ణ పరమాత్ముడే సర్వప్రపంచము కన్నను అధికుడుగా నుండును. శ్రీకృష్ణుడు సంకల్ప మాత్రములో సమస్త జగత్తును భస్మము చేయ జాలును కాని, అతనిని భస్మము చేయుటకు ఈ జగ మంతయు సమర్థము కా జాలదు. సత్య - ధర్మ - లజ్జా నిష్కపటత్వము లున్నవైపుననే ఆ భగవంతుడు ఉండును. అత డున్న వైపుననే విజయము సిద్ధ మగును.

"రాజా! పృథివి - ఆకాశము - స్వర్గాదిలోకముల నతడు క్రీడగా నడపుచుండును. అతడు సర్వప్రాణులకు ఆత్మభూతుడు. శ్రీకృష్ణభగవానుడు పాండవుల వ్యాజములో లోకములను మోహింప జేయుచు అధర్మపరు లైన నీ మూర్ఖపుత్రులను భస్మీపటలము చేయ గోరు చున్నాడు. శ్రీకృష్ణభగవానుడు తన యోగశక్తిచేత, కాలచక్రమును, ప్రపంచ చక్రమును, యుగచక్రమునున్ను నిరంతరము త్రిప్పు చుండును. అత డొక్కడే కాలమునకు, మృత్యువునకు, చరాచరాత్మక ప్రపంచమునకున్ను ప్రభువుగా నుండి, వానిని శాసించుచున్నాడు. జగత్తునకు ప్రభు వైనను శ్రీకృష్ణభగవానుడు, కర్షకుని (వ్యవసాయదారుడు) వలె, సర్వదా క్రొత్త క్రొత్త కార్యములను ఆరంభించు చుండును. అతడు తన

మాయాప్రభావముచేత లోకముల నన్నింటిని మోహమునందు పడవేసి యుంచును. కాని, అతని శరణు జొచ్చినవానిని, అతడు మాయామోహమునందు పడవేసి యుంచును."

సంజయుడు శ్రీకృష్ణుని భగవద్భావనను గూర్చి చెప్పి భగవత్ప్రాప్త్యుపాయము చెప్పుట

జనమేజయా! అట్లు సంజయుడు చెప్పిన మాటలు వినిన ధృతరాష్ట్రునకు, సంజయునకున్ను ఇట్లు సంవాదము జరిగెను.

ధృత : "సంజయా! సర్వలోకమహేశ్వరుడైన శ్రీకృష్ణభగవానుని నీ వెట్లు ఎరుదువు? నే నేల ఎరుగను? చెప్పుము.

సంజ : రాజా! వినుము. నీకు తత్త్వజ్ఞానము లేదు నా జ్ఞానదృష్టి యెప్పుడున్ను లోపించదు. తత్త్వజ్ఞానశూన్యుడు, అజ్ఞానాంధకారముచేత బుద్ధినశించిన వాడున్ను, శ్రీకృష్ణభగవానుని వాస్తవ స్వరూపమును తెలిసికొన జాలడు. రాజా! ఈ సమస్త ప్రపంచమునకు కర్తగా నుండి కార్యస్వరూపుడు గాక యుండి, సమస్త ప్రాణులయొక్క ఉత్పత్తి వినాశములను చేయుచు, త్రియుగ(కృత - త్రేతా - ద్వాపరయుగములు) స్వరూపుడైన శ్రీకృష్ణ పరమాత్ముని నేను జ్ఞానదృష్టితో తెలిసికొనెదను.

ధృత : "సంజయా! నీకు శ్రీకృష్ణభగవానుని యెడల గల శాశ్వతభక్తి స్వరూప మేమి? నీవు ఆ భక్తిచేత త్రియుగ స్వరూపు డైన శ్రీకృష్ణుని తత్త్వ మును తెలిసికొనినావుగదా! దానిని చెప్పుము.

సంజ : రాజా! నేను మాయను (కపటవృత్తిని) సేవించను. (పాషండులవలె) నిరుపయోగ ధర్మమును ఆచరించను భగవద్భక్తిచేత నా మనస్సు పరిశుద్ధమై యున్నది. కాబట్టి, శాస్త్ర వచనముల జ్ఞానముచేత శ్రీకృష్ణభగవానుని స్వరూపములు ఉన్న దున్నట్లు తెలిసికొన గలుగుచున్నాను.

తరువాత, ధృతరాష్ట్ర - దుర్యోధన - గాంధారీ మాతలకు ఇట్లు సంభాషణము జరిగెను:

ధృత : కొడుకా, దుర్యోధనా! సంజయుడు మనకు విశ్వాసపాత్రుడు ఇతని. మాటల యందు శ్రద్ధ ఉంచి నీవు శ్రీకృష్ణభగవానుని ఆశ్రయించి, అతని శరణు వేడుము.

దుర్యో : తండ్రీ! శ్రీకృష్ణపరమాత్ముడు సాక్షాత్తు భగవంతుడే సందేహము లేదు. ఆయన యిచ్ఛా మాత్రముచేత సర్వలోకములను సంహరింప గలడు. అయినను, తాను అర్జునునకు మిత్రుడ నని చెప్పికొనును. కాబట్టి నే నిప్పు డాయన శరణు వేడ జాలను.

ధృత : దేవీ, గాంధారీ! దుర్బుద్ధి, దురభిమాని, ఈర్ష్యాసూయాపరుడు, దురాత్ముడు నైన నీ పుత్రుడు ఉత్తముల యాజ్ఞను ఉల్లంఘించి నరకము వైపు పోవుచున్నాడు.

గాంధారి : దుష్టదుర్యోధనా! నీవు ఐశ్వర్యమును కోరుచు పెద్దల యాజ్ఞను ఉల్లంఘించుచున్నావు. మూర్ఖా! నీవు, ఈ యైశ్వర్యములు, జీవనమును, తల్లిదండ్రులను గూడ త్యజించి, శత్రువులకు సంతోషము, నాకు శోకమును పెంచుచు, భీమసేనుని చేతిలో చంప బడినప్పుడు, నీకు ఇప్పుడు నీ తండ్రి చెప్పు చున్న మాటలు జ్ఞప్తికి రా గలవు.

ఆ మాటలు విని వ్యాసభగవానుడు ధృతరాష్ట్రునితో ని ట్లనెను :

"రాజా! నా మాటలను బాగుగా వినుము. వాస్తముగా నీవు శ్రీకృష్ణ భగవానునకు ప్రియుడవు కాబట్టియే, నీకు సంజయునివంటి దూత లభించినాడు. ఇతడు మీకు శ్రేయస్సు కలిగించు మార్గమునే చూపించును. సంజయుడు పురాణపురుషుడైన శ్రీకృష్ణభగవానుని బాగుగా నెరిగినవాడు. ఆ భగవంతుని పరతత్త్వము గూడ సంజయునకు తెలియును. నీవు ఏకాగ్ర చిత్తముతో సంజయుని వచనములను వినిన యెడల, ఇతడు నీకు మహా భయమునుండి విముక్తి కలిగించ జాలును.

"ధృతరాష్ట్రా! ఏ మనుష్యులు, తన ధనముతో సంతుష్టి చెందక, కామ క్రోధాదు లైన వివిధ బంధనములతో కట్ట బడి, క్రోధమునకు పశు లైయుందురో, అట్టి కామ మోహిత పురుషులు, అంధులచేత తోడ్కొని పోవబడు చున్న గ్రుడ్డి వారివలె, తమ కర్మలచేత ప్రేరితు లై మాటిమాటికి యమలోకమునకు పోవుదురు. ఈ జ్ఞానమార్గ మొక్కటే పరమాత్మ ప్రాప్తికి హేతు వగును. జ్ఞాను లైన పురుషులు సంచరించు త్రోవను చూచుకొని, లేక, దానిని తెలిసి కొనిన మీదటగాని, మనుష్యుడు జననమరణ రూప సంసారమును దాట జాలును. అట్టి మహాత్ముడు మరల నెప్పుడు గూడ సంసారమునందు ఆసక్తి గానడు.''

ఆ మాటలు విని ధృతరాష్ట్రుడు సంజయునితో నిట్లనెను :-

"సంజయా! ఏ మార్గముగుండా పోయి నేను పరమ మోక్ష స్వరూపుడైన శ్రీ కృష్ణభగవానుని పొంద జాలుదునో, అట్టి భయరహిత మైన మార్గమును గూర్చి నాకు తెలుపుము."

ఆ మాటలకు సంజయు డిట్లు ధృతరాష్ట్రునకు బదులు చెప్పెను :

"రాజా! మనస్సును వశమునందు ఉంచుకొన జాలనివాడు నిత్యశుద్ధు డైన శ్రీ కృష్ణపరమాత్ముని పొంద జాలడు. తన యింద్రియములను అధీనమునందు ఉంచుకొనకుండ, ఎట్టి కర్మలు చేసినను, అవి పరమాత్మ ప్రాప్తికి ఉపాయములు కాజాలవు.

1) ప్రాపంచిక విషయములవైపు పరుగెత్తునట్టి యింద్రియముల భోగేచ్ఛను పరిపూర్ణముగా, అతి జాగ్రత్తతో విడుచుట - 2) ప్రమాదము (ఏమరుపాటు) దగ్గరకు రానీయకుండుట 3) ఏ ప్రాణిని గూడ హింసించకుండుట- ఈ మూడే తత్త్వజ్ఞానము కలుగుటకు కారణములు.

"రాజా! నీవు సోమరితనము విడిచి, యింద్రియములను నిగ్రహింపుము. నీ బుద్ధిని సాధ్య మయినంతవరకు వశమునందు ఉంచుకొనుము. ఆత్మజ్ఞాన సంపన్ను లైన బ్రాహ్మణులు దీనినే జ్ఞాన మని చెప్పెదరు. జ్ఞానులు సంచరించు జ్ఞానమార్గమున్ను ఇదియే రాజా! యింద్రియ విజయమును సాధించనివాడు శ్రీ కృష్ణ పరమాత్ముని పొంద జాలడు. ఎవడు, శాస్త్రజ్ఞానప్రభావము చేత, యోగాభ్యాసమహిమ చేతను, తన మనస్సును ఇంద్రియములనున్ను వశము నందు ఉంచుకొని యున్నాడో, అతడే తత్త్వజ్ఞానమును సంపాదించి, సంతుష్ట చిత్తు డగును."

జనమేజయా! సంజయుని మాటలు విని, ధృతరాష్ట్రుడు మరల నిట్లు సంజయుని ప్రశ్నించెను :

సంజయుడు శ్రీకృష్ణనామముల యర్థము చెప్పుట

"సంజయా! నీవు శ్రీకృష్ణుని నామములయొక్క, అతని కార్యముల యొక్కయు నభిప్రాయములను తెలిసికొని యున్నావు. కనుక, నా ప్రశ్నములను అనుసరించి, మరియొక పర్యాయము శ్రీ కృష్ణ భగవానుని నామాదుల వర్ణనము చేయుము."

ఆ మాటకు సంజయు డిట్లు చెప్ప దొడగెను :

"రాజా! నేను శ్రీకృష్ణుని పేర్ల యర్థములను (వ్యుత్పత్తి) వినినాను. నాకు జ్ఞప్తియందు ఉన్నంతవరకు చెప్పెదను వినుము. వాస్తవమును విచారించినచో శ్రీకృష్ణుని సర్వప్రాణులు పొంద జాలరు. ఆ పేర్ల యర్థము లివి :

1. వాసుదేవుడు : శ్రీకృష్ణభగవానుడు సమస్త ప్రాణులకు నివాసస్థానభూతుడు, సర్వ ప్రాణులయందున్ను నివాసము చేయువాడు కనుక 'వసు' అని, దేవతల పుట్టుకకు స్థానభూతుడు, దేవతలందరు ఆయనయందు నివసించు చుందురు. కనుక, 'దేవ' అనియు నర్థము అందుచేతనే యతడు 'వాసుదేవ' నామము గలవా డని తెలిసికొనవలెను.
2. విష్ణువు :- సమస్త జగత్తునందు వ్యాపించి యున్న వా డగుటచేత 'విష్ణు' నామ మతనికి వచ్చినది. 'విష్ల్' అను ధాతువునుండి విష్ణు శబ్దము పుట్టినది. ఆ ధాతువునకు 'వ్యాప్తి' అని యర్థము. కనుక 'విష్ణు' అనగా వ్యాపకుడు అని యర్థము.
3. మాధవుడు : మౌనము - ధ్యానము - యోగము - వీనిచేత శ్రీకృష్ణుని సాక్షాత్కారము కలుగును. కనుక 'మాధవ' నామము వచ్చినది.
4. మధుసూదనుడు : మధుశబ్దముచేత ప్రతిపాదింప బడిన పృథివి మొద లైన సమస్తతత్త్వములను ఉపాదాన (మూల) కారణము (కంకణమునకు ఉపాదానకారణము బంగార మైనట్లు), ఆ తత్త్వములకు అధిష్ఠానము నగుటచేత 'మధుసూదన' నామము వచ్చినది. 'మధు' అను రాక్షసుని సంహరించిన వాడు కాబట్టి కూడ మధుసూదన నామ మేర్పడినది.
5. కృష్ణుడు : 'కృషి' శబ్దమునకు 'సత్త' యని యర్థము, 'ణ' యను దానికి 'ఆనందము' అని యర్థము. 'సత్ - ఆనంద' భావములచేత గూడిన వాడగుటచేత అతనికి 'కృష్ణ' నామము వచ్చినది.
6. పుండరీకాక్షుడు : 'పుండరీక' అనగా వినాశము లేని భగవంతుని స్థానము. ఆ స్థానమునందు 'అక్షయ' (నాశరహిత) భావములో నుండును గాబట్టి 'పుండరీకాక్ష' నామము ఆ దేవునకు వచ్చినది.
7. సాత్వతుడు : శ్రీకృష్ణుడు సత్త్వ గుణము నుండి జారిపోవడు - అనగా, సత్త్వము లేకుండ నుండడు గనుక, 'సాత్వత' నామ మతనికి ఏర్పడినది.

8. ఆర్షభుడు : 'ఆర్ష' అనగా వేదము. వేదముచేత భాసిల్లువాడు గాబట్టి 'ఆర్షభ' నామ మతని కేర్పడినది.

9. వృషభేక్షణుడు : 'ఆర్షభ' శబ్ద సంబంధము చేతనే శ్రీకృష్ణునకు 'వృష భేక్షణ' నామము ఏర్పడినది. వృషభ మనగా వేదము. వేదమే ఈక్షణ (నేత్రము)ము వలె ఆ భగవంతుని తెలుపును గనుక 'వృషభేక్షణ' అని అతనికి మరియొక పేరు గలదు.

10. అజుడు : శ్రీకృష్ణుడు జన్మదాత (పుట్టించినవాడు) యెవడు గూడ లేనందు చేత నతడు 'అజ' నామము పొందినాడు.

11. ఉదరుడు : శ్రీకృష్ణుడు ఉత్కృష్ట రూపముతో ప్రకాశించువాడు కనుక, నతనికి 'ఉదర' నామము ఏర్పడెను.

12. దాముడు : 'దమ' (ఇంద్రియ నిగ్రహము) గుణము గలవాడు గనుక, శ్రీకృష్ణునకు 'దామ' నామ మేర్పడినది.

13. దామోదరుడు : 'దామ - ఉదర' ఈ రెండు శబ్దముల కలయిక చేత నతనికి 'దామోదర' నామము వచ్చినది. అనగా, 'ఇంద్రియ నిగ్రహము చేత ప్రకాశించువాడు' అని యర్థము.

14. హృషీకుడు : 'హర్షము' అనగా సుఖము. సుఖము గలవాడు గాబట్టి 'హృషీక' నామము అతనికి ఏర్పడినది.

15. ఈశుడు : సుఖైశ్వర్యములు గలవాడు గాబట్టి 'ఈశ' నామము అతని కేర్పడినది.

16. హృషీకేశుడు : 'హృషీక - ఈశ' అను శబ్దముల కలయిక చేత 'హృషీకేశ' నామము వచ్చినది. అనగా, సంతోషము-సుఖైశ్వర్యములున్ను గలవాడు అని యర్థము.

17. మహాబాహుడు : తన రెండు బాహువులచేత భూమ్యాకాశములను ధరించు వాడు కనుక శ్రీకృష్ణునకు 'మహాబాహు' నామము వచ్చినది.

18. అధోక్షజుడు : శ్రీకృష్ణుడు ఎప్పుడు గూడ 'అధః' - క్రింద పడి క్షీణించడు గనుక 'అధోక్షజ' నామముతో నొప్పు చున్నాడు.

19. నారాయణుడు : నరు లనగా జీవులు. నరులకు అయనము (ఆశ్రయము) కాబట్టి శ్రీకృష్ణునకు 'నారాయణ' నామము ఏర్పడినది.

20. పురుషోత్తముడు : పురుష శబ్దమునకు సర్వత్ర పరిపూర్ణుడు, అందరికి నివాస స్థానము అని యర్థము. ఉత్తమ పురుషుడు గాబట్టి శ్రీకృష్ణునకు 'పురుషోత్తమ' నామము ఏర్పడినది.

21 సర్వుడు : శ్రీకృష్ణుడు, సత్యాసత్యవస్తువు లన్నిటి యొక్క ఉత్పత్తి వినాశ స్థానభూతుడు గాబట్టి 'సర్వ' నామము గలవాడు.

22. సత్యుడు : ఆ భగవంతుడు సత్యమునందు ఉన్నాడు - అతనియందు సత్యము ఉన్నది. అతడు సత్యమునకంటెను ఉత్కృష్ట సత్యస్వరూపుడు. కాబట్టి యతనికి 'సత్య' నామము వచ్చినది.

23. విష్ణుడు : విక్రమణము (వామనావతారమునందు మూడు లోకములను ఆక్రమించుట) చేసినవాడు గాబట్టి, శ్రీకృష్ణుడు 'విష్ణు' నామముతో నొప్పు చున్నాడు. (ఇది యీ పదమునకు మరియొక యర్థము).

24. జిష్ణుడు : శ్రీకృష్ణుడు అందరిని జయించువాడు కాబట్టి 'జిష్ణు' నామము గలవాడు.

25. అనంతుడు ; 'నిత్యుడు గనుక, 'అనంత' నామ మతని కేర్పడినది.

26. గోవిందుడు : 'గో' శబ్దమునకు ఇంద్రియము అని అర్థము. ఇంద్రియముల జ్ఞానము గలవాడు - ఇంద్రియములను ప్రకాశింప జేయువాడున్ను గాబట్టి శ్రీకృష్ణునకు 'గోవింద' నామము ఏర్పడినది.

"రాజా! శ్రీకృష్ణుడు అందరికిని స్ఫూర్తిని ఇచ్చి అసత్యమును సత్యముగా జేయును. అందుచేత ప్రజలు మోహమునందు పడుదురు. భగవంతుడు సర్వదా ధర్మమునందే ఆసక్తి గలవాడు. అతని స్వరూపము ఇన్ని నామములతో నొప్పు చున్నది. ఆయన, కౌరవులపై కృపచేత నిక్కడికి రా బోవు చున్నాడు."

జనమేజయా! ఈ విధముగా శ్రీకృష్ణ భగవానుని స్వరూపమును, ఆయన నామముల ద్వారా చెప్పి వివరించిన సంజయుని ధృతరాష్ట్రుడు మరల నిట్లు ప్రశ్నించెను:

శ్రీకృష్ణుడు వచ్చునని తెలిసి సంతసించిన ధృతరాష్ట్రుడు ఆయన దర్శనభాగ్యము గలవారిని ప్రశంసించి శ్రీకృష్ణుని శరణు జొచ్చుట

''సంజయా! ఉత్తమములైన అవయవములచేత శోభితుడు, సమస్త దిక్కులను ప్రకాశింప జేయువాడునైన శ్రీకృష్ణభగవానుని అతి సమీపమునుండి దర్శించు భాగ్యమును పొందుటకు నేను గూడ నభిలషించు చున్నాను. నా కన్నులు సఫలములు చేసికొనెదను. ఆ భగవంతుడు అత్యంతమనోహర వాక్కుచేత పలుకు మాటలు భరత స్సృంజయ వంశీయులకు అతి శ్రేయోదాయకములు - ఆదరణీయములునై ఉండును. ఐశ్వర్యమునందు ఇచ్ఛగల పురుషులకు, భగవంతుని వాక్కు అనింద్యము - శిరోధార్యము నగును. కాని, మరణ మాసన్నమైనవారు ఆ వాక్కులు గ్రహింపజాలరు.

"సంజయా! ప్రపంచమునందు అద్వితీయ వీరుడు - యదుకుల శిరోమణి- శత్రు సంహారకుడునైన శ్రీకృష్ణుడిచటికి విచ్చేయుట మా భాగ్యము. (కన్నులు గలవారు ఆయన దర్శనము చేసి ధన్యులగుదురు.) కృష్ణపరమాత్ముడు ఇక్కడికి వచ్చి కృపతో తన మృదువాక్యములచేత మా పక్షపు రాజులను మోహపరవశులను చేయును. అప్పుడు కౌరవులు ఆ భగవంతుని చూచెదరు. అత్యంత నూతనుడు - సాధకులకు అరచేతియందుగల కలశోదకమువలె సులభుడు - సర్వ విఘ్నములను నివారించు చరణ సరోజములు గలవాడు - అదిమధ్యాంత రహితుడు - ప్రపంచముయొక్క బీజమును - వీర్యమున్ను ధరించు వాడునైన శ్రీకృష్ణ భగవానుని శరణు జొచ్చెదను.

"సంజయా! మూడు లోకములను నిర్మించువాడు - దేవాసుర నాగ రాక్షసాదులకు గూడ జన్మము నిచ్చినవాడు - సుజ్ఞానులైన రాజులలో శ్రేష్ఠుడు - ఇంద్రుని తమ్ముడై వామనుని యవతారమెత్తిన శ్రీకృష్ణపరమాత్ముని శరణు జొచ్చెదను."

యానసంధి పర్వము సమాప్తము.

భగవద్యాన పర్వము

జనమేజయా! సంజయుడు వెడలిపోయిన తరువాత, ధర్మరాజు తన నలుగురు తమ్ములతో, విరాట ద్రుపదులతో, కేకయులతోను, ''శంఖ, చక్ర గదాధరుడైన శ్రీకృష్ణ భగవానుని, కౌరవ సభకు పొమ్ము అని వేడుకొందము. ఆ మహాత్ముడక్కడికి పోయి, మేము యుద్ధమునందు భీష్మ - ద్రోణ - కృప బాహ్లీకాది కురువీరులతో పోరాడవలసిన అవకాశము కలుగకుండునట్లు ప్రయత్నము చేయుగాక! ఇదియే మన మొదటి ధ్యేయము. ఇదియే మనకు శ్రేయోదాయకమైన విషయము'' అని యనెను.

యుధిష్ఠిరుడు కృష్ణునకు తన అభిప్రాయము చెప్పుట - అతని దౌత్యము నంగీకరించి శ్రీకృష్ణుడు కౌరవ సభకు పోవుటకు అంగీకరించుట - ఈ విషయములో ఆ యిరువురి సంవాదము

ధర్మరాజు మాటలు వినిన పిదప వారందరు ప్రసన్నులై శ్రీకృష్ణ భగవానుని యొద్దకు ఇంద్రుని కడకు దేవతలవలె పోయిరి. యుధిష్ఠిరుడు శ్రీకృష్ణునితో నిట్లనెను :

''మహాత్మా! మిత్రులకు సహాయము చేయుటకు నీకు ఇదియే అనువైన సమయము. ఈ యాపద నుండి మమ్ము ఉద్ధరించుటకు నీకంటె మరియెవరు గూడ మాకు లేరు. నీ శరణుజొచ్చి మేమందరము నిర్భయముగ నున్నాము. వ్యర్థమైన దుర్గర్వముగల దుర్యోధనునితో, అతని మంత్రులతోను మేము స్వయముగా పోరాడుటకు ఉత్సాహపడుచున్నాము. వృష్ణివంశీయులకు గలిగిన అన్ని ఆపదల నుండి వారిని రక్షించు చున్నట్లే పాండవులను గూడ ఈ మహాభయము నుండి కాపాడుము."

జనమేజయా! అప్పుడు శ్రీకృష్ణుడు "వీరాగ్రేసరా! మీ సేవకొరకై ఇదుగో నేను సంసిద్ధముగా నున్నాను. నీవు ఏమి కోరెదవో చెప్పుము. రాజా! నీవు

చెప్పబోవు పనులన్నియు తప్పక చేసెదను'' యనగా, శ్రీకృష్ణపరమాత్మ మాటలకు మిగుల సంతుష్టుడై యుధిష్ఠిరుడు ఆయనతో నిట్లనెను:

"కృష్ణా! ధృతరాష్ట్రుడు పుత్రసహితుడై చేయబోవు కార్యమును నీవు వినియే యున్నావు. సంజయుడు నాతో చెప్పిన మాటలే ధృతరాష్ట్రుని యభిప్రాయమని స్పష్టమైనది. సంజయుడు ధృతరాష్ట్ర మనోభావములనే ప్రకటించెను. దూతయైన సంజయుడు ప్రభువు నభిప్రాయమునకు విపరీతముగా మాట్లాడినచో వధార్హుడగును గాబట్టి, సంజయుడు, తన ప్రభువు మాటనే చెప్పెను.

''ధృతరాష్ట్రునకు రాజ్యమునందు అతి లోభము గలదు. అతని మనస్సునందు పాపము నిండి యున్నది. అందుచేత నతడు తనకు అనురూపముగానే వ్యవహరించుచు, మాకు రాజ్యమియ్యకుండనే, సంధికి మార్గము వెదకుచున్నాడు.

"మహాత్మా! ధృతరాష్ట్రుడు తన ప్రతిజ్ఞపైన స్థిరముగా నిలిచియుండునని తలచి, అతని యాజ్ఞచేతనే మేము పదమూడేండ్లు అరణ్యాజ్ఞాత వాసములు చేసితిమి. కృష్ణా! మేము ప్రతిజ్ఞా భంగము చేయలేదు. ఈ విషయము, మాతో నుండిన బ్రాహ్మణు లందరికిన్ని తెలియును. కాని, ధృతరాష్ట్రుడు దురాశాలోభ పూరితుడై యున్నాడు అతడు, తన విధ్యుక్త ధర్మము వైపు చూచుట లేదు. పుత్రప్రేమ చేత, సర్వదా పుత్రుల వశములో నుండుట చేతను నతడు, తన మూర్ఖ పుత్రుడైన దుర్యోధనుని యభిప్రాయమునే అనుసరించుచున్నాడు. జనార్దనా! దుర్యోధనుని మతమునందు ఉండి, తనకు ప్రియమైన కార్యమునే చేయుచు, మా యెడల ధృతరాష్ట్రుడు అసత్యముగా వ్యవహరించుచున్నాడు.

"ప్రభూ! నేను నా మాతృదేవిని, మిత్రులను గూడ పోషించలేకయున్నాను. ఇంతకన్న దుఃఖకరమైన విషయమేమి యుండును? కాశీ - చేది - పాంచాల - మత్స్య దేశాది వీరులు మాకు సహాయకులుగా నున్నారు. నీవు మాకు రక్షకుడవుగా నిలిచి యున్నావు. మీ యందరి సహాయముతో మేము సమస్త రాజ్యమును తీసికొనగలము. అయినను, నేను అయిదు ఊళ్ళు మాత్రమే యిమ్మని వారి నడిగితినిగదా! నేను ధృతరాష్ట్రునితో నిట్లంటిని :

"తండ్రీ! మాకు, 'అవిస్థలము - వృకస్థలము - మాకంది - వారణావతము' ఇచ్చి, చివరిది యైన అయిదవగ్రామము ఏదైనను నీ యిష్టము వచ్చినది యిమ్ము. ఇట్లు అయిదు గ్రామములు గాని, లేక, ఒక పట్టణము గాని యిమ్ము.

దానియందు మేము అయిదుగురు సోదరులము ఒకటిగా కలిసి యుండెదము. మావలన భరత వంశీయులకు నాశము కలుగకుండుగాక!

''కాని, మహాత్మా! దుష్టాత్ముడైన దుర్యోధనుడు, అందరిపైన తాను అధికారము కలవాడ నని ఆ అయిదు ఊళ్ళు మాకు ఇచ్చుటకుగూడ అంగీకరించలేదు. ఇంతకన్న బాధాకర మైన విషయము మరి యేది యుండును?

''కృష్ణా! ఉత్తమ కులమునందు పుట్టి,వృద్ధు డై కూడ, ఇతరుల ధనమును అపహరింప దలచిన యెడల, ఆ మనుష్యుని లోభము, అతని విచారశక్తిని నశింప జేయును. తరువాత ఆ లోభమే ఆ మనుష్యుని లజ్జనుగూడ నశింపజేయును. లజ్జ నశించినప్పుడు, అది ధర్మమునుగూడ నశింప జేయును. ధర్మము నశించినప్పుడు అది మనుష్యుని సంపదనుగూడ నష్టము చేయును. నష్టమైన సంపద ఆ మనుష్యునకు నాశహేతు వగును. ధనాభావమే మనుష్యునకు వధవంటిది కదా!

ధర్మరాజు నిర్ధనుని దుర్గతిని గూర్చి చెప్పుట

''భగవన్! ధనహీనుని బంధువులు - మిత్రులు - బ్రాహ్మణులుగూడ, పుష్పఫలరహిత మైన వృక్షమును పక్షులు విడిచినట్లు విసర్జించెదరు. ప్రజలు, పతితు డైన మనుష్యునకు దూరముగా పోవునట్లు, మరణించిన శరీరమునుండి ప్రాణములు పోవునట్లున్ను, నా కుటుంబ జనముగూడ, నిర్ధనుడ నైన నన్ను విడిచి పోయెదరు. ఇది నాకు మరణమే యగును గదా! 'ఈనాడు, రేపు ఉదయము' ఈ రెండు పూటలకుగూడ భోజనము లభించని దరిద్రత్వముకన్న మించిన దుఃఖకర మైన దశ మరియొకటి యుండ దని 'శంబరుడు' (ఒక రాజు) చెప్పెను.

''కృష్ణా! ధనమే ఉత్తమ ధర్మ సాధకము కదా! ధనమునందే సర్వము ప్రతిష్ఠిత మై యున్నది. ప్రపంచమునందు ధనవంతులే జీవింతురు. నిర్ధనులు చచ్చినవారితో సమానులు. ఏ మనుష్యులు, తాము బలవంతుల మని తలచి, బలముతో నితరుల ధనమును లాగుకొనెదరో వారు ధర్మ - అర్థ - కామములనే కాక, ధనహీనులుగా చేయ బడిన వారినిగూడ నశింప జేసెదరు

"కృష్ణా! ఇట్టి నిర్ధన దశను అనుభవించ లేక, యెందరో మరణమును కోరిరి. ఎందరో తాము ఉన్న ఊరు విడిచి గ్రామాంతరమునందు నివసించిరి. ఎందరో అడవులు పట్టి పోయిరి. ఎందరో ఉన్మత్తు లగు చున్నారు. అనేకులు, శత్రువులకు వశు లగు చున్నారు. ఎందరో మనుష్యులు ధనము కొరకు, ఇతరుల యొద్ద బానిసతనముగూడ అంగీకరించెదరు.

''కృష్ణా! మనుష్యునకు ధన సంపదల నాశము గొప్ప విపత్తికే కారణమగును. ఆయాపద మృత్యువుకన్న గొప్పది. సంపదయే మనుష్యునకు ధర్మ - కామ సంపాదనకు కారణ మైనది. మనుష్యునకు ధర్మానుకూలమైన మృత్యువు పరలోక ప్రాప్తికొరకు సనాతన మార్గము. ప్రాణులలో నెవడుగూడ అట్టి మరణమును ఏ విధముగగూడ ఉల్లంఘించ జాలడు. కృష్ణా! గొప్ప సంపదలను జన్మము నుండియే అనుభవించి, బాగుగా సుఖపడుచునే పెరిగిన మనుష్యునకు, ఆ సంపద నశించినప్పుడు కలిగినంత కష్టముకన్న, పుట్టుకతో నిర్ధనుడుగా నుండినచో ఆ పేదతనమువలన కలిగిన కష్టము వానిని పెద్దగా బాధించదు మనుష్యుడు, తన యపరాధములచేతనే గొప్పసంకటమునందు పడినప్పటికిన్ని, అతడు తన అభాగ్యమును, దానిని కలిగించిన ఇంద్రాది దేవతలనే నిందించును గాని, ఆ దరిద్ర దోషము తనకు అంట గట్టుకొనడు. అట్టి సమయమునందు ఆజన్మదరిద్రునకు, ఏ శాస్త్రములుగూడ, ఆ సంకటమునుండి విముక్తి కలిగించ జాలవు, అట్టివాడు, తన సేవకులను కోపించును బంధుమిత్రుల దోషములనే చూచుచు, వారియెడల అసూయపడును

''శ్రీకృష్ణా! దరిద్రదశలో మనుష్యునకు క్రోధము మాత్రమే వచ్చును. దానిచేత నతనిపై మోహము కప్పబడును. అతనికి యుక్తాయుక్త వివేకశక్తిగూడ నశించును. మోహమునకు వశుడై క్రూరకర్మలు చేయుటకు అతడు ఆరంభించును. ఇట్లు పాపకార్యములు చేయుటకు ప్రవృత్తి కలవాడగుటచేత, అతడు జాతి సాంకర్యమును పొంది, సంకరజాతిలో పుట్టిన సంతానమును పోషించుచుండును జాతి సాంకర్యము నరకప్రాప్తినే కగించును. పాపిష్ఠులకు ఇదియే చివరకు ఏర్పడు గతి.

''శ్రీకృష్ణా! అట్టి పాపిష్ఠునకు మరల కర్తవ్యముల జ్ఞానము కలుగకున్న యెడల, అతడు నరకమువైపునకే సాగి పోవుచుండును. కర్తవ్యజ్ఞానము కలిగించునది ప్రజ్ఞ (బుద్ధి) యే యగును. ప్రజ్ఞానేత్రము గలవాడు నిశ్చయముగా సంకటమును దాట గలడు. పజ్ఞ కలిగినవాడు, శాస్త్రపఠనములయందే దృష్టి పెట్టును. శాస్త్రమునందు శ్రద్ధ గలిగినపుడు అతడు మరల ధర్మమును అనుష్ఠించును.

"ధర్మము యొక్క శ్రేష్ఠమైన అంగము, లజ్జ యగును. లజ్జ ధర్మముతోనే వచ్చును. లజ్జ గలవాడు పాపమును ద్వేషించి, దానికి దూరముగ

నుండును. ఆ కారణముచేత, అతని ధన సంపత్తి అభివృద్ధి పొందుచుండును. మనుష్యుడు ఎంత గొప్ప ధనవంతుడగునో అంత గొప్ప గౌరవ-సమ్మానములు పొందును.

"ధర్మమునందు సర్వదా ఆసక్తి గల పురుషుడు శాంతచిత్తుడై, సత్కర్మములయందు నిరంతరము నిమగ్నుడై యుండును. అతడెప్పుడు గూడ అధర్మమునందు మనస్సు పెట్టడు. అతనికి పాపమునందు ప్రవృత్తి కలుగదు.

"కృష్ణా! నిర్లజ్జుడైన మూర్ఖుడు స్త్రీ కాడు పురుషుడున్ను కాడు. అతనికి ధర్మకార్యములను ఆచరించుటకు అధికారము ఉండదు. అతడు శూద్రునితో సమానుడు. లజ్జావంతుడు దేవతలను-పితృదేవతలను- తననున్ను రక్షించును. దీనిచేత నతడు అమృతత్వము (మోక్షము)ను పొందును. అదియే, అట్టి పుణ్యపురుషులకు గలుగు ఉత్తమ గతి.

"మధుసూదనా! నేను ఏ విధముగా రాజ్యభ్రష్టుడనై, ఎన్ని కష్టములు అనుభవించుచు ఈనాడు కాలము గడుపుచున్నానో, అది యంతయు నీవు ప్రత్యక్షముగా చూచుచున్నావు. అందుచేత, మేము ఏ న్యాయము చేతనైనను, మా తండ్రితాతల సంపదను విడుచుకొనుటకు తగము. దానికొరకు ప్రయత్నము చేయుచున్న మాకు మరణము సంభవించినను మంచిదే.

"మాధవా! మేము - ధృతరాష్ట్రిలున్ను పరస్పరము సంధి చేసికొని, శాంతభావముతో ఉండి రాజ్యసంపదను సమానముగా అనుభవించవలెననునది మా మొదటి పక్షము. లేదా, మేము కౌరవులను సంహరించి రాజ్యసంపత్తినంతయు మా యధికారములోనికి తీసికొనవలెననునది మా రెండవ పక్షము.

''కృష్ణా! మనకు ఏలాటి సంబంధము లేకుండి, మనపైన శత్రుత్వముతో నీచముగా వ్యవహరించువారిని గూడ వధించుట ఉచితము గాదు. ఇట్లుండగా, మన బంధువులు-శ్రేష్ఠులు-మిత్రులునైన వారిని వధించుట ఉచితమెట్లగును? మా విరోధులలో చాలామంది మా బంధువులు - భ్రాతలు - సహాయకులు-గురుజనులు నున్నారు. వారిని వధించుట యనిన మహా పాపము గదా! యుద్ధమునందు మంచిదనునది ఏమి యున్నది? ఏదియు లేదు. క్షత్రియ జాతికి యుద్ధము ధర్మమనునది పాప రూపమే యగును. మేముగూడ క్షత్రియులమే. అందుచేత, మా స్వధర్మము పాపమైనను, మాకు అది చేయవలసియే

యుండును. ఎందు కనగా, యుద్ధమును విడిచి, యితర వృత్తిని దేనిని గూడ అవలంబించుట మాకు నింద్యము. శూద్రులు సేవ - వైశ్యులు వ్యాపారము చేసి జీవించెదరు. మేము క్షత్రియులము. ఇతరులను వధించియే జీవనము గడపి కొనెదము. బ్రాహ్మణులు తమ జీవనము కొరకై భిక్షాపాత్రమును ఆధారముగా చేసికొనిరి. క్షత్రియుడు క్షత్రియుని చంపు చున్నాడు. చేప చేపను తిని బ్రతుకు చున్నది. శునకము శునకమును చంపు చున్నది. కృష్ణా! ఇదియే పరంపరగా వచ్చుచున్న ధర్మము.

"కృష్ణా! యుద్ధమునందు సర్వదా కలహమే యగును. దానివలననే ప్రాణ నాశము కలుగును నేనో, నీతిబలమునే ఆశ్రయించి, యుద్ధము చేసెదను. ఈశ్వరేచ్ఛ ప్రకారము జయమో, అపజయమో అగుగాక!

"కృష్ణా! ప్రాణుల చావు బ్రతుకులు వారి యిచ్ఛానుసారము కావు. ఈ పరిస్థితియే జయ-పరాజయములందు గూడ నుండును. ఎవనికి గూడ సుఖ దుఃఖములు అసమయమునందు సంభవించవు. యుద్ధమునందు ఒక్కడే యనేకులను గాని, లేక, అనేకులు గలిసి యొక్కనినేకాని సంహరించెదరు. నీచ పురుషుడు మహాశూరుని, యశస్సు లేనివాడు గూడ యశస్విని చంపును. యుద్ధమునందు ఇద్దరికిన్ని జయము గాని, అపజయము గాని కలుగుట చూడము గదా! కాని, యిద్దరికిన్ని ధన - వైభవముల నాశము తప్పక కలుగు చుండుట చూచు చున్నాము ఏ వైపు వారైనను, వీపు జూపి పారి పోయినచో, ఆ పక్ష మునకు గూడ ధన నాశము - జన నాశమున్ను కలుగును.

"కృష్ణా! యుద్ధము సర్వధా పాప మని దీనివలన సిద్ధ మగు చున్నది. ఇతరులను చంపువాడు, ఒకనాడు తాను గూడ చంప బడకుండు వాడు ప్రపంచములో నెవ డున్నాడు? యుద్ధమునందు చంప బడినవానికి జయాపజయములు సమానములే. పరాజయము మృత్యువుకన్న మంచి దని నేను తలచను. విజయము సాధించిన వానికి గూడ గొప్ప ధన - జన హాని కలుగును. యుద్ధము ముగియువరకు ఎందరో శత్రుసైనికులు, విజయము సాధించిన వీరుని యొక్క ప్రియజనుల ననేకులను చంపెదరు. విజయియొక్క కుటుంబజనులు - ధన సంపదలు మొదలైనవి నశించి, అతడు బలహీను డగును. కృష్ణా! విజయి యొక్క పుత్రులు, సోదరులున్ను చనిపోవగా జూచి అతనికి తన బ్రతుకుపైన గూడ వైరాగ్యము కలుగును. కృష్ణా! ధీరులు - వీరులు - లజ్జావంతులు -

ఉత్తములు - దయాపరులు తరచుగా యుద్ధమునందు చంప బడుదురు. అధములు బ్రతికెదరు.

''జనార్దనా! శత్రువులను సంహరించితిమే యని జయశీలుని మనస్సులో గూడ పశ్చాత్తాపము కలుగక పోవదు. పారిపోవుచున్న శత్రువులను తరుముట గూడ పాపమే యగును. చంప బడు శత్రువులలో కొందరు బ్రతికి యుండ గలరు. ఆ మిగిలిన శత్రువులు, తమ శక్తిని మరల కూర్చుకొని, విజేత పక్షము నందు మిగిలిన వారిని సంహరించుటకు ప్రయత్నించెదరు. వారు శత్రుపక్షమును పూర్తిగా అంత మొందించుటకు ప్రయత్నించు చుండెదరు.

''కృష్ణా! విజయము వైరమును పుట్టించును. ఓడినవాడు దుఃఖించు చుండును. ఎవరితోను శత్రుత్వము చేయక శాంతితో నుండువాడు, జయాపజయములను గూర్చిన చింతను విడిచి, సుఖముగా నిద్రించును. మనస్సులో పగ పెట్టుకొనినవాడు, సర్పయుక్త గృహములో నున్నవానివలె, ఉద్వేగముతో సర్వదా దుఃఖించు చుండును. శత్రుకులము నంతటిని నశింప జేసినవానికి, కీర్తి పూర్తిగా నశించును. అతడు అపకీర్తితోను సమస్త ప్రాణుల హృదయములలో సర్వదా నిలిచి యుండును. వైరము మనస్సునందు చాలకాలమువరకు అణచి యుంచుకొనినప్పటికిన్ని ఆ వైరాగ్ని యేమాత్రము ఆరిపోవదు. ఎందు కనగా, నతని కులమునందు ఉన్నవారు, పూర్వవైరమును పెంచు సంఘటనలను అతనికి తెలుపువారున్ను ఎందరో ఉండెదరు.

''కృష్ణా! పగ పగ చేత చల్లారదు. హవిస్సు వేయగా నభివృద్ధి చెందు అగ్ని వలె మరల - మరల పెరుగు చుండును. రెండు పక్షములయందు, ఏదియో యొక దోషము దొరక వచ్చును కాబట్టి, రెండింటిలో నొకపక్షము పూర్తిగా నశించకుండ, పరిపూర్ణశాంతి ప్రాప్తించదు. దోషములను వెదకు చుండు వారి ముందు దోషము నిరంతరము కనపడు చుండును.

''కృష్ణా! పౌరుషవంతుడు, పూర్వవైరమును జ్ఞప్తికి తెచ్చుకొని, దానిచేత హృదయమును పీడించు చింతను పూర్తిగా వైరాగ్యముతో త్యజించినప్పుడే శాంతి లభించును. లేక, మరణించిన మీదటనే, ఆ చింత తొలగి పోవును. లేదా శత్రువులను సమగ్రముగా నిర్మూలించినప్పుడే, కోరిన ఫలము సిద్ధించును కాని, దేవా! అది చాల క్రూరకార్యముగదా? రాజ్యమును విడుచుట చేత కలుగు శాంతి

గూడ, వధతో సమానమే యగును. ఎందు కనగా, అట్టి పరిస్థితిలో, 'శత్రువులు అవకాశము దొరకినప్పుడు, కొట్ట వచ్చును, ధనసంపత్తి నశించి యుండుటచేత, తనకు నాశనము కలుగ వచ్చును', అను సందేహము సర్వదా అతనిని బాధించుచుండును.

''కృష్ణా! అందుచేత, రాజ్యమును విడుచుటకు గాని, లేక, కులమును నశింప జేయుటకు గాని మేము ఇచ్ఛయించుట లేదు. అణగిపోయి, నమ్రత్వము చేత నైనను శాంతి కలిగిన యెడల, అదియే అన్నిటికన్న శ్రేష్ఠము. ఒకవేళ, యుద్ధమును కోరకుండ సామ - దాన - భేదోపాయములచేత, రాజ్యమును పొందుటకు ప్రయత్నము చేసినప్పటికిన్ని, మా సామోపాయమందలి నీతి సఫలము కాకున్నచో, యుద్ధమే మా ముఖ్యకర్తవ్య మగును. మేము పరాక్రమము విడిచి కూర్చొని యుండ జాలము గదా? శాంతి ప్రయత్నములు విఫలము లైనప్పుడు, భయంకర మైన యుద్ధము, తనంతట నదియే ప్రారంభించును. పండితులు ఇట్టి యుద్ధము, కుక్కల పోట్లాటతో తుల్య మని చెప్పినారు,

''కృష్ణా! కుక్కలు మాంసపు ముక్కకొరకు మొదట తోక ఆడించును. తరువాత 'గుర్ర్' అనును. పిదప మొరుగును. ఆ తరువాత రెండున్ను ఒండొంటిని సమీపించును. పిదప దంతములు చూపును, బిగ్గరగా మొరుగును. ఆ తరువాత వానికి కలహము ఆరంభించును. ఆ రెండు కుక్కలలో బలము గలది ఆ మాంసపు ముక్కను తినును.

"కృష్ణా! ఈ పరిస్థితియే, మనుష్య కలహములో గూడ సంభవించును. శునకములలో - మానవులలో విశేష మేమియు లేదు. యుద్ధము చేయువారు గూడ ఈ యన్ని చేష్టలు చేయుదురు. కుక్కతోక ఆడించుట వంటిది ధ్వజము ఆడించుట. తక్కిన వన్నియు సమానములే.

"కృష్ణా! దుర్బలులపైన బలవంతులకు ఆదర భావము ఉండకుండుట సముచితమే. దుర్బలులు బలవంతులతో విరోధము గూడ చేయరు. సర్వదా వంగిపోవుటకు సిద్ధముగా నున్నవాడే దుర్బలుడు.

''కృష్ణా! తండ్రి - రాజు - వృద్ధుడు - వీరు పూర్తిగా ఆదరింప దగినవారే. అందుచేత ధృతరాష్ట్రుడు మాకు పూజ్యుడు - మాననీయుడు.

''మాధవా! ధృతరాష్ట్రునకు తన పుత్రునిపై ప్రబల మైన ప్రేమ కలదు. అతడు పుత్రుని వశములో నున్నాడు. కాబట్టి, అతడు అణగి యుండుటకు ఎప్పుడు గూడ అంగీకరించడు.

''కృష్ణా! యిట్టి పరిస్థితిలో నీవు ఏది ఉచిత మని భావించెదవు? మాకు ధర్మార్థములు లోపించకుండుటకు, ఇప్పుడు మేము వారితో నెట్లు వ్యవహరించవలెను?

''పురుషోత్తమా! యిట్టి సంకటావస్థలో మేము, నిన్ను దప్ప మరియెవరితో సంప్రదించి అడిగెదము? నీవంటి ప్రియుడు - మా హితమును కోరువాడు - అన్ని కార్యములు ఫలితముల నెరిగినవాడు - అన్ని విషయములలోను నిశ్చిత మైన ఒక సిద్ధాంతము గల మిత్రుడు మరియొకడు మాకు ఎవ డున్నాడు?''

జనమేజయా! యుధిష్ఠిరుని మాటలు విని శ్రీకృష్ణభగవానుడు అతనితో ని ట్లనెను:-

''రాజా! నేను రెండు పక్షముల హితము కొరకు కౌరవులసభకు పోయెదను. అక్కడ మన లాభమునకు ఏలాటి భంగము కలగకుండు విధమున ఇరుపక్షములకు సంధి చేయ గలిగిన యెడల, నావలన మహాఫలదాయక మైన యీ మహా పుణ్యకార్యము నెరవేరిన దని తలచెదను. అట్లు నేను చేయ గలిగినప్పుడు, పరస్పరము రోషము గల కౌరవ - సృంజయ - పాండవులను, ధృతరాష్ట్రపుత్రులను, సమస్త భూమండలమును గూడ మృత్యు ముఖమునుండి తప్పించెదను.''

ఈ మాటలు విని యుధిష్ఠిరుడు కృష్ణునితో ని ట్లనెను:

''కృష్ణా! నీకు ఏది యిష్టమో అదియే చేయుము. నీకు శుభ మగుగాక! నీవు సంతోషపూర్వకముగా కౌరవులకడకు పొమ్ము. నీ కార్యమునందు సఫలుడవై క్షేమముగా తిరిగి యిక్కడికి రా గోరెదను.

''విష్వక్సేనా! నీవు కురుదేశమునకు పోయి, భరతవంశీయులను శాంతింప జేయుము. దానివలన, మే మందరము పరిశుద్ధ హృదయుల మై సంతోషముతో ఒకటిగా కలిసి యుండెదము గాక!

''కృష్ణా! నీవు మాకు సోదరుడవు - మిత్రుడవు. అర్జునునకు, నాకున్ను ప్రియుడవు. నీకు మాయెడల గల మైత్రి విషయములో మాకు ఏలాటి సంశ

యములేదు. అందుచేత నీవు ఉభయపక్షముల శ్రేయస్సు సాధించుటకొరకు అక్కడకు పొమ్ము. నీకు మంగళ మగుగాక!

"శ్రీకృష్ణా! నీవు మమ్ము ఎరుగుదువు. శత్రువులనున్ను ఎరుగుదువు. మా యిద్దరి స్వార్థములు గూడ నీకు పరిచితములే. నీకు మంచి సంభాషణ చాతుర్యము గలదు. అందుచేత, ఎట్లు మాటాడినచో మాకు హితము కలుగునో, ఆ విధముగ నక్కడ మాటాడి అన్ని విషయములను దుర్యోధనునకు తెలుపుము.

"కృష్ణా! ఏయేమాటలు ధర్మసంగతములో, యుక్తియుక్తములో, హిత కరములో, ఆయా మాట లన్నియు, అవి: మృదువు లైనను, కఠినములైనను నీవు కౌరవసభలో చెప్పుము."

జనమేజయా! అట్లు శ్రీకృష్ణభగవానునకు యుధిష్ఠిరుడు చెప్పగా కృష్ణ పరమాత్ముడు మరల నతనితో నిట్లనెను:

ధర్మజుని శ్రీకృష్ణుడు యుద్ధముకొరకు ప్రోత్సహించుట

"రాజా! నేను సంజయుని మాటలు, నీ మాటలున్ను విన్నాను. కౌరవుల యభిప్రాయ మంతయు నెరుగుదును. నీ విచారము గూడ తెలిసినది. నీ బుద్ధి ధర్మమునందు నిలిచి యున్నది. వారి బుద్ధి శత్రుత్వముతో నున్నది. నీవు యుద్ధము లేకుండ, దొరికినదే గొప్ప దని తలచు చున్నావు. కాని, మహారాజా! నీవు తలచునది క్షత్రియుని స్వాభావిక కార్యము గాదు.

"రాజా! బ్రహ్మచర్యాదు లైన నాల్గు ఆశ్రమము లందలి శ్రేష్ఠపురుషులు, క్షత్రియులు భిక్షమడుగ గూడ దని చెప్పినారు. క్షత్రియునకు యుద్ధమునందు జయము గాని మరణము గాని, విధాత నిర్ణయించినాడు. ఇది సనాతన కాలము నుండి వచ్చు చున్న క్షత్రియుని కర్తవ్యము. దైన్యము క్షత్రియుని కర్తవ్యము కాదు. యుధిష్ఠిరా! దైన్యముతో క్షత్రియుని జీవనము గడవదు. కనుక, ఇప్పుడు నీ పరాక్రమము చూపించి శత్రుసంహారము చేయుము.

"రాజా! ధృతరాష్ట్రి పుత్రులు అతి లోభులు. దుర్యోధనుడు తన మిత్ర రాజ్యములవారి నందరిని తనయొద్ద చేర్చుకొని చాలకాలము నుండి వారి స్నేహ మును సంపాదించుకొనినాడు. యుద్ధ విద్యాభ్యాసము చేతగూడ వారు విశేష బలమును కూర్చుకొనినారు. అందుచేత, రాజా! వారు మీకు అర్ధరాజ్యమును ఇచ్చి

మీతో సంధి చేసికొనుటకు తగిన ఉపాయ మేమియు కనబడుట లేదు. భీష్మ - ద్రోణ - కృపాచార్యాది మహావీరులు వారి పక్షమునందు ఉన్నారు. కాబట్టి, వారు మీకంటె నెక్కువ బలవంతుల మని తలచు చున్నారు. ఎంతవరకు నీవు వారితో మృదువుగా వ్యవహరించెదవో, అంతదాక వారు నీ రాజ్యమును అపహరించుటకు ప్రయత్నించు చుండెదరు.

"రాజా! ధృతరాష్ట్రిపుత్రులు, మీ యందు దయదలచికొని, మీరు దీనులు దుర్బలు లని కాని, లేక, ధర్మార్థములపై దృష్టిని ఉంచికొని మీ కోరికను నెర వేర్చెద రని నీవు తలచవద్దు. వారు మీకు గోచి పెట్టించి, దీర్ఘకాలమువరకు దుష్కర మైన అరణ్యవాస కష్టము కలిగించి కూడ, దానికొరకు ఎప్పుడును ఏమాత్రము పశ్చాత్తాపము చెంద లేదు కనుక, కౌరవులు మీతో సంధి చేసికొన రనుట ఆ ఒక్క కారణము చేతనే రుజావు చేయ వచ్చును.

"రాజా! నీవు దానశీలుడవు - మృదుస్వభావము గలవాడవు - శాంతు డవు - ధర్మాత్ముడవు. ఇన్ని సద్గుణములు గలవాడ వైనను, క్రూరు డైన దుర్యోధనుడు, జూదమాడునప్పుడు భీష్మాదివీరులు - ధర్మాత్ములు - ప్రజలు అందరున్ను చూచు చుండగానే, జూదమునందు కపటము చేసి నిన్ను మోసగించెను. అప్పు డతడు చేసిన దుష్కృత్యమునకు ఇంతవరకు గూడ సిగ్గు చెందుట లేదు. అట్టి కుటిల స్వభావుడు - దురాచారుడు నైన దుర్యోధనుని యెడల నీవు ప్రేమ చూపించకుము. ధృతరాష్ట్రపుత్రులు అందరికిన్ని చంప దగినవారే. కనుక, నీవు వారిని వధింపుము. ఇందులో చెప్పవలసిన దే మున్నది?

"రాజా! దుర్యోధనుడు, అతని తమ్ములున్ను అనాడు నిన్ను అసభ్య వచనములతో బాధపెట్టిరి గదా! ఆ దినము నీవు మరచితివా? ఇప్పుడు పాండవుల యొద్ద ఈ ప్రపంచమునందు "తనది అను వస్తు వేదియు లేదు. వారి కిప్పుడు వారి పేర్లు - గోత్రము మాత్రమే మిగిలి యున్నవి. కాని, అవి గూడ ఇకమీద మిగులవు' అని దుర్యోధనుడు మిక్కిలి సంతోషముతో ఉబ్బిన వా డై అసత్య ముగా ఆత్మ ప్రశంస చేసికొనుచు, తన తమ్ములతో అనుచుండెను గదా! అది మరచితివా?

"రాజా! కాలము వచ్చినప్పుడు వారికి తప్పక అవమానము కలుగును. ఆ పరాజయముతో వారికి సహజముగా నున్న బలపరాక్రమాదులు నశించ గలవు. అప్పుడు వారు నాయొద్దనే ప్రాణత్యాగము చేసెదరు.

'ద్యూతసమయమునందు పాపిష్ఠుడు - దురాత్ముడు నైన దుశ్శాసనుడు, రాణి ద్రౌపదిని కొప్పు పట్టుకొని సభలో ఈడ్చుకొని వచ్చెను గదా! అప్పుడు ఆమె అనాథవలె ఏడ్చు చుండెనుగదా! అప్పు డతడు, భీష్మద్రోణాదుల సమక్షము నందు, ఆమెను 'గోవు' అని బిగ్గరగా మాటిమాటికి అరచెను. (అనగా, గోవులకు నియతముగా ఒక పతి లేనట్లే, ఈమె యిప్పుడు దాసి కాబట్టి, యీమెకు ఎవరైనను పతి కావచ్చు నని భావము.) అప్పుడు, పరాక్రమవంతు లైన నీ తమ్ములను నీవు నివారించితివి. కాబట్టి, వారు ధర్మపాశబద్ధు లై, ఏమియు చేయ లేదు.

"రాజా! మీరు అడవికి పోవునప్పుడు గూడ దుశ్శాసనుడు, బంధువుల మధ్య, పైమాటలేకాక, యింకను నెన్నియో దుర్భాషలు గూడ కఠినముగా పలికి తన ప్రశంస చేసికొను చుండెను గదా! అక్కడికి ఆహ్వానింప బడిన రాజ వీరు లందరు, నిరపరాధు లైన మిమ్ము చూచి, ఏడ్చుచు, కన్నీరు కార్చుచు ఏమియు చేయ జాలక ఊర కుండిరి గదా! అక్కడ చేరి యున్న రాజులు, బ్రాహ్మణులు నతనిని అభినందించిరా? అందరున్ను దుర్యోధనుని నిందించిరి గదా!

"రాజా! సత్కులీనుడు, వధ - నిందలలో వధయే మంచి దని భావించును. అతడు జీవిత మంతయు నిందా పాత్రు డైనచో, ప్రజల ఏవగింపునకు పాత్రు డగును. నిర్లజ్జు డై, రాజు లందరిచేత నిందింపబడినప్పుడే అతడు మృతు డైనట్లు భావించ వలెను. ఇంతటి దుష్టప్రవర్తన గలవానిని వధించుట చాల సులభము. ఎట్లనగా, వేళ్ళు నరకబడి, మొద్దులై నిల బడిన వృక్షముల వలె, దుర్యోధనుడు పడిపోవుటకు ఏమాత్రము విలంబము పట్టదుగదా! దుర్బుద్ధి యైన దుర్యోధనుడు దుష్టసర్పమువలె, అందరికిన్ని వధ్యు డగును. రాజా! నీవు సంశయించక యతనిని సంహరింపుము. నీవు పితృసమాను డైన ధృతరాష్ట్రుని యెడల, పితామహు డైన భీష్మునియెడలను నమ్రత్వము (అణకువ)తో వ్యవహరించుట సర్వథా అనుచితము. నేను గూడ దీనిని అభినందించను.

"రాజా! దుర్యోధనుని విషయములో సంశయము గలవారిని కలిసికొని, నేను వారి సంశయము నివారించెదను. నేను కౌరవరాజసభయందు చేరి యున్న రాజసమూహములో, నీ సర్వసాధారణ గుణములను గూర్చి వర్ణించి, దుర్యోధనుని దోషములను, అపరాధములనున్ను ఉద్ఘాటించెదను. నేను ఆ సభయందు ధర్మార్థ సహితముగా చెప్పిన మాటలను వినిన నానాదేశ రాజులు, 'నీవు ధర్మాత్ముడవు - సత్యవచనుడ వనియు, దుర్యోధనుడు లోభముచేత ఈ అనుచిత కార్యము వ్యర్థముగా చేయు చున్నా' డనియు నిశ్చయించుకొనెదరు. నేను, అక్కడకు వచ్చిన చాతుర్వర్ణ్యము వారిని ఆబాలవృద్ధులను, నా యభిప్రాయముతో ఏకీభవింపజేసికొని, వారి యెదుట, పురజన - దేశజన సమక్షములోను దుర్యోధనుని నిందించెదను.

"రాజా! ఆ సభలో నేను శాంతిని యాచించినప్పుడు నీకు అధర్మము అంటదు. అక్కడి రాజు లందరు కౌరవులను, ధృతరాష్ట్రునిన్ని నిందించెదరు. దుర్యోధనుడు అన్యాయము చేయు చున్నా డని అందరు అతనిని విడిచినప్పుడు, అతడు నిందనీయుడు కాబట్టి, మృతప్రాయు డగును. అట్టి సందర్భమునందు, మీ కార్యము ఏమాత్రము మిగులకుండ నెరవేరినట్లే కదా! ఇక చేయ వలసినది యేమి యుండును? అక్కడికి నేను పోయి, మీ స్వార్థస్థితికి ఏ కొంచెము గూడ లోపము రాకుండ జేయుచు, కౌరవు లందరితోను సంధికిగాను ప్రయత్నించెదను. వారి చర్యలను గూడ గమనించెదను.

"రాజా! నేను యుద్ధ విషయమై, కౌరవులు చేయు చున్న ప్రయత్నములను, అక్కడి సమాచారమునున్ను తెలిసికొని, విని, నీ విజయము కొరకు తిరిగి యిక్కడికి వచ్చెదను. శత్రువులతో యుద్ధము సర్వథా కలుగు నని నాకు తోచు చున్నది. నాకు అటువంటి శకునములే కనపడు చున్నవి.

"రాజా' మృగములు - పశువులు - పక్షులున్ను భయంకరముగా ఘోర ధ్వనులను చేయు చున్నవి. ప్రదోష (మునిమాపు) కాలమునందు, గజశాలలలో - అశ్వశాలలలోను వికృతము లైన భయంకరాకారములు గజాశ్వములపైన కనపడు చున్నవి. అగ్ని దేవుని యందు గూడ భయంకరము లైన పలు రంగులు కనపడు చున్నవి.

"రాజా! మానవలోకము నంతటిని సంహరించు మృత్యువు ఇప్పుడు దుర్యోధనుని సమీపించకుండిన యెడల, ఇట్టి అపశకునములు కనపడవు. అందు

చేత రాజా! నీ పక్షమునందలి యోధులందరు దృఢ నిశ్చయముతో వివిధము లైన అస్త్ర శస్త్రములను, కవచ యంత్రాదులను, చతురంగ సైన్యములను సమకూర్చుకొని, వాహనముల నెక్కి, యుద్ధసన్నద్ధులు కావలెను. ఇవియేకాక, యుద్ధోపయోగము లైన యితర వస్తు సామగ్రులను గూడ మీరు చేకూర్చుకొనుడు.

మహారాజా! మీ యధీనమునందు పూర్వము ఉండిన సమృద్ధ మైన రాజ్యమును నీవు జూదమునందు బోగొట్టుకొంటివి. ఆ రాజ్య మంతయు నిప్పుడు దుర్యోధనుని వశమునందు ఉన్నది. ఆ రాజ్యవైభవ మంతయు, దుర్యోధనుడు, తాను బ్రతికి యుండగా, ఎప్పుడు గూడ మీకు స్వయముగా నీయ జాల దని నిశ్చయముగా తెలిసికొనుము."

జనమేజయా! అట్లు శ్రీకృష్ణభగవానుడు చెప్పిన మాటలు విని, భీమసేనుడు శ్రీకృష్ణునితో ని ట్లనెను:

భీముడు శాంతి సందేశము కృష్ణునకు చెప్పుట

"మధుసూదనా! మా యిరు వర్గములలో శాంతి స్థాపనకు అను వైన విధముగా కౌరవ సభలో మాటాడుము. యుద్ధము మాట వినిపించి వారిని భయపరచకుము. దుర్యోధనుడు ఓర్పు లేనివాడు. క్రోధముతో నెల్లప్పుడు నుండువాడు. శ్రేయస్సును విరోధించువాడు. మనస్సులో గొప్ప ఉత్సాహముతో నుండువాడు కనుక, అతనితో కఠినముగా మాట్లాడకుము. దుర్యోధనుడు పాపాత్ముడు. బందిపోటు దొంగల హృదయమువలె నతని మనస్సు సర్వదా క్రూరముగా నుండును. అతడు ఐశ్వర్యమదమత్తుడు. పాండవులతో నెల్లప్పుడు వైరము గలిగి యుండును. అతనికి దూరదృష్టి లేదు. నిష్ఠురముగా మాటాడు చుండును. పరనిందకుడు. క్రూరపరాక్రమము గలవాడు. చాలకాలము కోపము మనస్సునందు ఉంచుకొనువాడు, ఉపదేశమునకు అనర్హుడు గూఢముగా నపకారము చేయు చుండు వాడు. అతడు మరణించుటకు గూడ సిద్ధపడును గాని, యితరులకు తల వంచనివాడు. తన మతమును (పట్టుదలను) విడువడు. ఇటువంటి దురాగ్రహము గల వానితో సంధి చేయుట దుష్కర మని నాకు తోచు చున్నది.

"కృష్ణా! దుర్యోధనుడు, తన హితమును గోరు మిత్రులయెడల గూడ చెడు ప్రవర్తన గలవా డై యుండును. అతడు ధర్మమును విడిచి, అసత్యమునే ఆశ్రయించెను. అదియే అతనికి ప్రియ మైనది. మిత్రుల మాటలను గూడ

ఖండించుచు వారి హృదయములను బాధించు చుండును, అతడు క్రోధవశు డై చెడు స్వభావమును కలిగి యుండును. గడ్డితో కప్ప బడిన సర్పమువలె నుండి యతడు, స్వభావతః సమయము చూచి ఇతరులను హింసించు చుండును. భగవన్! దుర్యోధనుని సైన్య మెట్టిదో, అతడు ఎట్టి స్వభావము గలవాడో, అతని బల మెంతటిదో, పరాక్రమ మెట్టిదో, యది యంతయు నీకు బాగుగా తెలియును,

"కృష్ణా! మే మందరము పూర్వము బంధు మిత్రులతో కలిసి యింద్రాది దేవతల వలె మిక్కిలి సంతుష్టితో, ఆనందముతోను నుంటిమి. మధుసూదనా! శిశిరఋతువు గడచిన తరువాత, ఎండకాలములో వనము అగ్నిచే దహింప బడునట్లు, దుర్యోధనుని క్రోధాగ్ని చేత భరత వంశీయు లందరు దహింప బడుదురు. రాజులు పదునెనిమిదిమంది ఉన్నారు. వారు తమ జ్ఞాతులను, మిత్రులను, బంధువులనున్ను నిర్మూలించినారు. వారందరిని గూర్చి చెప్పెద వినుము:

"కృష్ణా! ధర్మవిప్లవము సంభవించినప్పుడు, తేజస్సుచేత ప్రజ్వలించు నసురులలో అతి భయంకరరూపుడైన 'కలి' పుట్టెను. హైహయవంశమునందు ముదావర్తుడు- నీపవంశమున 'జనమేజయుడు'-తాలజంఘవంశమున 'బహులుడు' కృమికులమునందు ఉద్దండు డైన 'వసువు' - సువీరవంశమున 'అజబిందువు' సురాష్ట్రకులమునందు 'రుషర్ధికుడు' - బలీహవంశమునందు 'అర్కజుడు'- చీన కులమునందు 'ధౌత మూలకుడు' - విదేహ కులమున 'హయగ్రీవుడు' - మహౌజస కులమునందు 'వరయువు'- సుందర వంశమున 'బాహువు' - దీప్తాక్ష కులమున 'పురూరవుడు' - చేది - మత్స్యకులములందు 'సహజుడు' - ప్రవీర వంశమున 'వృషధ్వజుడు' - చంద్రవత్సకులమునందు 'ధారణుడు' - ముకుట వంశమున 'విగాహనుడు' - నందివేగవంశమునందు 'శముడు' నను నీ పదునెనమండుగురు కులనాశకులు. యుగాంతమునందు ఈ అధమ పురుషులు పుట్టిరి.

"కృష్ణా! పైన జెప్పబడిన పదునెనుమండుగురు రాజులు వలెనే, కులాంగారుడు (కులనాశమునకు అగ్గి), నీచుడు, పాపిష్ఠుడు నైన దుర్యోధనుడు గూడ ఈ ద్వాపరయుగాంతము నందు యమ ప్రేరితు డై, మా కురుకుల వినాశమునకు కారణ మై జన్మించెను. అందుచేత కృష్ణా! నీవు అతనితో మృదువుగా, ధర్మయుక్తముగా, అర్థసహితముగా, మధురముగా, మెల్ల మెల్లగా మాట్లాడుము. నీ మాటలు కురు వంశమునకు హితకరము లై యుండ వలెను. నీ మాటలలో

కొంచెముగూడ ఉగ్రత్వము చూపకుము. ఆ మాటలు చాలవరకు అతనికి రుచికరములుగా నుండునట్లు గమనించి మాట్లాడుము.

''కృష్ణా! మేమందరము నేలపై నడచుచు, మిక్కిలి వినయముతో దుర్యోధనుని అనుసరించుచు పోయెదము. కాని, మా కారణముగా, భరత వంశీయులకు నాశము కలుగకుండునట్లు చూడుము.

''వాసుదేవా! మేము కౌరవులతో తటస్థులముగా ఉదాసీనభావముతో నున్నప్పటికిన్ని, మాకు సంకోచము - అవమానము లేదు. కాని, యే విధముగనైనను, కురువంశీయులకు అధర్మము అంటకుండునట్లు నీవు ప్రయత్నించుము. అక్కడ వృద్ధుడైన భీష్మ పితామహునితో, సభాసదులతోను, నీవు 'అన్నదమ్ములలో సోదరభావము ఉండునట్లు, దుర్యోధనుడు శాంతించునట్లున్ను ప్రయత్నింపవలసినది' అని చెప్పుము.

''కృష్ణా! నేను ఈ విధముగా శాంతిస్థాపనకై ప్రయత్నించుమని నీతో చెప్పినాను. యుధిష్ఠిరుడు గూడ శాంతినే కోరుచున్నాడు. అర్జునుడు మిక్కిలి దయాళువు గనుక, యుద్ధమును కోరుట లేదు.''

జనమేజయా! భీమసేనుని యీ శాంత వచనములను విని శ్రీకృష్ణుడు నవ్వుచు భీమునితో నిట్లనెను :

శ్రీకృష్ణుడు భీముని పరిహసించి యుద్ధమునకు ప్రోత్సహించుట

''భీమసేనా! నేడు దప్ప నీ నోటినుండి యిట్టి మాటలు దుర్యోధనాదులను గూర్చి నీవు చెప్పినట్లు, ఎప్పుడు గూడ నేను వినలేదు. నీకింత మెత్తదన మెక్కడినుండి వచ్చెను? పర్వతమునందు చులకదనము - అగ్నియందు చల్లదనమున్ను వచ్చినట్లు నేడు నిన్ను చూడగా తోచుచున్నది. నీవింత దయాళువుగా దుర్యోధనాదుల యెదుట ఉన్నావనగా, నాకు ఆశ్చర్యము కలుగుచున్నది.''

జనమేజయా! ఇట్లు చెప్పి శ్రీకృష్ణభగవానుడు భీముని ఉత్తేజపరచుచు మరల నిట్లనెను :

''భీమసేనా! శత్రువుల దురంతములకు విచారించుచు రాత్రి యంతయు నిద్రింపకుంటివి గదా! ఎప్పుడైన పండుకొనవలసి వచ్చినను, బోరగిల పండుకొని సర్వదా, ఘోరముగా అశాంతముగాను ఉండి క్రోధపూరితములైన మాటలు పలుకుచుంటివి. అగ్ని తన తాపముతోనే సంతసించుచున్నట్లు, నీవు నీ క్రోధముతోనే తపించుచుంటివి. ధూమముచేత కప్పబడిన యగ్నివలె నీవు నీ అశాంతిని సర్వదా అణచుకొనుచుంటివి. గొప్ప బరువును మోయుచున్నవాడు మిక్కిలి బాధపడుచు ఊపిరి ఉష్ణముగా విడుచుచుండునట్లు, నీవు సర్వదా బిగ్గరగా, వేడి ఊపిరి విడుచుచు, ఒంటరిగా ఏకాంతమునందు కూర్చొనుచుంటివి.

"భీమసేనా! మత్తగజము వృక్షమును సమూలంగా ఊడబెరకి కాళ్ళతో త్రొక్కుచు దూరముగా చిమ్ముచున్నట్లు, నీవు భూమిపైన త్రొక్కుచు, అరచుచు, నలువైపుల పరుగెత్తుచుంటివి. ఎప్పుడు గూడ నీవు జనసముదాయమునందు ప్రసన్నుడవై యుండుటకు ఇష్టపడక, యేకాంతమునందే సర్వదా కూర్చుని కాలము గడుపుచుంటివి. రేయింబవళ్ళు ఒంటరిగానే గడుపుచు, ఎవరిని గూడ పలుకరించకుంటివి. ఒక్కొక్కప్పుడు, హఠాత్తుగా నవ్వుచుంటివి. మరియొకప్పుడు, ఏకాంత స్థానములో ఏడ్చుచునుంటివి. ఒకప్పుడు మోకాళ్ళపైన ముఖము వాల్చి చాల కాలము కన్నులు మూసికొనుచునుంటివి.

''భీమసేనా! నీవు కనుబొమలు ముడిపెట్టుకొని, పెదవులను గరచుచు, నావేశముతో నుండుటను అనేక పర్యాయములు చూచియున్నాను. ఇవన్నియు నీ క్రోధసూచకములుగా నుండెను. నీవు నీ సోదరుల మధ్య కూర్చొని యుండి శపథము చేయుచు మాటిమాటికి గదను స్పృశించుచు నిట్లనుచుంటివి :

''ఏ విధముగా సూర్యుడు ఉదయించి ప్రకాశముతో ప్రపంచమును వెలిగించుచు, సాయంకాలము మేరుపర్వతమును ప్రదక్షిణము చేయుచు ప్రతిదినము నియమము తప్పకుండ స్వాభావికముగా తన కర్తవ్యమును నిర్వహించుచుండునో, ఆ విధముగానే, నేను గూడ నా పట్టుదల విడువక, దుర్మార్గుడైన దుర్యోధనుని యొద్దకు పోయి, నా గదచేత అతని ప్రాణములను తీసికొనెదను. నేను సత్యము చెప్పుచున్నాను. ఈ నా మాట యెప్పుడు గూడ తప్పదు. అతని యెడల నాకు ఇది సహజము.''

"శత్రుభయంకరా! ఈ విధముగా చెప్పుచుండిన నీకు ఇటువంటి శాంతి యెట్లు కలిగెను? నాకు చాలా ఆశ్చర్యముగా నున్నది. సాధారణముగా, యుద్ధమునకు అన్ని విధముల సన్నద్ధులైనవారు గూడ, యుద్ధకాలము సమీపించినప్పుడు భయముతో యుద్ధ ప్రసక్తి విడిచి, దానికి విపరీతముగా యోచించుచుందురు. ఆలాగే భీమసేనా! యిప్పుడు నీవు గూడ భయపడి, యుద్ధ ప్రసక్తిని మానుకొన్నావా? ఆహా! ఆశ్చర్యముగా నున్నదే?

"భీమా! నీవు నిద్రించునప్పుడు, మేల్కొనునప్పుడు గూడ అపజయమును సూచించునట్టివెన్నియో అపశకునములను చూచుచున్నావు గనుక, ఇప్పుడు నీవు శాంతిని కోరుచున్నావనుకొనెదను. ఇప్పుడు నీవు పిరికిపందవలె, నపుంసకునివలెను, పౌరుషహీనుడవై కనవడుచున్నావు. యుద్ధము సమీపించగానే నిన్ను మోహము కప్పినది. దానిచేత నీ మానసిక వృత్తి యిప్పుడు చెడిపోయినదనుకొనుచున్నాను. యుద్ధము వలన నీవు భయపడి వణకుచున్నావు. నీ మనస్సు, పట్టుదప్పి శిథిలమైనది. నీ తొడలు భయముచేత బిగుసుకొని పోయినవి అని నాకు తోచుచున్నది. అందుచేతనే, నీవు శాంతిని కోరుచున్నావు. మానవుని హృదయము, గాలికి కంపించుచున్న బూరుగుకాయవలె, సర్వదా నిశ్చలముగా నుండక ఊగుచుండును. గోవులు మనుష్యుల మాటలు మాటాడిన యెడల చెడిపోవునట్లు, నీ బుద్ధి గూడ వికృతమై యుండుటచేత నావ లేనందువల్ల అగాధ సముద్రమునందు మునుగుచున్న మనుష్యులవలె పాండవుల మనస్సులు చింతలో నిమగ్నములై యున్నవి.

"భీమసేనా! ఇప్పటి నీ మాటలు నీకు యోగ్యములు కావు, పర్వతములు నడచుచున్నవనగా ఎంత ఆశ్చర్యము కలుగునో, అట్లే నీవు చేయుచున్న శాంతి ప్రస్తావముల వలన నాకు చాలా ఆశ్చర్యము కలుగుచున్నది. నీ కర్మముల నొకసారి సింహావలోకనము చేసి, నీ కులము యొక్క ప్రతిష్ఠను దృష్టిలో నుంచుకొని, లేచి ధైర్యముగా నిలుచుకొనుము.

"వీరశేఖరా! దుఃఖపడకుము. నీ క్షత్రియోచిత కార్యమునందు స్థిరముగా నిలువుము. నీ మనస్సులో కలిగిన యీ బాధ నీకు తగినది కాదు. క్షత్రియుడు తన పరాక్రమము చేత సాధించదగిన వానిని సాధించక ఉండకూడదు."

జనమేజయా! శ్రీకృష్ణుని మాటలు విని భీముడు సుశిక్షితమైన మంచి అశ్వమువలె, క్రోధఘూర్ణితుడై యిట్లనెను :

భీముడు శ్రీకృష్ణునకు తన సామర్థ్యమును గూర్చి చెప్పి శాంతి ప్రస్తావనకు కృపయే కారణమని చెప్పుట

"అచ్యుతా! నే నొకటి చేయదలచుచుండగా నీ వొకటి నన్ను గూర్చి యోచించుచుంటివి. నీవు చాలకాలము నాతో కలిసి మెలసి తిరిగినావు. కనుక, నాకు యుద్ధమునందు మిక్కిలి ప్రేమ యున్నదని, నాది మిథ్యా పరాక్రమము కాదనియు నీకు బాగుగా తెలియును. నౌక లేకుండా అగాధ సరస్సు దాటువానికి దానిలోతు తెలియనట్లు, నీవు నన్ను గూర్చి పూర్తిగా తెలుసుకొనలేదు. కనుక, అనర్హ వచనములు మాటాడుచు నన్ను ఆక్షేపించుచున్నావు. భీమసేనుని గూర్చి బాగుగా తెలిసినవా రెవ్వరు గూడ నీ విప్పుడు మాటాడిన విధముగా, అనుచిత వాక్యములను మాటాడరు.

"కనుక, కృష్ణా! నా బలపరాక్రమములతో సరి తూగ గల వా రెవ్వరు గూడ లే రను విషయములో ఇప్పుడు నీకు, నా పౌరుషమును, బలమును గూర్చి వర్ణించి చెప్పదలచుకున్నాను. తన బలపరాక్రమములను ప్రశంసించుకొనుట నీచ పురుషుల పని యైనప్పటికిని నీవు నా గౌరవ ప్రతిష్ఠలకు భంగకరమైన మాటలు చెప్పి నన్ను తిరస్కరించుచుంటివి గనుక, నేను చాలా బాధపడి, నా పరాక్రమములను గూర్చి నీ కిప్పుడు వర్ణించెదను వినుము :

"కృష్ణా! భూలోక స్వర్గలోకముల మధ్యమున ఉన్న ప్రజలందరికి ఈ రెండు లోకములు తల్లిదండ్రులవలె ఆధారములై యున్నవి. కాని, యీ రెంటికిని ఆధారము లేవియు లేవు. ఈ లోకములు, అచలములు - అనంతములు. ఒకవేళ, భూలోక - స్వర్గలోకములు, హఠాత్తుగా పరస్పరము కోపించి, శిలలవలె కొట్టుకొనుచున్న యెడల నేను ఈ రోదసీ మధ్యమునందున్న స్థావర జంగమములైన సమస్త భూతకోటితోపాటు, రెండు లోకములను నా రెండు భుజములతో ఆపి పట్టుకొనగలను.

"కృష్ణా! గడియనమానుల వంటి నా రెండు బాహువుల మధ్యముననున్న ప్రదేశమును చూడుము. ఈ రెంటి నడుమ చిక్కుకొనిన యే వీరుడైనను జీవించి పోవజాలడు. నేను ఆక్రమించి పట్టుకొనిన వీరుని హిమాలయము, సముద్రము, ఇంద్రుడు, ఈ ముగ్గురు ఏకమై వచ్చినను రక్షింపజాలరు. పాండవుల యెడల ఆతతాయులై వచ్చిన సమస్త క్షత్రియులను యుద్ధభూమియందు పడవేసి త్రొక్కివేసెదను సుమా!

(ఆతతాయి అనగా చంపుటకు పూనినవాడు. వీరు ఆరుగురు: 1. ఇంటికి నిప్పు అంటించినవాడు, 2 విషము పెట్టినవాడు, 3. కత్తితో నరకుటకు పూనిన వాడు, 4. ధనము దోచుకొనువాడు, 5 భూమిని అపహరించువాడు. 6 ఒకని భార్యను చెరబట్టినవాడు. ఈ యారుగురు ఆతతాయు లనబడుదురు)

"అచ్యుతా! నా పరాక్రమమును గూర్చి నీకు తెలియ కున్నది. నేను రాజుల నందఱిని ఓడించి నా యధీనములో తెచ్చుకొనిన విషయమును నీవు మరచిన ట్లున్నావు. ఉదయించిన సూర్యుని ప్రభవలె నున్న నా ప్రతాపమును నీవొక వేళ తెలియ కున్నచో, రాబోవు భయంకర యుద్ధమునందు చూచెదవు గాక! బాగుగా పండి ముదిరిన గాయమును, కత్తితో కెలికి నొప్పి పరచు వాని వలె, నన్ను నీ కఠిన వాక్యములచేత ఏల తిరస్కరించు చున్నావు?

"కృష్ణా! నా బుద్ధికి తోచినంతవరకు నేను నీకు చెప్పినాను. ఇంతకంటె అధికముగా నా శక్తి యున్న దని తెలిసికొనుము. యుద్ధమునందు నేను విజృంభించి శత్రుసంహారము చేయు చున్నప్పుడు నా శక్తిని నీవు చూచెదవు గాక! నేను క్రుద్ధుడనై ఘోర యుద్ధమునందు మద గజములను, రథికులను, గుఱ్ఱపు రౌతులనున్ను క్రింద పడ గొట్టినప్పుడు, తన్నుచు నెగుర గొట్టు చున్నప్పుడు, యుద్ధవీరులను వధించు చున్నప్పుడున్ను నీవు, అనేక వీరులున్ను నేను ఏ విధముగా యుద్ధమునందు మహావీరులను సంహరించు చుందునో చూచెదరు గాక!

"కృష్ణా! నా మజ్జలు (శరీరమునందు ఎముకలలో నున్న బలకర మైన రసము) శిథిలములు కాలేదు. నా మనస్సుగూడ కంపించుట లేదు. మధుసూదనా! ఒకవేళ సమస్త ప్రపంచము కోపించి నాపైన దాడి సలిపినప్పటికిన్ని నాకు భయము లేదు. కాని, యిప్పుడు నేను చేసిన శాంతి ప్రస్తావము, కేవలము నా మంచి మనస్సును ప్రకటించుట మాత్రమే యగును. నాకు దయ గలిగి నప్పుడు నాకు గలిగిన క్లేశముల నన్నిటిని సహించుటకు సంసిద్ధుడనుగా నుండెదను. మా మూలముగా భరత కులమునకు నాశము ఏర్పడ గూడ దనియే నేను కోరుచు అట్లు మాటాడితిని."

జనమేజయా! భీమసేనుని మాటలు విని యతనితో శ్రీకృష్ణభగవాను డిట్లనెను :

శ్రీకృష్ణుడు భీముని తేజస్సు దీపింప జేయుటకే చెప్పుట యని యతనిని అశ్వాసించుట

"భీమసేనా! నేను నీ మనోభావమును కనుగొనుటకై ప్రేమతో నట్లు మాట్లాడితిని. నిన్ను ఆక్షేపించుటకు గాని, నా పాండిత్యమును చూపించు కొనుటకు గాని, నా క్రోధమును ప్రకటించుటకు గాని, లేక, నిన్ను విమర్శించుటకు గాని నేను మాటాడ లేదు. నేను నీ మహిమను ఎరుగుదును. నీ బల పరాక్రమములను గూర్చి గూడ నాకు బాగుగా తెలియును. నీ వింతకు పూర్వము ప్రదర్శించిన పెద్ద పెద్ద పరాక్రమములు గూడ నాకు తెలియనివి కావు. కాబట్టి, నేను నిన్ను తిరస్కరింపను. భీమసేనా! నీవు నీయందు ఎన్ని గొప్పగుణము లున్న వని తలచు చున్నావో అంతకంటె వేయిరెట్లు ఎక్కువ నీయందు శౌర్య-ధైర్యాదిగుణము లున్నట్లు నేను ఎరుగుదును.

"భీమా! సమస్త రాజన్యులచేత కీర్తింప బడు చున్న ఉన్నత కులమునందు నీవు జన్మించితివి. అటువంటి గౌరవ ప్రతిష్ఠలనే నీవు నీ బంధు మిత్రాదుల వలన గూడ పొందుటకు యోగ్యుడవు.

శ్రీకృష్ణుడు దైవ-పౌరుష శక్తులను వివరించుట

''వృకోదరా! దేవధర్మము (పూర్వజన్మ ధర్మము) - మనుష్య ధర్మము (ఈ జన్మమున నీకు గల పౌరుష ధర్మము)- ఈ రెండు ధర్మముల స్వరూపము సందిగ్ధమై యున్నది కనుక, ప్రజలు దైవశక్తి - మానుష శక్తి- యీ రెంటి యొక్క పరిణామము (ఫలితము) తెలిసికొన గోరు చుందురు. కాని, ఈ రెంటిని గూర్చి యేలాటి నిశ్చయము గూడ, ఫలితమునకు పూర్వము చేయజాలరు. ఎందు కనగా, పైన జెప్పబడిన పురుషార్థమే (పౌరుషము) ఒకప్పుడు పురుషుని కార్యసిద్ధికి కారణ మైకూడ, మరియొకప్పుడు అదియే కార్యనాశమునకు గూడ హేతువగును.

''భీమా! ఈ విధముగా పూర్వజన్మార్జిత దైవఫల మెట్లు సందేహాస్పదమో అట్లే యీ జన్మమున సంపాదించిన పౌరుష ఫలముగూడ సందేహాస్పదమే యగును దోషజ్ఞు లైన విద్వాంసులు, ఒక విధముగా చూచి, తలచిన విషయములు వాయు వేగమువలె, మరియొక విధముగా మారు చుండును. బాగుగా విచారించి నిశ్చయింపబడినట్టిది, ఉత్తమ నీతిచేత కూడినది, న్యాయపూర్వకముగా

సంపాదింపబడినట్టిదియు నగు పౌరుష సాధ్య మైన కర్మగూడ, ఒకప్పుడు, దైవ వశముచేత బాధిత మై, ఆ కార్యసిద్ధియందు విఘ్నములు సంభవించు చుండును.

''భీమా! దైవకార్యములు గూడ నిట్లే సమాప్తి పొందుటకు పూర్వమే, పురుషుని పురుషకారముచేత నశింప జేయ బడును. దీనికి దృష్టాంతము చెప్పెద వినుము:

''భీమా! దైవ నిర్మిత ధర్మ మైన చలిని వస్త్రముచేత, ఉష్ణమును విసనకఱ్ఱచేత, వానను గొడుగుచేత, ఆకలిదప్పులను అన్నపానీయములచేతను పురుషుడు నివారించు చున్నాడు గదా! ఇట్లే, పూర్వజన్మ కర్మవశముచేత కాక, పురుషుడు స్వయముగా చేసిన అన్య కర్మములుగూడ సిద్ధిని పొందుచున్నవి. ఈ విషయములో మనకు కావలసినన్ని దృష్టాంతములు లభించును.

''కనుక, పాండునందనా! పురుషకారము లేకుండ మరి యేయితర సాధనముల చేతగూడ మనుష్యుని జీవన నిర్వాహము సాగదు. ఈ విధముగా మనుష్యుడు యోచించి కర్మములు చేయ వలెను. కేవలము దైవమునందే ఆధారపడి యుండ రాదు. తాను చేసిన పురుష ప్రయత్నమునకు దైవబలముగూడ చేకూరి, ఆరెంటి సంబంధముచేత ఫలప్రాప్తి తేలికగా కలుగును.

''కనుక, భీమసేనా! ఎవడు తనబుద్ధిలో నిట్లు నిశ్చయించుకొని, కర్మములనే చేయు చుండునో, అతనికి ఫలసిద్ధి కలుగకున్నను దుఃఖము రాదు. ఫలము కలిగినను వాడు సంతోషించడు. అతనికి రెండును సమానములే. తన కర్తవ్యమును చేసినా నని తృప్తి చెందును.

''భీమసేనా! యుద్ధమునందు శత్రువులతో తలపడిన తరువాత, తప్పక తనకే విజయము కలుగు నని చెప్పుటకు వీలు కా దను నా నిర్ణయము నీకు చెప్ప దలచు చున్నాను. 'మనోభావము మారినప్పటికిన్ని దురదృష్టవశాత్తు, ఏవైన వైపరీత్యములు ఘటిల్లినప్పటికిన్ని హఠాత్తుగా తన పరాక్రమమును ఉత్సాహమును విడువ గూడదు. దుఃఖము - శ్రమమున్ను చెంద గూడదు' అని నీకు చెప్పుటగూడ అవసర మని తలచు చున్నాను.

''పాండుపుత్రా! రేపే నేను ధృతరాష్ట్రునికడకు పోయి, మీ కార్యసిద్ధి కొరకు, ఏమాత్రము బాధపడక, సంధిప్రయత్నము చేసెదను. వారు ఒకవేళ సంధినే అంగీకరించినయెడల, నాకు గొప్ప కీర్తి కలుగును. మీ యిష్టార్థముకూడ

నెరవేర గలదు. వారికిగూడ సంధివలన శ్రేయస్సు కలుగును. ఒకవేళ వారు నా సంధిమాటలను తిరస్కరించి, యుద్ధము చేయుటకే మొండి పట్టుదల చూపిన యెడల అప్పుడు, అత్యంత భయంకర మైన యుద్ధమే యిక్కడ జరిగి తీరును.

''భీమసేనా! ఈ యుద్ధభార మంతయు నీమీద మోప బడును. అర్జునుడు ఈ భారమును ధరించ గలడు. ఇతరుల బరు వంతయు మీ యిద్దరే మోయ వలసి యుండును యుద్ధము జరిగినచో, నేను అర్జునునకు రథసారథి నయ్యెదను. అర్జునుని యిచ్ఛగూడ నదియే. నేను యుద్ధము జరుగుటకు ఇచ్ఛయించ నని నీవు తలచకుము.

''భీమసేనా! నీవు పిరికిపందవలె మాట్లాడుచు సంధిని ప్రస్తావించినపుడు, యుద్ధము చేయు తలంపును మార్చుకొనినట్లు నాకు సందేహము కలిగెను. ఆ కారణముచేత, నేను నీతో ననిన మాటలతో నీ పరాక్రమమును దీపింప జేసితిని."

తరువాత అర్జునుడు తన సందేశమును కృష్ణునకు ఇట్లు చెప్పెను :

అర్జునుని సందేశము

''జనార్దనా! నేను చెప్ప వలసిన మాట లన్నియు యుధిష్ఠిరమహారాజు చెప్పియే యున్నాడు. నీవు ధృతరాష్ట్రుని లోభము వలన, మా యిప్పటి దైన్యము వలనను సంధి చేయుట సరళము కా దని తలచు చున్నట్లు నీ మాటలవలన నాకు తోచు చున్నది. నీవు మనుష్యుని పరాక్రమము నిష్ఫల మని తలచు చున్నావు. ఎందు కనగా, పూర్వజన్మకర్మ లేకుండ, కేవలము పురుష ప్రయత్నముచేత మాత్రమే యేకర్మకుగూడ ఫలసిద్ధి కలుగదు.

''కృష్ణా! నీవు చెప్పిన మాటలు బాగుగనే యున్నవి. కాని, ఎల్లప్పటికిన్ని ఇట్లే యుండు నని చెప్పజాలము. ఏ కార్య మైనను అసాధ్యము కా దని తెలిసికొన వలెను. ఇప్పుడు మే మనుభవించు కష్టమే మమ్ము బాధించునది యని నీవు భావించు చున్నావు. కాని, అది సరి కాదు మా శత్రువులకు గలుగు ఫలముగూడ విశేషముగా ఏమియు లేదు.

''కృష్ణా! మంచి మనసుతో చేయ బడిన కార్యము సఫల మగును. శత్రువులతో సంధి యేర్పడు ప్రయత్నము చేయుము. శ్రీకృష్ణా! ప్రజాపతి దేవ - రాక్షసులకు హితము కోరువాడుగా నున్నట్లు, నీవు గూడ పాండవ - కౌరవులిరువురకు ముఖ్య మిత్రుడవు. మా యిరువురకు దుఃఖ నివారణ మగు ప్రయ

త్నము చేయుము. మాకు హిత మైన కార్యము చేయుట నీకు దుష్కరము కాదని నా విశ్వాసము.

''కృష్ణా! ఇట్లు చేయుటయే నీయవశ్యకర్తవ్యముగా భావింపుము. నీ వక్కడికి పోయినంత మాత్రముననే యీ కార్యముల నెరవేర్చ గలవు. దురాత్ముడైన దుర్యోధనుని యెడల, ఇంకను నీ వేదైన చేయ కోరినచో నీ యిష్టప్రకారమే ఆ కార్యము లన్నియు నెరవేర గలవు.

''కృష్ణా! నీవు తలచినచో, కౌరవులతో మాకు సంధి గాని, నీవు చేయ దలచిన యితర కార్యములు గాని తప్పక జరుగును. నీవు చేయ గోరునదియే, మాకు గౌరవాదరములు కలిగించునది యగు నని మేము నిశ్చయించుకొనినాము. ధర్మాత్ముడైన యుధిష్ఠిరునకు చేరి యున్నసంపదను చూచి సహించని దుష్టాత్ముడైన దుర్యోధనుడు, తనపుత్రు-బంధు సహితముగా వధార్హుడే యగును. ఇంతయే కాక, కపటద్యూతమును ఆశ్రయించి సంపదను లాగుకొనిన ఆ దురాత్ముడు, ధర్మసమ్మత మైన యుద్ధము, యితరోపాయములున్న తనకు సాఫల్యము కలిగించ వని తలచి, కపటము చేత జూదమునే ఆడెను.

''కృష్ణా! క్షత్రియ కులములో పుట్టినవా డెవ డైనను, యుద్ధమునకు పిలువ బడి నప్పుడు, ఎట్లు వెనుకాడును? తనకు ప్రాణత్యాగ సంకటము కలిగినను, యుద్ధము చేయకుండ నుండ జాలడు. మేము అధర్మ పూర్వకముగా యుద్ధమునందు ఓడింప బడి వనమునకు తోల బడితిమి. ఇది యంతయు చూచి, దుర్యోధనుడు వధింప దగినవా డని నా మనస్సులో - ఆనాడే నిశ్చయించుకుంటిని.

''కృష్ణా! మిత్రుల హితము కొరకు నీవు చేయ దలచిన కార్యము, నీకు అసాధ్యవేమియు కాదు. మృదువుగా నైనను, కఠినముగా నైనమ, నీకు సాధ్యమయిన ఉపాయముచేత ఆ పని సఫలము కావలెను. అదియే మా యిష్టము. లేక, ఒక వేళ వారిని వధించుటయే శ్రేష్ఠ మని నీవు భావించినచో దానినే అతి శీఘ్రముగా చేయుము. ఈ విషయములో నీవు ఏ మాత్రము విచారించవలసిన యవసరము లేదు.

''శ్రీకృష్ణా! పాపాత్ము డైన దుర్యోధనుడు నిండు సభలో ద్రౌపదికి ఎంత కష్టము కలిగించినప్పటికిన్ని, మేము, ఆ దుష్టాత్ముని మహాపరాధమును సహించి నోరు మూసికొని యున్న సంగతి నీకు తెలియును గదా! అట్టి దుర్యో

ధనుడు యిప్పుడు పాండవుల యెడల మంచిగా వ్యవహరించు నని నాకు తోచుట లేదు. అట్టి వాని యెడల చేయు సంధి ప్రయత్నము లన్నియు చౌటి నేలలో నాటిన విత్తనమువలె వ్యర్థము లగును. కాబట్టి, వృష్ణికుల భూషణా! నీవు పాండవుల హితము కొరకు, ఇప్పటి నుండియే చేయ దగిన హితకార్యము లన్నియు, అతి శీఘ్రముగా ప్రారంభింపుము.''

అర్జునుని మాటకు శ్రీకృష్ణుని యుత్తరము

ఇట్లు అర్జునుడు చెప్పిన మాటలు విని శ్రీకృష్ణుడు అర్జునునితో నిట్లనెను:

''పాండు కుమారా! నీవు చెప్పినట్లే చేయుట ఉచితము. నేను కౌరవ - పాండవు లిరువురకు గూడ సంకటము తొలగిపోయి, వారు సుఖముగా నుండునట్లు ప్రయత్నించెదను. అర్జునా! శాంతి - యుద్ధము ఈ రెండింటిలో హితకరమైన దానినే చేయు బాధ్యత ఇప్పుడు నా చేతిలో వచ్చినది. అయినను, ఇందులో అదృష్టమునే నమ్మ వలెను. బాగుగా దున్ని, నీరు పెట్టి సిద్ధము చేయ బడిన పొలము ఒక్కొక్కప్పుడు వానలు కురియ కున్నచో మంచి పంటను ఈయ జాలదు కదా! దున్ని నీరు పెట్టుట పురుష ప్రయత్నమే యగును. అప్పుడు గూడ దైవవశముచేత, అనావృష్టి కలిగినచో, ఆ పొలము ఎండిపోవుట దైవాధీనమనుకొన వలెను. కాబట్టి, పురుష ప్రయత్నము ఫలించుటకు దైవ ప్రయత్నము గూడ అవసర మగును.

''ప్రపంచ హితమునకు సాధనములు దైవప్రయత్నము - పురుష ప్రయత్నము - ఈ రెండింటి పైననే యాధారపడి యున్నవని, పూర్వము మహాత్ములు నిశ్చయించిరి. నేను పురుష కారము చేత, సంధి స్థాపనకు మిక్కిలి ప్రయత్నము చేసెదను. కాని, పూర్వ జన్మార్జిత కర్మఫలమును ఏ విధముగా గూడ తొలగించుటకు గాని, మార్చుటకు గాని, నాకు సాధ్యము కాదు.

''అర్జునా! దుర్బుద్ధి యైన దుర్యోధనుడు సర్వదా ధర్మమును, లోకాచారమునున్ను విడిచి ప్రవర్తించు చుండును. కాని, ధర్మవిరుద్ధముగా, లోకవిరుద్ధముగాను కార్యము చేసినప్పటికిన్ని అతడు ఏ మాత్రము సంతాపము చెందుట లేదు. ఇంతటితో పోవక, అతని మంత్రు లైన కర్ణ - శకుని - దుశ్శాసనులు, అతని పాపబుద్ధికి దోహదము కల్పించి, దానిని వృద్ధిపరచు చుందురు. దుర్యోధనుడు బంధుమిత్ర సహితముగా వధింప బడువరకు, మీ రాజ్య భాగము

నిచ్చి, సంధి చేసికొనడు. ఏ విధముగ ప్రయత్నించినను సంధి సాగ దని నాకు తోచు చున్నది. యుధిష్ఠిరుడు గూడ నమ్రతా పూర్వకముగా, సంధికొరకు, తన రాజ్యమును విడుచుటకు ఇష్టపడడు యాచించినప్పటికిన్ని, దుర్యోధనుడు రాజ్యము నీయడు.

''అర్జునా! యుధిష్ఠిరుడు, 'ఐదు గ్రామములను మాత్రమే కోరుము దాని చేత సంధి కుదుర వచ్చును' అని చెప్పెను. అట్లు దుర్యోధమునితో చెప్పుట ఉచితము కా దని నా భావము ఎందు కనగా, కురుకులకళంకుడు, పాపాత్ముడు నైన దుర్యోధనుడు, నా మాటలను ఎప్పుడు గూడ అంగీకరించడు. అట్టి దుర్యోధనుడు తప్పక వధార్హుడు కాగలడు.

''అర్జునా! మీ యందరిని బాల్యమునందు గూడ అనేక విధములుగా కష్ట పెట్టినవాడు - నిర్దయు డై మీ రాజ్యమును అపహరించినవాడు - యుధిష్ఠిరునకు రాజ్య సంపద యుండుట చూచి సహించనివాడు నైన పాపిష్ఠ దుర్యోధనుడు నాకేకాక, సమస్త ప్రపంచమునకు గూడ వధార్హుడే యగును. అతడు నీ యెడల నాకు భేదభావము కలిగించుటకు అనేక పర్యాయములు ప్రయత్నించెను. కాని, నేను అతని పాపపు మాటలను ఎప్పుడు గూడ అంగీకరించ లేదు నేను యుధిష్ఠిరునకే ప్రియము చేయువాడ నని అతడు స్పష్టముగా తెలిసికొనినాడని నీవు ఎరుగుదువు కదా!

''అర్జునా! నీవు. దుర్యోధనుని యభిప్రాయమును, నా దృఢనిశ్చయమును న్ను తెలిసినవాడ వైనను, నేడు. ఏమియు తెలియనట్లు నా విషయములో ఏల సందేహించు చున్నావు? భూభారమును తగ్గించ వలె నను దేవతల నిర్ణయమును నీవు బాగుగా ఎరుగుదువుగదా! ఇ ట్లుండగా, శత్రువులతో సంధి యెట్లు కుదురును? మనోవాక్కాయ కర్మలచేత నా సాధ్యమయినంతవరకు సంధికి తప్పకుండ ప్రయత్నించెదను శత్రువులతో సంధి కుదురు నని నాకు లేశ మాత్రము గూడ ఆశ లేదు.

''అర్జునా! విరాటనగరమునందు గోగ్రహణకాలములో మీ యజ్ఞాతవాసపు గడుపు పూర్తిగా ముగిసి యుండెను. అప్పుడు భీష్మ పితామహుడు దుర్యోధనుని 'నీవు పాండవులకు రాజ్య మిచ్చి, వారితో సంధి చేసికొనుము' అని కోరెను. కాని, శ్రేయస్కరము - హితకరము నైన భీష్ముని మాటలను గూడ అతడు అంగీకరించ లేదు. నీవు కౌరవులను ఓడింప దలచినప్పుడే వా రు ఓడిపోయిది.

కాని, దుర్యోధనుడు మీ యెడల కొంచెము గూడ సంతుష్టి చెంద లేదు. నేను అక్కడికి పోయి యుధిష్ఠిరుని యాజ్ఞ ప్రకారము, సంధికొరకు సర్వవిధముల ప్రయత్నము చేసెదను. ఇట్లు నా సంధి ప్రయత్నము ఫలించనప్పుడు, దురాత్ము డైన దుర్యోధనుడు చేసిన పాపకర్మములకు, ఎట్టి దండనము విధించ వలె నని యోచించుట నాకు అవశ్యకర్తవ్య మై యుండును."

జనమేజయా! ఈ విధముగా శ్రీకృష్ణభగవానుడు చెప్పిన తరువాత ఆయనతో నకులు డి ట్లనెను:

నకులుని సందేశము

"మహాత్మా! ధర్మజ్ఞు డైన యుధిష్ఠిరుడు అనేక విషయములను చెప్పెను. నీవును విని యున్నావు. ధర్మరాజు యొక్క అభిప్రాయమును కనిపెట్టి భీమసేనుడు మొదట సంధిమాటలు మాట్లాడినను, చివరకు, తన బాహుబల - శౌర్యములను గూర్చి చెప్పెను. అట్లే, అర్జునుడుగూడ తన యభిప్రాయము తెలిపెను. వీరు ముగ్గురు చెప్పిన మాటలను త్రోసి పుచ్చి, అక్కడ నీవు శత్రువుల యభిప్రాయమును పూర్తిగా విని, నీ మనస్సునకు ఏది సమయోచిత కర్తవ్యమని తోచునో, అట్లే చేయుము.

"భగవన్! వేర్వేరు కారణములు ఏర్పడినప్పుడు వేర్వేరు అభిప్రాయములు గూడ మనుష్యునకు కలుగు చుండును గదా! కనుక, ఆయా సమయమునకు తగిన కార్యమునే మనుష్యుడు చేయ వలెను. ఒక విషయమునందు, ఒక విధముగా యోచించి నిర్ణయించుకొనినప్పుడు, సమయోచితముగా దానిని మరియొకవిధముగా మార్చుకొన వలసి యుండును. ప్రపంచమునందు మనుష్యుడు స్థిరబుద్ధి గలవాడు కాడు. మేము వనవాసము చేయు చున్నప్పుడు ఒక విధముగా యోచించు చుంటిమి. ఆ యోచన అజ్ఞాతవాసకాలమునందు మరియొక విధముగా మారిపోయెను. ఆ గడువును పూర్తి చేసికొని మేము అందరికిని ప్రకటముగా నిప్పుడు వచ్చినాము. ఇప్పుడు ఆ యభిప్రాయము వేరు విధముగా మారిపోయెను.

"కృష్ణా! మేము వనవాసము చేయు చున్నప్పుడు, రాజ్యమునందు మాకు ఇప్పు డున్నంత ప్రేమ లే కుండెను. మేము వనవాసపు గడువు ముగించుకొని వచ్చిన సంగతి తెలిసి నీ దయచేత మాయొద్దకు ఏడు అక్షౌహిణీసైన్యములు

చేరెను. ఇక్కడ చేరిన వీరపురుషసింహుల బలపరాక్రమ - పౌరుషములు అచింత్యములు. శస్త్రాస్త్రములతో సన్నద్ధు లై యుద్ధమునందు నిలిచిన యీ వీరులను చూచి, యే శత్రువు యొక్క మనస్సు భయముచేత తల్లడిల్లదు?

"మహాత్మా! కౌరవసభలో తొలుత నీవు శాంతవచనములతో సంధిని గూర్చి ప్రస్తావించి, చివరకు, మూర్ఖుడైన దుర్యోధనుని మనస్సులో బాధకలుగని విధముగా యుద్ధభయమును గూడ ప్రస్తావించుము. తన శరీరములో రక్త - మాంసములను వృద్ధి నొందించుకొను ఏ వీరుడు, యుద్ధమునందు, యుధిష్ఠిరుడు- భీమసేనుడు - అపరాజితు డైన యర్జునుడు - సహదేవుడు - బలరాముడు - మహాపరాక్రమ శాలి యైన సాత్యకి - సపుత్రకు డైన విరాటుడు - మంత్రిసహితు డైన ద్రుపదుడు - ధృష్టద్యుమ్నుడు - పరాక్రమి యైన కాశీరాజు - చేదిరా జైన ధృష్టకేతువు - నీవు - నేను - ఈ మన నందరిని ఎదిరించ గలడు?

"భగవన్! నీ వక్కడికి పోయినంత మాత్రము చేతనే, ధర్మరాజు యొక్క అభీష్టమును సిద్ధింప జేసెదవు. ఇందులో ఏ మాత్రము సంశయము లేదు. విదుర - భీష్మ - ద్రోణ - బాహ్లికులు నీవు చూపించు శ్రేయోమార్గమును తెలిసికొనుటకు సమర్థులు. వా రందరు ధృతరాష్ట్రునకు, పాపాచారు డైన దుష్టదుర్యోధనునకున్ను ఉపదేశించి వారిని మంచి మార్గములో తే గలరు. నీవు ప్రయోజనకర మైన మాటను వినిపించు చుండగా, దానిని జాగ్రత్తగా విదురుడు వినును. మీ రిద్దరు కలిసినచో, చెడిపోవు చున్న యే కార్యమును సన్మార్గమునకు తే జాలరు?"

"జనమేజయా! నకులుడు చెప్పిన మాటలు విని, సహదేవుడు శ్రీకృష్ణునితో ని ట్లనెను:

యుద్ధప్రయత్నమునకు సహదేవ - సాత్యకుల సమ్మతి - యోధుల సమర్థనము

"కృష్ణా! ధర్మరాజు చెప్పిన మాటలు సనాతన ధర్మములు. యుద్ధమే జరుగునట్లు నీవు ప్రయత్నించ వలె నని నేను చెప్పు చున్నాను. ఒకవేళ, కౌరవులు శాంతినే కోరు చున్నప్పటికిన్ని, నీవు మాత్రము యుద్ధమును గూర్చిన పథకమునే వేయుము. ద్రౌపదిని ఆనాడు సభలో అవమానించుటను చూచిన నేను శత్రువధ చేయకుండ ఎట్లు ఉండెదను? నా కోపము ఎట్లు శాంతించును? యుధిష్ఠిర భీమార్జునులు ధర్మమార్గమునే అవలంబించి యుద్ధము చేయ కున్నను సరియే, నేను మాత్రము ఆ ధర్మమును విడిచి యుద్ధ భూమియందు దుర్యోధనునితో పోరాడుటకే నిశ్చయించుకొనినాను."

జనమేజయా! సహదేవుని మాటలను సమర్థించుచు సాత్యకి కృష్ణునితో ని ట్లనెను:

సాత్యకి యభిప్రాయము

"మహాత్మా! మహాబుద్ధిశాలి యైన సహదేవుడు సరిగానే చెప్పెను. దుర్యోధనుని యెడల నాకు గల కోపముగూడ, అతని వధతోనే శాంతించును. వనమునందు నారచీరెలను, మృగచర్మములను ధరించి దుఃఖితు లై యున్న పాండవులను చూచి, నీకు గూడ క్రోధము ఉబికి వచ్చిన సంగతి మరచితివా? అందుచేత యుద్ధకర్కశుడు - శూరుడు నైన సహదేవుడు చెప్పిన మాటలు యోధుల మైన మా కందరికి సమ్మతములే."

జనమేజయా! సాత్యకి అట్లు చెప్పగనే, అక్కడ అన్ని వైపుల నుండి యోధు లందరున్ను బిగ్గరగా భయంకర సింహనాదము చేసిరి. యుద్ధము చేయ గోరు చున్న అక్కడి యుద్ధ వీరు లందరు 'మంచిది - మంచిది' అనుచు, శైనేయు డైన సాత్యకి సంతోషమును వృద్ధి పరచుచు, అతని మాటను సంపూర్ణముగా ప్రశంసించిరి.

''జనమేజయా! సుదీర్ఘము లైన నీలకేశములు వ్రేలాడు చుండగా, దీనవదన యై ద్రౌపది, యుధిష్ఠిరుని ధర్మార్థయుక్త హిత వచనములను విని, శోకముచేత వణకుచు, మహారథికు డైన సాత్యకి - సహదేవుడున్ను చెప్పిన మాటలను సమర్థించి, వారిని ప్రశంసించుచు, శ్రీకృష్ణ భగవానునితో మాటాడుటకు ఉద్యుక్తురా లయ్యెను, అత్యంత ప్రశాంతముగా కూర్చొని యున్న భీమసేనుని చూచి యామె మిక్కిలి బాధపడుచు కన్నీటి ధారలు స్రవించు చుండగా శ్రీకృష్ణునితో ని ట్లనెను:

ద్రౌపది శ్రీకృష్ణునకు తన దుఃఖము తెలుపుట - శ్రీకృష్ణ డామెను ఆశ్వాసించుట

"మధుసూదనా! దురాత్ము డైన దుర్యోధనుడు, మంత్రి సహితు డై, పాండవులకు గూఢముగా నపకారము చేయ దలచి, వారిని సుఖమునకు

దూరము చేసిన సంగతి ధర్మజ్ఞుడ వైన నీవు బాగుగా నెరుగుదువు. ధృతరాష్ట్ర మహారాజు, రహస్యముగా సంజయునితో మంత్రాలోచనము చేసి, ఆ మాటలను యుధిష్ఠిరునకు చెప్పుటకు, ఆయన పంపిన సంజయుని మాటలను, యుధిష్ఠిరుడు సంజయునకు చెప్పిన ఉత్తరములనున్ను నీవు బాగుగా నెరుగుదువు. యుధిష్ఠిర మహారాజు సంజయునితో నిట్లని యుండెనుగదా?

"సంజయా! నీవు దుర్యోధనునితో మాకు 'అవిస్థలము - వృకస్థలము - మాకంది - వారణావతము - మరియే దైన తనకు ఇష్ట మైన ఒక గ్రామము - ఈ యైదూళ్ల మాత్రమే ఇచ్చిన చాలును అని యతని మిత్రుల సమక్షము నందు మా కోరిక తెలుపుము."

"శ్రీకృష్ణా! మిక్కిలి వినయ పూర్వకముగా యుధిష్ఠిరుడు సంధిని కోరుచు చెప్పి పంపిన యీ కోరికను గూడ దుర్యోధనుడు అంగీకరించ లేదుగదా? కృష్ణా! నీవు అక్కడికి పోయి, దుర్యోధనుడు మాకు రాజ్య మీయకుండనే, సంధిని కోరిన యెడల, దానికి ఏ మాత్రము అంగీకరింపకుము.

"భగవన్! పాండవులు, సృంజయులున్ను కలిసి క్రుద్ధు లైన దుర్యోధన సైనికులను యుద్ధమునందు ఎదిరించ గలరు. వారియెడల, సామ - దానోపాయములు ఉపయోగించవు. కనుక, వారి విషయములో నీవు దయ చూపకుము. నీవు-పాండవులు-సృంజయులున్ను కలిసి వారిపైన దండోపాయమునే త్వరగా ప్రయోగించ వలెను. ఇదియే పాండవులకు ఇప్పుడు కర్తవ్యము. ఈ కార్యము నీవు నెరవేర్చినచో, నీకు గొప్ప కీర్తియేకాక, సమస్త క్షత్రియ జాతికి సుఖము గూడ కలుగును.

"శ్రీకృష్ణా! తన ధర్మమును పాలించు క్షత్రియుడు, లోభముచేత ఆకృష్టుడైన క్షత్రియుని గాని, క్షత్రియేతరుని గాని, తప్పక చంప వలెను. కృష్ణా! యీ నియమము బ్రాహ్మణుల విషయముతో పనికిరాదు. ఇతరుల విషయములోనే అనుసరించ వలెను. బ్రాహ్మణుడు, సమస్త పాప కార్యములను చేసినను, అతనికి ప్రాణదండనము విధించ గూడదు. ఎందు కనగా, అన్ని వర్ణముల వారికిన్ని బ్రాహ్మణుడు గురువు. దానము చేయ బడిన వస్తువును గ్రహించుటకు బ్రాహ్మణుడు సర్వప్రథముడుగా యోగ్యు డని పరిగణింప బడినాడు.

"వధార్హుడు కాని వానిని వధించుట ఎట్లు మహాదోషమో, అట్లే వధకు యోగ్యుని వధించకుండుట గూడ దోషము" అని ధర్మజ్ఞులు చెప్పెదరు.

"కనుక కృష్ణా! అట్టి దోషము నీకు, పాండవులకు యాదవులకు, సృంజయులకున్ను కలుగకుండు విధమున ప్రయత్నించుము.

''కృష్ణా! నీయందు నాకు మిక్కిలి విశ్వాసము ఉన్నది. కనుక, నేను చెప్పిన మాటనే మాటిమాటికి చెప్పు చుందును. ఈ భూమండలమునందు నాతో సమానురా లైన స్త్రీ మరి ఎవతె యున్నది? నేను ద్రుపద మహారాజు పుత్రికను. యజ్ఞవేది మధ్యనుండి జన్మించినదానను. మహావీరు డైన ధృష్టద్యుమ్నునకు ప్రియసోదరిని. నీకు ప్రియమిత్రురాలను. సుప్రసిద్ధ మైన అజమీఢకులమునందు వివాహితురాల నై వచ్చినాను. మహాత్ము డైన పాండురాజునకు కోడలుగా, పంచేంద్రియములతో సమానులు - పరాక్రమవంతులు నైన పాండవులకు పట్టపు దేవిగా నున్నాను. నాకు ఐదుగురు కొడుకులు మహారథికులు పుట్టినారు. నీకు ఈ ఐదురుగు నా పుత్రులు, ధర్మము ప్రకారము అభిమన్యుడువలెనే మేనల్లుండ్రు కదా!

''కృష్ణా! ఇట్లు మాననీయురాల నై, సౌభాగ్యవతి నై యున్నప్పటికిన్ని నేను, పాండవులు చూచు చుండగనే, నీవు బ్రతికి యుండగనే సభలో జుట్టు పట్టుకొని ఈడ్వ బడితిని. అనేక పర్యాయములు అవమానపరచ బడితిని. నాకు అనేక విధము లైన క్లేశములను శత్రువులు కలిగించిరి. పాండు పుత్రులు, పాంచాలురు, యాదవులు జీవించి యుండగనే నేను పాపిష్ఠులకు దాసిగా సభలో ఈడ్వ బడితిని. నాకు గలిగిన ఈ యవమాన మంతయు చూచు చున్నప్పటికిన్ని, పాండవులకు కించిత్తుగూడ కోపము కలుగ లేదు. వారి బారినుండి నన్ను పాండవులు విడిపించుటకు ప్రయత్నము చేయ లేదు. అట్టి సమయమునందు మిక్కిలి నిస్సహాయురా లై, మనస్సులోనే నిన్ను భక్తితో ధ్యానించుచు, 'గోవిందా! నన్ను రక్షింపుము' అని నీకు మొర పెట్టుకొంటిని. ప్రభూ! ఆ దుఃఖసమయమునందు నీవే కృపచేత నా లజ్జను కాపాడితివి.

''భగవన్! అప్పుడు సభా మధ్యమునందు రాజ్యైశ్వర్య సంపన్ను డైన నా మామ ధృతరాష్ట్ర మహారాజు నన్ను ఆదరించుచు 'పాంచాలీ! నీకు ఇష్ట మైన వరమును కోరుకొనుము. నీవు వరమునకు అర్హురాలవు' అని నాతో ననెను. అప్పుడు నేను ఆ మహారాజుతో ''పాండవులకు రథములను, ఆయుధములనున్ను ఇచ్చి దాస్యమునుండి వారిని విముక్తులను జేయుము'' అని వరమును కోరితిని. ఇంత మాత్రము నేను వరము కోరిన వెంటనే పాండవులకు దాస్య

విముక్తి ఆయన కలిగించెను. 'ఆ విముక్తి వారిని వనవాసకష్టములను అనుభవింప జేయుటకే ఏమో' యని నేను భావించు చున్నాను.

''జనార్దనా! మాపైన అనేక కష్టములు వచ్చి పడిన సంగతి నీకు బాగుగా తెలియును. అవి యన్నియు దుర్యోధనాదులు కపటము చేత కల్పించినవియే. పుత్ర-మిత్ర-బంధు-కుటుంబ-పతి సహితముగా నన్ను నీవు రక్షించ వలెను.

"కృష్ణా! ధర్మము ప్రకారము నేను భీష్మునకు, ధృతరాష్ట్రునకున్ను కోడలుగా నున్నప్పటికిని వారిసమక్షములోనే నన్ను బలాత్కారముగా దుర్యోధనాదులు దానిని చేసిరి. అట్టి దుర్దశ నాకు కలిగినపుడు దుర్యోధనుడు ఒక్కక్షణకాల మైనను జీవించి యున్నా డనగా, అది అర్జునుని ధనుర్ధరత్వమునకు, భీమసేనుని బలమునకు ధిక్కారమే కదా?

''శ్రీకృష్ణా! ఒకవేళ నేను నీకు అనుగ్రహపాత్రురాల నైనచో, నాపైన నీకు కృప యున్నచో, నీవు తప్పకుండ ధృతరాష్ట్ర పుత్రులపైన నీ పరిపూర్ణ క్రోధమును ప్రయోగింపుము.''

జనమేజయా! సుందరాంగి యైన ద్రౌపది ఈ విధముగా కృష్ణునితో చెప్పి, మిక్కిలి సుందరము లైన తన దీర్ఘ నీల కేశములను నీలసర్పమువలె తన యెడమచేతితో తీసికొని శ్రీకృష్ణునకు చూపించుచు కన్నీటిధారలు స్రవించు చుండగా ఆయన సమీపమునకు పోయి ఇ ట్లనెను:-

''శ్రీకృష్ణా! నీవు శత్రువులతో సంధి చేయుటకుగాను ఏయే ప్రయత్నములు చేసెదవో, అప్పు డంతయు దుశ్శాసనుని చేతులతో లాగ బడిన ఈ నా వెంట్రుకలను జ్ఞప్తియం దుంచుకొనుము. భీమార్జునులు పిరికితనముతో కౌరవులతో సంధిని కోరు చున్నయెడల, వృద్ధు డయిన మా తండ్రి ద్రుపదరాజు మహారథికు డైన ధృష్టద్యుమ్నునితో కలిసి శత్రువులతో యుద్ధము చేయ గలడు. మహావీరు లైన నా కొడుకులు అభిమన్యుని ముం దిడుకొని కౌరవులతో యుద్ధము చేయ గలరు.

''శ్రీకృష్ణా! దుశ్శాసనుని నల్లని భుజము చేదింప బడి దుమ్ములో పొరలు చుండగా నేను చూడ కున్నచో నా మనస్సుకు, శాంతి యెక్కడిది? పదుమూ డేండ్లుగా ఇట్టి దినముకొరకు, మండు చున్న అగ్నివలె, కోపమును మనస్సులోనే అణచుకొని వేచి యుంటిని. నేడు భీమసేనుడు సంధి కొరకు మాటాడిన

పలుకులు నా మనస్సులో బాణముల వలె గ్రుచ్చుకొనినవి. దానిచేత పీడింప బడి నా గుండె పగులు చున్నది. అహా! ఈ మహాబాహు డైన భీమసేనుడు నేడు నాకు జరిగిన అవమానమును మరచిపోయి కేవలము ధర్మమునే దృఢముగా తలచు చున్నాడు. ఏ మని చెప్పెదను?''

జనమేజయా! ఈ మాటలు చెప్పిన తరువాత ద్రుపద రాజపుత్రికంఠము అశ్రుపాతము చేత అడ్డగింప బడి డగ్గుత్తుక పడెను. ఆమె గడగడ వణకుచు అవరుద్ధ కంఠముతో బోరు - బోరున ఏడ్చెను. ఆమె యొక్క పీనపయోధరములందు కన్నులనుండి వేడి - వేడి నీరు కురియు చుండెను. ఆ కన్నీరు ఆమె హృదయములో నున్న క్రోధాగ్ని ద్రవించి బాష్పబిందువుల రూపమున వెదజల్లబడినట్లుండెను.

జనమేజయా! ఈ విధముగా దుఃఖించుచున్న ద్రౌపదిని శ్రీకృష్ణుడు ఓదార్చుచూ ఇట్లనెను:

''ద్రౌపదీ! నీవు భరతవంశములోని యితర స్త్రీలు కూడ ఈ విధముగానే యేడ్చుటను త్వరలోనే చూడగలవు. నీవు కోపించుచున్న యీ శత్రువుల భార్యలు గూడ తమ బంధుమిత్ర పరివార సైనికులందరు చంపబడినప్పుడు ఈ విధముగానే యేడ్చెదరు. యుధిష్ఠిరుని యాజ్ఞచేత, దైవేచ్ఛచేతను ప్రేరితులమై నేను, భీమార్జున నకుల సహదేవులున్ను కలిసి నీ యభీష్టమును తప్పక నెరవేర్చెదము. ఇక చింతించకుము. యమలోకమునకు పోవుటకు సిద్ధముగా నున్న ధృతరాష్ట్ర పుత్రులు నామాట వినని యెడల, తప్పక చంపబడి భూమిపై పడి పొరలుచు కుక్కలకు, నక్కలకున్ను భోజనము అయ్యెదరు.

"ద్రుపదరాజ పుత్రీ! హిమాలయ పర్వతము తన చోటు విడిచి చలించ వచ్చును. భూమి పగిలి నూరు వ్రక్కలు కావచ్చును. నక్షత్రములతోపాటు ఆకాశము క్రిందపడినను పడవచ్చును. కాని, నేను చెప్పిన యీ మాట ఎప్పటికిని గూడ అసత్యము కాజాలదు.

"కృష్ణాదేవీ! నీ కన్నీటిని అపుము. నేను నీతో సత్య ప్రతిజ్ఞ చేయుచు చెప్పుచున్నాను. నీ శత్రువు లందరు చంపబడినట్లు, నీ పతులు రాజ్యలక్ష్మి సంపన్నులయినట్లు, నీవు త్వరలోనే చూడగలవు."

''జనమేజయా! శ్రీకృష్ణుడు ఇట్లు చెప్పిన తరువాత ఆయనతో అర్జునుడు ఇట్లనెను:

శ్రీ కృష్ణుని హస్తినాపుర ప్రయాణము - యుధిష్ఠిరుడు కుంతీదేవికి కౌరవులకున్ను నుపదేశము పంపుట - మార్గములో శ్రీకృష్ణునకు దివ్యమహర్షుల దర్శనము

"శ్రీకృష్ణా! నేడు సమస్త కౌరవులకు నీవే ప్రియమిత్రుడవు. ఇరుపక్షములకు దగ్గరి చుట్టముగా నున్నావు. కౌరవపాండవులకు శ్రేయస్సు గలుగజేయట నీ కర్తవ్యము. ఇరుపక్షములకు సంధి చేయుశక్తి గూడ నీకే యున్నది. నీవక్కడికి పోయి, అమర్షశీలుడైన మా సోదరుడు దుర్యోధనునితో సంధికి అనువైన విధముగా మాట్లాడుము. నీవు చెప్పు ధర్మార్థ సంగతములైన మాటలు దుర్యోధనుడు వినని యెడల, ఆ మూర్ఖుడు యముని వశములో చిక్కుకొని నశించగలడు''

జనమేజయా! అర్జునుని మాటలకు శ్రీకృష్ణు డతనితో నిట్లనెను:

''అర్జునా! ధర్మ సంగతము - మనకు హితకరము - కౌరవులకు మంగళ కరమునైన కార్యమును చేయుటకే నేను ధృతరాష్ట్రుని యొద్దకు పోవుచున్నాను."

శ్రీకృష్ణుని రాయబారము

జనమేజయా! రాత్రి చీకటి తొలగి, నిర్మలాకాశమునందు సూర్యుడు ఉదయించిన పిదప కోమల సూర్యకిరణములు నలువైపులా వ్యాపించెను. కార్తిక మాసములో రేవతీ నక్షత్రమునందు, 'మైత్రము' అను ముహూర్తము వచ్చిన తరువాత, సత్త్వగుణ ప్రధానుడైన శ్రీకృష్ణుడు హస్తినాపుర ప్రయాణము చేసెను. పగటి గడియారము 15 భాగములుగా విభజించగా, 3వ భాగము, అనగా ఉదయము సుమారు 9 గంటలకు 'మైత్ర' ముహూర్తము వచ్చును. కార్తిక పూర్ణిమకు పూర్వము వారము దినములలో రేవతీ నక్షత్రము వచ్చును. ఇది ఇప్పటి దక్షిణ కాలమాన పరిమాణము. ఉత్తర భారతములో ఈ ముహూర్త మింకను విలంబముగా రావచ్చును.

''జనమేజయా! ఆ దినములలో శరదృతువు ముగిసి, హేమంత ఋతువు మొదలగు చుండెను. అన్నివైపుల భూములు బాగుగా పంటలు పండి యుండెను. ఆనాడు శ్రీకృష్ణభగవానుడు, ఋషుల మంగళ, పాఠములను, ఇంద్రుడు వినుచున్నట్లు, బ్రాహ్మణుల ముఖము నుండి ప్రాతః కాలమునందు మంగళకరములైన పుణ్యాహవాచన మంత్రములను వినుచు స్నానము చేసెను.

తరువాత, శ్రీకృష్ణుడు వస్త్రాలంకార విభూషితుడై, సంధ్యావందనము- సూర్య ప్రార్థన - అగ్నియందు హోమము మొదలైన ప్రాతఃకాల కృత్యములు నెరవేర్చెను. ప్రదక్షిణము చేసెను. తరువాత ప్రయాణ కాలమునందు శుభ శకునమునకై తన యెదుట నుంచబడిన మంగళకరవస్తువులను చూచెను. ఆ పిదప, యుధిష్ఠిరుని మాటలను విచారించుచు శ్రీకృష్ణుడు తనయొద్ద కూర్చొని యున్న సాత్యకితో నిట్లనెను:

''యుయుధానా! నా రథమునందు శంఖము - చక్రము - గద - అంబుల పొది - శక్తి మొదలైన అన్ని విధములైన యాయుధములను తెచ్చిపెట్టుము. ఎంత బలవంతుడైనను, శత్రువు దుర్బలుడు గదా యని నిర్లక్ష్యముగా నుండ గూడదనగా కర్ణ - శకుని - దుర్యోధనులు దుష్టాత్ములు- వారి విషయమునందు అతి జాగ్రత్తతో నుండవలెను.''

జనమేజయా! శ్రీ కృష్ణుని మాట వినగానే, ఆయన యెదుట నున్న సేవకులు రథమును సిద్ధము చేయుటకు పరుగెత్తిరి. ఆ రథము, ప్రళయ కాలాగ్నివలె దీప్తిమంతమై యుండెను. అది విమానమువలె అతిశీఘ్రముగా పోవునది. దానికి సూర్యచంద్రులవలె ప్రకాశమానములైన రెండు గుండ్రమైన చక్రములు ఉండెను. చిత్రవిచిత్రములైన అనేక పుష్పములతో, పక్షుల చిత్రములతో, సువర్ణ - మణులతోను విరాజిల్లుచున్న ఆ రథము విచిత్ర శోభలను ఈనుచుండెను.

ఆ రథము సూర్యునివలె, పెద్దదిగా, అందముగాను నుండెను. రథ ధ్వజము (జెండా) సుందరముగా నెగురుచు నుండెను. రథమునందు అవశ్యకములైన వస్తువులు అందముగా అమర్చ బడి యుండెను. పులి చర్మముల తెరలు కట్ట బడి యుండెను, అది శత్రువులకు చెనక వీలు గాక వారి కీర్తిని హరించునదిగా నుండెను. దానిని చూడగానే యదువంశీయుల యానందము పెంపొందు చుండెను. 'శైబ్య - సుగ్రీవ - మేఘపుష్ప - వలాహకములు' అనెడు నాలుగు అశ్వములకు శుభ్రముగా స్నానము చేయించి వస్త్రమాల్యాభరణములతో వానిని అలంకరించి, ఆ రథమునకు కట్ట బడెను.

ఈ విధముగా ఆ రథము, శ్రీకృష్ణుని గొప్పదనమును ఇతోధికముగా పెంపొందించుచున్న గరుడ ధ్వజముచేత మిక్కిలి శోభాయమానముగా నుండెను. అది పరుగెత్తుచున్నప్పుడు దాని చక్రముల ధ్వని అతి గంభీరముగ

నుండెను. బంగరుకొండ శిఖరములవలె సువర్ణకాంతుల నీనుచు, మేఘ - దుందుభులవలె గంభీరముగా ధ్వనించు చున్న చక్రములు గల ఆ రథమును శ్రీకృష్ణపరమాత్ముడు అధిరోహించెను. అది ఇచ్ఛానుసారముగా పోవు విమానమా యనునట్లు చూచువారికి తోచుచుండెను. శ్రీకృష్ణుడు తాను ఎక్కిన పిదప సాత్యకిని గూడ రథముపైన కూర్చొన బెట్టుకొనెను. అప్పు డా రథ ధ్వని భూమ్యాకాశములను ప్రతిధ్వనింప జేయు చుండగా, శ్రీకృష్ణుడు ప్రయాణము సాగించెను.

జనమేజయా! తరువాత, ఒక్క క్షణములోనే, ఆకాశమును చుట్టి యున్న మేఘములు ఛిన్నభిన్నము లై అదృశ్యము లయ్యెను. చల్లగా సుఖకరమైన అనుకూల వాయువు వీచుట కారంభించెను. ధూళి రేగుట ఆగిపోయెను. శ్రీకృష్ణుని ప్రయాణ సమయమునందు శుభశకున సూచకముగా, మృగ - పక్షులు ఆయన కుడివైపు అనుకూలదిక్కుగా రథము ననుసరించి పోవు చుండెను. సారస (బెగ్గురు) పక్షులు - శతపత్రములు (నెమిళ్ళు) - హంసలున్ను అన్నివైపుల నుండి మంగళ ధ్వనులు చేయుచు శ్రీకృష్ణుని వెనుక పార్శ్వమున పోవు చుండెను. అప్పుడు మంత్రపూర్వకముగా వేల్చబడు నాహుతులను స్వీకరించిన యజ్ఞాగ్ని ప్రదక్షిణముగా పైకి లేచు చున్న జ్వాలలతో ప్రజ్వరిల్లుచు పొగ లేకుండ నాయెను.

జనమేజయా! అప్పుడు, 'వసిష్ఠ - వామదేవ - భూరిద్యుమ్న - గయ - క్రథ - శుక్ర - నారద - వాల్మీకి మరుత్త - కుశిక - భృగు" - నామములు గల దేవర్షి - బ్రహ్మర్షులు ఒక్కటిగా గుమిగూడి వచ్చి, ఉపేంద్రు డైన (ఇంద్రుని తమ్ముడుగా వామనావతారమునందు అదితీదేవిగరమునుండి పుట్టిన వాడు) శ్రీకృష్ణునకు కుడివైపుగా ప్రదక్షిణము చేసిరి. ఈ విధముగా, మహర్షి - సాధు - మహాత్ములచేత గౌరవింప బడుచు శ్రీకృష్ణుడు హస్తినాపురికి ప్రయాణము సాగించెను.

జనమేజయా! శ్రీకృష్ణుడు ప్రయాణము చేయు సమయము నందు ఆయనను సాగ నంపుటకు, 'పాండవులు - చేకితానుడు - చేదిరా జైన ధృష్టకేతువు - ద్రుపద, కాశీరాజులు - మహారథికు లైన శిఖండి, ధృష్టద్యుమ్నులు - కేకయులతో, పుత్రులతోను గూడిన విరాటరాజు' - 'ఈ క్షత్రియు లందరు కార్యసిద్ధిని గోరుచు, శిష్టాచారము ప్రకారము శ్రీకృష్ణుని వెంట కొంతమేరకు నడచుచు అతనిని సాగ నంపుచు పోయిరి.

కొంతదూరము పోయిన తరువాత యుధిష్ఠిరుడు, రాజులసమక్షములో, ఎప్పుడుగూడ, కామ - క్రోధ - లోభ - భయాదుల కారణముచేత అన్యాయము చేయనట్టి - స్థిరబుద్ధి గలిగి, లోభరహితు డై, ధైర్యము గలిగి, విద్వాంసుడై సమస్త చరాచరాత్మక ప్రపంచములో వెలుగుచు, దేవదేవు డై, సనాతన పరమేశ్వరు డై, సమస్తప్రాణులను శాసించునట్టివా డై సర్వగుణసంపన్ను డై, శ్రీవత్సాంకు డైన శ్రీకృష్ణభగవానుని గాఢాలింగనము చేసికొని యీ విధముగా తనమాతృదేవి కుంతీదేవికి తన సందేశము పంప దలచి యి ట్లనెను :

"జనార్దనా! మా తల్లి అబల యయ్యు మమ్ము బాల్యమునుండి పాలించి పోషించెను. ఉపవాసములు, తపస్సులున్ను చేయుట ఆమెకు స్వభావ మైనది. ఆమె యెల్లప్పుడున్ను శ్రేయోదాయక కార్యములయందే లగ్నమై యుండును. దేవతల - అతిథుల - గురుజనముల సేవలోనే యామె సర్వదా శ్రద్ధ వహించి యుండును. పుత్రులను వాత్సల్యముతో నామె సదా ప్రేమించు చుండును. ఆమె యెడల మా యైదుగురు సోదరులకు అత్యంతప్రేమ - భక్తియు నున్నవి. దుర్యోధనునివలన భయముచేత ఆమె మమ్ము రక్షించుచుండెను. సముద్రములో మునుగకుండ జనులను ఓడ కాపాడునట్లే మమ్ము ఆమె మృత్యుసంకటము నుండి కాపాడు చుండెను.

"మాధవా! మా తల్లి మా కారణముగా సర్వదా దుఃఖములే అనుభవించెను. ఆమె యట్టి దుఃఖములు అనుభవించుటకు తగదు. అటువంటి మా తల్లి కుంతీదేవిని నీవు కలిసికొని, ఆమె క్షేమ సమాచారములను తప్పక విచారించుము. పుత్రశోకముచేత పీడిత యైన ఆమెకు మా నమస్కారములను నివేదించి ఆమెను ఊరడింపుము.

"శ్రీకృష్ణా! మా తల్లి వివాహ మైనప్పటి నుండియు, తన మామగారి యింటిలో ననేక దుఃఖములను - కష్టములనే అనుభవించుచు నిప్పుడుగూడ ఆ దుర్దశలోనే యున్నది. మా దుఃఖము లన్నియు దూర మై, దుఃఖముతో దురపిల్లు చున్న మా తల్లిని సుఖపెట్టగలమా? అట్టి సమయము మా భాగ్యములో నెప్పు డైన వచ్చునా? మేము అడవికి పోవు చున్నప్పుడు, ఆమె పుత్రప్రేమ చేత వ్యాకులపడి, భయముచేత నేడ్చుచు మా వెనువెంట పరుగెత్తుచు వచ్చు చుండెను కాని, ఆమె నక్కడనే విడిచి మేము అడవికి పోయితిమి.

''కేశవా! మనుష్యుడు దుఃఖాతిశయముచేత గూడ భయపడి మరణించును ఒకవేళ ఆమె జీవించి యున్నను, పుత్రుల వలన చింతచేత మిక్కిలి పీడితురాలుగానే యుండును. శ్రీకృష్ణా! మా తల్లికి ప్రణామము చేసి, నేను చెప్పిన విషయము లన్నియు భీష్మ - ద్రోణ - ధృతరాష్ట్రాది రాజవీరులు - మహాజ్ఞాని యైన విదురుడున్ను సమావిష్టు లైయున్న కౌరవసభలో చెప్పుము. దుర్యోధనాదులను నా పక్షమున ఆలింగనము చేసికొనుము.''

''జనమేజయా! ఇట్లు ధర్మరాజు శ్రీకృష్ణునకు రాజుల సమక్షమునందు చెప్పి, ప్రదక్షిణ నమస్కారములు చేసి, ఆయన యాజ్ఞ తీసికొని, తిరిగి వెడలి పోయెను. తరువాత అర్జునుడు శ్రీకృష్ణుని రథము వెనువెంట పోవుచు నిట్లు చెప్పెను :

''గోవిందా! మన మందరము రహస్యాలోచన చేయు చున్నప్పుడు ఒక నిశ్చిత మైన సిద్ధాంతము చేసి, దాని ప్రకారము, మనము అర్ధరాజ్యము తీసికొనిన తరువాతనే సంధి చేసికొన వలె నని నిర్ణయము చేసి యుంటిమి. ఈ విషయ మిక్కడి రాజు లందరికిన్ని తెలియును. దుర్యోధనుడు లోభము విడిచి, అనాదరము చేయక, గౌరవ పూర్వకముగా మాకు అర్ధరాజ్యము ఇచ్చిన యెడల, నా కోరిక పరిపూర్ణ మగును. అప్పుడు సమస్త కౌరవులు మహాభయము నుండి విముక్తు లయ్యెదరు. దీనికి వ్యతిరేకముగా అవివేకి యై దుర్యోధనుడు వ్యవహరించి యుద్ధమునకే దిగినచో, నేను నిశ్చయముగా అతని పక్షమునందున్న రాజు లందరిని సంహరించెదను.''

జనమేజయా! అర్జును డట్లు చెప్పగా, భీమసేనునకు చాల సంతోష మైనది. అతడు క్రోధముచేత మాటిమాటికి కంపించు చుండెను. బిగ్గరగా సింహనాదము చేసెను. అది విని, ధనుర్ధరు లందరు భయముచేత మిక్కిలి వణకు చుండిరి. వాహనము లన్నియు మలమూత్రములు విడిచినవి.

అట్లు అర్జునుడు శ్రీకృష్ణునకు చెప్పి. యతనిని కౌగిలించుకొని, అతని యాజ్ఞ గొని తిరిగి పోయెను. రాజు లందరు గూడ తిరిగి పోయిరి. శ్రీకృష్ణుడు శైబ్య - సుగ్రీవాది వాహనములు తర్వగా పరుగెత్తు చుండుగా హస్తినాపురికి ప్రయాణము సాగించెను. ఆ యశ్వములు సారథి యైన దారుకునిచే నడప బడుచు భూమిని త్రాకు చున్నవా యనునట్లు, ఆకాశమును మ్రింగు చున్నవా యను నట్లున్ను అతి శీఘ్రముగా పరుగెత్తు చుండెను.

''అప్పుడు మార్గమునందు, బ్రహ్మతేజో విరాజమాను లైన మహర్షులు త్రోవకు ఇరువైపుల నిలిచి యుండిరి. వారిని చూడగనే శ్రీకృష్ణుడు రథము దిగి ఆ మహర్షు లున్న చోటికే పోయి వారికి నమస్కారము చేసి, ఆదరపూర్వకముగా వారితో ని ట్లనెను:-

''మహాత్ములారా! సమస్త ప్రపంచము క్షేమముగ నున్నదా? మీ ధర్మానుష్ఠానము సక్రమముగా జరుగు చున్నదా? త్రైవర్ణికు లైన క్షత్రియ - వైశ్య - శూద్రులు బ్రాహ్మణుల యాజ్ఞలో నున్నారా? దేవతలకు పితృదేవతలకు అతిథులకున్ను బాగుగా పూజలు జరుగు చున్నావా? మహాత్ములారా! మీరు తపస్సిద్ధిని ఎక్కడ పొందితిరి? ఇప్పుడు మీరు ఎక్కడికి పోవు చున్నారు? మీ కే మైన పని యున్నదా? నే నే మైనా మీకు సేవ చేయ వలెనా? ఏ ప్రయోజనము నపేక్షించి యీ భూతలమునకు వచ్చితిరి?''

జనమేజయా! ఆ మహర్షు లెవ రనగా - 'నారదుడు - అథర్వశిరుడు - సర్పమాలి - దేవలుడు - అర్వావసువు - సుజానువు - మైత్రేయుడు - శునకుడు - బలి - దల్భపుత్రుడైన బకుడు - స్థూలశిరుడు - పరాశరనందను డైన శ్రీకృష్ణ ద్వైపాయనుడు - ఆయోదధౌమ్యుడు - ధౌమ్యుడు - అణీమాండవ్యుడు - కౌశికుడు - దామోష్ణీషుడు - త్రిషవణుడు - పర్ణాదుడు - ఘటజానుకుడు - మౌంజాయనుడు - వాయుభక్షుడు - పారాశర్యుడు - శాలికుడు - శీలవంతుడు - అశని - ధాత - శూన్యపాలుడు - అకృతవ్రణుడు - శ్వేతకేతువు - కహోలుడు - మహాతపశ్శాలి యైన పరశురాముడు.' అని ఈ మొద లైన మహర్షులు శ్రీకృష్ణ దర్శనార్థమై వచ్చి యుండిరి.

అప్పుడు దేవరాజునకు - రాక్షసరాజునకున్ను మిత్రు డైన జమదగ్ని పుత్రుడు పరశురాముడు శ్రీకృష్ణుని సమీపించి యతనిని కౌగిలించుకొని యి ట్లనెను :

''మహానుభావా! పూర్వము దేవాసుర యుద్ధమును ప్రత్యక్షముగా చూచిన పుణ్యాత్ము లైన దేవర్షులు - అనేక శాస్త్రవిద్వాంసు లైన మహర్షులు - నిన్ను గౌరవించు రాజర్షులు - వీ రందరు గూడ, సమస్త దిక్కులనుండి వచ్చిన రాజులను కౌరవ సభలో కూర్చొని యున్న రాజులను, సచ్చిదానం దస్వరూపుడ వైన నిన్నును దర్శింప గోరు చున్నారు. మిక్కిలి దర్శనీయ మైన యా సభను చూచుటకే యీ ఋషీశ్వరు లందరు హస్తినాపురమునకు పోవుటకు బయలు

దేరినారు. మాధవా! కౌరవసభలో నీవు చెప్ప బోవు దర్మార్థయుక్తము లైన మాటలను మే మందరము వినగోరుచున్నాము.

"శ్రీకృష్ణా! భీష్మ - ద్రోణాదులు - మహాబుద్ధిమంతు డైన విదురుడు - యదుకులతిలకుడ వైన నీవున్ను సభలో విరాజమాను లై యుందురు. సత్యములు - హితములు నైన నీ దివ్యవాక్కులను - వారందరి మాటలనున్ను మేము విన గోరు చున్నాము. మహాత్మా! మాకు ఆజ్ఞ యిమ్ము. మేము పోయెదము. మరల నీ దర్శనము చేసికొనెదము. నీ ప్రయాణము నిర్విఘ్నముగా సాగుగాక! నీవు కౌరవ సభకు పోయి, అక్కడ దివ్యాసనమునందు కూర్చొని యుండగా, బలపరాక్రమసంపన్నము లైన నీ దివ్యావయవములను మేము మరల సందర్శించెద.ము"

ఇట్లు చెప్పి ఆ మునీశ్వరులు వెడలి పోయిరి.

మార్గములో శుభాశుభ శకునముల వర్ణనము - జనుల సత్కారము గైకొని శ్రీకృష్ణుడు వృకస్థలమునకు పోయి విశ్రమించుట

జనమేజయా! శ్రీకృష్ణుని రథము ముందుకు సాగు చుండగా, ఆయనతో పాటు శత్రువీరులను ఓడింప గల శస్త్రాస్త్రధారు లైన పదుగురు మహారథికులు- వేయి మంది కాల్బలము - వేయిమంది గుఱ్ఱపురౌతులు - పుష్కలముగా ఆహార సామగ్రి - నూర్లకొలది యితర సేవకులున్ను పోవు చుండిరి."

ఈ మాట విని జనమేజయుడు వైశంపాయనునితో "మహాత్మా! శ్రీకృష్ణుని ప్రయాణము ఎట్లు సాగెను? అప్పుడు ఏయే శుభశకునములు - దుశ్శకునములున్ను కలిగెను?" యని యడిగెను.

వైశంపాయను డిట్లు చెప్పదొడగెను :

అపశకునములు

"రాజా! అప్పుడు మేఘములు లేకయే ఆకాశమునందు పిడుగులు ఘోరముగా ధ్వనించెను. మెరపులు మెరసెను. పర్జన్యదేవుడు, మేఘ సమూహము లేకయే అతివృష్టి కురిసెను. తూర్పు దిక్కుగా ప్రవహించు 'సింధు' మొద లైన మహానదులు, వెనుదిరిగి పడమటి దిక్కున ప్రవహించెను. దిక్కు

లన్నియు విపరీతములుగా తోచెను. ఏమియు తెలియ బడ కుండెను. అగ్నులు భయంకరముగా ప్రజ్వలించెను. భూమి కంపించెను. నూర్లకొలది జలాశయములనుండి, జలకలశములనుండియు జల్లు జల్లున నీరు చిమ్మి ఎగురు చుండెను. ఈ జగ మంతటను దుమ్ము రేగి చిమ్మచీకట్లు క్రమ్మిన ట్లాయెను. ఏది దిక్కు, ఏది దిక్కు గాదు అని తెలియ బడ కుండెను. రాజా! బిగ్గరగా కోలాహలధ్వని పుట్టెను. ఆకాశమునం దంతటను మనుష్యాకారము కనపడుచుండెను. అన్ని దేశములందున్ను ఇది మహాద్భుతముగా కనపడెను. దక్షిణ-పశ్చిమ దిక్కులనుండి సుడిగాలి వీచుచు హస్తినాపురమును మథించు చుండెను. ఆ సుడిగాలి చేత గుంపులు గుంపులుగా వృక్షములు విరిగి క్రింద పడు చుండెను. ఈ మొద లైన అపశకునములు కలిగెను.

శుభశకునములు

జనమేజయా! శ్రీకృష్ణుడు మార్గమునందు ఎక్కడెక్కడ నిలిచెనో అక్కడక్కడంతయు సుఖకర మైన వాయువు వీచు చుండెను. శుభశకునము లన్నియు నాయన కుడివైపు కనపడు చుండెను. ఆయన పైన అనేక పుష్ప వర్షములు కమలముల వర్షమున్ను కురిసెను. ఆయన మార్గ మంతయు కుశ-కంకరహిత మై సమతలముగా నుండి మార్గమునందు ఏలాటి కష్టము కలుగక సుఖముగా ఆయన ప్రయాణము సాగు చుండెను.

అక్కడక్కడ త్రోవలో వేలకొలది మంది బ్రాహ్మణులు శ్రీకృష్ణుని దర్శించుచు, స్తుతించుచు, ఆయనకు మధుపర్కము (పెరుగుతో కలిపిన తేనె) నిచ్చి, ఆయనను సత్కరించు చుండిరి. శ్రీ కృష్ణభగవానుడు గూడ ఆ బ్రాహ్మణులకు పుష్కలంగా ధనమును ఇచ్చు చుండెను. సర్వభూతహితకరు డైన శ్రీకృష్ణునిపైన స్త్రీలు మార్గములో సుగంధము గల అడవి పూవులు కురియు చుండిరి.

అప్పుడు కృష్ణుడు, సమస్త ధర్మ కార్యములకు ఉపయోగపడునట్టివి, సంపూర్ణ సస్యములచే నిండి యున్నట్టివి, మార్గశీర్ష మాస ధాన్యములతో విరాజిల్లు చున్నట్టివియున్ను నగు పంట పొలములను చూచుచు, మిక్కిలి సుఖముగా ప్రయాణము చేయుచుండెను. దారిలో శ్రీకృష్ణుడు అనేక పశువులు ఆనందముతో తిరుగు చున్న గ్రామములను, అనేక నగరములను, రాష్ట్రముల

నున్ను దాటి పోవుచుండెను. అవి అందముగా, మనస్సునకు సంతోషము కలిగించునవిగాను నుండెను.

ఉపప్లవ్యపురమునుండి వచ్చుచున్న శ్రీకృష్ణుని దర్శించుటకై అనేక పౌరులు దారిలో గుమిగూడి యుండిరి. వారు భరతవంశరాజులచేత సురక్షితులై యుండుటచే హర్షోల్లాసభరితులై యుండిరి వారి మనస్సులు ప్రసన్నములుగా నుండెను. వారికి శత్రుసేనలవలన దుఃఖము లేనట్లు తెలియుచుండెను. దుఃఖము-సంకటమున్ను ఎట్లుండునను నది వారికి తెలియకయే యుండెను.

జ్వలించుచున్న అగ్నివలె తేజస్వియై వచ్చుచున్న తమ దేశపు పూజనీయాతిథియైన శ్రీ కృష్ణుడు తమ సమీపమునకు వచ్చుచుండుట చూచి జనులు ఆయన యొద్దకు పోయి ఆయనను పూజించిరి. శ్రీకృష్ణుడు కుశస్థల గ్రామమునకు వచ్చు వేళకు సూర్యుడు అస్తమించుచుండెను. ఆకాశమునందు పడమటివైపు ఎఱ్ఱని చాయ వ్యాపించెను. అప్పుడు శ్రీకృష్ణుడు రథము నుండి దిగి అశ్వములను విడువు మని దారుకునకు ఆజ్ఞాపించి. తాను శౌచస్నానాదులు నెరవేర్చి సాయంకాల సంధ్యోపాసన చేయ దొడగెను.

సారథియైన దారుకుడు గుఱ్ఱములను విడిచి, విధి పూర్వకముగా వానికి పరిచర్య చేసెను. వాని యలంకరణము లన్నియు తీసి, కట్లు విప్పి, వానిని స్వేచ్ఛగా తిరుగుటకు విడిచెను.

శ్రీ కృష్ణుడు సాయం సంధ్యోపాసనాదులు ముగించి, ''యుధిష్ఠిరుని కార్యసాధనకుగాను ఈ రాత్రి మనమందర మీగ్రామముననే విడిసి యుందము'' అని యనెను.

అది విని సేవకులు అక్కడనే నివాసములు (డేరాలు మొదలైనవి) వేసి, రుచికరములైన ఆహారపానీయములను ఆయనకు సమర్పించిరి. ఆ గ్రామమునందున్న బ్రాహ్మణముఖ్యులు. - లజ్జాశీలురు - బ్రాహ్మణోచిత వృత్తితో నుండు ఇతర కులముల పెద్దలున్న శత్రుహంతకుడు - మహాత్ముడునైన హృషీకేశుని సన్నిధికి వచ్చి, ఆయనకు ఆశీర్వాదము - మంగళస్తోత్రములున్ను చేసి, యథోచితముగా పూజ చేసిరి.

తర్వాత వారు తమ తమ రత్నమయ గృహములందు ఆ రాత్రి యుండు మని శ్రీ కృష్ణుని ప్రార్థించిరి.

అప్పుడు శ్రీకృష్ణుడు వారితో 'ఇక్కడ బాగుగా నున్నది, ఈ రాత్రి యిక్కడనే గడపెదను' అని వారితోచెప్పి, వారికి యథోచితముగా సన్మానములు చేసి, వారి తృప్తికై వారందరి యిండ్లకు పోయి, వారితోనే తన విడిదికి తిరిగి వచ్చెను.

అక్కడ బ్రాహ్మణులకు శ్రద్ధతో రుచికరమైన భోజనము పెట్టి, తరువాత తానుగూడ భోజనము చేసి, వారందరితో ఆరాత్రి తన విడిదిలోనే సుఖశయనము చేసెను.

జనమేజయా! శ్రీకృష్ణ భగవానుడు వచ్చుచున్నాడని దూతలవలన తెలుసుకొని ధృతరాష్ట్రుని శరీరమునందు పులకాంకురములు పొడమెను. ఆయన భీష్మ-ద్రోణ - సంజయ-విదురులను సత్కరించుచు దుర్యోధనునితో నిట్లనెను-

దుర్యోధనుడు శ్రీ కృష్ణుని స్వాగత సత్కారములకు మార్గమునందు ఏర్పాట్లు చేయుట

"నాయనా! పాండవుల పక్షమున, శ్రీకృష్ణపరమాత్ముడు ఇక్కడికి వచ్చుచున్నాడు. మన కతడు మిక్కిలి మాననీయుడు. అన్ని విధముల నతడు పూజ్యుడు. అత డిక్కడికి వచ్చుట అత్యద్భుతమైన విషయము. ఇంటింట స్త్రీ బాలవృద్ధు లందరు ఈ చర్చనే చేయుచున్నారు. ఇచటి పౌరులేకాక, వేరూళ్ళ నుండి యిక్కడికి వచ్చినవారుగూడ ఈ విషయమునే మాట్లాడుకొనుచున్నారు. మార్గముల కూడళ్ళలో, సభలలోను ఈ చర్చయే వేర్వేరుగా జరుగుచున్నది.

''పుత్రా! సమస్త లోకముల జీవనము అతనిపైననే ఆధారపడి యున్నది. ఆయన సమస్త ప్రాణులకు అధిపతి. ఆ మాధవుని ధైర్య - శౌర్య - పరాక్రమాదులు విశేషముగా నున్నవి. అతడు సనాతన ధర్మస్వరూపుడు గాబట్టి యిక్కడ అతనికి ఘనమైన సమ్మానము జరుగవలెను. అతనిని సమ్మానించినచో, మనకు సుఖము-అట్లు కాకున్న, దుఃఖమున్ను కలుగును. అతడు మన సత్కారము-సమ్మానములతో సంతుష్టుడైన యెడల, మన మనోరథము సంపూర్ణముగా నెరవేర్చ గలడు.

"దుర్యోధనా! శ్రీకృష్ణునకు స్వాగత-సత్కారములు చేయుటకు నేటి నుండియే అన్ని యేర్పాట్లు చేయుము. శ్రీకృష్ణుడు వచ్చు మార్గమునం దక్కడక్కడ విశ్రాంతి గృహములను ఏర్పరచి, వానిలో ఆయన మనస్సుకు అనుకూల మైన సమస్త వస్తు సామాగ్రిని ఉంచుము. పుత్రా! శ్రీకృష్ణునకు నీయందు ప్రేమ కలుగు విధమున, ఆయనకు అన్ని సౌకర్యములను-సుఖములన్ను ఏర్పరుచుటకు సర్వప్రయత్నములు చేయుము.''

జనమేజయా! ధృతరాష్టుని మాటలను భీష్మాదులు మిక్కిలి ప్రశంసించుచు 'ఇది చాల శ్రేష్ఠము అని యనిరి. వారి యనుమతి ప్రకారము దుర్యోధనుడు శ్రీకృష్ణుని మార్గమునందు సమ్మేళనములు-విశ్రాంతి గృహములున్ను ఏర్పరుచుటకు ఆజ్ఞాపించెను. ఆ ప్రకారమే శిల్పులు మార్గము నందు అక్కడక్కడ రత్నమయ విశ్రాంతి భవనములను నిర్మించిరి. ''విచిత్రము లైన ఆసనములు-స్త్రీలు-సుగంధద్రవ్యములు-భూషణములు-సూక్ష్మవస్త్రములు - రుచికరము లైన అన్నపానీయములు-వివిధము లైన ఆహార పదార్థములు-సుగంధ పుష్పమాలికలు"- ఈ మొదలైన వస్తువులను దుర్యోధనుడు నవనిర్మితము లైన విశ్రాంతి గృహములలో ఉంచు నేర్పాటు చేసెను.

జనమేజయా! విశేషించి, వృకస్థల గ్రామమునందు శ్రీకృష్ణుని వాసమునకుగాను వివిధరత్నములతో మనోహర మైన యొక సభను నిర్మింప జేసెను. దుర్యోధనుడు మనుష్యులకు దుర్లభములు, దేవోచితములు నైన యేర్పాట్లు చేసి, ధృతరాష్టునకు తెలిపెను.

జనమేజయా! ఇట్లు దుర్యోధనుడు వివిధము లైన పెద్దపెద్ద యేర్పాట్లు చేసి, కృష్ణునకు నివాసములు ఏర్పరచినప్పటికిన్ని కృష్ణుడు వానినన్నిటిని నిర్లక్ష్యము చేసి, వానివైపు గూడ చూడక, హస్తినాపురమువైపు సాగుచు పోయెను. అప్పుడు ధృతరాష్ట్రుడు విదురునితో నిట్లనెను:

ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుని ఎదుర్కొని కానుక లిచ్చి దుశ్శాసనుని భవనములో కృష్ణునకు విడిది యేర్పరచుట

"విదురా! శ్రీకృష్ణభగవానుడు ఉపప్లవ్యనగరము నుండి యిక్కడికి వచ్చుటకు బయలు దేరె నని, నేడు వృకస్థలమునందు బస చేసి - రేపు ఉదయము ఇక్కడికి వచ్చుచున్నా డనియు తెలిసినది జనార్దనుడు ఆహుకవంశ క్షత్రి

యులకు అధిపతి, యాదవులకు ముఖ్యుడు. అతని మనస్సు, పరాక్రమము చాలా గొప్పవి. ఆయన మహాసత్త్వగుణసంపన్నుడు. అతిసమృద్ధ మైన యాదవ గణ రాజ్యమునకు సంరక్షడు ,పోషకుడు. సర్వలోకములకు పిత యైన చతుర్ముఖునకు గూడ ఆయన తండ్రి గాబట్టి, సర్వలోకపు పితామహుడు. ఆదిత్యులు, వసువులు రుద్రులు, బృహస్పతిబుద్ధిని ఆశ్రయించినట్లు, వృష్ణి అంధక వంశీయ జనులు శ్రీకృష్ణుని బుద్ధిని ఆశ్రయించి యుందురు.

"విదురా! అట్టి శ్రీకృష్ణభగవానునకు నేను, ఒక టే వన్నె గల సుదృఢము లైన బాహ్లీక జాతి యుత్తమాశ్వములను నాలుగు - నాలుగుగా గూర్చిన పదియారు సువర్ణ రథములను కానుకగా సమర్పించెదను. అవియేకాక, సర్వథా మదజలము కుంభస్థలములనుండి స్రవించు చున్నట్టివి. నాగేటి దండములవంటి దంతములు గలిగినట్టివి, శత్రువులను కొట్టుటలో సమర్థము లైనట్టివి నైన యెనిమిది మదగజములను, ఒక్కొకదానితో నల్గురు సేవకులను ఇచ్చి శ్రీకృష్ణునకు కానుకగా సమర్పించెదను. సంతానము కలుగనట్టి వారు, సువర్ణ దేహకాంతి గలవారు, సుందరాంగులు నైన దాసీజనులను నూరుగురను, దాసజనమును నూర్గురనున్ను శ్రీకృష్ణభగవానునకు కానుకగా నిచ్చెదను.

"విదురా! నాకడ పర్వతీయులు కానుకగా నిచ్చిన గొఱ్ఱెల ఉన్నితో చేయబడిన మెత్తని కంబళములు కలవు. వానిలో పదునెనిమిదివేల కంబళ్ళు శ్రీకృష్ణునకు కానుకగా నిచ్చెదను. చీనదేశమునందు ఉత్పన్నములైన యనేక మృగచర్మములు నా యొద్ద ఉన్నవి. శ్రీకృష్ణువకు కావలసినన్ని సమర్పించెదను. రాత్రింబగళ్ళు జాజ్వలనముగా ప్రకాశించు మణి యొకటి నా యొద్ద నున్నది. అది గూడ శ్రీకృష్ణునకు సమర్పించెదను. నా యొద్ద వెండి కంచరిగాడిదల రథము ఉన్నది. అది ఒక దినములో పదునాల్గువేల యోజనములు వోప గలదు. దానిని శ్రీకృష్ణునకు సమర్పించెదను.

"విదురా! శ్రీకృష్ణునితో వచ్చు వాహనములు - సేవకులు నెంతమంది యుందురో వారికన్న నెనిమిది రెట్లు అధికముగా భోజన పదార్థములను, ప్రతిపూట ఏర్పరచెదను. దుర్యోధనుడు దప్ప నా పుత్రు లందరున్ను సుభూషితు లై శ్రీకృష్ణునకు స్వాగతము చెప్పుటకు ఎదురు పోయెదరు. సుందరాంగు లైన వేయిమంది వారాంగనలు సమస్త వేషభూషణములతో నలంకృత లై శ్రీకృష్ణునకు స్వాగతము చెప్పుటకు పాదచారిణులుగానే పోయెదరు. ముసుగులు వేసికొను

నియమము లేని కన్యకలు గూడ పోవచ్చును. ఈ నగరము నుండి ఉదయించిన సూర్యుని చూచునట్లు శ్రీకృష్ణుని చూచుటకు ఈ నగరమునందలి స్త్రీ-బాలవృద్ధు లందరు పోవచ్చును. హస్తినాపురిలో, నలుదిక్కుల పెద్ద - పెద్ద టెక్కెములు (జెండాలు) - గవనులున్ను గట్టి శోభాయమానముగా చేయుటకు, నగరములో దుమ్ము రేగకుండ, అతని మార్గములో నీరు చల్లుటకున్ను ఆజ్ఞ యివ్వ నైనది.

"విదురా! దుర్యోధనుని భవనముకన్న దుశ్శాసనుని ప్రాసాదము శ్రేష్ఠముగ నున్నది. ఆ భవనమును నేడు శుభ్రముగా ఊడ్చి, కడిగి. తుడిచి, సంపూర్ణముగా నలంకరించ వలెను. దుశ్శాసనుని భవనము అతి సుందరముగా నున్నది. అది మంగళకరము, సమస్త ఋతువుల శోభలచేత విరాజిల్లుచు అది అనంత ధనరాసులచేత సమృద్ధ మై యున్నది. నాయొద్ద నున్నవి, దుర్యోధనుని యొద్ద నున్నవియు సర్వరత్నములు శ్రేష్ఠవస్తువులు, అన్నియు దుశ్శాసనుని భవనముం దున్నవి. ఆ భవనము నందలి యే యే రత్నములను శ్రీకృష్ణుడు తీసికో దలచినను ఇవ్వ బడును."

శ్రీకృష్ణుని యాజ్ఞను పాలింపుమని విదురుడు ధృతరాష్ట్రునకు ఉపదేశించుట

జనమేజయా! ఆ మాటలు విని విదురుడు ధృతరాష్ట్రునితో ని ట్లనెను:

"మహారాజా! నీవు మూడు లోకములలోను నుత్తమపురుషుడవు. అంతటను నీకు సమ్మానము జరుగును. ఈ లోకమునందు గూడ నీకు గౌరవ ప్రతిష్ఠలు విశేషముగ నున్నవి. నీ విప్పుడు వృద్ధాప్యమునం దున్నావు. అందుచేత నీవు ఏమాట చెప్పినను అది శాస్త్రప్రకారము - లౌకిక రీతిగాను బాగుగానే యుండును. ఇట్టి స్థిర విచారము గలవాడవు గనుకనే, చంద్రునియందు కళలవలె, సూర్యుని యందు ప్రభలవలె, సముద్రమునందు ఉత్తుంగ తరంగములవలెను నీ యందు ధర్మము స్వాభావికముగానే యున్నది. ఈ విషయము ప్రజ లందరికిన్ని బాగుగా తెలియును.

"రాజా! నీ సద్గుణ సంపత్తి చేతనే సర్వదా యీ ప్రపంచమునకు ఉన్నతి, ప్రతిష్ఠయు కలుగు చున్నవి. అందుచేత, నీవు బంధుపుత్రమిత్రసహితముగ ఎల్లప్పటికిన్ని ఈ సద్గుణములను రక్షించుకొనుటకు ప్రయత్నము చేయుము.

"రాజా! నీవు సరళముగా నుండి, మూర్ఖముగా, కుటిలముగాను వ్యవహరించుచున్న నీ ప్రియ పుత్రుడు పౌత్రులకు, మిత్రులకున్ను సర్వనాశనము కలుగునట్లు చేయకుము. నీవు శ్రీకృష్ణునకు ఇవ్వ దలచిన వస్తువు లేవియు నతనిని తృప్తిపరచ జాలవు. ఆయన యీ సమస్త చరాచర ప్రపంచమునుగూడ పొందుటకు అధికారి.

"రాజా! నీవు ధర్మమును పాలించవలె నను నుద్దేశముతో గాని, శ్రీకృష్ణునకు ప్రియము చేయవలె నను నుద్దేశముతో గాని, యీ సమస్త వస్తువులు ఇవ్వ దలచుట లే దని స్పష్టముగా నేను నా యెదను తాకుచు సత్యము మీద శపథము చేసి చెప్పు చున్నాను.

"రాజా! నేను సత్యము చెప్పుచున్నాను. ఇది యంతయు నీవు చేయు మోసము - కపటము మాత్రమే కాని, వేరు కాదు. నీయీ బాహ్యవ్యవహారముల వెనుక దాగి యున్న నీ దురభిప్రాయము నాకు బాగుగా తెలియును.

"రాజా! అమాయకులైన పాండవులు, ఐదు చిన్న గ్రామములను మాత్రమే కోరు చున్నారు. వానిని గూడ నీవు ఇచ్చుటకు ఇచ్ఛయించ కున్నావు.

"రాజా! అర్థోపాయముచేత ధనము నిచ్చి నీవు శ్రీకృష్ణుని ఆకర్షింప జూచు చున్నావు. ఇంతయేకాక, యీ యుపపాయము చేతనే శ్రీ శ్రీష్ణునకు పాండవులతో భేదము కల్పింప జూచు చున్నావు కాని, నీకు వాస్తవము చెప్పు చున్నాను. వినుము. శ్రీకృష్ణుడు ధనముచేత గాని, మరియే యితర ప్రయత్నము చేత గాని, అర్జునునిపై నింద మోపుటచేత గాని, అర్జునుని వేరు చేయ జాలడు. నేను శ్రీకృష్ణుని మహిమను ఎరుగుదును. శ్రీకృష్ణుని యెడల అర్జునకుగల సుదృఢ భక్తిని గూడ నెరుగుదును. కాబట్టి శ్రీకృష్ణుడు, తన ప్రాణ సమాను డైన అర్జునుని ఎప్పటికిగూడ త్యజించ జాల దని నిశ్చయముగా చెప్పెదను.

"రాజా! అందుచేత నీవు శ్రీకృష్ణున కిచ్చు వస్తువు లన్నింటిలోను, జలకుంభము - కాళ్ళు కడుగకొనుటకు నీరు, నీవు చేయు కుశల ప్రశ్నములు తప్ప మరి యేమియు స్వీకరించడు. కనుక, రాజా! సమ్మాననీయ మహాత్ము డైన శ్రీకృష్ణునకు పరమ ప్రియమైన ఆతిథ్యమునే యిమ్ము. ఆయన మాననీయుడు గాబట్టి, అందరినుండి గౌరవము పొందుటకు అర్హుడు.

"మహారాజా! శ్రీకృష్ణభగవానుడు ఉభయపక్షములకు శ్రేయస్సు గోరి, యే ప్రయోజనమునకై యిక్కడికి వచ్చు చున్నాడో, దానినే ఆయనకు కానుకగా నిమ్ము. శ్రీకృష్ణుడు. నీకు, దుర్యోధనునకున్ను పాండవులతో సంధి గూర్చి ఉభయులమధ్య శాంతిని స్థాపించుటకై వచ్చు చున్నాడు. కనుక, ఆయన చెప్ప బోవు మాటలను నీవు అంగీకరించుము. అదియే ఆయనకు సంతుష్టి కలిగించును. మరి దేనిచేతగూడ కలుగదు.

"రాజా! నీవు తండ్రివి. వారు పుత్రులు. నీవు వృద్ధుడవు - వారు శిశువులు. కనుక, నీవు పాండవుల యెడల తండ్రివలె స్నేహభావముతో వ్యవహరింపుము."

దుర్యోధనుడు కృష్ణునిగూర్చి తన యభిప్రాయము తెలుపుట కుపితుడైన భీష్ముడు సభ విడిచి పోవుట

జనమేజయా! విదురుని మాటలు విని దుర్యోధనుడు తండ్రితో ని ట్లనెను:

"తండ్రీ! విదురుడు శ్రీకృష్ణుని విషయమై చెప్పిన మాటలన్నియు యథార్థములు. శ్రీకృష్ణునకు పాండవులయందు అచంచలమైన యనురాగము ఉన్నది. కనుక, వారి మధ్య భేదభావము కలిగించుట అసంభవము.

"రాజేంద్రా! నీవు శ్రీకృష్ణునకు సువర్ణ-ధన-రత్న రాసులు ఏమి యిచ్చినను ప్రయోజనము లేదు. అవి నీవు ఈయకుము. - నీ వీయ బోవు వస్తువులను పొందుటకు శ్రీకృష్ణుడు అధికారి కా డని నే ననుట లేదు. శ్రీకృష్ణునకు విశేష సత్కారములు చేయుటకు ఇది తగిన దేశము - కాలమున్ను కా దని మాత్రమే నేను వల దను చున్నాను. ఇప్పు డీయన్నియు మనము ఆయనకు చేసిన యెడల 'వీరు భయపడి యీ సత్కారములు తనకు చేయు చున్నారు' అని తలచును.

"రాజా! ఎక్కడైతే క్షత్రియునకు అవమానము జరుగునో, అచ్చట వివేకముగల క్షత్రియుడు అట్టి కార్యము చేయ గూడ దని నా నిశ్చయము. శ్రీకృష్ణుడు మూడు లోకములలోను అత్యంత పూజనీయు డని నాకు బాగుగా తెలియును. ఆయన అందరికన్నను శ్రేష్ఠుడు. అయినను, ఇప్పుడు ఆయనకు ఏమియు నీయ గూడదు. యుద్ధము ప్రారంభింప బడ నున్నప్పుడు, అతిథి సత్కారము చేత, ప్రేమ చూపినంత మాత్రమున చేత, అది శాంతించ బోవ దనుట తథ్యము. ఇది యిప్పటి కార్యగతి యని తెలిసికొనుము."

జనమేజయా! దుర్యోధనుని మాటలు విని భీష్మ పితామహుడు ధృత రాష్ట్రునితో ని ట్లనెను:

"రాజా! శ్రీకృష్ణుడు సత్కరింప బడినను, సత్కరింప బడకున్నను కోపింపడు. కాని, ఆయన అవమానింప బడుటకు ఎప్పుడు గూడ తగడు. కనుక, ఆయనను ఎవరు గూడ తిరస్కరించుట గాని, అవమానపరచుట గాని, చేయ గూడదు.

"రాజా! శ్రీకృష్ణుడు మనస్సునందు స్థిరముగా నిశ్చయించి చేయ దలచిన కార్యమును, ఎవడుగూడ, ఎన్ని ఉపాయములచేత గూడ, మార్చి త్రిప్పజాలడు. కనుక, వాసుదేవుడు చెప్ప బోవు కార్యమును ఏమాత్రము సంశయించక, వెంటనే చేయ వలెను. శ్రీకృష్ణుని మధ్యస్థునిగా నుంచుకొని నీవు వెంటనే పాండవులతో సంధి చేసికొనుము. ధర్మాత్ముడైన శ్రీకృష్ణభగవానుడు చెప్పు మాట లన్నియు ధర్మార్థములకు అనుకూలములుగా నుండును. కనుక, రాజా! నీవు నీ పుత్రమిత్ర బాంధవులతోపాటు ఆయనతో ప్రియవచనములనే మాట్లాడ వలెను."

జనమేజయా! ఆ మాటలు విని దుర్యోధనుడు భీష్మపితామహునితో ని ట్లనెను:-

"పితామహా! నేను జీవితాంతము పాండవులతో కలిసి యుండి, ఈ రాజ్య సంపదను అనుభవించుట యెప్పుడుగూడ సంభవము కాదు. ఇప్పుడు నేను చేయ బోవు మహాకార్యమును గూర్చి వినుడు. పాండవులకు సంపూర్ణముగా నాధార భూతుడు - ఆశ్రయుడు నైన శ్రీకృష్ణుడు ఇక్కడికి వచ్చినప్పుడు ఆయనను బంధించి చెరలో పెట్టెదను. తరువాత, యదువంశీయులు - పాండవులు - సమస్తభూమండలము వారున్ను నాయధీనములో వచ్చెదరు. శ్రీకృష్ణుడు తెల్లవార ఇక్కడికి వచ్చుచునే యున్నాడు గదా! కనుక, శ్రీకృష్ణునకు ఈ రహస్యము తెలియకుండునట్లు, ఈ నా యభిప్రాయములో విఘ్నములు కలుగకుండు నట్లున్ను ఏదైన ఉపాయము లుండినచో, అవి నాకు ఇప్పుడు తెలుపుడు."

జనమేజయా! శ్రీకృష్ణునియెడల కపటోపాయములను ప్రయోగింప దలచిన దుర్యోధనుని మాటలు విని ధృతరాష్ట్రుడు మిక్కిలి దుఃఖితుడై, దుర్యోధనునితో ని ట్లనెను:

''నాయనా! నీవు ప్రజాపాలకుడవు. ఇట్టి మాటలు నీనోటినుండి వెలువడ గూడదు. ఇది సనాతన ధర్మము. శ్రీకృష్ణుడు దూతగా వచ్చెను. ఆయన మనకు ప్రియబంధువు. ఆయన కౌరవులకు ఏలాటి యపరాధము గూడ చేయలేదు. ఇట్టి పరిస్థితిలో, ఆయన బంధింప బడుటకు అర్హు డె ట్లగును?''

"అప్పుడు భీష్మ డి ట్లనెను:

''ధృతరాష్ట్రా! మందబుద్ధి యైన నీ కొడుకు కాల (యమ) వశములో చిక్కుకొనినాడు. ఇతడు తన హితమును గోరు మిత్రులు ఎంతగా సమాధాన పరచుచు చెప్పినప్పటికిన్ని, అనర్థము వైపునకే పోవు చున్నాడు గాని, అర్థము (ప్రయోజనము) వైపు పోవుట లేదు.

''రాజా! మిత్రులు - హితులు - బంధువులున్ను చెప్పిన మాటలను అంగీకరించక, చెడు మార్గములో పడి పోవు చున్న యీ పాపాత్మునే నీవుగూడ అనుసరించు చున్నావు గదా! మిక్కిలి అవలీలగా మహాకార్యములను క్షణములో సాధింప గల శ్రీకృష్ణ పరమాత్మునితో విరోధము కట్టుకొని, దుర్బుద్ధి యైన యీ నీ కొడుకు, తన మంత్రులతోపాటు ఒక్క క్షణమాత్రమునే నశించి పోవ గలడు సుమా! పాపిష్ఠుడు - క్రూరుడు - దుర్బుద్ధి - ధర్మమును విడిచిన వాడు నైన దుర్యోధనుని యనర్థకరము లైన మాటలను నేను ఏమాత్రము విన గోరను.''

జనమేజయా! భీష్మ పితామహు డిట్లు చెప్పి మిక్కిలి కుపితు డై సభాభవము నుండి లేచి వెడలి పోయెను.

శ్రీకృష్ణునకు హస్తినపురిలో స్వాగతము - అతనికి ధృతరాష్ట్ర విదుర గృహములలో సత్కారము

జనమేజయా! అక్కడ వృకస్థలమునందు శ్రీకృష్ణ భగవానుడు ఉదయము మేల్కొని ప్రాతః కాలకృత్యములను తీర్చుకొని, అక్కడి బ్రాహ్మణుల యనుజ్ఞ తీసికొని, హస్తినపురమునకు ప్రయాణము చేసెను. అక్కడినుండి బయలుదేరు చున్న శ్రీకృష్ణునకు వీడ్కోలు చెప్పి వృకస్థల వాసులు తిరిగి పోయిరి.

దుర్యోధనుడు తప్ప, తక్కిన ధృతరాష్ట్రపుత్రులు - భీష్మద్రోణాదులున్ను చక్కగా నలంకరించుకొని శ్రీకృష్ణునకు స్వాగతము చెప్పుటకు ఆయనకు ఎదురుగా పోయిరి.

అనేకులు పౌరులు శ్రీకృష్ణ దర్శనాకాంక్షతో వివిధ వాహనములలో, పాదచారులుగాను వెడలిపోయిరి. శ్రీకృష్ణభగవానుడు మార్గములోనే, భీష్మద్రోణాదులచేత, పౌరులచేతను పరివృతుడై హస్తినాపురమునకు పోయెను. శ్రీకృష్ణుని గౌరవార్థము ఆ నగరము బాగుగా నలంకరించబడి యుండెను. రాజమార్గములు అనేక విధ రత్నములచేత నలంకరింపబడి యుండెను. అప్పుడు జనమేజయా! నగర గృహములలో స్త్రీబాల వృద్ధులెవ్వరు గూడ తమ యిండ్లలో ఉండక శ్రీకృష్ణ దర్శనేచ్ఛతో వీధులలోనికి వచ్చిరి.

జనమేజయా! శ్రీకృష్ణుడు నగరమునందు ప్రవేశించుచున్నప్పుడు, మార్గములలో నిలిచియున్న జనులు ఆయనను బహువిధములుగా స్తుతించుచుండిరి. శ్రీకృష్ణ దర్శనార్థమై పౌరులు గుమిగూడి పెద్ద పెద్ద భవనములపైన నిలిచియున్న సుందర స్త్రీల సమూహములతో ఆ భవనములు గూడ శ్రీకృష్ణునితో వీథిలో నడచిపోవుచున్నవా యనునట్లుండెను. జన సమూహముతో నిండియున్న మార్గములలో శ్రీకృష్ణుని రథాశ్వముల గమనము కుంటుపడి పోయెను.

రాజా! తెల్లని కమలముల వంటి కన్నులు గల (పుండరీకాక్షుడు) శ్రీకృష్ణుడు అనేక ప్రాసాదములలో సుశోభితమైన ధృతరాష్ట్రుని తెల్లని భవనములలో ప్రవేశించెను. ఆ రాజభవనము నందు శ్రీకృష్ణుడు మూడు కక్ష్యలను దాటి ధృతరాష్ట్రుని సమీపము చేరెను. ఆయన అక్కడ చేరిన వెంటనే ప్రజ్ఞాచక్షువైన ధృతరాష్ట్రుడు భీష్మద్రోణులతో పాటు తన ఆసనము నుండి లేచి నిలబడెను. కృపాచార్య సోమదత్తాదులందరున్ను తమ తమ ఆసనములనుండి లేచి అతిథి గౌరవార్థము నిలబడిరి.

రాజా! పిదప శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుని కలిసికొని, గౌరవ వచనములతో భీష్ముని ఆదరించెను. శ్రీకృష్ణుడు అందరిని ధర్మము ప్రకారము పూజించి అక్కడ ఉన్న రాజులతో వారి వారి మనస్సు ననుసరించి అందరితో కలిసికొనెను. అక్కడ ధృతరాష్ట్రుని యాజ్ఞతో ఉంచబడిన విశాలమైన సువర్ణ పీఠమునందు శ్రీకృష్ణుడు కూర్చొనెను. ధృతరాష్ట్ర పురోహితులు శ్రీకృష్ణుని యాతిథ్యము కొరకు శ్రేష్ఠమైన గోవును, మధుపర్కమును, జలమును తెచ్చి పూజ చేసిరి.

రాజా! ఇట్లు అతిథిపూజ స్వీకరించి శ్రీకృష్ణుడు నవ్వుచు కౌరవులతో పాటు అక్కడి బంధువులను తగినట్లుగా పలకరించుచు కొంతసేపు ఆ సభలో కూర్చొనెను. ధృతరాష్ట్రునిచేత సమ్మానితుడై శ్రీకృష్ణుడు అతని యనుమతి తీసికొని బయటికి వెడలి విదురుని యింటికి పోయెను. తన యింటికి దయచేసిన శ్రీకృష్ణభగవానుని సమీపించి విదురుడు తన యిష్టము ప్రకారము సకల మంగళ ద్రవ్యములతో పూజించి ఇట్లనెను:

''కమలనయనా! నీ దర్శనముచేత నాకు కలిగిన సంతోషము నేను వర్ణింప జాలను. నీవు సమస్త ప్రాణులకు అంతర్యామి యైన ఆత్మస్వరూపుడవు. కనుక నా మనస్సంతోషమును నీవు తెలిసికొనియే ఉందువు."

జనమేజయా! ఇట్లు చెప్పి ధర్మాత్ముడైన విదురుడు, శ్రీకృష్ణునకు అతిథి సత్కారము చేసిన తరువాత పాండవుల క్షేమమును గూర్చి అడిగెను. అన్ని విషయములను ప్రత్యక్షముగా చూడగల శ్రీకృష్ణుడు ధర్మాత్ముడైన విదురునకు పాండవుల ప్రయత్నములన్నియు సవిస్తారముగ చెప్పెను.

శ్రీకృష్ణుడు కుంతీదేవిని దర్శించుట - తన కష్టములు తలచి దుఃఖించుచున్న కుంతిని కృష్ణుడు ఊరడించుట

జనమేజయా! శ్రీకృష్ణుడు విదురునితో కలిసిన తరువాత, ఆనాటి మూడవ జామున తన మేనత్త కుంతీదేవి యొద్దకు పోయెను. శ్రీకృష్ణుడు వచ్చుట కుంతీదేవి చూచి అతనిని సమీపించి ఆలింగనము చేసికొని తన పుత్రులను తలచు కొని బోరుబోరున ఏడ్చెను. తన పుత్రుల మధ్య సర్వదా తిరుగుచు మెలగుచు నున్న శ్రీకృష్ణుని చాల కాలము తరువాత చూచిన కుంతీదేవికి కన్నీరు ఏకధారగా కురియు చుండెను. ఆమె శ్రీకృష్ణ భగవానునకు అతిథి సత్కారములు చేసెను. ఆయన పీఠముపై కూర్చొనిన తరువాత కుంతీదేవి, కన్నీటితో డగ్గుత్తుక పడిన కంఠములో ఈ విధముగా మాటాడెను :

''వత్సా! బాల్యము నుండి గురుజన సేవలో ఆసక్తిగల నా పుత్రులు పరస్పరము ప్రేమ కలిగి, అంతటను పూజలు పొందుచు, అందరిని సమాన భావముతో చూచుచున్నప్పటికిన్ని, వారియెడల శత్రువులు రహస్యముగా చేయు నపకారములను అనుభవించుచు చివరకు రాజ్యమును పోగొట్టుకొని, జన సమూహములో ఉండుటకు యోగ్యులయినను నిర్జన వనమునకు పోయిరి. నా కొడుకులు సంతోష క్రోధములను జయించినారు. బ్రాహ్మణులకు హితము చేయువారు. సత్యవాదులు. అట్లయినను శత్రువులు చేసిన యన్యాయముచేత వశము తప్పి ప్రియజనులను, సుఖమును, ఏడ్చుచున్న నన్నును విడిచి వనమునకు పోయిరి.

"కేశవా! నాకు వనమునకు పోవునపుడు నా మనస్సు సమూలముగా లాగుకొని తమ వెంట తీసికొనిపోయిరి. వారు వనవాసమునకు అర్హులు కారు. అట్టి వారికి ఈ కష్టము సంభవించెను.

"నాయనా! వారికి బాల్యమునందే తండ్రి ప్రేమ లేకుండ పోయెను. నేనే వారిని లాలించి పాలించితిని. అట్టి సుకుమారులు సింహ-వ్యాఘ్ర-గజాది క్రూర మృగములతో నిండిన విశాల మైన ఆ యడవి యందు తల్లిదండ్రులను విడిచి ఏ విధముగా నివసించి యుండిరో గదా!

"శ్రీకృష్ణా! నా కొడుకులు బాల్యము నుండియు శంఖదుందుభి మృదంగాది వాద్యముల మధుర నాదములచేత మేల్కొల్పబడు చుండిరి. కోమల శయ్యపై శయనించు చుండిరి. ఆ దినములలో వారు ఏనుగుల ఘీంకార శబ్దములతో, గుఱ్ఱముల సకిలింపులతో, రథ చక్రముల ఘర్ఘర శబ్దములతోను నిద్ర మేల్కొను చుండిరి. బ్రాహ్మణులు పుణ్యాహవాచన మంత్రముల పవిత్రధ్వని చేత నా పుత్రులను ఆదరించు చుండిరి. పూజనీయులు గూడ వారి గుణముల గానము చేయుచు వారిని అభినందించు చుండిరి. వారు నిద్ర మేల్కొని రత్నాలంకార వస్త్రములతో బ్రాహ్మణులను పూజించు చుండిరి. జనార్దనా! అట్టి వారే వనమునందు క్రూరజంతువుల భయంకర ధ్వనులు వినుచు, నిద్రగూడ సరిగా కానక ఉండిరి. ఇట్టి దురవస్థకు వారు అర్హులు కారుగదా!

"శ్రీకృష్ణా! లజ్జాశీలుడు, సత్యవ్రతుడు, జితేంద్రియుడు, దయాళుడు, కామక్రోధములను జయించినవాడు, సత్పురుష మార్గములను అనుసరించు వాడు, అంబరీష-మాంధాతృ-యయాతి-నహుష-భరత-శిబి-దిలీపాది రాజర్షుల సత్ప్రవర్తన కలవాడు, కఠిన మైన ధర్మపాలన భారము వహించినవాడు, సర్వ సద్గుణ సంపన్నుడై యుండుటచేత త్రిలోకాధిపత్యము గూడ వహించ గలవాడు, కౌరవు లందరిలో శ్రేష్ఠుడు, బంగారువన్నె గల శరీరము గలిగి, అందరికిన్ని ప్రియుడు నైన యుధిష్ఠిరుడు ఇప్పుడు ఎట్లున్నాడు?

"మధుసూదనా! పదివేల యేనుగుల బలము, వాయువేగము, సోదర ప్రేమ సోదరులకు ప్రియము చేయుటయందే ఆసక్తి, ఇవన్నియు కలిగి యున్నవాడు, నూరుగురు కీచకులను సంహరించినవాడు, సుప్రసిద్ధులైన బక-హిడింబాసురులను సంహరించినవాడు, పరాక్రమములో ఇంద్రుడు, బలములో వాయువు క్రోధమునందు మహేశ్వరునితో సమానుడు, యోధాగ్రేసరులలో శ్రేష్ఠుడు, శత్రువులకు భయంకరుడై, సంతాపము గూర్చువాడునై, తనలో క్రోధ-బల, అసూయలను కలిగి యున్నను,మనస్సును తన వంశమునం దుంచుకొని సర్వదా అన్నగారి ఆజ్ఞతో మెలగును, పరాక్రమరాశియై యున్న భీమసేనుడు క్షేమముగా నున్నాడా?

"కృష్ణా! రెండు భుజములు కలవాడైనను అర్జునుడు సహస్రభుజములు గల కార్తవీర్యార్జునునితో సర్వదా స్పర్ధ (పోటీ) వహించి యుండును. అతడు ఒకటే వేగముతో ఐదునూర్ల బాణములను ప్రయోగించ గలడు. అతడు ధనుర్విద్యలో కార్తవీర్యార్జునునితో, తేజస్సులో సూర్యునితో ఇంద్రియ నిగ్రహమునందు మహర్షులతో ఓర్పునందు భూమితో, పరాక్రమమునందు ఇంద్రునితోను సమానుడు. ఇప్పు డున్న సంపూర్ణ కౌరవ సామ్రాజ్యమును అర్జునుడే తన భుజబల పరాక్రములతో వృద్ధి పొందించెను. అతని బాహు బలముననే ఆశ్రయించి పాండవు లున్నారు.

''కృష్ణా! యుద్ధమునందు అతని యెదుట నిలిచి ఎవడున్ను తప్పించుకొని పోవ జాలడు. అతడు సమస్త ప్రాణులను జయించ గలడు. అతనిని ఎవరు గూడ జయింప జాలరు. దేవతలకు ఇంద్రునివలె, పాండవులకు అతడు ఆశ్రయమై యున్నాడు. కృష్ణా! నీకు సోదరునివలె నున్న అర్జునుడు ఇప్పుడు ఎట్లున్నాడు?

''శ్రీకృష్ణా! సమస్త ప్రాణులందు దయ గలిగి లజ్జాశీలుడై, అస్త్రవిద్యయందు పండితుడు, సుకుమారుడు, ధార్మికుడు, నాకు మిక్కిలి ప్రియుడు నయిన సహదేవుడు ఎట్లున్నాడు? అతడు అన్నలకు సేవ చేయు చుండును. ధర్మార్థ కామమోక్షములను వివరించుటలో కుశలుడై యున్న యతని ప్రవర్తనము సోదరు లందరు ప్రశంసించు చుందురు.

''కృష్ణా! సుకుమారుడు, యువకుడు, శూరుడు, సుందరుడు. సోదరులకు బహిఃప్రాణము, విచిత్రయుద్ధము చేయువాడు, నాకు ప్రియుడునయిన

నకులుడు కుశలముగా నున్నాడా? నకులుడు రెప్పపాటు మాత్రము నాకు కనపడ కున్న, నిలువ జాల కుంటిని. అట్టి నేను ఇప్పుడు జీవించి యున్నాను. చూడుము. నకులుని నే నెప్పుడైనను చూడ గలుగుదునా?

''జనార్దనా! ద్రౌపది నాకు పుత్రులకంటే మిక్కిలి ప్రియురాలు. ఆమె సత్కులసంజాత, అసమానరూప సౌందర్య, సంపన్నురాలు, సమస్త సద్గుణ సంపన్నురాలు. ఆమె పుత్రలోకముకంటే పతిలోకమే శ్రేష్ఠమని ప్రియపుత్రులను విడిచి పతులతో అడవికి పోయెను. ఆమెకు నేను అన్నివిధములైన వస్తువులను ఇచ్చి ఆదరించితిని. అట్టి మహారాజ్ఞి ద్రౌపది ఇప్పుడు ఎట్లు ఉన్నది? మహాశూరులైన ఐదుగురు పతులు కలిగినదైనను ఆమె దుఃఖము ననుభవించు చున్నది.

''కృష్ణా! నేను పుత్రవియోగముచే తపించుచు ద్రౌపదిని చూడక పదునాలుగు వర్షములు గడచు చున్నవి. ఇంత సద్గుణవతి యయినను ఆమెకు సుఖము కలుగ లే దనగా, మనుష్యులకు పుణ్యకర్మలవలన సుఖము కలుగదని చెప్ప వలసి యున్నది. ఆమెను నిండుసభలో ఈడ్చుకొని వచ్చు చుండగా నేను అసహాయురాలనై చూచితిని. అంతకన్న మించిన దుఃఖము నాకు ఎప్పుడున్ను కలుగ లేదు. క్రోధము చేత, లోభముచేతను గూడిన దుష్ట దుర్యోధనుడు రజస్వలావస్థయందు ఏకవస్త్రయై యున్న ద్రౌపదిని సభలో పిలిపించి, మామ మొదలగు పెద్దలయెదుట నిలువబెట్టెను. సభలోని పెద్ద లందరు ఆమెను చూచి మిక్కిలి దుఃఖించిరి. ఆ సభయం దున్న యందరికంటెను నేను విదురుని మిక్కిలి గౌరవించెదను. అతడు ద్రౌపదికి జరిగిన యన్యాయమును స్పష్టముగా ఖండించెను. కనుక, అందరికంటే అతడే శ్రేష్ఠుడు. మనుష్యుడు తన సత్ప్రవర్తనతోనే శ్రేష్ఠు డనిపించుకొనును. ధనసంపదలతోకాదు. కృష్ణా! మిక్కిలి బుద్ధిమంతుడు, గంభీరస్వభావము కలవాడు నగు విదురునకు గల మంచి స్వభావమే అతనికి అలంకారము. అదియే సర్వలోక విఖ్యాతమై యున్నది.

''శ్రీకృష్ణా! పూర్వకాలమునందు దుష్టులైన రాజులు జూదము, వేట పరిపాటిగా పెట్టినారు. కాని, ఆ రెండింటివలననూ లోకమునందు సుఖము కలిగినదా? ప్రత్యక్షముగా మనము చూచినాము గదా! పాండవులకు జూదమువలన లాభము కలిగినదా? ఈ రెండు వ్యసనములవలన ఎప్పుడు కూడ సుఖము గలుగదు. సభలో దుర్యోధనాదులు ద్రౌపదికి కలిగించిన కష్టములవలన ఎప్పుడు

గూడ వారికి సుఖము గలుగదు. ఆ యవమానము నా హృదయమును దహించు చున్నది. నా పుత్రులు అనుభవించిన దుఃఖము లన్నియు నేను కనులార చూచినవే కదా! ఇప్పుడు వారికి సామాన్య జీవితము నిర్వహించుటకు గూడ అవరోధము కలుగు చున్నది. నాకు, నా పుత్రులకున్ను ఇట్టి క్లేశము రా గూడదు. నా పుత్రులు ఇట్టి దురవస్థచేత నేటికి పదునాలుగు వర్షములుగా బాధపడు చున్నారు. మేము ఇంత దుఃఖము అనుభవించినను మాకు సుఖము లభించ లే దనగా , మేము చేసిన పుణ్యము నశించినట్లే.

''శ్రీకృష్ణా! నాకు కౌరవ పాండవుల యెడల ఎప్పుడు గూడ భేదభావము లేదు. నీవు, పాండవులున్ను శత్రువులను సంహరించి రాజ్యలక్ష్మిని చేపట్టి యుద్ధము నుండి విముక్తు లైనట్లుగా భావించెదను. పాండవులయందు అన్ని సద్గుణములు నున్నవి. అందుచేత శత్రువులు వారిని జయింప జాలరు. ఇప్పుడు నేను అనుభవించు కష్టములకు నా దోషము కాని, దుర్యోధనుని దోషము కాని, కాదు. ఈ దోషముల కన్నిటికిన్ని కారకుడు నా తండ్రియే. కనుక, ఈ నిందను ఆయన యందే మోపు చున్నాను ఆయన నన్ను కుంతి భోజునకు, ఒక యాచకునకు సాధారణముగా ధనము దానము చేసినట్లు దానము చేసెను.

''కృష్ణా! నేను బాల్యమునందు బంతు లాడుచు తిరుగు చుంటిని. అట్టి చిన్న వయస్సులోనే నన్ను నీ పితామహుడు కుంతిభోజుని యందలి మైత్రి చేత అతనికి అభిమానపుత్రిగా ఇచ్చెను. కనుక, శ్రీకృష్ణా! నాకు ఇటు తండ్రి, అటు మామగారు మోసమే చేసిరి. దానివలన నేను మిక్కిలి దుఃఖించు మన్నాను. నేను బ్రతికి యుండి ఏమి లాభము? అర్జునుని జన్మకాలమునందు నేను సూతికాగృహము (పురిటి ఇల్లు) నందు ఉంటిని ఆ రాత్రి ఆకాశవాణి నాతో ని ట్లనెను :

''మంగళకరులాలా! నీ యీ కొడుకు సమస్తభూమండలమును జయింప గలడు. ఇతని కీర్తి స్వర్గలోకము వరకు వ్యాపించును. మహాయుద్ధమునందు కౌరవులను సంహరించి సమస్త రాజ్యాధికారమును పొంద గలడు. తరువాత, ఇతడు తన సోదరులతో కలిసి మూడు అశ్వమేధయాగములను చేయ గలడు."

''కృష్ణా! ఆ యాకాశవాణిపై గూడ నేను దోషము చెప్పను. కాని, మహావిష్ణుస్వరూప మైన ధర్మమునకే నమస్కారము చేసెదను. ధర్మమే ఈ

ప్రపంచమును సృష్టించెను. అదియే ప్రజలను రక్షించు చున్నది. శ్రీకృష్ణా! ఒకవేళ ధర్మమే ప్రపంచమునం దుండిన యెడల ఆకాశవాణి చెప్పిన మాట లన్నియు ధర్మస్వరూపుడ వైన నీవే నెరవేర్చ వలెను.

"మాధవా! పుత్రవియోగములన గలిగిన శోకముచేత నేను ఎంతగా దహింప బడు చున్నానో, అంతటి దుఃఖము, వైధవ్యము, ధన నాశము, దాయదులతో వైరము - వీటిచేత గూడ నాకు కలుగట లేదు. గాండీవధారియై, సర్వశాస్త్రజ్ఞు డైన అర్జునుని చూడ కున్నచో నా హృదయమునకు శాంతి యెట్లు లభించును? పదునాలుగేండ్లుగా నాకొడుకులను చూడ లేదు. ప్రాణములు పోయిన వారు కనబడకుండ పోయెదరు. అట్టి వారికి లోకములో శ్రాద్ధములు చేసెదరు. మృత్యువు అనగా 'వ్యక్తి కనబడ కుండ పోవుట' అని అర్థము కదా! అట్లయినప్పుడు నాకు పాండవులు, పాండవులకు నేను పదునాలుగేండ్లుగా కనబడకుండుట చేత వారి దృష్టిలో నేను, నా దృష్టిలో వారు మరణించినట్లే కదా!

''శ్రీకృష్ణా! నా మాటగా నీవు యుధిష్ఠిరునితో ని ట్లనుము :

"పుత్రా! నీ ధర్మమునకు హాని కలుగు చున్నది. దానిని నీవు వ్యర్థము చేయకుము. ఇతరులను ఆశ్రయించి జీవనము గడపికొను స్త్రీకి దిక్కారమగు గాక! దైన్యముచే లభించు జీవికన్న మరణించుట శ్రేయము.

"శ్రీకృష్ణా! భీమార్జునులతో మరల నిట్లు చెప్పుము:

''పుత్రులారా! క్షత్రియస్త్రీ, ఏ ప్రయోజనము కొరకు పుత్రులను కనునో, అది పూర్తి చేయుటకు సమయము ఆసన్న మైనది. ఇట్టి సమయమునందు గూడ మీరు యుద్ధము చేయనియెడల, కాలము వ్యర్థముగా గడచి పోవును. మీరు ప్రపంచమునందు గౌరవింప బడిన పురుషులు. మీ రే దైన నీచ కర్మ చేసిన యెడల, నేను మిమ్ము ఎల్లప్పటికిన్ని విడిచెదను. అవసరము వచ్చినప్పుడు మీరు ప్రాణత్యాగమునకు గూడ సంసిద్ధు లై యుండ వలెను.

''శ్రీకృష్ణా! సర్వదా క్షత్రియ ధర్మమునందే తత్పరు లై యున్న నకుల సహదేవులకు నా మాటగా నిట్లు చెప్పుము :

"పుత్రులారా! మీకు ప్రాణముల నొడ్డియైనను, పరాక్రమముతో సంపాదించిన సుఖభోగములనే అనుభవింపుడు.

''పురుషోత్తమా! క్షత్రియధర్మముతో జీవికను నిర్వహించు మనుష్యుని మనస్సునకు పరాక్రమము చేత సంపాదించిన ధనమే సంతోషము కలిగించును. కనుక, నీవు పాండవుల యొద్దకు పోయి అర్జునునితో నా మాటగా తాను ద్రౌపది చెప్పినట్లు చేయ వలె నని చెప్పుము.

"భీమార్జునులు కోపించినచో వారు యమునివలె, దేవతలను గూడ మృత్యుముఖమును పొందించ గలరు. ద్రౌపది రాజసభలో నున్నప్పుడు కర్ణ దుశ్శాసనులు ఆమెను కఠినముగా దుర్భాషలు మాటాడిరి. అది యంతయు భీమార్జునులకే అపమానకరము.

"కృష్ణా! దుర్యోధనుడు కురు శ్రేష్ఠుల సమక్షమునందు భీమసేనుని అవమానపరచెను. దాని ఫల మత డను భవించ గలడు. వైర మేర్పడిన తరువాత భీమసేనుడు శాంతితో నుండడు. అతడు శత్రుపక్షమును పూర్తిగా హతమార్చువరకు చాలకాలము గడిచిన తరువాత గూడ, అతని వైరము చల్లారదు. జూదమునందు ఓడినందుకు గాని, రాజ్యము గుంజుకొనినందుకు గాని నా పుత్రులను వనమునకు పంపించినందుకు గాని నాకు దుఃఖము కలుగ లేదు. కాని, సాధ్వి యైన నా కోడలు ద్రౌపది ఏకవస్త్రమును ధరించి నిండు సభలో పోవలసి వచ్చినందులకు, ఆమె దుష్టుల కఠిన వాక్కులు విన వలసి వచ్చినందులకు, నాకు గలిగిన దుఃఖమునకంటె అధిక దుఃఖము మరియేమి యుండును? ద్రౌపది అప్పుడు రజస్వలగా నుండెను. ఆమె సనాథ యయ్యు అప్పుడు తనకు నాథుని (రక్షకుని) గా నెవనిని గూడ పొంద జాలక దిక్కు లేనిదిగా నుండెను.

"పురుషోత్తమా! పుత్రసహితురాల నైన నాకు బలరాముడు - ప్రద్యుమ్నుడు - నీవున్ను రక్షకులుగా నున్నారు. యుద్ధము నందు ఎప్పుడు గూడ వెన్ను జూపని యర్జునుని వంటి-ఎవరికి గూడ నెదిరించుటకు శక్యుడు కాని భీమసేనుని వంటి పుత్రులు జీవించి యుండగా, నేను దుర్భరము లైన కష్టములను - దుఃఖములనున్ను సహించు చున్నాను."

జనమేజయా! అర్జున సఖు డైన శ్రీకృష్ణుడు, చింతానిమగ్నురా లై దుఃఖించు చున్న తన మేనత్త కుంతీదేవిని ఈ విధముగా ఊరడించెను:

"అత్తా! ప్రపంచమునందు నీవంటి యదృష్టవంతురాలు మరియెవతె యున్నది? నీవు శూరసేనరాజపుత్రివి. అజమీఢ మహారాజ వంశమునందు కోడలుగా వచ్చితివి. మహా కులీనురాలవు. కమలము, ఒక సరోవరమునుండి మరియొక సరోవరమునకు వచ్చినట్లు, ఒక మహాకులమునుండి మరియొక యున్నతకులమునకు వచ్చితివి. ఒకనాడు నీవు గొప్ప భాగ్యవతివిగా నుంటివి. నీ పతిదేవుడు నిన్ను సర్వదా గౌరవించు చుండెను. నీవు వీరపత్నివి. వీరజననివి. సమస్త సద్గుణ సంపన్నురాలవు. మహాప్రాజ్ఞురాలవు. నీవంటి వివేకవతి సుఖ - దుఃఖములు సహించి యుండ వలెను.

''అత్తా నీ పుత్రులందరు, నిద్రను, సోమరితనమును, హర్ష - క్రోధములను, ఆకలి - దప్పులను, శీతోష్ణములనున్ను జయించిరి. వారు సర్వదా వీరోచిత సుఖమునే అనుభవించెదరు. నీ పుత్రులు గ్రామ్యము లైన లౌకిక సుఖములను విడిచిరి. వారు గొప్ప ఉత్సాహము గలవారు. మహాబలశాలురు. కాబట్టి వారు అల్పము లైన ఐశ్వర్యములతో సంతుష్టి చెందరు.

"వీరపురుషులు సుఖములయొక్క అంతిమ స్థితిని పొందెదరు. గ్రామ్యము లైన విషయ సుఖభోగములందు ఆసక్తు లైనవారు, సుఖముల మధ్యమ స్థితిని పొందెదరు. ధీర పురుషులు, తమకు సంభవించిన పెద్ద-పెద్ద క్లేశములనుగూడ, కర్తవ్యపాలన రూపములోనే సహించి, చివరకు, మానవులకు అంద రాని సుఖములలో రమించెదరు. అంతిమ (సుఖ-దుఃఖాతీత మైన)స్థితిని పొందుటయే వాస్తవసుఖ మని, సుఖ-దుఃఖముల మధ్యమస్థితియే దుఃఖ మనియు మహాత్ములు చెప్పెదరు.

"అత్తా! ద్రౌపది, పాండవులున్ను నీకు ప్రణామములను చెప్పి పంపిరి. తాము క్షేమముగ, ఆరోగ్యముగ నున్నట్లు నీకు నివేదించు మనిరి. ఆరోగ్యముతో సంపూర్ణమనోరథసిద్ధితో, శత్రుసంహారముతో, సామ్రాజ్య లక్ష్మితోను కూడి యుండిన నీ పుత్రులు ప్రపంచ సామ్రాజ్యపదవియందు ఉండగా నీవు త్వరలోనే చూడ గలవు.

జనమేజయా! యీ విధముగా శ్రీకృష్ణభగవానుని చేత ఊరడింప బడిన తరువాత కుంతీదేవి, అజ్ఞాన జనిత మైన మోహము విడిపోవగా శ్రీకృష్ణునితో ని ట్లనెను :-

"శ్రీకృష్ణా! పాండవులకు హితకరములు, నీకు ఉచితములు నని తోచిన కార్యము లన్నియు చేయుము. ధర్మలోపము రాకుండ, మాయాకపటములు లేకుండను నున్న సమయోచిత కార్యములను నీవు చేయ వలెను. నీకు సత్యము నందు గల ఆసక్తి,కులగౌరవమునందు గల ప్రేమభావముగూడ నే నెరుగుదును.

"ప్రతి కార్యమున్ను వ్యవస్థతో చేయుట, మిత్రులను కూర్చుకొనుట' బుద్ధి పరాక్రమము, వీనియందు నీకు గల యద్భుత ప్రభావమును నేను బాగుగా నెరుగుదును. మా కులమునందు నీవే ధర్మము, నీవే సత్యము, నీవే గొప్ప తపస్సు, నీవే రక్షకుడవు, వరబ్రహ్మవు - పరమాత్ముడవున్ను నీవే.

"కృష్ణా! ఈ జగ మంతయు నీయందే ప్రతిష్ఠితమై యున్నది. నీ నోట ఏమాట అన్నను, అది యంతయు నీ యెదుట సత్య మై నిలుచును. ఎవనికిన్ని పరాజితుడవు గానట్టి మాధవా! కౌరవ - పాండవులకేకాక, సమస్త ప్రపంచము నకున్ను నీవు ఆశ్రయభూతుడ వై యున్నావు. నీ మహిమ - నీ బుద్ధిబలము గూడ నీకు తగినట్లుగానే యున్నది."

జనమేజయా! యిట్లు కుంతీదేవి చెప్పిన తరువాత శ్రీకృష్ణభగవానుడు ఆమెకు ప్రదక్షిణ-నమస్కారములు చేసి యామె సెలవు తీసికొని, దుర్యోధనుని భవనమునకు పోయెను."

శ్రీకృష్ణుడు దుర్యోధన గృహమునకు పోయి యతని యాతిథ్యము స్వీకరించక విదురుని యింటిలో భుజించుట

జనమేజయా! ఇంద్ర భవనముతో సమానముగా సంపద్యుక్త మై యున్న దుర్యోధనుని భవమునకు శ్రీకృష్ణుడు పోయెను. అందులో చిత్ర - విచిత్రము లైన ఆసనములు చేయ బడి యుండెను. శ్రీకృష్ణుడు ఆ భవనమునందు మూడు కక్ష్యలు దాటి శరత్కాల మేఘమండలమువలె తెల్ల నై శ్వేతపర్వతశిఖరతుల్య మై, ప్రకాశించు చున్న దుర్యోధనుని ప్రాసాదమును చేరెను. ఆయనను ద్వారపాలకు లెవరు గూడ అడ్డు పెట్టలేదు.

"అక్కడ ననేక రాజులతో, కురువంశీయులతోను, చుట్ట బడి ఉత్త మాసనమునందు కూర్చొని యున్న దుర్యోధన్నుని శ్రీకృష్ణుడు చూచెను. అతని యొద్ద కర్ణ - శకుని - దుశ్శాసనులు కూర్చొని యుండిరి. శ్రీకృష్ణుని చూడగనే యతడు మంత్రులతో నెదురు వచ్చి స్వాగతము చెప్పి పూజించెను.

శ్రీ కృష్ణుడు దుర్యోధనునితో అతని మంత్రులతో, ఇతర రాజులతోను, వారి వారి వయస్సుల ననుసరించి, యుదారపూర్వకముగా కుశల ప్రశ్నములు చేసెను. అక్కడ ఆలంకరింపబడిన యొక సువర్ణ పర్యంకమునందు శ్రీకృష్ణుడు సుఖాసీనుడయ్యెను.

దుర్యోధనుడు శ్రీకృష్ణభగవానునకు అతిథిపూజలో గోవు, మధు పర్కము, గృహము, రాజ్యము- ఈ యన్నింటిని నివేదించెను.

"అట్లు కూర్చుని యున్న శ్రీ కృష్ణుడు నిర్మల సూర్యుడువలె ప్రకాశించు చుండెను. అప్పుడు అక్కడే రాజులు, కౌరవులు అందరున్ను ఆయన సమీ పమునకు పోయి కూర్చొనిరి.

"జనమేజయా! అప్పుడు దుర్యోధనుడు కృష్ణునితో మృదువుగా ని ట్లనెను: ఆ మాట మృదువుగా నున్నప్పటికిన్ని దానిలో భవిష్యత్తునందు రహస్యాపకారము సూచిత మగు చుండెను.

"శ్రీకృష్ణా! నీ కొరకు అన్నము, పానీయము, వస్త్రములు, నెయ్యి మొద లైన వస్తువులు సమర్పింప బడెను. వానిని నీ వేల స్వీకరించక పోయితివి? నీవు మా యుభయులకు (కౌరవ-పాండవులకు) సహాయము చేసితివి. ఉభయులకున్ను హితమును గూర్చుటకు ఆసక్తుడవై యున్నావు. ధృతరాష్ట్రునకున్ను బంధువు డవు, ప్రియుడవు నై యున్నావు. గోవిందా! నీవు వాస్తవముగా, ధర్మార్థముల నెరగినవాడవు. ఇట్లుండియు నీవు మా యాతిథ్యమును స్వీకరించక పోవుటకు కారణ మేమి?"

జనమేజయా? ఆ విధముగా దుర్యోధనుడు అడుగగా, శ్రీకృష్ణుడు తన భుజములను ఎగుర వేయుచు సజలమేఘ గర్జనమువంటి గంభీర ధ్వనితో నిట్లు ఉత్తరము చెప్పెను: ఆయన చెప్పిన మాటలు ఉత్తమములుగా, యుక్తిసంగతము లుగా, దైన్యరహితముగా, అసంకీర్ణముగాను నుండెను.

"భరతకులభూషణా! దూతలు, తాము వచ్చిన కార్యము నెరవేరిన తరువాతనే, తమకు సమర్పింప బడు పూజలను, భోజనమును స్వీకరించ వలె నను నియమము కలదు. దాన్నిప్రకారమే నీవుగూడ, నేను వచ్చినపని నెరవేర్చిన తరువాతనే నాకు, నా మంత్రులకును పూజా-సత్కారములు చేయ వలెను.

జనమేజయా! ఆ మాటలు విని దుర్యోధనుడు జనార్దనునితో నిట్లనెను:

"మధుసూదనా! నీ పని నెరవేరినను, నెరవేరకున్నను, మేము నీకు పూజలు చేయ యత్నించుచున్నాము. కాని, మాయత్నము సఫలము కాకున్నది.

"శ్రీకృష్ణా! మేము ప్రేమతో చేయు చున్న పూజలు నీవు స్వీకరించక పోవుటకు కారణము తెలియకున్నది. గోవిందా! నీతో మాకు వైరముగాని, జగడము గాని లేదు. ఈ విషయము నీవు బాగుగా గమనించి, ఇట్లు చేయ గూడదు."

జనమేజయా! దుర్యోధనుని మాటలు విని శ్రీకృష్ణుడు నవ్వుచు, అతనితో అతని కుతంత్రులతోను నిట్లు ఉత్తరము చెప్పెను:

"రాజా! కామ-క్రోధ-లోభ-ద్వేష-స్వార్థముల చేత కాని, మరియేసాకుచేత కాని, యెంతకష్ట మైనను ధర్మమును విడువను. ఇతరుల యన్నము తిన వలసి వచ్చినప్పుడు ఆయన్నమును ప్రీతితో పెట్ట బడినప్పుడే తిన వలెను. లేదా తనకు ఆపద కలిగి, ఆకలితో బాధపడుచున్నప్పుడు తిన వలెను.

"దుర్యోధనా! నీకు నాయందు ప్రేమ లేదు. నేను ఆపదలలో చిక్కుకొని ఆకలి గొనలేదు. కనుక, నీ విచ్చు భోజనమును తిన దలచుకొనలేదు.

''రాజా! పాండవులు నీ సోదరులు. వారు హితులకు సహాయము చేయు సద్గుణములు గలవారు. ఇట్లున్నను, నీవు జన్మము నుండియే వారిని నిష్కారణముగా ద్వేషించు చున్నావు. అది సరికాదు. పాండవులు ధర్మాత్ములు. అట్టి వారిని ఎవరుగూడ విరోధించరు, నిందించరుగదా! వారిని ద్వేషించిన వారు నన్ను ద్వేషించినవారే యగుదురు. వారికి హితులు నాకున్ను హితులే. ధర్మాత్ములైన పాండవుల యాత్మ నా యాత్మ ఒకటే యని తెలిసికొనుము.

''కామ-క్రోధములకు వశుడై, మోహము చేత గుణవంతులను విరోధింప దలచువాడు పురుషాధము డన బడును. శుభగుణ సంపన్ను లైన జ్ఞాతులను లోభముచేతనో, మోహము [1]చేతనో కించపరచ గోరువాడు, తన మనస్సును, క్రోధమునున్ను జయింప జాలనివాడై చాలాకాలము రాజ్యలక్ష్మిని అనుభవింపడు.

1. ఇతరుల ధనమును అపహరింపగోరుట లోభము. దుష్టుడు కానివానిని దుష్టునిగా భావించుట మోహమున బడును.

"తనకు అప్రియు లైనను సద్గుణ సంపన్నులకు ప్రియము గూర్చుచు, వారిని తనకు హితులనుగా చేసికొనువాడు చాలకాలము యశస్వియై యుండ గలడు. తనపైన ద్వేషముగలవాని యన్నమును తినగూడదు. ద్వేషికి భోజనము గూడ పెట్ట గూడదు (''ద్విషదన్నం న భుంజీత ద్విషంతం నైవ భోజయేత్'' అని యిచట వ్యాస మహర్షి వాక్యము గలదు.)

(శత్రువు ఇంట భుజించినచో తనకు ఏ కొంచెము జబ్బుచేసినను, అతడు ఏమి పెట్టెనో యను ననుమానము కలుగును. అట్లే శత్రువుకు భోజనము పెట్టినను అతనికి ఏదైన జబ్బుచేసినను మన మేమి పెట్టినామో యని అతనికి గూడ అనుమానమే కలుగునని భావము.)

''దుర్యోధనా! నీవు నా ప్రాణములనే తీయ దలచు చున్నావు. 'పాండవులు నాకు ప్రాణములు. వారిని నీవు చంపదలచుట నా ప్రాణములను తీయ దలచు చున్నట్లే యగును గదా! నీయింట భోజనము చేయను.

"దుర్యోధనా! ఈ యన్నము నీవు దుర్భావముతో పెట్టుచున్నావు కనుక, అది దూషిత మైనది. కనుక, నేను భుజించుటకు యోగ్య మైనది కాదు. ఇక్కడ విదురుని యన్న మొక్కటే నేను తినుటకు యోగ్య మైనది అని నా నిశ్చయము."

జనమేజయా! అట్లు చెప్పి శ్రీకృష్ణు డక్కడినుండి బయలుదేరి, విదురుని యింట బస చేయుటకు వెడలి పోయెను. అప్పుడు శ్రీకృష్ణుని వెంట భీష్మ-ద్రోణ-కృప-బాహ్లీకాదులు, ఇతర కౌరవులు గూడ బయలుదేరి పోయిరి.

విదురుని యింట నున్న శ్రీకృష్ణుని వారు, "వృష్ణినందనా! ధన - రత్నాదులచేత సంపన్నము లైన మా గృహములను నీకు సమర్పించెదము రమ్ము'' అని ఆహ్వానించిరి. శ్రీకృష్ణుడు వారితో "మీరు చేయు సమ్మానము నాకు చేరినట్లుగానే భావించెదను. మీ-మీ యిండ్లకు మీరు పొండు" అని చెప్పెను.

జనమేజయా! వారందరు వెడలిపోయిన తరువాత, విదురుడు, శ్రీకృష్ణునకు ఇష్టములైన వస్తువులన్నియు సమర్పించి, ఆయనను పూజించి, రుచికరములైన అనేకాహార పానీయములను ఆయనకు సమర్పించెను.

శ్రీకృష్ణుడు ఆయాహారము లన్నియు మొదట బ్రాహ్మణులకు పెట్టి, వారు తృప్తి చెందిన తరువాత వారికి పుష్కలముగా ధనము నిచ్చెను. తరువాత ఆయన తన యనుచరులతోపాటు శుచియైన విదురుని యన్నమును భుజించెను.

విదురుడు కృష్ణునకు ధార్తరాష్ట్రుల దురుద్దేశము చెప్పి యతడు కౌరవ సభకు పోవుట అనుచితమని బోధించుట

జనమేజయా! ఆ రాత్రి శ్రీకృష్ణ భగవానుడు భోజనము చేసి విశ్రాంతి తీసికొనుచుండగా, విదురుడు ఆయనతో నిట్లనెను:

''కేశవా! నీ విక్కడికి వచ్చుట నా యభిప్రాయములో బాగనిపించుట లేదు. మందబుద్ధి దుర్యోధనుడు ధర్మార్థములను ఉల్లంఘించినాడు. అతడు మహాక్రోధి. ఇతరుల గౌరవమును నష్టపరచి, తన సమ్మానమునే కోరుచుండును. పెద్దల యాదేశమును ఎగురదన్నెను. ఆ మూర్ఖుడు ధర్మశాస్త్రము ఆజ్ఞను ఉల్లంఘించెను. సర్వదా తన మొండిపట్టే చెల్లవలెననువాడు. అట్టి దురాత్ముని సన్మార్గము నందుంచుట అసంభవము. అతని మనస్సు కామోపభోగములందే ఆసక్తమై యుండును. తనను పండితునిగా తలచుకొనును. మిత్రులకు ద్రోహము చేయును. అందరిని సంశయదృష్టితోనే చూచును. తా నెప్పుడు గూడ ఇతరులకు ఉపకారము చేయడు. ఇతరులు తనకు చేయు ఉపకారమును గూడ ఆదరపూర్వకముగా స్వీకరింపడు.

"దేవా! అతడు ధర్మమును విడిచి, అసత్యమునే సర్వదా ప్రేమించును. అతనికి సర్వదా వివేకము లేదు. అతని బుద్ధి నిశ్చయాత్మకము కాదు. తన యింద్రియములను వశమునం దుంచుకొను శక్తి అతనికి లేదు. తన యిష్ట ప్రకారమే నడచుచు అన్ని విషయములను అనిశ్చితముగా చింతించు చుండును. ఇవియేకాక, యింకను ననేక దుర్గుణములు అతనికి ఉన్నవి. అట్టి దుర్యోధనునకు నీవు శ్రేయస్కరమైన మాట చెప్పినను గ్రహింపడు.

"మధుసూదనా! భీష్మ-ద్రోణ-కృప-అశ్వత్థామ-కర్ణ-సైంధవుల శక్తినే, దుర్యోధనుడు పూర్తిగా విశ్వసించి యున్నాడు. కనుక, అతనికి సంధి చేయు విచారమే లేదు పాండవులకు భీష్మ-ద్రోణాది వీరులవైపు చూచుటకు గూడ శక్తి లే దని దుర్యోధనుడు, అతని తమ్ములు - కర్ణుడున్ను పూర్తిగా నిశ్చయించి యున్నారు.

''కృష్ణా! మూర్ఖుడు, బుద్ధిహీనుడు నైన దుర్యోధనుడు తాను కూడగట్టు కొనిన రాజుల సేనతోనే కృతకృత్యుడ నని తలచు చున్నాడు. కర్ణు డొక్కడే శత్రువులను జయించ గల డని దుర్యోధనుడు నిశ్చయించుకొని యున్నాడు.

కాబట్టి, యెప్పుడు గూడ సంధికి అంగీకరింపడు. పాండవులకు సముచితమైన రాజ్యభాగమును ఈయ గూడ దని ధృతరాష్ట్రి పుత్రు లందరు తలచు చున్నారు. ఇదియే వారి దృఢనిశ్చయము. నీవు సంధికొరకు ప్రయత్నించుచు, వారియందు ఉత్తమ భ్రాతృభావమును జాగరూకము చేయ వలె నని కోరు చున్నావు. కాని, ఆ దుష్టుల విషయములో నీవు ఏమి చేసినను, అది యంతయు వ్యర్థమే యగును.

''కృష్ణా! దుష్టునకు మంచిమాట గాని, పెద్దమాట గాని, చెప్పినప్పుడు అది వ్యర్థమై, చెవిటివాని ముందు సంగీతము ఆలాపించిన ట్లగును. కనుక, పండితుడెవడు గూడ అట్టి వానికి ఏమియు. చెప్ప గూడదు.

''కృష్ణా! చండాలురకు విద్వాంసుడైన బ్రాహ్మణుడు ఉపదేశము చేయుట ఎట్లు ఉచితము కాదో, అట్లే. తన పరిమితిని తెలియక, మూర్ఖులుగా నుండి, అజ్ఞానులుగా నున్న వారికి నీవు ఏ మాట చెప్పుట గూడ మంచిది గా దని నాకు తోచు చున్నది.

"జనార్దనా! మూఢ దుర్యోధనుడు సైన్యమును కూర్చుకొని తాను శక్తిమంతుడ నని తలచు చున్నాడు. కనుక, నతడు నీ మాటను గౌరవించడు. నీ మాట లన్నియు నతని యెడల నిరర్థకము లగును. వా రందరు పాపపు తలంపు గలిగి యున్నారు. అట్టివారి నడుమకు నీవు పోవుట నాకు మంచిగా తోచుట లేదు. వారందరు దుర్బుద్ధులు. ఎవరికి గూడ శిష్టాచారము తెలియదు. అందరు గూడ దుష్టచిత్తులే. వారు చాలామంది ఆ సభలో నుండెదరు. కనుక, కృష్ణా! వారిమధ్యలోకి నీవు పోయి, వారికి వ్యతిరేకముగా మాట్లాడినచో, అది నాకు ఏమాత్రము మంచిగా అనిపించుట లేదు.

''కృష్ణా! దుర్యోధనుడు ఎప్పుడు గూడ వృద్ధులను సేవించ లేదు. రాజ్యలక్ష్మివలన గలిగిన పొగరుచేత మోహము చెంది యున్నాడు. తాను యువకుడ నని తలచుచు, సర్వదా పాండవులయెడల క్రోధము గలవాడై యున్నాడు గాబట్టి, నీవు చెప్పెడు మాటలు హితకరములైనను, అంగీకరించడు. అతనియొద్ద గొప్పసైన్యము ఉండుటయేకాక, అతనికి నీ యెడల మిక్కిలి సందేహము గూడ కలదు. కనుక, నీవు చేయు సదుపదేశమును అతడు ఏమాత్రము వినడు. దేవ సైన్యముతో నింద్రుడు వచ్చినను తమ సేనను జయింప జాల దని ధృతరాష్ట్రపుత్రు లందరు ధృఢముగా నిశ్చయించుకొని

యున్నారు. అట్టివారల యెడల కృష్ణా! నీవు చెప్పెడు మాటలు ఎంత యుక్తియుక్తములుగా నున్నను, ఎంత ప్రయోజనకరములుగా నున్నను అవి నిరర్థకములై పోవును గాబట్టి నీ వక్కడికి పోవుట మంచిది కాదు.

''శ్రీకృష్ణా! రథ - గజాశ్వసేనల మధ్య నిలుచుకొని దుర్యోధనుడు మందబుద్ధి యై, సమస్తభూమండలమును తానే జయించినట్లు తలచు చున్నాడు. అతడు శత్రురహిత మైన సమస్త భూమండల సామ్రాజ్యమును పొంద వలె నని ఆశించు చున్నాడు. కపటపు జూదములో సంపాదించిన ధనము - రాజ్యమున్ను తన యధీనమునందే యుండ వలె నని కూడ నతడు దృఢ సంకల్పముతో నున్నాడు.

"శ్రీకృష్ణా! ఈ భూమండల మిప్పుడు పరిపక్వ మై నశింప నున్న దని తోచు చున్నది. ఎందు కనగా, రాజులేకాక, భూమండలమునందలి సమస్త క్షత్రియ యోధులుగూడ దుర్యోధనుని పక్షమున పాండవులతో పోరాడుటకు ఒకటిగా చేరి యున్నారు.

"కృష్ణా! ఏ రాజులు పూర్వము నీతో వైరము చేసి, నీవు వారి సమస్త సంపదలను లాగుకొని యుంటివో, ఆ రాజు లందరు గూడ నిప్పుడు నీ భయము వలన దుర్యోధనుని పక్షము చేరి, ధార్తరాష్ట్రుల శరణు జొచ్చి యున్నారు. వారు కర్ణునితో చేరి, తమ శౌర్యమును చూపించుటకు ఉద్యుక్తు లై యున్నారు. వారందరు తమ ప్రాణముల పైన మోహము విడిచి, హర్షోత్సాహములతో పాండవులతో యుద్ధము చేయుటకు సన్నద్ధు లై యున్నారు.

"దాశార్హా! అట్టి విరోధులనడుమకు నీవు ఇప్పుడు పోవుట నాకు ఏమాత్రము మంచి దనిపించదు. శత్రుకర్శనా! దుష్ట సంకల్పములు గలిగి, బహుళ సంఖ్యలో నున్న శత్రువులు కూర్చొని యున్నచోటికి నీ వెట్లు పోవ దలచు చున్నావు?

"శ్రీకృష్ణా! సమస్త దేవతలు గూడ నిన్ను ఎదిరించ జాలక పోవచ్చును. నీ ప్రభావము, పౌరుషము, బుద్ధిబలముగూడ నాకు బాగుగా తెలిసి యుండ వచ్చును. ఐనప్పటికి, పాండవులయెడల నాకు ప్రేమ గలదు. అంతకంటె నెక్కువగా నీపైన నాకు ప్రేమ గలదు. కావున, అధిక ప్రేమాదరములచేత, మైత్రిచేతను ప్రేరితుడ నై యిట్లు నీతో చెప్పు చున్నాను. నీ వక్కడికి పోవుట నాకు ఏమాత్రము నచ్చ లేదు.

"కృష్ణా! నీ దర్శనముచేత నాకు నీయెడల గల ప్రేమ ఉబికి ప్రకటిత మగు చున్నది. దానిని నేను వర్ణింప జాలను. నీవు సమస్త ప్రాణులకు అంతర్యామివిగా నున్నావు. అందరి ఆత్మ నీవే. అందుచేత నీవు అందరి మనోభావములను బాగుగా నెరుగుదువు."

శ్రీకృష్ణుడు కౌరవ - పాండవులకు చేయు సంధి ప్రయత్నము ఉచితమని విదురునకు చెప్పుట

జనమేజయా! విదురుడు వినయపూర్వకముగా చెప్పిన ప్రేమభరిత వచనములను విని, శ్రీకృష్ణ భగవానుడు ఆయనతో నిట్లనెను:

"విదురా! ఒక బుద్ధిమంతు డైన మహాపురుషుడు చెప్పెడు మాటలను, ఒక విద్వాంసుడు చేయునట్టి యుపదేశమును, నీవంటి హితుడు నావంటి మిత్రునకు చెప్ప వలసిన మాటలను, నీ ముఖమునుండి వెడల వలసిన ధర్మార్థయుక్తములైన సత్యవచనములను నీవు తల్లిదండ్రులవలె స్నేహపూర్వకముగా, నాతో చెప్పితివి. నీ మాట లన్నియు సమయోచితములు, సత్యములు, యుక్తిసంగతములుగా నున్నవి. ఐనను, విదురా! నే నిక్కడికి వచ్చిన కారణమును సావధానముగా వినుము:

"ధృతరాష్ట్ర పుత్రుల దుష్టత్వమును, వారి పక్షమున నున్న క్షత్రియ యోధుల వైరము మొద లైన విషయములను తెలిసియే నేను కౌరవుల కడకు వచ్చినాను. రథాశ్వ గజసహిత మైన సమస్త భూమండలము వినాశోన్ముఖ మై యున్నది. దానికి మృత్యుపాశము నుండి విముక్తి పొందించుటకుగాను ప్రయత్నించువానికే ఉత్తమ ధర్మము ప్రాప్తించును. తన శక్తి ననుసరించి ధర్మకార్యమును చేయుటకు ప్రయత్నించువానికి ఆ కార్యము సఫలము కాకున్నప్పటికిన్ని, దానివలన నతనికి తప్పక పుణ్యము కలుగును. ఇందులో ఏమాత్రము సందేహము లేదు. ఈ విధముగనే తన మనస్సులో ఒక కార్యము చెడ్డదని చింతించుచు, ఇష్టము లేనందుచేత ఆ కార్యము చేయనిచో, అతనికి ఆ పాప ఫలము అంటదని ధర్మజ్ఞులు చెప్పెదరు.

''అందుచేత విదురా! యుద్ధములో మరణించుటకు సిద్ధముగా నున్న కౌరవులకు, సృంజయులకున్ను మధ్య నిష్కపటభావముతో సంధి చేయుటకు ప్రయత్నించెదను. కర్ణదుర్యోధనుల కారణముగానే యీ భయంకర పరిస్థితి

యేర్పడినది. వారితో చేరిన రాజవీరులు గూడ ఆ యిద్దరినే అనుసరించుచున్నారు. అందుచేత, ఈ యాపద కౌరవపక్షమునుండియే పుట్టెను. వ్యసనములలో, ఆపదలలోను చిక్కుకొని క్లేశము ననుభవించుచున్న మిత్రులకు యథాశక్తి ఉపదేశము చేసి, వారిని ఉద్ధరించనివాడు నిర్దయుడు క్రూరుడు నని విద్వాంసుల తలచెదరు. మిత్రుడు చేయు చెడ్డపనినుండి అతని జుట్టుపట్టుకొనియైనను ఈడ్చి, చెడు కార్యమునుండి అతనిని తప్పించువానిని ఎవరు గూడ నిందించరు.

''కాబట్టి విదురా! దుర్యోధనుడు - అతని మిత్రులు నేను చెప్ప బోవు హితకరములు - శుభకరములు - యుక్తియుక్తములు - ధర్మార్థసంగతములు నగు మాటలను తప్పక అంగీకరించ వలెను. నేనైతే, ధార్తరాష్ట్ర - పాండవులకు, భూమండలమునందలి సమస్త క్షత్రియజాతికిన్ని హితము చేయుటకు ప్రయత్నించెదను. వారి హిత సాధనకు నేను ప్రయత్నము చేసినప్పటికిన్ని, దుర్యోధను డొకవేళ నన్ను శంకించినను, నా మనస్సునకైతే ప్రసన్నత్వము కలుగును. దీనిచేత నేను నా కర్తవ్యభారమునుండి విముక్తుడనయ్యెదను.

''విదురా! జ్ఞాతులతో పరస్పరము విరోధము ఏర్పడినప్పుడు, వారికి మిత్రు డైనవాడు సర్వవిధముల ప్రయత్నము చేసి వారికి సంధి కుదిరించుటకు మధ్యవర్తిత్వము జరుపనివానిని, మిత్రునిగా విద్వాంసులు తలచరు. శ్రీకృష్ణుడింతసమర్థు డై యుండి కూడ, క్రుద్ధు లైన కౌరవపాండవులను యుద్ధమునుండి ఆప లేదు అని ప్రపంచమునందలి పాపిష్ఠులు - మూర్ఖులు - శత్రువులున్ను నా విషయమై నిందా వాక్యములు పలుకకుండ వలెను. ఈ కారణముచే గూడ నేను సంధికి ప్రయత్నించు చున్నాను.

''విదురా! ఇరుపక్షములవారి ప్రయోజన సిద్ధికొరకే నే నిక్కడికి వచ్చినాను. దీని కొరకు నేను పూర్తిగా యత్నించినచో లోకమునందు నిందాపాత్రుడను కాను. మూర్ఖు డైన దుర్యోధనుడు కష్టనివారకము, ధర్మార్థయుక్తము నైన నా మాట విని కూడ దానిని స్వీకరించనియెడల, నతడు దౌర్భాగ్యమునకు వశుడు కావలసి వచ్చును.

"మహాత్మా! పాండవుల ప్రయోజనమునకు బాధ కలుగకుండ, కౌరవ - పాండవుల మధ్య సాధ్య మయినంతవరకు ప్రయత్నము సలిపి సంధి కుదిరించగలిగినచో, నేను ఈ మహాపుణ్యకార్యమును చేసినవాడ నగుదును. కౌరవులుగూడ

మృత్యుపాశమునుండి విముక్తు లగుదురు. నేను, శాంతి విషయములో విద్వాంసులు అనుమతించినవి - ధర్మార్థములకు అనుకూలము లైనవి - హింసారహితము లైనవియు నగు మాటలను చెప్పెదను. దుర్యోధనుడు నా మాటలను వినినయెడల శాంతిని కోరు కౌరవు లందరు నేను శాంతిస్థాపనకే వచ్చినా నని తలచి నన్ను ఆదరించెదరు.

''విదురా! క్రోధపూరిత మైన సింహమునకు ఎదురుగా ఇతర మృగములు నిలువ జాలనట్లే నేను కోపించినచో, ఈ రాజు లందరు ఏక మై కూడ నన్ను ఎదిరించ జాలరు.''

''జనమేజయా! యిట్లు శ్రీకృష్ణుడు విదురునితో చెప్పి శయ్యపైన సుఖశయనము చేసెను.

దుర్యోధన శకునుల ప్రార్థనపై శ్రీకృష్ణుడు కౌరవ సభకు పోవుట

జనమేజయా! అట్లు శ్రీకృష్ణుడు ఆ రాత్రి చాలసేపు విదురునితో ధర్మార్థ కామముల విషయము లైన యనేక వచనములు మాటాడు చుండెను. ఆయన వాణిలో పదములు - అర్థములు - అక్షరములున్ను అతి విచిత్రములుగా నుండెను అందుచేత. విదురుడు భగవంతుని మాటలను ప్రసన్నముగా విను చుండెను. ఆ రాత్రి వారికి తెలియ కుండనే గడచునంతటి మంచి మాటలు, కథలున్ను చెప్పికొని వారు యానందించు చుండిరి.

''తరువాత, అనేక సూత - మాగధులు మధుర స్వరముతో, శంఖ దుందుభిధ్వనులతోను శ్రీకృష్ణభగవానుని మేల్కొల్పిరి. శ్రీకృష్ణుడు ప్రాతఃకాల కృత్యములను క్రమముగా తీర్చెను. సంధ్యావందనము - జపము - తర్పణము హోమమున్ను చేసిన తరువాత, వస్త్రభూషణాలంకృతు డై ప్రాతఃకాల సూర్యోపాసన (ప్రార్థన) చేసెను.

శ్రీకృష్ణుడు సంధ్యోపాసనాదులు చేయు చుండగనే - శకుని దుర్యోధను లతని యొద్దకు వచ్చి యిట్లనిరి:

''గోవిందా! ధృతరాష్ట్రమహారాజు సభలో విచ్చేసెను. భీష్మాది కౌరవులు ఇతర రాజు లందరు, ఆ సభలో కూర్చొని యున్నారు. దేవతలు ఇంద్రుని

కొరకు ఎదురుచూచు చున్నట్లు సభవా రందరు మీ దర్శనముకొరకు నిరీక్షించు చున్నారు. దర్శన మిప్పింపు డని మిమ్ము ప్రార్థించు చున్నారు.''

అది విని శ్రీకృష్ణుడు మధుర వచనములతో వారిని ఆదరించి అభినందించెను.

సూర్యోదయ మైన పిదప బ్రాహ్మణులకు సువర్ణ - గో - అశ్వదానములు చేసి నిలుచుకొని యున్న శ్రీకృష్ణుని యొద్దకు రథసారథి వచ్చి తల వంచి నమస్కరించి, గజ్జెలు గల్లు- గల్లు మని శబ్దించుచున్న ఉత్తమాశ్వములు కట్ట బడిన రథమును శ్రీకృష్ణుని యొద్దకు తెచ్చి నిల్పెను.

"జనమేజయా! విశ్వ విఖ్యాత మై శోభిల్లు చున్న ఆ రథమునకు శైబ్య-సుగ్రీవ-మేఘపుష్ప-వలాహక నామములు గల నాల్గు అశ్వములు కట్ట బడి యుండెను. ఆ యశ్వములలో శైబ్యము చిలుక రెక్కల కాంతితో, సుగ్రీవము మోదుగు పువ్వు కాంతితో, మేఘ పుష్పము మేఘవర్ణ కాంతితో, వలాహకము తెల్లని కాంతితోను ప్రకాశించు చుండెను. రథము యొక్క నొగకు కుడివైపు శైబ్యము - ఎడమవైపు సుగ్రీవము - ఆ రెండింటి వెనుక క్రమముగా మేఘపుష్ప-వలాహకములున్ను కట్ట బడి యుండెను.

సత్త్వ గుణసంపన్ను డైన శ్రీకృష్ణుని రథధ్వజమునందు పైన సూర్యుని తాకు చున్నట్లుగా సర్ప శత్రువైన గరుత్మంతుడు విరాజిల్లు చుండెను. ఆ గరుడ ధ్వజముచేత రథము మిక్కిలి ప్రకాశమానముగా నుండెను. ఆ రథము స్వర్ణమయము లైన జాలమార్గము (కిటికీలు) లతో, ధ్వజములతోను ప్రళయ కాలమునందు ఉదయించిన సూర్యునివలె భాసిల్లు చుండెను.

జనమేజయా! ఆ దివ్యరథము, గరుడధ్వజము - వితానములు (మేలి కట్లు - చాందినీలు) - సువర్ణజాల భూషిత మైన మధ్య ప్రదేశము - వేరు-వేరు దండమార్గములున్ను (రథము నందలి స్తంభముల మధ్యనున్న మార్గములు) గలిగి మిక్కిలి సుందరముగా నుండెను. అది విశ్వకర్మ చేత నిర్మింప బడి యుండెను.

పగడములు - మణులు - సువర్ణము - వైడూర్యములు - ముత్యములు మొద లైన మణులు చెక్క బడిన భూషణములతో, అనేకము లైన గజ్జెలతో, వాలమణుల (వజ్రముల) జాలములతోను ఆ రథపు లోపలి భాగము అలంకరించ బడి యుండెను.

బంగారముతో చేయ బడిన కమల లతలతో అది యలంకరింప బడి యుండెను. సువర్ణ వృక్షపత్రములతో, వ్యాఘ్ర - సింహ - వరాహ - గో - వృషభ - మృగ - పక్షి - నక్షత్ర - సూర్య - గజముల బంగారు బొమ్మలతోను భూషిత మై యా రథము శోభిల్లు చుండెను.

దాని కాడిమ్రాకు రంధ్రములలో (సంధి భాగములలో) వజ్రములు - అంకుశములు - విమానములు - ఈ మొద లైన వాని యాకారములతో రథము విభూషిత మై యుండెను.

సజలమేఘ గర్జనము వలె ధ్వనించుచు, అనేక రత్నభూషిత మైన రథము వచ్చిన సంగతి తెలిసికొని అగ్నిని, బ్రాహ్మణులనున్ను తన కుడివైపు ఉంచుకొని (అది శుభశకునము), కౌస్తుభమణిని ధరించి, దివ్య శోభతో, కౌరవులచేత పరివృతు డై వృష్ణివంశీయులచేత సురక్షితు డైన యదుకుల దీపకుడు ఆ రథముపై నెక్కెను.

తరువాత ధర్మజ్ఞు డైన విదురుడు గూడ అతనితోపాటు రథమును అధిరోహించెను. ఆ వెనుక దుర్యోధనుడు, శకునియు వేరొక రథములో శ్రీకృష్ణుని అనుసరించి పోయిరి. సాత్యకి - కృతవర్మ - వృష్ణి వంశీయు లైన ఇతర వీరులున్ను గజాశ్వరథములందు కూర్చొని, శ్రీకృష్ణుని అనుసరించి పోయిరి.

స్వర్ణాలంకృతము లైన ఉత్తమాశ్వములతో పోవు చున్న ఆ రథములు గంభీర ధ్వనులు చేయుచు మిక్కిలి శోభిల్లెను. శ్రీకృష్ణుడు, ఊడ్చి - నీరు చల్ల బడి - దుమ్ము లేనట్టి రాజమార్గములలో వెడలెను. అది పూర్వ మెందరో రాజర్షులు పోవు చుండిన రాజమార్గము.

జనమేజయా! శ్రీకృష్ణుడు ప్రయాణ మగు చున్నప్పుడు డోలులు వాయించ బడెను. సర్వలోక వీరులు - సింహపరాక్రములు నైన యువకులు శ్రీకృష్ణుని చుట్టుకొని పోవు చుండిరి. శ్రీకృష్ణుని ముందుభాగమునందు, విచిత్రాద్భుత వస్త్రధారు లై, ఖడ్గ-ప్రాసాద్యనేకాయుధధారు లైన యనేక సైనికులు పోవుచుండిరి.

ఐదునూర్ల గజములు - అనేక సహస్రము లైన యశ్వములు శ్రీకృష్ణుని అనుసరించి పోవు చుండెను.

అప్పుడు కృష్ణదర్శనార్థమై స్త్రీ బాలవృద్ధు లందరు హస్తినాపుర వీదులలో చేరి వరుసగా నిలుచుకొని యుండిరి. మార్గము వైపున వున్న భవనముల కప్పులపై స్త్రీలు గుంపులు-గుంపులుగా శ్రీకృష్ణుని చూచుటకు చేరి యుండిరి.

ప్రతి భవనముపైనను అట్లు స్త్రీగణము ఉండుటచేత స్త్రీసహిత భవనములే శ్రీకృష్ణుని అనుసరించి పోవు చున్న వా యను నట్లుండెను.

శ్రీకృష్ణు డప్పుడు కౌరవులచేత పూజింపబడుచు, వారి మధుర వచనములను వినుచు, వారిని సత్కరించుచు అందరిని చూచుచు మెల్లమెల్లగా పోవు చుండెను.

జనమేజయా! తరువాత, శ్రీకృష్ణుని అనుసరించుచు వచ్చినవారు కౌరవ సభముందు వేణుశంఖాది వాద్యములు వాయించిరి. దానితో శ్రీకృష్ణుడు వచ్చిన సంగతి తెలిసికొని అక్కడి రాజు లందరు హర్షోల్లాసములతో నుండిరి.

సభా భవనము సమీపించగనే, శ్రీకృష్ణుడు కైలాస సదృశ మైన రథము దిగి, నవమేఘమువలె, శ్యామవర్ణముతో దీపించుచు ఇంద్ర భవనమువలె నున్న కౌరవ సభలో సాత్యకిని, విదురునిన్ని, చేతులతో పట్టుకొని, సూర్యుడు తన తేజస్సుతో నక్షత్రములను కప్పి వివర్ణములుగా చేసినట్లు తన తేజస్సుతో శ్రీకృష్ణుడు కౌరవులను కప్పి వేయుచు సభలో ప్రవేశించెను.

ఆయనకు ముందు భాగమునందు కర్ణ - దుర్యోధనులు, వెనక భాగమునందు వృష్ణివంశీయులు, కృతవర్మయు పోవు చుండిరి.

ధృరాష్ట్రుడు, భీష్మ - ద్రోణాదులున్ను శ్రీకృష్ణుని గౌరవార్థమై తమ యాసనములనుండి లేచి నిల బడిరి. వారి ననుసరించి యితర సభాసదులుగూడ లేచి నిలుచుండిరి.

అక్కడ శ్రీకృష్ణుని కొరకు దృతరాష్ట్రుని యాజ్ఞచేత 'సర్వతోభద్రము' అనెడు సువర్ణమయాసనము అమర్చబడి యుండెను.

శ్రీకృష్ణుడు చిరునవ్వుతో ధృతరాష్ట్ర - భీష్మ ద్రోణాదులతో, ఇతర రాజులతోనూ కుశలప్రశ్నపూర్వకముగ మాటాడెను. అక్కడివా రందరు శ్రీకృష్ణుని పూజించిరి.

అక్కడనే రాజుల నడుచు నిలుచుకొని శ్రీకృష్ణుడు ఆకాశమువైపు చూచెను. అక్కడ నారదాది మహామునులు ఉండుటను జూచి, భీష్మునితో నిట్లనెను:

''పితామహా! రాజసభను చూచుటకు మహామునులు వచ్చి యున్నారు. వీరిని సత్కారపూర్వకముగా ఆహ్వానించి, శుభాసనములందు కూర్చొన బెట్ట వలెను వీరు కూర్చొనకుండ నెవరును కూర్చొన జాలరు. త్వరగా నీ మునీశ్వరులను పూజించ వలెను.''

శ్రీకృష్ణుడు చెప్పిన మాటలు వినగనే భీష్మ పితామహుడు, ద్వారమునందున్న సేవకులను త్వరగా పిలిచి ''మహామునీశ్వరులకు మంచి యాసనములు వేయుడు'' అని ఆజ్ఞాపించెను.

సేవకులు శుభము లైన సువర్ణమణిమయాసనములను తెచ్చి అక్కడ వేసిరి. ఆయాసనములపైన మునులు కూర్చొగనే, శ్రీకృష్ణుడు తన యాసనమున కూర్చొనెను.

దుశ్శాసనుడు సాత్యకికి, వివింశతి కృతవర్మకున్ను మణిమయాసనములను వేయించి కూర్చొని బెట్టిరి.

శ్రీకృష్ణుని సమీపమునందే యేకాసనమునందు కర్ణ - దుర్యోధనులు కూర్చొనిరి.

గాంధారరా జైన శకుని తన పుత్రులతో ఆసనములందు కూర్చొనెను.

విదురుడు శ్రీకృష్ణుని పీఠమును తాకుచు శ్వేతమృగచర్మము పరచబడి యున్న యొక మణిమయాసనమునందు కూర్చొనెను.

అక్కడి రాజు లందరు, చాలాకాలముతర్వాత కృష్ణభగవానుని చూచినందుచేత ఆయనపైననే దృష్టి నిలిపి, అమృతపానము చేయుచున్నంత తృప్తితో శ్రీకృష్ణుని చూచు చుండిరి. ఎంత సేపు చూచినను వారికి తృప్తి చాల కుండెను.

''అవిసెపూవువలె, శ్యామవర్ణము గల శ్రీకృష్ణభగవానుడు ఆ సభ నడుచు నున్నప్పుడు, సువర్ణ పాత్రమునం దున్న యింద్రనీలమణివలె శోభిల్లు చుండెను.

''అప్పు డక్కడివా రందరి మనుస్సులు గోవిందునియందే లగ్నము లై యుండెను కాబట్టి, అందరును ఏమియు మాటాడక ఊరక కూర్చొని యుండిరి."

శ్రీకృష్ణుడు కౌరవ సభలో ప్రభావవంతముగా సంధి ప్రస్తావన చేయుట

జనమేజయా! సభలోనివా రందరు మౌనముతో కూర్చొని యున్నప్పుడు శ్రీకృష్ణభగవానుడే సభను నలువైపుల జూచుచు, అందరికి వినిపించునట్లుగా, ధృతరాష్ట్రుని ఉద్దేశించి. మేఘ గంభీరధ్వనితో ని ట్లనెను :

''ధృతరాష్ట్రమహారాజా! క్షత్రియ వీరులసంహారము కాకుండనే, కౌరవ-పాండవులలో శాంతిస్థాపన జరుగుట మంచి దని నీతో ప్రార్థన చేయుటకు నే నిక్కడికి ఇప్పుడు వచ్చినాను. నేను నీతో నిప్పు డింతకన్న నెక్కు వగు శ్రేయస్కర వచనములను మాట్లాడ వలసిన యవసరము లేదు. ఎందుకనగా, తెలియ దగిన వన్నియు నీకు పూర్వమే తెలియును.

''అన్ని రాజవంశములలో కురువంశము శ్రేష్ఠ మైనది. ఈ వంశమునందు శాస్త్రము - సత్ప్రవర్తన ఇత్యాదులు సంపూర్ణముగా అనుసరింప బడు చున్నవి. ఈ కౌరవకులము సమస్త సద్గుణసంపన్నము. కురువంశీయులకు, కృప, అనుకంప, కరుణ, అనృశంసత, సరళత్వము, ఓర్పు, సత్యము - ఈ సద్గుణము లన్నియు నున్నవి. ఈ సద్గుణములు ఇతర రాజవంశీయులకు లేవు.

(''కృప యనగా, ఇతరులకు సుఖము కలిగించు స్వభావము పుట్టుకతోనే యుండుట; అనుకంప యనగా,ఇతరుల దుఃఖమును చూచి హృదయము ద్రవించి సహానుభూతితో చలించుట; కరుణ యనగా, ఇతరులకు కలిగిన దుఃఖమును పోగొట్టు తలంపు గలిగి యుండుట; అనృశంసత (ఆనృశంస్యము) అనగా ఏ మాత్రము క్రూరత్వము లేకుండుట.'సాధారణముగా ఈ నాలుగు మాటలు దయకే వాడెదరు. కాబట్టి, యిక్కడ వాడిన నాల్గింటికిన్ని పునరుక్తి కా గూడ దని వేరు-వేరుగా అర్థములు తెలుపబడినవి.)

''రాజా! ఇట్టి ఉత్తమ గుణసంపన్నము - మిక్కలి ప్రతిష్ఠయుగల కులము నందు జన్మించినవా రైనను, ఈ వంశీయులు నీ కారణముగా అనుచితకార్యములు చేయుట మంచిది కాదు.

''రాజా! ఈ కురువంశీయు లొకవేళ - రహస్యముగనో, వెల్లడిగనో చెడ్డగా వ్యవహరించినచో - వారిని నీవే ఆపి, సన్మార్గమునందు ఉంచ వలసిన వాడవు.

''దుర్యోధనాదు లైన నీ మిత్రులు, ధర్మార్థములను వెనుకకు త్రోసి క్రూరులవలె. ప్రవర్తించు చున్నారు. వీరు, ఉత్తము లైన తమ బంధువులతోనే అసభ్యముగా వ్యవహరించు చున్నారు. వీరు ధర్మము యొక్క మితిని తెగగొట్టు నంతటి లోభము గలవా రై యున్నారు.

''ఈ విషయము నీకు బాగుగా తెలియును. అత్యంత ఘోర మైన యీ యాపద కౌరవులకే కలిగినది. దీనిని ఇప్పుడు ఉపేక్షించినయెడల, సమస్త భూమండల ధ్వంసము ఇది చేయ గలదు. నీవు కోరిన యెడల, ఈ యాపదను శమింప జేయ గలవు.

''కౌరవ - పాండవుల పక్షములలో శాంతిని స్థాపించుట అసాధ్యకార్యము కా దని నేను తలచెదను. రాజా! ఈ శాంతి నీ యధీనమునం దున్నది. నీవు నీ పుత్రులను నియంత్రణము (హద్దు)లో నుంచుము. నేను గూడ పాండవులను అదుపులో నుంచెదను.

"నీ పుత్రులు, తన మిత్రులతోపాటు నీ యాజ్ఞను పాలించ వలెను. నీ యాజ్ఞలో నుండినపుడే వారికి గొప్ప మేలు కలుగును. నీవు పుత్రులను శాసించి, సంధికి ప్రయత్నించినచో మీకు - పాండవులకున్ను మేలు కలుగును.

"రాజా! పాండవులతో వివాదము - విరోధమున్ను చేయుటవలన మంచి ఫలితము సిద్ధించ దని బాగుగా విచారించి స్వయముగానే నీవు సంధికొరకు ప్రయత్నించుము. ఇట్లు చేయుట చేత, పాండవులు నీకు సహాయకులుగా నుండెదరు. నీవు పాండవులచేత సురక్షితుడ వై, ధర్మార్థములను అనుష్ఠించుము. నీకు పాండవులవంటి సంరక్షకులు ప్రయత్నించినను లభించరు.

''పాండవులచే సురక్షితుడ వై యున్న నిన్ను దేవతలతో గూడి వచ్చిన యింద్రుడు గూడ జయింప జాలడు. ఇతర రాజవీరుల విషయము చెప్ప వలసిన దే మున్నది?

"నీ పక్షమునందు భీష్మద్రోణాది మహావీరులు, నీ పుత్రులున్ను, వారి మిత్రు లైన కర్ణాదివీరులు, పాండవులు - వారి హితులున్ను, ఉన్నప్పుడు, మీతో నెంత యవివేకి యైనను, యుద్ధము చేయుటకు సాహసింపడు గదా!

''నీవు కౌరవ - పాండవు లందరితో కలిసి యున్న యెడల, సంపూర్ణ ప్రపంచ సామ్రాజ్యమునకే చక్రవర్తి వై యుండెదవు. శత్రువు లెవ్వరుగూడ నిన్ను కన్నెత్తి యైన చూడ జాలరు గదా!

"రాజా! నీవట్టిసమ్రాట్టువై యున్నప్పుడు, నీ సమానులు గాని, నీకంటె నధికులు గాని వారగు రాజవీరులు గూడ నీతో సంధి చేసికొనెదరు.

''మహారాజా! ఈ విధముగా నీవు పుత్ర - పౌత్రులచేత, పితృ సోదరుల చేత, మిత్రుల చేతను సంపూర్ణముగా సురక్షితుడ వై సుఖజీవనమును గడప గలవు.

"నీవు పూర్వమువలెనే పాండవులను ఆదరించుచు నీయొద్ద ఉంచుకొనిన యెడల, ఈ సమస్త భూమండల సామ్రాజ్యమును అనుభవించ గలవు. పాండవులతో, నీ పుత్రులతోను కూడి యుండినచో, నీ యితర శత్రువులను గూడ ఓడించగలవు.

"ఈ విధముగా నీకు సంపూర్ణముగా స్వార్థము సిద్ధించును. నీవు నీ పుత్రులైన కౌరవ - పాండవులతో, మంత్రులతోను కలిసి యుండిన యెడల, వారే జయించి యిచ్చిన యీ భూమండల రాజ్యమును అనుభవించెదవు.

"మహారాజా! యుద్ధ మైన యెడల అనేకులు సంహరింప బడెదరు. ఇట్లు ఇరుపక్షముల వారిని సంహరింప జేయుట నీకు ధర్మమా- చెప్పుము. యుద్ధమునందు పాండవులు మరణించినను, నీ పుత్రులు మరణించినను, దానివలన నీకు గలుగు సుఖ మేమి? చెప్పుము.

"యుద్ధ పరిణామమును గూర్చి విచారించినచో, మనకు సమస్త కౌరవ పాండవులు నశించినట్లుగానే కనపడు చున్నది. ఇరుపక్షముల వీరు లైన రథికుల చేతనే చంప బడుదురు. రాజా! భూమండలము నందలి రాజవీరు లందరు ఇక్కడ ఏకముగా చేరినచో వారు కోపముచేత అమాయకు లైన ప్రజలను వధింప జేసెదరు.

"రాజా! నీవు ఈ ప్రపంచము నిప్పుడు రక్షింపుము. దాని వలన సమస్త ప్రజలు నశింప కుండెదరు గాక! నీవు సత్వగుణ సంపన్నుడ వై, సత్స్వభావము గలవాడ వైనచో ఈ యందరు బ్రతుక గలరు.

''రాజా! రా రాజు లందరు సత్కుల సంజాతులు - సత్స్వభావము గలవారు-ఉదారులు-పవిత్రులు-శ్రేష్ఠులు-పరస్పరము సహాయము చేసికొనువారు. వీ రందరికిన్ని ఇప్పుడు మహా ప్రాణ భయ మేర్పడినది. నీవు వీరిని రక్షింప వలెను.

"ఈ రాజు లందరు ఒండొరులు కలిసికొని, విందులు జరిపికొని, క్షేమముగా వారి- వారి యిండ్లకు తిరిగి పోవునట్లుగా నీవు ప్రయత్నించుము. వీ రందరు మంచి వస్త్రములను, సుందరహారములనున్ను ధరించి, క్రోధము, శత్రుత్వమున్ను విడిచి, సత్కార పూర్వకముగా నిక్కడినుండి నీచేత వీడ్కోల్పబడుదురు గాక!

''రాజా! ఇప్పుడు నీ ఆయుస్సుగూడ క్షీణించు చున్నది. నీకు పాండవుల యందు పూర్వ ముండిన ప్రేమయే, యీ వృద్ధాప్యపు వయస్సులో గూడ నుండ వలెను. పాండవులు తమ బాల్యమునందే తండ్రిని పోగొట్టుకున్నారు. అప్పటి నుండి నీవే వారిని పాలించి, పోషించి పెంచినావు. కాబట్టి, యిప్పుడు వారిని, నీ పుత్రులనున్ను, న్యాయపూర్వకముగా పాలించుము. రాజా! నీవే సర్వదా పాండవులను రక్షించ వలెను. విశేషించి, యిటువంటి సంకటావస్థలో నీవు వారిని రక్షించుట చాల యవసరము. పాండవులందు వైరము పెట్టుకొని నీ ధర్మార్థములు రెండున్ను నశింప జేసికొనకుము.

శ్రీకృష్ణుడు పాండవుల సందేశమును దృతరాష్ట్రునకు విని పించుట

''మహారాజా! పాండవులు నీకు నమస్కారము చేసి నీ కిట్లు చెప్పమనిరి:

"తండ్రీ! నీ యాజ్ఞచేత మేము, మా అనుచరులతో పాటు గొప్ప దుఃఖమును సహించితిమి పన్నెండేండ్లు మేము నిర్జన వనమునందు నివసించితిమి. పదమూడవయేడు నగరమునందు జనసమూహములో అజ్ఞాతుల మై యుంటిమి.

"తండ్రీ! నీవు మా పెదతండ్రివి గనుక, నీవు మా విషయములో చేసిన ప్రతిజ్ఞను నిలిపికొనుము: వనవాసము నుండి తిరిగి వచ్చిన తరువాత మా రాజ్య భాగమును మాకు తిరిగి యిచ్చెదనని యంటివి. నీ మాటపైననే మేము ఈ పదమూడేండ్లు ఆరణ్యాజ్ఞాతవాసముల నియమమునకు భంగము కలిగించకుండ నుంటిమి. ఈ విషయము మాతో నుండిన బ్రాహ్మణు లెరుగుదురు.

"తండ్రీ! మేము ఆ ప్రతిజ్ఞపైననే దృఢముగా నిలిచియున్నాము. కనుక, నీవుగూడ మా విషయములో చేసిన ప్రతిజ్ఞపై నిలుపుము.

"మేము సర్వదా దుఃఖములనే అనుభవించితిమి. తండ్రీ! యిప్పుడు మాకు మా రాజ్యభాగము చెంద వలెను. నీవు ధర్మార్థముల నెరిగిన వాడవు గనుక, మమ్ము రక్షింపుము. నీయందు మాకు గల గురుత్వమును దృష్టియందుంచుకొని, నీ యాజ్ఞను పాలించుట కొరకు మేము మౌనముతో నోరుమూసుకొని, యిన్నాళ్ళుగా అనేక క్లేశములను సహించుచు వచ్చితిమి.

"తండ్రీ! ఇప్పుడు నీవుగూడ మా తల్లి-దండ్రులవలె, మాయెడల స్నేహపూర్వముగా వ్యవహరించుము గురువులయందు శిష్యులు, పుత్రులున్ను వ్యవహరించ వలసిన విధముగానే నీయెడల మేము గూడ ప్రవర్తించి నీ యాజ్ఞను పాలించితిమి. నీవుగూడ మాయందు గురుజనోచిత మైన స్నేహమును చూపుచు వ్యవహరించుము.

"తండ్రీ! చెడు మార్గమునందు మేము పోవు చున్నచో పుత్రుల మైన మమ్ము తండ్రి వైన నీవు సన్మార్గమునందు ఉంచుట నీ కర్తవ్యము కనుక, నీవు ప్రశంసనీయ మైన ధర్మమార్గమునందు నడచుచు, మమ్ముగూడ ధర్మమార్గమునకు తీసికొని పొమ్ము."

జనమేజయా! శ్రీకృష్ణు డట్లు పాండవుల సందేశమును ధృతరాష్ట్రునకు తెలిపి, "పాండవులు సభలోని వారికి గూడ కొన్నిమాటలు చెప్పిపంపినారు" అని సభవారితో నిట్లనెను:

"సభ్యులారా! సమస్త సభాసదు లైన మీ రందరు ధర్మము నెరిగిన వారు. మీ సమక్షములోనే యే దైన అయోగ్యకార్యము జరిగినచో మంచిది గాదు.

"ఏ సభలో, సభ్యులు చూచు చుండగనే, అధర్మముచేత ధర్మము, అసత్యముచేత సత్యమున్ను హతములగునో. అక్కడ ఆ సభాసదు లందరు నశించినట్లుగా భావింప బడుదురు. అధర్మముచేత బాధిత మైన ధర్మము ఏ సభలో ప్రవేశించునో, ఏసభాసదులు ఆ యధర్మకంటకములను పెరికి వేయరో, ఆ సభలో ఆ ముండ్లచేత ఆ సభాసదులే గ్రుచ్చుకొన బడెదరు. (అనగా ఆ యధర్మము ఆ సభాసదులకే సంక్రమించును.) వడిగా పారు నదీప్రవాహము నదీతీరమునందు మొలచిన వృక్షములను పడ గొట్టి వేయునట్లు అధర్మబాధిత మైన ధర్మమే ఆ సభాపతులను నశింప జేయును."

జనమేజయా! అట్లు పాండవులు సభాసదులకొరకు పంపిన సందేశమును శ్రీకృష్ణుడు వినిపించిన తరువాత ధృతరాష్ట్రునితో నిట్లు మరల చెప్పెను:

"మహారాజా! సర్వదా ధర్మముపైనే దృష్టి నిలిపి, ధర్మమునే చింతించుచు, మౌనముతో నున్న పాండవులు, వారిరాజ్యమును తిరిగి వారికి ఇమ్మని నిన్ను ప్రార్థించు చున్నారు. అట్లు వా రడుగుట, సత్యము- ధర్మసమ్మతము- న్యాయసంగతము నైనది.

"రాజా! పాండవులకు రాజ్యభాగమును తిరిగి యిచ్చుటదప్ప, మరి యే మాటను ఇక్కడ నేను చెప్ప జాలుదును?

"ఈ సభలో కూర్చొని యున్న రాజులు, ధర్మార్థములను బాగుగా విచారించి నేను సరి యైనమాటను చెప్పుచున్నానా, లేదా యని చెప్ప వలెను.

"మహారాజా! నీవు ఈ క్షత్రియులను మృత్యుముఖము నుండి రక్షింపుము. శాంతి వహింపుము. క్రోధవశుడవు కాకుము. పాండవులకు సముచితమైన తండ్రితాతల రాజ్యభాగమును ఇచ్చి నీ పుత్రులతో సఫలమనోరథుడ వై, నీవు కోరిన సుఖభోగములను అనుభవింపుము.

"రాజా! అజాత శత్రు డైన యుధిష్ఠిరుడు సర్వదా సత్పురుష ధర్మమునందే స్థిరముగా నున్నాడు. అతడు సపుత్రకు డై నీయెడల ప్రవర్తించు రీతి గూడ నీకు తెలియును. వారిని మీ రందరు లక్క-యింటిలో దహింప జూచితిరి. అయినను, వారు మరల మీ శరణమునే వేడు చున్నారు. నీ పుత్రులతో గూడి నీవే పాండవులను ఇక్కడి నుండి బహిష్కరించి యింద్రప్రస్థమునకు తోలితివి.

"అక్కడ వారు నివసించుచు సమస్తరాజులను తమ వశములో తెచ్చుకొని ఆ రాజులకు నిన్నే అధిపతిగా చేసి, నీ యాజ్ఞ నెప్పుడుగూడ వారు ఉల్లంఘించకుండ జేసెను.

"అట్లు సజ్జనుడుగా వ్యవహరించు చున్న యుధిష్ఠిరుని రాజ్యమును, ధన-ధాన్య-సంపదనంతను నపహరించు నిచ్చతో, శకునిచేత మాయజూదమును కపటవృత్తితో కల్పించి, ఆ సాకుతో నీవు పాండవులను సంకటములో ఇరికించుటకు గొప్ప వల పన్నితివి.

"రాజా! నేను నీయొక్క, పాండవులయొక్కయు శ్రేయస్సునే కోరు చున్నాను. నీవు సమస్త ప్రజలను ధర్మార్థ సుఖములనుండి దూరము చేయకుము.

ఇప్పుడు అనర్థము అర్థముగాను, అర్థమే నీ విషయమునందు అనర్థముగాను తలచు చున్నావు. నీ పుత్రులు లోభమునందే మిక్కిలి ఆసక్తు లై యున్నారు. వారిని నీ వశములో నుంచుకొనుము.

"శత్రుదమను లైన పాండవులు నీ సేవ చేయుటకు గూడ సంసిద్ధు లై యున్నారు. దానిని నీ వంగీకరించని యెడల, యుద్ధము చేయుటకుగూడ సిద్ధముగా నున్నారు. ఈ రెంటిలో నీకు ఏమార్గము హితకరమో దానినే అవలంబించుము."

జనమేజయా! శ్రీకృష్ణభగవానుడు చెప్పిన మాటలను, ఆ సభలోని రాజు లందరున్ను హృదయ పూర్వకముగా నాదరించి మెచ్చుకొనిరి. వారిలో నెవరు గూడ శ్రీకృష్ణుని మాటలకు బదులు చెప్పుటకు ముందుకు రా లేదు.

పరశురాముడు దంభోద్భవ కథద్వారా నర-నారాయణు లైన కృష్ణార్జునుల మహిమ చెప్పుట

జనమేజయా! అప్పుడు జమదగ్నినందను డైన పరశురాముడు కౌరవ సభలో నీ విధముగా చెప్పెను:

"ధృతరాష్ట్ర మహారాజా! దీనికి ఉదాహరణముగా నేను వినిన కథ చెప్పెద వినుము. ఇది నీకు శ్రేయోదాయక మైనచో అంగీకరింపుము:

"రాజా! పూర్వము దంభోద్భవు డను నొక చక్రవర్తి యీ సమస్త భూమండల సామ్రాజ్యము నేలు చుండెను. ఆ రాజు ప్రతి దినము ప్రాతఃకాలమునందు మేల్కొని క్షత్రియులను ఇ ట్లడు'గు చుండెను:

"క్షత్రియులారా! యుద్ధమునందు నా సమానులు గాని, నాకంటె అధికులు గాని యీ ప్రపంచమునందు బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్య-శూద్రులలో నెవ రైన నున్నారా?''

''అ ట్లడుగుచు మిక్కిలి గర్వముతో, పిచ్చివా డై యతడు ఎవరినిగూడ లక్ష్య పెట్టక భూమండల మంతయు తిరుగుచుండెను.

''అప్పుడు నిర్భయు లైన బ్రాహ్మణులు, మాటిమాటికి తనను ప్రశంసించుకొను చున్న ఆ రాజును 'ఇది సరి కాదు' అని నిషేధించు చుండిరి.

"బ్రాహ్మణులు అట్లు నిషేధించు చున్నప్పటికిన్ని దంభోద్భవుడు మాటి మాటికి ఆ ప్రశ్నమునే వారి నడుగు చుండెను. అతని యహంకారము పెచ్చు పెరిగి యుండెను. అతడు ధనవైభవములతో మదించి యుండెను.

"అట్లు విడువక ప్రశ్నించు చున్న యా రాజుతో వేదవేత్తలు - మహాతపస్సంపన్నులు నైన బ్రాహ్మణులు క్రోధముతో ని ట్లనిరి:

''రాజా! యుద్ధమునందు అనేక యోధులపైన విజయమును సాధించిన యిద్దరు పురుషశ్రేష్ఠు లున్నారు. నీవెప్పుడుగూడ వారితో సమానుడవు కా జాలవు."

'రాజా! అట్లనిన ఆ బ్రాహ్మణుల మాటలను విని దంభోద్భవుడు మరల ఆ బ్రాహ్మణుల నిట్లు ప్రశ్నించెను:

''ఆ యిద్దరు వీరు లెక్కడ నున్నారు? వా రెక్కడ జన్మించిరి? వారు ఏయే కార్యములు చేసెదరు? వారి పే ర్లేమి?''

''ధృతరాష్ట్ర మహారాజా! ఆ మాటకు బ్రాహ్మణు లిట్లు ఉత్తరము చెప్పిరి:

''దంభోద్భవరాజా! ఆ యిద్దరు నర-నారాయణు లనెడు మునీశ్వరులు. ఇప్పుడు మనుష్యలోకమునకు వచ్చి యున్నారు. నీ వా యిరువురితో యుద్ధము చేయుము. మహాత్ము లైన ఆ నరనారాయణులు ఇప్పుడు గంధమాదన పర్వతమునందు, వర్ణించుటకు తరము గాని ఘోర తపస్సు చేయు చున్నారని విని యున్నాము.''

''మహారాజా! దంభోద్భవుడు బ్రాహ్మణుల మాటలు విని సహించ జాలక షడంగ (రథ-గజ-తురగ-పదాతి-శకట-ఉష్ట్ర) సైన్యములతో నరనారాయణు లుండు చోటికి పోయెను.

''అతి విషమము - ఘోరము నైన గంధమాదన పర్వతమునకు దంభోద్భవుడు పోయి, అక్కడ తపస్సు చేయు చున్న నరనారాయణుల సమీపము చేరెను.

''ఆ యిరువు రప్పుడు ఆకలిదప్పులతో మిక్కిలి కృశించి యుండిరి. వారి శరీరమునందలి నరములు స్పష్టముగా బయటకు ఉబికి కనపడు చుండెను.

వారు శీతోష్ణ వాయువులను ఓర్చుకొని తపస్సు చేయుచు మిక్కిలి బక్క జిక్కియుండిరి.

''దంభోద్భవుడు అట్లున్న వారిని చూచి సమీపించి వారి పాదములకు నమస్కారము చేసి వారి క్షేమసమాచారము నడిగెను.

"అప్పుడా నర నారాయణలు ఆ రాజునకు స్వాగత సత్కారములు చేసి, ఆసనము - జలము - పండ్లు - పూలు సమర్పించి, యాతనిని భోజనము కొరకు ఆహ్వానించిరి.

"తరువాత నతనితో 'నీకు మే మేమి సేవ చేయ వలెను?' అని అడిగిరి.

''వారి మాటలు విని దంభోద్భవుడు తన సంగతియంతయు సంపూర్ణముగా వారికి ఇట్లు తెలిపెను :

"మహాత్ములారా! నేనీ భూమండలమంతయు నా బాహుబలముచే జయించితిని. శత్రువులందరిని సంహరించితిని. ఇప్పుడు మీ యిద్దరితో యుద్ధము చేయు నిచ్ఛతో నీ పర్వతమునకు వచ్చినాను. ఇదియే నా చిరకాలవాంఛితము. మీరు అతిథి సత్కార రూపములో నాకు యుద్ధ భిక్ష గూడ నిచ్చి సత్కరింపుడు.''

"ఆ మాటలు విని నరనారాయణులు దంభోద్భవునితో నిట్లనిరి :

''రాజోత్తమా! ఈ మా యాశ్రమమునందు క్రోధలోభములకు తావులేదు. ఈ యాశ్రమమునందెప్పుడు గూడ యుద్ధము సంభవింపదు. ఇట్లుండగా, అస్త్ర శస్త్రములు ఇక్కడనుండవు. కుటిల మనోవృత్తి గల మనుష్యులు నిక్కడ నెట్లుండెదరు? ఈ భూమండలమునందు అనేక క్షత్రియులున్నారు. కనుక, మరి ఎక్కడికైన పోయి యుద్ధము చేయుము. నీ యభిలాష ఇతరత్ర తీరునుగాని యిక్కడ తీరదు.''

''ధృతరాష్ట్ర మహారాజా! ఈవిధముగా మహాత్ములైన నరనారాయణులు దంభోద్భవునకు మాటి మాటికి ఈ మాటలే చెప్పి, అతని క్షమింపుమని కోరి, వివిధరీతులలో నూరడించిరి.

"అయినను, దంభోద్భవుడు, యుద్ధేచ్ఛతో ఆ యిరువురు తాపసులను యుద్ధమునకు ఆహ్వానించెను.

"అప్పుడు మహాత్ముడైన నరుడు, తన పిడికిలి నిండుగా ముండ్లను తీసికొని దంభోద్భవునితో నిట్లనెను:

"యుద్ధేచ్ఛగల క్షత్రియుడా! రమ్ము. యుద్ధము చేయుము. నీ శస్త్రాస్త్రము లన్నియు తీసికొనుము. నీ సమస్త సేనను సిద్ధము చేసికొనుము. నీవు కవచాదులైన నీ యితర యుద్ధ సాధనములన్నిటిని సంపూర్ణముగా తీసికొనుము. నీవు చాల గర్వముతో పొగరుతోను బ్రాహ్మణాది సమస్త జాతులవారిని యుద్ధమునకు పిలుచుచు ప్రపంచమునందు తిరుగు చుందువు. కాబట్టి, నేటినుండి నీ యుద్ధ నిశ్చయమును నేను పోగొట్టెదను.''

"రాజా! ఆ మాటలు విని దంభోద్భవుడు నరునితో నిట్లనెను:

''తాపసా! నీ చేతిలో నున్న యీ యస్త్రమే నాపైన ప్రయోగించుటకు చాలునని నీవు తలచిన యెడల, నీ చేతిలోని వీటితోనే నాతో పోరాడుము. నేను యుద్ధార్థినై వచ్చినాను.''

జనమేజయా! పరశురాముడు, ధృతరాష్ట్రునకు నర-దంభోద్భవుల యుద్ధమును గూర్చి యిట్లు వర్ణింపదొడగెను:

''మహారాజా! తరువాత దంభోద్భవుడు మహానుభావుడైన నరుని చంపు నిచ్ఛతో అన్ని వైపులనుండి నరునిపైన బాణవర్షము కురియించెను.

"ఆ బాణములు మిక్కిలి భయంకరములుగా, శత్రు శరీరమును ఛిన్న భిన్నము చేయునవిగాను నుండెను.

"కాని నరమహర్షి దంభోద్భవుని లెక్కచేయక, తన చేతిలోని యిషీకలతోనే (ముండ్లు) ఆ బాణములను ఛేదించెను.

"తరువాత నరుడు ఆ రాజుపైన ఐషీకాస్త్రమును భయంకరముగా ప్రయోగించెను.

ఆ యస్త్రమును నివారించుట దంభోద్భవునకు అసంభవముగా నుండెను. అది యొక యాశ్చర్యకరమైన సంఘటనగా నుండెను.

నరమహాముని ఆ ముండ్లతోనే, దంభోద్భవుని సైనికుల కన్నులను, చెవులను, ముక్కులను ఛేదించెను. ఆ యిషీకలు ఆకాశమునందంతను తెల్లగా వ్యాపించెను.

"అది చూచి, దంభోద్భవుడు భయపడి, నరమునీశ్వరుని చరణములపై వ్రాలి 'భగవన్! నన్ను రక్షింపుము' అని వేడుకొనెను."

జనమేజయరాజా! అప్పుడు నరమహర్షి దంభోద్భవునితో నిట్లనెను:

''దంభోద్భవా! నేటి నుండి నీవు బ్రాహ్మణులకు హితము చేయుచు ధర్మాత్ముడవై యుండుము. ఇక మీద ఎప్పుడు గూడ నిట్టి సాహసము చేయకుము.

"రాజా! శత్రువిజయులైన క్షత్రియవీరులు ధర్మములను తలచుచు ఎప్పుడు గూడ మనస్సులో నైనను నీవలె వ్యవహరించరు. నేటి నుండి నీవు పొగరుతో నీకంటె పెద్దవారితో, చిన్నవారితో ఏ విధమైన ఆక్షేపము చేయకుము,

"రాజా! నీవు వినయముతో నుండి లోభమును, అహంకారమును విడిచి, బుద్ధిమంతుడవై, జితేంద్రియుడవై, ఓర్పు గలిగి, మృదుస్వభావముతో, సౌమ్యుడివై ప్రజలను పాలింపు చుండుము.

"ఇకపైన ఎప్పుడు గూడ నీవు ఇతరుల బలాబలములను తెలిసికొనక నెవరిపైన గూడ దాడి చేయకు మని నీకు ఆజ్ఞ యిచ్చితిని. నీకు మేలు కలుగు గాక! ఇక పొమ్ము. ఇక నెప్పుడు గూడ ఈ విధముగా వ్యవహరించకుము.

"విశేషించి నీకు మేమిద్దరము చెప్పుచున్నాము. వినుము. మా మాటపైన బ్రాహ్మణుల క్షేమసమాచారము తెలిసికొనుచుండుము"

"మహారాజా! తరువాత దంభోద్భవుడు మహానుభావులైన నరనారాయణ మునీశ్వరుల చరణములపైబడి నమస్కరించి, వారి సెలవు తీసికొని, తన నగరమునకు తిరిగి పోయెను.

''ఈ విధముగా నరుడు పూర్వము మహాకార్యము చేసెను. ఆ నరుని కన్నను నారాయణమహర్షి అనేక గుణములలో శ్రేష్ఠుడు.

"కనుక రాజా! అర్జునుడు ఎంతవరకు తన గాండీవధనుస్సునందు బాణములను ఎక్కుపెట్టడో, అంతలోపలనే నీవు ఆత్మాభిమానమును విడిచి అర్జునునితో కలిసికొనుము.

"రాజా! 1. కాకుదీకము (ప్రస్వాపనము) 2. శుకము (మోహనము) 3. నాకము (ఉన్మాదనము) 4. అక్షి సంతర్జనము (త్రాసనము), 5. సంతానము (దైవతము), 6. నర్తకము (పైశాచము), 7. ఘోరము (రాక్షసము), 8. ఆస్యామోదకము (యామ్యము), ఈ యెనిమిది విధములైన యస్త్రములున్నవి.

"1. కాకుదీకము (ప్రస్వాపనము) అనగా, ఈ యస్త్రము ప్రయోగించి నపుడు శత్రువులు దానిచేత తిరస్కృతులై, గజ - రథ- తురగాది వాహనముల కకుదము (వృష్ఠభాగము) పైననే పడి నిద్రింపజేయు అస్త్రము.

"2. శుకము (మోహనము) అనగా, చిలుక, నీటిపైన ఉంచబడిన వెదురు గొట్టమును పట్టుకొని భయముతో నరచుచున్నట్లు, ఈ శుకాస్త్రముచేత మోహితులైన యోధులు, భయకారణము లేకున్నను, భయపడుచు, అశ్వ - రథాదుల పాదములను అంటిపట్టుకొనునట్లు చేయు నస్త్రము.

"3. నాకము (ఉన్మాదనము) అనగా, ఈ యస్త్రపు దెబ్బతినిన యోధులకు, భ్రాంతిచేత ఈ యస్త్రము నాకము (స్వర్గము)ను కనిపింపజేయును.

"4. అక్షిసంతర్జనము (త్రాసనము) అనగా, ఈ యస్త్రము దెబ్బతినిన యోధులు భయపడి మలమూత్రములను విడుచునట్లు చేయును.

"5. సంతానము (దైవతము) అనగా, ఈ యస్త్రము ప్రయోగించుటచేత ఎడతెగక బాణవర్షము కురియుచుండును.

"6. నర్తకము (పైశాచము) అనగా, ఈ యస్త్రము దెబ్బవలన యోధులకు చాల బాధ గలిగి నృత్యము చేయుదురు.

"7. ఘోరము (రాక్షసము) అనగా, ఈ యస్త్రము శత్రువులను అతి భయంకరముగా సంహరించును.

"8. ఆస్యామోదకము (యామ్యము) అనగా ఈ యస్త్రముచేత కొట్టబడిన యోధులు, నోటిలో పాషాణములు పెట్టుకొని మరణించుటకు బయలుదేరెదరు. (ఈ విషయములు 'భారత భావదీపిక' అను గ్రంథమునందున్నవి)

''ధృతరాష్ట్ర మహారాజా! ఈ యెనిమిది యస్త్రములతో కొట్టబడిన మానవులందరు మరణించెదరు.

కామ - క్రోధ - లోభ - మోహ - మద - మాన - మాత్సర్య - అహంకారములు క్రమముగా నెనిమిది దోషములు చెప్పబడినవి. ఇవి పైన జెప్పబడిన యస్త్రముల యొక్క ప్రతీకములు (స్వరూపములు.)

"ఈ యెనిమిదియస్త్రములు ప్రయోగింపబడునపుడు శత్రువులు కొందరు ఉన్మత్తులై పిచ్చిచేష్టలు చేయుచుందురు. కొందరికి తెలివి యుండదు. చైతన్యము నశించును. చాలమంది నిద్రించుచుండెదరు. మరికొందరు ఎగురుచు దుముకుచు

అరచుచు నుండెదరు ఎందరో మలమూత్రములను విడుచుచుండెదరు. ఇంక కొందరు నిరంతరము ఏడ్చుచు నవ్వుచు నుందురు.

"రాజా! సమస్త లోకముల నిర్మాణము చేయు ఈశ్వరుడు - సమస్త లోకులు చేయు కర్మలను తెలిసినవాడునైన సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు యేయర్జునునకు బంధువుగా వచ్చి శ్రీకృష్ణుని రూపములో సహాయము చేయుచున్నాడో, అట్టి నరమహర్షి స్వరూపుడైన అర్జునుని యుద్ధమునందు జయించుట సాధ్యముగాదు. (అతడు పైన జెప్పబడిన యెనిమిది అస్త్రములను బాగుగా నెరిగినవాడు)

''రాజా! యుద్ధభూమియందు అసమాన బలపరాక్రమ సంపన్నుడై తిరుగులేకుండ పోరాడు విజయశీలుడు - కపిధ్వజుడునైన అర్జునుని జయించుటకు సాహసించువాడు మూడులోకములందెవడున్నాడు? అర్జునుని యందు లెక్కలేనన్ని సద్గుణములున్నవి. అతని కంటె నన్ని గుణములతో నధికుడు జనార్దనుడు. అర్జునుని నీవు గూడ బాగుగా నెరుగుదువు.

"మహాత్ములైన నర-నారాయణుల పేర్లతో ప్రసిద్ధులైన ఆ యిరువురే అర్జునుడు, శ్రీకృష్ణుడుగా నవతరించిరి. ఆ యిరువురు పురుషశ్రేష్ఠులు సర్వోత్తములైన వారు అని నీవు బాగుగా తెలిసికొనవలెను.

"రాజా! నీవొకవేళ ఈ విషయమును, ఈ రూపములో తెలిసికొనినయెడల నా మాటల యెడల నీకు కించిత్తు గూడ సందేహము లేనిచో, నా మాటలను విని, మంచి బుద్ధిని తెచ్చుకొని, పాండవులతో సంధి చేసుకొనుము.

"రాజా! మీలో భేదభావము లేకుండ నుండవలెనని, అందులోనే మీకు శ్రేయస్సు గలదనియు నీవు తలచినచో సంధి చేసికొని శాంతితో నుండుము. యుద్ధమును తలపెట్టకుము.

"కురుశ్రేష్ఠా! మీ కులము ఈ భూమండలమునందు చాలా సుప్రతిష్ఠితమైనది. ఇది యట్లే ప్రతిష్ఠతో సర్వదా ఉండినయెడల మీకు మేలుకలుగును. ఇట్లు నీవు తలచినచో రాజా! నీకు వాస్తవముగా గలుగు మేలుకొరకు ప్రయత్నము చేసి, పాండవులతో సంధి చేసుకొనుము.''

దుర్యోధనునకు కణ్వుడు శాంతికొరకు బోధించుచు మాతలియుపాఖ్యానము చెప్పుట

జనమేజయా! ఇట్లు పరశురాముడు చెప్పిన మాటలు విని, కణ్వమహాముని గూడ కౌరవసభలో దుర్యోధనునితో నిట్లు చెప్పదొడగెను:

"దుర్యోధనా! లోక పితామహుడైన బ్రహ్మదేవుని వలెనే నర-నారాయణ ఋషులు గూడ అక్షయులు - నాశరహితులు. అదితీదేవి పుత్రులందరిలోను భగవంతుడైన నారాయణుడు ఒక్కడు మాత్రమే అజేయుడు, నాశరహితుడు, శాశ్వతముగా నుండువాడు, సనాతనుడు, పరమేశ్వరుడునై యున్నాడు.

''సూర్య - చంద్ర - భూమి - జల - వాయు - అగ్ని - ఆకాశ - గ్రహ-నక్షత్రాదులన్నియు నదితి పుత్రులే. అయినను, వారు ఏదో యొక నిమిత్తము చేత మరణించువారే. కనుక వారందరు నశించువారు.

''మహాప్రళయ కాలమునందు చంద్రసూర్యాదులును తక్కినవన్నియు పూర్తిగా నశించిపోవును. మరల సృష్టికాలమునందు వారందరు జన్మింతురు. ఇట్లు ఎన్నియో పర్యాయములు వారికి జనన మరణములు తప్పవు.

"ఇక భూలోకమునందున్న మనుష్యాది సర్వప్రాణులు గూడ అల్పకాలములోనే మరణింతురు. రాజులు సంపూర్ణగాముగా రాజ్యలక్ష్మిని - సుఖభోగములను అనుభవించి, ఆయస్సు క్షీణమైనతరువాత మరణించి, యిక్కడ వారు చేసిన పుణ్యపాపకర్మముల ఫలములు అనుభవించుటకు మరల నిక్కడ వివిధ యోనులందు జన్మించెదరు.

''ధృతరాష్ట్రమహారాజా! ఇది యెరిగి నీవు ధర్మపుత్రునితో సంధి చేసికొనుము. కౌరవ పాండవు లిరువురు కలిసి యీ భూమిని ఏలవలెనని నేను కోరుచున్నాను.

"దుర్యోధనా! 'నేనొక్కడనే బలవంతుడను' అని నీవు తలచకుము. ప్రపంచమునందు బలవంతులకన్న మించిన బలవంతులు ఉన్నారు. బలవంతులకు ఉన్నబలమే బలమనుకొనగూడదు.

"పాండవులు దైవబలము గలవారు. కనుక నీకన్నను వారే బలవంతులు. ఈ విషయములో ఉదాహరణముగా నీకొక ప్రాచీనమైన యితిహాసము చెప్పెదను వినుము:

మాతలి ఉపాఖ్యానము

"దుర్యోధనా! త్రిలోకనాథుడైన యింద్రుని సారథి మాతలికి ఒకే కూతురు ఉండెను. ఆమె సాటిలేని రూపసౌందర్యములలో లోకవిఖ్యాతిని చెందియుండెను. దేవతా స్వరూపిణియైన ఆ కన్యక పేరు 'గుణకేశి' యని యుండెను. ఆమె స్త్రీలందరిలో అత్యంత శ్రేష్ఠురాలు.

"ఆమెకు వివాహయోగ్యమైన వయస్సు వచ్చినపుడు, మాతలి చింతించుచు తన పత్నియైన 'సుధర్మ'తో సంప్రదించుచు నామెతో నిట్లనెను:

"ఉత్తమ కులమునందు పుట్టి, ఉత్తమ శీలము గలిగిన వారికి పుట్టిన కన్యక తల్లిదండ్రులకు దుఃఖకారణమగును. కన్యక తన తండ్రి - తల్లి - భర్త - ఈ ముగ్గురి కులముల పెద్దలకు ఒక సమస్యయగును. ఆమె యీ మూడు కులముల కీర్తి ప్రతిష్ఠలకు కారకురాలగును.

"నేను దేవ - మనుష్యలోకములలో మన కన్యకు అనురూపవరుని కొరకు అంతటను వెదకితిని. కాని, యే వరుడు గూడ ఆమెకు అనురూపుడు దొరకలేదు. దేవ - దానవ - గంధర్వ - మనుష్య - ఋషికులములన్నింటిలోను వెదకినాను. కాని, ఆమెకు ఎక్కడగూడ మంచి వరుడు లభించలేదు. ఇక ఇప్పుడు నాగ లోకమునకు పోయి వరుని వెదకెదను."

"ఆ మాటకు సుధర్మ యనుమతించెను.

"సుధర్మ యనుమతితో మాతలి వరాన్వేషణము కొరకు, తన యిష్ట దేవతలకు ప్రదక్షిణ నమస్కారములు చేసి ప్రార్థించి, కన్యక శిరస్సును ప్రేమతో అఘ్రాణించి భూలోకమునకు పోయెను.

వరాన్వేషణమునకు పోవుచున్న మాతలి నారదునితో వరుణ లోకమునకు పోయి యచట వివిధాశ్చర్యములను చూచుట

"మాతలికి మార్గమధ్యమునందు నారద మహాముని కనపడెను. అయన వరుణదేవుని దర్శించుటకు పోవుచుండెను. నారదుడు మాతలిని అకస్మాత్తుగా చూచి యిట్లనెను:

"మాతలీ! ఎక్కడికి నీ ప్రయాణము? లేక యింద్రుని యాజ్ఞతో పోవుచుంటివా?''

"మాతలి నారదునకు, తన ప్రయాణకారణమును పూర్తిగా చెప్పెను.

ఆ మాటకు నారదుడిట్లనెను:

"మనమిద్దరము కలిసి పోవుదము. నేను గూడ వరుణదేవుని దర్శనము చేయుటకు పోవుచున్నాను. నేను భూమండలము క్రింది లోకములను నీకు చూపుచు, అక్కడి వస్తువులన్నింటిని గూర్చి నీకు తెలిపెదను. అక్కడ మంచి వరుని వెదకుదము.''

"దుర్యోధనా! తరువాత వారిద్దరు భూమిలో ప్రవేశించి జలస్వామియైన వరుణదేవుని సమీపమునకు పోయిరి.

"వరుణుడు దేవర్షులకు యోగ్యమైన పూజను నారదునికి, ఇంద్రయోగ్యమైన పూజలను మాతలికి చేసి అతిథి సత్కారము చేసెను.

"వారు తాము వచ్చిన పని వరుణునకు చెప్పి, అతని యాజ్ఞతో నాగ లోకమునందు వరాన్వేషణార్థమై తిరుగజొచ్చిరి.

''నారదుడు నాగలోకమునందున్న సమస్త ప్రాణులను గూర్చి తెలిసిన వాడుగనుక, ఇంద్ర సారథికి అక్కడి అన్ని విషయములను గూర్చి విస్తారముగా తెలుపుచు నిట్లనెను:

"మాతలీ! నీవిప్పుడు జలేశ్వరుడైన వరుణదేవుని, అతని పుత్రపౌత్రులను చూచితివి కదా! ఇది సర్వసంపదలచే సమృద్ధమైన వరుణుని నివాస స్థానము. దీని పేరు 'సర్వతోభద్రము'. ఇదుగో, యితడు గోపతి (జలపతి - గోవు అనగా నీరు అని కూడ అర్థము) యొక్క పుత్రుడు.

''ఇతడు మిక్కిలి బుద్ధిమంతుడు. ఇతడు మంచి స్వభావము, సత్ప్రవర్తన, పవిత్రత్వము కలవాడగుటచేత ఇక్కడ ఇతనికి విశిష్టమైన స్థానము కలదు.

''ఇతనియందు వరుణునకు చాలా ప్రేమ గలదు. ఇతని పేరు 'పుష్కరుడు' ఇతడు మిక్కిలి సుందరుడు - కమలనయనములు గలవాడు. కనుక సోమదేవుని కూతురు ఇతనిని పతిగా వరించెను.

''సోమదేవుని రెండవ కూతురు 'జ్యోత్స్నకాళి' యను పేరుగలది. ఆమె లక్ష్మి సమాన రూపవతి. ఆమె అదితీదేవియొక్క జ్యేష్ఠపుత్రుడైన సూర్యుని తనకు పతిగా వరించెను,

''వరుణదేవుని భవనము చూడుము. ఇది సంపూర్ణముగా సువర్ణమయము. ఇక్కడికి దేవతలు వచ్చి దేవత్వలాభమును పొందెదరు.

''మాతలీ! ఇవి చూడుము. దేవతలు దైత్యులను ఓడించి, వారి రాజ్యము నుండి తెచ్చిన దైత్యుల ఆయుధములు ఇవి.

"ఇవి అక్షయములు (నాశరహితములు). ఇవి ప్రయోగింపబడినప్పుడు శత్రువులను సంహరించి, తిరిగి తమ ప్రభువును చేరును. వీటిని పూర్వము దైత్యులు ప్రయోగించు చుండిరి. వారిని ఓడించి, దేవతలు వీటిని తమ ఆధీనము లోకి తీసికొనిరి.

''మాతలీ! ఇదుగో యిక్కడ, రాక్షసజాతివారు, దైత్యజాతివారు ఉండెదరు. ఇక్కడ దైత్యులు నిర్మించిన అనేక దివ్యాస్త్రములున్నవి.

"ఈ వరుణదేవతయొక్క సరస్సునందు అగ్నిదేవుడు ప్రకాశించుచున్నాడు ఇతడు ధూమరహితుడుగా నున్నాడు. ఈ యగ్నిదేవుడు విష్ణుభగవానుని సుదర్శన చక్రమును గూడ యిక్కడ అవరోధించి (ఆపి) యుంచినాడు.

"మాతలీ! వజ్రము యొక్క ముడికి 'గాండి' అని పేరు. ఆ వజ్రగ్రంథుల చేత చేయబడినది గనుక, ఇక్కడ ఉన్న ఈ ధనుస్సునకు 'గాండివము' (గాండీవము) అని పేరు.

"ప్రపంచ సంహారమునకు గాను ఈ ధనుస్సు నిర్మింపబడినది. దేవతలు దీనిని సర్వదా కాపాడు చుందురు. అవసరము వచ్చినప్పుడు ఈ ధనుస్సు ఒక లక్షరెట్లు అధికశక్తి, అంత బలము గూడ కలిగియుండి, సర్వదా స్థిరముగా నుండును.

"ప్రజాపతియైన బ్రహ్మదేవుడు దీనిని మొదట నిర్మించెను. బ్రహ్మ సోమదేవునకు, అతడు వరుణునకు, వరుణుడు అగ్నిదేవునకు దీనిని ఇచ్చిరి. ఇది రాక్షసులవలె వ్యవహరించుచున్న రాజులలో, అణచుటకు వీలుపడని రాజులను అణచివేయును.

''ఈ ధనుస్సు రాజులకొక గొప్ప అస్త్రము. ఇది చక్రముతో సమానముగా భాసిల్లు చుండును. శ్రేయస్సును గలిగించు ఈ ధనుస్సును జలేశ్వరుడైన వరుణుని కొడుకులు ధరించెదరు.

"ఇదుగో, యిది వరుణదేవుని ఛత్రము (గొడుగు). ఇది యీ ఛత్రశాల, యందుంచ బడినది. చూడుము. ఈ గొడుగు మేఘమువలె అన్నివైపులనుండి చల్లని నీరు వర్షించు చుండును. ఈ జలము చంద్రునివలె తెల్లగా నిర్మలముగా నుండును. ఈ జలము అంధకారముచేత కప్పబడి యుండును. అందుచేత ఇది కనపడదు.

"మాతలీ! ఈ వరుణలోకమునందు చూడదగిన అద్భుతములైన అనేక వస్తువులున్నవి. కాని, ఇవి యన్నియు చూచుచుండినచో, నీ కార్యమునకు ఆటంకము కలుగును. కనుక, మనము ఇక్కడినుండి శీఘ్రముగా నాగలోకమునకు పోవుదము.

నారదుడు మాతలికి పాతాళలోకము చూపించుట

''మాతలీ! యిక్కడ నాగలోక నాభి (మధ్య) స్థానమునందు కనబడుచున్నది పాతాల లోకమనబడును. దీనియందు దైత్య - దానవులు నివసించుచుందురు. ఈ పాతాళ లోకమునకు భూలోకమునుండి యెవరైన ప్రాణులు జలములో ప్రవహించుచు వచ్చినచో వారు భయ పీడితులై బిగ్గరగా అరచెదరు.

''ఇక్కడ జలమునే ఆహారముగా తీసికొను అసురాగ్ని సర్వదా మండుచుండును. ఆ యగ్ని మిక్కిలి ప్రయత్నపూర్వకముగా అదుపులో నుంచబడెను. దేవతలు తనను అదుపులో నుంచుచున్నట్లు ఆ యగ్ని తలచును. అందుచేత ఆ యగ్ని అన్నివైపుల వ్యాపించ జాలదు.

"దేవతలు తమ శత్రువులను సంహరించి అమృతపానము చేసి, మిగిలిన అమృతమును ఇక్కడనే దాచియుంచిరి. అందుచేత అమృతమయమైన సోమరసము ఇక్కడ హెచ్చుట - తగ్గుట కనబడుచుండును.

''మాతలీ! ఇక్కడ శ్రీమహావిష్ణువు అదితీదేవికి హయగ్రీవుడుగా నవతరించెను. హయగ్రీవుడు, సువర్ణ కాంతితో ప్రతి పర్వకాలమునందున్ను వేదధ్వనిచేత ప్రపంచమును పూరించుచు పైకి లేచును.

"జలరూపములందున్న యే వస్తువులైనను ఇక్కడ పడును గనుక ఈ పట్టణమునకు పాతాలము అని పేరు.

(పతంతి అలం అను వ్యుత్పత్తి ననుసరించి పాత + అలం — అను నీ రెండు శబ్దముల కలయికచేత పాతాల శబ్దము ఏర్పడినది.)

"ప్రపంచమునకు హితము చేయు ఐరావతము (ఇంద్రుని గజము లేక యింద్ర ధనుస్సు) ఇక్కడి నుండియే జలము తీసికొని మేఘముల యందు నింపగా, ఇంద్రుడు మేఘముల నుండి జలమును భూమి మీదకు వర్షించుచున్నాడు.

"ఇక్కడ అనేక విధములైన ఆకారములను గలిగి వివిధ రూపములతో ప్రకాశించు తిమి (నూరు ఆమడల పొడవుగల చేప) యను జలచరము చంద్ర కిరణములను త్రాగుచు, ఈ జలమునందు నివసించు చుండును.

''మాతలీ! పాతాళము నందు నివసించు జంతువులు, ఇక్కడ పగలు సూర్యకిరణమువలన తపించుచు మరణావస్థను పొంది యుండును. కాని, మరల అవి రాత్రియందు అమృతమయములైన చంద్ర కిరణముల సంబంధము (స్పర్శము) చేత జీవించు చుండును.

"చంద్రలోకము నందు చంద్రుడు తన కిరణము లనెడు బాహువుల చేత అమృతమును స్పృశించి (తాకి), అమృతమయములైన ఆ భుజముల చేత ఈ పాతాళ లోకములందు మరణించుటకు సిద్ధముగానున్న జంతువులను స్పృశించి రాత్రి వేళల బ్రతికించు చుండును.

''ఇంద్రునిచేత జయింప బడిన అధర్మపరులైన రాక్షసులు సంపద్విహీనులై బంధింపబడి, పీడితులై ఈ పాతాళ లోకమునందు నివసింతురు.

''మాతలీ! సర్వభూతములకు మహేశ్వరుడైన భూతనాథుడు, సమస్త ప్రాణుల శ్రేయస్సు కొరకు ఇక్కడ తపస్సు చేసియుండెను.

''గోవ్రత ధారులైన బ్రాహ్మణులు - మహర్షులు వేదాధ్యయనము చేత దుర్బలులై, ప్రాణములను లెక్కచేయక తపస్సు చేయుచు, దాని ద్వారా స్వర్గము సాధింపదలచినవారు ఇక్కడ నివసించు చుండెదరు.

"ఎక్కడనో యొకచోట శయనించుచు ఏది యెక్కడ లభించునో దానినే భుజించుచు, నారచీరలు మొదలైనవి ఏవి యెక్కడ లభించునో ఆ వస్తువులతోనే శరీరమును కప్పికొనుచు తపస్సు చేయుట 'గోవ్రత' మనబడును. అట్టి గోవ్రతధారులు ఇక్కడ నివసించెదరు.

(గోవులు గూడ ఎక్కడనో పండుకొని, దొరకినది తినుచు, లభించినది కప్పికొను చుండును గదా! అందుకే దీనికి గోవ్రతమని పేరు.)

''మాతలీ! ఈచోట నాగరాజులైన ఐరావతము, వామనము, కుముదము అంజనము అను పేర్లుగల ఉత్తమ గజములు, సుప్రసిద్ధమైన 'సుప్రతీక' గజ వంశమునందు జన్మించెను.

"ఈ లోకమునందు నీ కన్యకకు అనురూపుడైన వరుడెక్కడనైన ఉన్నాడేమో చూడుము. మాతలీ! నేను స్వయముగా పోయి ప్రయత్నించి, యతనిని తోడ్కొని వచ్చెదను.

"మాతలీ! ఇక్కడ జలములోపల ఒక గ్రుడ్డు (అండము) ఉన్నది. అది యిక్కడ తన కాంతితోనే ప్రకాశించు చున్నది. ప్రజాసృష్టి మొదలైనప్పటి నుండి నేటిదాక ఆ యండము పగులలేదు. అది తన చోటినుండి కదలక అట్లే యున్నది.

"ఈ యండము యొక్క జాతి - స్వభావముల విషయములో ఎవరును ఏమియు చెప్పినట్లు నేను వినలేదు. దాని తలిదండ్రులను గూర్చి గూడ ఎవరికి తెలియదు.

"మాతలీ! మహాప్రళయ కాలమునందు ఈ యండము నుండి చాల గొప్ప అగ్ని వెడలును. ఆ యగ్ని మూడు లోకములను, చరాచరాత్మకమైన సమస్త ప్రపంచమును భస్మము చేయును."

జనమేజయా! నారదుడు చెప్పిన మాటలు విని మాతలి యిట్లనెను:

"నారదమునీ! నాకిచోట ఏ వరుడు గూడ నా కన్యకొరకు నచ్చలేదు. మరియొక చోటికి పోవుదము."

అప్పుడు అతనికి నారదుడిట్లు చెప్పదొడగెను:

హిరణ్యపుర దర్శనము - వర్ణనము

"మాతలీ! యిది 'హిరణ్యపురము' అనబడు మహానగరము. ఇక్కడ మాయావులైన అనేక దైత్య-దానవులు నివసించుచుందురు.

"అసురజాతివాడైన మయుడు ఈ నగరమును తన మనస్సంకల్పము ననుసరించి మహాప్రయత్నము చేత పాతాళ లోకమునందు నిర్మించెను.

"ఈ నగరమునందు వేలకొలది మాయలను ప్రయోగించు వారు, మహాబల పరాక్రమశాలురునైన దానవులు నివసించు చుందురు. వారు ఇక్కడ వసించుటకు పూర్వమే వారు ఎవరి చేతగూడ వధింప బడ దగినవారు కారను వరము వారికి లభించియుండెను. ఆ దానవులను ఇంద్ర-యమ-వరుణ-కుబేరాది దిక్పాలకులుగాని, మరియెవరైన గాని తమ వశములోనికి తీసికొనజాలరు.

"మాతలీ! ఈ హిరణ్యపురమునందు, విష్ణు భగవానుని చరణములనుండి పుట్టిన 'కాలఖంజులు' అను పేరుగల అసురులు, బ్రహ్మదేవుని పాదములనుండి పుట్టినవారు, పెద్ద పెద్ద కోరలు గలవారు, భయంకర వేగము గలవారు, సదా గమనశీలుడైన వాయువుతో సమానమైన పరాక్రమము గలవారు, మహాబలశాలురునైన 'నైరృతులు' 'యాతుధానులు' అను పేర్లుగల అసురులున్ను నివసించెదరు.

"మాతలీ! ఈ నగరమందే 'నివాతకవచులు' అను పేరుగల దానవులు నివసించెదరు. వీరు యుద్ధోన్మత్తులై పోరాడుచుందురు. ఇంద్రుడు గూడ వీరిని జయించు శక్తి చాలని వాడని నీకు తెలియును గదా!

"మాతలీ! నీవు- నీ పుత్రుడు 'గోముఖుడు',ఇంద్రుడు తన పుత్రులతోను యుద్ధమునందు వీరిని ఎదురించ జాలక, యుద్ధరంగమునుండి యెన్నియో పర్యాయములు పారిపోయితిరి గదా!

"మాతలీ! చూడుము, ఈ నగరమునందలి సువర్ణ-రజత మయములైన భవనములు ఎంత శోభాయమానములుగా నున్నవో! ఈ నగర నిర్మాణము శిల్పశాస్త్ర విధానము ననుసరించి చేయబడినది. ఇందలి భవనములన్నియు ఒండొంటిని ఒరసికొనుచు కలిసియున్నవి.

"మాతలీ! ఈ యన్ని భవనములందు వైడూర్యమణులు పొదుగబడి యున్నవి. దానిచేత విచిత్ర కాంతి గలదిగా ఈ నగరమున్నది. అంతటను పగడములు పొదుగబడి యుండుటచేత,దీని సౌందర్యము అత్యధికముగానున్నది.

"జిల్లేడు పూవులవలె, స్ఫటికములవలె శుభ్ర శ్వేతవర్ణముతో నీ నగరము ప్రకాశించు చున్నది. ఉత్తమ వజ్రమణులు పొదుగ బడియుండుట చేత ఈ నగరము మిక్కిలి కాంతిమంతముగా కనపడుచున్నది.

"ఈ భవనములలో కొన్ని మంటితో నిర్మింపబడినట్లు, కొన్ని పద్మరాగ మణుల (కెంపులు)తో కట్టబడినట్లు; కొన్ని పాషాణములతో, మరికొన్ని కొయ్యతో నిర్మింపబడినట్లున్ను గోచరించుచున్నవి.

"కొన్ని భవనములు సూర్యునివలె, కొన్ని అగ్నివలెను ప్రకాశించుచున్నవి. మణి జాలముల (కిటికీల) తో ఈ భవనముల కాంతి విచిత్రముగా నున్నది. ఇవి యన్నియు చాల ఎత్తుగా, నిబిడముగాను (దట్టముగా) నున్నవి.

''మాతలీ! ఈ హిరణ్య పురమునందలి భవనములు, ఎంత సుందరములు? ఏయే ద్రవ్యములతో చేయబడినవి? అని నిరూపించుటకు సాధ్యము కాదు.

"ప్రపంచమంతటను ఈ నగరము ప్రసిద్ధమైయున్నది. అన్ని గుణములు నిందున్నవి. దీని నిడివి వెడల్పులు చాల పెద్దగా నున్నవి. ఇది మిక్కిలి ప్రశంసనీయము.

"ఇక్కడ దైత్యుల ఉద్యానవనములు - క్రీడాస్థానములు ఎంత సుందరములుగ నున్నవో చూడుము. ఇక్కడి శయనగృహములు గూడ నగరమునకు అనురూపములుగనే అందముగ నున్నవి. ఇక్కడివారు వాడుకొను పాత్రములు-ఆసనములు రత్నములచేత పొదుగబడియున్నవి. ఇవి బహుమూల్యములు.

''మాతలీ! యిక్కడి పర్వతములు మేఘ సమూహములవలె కనపడుచుండును. ఈ పర్వతములనుండి సెలయేళ్ళు ప్రవహించుచుండును. ఈ వృక్షములను చూడుము. కోరిన పుష్పఫలము లివి యిచ్చును. ఇచ్ఛ వచ్చిన చోటికి పోవుచుండును.

''మాతలీ! ఈ పట్టణమునందు నీ కన్యకు అనురూపుడైన వరుడున్నాడేమో చూచికొనుము'' అని నారదుడు చెప్పగా, మాతలి యిట్లనెను:

''దేవర్షి! దేవతలకు అప్రియమైన పనియేదియు నేను చేయగూడదు. దేవ-రాక్షసులు సోదరులైనప్పటికిని, ఆ యిరువర్గములకు నెల్లప్పుడున్ను వైరము కలదు. ఇట్టి పరిస్థితిలో శత్రుపక్షములో నేనెట్లు సంబంధము చేయుటకు ఇష్టపడెదను? కనుక, ఇది మంచిది గాదు. మరియొకచోటికి పోవుదము. దానవులను చూచుటకు గూడ ఇష్టపడను. నారదా! నీ మనస్సులో హింసాత్మక కార్యము (యుద్ధము) నీవు తలచుచున్నట్లు తోచుచున్నది.''

''దుర్యోధనా! మాతలి మాటలు విని నారదుడు, తరువాత నిట్లు చెప్ప దొడగెను:

గరుడలోక - గరుడ సంతతుల వర్ణనము :

''మాతలీ! యిది సర్పభోజనము చేయు గరుడవంశీయుల లోకము. ఇక్కడి పక్షులకు తమ పరాక్రమమును ప్రకటించుటకు, దూర దూర ప్రదేశ ములవరకు ఎగురుటకు, గొప్ప బరువు మోయుటకును కించిత్తుగూడ శ్రమము కాదు.

"ఇక్కడ వినతకొడుకైన గరుడునియొక్క ఆరుగురు పుత్రుల వంశపరం పరలు విస్తరిల్లియున్నవి. ఆ యారుగురి పేర్లు - 'సుముఖుడు - సునాముడు- సునేత్రుడు-సువర్చుడు-సురుచుడు-సుబలుడు' అని.

"వినత కశ్యపప్రజాపతి యొక్క పదునాలుగురు భార్యలలో నొకతె. ఆమె నుండి పక్షిజాతి పుట్టినది. ఇట్లే కశ్యపుని యితర భార్యలు పదముగ్గురు నుండి కూడ వేర్వేరు జాతులు పుట్టినవి కనుక ఈ ప్రపంచమంతయు కశ్యపుని సంతానమే.

(భూమికి 'కాశ్యపి' యని పేరు, కశ్యపుని బిడ్డగాబట్టియే ఈ పేరు వచ్చి నది. శ్రాద్ధతర్పణాది పితృకార్యములయందు, మామ-అత్త-బావ- మొదలగువారి గోత్రములు తెలియనప్పుడు, అ కర్మలు చేయువాడు, తనకు తెలియని గోత్ర ములకు బదులుగా 'కాశ్యప' గోత్రము అని అందరికి చెప్పుట వైదిక సంప్రదా యము. వసిష్ఠ - భారద్వాజాది గోత్రములందు పుట్టిన వారందరికి మూల ఋషి కశ్యపుడే కాబట్టి, యే గోత్రము తప్పినను కాశ్యప గోత్రము తప్పదని భావము).

"వినత యొక్క వంశమును వృద్ధిపొందింప దలచి కశ్యపుని కులమునందు పుట్టి, ఐశ్వర్యమును విస్తరింప జేయు నీ యారు పక్షులనుండి, గరుడ జాతి యొక్క నూర్లకొలది, వేలకొలదిపక్షిజాతిశాఖలుపుట్టి ప్రపంచమంతటను విస్తరించి నవి. ఇవి యన్నియు సంపదగలవి. అన్నిటికిన్ని 'శ్రీవత్స' చిహ్నము గలదు. శ్రీ మహావిష్ణువు వక్షఃస్థలమునందున్న మచ్చ శ్రీవత్సమనబడును. అట్టి దే గరుడ పక్షుల మెడపైనుండును. అన్నియు ధన సంపదను కోరుచుండును. అత్యంత బలము గలిగి యుండును.

"మాతలీ! ఈ పక్షులు బ్రాహ్మణ (కశ్యప) కులమునందు పుట్టినవైనను. క్షత్రియ కర్మలే చేయుచుండును ఈ పక్షులకు దయ లేదు. ఇవి సర్పములనే తమకు ఆహారముగా కోరును.

"ఈ విధముగా గరుడజాతి పక్షులు, తమ సోదరులైన సర్పములను (సర్పములు కశ్యపుని భార్యలలో నొకతెయైన 'కద్రువు' అను నామె పుత్రులు. కనుక గరుడ పక్షులకు సర్పములు సవతి తమ్ములు) సంహరించుటచేత ఆ పక్షులకు బ్రాహ్మణత్వము లభింపదు.

(ఈ కద్రూ వినతల కథ ఆదిపర్వమునందు విస్తారముగా నున్నది - చూడుడు.)

ఈ గరుడ కులము వారు విష్ణు భగవానుని పార్షదులు (ఆత్మీయులు) గాబట్టి చాల ప్రశంసనీయులు వీరికి దేవత విష్ణువు, ఆయనయే వీరికి ఆశ్రయ భూతుడు. ఆయనయే వీరికి సర్వదా గతి. వీరి మనస్సులలో విష్ణువు సర్వదా విరాజమానుడై యుండును.

''మాతలీ! గరుడజాతికి ప్రముఖులెవరనగా వారి పేర్లు చెప్పెద వినుము:

"సువర్ణచూడ - నాగాశి - దారుణ-చండతుండక - అనిల అనల-విశాలాక్ష కుండలి - పంకజిత్ - వజ్రవిష్కంబ - వైనతేయ - వామన - వాతవేగ - దిశా చక్షు - నిమేష అనిమిష - త్రిరావ - సప్తరావ - వాల్మీకి - దీపక - దైత్యద్వీప - సరిద్ద్వీప - సారస - పద్మకేతన - సుముఖ - చిత్రకేతు - చిత్రబర్హ - అనఘ - మేషహృత్ - కుముదదక్ష - సర్పాంత - సహభోజన - గురుభార - కపోత - సూర్యనేత్ర - చిరాంతక - విష్ణుధర్మ-కుమార - పరిబర్హ - హరి - సుస్వర - మధుపర్క - హేమపర్ణ - మాలయ - మాతరిశ్వ - నిశాకర - దివాకర' అను పేర్లు గలవారు నలువది యెనమండుగురు ముఖ్యులున్నారు. వీరందరు గూడ కీర్తిమంతులు - బలవంతులు.

''మాతలీ! ఈ గరుడ లోకమునందు నీకు ఇష్టము లేకున్నచో రమ్ము, మరి యొకచోటికి తోడ్కొని పోయెదను."

"దుర్యోధనా! యిట్లు చెప్పి నారదుడు మాతలిని రసాతలమునకు దోడ్కొని పోయి యతనితో నిట్లనెను

సురభి - సురభి సంతతి - రసాతల సుఖముల వర్ణనము

''మాతలీ! ఈ రసాతలము, పృథ్వియొక్క యేడవ తలము (క్రింది భాగము) నందలి లోకము - ఈ రసాతలలోకమునందు అమృతమునుండి పుట్టిన గోమాత యైన సురభి నివసించుచుండును.

"ఈ సురభి పృథివియొక్క సారమునుండి పుట్టిన ఆరు రసముల(రుచులు- తీపి - పులుపు - ఉప్పు - కారము - చేదు - ఒగరు ఇవి ఆరు రుచులు) సార భూతాంశములతో కూడి, సర్వశ్రేష్ఠము అనిర్వచనీయమునైన (ఇది యిట్టిది అని వర్ణించుటకు వీలు కానిది). ఏకరస రూపములో నున్న పాలు తన స్తనముల నుండి సర్వదా ప్రవహింపజేయుచుండును.

"మాతలీ! పూర్వము బ్రహ్మదేవుడు అమృతపానము చేసి తృప్తిచెంది, ఆ యమృతము యొక్క సార భాగమును బయటకు తీయునప్పుడు, ఆయన నోటినుండి అనింద్యమైన యీ సురభి పుట్టినది.

"భూమిమీద నిరంతరము ప్రవహించుచున్న సురభి యొక్క క్షీరధారల నుండి ఒక అనంతమైన తటాకము ఏర్పడెను. అదియే 'క్షీర సముద్రము' అనబడును.

"అది అతి పవిత్రమైనది క్షీరసాగరము నుండి పుట్టిన ఫేనము (నురుగు) పుష్పము వలె నుండును. ఆ ఫేనము క్షీర సముద్ర తీరములందు వ్యాపించి యుండును. ఆ ఫేనమును త్రాగుచు 'ఫేనపులు' (ఫేనమును త్రాగి తపస్సు చేయువారు) అను మునీశ్వరులు ఈ రసాతలమునందు నివసించు చుండెదరు.

"మాతలీ! ఫేనమును ఆహారముగా తీసుకొనుచున్న కారణముచేత ఆ మహర్షులు 'ఫేనపులు' అని ప్రసిద్ధులై యున్నారు వారు అతి కఠిన తపస్సులో మునిగి యుందురు. వారికి దేవతలు గూడ భయపడు చుందురు.

"మాతలీ! ఈ సురభికి నాలుగు ధేనువులు బిడ్డలుగా నున్నవి. అవి అన్ని దిక్కులలో నివసించు చున్నవి. అవి దిక్కులను పాలించుచు పోషించు చుండును.

"ఆ బిడ్డలలో 'సురూప' యను ధేనువు పూర్వ (తూర్పు) దిక్కును, 'హంసక' సౌరభి (సురభి బిడ్డ) దక్షిణ దిక్కును, మహా ప్రభావముగలిగి విశ్వ

రూపముగల 'సుభద్ర' యను సౌరభి వరుణ దేవుని నివాసస్థానమైన పశ్చిమ (పడమటి) దిక్కును, నాలుగవదైన సౌరభి 'సర్వకామదుఘ' యనబడు ధేనువు ధర్మజ్ఞుడైన కుబేరుని ఉత్తర దిక్కును క్రమముగా ధరించుచున్నవి.

(పూర్వ-పశ్చిమ దిక్కులకు తెలుగులో 'తూర్పు-పడమర' అని పేర్లు కలవు. కాని, ఉత్తర - దక్షిణ దిక్కులకు తెలుగులో పేర్లు వేరుగా లేవు. సంస్కృత నామములనే వాడుచున్నాము.)

''మాతలీ! దేవతలు అసురులతో కలిసి మందర పర్వతమును కవ్వముగా చేసికొని, ఈ ఆవుల పాలతో సంపన్నమైన క్షీర సాగరము అను క్షీర రాశిని చిలికిరి.

"అప్పుడు దానినుండి వారుణి (మద్యము), లక్ష్మీదేవి,అమృతము పుట్టెను. తరువాత, సముద్ర మథనమునుండి అశ్వములలో శ్రేష్ఠమైన 'ఉచ్చైశ్రవము' మణిరత్నమైన 'కౌస్తుభము' గూడ జన్మించెను.

"సురభి తన స్తనముల నుండి కురిసిన క్షీరములు సుధాపానము (పాలు త్రాగుట-సుధ యనగా పాలు అని కూడ అర్థము) చేయువారికి సుధరూపములో, 'స్వధ'ను భుజించు పితృదేవతలకు స్వధారూపములో నుండును.

(స్వధయనగా పితృదేవతల కొరకు శ్రాద్ధాది పితృ కర్మలతో హోమము ద్వారా సమర్పించు నేయి, అన్నము మున్నగు ఆహార ద్రవ్యములు. స్వధయను నామె దక్ష ప్రజాపతి కూతురు. ఆమె పితృదేవతల భార్య. జనులు పితృదేవతల తృప్తికొరకు వారి భార్య స్వధను అనేక హోమ ద్రవ్యముల ద్వారా సంతోష పరచి, వానిని ఆమె పేరనే అర్పించుచుందురు - ఇది స్వధాకారము.)

"అమృతమును భుజించు దేవతలకు ఈ సుధాపానము అమృత రూపముతోను నుండును.

''మాతలీ! 'నాగలోకములో - స్వర్గలోకములో - స్వర్గలోక విమానములో నివసించుటగూడ రసాతలలోకమునందు నివసించునంతటి సుఖము కలిగించదు అను గాథను రసాతల నివాసులు పూర్వము గానము చేసి యుండిరి. ఆ గాథను ఇప్పుడు గూడ లోకమునందు విద్వాంసులు గానము చేయుచుందురు.''

"అట్లు రసాతలమును గూర్చి మాతలికి వర్ణించి చెప్పి, నారదుడు తరువాతి కథ యిట్లు చెప్పదొడగెను:

నాగలోకమునందలి నాగుల వర్ణనము - నాగకుమారుడైన సుముఖునకు కన్యనిచ్చుటకు మాతలి నిర్ణయము

''మాతలీ! ఇది, నాగరాజు వాసుకిచేత సురక్షితమైయున్న - 'భోగవతి' యను పట్టణము. ఇంద్రుని 'అమరావతీ' పురమువలెనే ఈ నగరము గూడ అనేక సుఖసంపదలతో సంపన్నమైయున్నది.

"ఇదిగో, యితడు 'శేషుడు' అను పేరుగల నాగరాజు. ఇతడు లోక ప్రసిద్ధమైన తన తపోబలముచేత, మహిమచేతను సమస్త భూమండలమును సర్వదా తన శిరస్సులపైన ధరించి యుండును.

"ఈ శేషభగవానుని శరీరము కైలాస పర్వతము (వెండికొండ) వలె తెల్లగా నున్నది. ఈ నాగరాజునకు వేయితలలు (పడగలు) ఉన్నాయి. ఇతని నాలుకలు అగ్ని జ్వాలలవలె నుండును. మహాబలవంతుడైన యీ శేషనాగరాజు అనంత దివ్యరత్న భూషణములచేత అలంకరింపబడియున్నాడు.

''మాతలీ! ఈ నాగలోకమునందు 'సురస' యను పేరుగల నాగమాత యొక్క పుత్రులు 'నాగ గణము' అనువారు శోక- సంతాపము లేవియు లేకుండ నివసించు చుందురు. వీరి రూపము-వర్ణము-భూషణములు అనేక విధములుగా నున్నవి. ఈ నాగులు వేల సంఖ్యలో నిచట నుండెదరు. వీరందరు అతి బల వంతులు - భయంకర స్వభావముగలవారుగా నున్నారు.

వీరిలో కొందరి శరీరములందు మణులయొక్క, మరికొందరి దేహము లందు స్వస్తికము (పడగమీద, కొనలుగల అర్ధచంద్రాకారము గలది) యొక్క కొందరి శరీరములందు చక్రము యొక్క, మరికొందరి దేహములందు కమండ లువు యొక్కయు చిహ్నములు (గురుతులు) ఉండును.

"కొందరు - కొందరు వేయి శిరస్సులు, ఐదునూర్ల ముఖములు, నూరు తలలు, మూడు శిరస్సులు; రెండు, ఐదు, ఏడు శిరస్సులు (పడగలు) గలవారుగా నున్నారు.

"కొందరికి పెద్ద పెద్ద ఫణములు (పడగలు),కొందరికి మిక్కిలి పొడవైన శరీరములు, కొందరికి పర్వతములవంటి స్థూల శరీరములు గలవు.

"ఈ నాగలోకమునందలి ఒక్కొక్క వంశమునందు అనేక సహస్ర-లక్ష అర్బుద (పది లక్షలు) ముల సంఖ్యలో నాగులున్నారు. వారిని గూర్చి జ్యేష్ఠాది క్రమముగా చెప్పెద వినుము:

''వాసుకి - తక్షక - కర్కోటక - ధనంజయ - కాళియ - నహుష కంబల - అశ్వతర - బాహ్యకుండ - మణినాగ - అపూరణ - ఖగ - వామన - ఏల - పత్ర - కుకుర - కుకుణ - ఆర్యక - నందక - కలశ - పోతక - కైలాసక - పింజరక - ఐరావత - సమనోముఖ - దధిముఖ - శంఖ - నంద - ఉపనంద - ఆప్త - కోటరక శిఖి - నిష్ఠూరిక - తిత్తిరి - హస్తిభద్ర - కుముద - మాల్య పిండక - పద్మ (ఈ పేరుగల నాగులు ఇద్దరు) - పుండరీక - పుష్ప - ముద్గర పర్ణక - కరవీర - పీఠరక - సంవృత్త - వృత్త పిండార - బిల్వపత్ర -మూషి కాద - శిరీషక - దిలీప - శంఖశీర్ష - జ్యోతిష్క - అపరాజిత - కౌరవ్య - ధృతరాష్ట్ర - కుహుర - కృశక - విరజ - ధారణ - సుబాహు - ముఖర - జయ - బధిర - అంధ - విశుండి - విరస - సురస'' - అను పేర్లుగల అరువది యేడుగురు గాక యింకను ననేక నాగులు కశ్యప వంశ సంజాతులు ఉన్నారు.

''మాతలీ! ఈ నాగలోకమునందు నీ పుత్రికి తగిన వరుడెవడైన ఉన్నాడేమో చూడవచ్చు.''

''దుర్యోధనా! అప్పుడు మాతలి స్థిరముగా నొక నాగ కుమారుని ఏకాగ్రతతో పరీక్షించి, ప్రసన్నుడై నారదునితో నిట్లనెను:

"దేవర్షి! యిక్కడ 'కౌరవ్య - ఆర్యక' నాగుల ముందు భాగమునందు కాంతిమంతుడుగా నిలిచి యున్న నాగకుమారుడు సుందరుడుగా నున్నాడు ఇతడు ఎవరి కులమునందు పుట్టిన వాడు? ఇతని తల్లి దండ్రులెవరు? ఏ నాగ వంశమునకు చెందినవాడు? గొప్ప ధ్వజమువలె నుండు నితడు ఏ వంశపు గౌరవమును పెంపొందించుచున్నాడు?

"నారదమునీశ్వరా! ఇతడు తన యేకాగ్రత, ధైర్యము. రూపము - యౌవనము - వీటి చేత నా మనస్సునకు నచ్చియున్నాడు. ఇతడే నా కూతురు 'గుణకేశి'కి పతి యగుటకు యోగ్యుడుగ నున్నాడు.''

''దుర్యోధనా! మాతలిని సుముఖుని చూచుట చేత ప్రీతి చెందిన వానినిగా చూచి నారదుడు ఆ నాగకుమారుని గురించి యిట్లు చెప్పదొడగెను:

"మాతలీ! ఇతడు 'ఐరావతుడు' అను నాగరాజు కులమునందు జన్మించినాడు. ఇతని పేరు 'సుముఖుడు.' ఇతడు 'ఆర్యకుడు' అను నాగరాజునకు పౌత్రుడు. ఆతనికి వామనుడు, దౌహిత్రుడు (కూడ కొడుకు). ఇతని తండ్రి పేరు 'చికురుడు'. చికురుని ఈ మధ్యనే గరుడుడు సంహరించెను.''

''దుర్యోధనా! ఆ మాటలు విని మాతలి ప్రసన్నుడై నారదునితో నిట్లనెను :

''దేవర్షి సత్తమా! యీ నాగశ్రేష్ఠుడు నాకు అల్లుడుగానగుటకు యోగ్యుడు. ఇతడు నచ్చినాడు. ఇతనిని చూచి నేను చాల ప్రసన్నుడనైతిని. ఇతని కొరకే నీవు ప్రయత్నించుము.

"మహాముని! నేను ఈ నాగునకే నా ప్రియపుత్రిని ఇచ్చి వివాహము చేయ గోరుచున్నాను."

''దుర్యోధనా! అట్లు మాతలి చెప్పిన మాటలు విని నారద మునీంద్రుడు నాగరాజైన ఆర్యకునితో నిట్లనెను:

నాగరాజైన ఆర్యకునితో నారదుడు మాతలి కన్యతో సుముఖుని వివాహ ప్రస్తావనము చేయుట-మాతల్యాదులు ఇంద్రునిచేత సుముఖునకు దీర్ఘాయువు ఇప్పించుట - గుణకేశ - సుముఖుల వివాహము

''నాగరాజా! ఇతడు ఇంద్రునకు ప్రియమిత్రుడు. అతనికి రథ సారథి. ఇతని పేరు మాతలి. ఇతడు సుశీలుడు-పవిత్రుడు - సమస్త సద్గుణపరిపూర్ణుడు - తేజస్వి - బలపరాక్రమ సంపన్నుడు - విశేషించి ఇంద్రునకు అంతరంగికుడైన మంత్రిగా నున్నాడు. ఇంద్రుడు చేయు ప్రతి యుద్ధమునందున్న ఇతడు తోడుగా నుండును. ఇతని ప్రభావము ఇంద్రుని మహిమకన్న కొంచెమే తక్కువ.

"ఇంద్రునకు ఇతడు దేవాసుర యుద్ధమునందు సారథిగా ఉండి వేయి గుఱ్ఱములు కట్టబడిన జయశీలమైన రథమును తోలెను. అశ్వముల నితడు మానసిక సలకల్పము చేతనే నడుపుచు, అదుపులో పెట్టుచుండును. ఇతడు తన అశ్వములచేత జయించిన శత్రువులనే యింద్రుడు బాహుబలముచేత జయించుచుండును. తొలుత నితడు శత్రువులను కొట్టిన తరువాతనే బలజిత్తైన యింద్రుడు కొట్టుచుండును.

''ఆర్యకా! ఇట్లు బలసంపన్నుడైన యీ మాతలికి ఒక కన్యక ఉన్నది. ఆమె భూమండలములో అసమాన రూపసౌందర్యవతి. సత్యాది సద్గుణసంపన్నురాలు. ఆమె పేరు 'గుణకేశి' యని ప్రఖ్యాతమై యున్నది.

''నాగరాజా! యీ మాతలి మిక్కిలి ప్రయత్నము చేయుచు తన బిడ్డకు వరుని వెదకుట కొరకు మూడు లోకములందును సంచరించుచు నిక్కడకు వచ్చినాడు నీ పౌత్రుడు (మనుమడు - కొడుకుకొడుకు) 'సుముఖుడు' ఇతనికి నచ్చినాడు. అతడు ఇతని బిడ్డకు పతి యగుటకు యోగ్యుడని యితనికి తోచినది.

"నీ మనుమనినే ఇతడు ఇష్టపడినాడు. నీకు కూడ ఈ సంబంధము అనుకూలమని తోచిన యెడల శీఘ్రమే యితని కన్యను మీ సుముఖునకు పెండ్లి చేసి తెచ్చి కొనుము.

"విష్ణుభగవానుని ఇంటిలో లక్ష్మీదేవివలె, అగ్నిదేవుని యింటిలో స్వాహాదేవివలెను మీ యింటిలో గుణకేశి ప్రతిష్ఠ గలదిగా నుండుగాక! కనుక నీ పౌత్రునికొరకు నీవు గుణకేశిని పరిగ్రహింపుము.

"ఇంద్రునకు శచిదేవివలె నీమనుమనికి ఈ గుణకేశి యోగ్యపత్నిగా నుండగలదు. నీ యెడల, ఐరావతునియెడల మాకు గౌరవము కలదు.

"సుముఖుడు గూడ పవిత్రుడు, మంచి శీలము గలవాడు, ఇంద్రియ నిగ్రహాదిగుణములచేత పరిపూర్ణుడు. కాబట్టి, తండ్రిలేనివాడైనను, మా కన్య కొరకు ఇతనిని వరించితిమి.

''ఆర్యకా! ఈ మాతలి స్వయముగ నీ వద్దకు కన్యక నిచ్చుటకు వచ్చినాడు. కనుక నీవు గూడ ఇతనిని గౌరవించుము."

''దుర్యోధనా! అప్పుడు నాగరాజైన ఆర్యకుడు ప్రసన్నుడై దీన భావముతో నారదునితో నిట్లనెను:

''నారదమహర్షీ! నా పుత్రుడు చంపబడెను. పౌత్రునకు గూడ ఆ విధముగనే మృత్యువు ఆసన్నమై యున్నది. కాబట్టి 'గుణకేశి'ని నా యింటి కోడలుగా తీసికొనుటకు నేనెట్లు అంగీకరింతును?

"మహర్షీ! ఈ నీ మాటలపై నాకు మిక్కిలి ఆదరము గలదు. మాతలి యింద్రునితో నుండువాడు. అతనికి మిత్రుడు. కనుక, నిత డెవనికి ప్రియుడు కాకుండును? కాని, గుణకేశిని సుముఖునకు భార్యగా తీసికొనజాలకుండుటకు కారణము అతి దుర్భరముగా నున్నది.

''సుముఖుని తండ్రి నాకు కొడుకు. అతనిని గరుడుడు చంపి తినెను. ఈ దుఃఖముచేత మేము బాధపడుచుండగా. గరుడుడు ఒకనాడు ఈ మార్గముగా పోవుచు, 'రెండవ నెలలో నేను ఈ సుముఖుని గూడ భక్షించెదను' అని యనెను.

"అతడు అవశ్యముగా నట్లే చేయును. ఎందుకనగా, మేము గరుడుని నిశ్చయము బాగుగా నెరుగుదుము. అతడట్లు చెప్పుటచేత నా సంతోషమంతయు నశించెను."

''దుర్యోధనా! ఆర్యకుడు చెప్పిన మాటలు విని మాతలి యతనితో నిట్లనెను:

''ఆర్యకా! నేనీ విషయములో విచారించితిని. నేనైతే, నీ పౌత్రుని నా అల్లునిగా జేసికొనుటకు నిశ్చయించినాను. కనుక, ఈ నాగకుమారుడు నాతోను, నారద మహామునితోను ఇంద్రుని వద్దకుపోయి అతని దర్శనముచేయుగాక!

"అ తరువాత ఇతని ఆయుస్సు విషయమై మిగిలిన కార్యమును నేను చూచకొనెదను. గరుడుడు ఇతనిని చంపకుండ ప్రయత్నించెదను.

"కనుక నాగరాజా! నీకు మేలగుగాక! సుముఖుని, ఇప్పుడు నాతోపాటు ఇంద్రునికడకు పంపుము."

''దుర్యోధనా! మాతలి అట్లు చెప్పిన తరువాత అందరున్ను సుముఖుని తోడ్కొని యింద్రునికడకుపోయి అతనిని దర్శించిరి. అదృష్టవశాత్తు అప్పుడు దేవేంద్రునితో విష్ణుభగవానుడు గూడ స్వర్గమునందుండెను.

"అప్పుడు నారదుడు మాతలి వృత్తాంతమంతయు నింద్ర విష్ణువులకు చెప్పెను."

అట్లు కణ్వుడు దుర్యోధనునకు చెప్పెనని వైశంపాయనుడు జనమేజయునకు చెప్పి, తరువాత వృత్తాంతమునిట్లు చెప్పదొడగెను:

శ్రీవిష్ణువు గరుడ గర్వభంగము చేయుట - దుర్యోధనుడు కణ్వుని యుపదేశమును తిరస్కరించుట

"జనమేజయా! ఆ మాటలు విని విష్ణువు ఇంద్రునితో నిట్లనెను:

"దేవేంద్రా! నీవు సుముఖునకు అమృతము నిచ్చి యితనిని దేవతలతో సమానునిగా చేయుము. ఆ విధముగా చేసినచో, మాతలి - నారదుడు సుముఖుడు ఈ ముగ్గురు గూడ తమ యిచ్ఛను నెరవేర్చు కొనెదరు."

ఆ మాటకు, ఇంద్రుడు గరుడుని పరాక్రమము నెరిగినవాడగుటచేత విష్ణువుతో ''మీరే అమృతమును సుముఖునకు ఇవ్వగలరు'' అని యనెను.

"ఆ మాటకు విష్ణువు ఇంద్రునితో నిట్లనెను:

''దేవరాజా! నీవు ఈ చరాచరాత్మకమైన సమస్త ప్రపంచమునకు ఈశ్వరుడవు. నీవు ఇచ్చిన ఆయుస్సును తీసివేయగల సాహస మెవరికున్నది?''

"శ్రీవిష్ణుభగవానుని మాటలు విని యింద్రుడు, సుముఖునకు పరిపూర్ణమైన ఆయుస్సును ఇచ్చెను. కాని, అమృతము నీయలేదు.

''దుర్యోధనా! అట్లు సుముఖుడు ఇంద్రుని నుండి వరమును పొంది సుముఖుడై (సంతోషించిన ముఖముగలవాడై) గుణకేశిని పెండ్లియాడెను.

"నారదుడు - ఆర్యకుడున్ను తమ కార్యమును నెరవేర్చుకొని, యింద్రుని యాజ్ఞ తీసికొని సంతోషముతో వెడలిపోయిరి.''

జనమేజయా! అట్లు కణ్వముని తరువాతి వృత్తాంతమును దుర్యోధనునకు ఈ విధముగా చెప్పదొడగెను:

''దుర్యోధనా! మహాబలవంతుడైన గరుడుడు ఈ సమాచారమంతయు జరిగినది జరిగినట్లుగా (ఇంద్రుడు సుముఖునకు దీర్ఘాయువు ఇచ్చినట్లు) వినగానే, అత్యంత క్రుద్ధుడై తన రెక్కల ప్రచండ వాయువుచేత మూడు లోకములను కంపింపజేయుచు నింద్రుని సమీపమునకు పరుగెత్తుచుపోయి యతనితో నిట్లనెను:

''భగవాన్! నన్ను అవమానపరచి, నా జీవికకు ఏల భంగము కలిగించితివి? నా యిచ్ఛాను సారముగా కార్యములు చేయుమని యొకసారి నీవే నాకు వరము నిచ్చి, యిప్పుడిట్లు ఎందుకు మాట తప్పితివి?

''సమస్త ప్రాణుల సృష్టి చేసినప్పుడు బ్రహ్మదేవుడు నాకు అహారమును సర్పములని నిశ్చయించెను. నీవిప్పుడెందుకు దానికి బాధకలిగించుచున్నావు?

''నేను ఆ మహానాగమును నాభోజనము కొరకై యెన్నుకొని యుంటిని. దాని కొరకు నేనొక సమయము గూడ నిశ్చయించుకొని యుంటిని. దాని చేతనే నా కుటుంబ పోషణము చేయవలసి యుండెను. నా కుటుంబము పెద్దది, నీ వరముచేత సుముఖుడు దీర్ఘాయువైన యెడల, అతనికి బదులుగా నేను మరియొక నాగమును హింసింపజాలను.

''దేవరాజా! నీవు స్వేచ్ఛతో నీ యిష్టము వచ్చినట్లు ఆడుచున్నావు. ఇప్పుడు నాతోగూడ నా పోషణలో నున్న నాకుటుంబము వారు, నా సేవకులు భోజనము లేక చచ్చి పోయెదరు. నీవు సంతుష్టుడవు కమ్ము.

''దేవరాజా! నేను మూడులోకములను పాలించుటకు అర్హుడనైనప్పటికిన్ని ఇతరులకు సేవచేయుటకు అంగీకరించి యున్నాను గాబట్టి, యింతకన్న వేరు విధముగా వ్యవహరించను.

''త్రిలోకనాథా! నీవు అండగానుండగా, నా జీవికను, విష్ణుభగవానుడు గూడ ఆపుజేయుటకు కారణము కాజాలడు. ఎందుకనగా, మూడు లోకముల రాజ్యభారము నీపైననే యున్నదిగదా !

''నా తల్లి గూడ దక్ష ప్రజాపతి బిడ్డయే, నా తండ్రిగూడ కశ్యపుడే. నేనుగూడ అనాయాసముగా ఈ సమస్త లోకములను భరించి పాలించగలను. నా బలముగూడ చాల గొప్పది. సమస్త ప్రాణులు ఏకమైనను నాబలమును ఓర్వ జాలరు. దైత్యులతో యుద్ధము జరిగినప్పుడు నేను గూడ నా పరాక్రమమును ప్రకటించియుంటిని. 'శ్రుతశ్రీ - శ్రుత సేన - వివస్వాన్ - రోచనాముఖ - ప్రస్వత కాలకాక్ష' నామకులైన దైత్యులను నేను గూడ సంహరించియుంటిని.

''దేవరాజా! ఇంతటి బలపరాక్రములు గలవాడనైనను రథధ్వజమునందు ఉండి, విధిలేక యత్నపూర్వకముగా నీకు తమ్ముడైన విష్ణువును సేవించు చున్నాను.

''వామనావతారమునందు శ్రీమహావిష్ణువు అదితీదేవికి,ఇంద్రునకుతమ్ముడై జన్మించినాడు. అందుచేతనే విష్ణువునకు 'ఉపేంద్రుడు' అను పేరు ఏర్పడినది)

"ఆయనకు వాహనముగా ఉండి అయనను మోయుచున్నాను. ఈ కారణము చేతనే నీవు నన్ను అవమానపరచుచున్నావు.

"భగవంతుడైన విష్ణువుయొక్క భారమును మోయుటకు నేను దప్ప మరి యెవరున్నారు? నాకంటె అధిక బలవంతు డెవడున్నాడు? నేను విశిష్టమైన శక్తి గలవాడనై యుండియు నా బంధువులతోపాటు విష్ణుభగవానుని భారమును వహించు చుందును.

"నన్ను అవమాన వరచినీవు నా భోజనమును అపహరించితివి. దానిచేత నా గౌరమంతయు నశించెను. దీనికంతటికి కారణభూతులు నీవు, శ్రీహరియే.

"వాసవా! అదితి గర్భమునుండి జన్మించిన దేవతలందరు బలపరాక్రమ సంపన్నులు. వారందరిలోను బలములో నీవు అధికుడవు. అట్టి నిన్ను నేను నా ఒక్క రెక్కయొక్క ఒక భాగమునందే, యేలాటి అలసటలేకుండ మోయు చుందును. కాబట్టి, మన యిరువురిలో నెవడు అధిక బలము గలనాడో నీవే విచారించుము."

"దుర్యోధనా! గరుడుని మాటలు భయంకరమైన దుష్ఫలితమును తెచ్చునవిగా నుండెను. ఆ మాటలు విని రథాంగపాణియైన శ్రీమహావిష్ణువు, ఎప్పుడు కూడ క్షోభము చెందని గరుడుని క్షోభింపజేయదలచి యిట్లనెను:

"గురుత్మన్! నీవు అతి దుర్బలుడవు. కాని, నిన్ను నీవు అతి బలవంతునిగా తలచు చున్నావు. పక్షిరాజా! నా యెదుట ఇకనెప్పుడు గూడ నీవు ఆత్మ ప్రశంస చేసికొనకుము.

''మూడు లోకములు ఏకమైనను అవి నా శరీరభారమును వహింప జాలవు. కనుక, నన్ను నేను మోసికొనుచు నిన్ను గూడ వహించుచుందును.

"నీవు ఇప్పుడు నా కుడిచేతి భారమును మాత్రము మోయుము. చాలును. ఈ ఒక్క బాహువును మాత్రమే నీవు మోయగలిగిన యెడల, నీ యాత్మ ప్రశంస యంతయు సఫలమైనట్లే భావించ వచ్చును."

''దుర్యోధనా! ఇట్లు చెప్పి భగవంతుడైన విష్ణువు గరుత్మంతుని భుజముపైన దక్షిణబాహువును ఉంచెను. దాని బరువు చేత బాధపడి గరుత్మంతుడు

క్రిందపడి మూర్ఛిల్లెను. గిరికానన సహితమైన సమస్త భూమండలమునకున్నంత బరువు. శ్రీమహావిష్ణువు యొక్క ఒక బాహువునకే యుండును.

"అత్యంత బలిశాలియైన శ్రీవిష్ణువు గరుడుని బలపూర్వకముగ అణచలేదు. కనుకనే గరుడుని జీవితమును ఆయన నశింపజేయలేదు. శ్రీ విష్ణువు యొక్క మహా బాహు భారముచేత గరుడుడు మిక్కిలి పీడితుడై నోరు తెరచుకొనెను. అతని శరీరమంతయు శిథిలమయ్యెను. అచేతనుడైనట్లు తన రెక్కలను జార విడిచెను.

''దుర్యోధనా! అప్పుడు గరుత్మంతుడు విష్ణు భగవానుని పాదములకు నమస్కరించి యిట్లనెను:

"భగవన్! ప్రపంచములోని బలమంతయు మూర్తమంతమైనట్లున్న నీ భుజమును అలవోకగా నాపైన ఉంచితివి. ఆ మాత్రము చేతనే నేను పిండి పిండియై భూతలమునందు పడిపోయితిని.

"దేవా! నేను నీ ధ్వజమునందు ఉండు సామాన్య పక్షిజాతివాడను. ఇప్పుడు నీ బలపరాక్రమములచేత పీడింపబడి వ్యాకులము చెంది, అచేతనునివలె నైతిని. నా యపరాధమును క్షమింపుము.

"దేవా! నీ సర్వోత్కృష్టమైన బలమును నేను తెలియజాలకుంటిని. ఆ యజ్ఞానము చేతనే నేను ఇన్ని నాళ్ళుగా, నా బలపరాక్రమములకు ఇతరుల బలపరాక్రమములు సమానములు కావని వారికన్న మిక్కిలి బలవంతుడననియు పెద్దగా అనుకొనియుంటిని.''

"దుర్యోధనా! తరువాత విష్ణుభగవానుడు, గరుడునిపై దయదలచి యతనితో 'ఇక నెప్పుడు గూడ నిట్లు గర్వపడకుము' అని చెప్పెను.

"తరువాత శ్రీవిష్ణువు సుముఖుని, తన కాలిబొటన వ్రేలిచేత ఎత్తి గరుత్మంతుని వక్షస్థలమునందుంచెను. అప్పటి నుండియే గరుత్మంతుడు సర్వదా సర్పమును తనతోపాటు ఉంచుకొని యున్నాడు.

"ఈ విధముగా గరుడుడు విష్ణుబలముచేత ఆక్రమింపబడి తన అహంకారమును విడిచెను.

"దుర్యోధనా! ఆ విధముగానే, నీవు గూడ, యుద్ధభూమియందు పాండవ వీరులయెదుట ఎంతవరకు నిలువవో, అంతవరకే జీవించగలవు.

"వీరయోధులలో శ్రేష్ఠుడైన వాయుపుత్రుడు భీముడు మహాబలసంపన్నుడు అర్జునుడు ఇంద్రపుత్రుడు ఈ యిద్దరు కలిసినచో యుద్ధమునందు ఎవరిని చంపజాలరో చెప్పుము.

"ధర్మస్వరూపుడైన విష్ణువు (కృష్ణుడు) వాయువు - ఇంద్రుడు-యమధర్మ రాజు - ఇద్దరు అశ్వినీకుమారులు - ఇందరు దేవతలు నీకు విరుద్ధముగా నున్నారు. ఈ దేవతల వైపు చూచుటకు గూడ నీవు ఏ కారణముచేత సాహసము చేయగలవో చెప్పుము.

"కాబట్టి దుర్యోధనా! ఈ విరోధముచేత నీకు లభించబోవునదేమియు లేదు. పాండవులతో సంధి చేసికొనుము. శ్రీకృష్ణభగవానుని సహాయకునిగా చేసికొని, యీయన ద్వారా ఇప్పుడు నీ కులమును రక్షించుకొనవలెను సుమా!

"మహా తపస్సంపన్నుడైన నారదుడు అప్పుడు భగవంతుడైన శ్రీమహావిష్ణువు యొక్క మహిమను ప్రత్యక్షముగా చూచినాడు. శంఖ - చక్ర - గదాధరుడు భగవంతుడునైన శ్రీమహావిష్ణువే ఈ శ్రీకృష్ణభగవానుడు సుమా!"

జనమేజయా! కణ్వమహాముని చెప్పిన మాటలను విని దుర్యోధనుడు కనుబొమ లెగురువేయుచు దీర్ఘముగా నిట్టూర్చి కర్ణుని చూచుచు బిగ్గరగా నవ్వజొచ్చెను.

ఆదుర్బుద్ధియైన దుర్యోధనుడు కణ్వముని మాటలను లెక్కచేయక అవమానపరచుచు, ఏనుగు తొండమువంటి తన తొడపైన చేతితో చరచుచు నిర్లక్ష్యముగా కణ్వమహామునితో నిట్లనెను:

''మహర్షీ! నన్ను ఈశ్వరుడెట్లు సృష్టించెనో, నా భవిష్యత్తు ఎట్లున్నదో, నా గతి యెట్టిదో, అట్లే నేను నడచుకొనెదను. నీవు పలుకునట్టి యీ పనికిమాలిన మాటలు నన్నేమి చేయగలవు?"

యమధర్మరాజు విశ్వామిత్రుని పరీక్షించుట - విశ్వామిత్రునకు గురుదక్షిణ యిచ్చుటకు గాలవుని హఠము

అట్లు వైశంపాయనుడు చెప్పగా జనమేజయుడు మరల వైశంపాయన మునిని ఇట్లు ప్రశ్నించెను:

''భగవన్! దుర్యోధనునకు అనర్థకములైన కార్యములు చేయుట యందు మిక్కిలి పట్టుదల యుండెను ఇతరుల ధన సంపదల యందు అతనికి చాల లోభము ఉండెను గనుక మోహము కలిగెను. దుర్జనులయందే అతనికి ప్రేమ యుండెను. మరణించుటకే యతడు నిశ్చయించుకొనియుండెను. అతడు కుటుంబ జనులకు దుఃఖదాయకుడు, బంధువుల శోకమును పెంపొందించువాడు, మిత్రులకు క్లేశమును పొందించు వాడు, శత్రువులకు సంతోషము పెంచువాడు గాను నుండెను.

"ఇట్లు చెడ్డ మార్గములో సంచరించు వానిని, బంధువులు ఎందుకు నివారించలేదు? మిత్రులు, వ్యాస భగవానుడు, భీష్మ పితామహుడున్ను అతని యందు మైత్రీ భావము ఎందుకు చూపిరి? వారతని నెందుకు దుష్కార్యము నుండి వారించలేదు?"

జనమేజయుని ప్రశ్నములకు వైశంపాయనుడిట్లు బదులు చెప్పెను:

''జనమేజయా! వేదవ్యాస భగవానుడు, భీష్మ పితామహుడు, మిత్రులు అందరుగూడ అతనికి యోగ్యము - హితము నైన కర్తవ్యమును బోధించిరి. వీరేకాక, నారద మహాముని కూడ అనేక విధములుగా నతనికి ఉపదేశింపదలచి యీ విధముగా చెప్పెను:

''దుర్యోధనా! నిష్కారణ కృపతో నీ హితము కోరువారి మాటలును సావధానముగా వినుము. మహా సంకటావస్థ కలిగినప్పుడు బంధువు లెవ్వరు గూడ ఆదుకొనరు. అప్పుడు మిత్రుడొక్కడే నిలిచి సహాయము చేయగలడు గనుక హితమును కోరు మిత్రుడు - హితమును వినువాడును దుర్లభులు సుమా!

"ఇప్పుడు నీకు మిత్రుల ఉపదేశమును వినుట చాల ఆవశ్యకమని నాకు తోచుచున్నది. కనుక నీవేదో యొక మాటపైననే, దురాగ్రహముతో పట్టుదల వహింప గూడదు. ఈ మొండిపట్టు యొక్క ఫలితము చాల భయంకరముగా నుండును సుమా!

"ఈ విషయములో ఉదాహరణముగా నీకొక కథ చెప్పెద వినుము :

"పూర్వము 'గాలవ' మహాముని, తన దురాగ్రహము హఠము కారణముగా పరాజయమును పొందిన యితిహాసమును చెప్పెదను. దానివలన నీకు విషయము బోధపడును.

''పూర్వము సాక్షాత్తు యమధర్మరాజు వసిష్ఠుని రూపమును ధరించి, తపస్సు చేయుచున్న విశ్వామిత్రుని పరీక్షించుటకు అతని కడకు పోయెను. ఆ కపట వసిష్ఠుడు ఆకలిగొన్నట్లు నటించుచు భోజనము పెట్టుమని విశ్వామిత్రుని కోరెను.

"అప్పుడు విశ్వామిత్రుడు మిక్కిలి తొందరపాటుతో, ఉత్తమాన్నమును అతిథిగా వచ్చిన వసిష్ఠునకు అర్పింపదలచి 'చరు' (హోమద్రవ్యమును వండు పాత్రము) పాత్రలో వండుటకు మొదలిడెను. ఆ యన్నము ఉడుకుదాక ఆ కపట యతి వేచి యుండక ఇతర మునీశ్వరులిచ్చిన అన్నము తినెను.

అప్పుడు విశ్వామిత్రుడు గూడ ఉష్ణమైన అన్నమును తీసికొని అతిథి సేవకై వచ్చెను. అప్పుడు యమధర్మరాజు, 'నేను భుజించినాను. నీ యన్నము ఉండనిమ్ము' అని చెప్పి వెడలిపోయెను.

"విశ్వామిత్రుడట్లే ఆ యన్నమును పట్టుకొంచి నిలిచి యుండెను. తన రెండు చేతుల చేత ఆ భోజన పాత్రను శిరస్సు మీద పెట్టుకొని, ఆశ్రమ సమీపమునందే వాయుభక్షణము చేయుచు చెట్టు మొద్దు (మూలభాగము) వలె నిశ్చేష్టుడై నిలిచియుండెను.

"విశ్వామిత్రుని ప్రసన్నుని చేయుటకు, అతనిపైన ప్రేమ భక్తి శ్రద్ధలు గల శిష్యుడైన 'గాలవ' మహాముని విశ్వామిత్రుని సేవించు చుండెను.

''దుర్యోధనా, ఆ తరువాత నూరు సంవత్సరములకు మరల యమధర్మ రాజు వసిష్ఠ వేషముతో విశ్వామిత్రుని కడకు భోజనేచ్ఛతో వచ్చెను.

"అప్పుడు విశ్వామిత్రుడు అన్న పాత్రమును తలపైన ఉంచుకొని అట్లే నిలిచి నూరు సంవత్సరములుగా వాయుపానము చేయు చుండుటను చూచి, ధర్మదేవుడా భోజన పాత్రమును తీసికొని చూచెను.

"అప్పుడా యన్నము అప్పుడే చేయబడినట్లు ఉష్ణముగా నుండెను. ఆ యన్నమును తిని యమధర్మరాజు "బ్రహ్మర్షీ! నీ యెడల నేను ప్రసన్నుడనైతిని" అని చెప్పి వెడలిపోయెను.

"క్షత్రియత్వము నుండి విడిపోయి బ్రాహ్మణత్వమును పొందిన విశ్వామిత్రుడు ధర్మదేవుని మాటలు విని మిక్కిలి సంతుష్టుడయ్యెను.

"అంతవరకు అట్లే తనకు సేవ చేయుచున్న తన శిష్యుని గాలవ మునిని చూచి విశ్వామిత్రుడు సంతోషించి యిట్లనెను:

''వత్సా! గాలవా! ఇప్పుడు నీవు ఇచ్చ వచ్చిన చోటికి పొమ్మని ఆజ్ఞ యిచ్చుచున్నాను. నీ యెడల ప్రసన్నుడనైతిని'' అని ఆదేశించెను.

"అప్పుడు గాలవుడు ఇట్లనెను:

''భగవాన్! మీకు నేను గురుదక్షిణగా ఏమి యిత్తును? ఎందుకనగా, దక్షిణతో కూడిన కర్మలే సఫలమగును. దక్షిణయిచ్చువానికే సిద్ధి లభించును. వాడే స్వర్గమునందు యజ్ఞఫలమును పొందగలడు. వేదములలో దక్షిణయే శాంతిప్రదమని చెప్పబడినది. కాబట్టి, పూజ్యగురుదేవా! నేను మీకు ఏ దక్షిణ తెచ్చి యివ్వవలెనో ఆజ్ఞ ఈయ వేడెదను.''

''దుర్యోధనా! గాలవుని సేవలకు సంతుష్టుడైన విశ్వామిత్రుడు గాలవునకు వశుడై యుండెను. అందుచేత, గాలవుడు చేసిన ఉపకారమును తలచుచు, విశ్వామిత్రుడతనితో మాటిమాటికి 'పొమ్ము పొమ్ము' అని యనెను.

"అనేక పర్యాయములు పొమ్మని చెప్పుచున్న విశ్వామిత్రుని, గురుదక్షిణ యేమి యిత్తును? అని గాలవుడు గూడ మాటిమాటికి అడుగజొచ్చెను.

"అట్లు నిర్బంధించుచున్న గాలవునిపై కోపము వచ్చి విశ్వామిత్రుడు ఇట్లనెను:

''గాలవా! శరీరమంతయు చంద్రునివలె తెల్లగా నుండి కర్ణములు మాత్రము నల్లగా నుండునట్టి యెనిమిది నూర్ల అశ్వములను నాకు గురుదక్షిణగా వెంటనే తెచ్చి యిమ్ము. జాగుచేయకుము."

గాలవుని చింత - గరుడుని ఊరడింపు :

అట్లు చెప్పి నారదుడు దుర్యోధనునకు తరువాతి కథ యిట్లు చెప్పదొడగెను:

''దుర్యోధనా! గాలవ ముని అప్పటినుండి ఎక్కడను కూర్చొనక, శయనించక భోజనము చేయక యుండెను,

"గాలవుడు చింతాశోకములలో నిమగ్నుడైయుండుటచేత శరీరమంతయు పాలిపోయి తెల్లబారినది. ఎముకలు, చర్మము మాత్రమే మిగిలినవి. రక్తమాంస

ములు నశించినవి. గాలవముని చింతా శోకాగ్నిలో దహింపబడుచు నిట్లు చింతించెను:

''నాకు ధన మిచ్చు మిత్రుడెవడు? నాకెక్కడినుండి ధనము ప్రాప్తించును. ఎక్కడ నా కొరకై ధనసంగ్రహము చేయబడియుండును? చంద్ర సమానములైన యెనిమిది నూర్ల శ్వేతాశ్వములు ఎక్కడినుండి నాకు లభించును? ఇట్టి పరిస్థితిలో నాకు భోజనము ఎట్లు రుచించును? సుఖమును అనుభవించు నిచ్ఛయిక నా కెక్కడిది? ఈ జీవితముతో నిక నాకు ఏమి ప్రయోజనము?

"నా ప్రాణములను సురక్షితములుగా నుంచుకొనుటకు నాకు గల ఉత్సాహముగూడ నశించినది. సముద్రపు ఆవలి యొడ్డునకుగాని, భూమండలమునందు చాల దూరము నిర్జన ప్రదేశమునకు గాని పోయి నా శరీరమును విడిచెదను. ఇప్పుడు నేను జీవించుటవలన లాభమేమి?

"నిర్ధనుడుగా నుండి, తన కోరికలను తీర్చుకొనజాలక నానా విధములైన శుభకర్మల ఫలములను పొందజాలక, ఋణ భారమును మాత్రము మోయుచు నున్నవాడు ఏలాటి ప్రయత్నము చేయక జీవించి యుండుటవలన అతనికి ఏ సుఖము కలుగును?

''తన యిచ్ఛానుసారముగా మైత్రీ సంబంధమును పెంచుకొని, మిత్రుల ధనము ననుభవించి ప్రత్యుపకారము చేయజాలనివాడు జీవించుటకంటె మరణించుట మేలు.

"నేను ఈ కార్యమును చేసెదను" అని ప్రతిజ్ఞ చేసి ఆ ప్రతిజ్ఞ చెల్లించజాలక, అసత్య భాషణముతో దహింపబడినవాడు చేసిన 'ఇష్టము', (యజ్ఞకర్మము), 'పూర్తము' (నూతులు - బావులు - తటాకములు త్రవ్వించుట - గుడిని నిర్మించుట - తోటలను వేయించుట) - అన్నదానము నశించిపోవును.

"సత్యహీనుని జీవితము మరణించినవానితోనే సమానము. అసత్యపరునికి సంతానము గలుగదు. అసత్యవాదికి ప్రభుత్వము (అధికారము) గూడ లభించదు. కనుక, అతనికి శుభప్రాప్తి యెట్లు కలుగును?

"కృతఘ్నునకు సత్కీర్తి యెక్కడిది? అతనికి, ఒక స్థానము, స్థిరత్వము, సుఖము ఎక్కడిది? కృతఘ్నుడు అవిశ్వసనీయుడుగా నుండును. అతడు ఎప్పుడు గూడ ఉద్ధరింపబడడు.

"నిర్ధనుని జీవనము-పాపిష్ఠుడునైన వాని జీవనము వాస్తవముగా జీవనము కాదు. పాపిష్ఠుడు తన కుటుంబ పోషణముగూడ ఎట్లు చేయగలడు? పాపాత్ముడైన నిర్ధనుడు, తాను చేసిన పుణ్యకర్మములను నశింపజేయుచు, తానుగూడ నశించిపోవును.

"నేను పాపిష్ఠుడను-కృతఘ్నుడను-దీనుడను - అసత్యవాదినై యున్నాను. దాని వలన గురువు చేత నా పని చేయించుకొంటిని. కాని, నేను ఆయనకు ఇచ్చెదనని చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చజాలకున్నాను. అందువలన నేను ప్రయత్నము చేసియైనను నా ప్రాణములను విడిచెదను.

"నేనింతకు పూర్వము దేవతలను ఏ కోరికలగూడ కోరలేదు. దేవతలందరు యజ్ఞములందు నన్ను ఆదరించెదరు. కనుక, నేనిప్పుడు త్రిలోక ప్రభువు - స్థావర జంగమాత్మకమైన సర్వప్రపంచమునకు ఆశ్రయదాత, సచ్చిదానంద ఘనుడు, భగవంతుడునైన శ్రీ మహావిష్ణువును శరణుజొచ్చెదను. కృపామయుడైన ఆ దేవుడు దేవాసురులను రక్షించుచున్నాడు. వారికి సమస్త సుఖములను చేకూర్చుచున్నాడు. ఆ భగవంతుని నేను దర్శించెదను.''

"దుర్యోధనా! గాలవుడట్లు చింతించుచుండగనే, అతని మిత్రుడైన గరుత్మంతుడు అతని యెడల ప్రసన్నుడై, యతనికి ప్రియము చేయు నిచ్ఛతో తన దర్శనము నిచ్చి యతనితో నిట్లనెను:

"గాలవా! నీవు నాకు ప్రియమిత్రుడవు. నా మిత్రులకు గూడ ప్రియమిత్రుడవు. మిత్రుడు తన వద్దనున్న ధన సంపదలను తన మిత్రుల కోర్కెలను తీర్చుటకు ఉపయోగించుట అతని కర్తవ్యము బ్రాహ్మణోత్తమా! నా వద్ద నున్న మహావైభమంతయు శ్రీ మహావిష్ణువే.

"నేను ఇంతకు పూర్వమొక సారి నీ విషయమై ఆ దేవునకు నివేదించి యుంటిని, ఆయన నా కోరికను మన్నించి యుండెను. అందుచేత రమ్ము, మనమిరువురము ఆ దేవుని వద్దకు పోవుదము.

"గాలవా! నిన్ను నేను సముద్రమునకు అవలనున్న ప్రదేశమునకు సుఖముగా తోడ్కొని పోయెద రమ్ము, జాగు చేయకుము.

"గాలవా! నీకు సహాయము చేయుమని శ్రీ మహావిష్ణువు నాకు అజ్ఞ యిచ్చెను. నీ యిష్టము వచ్చిన దిక్కునకు తొలుత పోవుదము చెప్పుము.

"బ్రాహ్మణోత్తమా! తొలుత తూర్పు దిక్కును గూర్చి చెప్పెద వినుము:

గరుడుడు గాలవునకు పూర్వదిక్కును వర్ణించి చెప్పుట

''గాలవా! యే దిక్కునందు ప్రపంచమును ప్రకాశింపజేయు సూర్య భగవానుడు ఉదయించునో, ఏ దిక్కునందు సంధ్యాకాలమునందు సాధ్యులు తపస్సు చేయుచుందురో, ఏ దిక్కునందు గాయత్రీ జపముచేత సమస్త జగత్తునందు వ్యాపించు ఉత్కృష్టమైన బుద్ధిని పొందెదరో, ఏ దిక్కునందు ప్రపంచ నేత్రస్వరూపులైన సూర్యచంద్రులు ఉదయించెదరో, యే దిక్కునకు సాధారణముగ ముఖము చేసి ధర్మానుష్ఠానమును చేయుట చేత ధర్మము ప్రతిష్ఠింపబడి యున్నదో, యే దిక్కునందు సమస్తహవిస్సుల హోమము చేయగా ఆ యాహుతి సమస్త దిక్కులయందు వ్యాపించునో ఆ పూర్వ (తూర్పు) దిక్కు సూర్యునకు పగటి ద్వారమైయున్నది.

"తూర్పుదిక్కునందే దక్షప్రజాపతి యొక్క అదితి మొదలగు బిడ్డలు, అందరికంటె మొదట (పూర్వము) ప్రజావర్గమును ఉత్పన్నము చేసియుండిరి. కశ్యప ప్రజాపతి సంతతి యీ తూర్పుదిక్కునుండే పూర్వము వృద్ధి చెంది యుండెను. దేవతల లక్ష్మి (సంపత్తి)కి పూర్వము పట్టాభిషేకము జరిగెను. ఈ దిక్కునందే దేవతలు పూర్వము తపస్సు చేసిరి.

''గాలవమునీశ్వరా! ఈ యన్ని కారణములచేతనే, ఈ దిక్కును 'పుర్వా' దిక్కు అని అనెదరు.

"అత్యంత పూర్వకాలమునందు, తొలుత ఈ తూర్పుదిక్కునందే దేవతలుండిరి. అందుకే దీనిని అన్నిటికన్న 'ఆది దిక్కు' అని యనెదరు.

"సుఖమును గోరువారు దైవకార్యములన్నియు మొదట ఈ దిక్కునందే చేయవలెను.

"సృష్టికర్తయైన బ్రహ్మదేవుడీ దిక్కునందే వేదములను తొలుత గానము చేసియుండెను.

''సవిత అను దేవత బ్రహ్మవాదులైన మునులకు ఈ దిక్కునందే సావిత్రీ (గాయత్రి) మంత్రమును ఉపదేశించియుండెను.

"ఈ పూర్వదిక్కునందే సూర్యదేవుడు తొలుత శుక్లయజుర్వేద మంత్రములను యాజ్ఞవల్క్య మహర్షికి ఉపదేశించి యుండెను.

"ఈ దిక్కునందే దేవతలు యజ్ఞములందు సోమరసపానమును చేసి యుండిరి. ఆ రసము వారికి వరదానముగా లభించియుండెను.

"గాలవా! ఈ పూర్వదిక్కునందే, యజ్ఞముల ద్వారా, తృప్తి జెందిన అగ్ని దేవగణము, తమకు జన్మస్థానమైన జలమును ఉపభోగించుచున్నారు.

"ఇక్కడనే వరుణదేవుడు పాతాళమును ఆశ్రయించి, లక్ష్మి (సంపత్తి)ని పొందెను.

"ఈ తూర్పుదిక్కునందే ప్రాచీన మహర్షియైన వసిష్ఠుడు జన్మించెను. ఆయనకు ఈ దిశయందే సప్తర్షులలో స్థానము లభించెను.

"ఇక్కడనే వసిష్ఠుడు నిమి యొక్క శాపము చేత దేహ త్యాగము చేయవలసి వచ్చెను.

(నిమి యను ఇక్ష్వాకు వంశరాజు స్త్రీలతో పాచికలాడుచుండగా వచ్చిన తనను పూజించలేదని వసిష్ఠుడు నిమిని శపించెను. దానితో నిమి దేహత్యాగము చేయవలసినవాడై, వసిష్ఠునకు ప్రతి శాపమిచ్చి యతనిని 'విరేతసుని' చేసెను. ఇట్లు వసిష్ఠుడు గూడ దేహత్యాగము చేయవలసిన వాడయ్యెను అను మత్స్య పురాణములోని కథ యిక్కడ తెలిసికొనవలెను.)

"ఈ దిక్కునందే ఓంకారము(వేదము)యొక్క వేయిశాఖలు ప్రకటితములయ్యెను. ఆ ప్రణవమునందే మహర్షులు హోమాగ్ని ధూమపానము చేసెదరు.

"ఈ దిక్కునందే యింద్రుడు యజ్ఞభాగసిద్ధికొరకై వనమునందు అడవి పందులు మొదలైన క్రూరమృగముల ప్రోక్షణము (యజ్ఞము కొరకు మృగములను చంపుట) చేసి, దేవతలకిచ్చెను.

"ఇతరులకు అహితము చేయుచు కృతఘ్నులుగా నుండు మనుష్యులను, అసురులను అందరిని ఈ దిక్కునందు ఉదయించిన సూర్యభగవానుడు కోపము చేత నశింపజేయును. వారి ఆయుస్సును క్షీణింపజేయును. గాలవమునీ! ఈ పూర్వదిక్కే మూడులోకములకు, స్వర్గమునకు సుఖమునకు ద్వారము.

"నీకు నీ కొరకు విష్ణుభగవానుని యాజ్ఞను నెరవేర్చవలసిన వాడనై యున్నాను ఆ దేవుని అధీనములో నున్నాను. అందుచేత, నేను పూర్వదిక్కునకు పోవుదునా? చెప్పుము. అథవా, ఇతర దిక్కుల వర్ణనము గూడ వినుము"

అని గరుడుడు దక్షిణదిక్కును వర్ణింపదొడగెను:

దక్షిణ దిగ్వర్ణనము

"గాలవమునీ! పూర్వకాలమునందు, సూర్యభగవానుడు వేదోక్తవిధి పూర్వకముగా ఈ దక్షిణ దిక్కునందు యజ్ఞము చేసి. గురువైన కశ్యప ప్రజాపతికి దక్షిణగా ఈ దిక్కును దానము చేసి యుండిన విషయము సుప్రసిద్ధము. అట్లు దక్షిణ యివ్వబడినది గనుకనే యీ దిక్కునకు దక్షిణదిక్కు అని పేరు వచ్చినది.

"బ్రాహ్మణోత్తమా!మూడు లోకములందలి పితృదేవతాగణము ఈ దిక్కునందే యుండెదరు. 'ఊష్మప' నామముగల దేవతలు గూడ ఇక్కడనే నివాసము చేయుదురు. (ఊష్మపులనగా ఆవిరిని ఆహారముగా పానము చేయుచు తపస్సు చేయువారు).

"పితృదేవతలతోపాటు 'విశ్వేదేవులుగూడ సర్వదా ఈ దక్షిణ దిక్కునందే నివసించెదరు. వారు సమస్తలోకముల చేత పూజింపబబడుచు, శ్రాద్ధకర్మములయందు పితృదేవతలతో సమానముగానే శ్రాద్ధ భాగమును స్వీకరించెదరు.

"విద్వాంసులీ దక్షిణ దిక్కును ధర్మదేవతయొక్క రెండవ ద్వారమని చెప్పెదరు. ఈ దిక్కునందే (చిత్రగుప్తుడు మొదలైనవారు) త్రుటికి లవము' అను అతి సూక్ష్మములైన కాల భాగములను (అంశములను) బాగుగా పరిశీలించి, ప్రాణుల ఆయుస్సునకు, నిశ్చయమైన గణితము (లెక్క) చేసెదరు.

"ఈ దిక్కునందు దేవఋషులు, పితృఋషులు, రాజఋషులు దుఃఖరహితులై సర్వదా నివాసము చేయుచుండెదరు.

ఈ దిక్కునందే ధర్మ - సత్య - కర్మముల విషయములు చెప్పబడినవి. మరణించిన ప్రాణులు - వారికర్మలు ఈ దిక్కునే ఆశ్రయించియుండును. మరణించిన పిదప సమస్త ప్రాణులు ఈ దిక్కునకే పోవలసియుండును.

ఈ దిక్కు సర్వదా అజ్ఞానంధకారము చేత కప్పబడియుండును. అందు చేత, ఈ దిక్కునకు సుఖముగా ప్రయాణముచేయుట అసంభవము.

''గాలవమునీ! బ్రహ్మదేవుడీ దక్షిణ దిక్కునందు చెడు ప్రవర్తనగల వేల కొలది రాక్షసులను సృష్టించినాడు. ఆ రాక్షసుల దర్శనము పాపాత్ములకే కలుగును.

ఈ దిక్కునందే గంధర్వులు మందర పర్వత కుంజము (పొదలు) లలో, బ్రహ్మర్షుల ఆశ్రమములలో గాథలను చాల మనోహరముగా గానము చేసెదరు.

పూర్వ మీ దక్షిణ దిక్కునందే 'రైవత రాజు' గాథల రూపములో సామ గానమును వినుచు వినుచు తన భార్యను, మంత్రులను, రాజ్యమును విడిచి వనమునకు పోయెను.

ఆ కథ చెప్పెద వినుము:

"పూర్వ మొకప్పుడు రైవతరాజు తన పుత్రికకు వరుని వెదకుటకు, ఆమెతో బ్రహదేవుని కడకు పోయి యుండెను. అక్కడినుండి తిరిగి వచ్చునపుడు రైవతుడు మందరపర్వత పుణ్యప్రదేశములందు గంధర్వుల సామగానమును విని అక్కడనే కొంత సేపు నిలిచెను

"అక్కడ కొంచెము సమయము గూడ, మనుష్యలోకమునందు చాలా కాలముతో సమానమగును.

"మందరపర్వతమునుండి, రైవతుడు, తిరిగి తనరాజధానికి వచ్చెను. అప్పటికి కృత - త్రేతాయుగములు గడచి, ద్వాపరయుంగాంతము గూడ గడచిపోవు చుండెను.

"తన మంత్రి పరివారమువారందరు ఎప్పుడో మరణించి పోయి యుండిరి. ఆ దినములలో ఆయన రాజధాని కుశస్థలీ స్థానము నందు దివ్యమైన ద్వారకా నగరము నిర్మింపబడియుండెను.

అప్పుడు రైవత రాజు తన పుత్రిక రేవతిని బలరామునికిచ్చి వివాహము చేసెను. తాను వనమునందు తపస్సు చేయుటకు పోయెను. ఇది రైవతుని పూర్వ కథ.

''గాలవమునీ! ఈ దక్షిణ దిక్కునందే పూర్వము 'సావర్ణి' యను మనువు, "యవక్రీత' పుత్రుడును కలిసి సూర్యుని గమనము కొరకు ఒక సీమ (హద్దు) ను స్థాపించి యుండిరి. ఆ యెల్లను సూర్యుడెప్పుడును దాటుట లేదు.

రావణాసురుడీ దిక్కునందే తపస్సుచేసి, తాను దేవతల చేత వధింపబడకుండునట్లు వరమును పొందియుండెను.

ఈ దిక్కునందే జరిగిన ఒక సంఘటన వలన, వృత్రాసురుడు ఇంద్రునకు శత్రువయ్యెను.

"ఈ దక్షిణ దిక్కునందే అందరి ప్రాణములు వచ్చి (ప్రాణ - అపాన - వ్యాన - ఉదాన - సమానములు)అయిదు భాగములుగా విభజింపబడును. ప్రాణులు నూతన దేహమును ధరించెదరు.

''గాలవా! ఈ దక్షిణ దిక్కునందే పాపిష్ఠులు నరకాగ్నిలో ఉడికింపబడెదరు.

ఈ దిక్కునందే, 'వైతరథి' యను నరకమునకు పోయిన పాపుల చేత చుట్టబడిన 'వైతరణి' యను నది యున్నది.

"మనుష్యులు ఈ దక్షిణ దిక్కునకుపోయి తమ సుఖ-దుఃఖములు నశింప జేసికొనెదరు.

"ఈ దక్షిణ దిక్కు (దక్షిణాయనము) నందు ప్రవేశించి సూర్యుడు రుచికరమైన జలమును వర్షించును.

"వసిష్ఠముని సేవించుచున్న ఉత్తరదిక్కును మరలపోయి సూర్యుడు (ఉత్తరాయణ ప్రారంభము నందు) మంచును గురియును.

"నేను పూర్వము, ఆకలిగొని, చింతించుచు ఈ దిక్కునకు వచ్చితిని. ఇక్కడ, గజము-కచ్ఛపము (తాబేలు) ఉండెను. మహాకాయములైన ఆ రెండు ఒండొంటితో పోరాడుచు నా చేతికి చిక్కెను.

''గాలవా! ఈ దిక్కునందు సూర్య సమానమైన తేజస్సుగల కర్దమ ప్రజాపతి (కర్దమ మహర్షి) కొడుకు చక్రధనుడు అను పేరుగల మునీశ్వరుడు ఉండెను. ఆయనకు 'కపిలుడు' అను ప్రసిద్ధ నామము గలదు. అతడే సగర చక్రవర్తి పుత్రులను భస్మము చేసెను. (ఈ కథ విపులముగా ఇతరత్ర చూడవచ్చును).

"ఈ దిక్కునందే 'శివ' నామముతో ప్రసిద్ధులైన సిద్ధ బ్రాహ్మణులు కొందరుండిరి. వారు వేదపండితులు. వారు పరిపూర్ణముగా వేదాధ్యయనము చేసి (తత్త్వజ్ఞానము ద్వారా) అక్షయమైన మోక్షమును పొందిరి.

"ఈ దిక్కునందే వాసుకియను నాగరాజు చేత పాలింపబడుచు, తక్షకుడు, ఐరావతుడు అను నాగ వీరులచేత రక్షింపబడుచున్న 'భోగవతి' అను పట్టణము కలదు.

"మరణించిన తరువాత ఈ దిక్కున పోవు ప్రాణి అగ్నికి, సూర్యునకున్ను అభేద్యమైన గాఢాంధకారమును ఎదుర్కొనవలసియుండును.

"గాలవ మహామునీ! నీవు నాకు సేవింపదగినవాడవు. అందువలన నీకు ఇష్టము ఉన్నచో చెప్పుము. పోవుదము.

"అథవా, ఇప్పుడు మూడవదైన పశ్చిమదిక్కును గూర్చి చెప్పెద వినుము."

పశ్చిమ దిగ్వర్ణనము

''గాలవమునీ! ఈ యెదుట కనపడు దిక్కే జలాధిపతియైన వరుణ దేవునకు ప్రియమైన పశ్చిమ దిక్కు.

"వరుణుడు ఈ దిక్కునకు అధిపతి. పగలు ముగిసిన తరువాత సూర్య భగవానుడు తన కిరణములను ఈ దిక్కునందే విడుచును. అందుచేతనే యీ దిక్కునకు 'పశ్చిమ' దిక్కు అని పేరు (దినము యొక్క 'పశ్చాత్' వెనుక నుండునది యని యర్థము).

పూర్వకాలమునందు, కశ్యపుడు, జలజంతువులకు ఆధిపత్యమును, జలములకు రక్షణమును కలిగించుట కొరకు ఈదిక్కునందే వరుణుని పట్టాభిషిక్తుని చేసి యుండెను.

"చీకటిని నశింపజేయు చంద్రుడు, వరుణుని సమీపము నందుండి, ఆరు విధములైన రసములను (రుచులను) (ఆరు రుచులు - తీపి, ఉప్పు, పులుపు, కారము, చేదు, ఒగరు) పానము చేసి శుక్లపక్ష పాడ్యమినాడు నూతనముగా ఈ దిక్కునందే ఉదయించును.

ఈ పశ్చిమ దిక్కునందే పూర్వము వాయుదేవుడు తన వేగముచేత దైత్యులను యుద్ధమునందు వెనుకకు తరిమి బంధించి, పీడించియుండెను. దాని చేతవారు క్రిందపడి చచ్చిపోయిరి.

ఈ పడమటి దిక్కునందే అస్తాచలము' ఉన్నది. ఈ పర్వతము తనకు ప్రీతిపాత్రుడైన సూర్యుని ప్రతిదినము స్వీకరించును. (దీనికే సూర్యాస్తమయము -ప్రొద్దు గ్రుంకుట అని పేరు.) ఇక్కడి నుండియే "పశ్చిమ సంధ్య' ప్రసరించును.

ఈ దిక్కు నుండియే సాయంకాలమునందు ప్రాణుల ఆయుస్సులో సగము భాగము లాగుకొనబడును కాబట్టి, 'రాత్రి-నిద్ర'- ఈ రెండు ప్రకటితములగును. (రాత్రి యనగా ఆయుస్సు హరించునది. నిద్రయనగా నిందింపబడునది యని యర్థము.)

''గాలవా! ఈ పడమటి దిక్కునందే నిద్రించుచున్న గర్భవతియైన 'దితీదేవి' యొక్క ఉదరమునందు ఇంద్రుడు ప్రవేశించి గర్భమును ఛేదించియుండెను. దాని నుండి మరుద్గణము జన్మించెను.

"ఇక్కడనే హిమాలయ మూలభాగము మందర పర్వతము వరకు వ్యాపించి పోవుచుండును. సహస్ర సంవత్సరములకు గూడ దాని నంతము చేయుట హిమాచలమునకు అసంభవమైనది.

ఈ దిక్కునందు సువర్ణ మయమైన మందర పర్వతముచేత, సువర్ణ కమలముల చేతను శోభిల్లుచున్న పాలసముద్రపు తీరమునందు సురభి (కామ ధేనువు) పాలు ప్రవహింపజేయును.

''ఈ పశ్చిమ దిక్కునందే సముద్ర మధ్యమునందు సూర్యసమాన తేజస్వియైన రాహువు యొక్క కబంధము (మొండెము-తలలేని శరీరము) కనపడుచుండును. ఆ రాహువు సూర్య చంద్రులను నశింపజేయ జూచుచుండును.

"ఈ దిక్కునందే పచ్చని (బంగారు వర్ణము) రంగు గల కేశములతో, ప్రభావశాలియై కనపడకుండ నుండు "సువర్ణ శిరసుడు' అను మునీశ్వరుడు, సామగానము చేయుచుండును. ఆ గాన ధ్వని స్పష్టముగా వినిపించుచుండును.

"గాలవా! ఈ దిక్కునందే, 'హరమేధసుడు' అను మునీశ్వరుని కూతురు 'ధ్వజవతి' అనునామె, సూర్యుని 'నిలు నిలుము' అని ఆజ్ఞాపించుచు నుండును.

"ఈ దిక్కునందు, 'వాయువు - అగ్ని - జలము - ఆకాశము' - ఇవి రాత్రియందు పగటియందున్న కలుగు దుఃఖమును పోగొట్టుచుండును. ఇక్కడ ఈ నాలుగింటి స్పర్శము సర్వదా సుఖప్రదముగా నుండునని భావము

"ఈ దిక్కునుండియే సూర్యుడు అడ్డపు నడకతో పరిభ్రమించుటకు ఆరంభించును. ఇక్కడ నక్షత్రములన్నియు సూర్యమండలమునందు ప్రవేశించును.

ఈ దిక్కునందు, 'అభిజిత్తు'తో గూడిన యిరువది యెనిమిది నక్షత్రములలో ప్రతి నక్షత్రము ప్రతి యిరువది యెనిమిదవ దినమునందు సూర్యునితో పాటు సంచరించి, అమావాస్య అనంతరము సూర్యమండలము నుండి విడిపోవు చుండును. (దీనిని సౌరమాన మాసమని యందురు.)

''ఈ పడమటి దిక్కునందే, సముద్రమును సంపూర్ణముగా నింపునట్టి మహానదులు* తరచుగా జన్మించును. ఇక్కడి వరుణాలయము (పశ్చిమ సముద్రము) నందు మూడు లోకములకున్ను ఉపయోగపడు జలము ప్రోగై యుండును.

"ఈ పడమటి దిక్కునందే 'అనంతుడు' అను నాగరాజు నివసించు చుండును. ఆద్యంతరహితుడైన శ్రీ మహావిష్ణువునకు ఇది ఉత్కృష్ట స్థానము.

"ఈ దిక్కునందే అగ్ని దేవునకు మిత్రుడైన వాయుదేవుని భవనము, మరీచి నందనుడైన కశ్యప మునీశ్వరుని యాశ్రమము నున్నవి.

''గాలవ మహా మునీ! యీ విధముగా నీకు పశ్చిమ దిక్కు యొక్క మార్గమును గూర్చి సంగ్రహముగా చెప్పితిని.

"ఇప్పుడు నీ యభిప్రాయమేమియో చెప్పుము మనమిద్దరమిప్పుడు ఏ దిక్కునకు పోవుదుము?''

"అట్లు చెప్పి గరుడుడు గాలవునకు ఉత్తర దిక్కును గూర్చి యిట్లు చెప్పదొడగెను :

ఉత్తర దిగ్వర్ణము

'గాలవమునీ! ఈ ఉత్తరదిక్కు మార్గము గుండా పోయినచో మనుష్యుడు పాపమునుండి ఉద్ధరింపబడును. అతడు శ్రేయస్కరమైన స్వర్గసుఖములను

పొందగలడు అందుచేత ఇది 'ఉత్తారణము' (సంసారమునుండి దాటించునది) గనుక దీనికి 'ఉత్తరదిక్కు' అని పేరు.

ఉత్తర దిక్కు ఉత్కృష్టములైన సువర్ణనిధులకు అధిష్ఠానము. ఈ కారణముచేత గూడ దీని వేరు ఉత్తరదిక్కు అని యనెదరు. ఈ దిక్కు పూర్వ - పశ్చిమదిక్కుల మధ్యనున్నది.

అత్యంతశ్రేష్ఠమైన ఈ ఉత్తర దిక్కునందు సౌమ్య స్వభావము, ఇంద్రియ నిగ్రహము, మనో నిగ్రహము, ధర్మమార్గ ప్రవర్తనము లేనివారు నివసింపజాలరు.

''ఈ ఉత్తర దిక్కునందే, 'బదరికాశ్రమము' అనబడు పుణ్యక్షేత్రము గలదు. ఇక్కడ సచ్చిదానంద స్వరూపుడైన 'శ్రీమన్నారాయణుడు, విజయశీలుడైన నరోత్తముడు 'నరుడు', సనాతనుడైన 'బ్రహ్మదేవుడు'న్ను నివసించెదరు.

ఉత్తరమునందే హిమాలయ శిఖరముపైన ప్రళయాగ్ని సమాన తేజస్సు గల అంతర్యామియైన భగవంతుడు 'మహేశ్వరుడు' పార్వతీదేవితోపాటు నిత్య నివాసము చేయుచుండుడు. ఆ పరమేశ్వరుని దర్శనము, నర-నారాయణులు దప్ప, ముని - గంధర్వ యక్ష - సిద్ధ - దేవతాగణ - ఇంద్రాదులు గూడ, చేయజాలరు. (దీని పేరే కేదారక్షేత్రమేమో?)

''ఈ ఉత్తర దిక్కునందు, 'సహస్ర నేత్ర - సహస్ర చరణ - సహస్ర మస్తకములు గల అవినాశియైన శ్రీ మహావిష్ణువొక్కడే ఆ పరమేశ్వరుని సాక్షాత్కరించగలడు. ఈ ఉత్తర దిక్కునందే చంద్రుడు ద్విజరాజ రాజ్యమునందు అభిషిక్తుడయ్యెను.

''గాలవా! ఇక్కడనే ఆకాశము నుండి పడుచున్న గంగానదిని మహేశ్వరుడు తన మస్తకముపైన ధరించి మనుష్యలోకమునందు విడిచెను.

''ఈ దిక్కునందే పార్వతీదేవి భగవంతుడైన మహేశ్వరుని పతిగా పొందుటకు కఠిన తపస్సు చేసియుండెను.

''ఇక్కడనే పరమేశ్వరుని మోహింపజేయుటకు మన్మథుడు వచ్చి యుండెను. అతనిపైన భగవంతునికి కోపము వచ్చెను. ఆ సమయమందు

హిమాలయము పార్వతీదేవియు అక్కడ వెలసిరి. ఇట్లు వీరందఱు అక్కడ ఒకే సమయమందు వెలసిరి.

''ఈ ఉత్తరదిక్కునందలి కైలాసపర్వతమునందు యక్షరాక్షసగంధర్వులకు అధిపతియైన ధనదాత కుబేరుడు పట్టాభిషిక్తుడై ఉండెను. ఈ దిక్కునందే సుందరమైన చైత్రరథ వనము, వైఖానస ఋషుల ఆశ్రమము ఉన్నవి.

''బ్రాహ్మణోత్తమా! ఈ దిక్కునందే మందాకినీ నది, మందరాచలము ఉన్నవి.

''ఈ దిక్కునందే రాక్షసగణము సౌగంధిక వనమును రక్షించుచున్నది. ఈ ఉత్తర దిక్కునందే పచ్చికలతో శోభిల్లుచున్న కదళీవనము, కల్పవృక్షములు ప్రకాశించుచున్నవి.

"గాలవమునీ! ఈ దిక్కునందే సిద్ధసాధ్యులకు ఇచ్ఛానుసార భోగములను కూర్చుచు, వారి మనస్సునకు అనుకూలముగా విమానములు సంచరించుచుండును.

"ఈ దిక్కునందే అరుంధతీదేవి, సప్త ఋషులు ప్రకాశించుచుందురు. ఇక్కడనే స్వాతి నక్షత్రము ఉదయించి నివసించుచుండును.

"ఇక్కడ బ్రహ్మదేవుడు యజ్ఞానుష్ఠానమునకు పూనుకొని నియమముతో నుండును.

"చంద్ర - సూర్య - నక్షత్రములు అన్నియు సర్వదా ఈ దిక్కునందే పరిభ్రమించుచుండును.

''బ్రాహ్మణోత్తమా! ఈ ఉత్తర దిక్కునందే మహాత్ములైన 'ధామ' నామముగల మునులు గంగా మహాద్వారమును (హరిద్వారమును) రక్షించుచుందురు. సత్యవాదులైన ఆ మునీశ్వరుల మూర్తులు - ఆకృతులు - తపఃపరిణామములు ఎవరికిని తెలియవు.

"గాలవా! ఆ మునీశ్వరులు సహస్రయుగాంత కాలముల వఱకు తమ ఇచ్ఛానుసారముగ ఆయుస్సును అనుభవించెదరు.

"మనుష్యులు గంగామహాద్వారమునుండి ముందుకు పోవుచున్న కొలది ఇక్కడి హిమరాశి కరగిపోవుచుండును.

"గాలవా! భగవంతుడైన సాక్షాచ్ఛ్రీమన్నారాయణుడు; విజయశీలుడు-అవినాశి-మహాత్ముడునైన నరుడు ఈ యిరువురు (నర-నారాయణమునీశ్వరులు)

తప్ప ఇతరులెవ్వరు కూడ పూర్వము ఈ గంగా మహాద్వారమునుండి ముందుకు పోలేదు కుబేర స్థానమైన కైలాసపర్వతము ఈ దిక్కునందే ఉన్నది.

''బ్రహ్మన్! ఈ ఉత్తర దిక్కునందే 'విద్యుత్ప్రభలు' అని ప్రసిద్ధులైన అప్సర స్త్రీలు జన్మించి యుండిరి. భగవంతుడైన శ్రీ విష్ణువు త్రివిక్రమావతారమునందు మూడు లోకములను కొలుచుచున్నపుడు ఈ దిక్కునందే తన చరణమును ఉంచెను. (ఆ దేవుని చరణచిహ్నము (హరిపౌడీ) నేడు కూడ హరిద్వారమునందు ఉన్నది.)

"బ్రహ్మర్షీ! ఉత్తర దిక్కునందలి 'ఉశీరబీజ' నామముగల స్థానమందు సువర్ణమయ సరోవరము ఉన్నది. అక్కడ 'మరుత్తుడు' అను రాజు యజ్ఞము చేసి యుండెను.

"ఈ దిశయందే బ్రహ్మర్షి, మహాత్ముడునైన 'జీమూత'ముని సమక్షమునందు హిమాలయము యొక్క పవిత్రము నిర్మలమునైన సువర్ణ నిధి (బంగారు గని) ప్రకటితమై యుండెను. ఆ జీమూతముని ఈ ధనరాశినంతయు బ్రాహ్మణులకు పంచి సద్వినియోగపరచి, ఆ బ్రాహ్మణులను 'ఈ ధనము నా పేరుతో ప్రసిద్ధమగునట్లు చేయుడు' అని వరము కోరెను. ఆ కారణముచేత ఈ ధనము 'జైమూత' అను పేరుతో ప్రసిద్ధమయ్యెను.

'గాలవమునీ! ఈ ఉత్తర దిక్కునందు ప్రతిదినము ప్రాతస్సాయం కాలములందు దిక్పాలురందరు ఒకచోట చేరి ఉచ్చైస్స్వరముతో 'ఎవరికి ఏమి పని కావలెను? చెప్పుడు' అని అడుగుచుందురు.

''గాలవా! ఈ యన్ని కారణములచేత, ఇతర గుణముల చేతను ఈ ఉత్తరదిక్కు ఉత్కృష్టమైనది. సమస్త శుభకర్మలకు కూడా ఈ దిక్కే ఉత్తమముగా అంగీకరింపబడినది. అందుచేత దీనికి 'ఉత్తర దిక్కు' అని పేరు వచ్చినది.

''మునివరా! ఇట్లు నేను క్రమముగా నాలుగు దిక్కులను గూర్చి నీకు విస్తారముగ వివరించి చెప్పితిని. ఇప్పుడు చెప్పుము, ఏ దిక్కునకు పోవుదము? నీకు నేను సమస్త భూమండలమునందలి అన్ని దిక్కుల దర్శనము చేయించుటకు పూనుకొని యున్నాను. కనుక నీవు నా వీపు పైన ఎక్కి కూర్చొనుము.''

గరుడునిపై నెక్కి తూర్పు దిక్కునకు పోవుచున్న గాలవుడు గరుడవేగము చేత వ్యాకులపడుట

"ఇట్లు గరుత్మంతుడు చెప్పిన మాటలు విని గాలవ మహాముని మరల గరుడునితో నిట్లనెను:

''వైనతేయా! నీవు ధర్మమునకు నేత్ర స్వరూపులైన సూర్యచంద్రులు ప్రకాశించుచున్న తూర్పు దిక్కునకు నన్ను తోడుకొని పొమ్ము.

"ఆ దిక్కుననే నీవు దేవతల సాన్నిధ్యము ఉన్నదనియు, సత్యము ధర్మము నిలిచియున్నదనియు, పూర్వము చెప్పియుంటివి. నేను తూర్పు దిక్కునందు దేవతలందరితోను కలిసి వారిదర్శనము చేయవలెనని కోరుచున్నాను ''

"ఆ మాటకు గరుడుడు గాలవునితో గాలవా! నీవు నా పైన ఎక్కు'' మనగా అతడు గరుడుని వీపుపై ఎక్కి కూర్చొని అతనితో నిట్లనెను:

''సర్ప భోజనా పగటి పూర్వభాగమందు సహస్రకిరణములతో శోభిల్లుచున్న భువన భాస్కరుడైన సూర్యుని వలెనే- అకాశమున నెగురుచున్నప్పుడు నీవు కనబడుచున్నావు.

"నీ రెక్కల గాలితాకిడి చేత పెరకబడి యీ వృక్షములు నీ వెంటనే వచ్చుచున్నవి. ఇవి కూడ మనతోపాటు పోవుటకు వచ్చుచున్నట్లు వీటి తీవ్రగతి కనబడుచున్నది.

''నీ రెక్కల వేగముచేత వెడలిన గాలిద్వారా సముద్రపు జలరాశి, పర్వతములు వనములతో కూడిన సమస్త భూమండలము నీవైపు ఈడ్వబడుచున్నట్లు తోచుచున్నది.

నీ వృక్షముల వాయువు చేత మత్స్యములు, నీటి యేనుగులు వీటితో సహితముగా సముద్రజలము ఆకాశముపై చిమ్మబడు చున్నది.

"ఒకటే ఆకారములు, ముఖములుగల చేపలు, తిమి - తిమింగిలములు, గజములు, అశ్వములు, మనుష్య ముఖముగల జల జంతువులు అణగద్రొక్కబడుచున్నటుల నాకు కనబడు చున్నవి.

"మహా సముద్రపు భీషణ గర్జనములు నా చెవులను బధిరముల జేయుచున్నవి. నేను ఏమియు వినజాలక, చూడజాలక యున్నాను. నా సంరక్షణ

కొరకు ఏలాటి ఉపాయము నాకు తోచకున్నది. కావున వినతాసుతా! నీవు మెల్ల మెల్లగా పొమ్ము. లేకున్నచో నీకు బ్రహ్మ హత్యాపాతకము కలుగును.

"ఇప్పుడు నాకు సూర్యుడు కనబడకున్నాడు. దిక్కులు తెలియకున్నవి. ఆకాశము కూడ కనబడుట లేదు. అంధకారము మాత్రమే తోచుచున్నది.

"నేను నీ శరీరమును కూడ చూడజాలకున్నాను. నీ రెండు కన్నులు నాకు ఉత్తమజాతి రత్నములవలె ప్రకాశించుచు కనబడుచున్నవి. నీ శరీరమును గాని నా శరీరమునుగాని చూడలేకున్నాను.

"అడుగడుగున అవయవముల నుండి అగ్నిజ్వాలలు పైకి లేచుచున్నట్లు కనబడుచున్నవి. వినతానందనా! నీవు ఈ యగ్నిని వెంటనే ఆర్పి, నీ రెండు నేత్రములను గూడ శాంతింపజేసి, నీ మహావేగమును సైతము ఆపుము.

"పక్షిరాజా! ఈ ప్రయాణముచేత నాకు ఏ మాత్రము ప్రయోజనము లేదు. కనుక తిరిగి పొమ్ము. నేను నీ వేగమును సహింపజాల కున్నాను.

"నేను చంద్రునితో సమానమగు తెల్లని శరీరము గలిగి చెవులు మాత్రమే నల్లరంగుగల ఎనిమిది నూర్ల అశ్వములను గురుదక్షిణగా ఇచ్చుటకు ప్రతిజ్ఞ చేసితిని.

"కాని, ఆ గుఱ్ఱములను ఇచ్చుటకు నాకు మార్గము కనబడకున్నది. అందుచేత నా ప్రాణములను విడచుటకే నేను నిశ్చయించుకున్నాను.

"నా వద్ద కొంచమైనను ధనము లేదు. నాకు ధనవంతుడగు మిత్రుడెవ్వడును లేదు. అనేక ధనరాసులను వెచ్చించినను ఇప్పడు నేను పూనిన కార్యము నెరవేర జాలదు"

"ఇట్లు చెప్పి నారదుడు "దుర్యోధనా! గాలవుడు ఈ విధముగా దీనవచనములు పలుకగా విని వినతానందనుడు ఎగురుచునే నవ్వుచు గాలవునితో నిట్లనెను:

"బ్రహ్మర్షీ! నీవొకవేళ ప్రాణములు విడువ దలచిన యెడల అది బుద్ధిమంతుల లక్షణము కాదు. ఎందుకనగా, మృత్యువు ఎప్పుడును కృత్రిమము కాదు. అది తన యిచ్ఛతో ఎప్పుడును కలుగదు. మృత్యువు పరమేశ్వరుని స్వరూపము.

"నీకు నావు ఈ విషయము తొలుతనే ఎందుకు చెప్పలేదు? ఈ కార్యము నెఱవేర్చుటకు నా వద్ద ఒక గొప్ప ఉపాయమున్నది.

''గాలవా! సముద్ర సమీపమందు ఇదుగో ఇక్కడ 'ఋషభము' అను పర్వతము కలదు. అక్కడ మనము కొంచెముసేపు విశ్రమించి భోజనము చేసి తిరిగి పోవుదము."

ఋషభ శిఖరమందున్న గాలవ గరుడులకు శాండిలీదేవి దర్శనము-గురుదక్షిణ విషయమై విచారించుట

"అట్లు చెప్పి నారదుడు దుర్యోధనునితో తరువాతి కథ ఇట్లు చెప్పదొడగెను :

''దుర్యోధనా! పిదప గాలవుడు గరుడుడును ఋషభ పర్వత శిఖరముపైన దిగి అక్కడ తపస్సు చేయుచున్న 'శాండిలి' అనెడు బ్రాహ్మణ స్త్రీని చూచిరి. వారు ఆ తపస్వినికి భక్తి పూర్వకముగ నమస్కారము చేసిరి. ఆమె కూడ వారికి స్వాగత సత్కారములు చేసి ఆసనములనిచ్చి కూర్చొనబెట్టెను.

''ఆమె బలి-వైశ్వదేవములు చేసిన పిదప మిగిలిన పవిత్రమైన అన్నమును అభిమంత్రించి ఆ యిరువురికి సమర్పించెను. దానిని భుజించి వారు తృప్తులై నేలపైననే నిద్రించిరి.

''ముహూర్తము (రెండు గడియలు) తరువాత అక్కడినుండి పోవదలచి గరుడుడు మేల్కొనెను.

"అప్పుడు తన శరీరమునందు రెండు రెక్కలులేనటుల అతనికి కనపడెను.

''అతనికి ముఖము హస్తములు ఉన్నప్పటికి పక్షములు లేని మాంసపిండమువలె ఆయెను.

''అట్టి పరిస్థితిలో అతనిని చూచి గాలవుడు బాధపడి గరుడుని ఇట్లడిగెను:

''మిత్రమా! నీవు ఇక్కడికి వచ్చినందుకు ఇది యేమిఫలము లభించెను? ఇట్టి పరిస్థితిలో మనమిక్కడ ఎంత వఱకు ఉండవలసి వచ్చును? నీవు మనస్సునందు ఏ అశుభమును చింతించి యిట్లు ధర్మదూషితుడవైతివి? నీవు కొంచెమైనను ధర్మవిరుద్ధ కార్యమును చేయలేదు కదా! ఇట్లేల ఆయెను?"

''ఆ మాటకు గరుడు డిట్లు బదులు చెప్పెను :

"విప్రోత్తమా! నేను ఈ తవస్వినిని,బ్రహ్మ-విష్ణు-మహేశ్వరులు,ధర్మము యజ్ఞము ఉన్నచోటికి తోడుకొనిపోయి అక్కడనే ఈమెను నివసింపజేయదలచి యుంటిని. అది నేను ఈమె యెడల చేసిన పొరపాటు. కనుక ఇప్పుడు నేను భగవతియైన శాండిలీదేవి చరణములపై వ్రాలి - 'దేవీ! నేను నీకు ప్రియమునే చేయదలచి ఇట్లు ఆలోచించితిని' అని ఆమెను ప్రార్థించెదను."

"ఇట్లు చెప్పి గరుత్మంతుడు శాండిలీ దేవి నిట్లు ప్రార్థించెను.

''అమ్మా! నీ యెడల నాకు గౌరవభావము ఉండుటచేతనే నేను ఇట్లు తలచితిని. అది బహుశః నీకు ఇష్టము కాలేదు. నేను పాపమే చేసితినో, పుణ్యమే చేసితినో నీవు నీ మహిమ చేతనే నా యీ యపరాధమును క్షమింపుము.''

"ఆ ప్రార్థనను విని శాండిలీదేవి సంతుష్టురాలై ఆ యిరువురితో 'భయపడకుడు' అని చెప్పి. గరుడునితో నిట్లనెను :

''సుపర్ణా!' నీ రెక్కలు ఇతోధికముగా సుందరములు శక్తిమంతములు నగును. కనుక నీవు భయపడకుము. వత్సా! నీవు నన్ను నిందించితివి. ఆ నిందను నేను సహించజాలను. నన్ను నిందించిన పాపిష్ఠుడు వెంటనే పుణ్యలోకములనుండి భ్రష్టుడగును.

"నేను అశుభ లక్షణము లేవియులేక అనిందితురాలనై సత్ప్రవర్తనము పాలించుచు నుండుట చేత నాకు ఈ ఉత్తమసిద్ధి ప్రాప్తించినది.

"సదాచారమే ధర్మమును సఫలము చేయును. ధన రూపమైన ఫలము నిచ్చును. సత్ప్రవర్తన చేత మనుష్యునకు సంపత్తి ప్రాప్తించును. అదియే అతని అశుభలక్షణము లన్నియు నశింపజేయును.

"కనుక వత్సా! పక్షిరాజా! ఇప్పుడు నీవు నీ యిష్టము వచ్చిన చోటికి పొమ్ము. నేటినుండి నీవు ఎప్పుడున్ను నన్ను నిందించగూడదు.

''నన్నేకాదు, ఎక్కడకూడ ఏ స్త్రీని కూడ నీవు నిందించుట ఉచితము కాదు. నీవు పూర్వమువలెనే బలపరాక్రమ సంపన్నుడవు కాగలవు."

''ఇట్లు శాండిలీదేవి చెప్పిన వెంటనే గరుడుని రెక్కలు మరల మొలిచి పూర్వముకన్న అధిక శక్తిమంతములై శోభిల్లెను.

''పిదప ఆమె ఆజ్ఞ తీసికొని గరుడ-గాలవులు బయలుదేరి పోవుచుండగా గాలవుడు కోరిన శ్యామకర్ణముగల తెల్ల గుఱ్ఱములు గరుడునికి ఎక్కడను కనపడలేదు.

''అట్లు వచ్చుచున్న గాలవుని మార్గమధ్యమున విశ్వామిత్రుడు చూచి గరుడుని సమక్షమున గాలవునితో నిట్లనెను :

''గాలవా! నీవు స్వయముగనే గురుదక్షిణ నిచ్చుటకు చేసిన ప్రతిజ్ఞకు గడువు సమీపించెను, ఇప్పుడు నీకు ఏది యుక్తమో అది చేయుము. నీకు గురుదక్షిణ ధనము లభించువరకు నేను వేచియుండెదను. నీ కోరిక ఫలించు మార్గమును విచారించు కొనుము.''

"అట్లు విశ్వామిత్రుడు చెప్పగా మిక్కిలి దుఃఖముతో దీనుడై యున్న గాలవునితో గరుత్మంతుడు ఇట్లనెను :

''గాలవా! రమ్ము. ఆ విషయములో మనమిద్దరము ఆలోచింతము. నీ గురువునకు నీవు ప్రతిజ్ఞ చేసి ఇవ్వదలచిన గురుదక్షిణ ధనమంతయు ఇవ్వక ఉండగూడదు."

గరుడ - గాలవులు యయాతి యింటికిపోయి గురుదక్షిణ కొరకు అశ్వములను యాచించుట

"గాలవా! భూమండలములోనున్న సారమంతయు తపించి అగ్నిదేవుడు నిర్మించినట్టిదియు, అగ్నిని జ్వలింపజేయు వాయుదేవుడు శోధించినట్టిదియు నైన సువర్ణమునకు 'హిరణ్యము' అని పేరు.

''ఈ ప్రపంచమంతయు, సువర్ణము ప్రధానమైనది. అందుచేతనే దీనిని హిరణ్య మందురు. (భాగ్యవంతులను ఆకర్షించునది.)

''ఆ హిరణ్యము ప్రపంచమును స్వయముగ ధరించుచు ఇతరుల చేతకూడ ధరింపజేయుచున్నది. ఈ కారణము చేత సువర్ణమునకు 'ధనము' (ధరించునది) అని పేరు.

''ఈ సువర్ణ (చెడని మంచి వర్ణము గలది) ధనము మూడు లోకములం దును ఎల్లప్పుడు స్థిరముగా నుండును.

''ద్విజోత్తమా! పూర్వ భాద్రపద - ఉత్తర భాద్రపద నక్షత్రములలో ఒక దానితో శుక్రవారము కలిసినపుడు అగ్నిదేవుడు కుబేరుని కొరకు తన సంకల్పముతో ధనమును నిర్మించి దానిని మనుష్యులకిచ్చును.

''పూర్వ భాద్రపద దేవతయైన 'అజైకపాదుడు', ఉత్తర భాద్రపద దేవతలైన అహిర్బుధ్న్యులు మఱియు కుబేరుడు - ఈ ముగ్గురు ఈ ధనమును రక్షించు చుందురు.

''పూర్వకర్మ వశముచేత ధనము లభించని యెడల శ్యామకర్ణ శ్వేతాశ్వములు లభింపజాలవు.

''కాబట్టి పురజనులను బాధింపక సంపాదించి, మనకు ధనమును ఇచ్చి కృతార్థులను చేయగల రాజర్షుల వంశమునందు పుట్టిన ధర్మాత్ముడైన ఒక రాజు కడకు పోయి నీవు ధనమును యాచింపుము అని అభిప్రాయము. అట్టి రాజును గూర్చి చెప్పెదను వినుము:

యయాతి చరిత్ర

"గాలవా! చంద్రవంశమునందు పుట్టిన ఒక రాజు నా మిత్రుడున్నాడు. అయనవద్దకు మనమిద్దరము పోవుదము. ఈ భూమండలమునందు అందరికన్నను ఆయన దగ్గర ధనము విశేషముగా ఉన్నది. ఆ రాజు పేరు 'యయాతి.' అతడు నహుషుని పుత్రుడు - సత్యపరాక్రమము కలవాడు.

''నీవు అతనిని కోరి నేను చెప్పిన మీదట అతడు స్వయముగా నీకు ధనము ఇచ్చును. అతని వద్ద ధనాధ్యక్షుడైన కుబేరున కున్నంత ధన సంపదలు ఉన్నవి.

''విద్వన్! ఈ విధముగా నీవు ధనదానము తీసికొని గురుదక్షిణ యిచ్చి ఋణ విముక్తుడవు కమ్ము."

''ఈ విధముగా వారిరువురు మాట్లాడుకొనుచు ప్రతిష్ఠానపురము నందున్న యయాతి మహారాజు సభకు పోయిరి. ఆ యిరువురకు రాజు అర్ఘ్యపాద్యాదులతో పూజ చేసి వారు వచ్చిన కారణమును అడుగగా, గరుత్మంతుడు అతనితో ఇట్లు చెప్పెను:

''నహుషనందనా! తపోధనుడైన ఈ గాలవుడు నా మిత్రుడు. ఇతడు పదివేల యేండ్లు విశ్వామిత్ర మహర్షికి శిష్యుడుగా నుండెను. విశ్వామిత్రుడు, విద్యాదీక్ష యిచ్చిన తరువాత ఇతనిని ఇంటికి పొమ్మని ఆజ్ఞయిచ్చెను.

''అప్పుడు ఈ గాలవుడు గురువుతో నిట్లనెను:

"భగవన్! నేను మీకు ఏమి గురుదక్షిణ ఇత్తును?''

"అట్లు మాటిమాటికి నితడు పట్టుదలతో అడుగగా విశ్వామిత్రునకు క్రోధము వచ్చి ఇతనివద్ద ధనము లేదని తెలిసినప్పటికి, నితనితో నిట్లనెను:

"తెమ్ము. గురుదక్షిణ నాకిమ్ము. ఉత్తమ జాతిలో ఉత్పన్నములైన ఎనిమిది నూర్ల గుఱ్ఱములను గురుదక్షిణగా ఇమ్ము. వాటి శరీర కాంతి చంద్రునివలె ఉజ్జ్వలముగా తెల్లగా ఉండవలెను. వాటి చెవులు నల్లగా ఉండవలెను. గాలవా! ఇదియే నీవు నాకు ఇవ్వవలసిన గురుదక్షిణ."

''రాజా! ఆ కారణముచేత ఈ గాలవుడు గురుదక్షిణ నిచ్చుటకు అసమర్థుడై మహాశోకసంతప్తుడై యున్నాడు. దాని కొఱకు ఇప్పుడు నీ శరణుజొచ్చినాడు.

''నీ వద్దనుండి ఆ ధనము యాచించి తీసికొని పోయి గురువుకోరిన గురు దక్షిణ ధనమిచ్చి క్లేశరహితుడై గొప్ప తపస్సునందు కాలము గడపగలడు.

''ఇతడు చేయు తపస్సులో ఒక భాగమును నీకుగూడ ఇతడు ఇవ్వగలడు. నీవు రాజర్షి జనోచితమై తపస్సును సంపూర్ణముగ ఇదివఱకే చేసియున్నను దానికి తోడుగా ఈ గాలవుడు తన బ్రహ్మ తపస్సును కూడ నీకు ఇచ్చి నిన్ను ఇతోధికముగ సమగ్రతపస్సుచేత సంపన్నుని చేయగలడు.

''రాజా! ఇక్కడ నీవు దానమిచ్చు అశ్వశరీరమునందు ఎన్ని రోమములు ఉన్నవో అన్ని గుఱ్ఱములు దానమిచ్చువారికి (పరలోకమునందు) ప్రాప్తించగలవు.

ఈ గాలవుడు దానము పొందుటకు సుయోగ్యుడు. శంఖములో పాలుపోసి ఉంచినట్లు ఇతని చేతియందు నీవు ఇచ్చు దానము మిక్కిలి శోభిల్లును."

యయాతి గాలవునకు తన కన్యనిచ్చుట - ఆమెతో గాలవుడు అయోధ్య రాజుకడకు పోవుట

''ఇట్లు చెప్పి నారదుడు, గరుడుని మాటలు వినిన యయాతి భావమును ఇట్లు చెప్పదొడగెను:

''దుర్యోధనా! తన ప్రియమిత్రుడైన గరుడుని, మూర్తీభవించిన తపస్సుగా నున్న గాలవుని తన సమక్షమునందు చూచి, గరుడుడు తనకు తెలిసిన దాన వృత్తాంతమును విని యయాతి మనస్సునందు, 'వీరిరువురు సూర్యవంశీయులైన అనేక రాజులను విడిచి నాకడకు వచ్చినారు. ఇది నాకు ఆనందదాయకము' అని భావించి, గరుడునితో నిట్లనెను:

"గరుడా! నేడు నా జన్మము సఫలమైనది. నా కులము ఉద్ధరింపబడినది. నేను పరిపాలించు ఈ దేశమంతయు ఉద్ధరింపబడెను. మిత్రమా! ఐనను నేనొక్క మాట చెప్పెదను వినుము:

"నీవు పూర్వమునుండి తలచుచున్నంత ధనవంతుడనుగా నేను ఇప్పుడు లేను. నా వైభవము ఇప్పుడు క్షీణించినది. ఇట్టి దశలోకూడ నేను నీ రాకను నిష్ఫలము చేయను. ఈ బ్రహ్మర్షిని కూడ నేను విఫలుని చేయదలచలేదు. నేనిప్పుడు ఈ కార్యమును నెరవేర్చుటకు ఉపయోగపడు ఒక వస్తువును ఇచ్చెదను.

''యాచకుడు తనవద్దకు వచ్చి హతాశుడై తిరిగిపోయినచో అతనికి ఆశాభంగము చేసిన రాజుయొక్క కులమంతయు దగ్ధమగును. యాచకుడు అడిగిన వస్తువు నావద్ద లేదు పొమ్మని చెప్పి ఆశాభంగముచేయుట చేత కలుగు పాపముతో సమానమగు మహా పాపము వేరొకటి లేదు. అట్లు నిరాశతో యాచకుడు పోయినచో ఆ యాచకుడు మృతప్రాయుడు అగును. తన కోరికను నెరవేర్చని ధనవంతుని పుత్ర పౌత్రులను నశింపచేయును.

"నా కొక పుత్రిక ఉన్నది. ఆమె నాలుగు కులములను ఉద్ధరింపగలదు. ఆమె శరీర కాంతి, దేవకన్యల కాంతితో సమానము. ఆమె ధర్మపరురాలు. ధర్మమును వృద్ధిపొందింపగలదు.

''గాలవా! ఆమె రూప - సౌందర్యములచేత ఆకర్షింపబడి దేవ దానవ మానవులందరు సర్వదా ఆమెను అభిలషించుచుందురు. కనుక, నీవు ఈ నా పుత్రికను గ్రహింపుము. ఈమెకు రాజులందరు తమ రాజ్యమును గూడ శుల్కముగా ఇచ్చి గ్రహించెదరు. ఇట్లుండగా ఎనిమిది నూర్ల తెల్లని శ్యామ కర్ణాశ్వముల మాట యెంత?

''కావున మాధవి యను పేరుగల ఈ నా పుత్రికను తీసికొనుము. నేను దౌహిత్రవంతుడను అగునట్లు వరమిమ్ము."

''యయాతి అట్లు చెప్పిన తరువాత, గాలవుడు ఆ కన్యకను స్వీకరించి, ''మంచిది, నేను మరల ఎప్పుడైన నీ కడకు వచ్చెదను" అని యయాతికి చెప్పి అక్కడనుండి గరుడునితో వెడలిపోయెను.

"తరువాత గరుడుడు, 'గాలవా! ఇప్పుడు నీకు గుఱ్ఱములు లభించుటకు ఒక మార్గము దొరికినది. ఇక నేను పోయెదను' అని చెప్పి గాలవుని వద్ద సెలవు తీసికొని తన యింటికి వెడలి పోయెను.

"పక్షిరాజు గరుడుడు వెడలినమీదట గాలవుడు ఆ కన్యకను వెంటతీసికొని 'ఈ కన్యకను తీసికొని నాకు కావలసినంత ధనము ఇవ్వగల రాజు ఎవడున్నాడు?' అని యోచించుచు అయోధ్యా రాజ్యు మేలుచున్న ఇక్ష్వాకు వంశీయుడైన 'హర్యశ్వుని' కడకు పోయెను.

''అతనికడ సుసంపన్నములైన చతురంగ సైన్యము లుండెను. కోశము ధనధాన్యములు సైన్యబలము గల ఆ రాజు ప్రజలకు మిక్కిలి ప్రియుడుగా నుండెను.

"అతనికి బ్రాహ్మణులయెడ మిక్కిలి ప్రేమ యుండెను. ప్రజలకు హితము చేయవలెనని సర్వదా అతడు తలచుచుండెను.

అతని మనస్సు ప్రాపంచిక సుఖములనుండి విరక్తి చెంది శాంతముగా నుండెను. అతడు ఉత్తమమైన తపస్సులో నిమగ్నుడై యుండెను.

''అట్లు మహాత్ముడుగా నున్న హర్యశ్వమహారాజు కడకు గాలవుడు పోయి యిట్లనెను:

''రాజా! ఈ నా కన్యక తన సంతానము ద్వారా నీ వంశాభివృద్ధి చేయగలదు. నీవు నాకు శుల్కమిచ్చి ఈమెను నీ పత్నిగా గ్రహింపుము.

''హర్యశ్వా! తొలుత ఈమెకుగాను ఇవ్వవలసిన శుల్కమును గూర్చి చెప్పెదను. విని నీ కర్తవ్యమును నిశ్చయించుకొనుము.

రెండు నూర్ల శ్యామకర్ణాశ్వము లిచ్చి హర్యశ్వుడు యయాతి బిడ్డవలన వసుమనసుని కనుట - గాలవుడా కన్యకతో మరియొక చోటికి పోవుట

''అట్లు చెప్పి నారదుడు దుర్యోధనునకు అనంతర కథ చెప్పదొడగెను.

''దుర్యోధనా! తరువాత హర్యశ్వమహారాజు చాలసేపు యోచన చేసి సంతానోత్పాదనమందు ఇచ్ఛగలవాడై గాలవమునితో నిట్లనెను:

''బ్రాహ్మణోత్తమా! ఈ కన్యకకు 'నితంబములు - లలాటము - తొడలు- ముక్కు' - ఈ ఆరు అంగములు ఉన్నతములుగా ఉన్నవి.

''వ్రేళ్ళ కణుపులు - కేశములు - రోమములు - నఖములు - చర్మము - ఈ ఐదు సూక్ష్మములుగా నున్నవి.

''స్వరము - అంతరింద్రియము - నాభి - ఈ మూడు అంగములు గంభీరములుగా నున్నవి. (గంభీరమనగా-లోతు గలది అని కూడా యర్థము గలదు.)

''అరికాళ్లు - అరిచేతులు-కన్నుల కొనలు-నఖములు-ఈ యైదు అంగములు రక్తవర్ణములుగా నున్నవి.

''ఈ లక్షణములన్నియు ఉత్తమజాతి స్త్రీకి ఉండదగినవి. ఈమె దేవాసురులందరికిని దర్శనీయురాలుగా నున్నది. గాంధర్వ విద్యలో కూడ ఈమె సమర్థురాలు.

"ఈ లక్షణములనుబట్టి ఈమె అనేక సంతానమును ఉత్పత్తి చేయగలదని తెలియుచున్నది. చక్రవర్తియైన కొడుకును కనగలదు.

''కాబట్టి, నీవు నా వైభవమునుబట్టి ఈమె కొఱకు ఇవ్వవలసిన సముచితమైన శుల్కమును తెల్పుము.

''హర్యశ్వుని మాటలు విని గాలవుడు అతనితో ఇట్లనెను:

"రాజా! నాకు తెల్లని శరీరము నల్లచెవులు గల ఎనిమిదినూర్ల గుఱ్ఱముల నిచ్చి అగ్నిని పుట్టించు అరణి (అగ్నిని చిలుకు కొయ్య) వలె నున్న ఈ నా కన్యను స్వీకరింపుము."

''దుర్యోధనా! గాలవుని మాటలు విని హర్యశ్వమహారాజు కామమోహితుడై గాలవునితో దీనముగ నిట్లనెను:

''మహామునీ! నీవు కోరిన లక్షణములు గల అశ్వములు నా వద్ద రెండు నూర్లు మాత్రమే కలవు. కాని, ఇతరజాతికి చెందిన గుఱ్ఱములు అనేక శత సంఖ్యలో నున్నవి. కాబట్టి, నేను ఈ కన్యనుండి ఒక సంతానమును మాత్రమే కనెదను. నా యీ కోర్కెను నెరవేర్చుము.''

"ఆ మాట విని మాధవి గాలవునితో నిట్లనెను:

"మహామునీ! నాకు ఒక వేదవిదుడైన మహాత్ముడు వరమిచ్చియుండెను. ఆ వరము ప్రకారము ఒకసారి బిడ్డను కనిన తరువాతనూ నేను కన్యకగానే

అగుదును. కాబట్టి నీవు రెండు నూర్ల అశ్వములను తీసికొని నన్ను అతని కప్పగింపుము."

''ఆ విధముగా నీవు నలుగురు రాజులకు ఇచ్చి ఒక్కొక్కరివద్ద రెండు నూర్ల అశ్వముల చొప్పున తీసికొనినచో నీకు ఎనిమిది నూర్ల అశ్వములు లభించును. నాకుగూడ నలుగురు పుత్రులు జన్మింతురు. ఈ ప్రకారముగ నీవు గురుదక్షిణకై ధనమును ప్రోగుచేసికొనుము. ఇది నాకు ఇష్టము. తరువాత నీ యిష్టప్రకారము చేయుము.''

''అట్లు మాధవి చెప్పగా విని గాలవుడు హర్యశ్వునితో నిట్లనెను:

''రాజా! నీవీ కన్యకను తీసికొనుము. నీవు నాకు ఇవ్వబోవు శుల్క ధనములో నాల్గవ భాగమునకు సరిపడునంతగా ఒక కుమారుని కనుము.''

''అప్పుడు హర్యశ్వుడు గాలవుని అభినందించి ఆ కన్యకను గ్రహించి సముచిత దేశకాలములందు ఆమెద్వారా తాను కోరిన ఒక పుత్రుని కనెను.

''ఆ పుత్రుడు 'వసుమనసుడు' అను పేరుతో ప్రసిద్ధుడయ్యెను. అతడు వసువువంటి కాంతిగలవాడై వసువులకన్నను అధిక ధనరత్న సంపన్నుడై విరివిగ దానము చేయుచుండెను.''

''దుర్యోధనా! తరువాత సముచిత సమయమునందు గాలవుడు తిరిగి అక్కడకు వచ్చి, హర్యశ్వునితో నిట్లనెను:

''రాజా! నీకు సూర్య సమాన తేజస్సు గల పుత్రుడు కలిగెను. ఇప్పుడు ఈ కన్యకను తోడుకొని నేను గుఱ్ఱములను యాచించుటకు ఇతర రాజులవద్దకు పోవలెను.''

''సత్యవచనుడైన హర్యశ్వుడు పౌరుషము కలవాడయ్యు తక్కిన ఆరు నూర్ల అశ్వములు తనకడలేనందున మాధవిని తిరిగి గాలవున కిచ్చెను.

''మాధవి దేదీప్యమానమగు రాజ్యలక్ష్మిని వదలి తన యిచ్ఛానుసారముగ మరల కన్యకయై గాలవుని వెంటపోయెను.

''గాలవుడు పోవునపుడు హర్యశ్వునితో నిట్లనెను:

''రాజా! నీ విచ్చిన ఈ రెండునూర్ల అశ్వములు నీ వద్దనే న్యాసముగా (ఇల్లడ) నుంచుకొనుము.''

''దుర్యోధనా! ఇట్లు చెప్పి గాలవుడు ఆ రాజకన్యకతో 'దివోదాస' రాజు కడకు పోవదలచి మాధవితో నిట్లనెను:

దివోదాసుడు యయాతికన్యకయందు ప్రతర్దనుని కనుట

''భద్రే! కాశీరాజు భీమసేన కుమారుడు 'దివోదాసుడు' మహాబలపరాక్రమములు కలవాడని ప్రసిద్ధుడై యున్నాడు. ఆయనకడకు మనమిరువురము పోవుదము. నీవు మెల్ల మెల్లగా నావెంట నడచి రమ్ము. ఏమాత్రము దుఃఖ పడకుము. దివోదాసుడు ధర్మాత్ముడు - సత్యశీలుడు.''

''దుర్యోధనా! దివోదాసరాజుకడకు గాలవుడు పోవగానే గాలవునకు ఆ రాజు అతిథిపూజ చేసెను.

"అప్పుడు గాలవుడు తనకు శుల్క మిచ్చి యీ కన్యకనుండి ఒక సంతానమును కనవలసినదిగా చెప్పెను.

"బ్రాహ్మణోత్తమా! నేనీవిషయము ఇదివరకే వినియుంటిని. ఇక నీవు విస్తారముగ చెప్పబనిలేదు. నీవు ఈ విషయము సూచించిన వెంటనే నా మనస్సునందు పుత్రోత్పాదనేచ్ఛ కలిగెను.

''ఇంతమంది రాజులు ఉండగా వారిని విడిచి నన్ను ప్రార్థించుటకు వచ్చితివి. ఇది నాకు మిక్కిలి గౌరవప్రదముగా నున్నది. నీవు చెప్పినట్లే అగుగాక!

''గాలవా! నావద్ద కూడ నీవు కోరిన లక్షణములు గల అశ్వములు రెండు నూర్లే ఉన్నవి. కావున, నేను కూడ ఈమె గర్భము నుండి ఒక కుమారుని మాత్రమే కనెదను.''

"ఆ మాట విని గాలవుడు, 'మంచిది అలాగే కానిమ్ము' అని దివోదాసునకు ఆ కన్య నిచ్చెను. అతడామెను విధిపూర్వకముగా పెండ్లి చేసికొనెను.

"రాజర్షియైన దివోదాసుడు మాధవి యందు అనురక్తుడై ఆమెతో రమించుచుండెను.

అయన ఆమెతో సూర్యుడు ప్రభావతితో, అగ్ని స్వాహాదేవితో, ఇంద్రుడు శచీదేవితో, చంద్రుడు రోహిణితో, యముడు ధూమోర్ణతో, వరుణుడు గౌరితో, కుబేరుడు బుద్ధితో, నారాయణుడు లక్ష్మితో, సముద్రుడు గంగతో, రుద్రుడు రుద్రాణి (పార్వతి)తో, బ్రహ్మదేవుడు వేదీ దేవితో, వసిష్ఠ కుమారుడైన శక్తి అదృశ్యంతితో, వసిష్ఠుడు అక్షమాల (అరుంధతి)తో, చ్యవనుడు సుకన్యతో,

పులస్త్యుడు సంధ్యా దేవితో, అగస్త్యుడు విదర్భరాజకుమారియైన లోపాముద్రతో, సత్యవంతుడు సావిత్రితో, భృగుమహర్షి పులోమతో, కశ్యపుడు అదితితో, జమదగ్ని రేణుకతో, కుశికవంశజుడైన విశ్వామిత్రుడు హైమవతితో, బృహస్పతి తారాదేవితో, శుక్రుడు శతపర్వతో, భూమిపతి భూమితో, పురూరవుడు ఊర్వశితో, బుధికుడు సత్యవతితో, మనువు సరస్వతితో, దుష్యంతుడు శకుంతలతో, సనాతనుడైన ధర్మదేవుడు ధృతితో, నలుడు దమయంతితో, నారదుడు సత్యవతితో, జరత్కారుముని నాగకన్యకయైన జరత్కారువుతో, పులస్త్యుడు ప్రతీచ్యతో, ఊర్ణాయువు మేనకతో, తుంబురుడు రంభతో, వాసుకి శతశీర్షతో, ధనంజయుండు కుమారితో, శ్రీరామచంద్రుడు విదేహకుమారియైన సీతాదేవితో, శ్రీకృష్ణ భగవానుడు రుక్మిణి తోడను రమించునట్లు రమించెను,

"అట్లు తనతో రమించుచున్న దివోదాస రాజు నుండి మాధవి ''ప్రతర్దనుడు'' అను పేరు గల ఒక పుత్రుని కనెను.

"దుర్యోధనా! తరువాత గాలవముని దివోదాసు కడకు పోయి యిట్లనెను:

''రాజా! ఇక ఇప్పుడు రాజకన్యను నాకు తిరిగియిమ్ము. నీవు నాకిచ్చిన యశ్వములు నీ యొద్దనే యుండనిమ్ము. ఇప్పుడు నేను తక్కిన శుల్కధనము కొఱకు ఇతరత్ర పోవుచున్నాను."

''దుర్యోధనా! అప్పుడు ధర్మాత్ముడైన దివోదాసుడు గాలవునకు ఆమెను తిరిగియిచ్చి తన మాటను నిలబెట్టుకొనెను.

ఉశీనరుడు మాధవి వలన శిబిని గనుట - అక్కడి నుండి పోవుచున్న గాలవునకు మార్గములో గరుడుని దర్శనము

''దుర్యోధనా! తరువాత సత్యపాలకురాలైన ఆ మాధవి కాశీరాజు యొక్క రాజ్యలక్ష్మిని విడిచి విప్రవరుడైన గాలవునితో వెడలిపోయెను.

''గాలవుడు తన కార్యసిద్ధి కొరకు 'ఉశీనర' రాజును చూచుటకు భోజనగరమునకు పోయి అతనితో ఇట్లనెను:

''రాజా! ఈ కన్యక మీ రాజ్య శాసనము కొఱకు సమర్థులైన ఇద్దరు కుమారులను నీ నుండి పొందగలరు. వారు సూర్యచంద్రులవలె తేజస్వులై, నీకు ఇహపరలోకములయందు సుఖములు కలిగించి, నీ కోరికలు పూర్తి చేయగలరు.

దీనికి శుల్కముగా శరీరమంతయు తెల్లవర్ణము కలిగి చేవులు మాత్రము నల్లగానున్న నాలుగు నూర్ల గుఱ్ఱములను ఇవ్వవలెను.

''ఈ నా ప్రయత్నము - గురుదక్షిణ యిచ్చుటకే చేయుచున్నాను. అశ్వములు నాకక్కరలేదు, రాజా! నేను కోరిన శుల్కధనమును నీవు ఇవ్వగలిగినచో అన్యథా విచారింపక ఈ నా కార్యము నెరవేర్చుము.

''రాజా! నీవు అనపత్యుడవు. ఇద్దరు పుత్రులను కనుము. పుత్రులు అనెడు నౌకచేత నీ పితరులను, నిన్ను తరింపజేసికొనుము. పుత్రజనితమైన పుణ్యఫలమును అనుభవించు మనుష్యులు ఎప్పుడును స్వర్గమునుండి క్రిందకు పడిపోవరు. సంతాన హీనులగు మనుష్యులు పోవు ఘోర నరకమునకు పుత్రవంతులు పోవరు.''

''దుర్యోధనా! అట్లు అనేక విధములుగ చెప్పిన గాలవుని మాటలు విని ఉశీనరుడు ఆయనతో నిట్లనెను:

''గాలవా! నీ మాటలన్నియు వింటిని. ఈమె నుండి సంతానము కనుటకు నేను కోరుచున్నాను. కాని, దైవము ప్రబలమైనది.

"నావద్ద రెండు నూర్లు అశ్వములు మాత్రమే కలవు. ఇతర జాతి అశ్వములు వేనవేలు కలవు. కనుక, నేను కూడ ఈమెనుండి ఒక్క పుత్రునే కనెదను. ఇంతకు పూర్వపు ఇద్దరు రాజుల మార్గమునే నేనును అనుసరించెదను.

''ద్విజవరా! నేను అశ్వముల వెలను ఇచ్చి నీ శుల్కమునంతయు తీర్చగలను. కాని, అదికూడ అసంభవము. ఎందుకనగా నా వద్దనున్న ధనము పౌరజానపదుల ఉపయోగము కొరకే ఉన్నది. నా ఉపయోగముల కొఱకు ఈ ధనమును వెచ్చింప జాలను.

''ధర్మాత్మా! ఇతరుల ధనమును తన యిచ్చానుసారముగ దానము చేయు రాజునకు ధర్మము, కీర్తి కలుగవు. కావున, నీవు దేవకన్యవంటి యీ సుందరిని కేవలము ఒక్క పుత్రుని కనుట కొఱకే నాకు ఇమ్ము. ఈమెను నేను గ్రహించెదను.''

"దుర్యోధనా! ఆ విధముగా న్యాయ సమ్మతములైన మాటలను చెప్పుచున్న ఉశీనరరాజును, గాలవుడు మిక్కిలి ప్రశంసించి ఆయనకు కన్యకను ఒప్పగించి అడవికి పోయెను.

"ఆ రాజు ఆ కన్యకను పొంది రాజ్యలక్ష్మిని పొందినంత సంతోషము పొంది ఆ కన్యకతో రమించు చుండెను.

"పర్వతగుహలలో, రమ్య నదీతీరములందు, సెలయేళ్ళ పార్శ్వములందు, విచిత్రోద్యానములందు, వనోపవనములందు, రమణీయములైన మేడలయందు భవన శిఖరములందు, వాయు మార్గములో నెగురు విమానములందు, భూగర్భ గృహములందును మాధవితో విహరించెను.

"దుర్యోధనా! ఉశీనర రాజువలన మాధవికి బాలసూర్యప్రభగల ఒక కొడుకు పుట్టెను. అతడు 'శిబి' యను పేరుతో ప్రసిద్ధుడయ్యెను.

"దుర్యోధనా! తరువాత గాలవముని ఉశీనరుని సభకు పోయి అతని నుండి కన్యకను తిరిగి తీసికొని పోవుచుండగా అతనికి మార్గమునందు వినతా నందనుడైన గరుత్మంతుడు కనబడి అతనితో నిట్లనెను:

గాలవుడు ఆరునూర్ల అశ్వములను, మాధవినిన్ని విశ్వామిత్రుని కిచ్చుట - విశ్వామిత్రుడు మాధవి వలన అష్టకుని కనుట - గాలవుడా కన్యతో ఆమె తండ్రి యింటికి పోవుట

"మునివరా! నేను ఇప్పుడు నిన్ను కృతకృత్యునిగా చూచితిని. చాల సంతోషమైనది."

''ఆ మాటకు గాలవుడు గరుడునితో నిట్లనెను:

''గరుడా! నే నివ్వవలసిన గురుదక్షిణలో ఇంకను నాల్గవ భాగము మిగిలి యున్నది. దానిని త్వరగా సంపాదించవలసియున్నది.''

అ మాట విని గరుడుడు గాలవునితో నిట్లనెను:

''గాలవా! ఇక నీవు నాల్గవ భాగము కొఱకు ప్రయత్నింప నక్కరలేదు. ఎందుకనగా, ఈ నీ కోరిక నెరవేరదు. పూర్వము జరిగిన కథ చెప్పెద వినుము:

''గాలవా! పూర్వకాలమునందు కన్యకుబ్జనగరాధీశ్వరుడైన 'గాధి' రాజునకు 'సత్యవతి' అను కూతురు ఉండెను. ఆమెను పెండ్లి యాడవలెనను కోర్కెతో ఋచీక మహాముని గాధిరాజును కోరెను అప్పుడు ఋచీకు డతనితో నిట్లనెను:

''భగవన్! నాకు కన్యాశుల్కముగా ఒక వేయి గుఱ్ఱములు- చంద్రునివలె తెల్లనివి, చెవులు నల్లగా నుండునని యిమ్ము.''

"ఆ మాటకు ఋచీకుడు 'తథాస్తు' అని వరుణ లోకమునకు పోయి అక్కడ అశ్వతీర్థమునందు ఆ గుఱ్ఱములను సంపాదించి తెచ్చి గాధిరాజునకు ఇచ్చెను.

''గాధిరాజు 'పుండరీకము' అను యజ్ఞము చేసి ఆ గుఱ్ఱముల నన్నింటిని బ్రాహ్మణులకు యజ్ఞదక్షిణగా పంచి యిచ్చెను.

''తరువాత రాజులు ఆ బ్రాహ్మణులకడకు పోయి, వారి నుండి రెండు వందల చొప్పున ఆ గుఱ్ఱములను కొనుక్కొని తమకడనుంచుకొని తమ తమ పురములకు పోవుటకు బయలు దేరిరి.

''అప్పుడు వారికి మార్గములో నొకచోట నదిని దాటవలసి వచ్చెను. నాలుగు నూర్ల గుఱ్ఱములు వితస్తా (ఝీలం) నదియొక్క తీవ్రమైన జల ప్రవాహములో కొట్టుకొని పోయెను.

''గాలవా! కాబట్టి ఈ దేశమునందు ఆరువందల గుఱ్ఱములకంటె ఎక్కువ గుఱ్ఱములు, ఆ లక్షణములు గలవి దొరకవు. కనుక, వాటిని సంపాదించుట అసంభవము. కనుక, తక్కిన రెండు వందల గుఱ్ఱములకు బదులుగా నీవు ఈ కన్యకనే విశ్వామిత్రునకు సమర్పింపుము ఇట్లు చెయుటవలన నీ భయమంతయు తొలగిపోయి, నీవు ఋణ విముక్తుడవై, కృతకృత్యుడ వయ్యెదవు.''

''ఆ మాటలు విని గాలవుడు 'ఈ ఉపాయము చాల బాగున్న'దని చెప్పి గరుడునితోపాటు ఆరువందల అశ్వములను, కన్యకను వెంటతోడుకొని విశ్వామిత్రుని కడకు పోయి ఇట్లనెను:

''గురుదేవా! నీవు కోరినట్టి ఆకారముగల ఆరు నూర్ల అశ్వములను నీకు గురుదక్షిణగా సమర్పించుచున్నాను. తక్కిన రెండు నూర్ల అశ్వములు లభించ లేదు. వాటికి బదులుగా నీవు ఈ కన్యకను గ్రహింపుము.

''ఈమె గర్భమునుండి ధర్మాత్ములైన ముగ్గురు పుత్రులను కనుటకు రాజర్షులు ఒకొక్కక్క పుత్రుని కనుటకు రెండువందల అశ్వముల చొప్పున కన్యాశుల్కము నిచ్చిరి.

''ఇప్పుడు నీవు కూడ పురుష శ్రేష్ఠుడైన నాల్గవ పుత్రుని ఈమె నుండి కనుము ఆ విధముగా నీకు ఎనిమిదివందల అశ్వముల సంఖ్య పూర్తియగును.

అందుచేత నేను నీనుండి ఋణవిముక్తుడనై సుఖముగా తపస్సు చేసికొనెదను. నా యెడల నీవు ఈ మాత్రము దయచూపుము.''

''దుర్యోధనా! గాలవుని మాటలు విని, విశ్వామిత్రుడు అతి సౌందర్య వతియైన ఆ కన్యకను చూచి గాలవునితో నిట్లనెను:

''గాలవా! ఈ కన్యకను నీవు మొదలే నాకెందుకియలేదు? నాకే వంశ ప్రవర్తకులైన నల్వురు పుత్రులు పుట్టియుందురు కదా! సరియే కానిమ్ము. ఏక పుత్ర ఫలప్రాప్తికొరకే యీ కన్యను స్వీకరించెదను. నీవుతెచ్చిన ఈ గుఱ్ఱములు ఆరు నూర్లు నా యాశ్రమమందే మేయుచు తిరుగుచుండుగాక!''

"దుర్యోధనా! మహా తేజస్వియైన విశ్వామిత్రుడు మాధవితో రమించుచు ఆమె గర్భము నుండి ఒక పుత్రుని కనెను. అతని పేరు అష్టకుడు. ఆ పుత్రునకు విశ్వామిత్రుడు ధర్మార్థ సంపదలతోబాటు అశ్వములను గూడ ఇచ్చెను.

"పిమ్మట అష్టకుడు చంద్రపురమువలె ప్రకాశించుచున్న విశ్వామిత్రుని రాజధానికి పోయెను. విశ్వామిత్రుడు ఆ కన్యను గాలవునికే తిరిగి యిచ్చి తాను తపస్సునకుగాను వనమునకు పోయెను.

''దుర్యోధనా! యిట్లు గురుదక్షిణ యిచ్చి గాలవుడు ఋణవిముక్తుడై సంతుష్టితో గరుడుని సమక్షమున మాధవితో నిట్లనెను :

"సుందరీ! నీ జ్యేష్ఠపుత్రుడు దానపతి యగును. రెండవవాడు వీరాగ్రేసరుడగును. మూడవవాడు సత్యధర్మపరాయణుడగును. నాల్గవవాడు యజ్ఞానుష్ఠాన పరుడగును" అని చెప్పి మరల నిట్లనెను:

''మాధవీ! నీవు నీ పుత్రులద్వారా నీ తండ్రిని తరింపజేసితివి. ఆ నలుగురు రాజులను పుత్రోత్పత్తిచేత ఉద్ధరించితివి. ఇక నిప్పుడు నాతో రమ్ము.''

''దుర్యోధనా! ఇట్లు చెప్పి గాలవుడు గరుత్మంతుని యాజ్ఞ తీసికొని రాజకన్యకను తోడ్కొని యామెను తిరిగి ఆమె తండ్రియయాతికి నిచ్చి, వనమునకు తపస్సు చేయుటకు వెడలి పోయెను."

మాధవి వనములో తపస్సు చేయుట-యయాతి స్వర్గసుఖ మనుభవించి మోహముచేత తేజోహీనుడగుట

''అట్లు చెప్పి నారదుడు దుర్యోధనునకు తరువాతి కథ చెప్పదొడగెను:

''దుర్యోధనా! తరువాత యయాతిరాజు తిరిగి మాధవి యొక్క స్వయంవరమును గూర్చి విచారించుచు గంగా యమునా సంగమమందు తన యాశ్రమములో ఉండెను.

''పిదప మాధవిని ఆమె సోదరులు 'పూరువు, యదువు' అనువారలు రథమునందు కూర్చొన బెట్టుకొని విశ్వామిత్రుని యాశ్రమమునకు పోయిరి. స్వయంవరమునందు నాగ యక్ష మనుష్య గంధర్వ పశుపక్షులును, పర్వత వృక్ష వనములందు నివసించు వారును అందరు వచ్చిరి. ప్రయాగలోని ఆ వనము అనేక దేశముల రాజులచేత వ్యాపించియుండెను. బ్రహ్మసమానులగు బ్రహ్మర్షులు ఆ వనమును చుట్టియుండిరి.

''దుర్యోధనా! అప్పుడు మాధవికి అక్కడ చేరియున్న వరుల వరిచయము చేయబడుచుండెను. అందరిని విడిచి ఆమె తపోవనమునే తనకు వరునిగా కోరుకొని, ఆ వచ్చిన వారిలో నెవనిని గూడ వరించక తపస్సునకే నిశ్చయించుకొనెను.

''తరువాత మాధవి రథము దిగి, తండ్రికి, సోదరులకు బంధువులకు, కుటుంబ జనులకు నమస్కరించి పుణ్యతపోవనమునకు పోయి తపస్సు చేసికొనుచుండెను.

''ఆమె ఉపవాసము మొదలైన అనేక దీక్షలను, నియమములను పాటించుచు మనస్సును రాగద్వేషాదిరహితముగ చేసికొని వనమునందు మృగి (ఆడు లేడి) వలె సంచరించుచుండెను.

''దుర్యోధనా! ఈ విధముగ మృగి రూపముతో మాధవి వైడూర్య మణి కిరణములవలె ప్రకాశించుచున్న కోమలములు, మృదువులు, మధురములు నయిన పచ్చిగడ్డిని తినుచు పవిత్ర నదుల శీతల శుద్ధ నిర్మల స్వాదుజలముల త్రావుచు, మృగములకు నివాసమై, వ్యాఘ్రరహితము, దవానల (కార్చిచ్చు) శూన్యమునగు వనభూమియందు మృగములతోబాటు వనచారిణియైన లేడివలె సంచరించుచుండెను.

''యయాతిరాజుకూడ తన పూర్వరాజుల సదాచారములను పాలించుచు అనేక సహస్రవత్సరములు జీవించి మరణించెను.

"పూరువు - యదువు అను యయాతి పుత్రులిద్దరు వంశమునందు అభ్యుదయముతో ప్రవర్ధిల్లుచుండిరి. నహుష పుత్రుడైన యయాతి తన యిరువురు పుత్రులతో ఇహపరలోకములందు ప్రతిష్ఠితుడయ్యెను.

''దుర్యోధనా! యయాతి మహారాజు మహర్షులవలె పుణ్యాత్ముడు తపశ్శాలియునై యుండెను. అతడు స్వర్గమునకు పోయి అచటి సౌఖ్యములను అనుభవించుచుండెను.

''దుర్యోధనా! అట్లు అనేక సహస్ర వర్షముల కాలము గడచెను. యయాతి తనకు కలిగిన స్వర్గ వైభవములను చూచి మిక్కిలి ఆశ్చర్యపడెను. అతని బుద్ధి మోహము చెందియుండెను.

''అందుచేత మహాతపస్సంపన్నులైన రాజర్షులు తనయొద్ద కూర్చొనియుండగా నెవరిని గూడ లెక్కచేయక దేవతలను, మనుష్యులను గూడ పరిహసింప దొడగెను.

''పిమ్మట యయాతి పరిస్థితి ఇంద్రునకు తెలిసెను. రాజర్షులందరును యయాతిని 'ఛీ! ఛీ!' యని నిందించిరి.

''అప్పుడు యయాతిని చూచిన దేవతలు ఇట్లనఁజొచ్చిరి:

''ఇత డెవడు? ఏ రాజు పుత్రుడు? స్వర్గమున కెట్లు వచ్చెను? ఏ కర్మలు చేసి యితడు సిద్ధి పొందెను? ఎచట తపస్సు చేసెను? ఇతనిని స్వర్గములో గుర్తించు టెట్లు? ఎవ్వడితనిని గుర్తించును?''

''అట్లు విచారించుచు యయాతి విషయమై ఒండొరులు ప్రశ్నించుకొనుచుండిరి.

''నూర్లకొలది విమాన రక్షకులు, స్వర్గ ద్వారపాలకులు మున్నగు వారందరిని గూడ యయాతిని గూర్చి యడుగగా నందరును 'ఇతనిని మేమెరుగము' అని బదులు చెప్పిరి.

''అందరి తెలివి కూడ మరుగుపడి యుండెను. కావున, వారు రాజును గుర్తించలేక పోయిరి. తరువాత, రెండు గడియలలోనే యయాతి రాజు తేజస్సు నష్టమయ్యెను.

యయాతి స్వర్గమునుండి భ్రష్టుడగుట-అతనికి దౌహిత్రులు, కూతురు, గాలవుడున్ను తమ పుణ్యము లిచ్చుట

"దుర్యోధనా! తరువాత యయాతి తన సింహాసనమునుండి పడిపోయి స్వర్గమునుండి జారి క్రిందపడెను.

''అతని హృదయము కంపింపగా నతడు శోకాగ్ని చేత దహింపబడుచుండెను. అతడు ధరించిన దివ్యకుసుమమాలిక వాడిపోయెను అతని జ్ఞానశక్తి లోపించెను. అతని కిరీటము, భుజకీర్తులు శరీరము నుండి తొలగిపోయెను గిలగిల తన్నుకొనెను. అవయవములన్నియు శిథిలము లయ్యెను. అతని శరీరము నుండి వస్త్రాభరణములు ఊడిపడుచుండెను.''

"దుర్యోధనా! అప్పుడు అతనిచుట్టు చీకటి క్రమ్మియుండుటచేత దేవతలకతడు కనబడకుండెను. కాని, యయాతి దేవతలను చూడ జాలియు చూడ జాలకయుండెను.

"భూమిపైబడుటకు ముందు అతడు శూన్యచిత్తుడై 'నేను ఇట్లు స్థానభ్రష్టుడనై పడుటకు ధర్మదూషితమైన ఏ యశుభ విషయమును చింతించితిని?' అని మనస్సులోనే విచారింపదొడగెను.

''అట్లు స్వర్గము నుండి జారి ఆశ్రయములేక అల్లాడుచున్న యయాతిని స్వర్గమందలి రాజర్షులు అప్సరసలు సిద్ధులు చూచుచుండిరి.

''దుర్యోధనా! ఇంతలోనే పుణ్యహీనులైన వారిని స్వర్గము నుండి క్రిందకు పడద్రోయుచున్న పురుషుడొకడు ఇంద్రుని యాజ్ఞచేత అక్కడకు వచ్చి యయాతితో నిట్లనెను:

"రాజపుత్రా! నీవు మిక్కిలి మదించి యున్నావు. ఇక్కడివారందరును మహాపురుషులు. నీవు తిరస్కరింపదగిన వాడెవ్వడును లేడు ఈ దురభిమానము వలననే నీవు నీ స్థానము నుండి భ్రష్టుడవైతివి. నీ విక్కడ నుండ నర్హుడవు కావు. ఇక్కడ నిన్నెవరును ఎరుగరు. కావున పొమ్ము. క్రింద పడుము.''

"ఇట్లు ఆ పురుషుడు చెప్పిన మాటలు విని,యయాతి 'నేను సత్పురుషుల మధ్యమునందు పడిపోవుదునుగాక!' అని ముమ్మారు చెప్పుచు క్రిందికి జారుచుండెను.

ఆ సమయమందే అతడు నైమిశారణ్యమునందున్న నలుగురు రాజోత్తములను చూచి వారిమధ్యమున పడెను

''దుర్యోధనా! అక్కడ 'ప్రతర్దనుడు, వసుమనసుడు, ఔశీనరుడైన శిబి, అష్టకుడు' అను నలుగురు మాధవి పుత్రులు వాజపేయ యజ్ఞము చేయుచు దాని ద్వారా దేవదేవుడైన శ్రీ మహావిష్ణువును తృప్తిపరచుచుండిరి. ఆ యజ్ఞ ధూమము ఆ రాజపుత్రులకు స్వర్గద్వార మయ్యెను.

''యయాతి దాని నాఘ్రాణించుచు క్షీణపుణ్యుడై స్వర్గమునుండి భూమి వైపు పడుచుండెను. భూతలము నుండి స్వర్గమువఱకు ధూమము, నదియా అన్నటుల ప్రవహించుచుండెను. ఆ ధూమ ప్రవాహము ఆకాశగంగ భూమిపై బడుచున్నదా యనునట్లు తోచుచుండెను.

''యయాతిరాజు ఆ ధూమరేఖను పట్టుకొని లోకపాలురవలె తేజస్వులై అవభృథస్నానముచేత పవిత్రులైయున్న ఆ నలుగురిమధ్య పడెను.

''ఆ నల్వురు రాజోత్తములు అక్కడ ఆహుతులతో జ్వలించుచున్న అగ్నితో సమానులుగ తేజస్వులై ప్రకాశించుచుండిరి.

''దుర్యోధనా! అట్లు దివ్యకాంతిచేత భాసిల్లుచున్న ఆ మహారాజును అక్కడి రాజులందఱు చూచి ఇట్లడిగిరి:

''మహాపురుషా! నీ వెవడవు? ఎవరి సోదరుడవు? ఎవరి బంధువుడవు? నీ నివాసస్థాన మే దేశములోని ఏ నగరము? నీవు యక్షుడవా? దేవతవా? గంధర్వుడవా? రాక్షసుడవా? నీ రూపము మనుష్య రూపము వలె లేదు. నీవు ఏ ప్రయోజనము నెరవేర్చుకొనుటకు వచ్చినావు?"

''ఆ మాట విని యయాతి వారితో నిట్లనెను:

''నేను రాజర్షియైన 'యయాతి యనువాడను. నా పుణ్యము క్షీణించినందున స్వర్గము నుండి క్రింద పడిపోయినాను. పడునప్పుడు నేను 'సత్పురుషుల నడుమ పడవలె' నని కోరుకొనుచున్నందున మీ మధ్య వచ్చి పడినాను.''

ఈ మాటలకు రాజులు యయాతిని ఇట్లడిగిరి:

''పురుషోత్తమా! నీ కోరిక ఫలించుగాక! నీవు మేమందరము చేసిన యజ్ఞము యొక్క ఫలము, ధర్మమున్ను గ్రహింపుము.''

''ఆ రాజుల మాటలు విని యయాతి వారితో నిట్లనెను:

''మహాత్ములారా! దానధనముచేత జీవించు బ్రాహ్మణుడను కాను. నేను క్షత్రియుడను. కాబట్టి, ఇతరుల యొక్క పుణ్యమును నేను గ్రహించి వారి పుణ్య ధనమును క్షయింపజేయుటకు పూనుకొని రాలేదు.

''దుర్యోధనా! ఆ సమయమునందే ఆ రాజులు నలువురు తమ తల్లియైన మాధవిని చూచిరి. ఆమె మృగమువలె వారితోపాటే అక్కడ సంచరించుచు వారికడకు వచ్చి చేరెను. ఆమెకు ప్రణామము చేసి వారిట్లనిరి:

"అమ్మా! తపోధనురాలా! ఇక్కడికి నీవు ఏ ప్రయోజనము నుద్దేశించి వచ్చితివి? మాకు ఏమి ఆజ్ఞ యిచ్చెదవు? దానిని మేము పాలించెదము. మేమందరము నీ పుత్రులము. కావున అర్హమైన సేవకై మాకు ఆజ్ఞ యిమ్ము.''

"ఆ రాజుల మాటలను విని మాధవి మిక్కిలి సంతోషించెను.

''ఆమె తరువాత తన తండ్రి యయాతి కడకు పోయి ఆయనకు ప్రణామము చేసి తన పుత్రుల శిరస్సులపైన చేతినుంచి లాలించుచు తన తండ్రితో నిట్లనెను:

"రాజేంద్రా! ఈ నలువురు నీకు దౌహిత్రులు (కూతు కొడుకులు) నాకు పుత్రులు. పరులు కారు వీరు నిన్ను తరింపజేసెదరు. దౌహిత్రులచేత మాతామహుడు (తల్లికి తండ్రి) ఉద్ధరింపబడుటను గుర్చి ప్రాచీన వేద శాస్త్రములందు స్పష్టముగా చెప్పబడినది.

"రాజా! నేను నీ పుత్రిక మాధవి యను దానను. ఈ తపోవనమునందు మృగములతో సమానముగ జీవించి తిరుగుచున్నాదు.

''రాజా! నేను కూడ గొప్ప ధర్మమును సంపాదించినాను. దానియందు అర్ధ భాగమును నీవు తీసికొనుము.

"రాజా! లోకమునందు మనుష్యులందరు తమ సంతానము ఆచరించిన సత్కర్మ ఫలములకు భాగస్వాము లయ్యెదరు. అందుచేత వారు దౌహిత్రులు కావలెనని కోరుకొనెదరు. ఇట్లు యోచించియే నీవు కూడ దౌహిత్రులు కావలెనని కోరియుంటివి.''

''దుర్యోధనా! తరువాత ఆ రాజులందరు తమ మాతృదేవి చరణములపై మస్తకములుంచి ప్రణామము చేసిరి. స్వర్గమునుండి భ్రష్టుడై వచ్చిన మాతామహునకు గూడ నమస్కారము చేసిరి,

''తరువాత అసమాన స్నేహపూర్ణమైన ధ్వనితో భూమండలమును ప్రతి ధ్వనింప జేయుచు తమ మాతామహుని తరింపజేయు నుద్దేశముతో అతనికి వారు తమ పుణ్యము నీయదలచుచుండిరి.

''ఆ సమయమునందే ఆ వనమునుండి గాలవ మహాముని కూడ అక్కడికి వచ్చి యయాతిరాజుతో నిట్లనెను:

''మహారాజా! నీవు నా తపస్సులో ఎనిమిదవ భాగమును తీసికొని దాని శక్తితో స్వర్గలోకమును మరలచేరుకొనుము.''

''జనమేజయా! అట్లు నారదుడు దుర్యోధనునకు చెప్పి తరువాతి వృత్తాంతము చెప్పదొడగెను:

సత్సంగము వలన, దౌహిత్రుల పుణ్యదానము వలనను యయాతి మరల స్వర్గమునకు పోవుట

''దుర్యోధనా! ఆ సత్పురుషులచేత గుర్తింపబడిన మాత్రము చేతనే యయాతి భూతలమును స్పృశింపకయే పైపైననే లేవదొడగెను.

''అప్పుడు అతని యాకారము దివ్యమయ్యెను. శోకము, చింత అతనికి లేకుండెను. దివ్యమాల్యాంబరధరుడై యుండెను. దివ్యములైన భూషణముల నలంకరించుకొని యుండెను. వాటిచేత అతడు మిగుల శోభిల్లుచుండెను. అతని శరీరమునుండి దివ్య సుగంధములు గుబాళించుచుండెను. అతడు తన పాదముల చేత భూతలమును స్పృశింపక యుండెను.

''తరువాత లోకమునందు దానపతి అను పేరుతో ప్రసిద్ధుడైన 'వసుమనసుడు' అను యయాతి జ్యేష్ఠ దౌహిత్రుడు ఆ మహారాజుతో నిట్లనెను:

''మహారాజా! నేను ప్రపంచమునందు అన్ని వర్ణములవారితో నిందపడక సంపాదించిన పుణ్యము కూడ నీకు ఇచ్చుచున్నాను. ఆ పుణ్యము నీకు అధికముగా నుండుగాక!

"నాకుగల దానశీలుని పుణ్యఫలము, ఓర్పుగలవాని పుణ్యఫలము, అగ్నిని స్థాపించి వేదోక్త విధులచే హోమాది కర్మలను అనుష్ఠించుటవలన నాకు కలుగబోవు పుణ్యఫలములన్నియు నీకు ఇచ్చెదను.''

''దుర్యోధనా! యయాతి రెండవ దౌహిత్రుడైన ప్రతర్దన రాజుకూడ యయాతితో నిట్లనెను:

''మహారాజా! నేను ఏవిధముగా సర్వదా ధర్మతత్పరుడనై యున్నానో, న్యాయముగా యుద్ధము చేయుచు వచ్చినానో, ఆ ఫలమునేకాక ప్రపంచమునందు నేను క్షత్రియవంశమునకు తగిన యశస్సు వలన పరాక్రమము వలన సంపాదించిన పుణ్యఫలమును గూడ నీకు ఇచ్చెదను."

''దుర్యోధనా! ప్రతర్దను డిట్లు చెప్పిన పిమ్మట యయాతి మూడవ దౌహిత్రుడు ఉశీనరపుత్రుడునైన 'శిబి' కూడ యయాతితో నిట్లనెను:

"మహారాజా! నేను బాలకులతో, స్త్రీలతో, పరిహాసయోగ్యులైన బంధువులతోను యుద్ధమునందు, ఆపదలయందు, సంకటములయందు గూడ పూర్వము ఎప్పుడున్ను అసత్యములు మాట్లాడలేదు.

''రాజా! నేను నా ప్రాణములను, రాజ్యమును, మనోవాంఛితమును, సుఖభోగములను గూడ విడిచిపెట్టగలను. కాని, సత్యమును పరిత్యజింపజాలను.

''ఒకవేళ నా సత్యముచేత ధర్మదేవుడు, అగ్నిదేవుడు, ఇంద్రుడు సంతుష్టులైనచో అట్టి సత్యముయొక్క ప్రభావముచేత నీవు స్వర్గలోకమునకు పొమ్ము.

''దుర్యోధనా! శిబి యిట్లు చెప్పిన తరువాత యయాతి నాలుగవ దౌహిత్రుడు, విశ్వామిత్రుని పుత్రుడు, మాధవి కనిష్ఠ పుత్రుడు, కుశికవంశ సంజాతుడు, ధర్మజ్ఞుడు, రాజఋషియునైన 'అష్టకుడు' అనేక శతసంఖ్యాకములైన యజ్ఞములను అనుష్ఠించిన నహుష పుత్రుడైన యయాతి కడకుపోయి యిట్లనెను:

''మహారాజా! నేను ఎన్నియో సూర్ల పుండరీక - గోసవ - వాజపేయాది యజ్ఞకర్మలను అనుష్ఠించినాను. నా వద్ద ఉన్న రత్నములు, ధనములు, ఇతర సామగ్రులన్నియు నేను యజ్ఞములయందు ఉపయోగించినాను. సత్యస్వరూపమైన నా యజ్ఞకర్మల ప్రభావముచేత నీవు స్వర్గలోకమునకు పొమ్ము.''

''దుర్యోధనా! ఏయే విధముగ యయాతి యొక్క దౌహిత్రులు మాటలు చెప్పుచుండిరో ఆయా విధముగనే యయాతి మహారాజు ఈ భూతలమును విడుచుచు స్వర్గలోకమువైపు సాగుచు పోయెను.

''దుర్యోధనా! ఈ విధముగ ఆ నలుగురు రాజులు క్రిందపడుచున్న యయాతిని తమ సంపూర్ణ సత్కర్మల ద్వారా అనాయాసముగ ఉద్ధరించిరి.

''దుర్యోధనా! తమ తమ వంశోద్ధారకులైన యయాతి యొక్క నలుగురు దౌహిత్రులు నాలుగు రాజవంశములయందు జన్మించియుండిరి. వారు తమ యజ్ఞ దానాది జనిత ధర్మముచేత మహాప్రాజ్ఞుడు, మాతామహుడునైన యయాతిని స్వర్గమునకు చేర్చి ఆయనతో నిట్లనిరి:

''రాజా! మేము రాజధర్మము, రాజోచిత గుణములు కలిగి యున్నాము. సమస్త ధర్మ - సద్గుణసంపన్నులము. నీ యొక్క దౌహిత్రులము. నీవు మా యందరి పుణ్యమును తీసికొని స్వర్గలోకమునందు స్థిరముగ నుండుము."

యయాతికి స్వర్గములో స్వాగతము - యయాతి పతనమునకు కారణము అతని యభిమానమేనని బ్రహ్మ చెప్పుట - నారదుడు దుర్యోధనునకు ఉపదేశించుట

''దుర్యోధనా! అనేక దక్షిణ లిచ్చి సత్కర్మలను చేయు రాజులు, యయాతిని ఆ విధముగ స్వర్గలోకమునందు స్థిరముగా నిలిపిరి. యయాతి తన దౌహిత్రులను వీడ్కొని స్వర్గమునకు పోయెను.

''స్వర్గమునందు యయాతిపైన అనేకవిధ సుగంధి పుష్పముల వర్షము కురిసెను. పవిత్ర సువాసనగల పావన వాయువు యయాతిని నలువైపులనుండి ఆలింగనము చేసికొనుచుండెను.

''అట్లు దౌహిత్రుల పుణ్యఫలము చేత లభించిన స్థిరమైన స్వర్గస్థానమును పొంది తన సత్కర్మలచేత వృద్ధిపొందిన యయాతి మహారాజు ఉత్తమ శోభతో స్వర్గలోకమునందు ప్రకాశించుచుండెను.

''స్వర్గమునందు గంధర్వులు అప్సరసలు యయాతి కీర్తిని గానము చేయుచు అతని సమీపమునందు నృత్యము చేయుచు అతనిని ప్రసన్నుని చేసిరి.

స్వర్గలోకమునందు దుందుభి (నగారా) మొదలైన వాద్యముల యొక్క గంభీర ధ్వనితో, ఆత్మీయ భావముతోను యయాతికి స్వాగత సత్కారములు చేయబడెను.

''దుర్యోధనా! అనేక దేవర్షి-రాజర్షి-చారణులు యయాతిని స్తుతించిరి. దేవతలందరు అర్ఘ్యపాద్యాదులిచ్చి యయాతిని పూజించి అభినందించిరి. ఈ విధముగ యయాతి ఉత్తమ స్వర్గఫలమును పొందెను.''

''దుర్యోధనా! అట్లు సంతుష్టుడైన శాంతచిత్తుడుగా నున్న యయాతితో బ్రహ్మదేవుడు మధురవచనములను తృప్తి పూర్వకముగ నిట్లు పలికెను:

''రాజా! నీవు లోకహితకరములైన సత్కర్మలద్వారా నాలుగు పాదముల ధర్మమును పరిపూర్ణముగ సంపాదించితివి. కాబట్టి, నీకు అక్షయమైన స్వర్గలోకము ప్రాప్తించెను. స్వర్గమునందు అక్షీణముగా నీ కీర్తి వ్యాపించెను.

''రాజర్షి! నీవు పూర్వము స్వర్గమందు దురభిమానముతో వ్యవహరించి నీ పుణ్యమును నీవే నశింపజేసికొంటివి. అప్పుడు స్వర్గవాసులందరి మనస్సు తమోగుణముచేత వ్యాప్తమైయుండెను కనుక, వారు నిన్ను గుర్తించక యుండిరి. నీవు అజ్ఞాతుడవై యుండుట చేత స్వర్గమునుండి క్రిందకు త్రోయబడితివి.

''తరువాత నీ దౌహిత్రులు నిన్ను ప్రేమపూర్వకముగ ఉద్ధరించుటచేత నీవిక్కడకు వచ్చి చేరితివి. ఇప్పుడు నీవు, నీ దౌహిత్రులద్వారా పొందిన సత్కర్మల ఫలముచేత అచంచలము, శాశ్వతము, పుణ్యమయము, స్థిరము, ఉత్తమము, అక్షయమునైన స్థానమును జయించి పొందితివి."

''దుర్యోధనా! బ్రహ్మదేవుని మాటలు విని యయాతి ఆయనతో నిట్లనెను:

''భగవన్! నా మనసులో యొక సందేహమున్నది. దానిని నీవు తొలగింపుము. లోక పితామహా! ఈ ప్రశ్నము నేను మరియింకెవరికిని గూడ అడుగదగినది కాదని, నిన్ను అడుగుచున్నాను.

''నేను అనేక సహస్ర సంవత్సరములు అనేక యజ్ఞములద్వారా, దానముల ద్వారా సంపాదించిన పుణ్యము యొక్క ఫలమును, ప్రజాపాలన రూపమైన ధర్మము ద్వారా ఉత్తరోత్తరముగా పెంపొందించితిని.

''దేవా! ఆ పుణ్యఫలమంతయు కొద్దిసమయములోనే ఎట్లు నష్టమయ్యెను? అందువలన నేను ఇక్కడినుండి క్రిందికి త్రోసివేయబడితిని కదా! భగవన్! నాకు నా సత్కర్మల ద్వారా ప్రాప్తించిన సనాతన లోకములను గూర్చి నీవు బాగుగా ఎరుగుదువు. ఆ నా పుణ్యమంతయు ఎట్లు హఠాత్తుగా నష్టమయ్యెనో చెప్పుము."

"దుర్యోధనా! యిట్లు యయాతి పలికిన మాటలను విని పితామహుడు ఈ విధముగా చెప్పెను :-

"రాజేంద్రా! నీవు యజ్ఞముల ద్వారా సంపాదించినదియు ప్రజాపాలన ధర్మము ద్వారా క్రమముగా పెంచుకొనిన పుణ్యఫలమంతయు నీకు ఉండిన దురభిమాన రూపమైన దోషమువలన నష్టమగుట చేత నీవు క్రిందకు త్రోయ బడితివి. ఆ దురభిమానమువలననే స్వర్గవాసులందరు నిన్ను ధిక్కరించిరి.

"రాజర్షీ! 'దురభిమానము, బలగర్వము, హింస, వంచన, వివిధ మాయలు'-ఇవి లేనివారికే ఈ పుణ్యలోకము సుస్థిరముగా నుండును.

''కనుక రాజా! నీ వెప్పుడుకూడ ఉత్తమాధమమధ్యమ వర్గములకు చెందిన లోకులకు అవమానము చేయకూడదు. అభిమానమనెడు అగ్నిలో జ్వలించుచున్న వారికి ఆ సంతాపమును శాంతింపజేయు ఉపాయము ఏది కూడ ఎక్కడ కూడ లభించదు.

"రాజా! నీ స్వర్గపతనము - పునరుద్ధరణము అను ఈ యితిహాసము విన్నవారు సంకటములనుండి విముక్తులయ్యెదరు."

''జనమేజయా! ఈ విధముగా నారదుడు దుర్యోధనునకు చెప్పి మరల నిట్లనెను:

"దుర్యోధన మహారాజా! ఈ విధముగ పూర్వము యయాతి మహారాజు తన దురభిమానము కారణముగా సంకటములలో చిక్కుకొనెను.

"అట్లే మిక్కిలి మొండి పట్టుదల, హఠము కారణముగా గాలవమహర్షి కూడ గొప్ప క్లేశమును అనుభవించెను.

''కావున నీవు నీ హితముగోరు మిత్రుల మాటలను తప్పక విని ఆచరింప వలెను. దురాగ్రహము (మొండిపట్టు) ఎప్పుడును చేయరాదు. అది వినాశనమునకే దారితీయును.

''కాబట్టి గాంధారీనందనా! నీవు గూడ అభిమానమును, క్రోధమును విడిని పాండవులతో సంధి చేసికొనుము. క్రోధావేశము సర్వదా వినాశహేతువగును అది విడువుము. నీ విట్లు చేయకున్నచో శక్తిమంతులైన పాండవులతో యుద్ధము చేసి మహాసంకటము లనుభవించగలవు

''సుయోధనా! మనుష్యులు చేయు దానములు, కర్మలు, తపస్సులు, యజ్ఞహోమాదులు ఎప్పుడున్ను నశింపవు. అవి, తరుగవు. ఆ కర్మ ఫలమును ఇతరు లెవ్వరు అనుభవింపరు. వాటిని అనుష్ఠించినవారే ఆ శుభాశుభ కర్మఫలము లను అనుభవించెదరు.

"దుర్యోధనా! మహత్త్వపూర్ణమైన ఈ యుపాఖ్యానము అనేక శాస్త్రజ్ఞులకు, రాగ ద్వేష క్రోధ రహితులకు సంబంధించినది ఇది అందరికిని ఉత్తమమైన హితము చేకూర్చునిది.

"ప్రపంచమునందు అనేక విధములుగ విచారించి నిశ్చయింపబడిన సిద్ధాంతములను అవలంబించి ధర్మార్థ కామములను దృష్టియందుంచుకొనువాడే ఈ సమస్త భూమండలమును పాలించగలడు.''

ధృతరాష్ట్రుని కోరికపై శ్రీకృష్ణుడు దుర్యోధనునకు ఉపదేశించుట

''జనమేజయా! ఈ విధముగ అనేక విషయములనుగూర్చి దుర్యోధనునకు బోధించిన నారదమహామునితో ధృతరాష్ట్రమహారాజు ఇట్లనెను:

"భగవన్! నీవు చెప్పిన మాటయే సరియైనది. అదియే నేను గూడ కోరు చున్నాను. కాని, నా మాట సాగకున్నది.''

వైశంపాయనుడు తరువాతి వృత్తాంతమును జనమేజయునకు ఇట్లు చెప్ప దొడగెను.

"జనమేజయా! నారదునితో ధృతరాష్ట్రుడు అట్లు చెప్పి శ్రీకృష్ణభగ వానునితో నిట్లనెను:

''శ్రీకృష్ణా! నీవు నాతో చెప్పిన మాటలన్నియు ఇహపరలోకములకు హితకరములు, ధర్మసమ్మతములు, న్యాయసంగతములుగా నున్నవి.

''జనార్దనా! నేను నా వశమునందు లేను. ఇప్పుడు చేయబడుచున్న దంతయు నాకు ప్రియమైనది కాదు. కాని, నేనేమందును? దురాత్ములైన నా పుత్రులు నా మాట నంగీకరింపరు.

"పురుషోత్తమా! శాస్త్రము యొక్క ఆజ్ఞను ఉల్లంఘించిన వాడై మూర్ఖుడుగానున్న నా పుత్రుని దుర్యోధనుని నీవే ఉపదేశించి సరియైన త్రోవకు దెచ్చుటకు ప్రయత్నింపుము.

''హృషీకేశా! ఇతడు సత్పురుషుల మాటలను వినడు. గాంధారి, బుద్ధి మంతుడైన విదురుడు, భీష్మాదులైన హితులు, అనేక మిత్రులు చెప్పిన మాటలు కూడ ఇతడు వినకున్నాడు.

"కేశవా! దురాత్ముడైన దుర్యోధనుని బుద్ధి పాపములందు మునిగి యున్నది. సర్వదా పాపములనే చింతించుచు క్రూరుడై వివేకశూన్యుడయ్యెను. నీవే ఇతనిని శాసింపుము. నీ వితనిని సంధికొరకు ఇష్టపరచిన యెడల నీ వలన మిత్రులకు చాల గొప్ప ఉపకారము కలుగును."

"జనమేజయా! అట్లు ధృతరాష్ట్రుడు చెప్పిన మాటలు విని శ్రీకృష్ణ భగవానుడు అమర్షశీలుడైన దుర్యోధనుని ఉరిమి చూచుచు నిట్లనెను:

దుర్యోధనునకు శ్రీకృష్ణుని ఉపదేశము

"దుర్యోధనా! నీవు ఈ నామాట వినుము. విశేషించి నేను బంధుమిత్ర సహితుడైన నీ శ్రేయస్సుకొఱకే చెప్పుచున్నాను.

"నీవు ప్రాజ్ఞులైన మహాపురుషుల వంశములో పుట్టినావు. నీవును శాస్త్ర జ్ఞానము, సద్వ్యవహారము పూర్తిగా కలవాడవు. నీయందు సమస్త సద్గుణము లున్నవి. కాబట్టి, నీవు నేను చేయు సదుపదేశమును తప్పక వినవలెను.

"నాయనా! నీవు దేనిని మంచిదని తలచుచున్నావో ఆ కార్యము నీచకులోత్పన్నులు, దుష్టచిత్తులు, క్రూరులు, నిర్లజ్జులు చేయునది. ప్రపంచము నందు సత్పురుషులు ధర్మార్థయుక్తముగా వ్యవహరించుచుందురు. దుష్టులు దీనికి పూర్తిగా వ్యతిరేకముగా నడచుటకు చూచుచున్నారు. నీయందు ఈ విపరీత ప్రవృత్తి మాటిమాటికి కనబడుచున్నది.

''భరతకుల భూషణా! ఇప్పుడు నీ దురాగ్రహమునకు సముచితమైన కారణ మేదియు కనబడుట లేదు. నీవు చేయు ఈ భయంకర హఠము వంశమునకు అనిష్ట కారకమేకాక గొప్ప ప్రాణనాశకరముగ గూడ నగును. నీవు దీనిని సఫలము చేయుట సంభముకాదు.

"ధార్తరాష్ట్రా! నీవు అనర్థకరమైన యీ దురాగ్రహమును విడిచిన యెడల నీకేకాక నీ తమ్ములకు, సేవకులకు మిత్రులకు, బంధువులకు గూడ హితసాధనమైన గొప్ప శ్రేయమును కలిగింపగలవు.

''ఇట్లు చేయుట చేత నీకు అధర్మము, అపకీర్తి కలిగించు కార్యమునుండి విముక్తి కలుగును. కాబట్టి పురుషసింహా!, జ్ఞానము, ఉత్సాహము, శౌర్యము, శాస్త్రపాండిత్యముగల నీవు పాండవులతో సంధి చేసికొనుము. ఇదియే ధృత రాష్ట్రునకుగూడ ప్రియము, హితము అని తెలియుచున్నది.

''భీష్మ-ద్రోణ-కృప-సోమదత్త-బాహ్లీక-అశ్వత్థామ-వికర్ణ-సంజయ-వివింశతి ప్రభృతులేకాక అనేక బంధువులకు మిత్రులకును సంధి మిక్కిలి ప్రియమైనది.

"నాయనా! సంధి చేసికొనుట వలననే సమస్త ప్రపంచమునకు మేలు కలుగును. నీవు ఉత్తమకులోత్పన్నుడవగుటయేకాక తల్లిదండ్రుల యాజ్ఞలో గూడ నున్నావు. స్వయముగ పండితుడవు, లజ్జాశీలుడవు, క్రూరత్వము లేని వాడవు.

''తండ్రిచేసిన ఉపదేశమే శ్రేయస్కరమని శ్రేష్ఠపురుష లనుకొనెదరు. మహాపదలో చిక్కుకొనినవా రందరును తండ్రి యుపదేశమునే ఆచరింతురు. నీ తండ్రికి, మంత్రులకు పాండవులతో సంధి చేసికొనుటయే మంచిదను తలంపు కలదు. కురుశ్రేష్ఠా! ఇదియే నీకు గూడ రుచించవలెను.

"దుర్యోధనా! మిత్రులు చెప్పిన శాస్త్రసమ్మతమైన ఉపదేశమును వినికూడ దానిని అంగీకరించని వానికి దానివలన గలుగు పరిణామము, కింపాకఫలము (విషముష్టిపండు) తినిన తరువాత అది జీర్ణించునపుడు దాహము కలిగించునట్లు కడుపులో మంట కలిగించును.

''మోహముచేత హితవచనములను స్వీకరించని దీర్ఘసూత్రి (విలంబముగ పనిచేయువాడు) యైన మనుష్యుడు, తన స్వార్థమును పోగొట్టుకొని పశ్చాత్తాప మునే పొందును. తనకు శ్రేయస్కరమైన మాటను విని దురాగ్రహమును విడుచువాడు ప్రపంచమందు సుఖమును ఉన్నతిని పొందును.

"దుర్యోధనా! తన మేలు కోరు మిత్రుని మాటలకు వ్యతిరేకముగ ఆచరించుచు అమిత్రుల మాటల ప్రకారమే నడచువాడు శత్రువశములో చిక్కుకొనును, సత్పురుషుల యుపదేశముల నుల్లంఘించి దుష్టుల మతము ననుసరించు వాడు ఆపదలలో పడియుండుట చూచి అతని మిత్రులు దుఃఖించెదరు.

''ముఖ్యులైన మంత్రులను విడిచి నీచులను సేవించువారు భయంకరమైన ఆపదలలో చిక్కుకొని, తనను ఉద్ధరించు మార్గమును చూడజాలరు. దుష్టపురుష సంఘములో తిరుగువాడు అసత్యముగ వ్యవహరించుచు ఉత్తమ మిత్రుల మాటను వినక ఇతరులను తనవారినిగ చూచుచు ఆత్మీయులతో ద్వేషించువానిని ఈ భూమండలము విడిచి పెట్టును.

"భరతశ్రేష్ఠా! నీవు పాండవ వీరులతో విరోధించి, అశిష్టులు-అసమర్థులు-మూర్ఖులు నైన వారినుండి నీ రక్షణమును కోరుచున్నావు. ఇంద్ర సమాన పరాక్రములై, మహారథికులైన బంధువులను విడిచి యితరులనుండి తన రక్షణమును ఆశించుచున్న వారెవరును, నీవు తప్ప, ఈ భూతలమున లేరు.

''నీవు పుట్టుక నుండియే పాండవులతో సర్వదా అపకారపూర్వకముగానే వ్యవ్యహరించుచుంటివి. కాని, అట్టి నీ యెడల వారెప్పుడు కూడ కుపితులు కాలేదు.

''ఎందుకనగా, పాండవులు ధర్మాత్ములు, అట్టి నీ సోదరులైన పాండవుల యెడల నీవు కపటముగ ప్రవర్తించినప్పటికిని, వారు నీయందు సద్భావమే చూపుచు వచ్చిరి. నీవుకూడ ఉత్తమ బంధువులయందు మంచిగనే వ్యవహరించుట భావ్యము కోపపడక యుండుము

"భరతభూషణా! బుద్ధిమంతులైన పురుషులు చేయు ప్రతికార్యము ధర్మార్థ కామముల సిద్ధికి అనుకూలముగనే యుండును. ఈ మూడింటియొక్క సిద్ధి అసంభవమైనప్పుడు, బుద్ధిమంతుడు ధర్మార్థములను మాత్రమే అనుసరించును.

''వేర్వేరుగా నున్న ధర్మార్థ కామములలో ఒకదానిని మాత్రము ఎన్నుకొనవలసినప్పుడు ఉత్తముడు ధర్మమునే అనుసరించును. మధ్యముడు కలహ కారణమైన అర్థమును గ్రహించును. అధముడైన అజ్ఞాని కామమునే పొందగోరును.

''అధముడు ఇంద్రియములకు వశుడై, లోభము చేత ధర్మమును విడిచి దుష్టోపాయములచేత అర్థకామములను పొందు నిచ్చలో పడి నశించును.

''అర్థకామములను పొందగోరువాడు తొలుత ధర్మమునే ఆచరించవలెను. ఎందుకనగా, అర్థకామములు ఎప్పుడు కూడ ధర్మమునుండి వేరుపడి యుండవు.

"ప్రజానాథా! విద్వాంసుడు త్రివర్గ (ధర్మార్థకామ) ప్రాప్తికి ధర్మమొక్కటే ఉపాయముగ చెప్పును. కావున, ధర్మము ద్వారా అర్థకామములను పొందగోరువాడు ఎండుగడ్డియందు పడిన అగ్నివలె శీఘ్రముగా ఉన్నతిని పొందుచు పోవును.

"భరతశ్రేష్ఠా! సుప్రసిద్ధమైన, ఉజ్జ్వలమైన ఈ విశాల సామ్రాజ్యమును నీవు అనుచితమైన ఉపాయముచేత పొందగోరుచున్నావు.

''రాజా! సత్పురుషులతో చెడుగా వ్యవహరించువాడు, గొడ్డలిచేత అడవిని వలె తన దుష్ప్రవర్తనచేత తననే నరకుకొనును.

''ఇతరుని పరాభవమునుగూడ కోరనివాని బుద్ధిని ఛేదించగూడదు. భిన్నము కానట్టి బుద్ధికలవాని మనస్సు శ్రేయస్కరకార్యములయందే ప్రవర్తిల్లును.

''భరతనందనా! బుద్ధిమంతుడైన పురుషుడు, ఏ లోకమునందైనను, నీచులను కూడ అవమానించగూడదు. అట్లుండగా ఉత్తములైన పాండవులను అవమానించగూడదనుటలో చెప్పవలసిన దేమున్నది?

''ఈర్ష్యకు లోనైనవాడు ఏ మాటను గూడ సరిగా అర్థము చేసికొనడు. అసూయ గలవానికి ఎంత పెద్ద ప్రమాణము తెలిపినను అది ఉచ్ఛిన్నమే యగును.

"నాయనా! దుష్టులతో నీవు సంబంధము పెట్టుకొనుటకన్న, పాండవులతో కలిసియుండుట నీకు విశేష శ్రేయస్సును కలిగించును. వారితో ప్రేమ పూర్వకముగా ఉండినయెడల నీ కోరికలన్నియు నెరవేర్చుకొనగలవు.

"రాజోత్తమా! పాండవులు స్థాపించిన రాజ్యమును నీవు అనుభవించుచున్నప్పటికిన్ని వారిని తిరస్కరించి నీవు ఇతరుల వలన రక్షణమును ఆశించుచున్నావు.

''దుశ్శాసన - దుర్విషహ - కర్ణ - శకుని ప్రభృతులయందు నీ యైశ్వర్య భారమును ఉంచి ఉన్నతి కోరుచున్నావా? భరతనందనా! వీరు నీకు జ్ఞానము అర్థము ధర్మము కలిగించుటకు సమర్థులు కాజాలరు. పాండవుల యెదుట తమ పరాక్రమమును చూపుటకు కూడ వీరు సమర్థులు కారు,

''నీవు, ఈ రాజులందరున్ను యుద్ధమునందు కుపితుడైన భీమసేనుని ముఖమును కన్నెత్తియైన చూడజాలరు.

"నాయనా! నీ వద్ద ఉన్న ఈ రాజులందరి సేనలు, భీష్మ-ద్రోణ-కర్ణ-కృపాచార్యులు, సోమదత్త పుత్రుడైన భూరిశ్రవసుడు, అశ్వత్థామ, జయద్రథుడు (సైంధవుడు) వీరందరు ఏకమైనప్పటికిన్ని అర్జునుని ఎదిరింపజాలరు.

''రాజా! అర్జునుడు యుద్ధమునందు సమస్తసురాసురులకు, మనుష్య గంధర్వాదులకున్ను జయింపనలవికానివాడు. కాబట్టి నీవు యుద్ధము చేయు తలంపు వీడుము.

"నీ వద్ద చేరియున్న ఈ సమస్త రాజ సైన్యముల వైపు దృష్టి సారించి చూడుము. వీరిలో ఏ యొక్కడైనను యుద్ధమునందు అర్జునుని ఎదిరించి క్షేమముగ తిరిగి యింటికి వచ్చునా?

"భరతశ్రేష్ఠా! ఈ జన సంహారమువలన నీకు కలుగబోవు లాభమేమున్నది? నీ పక్షమునందు అన్వేషించి చూడుము. అర్జునుని జయించి ప్రాణములతో నీ పక్షమున ఏ యొక్కడైనను తిరిగి వచ్చినచో నీ పక్షమునకు జయము కలిగినట్లే భావింపుము.

"ఖాండవవనమునందు గంధర్వ-యక్ష-రాక్షస-నాగాదులతోపాటు సమస్త-దేవతలను ఓడించిన అర్జునునితో ఎవడు యుద్ధము చేయగలడు?

"అదిగాక, విరాటనగరమునందు ఉత్తరగోగ్రహణ యుద్ధములో అనేకులతో ఒక్క అర్జునుడే యుద్ధముచేసి గెలిచెను. ఈ ఒక్క సంఘటనమే భవిష్యత్తులో కలుగు యుద్ధ పరిణామమును తెలుపుటకు చాలును.

"సాక్షాత్పరమేశ్వరుని తన పరాక్రమముచేత సంతోషపఱచిన అజేయుడైన అర్జునుని యుద్ధమునందు జయింపవలెనని ఆశించుట అత్యాశ్చర్యకరముగానున్నది.

"దుర్యోధనా! ఎవనికి నేను సారథినై సహాయము చేయుచుందునో, అట్టి అర్జునుడు ప్రతిపక్షిగా యుద్ధమునకు వచ్చినప్పుడు సాక్షాత్తు ఇంద్రుడైనను అతనితో యుద్ధము చేయగలడా?

"ఎవడు యుద్ధభూమియందు అర్జునుని జయింపగలడో వాడు తన భుజములపై భూమండలమును ఎత్తుకొనజాలునని, కుపితుడై సమస్త ప్రజలను దహింపగలడని, దేవతలను స్వర్గము నుండి క్రిందికి తోసివేయగలడనియు భావింపవచ్చును. కనుక, అర్జునుని జయించుట యెవరికిని సాధ్యము కాదు.

"రాజా! కౌరవ వంశమును రక్షింపుము. కులమును అవమానపరచవద్దు. నీవు కూడ కీర్తిని నశింపజేసికొని కులఘాతకుడవు కావద్దు. పాండవులు నిన్నే యువరాజ పదమునందు ప్రతిష్ఠించి, నీ తండ్రి ధృతరాష్ట్రుని మహారాజ పదమునందే ఉంచగలరు.

"నాయనా! నీ యింటికి చొచ్చుకొని వచ్చుటకు సిద్ధముగనున్న రాజ్యలక్ష్మిని అవమానపరచకుము. కుంతీ పుత్రులకు అర్ధరాజ్యమునిచ్చి విశాల సంప

దను అనుభవింపుము. పాండవులతో సంధిచేసికొని, నీ హితమును కోరు మిత్రుల మాటలను మన్నించి, మిత్రులతో పాటు సంతోషపూర్వకముగా నుండి నీవు సుదీర్ఘ కాలము శ్రేయస్సులను అనుభవించుచుండుము."

భీష్మ, ద్రోణ, విదుర, ధృతరాష్ట్రులు దుర్యోధనునకు ఉపదేశించుట:

"జనమేజయా! శ్రీకృష్ణభగవానుడు ఇట్లు చెప్పిన ఉపదేశ వచనములు విని శాంతనందనుడైన భీష్ముడు ఈర్ష్యాక్రోధ పరిపూర్ణుడైన దుర్యోధనునకు ఇట్లు చెప్పెను:

"నాయనా! దుర్యోధనా! శ్రీకృష్ణ భగవానుడు తన మిత్రులతో పరస్పరము శాంతిని స్థాపించు నిచ్ఛతో చెప్పిన మాటలను స్వీకరింపుము. క్రోధమునకు పశుడవు కావద్దు. శ్రీకృష్ణ పరమాత్మయొక్క మాటను విననియెడల నీకు ఎప్పుడు కూడ శ్రేయస్సు, సుఖము, మంగళము కలుగవు.

"వత్సా! కేశవుడు నీకు ధర్మార్థములకు అనుకూలములైన మాటలనే చెప్పెను. రాజా! నీవు ఆ మాటలను అంగీకరింపుము. ప్రజానాశనము చేయవద్దు.

"ఈ భరతవంశ రాజ్యలక్ష్మి కళకళలాడుచు ప్రకాశించుచున్నది. నీ దుష్టత్వ కారణముచేత దీనిని, ధృతరాష్ట్రుడు జీవించియుండగనే, నష్టము చేయగలవని నేననుకొనుచున్నాను. ఈ యహంకార బుద్ధిచేత పుత్ర - సోదర - బంధు - మంత్రి సహితముగా నీవు జీవితమును నశింపజేసికొనుచున్నావు.

"నాయనా! కేశవుడు చెప్పిన మాటల సత్యములు, సార్థకములు. ఆయన, మీ తండ్రి, బుద్ధిమంతుడైన విదురుడును చెప్పిన ఉపదేశములను తిరస్కరించి నీవు చెడుమార్గమునందు నడవవద్దు. కులఘాతుకుడవు, కుపురుషుడవు, కుబుద్ధివి, కళంకితుడవు కావద్దు. తల్లిదండ్రులను శోకసముద్రమునందు ముంచకుము."

"జనమేజయా! తరువాత ద్రోణాచార్యుడు రోషముతో మాటిమాటికి దీర్ఘముగా నిట్టూర్చుచున్న దుర్యోధనునితో ఈ విధముగా చెప్పదొడగెను:

"నాయనా! దుర్యోధనా! శ్రీకృష్ణభగవానుడు, మీ తాత భీష్ముడు ధర్మార్థయుక్తవచనములను చెప్పిరి. ఆ ప్రకారము నడచుకొనుము.

"రాజా! ఈ యిరువురు కూడ మహాపురుషులు, విద్వాంసులు, మేధావులు, జితేంద్రియులేకాక నీ మేలును గూడ కోరువారు. అనేక శాస్త్ర నిష్ణాతులు. వీరు నీకు హితమును బోధించిరి. కనుక దానిని నీవు అనుసరింపుము.

''మహామతీ! నీవు వీరి మాటలను విడిచి తుచ్ఛబుద్ధిగల వారి మాటలను శ్రద్ధతో వినకుము. మూర్ఖతచేత మాధవుని తిరస్కరించకుము.

''నాయనా! నిన్ను యుద్ధమునకు ప్రోత్సహించువారు నీకు అవసరము వచ్చినప్పుడు పనికిరాకుండ పోయెదరు. వీరందరు అవకాశమును చూచి యుద్ధభారమంతయు ఇతరుల స్కంధములపైన పడవేసి పోయెదరు. సమస్త ప్రజలను, పుత్రులను, సోదరులను హత్య చేయింపకుము. శ్రీకృష్ణ భగవానుడు, అర్జునుడున్ను ఉన్నవైపు నందున్న వారిని జయించుట అసాధ్యమని తెలిసికొనుము.

''భరతనందనా! వాస్తవముగా నీ హితమును కోరు కృష్ణ భీష్ములు సత్యము చెప్పిరి. వీరి మాటలు నీవు స్వీకరింపని యెడల తరువాత పశ్చాత్తాపము చెందెదవు.

''జమదగ్ని నందనుడైన పరశురాముడు చెప్పిన దానికంటె అర్జునుడు అధికబల సంపన్నుడు. శ్రీకృష్ణభగవానుడన్ననో-దేవతలకు గూడ అత్యంతము దుస్సహుడు.

''భరతాగ్రణీ! నీకు సుఖప్రదములు ప్రియకరములునైన మాటలు అధికముగా చెప్పుటవలన లాభమేమి? నీకు చెప్పవలసిన మాటలన్నియు మేము చెప్పితిమి. ఇక నీ యిష్టము వచ్చినట్లు చేయుము. ఇంతకన్న మించి నీకు చెప్పుటకు మాకు ఉత్సాహము కలుగకున్నది."

"జనమేజయా! ద్రోణాచార్యులు ఇట్లు దుర్యోధనునకు చెప్పుచున్న సమయము నందు క్రోధపూరితుడైన దుర్యోధనుని చూచుచు విదురుడు ద్రోణుని మాటల మధ్యలోనే ఇట్లు చెప్పదొడగెను:

"భరతకుల భూషణా! నిన్ను గూర్చి నేను దుఃఖించుట లేదు. కాని నీ వృద్ధమాతాపితరులను చూచి నాకు మిక్కిలి దుఃఖము కలుగుచున్నది. ఎందుకనగా, ఈ యిరువురు నీవంటి దుష్టపుత్రుడు కారణముగా, తమ మిత్రులు, మంత్రులు చంపబడిన తరువాత రెక్కలు నరకబడిన పక్షులవలె అనాథులై తిరిగెదరు. నీవంటి పాపాత్ముడు, కులఘాతుకుడు, కుపురుషుడునైన పుత్రుని

పుత్రుని కనుటవలన ఈ యిరువురు శోకమగ్నులై భిక్షుకులవలె ఈ పృథివియందు దిక్కులేక పరిభ్రమించెదరు.''

"జనమేజయా! విదురుడిట్లు చెప్పిన పిదప ధృతరాష్ట్రుడు రాజులమధ్య, సోదరుల మధ్య కూర్చొనియున్న దుర్యోధనునితో నిట్లనెను:

''కుమారా! నా మాటలను సావధానముగా వినుము. శ్రీకృష్ణపరమాత్ముడు చెప్పిన మాటలు మిక్కిలి మంగళకరములు, శ్రేయస్కరములు, యోగక్షేమములు కలిగించునవి, చాలకాలము వరకు స్థిరముగా నిలుచునవి. ఆ మాటలను నీవు అంగీకరింపుము.

"అవలీలగా మహాకార్యములను గూడ సాధించగల శ్రీకృష్ణభగవానుని సహాయముతో మనము సమస్తరాజుల మధ్య గౌరవింపబడుచు మనకు ఇష్టములైన కోరికల నన్నిటిని పొందగల్గుదుము.

''నాయనా! శ్రీకృష్ణభగవానునితో కలిసి నీవు యుధిష్ఠిరుని కడకు పోయి, అన్ని శుభములను శ్రేయస్సులను సంపాదించుకొనుము. అట్లు చేయుటచేత భరత వంశీయులకు నాశము కలుగకుండును.

"పుత్రా! శ్రీకృష్ణపరమాత్మను మధ్యస్థునిగా చేసికొని శాంతి స్థాపన చేయుము. ఇదియే నీకు సమయోచితమైన కర్తవ్యమని నేను భావించుచున్నాను.

''కుమారా! నా యీ ఆజ్ఞను ఉల్లంఘింపకుము. శాంతికొఱకు యాచించుచున్న శ్రీకృష్ణుని నీవు తిరస్కరించి ఆయన ఆజ్ఞను పాటింపనిచో నీకు తప్పక పరాభవము కలుగును. ఆయన మా అందరి హితమును గోరి బోధించెను."

భీష్మ - ద్రోణులు మరల దుర్యోధనునకు ఉపదేశించుట

"జనమేజయా! ఇట్లు ధృతరాష్ట్రుడు చేసిన ఉపదేశమును విని జనసంహారమువలన కలుగబోవు దుఃఖమును సమానముగ అనుభవించు భీష్మద్రోణులు గురుజనాజ్ఞను ఉల్లంఘించు దుర్యోధనునితో నిట్లనిరి:

''వత్సా! కృష్ణార్జునులు ఎంతవఱకు కవచములు ధరించి యుద్ధ సన్నసన్నద్ధులు కారో, ఎంతఱకు గాండీవము ఇంటిలో ఉంచబడియుండునో, ఎంతవఱకు ధౌమ్య మహాముని యజ్ఞాగ్నియందు శత్రుసేనల వినాశముకొరకు అహుతులను వ్రేల్చడో, ఎంతవరకు లజ్జాశీలుడు మహాధనుర్ధరుడునైన యుధిష్ఠిరుడు

నీ సేనపైన క్రోధమూర్ఛితమైన దృష్టిని సారించడో అంతలోపలనే భవిష్యత్తులో జరుగు జనసంహారమును శాంతింప జేయవలెను.

"ఎంతవరకు మహాధనుర్ధనుడైన భీమసేనుడు తన సేనా ముఖమునందు కనబడకుండునో, అంతలోపలనే ఈ మారణ - ఛేదన సంకల్పము శాంతింప వలెను.

"ఎంతవరకు గదాధారియై, భీమసేనుడు నీ సేనను సంహరించుచు యుద్ధభూమిలో నలువైపుల సంచరింపడో ఆ లోపలనే నీవు పాండవులతో సంధి చేసికొనుము.

"ఎంతవఱకు భీమసేనుడు తన వీర ఘాతుకమైన గదచేత పరిపక్వ ఫల వృక్షము యొక్క ఫలములనువలె యుద్ధభూమియందు గజారోహులైన యోధుల మస్తకములను ఛేదించి, ఛేదించి క్రింద పడవేయడో అంతలోపలనే నీ యుద్ధ సంకల్పమ్ము శాంతింపవలెను సుమా!

"ఎంతవరకు 'నకుల సహదేవ - ధృష్టద్యుమ్న - విరాట - శిఖండి - ధృష్టకేతువు' - ఈ మొదలగు అస్త్రవిద్యా నిపుణులు, మహావీరులు, కవచధారణ చేసి మహా సముద్రమునందు ప్రవేశించిన మొసళ్ళవలె నీ సేనలో ప్రవేశింపరో అంతలోపలనే ఈ జనసంహార సంకల్పము శాంతింపవలెను.

"ఎంతవరకు రాజుల సుకుమార శరీరముల పైన గ్రద్దల యీకలతో గూడిన భయంకర బాణములు పడవో అంతలోపలనే యుద్ధ సంకల్పము శాంత మగు గాక!

"ఎంతవఱకు, ఎదురుపడ్డ లక్ష్యములను కొట్టిపడవేయగలవారు, వడిగా బాణములు ప్రయోగించువారు, దూరదూరములందున్న లక్ష్యములను ఛేదించు వారు, అస్త్ర విద్యా పారంగతులు, మహాధనుర్ధనులునైన శత్రువీరులు చందనా గురు చర్చితములు. హారభూషణాలంకృతములైన మీ యుద్ధవీరుల వక్షఃస్థలము లందు ఉక్కు బాణములను వర్షింపరో అంతలోపలనే నీవు యుద్ధ సంకల్పమును విడువవలెను.

"దుర్యోధనా! నీవు ధర్మరాజు నెదుట తలవంచి నమస్కరింపగా, ఆయన తన బాహువులచేత ఎత్తి నిన్ను ఆలింగనము చేయుటను చూడగోరు చున్నాము. యుధిష్ఠిరుని యొక్క ధ్వజాంకుశ పతాక చిహ్నముల చేత శోభి

ల్లిన తన కుడిభుజమును ప్రపంచమునందు శాంతి స్థాపన కొరకు నీ స్కంధము నందు ఉంచుగాక! నిన్ను తనవద్ద కూర్చొనబెట్టుకొని ఎట్టని అరచేతులతో యుధిష్ఠిరుడు నీ వీపుపైన మెల్ల మెల్లగా నిమురుచుండుగాక!

"తాళ (తాటిచెట్టు) స్కంధముల వంటి దీర్ఘబాహువులు గల భీమసేనుడు కూడ శాంతికొఱకు నిన్ను ఆలింగనము చేసికొని నీతో మధుర భాషణములు చేయుచుండుగాక!

"రాజా! అర్జున నకుల సహదేవులు ముగ్గురు నీకు ప్రణామము చేయగా వారి మస్తకములు నీవు ఆఘ్రాణించి వారితో ప్రేమ పూర్వకముగా మాట్లాడు చుందువుగాక!

"నీవు నీ వీరసహోదరులైన పాండవులతో కలసి యుండుటను ఈ రాజు లందరు నేత్రానందముగా చూచుచు ఆనంద బాష్పములు కురియుచుందురుగాక!

"రాజుల రాజధానులన్నింటిలోను 'కౌరవ పాండవుల జగడమంతయు సమాప్తిచెంది వారు ఒండొరులు ప్రేమపూర్వకముగ సమస్త కార్యములను నెర వేర్చుకొనిరి' అని చాటింతురు గాక!

"తరువాత నీవు, యుధిష్ఠిరుడు పరస్పరము భాతృభావముతో ఈ రాజ్యము సమానముగ అనుభవించుచుందురుగాక! నీ సమస్త చింతలు తొలగి పోవుగాక!"

శ్రీకృష్ణునకు దుర్యోధనుడు ఉత్తరము చెప్పుట - అతడు పాండవులకు రాజ్య మియ్యనని నిశ్చయముగా చెప్పుట

''జనమేజయా! కౌరవ సభలో ఇట్లు తనకు అప్రియములైన వచనములు మాట్లాడుట విని దుర్యోధనుడు శ్రీకృష్ణభగవానునితో ఈ విధముగా ననెను:

''కేశవా! నీవు బాగుగా విచారించి యోచనచే యిటువంటి మాటలు చెప్ప వలెను. విశేషించి నన్నే నీవు దోషిగా నిర్ణయించి నిందించుచున్నావు.

మధుసూదనా! నీవు పాండవుల యందలి ప్రేమను ద్విగుణీకృతము చేసికొని నిష్కారణముగా ఎల్లప్పుడు మమ్ము నిందించుచుందువు. దీనికి కారణ మేమి? మా యిరువురి బలాబలములను విచారించియే ఇట్లు చేయుచున్నావా?

"నీవు, విదురుడు, మా తండ్రి, ద్రోణాచార్యుడు, భీష్మపితామహుడు అందరు కూడ కేవలము నాపైననే దోషారోపణము చేయుచున్నారు. కాని, యితర రాజులపైన చేయుటలేదు అని నాకు స్పుటముగ కనపడుచున్నది.

"కాని, యిందులో నా దోషమేమియు లేదని తెలిసికొనుము. ధృతరాష్ట్రునితోబాటు మీరందరు అకారణముగ నన్ను నిందించుచున్నారు. శత్రుదమనా! కేశవా! నేను ఎంతగా యోచన చేసి చూచినను నా యందు సూక్ష్మాతిసూక్ష్మమైన అపరాధము కూడ లేదని తెలియుచున్నది.

"మధుసూదనా! పాండవులకు జూదమాడుట చాల ప్రియముగా నుండెను. అందుచేతనే వారు జూదమాడిరి. మా మామ శకుని జూదమువందు వారి రాజ్యమును గెలుచుకొనెను. ఇందులో నా అపరాధ మేమున్నది?

"మాధవా! ఆ జూదమునందు పాండవులు ఓడిపోయిన ధనమంతయు అప్పుడే వారికి తిరిగి యివ్వబడియుండెను. పాండవ వీరులు రెండవసారి జూదమాడి అడవికి పోవలసినవారైరి. ఇందులో గూడ నా యపరాధమేమియులేదు.

"శ్రీకృష్ణా! అసమర్థులైన పాండవులు శత్రువులతో కలిసి మా యందు ఏ యపరాధమున్నదని మమ్ము ఇట్టి దోషము వారియందు ఉండికూడ మాకు సహజ శత్రువులవలె తలచు చున్నారు? మేము వారిని చెరచిన దేమియులేదు. ఇట్లుండగా పాండవులు సృంజయులతో కలిసి నిరపరాధులైన ధృతరాష్ట్రపుత్రులను వధింపగోరుచున్నారు.

"కృష్ణా! మమ్ము ఎవరు భయపెట్టినను, మాయెడల క్రూరముగ వ్యవహరించినను మేము బెదరిపోయి క్షత్రియ ధర్మము విడిచి, సాక్షాత్తు ఇంద్రునంతటి వాడు వచ్చినను తలవంచజాలము.

"శ్రీకృష్ణా! యుద్ధమునందు మమ్మందరిని జయించు సాహసముగల క్షత్రియ వీరుడెవడు గూడ నాకు కనబడుటలేదు. భీష్మద్రోణ కృపకర్ణులను దేవతలు గూడ యుద్ధమునందు జయింపజాలరు. ఇట్లుండగ పాండవులెంత?

"మాధవా! స్వధర్మమును దృష్టియందుంచుకొని ఒకవేళ మేము యుద్ధము నందు అస్త్రశస్త్రాఘాతముల చేత, మరణించినను మాకు స్వర్గము ప్రాప్తించును క్షత్రియులకు సంగ్రామమునందు అంపశయ్యపై నిద్రించు అవకాశము లభించుట ముఖ్యమైన ధర్మము.

"కాబట్టి మాధవా! మా శత్రువుల యెదుట తలవంచక మేము యుద్ధము నందు వీరశయనము పొందినచో మా సోదరులకు, బంధువులకు దుఃఖము కలుగదు.

"శ్రీకృష్ణా! ఉత్తమకులోత్పనులై క్షత్రియ ధర్మానుసారముగ జీవన నిర్వాహము చేయుచు క్షత్రియోచితవృత్తిని దృష్టియందుంచుకొని కూడ ఈ విధముగా భయపడి శత్రువుల యెదుట తలవంచు వారెవరుందురు?

"వీర పురుషులు సర్వదా ప్రయత్నము చేయుచు ఎవరియెదుట కూడ తలవంచక యుండవలెను. ఎందుకనగా, ప్రయత్నము చేయుటయే పురుషుని కర్తవ్యము. అదియే పౌరుషము వీర పురుషుడు అకాలమరణము చెందినను శత్రువుల యెదుట తలవంచగూడదు.

"ఈ విషయము మాతంగ మహాముని చెప్పెను. ఆ ముని మాటలను తమ హితమును కోరువారు తప్పక గ్రహించవలెను. అట్టివారు ఇతరులను లెక్కచేయక జీవితాంతము ఆ విధముగనే ప్రయత్నించుచుండవలెను. అదియే క్షత్రియధర్మము. నా యభిప్రాయము కూడ అదియే.

"కేశవా! పూర్వము నా తండ్రి నాకిచ్చిన రాజ్యభాగమును నేను బ్రదికి యుండగా ఎప్పుడు ఎవడుకూడ నానుండి తీసికొనజాలడు. ధృతరాష్ట్ర మహారాజు జీవించియున్నంతవరకు నేను, పాండవులు ఆయుధములు ధరించక శాంతిపూర్వకముగ జీవితమును గడపవలెను.

"కృష్ణా! పూర్వమే పాండవులకు రాజ్యమిచ్చుట సముచితము కాదు కాని, అప్పుడు నేను బాలకుడను, పరాధీనుడుగా నుండుటచేత అజ్ఞానముచేతనో భయముచేతనో రాజ్యము వారికివ్వబడినది. ఇప్పుడు రాజ్యము తిరిగి వారు పొందజాలరు. మహాబాహు పరాక్రమశాలియైనయీ దుర్యోధనుడు జీవించియుండగా ఒక సూక్ష్మమైన సూదిమొన మోపినంత భూమికూడ వారికి ఇవ్వబడదు."

శ్రీకృష్ణుడు దుర్యోధనుని బెదరించుట-అతడు కోపముతో సభ విడిచిపోవుచుండగా నతనినిబంధించుటకు బోధించుట

"జనమేజయా! ఆ విధముగా చెప్పిన దుర్యోధనుని మాటలు విని శ్రీకృష్ణుని నేత్రములు కోపము చేత ఎఱ్ఱబడెను. ఆయన కొంచెము సేపు యోచించి మరల దుర్యోధనునితో ఇట్లనెను:

"దుర్యోధనా! నీకు యుద్ధభూమియందు వీర శయనము ప్రాప్తించును. దానితో నీ కోర్కె నెరవేరును. కనుక, దానికొరకు నీవు మంత్రులతోపాటు ధైర్యముగ నుండుము. ఇప్పుడు చాల గొప్ప మనుష్య సంహారము కానున్నది.

"మూర్ఖుడా! 'పాండవులకు నేను ఏయపకారము చేయలే'దని నీవు చెప్పుచున్నావు. ఈ విషయములో నేనన్నియు నీకు తెలిపెదను. సభాసదులారా మీరు కూడ శ్రద్ధగా వినుడు.

"దుర్యోధనా! మహాత్ములైన పాండవుల యొక్క అభివృద్ధి పొందుచున్న సంపదను చూచి నీవు సంతాపము చెంది శకునితో దురాలోచనచేసి పాండవులతో జూదమాడితివి. అట్లు కాకున్నచో సరళస్వభావము కలిగి సత్పురుష సమ్మానితులైన నీ సోదరులు పాండవులు ఇక్కడ నీవంటి కపటితో అన్యాయమైన జూదమును ఎందుకు ఆడెదరు?

"ద్యూతక్రీడ సత్పురుషుల బుద్ధిని కూడ నశింపజేయును. ఇట్లుండగా దాని యందు దుష్టపురుషులకు ప్రవృత్తి గలిగినచో వారిలో చాల గొప్ప కలహము సంభవించును. వారికి అనేక సంకటములు కలుగును.

"దుర్యోధనా! సత్ప్రవర్తనను పాటించక నీవే పాపాత్ములతో కూడి విపత్తికి కారణభూతములైన ద్యూతక్రీడాది కార్యములు చేసితివి.

''అన్న భార్యను సభలో ఈడ్చి తెచ్చి ఆమె యెడల అనుచితముగా వ్యవహరించిన అధముడు నీవు తప్ప ఇంకెవరున్నారు?

''ఆమెను నిండు సభలో దుర్భాషలాడి నిందించితివి కదా! ఆమె ఉత్తమ కుల సంజాత. శీలము - సత్ప్రవర్తన కలది. పాండవులకు ప్రాణాధికురాలైన పట్టపుదేవి. ఐనను ఆమె యెడల నీవు అత్యాచారము చేసితివి.

పాండవులు అడవికి పోవుచున్నప్పుడు దుశ్శాసనుడు కౌరవ సభలో వారిని కఠినముగా మాట్లాడి బాధపెట్టిన సంగతి మీకందరికిని తెలియును. సత్ప్రవర్తన కల సోదరులకు ఎవడు ఇట్లు కఠినముగా అన్యాయము చేయును?

"దుర్యోధనా! నీవు, కర్ణుడు, దుశ్శాసనుడు వారిని అనేక పర్యాయములు నిర్దయగా చూచి అయోగ్యులవలె నిందించితిరి.

"నీవు వారణావతపురమునందు పాండవులను బాల్యావస్థలో తల్లితోబాటు లక్కయింటిలో దహించి వేయుటకు మహా ప్రయత్నము చేసియుంటివి. కాని,

నీ దురుద్దేశము ఫలించలేదు. అప్పుడు పాండవులు తల్లితోపాటు చాలకాలము ఏకచక్రపురమందు బ్రాహ్మణుని యింటిలో తలదాచుకొని యుండిరికదా!

"నీవు భీమసేనునకు విషము పెట్టి, సర్పములతో కరపించి, అతని కాళ్ళు చేతులు బంధించి యతనిని జలములో పడవేసితివి.

''ఇంకను అనేక ఉపాయములచేత పాండవులను నశింపజేయుటకు ప్రయత్నించితివి. కాని, అవి ఫలింపలేదు. ఇంతచేసినను నీవు వారికి ఏ యపరాధము చేయలేదని చెప్పుచున్నావు. అది యెట్లు అంగీకరించెదము?

''పాండవులు యాచించిన తరువాత కూడ వారి పైతృక రాజ్యభాగము నీవు ఇచ్చుటకు ఇష్టపడకున్నావు. యుద్ధభూమియందు నేలపై పడి రాజ్యభ్రష్టుడవైనప్పుడు వారి రాజ్యభాగము ఇచ్చెదవు.

''క్రూరకర్మునివలె వారికి అనేక అపకారములు చేసిన ద్రోహివి. ఐనను ఆ యపరాధములను చేయనట్లే చెప్పికొనుచున్నావు.

''తల్లిదండ్రులు, భీష్మ, ద్రోణులు, విదురుడు సంధి చేసికొమ్మని నీతో మాటిమాటికి చెప్పిరి. శాంతుడవు కమ్మనిరి. కాని, శాంతియను మాటయే నీవు తలంచలేదు. నీవు శాంతిని స్థాపించినప్పుడే నీకు గొప్ప లాభము కలుగును. కాని, నీవంగీకరించుట లేదు. దీనికి కారణము నీ మందబుద్ధి తప్ప వేరేమున్నది?

రాజా! నీహితమును గోరు మిత్రుల ఉపదేశములు పెడచెవిని పెట్టి నీ శ్రేయస్సును దూరము చేసికొనుచున్నావు. నీవు సర్వదా అధర్మకరము, అకీర్తి కరమునైన పని చేయుచుందువు.''

''జనమేజయా! అట్లు శ్రీకృష్ణభగవానుడు దుర్యోధనునకు చెప్పుచుండగనే దుశ్శాసనుడు దుర్యోధనునితో ఇట్లనెను:

''రాజా! నీవు వీరి యిష్టానుసారముగ పాండవులతో సంధి చేసికొనని యెడల వీరు నిన్ను బంధించి యుధిష్ఠిరునకు ఒప్పగించెదరని తోచుచున్నది. భీష్మపితామహుడు, ద్రోణాచార్యుడు, మన తండ్రి - ఈ ముగ్గురు కలిసి నిన్ను, నన్ను, కర్ణుని పాండవులకు ఒప్పగించెదరు.''

''సోదరుడు చెప్పిన మాటలు విని దుర్యోధనుడు క్రుద్ధుడై లేచి మహాసర్పమువలె బుసకొట్టుచు, విదుర-ధృతరాష్ట్ర-బాహ్లిక-కృప-సోమదత్త-భీష్మ-ద్రోణ-కృష్ణాదుల నందరిని తిరస్కరించి, సిగ్గు విడిచి దుర్మతియై అశిష్టునివలె

హద్దుమీరి దురభిమానముతో మాన్యులను అవమానించుచు సభ విడిచి వెడలి పోయెను.

''జనమేజయా! అట్లు పోవుచున్న దుర్యోధనుని చూచి అతని తమ్ముడు మంత్రులు సహచరులైన రాజులు అందరును లేచి అతనితోబాటే వెడలిపోయిరి.

''ఆ విధముగా క్రుద్ధుడై తమ్ములతో సభ విడిచి పోవుచున్న దుర్యోధనుని చూచి భీష్ముడు ఇట్లనెను:

''దుర్యోధనా! ధర్మార్థములను విడిచి క్రోధముతో వ్యవహరించు వానికి త్వరలోనే ముప్పు వాటిల్లును. వానిని చూచి శత్రువులు గేలి చేసెదరు ధృతరాష్ట్రునకు దురాత్ముడైన ఈ దుర్యోధనుడు పుత్రుడుగా పుట్టి లక్ష్యసిద్ధికి కావలసిన ఉపాయములకు వ్యతిరేకముగ కార్యములు చేయుచు క్రోధలోభములకు వశుడై యున్నాడు. తాను రాజు కావలెనను మిథ్యాభిమానము ఇతనికి కలదు.''

''అట్లు చెప్పి భీష్ముడు శ్రీకృష్ణునితో నిట్లనెను:

''జనార్దనా! ఈ క్షత్రియులందరు కాలపరిపాకము చెందిన పండ్లువలె మృత్యుముఖమునకు పోవువారని నేను తలచుచున్నాను. వీరందరును మోహవశులై మంత్రులతో పాటు దుర్యోధనుని అనుసరించుచున్నారు.''

''భీష్ముని మాటలు విని శ్రీకృష్ణుడు భీష్మద్రోణాదులతో నిట్లనెను:

''కురువీరులారా! మీరు ఈ మూర్ఖ దుర్యోధనుని అధికారమునందు కూర్చొనబెట్టి మీ యశక్తిచేత నితనిని అదుపులో పెట్టలేకున్నారు. ఇది పెద్దలు మీరందరు చేయు అన్యాయకార్యము. ఈ విషయమందు సమయోచితమైన మీ కర్తవ్యమును నిశ్చయించి చెప్పుచున్నాను. దీనిని తప్పక మీరు ఆచరించిన యెడల అందరకు మేలు కలుగును. ఇప్పుడు మీ కర్తవ్యమును చెప్పెదను వినుడు:

''కురువీరులారా! ఇప్పుడు నేను చెప్పబోవునది మీకు గూడ ప్రత్యక్షానుభవముగల విషయమే. దుర్యోధనుడు మీకు అనుకూలుడగుటకు నా మాట సరియైనదని మీరనుకున్నచో నేను చెప్పినట్లు చేయుడు.

''వృద్ధుడైన భోజరాజు ఉగ్రసేనుని కొడుకు కంసుడు మిక్కిలి దుష్ప్రవర్తన కలవాడు, అజితేంద్రియుడుగా నుండెను. అతడు తండ్రి బ్రతికియుండగనే అతని ఐశ్వర్యము సంతయు లాగుకొని తానే రాజుయి కూర్చొనెను. అతనిని

సోదరులు, బంధువులు అందరుకూడ విడిచిపెట్టిరి. కాబట్టి, అతని బంధువుల హితమును కోరి నేను ఉగ్రసేనపుత్రుడు కంసుని మహా యుద్ధమునందు సంహరించితిని.

''తరువాత మేమందరము బంధువులము కలిసి భోజవంశ క్షత్రియుల ఉన్నతి కొఱకు ఆహుకుడైన ఉగ్రసేనుని సత్కార పూర్వకముగా మరల రాజును చేసితిమి, కులముయొక్క రక్షణకొఱకు ఒక కంసుని మాత్రము విడిచి అంధక, వృష్ణిప్రభృతి సమస్త యాదవులు పరస్పరము కలిసి మెలసియుండి సుఖముగా వంశోన్నతిని చేసిరి.

"కురువీరులారా! ఇదిగాక, పూర్వము బ్రహ్మదేవుడు చెప్పిన మరియొక కథనుగూడ దృష్టాంతముగ చెప్పెదను వినుడు:

"దేవాసురులు యుద్ధముకొఱకు సేనలను వ్యూహములుగా చేసికొని అందరు కూడ శస్త్రాస్త్రములు ప్రయోగించుటకు సంసిద్ధులై యుండిరి. ప్రపంచమంతయు రెండు భాగములుగా చీలిపోయి ఇరువైపుల చేరెను.

"అట్టి పరిస్థితిలో బ్రహ్మదేవుడు దైత్యదానవాసుర వర్గములకు చెందిన రాక్షసులకు అపజయము కలుగుననియు, ఆదిత్యవసు - రుద్రాది దేవతలకు విజయము కలుగుననియు స్పష్టముగా చెప్పెను.

"దేవతలు, అసురులు, మనుష్య గంధర్వ నాగ రాక్షసాదులు క్రుద్ధులై ఒండొరులను వధించెదరు - అని కూడ బ్రహ్మదేవుడు చెప్పెను.

"భవిష్యత్తులో కలుగబోవు అనర్థము చెప్పి బ్రహ్మదేవుడు యమధర్మరాజుతో, 'ఈ దైత్యదానవులను బంధించి వరుణదేవునకు ఒప్పగింపుము' అని చెప్పెను. బ్రహ్మదేవుని ఆజ్ఞచేత యముడు దైత్యదానవులందరిని బంధించి వరుణునకు ఒప్పగించెను.

"అప్పటినుండి వరుణదేవుడు దైత్య దానవులను ధర్మపాశముతో, వారుణ పాశముతోను బంధించి, వారు తప్పించుకొని పోవకుండ జాగ్రత్తగా చూచుచు సముద్ర తీరమునందు ఉంచినాడు.

"భరత వీరులారా! మీరుగూడ ఆ విధముగనే దుర్యోధన - కర్ణ - శకుని - దుశ్శాసనులను చెరబట్టి పాండవులకు ఒప్పగింపుడు.

''కులము మేలుకొరకు ఒక పురుషుని, గ్రామహితము కొఱకు కులమును, దేశ శ్రేయస్సుకొఱకు గ్రామమును, తన హితము కొఱకు సమస్త భూమండలమును విడువవలెను. అని నీతిశాస్త్రము చెప్పినది.

"ధృతరాష్ట్రమహారాజా! నీవు దుర్యోధనుని బంధించి చెరసాలలో పెట్టి పాండవులతో సంధి చేసికొనుము ఇట్లు చేయుటవలన, నీ కారణముగా కలుగు సమస్త క్షత్రియుల వినాశము నివారింపబడును.''

ధృతరాష్ట్రుడు గాంధారిని పిలుచుట - ఆమె దుర్యోధనునకు బోధించుట

"జనమేజయా! అట్లు శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన మాటలను ధృతరాష్ట్రుడు విని సర్వధర్మజ్ఞుడైన విదురునితో నిట్లనెను:

''నాయనా! విదురా! పరమబుద్ధిమతి దూరదృష్టిగల గాంధారీ దేవిని ఇక్కడికి తోడ్కొని రమ్ము. పొమ్ము. అమెతోబాటు నేను ఈ దుర్మతియైన దుర్యోధనుని అనునయపూర్వకముగ (బ్రతిమాలి) మంచి మార్గమునకు తెచ్చుటకు ప్రయత్నించెదను. ఆమె కూడ ఈ దుష్టాత్ముని శమింపజేయగలిగిన యెడల కృష్ణుని యాజ్ఞను పాలించగల్గుదును.

''దుర్యోధనుడు లోభమునకు పశుడై యున్నాడు. వాని బుద్ధి చెడి పోయినది. వాని సహచరులు కూడ చెడు స్వభావము కలవారై యున్నారు. శాంతిస్థాపన కొఱకు సాధ్యమైన యెడల గాంధారి దుర్యోధనునకు చెప్పి వానికి సన్మార్గమును చూపించవచ్చును. అది సిద్ధించిన యెడల దుర్యోధనుడు మాకు తెచ్చిపెట్టిన భయంకర సంకటము ఎల్లప్పటికిని శాంతింపవచ్చును. మనకు యోగక్షేమములు కూడ స్థిరముగ లభింపగలవు.''

''ధృతరాష్ట్రుని యాజ్ఞచేత విదురుడు దూరదృష్టిగల గాంధారీ దేవిని అక్కడకు తోడ్కొని వచ్చెను.

అప్పుడు ధృతరాష్ట్రుడు ఆమెతో నిట్లనెను :

''గాంధారీ! దురాత్ముడైన నీ పుత్రుడు గురుజనుల యాజ్ఞ నుల్లంఘించు చున్నాడు. అతడు ఐశ్వర్యలోభమునందు పడి రాజ్యముతోబాటు తన ప్రాణములను గూడ పోగొట్టుకొనును. మూర్ఖుడు-దురాత్ముడు-అశిష్టుడును వలె నతడు, అతని హితము గోరు మిత్రుల ఆజ్ఞను కాలదన్ని హద్దుమీరి తన సహచరులతో పాటు సభనుండి వెడలిపోయెను.''

''జనమేజయా! పతిమాటలు విని గాంధారి ఇట్లనెను :

''మహారాజా! రాజ్యకాంక్షచేత తొందరపాటు చెందుచున్న పుత్రుని త్వరగా పిలిపింపుము. ధర్మార్థములకు లోపము కలిగించు అశిష్టపురుషు డెవరైనను రాజ్యమును పొందుటకు అర్హుడు కాజాలడు. ఐనను, మిక్కిలి ఉద్దండుడైన మన దుష్ట పుత్రుడు రాజ్యమును పొందెను.

''రాజా! నీకు నీ పుత్రుడు మిక్కిలి ప్రియుడు. అతనిని నీవు ఏమియు అనజాలవు. కనుక, ఇప్పుడు ఏర్పడిన యీ పెద్ద పరిస్థితికి నీవే నిందనీయుడవు. ఎందుకనగా, వాని పాపపు తలంపులను, చేష్టలను నీవు ఎరిగియు సర్వదా వాని మాట ప్రకారమే నడచుచుంటివి.

''దుర్యోధనుని కామక్రోధములు వశపరచుకొనినవి. అతడు లోభములో ఇరుకుకొని పోయినాడు. కాబట్టి, నేడు అతనిని బలాత్కారముగ సన్మార్గము లోనికి త్రిప్పుట నీకు సాధ్యము కాదు.

''మూర్ఖుడు, అజ్ఞాని, లోభి, దురాత్ముడు, దుష్టులైన సహచరులు గల పుత్రునకు నీవు చేజేత రాజ్యమును ఒప్పగించిన ఫలము ఇప్పుడనుభవించు చున్నావు.

''ఏ రాజైనను స్వజనములో వ్యాపించిన భేద భావమును ఎట్లు ఉపేక్షించచలడు? రాజా! ఇట్లు తన వారిలో భేదాభిప్రాయము కలిగించి వారిని దూరము చేసిన నిన్ను శత్రువులందరు పరిహసింపగలరు. సామభేదోపాయముల చేత ఆపదను తొలగింపగలిగినప్పుడు ఆత్మీయులపైన దండోపాయమును ఎవడు ప్రయోగించును?"

"జనమేజయా! గాంధారీ ధృతరాష్ట్రుల యాజ్ఞచేత విదురుడు సహన శీలత లేని దుర్యోధనుని మరల సభలోనికి పిలుచుకొని వచ్చెను.

''దుర్యోధనుని కన్నులు క్రోధముచేత ఎఱ్ఱబారియుండెను. సర్పమువలె నతడు బుసకొట్టుచు దీర్ఘనిశ్వాసము విడుచుచు తల్లి చెప్పబోవు మాటలను వినుటకు ఇచ్ఛచేత సభా భవనమందు మరల ప్రవేశించెను.

''అట్లు వచ్చిన దుర్యోధనుని గాంధారి నిందించుచు శాంతి స్థాపన కొఱకు అతనితో నిట్లనెను:

''పుత్రా! దుర్యోధనా! నాయీ మాటలను వినుము. నేను చెప్పబోవు మాటలు మన బంధుమిత్రులకు, నీకును హితము కలిగించును. భవిష్యత్తునందు ఈ నా ఉపదేశము నీకు సుఖము కలిగించును.

''దుర్యోధనా! నీ తండ్రి, భీష్మపితామహుడు, ద్రోణ, కృప, విదురులు మన హితముగోరు మిత్రులు. వారి మాటలను వినుము.

''నాయనా! ఎవడుకూడ తన యిష్టానుసారము రాజ్యము పొంది, దానిని రక్షించి అనుభవించజాలడు. జితేంద్రియుడు కానివాడు చాల కాలము రాజ్య భోగము అనుభవింపజాలడు. తన మనస్సును నిగ్రహించుకొనిన మేధావి రాజ్యమును రక్షించగలడు.

"మనుష్యుని కామక్రోధములు ధనమునుండి దూరముగా ఈడ్చుకొని పోవును. ఆ రెండు గొప్ప శత్రువులు. వాటిని జయించిన రాజు ఈ భూమి నంతయు జయింపగలడు. ఈ ప్రభుత్వమే రాజ్యము పేరుతోనున్న యిష్టమైన స్థానము. దుష్టమైన ఆత్మగలవాడు రాజ్యరక్షణము చేయజాలడు.

''నాయనా! దుర్యోధనా! మహాపదవిని పొందగోరువాడు తన యింద్రియ ములను ధర్మార్థములయందు నియమించి యుంచవలెను.

''ఇంద్రియములను జయించిన తరువాత ఇంధనములచేత అగ్ని జ్వలించి నట్లు బుద్ధి తనయంతటనే అభివృద్ధి చెందును.

''అవిధేయములై వశము తప్పిన గుఱ్ఱములు మార్గమునందే రథికుని పడవేసి చంపునట్లు ఇంద్రియములు వశములో ఉంచుకొనని యెడల అవి ఆ మనుష్యుని నశింపజేయును.

''తన మనస్సును జయింపక మంత్రులను జయింపగోరువాడు, మంత్రులను జయింపకయే శత్రువులపై విజయము సాధింపదలచువాడు, పరాధీనుడై తన రాజ్యమును, జీవితమును పోగొట్టుకొనును.

''కాబట్టి, తన మనస్సునే శత్రుస్థానమందు ఉంచి జయించవలెను. తరువాత మంత్రులను, శత్రువులను జయింపగోరవలెను. ఇట్లు చేయుటవలన అతని విజయేచ్ఛ ఎన్నడును వ్యర్థము కాదు.

''జితేంద్రియుడై మంత్రులను వశమునందుంచుకొనువాడు, అపరాధులను దండించువాడు, బాగుగా యోచనచేసి కార్యమును చేయువాడునైన ధీరపురుషుని రాజ్యలక్ష్మి అత్యంత శ్రద్ధాసక్తులతో సేవించును.

''చిన్న రంధ్రములు గల వలలోనున్న రెండు చేపలవలె శరీరమునందు కామ క్రోధమములు దాగియుండి మనుష్యుని జ్ఞానమును నశింపజేయును.

''కామ క్రోధములుగల పురుషునకు దేవతలు స్వర్గద్వారమును మూసి వేయుదురు. విరక్త పురుషుని వలన భయపడి దేవతలు అతనికి స్వర్గ ప్రాప్తికి ప్రతిబంధకములైన కామ క్రోధములను వృద్ధి పొందించెదరు.

''నాయనా! కామ-క్రోధ-లోభ-దంభ-దర్పములను పూర్తిగా జయింపగల రాజే ఈ పృథ్విని శాసింపగలడు. కాబట్టి, ధర్మార్థములను, శత్రుపరాభవమును కోరు రాజు తన యింద్రియములను సర్వదా అణచి యుంచుకొనుటకు ప్రయత్నించవలెను.

''నాయనా! కామక్రోధములలో చిక్కుకొని తన బంధుజనుల యెడలగాని, ఇతరుల యెడలగాని కపటముగా, అన్యాయముగాను వ్యవహరించు రాజున కెవరును సహాయము చేయరు.

''కుమారా! పాండవులు పరస్పరము కలిసి మెలసి ఒకటిగా ఉన్నారు. వారు మహాప్రాజ్ఞులు, శూరులు, శత్రుసంహార సమర్థులు. నీవు వారితో కలిసి మెలసి సుఖముగా పృథివీరాజ్యము ననుభవింపగలవు.

''భీష్మద్రోణులు చెప్పినట్లుగా కృష్ణార్జునులు అజేయులు. వారిమాటలు నిజము. కాబట్టి, మహాకార్యమును గూడ అవలీలగా సాధింపగల శ్రీకృష్ణ భగవానుని శరణు వేడుము. ఆ భగవంతుడు ప్రసన్నుడైన యెడల రెండు పక్షముల వారిని సుఖముగా నుంచ గలడు.

"తన మేలుకోరు విద్వాంసులు, జ్ఞానులునైన మిత్రుల ఆజ్ఞను పాలించని వారు, వారి ఉపదేశములను విననివారు తమ శ్రేయస్సును పోగొట్టుకొని శత్రువుల ఆనందమును పెంపొందించెదరు.

"నాయనా! యుద్ధము చేయుట చేత శ్రేయస్సు ధర్మార్థములు కూడ ప్రాప్తించవు. ఇట్లుండగా సుఖమెట్లు కలుగును?

"యుద్ధమునందు సర్వదా విజయమే కలుగునని నిశ్చయము లేదు. కనుక, యుద్ధమును కోరకుము.

"పరస్పర భేద భావము కలుగునను భయము చేతనే భీష్మపితామహుడు, నీ తండ్రి, బాహ్లీకుడు పాండవులకు వారి రాజ్యభాగమును ఇచ్చిరి. అట్లు ఇచ్చుట

చేతనే ఆ పాండవ వీరుల చేత నిష్కంటకము చేయబడిన యీ సంపూర్ణ భూమండల రాజ్యఫలము నీవు ప్రత్యక్షముగా అనుభవించుచున్నావు."

"కుమారా! నీవు నీ మంత్రులతోబాటు రాజ్యమును అనుభవించదలచిన యెడల పాండవులకు వారి అర్ధరాజ్యమును ఇమ్ము. మంత్రులతో నీవు సుఖముగా జీవించుటకు అర్ధరాజ్యము చాలును.

"నీవు మిత్రుల మాటను అనుసరించినచో కీర్తిని పొందగలవు. దుర్యోధనా! శ్రీమంతులు, మానశీలురు, బుద్ధిమంతులు జితేంద్రియులునైన పాండవులతో నీకు కలుగబోవు యుద్ధమువలన సుఖము సిద్ధించదు.

"నాయనా! నీవు పాండవులకు వారి రాజ్యభాగము నిచ్చి, దానిచేత మిత్రుల క్రోధమును శాంతపరచి నీ రాజ్యమును మంచి పద్ధతిలో ఏలుకొనుము.

"పుత్రా! పాండవులను పదుమూడు సంవత్సరములు దేశమునుండి వెడల గొట్టితివి. ఇదియే వారికి చేసిన మహాపకారము. నీ దుష్కర్మచేత, క్రోధముచేత వారికి నీవు అపకారము దినదినము ఎక్కువగా చేసితివి. ఇప్పుడు నీవు వారితో సంధి చేసికొని వారిని శాంతపరచుము.

"కుమారా! పాండవుల ధనమును నీవు అపహరింపదలచుచున్నావు. అట్టి శక్తి నీకు లేదు. కర్ణుడు, నీ సోదరుడు దుశ్శాసనుడు కూడ వారి ధనము నపహరింపజాలడు.

"ఇరుపక్షములందున్న భీష్మ - ద్రోణ - కృప - కర్ణ - భీమార్జున - ధృష్ట ద్యుమ్నాదులు మిక్కిలి కుపితులై పరస్పరము యుద్ధము చేసినపుడు సమస్త ప్రజలకు వినాశము అవశ్యముగా కలుగును.

"నాయనా! నీవు క్రోధవశుడవై కౌరవుల నందరిని వధింపకుము. నీ స్వార్థము కొఱకు సమస్త భూమండల వినాశము చేయకుము.

"మూర్ఖా! భీష్మ - ద్రోణ - కృపాచార్యాదులు తమ పరిపూర్ణ శక్తిని ప్రయోగించి నీ వైపున యుద్ధము చేయుదురని తలచుచున్నావు. అది యెప్పటికిని సంభవము కాదు.

"ఎందుకనగా, ఆత్మజ్ఞాన సంపన్నులైన యీ మహా పురుషుల దృష్టిలో ఈ రాజ్యము మీకున్నను పాండవులకున్నను సమానమే. వీరి మనస్సులో మీ యిద్దరి యందు ఒకటే విధమైన ప్రేమ ఉన్నది. రాజ్యముకంటె ఎక్కువగా ధర్మమే గొప్పదని వీరు భావించెదరు.

"ఈ రాజ్యముయొక్క అన్నమును వీరు తినినారు. అందువలన ఒకవేళ వారు నీ వైపు నుండి యుద్ధము చేసి తమ ప్రాణములను విడిచినప్పటికిని యుధిష్ఠిరుని ఎప్పుడు కూడ వీరు వక్రదృష్టితో చూడజాలరు.

"కాబట్టి భరతశ్రేష్ఠా! ఈ ప్రపంచమునందు కేవలము లోభముచేత ఎవరికి గూడ ధనము ప్రాప్తించదు. అందువలన లోభముచేత ఏలాటి లాభము కలుగదు. కాబట్టి నాయనా! నీవు పాండవులతో సంధి చేసుకొనుటయే మంచిది"

సాత్యకి దుర్యోధనుని దురాలోచనమును తెలుపుట - శ్రీకృష్ణుని సింహగర్జనము - ధృతరాష్ట్ర విదురులు మరల దుర్యోధనునకు బోధించుట

"జనమేజయా! తల్లి గాంధారి ఆ విధముగ చెప్పిన నీతి వచనములను దుర్యోధనుడు త్రోసిపుచ్చి మరల క్రోధముతో అక్కడినుండి లేచి తన మంత్రుల వద్దకు వెడలిపోయెను.

"తరువాత దుర్యోధనుడు శకునితో రహస్యముగ మంత్రాలోచన చేసెను. అప్పుడు దుర్యోధన - కర్ణ - శకుని - దుశ్శాసనులు నలుగురున్ను దురాలోచనము చేసి యొక నిర్ణయమునకు వచ్చి ఒండొరులతో నిట్లు చెప్పికొనదొడగిరి:

"ప్రతికార్యము అతి శీఘ్రముగా చేయు స్వభావము గల శ్రీకృష్ణుడు ధృతరాష్ట్ర భీష్ములతో కలిసి మనను బంధించులోపల మనమే బలాత్కారముగ హృషీకేశుని - ఇంద్రుడు విరోచన పుత్రుడైన బలిని బంధించినట్లు - చెరబెట్టుదము.

"శ్రీకృష్ణుడు బంధింపబడిన సంగతి విని పాండవులు దంతములూడిన సర్పమువలె మనోబలము నశించినవారై నిరుత్సాహులు కాగలరు.

"శ్రీకృష్ణుడే పాండవులకు శ్రేయస్సు కూర్చువాడు. వారినతడు కవచము వలె రక్షించుచుండును. శ్రీకృష్ణుని బంధించిన మీదట సోమకులు, పాండవులు ప్రయత్నశూన్యులై యుందురు. అందువలన మనము శ్రీకృష్ణుని ఇక్కడనే - ధృతరాష్ట్రుడు ఆక్రోశించుచున్నను - బంధించి శత్రువులతో యుద్ధము చేయుదము."

"జనమేజయా! విద్వాంసుడైన సాత్యకి ఇతరుల యింగితమును త్వరగా అర్థము చేసికొనువాడు కాబట్టి, దుష్టచిత్తులు పాపులునైన ఆ నలుగురి పాపపు

చింతనమును త్వరలో కనిపెట్టెను. పిదప దాని ప్రతీకారము కొరకు సాత్యకి సభను విడిచి బయటకు పోయి కృతవర్మను కలిసికొని అతనితో నిట్లనెను:

"కృతవర్మా! నీవు త్వరలోనే మన సేనను సిద్ధపరచుకొని, నీవు కూడ కవచధారణము చేసి వ్యూహాకారములో నిలిచియున్న సేనతో బాటు సభా భవన ద్వారమునందు సంసిద్ధుడవై యుండుము. అంతవఱకు నేను శ్రీకృష్ణభగవానునకు కౌరవులు పన్నిన కుట్రనుగూర్చి తెల్పెదను."

"జనమేజయా! యిట్లు చెప్పి వీరుడైన సాత్యకి, సింహము పర్వతగుహలో దూరినట్లు సభలో ప్రవేశించి, శ్రీకృష్ణునకు కౌరవుల అభిప్రాయమును తెలిపెను. తరువాత ధృతరాష్ట్ర విదురులకు గూడ ఆ కుట్రను సూచించెను. సాత్యకి కొద్దిగా నవ్వుచు సభాసదులైన కౌరవులకు ఈ విధముగా చెప్పదొడగెను:

"సభాసదులారా! మూర్ఖులై కొందరు కౌరవులు ధర్మార్థకామముల దృష్ట్యా సత్పురుషులు నిందించునట్టి ఒక నీచకార్యము చేయదలచినారు. ఈ కార్యము ఏ విధముగ కూడ సఫలముగాదు. ఐనను, ఇందుకు వారు పూనినారు.

"కురువీరులారా! క్రోధలోభములకు వశులై శోకకామములచేత చుట్టబడిన పాపాత్ములైన మూర్ఖులు ఇక్కడకు వచ్చి అనర్థమును కలిగింపజూచుచున్నారు.

"బాలకులు, మూర్ఖులు మండుచున్న అగ్నిని వస్త్రమునందు బంధింప జూచినట్లు మందబుద్ధులైన కౌరవులు కమలవదనుడైన శ్రీకృష్ణభగవానుని బంధింప గోరుచున్నారు."

"జనమేజయా! సాత్యకి మాటలు విని దూరదృష్టిగల విదురుడు కౌరవ సభయందు ధృతరాష్ట్రునితో నిట్లనెను:

"మహారాజా! నీ పుత్రులందరు అన్ని విధముల కాల (యమ) వశులై యున్నట్లు తెలియుచున్నది. కావుననే వారు అకీర్తికరము అసంభవమునైనకార్యము చేయుటకు సంసిద్ధులై యున్నారు.

"రాజా! వారందరు ఏకమై పురుష సింహుడైన శ్రీకృష్ణభగవానుని తిరస్కరించి హఠముతో చెరబట్టగోరుచున్నారు. శ్రీకృష్ణభగవానుడు ఇంద్రునకు తమ్ముడు. ఈయనను ఆక్రమించుటకు ఎవరికిని సాధ్యము కాదు సుమా! ఈయన కడకు వచ్చిన శత్రువులందరు మండుచున్న అగ్నిలో పడిపోవు మిడుతలవలె నశించిపోయెదరు.

"కురురాజా! క్రోధావేశముతోనున్న సింహము మదగజముపై పడిచంపు నట్లు శ్రీకృష్ణభగవానుడు, క్రుద్ధుడై తలచిన యెడల సమస్త శత్రుయోధులను యమలోకమునకు పంపగలడు.

"కాని, రాజా! పురుషోత్తముడు ఎప్పుడు కూడ నిందితమైన పాపకర్మను, అధర్మకార్యమును చేయడు.

"కురుకులభూషణా! శ్రీకృష్ణుడు అశ్వ - గజ - రథ - సహితముగా వారాణసీనగరమును దహించి, కాశీరాజును అతని బంధువులసహితముగా చంపినట్లే, తాను స్వయముగ ప్రళయకాలాధిపతియై హస్తినాపురమును దహించి కౌరవులను నశింప జేయును.

"రాజా! శ్రీకృష్ణుడు ఏకాకిగానే పోయి పారిజాతవృక్షమును అపహరించి నప్పుడు కోపావిష్టుడైన యింద్రుడు వసువులతో శ్రీకృష్ణు నాక్రమించెను. ఐనను జయింపజాలక పోయెను.

"మహారాజా! "నిర్మోచనము" అను స్థానమునందు 'ముర' దైత్యుడు దృఢములైన ఆరు వేల పాశములను తన బందురక్షణముకై అడ్డుగా కట్టి యుండెను. శ్రీకృష్ణుడు ఆ పాశములను ఛేదించెను.

"కురువల్లభా! శ్రీకృష్ణుడు, 'సౌభ' నగర ద్వారముకడకు పోయి తన గదతో అక్కడి పర్వతమును ఛేదించి మంత్రి సమేతముగ 'ద్యుమత్సేనుని' చంపెను.

"కురుపతీ! ఇంకను కౌరవుల ఆయుస్సు మిగిలి యున్నది. కనుకనే శ్రీకృష్ణుడు ఈ పాపులను దండింప సమర్థుడైనను, ధర్మాత్ముడైనందున క్షమించు చున్నాడు.

"కౌరవులు తమ సహచరులతో కలిసి గోవిందుని బంధింపదలచినయెడల వీరందరును నేడే యమధర్మరాజునకు అతిథులయ్యెదరు.

"ధృతరాష్ట్ర మహారాజా! తృణాగ్రములు మహాబలుడైన వాయువునకు అణగినట్లే సమస్త కౌరవులు ఈ చక్రధారి యెదుట అణగిపోయెదరు.

"జనమేజయా! విదురుడు ఇట్లు చెప్పిన తరువాత శ్రీకృష్ణభగవానుడు ఆ సభలోని మిత్రులు వినుచుండగా ధృతరాష్ట్రునితో ఇట్లనెను:

"రాజా! ఈ దుష్టకౌరవులు కుపితులై బలాత్కరించి నన్ను బంధింప దలచుచున్నారు. నాకు ఆజ్ఞ యిమ్ము, తరువాత చూడుము వీరు నన్ను బంధించెదరా? లేక, నేను వీరిని బంధించెదనా?

"నేను క్రోధముతో ఈ సమస్త కౌరవులను బంధింపగల శక్తి కలవాడనైనను ఎప్పుడు కూడ నిందితము, పాపకరమునైన ఏకార్యమును చేయను.

"ధృతరాష్ట్రా! నీ పుత్రులు పాండవుల ధనమును హరించుటకు లోభావేశముతో నున్నారు. కాని, వీరు తమ ధనమునే పోగొట్టుకొనవలసివచ్చును.

"వీరు నన్ను బంధించదలచిన యెడల యుధిష్ఠిరుని కార్యము సులభముగ నెరవేరినట్లే యగును. ఎందుకనగా, నేడే నేను ఈ కౌరవులందరిని వీరి సహచరులతో గూడ బంధించి పాండవులకు ఒప్పగించిన యెడల తప్పే మున్నది? కాని, ఇట్టి నిందితకార్యమును నేను నీ యెదుట చేయజాలను.

"మహారాజా! దుర్యోధనుడు తన యిష్టము వచ్చినట్లు చేయుగాక! నీ పుత్రులకు నేను అనుమతి ఇచ్చుచున్నాను."

"జనమేజయా! శ్రీకృష్ణుడు చెప్పిన మాటలను విని ధృతరాష్ట్రుడు విదురునితో నిట్లనెను:

"విదురా! పాపాత్ముడు రాజ్యలోభియునైన దుర్యోధనుని అతని మిత్ర మంత్రి సోదర - సేవక సహితునిగ వెంటనే నా కడకు తోడుకొని రమ్ము. మరల అతనికి నేను సన్మార్గమును ఉపదేశింప దలచినాను. నా మాట వినిన యెడల అతనికి మంచిదే యగును.''

''తరువాత విదురుడు దుర్యోధనుని మిత్ర సహితముగ, అతనికి ఇష్టము లేకున్నను, పిలుచుకొని వచ్చెను. అట్లు కర్ణదుశ్శాసనాదులైన మిత్రులతో వచ్చిన దుర్యోధనునితో అందరి సమక్షమున ధృతరాష్ట్రు డిట్లనెను:

"కుమారుడా! మహా పాపీ! నీకు నీచులే సహాయకులుగా నున్నారు. పాపులైన నీ సహాయకులతో కలిసి పాపకార్యమునే చేయదలచు చున్నావు. ఆ కార్యము సత్పురుషులు సర్వదా గర్హించునది. అది అకీర్తికరము. ఎప్పుడు కూడ నీవా కార్యము చేయజాలవు. కాని, మన కులమును దహించుటకు అగ్నివలె జన్మించి నీవు దుష్కర్మను చేయుటకు పూనియున్నావు.

"దుష్టుడా! ఎవ్వరికిని సమీపించుటకైనను సాధ్యముకాని యీ పుండరీకాక్షుని నీవు పాపులతో కలిసి బంధింప గోరుచున్నావు.

"మూర్ఖుడా! ఇంద్రాది దేవతలు గూడ బలాత్కరించి ఈ మహాత్ముని తమ వశములోనికి తీసికొనజాలరు. అట్టి మహానుభావుని నీవు బంధింప దలచుచున్నావు. ఇప్పుడు నీవు తలపెట్టిన పని మూర్ఖుడైన బాలకుడు చంద్రుని పట్టుకొనుటకు ప్రయత్నించు చున్నట్లున్నది.

"దురాత్మా! దేవ-మనుష్య-గంధర్వ-రాక్షస-నాగులు కూడ యుద్ధమునందు ఎవని వేగమును సహింపజాలరో, అట్టి శ్రీకృష్ణభగవానుని నీవు ఎరుగవు.

"దుష్టుడా! వాయువును చేతితో పట్టుకొనుట యెట్లు దుష్కరమో, చంద్రుని చేతితో స్పృశించుట యెంత కఠినమో, పృథివిని శిరస్సుపైన ధరించుట ఎట్లు అసంభవమో, ఆ విధముగనే శ్రీకృష్ణ భగవానుని బలాత్కరించి బంధించుట దుష్కరమైన పని."

"అట్లు ధృతరాష్ట్రుడు చెప్పిన తరువాత విదురుడు కూడ క్రోధపూరితుడై దుర్యోధనుని సమీపించి యిట్లనెను:

"దుర్యోధనా! ఇప్పుడు నేను చెప్పబోయెడి వాక్యములను సావధానముగ వినుము:

"సౌభ ద్వారమునందు 'ద్వివిదుడు' అను సుప్రసిద్ధుడైన కపిరాజు ఉండెను. అతడు ఒకనాడు గొప్ప పాషాణవర్షము కురిపించి శ్రీకృష్ణ భగవానుని ఆశిలా వర్షముతో కప్పివేసెను. ఇంకను ఎన్నియో ఉపాయములు చేసి ఆ వానరుడు శ్రీకృష్ణుని బంధింపదలచు చుండెను. కాని, అది అతనికి అసాధ్యమై, శ్రీకృష్ణుని అతడు బంధింపజాలక పోయెను. అటువంటి శ్రీకృష్ణ భగవానుని బలాత్కారముచేసి నీ వశములోనికి తీసికొన గోరుచున్నాను.

"మూర్ఖుడా! పూర్వము 'ప్రాగ్జ్యోతిష' పురమునకు పోయిన శ్రీకృష్ణుని నరకాసురుడు కూడ రాక్షససేనా సహితుడై బంధించుటకు ప్రయత్నించెను. అదికూడ సఫలము కాలేకపోయెను. అట్టి శ్రీకృష్ణుని బలపూర్వకముగా నీ వశలోనికి తీసికొన దలచుచున్నావు.

"నరకాసురుడు సామాన్యుడు కాడు. అనేక యుగములు అనేక సంవత్సరములు జీవించగల దీర్ఘాయువు కలవాడు. అట్టి వానిని యుద్ధమునందు చంపి శ్రీకృష్ణుడు అతని వద్ద బంధించబడిన వేలకొలది రాజ కన్యకలను విడిపించి తీసికొనిపోయి వారందరిని విధి పూర్వకముగా వివాహము చేసికొనెను.

"క్రూరాత్మా! నిర్మోచన మనుచోట ఆరువేల మంది మహా రాక్షసులను శ్రీకృష్ణ భగవానుడు బంధించెను అట్టి రాక్షసులు కూడ ఆయనను బంధించ లేకపోయిరి. అటువంటి మహానుభావుని నీవు బలపూర్వకముగా కట్టివేయ బూనితివి.

"భరతశ్రేష్ఠా! శ్రీకృష్ణుడు బాల్యమునందు 'శకునీ' అను నామాంతరము గల పూతనారాక్షసిని వధించెను. గోవులను రక్షించుటకుగాను గోవర్ధన పర్వత మును తన చేతిపై ధరించెను. అరిష్టాసురుడు, ధేనుకుడు, చాణూరుడు, అశ్వ రాజైన కేశి, కంసుడు మొదలైన లోక కంటకులను చంపెను.

''రాజా! జరాసంధ - వక్ర - శిశుపాల - బాణులు యుద్ధమునందు శ్రీ కృష్ణునిచే చంపబడిరి. ఎందరినో ఇతర రాజులను గూడ ఈయన సంహరించెను.

''దుర్యోధనా! అమిత పరాక్రమశాలియైన శ్రీకృష్ణుడు వరుణదేవుని, అగ్ని దేవుని కూడ జయించెను. పారిజాతాపహరణ సమయమునందు సాక్షాత్తు ఇంద్రుని గూడ జయించెను.

''ధార్తరాష్ట్రాగ్రణీ! శ్రీకృష్ణభగవానుడు ప్రళయకాలమునందలి ఏకార్ణవ జలమునందు శయనించినపుడు మధుకైటభులు అను రాక్షసులను సంహరించెను. ఇతరావతారము నందు ఈయన హయగ్రీవరాక్షసుని గూడ చంపెను.

''కురుపతీ! శ్రీకృష్ణుడు ప్రపంచమునందలి అన్నిటికిన్ని కర్త, కాని, ఇతనికి మరియొకడు కర్తగా లేడు. అన్ని పురుషార్థముల సిద్ధికి కారణము ఈయనయే ఈయన చేయదలచిన పనులన్నియు మిక్కిలి అవలీలగా చేయ గలడు.

''సుయోధనా! సర్వదా అచంచలమైన మహిమగల గోవిందుని పరాక్ర మము అతిభయంకరము. ఈయనను నీవు సరిగా తెలిసికొనలేదు. ఈయన కుపితమైన విషధర సర్పమువలె భయంకరుడు. ఈ తేజోరాశిని సర్వదా సత్పురు షులు ప్రశంసించుచుందురు.

''కురుపతీ! అత్యంత సులభముగా మహాపరాక్రమములను ప్రదర్శింపగల బాహు బలసంపన్నుడైన శ్రీకృష్ణభగవానుని నీవు తిరస్కరించుచు ఎదిరించిన యెడల నీ మంత్రులతో సహితముగ నీవు. మిడుతలు అగ్నిలో పడి భస్మమైనటుల నశించెదవు సుమా!''

శ్రీకృష్ణుని విశ్వరూప ప్రదర్శనము - ఆయన సభ నుండి వెడలిపోవుట

''జనమేజయా! విదురుడు అట్లు చెప్పిన తరువాత శత్రుసంహారకారియైన శ్రీకృష్ణపరమాత్మ దుర్యోధనునితో నిట్లనెను:

''దుర్మతీ. సుయోధనా! నీవు మోహవశుడవై, నేను ఒంటరిగా నీకు చిక్కితినని తలచుచున్నావు. అందుచేత నీవు నన్ను బంధింప తలచుచున్నావు. ఇది నీ యజ్ఞానమే సుమా!

''మూర్ఖుడా! చూడుము. పాండవు లిక్కడనే ఉన్నారు. అంధక - వృష్ణి వీరులందరు ఇక్కడనే యున్నారు. ఆదిత్యగణము, రుద్రగణము, వసుగణము, మహర్షులు అందరును ఇక్కడనే ఉన్నారు.''

"జనమేజయా! ఇట్లు చెప్పి శత్రువీర వినాశకరుడైన శ్రీకృష్ణభగవానుడు ఉచ్చైస్స్వరముతో అట్టహాసము చేసెను. ఆ యట్టహాసమునందు శ్రీకృష్ణపర మాత్మ అవయవములందున్న దేవతలు విద్యుత్సమాన కాంతిగలిగి, అంగుష్ఠ మాత్ర పరిమాణముగల స్వల్పశరీరులై, అగ్నిజ్వాలలు కురియుచుండిరి. ఆ శ్రీకృష్ణుని లలాటమునందు బ్రహ్మదేవుడు, వక్షః స్థలమందు రుద్రుడు విరా జిల్లుచుండిరి.

''జనమేజయా! సమస్త లోక పాలకులు శ్రీకృష్ణుని భుజములందుండిరి. ఆయన నోటినుండి అగ్నిజ్వాలలు బయలు వెడలుచుండెను. ద్వాదశాదిత్యులు, సాధ్యులు, అష్ట వసువులు, అశ్వినీ కుమారులు, ఇంద్రునితో గూడిన దేవతలు, యక్షులు, గంధర్వులు, నాగులు, రాక్షసులు అందరును శ్రీకృష్ణుని వేర్వేరు అవయవములనుండి ప్రకటితులైరి.

''జనమేజయా! శ్రీకృష్ణుని కుడిభుజమునందు ధనుర్ధనుడైన అర్జునుడు, ఎడమ భుజమునందు హలధరుడైన బలరాముడు భాసిల్లుచుండిరి. యుధిష్ఠిర - భీమ - నకుల సహదేవులు భగవంతుని పృష్ఠభాగమునందుండిరి. వృష్ణి వంశీయు లైన ప్రద్యుమ్నాదులు, అంధక వంశీయులైన యోధులు హస్తముల యందు గొప్ప ఆయుధములు ధరించి భగవంతుని అగ్రభాగమునందు ఆవిర్భవించిరి.

''శంఖ - చక్ర - గదా - శక్తి - శార్ఙ్గ - చాప - హల - నందక - ఖడ్గాద్యాయుధములు పైకెగసి, శ్రీకృష్ణుని అనేక భుజములందు దేదీప్యమానములుగ కనబడుచుండెను.

''ఆయన నేత్ర నాసికా కర్ణ రంధ్రములనుండియు అత్యంత భయంకర ధూమసహితములైన అగ్నిజ్వాలలు బయలువెడలుచుండెను. శ్రీకృష్ణుని సమస్త రోమములనుండి సూర్యకిరణ సమాన దివ్యకిరణములు వెడలుచుండెను.

''అట్టి భయంకర స్వరూపమును చూచి సభాసదులైన రాజులందరి మనస్సులలో భయము కలిగి కన్నులు మూసికొనిరి.

''మహాభాగ్యశాలియైన సంజయునకు, తపోధనులైన ఋషులకు, ద్రోణాచార్యులకు, భీష్మునకు, బుద్ధిమంతుడైన విదురునకు తప్ప తక్కిన యందరకును కన్నులు మూతబడెను.

"ద్రోణాదులకు శ్రీకృష్ణభగవానుడు దివ్యదృష్టి ప్రసాదించెను. కాబట్టి, వారుకన్నులు తెరచుకొని ఆయనను చూడగలిగిరి.

"ఆ సభాభవనమునందు శ్రీకృష్ణుని పరమాశ్చర్యకరమైన విశ్వరూపమును చూచి దేవతలు దుందుభులు మ్రోగించిరి. శ్రీకృష్ణుని పైన పుష్పవర్షము కురిపించిరి.

"అప్పుడు ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణునితో నిట్లనెను:

''పుండరీకాక్షా! నీవే సమస్త జగత్తునకు హితము కోరువాడవు. కాబట్టి నాయందు కూడ దయజూపుము. భగవాన్! నా నేత్రములు మూసికొనియున్నవి. నేడు నేను నా రెండు నేత్రములను ప్రసాదించమని నిన్ను కోరుచున్నాను. కేవలము నీ దర్శనము మాత్రమే చేయదలచుచున్నాను. నిన్ను తప్ప మరి ఎవరినిన్ని చూడదలచకున్నాను ''

''అట్లు ప్రార్థించిన ధృతరాష్ట్రునితో శ్రీకృష్ణుడు కురునందనా! ఇతరులకు అదృశ్యములైన నేత్రములు నీకు ప్రాప్తించుగాక!' అని వరమిచ్చెను.

"జనమేజయా! అక్కడ అప్పుడు కలిగిన మహాద్భుతము ఏమనగా, ధృతరాష్ట్రునకు గూడ శ్రీకృష్ణభగవానుని విశ్వరూపమును దర్శించుటకై రెండు నేత్రములు కనబడజొచ్చెను. సింహాసమున కూర్చొనియున్న ధృతరాష్ట్రునకు నేత్రములు కనబడుచున్నట్లు తెలిసికొని అక్కడి ఋషులు, రాజులు ఆశ్చర్యచకితులై మధుసూదనుని స్తుతించిరి.

"జనమేజయా! ఆ సమయమున సమస్త భూమండలము కంపింపజొచ్చెను. సముద్రములు క్షోభిల్లెను. రాజులందరు విస్మయము చెందిరి.

"జనమేజయా! తరువాత శత్రుదమనుడైన శ్రీకృష్ణపరమాత్మ తన దివ్యాద్భుత విచిత్రైశ్వర్యములతోబాటు విశ్వరూపమును ఉపసంహరించుకొనెను.

"తరువాత శ్రీకృష్ణుడు ఋషుల అజ్ఞ తీసుకొని సాత్యకి చేతిని, హార్దిక్యుడైన కృతవర్మ చేతిని పట్టుకొని ఆ సభాభవనము నుండి వెడలిపోయెను. అతడు వెడలగనే నారదాది మహర్షు లంతర్ధానము చెందిరి. అక్కడి కోలాహలమంతయు శాంతించెను. ఇది యంతయు నొక అద్భుత సంఘటనముగా నుండెను.

"జనమేజయా! అట్లు వెడలిపోవుచున్న శ్రీకృష్ణుని వెంట రాజులు సమస్త కౌరవులును ఇంద్రుని వెంట దేవతలవలె అనుసరించిపోయిరి. కాని, అచింత్య స్వరూపుడైన శ్రీకృష్ణభగవానుడు తనను అనుసరించుచున్న రాజులను లెక్కలేయక ధూమసహితవహ్నివలె సభాభవనమునుండి బయటికి వెడలిపోయెను.

"జనమేజయా! శ్రీకృష్ణభగవానుడు సభాబహిర్భాగమునకు రాగానే శైబ్య-సుగ్రీవ - మేఘపుష్ప - పలాహక నామములుగల నాలుగశ్వములతో కట్టబడి మిక్కిలి ప్రకాశించుచున్న రథముతో సారథియైన దారుకుడు కనబడెను.

ఆ రథమునందు అనేక క్షుద్రఘంటికలు (గజ్జెలు) శోభిల్లుచుండెను. సువర్ణజాలముల (కిటికీల) నుండి ఆ రథపు విచిత్రశోభ బయటికి వెడలుచుండెచు. శీఘ్రగామియైన ఆ రథము పోవుచున్నప్పుడు మేఘగంభీరధ్వని రథ చక్రముల నుండి వెడలుచుండెను. ఆ రథములో ఆవశ్యకమైన సమస్త సామగ్రి సుందరముగా అమర్చబడియుండెను, ఆ రథముపైన వ్యాఘ్రచర్మము కప్పబడియుండెను. రథ రక్షణముకొరకు ఇతరావశ్యకములు కూడ ఏర్పరచబడియుండెను.

"జనమేజయా! ఆ విధముగనే వృష్ణివంశపూజ్యుడైన హృదికపుత్రుడైన కృతవర్మ కూడ అన్యరథమునందు కూర్చొనియుండెను.

"శత్రుదమనుడైన శ్రీకృష్ణభగవానుని రథము సిద్ధమై యున్నది. అప్పుడు ఆయన ఇక్కడినుండి వెడలిపోవును అని తెలిసికొని ధృతరాష్ట్రమహారాజు మరల శ్రీకృష్ణునితో నిట్లనెను:

''జనార్దనా! నా శక్తి నా పుత్రులయందు ఎంతవరను పనిచేయుచున్నదో యను విషయమంతయు ఇపుడు నీ కన్నుల యెదుటనే జరిగెను. నేనేమియు నీ నుండి దాచలేదు.

''కేశవా! కౌరవ పాండవుల మధ్య సంధి యేర్పడుటకు నేను గూడ ప్రయత్నించెదను. కాని, ఈ నా వృద్ధ వయస్సును, నా పరిస్థితి గమనించి నీవు నన్ను ఏమాత్రము సందేహింపకుము.

''మాధవా! పాండవుల యెడల నాకు పాపచింతన లేదు. దుర్యోధనునకు నేను చెప్పిన హితవచనములు కూడ నీకు తెలియును.

"గోవిందా! నేను అన్ని ఉపాయములచేత శాంతిస్థాపనకు ప్రయత్నించుచున్నానని ఈ సమస్త కౌరవులకు, అన్యదేశములనుండి వచ్చిన రాజులకు కూడ సంపూర్ణముగ తెలియును.''

"జనమేజయా! తరువాత శ్రీకృష్ణభగవానుడు, ధృతరాష్ట్ర-ద్రోణ-భీష్మ-విదుర-బాహ్లీక-కృపాచార్యులతో నిట్లనెను:

''మహాత్ములారా! కౌరవసభయందలి సంఘటనము మీరు ప్రత్యక్షముగ చూచియున్నారు. మూర్ఖుడైన దుర్యోధనుడు నేడు అశిష్టునివలె రోషముతో సభ విడచి వెడలినదియు అతడు నన్ను బంధింపదలచినదియు మీకు తెలియును.

''ధృతరాష్ట్ర మహారాజు కూడ తాను అసమర్థుడనని చెప్పి కొనుచున్నాడు ఇక నేను ఇప్పుడు యుధిష్ఠిరుని కడకు పోయెదను. మీరందరు నాకు అజ్ఞ ఈయగలరు.''

"జనమేజయా! తరువాత రథముపై కూర్చొని ప్రయాణముకొఱకు ఉద్యుక్తుడైన శ్రీకృష్ణభగవానుని యనుమతిపైన భరతవంశీయులైన ధనుర్ధరులు కొందరు శ్రీకృష్ణుని వెనుక కొంతదూరము పోయిరి.

''అట్లు అనుసరించినవారిలో ముఖ్యులు భీష్మ-ద్రోణ-కృప-విదుర-ధృతరాష్ట్ర బాహ్లీక-వికర్ణ-యుయుత్సు-అశ్వత్థామలు.

శ్రీకృష్ణుని కోరికపై కుంతీదేవి పాండవులకు తన సందేశము పంపుట

"జనమేజయా! తరువాత శ్రీకృష్ణుడు తన మేనత్త కుంతీదేవి యింటికి పోయి, ఆమె చరణములకు ప్రణామము చేసి, ఆమెకు కౌరవ సభలో ఆనాడు జరిగిన విషయమంతయు సంగ్రహముగా వినిపించి యిట్లనెను:

"అత్తా! నేను, మహర్షులున్ను అనేక యుక్తియుక్తవచనములను సభలో చెప్పితిమి. ఆ మాటలన్నియు కౌరవులకు గ్రహింపదగినవిగా నుండెను. కాని, దుర్యోధనుడు అంగీకరించలేదు.

"దుర్యోధనుని వశమునందు చిక్కుకొని, అతనినే అనుసరించుచున్న క్షత్రియులందరికి వినాశకాలము దాపురించినదని తెలియుచున్నది. అందుచేత వారు శీఘ్రముగ నశించెదరు.

"నేనిప్పుడు ఇక్కడి నుండి పాండవులకడకు పోవుచున్నాను. అత్తా! నాకు అజ్ఞ నిమ్ము.

''మహాప్రాజ్ఞురాలా! నీవు పాండవులకు తెలుపవలసిన సందేశమేమైన ఉన్న యెడల నాకు చెప్పుము. ఇప్పుడు నీ మాట వినదలచినాను.''

''ఆ మాటలకు కుంతీదేవి శ్రీకృష్ణునితో నిట్లనెను:

"కేశవా! నీవు ధర్మాత్ముడైన యుధిష్ఠిరునికడకు పోయి నా మాటగా ఇట్లనుము:

"పుత్రా! నీ ప్రజాపాలన ధర్మమునకు గొప్పహాని కలుగుచున్నది. నీవు ధర్మపాలనావసరమును వ్యర్థము చేయకుము.

"వేదార్థమును తెలియక, అజ్ఞులైన వేదపాఠకుల బుద్ధి కేవలము వేద మంత్రములను వల్లించుటయందే నష్టమై పోవుచు, మంత్ర పాఠమాత్రధర్మమునందే దృష్టికలిగి నప్పుడు ఎట్లు అది నశించునో, అట్లు నీ బుద్ధికూడ కేవలము శాంతి ధర్మమునే చూచుచున్నది.

"కుమారా! బ్రహ్మదేవుడు నీ కొరకు సృష్టించిన ధర్మముపై దృష్టి నిలుపుము. ఆయన తన రెండు భుజములనుండి క్షత్రియులను పుట్టించెను. కాబట్టి, క్షత్రియులు బాహుబలము చేతనే జీవికానిర్వాహణము చేయవలెను. క్షత్రియులు కఠినమైన యుద్ధకార్యము కొరకే సృష్టింపబడినారు. వారు, సర్వదా ప్రజాపాలన ధర్మమునందే ప్రవృత్తి గలవారై యుందురు.

"ఈ విషయములో నేను పెద్దలనుండి వినిన ఒక యితిహాసమును ఉదాహరణముగా చెప్పెదను వినుము:

"పూర్వము ధనాధిపతియైన కుబేరుడు రాజర్షియైన ముచుకుందునియెడల ప్రసన్నుడై అతనికి సమస్త భూమండలము ఇచ్చెను. కాని, అతడు దానిని గ్రహింపక కుబేరునితో నిట్లనెను:

''దేవా! నేను నా బాహుబలముచేత సంపాదించిన రాజ్యమునే అనుభవింప వలెనని కోరుచున్నాను "

''ఆ మాటవిని కుబేరుడు మిక్కిలి సంతుష్టుడై ఆశ్చర్యపడెను.

"జనమేజయా! తరువాత క్షత్రియధర్మమునందు ఆసక్తికల ముచుకుంద మహారాజు తన బాహుబలముచేత సంపాదించిన పృథివిని న్యాయపూర్వకముగ ఏలెను.

''నాయనా! యుధిష్ఠిరా! రాజుచేత సురక్షితులైన ప్రజలు అనుష్ఠించిన ధర్మముయొక్క అర్ధభాగము రాజును చేరును. కనుక, రాజు ధర్మముతో పాలించిన యెడల అతనికి దేవత్వము సిద్ధించును. ఒకవేళ అతడు అధర్మమును చేసిన యెడల నరకమునందు పడిపోవును.

''రాజు దండనీతిని స్వధర్మము ననుసరించి ప్రయోగించిన యెడల అది బ్రాహ్మణ-క్షత్రియ వైశ్యశూద్రులనెడు నాలుగు జాతులవారిని అదుపులోన ఉంచి, వారికి ఆ ధర్మము అంటకుండ చేయును.

"నాయనా! రాజు దండనీతిని ప్రయోగించుటయందు పరిపూర్ణన్యాయ మును చూపిన యెడల ప్రపంచమునందు సత్యయుగము (కృతయుగము) అనెడు ఉత్తమకాలము రాగలదు.

"రాజుకు కాలము కారణమా - లేక కాలమునకు రాజు కారణమా? అను సందేహము నీకు కలుగనవసరము లేదు. ఎందుకనగా రాజే కాలమునకు కారణము.

"పుత్రా! యుధిష్ఠిరా! రాజు తన ధర్మాచరణము ద్వారా, కృత-త్రేతా-ద్వాపరయుగములను సృజించును. రాజు అధర్మపరుడైనచో, నాలుగవదైన కలియుగము ప్రకటితమగుటకు కూడ నతడే కారణమగును.

"ధర్మనందనా! రాజు తన సత్కర్మల ద్వారా ధర్మము నాలుగు పాదములు గల కృతయుగమును సృష్టించినందువలన అతనికి అక్షయమైన స్వర్గము ప్రాప్తించును. మూడు పాదములే ధర్మము గల త్రేతాయుగము కల్పించిన యెడల రాజునకు స్వర్గప్రాప్తి కలుగును. కాని, అతడు స్వర్గమునందు అక్షయముగ నుండజాలడు. రెండు పాదములే ధర్మము గల ద్వాపరయుగము సృష్టించిన రాజునకు దాని ననుసరించిన పుణ్యము, పాపము-ఈ రెంటి ఫలము ప్రాప్తించును.

"కాని ఒక్కపాదము మాత్రమే ధర్మముగల కలియుగ ప్రవృత్తి కలిగించిన రాజు మిక్కిలి పాపము కష్టము అనుభవించవలసియుండును.

"ఇట్లు కలియుగ ధర్మమును ప్రవేశపెట్టిన దుష్కార్యాచరణుడైన రాజు అనేక సంవత్సరములవరకు నరకమునందే నివసించుచుండును. రాజదోషము జగత్తునకు జగత్తుదోషము రాజునకు ప్రాప్తించును.

"పుత్రా! నీ పితృపితామహులు పాలించిన రాజధర్మమునందు దృష్టి నిలుపుము. ఇప్పుడు నీవు ఆశ్రయింపదలచిన ధర్మము రాజర్షుల ఆచారమునకు గాని, రాజధర్మమునకుగాని విరుద్ధముగ నున్నది.

"ఎల్లప్పుడు దయాభావముతో నుండి కలత చెందుచున్నవానికి ప్రజా పాలనము వలన కలిగిన పుణ్యఫలము ఎప్పుడు కూడ ప్రాప్తించదు.

"యుధిష్ఠిరా! నీవు ఇప్పుడు ఏబుద్ధిని ఆశ్రయించి నడచుచున్నావో దానిని నీ తండ్రి పాండురాజుకాని, లేక నేనుగాని, లేక పితామహుడు విచిత్రవీర్యుడు గాని పూర్వమెప్పుడు కూడ అనుమతించి ఆశీర్వదించియుండలేదు. నీకు అటు వంటి బుద్ధి కలుగవలెనని ఎవరును కోరలేదు.

"ధర్మపుత్రా! నీకు యజ్ఞము, దానము, తపస్సు, శౌర్యము, బుద్ధి, సంతానము, మహత్త్వము, బలము, పరాక్రమము, ప్రాప్తించుగాక" యని నేను సర్వదా కోరుచుందును.

"వేదజ్ఞులైన బ్రాహ్మణులను ఆరాధించినప్పుడు వారుకూడ దేవయజ్ఞ-పితృయజ్ఞ దీర్ఘాయువులు, ధనము పుత్రులు కలుగుటకే ఆశీర్వదించుచుందురు.

"దేవతలు, తమను ఉపాసించువారినుండియు, పితృదేవతలు తమ వంశమునందు పుట్టిన వారినుండియు ఎల్లప్పుడు దానము, అధ్యయనము, యజ్ఞము, ప్రజాపాలనము ఆశించుచుందురు."

జనమేజయా! ఇట్లు కుంతీదేవి యుధిష్ఠిరునకు చెప్పవలసిన సందేశమును శ్రీకృష్ణునకు చెప్పి మరల ఆయనతో నిట్లనెను:

''శ్రీకృష్ణా! నేను చెప్పిన మాటలు ధర్మసంగతములా - అధర్మయుక్తములా అను విషయము నీవు సహజముగానే ఎరుగుదువు.

"నాయనా! పాండవులు ఉత్తమ కుల సంజాతులు, విద్వాంసులునై యుండియు, ఇప్పుడు జీవనము గడపజాలక బాధపడుచున్నారు.

భూతలమునందు సంచరించుచు ఆకలిగొనియున్న మానవుడు దానపతి - శూరుడు - వీరుడునైన యే క్షత్రియుని కడకుపోయి అన్నపానములు గ్రహించి సంతుష్టితో తన యింటికిపోవునో ఆ క్షత్రియునకు అంతకంటె మించిన ధర్మము మరియొకటి ఏమియుండును?

"ధర్మాత్ముడైనరాజు కొందరికి దానముచేత, కొందరికి బలముచేత, మరి కొందరికి మధురవాక్కుచేతను సంతుష్టి కలిగించవలెను. ఈ విధముగ అన్ని వైపుల నుండి వచ్చినవారిని దాన సమ్మానాదులచేత సంతుష్టిపరచిన రాజే పుణ్యాత్ముడగును.

"బ్రాహ్మణుడు భిక్షావృత్తిచేత,క్షత్రియుడు ప్రజాపాలనముచేత, వైశ్యుడు ధనార్జనముచేత, శూద్రుడుపై త్రైవర్ణికులను సేవించుటచేత జీవికను గడప వలెను."

"జనమేజయా! అట్లు కుంతీదేవి యుధిష్ఠిరునకు చెప్పుమని మరల శ్రీకృష్ణునితో నిట్లనెను:

''యుధిష్ఠిరా! నీకు భిక్షావృత్తి సర్వదా నిషిద్ధము. కర్షకవృత్తి కూడ నీకు యోగ్యమైనది కాదు. ఇతరులను కాపాడుటయే క్షత్రియ ధర్మము. నీవు బాహుబలముచేతనే జీవికా నిర్వహణము చేయవలెను.

"పుత్రా! నీ పైతృకమైన రాజ్యభాగము శత్రువుల చేతిలో పడి లోపించి పోయినది. కాబట్టి, నీవు సామదానభేద దండములు అను నాలుగు ఉపాయముల చేత నీ రాజ్యమును రాబట్టుకొనుము.

"పాండవాగ్రజా! నిన్ను నేను కని కూడ దాయాదులకడ హీన స్త్రీవలె జీవిక కొఱకు ఇతరులనుండి అన్నపిండమును ఆశించుచు, ఆకాశము చూచుచు ఉండుటకన్న ఎక్కువ దుఃఖము నాకు మరి యేమి కలుగును? అందువలన నీవు రాజధర్మమును అనుసరించి యుద్ధమును చేయుము. నీవు పిరికిపందవై నీ తండ్రి తాతల పేరుప్రతిష్ఠలను హీనపరచకుము. సోదరులతోబాటు పుణ్యము పోగొట్టు కొని పాపగతిని పొందకుము.''

కుంతి విదులోపాఖ్యానము చెప్పుట - విదుల, యుద్ధము నుండి పారివచ్చిన పుత్రుని బెదరించి మరల యుద్ధమునకు పురికొల్పుట

జనమేజయా! ఇట్లు చెప్పి కుంతీదేవి, ఉదాహరణముగ ఒక ఉపాఖ్యానమును శ్రీకృష్ణునకు చెప్పదొడగెను.

''కృష్ణా! ఈ విషయములో విదులకు, ఆమె కొడుకునకు జరిగిన సంవాద రూపమైన ఒక పురాతనేతిహాసమును విద్వాంసులు చెప్పెదరు. వినుము. ఈ యితిహాసమునందు శ్రేయస్కరమైన ఒక ఉపదేశమున్నది. దానిని నీవు యుధిష్ఠిరునకు ఉన్నది ఉన్నట్లుగా చెప్పుము:

''కృష్ణా! 'విదుల' అను పేరు గల ఒక ప్రసిద్ధురాలైన క్షత్రియ మహిళ యుండెను. ఆమె ఉత్తమకుల సంజాత. యశస్విని - తేజస్విని - అభిమానవతి- జితేంద్రియురాలు, క్షత్రియ ధర్మపరాయణురాలు- దూరదృష్టికలదిగా నుండెను.

"రాజసమూహమునందు విదులకు గొప్ప ప్రఖ్యాతియుండెను. ఆమె అనేక శాస్త్రములందు జ్ఞానము కలదిగాను, మహాపురుషుల ఉపదేశములను విని దాని వలన లాభము పొందినదిగాను ఉండెను.

"శ్రీకృష్ణా! ఒకప్పుడు విదులపుత్రుడు సింధురాజుచేత పరాజితుడై అతిదీన భావముతో ఇంటికి వచ్చి నిద్రించుచుండెను. పట్టపురాణియైన విదుల తన ఔరస పుత్రుడు దీనదశలో నుండుటను చూచి అతనిని ఈ విధముగా నిందించెను:

''ఓరి మూర్ఖుడా! నీవు నా గర్భమునందు జన్మించినప్పటికిని నాకు ఆనందము కలిగించువాడవుగా లేవు. నీవు శత్రువుల సంతోషమును పెంపొందించు వాడవుగా ఉన్నావు. నీవు నా గర్భమునుండే పుట్టలేదని అనుకొనుచున్నాను. నీ తండ్రికూడ నిన్ను కనలేదు. నీవంటి పిరికిపంద ఎక్కడినుండి వచ్చెను?

''నీకు క్రోధాభిమానములే లేవు. క్షత్రియుల లెక్కలోనికి రానేరావు. నీవు నామమాత్రమునకే పురుషుడవు. నీ మనస్సు, నీవు చేయు పనులన్నియు నపుంసకునివలె నున్నవి. నీవు జీవితాంతము నిరాశ చెందియున్నావా? ఓరీ ఇప్పుడే నీవు లేచి నీ శ్రేయస్సు కొఱకు మరల యుద్ధ భారము వహింపుము.

"నిన్ను నీవు దుర్బలుడవనుకొని స్వయముగా అవమానపరచుకొనకుము. నీ యాత్మను ఈ కొద్ది ధనముతో పోషించి పాలించకుము. నీ మనస్సును మంగళకరముగ చేసికొని శుభసంకల్పములతో నిర్భయుడవు కమ్ము.

"పిరికిపందా! లెమ్ము! నిలుచుకొనుము! ఈ విధముగా శత్రువులచేత పరాజితుడవై ఇంటిలో నిద్రింపకుము. ప్రయత్న శూన్యుడవు కాకుము. ఇట్లు చేయుటవలన నీవు శత్రువులకే ఆనందదాయకుడవుగా నున్నావు. అభిమానము-కీర్తి ప్రతిష్ఠలు పోగొట్టుకొని బంధులను దుఃఖములో పడవేయుచున్నావు.

"చిన్ననది కొద్దినీటితో సులభముగా నిండిపోవును. ఎలుకదోసిలి కొంచెమన్నము చేతనే నిండును. ఆ విధముగనే పిరికి పందకు సంతోషము కలిగించుట మిక్కిలి సులభము. అతడు కొద్దితోనే సంతుష్టి చెందును.

"దుష్టుడా! నీవు శత్రురూపములోనున్న సర్పము యొక్క దంతములను విరుగ గొట్టుచునే మరణించుము. నీ ప్రాణము పోవునను సందేహము కలిగినప్పటికిని యుద్ధమునందు శత్రువుతో పరాక్రమింపుము. నీవు ఆకాశమునందు నిర్భయముగా నెగురుచున్న డేగపక్షి వలె రణభూమియందు నిర్భయముగా సంచరించుచు, గర్జించుచు, అథవా మౌనముతో నుండియైనను శత్రువుల రంధ్రాన్వేషణ చేయుచుండుము.

"కాపురుషుడా! నీవు ఈ విధముగా పిడుగుదెబ్బ తిన్న పీనుగువలె నిశ్చేష్టుడవై ఇక్కడ ఎందుకు పడియున్నావు? ఇంక చాలును. నీవు లేచి నిలుచుకొనుము. శత్రువులచేత ఓడిపోయి ఇక్కడ పడియుండకుము. నీవు దీనుడవై నశింపకుము. పరాక్రమ కార్యములచేత ప్రసిద్ధుడవు కమ్ము.

"మధ్యమ - అధమ-అధమాధమ భావములతో నుండకుము. యుద్ధభూమియందు సింహనాదము చేసి ఉత్తమునివలె స్థిరముగా నిలుపుము.

"తిందుక (తుమికి) వృక్షము యొక్క మండుచున్న కొరవివలె రెండు గడియలైనను జ్వలించుచుండుము. కొంచెము సేపైనను శత్రువు సమక్షమునందు మహాపరాక్రమము ప్రకటింపుము. కాని, బ్రతుక నిచ్చచేత పొట్టులోని అగ్నివలె మంటలు లేకుండ పొగను మాత్రమే కలిగించువాడవుగా నుండకుము. అల్పపరాక్రమముచే మెలగకుము.

"రెండు గడియలైనను జ్వలించుచుండుట మంచిది. కాని, చాల కాలము వరకు పొగరాజుచుండుట మంచిదికాదు. ఏ రాజగృహమునందుగూడ, మిక్కిలి కఠినుడుగా కాని, అతిమృదువుగా కాని మానవుడు జన్మించగూడదు.

"వీర పురుషుడు యుద్ధమునందు తన శక్తి కొలది ఉత్తమ పౌరుషమును ప్రకటించి క్షత్రియ ధర్మమునుండి ఋణవిముక్తుడగును. అతడెప్పుడుగూడ పిరికివలె తనను తాను నిందించుకొనడు.

"విద్వాంసుడు తాను కోరిన ఫలము లభించినను, లభించకున్నను దుఃఖపడడు. అతడు సమగ్రశక్తితో ప్రాణము పోవువరకు నిరంతరము ప్రయత్నించుచుండునేకాని తన కొఱకు ధనమును కోరడు.

"పుత్రా! ధర్మమును ముందిడుకొని, అథవా - పరాక్రమము ప్రకటించి ప్రాణులందరికి నిశ్చితమైన గతియైన మరణము చేరుకొనుము. అట్లుగాకున్న ఎందుకు జీవించియున్నావు?

"నీవు చేసిన ఇష్టాపూర్త కర్మలు (ఇష్టమనగా యాగాది క్రతువుల చేయుట; పూర్తమనగా చెరువులు బావులు త్రవ్వించుట, తోటలు, భవనములు దేవమందిరములు నిర్మించుట) నష్టమైనవి. నీ కీర్తియంతయు మంటిలో కలిసిపోయినది. నీ సుఖమునకు మూలకారణమైన రాజ్యము కూడ అపహరింపబడినది. ఇప్పుడు నీవు దేని కొఱకు జీవించియున్నావు?

"కొడుకా! వీరపురుషుడు జలములో మునుగునప్పుడు కూడ, పై భాగము నుండి క్రిందకు పడిపోవునప్పుడు కూడ శత్రువును కాలుపట్టుకొని యీడ్వవలెను. అట్టి సమయమునందు తాను నిర్మూలముగా నశించినను విషాదము చెందకూడదు.

"ఉత్తమజాతి గుఱ్ఱము అలసిపోవదు, శిథిలము కాదు. ఈ విషయమును నీవు మనస్సులో స్మరించుచు నీవు నీపై పెట్టబడిన యుద్ధాదిభారమును ప్రయత్నపూర్వకముగా వహించవలెను.

"పుత్రా! నీవు ధైర్యమును, స్వాభిమానమును ఆశ్రయించి; నీ పౌరుషమును, ప్రాణమును, నిలబెట్టుకొని, నీ అశక్తి కారణముగా మునిగిపోవుచున్న ఈ వంశమును నీవే ఉద్ధరింపుము.

"ఎవని అద్భుతపౌరుషమును, ప్రవర్తనమును గొప్పగా లోకులు ప్రశంసించి చర్చించుకొనరో, ఏ మనుష్యుని చేత సంతానము మాత్రమే వృద్ధిచెందింపబడునో అట్టివాడు నా దృష్టిలో పురుషుడు కాడు, స్త్రీయు కాదు.

''ఎవని దానము, తపస్సు, సత్యభాషణము, విద్య, ధన సంపాదనము, సత్కీర్తి ప్రపంచమంతట వ్యాపింపదో అట్టి మనుష్యుడు తల్లియొక్క ఉచ్చారము (ఋతుస్రావము) వంటివాడు.

''ఎవడు శాస్త్రజ్ఞానము తపస్సు ధనసంపత్తి పరాక్రమము-వీటితో ఇతరులను జయించునో వాడే పురుష డనిపించుకొనును.

''కొడుకా! నీవు నీచులవలె, క్రూరులవలె కుపురుషులవలె, కాపాలికుని (పుఱ్ఱెతో తిరిపెమెత్తుకొనువాడు) వలె, అకీర్తికరము, నింద్యమునైన వృత్తి నాశ్రయింపకుము. దానివలన నీకు దుఃఖము, అకీర్తి కలుగును.

''ఎవడు దుర్బలుడై శత్రువులకు మాత్రమే మాననీయుడో, లోకులచే అవమానింపబడునో, నికృష్టమైన వస్త్రములు ధరించి నీచమైన ఆసనమునందుండునో, కొద్ది లాభముతోనే సంతుష్టుడగునో, క్షుద్రమైన జీవనము గడుపునో, అల్పస్వభావము కలవాడో, అట్టివాని సోదరులు, బంధువులు సుఖముగా నుండరు.

''నీ పిరికి తనమువలన మేము రాజ్యభ్రష్టులమగుటచేత కోరికలకు సుఖములకు దూరమై, దరిద్రులమై, జీవనవృత్తిలేక చనిపోయెదము.

''కుమారా! సంజయా! నీవు సత్పురుషులమధ్య అసత్కార్యము చేయుచుంటివి. వంశప్రతిష్ఠను నశింపజేయుచుంటివి. నీ రూపములో నేను పుత్రుడు అను పేరుతో కలిపురుషుని కన్నానని తోచుచున్నది.

''రోషము, ఉత్సాహము, బలము, పరాక్రమము లేకుండ కేవలము శత్రువులకు సంతోషము కలిగించు పుత్రుని ప్రపంచమునందు ఏ స్త్రీ కూడ కనకూడదు.

''ఓరీ మూర్ఖా! ధూమమువలె పొరకుము. ప్రజ్వలించుచుండుము. శత్రు సైనికుల నాక్రమించి సంహరింపుము. క్షణకాలమైనను సరియే, నీవు శత్రువుల తలపైన అగ్నివలె ప్రజ్వలింపుము.

''ఏ క్షత్రియుని హృదయము అమర్షముచేత శత్రువులను క్షమించక యుండునో అట్టి క్షత్రియుడు పురుష డనిపించుకొనును. అమర్షశూన్యుడై, సర్వదా ఓర్పుతోనుండు క్షత్రియుడు స్త్రీయనిగాని, పురుషుడనిగాని అనిపించుకొనడు.

"కుమారా! సంతుష్టి, దయ, ప్రయత్నశూన్యత, భయము - ఈ గుణములు సంపదను నశింపజేయును. చేష్టారహితుడైన మనుష్యుడు ఎప్పుడు కూడ ఏ మహా పదవిని గూడ పొందజాలడు. నీవు అపజయమును పొందినందున లోకమునందు నిందకు తిరస్కారమునకు పాత్రుడయ్యెదవు. కాబట్టి, ఈ దోషము లేమియు నీ యందు లేకుండ చూచుకొని మనస్సును ఉక్కువలె దృఢముగా చేసికొని, నీ రాజ్య వైభవము మరల నొకసారి విమర్శించుకొని చూడుము.

"నాయనా! శత్రువును ఎదిరించి వాని వేగమును సహించువాడే పురుష డనిపించుకొనును స్త్రీవలె భీరుత్వముతో జీవనము గడుపువానికి పురుషుడు అను పేరు వ్యర్థము. ఉత్సాహము, పరాక్రమము సంపూర్ణముగా ఉండి శూరుడై సింహమువలె యుద్ధము చేసి, దైవ వశమున వీర మరణము పొందినప్పటికిన్ని అతని రాజ్యమునందు ప్రజలు సుఖముగనే ఉండెదరు.

"పుత్రా! తనకు అత్యంత ప్రియమైన సుఖమును విడిచి, సంపదను సంపాదింపగోరువాడు, త్వరగానే దానిని సంపాదించి తన బంధుమిత్రులకు, సంతోషము కలిగించును.''

"కృష్ణా! తల్లి చేసిన ఉపదేశమును విని విదులాపుత్రుడు తల్లితో నిట్టనెను. 'అమ్మా! నన్ను నీవు చూడకున్న యెడల ఈ సమస్త భూమండలము నీకు లభించినప్పటికిన్ని ఏమి సుఖము కలుగును? నేను లేనప్పుడు నీకు అలంకారముల ఆవశ్యకత కూడ ఉండదుకదా? నేను లేకుండ నీకు వివిధ సుఖములు జీవితము ఉండి కూడ ప్రయోజనమేమి?'

"ఆ మాటలు విని విదుల, పుత్రునితో నిట్లనెను:

''కొడుకా! నేడు ఏమి భోజనము చేయుదుము? అను చింతపడు దరిద్రుల లోకములు మన శత్రువులకు కలుగుగాక! సర్వత్ర మాననీయుడైన పుణ్యాత్ముల లోకములు మన మిత్రులు అనుభవింతురుగాక! సంజయా! ధృతిహీనులై ఇతరుల యాహారము మీద బ్రతుకుచు, దీనులు, దుర్బలులునైన మనుష్యుల వృత్తిని నీవు అనుసరింపకుము.

''నాయనా! ఎట్లు ప్రాణులందరి జీవనము మేఘముపై ఆధారపడి యున్నదో, ఎట్లు దేవతలందరు ఇంద్రుని ఆశ్రయించి జీవనమును గడిపి

కొందరో ఆ విధముగనే బ్రాహ్మణులు, మిత్రులు నిన్నాశ్రయించి జీవించు చుందురుగాక!

''సంజయా! పక్వఫలములుగల వృక్షమునువలె ఏ పురుషుని ఆశ్రయించి ప్రాణులన్నియు జీవన నిర్వాహము చేసికొనునో, అట్టి పురుషుని జీవనమే సార్థకమగును.

''ఇంద్రుని పరాక్రమముతో దేవతలందరు సుఖపడునట్లు, ఏ వీరపురుషుని బలపౌరుషముల చేత అతని సోదరులు, బంధువులు సుఖముగా అభివృద్ధి పొందెదరో ఆ వీరుని జీవనమే ప్రపంచమందు శ్రేష్ఠమనిపించుకొనును.

''ఏ మనుష్యుడు తన బాహుబలము నాశ్రయించి ఉత్తమ జీవనము గడుపునో, అతడే ఆ లోకమునందు సత్కీర్తిని, పరలోకమందు పుణ్యగతిని పొందగలడు."

విదుల తన పుత్రుని యుద్ధమునకు ప్రోత్సహించుట

''కృష్ణా! విదుల, పుత్రునకు ఈ విధముగ బోధించి యింకను అతనికి యుద్ధమునందు ఉత్సాహము కలిగించుచు నిట్లనెను:

''పుత్రా! సంజయా! నీవు ఇట్టి పరిస్థితిలో పౌరుషమును విడువదలచిన యెడల త్వరలోనే నీచపురుషుల మార్గమునందు పడిపోయెదవు.

"ఏ క్షత్రియుడు జీవనమునందాశచేత యథాశక్తి తన పరాక్రమము ప్రకటింపడో, అట్టివానిని లోకులందరు 'చోరు'డందురు.

''మరణమాసన్నమైన పురుషునకు ఏ యౌషధము కూడ పని చేయనట్లే నేను చెప్పు యుక్తియుక్తములైన సార్థక వచనములు కూడ నీ మనస్సున కెక్కకున్నవి. ఇది యెంత దుఃఖకరము?

''పుత్రా! చూడుము. సింధు రాజుయొక్క ప్రజలు అతని యెడల సంతుష్టులుగా లేరు. ఐనను నీ దుర్బలత్వమువలన ఆ ప్రజలు ఏమి చేయవలసినదియు తోచక ఉదాసీనులై ఊరక కూర్చొని, సింధు రాజుపై ఎక్కడనుండియైన ఆపదలు వచ్చి పడునా? యని ఎదురు చూచుచున్నారు. ఇతర రాజులు కూడ నీ పౌరుషమును చూచి యుద్ధసాధనములను కొద్దికొద్దిగా సమకూర్చుకొని సింధు రాజుపై దాడి చేయగలరు.

''కాబట్టి, పుత్రా! ఆ రాజులందరితో నీవు స్నేహము చేసి, సమయానుకూలముగ నీ శత్రువైన సింధురాజునకు ఆపదలు దాపురించుటను ఎదురుచూచుచు పర్వతగుహలయందు సంచరించుచుండుము ఎందుకనగా, సింధురాజు అజరుడు, అమరుడు కాదుకదా!

''నాయనా! నీ పేరు సంజయుడు, కాని, నీ పేరుకు అనురూపమైన గుణము నీ యందు నాకు కానవచ్చుట లేదు.

''పుత్రా! యుద్ధము నందు విజయము సాధించి నీ పేరు సార్థకము చేసికొనుము. వ్యర్థముగా సంజయ నామము ధరించకుము.

"నీవు బాలకుడవుగా నున్నప్పుడు బుద్ధిమంతుడైన యొక బ్రాహ్మణుడు నీ విషయమై 'ఇతడు గొప్ప సంకటములో పడి కూడ తిరిగి వృద్ధిని పొందగలడు' అని చెప్పియుండెను. నేను ఆ బ్రాహ్మణుని మాటలను జ్ఞప్తియందుంచుకొని నీకు తప్పక విజయము కలుగునని యాశించుచున్నాను. నాయనా! అందుచేతనే నీకు మాటిమాటికి ఉత్సాహము కలిగించుచున్నాను. ఇట్లే భవిష్యత్తులో కూడ కలిగించుచుండెదను.

"తనయా! కార్యములందు ప్రయోజనము సిద్ధించిన తరువాత ఆ కార్యకర్తకు సంబంధించిన మిత్రులు, బంధువులు కూడ సంతోషపడి అభివృద్ధి పొందెదరు. నీతి మార్గములందు నడచి ప్రయోజన సిద్ధికిగాను ప్రయత్నించు వానికి నిశ్చయముగా ఇష్టార్థసిద్ధి కలుగును.

"సంజయా! యుద్ధమువలన మన పూర్వులకుగాని, నాకు గాని లాభము కాని, నష్టముకాని కలిగిన కలుగుగాక! 'యుద్ధము చేయుట క్షత్రియ ధర్మము' అని తలచి యుద్ధమునందే ఆసక్తుడవై యుండుము. యుద్ధమును ఆపకుము. నేటికి, రేపుదయమునకు భోజనము లభింపకున్నచో అంతకంటె మించిన మహాపాపము ఏమి యుండును? అట్టి దశ తెచ్చుకొనకూడదని శంబరాసురుడు నీతిని చెప్పెను.

"కుమారా! దరిద్రత్వమనునది పతిపుత్ర వధలకంటె అధిక దుఃఖదాయకమని చెప్పబడియున్నది. దరిద్రత్వము మరణమునకు సమానార్థ శబ్దము.

"నేను ఉన్నత కులమునందు పుట్టి, హంసి ఒక సరస్సునుండి మరియొక సరస్సునకు వచ్చినట్లు ఈ వంశమునకు వచ్చి యీ రాజ్యమునకు అధికారిణినై అనేక శుభములను పొంది, నా పతిదేవుని ఆదరమునకు పాత్రురాలనైతిని.

"పూర్వకాలమునందు నా బంధువులకడకు నన్ను తోడ్కొని పోయినప్పుడు నా మిత్రులు వెలగల వస్త్ర భూషణములతో సుందరముగానున్న నన్ను చూచి మిక్కిలి సంతోషించిరి.

"సంజయా! నేను, నీ భార్య, చింతలో మునిగియుండుటను చూచినప్పుడు నీవు జీవితేచ్ఛను విడిచెదవు. మన దాస దాసీజనము, మనచేత పోషింపబడు కుటుంబ జనము, ఆచార్యులు, ఋత్విక్కులు, పురోహితులు అందరుగూడ జీవన వృత్తి లేక మనను విడిచిపోవునప్పుడు వారిని చూచి నీవు జీవించియుండుట నిష్ప్రయోజనమని తలచెదవు.

"పుత్రా! నేడు కూడ పూర్వము చేయనట్లే, నీవు కీర్తికరమైన కార్యములను చేయకుండిన యెడల నా హృదయమునకు శాంతి యెట్లు కలుగును?

"ఎవరైన బ్రాహ్మణులు నా యొద్దకు వచ్చి నన్నేమైన కోరినప్పుడు వారు కోరిన వస్తువు 'లేదు' - 'నావద్ద లేదు' అని నేను చెప్పినప్పుడే, నా హృదయము పగిలి చీలిపోవును.

"నేటిదాక నేనుగాని, నా పతిదేవుడుకాని బ్రాహ్మణుడు వచ్చి అడిగినప్పుడు 'లేదు' అని యెన్నడు గూడ చెప్పలేదు.

మనము సర్వదా లోకులకు ఆశ్రయదాతలముగా ఉంటిమి. ఇతరులను మనమెప్పుడు గూడ ఆశ్రయించలేదు.

"కాని, ఇప్పుడొకవేళ ఇతరులను ఆశ్రయించి జీవితము గడపవలసి వచ్చిన పరిస్థితిలో నా ప్రాణములనే విడిచెదను.

"కొడుకా! అపార సముద్రమునందు మునుగుచున్న మమ్ము ఒడ్డుకు చేర్చవలసినవాడవు నీవే! నౌకలేని అగాధ సముద్రమునందు (మహా సంకటమునందు) నీవు మాకు నౌకగా ఉన్నావు. మాకు స్థిరమైన చోటు ఏదియు లేదు. నీవు ఒక స్థానమును కల్పించుము. మేము మృతప్రాయులమైతిమి. మాకు జీవనదానము చేయుము.

"సంజయా! నీకు జీవితమునందు ఆసక్తి లేనియెడల, నీవు శత్రువులను జయించగలవు. ఈ విధముగ నీవు దుఃఖములో మునిగి ఉత్సాహము విడిచి పిరికివానివలె నుండవలసివచ్చినప్పుడు నీవు ఈ పాప జీవనమును విడుచుటయే నీకు శ్రేయస్కరము.

"కుమారా! ఒక్క శత్రువును వధించినంత మాత్రము చేతనే వీర పురుషుడు లోకమునందు ఖ్యాతి పొందును. ఇంద్రుడు ఒక్క వృత్రాసురుని మాత్రమే వధించి 'మహేంద్రుడు' అను పేరుతో ప్రసిద్ధి పొందెను. అతడు నివసించుటకు ఇంద్రభవనము లభించెను. మూడు లోకములకు ప్రభువయ్యెను.

"పుత్రా! వీరపురుషుడు యుద్ధమునందు తన పేరును ఉచ్చరించి, కవచధారులైన శత్రువులను యుద్ధమునకు పురికొల్పి, సేనయొక్క అగ్రభాగమునందు నిలిచి, శత్రుపక్షమునందలి ఒక మహావీరుని వధించి, ఉత్తమ యుద్ధముద్వారా గొప్ప కీర్తిని సంపాదించినప్పుడే అట్టి పురుషునికి శత్రువులు పీడితులై అతని యెదుట తలవంచెదరు.

"నాయనా! పిరికిపందయైనవాడు తన వశము తప్పి యుద్ధమునందు శరీరమును త్యజించి శత్రువులకు ఆనందము కలిగించి తన సంపదను వారి పాలుచేసి వారి కోరికలను నెరవేర్చును.

"భయంకరముగా పతనము చెందినవాడు ఒకవేళ రాజ్యమును పొందినను లేక జీవితమును సంకటావస్థలలో పడవేసినను, ఎట్టి దశలో గూడ తన చేతికి చిక్కిన శత్రువును విడిచిపెట్టడు. ఇది శ్రేష్ఠపురుషుని లక్షణము.

"కుమారా! యుద్ధమునకు స్వర్గద్వారము వంటి మంచి గమ్యముగాని, అమృతసమానమైన రాజ్యప్రాప్తిగాని - ఈ రెండు తప్ప వేరుమార్గము లేదని తలచి నీవు మండుచున్న కొరవివలె శత్రువులపై పడుము.

"రాజపుత్రా! నీవు యుద్ధమునందు శత్రువులను సంహరించి నీ ధర్మమును పాలించుము. శత్రుభయమును వృద్ధిపొందించునట్టి నీ వంటి పుత్రుడు దీనుడుగా, పిరికిగా కూర్చొనియుండుట నేను చూడలేకున్నాను. నీవు దీనాతి దీనునివలె దయనీయస్థితిలో పడియుండి, శోకమగ్నుడవై, స్వపక్షమువారు, శత్రుపక్షమువారు నిన్ను తర్జనభర్జనచేయుచు చుట్టుకొనియుండుటను నేను చూడజాలకున్నాను.

"పుత్రా! నీవు సౌవీరదేశ కన్యకలైన నీ భార్యలతో సుఖము ననుభవింపుము. పూర్వమువలె నీవు ధనాధిక్యముచేత గర్వపడకుము. ఆపదలో చిక్కుకొని శత్రువైన సింధుదేశ రాజుయొక్క కన్యకల వశమున చిక్కుకొనకుము.

"నీవు రూపయౌవన విద్యాకులీనత్వములు పరిపూర్ణముగా కలవాడవు. కీర్తిమంతుడవు, ప్రపంచ విఖ్యాతుడవు. నీ వంటి వీర పురుషుడు పరాక్రమము

చూపవలసిన సమయమందు భయపడినయెడల, భారము మోయవలసిన సమయమందు కాడిమ్రాను విడిచిన యెద్దువలె కూర్చొనిగాని, దారివిడిచి పరుగెత్తుచుగాని ఉండని యెడల అది నీకు మరణమే యని తలచెదను.

''పుత్రా! నీవు శత్రువులతో మధురముగా మాట్లాడుచు వారి వెనువెంట మెరమెచ్చులకు తిరుగుచుండగా చూచిన నా హృదయమునకు శాంతి ఎక్కడిది? ఇతరుల ననుసరించి వారి వెనువెంట పోవువారు ఈ కులమునందు ఎవరు కూడ ఎప్పుడును ఇంతవరకు పుట్టలేదు. నాయనా! నీవు ఇతరులకు సేవకుడవై జీవితమును గడపదగినవాడవు కావు.

''కుమారా! దేని సృష్టిని విధాత చేసియుండెనో, ప్రాచీనాతి ప్రాచీనులు దేని వర్ణనము చేసిరో,ఆ తరువాతివారు, అత్యంతాధునికులైన సత్పురుషులు దేనిని వర్ణించెదరో, ఏది అతి ప్రాచీనము, నశించనిదియునైనదో అట్టి సనాతనము, ఉత్తమమునైన క్షత్రియ హృదయమును నేను ఎరుగుదును.

''కొడుకా! ఈ ప్రపంచమునందు పుట్టిన క్షత్రియులు, క్షత్రియ ధర్మము నెరిగినవారును భయముచేతగాని, జీవిక కొరకుగాని ఇతరుల యెదుట తలవంచజాలరు.

"నాయనా! సర్వదా ప్రయత్నించుచుండుము. ఎవని యెదుట కూడ తలవంచకుము. ప్రయత్నించుచుండుటయే పౌరుషము. కాలము చాలనప్పుడు నష్టము కలిగినను కలుగుగాక! కాని, ఎవరికిని నీవు తలవంచకుము.

''సంజయా! మాననీయుడైన క్షత్రియుడు, మదించిన గజమువలె సర్వత్ర నిర్భయముగా సంచరించవలెను. అతడు సర్వదా బ్రాహ్మణులకు, ధర్మమునకును నమస్కారము చేయవలెను.

''క్షత్రియుడు సహాయవంతుడైనను, అసహాయుడైనను ఇతర వర్ణముల వారిని తన అధీనములో ఉంచుకొని పాపులందరిని దండించుచు ఉండవలెను. ఈ విధముగా క్షత్రియుడు సర్వదా ప్రయత్నశీలుడుగానే ఉండవలెను.''

విదుల,ఆమె పుత్రుని సంవాదము-విదుల కార్యసాఫల్యము కొరకు శత్రువశీకరణమునకున్న ఉపాయములు చెప్పుట

"ఇట్లు తల్లి చెప్పిన ఉపదేశవాక్యములు విని సంజయుడు ఆమెతో నిట్లనెను:

''తల్లీ! నీ హృదయము ఉక్కుపిండముతో చేయబడినట్లు కఠినముగా తోచుచున్నది. నీవు నా తల్లివైయుండియు ఇంత నిర్దయురాలవైనావు. నీకు వీరుల బుద్ధి ఉన్నది. ఎల్లప్పుడును నీవు క్రోధముతోనే ఉండెదవు.

"అహా! క్షత్రియుల ఆచారవ్యవహారములు ఎంతటి ఆశ్చర్యజనకములుగ ఉన్నవి? వాటిని అనుసరించుచు నీవు నన్ను ఈ విధముగ యుద్ధసన్నద్ధుని చేయుచున్నావు. నీవు నా తల్లివి కావో, నేను నీ కొడుకును కానో యని తోచుచున్నది.

''నీకు ఏకైక పుత్రుడనైన నాతో ఇట్టి నిష్ఠురవాక్యములు పలుకుట ఆశ్చర్యకరముగ నున్నది. నన్ను చూడనినాడు నీకు ఈ సమస్త భూమండలము లభించినను ఏమి సుఖము కలుగును? విశేషించి నేను నీకు ప్రియపుత్రుడను. అట్టి నేను యుద్ధమునందు చచ్చిన యెడల నీకు ఆభరణములతోగాని, సుఖసామగ్రితోగాని, జీవితముతోగాని ఎట్టి సుఖము లభించగలదు?

''శ్రీకృష్ణా! ఈ విధముగ పుత్రుడు చెప్పిన మాటలు విని విదుల అతనితో మరల నిట్లనెను:

"పుత్రా, సంజయా! విద్వాంసుల జీవితమంతయు ధర్మార్థముల కొరకే నిర్వహింపబడుచుండును. ధర్మార్థములయందే దృష్టి నిలిపి నేను నిన్ను యుద్ధమునకు ప్రోత్సహించితిని.

"పుత్రా! ఇప్పుడు నీవు చూపించదగిన పరాక్రమమును ప్రదర్శించుటకు సమయమాసన్నమైనది.ఇట్టి సమయమునందు గూడ నీవు నీ కర్తవ్యమును పాలించనియెడల నీనుండి నేను కోరిన విధముగా కాక, దానికి విపరీతముగా చూచుచున్నాను. నీవు శత్రువులయెడల క్రూరత్వముతో వ్యవహరించ కుండినచో నీ యకీర్తి అన్నిదిక్కుల వ్యాపించును.

సంజయా! ఇట్టి సమయమునందు గూడ నేను నీకు ఉపదేశించని యెడల నాకు నీయందుగల వాత్సల్యము గాడిద స్నేహముతో సమానముగ శక్తిహీనమై నిరర్థకమై పోవును. కాబట్టి వత్సా! సత్పురుషులు నిందించునట్టియు, మూర్ఖుడు నడుచునట్టిదియు నైన మార్గమును నీవు విడువుము.

"పుత్రా! ప్రజలు అవిద్య (అజ్ఞానము) లో నున్నారు. నీవు సత్పురుషులకు యోగ్యమైన మార్గమునందు నడుచునప్పుడే నాకు ప్రియపుత్రుడవయ్యెదవు.

ధర్మార్థములు, సద్గుణములున్ను కలవాడవై, దేవ-మనుష్యలోకములందు ఉపయోగపడువాడవై, సత్పురుషులు అచరించు సత్కర్మలను చేయునప్పుడే నీవు నాకు ప్రియపుత్రుడవు కాగలవు. దీనికి వ్యతిరేకముగా ఆసత్కర్మముల నాచరించినచో నీవు ఏ విధముగను నాకు ప్రియపుత్రుడవు కావు.

"కొడుకా! ఎవడు వినయశూన్యుడై, అశిక్షితుడైన పౌత్రునివలన సంతోషము పొందదలచునో; ఎవడు ప్రయత్నరహితుడు, వినయరహితుడు, దుర్బుద్ధియునైన పుత్రుని వలన సుఖము కోరునో - అట్టివాడు సంతానమును కనుట వ్యర్థము. ఎందుకనగా, అట్టి అయోగ్య పుత్రపౌత్రులు ఏ పనియు చేయనే చేయరు. ఒకవేళ చేసినను నిందితకర్మనే చేసెదరు. దానివలన ఆ యధములు ఇహపరలోకములందు సుఖము పొందజాలరు.

"సంజయా! అందుచేతనే మనస్వియైన క్షత్రియుడు అనేక పర్యాయములు ఆపజయము పొందికూడ క్రుద్ధుడైయున్నయెడల, అతడు తప్పక జయేచ్ఛచేత శత్రువులపై దాడి సలుపవలెను. అప్పుడతడు తాను మరణించి కాని, శత్రువును సంహరించి కాని శాంతి పొందగలడు. అట్లుకాక మరియొక విధముగ అతనికి శాంతి యెట్లు లభించును?

"బుద్ధిమంతుడైన పురుషుడు ఈ ప్రపంచము నందు అల్పమాత్రమైన అప్రియమునే కోరును.ఎవనికి ప్రపంచమునందు ప్రియము అల్పముగా నుండునో అతనికి అప్రియను కూడ అల్పముగానే యుండుట నిశ్చయము.

"అనగా, బుద్ధిమంతుడు ప్రియాప్రియములను సమానముగ తలచి, ప్రియము కలిగినప్పుడు మిక్కిలి సతోషించుటగాని అప్రియము కలిగినప్పుడు మిక్కిలి దుఃఖించుట గాని చేయడు అని భావము)"

''జనార్దనా! ఈ విధముగా తల్లియైన విదుల ఉపదేశించిన తరువాత ఆ తల్లికొడుకులకు ఇట్లు సంవాదము జరిగెను:

పుత్రుడు : తల్లీ! నీవు నీ నోటినుండి యీ విధముగ విచారమును వ్యక్తపరచకూడదు. కాబట్టి నీవు జడముగనో, మూగవుగనో ఉండి నీ పుత్రుడైన నన్ను విశేషదయాదృష్టితో చూడుము.

తల్లి : పుత్రా! నీవిట్లు చెప్పుటచేత నాకు మిక్కిలి సంతోషము కలిగినది. నీవైతే ఈ విధముగ యోచించుచున్నావు. నన్ను పుత్రునియందు

దయాదృష్టి ఉంచుటయను నా కర్తవ్యము ప్రోత్సహించుచున్నది. అందుచేతనే మాటిమాటికి నీ కర్తవ్యమును గూర్చి నీకు ప్రేరణ కలిగించుచున్నాను.

నీవు సింధుదేశపు యోధులందరిని సంహరించి వచ్చినపుడు నీకు నేను స్వాగతము చెప్పెదను. అతి కష్టముతో నీవు సాధించబోవు విజయమును అవశ్యముగ చూడగలనను విశ్వాసము నాకు ఉన్నది.

పుత్రుడు : తల్లీ! నా వద్ద ధనాగారము లేదు. సహాయకులైన సైనికులు లేరు. ఇట్లుండగా నాకు విజయము ఎట్లు సిద్ధించగలదు? నా యొక్క యీ భయంకరావస్థను గూర్చి నేను స్వయముగా విచారించి, రాజ్యమునందు ప్రేమను పాపిష్ఠుడు స్వర్గచింత విడిచినట్లు విడిచితిని.

నేను విజయమును సాధించగల ఉపాయమేదైనను నీకు తోచుచున్నదా? తల్లీ! నీకు పరిపక్వమైన బుద్ధి కలదు. ఇప్పుడు నాకు ఉత్తమమైన ఉపాయము చూపుము. నేను నీ యాజ్ఞల నన్నింటిని సముచితరీతిలో పాలించెదను.

కృష్ణా! ఈ విధముగ సంజయుడు చెప్పిన మాటలు విని విదుల అతనితో నిట్లనెను:

"పుత్రా! మనకు పూర్వసంపద నష్టమైనదని నీవు నిన్ను అవమానించుకొనవద్దు. ఎందుకనగా, ధనవైభవములు నశించుచు పుట్టుచు నుండును. అందువలన బుద్ధిహీనుడే అసూయచేత ధనవైభవముల కొఱకు ప్రయత్నించును. అట్లు నీవు చేయగూడదు.

"నాయనా! అన్ని కర్మఫలములయందు సర్వదా అనిత్యత్వము ఉండును. ఒకప్పుడు కర్మఫలము లభించును, మరొకప్పుడు లభింపదు. ఇట్లు కర్మఫలముల అనిత్యత్వము తెలిసియు బుద్ధిమంతుడు కర్మలు చేయుచునేయుండును. ఆ కర్మములు ఒకసారి అతనికి ఫలించును; ఒకసారి ఫలింపవు.

"నాయనా! కర్మములే చేయనివాడు ఎప్పుడు కూడ తన యిష్టార్థ సిద్ధిలో సఫలుడు కాడు. కాబట్టి,కర్మములు విడిచి నిశ్చేష్టుడై ఉండినందువలన మనుష్యునకు ఎప్పుడు కూడ అభీష్టము సిద్ధించదు. ఇదియే కర్మలు చేయని వానికి కలుగు పరిణామము. కాని,ఉత్సాహపూర్వకముగా కర్మలయందు తత్పరుడైనచో

కోరిన ఫలములు దొరుకుట, దొరకకుండుట - ఈ రెండును ఒకదాని వెంట నొకటి సంభవించవచ్చును.

"రాజకుమారా! ఏ పనికి మొదటి నుండియే పదార్థములన్నియు అనిత్యములు అని తెలియునో, అట్టి జ్ఞాని తనకు ప్రతికూలుడైన శత్రువునకు ఉన్నతి, తనకు అవనతి ప్రాప్తించినప్పుడు కలిగిన దుఃఖమును నివారించుకొనుము.

"తప్పక నా ప్రయత్నము ఫలించును" అని మనమునందు దృఢముగా విశ్వసించి నీవు దుఃఖరహితుడవై లెమ్ము. జాగరూకుడవు కమ్ము. ఐశ్వర్య ప్రాప్తి కలిగించు కర్మలయందు తత్పరుడవు కమ్ము.

"వత్సా! దేవ బ్రాహ్మణులను పూజించి అనేక శుభకార్యములను చేసి కార్యమును ఆరంభించిన బుద్ధిమంతుడైన రాజు శీఘ్రముగ అభివృద్ధి పొందును.

"పూర్వదిక్కునందు ఉదయించిన సూర్యుడు ఆ దిక్కును, సమస్త భూమండలమును ప్రకాశింపజేయునట్లు; దేవ బ్రాహ్మణ పూజలు, శుభకర్మలు చేయు రాజునకు అన్నివైపుల నుండి రాజలక్ష్మి లభించి, అతని కీర్తిని, పరాక్రమమును వృద్ధి పొందించును.

"కొడుకా! నీకు నేను అనేక దృష్టాంతములను, ఉపాయములను, ఉత్సాహ జనకములైన ఎన్నియో మాటలను చెప్పితిని. ప్రపంచ వృత్తాంతమును కూడ మాటిమాటికి సూచించితిని. ఇక నీ విప్పుడు పౌరుషమును చూపుము. నీ పరాక్రమమును చూచెదనుగాక!

"నాయనా! ఇప్పుడు నీకు ఇష్టమైన పురుషార్థమును నీవు ప్రదర్శింపవలెను. ఎవరు సింధురాజునందు కుపితులైయున్నారో, ఎవరి మనస్సులందు ధన లోభము కలదో, ఎవరు సింధురాజుపై దాడి సలిపి ఓడి క్షీణించి పోయిరో, ఎవరికి తమ బల - పౌరుషములందు గర్వము కలదో, ఎవరు నీ శత్రువులచేత అవమానింపబడి శత్రువులకు ప్రతీకారము చేయుట కొఱకు సిద్ధముగ నున్నారో, అట్టి వారందరిని నీవు జాగ్రత్తగా దానోపాయము ద్వారా ఆశ చూపికాని, నమ్మానముచేతగాని నీ పక్షమునందు చేర్చుకొనుము.

"కుమారా! నీ పక్షమున చేరిన వారిని సంతోషపరచుటకుగాను అగ్రిమ వేతనము (గడువు తీరుటకు ముందే ఇచ్చు వేతనము) ఇచ్చుచుండుము. ప్రతి దినము ప్రొద్దున మేల్కొనిన వెంటనే వారితో ప్రియముగా మాట్లాడుము. అట్లు చేయుటచేత వారందరు తప్పక నీకు ప్రియము చేయుచు, నీ ముందు నడచుచు, నిన్ను కాపాడుచుందురు.

"తమ విరోధిగణము ప్రాణములపైన మోహము విడిచి యుద్ధము చేయుటకు వారు సిద్ధముగా నున్నారని తెలిసిన వెంటనే నీ శత్రువులు తమ యింటిలో దాగియున్న సర్పమునకు భయపడినట్లు భయపడుచు ఉద్వేగము (దుఃఖము) చెందుచుందురు.

"పుత్రా! శత్రువు పరాక్రమవంతుడని తెలిసికొని కూడ తన అసామర్థ్యము వలన వారిని వశములోనికి తీసికొనజాలని యెడల అప్పుడు నీవు విశ్వసనీయులగు దూతల ద్వారా సామ - దానోపాయములను (శాంతి వచనములతోగాని, ధనాశ చూపిగాని) ప్రయోగించి శత్రువులను అనుకూలపరచుకొనుము.

"దానిచేత శత్రువులు నీపై దాడి సల్పక శాంతులై యుండెదరు. ఇట్లు చేయుటచేత చివరకు వారు నీ వశములోనికి వచ్చెదరు.

"సంజయా! ఈ విధముగ శత్రువులను శాంతపరచుటచేత నీవు నిర్భయుడవయ్యెదవు. అట్లు శత్రువులను వశపరచుకొనుటచేత నీవు యుద్ధాదులయందు చిక్కుకొనవు. అందువలన నీ ధనము వృద్ధి పొందును.

"ధన సంపన్నుడైన రాజును అనేకులు ఆశ్రయించి సేవించెదరు. ధన హీనుని మిత్రులు, సోదరులు, బంధువులు కూడ విడిచి పెట్టుదురు. వానియందు వారికి విశ్వాసము ఉండదు. వారు నిర్ధనుని నిందించు చుండెదరు.

"కనుక నాయనా! శత్రువులకు సహాయము చేయుచు వారియందు విశ్వాసము ఉంచువారు రాజ్యమును పొందరు సరికదా, అది కలుగునని కూడ వారు ఊహించగూడదు.''

విదులోపదేశము చేత ఆమె పుత్రుడు మరల యుద్ధమునకు పూనుకొనుట

''కృష్ణా! ఆ విధముగ విదుల పుత్రుడైన సంజయునకు ఉపదేశించి మరల నింకను ఇట్లు ఉపదేశింప దొడగెను:

''పుత్రా! ఎట్టి ఆపత్తి వచ్చినను, ఎప్పుడు కూడ రాజు భయపడగూడదు. అతడు భయపడినను భయపడినవానివలె వ్యవహరించ గూడదు. రాజు భయపడిన యెడల అతని పక్షమువారందరును భయము చెందెదరు. రాజ్యప్రజలు, సైన్యము, మంత్రులు కూడ రాజును గూర్చి అన్యథా చింతించెదరు. వారిలో కొందరు శత్రువులను శరణు జొచ్చెదరు. మరికొందరు తనను విడిచెదరు. పూర్వము రాజుచేత అవమానింపబడిన మరికొందరు రాజునకు కలిగిన అట్టి పరిస్థితిలో అతనికి ప్రతీకారము చేయగోరుచుందురు.

''కుమారా! అత్యంత మిత్రులుమాత్రమే సంకటసమయమందు రాజునకు తోడుగా నుందురు. కాని, అట్టి మిత్రులు గూడ అసమర్థులగుట వలన, కట్టి వేయబడిన దూడలుగల గోవులవలె ఏమియు చేయజాలక యతని శుభమును మాత్రమే కోరుచుందురు.

రాజునకు కలిగిన విపత్తి సమయమునందు రాజుతోపాటు దుఃఖించుచున్న బంధువులను సోదరులను మిత్రులని నీవు తలచెదవా? నీవు పూర్వమెప్పుడైనను అట్టి మిత్రులను సన్మానించి యుంటివా? రాజు సంకటములలో పడినప్పుడు రాజ్యము తనదిగ భావించి రాజ్యమును, రాజును రక్షించుటకొఱకు కృత సంకల్పులైన మిత్రులను నీ వెప్పుడు కూడ నీ నుండి విడదీయకుము. అట్లు చేసినచో నీకు భయము కలిగినప్పుడు వారు నిన్ను పరిత్యజింతురు.

''కుమారా! నేను నీ ప్రభావమును పౌరుషమును బుద్ధి బలమును తెలిసికొనదలచియుంటిని. అందువలన నిన్ను ఊరడించుచు నీ యుత్సాహమును, పరాక్రమమును వృద్ధి పొందించుటకు నేను పూర్వము అట్లు మాట్లాడితిని.

''సంజయా! నేను సరిగా మాట్లాడు చున్నానని నీవు తలచిన యెడల ఉగ్రుడవై విజయము కొఱకు సిద్ధము కమ్ము.

''మనవద్ద పెద్ద ధనాగారమున్నది. దానిని గూర్చి నీకు తెలియదు. నాకే తెలియును. మరి యితరులకు గూడ తెలియదు. ఆ ధనాగారమును నీకు ఒప్పగించుచున్నాను.

''సంజయా! ఇంకను నీకు నూర్లకొలది మిత్రులున్నారు. సుఖదుఃఖములను సహింపగలవారు యుద్ధము చేయుటకు వెనుకాడరు.

"శత్రుసూదనా! తన అభివృద్ధిని కోరుచు శత్రువుల చేతినుండి తన సంపదను లాగి తేదలచిన వానికి సహాయకులు, మంత్రులు పూర్వము చెప్పబడిన గుణములుగల్ల మిత్రులుగా నుండవలెను.''

"శ్రీకృష్ణా! సంజయుని హృదయము మిక్కిలి దుర్బలముగా నున్నను విదుల చెప్పిన విచిత్రమైన అర్థము, పదము, అక్షరములుకల మాటలు విని అతనికి తమోగుణము వలన కలిగిన భయము, విషాదము పరుగెత్తి పోయెను.

''కృష్ణా! తరువాత సంజయుడు తల్లితో మరల నిట్లు చెప్పదొడగెను:

"తల్లీ! నా రాజ్యము శత్రువులనెడు జలమునందు మునిగి పోయినది. ఇప్పుడు నేను దానిని ఉద్ధరించవలెను. లేదా, యుద్ధమునందు శత్రువుల నెదుర్కొనియైనను నా ప్రాణములను విడువవలెను. నాకు భవిష్యత్తులో రాజ్య వైభవమును కరతలమునందున్నట్లు చూపించునట్టి నీవంటి నాయకురాలు ఉన్నప్పుడు నాకు అట్టి సాహసము తప్పక కలుగవలెను.

"అమ్మా! నేను నీవు చెప్పిన క్రొత్త క్రొత్త మాటలను తప్పక వినగోరి యుంటిని. కాబట్టి, మాటి మాటికి నేను నీవు చెప్పుచున్నప్పుడు నడుమ ఏదో మాటలు చెప్పి మరల మౌనము వహించుచుంటిని. నీవు చెప్పిన అమృతతుల్య వచనములు దుర్లభములు నాకెవరు చెప్పెదరు? ఆ మాటలు విని నేను తృప్తుడనైతిని.

"ఇప్పుడు నేను శత్రువులను అణచి విజయమును సాధించుటకుగాను బాంధవులతోపాటు ప్రయత్నము చేయుచున్నాను. చూడుము.''

"కృష్ణా! మాతృదేవి యొక్క వాగ్బాణములచేత గ్రుచ్చబడి, ఆమె చేత తిరస్కరింపబడి, చబుకు (చేర్కోల-కొరడా) దెబ్బలు తిన్న ఉత్తమాశ్వమువలె సంజయుడు తల్లి చేసిన ఉపదేశమును యథావత్తుగా (ఉన్నదున్నట్లుగా) పాటించెను.

జనమేజయా! అట్లు కుంతీదేవి శ్రీకృష్ణునకు విదులోపాఖ్యానము చెప్పి అతని ద్వారా ధర్మరాజునకు తన సందేశమును పంపెను.

ఈ విదులోపాఖ్యానము వీరులకు ఉత్సాహవర్ధకముగాను, పిరికివారికి భయంకరముగాను ఉన్నది. రాజు శత్రువుచేత పీడితుడై దుఃఖపడి నిరాశ చెందినప్పుడు మంత్రి ఈ ఉపాఖ్యానమును వినిపించవలెను.

జనమేజయా! ఇది 'జయము' అను పేరుగల ఇతిహాసము. విజయేచ్ఛ గలవాడు దీనిని వినవలెను. ఈ యితిహాసము విని యుద్ధభూమికి పోవు రాజు త్వరలోనే విజయమును సాధించగలడు. శత్రువులను మర్దించగలడు.

ఈ యుపాఖ్యానము పుత్రప్రాప్తిని కలిగించును. సాధారణ పురుషుని యందు శౌర్యమును కలిగించును. గర్భవతి ఈ యుపాఖ్యానమును పలుసార్లు వినిన యెడల ఆమె తప్పక వీరపుత్రుని కనును.

ఈ యితిహాసమును విని ప్రతి క్షత్రియస్త్రీ విద్యాశూరుడు, తపశ్శూరుడు, దానశూరుడు, బ్రహ్మతేజస్వి, ప్రశంసనీయుడు, పరాక్రమవంతుడు, బలవంతుడు, పరమ సౌభాగ్యశాలి, మహారథి, ధైర్యవంతుడు, శత్రువుల కసాధ్యుడు, విజయ శీలుడు, ఎవరి చేతను అపజయము పొందనివాడు, దుష్టులను శిక్షించువాడు, ధర్మాత్ములను రక్షించువాడు, సత్యపరాక్రముడు, వీరుడునైన పుత్రుని కన గలదు.

పాండవులకు కుంతి యుపదేశము - శ్రీకృష్ణుడు ఉపప్లావ్య నగరమునకు పోవుట

జనమేజయా! అట్లు కుంతీదేవి శ్రీకృష్ణునకు విదులోపాఖ్యాన పూర్వకముగ యుధిష్ఠిరునకు సందేశము చెప్పి, అర్జునునికి తన సందేశము పంపుటకు అర్జునుని గూర్చి ఇట్లు చెప్ప దొడగెను:

''అర్జునా! నీ జన్మ సమయమునందు నేను పురిటింటిలో స్త్రీ జన పరివృతనై ఆశ్రమమునందు ఉంటిని. అప్పుడు నాకు దివ్యమైన ఆకాశవాణి యిట్లు వినబడెను:

''కుంతీ! నీ యీ పుత్రుడు, ఇంద్రునితో సమానమైన పరాక్రమము కలవాడగును. ఇతడు భీమసేనునితో కలిసి యుద్ధమునందు సమస్త కౌరవులను జయించి శత్రుసముదాయమును గగ్గోలు పెట్టగలడు. ఈ నీ పుత్రుడు శ్రీకృష్ణ భగవానునితో కలిసి యీ భూమండలమును జయించగలడు. ఇతని కీర్తి స్వర్గ లోకము వరకు వ్యాపించగలదు. ఇతడు యుద్ధమునందు శత్రువులైన కౌరవులను సంహరించి తన పైతృకమైన రాజ్యభాగమును తిరిగి పొందగలడు. శోభాయమానముగా నున్న యీ బాలకుడు తన సోదరులతో కలిసి మూడు అశ్వమేధ యాగములను అనుష్ఠించ గలడు.''

''అచ్యుతా! సవ్యసాచియైన అర్జునునకు గల సత్యప్రతిజ్ఞను, బలమును, అజేయమైన శక్తిని నీవే యెరుగుదువు కదా! దాశార్హ కులనందనా! ఆకాశవాణి చెప్పినట్లు జరిగి తీరుగాక. నా కోరికగూడ అదియే. ధర్మము ప్రపంచమునందు ఉండిన యెడల అది సత్యమగును. కృష్ణా! నీవు స్వయముగా కూడ ఆకార్యము లన్నియు నెరవేర్చగలవు. అకాశవాణి చెప్పినది అన్యథా కాదని భావించు చున్నాను.

''కృష్ణా! నేను మహా ధర్మమునకు నమస్కరించుచున్నాను. ఎందుకనగా, ధర్మమే ప్రజలను భరించుచున్నది.

''నీవు పోయి అర్జునునితో, సదా యుద్ధోన్ముఖుడైన భీమసేనునితోను ఇట్లు చెప్పుము:

''క్షత్రియ స్త్రీ దేనికొరకు పుత్రుని కనునో దానికి ఉపయుక్తమైన సమయము ఇప్పుడు వచ్చినది. ఉత్తముడు ఎవరితోనైన శత్రుత్వము కలిగినపుడు ఉత్సాహ శూన్యుడుగ నుండడు.

''శ్రీ కృష్ణా! నీకు భీమసేనుని యభిప్రాయము తెలిసియే ఉన్నది. అతడు శత్రునాశము చేయువరకు శాంతిని పొందడు.

"శ్రీకృష్ణా! నీవు సర్వధర్మములను తెలిసియున్న పాండురాజు కోడలగు ద్రౌపదితో నా మాటగా నిట్లనుము:

''పుత్రీ! నీవు పరమ సౌభాగ్య సంపన్నమైన వంశమునందు పుట్టితివి. నీవు నా పుత్రులందరితోను ధర్మముగా వ్యవహరించుట నీ సద్గుణములకు తగినది.''

''పురుషోత్తమా! క్షత్రియ ధర్మమునందు తత్పరులైయున్న మాద్రీ కుమారులైన నకుల సహదేవులకు నిట్లు చెప్పుము:

''వీరులారా! మీరు ప్రాణములను ఒడ్డియైనను మీ పరాక్రమముచేత పొందిన సుఖభోగములను అనుభవింపుడు. క్షత్రియ ధర్మమును నెరవేర్చుచున్న మనష్యుని మనస్సుకు పరాక్రమము ద్వారా ప్రాప్తించిన పదార్థమే ఎల్లప్పటికిని సంతోషము కలిగించును.''

''శ్రీకృష్ణా! పాండవులతో నా మాటగా నిట్లనుము:

''పుత్రులారా! అన్ని విధముల ధర్మాభివృద్ధిని చేయు ద్రౌపదిని, అందరు చూచుచుండగా శత్రువులు కఠిన వచనములతో నొప్పించిన విషయము వీరు డెవడు విని ఓర్చి యుండును?

"రాజ్యము అపహరించినందుకుగాని, జూదమునందు ఓడినందుకుగాని, పుత్రులు వనవాసము చేసినందుకుగాని నాకు మిక్కిలి దుఃఖము కలుగలేదు.

"నిండు సభలో సౌందర్యవతి యువతియునైన నా కోడలు ద్రౌపదిఏడ్చుచుండగా ఆమెను దుర్యోధనుడు దుర్భాషలాడెను. ఆ విషయమే నాకు అన్నిటి కన్న అధిక దుఃఖకారణమైనది.

"క్షత్రియ ధర్మాచరణము చేయుచున్న సాధ్వీమణి ద్రౌపది ఆ దినములలో రజస్వలగా నుండెను. ఆమె పరిపూర్ణ సనాథయైనను ఆనాడు కౌరవ సభలో ఆమెను రక్షించువారెవ్వరుగూడ లేకుండిరి. ఆమె అనాథవలె ఏడ్చుచు అవమానమును సహించుచుండెను.

"జనార్దనా! ధనుర్ధారులలో శ్రేష్ఠుడైన అర్జునునితో - 'నీవు ద్రౌపది కోరిన మార్గమునందు నడుపుము' అని చెప్పుము.

"కృష్ణా! భీమార్జునులు కుపితులైన యెడల యమధర్మరాజువలె భయంకరులై దేవతలను కూడ యమలోకమునకు పంపగలరని నీకు బాగుగా తెలియును.

"జూదమాడునప్పుడు సభకు ద్రౌపది పోవలసి వచ్చెను. అప్పుడు కౌరవ వీరుల సమక్షముననే దుర్యోధన దుశ్శాసనులు ఆమెను నిందించుట యంతయు భీమార్జునులను తిరస్కరించినట్లేయగును కదా! ఆ విషయము మరల వారి జ్ఞప్తికి తెచ్చుచున్నాను.

"మధుసూదనా! నా పక్షమున ద్రౌపదిని, పుత్ర సహిత పాండవులను కుశల ప్రశ్నవేసి, నా క్షేమము కూడ వారికి తెలుపుము.

"ఇక నీవు బయలుదేరి పొమ్ము. నీ మార్గము మంగళమయమగుగాక! నా పుత్రులను రక్షింపుము."

జనమేజయా! తరువాత శ్రీకృష్ణుడు కుంతీదేవికి ప్రదక్షిణ నమస్కారములు చేసి గంభీరమైన సింహగమనముతో అక్కడినుండి వెడలిపోయెను.

తరువాత భీష్మాదులైన కౌరవులను వీడ్కొని శ్రీకృష్ణుడు కర్ణుని మాత్రము తన రథముపై కూర్చొనబెట్టుకొని సాత్యకితోబాటు వెడలిపోయెను.

శ్రీకృష్ణుడు వెడలిపోయిన తరువాత కౌరవులందరు ఆ మహాత్ముని ఆశ్చర్య జనకములైన బలపరాక్రమములను ఒండొరులు చర్చించుకొనుచు ఇట్లనిరి:

"ఈ సమస్త భూమండలము మృత్యుపాశబద్ధమైనట్లు మోహముచే కప్పబడెను. దుర్యోధనుని మూర్ఖత్వముచేత ఈ భూమండలము నశింపగలదని తోచుచున్నది."

జనమేజయా! తరువాత శ్రీకృష్ణభగవానుడు హస్తినానగరమునుండి వెడలి ఉపప్లావ్య నగరమునకు పోవునపుడు చాలసేపటివరకు కర్ణునితో రహస్య మంత్రాలోచనము చేసెను.

కర్ణుని వీడ్కొని శ్రీకృష్ణుడు అతివేగముతో వెడలిపోయెను.

కృష్ణుని రథాశ్వములను దారుకుడు తోలుచుండగా వాయువేగ మనోవేగములతో మిక్కిలి వడిగా చౌకళించుచు పోవుచున్నప్పుడు అవి ఆకాశమును పానము చేయుచుండెనా యన్నట్లుండెను. అతివేగముతో ఆ గుఱ్ఱములు దేగలవలె సుదీర్ఘమైన ఆ మార్గమును త్వరగా గడచుచు పోవుచు, శ్రీకృష్ణ భగవానుని ఉపప్లావ్య నగరమునకు చేర్చెను.

ఈ విధముగా వైశంపాయన మహాముని జనమేజయునకు చెప్పి, తరువాతి వృత్తాంతమును ఇట్లు చెప్పదొడగెను:

"జనమేజయా! కుంతి మాటలను వినిన భీష్మద్రోణులు తమ ఆజ్ఞను ఉల్లంఘించిన దుర్యోధనునితో నిట్లనిరి:

భీష్మ ద్రోణులు దుర్యోధనునకు ఉపదేశించుట

"పురుషసింహా! కుంతీదేవి శ్రీకృష్ణునకు అర్థయుక్తము, ధర్మసంగరము, పరమోత్తమము, అతి భయంకరమునైన మాటలను చెప్పెను. ఆ ప్రసంగము నీవుకూడ వినియుందువు కదా!

"కురునందనా! కుంతీపుత్రులు శ్రీకృష్ణుని సమ్మతిననుసరించి ఆమె చెప్పిన పనులన్నియు చేసెదరు. అప్పుడు రాజ్యము తీసికొనక వారు శాంతముగ నుండజాలరు. నీవు జూదమునందు కౌరవ సభలో ధర్మబద్ధులైన పాండవులకు, ద్రౌపదికి గొప్ప దుఃఖము కలిగించితివి. అయినను, వారు నీ యపరాధము లన్నింటిని మౌనముతో సహించిరి,

"దుర్యోధనా! ఇప్పుడు యుధిష్ఠిరుడు, అస్త్ర విద్యాపారంగతుడైన అర్జునుని, యుద్ధమునందు దృఢ నిశ్చయముగల భీమసేనుని పొంది, గాండీవమును, బాణముతో నిండిన రెండంబుల పొదులను, దివ్యరథమును, ధ్వజమును వశములో నుంచుకొని, బలపరాక్రమ సంపన్నులైన నకుల సహదేవులను యుద్ధమునందు చూచి, శ్రీకృష్ణుని గూడ సహాయకునిగా పొంది, పూర్వము నీవు చేసిన అపరాధములను క్షమించడు.

"సుయోధనా! ఇటీవలనే అర్జునుడు విరాటనగర యుద్ధమునందు మనయందరిని జయించి యుండెనుగదా! అది యంతయు నీ యెదుట జరిగిన సంఘటనమే కదా!

"అర్జునుడు పాశుపతాస్త్రముతో నివాతకవచ రాక్షసులను చంపియుండెను కదా!

"ఘోషయాత్రయందు కర్ణాదియోధులు నీతోపాటే ఉండిరి కదా! నీవు స్వయముగ గూడ రథకవచాదులు కలిగియుంటివి గదా! ఐనను అర్జునుడే నిన్ను గంధర్వులనుండి విడిపించెను.

"అర్జునుని శక్తిని తెలిసికొనుటకు ఈ యుదాహరణములు చాలును. కాబట్టి భరతశ్రేష్ఠా! నీవు నీ సోదరులైన పాండవులతో సంధి చేసికొనుము.

"దుర్యోధనా! మృత్యుదేవత కోరలతో ఈ భూమండమంతయు ఇప్పుడు ఇరికిపోయినది. నీవు సంధి ద్వారా భూమండలమును రక్షింపుము.

"మీ అన్న యుధిష్ఠిరుడు - ధర్మాత్ముడు, దయాళుడు, మధురభాషి, విద్వాంసుడు. నీ మనస్సులోని కాలుష్యము నంతయు ఇక్కడనే కడిగి పురుష సింహుడైన యుధిష్ఠిరుని శరణు వేడుము.

"నీవు ధనుస్సును దించి, ముడిబెట్టిన నీ కనుబొమ్మలను సరళము చేసికొని, క్రోధమును విడిచి సహజ శోభతో ఒప్పారుచుండుటను యుధిష్ఠిరుడు చూచినపుడు నీవు మన కులము నందు శాంతిని స్థాపించినావని మాకు నమ్మకము కలుగును.

''శత్రుదమనా! నీ మంత్రులతో పాటు యుధిష్ఠిరుని కడకు పొమ్ము. పూర్వమువలె అతనికి ప్రణామము చేసి, ఆలింగనము చేసికొనుము. ప్రణామము చేయుచున్న నిన్ను చూచి యుధిష్ఠిరుడు మైత్రీ పూర్వకముగ తన చేతులెత్తి ఆలింగనము చేసికొనును.

"సింహబలుడైన భీముడు కూడ నిన్ను కౌగలించుకొనును. శంఖము వంటి మెడగల అర్జునుడు అంజలిబద్ధుడై నీకు నమస్కారము చేయును. నకుల సహదేవుల్లు నీకు నమస్కారము చేసి గురుజనోచితమైన సేవలు చేయుదురు.

"భూపాలా! అభిమానము విడిచి, నీవు విడిపోయిన నీ సోదరులను కలిసికొనుము. ఈ యపూర్వ సమ్మేళనము చూచి కృష్ణుడు మొదలైన రాజులందరు కన్నులనుండి ఆనంద బాష్పముల విడిచెదరు.

"తరువాత నీ సోదరులతోబాటు నీవు సమస్త భూమండల రాజ్యమును ఏలుకొనుము. అంతటితో దూరదూరముల నుండి యిక్కడికి యుద్ధము చేయుటకు వచ్చిన రాజులు ఒండొరుల కలిసికొని హర్షముతో వెడలిపోయెదరు.

''రాజేంద్రా! ఈ యుద్ధము వలన ఏమాత్రము లాభము లేదు యుద్ధము నుండి నిన్ను నివారించుచు నీ హితచింతకులయిన మిత్రుల మాట వినుము. ఎందుకనగా, యుద్ధము సంభవించిన యెడల నిశ్చయముగా క్షత్రియకులమునకు వినాశము కలుగును.

"కురువీరా! గ్రహనక్షత్రాదులు ప్రతికూలము లగుచున్నవి. పశుపక్ష్యాదులు భయంకర ధ్వని చేయుచున్నవి. క్షత్రియుల వినాశనము సూచించునట్టి అనేకములైన అపశకునములు కనబడుచున్నవి.

''విశేషించి యిక్కడ మన యింటిలో అపశకునములు కనబడుచున్నవి. మండుచున్న కొరవులు నీ సేనపైబడి బాధించుచున్నవి. మన వాహనములన్నియు అప్రసన్నములై యేడ్చుచున్నట్లు కనబడుచున్నవి. గ్రద్దలు నీ సేనలో నలువైపుల ఆవరించి కూర్చొనుచున్నవి. ఈ పట్టణ శోభ, రాజభవన శోభ ఇప్పుడు పూర్వమువలె లేదు. అన్ని దిక్కులు దహించుచున్నట్లు తోచుచున్నవి. ఆ దిక్కులయందు నక్కలు అమంగళ సూచకములైన ధ్వనులు చేయుచు తిరుగుచున్నవి.

''కనుక దుర్యోధనా! తల్లిదండ్రులు, నీ హితము కోరువారు చెప్పిన మాటలు నీవు వినుము. ఇప్పుడు శాంతిని స్థాపించుటగాని, యుద్ధము చేయుటగాని- ఈ రెండు నీ పైననే ఆధారపడి యున్నవి.

"శత్రుదమనా! నీవు మిత్రుల హిత వచనములను అంగీకరింపని యెడల నీ సేనలు అర్జున బాణములచేత పీడింపబడియుండుటచూచి పశ్చాత్తాపపడగలవు.

''సుయోధనా! మేము చెప్పెడు ఈ హితవాక్యములు నీకు వ్యతిరేకముగా తోచుచున్న యెడల యుద్ధమునందు గర్జించుచు భీమసేనుడు చేయుచున్న సింహనాదమును, అర్జునుని గాండీవ ధనుష్టంకారమును విననప్పుడు మేము చెప్పిన మాటలు నీకు జ్ఞప్తికి రాగలవు."

ద్రోణుడు భీష్మునితో సంప్రదించి మరల దుర్యోధనునకు ఉపదేశించుట

"జనమేజయా! భీష్మద్రోణులు దుర్యోధనునకు అట్లు చెప్పిన తరువాత అతని మనస్సు చెదరిపోయెను. అతడు కన్నులడ్డముగా త్రిప్పుకొని వారిని చూచుచు, కనుబొమలు ముడిచి, ముఖము క్రిందికి వ్రేలాడవేసి భీష్మద్రోణులతో ఏమియు మాటాడలేదు.

అట్లు నిరుత్సాహముగా నున్న దుర్యోధనుని చూచి భీష్మద్రోణులు పరస్పరము చూచుకొనుచు అతనితో మరల ఇట్లు చెప్పదొడగిరి:

''ఆహా! గురుజనులను సేవించుచు, ఎవరియందును దోషారోపణము చేయనని బ్రాహ్మణ భక్తుడు, సత్యవాదియునైన యుధిష్ఠిరునితో మాకు యుద్ధము చేయవలసి వచ్చెను కదా! ఇంతకన్న ఎక్కువ దుఃఖదాయకమైన విషయమేముండును?"

జనమేజయా! ఇట్లు భీష్ముడనిన తరువాత ద్రోణాచార్యుడు దుర్యోధనునకు మరల నిట్లు ఉపదేశించెను:

''రాజా! నా పుత్రుడైన అశ్వత్థామయెడల నాకు ఎంత ప్రేమ యున్నదో అంతకంటె ఎక్కువ ప్రేమ అర్జునునియందు కలదు. కపిధ్వజుడైన అర్జునుడు నా యెడల ఎల్లప్పుడును వినయభావముతో వ్యవహరించును. నా పుత్రుని కంటే ప్రియతముడైన అర్జునునితో నాకు క్షత్రియధర్మము నాశ్రయించి యుద్ధము చేయవలసి వచ్చును. ఛీ! క్షత్రియవృత్తి యెంత నీచమైనది?''

''దుర్యోధనా! నా కృపచేతనే అర్జునుడు ఇతర ధనుర్ధరులందరికంటె శ్రేష్ఠుడయ్యెను. ఇప్పుడు ప్రపంచమునందు అతనితో సమానుడు ఇతర ధనుర్ధరుడు ఎవ్వడును లేడు.

''యజ్ఞమునకు వచ్చిన మూర్ఖబ్రాహ్మణుడు గౌరవింపబడని విధముగనే మిత్రద్రోహి, దుష్టభావము కలవాడు, నాస్తికుడు, కుటిలుడు, రహస్యాపకారియునైనవాడు సత్పురుషులలో ఎప్పుడును సన్మానము పొందడు.

''రాజా! పాపాత్ముడు పాపములనుండి నివారింపబడినప్పటికిన్ని పాపములనే చేయగోరుచుండును. శుభసంకల్పముగల పుణ్యాత్ముడు పాపులచేత పాపకార్యములకొరకు ప్రోత్సహింపబడినను శుభకర్మలనే చేయగోరుచుండును.

''భరతశ్రేష్ఠా! నీవు పాండవులతో నెల్లప్పుడును అసత్యముగనే వ్యవహరించుచు ఎన్నియో కపటకృత్యములను చేసినప్పటికిని వారు నీకు ప్రియము చేయుటయందే ఆసక్తులై యున్నారు. కాబట్టి, నీకు గల ఈ యీర్ష్యాద్వేషాది దోషములు నీకే అహితమును చేయగలవు.

''దుర్యోధనా! కురుకుల పితామహుడైన భీష్ముడు, నేను, విదురుడు, శ్రీకృష్ణ భగవానుడు, నీకు శ్రేయస్కరములైన మాటలను ఎన్నియో చెప్పినను నీవు అంగీకరించలేదు.

''వివేకరహితుడు మొసళ్ళు మొదలైన క్రూరజల జంతువులు గలిగి మహాప్రవాహముచేత ఉప్పొంగుచున్న గంగానదిని తన బాహువులతో ఈది దాటగోరుచున్నట్లే, నీవు నాకు బలమున్నది అని తలచుచు కౌరవ సేనలో ఎగిరిపడి దుముకుటకు సాహసము చేయుచున్నావు.

''రాజా! ఇతరులు విడిచిన వస్త్రమును ధరించి 'అది తనదియే' యని తలచుచున్న వానివలె నీవు, తీసివేసిన పుష్పమాలికనువలె నున్న యుధిష్ఠిరుని రాజ్యలక్ష్మిని పొంది, లోభముచే 'అది నీదే' యని తలచుచున్నావు. సోదరులతో, భార్యతోను వనమునందున్నప్పటికిన్ని, అతనిని రాజ్యాధికారమందున్న ఏ రాజు జయించగలడు?

''సమస్త రాజులచేత సేవింపబడు కుబేరునితో కలిసి యుధిష్ఠిరుడు ఉండెను. ఆయన కుబేరుని భవనమునకు పోయి వివిధ రత్నములను తీసికొన్నాడు. ఇప్పుడు పాండవులు సంపన్నమైన మీ రాష్ట్రముపైన దాడి సలిపి తమ రాజ్యభాగమును తప్పక తీసికొందురు.

''దుర్యోధనా! మేమిద్దరము భీష్మద్రోణులము. దాన యజ్ఞాధ్యయనములు చేసినాము. ధనముచేత బ్రాహ్మణులను తృప్తిపరచినాము. ఇప్పుడు మా ఆయుష్షు ముగిసినది. కాబట్టి మేము కృతకృత్యులమైనామని నీవు తలచుము.

''కాని, నీవు పాండవులతో యుద్ధము తెచ్చిపెట్టుకొని సుఖమును, రాజ్యమును, ధనమును, మిత్రులను అన్నింటిని పోగొట్టుకొని మహాసంకటము నందు పడగలవు.

''రాజా! తపశ్శాలిని, ధర్మవాదినియైన ద్రౌపది ఎవని విజయమును కోరుచున్నదో, అట్టి యుధిష్ఠిరుని నీవెట్లు జయించగలవు? శ్రీకృష్ణభగవానుడు ఎవనికి మంత్రియో, శస్త్రధారులలో శ్రేష్ఠుడైన అర్జునుడెవనికి సోదరుడో, అట్టి ధర్మజుని నీవెట్లు జయించగలవు. ధైర్యవంతులు, జితేంద్రియులునైన బ్రాహ్మణులు సహాయకులుగా నున్న యుధిష్ఠిరుని నీవెట్లు జయిచగలవు?

''దుర్యోధనా! అనేక మిత్రులు కష్ట సముద్రమున మునిగిన వాని శ్రేయస్సును గోరి, తమ కర్తవ్యమని తలచి ఉపదేశింపవలసిన సమయమందు చెప్పవలసిన మాటలన్నియు ఇంతకు పూర్వమే చెప్పిరి. ఐనను ఇప్పుడు మరల చెప్పుచున్నాను వినుము:

''రాజా! యుద్ధమువలన నీకు ఏమాత్రము లాభము ఉండబోదు. కురుకుల వృద్ధికొరకు నీవు పాండవ వీరులతో సంధి చేసికొనుము. మంత్రి పుత్ర సేనా సహితముగా నీవు యమలోకమునకు పోవుటకు సంసిద్ధుడవు కావద్దు.''

పాండవ పక్షములో చేరుమని శ్రీకృష్ణుడు కర్ణునకు బోధించుట

జనమేజయా! ఆ విధముగా భీష్మద్రోణులు దుర్యోధనునకు చెప్పి, ఇక ఉపదేశించుట వ్యర్థమని తెలిసినను మాటిమాటికి ఉపదేశించిరి.''

తరువాత సంజయునితో ధృతరాష్ట్రుడిట్లనెను:

''సంజయా! శ్రీకృష్ణ భగవానుడు రాధానందనుడైన కర్ణుని రథముపైన కూర్చొనబెట్టుకొని హస్తినాపురమునుండి వెడలిపోయినప్పుడు అతడు కర్ణునితో నేమనెను? మేఘ గంభీరధ్వనిగల శ్రీకృష్ణుడు కర్ణునితో కఠినముగ మాట్లాడెనా? మధురముగనా?"

ఆ మాటలకు సంజయుడు ధృతరాష్ట్రునితో నిట్లనెను:

''మహారాజా! శ్రీకృష్ణుడు కర్ణునితో తీక్ష్ణముగ, మధురముగ, ప్రియముగ, ధర్మ సమ్మతముగ, సత్యముగ, హితముగ, హృదయమునకు హత్తు

కొనునట్లుగ, చెప్పిన మాటలను అన్నిటిని నీవు నా వలన క్రమముగ వినుము. కృష్ణుడు కర్ణునితో నిట్లనెను:

''రాధానందనా! నీవు వేదపారంగతులైన బ్రాహ్మణులను ఉపాసించితివి. తత్వజ్ఞాన సంపాదనము కొఱకు నీవు నియమముతో దోషదృష్టిని విడిచి ఆ బ్రాహ్మణులను నీ సందేహములను గూర్చి అడిగి తెలిసికొంటివి. కర్ణా! సనాతనమైన వైదిక సిద్ధాంతమును గూర్చి నీవు బాగుగా ఎరుగుదువు. ధర్మశాస్త్రముల సూక్ష్మ విషయములందు గూడ నీవు విద్వాంసుడవైతివి.

''కర్ణా! కన్యాగర్భమునుండి పుట్టిన కొడుకును గూర్చి రెండు విధములుగ చెప్పబడినది. ఒకడు కానీనుడు, మరియొకడు సహోఢుడు అని. ఈ పుత్రులను కనిన తల్లి ఎవరిని వివాహము చేసుకొనునో వారే ఆ పుత్రులకు తండ్రులని శాస్త్రజ్ఞులు చెప్పినారు.

("వివాహమునకు పూర్వము కన్యకకు పుట్టినవాడు కానీనుడు, వివాహమునకు పూర్వమే గర్భిణిగా నున్న కన్యకకు వివాహము తరువాత పుట్టిన వాడు సహోఢుడు.)

''కర్ణా! నీ జన్మము కూడ ఇటువంటిదే. కుంతికి నీవు కన్యకావస్థలో జన్మించితివి. కాబట్టి, నీవు కూడ ధర్మానుసారముగ పాండురాజునకే పుత్రుడవు. కనుక నాతో రమ్ము. ధర్మ శాస్త్రము ప్రకారము నీవే రాజువు కాగలవు.

''నీ పితృ పక్షమువారైన కుంతీపుత్రులందరు నీకు సహాయకులుగా నుండెదరు. నీ మాతృ పక్షము వారైన వృష్ణి వంశీయులందరును నీతో నుండగలరు. పురుష శ్రేష్ఠా! ఈ రెండు పక్షములు నీవైపు ఉన్నవని తెలిసికొనుము.

''నాయనా! నాతోపాటు నీవు ఇక్కడినుండి పోయిన తరువాత నేడు, పాండవులకు, 'నీవు కుంతికే పుత్రుడవనియు. యుధిష్ఠిరునికంటె పూర్వము నీవు జన్మించితివనియు' తెలిసిన వెంటనే పంచ పాండవులు, ద్రౌపదీ పుత్రులైదుగురు సుభద్రా పుత్రుడైన వీరాభిమన్యుడు - వీరందరును నీ చరణ స్పర్శచేసి నమస్కరింతురు.

''ఆదిగాక, రాధేయా! పాండవులకు సహాయము చేయుటకు వచ్చిన సమస్తరాజులు, రాజకుమారులు, అంధక వృష్ణి వంశీయులైన యోధులు కూడ నీ చరణములందు మస్తకము లుంచెదరు.

''అనేక రాజపుత్రులు, రాజకన్యలు నీ కొఱకు బంగారు - వెండి మంటి కలశములు, ఓషధులు, సమస్త ధాన్యములు, నవరత్నములు, లతలు మొదలైన అభిషేక సామగ్రిని తెచ్చెదరు. ధౌమ్యాచార్యులు నీ కొరకు హోమము చేయును. చతుర్వేద విద్వాంసులైన బ్రాహ్మణులు, సర్వదా బ్రాహ్మణోచిత ధర్మకర్మములను అనుష్ఠించు పాండవులకు పురోహితుడైన ధౌమ్యుడు కూడ నీకు రాజ్యాభిషేకము చేసెదరు.

''కర్ణా! ఈ విధముగనే పురుష సింహులైన పంచపాండవులు, ద్రౌపదీ పుత్రులైదుగురు, ద్రుపద, శిశుపాలురు-వీరందరును నిన్ను సమ్రాట్టుగా పట్టాభిషేకము చేసెదరు. ధర్మాత్ముడైన యుధిష్ఠిరుడు నీకు యువరాజుగా నుండి తెల్లని చామరము వీచుచు రథముపైన నీ వెనుక కూర్చొనును. భీముడు నీకు శ్వేతచ్ఛత్రము పట్టును.

''నూర్లకొలది గజ్జెల మధుర ధ్వనితో గూడి వ్యాఘ్రచర్మముచే కప్పవడి. శ్వేతాశ్వములచేత కట్టబడిన నీ రథమునకు అర్జునుడు సారథిగా నుండి రథము నడపగలడు. నీ సేవకొరకై అభిమన్యుడు ఎల్లప్పుడు నీ పాద సన్నిధిని నిలిచి యుండును. నకుల సహదేవులు, ద్రౌపదీపుత్రులు, పాంచాలదేశీయ క్షత్రియులు, మహారథియైన శిఖండి - వీరందరు నీ వెనుక నడుచు చుందురు.

''కర్ణా! నేను కూడ అంధక - వృష్ణి వంశీయులందరితో కలిసి నిన్ను అనుసరించుచుందును. దశార్హ - దశార్ణకులముల క్షత్రియులు అందరు నీకు పరివారముగ నుండెదరు.

''మహాబాహు బలశాలీ! నీవు నీ సోదరులైన పాండవులతోబాటు రాజ్యమును అనుభవింపుము. జపహోమాది వివిధ శుభకర్మానుష్ఠానములందు తత్పరుడవు కమ్ము. ద్రవిడ - కుంతల - ఆంధ్ర - తాళచర - చూచుప - వేణుప దేశముల ప్రజలు నీకు సేవకులై నీ ముందు నడుచుచుందురు. వంది మాగధ సూత జనులు (స్తోత్ర పాఠకులు) వివిధ స్తోత్రములచేత నీ కీర్తిగానము చేసెదరు. పాండవులు, 'వసుషేణ' మహారాజైన కర్ణుని విజయమును చాటెదరు గాక!

"కౌంతేయా! నక్షత్రములచేత పరివృతుడైన చంద్రునివలె నీ సోదరులచే చుట్టబడి నీవు రాజ్యపాలనము చేయుచు నీ తల్లి కుంతీదేవిని ఆనందపరచుము. నీ మిత్రులు సంతోషింతురుగాక! శత్రువులు బాధపడుదురుగాక! నేటినుండి

నీ సోదరులైన పాండవులతో నీవొక మంచి సోదరునివలె స్నేహభావముతో వ్యవహరించెదవుగాక!

కర్ణుడు దుర్యోధన పక్షముననే యుండుటకు తన నిశ్చయమును శ్రీకృష్ణునకు తెలిపి - యుద్ధమును యజ్ఞరూపముగా వర్ణించుట

''కేశవా! నీవు నా యెడల హితము, మైత్రి, ప్రేమ చూపుచు చెప్పిన మాటలు సత్యములనుటలో సందేహములేదు. కృష్ణా! ధర్మశాస్త్రముల నిర్ణయము ననుసరించి నేను పాండురాజు పుత్రుడనే. ఈ విషయములన్నియు బాగుగా ఎరుగుదును. జనార్దనా! కుంతి కన్యకగా నున్నప్పుడు సూర్యభగవానుని సంయోగముచేత నన్ను కనిన పిదప, సూర్యుని ఆజ్ఞచేతనే నదీజలమునందు నన్ను విడిచియుండెను.

"శ్రీకృష్ణా! ఇది నా జన్మరహస్యము. నేను పాండుపుత్రుడననుటలో సందేహములేదు. కాని, కుంతీదేవి నన్ను నదిలో వేయుటవలన నేను క్షేమముగా నుండెడివాడను కాకుంటిని.

''కాని, మధుసూదనా! ఆ తరువాత 'అధిరథుడు' అను పేరుగల సూతుడు (రథము నడుపువాడు - క్షత్రియ స్త్రీకి బ్రాహ్మణునివలన కలిగిన సంతానము) జలమునందు కొట్టుకొనిపోవుచున్న నన్ను చూడగానే తీసికొని తన యింటికి పోయి మిక్కిలి ప్రేమతో తన భార్యయైన రాధ ఒడిలోనికి ఇచ్చెను. అప్పుడు నా యందు అధిక ప్రేమవలన చనులు చేపగా, నాకు ఆమె స్తన్యమిచ్చెను.

''మాధవా! ఆమె నా మలమూత్రములను తీయుచు, స్తన్యమునిచ్చుచు కన్నతల్లివలె ప్రేమముతో పెంచెను. కాబట్టి, సర్వదా ధర్మశాస్త్రములను వినుచున్న నావంటి ధర్మజ్ఞుడు రాధాదేవి నోటినుండి గ్రాసమును ఎట్లు తీసివేయను? ఆమెను పోషించక విడిచి పెట్టునంతటి క్రూరత్వమును నేనెట్లు చేయుదును? ఆ విధముగనే సూతుడైన అధిరథుడు కూడ నన్ను తన పుత్రునిగానే భావించుచున్నాడు. నేను కూడ ఆయనను తండ్రినిగానే ప్రేమతో చూచుచున్నాను.

''మధుసూదనా! సూత దంపతులే నా జాతకర్మాది సంస్కారములు చేయించిరి. పుత్రప్రేమతో నాకు శాస్త్రీయవిధిచేత బ్రాహ్మణుల ద్వారా 'వసు

వేణుడు' అని నామకరణము అధిరథుడు చేయించెను. నేను యువకుడుగా నున్నప్పుడే అధిరథుడు సూతజాతికి చెందిన అనేక కన్యలతో వివాహము చేయించెను. ఇప్పుడు ఆ భార్యల వలన నాకు పుత్రులు, పౌత్రులు జన్మించిరి. ఆ స్త్రీలయందు నా హృదయము కామముచేత ఆసక్తమైయున్నది.

"గోవిందా! ఇప్పుడు నాకు సమస్త భూమండల సామ్రాజ్యము, సువర్ణ రాసులు లభించినను, అథవా సంతోషముచేతగాని, భయముచేతగాని శైశవము నుండి నాకు ఏర్పడిన సంబంధమును విడువజాలను.

"నేను ధృతరాష్ట్ర కులమునందు దుర్యోధనుని ఆశ్రయము వలన పదు మూడు సంవత్సరములు నిష్కంటకముగా రాజ్యమును ఏలితిని. నేను సూతులతో కలిసి అనేక యజ్ఞములు, సూతకుల ధర్మకర్మములు, వివాహకార్యములు చేసితిని.

"శ్రీకృష్ణా! నా యందలి నమ్మకముచేతనే దుర్యోధనుడు పాండవులతో యుద్ధము చేయుటకు సాహసించుచున్నాడు. కాబట్టి, అర్జునునితో ద్వైరథ యుద్ధమునందు (ఇద్దరు రథికులు మాత్రమే యితర సహాయకులు లేక చేయు యుద్ధము) అర్జునునకు ఎదురుగా నిలిచి పోరాడుటకు దుర్యోధనుడు నన్ను ఎన్నుకున్నాడు.

"జనార్దనా! ఇట్టి సమయమునందు నేను వధ - బంధన - భయ - లోభాది కారణములచేత గూడ బుద్ధిమంతుడైన దుర్యోధనుని యెడల అసత్యవ్యవహారము చేయుటకు ఇష్టపడను.

"హృషీకేశా! ఒకవేళ నేనిప్పుడు ద్వైరథయుద్ధము అర్జునునితో చేయని యెడల, అది అర్జునునకు నాకును అకీర్తికరము.

"మధుసూదనా! నీవు నా హితమును కోరియే ఈ విషయములన్నియు చెప్పుచున్నావనుటలో సందేహము లేదు. పాండవులు నీ యధీనమునందున్నారు. కాబట్టి, నీవు చెప్పినట్లే వారు తప్పక నడచుకొందురు.

కాని, మధుసూదనా! నీకు నాకు మాత్రమే తెలిసిన యీ రహస్యము మన యిరువురి వరకే ఉండనిమ్ము. ఇట్లుండుటయే,నాకు హితము అని తలచెదను.

"రాజా! ఇంద్రియనిగ్రహముగలిగి ధర్మాత్ముడైన యుధిష్ఠిర మహారాజు నకు 'కర్ణుడు కుంతీనందను'డను రహస్యము తెలిసిన యెడల, అతడు రాజ్యమును

గ్రహించడు. నేనొకవేళ ఆ విశాల రాజ్యమును పొందినప్పటికిన్ని దుర్యోధనునకే సమర్పించెదను.

"కాబట్టిక ృష్ణా! కృష్ణుడు నాయకుడుగా, అర్జునుడు యోధుడుగాను ఉన్న ధర్మాత్ముడైన యుధిష్ఠిరుడే సర్వదా రాజ్యమును పాలించుగాక! భీమ, నకుల, సహదేవులు, ద్రౌపదీపుత్రులు, అభిమన్యుడు, ధృష్టద్యుమ్నాది పాంచాల-విరాట-వృష్ణి-యాదవ వంశీయులు ధర్మజునకు సహాయులుగా, అక్షయనిధివలె నీవు రక్షకుడవుగాను ఉండగా ఈ సమస్త భూమండలము, కౌరవరాజ్యమున్ను ఆ ధర్మాత్ముడే ఏలవలెను.

"శ్రీకృష్ణా! దుర్యోధనుడు అనేక క్షత్రియ సముదాయమును తన పక్షమున చేర్చుకొనెను రాజులందరిలో విఖ్యాతుడయ్యెను. కురుదేశ రాజ్యముకూడ అతనికి లభించెను.

"ఇప్పుడు దుర్యోధనుడు శస్త్రయజ్ఞమును చేయనున్నాడు. ఆ యజ్ఞమునకు సాక్షిగా నీవు ఉండగలవు. అధ్వర్యుడవు కూడ నీవే.

(యజ్ఞములో ఋత్విక్కులందరికి అధ్యక్షుడుగా నుండి యజ్ఞసామగ్రిని సమకూర్చు బాధ్యత కలవాడై, ప్రధానముగా యజుర్వేదసంబంధమైన హోమ కర్మలు చేయువాడు అధ్వర్యుడు కనుకనే యజుర్వేదమునకు కూడ 'అధ్వర్యు' అను పేరు వచ్చినది.)

"కృష్ణా! కవచాదిసాధనములతో యుద్ధసన్నద్ధుడైన అర్జునుడు ఈ యజ్ఞమునందు 'హోత'గా నుండగలడు.

(హోమసంబంధమైన ఋగ్వేదమంత్రములను ఉచ్చరించువాడు, నలుగురు హోమకర్తలకు పెద్దగా ఉండి అధ్వర్యునకు కుడిభుజముగా నుండువాడు 'హోత' యనబడును.)

"ఈ యజ్ఞములో గాండీవము స్రువముగా నుండును.

(హోమ ద్రవ్యములను ఉంచి హోమము చేయు కొయ్యగరిటె స్రువ మనబడును)

"హోమద్రవ్యమే ఈ యజ్ఞమునకు శత్రు వీరుల పరాక్రమము,

అర్జునుడు ప్రయోగించు ఐంద్ర-పాశుపత-బ్రాహ్మ స్థూణాకర్ణాద్యస్త్రములే వేదమంత్రములుగా ఈ యాగమునందుండగలవు.

(మంత్రములచేత ప్రయోగింపబడు ఆయుధములు)

''కృష్ణా! సుభద్రాతనయుడైన అభిమన్యుడు శస్త్రయజ్ఞమునందు స్తోత్ర గానము చేయు ఉద్గాతగా నుండగలడు.

(యజ్ఞమునందు సామవేదమంత్రముల ద్వారా నిర్వహింపబడు హోమ తంత్రము నడుపువాడు 'ఉద్గాత' యనబడును.)

''భీమసేనుడే ప్రస్తోతగా నుండగలడు.

(ఉద్గాతకు సహాయకుడుగా నుండి ప్రస్తావములను అనగా సామవేద మంత్రములను యజ్ఞములందు ప్రయోగించువాడు 'ప్రస్తోత' యనబడును.)

''అతడు యుద్ధభూమియందు గర్జించుచు శత్రుసేనలను, గజములను నశింపజేయగలడు.

''ధర్మాత్ముడైన యుధిష్ఠిరుడే ఆ అసస్త్రయజ్ఞమునందు జపహోమా దులు చేయుటలో నిమగ్నుడై 'బ్రహ్మ' అను ఋత్విక్కు కార్యము నెరవేర్చ గలడు.

(నలుగురు ముఖ్య ఋత్విక్కులలో ఇతడొకడు. బ్రహ్మ మూడు వేద ములను తెలిసిన పండితుడుగా నుండవలెను. ఇతడు యజ్ఞమునంతటిని పర్యవే క్షించుచు తప్పులను దిద్దుచుండవలెను. యజ్ఞమునందు బ్రహ్మ అథర్వవేద మంత్రములచేత నెరవేర్చు హోమకర్మలను ప్రధానముగ చేయును.)

"శ్రీకృష్ణా! శంఖ-మృదంగ-భేరీ ధ్వనులు సింహనాదములు, అస్త్ర యజ్ఞమునందు సుబ్రహ్మణ్యనాదములుగా నుండగలవు.

(ఉద్గాతలచేత విశిష్టముగా ఉచ్చరింపబడు మంత్రముల ధ్వని 'సుబ్ర హ్మణ్య నాదము' అనబడును.)

''మాద్రీపుత్రులైన నకుల సహదేవులు శామిత్రములుగా నుండెదరు.

(యజ్ఞమునందలి పశుబంధనము, సమిధలు, కుశలు, హోమద్రవ్యములు మొదలగు సాధనములు 'శామిత్రములు' అనబడును.)

''కృష్ణా! చిత్రవిచిత్రములైన ధ్వజదండములుగల రథపంక్తులే ఈ అస్త్ర యజ్ఞమునందు యూపస్తంభములుగ నుండగలవు.

(యజ్ఞ పశువులు బంధింపబడు గుంజలు.)

కర్ణి-నాళీక-నారాచ-వత్సదలతాది బాణములు ఈ యజ్ఞమునందు ఉప బృంహణములుగ నుండును.

(సోమరసమునకు సాధనములైన నాలుగు మూలలు గల చమసాది యజ్ఞ పాత్రలు ఉపబృంహణములు అనబడును.)

"తోమరాయుధము సోమరస కలశముగాను, ధనుస్సులు పవిత్రములు (దర్భలు)గాను ఉండగలవు.

''శ్రీకృష్ణా! ఆ అస్త్ర యజ్ఞమునందు ఖడ్గములే కపాలములు (యజ్ఞ పాత్రలు). శత్రుమస్తకములే పురోడాశములు (యజ్ఞమునందు హోమము చేయ బడు రొట్టెలు). రక్తమే హవిస్సు (నేయి మొదలైనవి). శక్తి-గద మొదలైన ఆయుధములు సమిధలు (హోమము చేయబడు కట్టెపుల్లలు), పరిధులు (మధ్యమ దక్షిణ-ఉత్తర-అనబడు మూడు కట్టెలు-ఇవి యజ్ఞాగ్నులవద్ద ఉంచబడును.)

"ద్రోణ-కృపాచార్యుల శిష్యులే (పాండవ-కౌరవాదులు) ఈ యజ్ఞమునందు సదస్యులు.

"అర్జునుని గాండీవమునుండి, ఇతర మహారథుల ధనుస్సుల నుండి విడువబడు బాణములు యజ్ఞశాలలో పరవబడిన ప్రస్తోమములు (రత్నకంబళ ములు) గా ప్రకాశించును.

''సాత్యకి ప్రతిస్థాత (అధ్వర్యునకు రెండవ సహాయకుడు) గా నుండును.

''ఈ రణయజ్ఞమునందు దుర్యోధనుడు దీక్షితుడుగా ఉండగలడు.

''అతని సేన యజమాన పత్నిగా నుండును.

''ఈ మహాయజ్ఞానుష్ఠానము నందలి అతిరాత్రయాగము (జ్యోతిష్టోమ యాగమునందు ఒక రాత్రి చేయబడు యాగము) నందు ఘటోత్కచుడు శామిత్రకార్యము (యజ్ఞోపకరణములను సమకూర్చు పని) చేయగలడు.

''శ్రీ కృష్ణా! ద్రుపద మహారాజు చేసిన యజ్ఞముయొక్క ప్రారంభము నందే అగ్ని కుండమునుండి జన్మించిన వీర ధృష్టద్యుమ్నుడు ఈ రణయజ్ఞము నందు దక్షిణ లిచ్చు కార్యమును నెరవేర్చగలడు.

''శ్రీ కృష్ణా! నేను దుర్యోధనునకు ప్రియము చేయుటకు పాండవులను అతి కఠినముగా నిందించితిని. ఆ అయోగ్యకార్యము చేసినందుకు నాకు నేడు మిక్కిలి పశ్చాత్తాపము కలుగుచున్నది. అర్జునునిచేత రణభూమిలో నేను చంప బడినప్పుడు యీ యజ్ఞము యొక్క 'పునశ్చితి' (యజ్ఞానంతరము చేయబడు చయనము) అరంభమగును.

"జనార్దనా! భీమసేనుడు సింహనాదము చేయుచు దుశ్శాసనుని రక్తము పానము చేసినప్పుడు ఈ రణయజ్ఞముయొక్క 'సుత్య' (సోమరసము పిండుట) పరిపూర్ణమగును.

''ద్రుపదపుత్రుడైన ధృష్టద్యుమ్నుడు, శిఖండి, భీష్మ ద్రోణులను చంపి పడవేసినపుడు రణయజ్ఞము యొక్క 'అవసానములు' (మధ్యమధ్యన ఇవ్వబడు విరామసమయములు) గా నుండగలవు.

"భీమసేనుడు దుర్యోధనుని వధించినపుడు దుర్యోధనుడు ప్రారంభించిన యీ రణయజ్ఞము సమాప్తి చెందును.

"కేశవా! తమ సతులు-పుత్రులు-సంరక్షకులు చంపబడగా, ధృతరాష్ట్రుని కోడండ్రు, మనుమల భార్యలు గాంధారితో కలిసి కుక్కలు, గ్రద్దలు, కురరము (లకుముకిపిట్ట)ల వలె సమరాంగణమునందు ఏడ్చుచు తిరుగుచుందురు. అదియే ఆ యజ్ఞము యొక్క అవభృథము.

(యజ్ఞలోపములను నివారించుటకు యజ్ఞాంతమున చేయు హోమకర్మలు -స్నానము)

"మధుసూదనా! నీవు శాంతి స్థాపనము కొరకు చేయు ప్రయత్నముచేత విద్యావృద్ధులు, వయోవృద్ధులునైన క్షత్రియులు వ్యర్థముగా మృత్యువాత పడ కుందురుగాక! కేశవా! కురుక్షేత్రము మూడు లోకములకును పరమ పుణ్య తీర్థ స్థానము. క్షత్రియులు అక్కడకే పోయి శస్త్రఘాతములచేత మరణము పొందు దురుగాక!

"జనార్దనా! ఎంతకాలము వఱకు పర్వతములు నదులు నిలిచియుండునో అంతవరకు కీర్తికరమైన యీ యుద్ధగాథ అక్షయముగా నుండుగాక!

"వార్ష్ణేయా! బ్రాహ్మణులు క్షత్రియ పమాజమునందు ఈ మహాభారత యుద్ధవర్ణనము చేయుదురుగాక! ఈ కథాశ్రవణముచేత క్షత్రియులకు యశో ధనము కలుగుచుండుగాక!

"కేశవా! ఇట్లు మన యిరువురి నడుమ జరిగిన రహస్యమంత్రాలోచనము గుప్తముగా నుంచియే అర్జునుని నాతో యుద్ధము చేయుటకు తోడ్కొని రమ్ము."

అట్లు సంజయుడు ధృతరాష్ట్రునకు కర్ణ శ్రీకృష్ణుల రహస్యాలోచనము లను గూర్చి చెప్పి తరువాతి వృత్తాంత మిట్లు చెప్పదొడగెను:

పాండవుల విజయము అవశ్యం భావి యని శ్రీకృష్ణుడు కర్ణునకు చెప్పుట

''ధృతరాష్ట్రమహారాజా! శ్రీకృష్ణభగవానుడు కర్ణుడు చెప్పిన మాటలు విని బిగ్గరగా నవ్వి మందహాసము చేయుచు కర్ణునితో నిట్లనెను:

"కర్ణా! నేను నీకు చూపిన రాజ్యలాభోపాయము నీకు ఇష్టము లేనట్లు తోచుచున్నది. నేను నీకిచ్చిన పృథివీరాజ్యమును నీవు చేజేతుల పోగొట్టుకొన్నావు

''పాండవులకు విజయము తప్పక సిద్ధించును. ఇందులో సందేహములేదు. అర్జునుని కపిధ్వజమునందలి హనుమంతుడు నా కన్నులకు కన్పట్టుచున్నాడు. విశ్వకర్మ ఆ ధ్వజమునందు దివ్యమాయను రచించియుంచినాడు. అది యింద్ర ధ్వజమువలె ఉన్నతముగా ఉన్నది. ఆ ధ్వజముపైన విజయమును సిద్ధింపజేయు దివ్యములు, భయంకరములు నైన భూతములు కనబడుచున్నవి.

"రాధేయా! అర్జునుని అగ్ని సమానము, కాంతిమంతము నైన ఆ ధ్వజము ఒక ఆమడ యెత్తు కలదు. అది పైభాగమునందు, పార్శ్వములందు ఉన్న పర్వ తములచేత, వృక్షములచేత అడ్డుపడదు.

"యుద్ధమునందు నన్ను సారథిగా గొనివచ్చుచున్న శ్వేతవాహనుడైన అర్జునుడు ఐంద్ర ఆగ్నేయ వాయవ్యాద్యస్త్రములను ప్రయోగించుట చూచి నప్పుడు, పిడుగు ధ్వనివలె భయంకరమైన గాండీవంకారధ్వని నీ చెవులలో పడినప్పుడు నీకు ఇది కృత త్రేతా ద్వాపర యుగముల కాలమని తోచదు. కేవలము కలహరూపమైన భయంకర కలియుగమే నీకు కనబడును.

"సూతనందనా! జపహోమాదులయందు తత్పరుడై యుండు యుధిష్ఠిరుడు యుద్ధభూమియందు తన సేనను రక్షించుకొనుచు సూర్యుని వలె శత్రువుల కసాధ్యుడై శత్రుసేనను తపింపజేయుటను చూచినప్పుడు నీకు, గడచిన కృత యుగాదులు కనబడక కలియుగమే తోచును.

"రాధానందనా! యుద్ధమునందు మహాబలవంతుడైన భీమసేనుడు దుశ్శాసనుని రక్తము త్రాగి నృత్యము చేయుచు మదగజమువలె చెలరేగి శత్రుగజసేనను సంహరించుచుండుటను చూచినప్పుడు నీకు కలియుగమే కనపడును.

"ద్రోణ - భీష్మ - కృప - దుర్యోధన - శకునులు యుద్ధము కొఱకు ముందుకు సాగుచు వచ్చినప్పుడెల్ల అర్జునుడు త్వరగా వారందరి గమనమును అడ్డగించినప్పుడు దిగ్భ్రాంతి చెందిన నీకు అప్పుడు పూర్వయుగత్రయము కనపడదు. కలియుగమే గోచరించును.

"రాధేయా! యుద్ధభూమియందు అస్త్రశస్త్రముల దెబ్బలు తీవ్రముగా పడుచున్నప్పుడు, శత్రువీరుల రథములను విరుగగొట్టి నశింపజేయు నకుల - సహదేవులు రెండు మదగజములవలె ధృతరాష్ట్రపుత్రుల సేనను క్షోభింపజేయుటను నీవు కనులార చూచినప్పుడు నీ యెదుట కృతయుగముగాని, త్రేతాయుగముకాని ద్వాపరయుగముకాని ఉండదు కలియుగమే కనపడును.

"కర్ణా! నీవు ఇక్కడినుండి పోయి భీష్మ ద్రోణ కృపాచార్యులతో ఇట్లు చెప్పుము:

"ఇది సౌమ్య (మార్గశీర్ష - సుఖప్రద) మాసము. ఈ నెలయందు పశువులకు గడ్డి, వండుకొనుటకు పంటచెరకులు మొదలైనవి సులభముగా దొరకును. అన్నివిధములైన ఓషధులతో ఫలపుష్పములతో, వనము బాగుగా వృద్ధి చెంది యున్నది. పైర్లయందు ధాన్యము బాగుగా పండినది. ఈగలు తగ్గియున్నవి. భూమిపైన బురద యేమాత్రము లేదు. జలము స్వచ్ఛముగాను, రుచికరముగాను ఉన్నది. ఈ సుఖప్రదమైన మార్గశీర్ష మాసమునందు వేడిగాని చలిగాని యెక్కువ ఉండదు. నేటినుండి యేడు దినముల తరువాత ఎనిమిదవ దినము అమావాస్యయగును. ఆ తిథికి ఇంద్రుడు దేవత. ఆ దినమునందే యుద్ధము ప్రారంభించవలెను.

"కర్ణా! ఇక్కడ యుద్ధము కొఱకు వచ్చిన రాజులందరితోను నా మాటగా ఇట్లనుము:

"రాజులారా! మీ మనస్సులలో ఉన్న కోరిక అంతయు నేను పూర్తిగ నెరవేర్చెదను. దుర్యోధనుని వశమునందు ఎందఱు రాజులు, రాజకుమారులు ఉన్నారో వారందరు ఆయుధముల ద్వారా మృత్యువును చేరి ఉత్తమ లోకమును పొందగలరు."

కర్ణుడు పాండవవిజయ, కౌరవ పరాజయ సూచన లక్షణములను, తన స్వప్నమునున్ను వర్ణించుట

"ధృతరాష్ట్ర మహారాజా! శ్రీకృష్ణుడు చెప్పిన హితము, శ్రేయస్కరమునైన మాట విని కర్ణుడు ఆయన యెడల పూజ్యభావమును చూపుచు నిట్లనెను:

"భగవన్! నీవు అన్నియు తెలిసినప్పటికి నన్ను మోహములో ఎందుకు పడగొట్టదలచుచున్నావు? ఇప్పుడు ఈ భూమండలమునకు సంపూర్ణ నాశము కలుగనున్నది. దానిలో నేను, శకుని, దుశ్శాసనుడు, దుర్యోధనుడు- ఈ నలుగురము కేవలము నిమిత్తమాత్రులమే. కౌరవ పాండవులకు జరుగబోవు మహాభయంకర యుద్ధమునందు రక్త పంకములు ఏర్పడును. ఇందులో సంశయము లేదు.

"మధుసూదనా! దుర్యోధనుని పక్షమందున్న రాజులు, రాజపుత్రులు యుద్ధభూమి యందు అస్త్రశస్త్రాగ్నిలో కాలి, యమలోకమునకు పోవగలరు.

"నాకు భయంకరములైన అనేక దుస్స్వప్నములు కనబడుచున్నవి. అపశకునములు, దారుణములైన ఉత్పాతములు నా దృష్టికి గోచరించుచున్నవి. రోమాంచము కలిగించు వివిధోత్పాతములు దుర్యోధనుని పరాజయమును, యుధిష్ఠిరుని విజయమును చాటి చెప్పుచున్నవి.

"మహా తేజస్వియు, అతిభయంకరమునైన శనైశ్చరగ్రహము ప్రజాపతికి సంబంధించిన రోహిణీ నక్షత్రమును పీడించుచు ప్రపంచ ప్రాణులకు అధికాధిక బాధ కలిగించుచున్నది.

"మధుసూదనా! అంగారకగ్రహము జ్యేష్ఠానక్షత్రము నుండి వక్రగతితో అనూరాధా నక్షత్రముపైన రాగోరుచున్నది. ఈ గ్రహస్థితి రాజ్యాధికారమందున్న రాజుయొక్క మిత్రమండలికి వినాశము కలుగునా యన్నట్లు సూచించుచున్నది. ఇవి యన్నియు చూడగా నిశ్చయముగానే కౌరవులకు చాల భయము కలుగనున్నదని తోచుచున్నది. విశేషించి 'మహాపాత' నామముగల గ్రహము చిత్తానక్షత్రమును పీడించుచున్నది. అది రాజులకు వినాశసూచకము.

"శ్రీకృష్ణా! చంద్రుని కళంకము మాసిపోయినట్లు కనబడుచున్నది. రాహువు సూర్యుని సమీపించుచున్నాడు. భూమి కంపించుచున్నది. గజములు ఒండొంటిని ఢీకొనుచు వికారముగ ఘీంకరించుచున్నవి. గుఱ్ఱముల కనులనుండి

అశ్రువులు రాలుచున్నవి. అవి మేత, నీరు తృప్తిగా తీసుకొనుటలేదు. కొంచెము తినినను గజాశ్వములు, మనుష్యులు అధికముగా మలము విడుచున్నారు. మధుసూదనా! ఈయన్ని అపశకునములు దుర్యోధనుని సేనలో కనబడుచున్నవి. ఇవి యతనికి అపజయ సూచకములు.

"కేశవా! మృగములన్నియు దుర్యోధనుని సేనకు ఎడమవైపుగా పోవుచున్నవి. అశరీరవాణి అతనికి భయంకరముగ వినబడుచున్నది. ఇది అతనికి అపజయసూచకము.

"ఈ విధముగనే గ్రద్దలు, రాబందులు, కొంగలు, డేగలు, తోడేళ్లు, ఈగలు, గుంపులుగా కౌరవుల వెనుక పరిగెత్తుచున్నవి. కౌరవుల సేనలో భేరీ వాద్యములు వాయింపబడినప్పటికిని శబ్దము బయలు వెడలకున్నది.

"దుర్యోధనుని సేనలో బావులు మొదలైన జలాశయములు ఎండిపోవుచున్నవి. గోవులు ఎద్దులవలె రంకె వేయుచున్నవి. ఇవి అతని పరాజయ సూచకములు.

"కృష్ణా! ఆకాశమునుండి మేఘములు రక్తమాంసములను వర్షించుచున్నవి. సూర్యునితో గూడిన గంధర్వ నగరము (ఆకాశమునందు అనిష్ట సూచకముగా కనవడునొక నగరమువంటిది. అది కనపడిన నెల తరువాత వస్తువుల ఆకారము మారుట,బంగారము రంగు మారుట మొదలగు దేశారిష్ట సూచనలు కలుగును. దానికే గంధర్వనగరమని పేరు.) స్పష్టముగ కన్పట్టుచున్నది. సూర్యునితో ఆకాశమునందు ప్రాకారములు, అగడ్తలు, నాలుగు గోడలు, సుందరములైన బహిర్ద్వారములు కూడ ఆ గంధర్వ నగరమందు కనబడుచున్నవి.

''సూర్యునిచుట్టు నల్లని పరివేషమండలము కనబడుచున్నది. సూర్యోదయాస్తమయ సంధ్యలయందు ఒక పెద్ద నక్క మహాభయమును సూచించుచు భయంకర ధ్వనితో ఏడ్చుచున్నది. ఇది కూడ కౌరవులకు పరాజయ లక్షణము.

"మధుసూదనా! ఒక రెక్క, ఒక కన్ను, ఒక కాలు కల పక్షులు అతి భయంకరముగా ధ్వనించుచున్నవి.

''సంధ్యాకాలమునందు నల్లని కంఠములు, ఎఱ్ఱని కాళ్లు కల భయంకర పక్షులు ఎదురుగా వచ్చుచున్నవి. తూర్పుదిక్కు ఎఱ్ఱగాను, దక్షిణ దిక్కు నల్లని శస్త్రములు వర్ణము గలదిగను, పడమటిదిక్కు పచ్చిగానున్న మంటి పాత్రల

రంగు (బూడిదరంగు) గను, ఉత్తరదిక్కు శంఖమువలె తెల్లగాను ఉండును. ఈ విధముగా ఆయా దిక్కుల రంగులు శాస్త్రమందు చెప్పబడినవి.

"కృష్ణా! దుర్యోధనుని సేనలో పూర్వము చెప్పబడిన అపశకునములేకాక వివిధ వర్ణములుగల ఈ దిక్కులన్నియు ఏకాకారముగ నుండుచున్నట్లు కనబడుచున్నవి. ఇవి యన్నియు దుర్యోధనునకు అపజయమును సూచించుచున్నవి.

"వాసుదేవా! భీష్మద్రోణులు, నేను, దుర్యోధనుడు - మేము నలుగురము ఒంటెలు కట్టిన రథమునందు కూర్చొని దక్షిణ దిక్కునకు పోవుచుంటిమి. ప్రభూ! మేమందరమూ కొన్ని దినములలోనే యమలోకము చేరెదమని ఈ యపశకునముల ఫలము ఉండవచ్చును.

"జనార్దనా! దుర్యోధనుని సేనలో అశ్వత్థామ, కృపాచార్యుడు, యదు వంశీయుడైన కృతవర్మ - ఈ ముగ్గురు మాత్రమే తెల్లని తలపాగలతో ప్రకాశించుచున్నట్లు, ఇతర రాజులందరును ఎఱ్ఱని తలపాగలు ధరించినట్లును నాకు స్వప్నమున కనబడినది. కాబట్టి, పై ముగ్గురు మాత్రమే జీవించియుండి, యితరులందరు నశింపనున్నట్లు తోచుచున్నది.

సుస్వప్నములు

"ముకుందా! పాండవుల వాహనములు ప్రసన్నములుగా నున్నవి. మృగములు ఆ సేనకు కుడివైపుగా పోవుచున్నవి.

"నెమళ్లు, శుభశకున సూచకములైన మృగములు, హంసలు, సారస పక్షులు, వాన కోయిలలు, చకోర పక్షులు గుంపులుగా పాండవులను అనుసరించుచున్నవి.

"ఈ లక్షణములు వారికి విజయము సూచించుచున్నవి.

"పాండవుల సేనలోని పటహములు (తప్పెటలు) వాయింపకుండగనే మ్రోగుచున్నవి.

"అచ్యుతా! యుధిష్ఠిరుడు వేయి స్తంభముల భవనములపైవ సోదరులతో పాటు ఎక్కుచున్నట్లు నేను స్వప్నముయొక్క చివరి భాగములో చూచినాను. ఆ సోదరుల తలలపైన తెల్లని తలపాగలు, శరీరములందు శుభ్రమైన తెల్లని వస్త్రములున్ను కనబడుచుండెను. వారు కూర్చొనిన ఆసనములు కూడ తెల్లగా కనపడెను.

"జనార్దనా! పృథివియంతయు రక్తముచేత మలినమై ప్రేగులచేత చుట్టబడినట్లు స్వప్నాంతమున నాకు కనబడెను అమిత తేజస్వియైన యుధిష్ఠిరుడు తెల్లని యెముకల గుట్టపైన కూర్చొని బంగారు పాత్రమునందు ఉంచబడిన నేయి కలిపిన పాయసమును మిక్కిలి సంతోషముతో తినుచున్నట్లు స్వప్నమందు నేను చూచితిని.

కృష్ణా! యుధిష్ఠిరుడు ఈ పృథివిని మ్రింగుచున్నట్లు కూడ స్వప్నమునందు చూచితిని ఈ శకునములనుబట్టి చూడగా నీవు ఇచ్చిన భూమిని యుధిష్ఠిరుడే తప్పక అనుభవించగలడని తోచుచున్నది.

"భయంకర కార్యములు చేయు భీమసేనుడు కూడ చేతిలో గద ధరించి ఉన్నత పర్వతముపై నెక్కి ఈ పృథివిని మ్రింగుచున్నట్లు స్వప్నములో కనపడెను. అందువలన అతడు ఈ మహాయుద్ధమునందు మమ్మందరను సంహరించగలడని స్పష్టముగా తెలియుచున్నది. ధర్మము ఉన్న వైపే విజయము కలుగునని కూడ నాకు స్పష్టముగా తెలిసినది.

''శ్రీకృష్ణా! ఈ విధముగనే అర్జునుడు కూడ నీతోపాటు శ్వేత గజముపైన ఆరూఢుడై తన కాంతిచేత ప్రకాశించుచు స్వప్నమునందు నాకు కనబడెను కాబట్టి కృష్ణా! మీరందరు యుద్ధమునందు దుర్యోధనాదులను, సమస్త రాజులను వధించగలరు. ఇందులో నాకు ఏమాత్రము సందియము లేదు.

"నకుల సహదేవ సాత్యకులు తెల్లని భుజకీర్తులు, కంఠహారములు, వస్త్రములు, పుష్పమాలలున్ను ధరించి, శ్రేష్ఠములైన నరవాహనము (పల్లకీ)ల నెక్కి పోవుచున్నట్లు స్వప్నమునందు నాకు కనబడిరి ఆ ముగ్గురును శ్వేత చ్ఛత్రముల చేత, శ్వేత వస్త్రముల చేత శోభిల్లుచుండిరి.

ధృతరాష్ట్రా! కర్ణుడు చెప్పిన మాటలు విని శ్రీకృష్ణభగవానుడు అతనితో నిట్లనెను:

''కర్ణా! ఈ భూమండలమునకు తప్పక వినాశకాలము సంప్రాప్తించినది. అందుచేతనే నా యుపదేశము నీ మనస్సుకు నచ్చలేదు. నాయనా! ప్రాణులకు వినాశకాలము సమీపించినప్పుడు అన్యాయము కూడ న్యాయముగా తోచుచు, ఆ యధర్మము వారి హృదయములనుండి తొలగిపోవదు.''

"శ్రీకృష్ణుని మాటలు విని కర్ణుడిట్లనెను:

''శ్రీకృష్ణ పరమాత్మా! వీర క్షత్రియులకు వినాశకరమైన ఈ మహా యుద్ధము నుండి మేము బ్రతికి బయటపడిన యెడల మరల నీ దర్శనము చేసెదము.

"అథవా - కృష్ణా! ఇక మేము నిన్ను స్వర్గమునందే దర్శించెదము. ఇది నిశ్చయము. అక్కడ నేటివలెనే మరల నిన్ను కలిసి నీ యుపదేశవాక్యములు వినుభాగ్యము మాకు కలుగుగాక!''

''ధృతరాష్ట్రా! ఈ విధముగా సంభాషణము జరిగిన తరువాత కర్ణుడు శ్రీకృష్ణ భగవానుని గాఢముగ ఆలింగనము చేసికొని అతని యాజ్ఞ తీసికొని ఆ రథము వెనుక భాగము నుండి దిగిపోయెను.

"తరువాత కర్ణుడు సువర్ణభూషితమైన తన రథము నెక్కి ధైర్యముతో మనవారితో పాటు తిరిగివచ్చెను.

''తరువాత సాత్యకి సహితుడై శ్రీకృష్ణుడు త్వరత్వరగా పొమ్మని సారథియైన దారుకుని హెచ్చరించుచు శీఘ్రగమనములో ఉపప్లవ్యనగరమువైపు పోయెను.

''అట్లు సంజయుడు ధృతరాష్ట్రునితో శ్రీకృష్ణకర్ణుల రహస్యభాషణమును గూర్చి చెప్పెను"అని వైశంపాయనుడు చెప్పి, తరువాతి కథను జనమేజయునకు ఇట్లు చెప్పదొడగెను:

(రహస్యభాషణములు సంజయునకు మాత్రమే తెలియునట్లు అనతనికి వ్యాసుని వరము కలదు)

విదురుని మాటలు విని కుంతి యుద్ధపరిణామము చేత బాధపడుచు కర్ణునికడకు పోవుట

''జనమేజయా! శ్రీకృష్ణుడు కౌరవుల కడనుండి తిరిగి పాండవుల కడకు పోయెను.

"తరువాత విదురుడు కుంతీదేవికడకు పోయి శోకముతో మెల్లమెల్లగా నిట్లనెను:

''చిరంజీవులైన పుత్రులను కనిన దేవీ! కౌరవ పాండవులకు యుద్ధము జరుగగూడ దనియే నేను ఎల్లప్పటికిని కోరుచున్న సంగతి నీకు తెలియును

కదా! దీని కొఱకు నేను అనేక పర్యాయములు దుర్యోధనునితో ఆక్రోశ పూర్వకముగ చెప్పితిని, కాని, అతడు నామాట నంగీకరించలేదు.

''దేవీ! యుధిష్ఠిరమహారాజు, చేది - పాంచాల - కేకయ దేశ సైనికులు, భీమార్జున - నకుల - సహదేవ - శ్రీకృష్ణ - సాత్యకులు మొదలైన ఉత్తమ సహాయకులతో పరిపూర్ణుడై యున్నాడు.

"ఇప్పుడు యుధిష్ఠిరుడు యుద్ధసన్నద్ధుడై ఉపప్లవ్య నగరమునందు సేనలను కూర్చుకొనియున్నాడు. ఐనను, సోదరులయందు బంధువుల యందున్న మైత్రి గలవాడై ధర్మ సమ్మతముగానే ఉండగోరుచున్నాడు. అతడు బలవంతుడైనను దుర్బలునివలె సంధి చేసికొన గోరుచున్నాడు.

''దేవీ! ధృతరాష్ట్రుడు వృద్ధుడైనప్పటికిన్ని శాంతుడగుట లేదు. పుత్రులు శూరులు గదాయని తలచి, గర్వముతో పిచ్చివాడై అధర్మ మార్గమునందే నడచుచున్నాడు.

"సైంధవ - కర్ణ - దుశ్శాసన - శకునుల దుర్బుద్ధికారణముగా కౌరవ పాండవులలో భేదము దినదినము వృద్ధి పొందుచున్నది. కౌరవులు పాండవులకు పదునాల్గవ సంవత్సరమునందు రాజ్యమును తిరిగి యిచ్చుటకు చేసిన ప్రతిజ్ఞను పాలించలేదు.

''పరస్పరము నశింపజేయునట్టి అధర్మ కార్యములు కూడ ధర్మసమ్మతములుగా కౌరవులకు తోచుచున్నవి. వారి యీ అధర్మమువల్ల కలిగిన దుష్ఫలము తప్పక అనుభవించెదరు.

''అధర్మమునకు ఫలము, దుఃఖము - వినాశమే కదా!

''పృథాదేవీ! కౌరవులు ధర్మమని తలచి చేయుచున్న ఈ బలాత్కారమును గూర్చి ఎవరికి చింత యుండదు? కృష్ణభగవానుడు సంధి ప్రయత్నమందు సఫలుడు గాకుండ వెడలిపోయెను. అందుచేత పాండవులుకూడ ఇప్పుడు యుద్ధము కొరకు మహా ప్రయత్నము చేసెదరు ఈ విధముగా అధర్మము సమస్త వీరులను నశింపజేయును. ఈ విషయములన్నియు చింతించుచు నాకు రేయింబవళ్ళు నిద్రపట్టకున్నది."

జనమేజయా! విదురుడు ఇరుపక్షముల హితముగోరి ఈ మాటలు చెప్పెను. విదురుని మాటలు విని కుంతీదేవి దుఃఖితురాలై లేచి దీర్ఘముగాను ఉష్ణముగాను నిట్టూర్చుచు మనస్సులోనే యిట్లు చింతించెను:

"ఛీ! ధనమెంత నీచమైనది? ధనము కొఱకు బంధువులందఱు పరస్పరము సంహరించుకొనబోవనున్నారు. ఈ యుద్ధమునందు బంధువులకు పరాభవము కలుగును,, పాండవ - చేది - పాంచాల - యాదవులు ఏకమై యుద్ధము చేయబోవుచున్నారు ఇంతకన్న అధికముగా దుఃఖకర విషయ మేముండును?

''యుద్ధమునందు నాకు గొప్ప దోషము కనబడుచున్నది. కాని,యుద్ధము కాకున్నను పాండవులకు పరాభవము కలుగుట స్పష్టము. నిర్ధనుడు మృత్యువును కోరుట మంచిది. కాని బంధువులను, నశింపజేసి విజయము సాధించుట ఎవ్వటికిని మంచిదిగాదు.

''ఇట్లు చింతించుచున్న నా మనస్సునందు మిక్కిలి దుఃఖము కలుగుచున్నది. భీష్మ ద్రోణ కర్ణులు కూడ దుర్యోధనుని కొఱకు యుద్ధమునందు దిగబోవుచున్నారు. దీనివలన నాకు భయము ఇతోధికముగ కలుగుచున్నది.

''ద్రోణాచార్యుడు ఎల్లప్పుడును మా హితమునే కోరుచుండును. అయన తన శిష్యులతో ఎప్పుడు కూడ యుద్ధము చేయడు.

''ఇట్లే భీష్మ పితామహుడు కూడ పాండవులయందు హృదయపూర్వకముగ స్నేహము కలవాడై యున్నాడు.

"కాని కర్ణుడొక్కడు మాత్రమే మిథ్యాదృష్టి కలవాడై యున్నాడు. అతడు మోహముచేత దుర్బుద్ధియైన దుర్యోధనునే అనుసరించి యుండును. ఈ కారణము చేతనే పాపాత్ముడైన కర్ణుడు సర్వదా పాండవులను ద్వేషించుచుండును.

"అతడు పాండవులకు గొప్ప ముప్పు కలిగించుటకు కంకణము కట్టుకొని యున్నాడు. అతడు మహాబలవంతుడు. ఈ విషయము ఇప్పుడు నా మనస్సును దహించుచున్నది.

"కాబట్టి, నేడు నేను కర్ణుని మనస్సు పాండవులయందు ప్రసన్నముచేయుటకు అతని కడకు పోయెదను. నాకు అతనికిగల వాస్తవమైన సంబంధమును గూర్చి తెలిపెదను.

''నేను నా తండ్రి యింట నున్నప్పుడు దుర్వాసునకు పరిచర్యచేసి అతనిని మెప్పించి యుంటిని. ఆయన నాకొక మంత్రము నుపదేశించెను "దానిని ఉచ్చరించి ఆవాహనము చేసి దేవతలలో నెవరినైనను నాకడకు పిలువగలను" అని ఆ మహాముని నాకు వరమిచ్చియుండెను.

''నా తండ్రి కుంతిభోజునకు నాయందు మిక్కిలి ప్రేమ యుండెను. అప్పుడు నేను రాజాంతఃపురమునందుండి పీడిత హృదయముతో మంత్రముయొక్క బలాబలములను, బ్రాహ్మణునియొక్క వాక్శక్తిని గూర్చి అనేక విధములుగా చింతించుచుంటిని.''

''స్త్రీ స్వభావము, దానిపైన బాల్యావస్థ-ఈ రెండు కారణములుగా మాటి మాటికి ఈ ప్రశ్నమునే ఎల్లప్పుడు చింతించుచుంటిని. ఆ దినములలో ఒక విశ్వాసపాత్రురాలైన దాది నన్ను రక్షించుచు ఉండెను. నా సఖురాండ్రు నన్ను చుట్టుకొని యుండిరి.

''నేను నాపైన రానున్న దోషముల నన్నింటిని నివారించుచు నా తండ్రి దృష్టిలో నా సత్ప్రవర్తనను రక్షించుకొనుచుంటిని.

''నేను ఏమి చేయుదును? దేనివలన నాకు పుణ్యము లభించును? దేనిచేత నేను నిరపరాధిని నగుదును? అని చింతించితిని.

"అట్లు చింతించి నేను మనస్సులోనే ఆ బ్రాహ్మణ దేవతయైన దుర్వాసునకు నమస్కరించి కుతూహలముచేత, అవివేకము చేతను ఆ మంత్రమును ఉచ్చరించుచు దానిని ప్రయోగించుటకు ఆరంభించితిని.

''తత్పరిణామముగా కన్యావస్థలో నుండగనే నాకు సూర్యభగవానుని సంయోగము ప్రాప్తించెను.

''అప్పుడు నాకు గర్భమై పుత్రుడు కలిగెను. అతడే కర్ణుడు. అతని సోదరుల హితము కొఱకు నేను చెప్పబోవు లాభదాయకమైన మాటను అతడెందుకు అంగీకరింపడు?''

కర్ణుని కడకు కుంతీదేవి పోవుట

జనమేజయా! ఈ విధముగా తన కర్తవ్యమును నిశ్చయించుకొని కుంతీదేవి అభీష్టప్రయోజన సిద్ధికొరకు కర్ణుని చూచుటకు గంగానదీ తీరమునకు పోయెను.

అప్పుడక్కడ దయాళువు సత్యశీలుడునైన కర్ణుని ముఖమునుండి వేద ధ్వని గంభీరముగా వినపడెను. కర్ణుడు తన రెండు భుజములను పైకెత్తి పూర్వాభిముఖుడై జపము చేయుచుండెను.

అప్పుడు కుంతీదేవి దీనురాలై కర్ణుని జప సమాప్తిని ఎదురుచూచుచు తన కార్య సాధనము కొరకు అతని వెనుక నిలుచుకొని యుండెను.

జనమేజయా! పాండుపత్నియైన కుంతి అక్కడ సూర్యుని తాపముచేత పీడితురాలై కమలమాలికవంటి కర్ణుని ఉత్తరీయవస్త్రముయొక్క నీడలో నిలువబడియుండెను.

సూర్యుడు తన వీపువైపు తాపము కలిగింపనంతవరకు (సూర్యుడు తూర్పుదిక్కు నుండి పశ్చిమమునకు పోవునంతవరకు) కర్ణుడు జపము చేసి నియమపూర్వకముగా వ్రతమును పాలించి వెనుకకు తిరిగెను.

అప్పుడు తన యెదురుగ నున్న కుంతీదేవిని చూచి చేతులు జోడించి నమస్కరించి ఆమెవద్ద నిలుచుకొనెను.

ధర్మాత్ములలో ఉత్తముడు, అభిమానవంతుడు, మహాతేజస్వి, సూర్యపుత్రుడు 'వృషుడు' అను నామాంతరముగల కర్ణుడు కుంతీదేవికి యథోచిత సత్కారము చేసి నమస్కరించి మందహాసము చేయుచు ఆమెతో నిట్లనెను:

నీవు పుత్రుడవని కుంతి కర్ణునకు చెప్పి పాండవ పక్షములో చేరుమని అతనిని కోరుట

''దేవీ! నేను రాధకు, అధిరథునకు పుత్రుడైన కర్ణుడను. నీ చరణములకు నమస్కరించుచున్నాను. నీవు శ్రమ తీసికొని ఇంత దూరము ఎందుకు వచ్చినావు? తెలుపుము. నేను నీకు ఏమి సేవ చేయుదును?"

జనమేజయా! కర్ణుని మాటలు విని కుంతీదేవి యీ విధముగ బదులు చెప్పెను:

''కర్ణా! నీవు రాధా పుత్రుడవు కావు. కుంతీ పుత్రుడవు. నీ తండ్రి అధిరథుడు కాడు. నీవు సూతకులమునందు పుట్టలేదు. ఈ నా మాట వాస్తవమని తెలిసికొనుము.

"నీవు నా కన్యకావస్థలో నా గర్భమునుండి పుట్టిన నా జ్యేష్ఠపుత్రుడవు. నేను కుంతి భోజమహారాజు గృహమునందు ఉన్నపుడు గర్భధారణ చేసి నిన్ను కంటిని. అందుచేత కొడుకా! నీవు పార్థుడవే. (కుంతీకుమారుడు)

''పుత్రా! జగత్ప్రకాశకారకుడు, ఉష్ణకారకుడునైన సూర్యభగవానుడు శస్త్రధారులలో శ్రేష్ఠుడైన నీవంటి వీరపుత్రుని నా గర్భమునుండి కనెను,

కుమారా! నా తండ్రి గృహమునందు నిన్ను కంటిని. జన్మకాలమునుండియే నీవు సహజ కవచ కుండలములను ధరించి, దేవలోక బాలకునివలె శోభాయమానుడవై యుంటివి.

"కొడుకా! నీవు నీ సోదరులకు అపరిచితుడవైయుండి, ధృతరాష్ట్ర పుత్రులను సేవించుచున్నావు. అది నీకు ఎప్పుడును యోగ్యమైనది కాదు. తండ్రిని, గురుజనమును, పుత్రునియందే ప్రేమదృష్టిగల తల్లినిన్ని పుత్రుడు సంతోషపరచుచుండవలెనని, ధర్మశాస్త్రములందు ఇదియే ఉత్తమ ధర్మమనియు చెప్పబడియున్నది.

"పూర్వము అర్జునుడు సంపాదించినట్టిదియు, దుష్టులు లోభముచేత అపహరించినట్టిదియునైన యుధిష్ఠిరుని రాజ్యలక్ష్మిని నీవు ధృతరాష్ట్రపుత్రుల నుండి లాగుకొని నీ సోదరులతో పాటు అనుభవింపుము.

"పుత్రా! నేడు స్నేహపూర్వకముగా నీవు, అర్జునుడు కలిసికొనుట ఉత్తమ సోదరోచితమైన పని. అట్టి మీ కలయికను కౌరవులు చూచెదరుగాక! దుష్టులు తలపంచెదరుగాక! కర్ణార్జునులు బలరామకృష్ణులవలె అన్యోన్య ప్రేమతో నుండెదరు గాక! మీ యిరువురు ఒకటే మనస్సు కలవారైనచో మీకు ప్రపంచమునందు అసాధ్యకార్యము ఏదియుండును?

"కర్ణా! మహాయజ్ఞవేదియందు దేవగణముచేత పరివృతుడై యున్న బ్రహ్మదేవుడు శోభిల్లునట్లు నీవు నీ ఐదుగురు సోదరులచే చుట్టబడి శోభిల్ల గలవు. ఉత్తములైన సోదరుల మధ్య సర్వగుణసంపన్నుడవైన నీవు జ్యేష్ఠభ్రాతవుగా కుంతీపుత్రుడవుగా నుండుము. నీకు సూతపుత్రుడు అను పేరు ఇకపైన నుండగూడదు."

కుంతికి కర్ణుడు ఉత్తరము చెప్పి అర్జునుని దప్ప ఇతర పాండవులను నలుగురిని వధించనని ప్రతిజ్ఞ చేయుట

జనమేజయా! ఆ విధముగ కుంతీదేవి చెప్పుచుండగనే సూర్యమండలము నుండి ఒక అశరీర వాణి వినబడెను. అది సూర్యభగవానుడే చెప్పియుండెను. ఆ వాణియందు పితృప్రేమ నిండియుండెను. ఆ వాణి అనుల్లంఘనీయమైనదిగా తోచుచుండెను. కర్ణుడు దానిని స్పష్టముగా వినెను.

"ఆ అశరీరవాణి యేమనగా -

"నరశ్రేష్ఠకర్ణా! కుంతి సత్యమునే చెప్పుచున్నది. నీవు తల్లి యాజ్ఞను పాలింపుము. ఆమె యాజ్ఞను పూర్తిగా పరిపాలించుటచేత నీకు శ్రేయస్సు, మంగళము కలుగును."

జనమేజయా! తల్లి కుంతీదేవి, తండ్రి సాక్షాత్తు సూర్యభగవానుడున్ను అట్లు చెప్పిన తరువాత కూడ సత్యమైన ధైర్యము గల కర్ణుని బుద్ధిచలించక కుంతీదేవితో నిట్లనెను:

"రాజపుత్రీ! నీవు చెప్పిన మాటపైన నాకు శ్రద్ధ కలుగకున్నది. నీ యాజ్ఞాపాలనము నాకు ధర్మపాలనము వంటిదే. అది నాకు ధర్మద్వారము.

"ఐనను, నేను నీమాట యందు విశ్వాసము ఉంచను. నీవు నా యెడల గొప్ప అత్యాచారము చేసితివి. అది నాకు కష్టము కలిగించుచున్నది. నీవు నన్ను నీటిలో పడవేసితివి. అది నా యశస్సును కీర్తిని, నశింపజేసినది.

(యశస్సు శౌర్యాదుల వలన ఏర్పడునది, కీర్తి దానాదులవలన వచ్చునది. ఈ రెండు పదములు ఏకార్థకములైనను వ్యాకరణమునందు చూపబడిన ఈ యర్థభేదము ఇక్కడ గ్రహింపనగును)

"తల్లీ! నేను క్షత్రియకులమునందు పుట్టినను, నీ వలన క్షత్రియోచిత సంస్కారములకు దూరుడనైతిని. నీవు నాకు చేసిన అహితము కష్టదాయకమైన కార్యము. అట్టిపని నా శత్రువుకూడ నాకు చేయజాలడు. నాకు క్షత్రియోచితముగ జాతకర్మాదులు చేయవలసినప్పుడు నీవు నాపైన దయచూపలేదు. ఇప్పుడు క్షత్రియోచిత సంస్కార సమయము గడచిన తరువాత నన్ను క్షత్రియధర్మము వైపు ప్రోత్సహించుచున్నావు.

"పూర్వము తల్లివిగా నా హితము నెప్పుడు గూడ నీవు కోరలేదు. నేడు నీ హితము కొఱకై నా కర్తవ్యము నుపదేశించుచున్నావు.

"శ్రీకృష్ణునితో కలిసియున్న అర్జునునివలన నేడు ఏ వీరుడు భయపీడితుడుగా నుండడు? ఇప్పుడొకవేళ నేను పాండవులతో కలిసిన యెడల కర్ణుడు అర్జునునకు భయపడి పోయినాడని ఎవడు అనుకొనడు? ఇంతకు పూర్వమెప్పుడు కూడ నేను పాండవుల సోదరుడనని ఎవ్వనికిని తెలియదు. యుద్ధ సమయము

నందు నా యీ సంబంధము బయలుపడెను. ఇప్పుడు నేను పాండవులతో కలిసిన యెడల క్షత్రియులందరు నన్నేమందురు?

"ధృతరాష్ట్రపుత్రులు నాకు అన్ని విధములైన కోర్కెలు తీర్చుచు నేను కోరిన వస్తువులన్నియు ఇచ్చిరి. నన్ను సుఖపరచుచు ఎల్లప్పుడు గౌరవించిరి. వారు నాకు చేసిన ఆ యుపకారమును నేను ఇప్పుడెట్లు మరచి, వారి కోరిక నిష్ఫలము చేయగలను?

"ఎవరు శత్రువులతో వైరము పెట్టుకొని సర్వదా నన్ను ఉపాసించుచు వసువులు ఇంద్రునికి నమస్కారము చేయునట్లు నాకు సర్వదా నతమస్తకులై నా యెదుటనుందురో, ఎవరు నా ప్రాణశక్తియందు విశ్వాసముంచి శత్రువులయెదుట కాలూని దృఢముగా నిలుచుటకు ధైర్యము వహించి నన్ను ఆదరించు చున్నారో అట్టి ధార్తరాష్ట్రుల మనోరథముల నిప్పుడు నేను ఎట్లు ఛిన్న భిన్నము చేయగలను?

''ఎవరు నన్నే నౌకగా చేసికొని దాటశక్యముకాని యుద్ధ సాగరమును నా సహాయముతో దాటగోరుచున్నారో, ఎవరు నాయందు విశ్వాసము చేతనే అపారమైన ఈ యుద్ధ సంకటమును గడవగోరుచున్నారో, అట్టి ధాతరాష్ట్రులను ఇట్టి సంకట సమయమునందు ఎట్లు విడువగలను?

''అమ్మా! దుర్యోధనుని ఆశ్రయించి జీవనమును గడుపుచున్న వారికి అతని యుపకారమునకు ప్రత్యుపకారము చేసి ఋణ విముక్తులగుటకు ఇప్పుడు యోగ్యమైన అవసరము వచ్చి యున్నది. ఇట్టి సమయమునందు నేను నా ప్రాణ రక్షణము కూడ లెక్కలేయక ఋణమునుండి విముక్తుడ నయ్యెదను.

''జననీ! ఎవరు ఇతరులచేత బాగుగా పోషింపబడి కృతార్థులై కూడ వారి యువకారమునకు ప్రత్యువకారము చేయు సమయము ఆసన్నమైనప్పుడు స్థిర చిత్తములేక పాపాత్ములై పూర్వము చేయబడిన ఉపకారము నందు దృష్టి పెట్టక మారిపోవుదురో, అట్టివారు ప్రభువుయొక్క అన్నమును అపహరించువారుగాను, ఉపకారియైన రాజునకు అపరాధము చేయువారును అయ్యెదరు. అట్టి పాపాచారులైన కృతఘ్నులకు ఇహ లోకమునందును పరలోకమునందును సుఖము లభింపదు.

''దేవీ! నేను నీతో అసత్యమాడుట లేదు. ధృతరాష్ట్రపుత్రులవైపున ఉండి, వారి విజయము కొఱకు నేను నా బలపరాక్రమ శక్తులన్నియు ప్రయోగించి నీ పుత్రులతో యుద్ధము చేసెదను.

"కాని, నీవు తల్లివి కాబట్టి నీకు ఒక్కమాట యిచ్చెదను. అది యేమనగా నేను ధైర్య పరాక్రమములతో యుద్ధము చేయుచున్నప్పుడు కూడ దయాభావముతోను సజ్జనోచిత సదాచారముతోను వ్యవహరించుచుండెదను. ఈ కారణము చేత నీ యాజ్ఞ నాకు లాభదాయకమైనను దానిని నేడు అంగీకరింపను.

"కాని అమ్మా! నీవు నా వద్దకు శ్రమపడి వచ్చితివి. నీ రాక వ్యర్థము కాగూడదు. యుద్ధమునందు నీ నలుగురు పుత్రులు నా వశమునందు చిక్కుకొని వధకు అనువైన పరిస్థితిలో నున్నప్పటికి కూడ నేను ఆ నలుగురిని సంహరింపను. ఆ నలుగురు అర్జునుడు తప్ప యుధిష్ఠిర - భీమ - నకుల - సహదేవులని తెలిసికొనుము.

"యుధిష్ఠిరుని సైన్యములో అర్జునునితోనే నేను యుద్ధము చేసెదను. యుద్ధమునందు అర్జునుని నేను సంహరించినప్పుడు నాకు యుద్ధఫలము ప్రాప్తించగలదు. లేదా - అర్జునుని చేత నేను చంపబడిన యెడల నాకు అకళంకమైన కీర్తి కలుగును."

''దేవీ! ఎట్టి పరిస్థితిలో కూడ నీకు ఐదుగురే పుత్రులు మిగిలియుండగలరు. అర్జునుడు చంపబడినచో కర్ణునితో ఐదుగురు, నేను చంపబడినచో అర్జునునితో నీకు ఐదుగురు పాండవులు ఉండగలరు.

జనమేజయా! ఇట్లు కర్ణుడు చెప్పిన మాటలను విని, ధైర్యము పీడక అచంచలముగా నున్న తన పుత్రుని కర్ణుని కుంతీదేవి హృదయముతో ఆలింగనము చేసికొని దుఃఖముచేత వణకుచు నిట్లనెను:

"కర్ణా! దైవము గొప్ప బలవంతమైనది. నీవు చెప్పినట్లే అగుగాక! ఈ యుద్ధము ద్వారా కౌరవుల సంహారము అగును. శత్రునిషూదనా! నీవు నీ నలుగురు సోదరులకు అభయప్రదానము చేసితివి. యుద్ధసమయమునందు ఆ నలుగురిని విడిచి పెట్టుటకు నీవు చేసిన ప్రతిజ్ఞను జ్ఞప్తియందుంచుకొని దృఢముగా నీ మాట నిలిపికొనుము. కుమారా! నీకు శ్రేయస్సు, మంగళము కలుగుగాక! నీకు ఏలాటి కష్టములు కలుగకుండుగాక!"

''అట్లు కుంతీదేవి కర్ణుని ఆశీర్వదించి, కోరినప్పుడు కర్ణుడు కూడ 'తథాస్తు' అని చెప్పి ఆమె మాటను అంగీకరించెను. తరువాత వారిద్దరు తమ తమ స్థానములకు పోయిరి.''

యుధిష్ఠిరుడు అడుగగా శ్రీకృష్ణుడు కౌరవ సభలో భీష్ముని మాటలు చెప్పుట

జనమేజయా! శత్రుదమనుడైన శ్రీకృష్ణభగవానుడు హస్తినాపురము నుండి ఉపప్లవ్యనగరమునకు పోయి, హస్తిపురమునందు జరిగిన వృత్తాంత మంతయు జరిగినది జరిగినట్లు పాండవులకు చెప్పెను. తరువాత చాలకాలము వఱకు ఇష్టాగోష్ఠి జరిపి శ్రీకృష్ణుడు పలుసార్లు వారితో రహస్యాలోచనములు చేసి విశ్రమించుటకు తన నివాసస్థానమునకు పోయెను.

తరువాత సూర్యాస్తమయము అయ్యెను. అప్పుడు పంచ పాండవులు విరాటుడు మొదలైన రాజులను వీడ్కొలిపిరి. సంధ్యోపాసనము చేసిన తరువాత శ్రీ కృష్ణ భగవానునే వారు తలచుకొనుచు కొంతసేపు ఆయననే ధ్యానించు చుండిరి. పిమ్మట శ్రీకృష్ణుని పిలిచి ఆయనతో మరల రహస్యాలోచనలు చేయుటకు మొదలిడిరి. యుధిష్ఠిరుడు కృష్ణునితో నిట్లనెను:

''కమలనయనా! నీవు హస్తినాపురమునకు పోయి దుర్యోధనునితో కౌరవ సభలో ఏమి చెప్పితివి? అది యంతయు దయచేసి చెప్పుము.''

అప్పుడు శ్రీకృష్ణుడు ఇట్లు బదులు చెప్పెను:

''రాజా! నేను దుర్యోధనునితో అక్కడ అతనికి లాభదాయకము. హిత కరమునగు మాటను చెప్పితిని. కాని, దుర్బుద్ధియైన అతడు నా ఉపదేశమును అంగీకరింపలేదు.''

"ఆ మాటకు యుధిష్ఠిరుడు ఇట్లనెను:

''హృషీకేశా! దుర్యోధనుడట్లు కుమార్గగామియైనప్పుడు కురుకుల వృద్ధుడైన భీష్మపితామహుడు ఈర్ష్యాసూయలుగల దుర్యోధనునితో నేమనెను? భరద్వాజనందనుడైన ద్రోణాచార్యుడు ఏమనెను? తండ్రి ధృతరాష్ట్రుడు, తల్లి గాంధారి కూడ నేమనిరి? మా పినతండ్రి, ధర్మజ్ఞులలో శ్రేష్ఠుడునైన విదురుడు ఏమనెను? పుత్రులమైన మా శోకము చేత నతడు సర్వదా బాధ పడుచుండును.

''జనార్దనా! వీరేకాక ఆ సభలోనున్న సమస్త రాజులు తమ తమ యభిప్రాయములను ఎట్లు ప్రకటించిరి? అన్ని విషయములను నీవు జరిగినది జరిగినట్లు చెప్పుము.

''శ్రీకృష్ణా! నీవు కౌరవసభలో నిశ్చయముగా భీష్మ ధృతరాష్ట్రుల సమక్షమున అన్ని మాటలు చెప్పియుంటివి. కాని, నీవు వారు చెప్పిన మాటలు నాకు హితకరములు కాబట్టి లోభి, పండితమ్మన్యుడు (తాను పండితుడు కాకున్నను పండితుడను అని గర్వించువాడు) అయిన దుర్యోధనుడు నీ మాటలు తనకు 'అప్రియములు' అని తలచి కామ క్రోధములకు లోబడి మూర్ఖుడై బహుశః వినియుండడు.''

''గోవిందా! వారందఱు చెప్పిన మాటలను నేను వినగోరుచున్నాను. మా సమయము వ్యర్థము కాకుండ ఆ మాటలన్నియు సంగ్రహముగా చెప్పుము. శ్రీ కృష్ణా! నీవే మాకందఱికి ఆశ్రయుడవు రక్షకుడవు, గురువుగాకూడ ఉన్నావు. యుధిష్ఠురుని మాటలకు వాసుదేవు డిట్లు బదులు చెప్పెను:

''రాజేంద్రా! నేను కౌరవ సభయందు దుర్యోధనునితో చెప్పిన మాటలను అక్కడ జరిగిన సంగతి ఇప్పుడు చెప్పెద వినుము. నేను హితవచనములు చెప్పిన వెంటనే అతడు నవ్వెను.''

అప్పుడు భీష్ముడు కుపితుడై అతనితో నిట్లనెను :

''దుర్యోధనా! నేను మన వంశము హితముకొఱకు నీతో చెప్పుచున్న మాటలను నీవు ధ్యానముతో సావధానుడవై విని మన కులమునకు హితమును సాధింపుము.

"నాయనా! నా తండ్రి శంతనుడు విశ్వవిఖ్యాతుడైన రాజుగా ఉండెను. ఆయన పుత్రవంతులలో ఉత్తముడుగా తలచబడుచుండెను. నేను ఆయనకు ఏకైకపుత్రుడను. అందువలన ఆయన తనకు రెండవ పుత్రుడు ఎట్లు కలుగునని మనస్సులో విచారించుచుండెను.

ఎందుకనగా, విద్వాంసులు ఏకపుత్రుని పుత్రహీనునిగా చెప్పెదరు. కనుక ఈ కులము ఇంతటితో నిలిచిపోవక దీని యశస్సు ఎట్లు విస్తరించగలదు? అని కూడ అంతరంగములో సర్వదా విచారించుచుండెను.

''ఆయన మనస్సులోని యిచ్చను నేను తెలిసికొని వంశశ్రేయస్సు కొరకు, తండ్రి సంతోషము కొఱకును నేను రాజు కాకూడదనియు జీవితాంతము ఊర్ధ్వరేతస్కుడనై నైష్ఠిక బ్రహ్మచారిగా నుండవలయునని దుష్కరమైన ప్రతిజ్ఞచేసి మాతృదేవియైన కాళి (సత్యవతి)ని తోడ్కొని వచ్చితిని.

"ఈ విషయములన్నియు నీకు బాగుగా తెలియును. ఆనాడు నేను తండ్రికి చేసిన ప్రతిజ్ఞను పాలించుచు ఎల్లప్పుడు సంతోషముతో ఇక్కడ నివసించుచున్నాను.

"రాజా! సత్యవతి గర్భము నుండి శాంతనునకు ధర్మాత్ముడైన విచిత్రవీర్యుడు కలిగెను. అతడు నాకు తమ్ముడు మా తండ్రి గతించిన తరువాత మన రాజ్యము నందు విచిత్రవీర్యుని పట్టాభిషిక్తుని చేసి నేను రాజ్య సింహాసనము నుండి క్రిందికి దిగి, అతనికి సేవకుడనుగా నుంటిని.

''దుర్యోధనా! ఆ విచిత్రవీర్యుని కొఱకు దేశములోని రాజులందరిని జయించి ఆతనికి యోగ్యురాండ్రైన పత్నులను తెచ్చితిని. ఆ వృత్తాంతము కూడా నీవు చాలా పర్యాయములు వినియుండవచ్చును.

''దుర్యోధనా! తరువాత ఒక సమయమునందు నేను పరశురామునితో ద్వంద్వయుద్ధము చేయుటకు సమరభూమిలో దిగితిని. ఆ దినములలో పరశురామునివలన అందరికిని భయము ఉండెను. ఆ భయముచేత ఇక్కడి ప్రజలు విచిత్రవీర్యుని ఈ పట్టణము నుండి వెడలగొట్టిరి.

"తరువాత విచిత్రవీర్యుడు భార్యలయందు మిక్కిలిఆసక్తుడై ఎప్పుడున్ను వారితో విహరించుచుండుటచేత క్షయరోగపీడితుడై మరణించెను. అప్పుడు రాజు లేని రాజ్యమునందు దుర్భిక్షము కలిగెను. ఇంద్రుడు వర్షించకుండెను. అట్టి దుర్దశలో ప్రజలందరు ఆకలి భయముచేత పీడితులై నా వద్దకు పరుగెత్తుచు వచ్చి ఇట్లనిరి:

"మహారాజా! నీకు మేలు కలుగుగాక! రాజ్య ప్రజలందరు క్షీణించుచున్నారు. నీవు మా క్షేమముకొరకు రాజ్యాధికారమును స్వీకరించి అరాజకమైన రాజ్యమునందు ఏర్పడిన అనావృష్టి మొదలయిన ఈతిబాధలను పోగొట్టుము.

"గంగానందనా! నీ ప్రజలందరు భయంకర రోగములతో పీడింపబడుచున్నారు. కొందరుమాత్రమే జీవించియున్నారు. కనుక వారిని నీవు రక్షింపుము.

"మహావీరా! ఈ ఈతిబాధలనన్నిటిని పోగొట్టి ధర్మసమ్మతముగ ప్రజాపాలనము చేయుము. నీవు బ్రతికియుండగా ఈ రాజ్యము నశించకుండుగాక!"

"దుర్యోధనా! అట్లు ప్రజలు మొఱ వినిపప్పటికిని నేను చేసిన ప్రతిజ్ఞను దృష్టిలో నుంచుకొని దాని రక్షణముకొరకు దానిని స్మరించుచు మనస్సునందు క్షోభ చెందకుంటిని.

"దుర్యోధనా! తరువాత నా తల్లి కాళి (సత్యవతి), పురవాసులు, సేవకులు, పురోహితులు, అచార్యులు, అనేక శాస్త్రవేత్తలైన బ్రాహ్మణులు మిక్కిలి సంతాపము చెంది నాతో మాటిమాటికి నిట్లనిరి:

''శాంతసునందనా! నీవు రాజ్యాధికారము వహింపుము. అట్లు చేయనిచో ప్రతీపుని నుండి నేటిదాక సురక్షితముగానున్న ఈ రాష్ట్రము నీతో నశించిపోవును. దానిని నివారించుచు నీవు నీవు మా హితము కొరకు రాజువు కమ్ము."

''అట్లు వారందఱు చెప్పిన మీదట నేను మిక్కిలి వ్యాకులత్వము చెంది దుఃఖించితిని. అప్పుడు నేను చేతులు జోడించి, వారందరితో నా తండ్రి మహత్త్వముపైన దృష్టి ఉంచుచు నేను చేసిన ప్రతిజ్ఞను గూర్చి వారికి చెప్పితిని.

''దుర్యోధనా! తరువాత నేను తల్లియైన సత్యవతితో నిట్లంటిని:

''అమ్మా! నేను ఈ కులము అభివృద్ధి చెందుటకు, నిన్ను ఇక్కడికి తోడ్కొనివచ్చుటకుగాను 'నేను రాజుకాననియు, నైష్ఠిక బ్రహ్మచారిగా నుండెద' ననియు పలుసార్లు నా తండ్రి శాంతనునకు చెప్పి ప్రతిజ్ఞ చేసితిని. కనుక, ఈ రాజ్యభారము వహించుటకు నన్ను నీవు ఆజ్ఞాపింపకుము.''

"దుర్యోధనా! తరువాత నేను మరల చేతులు జోడించి తల్లిని ప్రసన్నురాలిని చేయుటకుగాను వినయపూర్వకముగా ఆమెతో నిట్లంటిని:

"అమ్మా! నేను శాంతసునందనుడనై కౌరవ వంశ మర్యాదను కాపాడెదను. నేను చేసిన ప్రతిజ్ఞను అసత్యము చేయజాలను."

"అట్లు నేను మాటిమాటికి ఆమెతో చెప్పి, దుర్యోధనా! మరల నామెతో నిట్లంటిని:

"పుత్రవత్సలా! విశేషించి నేను నీ కొఱకే యీ ప్రతిజ్ఞ చేసియుంటిని. నేను నీకు సేవకుడను. దాసుడను. నన్ను ప్రతిజ్ఞాభంగము చేయుమని చెప్పవద్దు."

"దుర్యోధనా! ఈ విధముగ తల్లిని, ప్రజలను అనునయించి వినయముతో వారిని అనుకూలపరచుకొని, తల్లితోపాటు వ్యాసమహాముని కడకుపోయి ఆయనను ప్రసన్నుని చేసి, నా తమ్ముని భార్యలయందు పుత్రోత్పత్తి చేయుమని ప్రార్థించితిని. అప్పుడా మహర్షి దయతో నా తమ్ముని భార్యల నుండి ముగ్గురు పుత్రులను కనెను.

"దుర్యోధనా! నీ తండ్రి అంధుడాయెను. అందువల్ల రాజు కాలేకపోయెను. అప్పుడు మహామనీషియైన పాండురాజు ఈ దేశమునకు రాజాయెను. కనుక పాండురాజు రాజ్యాధికారిగా నుండెను. కాబట్టి, అతని పుత్రులైన పాండవులు తండ్రి సంపత్తికి ఉత్తరాధికారులుగ నున్నారు. కావున వత్సా! దుర్యోధనా! నీవు వారితో కలహింపకుము. పాండవులకు అర్థరాజ్యమిమ్ము.

"నేను బ్రదికియుండగానే నా యిచ్ఛకు వ్యతిరేకముగా ఇతర పురుషు డెవడు రాజ్యమును పాలించగలడు? అని నీవు తలచి నా మాటను తీసివేయకుము మీలో సర్వదా శాంతి కలుగవలెనని నేను కాంక్షించుచున్నాను. రాజా! మీలోను, పాండవులలోను నాకు ఏలాటి భేదభావము లేదు. మీ తండ్రి, తల్లి గాంధారీదేవి, విదురుడు - ముగ్గురి అభిప్రాయము కూడ ఇదియే.

"నాయనా! దుర్యోధనా! నీవు పెద్దల మాటలు వినవలెను. మా మాటలను శంకింపకుము. మా మాటలు వినని నాడు నీవు అందరిని, నిన్ను, ఈ భూమండలమును గూడ నశింపజేయగలవు సుమా!''

కౌరవ సభలో ద్రోణ - విదుర - గాంధారుల మాటలు శ్రీకృష్ణుడు పాండవులకు చెప్పుట

జనమేజయా; అట్లు భీష్ముడు దుర్యోధనునకు చేసిన ఉపదేశమును శ్రీకృష్ణుడు పాండవులకు వినిపించి, తరువాతి కథ ఇట్లు చెప్పదొడగెను:

"రాజా! భీష్ముడు చెప్పిన తరువాత ద్రోణాచార్యుడు దుర్యోధనునితో నిట్లనెను:

"నాయనా! దుర్యోధనా! ప్రతీప పుత్రుడైన శాంతనుడు ఈ వంశ శ్రేయస్సు కొఱకు తత్పరుడై యుండినట్లే, దేవవ్రతుడు శాంతనుపుత్రుడు భీష్ముడు కూడ కురుకుల వృద్ధికొఱకు తత్పరుడై స్థిరముగా నిల్చియున్నాడు. ఈ విధముగనే సత్యప్రతిజ్ఞుడు జితేంద్రియుడునైన పాండురాజు కూడ ఉండెను- అతడు కురుకుల రాజుగా నుండునప్పటికిన్ని ధర్మమునందే మనస్సును సర్వదా నిలిపియుండెను. కురువంశాభివృద్ధిని చేయునట్టి పాండురాజు తన జ్యేష్ఠ భ్రాతయైన ధృతరాష్ట్రుని, కనిష్ఠ భ్రాతయైన విదురుని తన రాజ్యమునకు ఆధారములుగా గౌరవించుచుండెను.

"తరువాత రాజా! కురుకుల రత్నమైన పాండురాజు, తన హద్దుమీరి యెప్పుడు గూడ నడవనటువంటి ధృతరాష్ట్రుని సింహాసనమునందు ఉంచి, తాను తన యిద్దరు భార్యలతో వనమునకు వెడలిపోయెను.

''ఆ తరువాత పురుష సింహుడైన విదురుడు సేవకునివలె క్రింద నిలుచుకొని చామరములు వీచుచు వినయముతో ధృతరాష్ట్రుని సేవించుచుండెను. దేశ ప్రజలందఱు పాండురాజును అనుసరించినట్లే ధృతరాష్ట్రుని వశమునందుండి సేవించుచుండిరి.

''ఆ విధముగా శత్రువిజయియైన పాండురాజు విదురసహితుడైన ధృతరాష్ట్రునకు తన రాజ్యభారమును ఒప్పగించి ప్రపంచమంతయు సంచరింప జొచ్చెను.

''రాజా! సత్యప్రతిజ్ఞుడైన విదురుడు ధనాగార రక్షణమునందు, దానము చేయుట యందు, భృత్యపరిపాలమునందు, ప్రజాపోషణమునందు నిమగ్నుడై కార్యములను చక్కబెట్టుచుండెను.

"శత్రుభయంకరుడైన భీష్ముడు రాజ్యమునందు సంధి విగ్రహాదికార్యములను చక్కబెట్టుచు, రాజులనుండి సేవగొనుచు, పన్నులు మొదలైనవి తీసికొను కార్యమును చూచుచుండెను. అట్లు వీరందఱు రాజ్యకార్యములను చక్కగా నెరవేర్చుచుండగా ధృతరాష్ట్రుడు కేవలము సింహాసనమునందు కూర్చొనియుండెను. మహాత్ముడైన విదురుడు సర్వదా అతనికి సేవ చేయుచుండెను.

"నాయనా! దుర్యోధనా! అట్టి ధర్మాత్ముల వంశముల్లో పుట్టిన నీవు ఈ కులమునందు భేదభావము నెందుకు తెచ్చి పెట్టెదవు? రాజా! నీ సోదరులతో కలిసి మెలసి యుండి నీ కోరిన కోర్కెలన్నియు అనుభవింపుము. రాజోత్తమా! నేను దైన్యముచేత గాని, ధనాశచేత గాని ఏ మాటలు గూడ చెప్పను. నేను భీష్ముడిచ్చిన దానిని గ్రహింపగోరుచున్నాను. నీ విచ్చినది నా కక్కరలేదు.

''రాజా! నేను నీ నుండి నా జీవన సాధనములను పొందుటకు ఎప్పుడు గూడ కోరను. ఎక్కడ భీష్ముడున్నాడో అక్కడ ద్రోణుడున్నాడని తలచుము. భీష్ముడేది చెప్పునో దానినే నీవు కూడ అనుసరించవలెను.

''కనుక నాయనా! పాండు పుత్రులకు నీవు అర్ధరాజ్యమిమ్ము. నా ఆచార్యత్వము నీ యందు, పాండవుల యందును సర్వదా సమానముగా నున్నది. నాకు

అశ్వత్థామ యందువలెనే శ్వేతవాహనుడైన అర్జునునియందు కూడ ప్రేమ కలదు. అధికముగా ప్రలాపములు (వదరుటలు) చేయుటవలన లాభమేమి? ధర్మమెక్కడ నుండునో విజయమక్కడ నిశ్చితమై యున్నది.''

"యుధిష్ఠిరా! ద్రోణాచార్యుడిట్లు చెప్పిన తరువాత విదురుడు దుర్యోధనుని ముఖము చూచుచు తన పెద తండ్రియైన భీష్మునితో నిట్లనెను:

''దేవవ్రతా! ఈ కౌరవ వంశము నష్టమైయున్నప్పుడు నీవు పునరుద్ధరించితివి. నేను గూడ ఆ వంశరక్షణముకొఱకై విలపించుచున్నాను. కాని, నే చెప్పిన మాటలు నీ వెందుకు ఉపేక్షించుచున్నావో తెలియకున్నది. మన వంశమునకు అగ్నివంటివాడైన దుర్యోధనుడు ఎవ్వడు? ఈ వంశమందు వాని లెక్కయెంత? అతడు లోభమునకు వశుడైయున్నప్పటికిని నీవు అతనినే యెందుకు అనుసరించుచున్నావు? లోభము అతని వివేకశక్తిని హరించినది. అతని బుద్ధి దూషితమై, అతడు అనార్యుడై పోయినాడు.

''దుర్యోధనుడు శాస్త్రము యొక్క ఆజ్ఞను ఉల్లంఘించుచున్నాడు. ధర్మార్థములను అనుసరించుచున్న తన తండ్రి మాటలను కూడ అతడు వినుట లేదు. కేవలము ఒక్క దుర్యోధనుడు కారణముగానే ఈ కౌరవులందరు నశించుచున్నారు.

"మహారాజా! కౌరవ నాశమును నివారించుటకు ఏదైన ఉపాయమును నీవే చూడుము.

''ఒక చిత్రకారుడు చిత్రమును నిర్మించి ఒకచోట ఉంచినట్లు నీవు నన్ను, ధృతరాష్ట్రుని మొదటినుంచి కూడ ఎందుకు గూడ పనికిరాని వారినిగా చేసి ఉంచినావు. మా మాట సాగకుండ చేసినావు.

"కురువీరా! బ్రహ్మదేవుడు ప్రజలను సృష్టించి, తిరిగి ఆ సృష్టిని ఉపసంహరించినట్లే నీవు కూడ మన వంశము సృష్టించితివి. అది యిప్పుడు నశించుచుండుట చూచి ఉపేక్షించు చున్నావు.

''ఇప్పుడు వినాశకాలము దాపురించి యుండుటచేత నీ బుద్ధికూడ నష్టమైన యెడల నాతోను, ధృతరాష్ట్రునితోను వనమునకు బయలుదేరుము. లేదా - కపటి, దుర్బుద్ధియునైన దుర్యోధనుని శీఘ్రముగా బంధించి, పాండవులచేత రక్షింపబడుచున్న రాజ్యమును ఏలుము. రాజోత్తమా! ప్రసన్నుడవు కమ్ము -

కౌరవపాండవులకు, ఇతర రాజ వీరుల కందరికిన్ని వినాశకాలము సంప్రాప్తమైనటుల కనపడుచున్నది."

''యుధిష్ఠిరా! విదురుడట్లు చెప్పి దైన్యముతో పలుకకుండ మౌనము వహించి చింతామగ్నుడై దీర్ఘముగా ఉష్ణముగా నిట్టూర్చుచుండెను.

''తరువాత సుబలపుత్రియైన గాంధారీదేవి తన కులమునకు కలుగబోవు వినాశనమునకు భయపడి, క్రూరుడు పాపబుద్ధియునైన దుర్యోధనునితో రాజులందరి సమక్షము నందు ధర్మార్థయుక్తములైన మాటలను కోపముతో నిట్లనెను:

''పాపిష్ఠుడా! దుర్యోధనా! ఈ సభయందున్న రాజులు, బ్రహ్మర్షులు, సభాసదులు, మంత్రులు, సేవకులు అందరు నేను చెప్పబోవు నీ యపరాధములను వినెదరుగాక!

''దుర్యోధనా! మన వంశములో ఈ కౌరవరాజ్యమును క్రమముగా తండ్రి తరువాత కొడుకు రాజ్యాధికారము వహించు పద్ధతి వంశపరంపరగా వచ్చుచున్నది.

''నీవత్యంత క్రూరుడవై, పాపబుద్ధితో, అధర్మముగా ఈ కౌరవ రాజ్యముమ నశింపజేయ పూనుకొంటివి. ఈ రాజ్యమునకు అధికారులుగా ధృతరాష్ట్రుడు, అతని తమ్ముడు విదురుడు నియమింప బడినారు. మూర్ఖుడా! వీరిద్దరిని కాదని మోహవశుడవై నీవు నీయధికారమును నిలిపికొనదలచుకొన్నావు.

''దురాత్మా! భీష్ముడు జీవించియుండగా విదుర ధృతరాష్ట్రులు కూడ ఆయన యధీనములో నుండవలసినవారే. భీష్ముడుండగా రాజ్యము తీసుకొనుట కెవరికెన్ని అధికారము లేదు.

''కాని, భీష్ముడు ధర్మజ్ఞుడగుటచేత రాజ్యాధికారము వహించుటకు ఇష్టపడకున్నాడు.

''వాస్తవముగ ఈ రాజ్యము పాండురాజుదే కాబట్టి, అతని పుత్రులే రాజ్యాధికారులు కాగలరు. ఇతరులు కాజాలరు. కనుక, ఈ సమస్త రాజ్యము పాండవులదే. ఎందుకనగా, తండ్రితాతల రాజ్యము పుత్రపౌత్రులకే ధర్మప్రకారము వచ్చును.

''దుర్యోధనా! కురుకుల శ్రేష్ఠుడు, సత్యప్రతిజ్ఞుడు, బుద్ధిమంతుడు, మహానుభావుడునైన దేవవ్రతుడు ఏమి చెప్పినను ఆ మాటలన్నియు రాజ్యమును,

స్వధర్మమును పాలించు మనమందరము, అందులో ఏ మాత్రము మార్పు లేకుండ, స్వీకరించవలెను.

''లేదా, భీష్ముని ఆజ్ఞచేత ధృతరాష్ట్ర విదురులుకూడ ఈ విషయములో ఒక నిర్ణయము చేయగలరు. వారి నిర్ణయమే అందరును పాలించవలసియుండును.

''కురువంశీయులకు న్యాయప్రకారము ప్రాప్తించిన రాజ్యమును యుధిష్ఠిరుడే పాలించవలెను. భీష్ముడు అతనికి మార్గదర్శనము చేయుచు ఉపదేశించుచుండును.''

ధృతరాష్ట్రుడు దుర్యోధనునకు ఉపదేశించుట - అర్ధరాజ్యమిచ్చుటకు ఆదేశించుట

జనమేజయా! ఆ విధముగ శ్రీకృష్ణుడు గాంధారి మాటలను పాండవులకు చెప్పి, రాజసభలో ధృతరాష్ట్రుడు కూడ దుర్యోధనునితో నిట్లనెనని చెప్పదొడగెను:

''పుత్రా! దుర్యోధనా! నీకు తండ్రియందు ఏ మాత్రము గౌరవ భావముండినను ఇప్పుడు నీకు చెప్పబోవు మాటలను విని అనుసరింపుము. దీనివలన నీకు మేలు కలుగును.

''నాయనా! ఈ కౌరవ వంశమునకు మొదటి మూలపురుషుడు సోమ ప్రజాపతి. సోముని తరువాత ఆరవ తరమువాడు నహుషపుత్రుడు యయాతి జన్మించెను. యయాతికి ఐదుగురు పుత్రులు కలిగిరి. వారందరు రాజర్షులే. వారిలో జ్యేష్ఠ పుత్రుడు యదువు అనువాడు మహాబలపరాక్రమ సంపన్నుడైనవాడుగా నుండెను.

''అందరికన్న కనిష్ఠ పుత్రుడైన పూరువు మన వంశమునకు మూల పురుషుడు. అతడు 'వృషపర్వుడు' అను రాక్షస రాజు పుత్రియైన శర్మిష్ఠకు కొడుకు.

"యదువు అను యయాతి జ్యేష్ఠపుత్రుడు దేవయాని పుత్రుడు. అతడు అమిత తేజశ్శాలియైన శుక్రాచార్యునకు దౌహిత్రుడు. బలపరాక్రమ సంపన్నుడైన ఆ యదువు యాదవ వంశమునకు మూలపురుషుడు.

''మందమతియైన అతడొకసారి మిక్కిలి గర్వముతో క్షత్రియులను అందరిని అవమాన పరచెను. బలగర్వముచేత మోహితుడైన యదువు తండ్రి

యయాతి యాజ్ఞను పాలింపకుండెను. దుర్జయుడుగా నుండి అతడు తన సోదరులను తండ్రిని కూడ అవమాన పరుచుచు వచ్చెను.

'''నాల్గు సముద్రములచే చుట్టబడిన సమస్త భూమండలమునందు అందరికన్న యదువు అధిక బలవంతుడుగా నుండెను. అతడు రాజులందరిని వశపరచుకొని హస్తినాపురమునందు నివసించుచుండెను.

''యదువు తండ్రినహుషనందనుడునైన యయాతి మిక్కిలి కుపితుడై యదువుకు శాపమిచ్చి రాజ్యాధికారమునుండి దింపెను. బల గర్వములుగల తమ్ములు యదువునే అనుసరించిరి. యయాతి ఆ పుత్రులందరికి శాపమిచ్చెను.

''దుర్యోధనా! ఆటు తరువాత యయాతి మహారాజా తనకు ఆజ్ఞానువర్తియైన కనిష్ఠపుత్రుని పూరువును రాజ్యాధికారమందు నిల్పెను.

"కనుక దుర్యోధనా! 'మన వంశమునందు జ్యేష్ఠపుత్రుడు అహంకారియైనచో అతనికి రాజ్యము లభించదు. కనిష్ఠపుత్రుడు వృద్ధులను సేవించుటచేత చిన్నవాడైనను అతడు రాజ్యాధికారమును పొందును' అను విషయము మన వంశమందు సిద్ధమైయున్నది.

"ఆ విధముగానే దుర్యోధనా! నా తండ్రికి పితామహుడైన ప్రతీప మహారాజు (నా ముత్తాత) సర్వధర్మములను తెలిసినవాడై త్రిలోక ప్రసిద్ధుడుగా నుండెను. ఆయనకు ముగ్గురు పుత్రులు కలిగిరి. ఆ ముగ్గురును కీర్తిమంతులు పరాక్రమశాలురునై యుండిరి.

"నాయనా! ప్రతీపపుత్రులు ముగ్గురిలో జ్యేష్ఠుడు దేవాపి అనువాడు, రెండవ పుత్రుడు - బాహ్లీకుడు, మూడవ పుత్రుడు నా పితామహుడైన శాంతను మహారాజు.

''దేవాపి మహా తేజశ్శాలియైనను చర్మరోగముచేత పీడితుడై యుండెను. అతడు, పరమధార్మికుడు సత్యవాది, పితృసేవాతత్పరుడు, సత్పురుష సమ్మానితుడు, ప్రజలకు ప్రేమపాత్రుడుగాను ఉండెను. ప్రజలలో ఆబాలవృద్ధులు దేవాపిని ప్రేమించుచుండిరి. దేవాపి ఉదారుడు, సత్యప్రతిజ్ఞుడు, సమస్త ప్రాణులకు హితము చేయువాడు, తండ్రి యాజ్ఞను బ్రాహ్మణుల యాజ్ఞను పాలించువాడు.

"బాహ్లీకుడు శాంతను మహారాజుకు ప్రియ సోదరుడుగ నుండెను ఈ విధముగ ఆ ముగ్గురు సోదరులు పరస్పరము సౌభ్రాత్రముతో నుండిరి.

"తరువాత కొంత కాలమునకు ప్రతీపమహారాజు శాస్త్రానుసారముగ రాజ్యాభిషేకము కొఱకు సామగ్రిని సమకూర్చుకొనెను. జ్యేష్ఠపుత్రుడైన దేవాపి యొక్క మంగళము కొఱకు ఆవశ్యకములైన అన్ని శాంతికర్మలకు ఏర్పాట్లు చేయించెను. కాని, అప్పుడు బ్రాహ్మణులు, నగరవృద్ధులు ప్రజలు, దేశవాసులు అందరు వచ్చి దేవాపి యొక్క రాజ్యాభిషేకమును ఆపిరి.

"దుర్యోధనా! ఈ విషయము తెలిసి ప్రతీపుడు మిక్కిలి దుఃఖింప దొడగెను. ఈ విధముగ దేవాపి ఉదారుడు ధర్మజ్ఞుడు ప్రజలకు ప్రియుడై నప్పటికి అతనికి గల చర్మరోగము కారణముగా రాజ్యాధికారమునకు అనర్హుడని తలచబడెను.

"దుర్యోధనా! ఏదేని ఒక అంగము హీనమైనప్పుడు అట్టి రాజును దేవతలు అభినందించరు. కాబట్టి, బ్రాహ్మణులు ప్రతీపమహారాజును దేవాపికి పట్టాభిషేకము చేయకుండ నివారించిరి. దానివలన ప్రతీపమహారాజు మనస్సుకు చాల కష్టమయ్యెను. అతడు పుత్రుని గూర్చి చాల శోకించెను. ప్రతీపరాజును ప్రజలు నివారించిన కారణముగా తనకు రాజ్యాధికారము లభించనందుచేత దేవాపి వనమునకు పోయెను

"ప్రతీపుని రెండవ కుమారుడైన బాహ్లీకుడు సమృద్ధమైన రాజ్యమును, తండ్రిని, సోదరులను విడిచి, మామ యింటికి పోయెను బాహ్లీకుని అనుజ్ఞ తీసికొని శాంతను మహారాజు తండ్రి చనిపోయిన తరువాత రాజ్య శాసనము చేసెను.

"దుర్యోధనా! ఈ విధముగానే నేను కూడ అంగవిహీను (అంధు)డను. కాబట్టి జ్యేష్ఠుడనైనను, పాండురాజు ప్రజల చేత పట్టాభిషిక్తుడు చేయబడినందు చేత నాకు రాజ్యాధికారము లేకపోయెను. నాకంటె వయస్సులో చిన్నవాడైనను పాండురాజు రాజ్యమును పొంది, ఒక మంచి రాజుగా ప్రసిద్ధుడయ్యెను.

''దుర్యోధనా! పాండురాజు మృత్యువు తరువాత ఈ రాజ్యము అతని పుత్రులదే"యగును.

"కనుక పుత్రా! నేను రాజ్యమునకు అధికారిగానే కాకుంటిని. ఇట్లుండగా నీవెట్లు రాజ్యమును కోరుచున్నావు? రాజపుత్రుడు కానివాడు రాజ్యాధికారి కాజాలడు. నీవు ఇతరుల సంపదను అపహరింపదలచుచున్నావు. యుధిష్ఠిరుడు రాజపుత్రుడు. అందువలన ధర్మము ప్రకారము అతడే రాజ్యమునకు అధికారి.

అతడే కౌరవవంశమును పోషింపగలవాడు. ఈ రాజ్యమునకు ప్రభువు, శాసకుడున్ను అతడే.

''యుధిష్ఠిరుడు సత్యప్రతిజ్ఞుడు. ఏమాత్రము ఏమరుపాటు లేనివాడు. శాస్త్రము ననుసరించి నడచుచు సోదరులయందు బంధువులయందు సద్భావము గలిగియున్నాడు. ప్రజలకు కూడ అతనిపై విశేష ప్రేమ కలదు. ఓర్పు, ఇంద్రియ నిగ్రహము, సరళత్వము, ప్రాణులయందు దయ, గురువుల యాజ్ఞలో నుండుట మొదలైన రాజోచిత సమస్త సద్గుణములు యుధిష్ఠిరునకు ఉన్నవి.

"దుర్యోధనా! నీవు రాజుయొక్క పుత్రుడవుకావు. నీ వ్యవహారము కూడ దోషదూషితముగా నున్నది. నీవు పరమలోభివి. బంధువులయెడ ఎల్లప్పుడు పాపమునే విచారించుచుందువు. వంశపరంపరాగతమైన యీ రాజ్యము ఇతరులది. దీనిని నీవెట్లు అపహరించగలవు? నీవు మోహము విడిచి సమస్త వస్తు వాహనములతో బాటు అర్ధ రాజ్యము పాండవుల కిమ్ము. అప్పుడే నీ తమ్ములతో బాటు నీ జీవితము రక్షింపబడగలదు."

కౌరవుల యెడల సామ దాన భేదోపాయములు వ్యర్థములు కనుక దండనీతినేఉపయోగించవలెనని శ్రీ కృష్ణుడు ప్రతిపాదించుట

జనమేజయా! శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుని మాటలు యుధిష్ఠిరునకు చెప్పి తరువాత వృత్తాంతము ఇట్లు చెప్ప దొడగెను:

''యుధిష్ఠిరా! భీష్మ-ద్రోణ-గాంధారీ-ధృతరాష్ట్రులు అంతగా ఉపదేశించి నప్పటికిన్ని దుర్యోధనుడు కొంచెమైనను తన పట్టు విడువలేదు. అతడు కోపము చేత కన్నులు ఎఱ్ఱగా జేసికొని సభాసదులందరిని లెక్కచేయక లేచి సభ విడిచి వెడలిపోయెను. అతనివెంట ఇతర రాజులు కూడ తమ జీవితముపైన ఆశ విడిచి సభ విడిచిపోయిరి.

''యుధిష్ఠిరా! దుర్యోధనుడు అవివేకులైన ఆ రాజులతో 'మీరందఱు కురుక్షేత్రమునకు పొండు - నేడు పుష్యనక్షత్రము, మంచిదినము' అని చెప్పుచు వారికి ఆజ్ఞనిచ్చెను.

''పిమ్మట ఆ రాజులందఱు కాల(యమ) ప్రేరితులై భీష్ముని సేనాపతిగా చేసికొని మిక్కిలి హర్షముతో సైన్యముతోపాటు అక్కడినుండి వెడలిపోయిరి.

"కౌరవుల పదునొకండు అక్షౌహిణీ సేనలు కూడ వచ్చెను. ఆ సేనలకు అధిపతి భీష్ముడు. అతడు తన తాళ (తాటి చెట్టు) ధ్వజముతో సేనా ముఖము నందు శోభిల్లుచుండెను.

రాజా! ఇప్పుడు నీవు కూడ యుద్ధోచిత కార్యములను చేయుము. కౌరవ సభయందు భీష్మ-ద్రోణ-విదుర-గాంధారీ-ధృతరాష్ట్రులు నా సమక్షమందు చెప్పిన మాటలన్నియు నీకు వినిపించితిని. రాజా! ఇదియే అక్కడి వృత్తాంతము.

"యుధిష్ఠిర మహారాజా! సోదరులందరిమధ్య బంధుజనోచితమైన ప్రేమ ఉండవలెనను నిచ్చచేత నేను తొలుత కౌరవసభలో సామోపాయమును ప్రయోగించితిని. దానివలన కురు వంశమునందు వేర్పాటు భావము కలుగకుండ ప్రజలకు నిరంతరాభివృద్ధి కలుగవలెనని అట్లు చేసితిని.

''సామోపాయమును కౌరవులు గ్రహింపనప్పుడు నేను భేదోపాయమును ప్రయోగించితిని. పాండవుల యొక్క దేవమనుష్యోచితములైన వీర కర్మలను సభలో పలుసార్లు వర్ణించితిని.

"యుధిష్ఠిరా! దుర్యోధనుడు శాంతిపూర్ణములైన నా మాటలు పాటింపనప్పుడు నేను అక్కడి రాజులందరిని పిలచి, వారిలో భేదము కలిగించుటకు ప్రయత్నించితిని.

''అక్కడ నేను అద్భుతములు భయంకరములు కఠినములు మానవాతీతములైన కర్మల ననేకములను ప్రదర్శించితిని. నేను రాజులందరిని బెదిరించితిని. దుర్యోధనుని గడ్డిపరకతో సమానముగా చూచితిని. కర్ణశకునులను మాటిమాటికి భయపరచితిని. జూదమాడిన ధృతరాష్ట్ర పుత్రుని నిందించితిని.

నా మాటలచేత, రహస్యాలోచనలచేతను అక్కడి రాజుల మనస్సులలో అనేక పర్యాయములు భేదమును కల్పించితిని. తరువాత సామదానోపాయములను ప్రయోగించితిని. దానిచేత కురు వంశములో ఐక్యము కలిగి అభీష్టకార్యము సిద్ధించునని అటుల చేసితిని. ధర్మరాజా! ఆ సభలో దుర్యోధనునితో నేనిట్లు చెప్పితిని:

"దుర్యోధనా! పాండవులు శౌర్య సంపన్నులైనను అందరు అభిమానము విడిచి భీష్మ-ధృతరాష్ట్ర-విదురుల అండలో నుండగలరు. పాండవులు తమ రాజ్యమంతయు నీకే యిచ్చి నీ యధీనములో నుండెదరు. భీష్మ-విదుర-ధృతరాష్ట్రులు నీ హితమును గూర్చి చెప్పిన మాట ప్రకారము నడచుకొనుము.

''సమస్త రాజ్యము నీయధీనములోనే ఉండుగాక! నీవు పాండవులకు ఐదు గ్రామములనే ఇమ్ము. ఎందుకనగా, నీ తండ్రి పాండవులను గూడ పోషింపవలెగదా!

"ధర్మజా! నేను అట్లు చెప్పినప్పటికిని ఆ దుష్టాత్ముడు రాజ్యములో ఏ కొంచెము భాగము కూడ నీకు ఇచ్చుటకు అంగీకరించలేదు. కాబట్టి ఇప్పుడు నేను ఆ పాపాత్ములపైన నాల్గవదియైన దండోపాయమే ప్రయోగించుట ఆవశ్యకమని తలచుచున్నాను. అట్లు కానిచో వారిని మార్గములోనికి తెచ్చుట అసంభవము.

"రాజులందరు తమ వినాశముకొఱకు కురుక్షేత్రమునకు బయలుదేరి పోయిరి. రాజా! కౌరవసభలో జరిగిన సమాచారమంతయు నీకు చెప్పితిని.

"పాండునందనా! కౌరవులు యుద్ధము చేయని యెడల నీకు రాజ్యమును ఇవ్వరు. వారికందరికి వినాశకాలము సమీపించినది. మృత్యుకాలము కూడ వారికి వచ్చినది."

భగవద్యాన పర్వము సమాప్తము.

సైన్యనిర్యాణ పర్వము

పాండవ పక్షమున సేనాపతి నిర్ధారణము - పాండవ సేన కురుక్షేత్రమునకు పోవుట

జనమేజయా! శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన మాటలు విని ధర్మాత్ముడైన యుధిష్ఠిరుడు ఆ భగవంతుని యెదుటనే తన తమ్ములతో నిట్లనెను:

"తమ్ములారా! కౌరవ సభలో జరిగిన వృత్తాంతమంతయు మీరు వింటిరి గదా! శ్రీకృష్ణుడు చెప్పిన మాటల యర్థము కూడ మీరు బాగా తెలిసికొంటిరి. అందుచేత ఇప్పుడు మీరుకూడ మీ సేనలను విభజింపుడు.

"మన ఏడు అక్షౌహిణీ సేనలు ఒకచోటనే గుంపుగా నున్నవి. ఇవి మనకు విజయము సాధించగలవు. ఈ యేడక్షౌహిణీ సేనలకు ప్రసిద్ధులైన ఏడుగురు సేనాపతులున్నారు. వారు 'ద్రుపద-విరాట-ధృష్టద్యుమ్న-శిఖండి-సాత్యకి-చేకితాన-భీమసేనులు' ఈ వీరులందరు మనకొఱకు తమ శరీరములను కూడ విడుచుటకు సిద్ధముగ నున్నారు. కనుక, ఈ యేడుగురే పాండవ సేనలను నడుపుటకు యోగ్యులు.

"ఈ యేడుగురు వేదవేత్తలు. శూరులు. సత్ప్రవర్తన కలవారు. ఉత్తమ నియమములను పాటించువారు. లజ్జాశీలురు. నీతిజ్ఞులు మాత్రమేకాక యుద్ధ కౌశలము కూడ కలవారు. వీరు ధనుర్వేదమందు నిపుణులు. అన్ని విధములైన అస్త్రములతో యుద్ధము చేయుటకు సమర్థులు.

"ఇప్పుడు ఈ యేడుగురికి నాయకు డెవరని విచారించవలసియున్నది. ఆ నాయకుడు సేనా విభాగముల నన్నింటిని గూర్చి బాగుగా తెలిసినవాడుగ నుండవలెను. అంతయేకాక, యుద్ధమునందు బాణజ్వాలలతో మండుచున్న అగ్నివంటి తేజస్వియైన భీష్ముని దాడిని ఓర్చి ఎదిరించగలవాడుగా నుండవలెను.

"సహదేవా! ఈ విషయములో నీ యభిప్రాయము తెలుపుము. మనకు ప్రధాన సేనాధిపతిగా నుండుటకు ఎవడు యోగ్యుడు?"

"ఆ మాటకు సహదేవు డిట్లనెను:

"అగ్రజా! ఎవడు మనకు వియ్యంకుడో, ఎవడు దుఃఖమునందు మనతో కలిసి ఉండెనో, ఎవడు పరాక్రమవంతుడో, ధర్మజ్ఞుడైన ఏ వీరుని ఆశ్రయించి మన రాజ్య భాగమును పొందగలమో, ఎవడు అస్త్రవిద్యయందు నిపుణుడో యుద్ధోన్మాదముచేత పోరాడునట్టి బలవంతుడెవడో అట్టి మత్స్యదేశ ప్రభువైన విరాటుడు మన సేనలకు ప్రధాన నాయకుడుగా నుండవలెను. ఆయన యుద్ధభూమియందు భీష్ముని ధాటిని ఇతరమహారథుల దాడిని బాగుగా సహించగలడు."

జనమేజయా! సహదేవు డట్లు చెప్పినమీదట ప్రవచన నిపుణుడైన నకులుడు ఇట్లనెను:

"అగ్రజా! వయస్సు-శాస్త్రజ్ఞానము-ధైర్యము-కులము-ఈయన్ని విషయములలో ఎవడు పెద్దవాడో, ఎవనికి లజ్జా-బల-సంపదలు ఉన్నవో, ఎవడు సమస్త శాస్త్రముల జ్ఞానమునందు నిపుణుడో, ఎవడు భరద్వాజ మహర్షి వలన అస్త్రవిద్యను నేర్చినాడో, ఎవడు సత్యప్రతిజ్ఞుడై శత్రువులకు అసాధ్యుడైన యోధుడో ఎవడు మహాబలవంతులైన భీష్మద్రోణులతో సర్వదా స్పర్థ (పోటీ) పడుచుండునో, ఎవడు సమస్త రాజసమూహముల ప్రశంసకు పాత్రుడో, ఎవడు యుద్ధ ముఖమునందు నిలబడి సేనను రక్షించుటకు సమర్థుడో, అనేక పుత్ర పౌత్రులతో కూడుకొనియుండుటచేత, నూర్లకొలది కొమ్మలుగల వృక్షమువలె ఎవని శోభ అంతట వ్యాపించుచుండునో, ఏ మహారాజు ద్రోణాచార్యుని వినాశము కొఱకు పత్నీసహితుడై ఘోర తపస్సు చేసియుండెనో, ఎవడు యుద్ధభూమియందు వీరుడుగా ప్రకాశించుచుండునో, ఎవడు మనపైన ఎల్లప్పటికిని పితృప్రేమతో నుండునో అట్టి రాజేంద్రుడైన మన మామ ద్రుపద మహారాజు మన సైన్యమునకు ప్రధాన నాయకుడుగా నుండుగాక!

"యుద్ధమునందు ఎదురుపడిన భీష్మద్రోణులను ఎదిరించగల సమర్థుడు ద్రుపద మహారాజేయని నా యభిప్రాయము. ఎందుకనగా - ఆ మహారాజునకు సమస్త దివ్యాస్త్రజ్ఞానము కలదు. ఆయన ద్రోణాచార్యునకు మిత్రుడు."

"జనమేజయా! మాద్రీ పుత్రులైన నకుల సహదేవులు ఈ విధముగా తమ అభిప్రాయములను వేరువేరుగా తెలిపిన తరువాత కురుకులమునకు ఆనందమును గూర్చువాడు ఇంద్రసమాన పరాక్రముడునైన అర్జునుడు ఈ విధముగ చెప్పదొడగెను:

"ధర్మజా! ఎవడు అగ్నిజ్వాలతో సమానమగు కాంతిగలవాడో, ఎవడు తన తండ్రియొక్క తపఃప్రభావముచేత, మహర్షుల కృపానుగ్రహములచేత జన్మించిన దివ్యపురుషుడో, ఎవడు అగ్నికుండమునుండి ధనుఃకవచ ఖడ్గములను ధరించి బయలు వెడలిన వెంటనే దివ్యాశ్వములు కట్టిన రథము నారోహించి యుద్ధసన్నద్ధుడుగా కనపడెనో, ఎవడు పరాక్రమవంతుడై, వీరుడై తన రథము యొక్క ఘరఘర ధ్వనులచేత గర్జించుచున్న మహామేఘమువలె కనపడు చుండునో, ఎవని శరీర సౌష్ఠవము, పరాక్రమము, హృదయము, వక్షఃస్థలము, బాహువులు, కంఠము, గర్జనము ఇవన్నియు సింహమును పోలియుండునో, ఎవడు మహాబలపరాక్రమవంతుడో, మహావీరుడో, ఎవని కనుబొమలు-దంత పంక్తి-దవడలు-భుజములు-ముఖము-మిక్కిలి సుందరములుగా నున్నవో, ఎవడు పరిపుష్టిగా నున్నాడో, ఎవని మూపులు సుందరములో, ఎవని విశాలనేత్రములు, పాదములు మిక్కిలి అందమైనవో, ఎవని ఏ యస్త్రశస్త్రములు గూడ ఛేదింప జాలవో, ఎవడు మద గజరాజువలె పరాక్రమవంతుడో, ఎవడు వీరుడైన ద్రోణా చార్యుని వినాశము కొఱకు జన్మించెనో, ఎవడు సత్యవాదియో, జితేంద్రియుడో, అట్టి ధృష్టద్యుమ్నుడే ప్రధాన సేనాపతిగా నుండుటకు అర్హుడని నేను తలచెదను.

"జ్వలించుచున్న ముఖములుగల సర్పములవలె నుండు భీష్మ పితామహుని భయంకర బాణఘాతములను అతడు సహింపగలడు. భీష్ముని బాణస్పర్శ పిడుగువలె దుస్సహముగా నుండును. దానిని ధృష్టద్యుమ్నుడొక్కడే సహించ గలడు.

"భీష్మ పితామహుని బాణఘాతములు అగ్నితో సమానమైన తేజస్సు గలవిగా ప్రాణ హరణమునందు యమదూతలతో సమానములుగను ఉండును. పిడుగువలె గడగడ శబ్దములుగల భీష్ముని బాణములను పూర్వము యుద్ధము నందు పరశురాముడొక్కడే సహించి యుండెను.

"రాజా! మహానియమవంతుడైన భీష్ముని వేగమును ధృష్టద్యుమ్నుడు తప్ప మరియొక డెవ్వడును సహింపజాలడు. కనుక నా నిశ్చయమిదియే.

"అతి శీఘ్రముగ హస్త సంచాలనము చేయువాడు, విచిత్ర యుద్ధ కుశలుడు అభేద్యమైన కవచముతో కూడినవాడు, యూథపతియైన గజరాజుతో సమానముగా ప్రకాశించువాడునైన ధృష్టద్యుమ్నుడే సేనాపతి యగుటకు యోగ్యుడని నా యభి ప్రాయము."

జనమేజయా! అర్జునుడు ఇట్లు చెప్పిన తరువాత భీమసేనుడు తన యభి ప్రాయమును ఇట్లు ప్రకటించెను:

''రాజేంద్రా! ద్రుపదకుమారుడైన శిఖండి భీష్మ పితామహుని వధించుటకే పుట్టినాడు. ఈ విషయము ఇక్కడకు వచ్చిన సిద్ధులు మహర్షులు తెలిపినారు. యుద్ధ భూమియందు శిఖండి తన దివ్యాస్త్రములు ప్రయోగించినప్పుడు అతని స్వరూపము పరశురామునితో సమానముగ భయంకరమై కనిపించును- యుద్ధము నందు శిఖండిని సంహరింపగల వీరుని ఎవరిని గూడ నేను చూడలేదు.

"రాజా! భీష్ముడు రథములో కూర్చొని అస్త్రశస్త్రములతో సన్నద్ధుడై ఎదు రుగా వచ్చినప్పుడు ద్వైరథ యద్ధము (ఇద్దరు రథములందే ఉండి పరస్పరము చేయు యుద్ధము)న శిఖండి తప్ప మరియొక్క వీరుడెవడు కూడ భీష్ముని సంహ రింపజాలడు. అందువలన నా యభిప్రాయములో శిఖండియే ముఖ్య సేనాపతిగా నుండుటకు అర్హుడు."

ఆ మాటలు విని యుధిష్ఠిరుడు ఇట్లనెను:

"నాయనా! ధర్మాత్ముడైన శ్రీకృష్ణ భగవానుడు సమస్త ప్రపంచము నందలి సారములు అసారములు బలాబలములు అన్నింటిని బాగుగా నెరిగినవాడు ఈ విషయమునందు ఈ రాజులందరి యభిప్రాయమేమి? అని కూడ అతనికి పూర్తిగా నెలియును. కాబట్టి శ్రీ కృష్ణుడు ఎవరి పేరు చెప్పునో అతడే మన సేనకు ప్రధాన సేనాపతిగా నుండగలడు. శ్రీకృష్ణునిచేత సూచింపబడు వ్యక్తి అస్త్రవిద్యయందు నిపుణుడైనను కాకున్నను, వృద్ధుడైనను, యువకుడైనను సరియే - మనకు ఆ చింత అక్కరలేదు.

"నాయనా! ఈ భగవంతుడే మన జయాపజయములకు మూలకారణుడు. మన ప్రాణములు, రాజ్యము, భావాభావములు, సుఖదుఃఖములు ఇవన్నియు ఈ మహాత్మునిపైననే ఆధారపడియున్నవి. ఇతడే అందరికిని కర్త-భర్త. మన సమస్త కార్యముల సిద్ధి ఇతని పైననే ఆధారపడియున్నది. అందువలన శ్రీకృష్ణ భగవానుడు మన విశాలమైన సేవకు ప్రదాన నాయకుడుగా ఉండుటకు ఎవనిని సూచించునో అతనినే మన మంగీకరింతుము. తమ్ములారా! శ్రీకృష్ణ పరమాత్మ తన యభిప్రాయమును తెలుపుగాక!

"ఇది రాత్రి సమయము. మనము ఇప్పుడే మన ప్రధాన సేనాపతిని ఎన్ను కొని, ఈ రాత్రి గడిచిన తరువాత అస్త్రశస్త్రములకు అధివాసనము (గంధ

మాల్యాదులతో పూజ), కౌతుకను (రక్షాబంధనాదులు) మొదలగు మంగళ కార్యములు చేసిన తరువాత శ్రీకృష్ణుని ముందిడుకొని యుద్ధయాత్ర చేయుదుము."

జనమేజయ మహారాజా! యుధిష్ఠిరుని మాటలు విని శ్రీకృష్ణభగవానుడు అర్జునుని చూచుచు ధర్మరాజుతో నిట్లనెను:

"మహారాజా! మీరందరు ఏయే వీరులపేళ్లు చెప్పితిరో వారందరు కూడ నా యభిప్రాయములో సేనాపతులు అగుటకు యోగ్యులు. ఎందుకనగా వారందరు మహా పరాక్రమ సంపన్నులైన యోధులు. మీ శత్రువులను ఓడింపగల శక్తి వారందరికిని ఉన్నది. మహా సంగ్రామమునందు వారు ఇంద్రుని మనస్సులో కూడ భయము కలిగింప జాలుదురు. ఇట్లుండగా పాపాత్ములు లోభులునైన ధృతరాష్ట్ర పుత్రులమాట ఎంత?

''యుధిష్ఠిర మహారాజా! నేను గూడ ఇంత మహా యుద్ధము జరుగ గలదని ఊహించి నీకు ప్రియము చేయుటకుగాను శాంతి స్థాపన కొరకు మహా ప్రయత్నము చేసియుంటిని. ఈ కార్యముచేత మనము ధర్మమునుండి ఋణ విముక్తులమైతిమి ఇతరుల దోషములను ఎత్తిచూపువారు కూడ ఇప్పుడు మనపైన దోషారోషణము చేయజాలరు.

"ధృతరాష్ట్ర పుత్రుడు యుద్ధము కొరకు తొందరపడుచున్నాడు. అతడు మూర్ఖుడు అయోగ్యుడు. ఇప్పటికిని తాను అస్త్రవిద్యాపారంగతుడనని తలచును. దుర్బలుడైనను తాను బలవంతుడనని తలచును.

''కాబట్టి యుధిష్టిరా! నీవు మీ సేనను యుద్ధము కొఱకు బాగుగ సన్నద్ధము చేయుము. ఎందుకనగా నా యభిప్రాయములో ఆ శత్రువులు వధచేతనే లొంగుదురు. వీరుడైన అర్జునుడు క్రోధభరితుడైన భీమసేనుడు యమధర్మరాజు వంటి నకుల సహదేవులు సాత్యకి, ధృష్టద్యుమ్నుడు అభిమన్యుడు ద్రౌపది పుత్రులైదుగురు విరాటరాజు ద్రుపదరాజు అక్షౌహిణి సేనాధిపతులు భయంకరులయిన అనేక రాజవీరులు యుద్ధమునకు సన్నద్ధులుగా నుండుట దుర్యోధనుడు చూచి రణాంగణమునందు నిలువజాలడు.

"మన సేన మిక్కిలి శక్తిమంతము, శత్రువుల కసాధ్యము. ఎవరికిని చొరరానిదిగా నున్నది. అది యుద్ధమునందు శత్రుసేనలను సంహరించగలదు. ఇందులో సందేహము లేదు. శత్రుదమనా! ధృష్టద్యుమ్నుడే మనకు ప్రధాన సేనాపతిగా ఉండదగినవాడని నేను తలచెదను.''

''జనమేజయా! శ్రీకృష్ణుడు ఇట్లు చెప్పిన తరువాత పాండవులు మిక్కిలి సంతోషించిరి. తరువాత "ఇక యుద్ధసన్నద్ధులు కండు'' అని మాటిమాటికి చెప్పికొనుచు సైనికులందరు మిక్కిలి ఉత్సాహముతో ఇటునటు పరుగెత్తదొడగిరి.

''అప్పుడు ప్రసన్న చిత్తముగల ఆ వీరులు చేసిన హర్ష ధ్వనులుచేత దిక్కులన్నియు ప్రతిధ్వనించెను. అన్నివైపుల అశ్వ గజ రథధ్వనులు చెలరేగెను. శంఖ దుందుభులు భయంకరముగా అన్నివైపుల మ్రోగుచుండెను. రథ-గజ - తురగ-పదాతి సైన్యములు ఉత్తుంగ తరంగములతో విజృంభించిన మహా సముద్రమువలె భయంకరముగా క్షోభిల్లెను.

"యుద్ధయాత్ర కొఱకు సన్నద్ధులైన పాండవులు, వారి సైనికులు అన్నివైపుల పరుగెత్తుచు సింహనాదములు చేయుచు కవచములు ధరించుచుండుట కనపడెను. మహా సైన్యము పరవళ్ళు త్రొక్కుచు ప్రవహించు గంగానదివలె దుర్గమముగ కనబడుచుండెను.

"జనమేజయా! సేనయొక్క ముందు భాగమునందు భీమసేనుడు నకుల సహదేవులు అభిమన్యుడు ద్రౌపదీపుత్రులు, ధృష్టద్యుమ్నుడు, ప్రభద్రకులు, పాంచాలదేశపు క్షత్రియ వీరులు నడచుచుండిరి. వారందరు భీమసేనుని తమకు అగ్రగామిగా జేసికొనిరి.

''జనమేజయా! నిండు పూర్ణిమనాడు ఉప్పొంగుచున్న సముద్రముయొక్క హర్షోత్సాహ పూరితమైన మహాధ్వని అన్నివైపుల వ్యాపించి స్వర్గలోకమువరకు గూడపోయినదా అనునట్లుండెను. ఉత్సాహపూరితులైన సైనికులు శత్రుసేనను చీల్చబోవుచున్నట్లుగా నుండిరి.

"అప్పుడు యుధిష్ఠిరుడు సైనికుల మధ్యకు పోయెను. ఆయన వెనువెంటనే యుద్ధసామగ్రి తీసికొనిపోవు బండ్లు, అంగళ్ళు, పటకుటీరములు (డేరాలు) రథాదివాహనములు, ధనాగారము, యంత్రాయుధములు, చికిత్స యందు నేర్పరులైన వైద్యులు కూడ పోయిరి

"యుధిష్ఠిరుడు దుర్బలులను - కృశించిన శరీరము కలవారిని-సారహీనులను, ఇతర పరిచారికలను ఉపప్లవ్యనగరమునందే ఉంచి ప్రయాణము చేసెను.

''ద్రౌపదీదేవి దాసదాసీ జనముతోబాటు కొంతదూరము పోయి మహారాజును సాగనంపి తిరిగి ఉపప్లవ్యనగరమునకు స్త్రీలతోబాటు వచ్చెను.

"పాండవులు దుర్గరక్షణము కొఱకు అవశ్యకములైన స్థావరములను (బురుజులు, అగడ్తలు మొదలైనవి),జంగమములను (ద్వారపాలకులు, సైనికులు మొదలైనవి) ఏర్పరచి, స్త్రీలను ధనాదులను రక్షించుట కొఱకు ఏర్పాట్లు చేసి కొంత అధిక సామగ్రిని తనవెంట తీసికొని బయలుదేరెను

''జనమేజయా! బ్రాహ్మణులు యుధిష్ఠిరుని నలువైపుల అనుసరించుచు పాండవుల గుణగానము చేయుచు ఆశీర్వదించుచు కొంత దూరము అనుసరించి పోయిరి. వారికి యుధిష్ఠిరుడు గో - సువర్ణాదులు దానము చేసి నమస్కరించి మణిభూషితమైన రథముపైన కూర్చొని యుద్ధయాత్ర చేయుచుండెను.

''జనమేజయా! కేకయరాజకుమారులైదుగురు, ధృష్టకేతువు, కాశీరాజ పుత్రుడు 'అభిభూ' అనువాడు, శ్రేణిమంతుడు, వసుదానుడు, ఎవ్వరికిని ఓడిపోవని శిఖండి, వీరందఱు కవచ భూషణాదులు ధరించి ఆయుధ ధారులై, హర్షోత్సాహముతో యుధిష్ఠిరుని అనుసరించి పోవుచుండిరి.

''సేన వెనుక అర్ధభాగమునందు విరాటరాజు, ధృష్టద్యుమ్నుడు, సుధర్ముడు, కుంతిభోజుడు, ధృష్టద్యుమ్న పుత్రుడు పోవుచుండిరి.

"వారివెంట నలువదివేల రథములు, రెండు లక్షల గుఱ్ఱములు, నాలుగు లక్షల కాల్బలము, అరువదివేల గజములు ఉండెను.

''ధృష్టి చేకితానుడు, ధృష్టకేతువు, సాత్యకి మొదలైనవారు కృష్ణార్జునుల వెనువెంట పోవుచుండిరి.

"జనమేజయా! ఈవిధముగ సేనావ్యూహములను రచించుకొని యుద్ధము చేయుటకు సన్నద్ధులైన పాండవ సైనికులు కురుక్షేత్రమునకు పోయి కోడెలవలె రంకెలు వేయుచుండిరి.

''శత్రుదమనులైన ఆ వీరసైనికులు కురుక్షేత్రము యొక్క సీమకు పోయి తమ తమ శంఖములను ఊదిరి. కృష్ణార్జునులు గూడ తమ పాంచజన్య - దేవదత్త శంఖములను ఊదిరి. పిడుగు ధ్వనివంటి గంభీరమైన పాంచజన్య ధ్వని విని అన్ని వైపుల వ్యాపించియున్న సమస్త పాండవుల సైనికులు హర్షోత్ఫుల్ల హృదయములతో రోమాంచితులైరి. శంఖ దుందుభి ధ్వనులతో కలిసిన వీరసైనికుల సింహనాదములు భూమ్యాకాశములు సముద్రముల వఱకు వ్యాపించి అన్నివైపుల ప్రతిధ్వనించెను.''

వైశంపాయనుడు జనమేజయునకిట్లు చెప్పి, తరువాతి వృత్తాంతము చెప్పదొడగెను.

యుధిష్ఠిరుని సేనానివేశ శిబిరములు

"జనమేజయా! తరువాత యుధిష్ఠిరుడు ఒక నునుపైన చదరపు ప్రదేశమందు నీరు, గడ్డి, ఇంధనములు దొరకు చోటు చూసి, అచట తన సేనను విడియించెను.

"శ్మశానము - దేవమందిరము - మహర్షుల ఆశ్రమము - పుణ్యక్షేత్రము - సిద్ధక్షేత్రము - ఇవేమియు లేకుండ, చవిటి భూమి గాకుండ, దూరముగానున్న సుందరము, పరిశుద్ధము, పవిత్రమునైన చోటు చూచి యుధిష్ఠిరుడు తన సేనను నిలిపెను.

"తరువాత వాహనము లన్నియు విశ్రాంతితీసికొనిన పిమ్మట శ్రీకృష్ణుడు తానుకూడ విశ్రాంతి తీసికొని లేచి, అనేక రాజులతో కూడుకొని, అర్జునుని వెంటనిడుకొని ముందుకుసాగెను.

''ఆయన దుర్యోధనుని సైనిక దళములను దూరముగా పారద్రోలి, అక్కడ అన్నివైపుల తిరుగజొచ్చెను. అప్పుడు ధృష్టద్యుమ్నుడు - సాత్యకి సైనిక శిబిరములను నిర్మించుటకు యోగ్యమైన భూమిని కొలిచిరి.

''జనమేజయా! కురుక్షేత్రమునందు స్వచ్ఛజలము ప్రవహించుచున్న 'హిరణ్వతి' అను పవిత్ర నది ఉన్నది. దాని తీరమునందు సుందరములైన ఘట్టము లుండెను. ఆ నదియందు గులకరాళ్ళు - బురద లేకుండెను.

''శ్రీకృష్ణుడు దానినుండి అగడ్త త్రవ్వించెను. దాని రక్షణము కొరకు కావలివారిని నియమించెను. అక్కడనే సేనను నిలిపెను.

''పాండవుల కొఱకు నిర్మింపబడిన శిబిరముల వంటివే ఇతర శిబిరములు ఇతర రాజుల కొఱకు కూడ నిర్మింపజేసెను.

''జనమేజయా! ఆ సమయమునందు వేరువేరుగా వేలకొలది శిబిరములు సుందరముగా నిర్మింపజేసి, వాటిలో వంటచెరకు - భక్ష్యభోజ్యములైన ఆహార సామగ్రి - పానీయములు సమకూర్చబడెను.

''ఆ శిబిరములు భూతలమునందున్నను విమానములవలె ప్రకాశించుచుండెను. అక్కడ అనేకులు శిల్పవిద్యాపారంగతులు, వైద్యవిద్యా పండితులు

వేతనములిచ్చి ఉంచబడిరి. వారు సమస్తములైన ఉపకరణములతో అక్కడ సిద్ధముగా నుండిరి.

''ప్రతియొక శిబిరమునందును ఆల్లెత్రాళ్ళు, ధనుస్సులు, కవచములు, అస్త్రశస్త్రములు, తేనె, నేయి, మద్దిజిగురు ఇవన్నియు ఎక్కువగా నిలువ చేయబడెను.

''ధర్మరాజుచే ప్రతి శిబిరములోను అధిక జలము - మంచి గడ్డి-పొట్టు - అగ్ని ఉంచబడెను. పెద్ద పెద్ద యంత్రములు - నారాచములు (బాణములు), తోమరములు - గండ్రగొడ్డళ్ళు - కవచములు - ఖడ్గములు - అంబులపొదులు - మొదలైన వస్తువులు కూడ అక్కడ నిలువయుంచబడెను.

''లక్షలకొలది యోధులతో యుద్ధము చేయజాలిన పర్వతసమానములైన మహాగజము లనేకము లుండెను. ఆ గజములపైన కంటకయుక్త కవచములు, ఇనుప కవచములు, ఇనుప కంబళములు కప్పబడి యుండెను.

''జనమేజయా! పాండవులు కురుక్షేత్రమునకు పోయి సేనానివేశము ఏర్పరచినారని తెలిసి, వారి మిత్రు లనేకులు తమ తమ సేనలతోను, వాహనములతోను ఆ చోటికి పోయిరి.

"బ్రహ్మచర్యపాలనము చేయుచు, యజ్ఞములయందు సోమరస పానము చేసి, అనేక దక్షిణల దానము చేసిన రాజులు పాండవుల విజయము కొఱకు కురుక్షేత్రమునకు వచ్చిరి."

ఇట్లు చెప్పిన వైశంపాయనుని జనమేజయుడు మరల ప్రశ్నించెను:

"మహామునీ! ధర్మరాజు యుద్ధము కొరకు సేనలతో బయలుదేరి శ్రీకృష్ణ భగవానునిచేత రక్షింపబడుచు కురుక్షేత్రము చేరినాడని, అక్కడ సేనానివేశము ఏర్పరచుకొని యున్నాడని, ద్రుపద విరాట రాజులు కూడ తమ పుత్రులతో అక్కడ చేరినారని, కేకయ కుమారులు, వృష్ణివంశీయ యోధులు, అనేక రాజులు ధర్మరాజును చేరియున్నారని, వారితో గూడిన యుధిష్ఠిరుడు దేవతలతో గూడిన దేవేంద్రునివలె ప్రకాశించుచున్నాడనియు వినిన దుర్యోధనుడు ఏమి చేసెను? కురుక్షేత్రమునందు ఆ భయంకర సేనానివేశము ఏర్పడినప్పుడు జరిగిన కథనంతయు నేను వినగోరుచున్నాను.

''తపోధనా! పాండవులు, శ్రీకృష్ణభగవానుడు, విరాట ద్రుపద పాంచాలురు, ఇతర రాజకుమారులు, ధృష్టద్యుమ్న - శిఖండి - యుధామన్యులు వీరందరు సంగ్రామ భూమియందు చేరినప్పుడు దేవతాసహితుడైన ఇంద్రుని కూడ జయింపగలరు. కాబట్టి, అక్కడ కౌరవ, పాండవులు చేసిన కార్యము లన్నియు వినగోరుచున్నాను.''

అట్లు ప్రశ్నించిన జనమేజయునకు వైశంపాయనుడు ఈ విధముగా ఉత్తరము చెప్పెను :

''జనమేజయ మహారాజా! శ్రీకృష్ణుడు సేనలకు ఏర్పాట్లన్నియు చేసి వెడలిపోయిన తరువాత దుర్యోధనుడు కర్ణ, శకుని, దుశ్శాసనులతో నిట్లనెను:

దుర్యోధనుడు రాజులతో మంతనము చేయుట

''శ్రీకృష్ణుడు ఇక్కడినుండి కృతకృత్యుడై పోవలేదు. అతడు కోపముచేత పాండవులను నిక్కముగానే యుద్ధము కొఱకు ఉద్రేక పరచెను. ఇందులో సంశయము లేదు. వాస్తవముగా శ్రీకృష్ణుడు, నాకు పాండవులతో యుద్ధము జరుగవలెననియే కోరుచున్నాడు. భీమార్జునులు కృష్ణుని అభిప్రాయము ప్రకారమే నడచుచుందురు. ధర్మజుడు అధికముగా భీమునకే వశుడై యుండెను.

"ఇంతయేకాక,నేను పూర్వము అతనిని, అతని తమ్ములను తిరస్కరించి యుంటిని. ద్రుపద విరాటులు నాయందు పగ బూనియే యున్నారు. వారు పాండవ సేనలను శ్రీకృష్ణుని ఆజ్ఞానుసారము నడుపుచుందురు.

''కాబట్టి ఇప్పుడు మనకు పాండవులతో జరుగబోవు యుద్ధము మిక్కిలి భయంకరముగా నుండును. అందుచేత రాజులారా! మీరందరు సోమరితనము విడిచి యుద్ధ సన్నద్ధులు కండు. మీరు కురుక్షేత్రమునందు వేలకొలది శిబిరములను నిర్మించి వాటియందు మనకు అవశ్యకములైన వస్తు సామగ్రులన్నియు పూర్తిగా ఉంచి శత్రువులకు వాటిపైన అధికారము లేకుండ చేయుడు.

"ఆ శిబిరముల సమీపములందు జలము,పంట చెరకు సులభముగా దొరుకు సౌకర్యము లేర్పరచుడు. వాటిలో ఆహార పదార్థములను ఏ ఆటంకము లేకుండ చేర్చుటకు వీలైన త్రోవలను ఏర్పచుడు. వాటిని శత్రువులు నష్టము చేయకుండ చూచుచుండుడు. ఆ శిబిరముల నలువైపుల ప్రాకారములు నిర్మింపుడు.

''ఆ శిబిరములయందు అనేక శస్త్రాస్త్రములను ఉంచి ధ్వజపతాకములతో అవి శోభిల్లుచుండునట్లు చేయుడు. ఆ శిబిరనగరములోనికి పోవుటకు సరళములై, సమతలములైన మార్గములను నిర్మింపుడు. రేపు ఉదయమే యుద్ధము కొఱకు ప్రయాణము చేయవలెనని చాటింపుడు. ఏ మాత్రము విలంబము కాకుండ ఈ కార్యము లన్నియు నెరవేర్పుడు ''

''రాజులందరు దుర్యోధనుని ఆజ్ఞవిని 'మంచిది - అట్లే చేసెదము' అని ప్రతిజ్ఞ చేసిరి.

"కర్ణుడు మొదలైన వీరులు మిక్కిలి సంతోషముతో మరునాడు ఉదయమే రాజుల నివాసముల కొఱకు శిబిర నిర్మాణమును ఆరంభించిరి.

"తరువాత అక్కడికి వచ్చిన రాజులు దుర్యోధనుని ఆజ్ఞ విని చందనాగురు సుగంధ ద్రవ్యముల నందికొని, సువర్ణ భుజకీర్తులతో శోభిల్లుచు, గడియమానులతో సమానములైన భుజములను చరచుకొనుచు, తమ తమ ఆసనముల నుండి లేచి నిలువబడిరి.

జనమేజయా! ఆ రాజులందఱు తలపాగలు దోవతులు ఉత్తరీయములు వివిధాభరణములు ధరించిరి. ఉత్తమ రథికులు రథములను, గుఱ్ఱపు రౌతులు గుఱ్ఱములను, గజారోహులు గజములను సిద్ధము చేసికొనిరి. వారు చిత్రవిచిత్రములైన బంగారు కవచములను వివిధ శస్త్రాస్త్రములను ధరించిరి. కాల్బలము వారు కూడ బంగారు కవచములను శస్త్రాస్త్రములను ధరించిరి

"జనమేజయా! అప్పుడు హస్తినాపురమందు గొప్పఉత్సవము జరుగుచున్నట్లుగా ఉండెను. అక్కడ సంతోషముచేత ఉప్పొంగుచున్న మనుష్యుల కలకలము గొప్పగా రేగెను.

"రాజా! చంద్రోదయకాలమందు సముద్రము ఉత్తుంగ తరంగములతో ఉప్పొంగినట్లు దుర్యోధనుడనెడు మహా సాగరము, సైనిక సముదాయమనెడు చంద్రుని యొక్క ఉదయము చేత మిక్కిలి ఉల్లాసముతో నున్నట్లు కనబడెను.

"అక్కడ అన్ని దిక్కులకు నడచుచున్న జన సముదాయము జలమునందు ఉన్న నీటి బుగ్గలవలె నుండెను. రథ గజ తురగములు దుర్యోధన సాగరమునందు మత్స్యములవలె తోచుచుండెను. శంఖదుందుభిధ్వనులు సాగర గర్జనమువలె నుండెను. ధనాగారములు సముద్ర రత్నరాసులవలెను, యోధుల విచిత్రాభరణములు కవచములు పైకెగయు అలలవలెను ఉండెను. మెరయు

చున్న శస్త్రములు స్వచ్ఛమైన నురుగులవలె నుండెను. అక్కడి భవనముల వరుసలు తీరమునందలి పర్వతములవలె నుండెను. మార్గముల యందుగల అంగళ్ళు పర్వత గుహలవలె నుండెను."

ఇట్లు చెప్పి వైశంపాయనుడు తరువాతి కథను చెప్పదొడగెను:

''జనమేజయా! శ్రీకృష్ణ భగవానుడు పూర్వము చెప్పిన మాటలను జ్ఞప్తికి తెచ్చుకొనుచు యుధిష్ఠిరుడు అతనిని మరల నిట్లడిగెను:

''భగవన్! మందబుద్ధియైన దుర్యోధనుడు ఎందుకు ఇట్లనెను? అచ్యుతా! ఇప్పుడు నేనేమి చేయవలెను? ఎట్లు వ్యవహరించవలెను? ఏమి చేసినచో నేను ధర్మచ్యుతుడను కాకుందును?

"వాసుదేవా! కర్ణశకుని దుర్యోధనుల యభిప్రాయము దుర్యోధన సోదరుల యభిప్రాయము నా యభిప్రాయము కూడ నీకు తెలియును. భీష్ముడు విదురుడు మాట్లాడిన మాటలు కూడ నీవు విన్నావు. నా తల్లి కుంతీదేవి యభిప్రాయము కూడ నీకు తెలియును.

"కనుక ఈ యభిప్రాయములన్నిటిని అట్లుండనిచ్చి నీవు స్వయముగ ఈ విషయములను పలుసార్లు విచారించి మా కిపుడు ఏది సముచితమో నిస్సందేహముగ తెలుపుము."

"జనమేజయా! ధర్మరాజు చెప్పిన ధర్మార్థ సమ్మతములైన మాటలను విని శ్రీకృష్ణ భగవానుడు మేఘదుందుభి గంభీర ధ్వనితో నిట్లనెను:

"ధర్మరాజా! నేను దుర్యోధనునకు ధర్మార్థ సంగతము హితకరమునైన మాటలను కౌరవసభలో చెప్పితిని. కాని, కపటియైన దుర్యోధనుడు వానిని గ్రహింపలేదు. భీష్మ విదురుల మాటకూడ అతడు వినలేదు. అతడు అందరు చెప్పిన మాటలన్నిటిని ఉల్లంఘించెను. కర్ణుని ఆశ్రయించి అతడు అందరిని జయించినాననుకొనుచున్నాడు. అతనికి ధర్మముపైన, కీర్తిపైన ఇచ్ఛలేదు.

"ధర్మజా! ఆ దురాత్ముడైన దుర్యోధనుడు కౌరవ సభలో నన్ను బంధించి చెర పెట్టుమని ఆజ్ఞయిచ్చెను. కాని, అతని మనోరథము నెరవేరలేదు. అక్కడ భీష్మద్రోణులు కూడ అతనికి సముచితమైన మాటలు చెప్పలేదు.

"విదురుడొక్కడు తప్ప ఇతరులందరు దుర్యోధనునే అనుసరించుచుండిరి.

"కర్ణ-శకుని-దుశ్శాసనులు ముగ్గురు మూర్ఖులు అసహనముతో దుర్యోధనుని కడ నీ విషయమై అనుచితములైన మాటలెన్నో అనిరి. ఆ సభలో ఎవరెవరు ఏమి మాట్లాడినది మరల చెప్పుటవలన ఏమి లాభము? సంగ్రహముగా ఒక్క-మాటలో చెప్పవలెనన్నచో, దుర్యోధనుడు నీ విషయమునందు ఏమాత్రము న్యాయ యుక్తముగా వ్యవహరించుటలేదని తెలిసికొనుము.

"ధర్మజా! ఇప్పుడు ఈ నీ సేనలోనున్న రాజులలో ఎవరియందు పాపము కలదో ఎవరియందు అశుభము కలదో అది యంతయు దుర్యోధనునియందున్నది.

"మనము కూడ అధిక త్యాగము చేసి సర్వస్వము పోగొట్టుకొని ఎప్పుడు కూడ ఎట్టి పరిస్థితిలో కూడ కౌరవులతో సంధిని చేసికొనలేకపోయితిమి. కాబట్టి మనకు యుద్ధము చేయుటయే ఉచితమైనది. అది తప్ప గత్యంతరము లేదు."

"జనమేజయా! శ్రీకృష్ణభగవానుడు చెప్పిన మాటలను విని అక్కడి రాజులందరు మౌనముతో యుధిష్ఠిర మహారాజు ముఖము చూచుచుండిరి. యుధిష్ఠిరుడు ఆ రాజుల అభిప్రాయము గ్రహించి భీమార్జున నకుల సహదేవులతోపాటు ఆ రాజులకు యుద్ధసన్నద్ధులు కమ్మని ఆజ్ఞ యిచ్చెను.

"తరువాత యోధులందరు సంతోషముతో లేచి కలకల శబ్దము చేసిరి. దానిని యుధిష్ఠిరుడు చూచి "యుద్ధము రేగిన తరువాత వధార్హులు కాని వారిని కూడ వధింపవలసి వచ్చును కదా!" అని మనస్సులో దుఃఖముతో దీర్ఘముగా నిట్టూర్చి భీమార్జునులతో నిట్లనెను:

''తమ్ములారా! దేనిని తప్పించుకొనుటకు వనవాస కష్టము నంగీకరించి అనేక దుఃఖములు సహించితినో ఆ యుద్ధరూపమైన మహానర్థమును నేను ఎన్ని ప్రయత్నములు చేసినను తప్పించుకొనలేకపోయినాను. ఆ యనర్థము మనపైననే రానున్నది. దానిని తొలగించుటకొఱకు మనము పూర్తిగా ప్రయత్నము చేసి నప్పటికిని మన ప్రయాసమంతయు వ్యర్థమై యుద్ధమును నివారించలేకపోయితిమి. యుద్ధము కొఱకు మనము ప్రయత్నము చేయకున్నను అది స్వయముగా వచ్చి మనపైన పడుచున్నది.

''తమ్ములారా! ఎవరు వధార్హులు కారో, వారితో యుద్ధము చేయుట ఎట్లు ఉచితమగును? వృద్ధులైన గురుజనముల వధించిన తరువాత మనకు విజయము ఏ విధముగా ప్రాప్తించినట్లగును?"

''ధర్మరాజు మాటలు విని, అర్జునుడు, శ్రీకృష్ణుడు తనకు చెప్పిన మాటలను అతనికి ఇట్లు వినిపించెను:

''రాజా! శ్రీకృష్ణుడు మన తల్లి కుంతీదేవి, మన పినతండ్రి విదురుడు చెప్పిన మాటలు నీకు వినిపించియుండెను. వాటిని నీవు సమగ్రముగ విచారించి యుందువు. ఆ యిద్దరు అధర్మము చెప్పరు అని నా నిశ్చితాభిప్రాయము. అగ్రజా! ఇప్పుడు మనము యుద్ధము మానుకొనుట ఉచితము కాదు."

''అర్జునుని మాటలు విని శ్రీకృష్ణుడు కూడ ధర్మరాజుతో మందహాసము చేయుచు ''ఔను, అర్జునుడు సరిగనే చెప్పుచున్నాడు" అని యనెను.

''జనమేజయ మహారాజా! తరువాత యోధులతో గూడ పాండవులు యుద్ధముకొఱకు దృఢనిశ్చయులై ఆ రాత్రిని సుఖముగా గడపిరి.

''జనమేజయా! ఆ రాత్రి గడచి తెల్లవారగనే దుర్యోధనుడు తన పదకొండక్షౌహిణీల సేనలో రథములు - గజములు - అశ్వములు - కాల్బలము ఉత్తమ మధ్యమ నికృష్ట శ్రేణులుగా వేర్వేరు విభాగములు చేసి, వాటిని వేర్వేరు స్థలములందుంచెను.

దుర్యోధనుని సేనారచన

''ఆ వీరులందరు "అనుకర్షము (రథమును బాగుచేయుటకు దానిక్రింద కట్టబడిన కఱ్ఱ) లను, అంబుల పొదులను, వరూథము (రథమును కప్పుటకు వేయబడు వ్యాఘ్రాది చర్మము) లను, ఉపాసంగము (గజముగాని, అశ్వముగాని లేపగల అంబులపొది)లను, తోమరములను, శక్తులను, నిషంగము (కాలుబలము వారు తీసుకొనిపోవు అంబుల పొది) లను, ఋష్టులను (రెండంచుల ఖడ్గములు), ధ్వజములను, పతాకములను, ధనుర్బాణములను, వివిధములైన త్రాళ్ళను, పాశములను పరపులను, కచగ్రహవిక్షేపము (వెంట్రుకలు పట్టుకొని క్రిందపడవేయు యంత్రము) లను, నూనె, బెల్లము, ఇసుక, విషసర్పములుగల కడవలు, మద్ది జిగురు, ఘంటఫలకము (గంటలుగల డాలు)లు, ఖడ్గము మొదలైన లోహశస్త్రములు, కలియబెట్టిన బెల్లపు నీరు, గులకరాళ్ళు, సాలాయుధములు, భిందివాలములు, మైనము పూసిన ముద్గరములు, ముండ్లకట్టెలు, నాగేండ్లు, విషము పూసిన బాణములు, చేటలు, గంపలు, కొడవండ్లు, అంకుశములు, తోమరములు, ముండ్ల కవచములు, వాడిసెలు, గొడ్డండ్లు. రంపములు, వ్యాఘ్రఖడ్గమృగ చర్మ

ములచే కప్పబడిన రథములు, కాలచూర్ణములు, కొమ్ములు, ప్రాసములు, వివిధాయుధములు, కుద్దలులు, నూనెతో తడుపబడిన పట్టువస్త్రములు, నేయి - వీటిని తీసుకొనియుండిరి.

''ఆ సైనికులందరు బంగారు కవచములు ధరించి వివిధమణిమయ భూషణములచే అలంకరింపబడి విచిత్రశోభ కలిగి అగ్ని సమానముగ ప్రకాశించుచుండిరి.

''ఈ విధముగనే శస్త్ర విద్యాజ్ఞానము కలిగి, సత్కులీనులై అశ్వముల జాతులను గుర్తుపట్టగలవారుగా నుండి, కవచధారులైన శూరులే రథసారథ్యమునకు నియుక్తులైరి.

"ఆ సేనయొక్క రథములందు అమంగళ నివారణము కొఱకు త్రాళ్ళతో యంత్రములు, ఓషధులు కట్టబడియుండెను. రథములకు కట్టబడిన ధ్వజములు అకాశమునందె దెగురుచుండెను. రథములకు చిన్నచిన్న గంటలు కట్టబడియుండెను.

''ఒక్కొక్క రథమునకు నాలుగు గుఱ్ఱములు కట్టబడియుండెను. ఆ గుఱ్ఱములు ఉత్తమ జాతికి చెందియుండెను. అన్ని రథములందున్ను ప్రాసములు, మద్ధి జిగురు, నూరు ధనుస్సులు ఒరలలోని ఖడ్గములు ఉంచబడియుండెను.

ఒక్కొక్క రథమునకు ఇరువైపుల రెండు గుఱ్ఱముల పైన ఎక్కిన చక్రరక్షకులు ఉండిరి. వారిద్దరు రథిక శ్రేష్ఠులే. రథికులుకూడ రథసారథ్యకళయందు నిపుణులే.

"అన్నివైపుల సువర్ణహారములతో అలంకరింపబడిన వేలకొలది రథములు శోభిల్లుచుండెను. శత్రువులు వానిని భేదించ జాలకుండిరి. అన్నియు నగరముల వలె సురక్షితములైయుండెను.

''రథములవలెనే గజములు కూడ సువర్ణహారాలంకృతములై యుండెను. అవి త్రాళ్ళతో కట్టబడియుండెను. ఒక్కొక్క దానిపైన ఏడుగురు చొప్పున గజారోహకులు కూర్చొని యుండిరి. వారితో ఆ గజములు రత్నాలంకృతములైన పర్వతములవలె నుండెను. ఆ యేడుగురిలో ఇద్దరు అంకుశములు తీసుకొని మావటి వాండ్రుగా నుండిరి. ఇద్దరు శ్రేష్ఠ ధనుర్ధారులైన యోధులు. ఇద్దరు మంచి ఖడ్గధారులు, ఒకడు శక్తి త్రిశూలాయుధములను ధరించియుండెను.

''జనమేజయా! దుర్యోధనుని సేనయంతయు అస్త్రశస్త్రభాండాగారముల చేత కూడినదై మత్తగజములచేత వ్యాపించి యుండెను.

''యుద్ధసన్నద్ధులై ధ్వజములుగల అశ్వికులతో గూడిన లక్షల కొలది గుఱ్ఱములు సేనయందుండెను. ఆ గుఱ్ఱములు ఎగురుట దుముకుట మొదలైన దోషములు లేకుండుట చేత అవి అశ్వికుల వశమునందుండెను. అవి అన్నియు సుశిక్షితములు. అవి బంగారు కళ్లెములతో లక్షల కొలదిగ నుండెను.

"ఆ సేనయందు కాల్బలమువారు కూడ సువర్ణహారములతో అలంకృతులై యుండిరి. వారి రూపము-రంగు-కవచములు-అస్త్రశస్త్రములు అనేక విధములుగ నుండెను.

''ఒక్కొక్క రథమునకు పది యేనుగులు, ఒక్కొక్క గజమునకు పది గుఱ్ఱములు, ఒక్కొక్క గుఱ్ఱమునకు పదుగురు కాల్బలమువారు రథగజాశ్వ పాదములను రక్షించు చుండిరి.

"ఒక్కొక్క రథమువెనుక ఏబదియేనుగులు, ఒక్కొక్క గజము వెనుక నూరు గుఱ్ఱములు, ఒక్కొక్క గుఱ్ఱము వెంట ఏడుగురు కాల్బలమువారు ఉండిరి. వారు సమూహముగనుండి చెదరిపోయిన రెండు సైనిక సంఘములను పరస్పరము కలుపుటకై యేర్పరుపబడియుండిరి.

''ఐదునూర్ల గజములు, ఐదునూర్ల రథములు కలిసి ఒక సేన అని పిలువబడును. ఇటువంటి పదిసేనలు కలసి 'పృతన' అనబడును. పదిపృతనలు కలయికకు 'వాహిని' అని పేరు. ఇవిగాక ''సేనా-వాహినీ-పృతనా-ధ్వజినీ-చమూ-వరూధినీ-అక్షౌహిణీ'' ఇవన్నియు సమానార్థకములైనను వేరువేరుగా సేనావర్ణనము చేయబడియున్నది.

"ఏబదియైదు కాల్బలమువారి సంఘమునకు 'పత్తి' యని పేరు. మూడు పత్తులు కలిసి ఒక 'సేనాముఖ' మగును. సేనాముఖమునకు 'గుల్మము' అని మరియొక పేరు గలదు. మూడు గుల్మములు ఒక 'గణ' మగును. దుర్యోధనుని సేనలలో కాల్బలమువారు పదివేల కంటె అధిక గణములుండిరి.

"జనమేజయా! ఈ విధముగ దుర్యోధనుడు తన సేనలను వ్యూహములుగా పన్నెను. అప్పుడు కురుక్షేత్ర సంగ్రామ రంగము నందు, అటు ఏడు,

ఇటు పదకొండు వెరసి పదునెనిమిది అక్షౌహిణీల సేనలు ఒకచోట చేరియుండెను. పాండవులకు ఏడు, కౌరవులకు పదకొండు అక్షౌహిణులుండెను.

''అప్పుడు దుర్యోధనుడు బాగుగా విచారించి బుద్ధిమంతులైన శూరులను సేనాపతులుగా నియమించెను.

కృప-ద్రోణ-అశ్వత్థామ-శల్య-సైంధవ-సుదక్షిణ-కృతవర్మ-కర్ణ-భూరిశ్రవస్-శకుని-బాహ్లికులును పదకొండుగురిని పదకొండక్షౌహిణీ సేనలకు వేర్వేరుగా సేనాపతులుగా నియమించి వారికి విధిపూర్వకముగా సేనాపతిత్వ పట్టాభిషేకము చేసెను.

"దుర్యోధనుడు ఆ సేనాపతులందరికిని ప్రతిదినము ప్రతిపూట మాటిమాటికి అనేక విధములగు పూజలు చేయుచుండెను.

"దుర్యోధనుని అనుచరులు గూడ వారి వారికి తగిన స్థానములందు నియమింపబడిరి. ఆ రాజసైనికులు దుర్యోధనునకు ప్రియముచేయు కోరికతో తమ తమ కార్యములందు తత్పరులై యుండిరి."

వైశంపాయనుడు ఈ విధముగ దుర్యోధనుని సేనారచనను గూర్చి చెప్పి తరువాత వృత్తాంతమును జనమేజయ మహారాజునకు ఇట్లు చెప్పదొడగెను:

దుర్యోధనుడు భీష్మని సర్వసేనాధిపతిగా పట్టాభిషిక్తుని చేయుట

''జనమేజయా! తరువాత దుర్యోధనుడు సమస్త రాజులతో కలిసి శాంతను నందనుడైన భీష్మని కడకుపోయి చేతులు జోడించుకొని ఆయన నిట్లు ప్రార్థించెను:

"పితామహా! ఎంత పెద్ద సేననైనను, యోగ్యుడైన సేనాపతి లేకున్న యుద్ధరంగము నందు చీమలబారువలె చెదిరిపోవును. ఇద్దరు పురుషుల బుద్ధి ఎప్పుడు కూడ ఒకటిగా నుండదు. రెండువైపుల యోగ్యసేనాపతులుండినప్పుడు ఆ యిరువురి శౌర్యము పరస్పరము స్పర్థ పడుచుండును.

''నాకు పూర్వగాథ యొకటి జ్ఞప్తికి వచ్చుచున్నది. అది యేమనగా :

సేనాపతి ప్రాధాన్యము

"మహామతీ! బ్రాహ్మణులందరు తమ దర్భమయమైన ధ్వజమును ఎగురవేయుచు పూర్వము ఒకప్పుడు అమిత తేజస్వియైన హైహయవంశ క్షత్రియులపైన దాడి సల్పియుండిరని చెప్పెదరు. పితామహా! అప్పుడు బ్రాహ్మణులతో పాటు వైశ్యులు శూద్రులు కూడ హైహయరాజులపైన ఆక్రమణము చేసిరి. ఒకవైపు బ్రాహ్మణ వైశ్యశూద్రులు, మరియొకవైపు సమర్థులైన క్షత్రియులు ఉండిరి.

''ఆ రెండు వర్గములవారు యుద్ధము ప్రారంభించినప్పుడు మూడు వర్ణముల వారు మాటిమాటికి వెన్నుచూపి పారిపోయిరి. వారి సేనాసంఖ్య అధికముగా నున్నప్పటికిన్ని ఇటువైపువున్న క్షత్రియులు ఐకమత్యముతో ఉండుటచేత వారిని జయింపగలిగిరి.

''పితామహా! అప్పుడు ఆ బ్రాహణ శ్రేష్ఠులు క్షత్రియులతో, 'మా అపజయమునకు కారణమేమి?' అని యడిగిరి. అప్పుడు ధర్మజ్ఞులైన క్షత్రియులు వారి పరాజయమునకు వాస్తవమైన కారణమును ఇట్లు చెప్పిరి:

"బ్రాహ్మణోత్తములారా! మేము అత్యంత బుద్ధిమంతుడైన ఒక పురుషని సేనాపతిగా చేసికొని అతని యాజ్ఞలను పాలించుచుంటిమి కాని, మీరందఱు వేరువేరు జాతులుగా నుండి తమ తమ బుద్ధికి వచ్చినట్లు వ్యవహరించితిరి. అందువలన మీకు ఓటమి కలిగెను.''

"ఆ మాటవిని ఆ బ్రాహ్మణులు ఒక వీరుడు, నిపుణుడునైన బ్రాహ్మణుని సేనాపతిగా చేసికొని అతని యాజ్ఞలను పాలించుచు క్షత్రియులపైన విజయమును సాధించిరి.

''ఆ విధముగా హితైషి, పాపరహితుడు, యుద్ధకుశలుడు, శూరుడునైన పురుషని సేనాపతిగా చేసికొనినవారు యుద్ధమునందు అవశ్యకముగా విజయము సాధింపగలరు అని పైగాథవలన స్పష్టమగుచున్నది.

''పితామహా! నీవు సర్వదా నా హితమును కోరువాడవు. నీతిలో శుక్రాచార్యులకు సమానుడవు. నీ యిచ్ఛలేక ఎవడు గూడ నిన్ను చంపజాలడు, నీవు ఎల్లప్పుడు ధర్మమునందే నిలిచియుందువు. కాబట్టి మా సైన్యమున కంతటికిని ప్రధాన సేనాపతిగ నీవు ఉండుమని ప్రార్థించుచున్నాను.

"పితామహా! తేజస్వంతులకు సూర్యుడు, వృక్షములకు - ఓషధులకు చంద్రుడు, యక్షులకు కుబేరుడు, దేవతలకు ఇంద్రుడు, పర్వతములకు మేరువు,

పక్షులకు గరుడుడు, సమస్త దేవయోనులకు కుమారస్వామి, వసువులకు అగ్ని దేవుడు అధిపతి, సంరక్షుడున్ను అయినట్లు మన సేనలన్నిటికి నీవు ప్రధాన సేనా నాయకుడవుగాను, సంరక్షకుడవుగాను ఉండగలవు.

"తాతా! ఇంద్రునిచేత సురక్షితులయిన దేవతలవలె నీ సంరక్షణము నందుండిన మేము నిశ్చయముగా దేవతలకు గూడ అజేయులము కాగలము. కుమారస్వామి దేవతలకు ముందు నిలిచి నడుచుచున్నట్లు నీవు మన సేనలకు అగ్రగామిగా నుండుము. దూడలు కోడె వెనువెంట నడచునట్లు మేమందరము నిన్ననుసరించి నడచుచుండెదము.

"దుర్యోధనుని ప్రార్థనను విని భీష్మ పితామహుడు అతనితో నిట్లనెను:

"దుర్యోధనా! నీవు చెప్పినది సరియే. కాని, నాకు మీ రెంత ప్రీతిపాత్రులో పాండవులును గూడ నంత ప్రీతిపాత్రులే. నన్నడిగినప్పుడు వారికి హితమైన మాట తప్పక చెప్పెదను. నీ కొఱకు యుద్ధము చేసెదను. నేను ఇట్టి ప్రతిజ్ఞనే చేసితిని.

"ఈ భూమండలము నందు అర్జునుడు తప్ప ఇతర యోధులెవ్వరు కూడ నాతో సమానులు లేదు. అర్జునుడు అనేక దివ్యాస్త్రములను ఎరిగినవాడు. కాని, అతడు నా యెదుటికి వచ్చి ప్రకటముగా ఎప్పుడు కూడ యుద్ధము చేయడు

''అర్జునుని వలెనే నేను తలచినచో నా శస్త్ర బలము చేత దేవాసురమనుష్య సహితముగ ఈ సమస్త ప్రపంచమును క్షణ కాలములో నిర్జీవము చేయగలను.

''కాని, రాజా! నేను ఎట్టి పరిస్థితిలో కూడ పాండవులను సంహరించను. ఒకవేళ పాండవులు యుద్ధారంభములోనే నన్ను చంపకుండిన యెడల నా అస్త్ర ప్రయోగము చేత ప్రతి దినము పాండవ పక్షము నందలి పదివేల యోధులను వధించెదను. ఈ విధముగ వారి సైన్యముల సంఖ్యను తగ్గించెదను.

"నాయనా! ఒక యెడంబడికపైన నేను నీ సేనాపతినయ్యెదను. ఇది తప్ప నాకు వేరు ప్రతిజ్ఞ లేదు. దీని స్థానములో మరియొక ప్రతిజ్ఞ చేయుటకు గూడ నేను అంగీకరింపను అది యేమనగా, మొదట కర్ణుడైనను యుద్ధము చేయ వలెను - లేదా నేనైనను మొదట చేయవలెను. ఎందుకనగా - కర్ణుడు యుద్ధము నందు సర్వదా నాతో స్పర్ధ (పోటీ) పడుచుండును."

''భీష్ముడు చెప్పిన మాటలు విని కర్ణుడు దుర్యోధనునితో నిట్లనెను:

"రాజా! భీష్ముడు బ్రతికి యున్నంత వఱకు నేను యుద్ధము చేయను. ఈయన సంహరింపబడిన తరువాతనే నేను అర్జునునితో పోరాడెదను."

"జనమేజయా! తరువాత ధార్తరాష్ట్రుడు భీష్మ పితామహుని ప్రధాన సేనాపతి పదవి యందు శాస్త్రోక్తముగా పట్టాభిషిక్తుని చేసెను. అభిషేకానంతరము భీష్ముడు మిక్కిలి శోభిల్లుచుండెను. తరువాత రాజాజ్ఞచేత ఎన్నియో నూర్ల భేరీ శంఖాది వాద్యములు నిర్భయముగా ప్రయోగింపబడెను.

''అప్పుడు వీరుల సింహ నాదములు, వాహనముల వివిధ ధ్వనులు నలువైపుల ప్రతిధ్వనించెను. మేఘములు లేకయే ఆకాశము నుండి రక్తము వర్షించి నేల యంతయు బురదగ అయెను. గజముల ఘీంకారములతో పాటు, పిడుగుల ధ్వనితో సమానమైన భయంకర శబ్దము సేనలో బయలు దేరెను వృథివి కంపించెను. ఈ యుత్పాతములు కలుగుట చేత వీరుల మనస్సు లందు యుద్ధోత్సాహము సన్నగిల్లెను.

"ఆకాశవాణి అశుభముగ వినబడెను. ఆకాశము నుండి చుక్కలు రాలెను. భయమును సూచించుచు నక్కలు బిగ్గరగా, అమంగళకరముగాను కూయ సాగెను. సేనా నాయకత్వము నందు భీష్ముని దుర్యోధనుడు అభిషిక్తుని చేసినపుడు ఆ విధముగ నూర్ల కొలది ఉత్పాతములు కలిగెను

"జనమేజయా! అట్లు శత్రు భయంకరుడైన భీష్ముని సర్వ సేనాధిపతిని చేసికొని దుర్యోధనుడు బ్రాహ్మణుల చేత స్వస్తి వాచనములు చేయించి వారలకు విశేషముగా గో సువర్ణ దక్షిణలను ఇచ్చెను. అప్పుడు బ్రాహ్మణులు విజయ సూచకముగా రాజునకు ఆశీర్వాదములు చేసి అతని అభ్యుదయమును కోరిరి.

"దుర్యోధనుడు సేనా పరివృతుడై భీష్ముని అగ్రభాగము నందుంచి తమ్ములతో పాటు హస్తినాపురము విడిచి బయటకు వెడలెను. అతి విశాలములైన అనేక పట కుటీరము (డేరా) లతో దుర్యోధనుడు కురుక్షేత్రమునకు పోయెను.

"జనమేజయా! దుర్యోధనుడు కర్ణునితోపాటు కురుక్షేత్రమునకు పోయి ఒక విశాలమైన చదరపు ప్రదేశమందు శిబిరములు నిర్మించుటకుగాను భూమిని కొలిపించెను. చవట భూమి గాకుండనుండు మనోహరమైన ప్రదేశమునందు సేనా శిబిరములను నిర్మించెను. ఆ శిబిర నగరము హస్తినాపురమువలె ప్రకాశించుచుండెను.''

ఈ విధముగ వైశంపాయన ముని మాటలు విని జనమేజయుడు మరల నిట్లు ఆ మహా మునిని ప్రశ్నించెను:

"భగవన్! భరతవంశ పితామహుడైన భీష్ముడు ధనుర్ధారులలో శ్రేష్ఠుడు కదా! రాజులందరిలో పతాకవలె ఆయన స్థానము చాలా ఉన్నతముగా నుండెను.

"ఆయన బుద్ధిలో బృహస్పతి, క్షమలో ధరిత్రి, గాంభీర్యమున సముద్రుడు, స్థైర్యమునందు హిమాలయము. ఔదార్యమునందు ప్రజాపతి, తేజస్సునందు సూర్యుడు.

''అటువంటి భీష్ముడు తన బాణ వర్షముల చేత ఇంద్రాది శత్రువులను జయించగలవాడు. అతి భయంకరము, రోమాంచకారియునై రణయజ్ఞ మారంభింపబడినపుడు చాల కాలము దీక్ష వహించి యుండెను గదా!

''ఆయన దీక్ష గైకొనియుండు విషయమును యుధిష్ఠిరుడు వినిన తరువాత ఏమి చెప్పెను? ఆ విషయములో భీమార్జును లేమనిరి? అథవా - శ్రీకృష్ణభగవానుడు తన యభిప్రాయము నే విధముగ వ్యక్తీకరించెను?

జనమేజయుని ప్రశ్నములకు వైశంపాయనుడు ఇట్లు ఉత్తరము చెప్పెను:

"జనమేజయమహారాజా!పరమ బుద్ధిమంతుడైన యుధిష్ఠిరుడు తమ్ములను శ్రీకృష్ణుని పిలిచి శాంతముగా నిట్లనెను:

"మీరందఱు అన్నివైపుల తిరిగి మన సేనలను పర్యవేక్షింపుడు. కవచాదుల ధరించి సిద్ధముగా నుండుడు అందరికంటె మొదట భీష్మపితామహునితో మీరు యుద్ధము చేయవలసియుండును. కాబట్టి మన యేడక్షౌహిణీ సేనల సేనాపతులను జాగ్రత్తగ సంరక్షించుకొనుచుండుడు."

"ఇట్లు యుధిష్ఠిరుడు చెప్పిన తరువాత కృష్ణభగవానుడతనితో నిట్లనెను:

"భరతకులభూషణా! ఇటువంటి సమయములందు నీవు ఉపదేశించవలసిన విషయములను ఇప్పుడు చెప్పినట్లే చెప్పుచుండవలెను. నీవు చెప్పిన మాట చాల బాగుగా నున్నది. అందువలన ఇపుడు కర్తవ్యమును పాలింపుము. నీ సేనతోబాటు సేనాపతులను కూడ సిద్ధముగా నుంచుము

యుధిష్ఠిరుడు సేనాపతులను నియమించుట

"జనమేజయా! పిదప ద్రుపద-విరాట - సాత్యకి-ధృష్టకేతు-శిఖండి-ధృష్టద్యుమ్నులును, మగధరాజైన సహదేవుడు" ఈ యేడుగురు వీరులను యుధిష్ఠిరుడు శాస్త్రోక్తముగ సేనాపతి పదవులయందు అభిషిక్తులను చేసి ధృష్టద్యుమ్నుని ప్రధాన సేనాపతిని చేసెను

"అతడు ద్రోణాచార్యుల నంతమొందించుటకు జ్వలించుచున్న అగ్నికుండమునుండి పుట్టియుండెను. కాబట్టి అతడే ప్రధాన సేనాపతియని శ్రీకృష్ణ పాండవాదులు నిర్ణయించిరి.

"జనమేజయా! తరువాత యుధిష్ఠిరుడు అర్జునుని సమస్త సేనాపతులకు అధిపతిని చేసెను. అర్జునునకు గూడ నాయకుడై, అతని రథాశ్వములను కూడ నడపువాడు శ్రీకృష్ణభగవానుడే.

బలరాముడు పాండవుల కడకు వచ్చుట

"రాజా! తరువాత ఆ మహాయుద్ధ సమయము అతి సన్నిహితమగుచుండుట చూచి నీలాంబరధారియు, కైలాసశిఖరమువలె తెల్లని వర్ణముగల బలరాముడు పాండవుల శిబిరమునకు సింహమువలె గంభీర గమనముతో వచ్చెను.

"ఆయన కనులకొనలు మదముచేత ఎఱ్ఱబారియుండెను. అతనితోపాటు యదు వంశీయులైన అక్రూరాదులు-గద-సాంబ-ఉద్ధవ - ప్రద్యుమ్న-చారుదేష్ణ-ఆహుక పుత్రాదులైన వృష్ణివంశీయులును వచ్చిరి.

వారందరు సింహవ్యాఘ్రములవంటి బలముగలవారు. వారందరితో కలిసి వచ్చిన బలరాముడు, దేవతాగణముతో కూడిన ఇంద్రునివలె శోభిల్లెను.

"రాజా! బలరామదేవుని చూడగనే ధర్మరాజు, శ్రీకృష్ణుడు, భీమాది పాండవులు అక్కడ ఉన్న ఇతర రాజన్యులు అందరు లేచి నిలువబడిరి. బలరాముని అందరు సత్కరించి పూజించిరి.

"తరువాత యుధిష్ఠిరుడు బలరాముని కరస్పర్శచేసి అతనిని ఆలింగనము చేసికొనెను. కృష్ణాదులందరును అతనికి నమస్కారము చేసిరి. తరువాత వృద్ధులైన ద్రుపద విరాటులకు ప్రణామము చేసి బలరాముడు యుధిష్ఠిరునితో పాటు పీఠమందు కూర్చొనెను.

"జనమేజయా! అక్కడి రాజులందరు కూర్చొనిన తరువాత బలరాముడు శ్రీకృష్ణుని వైపు చూచుచు నిట్లనెను:

"మహా భయంకరమైన జనసంహారము కానున్నదని తోచుచున్నది. ప్రారబ్ధము తప్పదని తలచెదను. దానిని తప్పించుట అసాధ్యము. ఈ యుద్ధము ముగిసిన తరువాత మిత్రులైన మీరందరు క్షతగాత్రులు గాకుండ, రోగము లెవ్వియు లేకుండ తిరిగి వచ్చెదరుగాక యని నేను విశ్వసించుచున్నాను.

"ఇక్కడ చేరియున్న క్షత్రియులందరను యముడు తనకు గ్రాసముగా చేసికొనుటకు పక్వము చేసి యున్నాడనుటలో సందేహము లేదు.

"మన బంధువులందరితోను సమానముగా వ్యవహరించవలసినదని ఏకాంతము నందు నేను శ్రీకృష్ణునితో మాటిమాటికి చెప్పినాను.

"ఎందుకనగా 'మనకు పాండవులు ధార్తరాష్ట్రులు సమానులే. దుర్యోధనాదులకు గూడ సహాయము చేయుము అతడు నా వద్దకు మాటిమాటికి వచ్చి పోవుచున్నాడు' అని కూడ చెప్పినాను.

''కాని, యుధిష్ఠిరా! నీ విషయములో కృష్ణుడు నా మాట పాటించలేదు. ఇతడు అర్జునుని చూచిన చాలు, అతని యెడల ఆత్మీయ భావముతో అన్నియు మరచిపోవును. యుద్ధమునందు పాండవులకు విజయము తథ్యము. శ్రీకృష్ణుని సంకల్పము కూడ అదియే.

"శ్రీకృష్ణుడు నావద్దలేకున్నచో ఈ సమస్త ప్రపంచమును కన్నెత్తియైనను నేను చూడజాలను. అందుచేత కేశవుడు ఏ పనిచేసిన దానిని నేననుసరించెదను.

"భీమ దుర్యోధనులిద్దరు నా శిష్యులే. ఇద్దరు గదా యుద్ధమునందు సమర్థులే. ఆ యిరువురియందు నాకు సమాన స్నేహము కలదు.

''కాబట్టి యుధిష్ఠిరా! నేను సరస్వతీనదీ తీరమందలి పుణ్యక్షేత్రములను సేవించుటకు పోయెదను. ఇక్కడ నశించుచున్న కురు వంశీయులను చూచుచు ఉపేక్షించియుండజాలను.''

"జనమేజయా! ఇట్లు చెప్పి బలరాముడు పాండవులను వీడ్కొని శ్రీకృష్ణుని సంతోషపరచి తీర్థయాత్రకై వెడలెను.

రుక్మి సహాయమును అర్జునుడు దుర్యోధనుడును నిరాకరించుట

''జనమేజయా! ఆ సమయమునందే అక్కడకు భోజవంశీయుడు, ఇంద్ర మిత్రుడునైన భీష్మకుని పుత్రుడు 'రుక్మి' యనువాడు (రుక్మిణి సోదరుడు) పాండవుల కడకు వచ్చెను. (భీష్మకునకు 'హిరణ్యరోమ' అని కూడ మరియొక పేరు కలదు). ఆ రుక్మి గంధమాదన పర్వతమునందు నివసించుచున్న కింపురుష శ్రేష్ఠుడైన 'ద్రుముడు' అనువాని శిష్యుడై, అతని వద్ద నాలుగు పాదములు పూర్తిగా ధనుర్వేదమును నేర్చుకొనియుండెను.

"అతడు గాండీవముతో సమానమైన తేజస్సుగల 'విజయము' అను పేరు గల ధనుస్సును ఇంద్రునివలన పొందియుండెను సర్వలక్షణ సంపన్నమైన ఆ ధనుస్సు శార్‌ఙ్గ ధనుస్సును (విష్ణువుయొక్క ధనుస్సు) పోలియుండెను.

''దేవతలు అన్ని ధనుస్సులలోను వరుణదేవుని 'గాండీవము', ఇంద్రుని 'విజయము', విష్ణుభగవానుని 'శార్‌ఙ్గము'- ఈ మూడు ధనుస్సులే దివ్యములు అని చెప్పుదురు.

"శార్‌ఙ్గ ధనుస్సును శ్రీకృష్ణుడు ధరించెను ఖాండవదహన కాలమునందు అర్జునునకు గాండీవ ధనుస్సును అగ్నిదేవు డిచ్చియుండెను. పరాక్రమవంతుడైన రుక్మి ద్రుముడు అను కింపురుషునివలన 'విజయ' మను ధనుస్సును పొందెను.

"శ్రీకృష్ణుడు మురాసురుని పాశములను ఛేదించి, భూపుత్రుడైన నరకాసురుని జయించి, అతని నుండి 'అదితి' యొక్క మణిమయకుండలములను తిరిగి తీసికొని, అతడు చెరబట్టియున్న పదియారు వేల మంది స్త్రీలను విడిపించి, వివిధ రత్నములను వశపరచుకొన్నపుడు 'శార్‌ఙ్గ' ధనుస్సు కూడ అతనికి వచ్చెను.

''జనమేజయా! రుక్మి మేఘగర్జనమువంటి టంకారధ్వనిగల 'విజయ' ధనుస్సుచేత ప్రపంచమునంతయు భయపెట్టుచు పాండవుల కడకు వచ్చెను. పూర్వము శ్రీకృష్ణుడు రుక్మిణిని తీసికొనిపోవుచున్నపుడు సహించక యుద్ధము చేసి ఓడిపోయిన రుక్మియే ఇతడు.

"అప్పుడు సమస్త శస్త్రధారులలో శ్రేష్ఠుడైన రుక్మి, 'శ్రీకృష్ణుని చంపక తిరిగి నా నగరమునకు పోవను' అని ప్రతిజ్ఞ చేసి కృష్ణుని వెన్నంటిపోవుచుండెను. అప్పుడు అతని వద్ద గొప్ప చతురంగసేన గంగవలె విశాలముగ నుండెను. తన సేనతో కృష్ణునిపైన దాడిచేసి రుక్మి ఓడిపోవుటచేత సిగ్గుచెంది తన ప్రతిజ్ఞ ప్రకారము తిరిగి కుండిన నగరమునకు పోవలేదు.

"శ్రీకృష్ణుడు తనను జయించిన చోటనే రుక్మి 'భోజకటము' అను పేరుగల ఒక సుందర నగరమును నిర్మించుకొనియుండెను.

''జనమేజయా! గజాశ్వాది సేనలచేత నిండియున్న 'భోజకటక' నగరము సమస్త భూమండలమునందు ప్రసిద్ధమైయున్నది. భోజరాజైన రుక్మి ఒక అక్షౌహిణీ సేనతో పాండవుల కడకు వచ్చెను. కవచాదులను ధరించి యతడు సూర్యునివలె ప్రకాశించుచు పాండవుల మహాసేనలో ప్రవేశించెను.

"జనమేజయా! రుక్మి శ్రీకృష్ణభగవానునకు ప్రియము చేయగోరివచ్చియుండెను. అతడు వచ్చిన సంగతి తెలిసి యుధిష్ఠిర మహారాజు అతనికి ఎదురుగా పోయి స్వాగత సత్కారములు అదరముతో చేసి అతనిని ప్రశంసించెను. రుక్మి కూడ ప్రేమపూర్వకముగా అతిథి సత్కారములు స్వీకరించి తన సైనికులతో అక్కడ విశ్రాంతి తీసికొనెను.

తరువాత ''రుక్మి రాజవీరులమధ్య కూర్చొనియున్న అర్జునునితో నిట్లనెను:

''పాండునందనా! నీవు భయపడియుండిన యెడల నీకు యుద్ధమున సహాయము చేయ్య వచ్చినాను, నీ శత్రువులకు సహింపరానట్లుగా ఈ మహాయుద్ధమునందు నేను పోరాడెదను. ప్రపంచమునందు నావంటి పరాక్రమశాలి ఎవ్వడును లేడు.

''అర్జునా! శత్రుసేనలలో నాకు నీవు ఒప్పగించిన భాగమునందలి సేనను యుద్ధములో చంపివేసెదను. నా భాగములో భీష్మ ద్రోణ కృప కర్ణులు చేరినను ఎవరిని కూడ ప్రాణములతో విడువను.

''అథవా, ఇక్కడ చేరియున్న రాజులందరు ఊరకుందురుగాక! నేనొక్కడనే యుద్ధభూమియందు నీ శత్రువులనందరిని వధించి, నీకు ఈ సమస్త భూమండల సామ్రాజ్యమును సమర్పించెదను.''

''జనమేజయా! శ్రీకృష్ణుడు, యుధిష్ఠిరుడు ఇతర రాజులందరును వినుచుండగా రుక్మి అట్లు చెప్పిన పిదట అర్జునుడు శ్రీకృష్ణుని, ధర్మరాజును చూచుచు మైత్రితో నవ్వి రుక్మితో నిట్లనెను:

''వీరవరా! నేను కౌరవకులమందు జన్మించినాను విశేషించి పాండు మహారాజునకు పుత్రుడను. ద్రోణాచార్యులు మాకు గురువు. ఆయనకు శిష్యుడనని గర్వముతో చెప్పికొనుచుందును. అదిగాక సాక్షాత్తు శ్రీకృష్ణభగవానుడు మాకు సహాయకుడుగా నున్నాడు. నా చేతిలో గాండీవ,ధనుస్సును ధరించి యున్నాను. ఇట్లు పరిపూర్ణమైన సహాయ సంపత్తితో కూడిన వీరుడనైన నేను భయపడినానని ఎట్లు చెప్పగలను?

''వీరశిరోమణీ! కౌరవుల ఘోషయాత్ర సమయమునందు నేను మహాబలవంతులైన గంధర్వులతో యుద్ధము చేసియుంటిని. అప్పుడు నాకు సహాయము చేయుటకు ఏ మిత్రుడు వచ్చియుండెను?

''ఖాండవవనమునందు దేవ దానవులకు మహా యుద్ధము జరిగినప్పుడు నేను నా శత్రువులతో యుద్ధము చేసియుంటిని అప్పుడు నాకు ఎవడు సహాయకుడుగా వచ్చియుండెను?

"నివాత-కవచ-కాలకేయాది రాక్షసులతో నేను ఏకాకిగానే యుద్ధము చేసియుంటిని. అప్పుడు నాకు సహాయకుడుగా ఎవడు వచ్చియుండెను?

''విరాటనగరమునందు ఉత్తరగోగ్రహణ సమయమున అనేక కౌరవ వీరులతో నేను చేసిన యుద్ధమునందు నాకు ఎవడు సహాయకుడుగా నుండెను?

''వీరుడా! నేను యుద్ధమునందు విజయము పొందుటకు ఇంద్ర-రుద్ర-యమ-కుబేర-వరుణ-అగ్ని - కృప - ద్రోణ - శ్రీకృష్ణులను ఆరాధించియుంటిని. తేజస్వియై దృఢముగానున్న దివ్యగాండీవ ధనుస్సును ధరించియున్నాను. నా వద్ద అక్షయములైన బాణములతో నిండిన అంబుల పొదులు ఉన్నవి. దివ్యాస్త్ర జ్ఞానము కూడ నాకు గొప్పగా ఉన్నది.

"వీరవరా! నా వంటివాడు సాక్షాత్తు వజ్రాయుధధారియైన ఇంద్రుని ఎదుట కూడ నా కీర్తి నాశకరమైన 'నేను భయపడియున్నాను' అను మాట ఎట్లు చెప్పగలడు?

"వీరోత్తమా! నేను భయపడలేదు. నాకు సహాయకుని ఆవశ్యకత కూడా లేదు. కనుక నీవు నీ ఇచ్ఛానుసారముగా ఇతరత్ర పోవచ్చును. లేదా ఇక్కడనే ఉండవచ్చును."

''జనమేజయా! ఈ విధముగ అర్జునుడు చెప్పిన పిదట రుక్మి తన సైన్యముతో దుర్యోధనుని కడకు పోయి, అతనితో గూడ అర్జునితో మాట్లాడినట్లే మాట్లాడెను. అప్పుడు తాను శూరుడనని తలచి దుర్యోధనుడు కూడ రుక్మి సహాయము పొందుటకు నిరాకరించెను.

''జనమేజయా! ఆ యుద్ధమును ఇద్దరే వీరులు విడిచిపోయిరి. ఒకడు బలరాముడు, మరియొకడు రుక్మి.

"అక్కడ దుర్యోధనుడు రాజవీరులను ఆదరించి అందరి రక్షణము కొఱకు అనేక గుల్మముల (సేనాభాగముల) సైనికులను ఏర్పరచెను.

"అట్లు యోధుల సంరక్షణ కొఱకు ఏర్పాటుచేసి, దుర్యోధనుడు కర్ణ శకుని దుశ్శాసనులను పిలిచెను. దుర్యోధనుడు ఆ ముగ్గురితో రహస్యాలోచనచేసి ఏకాంతమునందు ఉలూకుని పిలిచి అతనితో నిట్లనెను:

"ద్యూత కుశలుడైన శకుని కుమారా, ఉలూకా! నీవు సోమక - పాండవుల కడకుపోయి శ్రీకృష్ణుని సమక్షమునందే నా యీ సందేశమును వారికి నా మాటగా తెలుపుము:

"యుధిష్ఠిరా! అనేక సంవత్సరముల నుండి విచారించుచున్న సమస్త ప్రపంచమునకు అతిభయంకరమైన కౌరవ పాండవుల యుద్ధము ఇప్పుడు తలపై బడినది.

"నీవు, నీ తమ్ములు మిక్కిలి గర్జించుచు శ్రీకృష్ణుని సహాయమున్నది కదాయని తలచి సంజయుని ద్వారా నీవు ఆత్మస్తుతి చేసికొనుచు చెప్పి పంపిన మాటలను సంజయుడు కౌరవ సభలో నీవు చెప్పిన దానికంటె ఎక్కువగా పెంచి వినిపించి యుండెను.

"నీ వాడిన మాటలన్నియు సత్యము చేయు సమయము ఆసన్నమైనది. మీరు చేసిన ప్రతిజ్ఞలన్నియు ఇపుడు నెరవేర్చుకొనుడు."

"అట్లు చెప్పి ఉలూకునితో "ఉలూకా! నీవు నా మాట ప్రకారము యుధిష్ఠిరుని వద్దకు పోయి యీ విధముగా చెప్పుము" అని యనెను.

"యుధిష్ఠిరమహారాజా! నీవు, నీ తమ్ములు, సోమకులు, కేకయులు అందరు కూడ చాల ధర్మాత్ములని పొగడబడుచున్నారు. కాని, నీవు ధర్మాత్ముడవై అధర్మము నెట్లు తలచుచున్నావు?

"నీవు సమస్త ప్రాణులకు అభయప్రదానము చేసినావని నా విశ్వాసము. కాని, యిప్పుడు నీవొక నిర్దయునివలె సమస్త ప్రపంచము యొక్క వినాశమును చూడగోరుచున్నావు.

"భరతశ్రేష్ఠా! నీకు మంగళమగుగాక! పూర్వకాలమునందు దేవతలు ప్రహ్లాదుని రాజ్యమును హరించినపుడు అతడు ఈ శ్లోకమును గానము చేసి యుండెను:

శ్లో. యస్య ధర్మధ్వజో నిత్యం, సురాధ్వజ ఇవోచ్ఛ్రితః
ప్రచ్ఛన్నానిచ పాపాని బైడాలం నామ తద్వ్రతమ్.

అనగా, 'దేవతలారా! సురాధ్వజము (కల్లు అంగడివద్ద కట్టబడిన ధ్వజము) వలె ఎవని ధర్మధ్వజము ఉన్నతముగా పైకి ఎగురుచుండునో, ఎవని ద్వారా పాపములు కూడ ప్రచ్ఛన్నముగా జరుగుచుండునో వాడు చేయు ధర్మవ్రతము పిల్లివ్రతమనిపించుకొనును.'

(కల్లు అంగడి పైన ధర్మ సూచకముగా ధ్వజము కట్టబడినను దాని క్రింద ఆ యంగడిలో అధర్మమైన మద్యపానము జరుగుచున్నట్లే ధర్మజా! నీవు పైకి ధర్మాత్ముడవుగా ప్రజలకు కనపడుచున్నను నీ లోపల అధర్మమే నిండి యున్నదని భావము).

"రాజా! ఈ విషయములో ఈ ఉత్తమమైన ఆఖ్యానమును చెప్పెద వినుము. ఈ కథను నారదుడు నా తండ్రికి చెప్పియుండెను:

బిడాలోపాఖ్యానము

"రాజా! పూర్వమొకప్పుడు దుష్టమైన ఒక పిల్లి రెండు భుజములు పైకెత్తుకొని గంగాతీరమునకుపోయి నిలిచెను. అది ఏ పనియు కొంచెము గూడ చేయక నిశ్చలముగా నుండెను. ఈ విధముగా సమస్త ప్రాణులకు తనపైన విశ్వాసము కలిగించుటకొఱకు ఆ పిల్లి అందరితోను 'ఇప్పుడు నేను మనస్సును పరిశుద్ధము చేసికొని, హింసను విడిచి ధర్మము నాచరించుచున్నాను' అని చెప్పుచుండెను.

"రాజా! ఇట్లు చాలాకాలము గడిచిన తరువాత మెల్ల మెల్లగా పక్షులు ఆ పిల్లిపై విశ్వాసము నుంచెను. అపుడు ఆ పక్షులు ఆ పిల్లి కడకు వచ్చి దానిని విశేషముగా పొగడుచు వచ్చెను. పక్షులను తనకు ఆహారముగా చేసికొను ఆ పిల్లి పక్షులచేత సత్కరింపబడుచు నున్నప్పుడు 'ఇప్పుడు నా పని నెరవేరినది. నా ధర్మానుష్ఠానముయొక్క ఉద్దేశము కూడ నెరవేరినది' అని ఆ పిల్లి తలచెను.

"అట్లు కొంతకాలము గడచిన పిదప అక్కడికి ఒక యెలుక కూడ వచ్చి కఠిన తపస్సు చేయుచున్న ధర్మిష్ఠమైన ఆ పిల్లిని చూచెను. యుధిష్ఠిరా! దంభాచారముతో గొప్పగా ధర్మానుష్ఠానము చేయుచున్న పిల్లిని చూచి యెలుక తన మనస్సులో ఇట్లు తలచెను:

"బలరాముడు తీర్థయాత్రలకు, రుక్మి తన నగరమునకు పోయినతరువాత పాండవులు మరల రహస్య సమాలోచనము చేయుటకు సమావేశము చేసిరి. ఆ సమావేశము నక్షత్రసహితమైన చంద్రమండలములతో శోభిల్లుచున్న ఆకాశము వలె ప్రకాశించెను."

ఈ విధముగా రుక్మి వృత్తాంతమును చెప్పిన వైశంపాయనునితో జనమేజయుడు ఇట్లనెను:

"మహామునీ! ఈ విధముగ కురుక్షేత్రమునందు సేనావ్యూహములు రచింపబడిన తరువాత కాలప్రేరితులైన కౌరవులు ఏమి చేసిరి?"

ఆ ప్రశ్నమునకు వైశంపాయనుడు ఇట్లు ఉత్తరము చెప్పదొడగెను:

"జనమేజయ మహారాజా! సేనలన్నియు కురుక్షేత్రములో యుద్ధము కొఱకు సిద్ధములై యుండగా ధృతరాష్ట్రుడు సంజయునితో నిట్లనెను:

''నాయనా, సంజయా! ఇటు రమ్ము. కూర్చొనుము కౌరవ పాండవ సేనలు కురుక్షేత్రమునందు నిలిచిన తరువాత అక్కడ జరిగిన సమాచారమును తెలుపుము.

''ఇందులో దైవమే ప్రబలమని నేను తలచెదను. దైవము ముందు నా పౌరుషము పనికిరాదు. ఎందుకనగా, యుద్ధమునందు జరుగు పొరపాట్లు నాకు బాగుగా తెలియును. ఆ దోషములు భయంకర సంహారమును తెచ్చిపెట్టునని కూడ నాకు తెలియును.

"ఇప్పటికిని వంచన విద్యలో పండితుడై కపట ద్యూతమునాడు నా పుత్రుని నివారించజాలకపోతిని నా హితమును గూడ సాధించజాలను.

"సంజయా! ఈ యుద్ధ దోషములను నేను మాటిమాటికి చూచుచు తెలిసి కొనినప్పటికిని దుర్యోధనుని చూచినప్పుడు నా బుద్ధి మారిపోవుచుండును.

''సంజయా! ఇట్టి పరిస్థితిలో జరుగవలసిన దేదియో జరిగియే తీరును. యుద్ధమునందు ప్రాణత్యాగము చేయుట అందరును గౌరవించు క్షత్రియ ధర్మమని నిశ్చయముగా చెప్పెదరు.''

"అట్లు ధృతరాష్ట్రుని మాటలు విని సంజయుడు అతనితో నిట్లనెను:

''మహారాజా! నీ విప్పుడు అడిగినది, నీవు కోరినదియు యోగ్యముగానే యున్నది. కాని, యుద్ధ దోషములను దుర్యోధనుని మెదడులో ఎక్కించజాలకున్నావు.

"రాజా! నేనన్ని విషయములు చెప్పెదను, వినుము మనుష్యుడు స్వయముగా చేయు చెడుపనులవలన కలుగు చెడుఫలములను తప్పక అనుభవించును. దానికిగాను కాలముపైనగాని, దేవతలపైనగాని దోషారోపణము చేయుటకు అతనికి అధికారము లేదు. మహారాజా! ఇతరులతో నింద్యముగా వ్యవహరించు పురుషుడు అందరికిని వధ్యుడే యగుకు.

"రాజా! జూదమాడునప్పుడు మాటిమాటికి కపటములకు, అవమానములకు గురియైన పాండవులు మంత్రులతోపాటు కేవలము నీ ముఖము చూచియే నీ వారు చేసిన అన్ని అవమానములను, తిరస్కారములను సహించిరి.

''ఇప్పుడు యుద్ధమువలన సమస్త సేనలకు, రాజులకు వినాశము కలుగనున్నది. ఆ సంగతి యంతయు నేను చెప్పెదను. వినుము. నేను యుద్ధ సమాచారములన్నియు జరిగినవి జరిగినట్లుగా చెప్పెదను. అది యంతయు నీవు స్థిరముగా వినుటకు ఏకాగ్రచిత్తుడవై యుండుము. వ్యాకులపడకుము.

"రాజా! మనుష్యుడు తాను చేసిన పుణ్యపాపకర్మముల ఫలానుభవమందు ఎప్పటికిని స్వతంత్రముగా కర్తకాడు. ఎందుకనగా . మనుష్యుడు ప్రారబ్ధమునకధీనుడుగా నుండును. అతడు కేవలము కొయ్యబొమ్మవలె ఆ కార్యములందు ప్రవృత్తి కలవాడు మాత్రమే యగును.

"రాజా! కొందఱు ఈశ్వర ప్రేరణచేత కార్యము చేయుచుందురు. మరి కొందరు అకస్మికముగా ఏర్పడిన సంఘటన మూలముగా కార్యములయందు ప్రవృత్తులగుదురు. ఇతరులు అనేకులు తమ తమ పూర్వకర్మల ప్రేరణచేత కార్యములు చేయుచుందురు. ఈ విధముగా ఈ కార్యములకు మూడువిధములైన దశలు కనబడుచున్నవి.

"కనుక, నీవు ఈ మహా సంకటమునందు పడి వికలచిత్తుడవు కాకుము. స్థైర్యముతో స్వస్థచిత్తుడవై నేను చెప్పు సమస్త వృత్తాంతమును వినుము."

"ఆ విధముగా ధృతరాష్ట్రునకు సంజయుడు చెప్పి తరువాతి వృత్తాంతము నిట్లు చెప్పదొడగెను:

ఉలూకుని రాయబారము

"మహారాజా! మహాత్ములైన పాండవులు హిరణ్వతీ నదీతీరమునందు తమ సేనలను విడియించినపుడు కౌరవులు కూడ ఇతర స్థానమునందు తమ సేనను విడియించిరి.

''మా కందరికి అనేకులు మిత్రులున్నారు. ఈ పిల్లికూడ ఇప్పుడు మా మిత్రమండలిలో చేరి మాకు మామగా నుండుగాక! ఈ పిల్లి మా సంఘములో నున్న వృద్ధులను బాలురను సర్వదా రక్షించుచుండుగాక!''

''అట్లు ఎలుక తలచి, అందరితో సంప్రదించి ఆ పిల్లి వద్దకు పోయి ఇట్లనెను:

''మామా! మేమందరము నీ కృపచేత సుఖముగా నున్నాము. నీవే మాకు సంరక్షకుడవు, మాకు మిక్కిలి మిత్రుడవు మేమందరమొకటిగా చేరి నీ శరణు జొచ్చితిమి. నీవు ఎల్లప్పటికిని ధర్మతత్పరుడవై యుందువు. మహాబుద్ధిశాలీ! వజ్రాయుధమును ధరించి యింద్రుడు దేవతలను రక్షించినట్లే మమ్ము నీవు రక్షింపుము.''

''ధర్మరాజా! ఎలుకలన్నియు అట్లు చెప్పిన తరువాత ఎలుకల పాలిటి యముడైన బిడాలము వాటితో నిట్లనెను:

''నాయనలారా! నేను తపస్సు చేయుదునా? మీ రక్షణము చేయుదునా? ఈ రెండు పనులకు పరస్పరము సంబంధము కనబడుటలేదు. ఈ రెండు ఒకటిగా చేరి యుండవు. ఐనను మీ హితమునుగోరి ఆవశ్యముగా నేను చేయవలెను.

''నొక్క మాట చెప్పెదను వినుడు. మీరు కూడ ప్రతి దినము నేను చెప్పునట్టి ఆజ్ఞను పాలించవలసి యుండును. నేను తపస్సు చేయుచు చేయుచు మిక్కిలి అలసి యున్నాను. దృఢముగా నియమవ్రతపాలనమునందు లగ్నమై యున్నాను. నాకు నడచుటకు తిరుగుటకు ఏ మాత్రము శక్తి లేకున్నది. అందువలన నాయనా! నీవు ఎల్లప్పటికి నన్ను ఇక్కడనుంటి నదీ తీరమునకు తోడుకొని పోవుచుండవలెను.''

''యుధిష్ఠిర మహారాజా! ఆ మాటకు ఎలుక అంగీకరించి ఆ బిడాలము యొక్క ఆజ్ఞను పాలించుటకుగాను మాటయిచ్చి అబాలవృద్ధముగా ఎలుకలు తమ సమస్త పరివారమును ఆ పిల్లికి ఒప్పగించెను.''

''తరువాత పాపి, దుష్టబుద్ధియునైన ఆ పిల్లి ప్రతిదినము మూషికములను తినుచు లావుగా బలిసి సుందరముగా ఆయెను. దాని అవయవములు, శరీర బంధములు దృఢములయ్యెను. ఎలుకల సంఖ్య చాల త్వరగా తరగుచు వచ్చెను. పిల్లి బలము పెరుగుచు వచ్చెను.

''తరువాత ఆ మూషికములన్నియు పరస్పరము కలిసికొని 'మన మామ ప్రతి దినము బలిసి లావుగా అగుచున్నాడు. మన సంఖ్య త్వరగా తగ్గిపోవుచున్నది. దీనికి కారణమేమి?' అని పరస్పరము మాట్లాడుకొనెను.

''యుధిష్ఠిరమహారాజా! ఆ యెలుకలలో 'డిండికము' అను పేరుగల ఒక యెలుక అన్నిటికంటె తెలివిగలదిగా నుండెను. అది తక్కిన యెలుకలతో నిట్లనెను:

''మీరందరు కలిసి యేకముగా నదీ తీరమునకు పొండు! వెనుక నుండి నేను గూడ మామతో అక్కడికి వచ్చెదను'' అని చెప్పెను.

''ఆ మాట విని ఎలుకలన్నియు 'చాలమంచిది, చాలమంచిది' అని డిండికమును ప్రశంసించి, దాని ఆజ్ఞప్రకారము నదీతీరమునకు పోయినవి.

''ఎలుకలు ఇట్లు కూడబలుకుకొని జాగరూకతతో నున్నట్లు బిడాలమునకు తెలియదు. అందుచేత పిల్లి ఒంటరిగా దొరకిన డిండికమును గూడ తినివేసెను.''

''తరువాత ఎలుకలన్నియు ఒకనాడు ఒకచోట కలిసికొని ఒండొంటితో సంప్రదించుకొనెను:

''అప్పుడు ఆ మూషికములలో 'కోలికము' అను పేరుగల ఒక ప్రసిద్ధ మూషికము కలదు. అది మంచి తెలివిగలది. అన్నిటికంటె ఎక్కువ ముసలిది. అది యెలుకలతో హితమైన ఒక మాట ఇట్లు చెప్పెను:

''సోదరులారా! మామకు కొంచెము గూడ ధర్మాచరణమునందు ఇచ్ఛ లేదు. అది మనవంటివారిని మోసగించుటకే జడలు పెంచుకొన్నది. ఫలమూలములు తినువారికి మలములో వెంట్రుకలు రావుకదా! దీనికి వచ్చుచున్నవి. అవి మన యెలుకల శరీర కేశములే యగును.

''దాని యవయవములు గూడ దిన దినమునకు బలిసి వృద్ధి చెందుచున్నవి, మనవారి సంఖ్యయేమో తగ్గుచున్నది. ఏడెనిమిది దినములనుండి డిండికుడు గూడ కనబడుటలేదు.''

''ఇట్లు కోలికము చెప్పిన మాటలు విని ఎలుకలన్నియు పిల్లిని విడిచి అక్కడి నుండి పరుగెత్తి పోయెను. ఆ దుష్ట బిడాలముకూడ చిన్న ముఖము చేసికొని వచ్చిన త్రోవబట్టి తిరిగిపోయెను.

“కనుక దుష్టాత్మా యుధిష్ఠిరా! నీవు కూడ ఈ విధముగనే బిడాల వ్రతము చేయుచు ఉన్నావు. ఎలుకల విషయములో పిల్లి ధర్మాచరణమను నెపముతో అసత్యముగా వ్యవహరించినట్లే నీవు కూడ నీ వంశ సోదరులయెడల ‘ధర్మాచారము’ అను ముసుగు కప్పుకొని వ్యవహరించుచున్నావు.

“నీ మాటలు ఒక విధముగా నున్నవి, పనులు మాత్రము మరియొక విధముగా నున్నవి. నీ వేదాధ్యయనము ప్రజలకు చూపించుటకు మాత్రమే పనికి వచ్చును. నీవు పాషండుడవు (వేదబాహ్యుడు).

“రాజా! నీవు ధర్మనిష్ఠుడవైన యెడల కపట వ్యవహారమును విడిచి క్షత్రియ ధర్మము నాశ్రయించి, దాని ప్రకారమే అన్ని పనులు చేయుము.

“భరతశ్రేష్ఠా! నీ బాహుబలము చేత ఈ పృథివీ రాజ్యమును సంపాదించుకొని బ్రాహ్మణులకు దానము చేసి పితృదేవతలను పూజించి వారి భాగమును ఇమ్ము.

“నీ తల్లి అనేక సంవత్సరముల నుండి కష్టము అనుభవించు చున్నది. ఆమెకు హితము చేయుటయందు తత్పరుడవై, ఆమె కన్నీళ్ళు తుడిచి విజయము పొంది పూజ్యుడవు కమ్ము.

“యుధిష్ఠిరా! నీవు ఐదు గ్రామములు మాత్రమే కోరియుంటివి. కాని, నేను నీ కోరికను ప్రయత్నపూర్వకముగా త్రోసిపుచ్చుటకు కారణమేమనగా, పాండవులను ఏ విధముగనైన కుపితులను చేసి వారితో యుద్ధము చేయు అవసరము పొందుటకొఱకే.

“నీకొరకే నేను దుష్టాత్ముడైన విదురుని పరిత్యజించితిని. లక్క యింటిలో నిన్ను కాల్చుటకు చేసిన ప్రయత్నము జ్ఞప్తికి తెచ్చుకొనుము ఇప్పటినుండియైనను పురుషుడవుగా మెలగుము.

“యుధిష్ఠిరా! నీవు శ్రీకృష్ణుని ద్వారా ‘నాకు శాంతియైనను సరే, యుద్ధమైనను సరే-రెంటికి సిద్ధముగా నున్నాను’ అని మాకు సందేశము పంపియుంటివి. రాజా! ఇప్పుడు ఆ యుద్ధమునకు అవసరము వచ్చినది. అందుకొరకే నేను ఇదియంతయు చేసితిని.

“క్షత్రియుడు యుద్ధమునకంటే మించిన లాభము మరియొకటి గొప్పదిగా తలచడు. ఇదిగాక, నీవు కూడ క్షత్రియకులములో పుట్టి ఈ భూమండలమునందు

గొప్ప ఖ్యాతిని ఆర్జించితివి. ద్రోణాచార్యుని వలన, కృపాచార్యుని వలనను అస్త్రవిద్యను నేర్చుకొంటివి. జన్మములో, బలములోను నీవు మాతో సమానుడవైనను శ్రీకృష్ణుని ఆశ్రయించి యున్నావు కనుక యుద్ధమువల్ల భయపడుటగాని, వెనుకాడిపోవుటగాని నీవెందుకు చేసెదవు?”

“జనమేజయా! ఇట్లు దుర్యోధనుడు ఉలూకుని ద్వారా చెప్పిపంపి మరల శ్రీకృష్ణునితో నా మాటలుగా నిట్లనమనెను :-

“జనార్దనా! నీవు పూర్తిగా సంసిద్ధుడవై నీయొక్క, పాండవుల యొక్కయు శ్రేయస్సు కొఱకు నాతో యుద్ధము ఆసక్తితో చేయుము.

“కృష్ణా! నీవు సభా మధ్యమునందు మాయచేత చూపించిన నీ వికటరూపమును మరల అదే విధముగ చూపించి అర్జునితోపాటు నాపైన దాడిచేయుము. ఇంద్రజాలము, మాయ, క్షుద్ర దేవతాశక్తి - ఇవి యుద్ధమునందు ఆయుధము ధరించిన శూరునకు క్రోధమును, సింహనాదమును పెంచునేకాని వీరుని బెదరింపజాలవు.

“మేము గూడ మాయచేత ఆకాశమునకు ఎగురగలము, అంతరిక్షలోకమునకు పోవగలము. పాతాళమునకు గాని స్వర్గమునకుగాని పోవగలము. కృష్ణా అంతయే కాదు. మేము మా శరీమునందు అనేక రూపములను ప్రకటించి చూపగలము. కాని, ఆ ప్రదర్శనము లన్నింటి ద్వారా మా అభీష్ట సిద్ధి కలుగుటగాని, మా శత్రువునకు భయము కలుగుటగాని జరుగదు.

“ఒక సృష్టికర్తమాత్రమే తన మనస్సంకల్పము లేక సమస్త ప్రాణులను వశపరచుకొనగలడు. వార్ష్ణేయా! యుద్ధమునందు ధృతరాష్ట్ర పుత్రులనందరిని చంపి వారి సమస్త రాజ్యసంపదను కుంతీ పుత్రులకు ఇచ్చెదనని నీవు చెప్పుచుంటివి. నీ మాటలన్నియు సంజయుడు నాకు చెప్పుచుండెను.

“కౌరవులారా! నేను ఎవరికి సహాయకుడుగా నుండెదనో అట్టి అర్జునునితో మీకు వైరము పెరుగుచున్నది” అని యీ మొదలైన, మాటలను కూడ నీవు చెప్పి యుంటివి. కాబట్టి నీవు ఇప్పుడు సత్యప్రతిజ్ఞుడవై పాండవుల కొఱకు నీ పరాక్రమమును చూపుము.

“కృష్ణా! నీవు గట్టిగా నిలువుము. మేము నీకై ఎదురు చూచుచుందుము. ఇప్పుడు నీ పౌరుషము చూపుము ఏ పురుషుడు శత్రువును తెలిసికొని పౌరుషముతో శోకములో ముంచునో వాడే శ్రేష్ఠమైన జీవితమును గడపగలడు.

"శ్రీకృష్ణా! ప్రపంచమునందు అకస్మాత్తుగా నీ కీర్తి వ్యాపించినట్లుగా నాకు కనబడుచున్నది. కాని, యిప్పుడు నిన్ను పూజించువారు వాస్తవస్థితిలో పౌరుష మనెడు తెరలో నపుంసకులుగా నున్నట్లు మాకు స్పష్టముగా తెలియుచున్నది.

''నా వంటి రాజు నీతో, విశేషించి కంసునికి సేవకుడవైన నీతో పోరాడుటకు కవచ ధారణము చేసి యుద్ధభూమియందు దిగుట ఏవిధముగ కూడ ఉచితము కాదు.''

''జనమేజయా! అట్లు దుర్యోధనుడు ఉలూకుని ద్వారా యుధిష్ఠిరునకు శ్రీకృష్ణునకు చెప్పవలసిన మాటలు చెప్పెను.

''తరువాత 'ఉలూకా! కొమ్ములు లేని యెద్దువలె బరువు మోయుటకు మాత్రమే పనికి వచ్చువాడు అధిక భోజనుడు, అజ్ఞాని, మూర్ఖుడునైన భీమసేనునకు కూడ ఈ నా సందేశమును యిట్లు చెప్పు'మనెను.

"భీమసేనా! నీవు ఇంతకు పూర్వము విరాట నగరమునందు వంటలవాడుగా నుండి 'బల్లవుడు' అను పేరుతో విఖ్యాతుడవైనదంతయు నా పౌరుషము వలననే.

''తొలుత కౌరవ సభలో నీవు చేసిన ప్రతిజ్ఞ అసత్యము కాగూడదు. నీకు శక్తియుండిన యెడల వచ్చి దుశ్శాసనుని రక్తము త్రాగవలెను.

''భీమసేనా! నీవు యుద్ధమునందు ధృతరాష్ట్ర పుత్రులను చంపెదనని ప్రతిజ్ఞచేసి యుంటివి. దానికిపుడు సమయము వచ్చినది.

భీమా! నీవు కేవలము భోజనమునకే పనికి వచ్చెదవు. అందువలన ఎక్కువ ఆహార పానీయములు ఆరగించు వారికి ఇచ్చు బహుమానమునకు యోగ్యుడవు. కాని, యుద్ధమెక్కడ? భోజన మెక్కడ? నీ వంటి తిండిపోతుకు అది సరిపడదు.

''శక్తియుండినయెడల యుద్ధముచేసి నీ మగతనము చూపెట్టుము. యుద్ధభూమియందు నా చేత చచ్చి నీవు ఎదపైన గదపెట్టుకొని దీర్ఘనిద్ర పోగలవు. నీవు సభలో డంబముగ మాట్లాడుచు ఎగురుచు దుముకుచు నుంటివి. అది యంతయు వ్యర్థమే."

''అట్లు దుర్యోధనుడు భీమునకు సందేశము పంపి ఉలూకునితో నకులునకు గూడ నా మాటగా ఇట్లు చెప్పుమనెను :

"భారతా! ఇప్పుడు నేను చెప్పుచున్నాను. నీవు స్థైర్యముతో యుద్ధము చేయుము. మేము నీ పౌరుషమును చూచెదము గాక! నీకు యుధిష్ఠిరుని యెడల గల ప్రేమను, నా యెడల గల ద్వేషమును, ద్రౌపదికి జరిగిన క్లేశమును గూడ నీవు ఇపుడు బాగుగా జ్ఞప్తికి తెచ్చుకొనుము.''

''సహదేవునకు గూడ ఇట్లు చెప్పుమని ఉలూకునితో దుర్యోధనుడనెను :

"పాండునందనా! పూర్వము నీ కివ్వబడిన క్లేశములను ఇప్పుడు జ్ఞప్తికి తెచ్చుకొని తత్పరుడవై యుద్ధము చేయుము. '

''ద్రుపద విరాటులతో గూడ ఇట్లనుము అని ఉలూకునితో దుర్యోధనుడు ఈ విధముగా చెప్పెను:

"రాజేంద్రులారా! విధాత ప్రజాసృష్టి చేసినప్పటినుండి చూచుచున్నాము. మిక్కిలి గుణవంతులైన సేవకులు కూడ తమ ప్రభువులను బాగుగా పరీక్షించలేదు. ఆ ప్రభువుల గుణగుణములను సమగ్రముగా తెలిసికొనలేదు. ఈ విధముగనే ప్రభువులు కూడ సేవకులను యథార్థముగా తెలిసికొనలేదు. కాబట్టి, యుధిష్ఠిరుడు గౌరవింప దగినవాడు కాడు. ఐనను మీ రిద్దరు అతనిని మీ రాజుగా అంగీకరించి అతని పక్షమున చేరి యుద్ధము చేయుటకు వచ్చినారు. మీరందరు చేరి ఏకమై నా వధకు ప్రయత్నింపుడు. మీ మేలు కొఱకు, పాండవుల మేలు కొఱకు మీరు నాతో యుద్ధము చేయుడు."

''ఉలూకా! ధృష్టద్యుమ్నునితో గూడ నిట్లనుమని దుర్యోధనుడు ఈ విధముగా చెప్పెను:

"రాజకుమారా! ఇప్పుడు నీకు యోగ్యమైన సమయము ప్రాప్తించినది. నీకు ద్రోణాచార్యుడు నీ యెదుటనే కనబడును. యుద్ధభూమియందు ద్రోణాచార్యుని యెదుటకు పోయి నీవు నీ హితమేమియో తెలిసికొనగలవు, రమ్ము. నీ మిత్రులతో పాటు వచ్చి యుద్ధము చేయుము. గురుహత్య వలన కలుగు అతి దుర్భరమైన పాపము ఒడి గట్టుకొనుము."

''ఉలూకా! శిఖండితో గూడ ఇట్లనుమని చెప్పదొడగెను:

''శిఖండీ! ధనుర్ధరులలో శ్రేష్ఠుడైన భీష్ముడు నీవు స్త్రీవని తలచి నిన్ను చంపడు. కనుక, ఇప్పుడు నీవు నిర్భయముగా యుద్ధము చేయుము. నీ పరాక్రమము చూపుము. ఇప్పుడు నీ పౌరుషము చూచెదము గాక!''

''జనమేజయా! అట్లు చెప్పుచునే దుర్యోధనుడు కిలకిల నవ్వెను. ఆ తరువాత ఉలూకునితో మరల ఈ విధముగా చెప్పదొడగెను:

"ఉలూకా! శ్రీకృష్ణుని సమక్షమునందే అర్జునునితో మరల నిట్లు చెప్పుము.

''ధనంజయా!నీవు మమ్ము జయించి ఈ భూమండలమును ఏలుకొనుము. లేదా - మా చేతులలో చచ్చి యుద్ధభూమి యందు దీర్ఘ నిద్రపొమ్ము.

''అర్జునా!రాజ్యము నుండి వెడలగొట్టబడుటకు, వనములో నివాసము చేసినందుకు, ద్రౌపదిని అవమానము చేసినందుకు, నీకు కలిగిన క్లేశములను జ్ఞప్తికి తెచ్చుకొనుము. ఇప్పుడైన నీ మగతనము చూపుము.

''అర్జునా! క్షత్రియస్త్రీ ఏ ప్రయోజనము కొఱకు పుత్రులను కనునో ఆ ప్రయోజనములన్నింటిని పూర్తిగ నెరవేర్చుటకు ఇప్పుడు సమయము వచ్చినది.

''నీవు యుద్ధమునందు బలపరాక్రమములను పౌరుషమును చూపించుచు నీ క్రోధమును మాపైన ప్రయోగించి అప్పుడు శాంతించుము.

"ఎవనికి అనేక విధములైన క్లేశములు కలిగించి చాల కాలము వరకు రాజ్యమునుండి బహిష్కరించి ఇప్పుడు కూడ రాజ్యము లేకుండ జేసినందువల్ల దీనభావముతో జీవితము గడపవలసి వచ్చెనో అట్టి స్వాభిమానముగల పురుషుని హృదయము చీలిపోక ఎట్లుండును? ఉత్తమ కులోత్పన్నుడై శూరుడై ధనమునందు లోభము లేనివాడు రాజ్యమును ఇతరులు వశపరచుకొని యున్నప్పుడు ఎవనికి క్రోధము కలుగనుండును?

"అర్జునా! నీవు పెద్ద పెద్ద డంబములు మాటాడితివి. ఇప్పుడు వాటిని ఆచరణలో పెట్టవలసిన సమయము వచ్చినది. ఆచరణ ద్వారా ఏ పనియు చేయక కేవలము నోటితో వదరువానిని సత్పురుషులు పిరికిపంద యనుకొందురు.

"నీ రాజ్యము నీ స్థానము శత్రువుల చేతిలో పడిపోయినది. దానిని నీవు పునరుద్ధరించుకొనుము. యుద్ధము చేయదలచిన వానికి ఈ రెండే ముఖ్య ప్రయోజనములు. కాబట్టి, వాటిని సిద్ధింపజేయుట కొఱకు పౌరుషము చూపుము.

"జూదమునందు ఓడింపబడితివి. నీ భార్య ద్రౌపది సభకు ఈడ్వబడెను. తాను పురుషుడు అనుకొను అభిమానము గలవాడు ఎవడైనను ఇటువంటి విషయములందు అమర్షము చూపించవలెను.

"నీవు పన్నెండు సంవత్సరములు రాజ్యమునుండి బహిష్కరింపబడి వనమునందుంటివి. తరువాత ఒక సంవత్సరము విరాటరాజునకు సేవకుడవై ఉండవలసి వచ్చెను.

"పాండునందనా! నీ కేర్పడిన రాజ్య బహిష్కరము వనవాసము ద్రౌపది అవమానము మొదలైన దుఃఖములను జ్ఞప్తికి తెచ్చుకొని ఇప్పటికైనను నీ మగతనము చూపుము.

"మేము మాటిమాటికి నిన్ను గూర్చి అప్రియముగా మాట్లాడుచున్నాము. నీవు మాపైన కోపము చూపింపుము. ఎందుకనగా, వీరునికి అమర్షమే పౌరుషము కదా!

"పార్థా! ప్రజలు నీ క్రోధ-బల-వీర్య-జ్ఞానయోగములను శస్త్రాస్త్ర సంచాలన చాతుర్యము మొదలైనవి ఇపుడు చూచెదరుగాక! యుద్ధము చేయుము. నీ పౌరుషము చూపుము.

"అర్జునా! ఇనుప శస్త్రాస్త్రములు ఇపుడు బైటకు తీయుము తీయవలసిన అవసరము వచ్చినది.

"కురుక్షేత్రమునందు బురద కూడ ఆరిపోయినది. నీ యశ్వములు బలిసి యున్నవి. సైనికులను కూడా బాగుగా పోషించినావు కాబట్టి, రేపు ఉదయమే శ్రీకృష్ణునితోవచ్చి యుద్ధము చేయుము.

"ఇప్పుడు నీకు చేతనయినచో వచ్చి భీష్ముని ఎదుర్కొనుము. నిన్ను నీవు అసత్యముగా ఎందుకు ప్రశంసించుకొందువు?

"కుంతీనందనా! దుర్బలుడు మందమతి గంధమాదన పర్వతమును ఎక్కగోరుచున్నట్లు నీవు మిథ్యావాదములు చేయుచు డంబము లాడెదవు. పురుషుడవు కమ్ము.

"మిక్కిలి దుర్జయుడైన వీరుడు కర్ణుడు,బలవంతులలో శ్రేష్ఠుడు శల్యుడు. ఇంద్ర సమాన పరాక్రముడు ద్రోణాచార్యుడు. ఇట్టి వారిని యుద్ధమునందు జయించక నీవు రాజ్యమునెట్లు తీసుకొనగోరుచున్నావు?

"ద్రోణాచార్యుడు బ్రాహ్మవేదము యజుర్వేదము - రెండింటిలో పారంగతుడు. అతడు యుద్ధ భారమును మోయుటలో సమర్థుడు. సేనా మధ్యభాగమునందు నడచుచు ఎప్పుడు కూడ యుద్ధ రంగమునుండి వెనుకకు పోవడు. మహా

పరాక్రమవంతుడైన ద్రోణాచార్యుని నీవు జయింపగోరుట మిథ్యా సాహసము మాత్రమే యగును.

"వాయువు మేరు పర్వతమును ఎప్పుడైన పెరికి పారవేయ గలుగునా? ఇంతవఱకు ఆ యాశ్చర్యమును మేము వినలేదు. ఆ విధముగనే ఆచార్యుని నీవు జయించగోరుట కూడ అగును.

"అర్జునా! నీవు నాతో చెప్పిన మాటలు ఒకవేళ సత్యము కావలసినచో వాయువు మేరు పర్వతమెత్తినట్లు, స్వర్గము భూమిపైన పడినట్లు, యుగమే మారినట్లు అగును.

"అర్జునా! భీష్మద్రోణులిద్దరిని సంహరించుటకు నిశ్చయించుటగాని, వారి భయంకర శస్త్రాస్త్రములు యుద్ధమునందు తగిలినవాడు జీవించుటగాని ఎట్లు పొసగును?

"దేవతలు స్వర్గమును రక్షించునట్లు నాల్గు దిక్కులను ఆయా రాజులు కాంభోజ-శక-ఖశ-శాల్వ-మత్స్య-కురు-మధ్య ప్రదేశ సైనికులు మ్లేచ్ఛ-పులింద ద్రవిడ-ఆంధ్ర-కాంచీ దేశీయ యోధులు జాగ్రత్తగా రక్షించుచు దేవతల సేనవలె నసాధ్యముగ నున్న కౌరవ రాజసేనా సముద్రమును కూపస్థమండూకమువలె నీవు ఏమి చేయగలవు? ఈ విషయమును మనసులో బాగుగా ఆలోచించుకొనుము.

''మూర్ఖా, అర్జునా! గంగానదీ వేగమువలె ఎప్పటికప్పుడు పెరుగుచు దాటుటకు అసాధ్యముగా నున్న నా సేనామధ్యమున నిలిచియున్న నాతో నీవు యుద్ధము చేయుటకు ఎట్లు కోరుచున్నావు?

''భారతా! నీ వద్ద అక్షయ బాణములుగల అంబుల పొదులు, అగ్నిదేవుడిచ్చిన దివ్య రథమున్నదనియు, యుద్ధకాలమునందు ఆ రథముపైన దివ్య ధ్వజము ఎగురుచుండుననియు మాకు బాగుగా తెలియును.

''నీవు ఆత్మస్తుతి చేసికొనకుము. వివిధ రీతుల యుద్ధము చేసినప్పుడే రాజ్యము లభించును. అసత్యముగా ఆత్మ ప్రశంస చేయుటవలన ఆ కార్యము ఫలించదు. ఒకవేళ ప్రపంచమునందు అసత్యమైన ప్రశంసవలననే ఇష్టకార్యసిద్ధి కలిగిన యెడల ప్రతి వ్యక్తియు తన మనోరథమును సులభముగా నెరవేర్చుకొనవచ్చును. ఎందుకనగా, మాటలలో దరిద్రుడెవడు?

''అర్జునా! నీకు సహాయకుడుగా శ్రీకృష్ణుడున్నాడనియు, నీవద్ద నాలుగు చేతుల పొడుగు గాండీవము కలదనియు, నీ వంటి యుద్ధవీరుడు మరియొకడు లేడనియు నాకు తెలిసినను నీ రాజ్యమును అపహరించి తీరెదను. ఎవడైనను నామమాత్రపు ధర్మమున సిద్ధిని పొందజాలడు. ఒక్క విధాత మాత్రమే సంకల్పము మాత్రమున ప్రపంచ సృష్టి చేయగలడు.

''ధనంజయా! నీవు చూచి యేడ్చుచుండగనే పదమూడేండ్లు నీ రాజ్యమును నే ననుభవించితిని. ఇప్పుడు నిన్ను, నీ సోదరులను వధించి భవిష్యత్తులో గూడ నేనే రాజ్యమును శాసించెదను.

''సేవకుడా, అర్జునా! నీవు జూదమునందు ఓడింపబడినప్పుడు నీ గాండీవమెక్కడికి పోయెను? భీమసేనుని బలము కూడ అప్పుడెక్కడికి పోయెను?

''గదను ధరించిన భీముడుగూడ గాండీవమును ధరించిన నీవు పతివ్రతయైన ద్రౌపది సహాయము లేక దాసత్వమునుండి విముక్తులు కాజాలకపోయితిరి.

"మీరందరు మనుష్యోచితమైన దీనదశను పొంది దాసులుగ నుంటిరి. అప్పుడు ద్రౌపదియే దాసత్వ సంకటమునందు పడియున్న మిమ్మందరను విడిపించెను కదా!

''సవ్యసాచీ! ఆ దినములలో నేను మిమ్ము నపుంసకులని యంటిని. అది సిద్ధమేయైనది. ఎందుకనగా, అజ్ఞాత వాసమున నుండిన నీవు స్త్రీవలె జడ ధరించి యుంటివి.

''నీ సోదరుడు, భీముడు విరాటునియింట వంటలవాడుగానుండి ఎక్కువ శ్రమపడియుండుట నా పౌరుషము వలననే కదా!

''ఈ విధముగనే ఎల్లప్పుడు కూడ క్షత్రియులు తమ శత్రువులైన క్షత్రియులకు దండనము విధించి యుండిరి.

''ఇందుచేతనే నీవు కూడ జడ వేసుకొని నపుంసకవేషముతో రాజాంతఃపురమునందు కన్యకలకు నాట్యము నేర్పవలసిన వాడవైతివి.

''ఫల్గునా! శ్రీకృష్ణుని భయముచేతగాని నీ భయముచేతగాని నేను రాజ్యమును తిరిగి ఇవ్వను. నీవు శ్రీకృష్ణునితో వచ్చి యుద్ధము చేయుము.

''మాయ - ఇంద్రజాలము - కపటము - ఇవి యన్నియు సంగ్రామ రంగమునందు ఆయుధము ధరించిన వీరునకు క్రోధమును, సింహనాదమును మాత్రమే కలిగించును.

''అర్జునా! వేలకొలది శ్రీకృష్ణులు గాని, నూర్లకొలది అర్జునులుగాని, అమోఘ బాణములుగల నావంటి వీరుని కడకు వచ్చినప్పుడు పది దిక్కులు పట్టి పారిపోవుదురు. నీవు భీష్మునితో యుద్ధము చేయుట శిరస్సుతో పర్వతమును పగులగొట్టుట వంటిది. లేక - సైనిక మహా సాగరమును భుజములతో ఈది దాటుట వంటిది.

"మా సైన్య సాగరమునందు కృపాచార్యుడు మహామత్స్యముతో సమానుడు. వివింశతి ఆ సాగరములో నున్న మహాసర్పమువంటివాడు. బృహద్బలుడు ఆ సాగరమునందు పైకెగయు అలవంటివాడు. భూరిశ్రవుడు తిమింగిలము వంటివాడు. భీష్ముడు ఆ సముద్రముయొక్క మహావేగము. ద్రోణాచార్యుడు మకరము. భీష్మ-ద్రోణులవలన భయముచేత సైన్య సాగరమునందు ప్రవేశించుట మిక్కిలి దుష్కరము. కర్ణుడు మత్స్యము, శల్యుడు సుడి, కాంభోజరాజగు సురక్షణుడు ఆ సముద్రమందలి బడబానలము.

"అర్జునా! ఆ సముద్రమునందు దుశ్శాసనుడు తీవ్ర ప్రవాహమువంటివాడు. శల-శల్యులు మత్స్యములు, సుషేణుడు - చిత్రాయుధుడు నాగమకరములు. జయద్రథుడు పర్వతము. పురుమిత్రుడు ఆ సముద్రపు గాంభీర్యము. దుర్మర్షణుడు జలము. శకుని వరదవంటివాడు. వివిధ శస్త్రాస్త్రములు ఆ సైన్య సాగరమునందు జలప్రవాహములు.

''ఆ సాగరము అక్షయమే కాక బాగుగా పెరిగియున్నది. దానియందు ప్రవేశించిన యెడల నీవు మిక్కిలి శ్రమ పడెదవు నీ చైతన్యము నష్టమగును. నీ బంధువులందఱు సంహరింపబడుదురు. నీ మనసునకు చాల సంతాపము కలుగును.

''పార్థా! అపవిత్రుడైన మనుష్యునియొక్క మనస్సు స్వర్గమువైపు నుండి మరలునట్లే నీ మనస్సు కూడ ఆ సమయమునందు భూమండల రాజ్యశాసనము నుండి నిరాశచెంది రాజ్యము మాటే విడుచును.

''అర్జునా! శాంతముగా కూర్చొనుము రాజ్యము పొందుట నీకు అతి దుర్లభము. తపస్సు చేయనివాడు స్వర్గము నెట్లు పొందగలడు? ఆ విధముగనే నీవు కూడ రాజ్యాభిలాష కలిగియున్నావు. అది నీకు దుర్లభము."

"అట్లు ఉలూకునకు చెప్పి, యతనిని పాండవుల కడకు దుర్యోధనుడు పంపెను.

"సంజయుడు ధృతరాష్ట్రునకు తరువాతి వృత్తాంతము నిట్లు చెప్పదొడగెను:

"రాజా! తరువాత జూదరియైన శకుని కొడుకు ఉలూకుడు పాండవుల సేనానివేశమునకు పోయి యుధిష్ఠిరుని చూచి అతనితో నిట్లనెను:

"రాజా! నీవు దూతల మాటల మర్మమును ఎరిగినవాడవు. దుర్యోధనుడు నాకు చెప్పి పంపిన సందేశమును చెప్పినది చెప్పినట్లుగా వినిపించెదను. దానిని విని నీవు నా పైన కోపము చెందగూడదు."

''ఆ విధముగా చెప్పిన ఉలూకుని మాటలు విని యుధిష్ఠిరుడు అతనితో నిట్లనెను:

"ఉలూకా! నీవు కొంచెమైనను భయపడకుము. నిశ్చింతుడవై లోభియైన దుర్యోధనుని అభిప్రాయమును వినిపింపుము.''

"ధృతరాష్ట్ర మహారాజా! తరువాత అక్కడ కూర్చొనియున్న పాండవ - సృంజయ - మాత్స్యులు, శ్రీకృష్ణుడు, ఉత్తర సహిత ద్రుపదుడు, విరాటుడు - ఆ రాజులందరి మధ్య ఉలూకుడు యుధిష్ఠిరునితో నిట్లనెను:

"రాజా! దుర్యోధనుడు కౌరవ వీరుల సమక్షమునందు మీకు ఈ సందేశమును పంపెను.

"యుధిష్ఠిరా! నీవు జూదమునందోడిన ద్రౌపది సభలోనికి తేబడెను. ఇట్టి పరిస్థితిలో పురుషుడనుకున్నవాడు ప్రతియొకడును తప్పక కోపపడును.

"పన్నెండేండ్లు రాజ్యము నుండి బహిష్కరింపబడి, వనవాసము చేసి, విరాట దాసుడవై ఒక యేడు అజ్ఞాతముగ ఉండవలసివచ్చెను.

"పాండునందనా! నీ తమ్ముడు భీమసేనుడు అప్పుడు ఏమి చేయుటకు గూడ అసమర్థుడుగా నుండుట వలన అనేక దుర్భాషలు మాట్లాడెను. వాటిని జ్ఞప్తికి తెచ్చుకొని, అత డిప్పుడు వచ్చి శక్తియున్న యెడల దుశ్శాసను రక్తము పానము చేయుగాక!

"ఇనుప అస్త్రశస్త్రములు బైటకు తీసి సిద్ధముగా ఉంచబడినవి. కురుక్షేత్రమందు బురద యెండిపోయినది మార్గము బాగున్నది. మీ అశ్వములు కూడ

బాగుగ పోషింపబడినవి. కాబట్టి, రేపు ఉదయమే కృష్ణునితో వచ్చి యుద్ధము చేయుము.

"యుద్ధరంగమునందు భీష్ముని ఎదుర్కొనకయే ఎందుకు ఈ యసత్య ప్రశంస చేసికొందువు? అశక్తుడు, బుద్ధిహీనుడు ఐనవాడు గంధమాదన పర్వతమును ఎక్క గోరుచున్నట్లు, నీవుకూడ నిన్ను గూర్చి గొప్పగా చెప్పుకొనెదవు. అనవసరముగా మాట్లాడవద్దు. మగతనము నిలబెట్టుకొనుము.

"అసాధ్యుడైన కర్ణుని, అతిబలవంతుడైన శల్యుని, ఇంద్రసమానుడైన ద్రోణుని జయించక నీకీరాజ్య మెట్లు సిద్ధించును?

"ద్రోణాచార్యుడు బ్రాహ్మధనుర్వేదములందు పండితుడు. యుద్ధమునుండి ఎప్పుడును వెనుకాడడు. వాయువు మేరుపర్వతమును పెరికివేయుట వంటిదే ఆయనను జయించదలచుట. చతురంగ బలములలో జీవితేచ్ఛ కలవాడెవ్వడు గూడ ద్రోణునితో పోరాడి క్షేమముగ ఇంటిక తిరిగిపోవజాలడు.

"భీష్మద్రోణుల చంపదలచినవారు గాని, వారి అస్త్రములు శరీరమునకు తాకియున్నవారు గాని యెట్లు జీవించగలరు?

"కురుసైన్యములోని మహామహులైన రాజులను గూర్చి నీవు కూపస్థ మండూకమువలె ఏమియు తెలియకున్నావు. అతి విశాలమైన కురుసైన్యమును, గజసైన్యమును జయించుటకుగాని, అటువంటి సైన్య సంపన్నుడైన దుర్యోధనుని జయించుటకుగాని యుధిష్ఠిరా! నీ వెట్లు కోరుచుంటివి?

"ఉలూకుడు ఆ విధముగా యుధిష్ఠిరునితో చెప్పి అర్జునుని వైపు తిరిగి, దుర్యోధను డిట్లు చెప్పి పంపినాడని యతనితో నిట్లనెను:

"అర్జునా! నీవు వ్యర్థముగా మాట్లాడుచున్నావు. ఎక్కువగా ఆత్మ ప్రశంస చేసికొనుచున్నావు. దీనివలన నీకేమియు ఫలము లభించదు. కేవలము మాట్లాడినంతమాత్రముచేతనే కార్యము నెరవేర్చినచో, అందరు అన్ని కోర్కెలు మాటలచేతనే తీర్చుకొనగలరు. మాటలకు పేదరికము లేదు. అవి దుర్లభము కూడ కావు.

"నీకు వాసుదేవుడు సహాయుడని తాళ (తాటిచెట్టు) ప్రమాణము (నాలుగు చేతుల పొడవు) గల గాండీవము ధరించినవాడవని, నీతో సమానులైన యోధు లెవ్వరు లేరని కూడ నాకు తెలియును.

"నామమాత్రము ధర్మము పలుకుటచేత రాజ్యము లభింపదు. ఒక్క బ్రహ్మదేవుడే సంకల్పమాత్రమున సృష్టి చేయగలడు.

"నీ వేడ్చుచుండగనే పదుమూడేండ్ల రాజ్యమును అనుభవించితిని. ఇప్పుడు నిన్ను వధించి ఆ రాజ్యమును భవిష్యత్తులో కూడ అనుభవించెదను.

"నీవు జూదములో ఓడినప్పుడు గాండీవ మెక్కడికి పోయెను? భీమసేనుని బల మెచటకుపోయెను?

''అర్జునా! నీ గాండీవము వలన గాని, భీమసేనుని గదాబలమువలన గాని ద్రౌపది సహాయము లేక ఆనాడు మీకు మరల రాజ్యము లభించలేదు.

"మీరందరు హీనస్థితిలో దాసులుగా నుంటిరి. అప్పుడు మీ దాసత్వము నుండి మిమ్ము ద్రౌపదియే విడిపించెను.

"అప్పుడు మీరు నపుంసకులు అని యంటిని. నీవు అజ్ఞాతవాసమునందు బృహన్నలగా నుండుటచేత ఆ నా మాట సత్యమయ్యెను అప్పుడు నీవు తలపైన జడ పెట్టుకొని, కన్యకలకు నాట్యము నేర్పితివి.

"భీమసేనుడు వంటలవాడుగా నగుటకు కూడ నా పౌరుషమే కారణము. ఈ విధముగనే క్షత్రియులు శత్రువులైన క్షత్రియులను దండించెదరు.

"నీ భయమువలన గాని, కృష్ణుని భయమువలన గాని రాజ్యమును ఇవ్వను. అతడు, నీవు కలిసి చేతనైనచో యుద్ధము చేసి రాజ్యము తీసికొనుడు.

''మాయ ఇంద్రజాలము కపటము - ఇవి యేమియు యుద్ధభూమిలో ఆయుధము ధరించిన నా యెదుట పనికి రావు. అవి నా క్రోధ సింహనాదము లనే పెంచును.

''వేయిమంది వాసుదేవులు, నూర్గురు అర్జునులు నా యెదుటకు వచ్చి భయపడి దశదిశలకు పారిపోయెదరు.

"భీష్మునితో యుద్ధము చేయుట, తలతో పర్వతమును వగులగొట్టుట వంటిది.

''మా సైన్య సాగరమును రెండు భుజములతో ఈది దాటుము. ఆ సాగరమునందు శల్యుడు మహా మత్స్యము. వివింశతి మహా సర్పము. బృహద్బలుడు వరదవంటివాడు. భూరిశ్రవుడు తిమింగలము. భీష్ముడు ఆ సముద్రము యొక్క అపార వేగము.

''ద్రోణాచార్యునివంటి మకరము ఉండుటచేత సైన్య సాగరము ప్రవేశించుట నీకు దుష్కరము.

''కర్ణుడు మత్స్యము, శల్యుడు సుడిగా నున్నాడు. కాంభోజరాజైన సుదక్షిణుడు బడబానలము వంటివాడు.

"అర్జునా! దుశ్శాసనుడు తీవ్రప్రవాహము. శల - శల్యులు మత్స్యములు. సుషేణుడు నాగము, చిత్రాయుధుడు మకరము, జయద్రథుడు పర్వతము, పురుమిత్రుడు గాంభీర్యము (లోతు) దుర్మర్షణుడు జలము శకుని ప్రపాతము (సెలయేరు)గా ఆ సముద్రమునందున్నారు.

"అనేక విధములైన శస్త్రాస్త్రములు సైన్య సాగరము నందలి జల ప్రవాహము. ఈ ప్రవాహము నశించక పెరుగుచునే యుండును దీనిలో ప్రవేశించగనే నీకు అతి శ్రమ కలిగి చైతన్యము పోగొట్టుకొనెదవు. నీ బంధువులందరు చంపబడెదరు, అప్పుడు నీ మనస్సుకు సంతాపము కలుగును.

"పార్థా! అపవిత్రుడైన మనుష్యుడు స్వర్గమునకు పోవుటకు అనర్హుడై తిరిగి వచ్చినట్లే నీ మనస్సు కూడ అప్పుడు రాజ్యమునుండి నిరాశ చెంది తిరిగి పోవును.

"అర్జునా! శాంతితో కూర్చొనుము. నీకు రాజ్యము దుర్లభము. తపస్సు చేయనివానికి స్వర్గము ఎట్లు లభించును? అట్లే నీవు రాజ్యాభిలాష విడువుము."

"ఇట్లు ధృతరాష్ట్రునకు సంజయుడు ఉలూకుని రాయబారము వినిపించి మరల నిట్లనెను:

''ధృతరాష్ట్ర మహారాజా! విష సర్పమువలె క్రోధముతో నిండిన అర్జునునకు ఉలూకుడు దుర్యోధనుని సందేశమును వినిపించెను.

''పాండవులకు ఆ మాటలు విని చాల కోపము కలిగెను. మొదలే వారికి ఎక్కువ క్రోధముండెను. దానిపైన జూదరి శకుని యొక్క కొడుకు కూడ చెప్పిన మాటలు వారికి అధిక తిరస్కారము, కోపము కలిగించెను.

''వారు తమ తమ ఆసనములనుండి లేచి కొట్టుటకా యన్నట్లు భుజములను పైకెత్తి ఆడించిరి విష సర్పములవలె మిక్కిలి కుపితులై ఒండొరులను చూచుకొనిరి.

''మహారాజా! భీమసేనుడు విష సర్పమువలె బుసకొట్టుచు నిశ్శ్వాసము విడుచుచు తల వంచుకుని ఎఱ్ఱని కన్నులతో శ్రీకృష్ణ భగవానుని చూచెను.

''అట్లున్న భీముని చూచి శ్రీకృష్ణుడు ఉలూకుని గూర్చి మందహాసము చేయుచు ఇట్లనెను:

''ఉలూకా! నీవు త్వరగా పోయి దుర్యోధనునితో నిట్లు చెప్పుము:-

"పాండవులు నీ సందేశమును విని దాని యర్థమును గ్రహించినారు. యుద్ధ విషయమునందు నీ యభిప్రాయము ప్రకారమే యగుగాక!''

''ధృతరాష్ట్ర మహారాజా! ఉలూకుడు సృంజయవంశీయులను శ్రీకృష్ణుని సపుత్రకుడైన ద్రుపదుని విరాటుని అతని వద్దనున్న రాజులను చూచి వారికి దుర్యోధనుని సందేశమును వేరు వేరుగా వినిపించెను.

''దుర్యోధనుని వాగ్బాణములచేత అర్జునుని మరల నొప్పించెను. అందరికిని దుర్యోధనుడు పంపించిన సందేశమును ఉలూకుడు మాటిమాటికి చెప్పెను.

"రాజా! ఉలూకుడు చెప్పిన దారుణ వచనములను విని అర్జునుని మనస్సు మిక్కిలి క్షోభిల్లెను. అతడు లలాటము నుండి చెమటను తుడుచుకొనెను.

''అట్టి పరిస్థితిలో నున్న అర్జునునిచూచి అక్కడనున్న వారందరు సహింపజాలకపోయిరి.

''కృష్ణార్జునులను దుర్యోధనుడు దూషించిన విధము విని అచటి శూరులందరు క్రోధముచేత మండిపడిరి.

"ధృతరాష్ట్ర మహారాజా! ధృష్టద్యుమ్న - శిఖండి - సాత్యకులు ఐదుగురు సోదరులైన కేకయులు, రాక్షసుడైన ఘటోత్కచుడు, ద్రౌపది కొడుకులు సుభద్రా పుత్రుడైన అభిమన్యుడు. ధృష్టకేతువు, భీమ నకుల సహదేవులు- వారందరు కూడ తమ తమ ఆసనముల నుండి పైకెగిరి, క్రోధరక్త లోచనులై, రక్త చందన రూషితములై, భుజకీర్త్యాద్యలంకారముల చేత భూషితములైన భుజములు చరచి పండ్లు కొరకుచు ఓష్ఠ మూలము (పెదవుల కొనలు)ను అతి క్రోధముతో నాకుకొనిరి.

"రాజా! వారి భావములను తెలిసికొని భీమసేనుడు అతి వేగముగ లేచి క్రోధముచేత జ్వలించుచు కన్నులు విశాలముగ చేసి అందరిని చూచుచు దంతముల కొరకుచు చేతులు రాచుకొనుచు ఉలూకునితో నిట్లనెను:

"మూర్ఖా! దుర్యోధనుడు చెప్పిన మాటలు చెప్పితివి. నీవు మేము అసమర్థులమని తలచి మమ్ము ఈ విధముగ ఉత్తేజితులను చేయుటకు ఈ మాటలు చెప్పుచున్నావా?

"ఇప్పుడు నేను చెప్పబోవు మాటలను వినుము. రాజులందరు, కర్ణుడు, దురాత్ముడైన నీ తండ్రి శకుని వీరందరి సమక్షమందు దుర్యోధనునకు నా యీ మాటలు వినిపింపుము.

"దుష్ట దుర్యోధనా! మేము మా అన్నను సంతోష పెట్టగోరి నీవు చేసిన అత్యాచారము లన్నియు నోరు మూసుకొని సహించితిమి. కాని, మూర్ఖుడవైన నీవు ఈ విషయమును గ్రహించజాలకున్నావు.

"బుద్ధిమంతుడైన ధర్మరాజు కౌరవులకు హితమును గోరి శాంతిని అభిలషించుచున్న శ్రీకృష్ణుని కౌరవుల కడకు సంధికై పంపియుండెను.

"కాని, నీవు నిశ్చయముగా కాలప్రేరితుడవై యమలోకమునకు పోవగోరుచున్నావు. కనుకనే సంధికి అంగీకరించలేదు. సరియే, మంచిదే, మాతో యుద్ధమునకు దిగుము. రేపు యుద్ధము కానున్నది కదా!

"పాపాత్ముడా! నిన్ను నీ తమ్ములను వధించుటకు నేను చేసిన ప్రతిజ్ఞ తప్పక పూర్తినొందగలదు. ఈ విషయమునందు నీవేమాత్రము సందేహించకుము.

"సముద్రము ఎల్లను దాటినప్పటికి, పర్వతములు పగిలిపోయినప్పటికిని నా ప్రతిజ్ఞ అసత్యము కాజాలదు

"దుర్బుద్ధీ! నీకు సహాయము చేయుటకు యముడు, కుబేరుడు, భగవంతుడైన రుద్రుడు వచ్చినప్పటికిని పాండవులు తమ ప్రతిజ్ఞను తప్పక నెరవేర్చుకొనగలరు.

''నేను స్వేచ్ఛగా దుశ్శాసనుని రక్తము త్రాగుదును. ఆ సమయమునందు భీష్ముడు ఇతర రాజవీరులతో అడ్డము వచ్చినను అప్పుడే వారిని యమలోకమునకు పంపెదను.

"నేను రాజుల సభలో చెప్పనమాట తప్పక సత్యమగును. ఇది నేను ఒట్టు పెట్టుకొని చెప్పుచున్నాను."

''భీమసేనుని మాటలు విని సహదేవుడు క్రోధారుణలోచనుడై అమర్షముతో నిట్లనెను:

"పాపీ, ఉలూకా! నేను ఈ వీరసైనికుల సమావేశమునందు వీరోచితములైన మాటలు చెప్పుచున్నాను. నీవు విని నీ తండ్రితో నిట్లు చెప్పుము:

"శకునీ! ధృతరాష్ట్రునితో నీకు సంబంధము కలుగకుండిన యెడల, ఎప్పుడు కూడ కౌరవులతో మాకు భేదభావము కలిగియుండదు. నీవు సమస్త ప్రపంచమును ధృతరాష్ట్రి కులమును నశింపజేయుటకు మూర్తీభవించిన శత్రుత్వముగా జన్మించితివి. దీనివలన నీ కులమును గూడ నశింపజేసికొనుచున్నావు."

"అట్లు సహదేవుడు తన సందేశమును శకునికి పంపి ఉలూకునితో మరల నిట్లనెను:

"ఉలూకా! పాపాత్ముడైన నీ తండ్రి, పుట్టుకనుండియే మాయందు ప్రతిదినము క్రూరత్వముతో అహితముగా వ్యవహరించుచున్నాడు. కనుక, శకుని చూచుచుండగనే తొలుత నిన్ను వధించి సమస్త వీరులయెదుట శకునిని కూడ చంపెదను. ఆ విధముగా నేను పగ దీర్చుకొనెదను "

"ధృతరాష్ట్ర మహారాజా! భీమ సహదేవుల మాటలు విని అర్జునుడు భీమసేనుని మందహాసముతో జూచుచు నట్లనెను:

''అగ్రజా! నీతో వైరము తెచ్చిపెట్టుకున్నవారు ఇంటిలో కూర్చొని సుఖము ననుభవించుచున్నారు. ఆ మూర్ఖు లిప్పుడు కాలపాశబద్ధులై యున్నారు. వారి జీవనము లేనిదానితో సమానము.

"నీవు ఈ ఉలూకునితో కఠినముగ మాట్లాడకూడదు. పాపము, ఇందులో దూతల అపరాధ మేమున్నది? వారు చెప్పిన మాటలనే వీరు ఇక్కడ చెప్పుచుందురు.''

"అట్లు అర్జునుడు భీమసేనునకు చెప్పి ధృష్టద్యుమ్నాది మిత్రులతో నిట్లనెను:

"మిత్రులారా! పాపిష్ఠుడైన దుర్యోధనుడు చెప్పిన మాటలు మీరు వింటిరి కదా! విశేషించి అతడు నన్ను, శ్రీకృష్ణపరమాత్మను నిందించెను. మీరు మా హితమును కోరువారు కాబట్టి యీ నిందావాక్యములు విని కుపితులై యున్నారు.

"కాని, శ్రీకృష్ణభగవానుని ప్రభావముచేత మీ యందరి ప్రయత్నముచేత ఈ సమస్త భూమండలమునందలి క్షత్రియుల నందరిని నేను ఏ మాత్రము

లెక్కచేయను. మీ యాజ్ఞ ఐనచో దుర్యోధనుని మాటలకు ఉత్తరము ఉలూకునకు చెప్పెదను. ఇతడు అతనికి వినిపించగలడు.

''లేదా, మీ అందరి సమ్మతియైనచో, దుర్యోధనుడు ఆత్మ ప్రశంస చేసికొనుచు చెప్పిన మాటలకు సరియైన ఉత్తరము నేను రేపు ఉదయము సేనా ముఖమునందు గాండీవముద్వారా ఇచ్చెదను. ఎందుకనగా, కేవలము మాటలతోనే ఉత్తరమిచ్చువాడు నపుంసకుడనిపించుకొనును.''

''ధృతరాష్ట్ర మహారాజా! అర్జునుని మాటలను అతని ప్రవచన పద్ధతిని అక్కడి రాజోత్తములందరు ఆశ్చర్య చకితులై విని, అర్జునుని మిక్కిలి ప్రశంసించిరి.

''తరువాత ధర్మరాజు రాజులందరిని వారి వారి ప్రతిష్ఠను వయస్సును అనుసరించి అనునయపూర్వకముగా మాట్లాడి వారిని శాంతపరచి దుర్యోధనునకు తాను పంపదగిన ప్రతి సందేశమునకు ఉలూకుని ద్వారా యిట్లు చెప్పి పంపెను:

''ఉలూకా! ఏ రాజుకూడ శాంతుడుగా నుండి తన అవమానమును సహించజాలడు. నీ మాటలను సావధానముగ వింటిని. ఇక ఇప్పుడు నీకు ఉత్తరము చెప్పెదను, వినుము:"

''జనమేజయా! ఈ విధముగ యుధిష్ఠిరుడు ఉలూకునితో తొలుత మధుర వచనములు పలికి తరువాత పరాక్రమ పూర్ణమైన మాటలతో ఇట్లు దుర్యోధనునకు ఉత్తరము ఉలూకుని ద్వారా పంపెను:

''తొలుత దుర్యోధనుని సందేశము వినిన యుధిష్ఠిరుడు రోషముచేత అత్యంత రక్త నేత్రములతో చూచుచు విషసర్పమువలె బుసకొట్టుచుండెను. ఓష్ఠ మూలములను నాకుచు శ్రీకృష్ణుని, తన తమ్ములను చూచి యిట్లు చెప్పుటకు ప్రారంభించెను:

''జూదరియైన శకుని పుత్రుడా! నాయనా! ఉలూకా! నీవు ఇక్కడి నుండి పోయి మూర్తీభవించిన శత్రుత్వమువలె నున్న కృతఘ్నుడు, దుర్బుద్ధి, కులాంగారకుడు నైన దుర్యోధనునితో ఈ విధముగ చెప్పుము:

"పాపీ! దుర్యోధనా! నీవు పాండవులతో ఎల్లప్పుడును కుటిలముగానే వ్యవహరించుచు వచ్చితివి. పాపాత్మా! ఎవడు ఇతరులకు భయపడక తన మాట నిలబెట్టుకొనుచు తన భుజబలముచేతనే పరాక్రమమును ప్రకటించి శత్రువులను యుద్ధమునకు పిలుచునో అతడే క్షత్రియుడనిపించుకొనును.

"కులాధమా! నీవు పాపివి. చూడుము, క్షత్రియుడవై యుండి మమ్ము యుద్ధమునకు పిలిచి మాకు మాననీయులు వృద్ధులునైన గురుజనులను స్నేహ పాత్రులైన బాలకులను యుద్ధమునకు ముందు బెట్టుకొని రాకుము.

''దుర్యోధనా! నీ బలపరాక్రమములను, నీ సేవకజనము యొక్క బల పరాక్రమములను ఆశ్రయించి కుంతీపుత్రులను యుద్ధమునకు ఆహ్వానించుము. పూర్తిగా క్షత్రియత్వమును చూపుము. స్వయముగ శత్రువులను ఎదుర్కొనుటకు అసమర్థుడగుటవలన ఇతరుల పరాక్రమముపై ఆధారపడి యుద్ధమునకు రమ్మని పిలుచువాడు నపుంసకుడనిపించుకొనును.

''నీవు ఇతరుల బలముపైననే ఆధారపడి నిన్ను నీవు మహాశక్తిశాలిగా తలచుచున్నావు. కాని, ఇట్లు అసమర్థుడవై కూడ మా యెదుట ఎందుకు వ్యర్థముగ గర్జనము చేయుచున్నావు.''

''తరువాత శ్రీకృష్ణుడు, ఉలూకా! నీవు నా మాటగా దుర్యోధనునితో ఇట్లు చెప్పుము అని యనెను:

''దుర్బుద్ధీ! ఇక రేపే నీవు రణభూమికి రమ్ము. నీ పౌరుషమును చూపింపుము.

''మూర్ఖుడా! కుంతీపుత్రులు శ్రీకృష్ణుని కేవలము సారథిగా నుండుటకే కోరినారు. కాబట్టి అతడు యుద్ధము చేయడు అని నీవు తలచుచున్నావు.

''సాధారణముగా ఆ కారణము చేతనే నేననగా నీకు భయములేక ఉండ వచ్చును. కాని, జ్ఞప్తియందుంచుకొనుము. నేను తలచిన యెడల ఈ రాజవీరుల నందరిని నా క్రోధాగ్నిచేత అగ్ని ఎండుగడ్డిని కాల్చినట్లు కాల్చి భస్మము చేసెదను.

''మూర్ఖుడా! యుధిష్ఠిరుని కోరికచేత నేను జితేంద్రియుడు మహాత్ముడు నైన అర్జునునకు యుద్ధసమయమునందు సారథ్యమును అవశ్యముగ చేసెదను.

"ఇప్పుడు నీవు మూడు లోకములపైన ఎగిరిపోయినను, భూమిలో దూరి పోయినను, ఎక్కడెక్కడికి పోయినను అక్కడికి రేపు ఉదయము అర్జునుని రథము నిన్ను వెన్నంటి వచ్చుటను చూచెదవుకాక!

"ఇంతయేకాక భీమసేనుడు చెప్పిన మాటలు వ్యర్థమని నీవు తలచుచున్నావు. ఇది సరికాదు. భీమసేనుడు దుశ్శాసనుని రక్తము త్రాగినాడు అని నీవు నేడే నిశ్చయముగా తెలిసికొనుము.

"నీవు పాండవుల యెడల విపరీతముగా కఠిన వచనములను పలుకుచున్నావు. అర్జునుడు, నేను భీముడు, నకుల సహదేవులు నిన్ను పూర్తిగా నిర్లక్ష్యము చేయుచున్నారు.''

"ఇట్లు సంజయుడు దృతరాష్ట్రునకు, యుధిష్ఠిరుడు శ్రీకృష్ణుడు ననిన మాటలు చెప్పి అర్జునుడనిన మాటలిట్లు చెప్పదొడగెను:

''ధృతరాష్ట్ర మహారాజా! దుర్యోధనుడు చెప్పిన మాటలన్నియు వినిన అర్జునుడు కోపముచేత కనులు ఎఱ్ఱజేసి ఉలూకుని చూచెను. తరువాత భుజము లెగుర వేయుచు శ్రీ కృష్ణుని వైపు చూచుచు ఉలూకునితో నిట్లనెను:

"ఉలూకా! తన బలపరాక్రమములనే అధారముగా జేసికొని శత్రువులను యుద్ధమునకు ప్రోత్సహించి నిర్భయముగ యుద్ధము చేయువాడే పురుషుడనిపించుకొనును. ఇతరుల బలపరాక్రమముల నాశ్రయించి శత్రువులను యుద్ధమునకు బిలుచువాడు క్షత్రబంధువు (నీచ క్షత్రియుడు) అగును స్వయముగా అసమర్థుడగుటవలన నతడు లోకములో పురుషాధము డనిపించుకొనును.

"మూర్ఖుడా! నీవు ఇతరుల బలాక్రమముల చేతనే బలాక్రమ సంపన్నుడననుకొనుచున్నావు. నీవు పిరికివై యితరులను ఆక్షేపింపజూచుచున్నావు.

"సమస్త రాజులలో వృద్ధుడు, అందరి హితమును కోరువాడు, జితేంద్రియుడు, పరమజ్ఞాన సంపన్నుడైన భీష్మపితామహునకు మరణము కొఱకు రణదీక్ష యిప్పించి నీ గొప్పతనమును చాటుకొనుచున్నావు.

"దుష్బుద్ధియైన కులపాంసనుడా! నీ మనోభావము నాకు తెలిసినది. పాండవులు, గంగా నందనుడైన భీష్ముని యందు దయచేత భక్తిచేత అతనిని వధించరని నీకు తెలియును. నీవు ఎవని పరాక్రమము నాశ్రయించి ఇంత గొప్పగా మాట్లాడుచున్నావో అట్టి భీష్మ పితామహునే రాజులందరు చూచుచుండగనే అందరికంటె ముందు చంపెదను."

"ఉలూకా! నీవు కౌరవుల కడకు పోయి అర్జునుడు, 'చాల మంచిది' అని నీ యుద్ధాహ్వానమును అంగీకరించెనని దుర్యోధనునకు చెప్పుము. ఈ రాత్రి గడవగనే యుద్ధము అరంభింపబడునుగదా!

''సత్యప్రతిజ్ఞుడైన భీష్ముడు సైనికులకు సంతోషము కలిగించు నిట్లనెను గదా!

''దుర్యోధనా! నేను సృంజయ వీరుల సేనను, సాల్వదేశ సైనికులను కూడ సంహరించెదను. ద్రోణాచార్యులు లేకయే సమస్త ప్రపంచమును సంహరించగలను. కాబట్టి పాండవుల వలన నీ కేలాటి భయము లేదు.''

"భీష్ముడు చెప్పిన యీ మాట చేతనే నీవు 'రాజ్యము నీకే ప్రాప్తించగలదు. పాండవులు ఆపదలో చిక్కుకొనగలరు' అని మనస్సులో నిశ్చయించుకొని యున్నావు.

"దుర్యోధనా! ఈ కారణము చేతనే నీకు పొగరెక్కువై త్రుళ్ళిపడుచు నీపైన వచ్చి పడియున్న ఇప్పటి సంకటమును చూడకున్నావు.

''కాబట్టి, నేను అందరికంటె తొలుత నీ సేనా సమూహమునందే ప్రవేశించి కురుకుల వృద్ధుడైన భీష్మనే నీ కన్నులయెదుట వధించెదను.

"నీవు రేపు సూర్యోదయ సమయమునందు సంసిద్ధుడవై కవచ రథాదులతో అన్నివైపుల దృష్టి జాగ్రత్తతో సాదించుచు సత్యప్రతిజ్ఞుడైన భీష్ముని రక్షింపుము.

''నేను నీ సైనికులు చూచుచుండగనే నీకు ఆశ్రయుడైన భీష్ముని బాణములతో సంహరించి రథమునుండి క్రిందకు పడగొట్టెదను.

''రేపు ఉదయమున నా చేత ప్రయోగింపబడు బాణసమూహములచేత నిండిన పితామహుని చూచి అతడు పలికిన వ్యర్థవచనముల పరిణామము నీకు తెలియగలదు.

"సుయోధనా! క్రోధము నిండిన భీమసేనుడు క్షుద్రుడు, అధర్మపరుడు, పాపబుద్ధి. క్రూరకర్ముడునైన నీ సోదరుడు దుశ్శాసనుని గూర్చి చేసిన ప్రతిజ్ఞను నీవు సత్యముగ చూచెదవుగాక!

''దుర్యోధనా! అభిమాన దర్ప - క్రోధ - కటుభాషణ నిష్ఠురత్వ - అహంకార - ఆత్మప్రశంసా - క్రూరత్వ - తీక్ష్ణత్వ - ధర్మ విద్వేష - అధర్మ - అతివాద - వృద్ధ పురుషావమాన - వక్రదృష్టులు - ఇవియేకాక ఇంకను అనేకములైన నీ అన్యాయములు - అత్యాచారములు కలవు. ఈ యన్నిటి యొక్క ఘోర పరిణామము త్వరలోనే చూడగలవు.

''మూర్ఖ పురుషాధమా! శ్రీకృష్ణునితోపాటు నేను కుపితుడనైనపుడు నీవు జీవితమునందు రాజ్యమునందు ఏ ధైర్యము చేత ఆశ పెట్టుకొనగలవు?

''భీష్మ ద్రోణ కర్ణులు చంపబడిన తరువాత నీ నీ జీవమును, రాజ్యమును, పుత్రులను రక్షించుకొనలేక నిరాశ చెందెదవు.

''సోదరుల యొక్క, పుత్రులయొక్క మరణము విని, నీవు భీమసేనుని చేత చంపబడుచున్నపుడు నీ దుష్కృత్యములను స్మరించగలవు.

"శకుని పుత్రా! నేను రెండవసారి ప్రతిజ్ఞ చేయుట ఎరుగను. నీతో సత్యము చెప్పుచున్నాను. నేను చెప్పిన దంతయు తప్పక జరిగి తీరును."

''ధృతరాష్ట్ర మహారాజా! ఈ విధముగ అర్జునుడు చెప్పిన తరువాత యుధిష్ఠిరుడు కూడ ఉలూకునితో మరల నిట్లనెను:

''వత్సా, ఉలూకా! నీవు దుర్యోధనుని కడకు పోయి నా మాటగా ఇట్లు చెప్పుము.

''దుర్యోధనా! నీవు నీ యాచరణము ప్రకారమే నా ఆచరణమును కూడ తలచగూడదు. మన యిద్దరి నడవడిక, సత్యా సత్యములు వీటి యంతరము నాకు బాగుగా తెలియును.

''నేను పురుగులకు, చీమలకు కూడ కష్టము కలిగించ దలచను. ఇట్లుండగా, నా సోదరులను, బంధువులను కుటుంబ జనులను వధించుటకు ఏ విధముగ గూడ కోరను.

''నాయనా! ఇందు కొఱకే మొదట నేను అయిదు గ్రామములనే కోరి యుంటిని. దుర్బుద్ధీ! నేనట్లు కోరుటకు నా ఉద్దేశము ఏ విధముగా నైన నీపైన సంకటము రాకుండ చూడవలె ననియే.

''కాని, నీ మనస్సు తృష్ణా లోభములలో మునిగియున్నది. మూర్ఖత్వ కారణము చేత నీవు మిథ్యా ప్రశంస చేసికొనుచున్నావు. శ్రీకృష్ణభగవానుని హిత వచనములను కూడ నీ వంగీకరింపలేదు. ఇప్పుడు ఎక్కువ మాట్లాడి ఏమి లాభము? నీ సోదరులతో వచ్చి యుద్ధము చేయుము."

"ఇట్లు దుర్యోధనునకు, యుధిష్ఠిరుడు తన సందేశము చెప్పి ఉలూకునితో తన మాటగా ఇట్లు చెప్పుమని మరల చెప్పెను:

"దుర్యోధనా! నీ సందేశము విని దాని అభిప్రాయమును తెలిసికొనినాను. నీ యిచ్ఛ ఉన్నట్లే అగుగాక!"

''తరువాత భీమసేనుడు మరల నిట్లనెను:

''నరాధమా, దుర్యోధనా! నీవు యుద్ధమునందు మరణించి గ్రద్దలకడుపు లోనైన నివాసము చేయవలెను, అథవా, హస్తినాపురమునకు పోయి దాగి యుండవలెను.

"నేను సభలో చేసిన ప్రతిజ్ఞ తప్పక సత్యము చేసి చూపించెదను. ఈ మాట నేను సత్యముపైననే ఒట్టు పెట్టుకొని చెప్పుచున్నాను. దుశ్శాసనుని చంపి అతని రక్తమును త్రాగెదను నీ తమ్ముల నందరిని చంపి నీ తొడలు విరుగ గొట్టి వేదసెను. సుయోధనా! నేను ధృతరాష్ట్ర పుత్రులందరికిని మృత్యు దేవతను.

"ఈ విధముగనే రాజకుమారులందరి మృత్యువునకు కారణము అభిమన్యుడు కాగలడు. ఇందులో సంశయము లేదు. నా పరాక్రమము చేత తప్పక నిన్ను సంతోష పరచెదను. నీవు ఒక్క మాట నాది వినుము.

"నిన్ను నీ తమ్ములతో సహితముగ సంహరించి ధర్మరాజైన యుధిష్ఠిరుడు చూచుచుండగనే నీ శిరస్సు నా పాదములచేత త్రొక్కెదను."

"జనమేజయా! తరువాత నకులుడు ఉలూకునితో నిట్లనెను :

''ఉలూకా! నీవు కురుకుల కళంకుడైన దుర్యోధనునితో నా మాటగా చెప్పుమని యిట్లనెను:

''రాజాధమా! నీవు చెప్పి పంపిన మాటలన్నియు ఉన్నవున్నట్లు మేము వినినాము. నీ ఉపదేశము ననుసరించియే నేను అంతయు చేసెదను."

''రాజా! తరువాత సహదేవుడు ఇట్లు ప్రతిసందేశమును పంపెను:

''దుర్యోధనా! నీకు ఈనాడున్న బుద్ధి వ్యర్థమై పోవును. ఇప్పుడు మేము నీ మూలముగ అనుభవించుచున్న దుఃఖములను సంతోషముతో వర్ణించి చెప్పుచున్నావు. దాని ఫలముగ నీ పుత్రులు కుటుంబజనులు బంధుజనులతో గూడ నీవు బాధపడుచు దుఃఖమునందు మునిగిపోయెదవు."

''తరువాత విరాట ద్రుపదులు దుర్యోధనునకు చెప్పుమని ఉలూకునితో నిట్లనిరి:

''రాజా! మేము సత్పురుషులకు దాసుల మయ్యెదము. ఇదియే మా యభిప్రాయము. మేమిద్దరము దాసులమా? అదాసులమా? అను నిర్ణయము యుద్ధము

నందు నీవు చూచెదవు. ఎవనికి ఎట్టి పౌరుషమున్నదో దాని ప్రకారము చేసెదము. అది నీవు చూచెదవు గాక!"

''తరువాత శిఖండి పాపాచారుడైన నీ రాజుతో ఇట్లు చెప్పుమని ఉలూకునితోననెను:

''దుర్యోధనా! యుద్ధమునందు నీవు భయంకర కార్యమును చేయుచున్న నన్ను చూడవలెను. ఎవని పరాక్రమముపైన ఆధారపడి నీ విజయము లభించినదని నీవు విఱ్ఱవీగుచున్నావో, అట్టి భీష్ముని సంహరించి రథమునుండి క్రిందికి పడగొట్టెదను.

"మహాత్ముడైన విధాత భీష్ముని వధకొఱకే నిశ్చయముగా నా సృష్టి చేసెను. అందుచేత నేను ధనుర్ధారులందరు చూచుచుండగనే భీష్ముని చంపెదను.

''తరువాత ధృష్టద్యుమ్నుడు కూడ కితవ (జూదరి) కుమారుడైన ఉలూకునితో నిట్లనెను:

''ఉలూకా! నీవు దుర్యోధనునితో నా మాటగా ఇట్లు చెప్పుము.

"నేను ద్రోణాచార్యుని, అతని వర్గము వారిని, అతని బంధువులను సంహరించెదను. నా వంశపు పూర్వుల ప్రవర్తనను తప్పక అనుసరించవలెను. కాబట్టి నేను యుద్ధమునందు నా పరాక్రమమును చూపెదను. అట్లు ఇతరు డెవ్వడును జేయజాలడు.''

''తరువాత యుధిష్ఠిరుడు దయతో మరల ఈ మహత్వపూర్ణమైన మాటలను దుర్యోధనునకు చెప్పి పంపెను.

''రాజా! నేను ఏవిధముగ గూడ నా కుటుంబ జనుల వధను చేయగోరను కాని, ఇది యంతయు నీ దోషము చేతనే మూడినది.

''నాయనా! ఉలూకా! నీకు ఇష్టముండినచో త్వరగా పొమ్ము లేదా, నీకు మంగళమగు గాక - ఇక్కడనే ఉండుము ఎందుకనగా, మేము కూడ నీకు బంధువులమే. సోదరులమే."

"జనమేజయా! తరువాత ఉలూకుడు యుధిష్ఠిరుని వీడ్కొని దుర్యోధనుడు ఉన్నచోటికి పోయి అతనికి అర్జునుని సందేశమును ఉన్నది ఉన్నట్లుగా వినిపించెను.

''శ్రీకృష్ణ - యుధిష్ఠిర - భీముల పౌరుషభరితములైన మాటలు కూడ ఉలూకుడు వర్ణించి చెప్పెను. నకుల - సహదేవ - ద్రుపద - విరాట - శిఖండి - ధృష్టద్యుమ్నులు చెప్పిన మాటలు కూడ యథాపత్తుగా వినిపించెను.

"ధృతరాష్ట్ర మహారాజా! ఉలూకుని మాటలు విని దుర్యోధనుడు కర్ణ - శకుని దుశ్శాసనులతో నిట్లనెను:

''వీరులారా! రాజులకు, మిత్రులకు సేనలకు ఆజ్ఞ యివ్వగలరు. సమస్త సైనికులు రేపు సూర్యోదయమునకు ముందే సంసిద్ధులై యుద్ధ రంగమునకు పోవలెను.''

''తరువాత కర్ణుడు పంపిన దూతలు మిక్కిలి త్వరతో రథములు, ఒంటెలు, గుఱ్ఱములపైన ఎక్కి తీవ్రగమనముచేత సేనామధ్యములోనికి పోయి కర్ణుని ఆజ్ఞానుసారముగ మరునాడు సూర్యోదయము లోపల సేయు యుద్ధమునకు సిద్ధముగా నుండవలెనని యందరకు చెప్పిరి.

''జనమేజయా! ఇట్లు సంజయుడు ధృతరాష్ట్రునకు ఉలూకుని రాయబారము గూర్చి చెప్పి తరువాతి వృత్తాంతము నిట్లు చెప్పదొడగెను :

"ధృతరాష్ట్ర మహారాజా! ఉలూకుని మాటలు విని యుధిష్ఠిరుడు కూడ ధృష్టద్యుమ్నుని సేనా నాయకత్వములో తన సేనను యుద్ధము కొఱకై ప్రయాణము చేయించెను.

"కాల్బలము, గజములు, రథములు, అశ్వసమూహము-ఇవన్నియు గల చతురంగ బలము భూమివలె స్థిరముగా నుండెను. అర్జున భీమ సేనాదులు దానిని రక్షించుచుండిరి. దుర్గమమైన ఆ సేన ధృష్టద్యుమ్నుని అధీనములో నుండెను. అది ప్రశాంతమైన సముద్రమువలె తోచుచుండెను.

"సేనాగ్రభాగమునందు ధృష్టద్యుమ్నుడు నడచుచుండెను. అతడు సర్వదా ద్రోణాచార్యునితో యుద్ధము చేయగోరుచుండెను. అతడు సమస్త సేనను తనవెంట నడిపించుకొని పోవుచుండెను.

"ధృష్టద్యుమ్నుడు ఏ వీరునకు ఎంత బలము ఉత్సాహము కలదో దానిని బాగుగా విచారించి అతనికి తగిన శత్రువీరునితో యుద్ధము చేయుటకాదేశించెను.

"అర్జునుడు కర్ణుని ఎదుర్కొనుటకు, భీముడు దుర్యోధనుని ఎదుర్కొనుటకు ఏర్పాట్లు చేసెను. ధృష్టకేతుడు శల్యునితో, ఉత్తమౌజుడు కృపాచార్యునితో, నకులు డశ్వత్థామతో, శైబ్యుడు కృతవర్మతో, సాత్యకి సైంధవునితో, శిఖండి భీష్ముని తోడను ముఖ్యముగా యుద్ధము చేయుటకు ఏర్పాటు చేసెను.

"సహదేవుడు శకునితో, చేకితానుడు శలునితో, ద్రౌపదీ పుత్రులు ఐదుగురు త్రిగర్తులతోను పోరాడుటకు ఏర్పరచి, సుభద్రాపుత్రుడైన అభిమన్యునకు వృషసేనుని (కర్ణపుత్రుని) తోను, ఇతర రాజులతోను యుద్ధము చేయవలసిన కార్యమును ఒప్పగించెను.

"ఎందుకనగా, వారు యుద్ధమునందు అర్జునునికంటె, అభిమన్యుని అధిక శక్తిమంతునిగా తలచుచుండిరి."

"ఆ విధముగా యోధులను వేరు వేరుగాను, వర్గములుగాను, విభజించి సేనాపతులకు అధీశుడైన ధృష్టద్యుమ్నుడు ద్రోణాచార్యుని తన భాగములోనికి ఉంచుకొనెను.

"ఈ విధముగా సంజయుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు అతని నిట్లడిగెను:

"సంజయా! అర్జునుడు భీష్ముని వధించుటకు ప్రతిజ్ఞ చేసినప్పుడు దుర్యోధనాదులైన నా మూర్ఖ పుత్రులు ఏమి చేసిరి?

"అర్జునుడు దృఢమైన ధనుస్సును ధరించును. ఇదిగాక శ్రీకృష్ణ భగవానుడు అతనికి సహాయకుడుగ నున్నాడు. అందుచేత యుద్ధభూమియందు నా తండ్రి భీష్ముడు అర్జునునిచేత చంపబడినట్లుగనే తలచుచున్నాను.

''అర్జునుని ప్రతిజ్ఞను విని బుద్ధిమంతుడు మహాధనుర్ధరుడునైన భీష్ముడేమనెను? కౌరవకులము యొక్క భారమును వహించునట్టి భీష్ముడు సేనాపతి పదవిని చేపట్టిన తరువాత యుద్ధము కొఱకు ఏయే ప్రయత్నములు చేసెను?"

"జనమేజయా! తరువాత భీష్ముడు అనిన మాటలను అన్నిటిని సంజయుడు ధృతరాష్ట్రునకు ఇట్లు చెప్పెను:

''రాజా! సేనాపతి పదమును పొందిన తరువాత భీష్ముడు దుర్యోధనుని సంతోషమును పెంపొందించుచు అతనితో నిట్లనెను:

''రాజా! నేను శక్తిధారుడైన దేవసేనాపతి కుమారస్వామికి నమస్కారము చేసి యిప్పుడు నీ సేనకు అధిపతి నయ్యెదను.

"సేనకు సంబంధించిన ప్రతియొక కార్యము నాకు బాగుగా తెలియును. నేను అనేక విధములైన వ్యూహములను పన్నుటయందు కూడ సమర్థుడను.

"నీ సేనయందు వేతనము తీసుకొనువారును, వేతనము తీసికొనక యుండు మిత్రసైనికులును ఉన్నారు. వారందరిచేత వారికి అర్హములైన పనులను చేయించు కళ కూడ నేను బాగుగా ఎరుగుదును.

''రాజా! యుద్ధయాత్రలు సలుపుటకును, యుద్ధము చేయుటకును, శత్రువులు ప్రయోగించిన అస్త్రములకు ప్రతీకారము చేయుటకును బృహస్పతికి తెలిసినన్ని విషయములలో విశేష జ్ఞానము నాకు కలదు.

''దేవతలు, గంధర్వులు, మనుష్యులు-ఈ మూడు వర్గముల వారు చేయు వ్యూహరచనల జ్ఞానము కూడ నాకు కలదు. ఆ మొగ్గరముల ద్వారా నేను పాండవులకు మోహము కలిగించెదను. అందువలన నీవు నిశ్చింతుడవుగా నుండవలెను.

''రాజా! నేను నీ సేనలను రక్షించుచు శాస్త్రవిధి ననుసరించి వాస్తవ స్వరూపముతో పాండవులతో యుద్ధము చేసెదను. కనుక నీవు చింతింపకుము."

''భీష్మపితామహుని మాటలు విని దుర్యోధనుడు ఆయనతో నిట్లనెను:

"తాతా, గంగానందనా! నేను సత్యము చెప్పుచున్నాను. దేవాసురులందరి వలనను ఎప్పుడు కూడ నాకు భయము కలుగదు. ఇట్లుండగా నీవంటి అసాధ్య వీరుడు మా సేనాపతిగా నుండగా, యుద్ధము నభినందించు పురుష సింహుడైన ద్రోణాచార్యులవంటి యుద్ధవీరుడు నా కొఱకు యుద్ధభూమియందు నిలిచి పోరాడుచుండగా నాకు భయమెట్లు కలుగును?

"కురుశ్రేష్ఠా! మీరిద్దరు పురుషశ్రేష్ఠులైన వీరులు నా విజయము కొఱకు ఇక్కడ నిలిచి యున్నప్పుడు నాకు అవశ్యముగా దేవరాజ్యము కూడ దుర్లభము కాదు.

''కురునందనా! మన పక్షమునందు శత్రుపక్షమునందున్న రథికులు, అతిరథులు ఎందరున్నారను విషయము నీకు బాగుగా తెలియును.

''అందుచేత నాకు చెప్పుము. నేను కూడ ఆ విషయములు తెలిసికొన దలచి యున్నాను. ఎందుకనగా - పితామహుడవైన నీవు ఈ రెండు పక్షముల యందలి విషయములను బాగుగా నెరిగిన సమర్థుడవు. కనుక, నేను ఈ రాజులందరితో కూడి నీ నోటినుండి ఆవిషయమును వినదలచుచున్నాను."

''ఆ విధముగా దుర్యోధనుడు అడిగిన మాటలకు భీష్ముడిట్లు బదులు చెప్పెను:

ధార్తరాష్ట్రుల సేనలోని వీరులను గూర్చి భీష్ముడు చెప్పుట:

"గాంధారీనందనా! నీవు మన సేనలో నున్న రథికుల సంఖ్యను వినుము. నీ సేనయందు రథికుల సంఖ్య అనేక సహస్ర లక్షకోటి సంఖ్యలో ఉన్నది. ఐనను వారిలో ప్రధానుల పేర్లను చెప్పెద వినుము:

"అందరికంటే మొదట నీ దుశ్శాసనాది సోదరులతోపాటు నీవే మహా రథికుడవుగా నున్నావు. మీరందరు అస్త్ర విద్యాపండితులు. ఛేదన (నరకుట), భేదన (పగులగొట్టుట) సమర్థులు.

"రథమునందు కూర్చొనిగాని, గజముపైన కూర్చొనిగాని మీరు యుద్ధము చేయగలరు. గదా ప్రాస ఖడ్గముల ప్రయోగమునందు కూడ మీరు సమర్థులు.

"రథము నడుపుటయందును అస్త్రములతో కొట్టుటయందును మీరు నిపుణులు. మీకు అస్త్ర విద్యాజ్ఞానము, బరువు ఎత్తు పరిజ్ఞానము కూడ బాగుగా నున్నది.

"ధనుర్బాణ విద్యయందన్ననో మీరు ద్రోణాచార్య కృపాచార్యులకు యోగ్య శిష్యులు.

ధృతరాష్ట్రపుత్రులందరు పాండవులతో శత్రుత్వము వహించియున్నారు. కాబట్టి, యుద్ధమునందు ఉన్మత్తులై పోరాడు పాంచాల యోధులను ఈ యుద్ధ భూమియందు మీరు సంహరించగలరు.

"భరతశ్రేష్ఠా! నేను మీ సమస్తసేనకు ప్రధాన సేనాపతిగనే ఉన్నాను. అందువలన పాండవులను కష్టపెట్టి శత్రుసైనికులను సంహరించెదను.

"నేను నా నోటినుండి నా గుణములను ప్రశంసించుకొనుట ఉచితము కాదు. నీవు నన్నెరుగుదువు.

"శస్త్రధారులలో శ్రేష్ఠుడు, భోజవంశీయుడునైన కృతవర్మ మీ సేనలో అతిరథ వీరుడుగా నున్నాడు. కృతవర్మ నీ యిష్టార్థసిద్ధిని కలిగించగలడు. ఇందులో సంశయము లేదు. గొప్ప గొప్ప శస్త్ర విద్యావేత్తలు కూడ ఇతనిని జయింపజాలరు. ఇతని ఆయుధము మిక్కిలి దృఢమైనది. ఇతడు దూరము నందున్న గురిని కూడ కొట్టి పడవేయగలడు. ఇంద్రుడు రాక్షసులను సంహరించినట్లే కృతవర్మ కూడ పాండవ సేనను నశింపచేయును.

"మహాధనుర్ధరుడైన మద్రదేశరాజు శల్యుని కూడ నేను ఆ అతిరథుడు అని అంగీకరించెదను. అతడు ప్రతియొక యుద్ధమునందు ఎల్లప్పుడును శ్రీకృష్ణ భగవానునితో స్పర్ధ (పోటీ) చేయుచుండును. శల్యుడు తన సొంతమేనల్లుండ్రైన నకుల, సహదేవులను విడిచి పాండవ సేనయందలి ఇతర మహారథులతో యుద్ధము చేయగలడు. నీ సేనలో ఈ వీర శిరోమణియైన శల్యుని అతిరథుని గానే తలచెదను. ఇతడు సముద్రతరంగముల వంటి తన బాణములచేత శత్రు సైనికులను ముంచుచున్నాడా అనునట్లు యుద్ధము చేయును.

"రాజా! సోమదత్తపుత్రుడు మహాధనుర్ధరుడునైన భూరిశ్రవుడుకూడ అస్త్ర విద్యా పండితుడు. నీ హితమును గోరు మిత్రుడు ఇతడు రథికులకు యూథ పతులకు గూడ యూథపతిగా నున్నాడు. కాబట్టి నీ శత్రుసేనను అధికముగా నితడు సంహరింపగలడు.

"మహారాజా! సింధు రాజైన జయద్రథుని నేను ఇద్దరు రథికులతో సమానునిగా తలచెదను. ఇతడు మహాపరాక్రమవంతుడు. రథికులైన యోధులలో శ్రేష్ఠుడు. రాజా! ఇతడు కూడ పాండవులతో యుద్ధము చేయగలడు.

"ద్రౌపదిని ఇతడు అపహరించినప్పుడు ఈ జయద్రథుని పాండవులు మిక్కిలి కష్టపెట్టి యుండిరి. ఆ మహాక్లేశమును జ్ఞప్తియం దుంచుకొని శత్రు సంహారము చేయునట్టి సైంధవుడు అవశ్యముగా నీకు మహా సహాయకుడుగా నుండగలడు.

"రాజా! ద్రౌపదిని అపహరించిన సమయమందు తాను పాండవులచేత పడిన కష్టములకు ప్రతీకారము చేయదలచి ఈ సైంధవుడు పరమేశ్వరునిగూర్చి కఠినమైన తపస్సుచేసి యుద్ధమునందు పాండవుల నెదిరించి పోరాడు సామర్థ్యము సంపాదించునట్టి అతిదుర్లభమైన వరము పొందియుండెను.

"నాయనా! రథికశ్రేష్ఠుడైన యీ జయద్రథుడు యుద్ధమునందు ప్రాత వైరమును జ్ఞప్తికి తెచ్చుకొని తన ప్రాణములను గూడ ఒడ్డి పాండవులతో సంగ్రామము చేయగలడు.

"రాజా! కాంభోజరాజైన సుదక్షిణుడు ఒక రథికుడుగా నంగీకరింపబడినాడు. నీ కార్యసిద్ధిని కోరుచు నతడు సమరాంగణమునందు శత్రువులతో యుద్ధము చేయగలడు.

"రాజేంద్రా! రథికసింహుడైన కాంభోజరాజు నీ కొఱకు సంగరమునందు ఇంద్రసమాన పరాక్రమము ప్రకటించగలడు. కౌరవులందరు ఇతనిపరాక్రమము చూడగలరు. అతి వేగముగా యుద్ధము చేయు నితని రథ సముదాయమునందు కాంభోజ సైనికులు మిడుతల దండువలె అసంఖ్యాకముగ నుందురు.

''రాజా! మాహిష్మతీ నగర నివాసియైన 'నీలుడు' అను రాజు కూడ నీ సైన్యములో నొక రథికుడు. ఇతడు నీలవర్ణకవచమును ధరించును. ఇతడు రథ సమూహము ద్వారా శత్రువులను సంహరించగలడు. రాజా! పూర్వము సహదేవునితో నీలునకు శత్రుత్వము ఉండెను కనుక,ఇతడు నీ వైపున నిలిచి శత్రువుతో యుద్ధము చేయును.

''అవంతీదేశముయొక్క ఇద్దరు రాజకుమారులు 'విందుడు, అనువిందుడు' అను సోదర వీరులు రథికులుగా తలచబడినారు. వీరు యుద్ధవిద్యా పండితులు. దృఢ బలపరాక్రమ సంపన్నులు.

''ఈ పురుషసింహు లిద్దరు గదా-ప్రాస-ఖడ్గ-బాణములను ప్రయోగించి సేనలను దగ్ధము చేయగలరు. మహారాజా! రెండు యూథపతులైన గజరాజులు పోరాడినట్లు సేనలో విందానువిందులు యమరాజువలె చరించెదరు.

"రాజా! త్రిగర్త దేశీయులైన ఐదుగురు సోదరులను నేను మంచి రథికులనుగా తలచెదను. విరాట నగరమునందు దక్షిణ గోగ్రహణ యుద్ధ సమయములో నలుగురు పాండుపుత్రులతో వీరికి వైరము వృద్ధిపొందెను.

''రాజేంద్రా!మకరములు,ఉత్తుంగ తరంగములుగల గంగానదిని మథించినట్లు ఈ త్రైగర్తులు ఐదుగురున్ను పాండవ సేనను గగ్గోలు పెట్టెదరు.

"మహారాజా! ఈ ఐదుగురు రథికులైన సోదరులలో సత్యరథుడు ప్రధానుడు. అర్జునుడు దిగ్విజయము చేయుచున్నప్పుడు త్రిగర్తులకు అప్రియము చేసియుండెను. ఆ పూర్వవైరమును జ్ఞప్తియందుంచుకొని ఈ యైదుగురు యుద్ధభూమియందు దీక్షతో యుద్ధము చేసెదరు. వీరు పాండవుల సేనలో ఉన్న గొప్ప గొప్ప మహారథికులను సంహరించగలరు.

''దుర్యోధనా! నీ పుత్రుడు లక్ష్మణుడు, దుశ్శాసన పుత్రుడు-ఈ ఇద్దరు పురుషసింహులు యుద్ధము నుండి పారిపోవువారు కారు. వీరు యువకులు, సుకుమారులునైన రాజపుత్రులు. మహావేగముగా యుద్ధము చేయువారు. అనేక

యుద్ధముల విశేష విషయములు కూడ తెలిసినవారు. అన్ని విధముల సేనలకు నాయకులుగా ఉండతగినవారు.

"ఈ యిరువురు రథికులే కాక, రథికులలో శ్రేష్ఠులుకూడ. వీరు క్షత్రియ ధర్మమునందు ఆసక్తికలవారై యుద్ధమునందు మహా పరాక్రమము చూపుచుందురు.

''మహారాజా! నీ సేనలో దండధారుడు అను ఒక రథికుడు కూడ ఉన్నాడు. అతడు సంగ్రామమునందు తన సేనను రక్షించుకొనుచు పోరాడగలడు.

"నాయనా! మహావేగపరాక్రమసంపన్నుడు, కోసలదేశరాజు నైన బృహద్బలుడు కూడ నా యభిప్రాయములో ఒక రథికుడు. రథికులలో ఇతని స్థానము చాల ఉన్నతమైనది. ఇతడు ధృతరాష్ట్రపుత్రులకు హితము కూర్చుటయందాసక్తుడై భయంకర శస్త్రాస్త్రములను, మహాధనుస్సును ధరించి తన మిత్రులను సంతోషపరచుచు సమరాంగణమునందు మహోత్సాహముతో యుద్ధము చేయును.

''రాజా! శరద్వంతుని పుత్రుడైన కృపాచార్యుడు రథికులు, యూథపతులు వీరందరిపైన కూడ యూథపతియైనవాడు. ఈతడు తన ప్రియములైన ప్రాణములుకూడ లెక్క చేయక నీ శత్రువులను దగ్ధము చేయగలడు.

''గౌతమ వంశ మహర్షి శరద్వంతుడను అచార్యునికి పుత్రుడైన కృపాచార్యుడు రెల్లుగడ్డి వెన్నునుండి పుట్టిన వరమేశ్వరపుత్రుడు కుమారస్వామి వంటివాడు. అతనివలె ఇతడు కూడ అజేయుడు.

''నాయనా దుర్యోధనా! ఈ కృపాచార్యుడు వివిధ శస్త్రాస్త్రములను ధనుస్సులను ధరించునట్టి అనేక సేనలను అర్జున సమాన పరాక్రముడై దగ్ధము చేయుచు సమర భూమియందు సంచరించుచుండును.''

''ఈ విధముగ చెప్పి భీష్మ పితామహుడు కౌరవ పక్షమునందలి వీరులను గూర్చి దుర్యోధనునకు ఇంకను నిట్టు చెప్పదొడగెను:

''రాజా! మీ మామ శకుని కూడ ఒక రథికుడే.ఇతడు పాండవులయందు శత్రుత్వముచేత యుద్ధము చేయును ఇందులో సంశయము లేదు. ఇతనిసేన కూడ శత్రువులకు అసాధ్యమైనది. ఈ సేన వాయువేగము గలది. వివిధాకారములుగలిగి అనేకా యుధములను కూడ శకుని సైన్యము ధరించి యున్నవి.

''మహాధనుర్ధరుడు, ద్రోణపుత్రుడునైన అశ్వత్థామ ధనుర్ధాకులందరిలోను పరమశ్రేష్ఠుడు. ఇతడు యుద్ధము నందు విచిత్రగతులతో శత్రువుల నెదిరించ గలడు. సుదృఢములైన అస్త్రము లెన్నియో అశ్వత్థామ వద్ద సంపూర్ణముగ నున్నవి. అశ్వత్థామ మహారధికుడు.

రాజా! గాండీవధారియైన అర్జునుని ధనుస్సునుండి వలె అశ్వత్థామ ధనుస్సునుండి ఏక కాలమునందు విడువబడిన బాణములు కూడ ఒండొంటిని ఒరసికొనుచునే లక్ష్యమును చేరుకొనగలవు.

రథిక శ్రేష్ఠుడైన ఈ వీరపురుషుని శక్తి వర్ణనాతీతము. మహారథికుడైన యితడు తలచినచో మూడు లోకములను దగ్ధము చేయగలడు.

''అశ్వత్థామకు క్రోధము, బలపరాక్రమములు, వాటితోపాటు ఆశ్రమవాసులైన మహర్షులకు ఉండవలసిన తపశ్శక్తికూడ సంచితమై యున్నది. నిశిత బుద్ధియైన అశ్వత్థామకు ద్రోణాచార్యుడు సంపూర్ణ దివ్యాస్త్రముల జ్ఞానము అనుగ్రహించి యున్నాడు.

''కాని, భరతశ్రేష్ఠా! ఇతనియందు చాల గొప్ప దోషము ఒక్కటే యున్నది. దానిచేత నేను ఇతనిని అతిరథికునిగాను, రథికునిగా కూడ అంగీకరింపను.

''ఈ బ్రాహ్మణునకు తన జీవితము అత్యంత ప్రియమైనది. అందుచేత ఇతడు ఎల్లప్పటికి దీర్ఘాయువుగా ఉండగోరుచున్నాడు. ఇదియే ఇతని దోషము. ఈ దోషము లేకుండినచో అశ్వత్థామకు ఈ ఉభయసేనలలో సమానుడైన శక్తిమంతుడు ఎవడుకూడ లేడు.

''అశ్వత్థామ ఒక్క రథమును మాత్రమే సహాయముగ గొని దేవతలసేనలన్నింటినీ సంహరింపగలడు. ఇతని శరీరము మంచి పుష్టితో బలముతో విశాలముగ నున్నది ఇతడు చప్పట్లు చరిచికూడ పరశతములను చీల్చి వేయగలడు.

రాజా! వీరుడైన యశ్వత్థామ అసంఖ్యాములైన సద్గుణములు కలవాడు. ఇతడు యుద్ధకుశలుడు. భయంకర బలపరాక్రమ సంపన్నుడు. అందుచేత దండధరుడైన యమునివలె నితడు శత్రువులకు సహింపరానివాడై యుద్ధభూమియందు సంచరించును.

''ఇతడు క్రోధముతో నున్నప్పుడు ప్రళయకాలాగ్నికి సమానుడుగా తోచును. ఇతని మెడ సింహపు మెడవలె నుండును మహాతేజస్వియైన అశ్వత్థామ మహాభారత యుద్ధము నందు మిగిలిన శత్రువుల భాగమును శమింపజేయును.

"అశ్వత్థామ తండ్రి ద్రోణాచార్యుడు మహాతేజస్వి, మహాబలపరాక్రమ సంపన్నుడు. ఇతడు వృద్ధుడుగా నున్నప్పటికిన్ని నవయువకుల కన్న గట్టివాడు. ఈ మహాయుద్ధమునందు ఇతడు తన మహాపరాక్రమమును ప్రకటింపగలడు. ఇందులో నా కెంత మాత్రము సందేహములేదు.

''సమరభూమియందు స్థిరముగా నిలిచియుండు ద్రోణాచార్యుడు అగ్నివలె వెలుగుచుండును. ఈ ద్రోణాగ్ని ఇతని బాణవేగమనెడి వాయువు సహాయముచేత ఉత్తరోత్తరముగ జ్వలించుచుండును. ఈ ద్రోణాగ్ని, సేనా రూపములో నున్న ఎండుగడ్డిని. ఇంధనములను దగ్ధము చేయుచు మండుచుండును. ఈ విధముగ నితడు జ్వలించుచు యుధిష్ఠిరుని సేనలను కాల్చి భస్మము చేయును.

పురుషశ్రేష్ఠుడైన యీ భరద్వాజనందనుడు రథికులు యూథపతులు యూథపతినాయకులు యందరిపైన యూథపతిగా నుండగలడు. నీ హితముకొఱకు ఇతడు తీవ్ర పరాక్రమమును ప్రకటింపగలడు.

"రాజా! ద్రోణాచార్యుడు మూర్ధాభిషిక్తులైన అనేక రాజులకు ఆచార్యుడు, వృద్ధగురువునై యున్నాడు. ఇతడు సృంజయ వంశ క్షత్రియులను నశింపజేయగలడు. కాని, ఇతనికి అర్జునుడు చాల ప్రియుడు.

''మహాధనుర్ధరుడైన ద్రోణాచార్యుని యొక్క మహోజ్జ్వలమైన ఆచార్యత్వము అర్జునియొక్క సద్గుణములచేత జయింపబడి అతనికి వశమైనది. అర్జునుని స్మరించినంత మాత్రము చేతనే ఇతడు అతనిని ఎట్టి పరిస్థితిలోను సంహరింపజాలడు.

"వీరవరా! ఈ ఆచార్యద్రోణుడు అర్జునుని గుణగణములను విస్తారముగా వర్ణించుచు అతనిని ఎల్లప్పుడు ప్రశంసించుచుండును. అర్జునుని ఇతడు పుత్రుని కంటె అధికముగ ప్రేమించుచుండును.

''ద్రోణాచార్యుడు ఏకరథమాత్ర సహాయముతో రణభూమియందు దేవ గంధర్వ మనుష్యసేనలన్నింటిని కూడ నశింపజేయగల మహారథికుడు. ఇతనికి ఈడైనవాడు మీ సేనలో నేను తప్ప మరియెవ్వరు లేరు.

"రాజా! నీ సేనయందు 'పౌరవుడు' అను రాజోత్తముడున్నాడు. అతడు రథికులలో కెల్ల ఉత్తముడు, మహారథికుడుగా నున్నాడు. అతడు శత్రువీరులైన

రథికులను బాధించుటలో సమర్థుడు. పౌరవరాజు తన విశాల సేనతో శత్రుసేనలను సంతాపపరచుచు పాంచాలురను కూడ, అగ్ని తృణమును దహించినట్లు భస్మము చేయగలడు.

''రాజా! నీ సేనలో 'బృహద్బలుడు' అను రాజకుమారుడు కూడ ఒక రథికుడుగా ఉన్నాడు. ప్రపంచమునందు అతని సత్కీర్తి వ్యాపించి యున్నది. అతడు నీ శత్రుసేనలో యమునివలె సంచరించును. అతని సైనికులు విచిత్రకవచములను శస్త్రాస్త్రములను ధరించి నీ శత్రువులను సంహరించుచు సంగ్రామభూమి యందు సంచరింతురు.

''రాజా! కర్ణుని కొడుకు వృషసేనుడు కూడ నీ సేనలో ఒక శ్రేష్ఠరథికుడు. ఇతనిని మహారథికుడని కూడ చెప్పవచ్చును. బలవంతులలో శ్రేష్ఠుడైన వృషసేనుడు నీ శత్రువుల విశాలసేనను భస్మీపటలము చేయగలడు.

''రాజా! మధువంశీయుడైన 'జలసంధుడు' అనువాడు మహాతేజస్వి. అతడు శత్రువీరులను సంహరింపగలవాడు. మీ సేనలో అతడొక ఉత్తమ రథికుడు. యుద్ధమునందు నీకొఱకు అతడు ప్రాణములను కూడ విడుచును. మహాభుజబల సంపన్నుడైన జలసంధుడు రథమునందు, గజముపైనను కూర్చొని యుద్ధము చేయుటలో సమర్థుడు. అతడు శత్రుసేనను సంహరింపగలడు.

''మహారాజా! అతడు నా యభిప్రాయమునందు రథికుడేకాక నీ కొఱకు యుద్ధమునందు సేనాసహితముగ ప్రాణత్యాగము చేయగలవాడు. సమరాంగణము నందతడు మహాపరాక్రమమును ప్రకటించుచు చిత్రరీతులచేత మీ శత్రువులతో నిర్భయముగ యుద్ధము చేయువాడు.

''దుర్యోధనా! మీ సేనలో 'బాహ్లీకుడు' అతిరథుడైన వీరుడు. అతడు యుద్ధమునందెప్పుడును వెనుకాడడు. నేను సమరభూమియందు అతనిని యమునితో సమానవీరుడని భావింతును. బాహ్లీకుడు రణరంగమునకు పోయి ఎట్టి పరిస్థితిలోను వెనుకకు అడుగు వేయడు, వాయువేగముతో శత్రువులను హతమార్చగలడు.

''రాజా! నీ సేనాపతులలో నొకడు 'సత్యవంతుడు' అనువాడు మహారథుడు. అతడు రథారూఢుడై యుద్ధమునందు పరాక్రమము చూపుటలో శత్రు రథికులను కొట్టి తరముటయందును అతి సమర్థుడు.

''యుద్ధమును చూచి యతడు ఏమాత్రము భయము దుఃఖము చెందడు. అతని రథమార్గమునందు అడ్డముగా వచ్చిన శత్రువులపైన నవ్వుచు నవ్వుచునే దుమికి పడును.

''పురుషశ్రేష్ఠుడైన సత్యవంతుడు శత్రువుపైన మహాపరాక్రమము చూపగలడు. అతడు యుద్ధమునందు నీ కొఱకు బాగుగా పోరాడును.

''దుర్యోధనా! క్రూరకర్ముడు రాక్షసరాజునైన 'అలంబుషుడు' అనువాడు కూడ మహారథికుడే. అతడు పూర్వవైరమును తలచుచు శత్రువును సంహరించు చుండును.

''అలంబుషుడు మాయావి. శత్రుత్వమును స్థిరముగా మనస్సులో నిలుపుకొని శత్రువులను నశింపజేయును. అతడు సమస్త రాక్షస సైనికులలో శ్రేష్ఠుడైన రథికుడు. నిర్భయముగా యుద్ధము చేయును.

"రాజా! 'ప్రాగ్జ్యోతిష' పురాధీశ్వరుడైన 'భగదత్తుడు' మహావీరుడు, ప్రతాపవంతుడు. అంకుశమును తీసికొని గజములను వశములో నుంచుకొను వారందరిలోను అతనికి ఉన్నత స్థానము కలదు.

''అతడు రథయుద్ధమునందు గూడ కుశలుడు. అతనితో పూర్వము అర్జునునకు యుద్ధము జరిగినది. దానియందు ఇద్దరు తమ తమ విజయమును గోరుచు చాల దినములు పోరాడుచుండిరి.

"గాంధారి కుమారా! కొన్ని దినముల తరువాత భగదత్తుడు తన మిత్రుడైన యింద్రుని సన్మానించుచు అర్జునునితో సంధి చేసుకొనెను. భగదత్తరాజు ఏనుగు మీద కూర్చొని యుద్ధము చేయుటయందు మిక్కిలి నేర్పుగలవాడు. అతడు ఐరావతము మీద కూర్చొని యుద్ధముచేయు ఇంద్రునివలె గజయుద్ధమునందు నీ శత్రువులతో యుద్ధము చేయును."

"ఆ విధముగా దుర్యోధనునకు భీష్ముడు కౌరవసేనలోని వీరులను గూర్చి వివరించి చెప్పుచు ఇంకను ఇట్లు చెప్పదొడంగెను:

"రాజా! నీ సేనయందు 'అచలుడు-వృషకుడు' అను సోదరులిద్దరు శత్రువుల కసాధ్యులైన రథికులు. వారు నీ శత్రువులను ధ్వంసము జేయగలరు. గాంధార దేశీయులైన యీ ప్రధాన వీరులు పురుష సింహులు, బలపరాక్రమవంతులు. క్రోధముతో యుద్ధము చేయుటయందు కుశలురు, యువకులు, సుందరులు, మహాబలులు."

భీష్మ కర్ణులకు సంవాదము:

"రాజా! నీ ప్రియమిత్రుడైన కర్ణుడున్నాడే ఇతడు పాండవులతో యుద్ధము చేయుటకు నిన్ను సర్వదా ప్రోత్సహించుచుండును కదా! రణరంగమునందితడు తన క్రూరత్వమును చూపుచు మిక్కిలి కఠిన భాషిగా ఆత్మ ప్రశంసకుడుగా నీచుడుగాను ఉండును.

"ఈ కర్ణుడు నీకు మంత్రిగాను, నాయకుడుగాను, సోదరుడుగాను నై యున్నాడు. ఇతడు దురభిమానము కలవాడగుట స్పష్టము. మీదు మిక్కిలి ఇప్పుడు నీ యభిమానమునొంది అత్యంత దురభిమానముతో పెచ్చు పెరిగి పోయినాడు.

"ఈ కర్ణుడు యుద్ధభూమియందు అతిరథుడు కాదు సరికదా రథికుడు అని అనిపించుటకు గూడ అర్హుడు కాడు. ఎందుకనగా ఈ మూర్ఖుడు తన సహజ కవచమును, దివ్య కుండలములను పోగొట్టుకున్నాడు. ఇతడు ఇతరులను చూచి ఈర్ష్యాసూయలు అసహ్యభావము కలవాడై యుండును.

"ఇతడు పరశురాముని అభిశాపము (అసత్యము చెప్పి పెద్దల ఆగ్రహము నకు గురియగుట) చేత, బ్రాహ్మణుల శాపములచేత, విజయసాధకములైన కవ చాది యుద్ధోపకరణములను పోగొట్టుకొనుటచేతను నా దృష్టిలో అర్ధరథికుడే. అర్జునునితో తలపడినప్పుడు ఎట్టి పరిస్థితిలో గూడ నితడు బ్రతికి బైటపడడు.

"జనమేజయా! భీష్ముని మాటలు విని సమస్త శస్త్రధారులలో శ్రేష్ఠుడైన ద్రోణాచార్యుడు గూడ ఇట్లనెను:

"భీష్మ పితామహా! నీవు చెప్పినమాట పూర్తిగా సత్యమైనది. నీ యీ యభిప్రాయము ఎప్పటికిని మిథ్యకాదు. ఈ కర్ణుడు ప్రతియొక్క యుద్ధము నందు మిక్కిలి గర్వము, పొగరు చూపించుచుండును కాని, యుద్ధమునుండి పారిపోవుచునే కనబడుచుండును. కర్ణుడు దయాళుడు. కాని యేమరుపాటు కలవాడు. కనుక నా యభిప్రాయమందు గూడ నితడర్ధరథుడే."

"జనమేజయా! ఈ విధముగా భీష్మద్రోణులు చెప్పిన మాటలు విని రాధా నందనుడైన కర్ణుడు అత్యంత క్రోధముచేత ఎఱ్ఱని కన్నులను అతి విశాలము చేసికొని చబుకు (చేర్నకోల - కొరడా) ల వంటి తన మాటలతో భీష్ముని పీడించుచు నిట్లనెను:-

"పితామహా! నేను నీ యెడల ఏ విధమైన అపరాధములు చేయకున్నను నీవు సర్వదా నా యెడల ద్వేషము కలిగియుండుటచేత ఈ విధముగనే అడుగడుగున నీ వాగ్బాణములచేత నీ యిష్టము వచ్చినట్లు నా మనస్సును గాయ పరచుచుందువు. నేను దుర్యోధనుని ముఖము చూచి నీవు అను మాటల నన్నిటిని నోరు మూసికొని సహించుచుందును. ఐనను నీవు నన్ను మూర్ఖుడుగను, పిరికి పందగను తలచుచుందువు.

"నీవు నన్ను 'అర్ధరథికుడు' అని నీ యభిప్రాయమును ప్రకటించుచున్నావు. ఇట్లు నీవు చెప్పుటచేత ప్రపంచమందంతట నిస్సందేహముగా అందరును నన్ను అర్ధరథుడుగానే భావించుచుందురు. ఎందుకనగా, 'గంగా నందనుడైన భీష్ముడు అసత్యము మాట్లాడడు' అని అందరకును తెలియును.

"పితామహా! నీవు కౌరవులకు ఎల్లప్పుడు అహితమే చేయుచుందువు. కాని, దుర్యోధనుడు ఇది తెలిసికొనకున్నాడు. నీవు నా గుణములను ద్వేషించుట చేత రాజులకు నా యెడల విరక్తి భావము కలిగింపదలచుచున్నావు. అట్టి ప్రయత్నమును నీవు తప్ప మరియెవరుగూడ చేయరు.

"ఈ యుద్ధ సమయమునందు సమాన శ్రేణికి జెందిన గొప్పరాజులు ఒక చోట చేరియున్నారు. ఇట్టి సమయమునందు వారిలో పరస్పరము భేదభావము కలిగింపగోరి నీవుదప్ప మరి ఎవడుగూడ తన పక్షములోని యోధుని బల పరాక్రమములను, ఉత్సాహమును ఈ విధముగ నష్టపరచడు.

"కౌరవా! కేవలము ఎక్కువ వయస్సుండి, వెంట్రుకలు నెరసి, అధిక ధన సంపాదనచేసి, అనేక సంఖ్యలలో సోదరులు బంధువులు ఉండినంత మాత్రముచేత అతనిని ఎవరు గూడ మహారథియని లెక్కపెట్టరు. క్షత్రియ జాతిలో ఎవడు బలాధికుడో వాడే శ్రేష్ఠుడనిపించుకొనును.

"బ్రాహ్మణుడు వేదమంత్రజ్ఞానముచేత, వైశ్యుడు అధిక ధన సంగ్రహముచేత, శూద్రుడు అధిక వయస్సుచేత శ్రేష్ఠుడనిపించుకొనును. పితామహా! నీవు రాగద్వేష భరితుడవై యున్నావు. కాబట్టి, మోహవశుడవై నీకు తోచినట్లు 'వీరు రథికులు, వీరు అతి రథికులు' అని విభాగము చేయుచున్నావు."

"అట్లు కర్ణుడు భీష్మునితో చెప్పి దుర్యోధనునితో నిట్లనెను:

''దుర్యోధనా! నీవు బాగుగా విచారించి చూడుము. ఈ భీష్ముడు దురభిప్రాయముచేత దూషితుడై నీకు చెడుపు చేయుచున్నాడు కనుక, నీవు ఈ దుష్టభావము కలవానిని వెంటనే విడిచిపెట్టుము.

''రాజా! ఒకసారి సేనలో భేదాభిప్రాయము కలిగిన తరువాత తిరిగి ఐకమత్యము కలుగుట కష్టమగును. ఇట్టి పరిస్థితులలో వంశపరంపరగా వచ్చిన సేవకులు గూడ నీ చేయి దాటిపోయెదరు.

''ఇట్లుండగా వేరువేరు స్థలములనుండి ఏదోయొక కార్యము సాధించుటకై పూనుకొని వచ్చిన రాజులు ఏకముగా ఒకచోట చేరినప్పుడు వారు ఇట్టి మాటల వలన భేదభావము కలిగి విడిపోయెదరనుటలో సందేహమేమి?

''రాజా! ఈ యోధులలో యుద్ధసమయమునందు భేదభావము ఉత్పన్నమైనది. ఈ విషయము నీవు ప్రత్యక్షముగా చూచుచనే యున్నావు. మా పరాక్రమము, మా ఉత్సాహము విశేషముగా హత్యచేయబడుచున్నది.

''రథికుల సమాచారమును తెలిసికొనుట యెక్కడ? అల్పబుద్ధియైన భీష్ముడెక్కడ? నేనొక్కడనే పాండవుల సేన నంతటిని ఒక్క అడుగుకూడ ముందుకు రానీయకుండ ఆపగలను.

''దుర్యోధనా! నా బాణప్రయోగ మమోఘమైనది. నా యెదుట పాండవులు, పాంచాలురు వచ్చినవారు వచ్చినట్లే దశదిశలకు, సింహమును చూచిన వృషభములవలె, పారిపోవుదురు.

''యుద్ధమునందు చంపి, గాయపరచి, రహస్యాలోచనమునందు మంచి యుద్ధనీతి వార్తలను చెప్పుట యెక్కడ? కాలప్రేరితుడై కాటికి కాళ్ళు జాపిన మందబుద్ధియైన భీష్ముడెక్కడ? ఈ రెంటికిని పొసగదు.

''ఇతడొక్కడే ఎల్లప్పుడు సమస్త ప్రపంచముతో స్పర్థపడుచు తన పనికి మాలిన దృష్టివలన ఇతరుల నెవ్వరిని కూడ లెక్కచేయకున్నాడు.

"వృద్ధులమాట వినవలెను, అని శాస్త్రము ఆదేశించుచున్నది. కాని ఎవడు అత్యంత వృద్ధుడయ్యెనో అతని మాటలు వినుటకు యోగ్యములు కావు. ఎందుకనగా - వారు బాలకులతోనే సమానులని తలచబడుదురు.

"రాజేంద్రా! నేనొక్కడనే సమస్త పాండవసేనను అంతమొందించగలను. కాని, ఈ కీర్తియంతయు భీష్మునకే లభించును. నీవు ఈ భీష్ముని సేనాపతిగా

చేసినావు. విజయఖ్యాతి సేనాపతికే ప్రాప్తించును. యోధులకు ఏవిధమైన కీర్తి కూడ దొరకదు.

''అందువలన రాజా! నేను భీష్ముడు బ్రతికియుండగా ఏ విధమైన యుద్ధము కూడ చేయను. కాని, భీష్ముడు చంపబడిన తరువాత మహారథికులందరితోను ఎదురించి పోరాడెదను."

"జనమేజయా! ఈ విధముగ కర్ణుడు దుర్యోధనునితో ఆడిన మాటలు విని భీష్ముడు కర్ణునితో నిట్లనెను:

''సూర్యపుత్రా! ఈ యుద్ధమునందు దుర్యోధనుని యొక్క సముద్రమువంటి గురుతర సేనా భారమును నా భుజములపై వహించినాను. దీని కొఱకు నేను అనేక సంవత్సరములనుండి చింతించుచుంటిని. సంతాప దాయకము, రోమాంచకరమునైన ఆ సమయము ఇప్పుడు సంప్రాప్తమాయెను. ఇట్టి సమయమునందు నేను ఇట్లు పరస్పర భేదభావమును కలిగించగూడదు. ఆ కారణము చేతనే నీవు ఇంతదాక జీవించియున్నావు.

''సూతకుమారా! ఒకవేళ నా భావము అట్టిది కాకుండిన యెడల వృద్ధుడనైనను నేను పరాక్రమించి నేడు బాలకుడవైన నీకు యుద్ధమునందు శ్రద్ధను, జీవమునందు ఆశనుకూడ త్రుంచివేసి యుందును.

"జమదగ్నినందనుడైన పరశురాముడు నాపైన పెద్ద పెద్ద అస్త్రములను ప్రయోగించియుండెను. ఐనను, అవి కూడ నాకు ఏమాత్రము బాధ కలిగించలేదు. ఇట్లుండగా నీవు నన్నేమి చేసెదవు?

"నీచకులపాంసనా! సత్పురుషులు ఎప్పుడుకూడ తమ బలమును ప్రశంసించుకొనుట మంచిదని తలచరు. ఐనను నేను నీ ప్రవర్తనచే సంతాపము చెంది, నా ప్రశంసను కూడ చేసికొనుచున్నాను.

భీష్ముడు తన శక్తినిగూర్చి చెప్పుట

"కాశీరాజువద్ద స్వయంవరమునకు భూమండలమునందలి సమస్త క్షత్రియులు వచ్చియుండిరి. కాని, నేను కేవలము ఒక్క రథము మాత్రమే సహాయముగా తీసికొని ఆ రాజుల నందరిని జయించి, బలాత్కారముగ కాశీరాజు కన్యలను హరించి తెచ్చియుంటిని.

"ఇక్కడ చేరిన రాజులకు సమానులు, అంతకంటే మించిన బలపరాక్రమ సంపన్నులు కూడ వేలకొలది రాజులు అక్కడ ఉండిరి. కాని, నేను ఒక్కడనే యుద్ధమునందు ఆ రాజులందరిని వారి సేనలతోబాటు జయించియుంటిని.

"కర్ణా! నీవు మూర్తీభవించిన శత్రుత్వముగా ఉన్నావు. నీ సహాయము నమ్ముటచేత అన్యాయముగా కురుకుల నాశము కలుగనున్నది. ఇప్పుడు దీనిని రక్షించుటకు ప్రయత్నింపుము. నీ పౌరుషమును చూపుము.

"యుద్ధమునందు నీవు ఎవనితో సర్వదా స్పర్థ (పోటీ) పడుచుంటివో అట్టి అర్జునునితో ఇప్పుడు యుద్ధము చేయుము. నీవు ఈ సంగ్రామమునుండి బ్రతికి ఎట్లు బైటపడగలవో చూచెదనుగాక!"

"జనమేజయా! ఈ విధముగా భీష్ముడు మాట్లాడిన తర్వాత దుర్యోధనుడు భీష్మునితో నిట్లనెను:

"గంగానందనా! నీవు నావైపు చూడుము. ఎందుకనగా, ఇప్పుడు మహాకార్యము మనపై పడియున్నది. నీవు ఏకాగ్రచిత్తుడవై నాయొక్క హితమును, మంగళమును, శ్రేయస్సును గూర్చిన విషయమును విచారింపుము నీవు,కర్ణుడు ఇద్దరుకూడ ఈ నా మహాకార్యమును సిద్ధింపజేయగలరు."

"అట్లు చెప్పి దుర్యోధనుడు భీష్మపితామహుని మరల నిట్లడిగెను:

"తాతా! ఇప్పుడు మన శత్రుపక్షములోనున్న శ్రేష్ఠులైన రథికులు, అతిరథికులు, మహారథికులు ఎవరో వారిని గూర్చి చెప్పుము. కురునందనా! శత్రువుల బలాబలములను గూర్చి నేను వినగోరుచున్నాను.

"ఈ రాత్రి గడిచినతోడనే రేపు ప్రభాతకాలమునందు ఈ మహాయుద్ధము ప్రారంభింపబడును గదా!"

ఆ విధముగ దుర్యోధనుడు అడిగిన ప్రశ్నకు భీష్ముడు ఇట్లు ఉత్తరము చెప్పదొడగెను:

భీష్ముడు పాండవపక్ష వీరుల బలము పరిశీలించుట

"రాజా! ఇంతవఱకు నేను నీ పక్షమునందలి వీరులను గూర్చి వర్ణించితిని ఇప్పుడు నీవు పాండవపక్ష వీరులను గూర్చిన వర్ణనము వినుము.

"నాయనా! కుంతీదేవికి ఆనందవర్ధనుడైన యుధిష్ఠిర మహారాజు మహారథికుడు. అతడు సమరాంగణమునందు అగ్నివలె అన్నివైపుల సంచరించును. ఇందులో సందేహము లేదు.

"రాజా! భీమసేనుడన్ననో, అతడొక్కడే ఎనిమిదిమంది రథికులతో సమానుడు. గదాయుద్ధమునందు, బాణయుద్ధమునందు అతనికి సమానుడైన మరియొక యోధుడు లేడు. అతనికి పదివేల యేనుగుల బలమున్నది. గొప్ప అభిమానవంతుడు అలౌకిక తేజస్సంపన్నుడు.

"దుర్యోధనా! మాద్రీపుత్రులైన నకులసహదేవులు అశ్వినీ కుమారులవలె రూపవంతులు, పరాక్రమవంతులు. ఆ యిరువురు పురుషరత్నములు రథికులే.

"రాజా! ఆ నలుగురు యుధిష్ఠిర - భీమ - నకుల - సహదేవులు తాము పడిన క్లేశమును స్మరించుకొనుచు నీ సేనలో దూరి, రుద్రునివలె శత్రుసంహారము చేయుచు సంచరించుచుందురు. ఈ విషయములో నాకు ఏమాత్రము సంశయము లేదు.

"వీరందరూ మహాత్ములే. మద్దిచెట్లవలె ఉన్నత శరీరులు. వారి యెదుట ఇతర పురుషులు జిట్టెడు కొలత కలవారుగా కనబడుదురు. పాండవులందరు సింహ శరీరమువంటి దృఢశరీరము గలవారు, మహాబలవంతులు.

"నాయనా! పాండవులందరు బ్రహ్మచర్య వ్రతమును పాలించినవారు. పురుషసింహులు. పరాక్రమవంతులు. తపశ్శక్తి సంపన్నులు. లజ్జాశీలురు. వ్యాఘ్రములవలె ఉత్కటబలము కలవారు.

"రాజా! పాండవులు వేగమునందు, యుద్ధమునందు కొట్టుట - గాయపరచుటల యందును మానవాతీత శక్తిసంపన్నులు. వారందరు దిగ్విజయము చేసినప్పుడు అనేక రాజులను జయించియుండిరి.

"కురునందనా! వారి గదాఘాతములు, ఆయుధముల దెబ్బలు, బాణముల దెబ్బలు ఎవడు కూడ ఓర్వజాలడు. ఇంతయేకాక వారి ధనుస్సులయందు అల్లెత్రాడుకూడ ఇతరులు ఎక్కించజాలరు. వారి బరువైన గదను ఎవరుకూడ ఎత్తజాలరు. వారు ప్రయోగించు బాణములను ఎవరును ప్రయోగింపజాలరు.

"వేగముగా నడచుటయందు, గురిని కొట్టుటయందు, ఆహార పానీయములందు, పాంసు క్రీడలయందు, ఇంకను ఇతరములయందు వారందరు బాల్యమునందుకూడ మిమ్ము ఓడించియుండిరి,

''ఈ యుద్ధముకొఱకు వారు కూర్చుకొన్న సైన్యముచేత పూర్వముకంటె అధిక బలము గడించిరి. యుద్ధములో నీ సేనా విధ్వంసమును చేయగలరు. వారితో మీరెప్పుడు కూడ తలపడకుండ ఉండవలెనని నేను కోరెదను.

''రాజా! వారిలో ఒక్కొక్కడే సమస్త రాజులను యుద్ధమునందు సంహరింపగల శక్తి సంపన్నుడు. రాజేంద్రా! రాజసూయ యాగమునందు జరిగిన సంగతి యంతయు నీవు కన్నులార చూచితివి కదా!

''దుర్యోధనా! జూదమాడునప్పుడు ద్రౌపదికి కలిగిన మహాదుఃఖము, పాండవులను గురించి మీరాడిన కఠోర వచనములు ఈ యన్నిటిని జ్ఞప్తియందుంచుకొని యుద్ధభూమియందు వారు ప్రళయకాలరుద్రుని వలె సంచరించెదరు.

అర్జునుని శౌర్యమును భీష్ముడు వర్ణించుట

"సాక్షాన్నారాయణావతారమైన శ్రీకృష్ణభగవానుడు అర్జునునకు మిత్రుడు, సహాయకుడనై యున్నాడు. కౌరవ పాండవుల సేనల రెంటిలోను అర్జున సమాన వీరుడు, రథికుడు మరియొకడు లేడు.

''సమస్త దేవాసుర నాగ యక్ష రాక్షసులలో గూడ అర్జునునితో సమానుడెవ్వడును లేడు. ఇట్లుండగా మనుష్యులలో లేరని చెప్పుట అక్కరలేదు.

''భూతభవిష్యత్కాలమందు కూడ అర్జునునకు ఈడైన రథికుడు మరియొకడు ఉన్నట్లు నేను వినలేదు.

''మహారాజా! అర్జునుని రథము సిద్ధముగా కనబడినది శ్రీకృష్ణభగవానుడు దానికి సారథిగాను, యుద్ధకుశలుడైన అర్జునుడు రథికుడుగాను అందులోనున్నారు. దివ్యమైన గాండీవము, వాయువేగములుగల అశ్వములు, అభేద్యమైన కవచము, అక్షయ బాణములుకల అంబుల పొదులు ఉన్నవి. ఆ రథమునందు మహేంద్ర రుద్ర కుబేర వరుణదేవతలకు సంబంధించిన అస్త్రములు, భయంకర గదయు నున్నవి.

''వజ్రము మొదలైన వివిధ శ్రేష్ఠాయుధములు కూడ ఆ రథమునందు ఉన్నవి. అర్జునుడు ఏకాకిగా ఆ రథ సహాయముతో హిరణ్యపురమునందలి అనేక సహస్ర దానవులను సంహరించెను.

''బలవంతుడు సత్యపరాక్రముడు ఆజానుబాహుడు నైన అర్జునుడు క్రోధముతో నీ సేనను సంహరించుచు తన సేనను రక్షించుకొనును.

"అట్టి అర్జునుని మన సేనలో ఎదురించగలవారు నేనుగాని, ద్రోణాచార్యుడు గాని ఉన్నాము. ఈ ఉభయ సేనలలో మూడవవాడెవడు కూడ బాణవర్షము కురిపించుచున్న అర్జునుని ఎదురింపజాలడు.

''గ్రీష్మఋతువు చివరిభాగమున ప్రచండ వాయుప్రేరితమైన మహామేఘమువలె శ్రీకృష్ణసహితుడైన అర్జునుడు యుద్ధసన్నద్ధుడై నిలిచి యున్నాడు. అతడు అస్త్రవిద్యాపారంగతుడు, యువకుడు."

''జనమేజయా! భీష్ముడు చెప్పిన యీ మాటలన్నియు విని అక్కడి రాజులు, పాండవులు పూర్వము చూపిన బలపరాక్రమములు తమకన్నులయెదుట కనపడినట్లుగా స్మరించుకొనుచుండగా వారి భుజకీర్తులతోపాటు, చందనము అలదిన వారి భుజములు, వారి మనస్సులు ఆవేగముతో చలించిపోయెను.

"భీష్ముడట్లు చెప్పి ఇంకను పాండవవీరులనిట్లు వర్ణింపజొచ్చెను :

''మహారాజా! ద్రౌపదీ పుత్రులైదుగురు మహారథులే. విరాటపుత్రుడైన ఉత్తరుడు రథికుడే.

''రాజా! మహాబాహుబల సంపన్నుడైన అభిమన్యుడు రథికులపైన, యూథపతులపైన గూడ యూథపతిగా నున్నాడు. శత్రునాశకుడైన ఆ వీరుడు సమరభూమియందు కృష్ణార్జునులతో సమాన పరాక్రముడు.

''అతడస్త్రవిద్యను విధివిధానముగా నేర్చుకొనెను. యుద్ధము యొక్క విచిత్రకళలను కూడ అతడెరుగును. దృఢముగా నతడు నియమమును పాటించువాడు. అభిమన్యుడు తన తండ్రి పడిన క్లేశములను జ్ఞప్తికి తెచ్చుకొనుచు తప్పక పరాక్రమమును చూపించగలడు.

''రాజా! మధువంశ వీరుడైన సాత్యకి కూడ అభిమన్యునివలెనే రథిక యూథపతులపై యూథపతిగా నున్నాడు. వృష్ణివంశ ప్రముఖులైన వీరులలో సాత్యకి మిక్కిలి అమర్షశీలుడు. ఇతనికి భయము ఏమాత్రము లేదు. అతడు దానిని జయించినవాడు.

"రాజా! ఉత్తమౌజుని కూడ నేను రథికునిగా తలచెదను. పరాక్రమవంతుడైన యుధామన్యుడు కూడ నా యభిప్రాయములో ఒక ఉత్తమ రథికుడు.

"ఈ వీరులందరియొక్క వేలకొలది రథములు, గజములు, అశ్వములు యుధిష్ఠిరుని హితముకొఱకు తమ శరీరములను బలియిచ్చి యుద్ధము చేసెదరు.

"రాజేంద్రా! వారందరు పాండవులతోపాటు నీ సేనయందు ప్రవేశించి ఒండొరుల నాహ్వానించుచు అగ్ని వాయువులవలె సంచరించుచుందురు.

''రాజా! వృద్ధరాజులైన ద్రుపద విరాటులు కూడ యుద్ధమునందు అజేయులు. వీ రిద్దరు మహారథికులని నేను తలచెదను. వారు ముసలివారైనను క్షత్రియ ధర్మము ప్రకారము వీరుల మార్గమునందే ఉండి శక్తిసంపూర్ణముగ యుద్ధము చేసెదరు.

"రాజేంద్రా! ద్రుపద విరాటు లిద్దరు బలపరాక్రమసంపన్నులు, శ్రేష్ఠులు, సత్ప్రవర్తన కలవారు, మహాధనుర్ధరులు. పాండవులతో వారిరువురకు చుట్టరిక ముండుటచేత వారు పాండవుల స్నేహబంధమున నున్నారు.

"కురుశ్రేష్ఠా! సాధారణముగా ఏదో కారణముచేత మహాశూరులుగాని, అథవా, పిరికివారుగాని అయ్యెదరు. ఆ యిరువు రట్లుకాదు. సహజముగా మహాశూరులు. దృఢముగా ధనుర్ధారణము చేయు ద్రుపద, విరాటులు వీరుల మార్గమునే ఆశ్రయించి యుండెదరు. వారు ప్రాణములను ఒడ్డి పరిపూర్ణశక్తితో నీ సేన నెదుర్కొనెదరు.

"అ యిరువురు యుద్ధభయంకరులు. కాబట్టి, తమ వియ్యంకులను రక్షించుచూ ఒక్కొక్కరు ఒక్కొక్క అక్షౌహిణీ సేనకు నాయకులుగానుండి పరాక్రమించెదరు. ఆత్మవిశ్వాసముతో, ఆత్మాభిమానముతో ద్రుపద విరాటు లిరువురు తమవారిని రక్షించుచు, శరీరమును కూడ లెక్కసేయక సమరాంగణమునందు తమ పౌరుషమును ప్రదర్శించెదరు.'

"జనమేజయా! భీష్ముడట్లు పాండవయోధులను గూర్చి దుర్యోధనునకు వర్ణించి చెప్పి ఇంకను వారిని గురించియే యిట్లు చెప్పదొడగెను:

''దుర్యోధనా! ద్రుపదపుత్రుడు శిఖండి శత్రునగరములను జయింపగలవాడు. అతడు యుధిష్ఠిర సేనలో ఒక ప్రముఖ రథికుడని నేను తలచెదను. అతడు నీ సేనలో ప్రవేశించి పూర్వ మతనికి వచ్చిన అపఖ్యాతిని నశింపజేసికొనుచు, ఉత్తమ యశస్సును విస్తరింపజేసికొనుచు మిక్కిలి ఉత్సాహముతో పోరాడగలడు.

''అతనితోపాటు పాంచాల ప్రభద్రకారి సేనలు అధిక సంఖ్యలో వచ్చి యుద్ధము చేయును. శిఖండి ఈ యుద్ధమునందు మహాద్భుతకర్మలు చేసి చూపించగలడు.

''రాజా పాండవుల సమగ్రసేనకు ప్రధాన సేనానాయకుడు, ద్రోణాచార్య శిష్యుడునైన ధృష్టద్యుమ్నుడు నా యభిప్రాయములో అతిరథుడు. ప్రళయకాల రుద్ర భగవానుడు కుపితుడై ప్రజాసంహారము చేసినట్లే ధృష్టద్యుమ్నుడు కూడ శత్రుసంహారము చేయుచు పోరాడగలడు. అతనివద్ద దేవసేనవలె విశాలమైన రథికుల సేన ఉన్నది. అది బహుళ సంఖ్యలో నుండుట చేత దానిని రథసముద్ర మనెదరు.

"రాజేంద్రా! ధృష్టద్యుమ్నుని పుత్రుడు 'క్షత్రధర్మ' అనువాడు నా యభిప్రాయమునందు ఇంకను అతిరథుడుగా నున్నాడు. బాలుడు కాబట్టి అతడు అస్త్రవిద్యలో ఎక్కువ పరిశ్రమ చేయలేదు.

"రాజా! శిశుపాలుని పుత్రుడు ధృష్టకేతువు మహాధనుర్ధరుడైన వీరుడు. అతడు యుధిష్ఠిరునకు వియ్యంకుడు. ఆ చేదిపతి తన పుత్రునితో వచ్చి తన పరాక్రమమును చూపగలడు.

"రాజా! శత్రునగరములపైన విజయము సాధించువాడు క్షత్రియధర్మతత్పరుడైన 'క్షత్రదేవుడు' నా యభిప్రాయములో పాండవ సేనయందు ఒక శ్రేష్ఠ రథికుడు.

''జయంతుడు, అమితౌజుడు, సత్యజిత్తు అను నీ ముగ్గురు పాంచాలదేశ వీరవరులు. వీరు మహారథులు. నాయనా! వీరందరు క్రోధ పరిపూర్ణములైన గజరాజములవలె యుద్ధము చేసెదరు.

''రాజా! 'అజుడు-భోజుడు' అను ఇద్దరు గూడ పాండవుల కొఱకు పరాక్రమమును చూపించగల మహావీరులు. వీరిద్దరున్ను ఆ సేనలో మహారథికులే. వీరు పరిపూర్ణ శక్తితో యుద్ధము చేసి శత్రుసంహారము చేసెదరు.

''రాజా! కేకయ రాజకుమారు లైదుగురు సోదరులు ఉత్తమ రథికులుగా తలచబడుదురు. వారు అతివేగముతో అస్త్రప్రయోగము చేయు విచిత్రయోధులు ఆ యైదుగురు మహావీరులు. వారి ధ్వజములు రక్తవర్ణము కలవి.

"రాజేంద్రా! 'కుమార-కాశిక-నీల-సూర్యదత్త-శంఖ-మదిరాశ్వ' నామకులు అందరును శ్రేష్ఠ రథికులు. వీరి శౌర్యమును యుద్ధమునందు చూడవచ్చును. వీరందఱు పరిపూర్ణమైన అస్త్ర విద్యాజ్ఞానము కలవారని నేను తలచెదను.

"రాజా! 'వార్ధక్షేమి' యను రాజు మహారథికుడని, 'చిత్రాయుధ' రాజు రథికుడని నా యభిప్రాయము చిత్రాయుధుడు అర్జునునకు భక్తుడు.

''చేకితానుడు - సత్యధృతి - ఈ యిద్దరు పురుష సింహులు శ్రేష్ఠ రథికులు అని నేను తలచెదను.

''వ్యాఘ్రదత్తుడు - చంద్రసేనుడు, 'క్రోధహస్త' యను నామాంతరము గల సేనాబిందుకుడు అనువారు శ్రేష్ఠ రథికులే. వారు శ్రీకృష్ణ భీమసేనులతో సమాన పరాక్రమము గలవారు. వారు సమరాంగణమునందు నీ సేనలతో పోరాడెదరు.

''రాజా! నీవు నన్ను, ద్రోణాచార్యుని, కృపాచార్యుని తలచినట్లే శత్రు వీరులతో స్పర్థపడి మిక్కిలి ఉత్సాహముతో శస్త్రాస్త్రములు ప్రయోగించు ప్రశంసనీయుడైన కాశీరాజును కూడ తలచవలెను.

"అతడు ఉత్తమ రథికుడు. శత్రు నగరములను జయించగల కాశీ రాజును సాధారణ పరిస్థితిలో ఒక్క రథికునిగానే తలచవలెను. కాని, అతడు సంగరమునందు తన పరాక్రమమును ప్రకటించునపుడు ఆతనిని ఎనిమిదిమంది రథికులతో సమానునిగ భావించవలెను.

"రాజా! ద్రుపదుని పుత్రుడైన 'సత్యజిత్తు' ఎల్లప్పుడు యుద్ధమందు ఆశ కలవాడుగా ఉండును. అతడు దృష్టద్యుమ్నునితో సమానుడుగనే అతిరథ పదవిని పొందినాడు. యువకుడైన అతడు పాండవుల యశస్సును కోరుచు గొప్పగా పోరాడగలడు.

"కురువీరా! పాండవపక్షమందు మిక్కిలి దురంధరుడైన వీరుడు మహా పరాక్రమశాలియునైన పాండ్యరాజు కూడ పాండవుల యెడల మిక్కిలి ప్రేమ గల వాడుగ నున్నాడు. అతని ధనుస్సు కూడ అతి దృఢమైనది. అతడా పక్షమునందు ఒక సమ్మాననీయుడైన మహా రథికుడు.

"రాజా! శ్రేణిమంతుడు- వసుదానుడు అను నీ యిరువురు వీరులు ఆ పక్షమునందు అతిరథులు. వారు శత్రు నగరములను అవలీలగా జయించగలవారు."

''ఆ విధముగ భీష్ముడు పాండవవీరులను గూర్చి వర్ణించుచు ఇంకను వారినే యిట్లు వర్ణింపదొడగెను:

"మహారాజా! పాండవపక్షమందు 'రోచమానుడు' అను మహారథికుడైన రాజు ఉన్నాడు. అతడు శత్రుసేనలతో దేవతా పరాక్రమ సమానమైన తన పరాక్రమమును చూపుచు పోరాడును.

''కుంతిభోజుని కుమారుడు, భీమసేనునకు మామయైన 'పురుజిత్తు' కూడ అతిబలశాలి, మహాధనుర్ధరుడు. అతనిని కూడ నేను అతిరథుడని తలచెదను. అతని ధనుస్సు కూడ గొప్పది. అతడు అస్త్రవిద్యాపండితుడు, యుద్ధకుశలుడు.

''పురుజిత్తు మిక్కిలి శక్తితో విచిత్రముగ యుద్ధము చేయును ఇంద్రుడు అతి పరాక్రమముతో దానవులతో యుద్ధము చేసినట్లు అతడు కూడ శత్రువులతో పోరాడును. అతనితో వచ్చిన సైనికులందరు కూడ యుద్ధకళానిపుణులు. వీరుడైన పురుజిత్తు తన మేనల్లుడైన పాండవుల హితము కోరుచు తెగించి యుద్ధము చేయును.

''మహారాజా! హిడింబా భీమసేనులకు పుత్రుడు, రాక్షసరాజునైన ఘటోత్కచుడు మహా మాయావి. అతడు రథిక యూథపతులపైన మహా యూథపతి.

"ఘటోత్కచునకు యుద్ధమనిన మహాప్రీతి. నాయనా! మాయావియైన ఆ రాక్షసుడు సమర భూమియందు తనతో వచ్చిన రాక్షస వీరులతో తన మంత్రులతో కలిసి ఉత్సాహ పూర్వకముగ యుద్ధము చేయును. వారందరు ఘటోత్కచుని వశమునందుండువారే.

''దుర్యోధనా! వీరేకాక శూరులైన అనేక క్షత్రియులు భిన్న భిన్న దేశముల నుండి వచ్చిన రాజులు పాండవ పక్షము నందున్నారు. వారందరు శ్రీ కృష్ణుని గొలుచువారే. యుధిష్ఠిరుని కొఱకు యుద్ధము చేయుటకు వచ్చి వారందరు ఏకమై నిలిచియున్నారు.

''దుర్యోధనా! యుధిష్ఠిరుని సేనలో ముఖ్యులైన రథికులు అర్ధరథులు వీరిని గూర్చి నేను చెప్పితిని. ఈ వీరులందరు అర్జునునిచేత రక్షింపడుచున్న యుధిష్టిర సేనను నడపెదరు.

''వీరవరా! నేను నీ పక్షమునందుండి రణరంగమునందు ఈ మాయావులు విజయాభిలాషులునైన పాండవ వీరులతో నా విజయమును కాని మృత్యువునుకాని కాంక్షించుచు యుద్ధము చేసెదను.

"మహారాజా! కృష్ణార్జునులు ఆ వీరులందరిలోను శ్రేష్ఠులు. కృష్ణుడు చక్రము అర్జునుడు గాండీవము ధరించి సంధ్యాకాలము నందలి సూర్యచంద్రుల వలె కలిసికొని యుద్ధ రంగమునందు దిగినప్పుడు నేను వారిని ఎదిరించెదను.

''రాజా! యుధిష్ఠిరుని సైన్యములో నున్న అనేక రథికులను సైనికులను ఎదుర్కొని నేను యుద్ధము చేసెదను.

"మహారాజా! నేను ఈ విధముగ నీ సైన్యములో ముఖ్యులైన రథికాతిరథిక అర్ధరథులను గూర్చి వర్ణించి చెప్పితిని.

''ఇట్లే పాండవ పక్షము నందలి వీరులను గూర్చి కూడ సూచనా ప్రాయముగ తెలియజేసితిని.

''శత్రు వీరులలో కృష్ణార్జునులనే కాక నాకు కనపడుచున్న వీరులనందరిని కూడ ముందుకు సాగకుండ ఆపెదను.

"కానీ, పాంచాల రాజకుమారుడైన శిఖండి యుద్ధమునందు ధనుర్బాణములను ధరించి నన్ను ఎదురించుచున్నను అతనిని చూచిన తోడనే నేను సంహరింపను.

''రాజా! నా తండ్రియైన శాంతనునకు ప్రియము చేయదలచి నాకు లభించిన రాజ్యమును కూడ కాలదన్ని బ్రహ్మచర్య పాలనము దీక్షతో జేయుచుంటినని సమస్త ప్రపంచమునకు తెలియును.

"నా సవతితల్లి సత్యవతికి జ్యేష్ఠపుత్రుడైన చిత్రాంగదుని కౌరవరాజ్య సింహాసనమునందు పట్టాభిషిక్తుని చేసి అతని తమ్ముడైన విచిత్రవీర్యుని అతనికి యువరాజుగా అభిషేకించితిని.

''రాజా! సమస్త భూమండలమునందలి రాజులందరికి కడ నా దేవవ్రతత్వ ఖ్యాతి వ్యాపించి యున్నది. అందువలన నేను ఎప్పుడు కూడ ఏ స్త్రీని కాని-లేక - తొలుత స్త్రీగా ఉండి, పురుషుడుగా మారినవానిని కాని సంహరించను.

''రాజా! శిఖండి మొదట స్త్రీగానే పుట్టియుండెను. అతడు తొలుత కన్యకగా నుండి, తరువాత పురుషుడయ్యెను. అందుచేత నేను అతనితో యుద్ధము చేయను.

''నన్ను యుద్ధములో ఎదుర్కొనిన ఇతర రాజు లందరిని చంపెదను. కాని, పాండవులను మాత్రము ఎన్నడును వధింపను."

''ఈ విధముగ భీష్మ పితామహుడు చెప్పగా విని దుర్యోధనుడు భీష్ముని ఇట్లు ప్రశ్నించెను:

అంబోపాఖ్యానము

''పితామహా! శిఖండి ధనుస్సు నెక్కుపెట్టి యుద్ధమునందు నిన్ను చంపుటకు ఆతతాయిగా (ఆతతాయులు ఆరుగురు: 1. ఇంటికి నిప్పు అంటించువాడు, 2. విషము పెట్టువాడు, 3. కత్తితో నరకుటకు వచ్చినవాడు, 4. ధనము అపహరించువాడు, 5. భూమిని అపహరించువాడు, 6. ఇతరుని భార్యను చెరబట్టువాడు.) వచ్చినపుడు అతనిని నీవు ఎందుకు సంహరించవు? 'సోమకులను పాంచాలురను వధించెదను' అని మొదట నీవు చెప్పియుంటివి. ఇట్లుండగా పాంచాలుడైన శిఖండిని ఎందుకు విడిచిపెట్టినావో చెప్పుము."

"ఆ ప్రశ్నమునకు భీష్ముడిట్లు బదులు చెప్పెను:

''దుర్యోధనా! సమరాంగణమునందు శిఖండి నన్ను ఏ కారణము చేత కొట్టుచున్నను అతనిని నేను ఎందుకు చంపనో ఆ కథను చెప్పెద వినుము. అది ఈ రాజులు కూడ వినెదరుగాక!

''భరతశ్రేష్ఠా! ధర్మాత్ముడైన నా తండ్రి శాంతను మహారాజు మరణించిన సమయమునందు నా ప్రతిజ్ఞను పాటించుచు నేను నా సోదరుడు చిత్రాంగదుని ఈ మహా సామ్రాజ్యమునకు పట్టాభిషిక్తుడను చేసితిని. అతడు కూడ చనిపోయినప్పుడు, మా తల్లి సత్యవతి సమ్మతితో నేను చిత్రాంగదుని తమ్ముడైన విచిత్రవీర్యుని రాజ సింహాసనమున కూర్చొనజేసి శాస్త్రోక్తముగ పట్టాభిషిక్తుని చేసితిని.

''రాజేంద్రా! అతడు వయస్సులో చిన్నవాడైనను ధర్మాత్ముడై ధర్మము ప్రకారము నా యందే గౌరవము ఉంచి నా అనుమతి చేతనే సమస్త రాజకార్యములను నెరవేర్చుచుండెను. నాయనా! అప్పుడు నేను మనకు యోగ్యమైన కులము నుండి కన్యకను తెచ్చి విచిత్ర వీర్యునకు వివాహము చేయ నిశ్చయించితిని.

''రాజా! ఆ దినములోనే కాశీరాజుయొక్క అసమాన రూప సౌందర్య శోభితురాండ్రైన ముగ్గురు కన్యలు స్వయంవర సభయందు స్వయముగనే

పతులను ఎన్నుకొను చుండిరని నేను వింటిని. ఆ ముగ్గురి స్వయంవరము కొఱకు భూమండలమునందని రాజులందరు పిలువబడి యుండిరి.

"రాజా! ఆ ముగ్గురు కన్యకలలో 'అంబ' అందరికంటే పెద్దది. 'అంబిక' నడిపి కూతురు. 'అంబాలిక' కనిష్ఠ పుత్రిక. ఆ స్వయంవర వృత్తాంతమును విని నేను ఏకరథ మాత్ర సహాయుడనై కాశీరాజ నగరమునకు పోయితిని. అక్కడ వస్త్రాభరణా లంకృతురాండ్రైన ముగ్గురు కన్యకలను చూచితిని. స్వయంవరము కొఱకు అక్కడకు అహూతులై వచ్చిన రాజులందరిని నేను చూచితిని.

"దుర్యోధనా! తరువాత నేను యుద్ధముకొఱకై నిల్చియున్న రాజులందరిని పిలిచి వారిని యుద్ధమునకు పురికొల్పుచు ముగ్గురు కన్యకలను నా రథమునందు కూర్చొన జేసితిని. ఆ కన్యకలు వీర్యశుల్కరాండ్రు (పరాక్రమమే కన్యాశుల్కముగా గలవారు) అని తెలిసికొని వారిని రథముపైన కూర్చొబెట్టుకొనిన తరువాత అక్కడి రాజులతో నేనిట్లంటిని:

"రాజులారా! శాంతను పుత్రుడు భీష్ముడనైన నేను ఈ కన్యకలను ముగ్గురిని అపహరించుచున్నాను. మీరందరు మీ సమగ్రశక్తిని, బలమును వినియోగించి వీరిని విడిపించుకొనుటకు ప్రయత్నింపుడు. ఎందుకనగా - నేను మీరందరు చూచుచుండగనే బలాత్కారముగ ఈ కన్యకలను తీసికొని పోవుచున్నాను.

"దుర్యోధనా! ఆ విధముగా నేను పలుసార్లు బిగ్గరగా అరచి చెప్పితిని. తరువాత ఆ రాజులు కోపించి ఆయుధములు తీసికొని నా పైన దాడి చేయుటకు తమ తమ సారథులకు 'రథము సిద్ధము చేయుడు, రథము సిద్ధము చేయుడు' అని ఆజ్ఞ యివ్వదొడగిరి.

"రాజా! తరువాత కొందరు రాజులు గజములతో సమానములైన మహారథములందు, ఏనుగులపై, బలిసిన అశ్వములపైనను అరూఢులై శస్త్రాస్త్రములు తీసికొని నాపై దాడి చేయ దొడగిరి. వారిలో గజయుద్ధ వీరులు అధిక సంఖ్యలో నుండిరి.

"రాజా! తరువాత ఆ రాజులందరు అనేక రథములతో నన్ను అన్ని వైపుల చుట్టు ముట్టిరి. అప్పుడు నేను గూడ బాణవర్షము కురియించి నలువైపుల వారి ప్రగతిని ఆపి దేవేంద్రుడు రాక్షసులను జయించినట్లు ఆ రాజులందరిని ఓడించితిని. రాజా! వారు నాపైన దాడి చేసినప్పుడు జ్వలించుచున్న నా బాణములచే నవ్వుచు నవ్వుచునే వారి సువర్ణ భూషిత విచిత్ర ధ్వజములను ఛేదించితిని. పిదప ఒక్కొక్క బాణమును ప్రయోగించి వారి గజాశ్వములను, సారథులను సంహరించితిని.

"దుర్యోధనా! నా హస్తలాఘవమును చూచి ఆ రాజులు వెన్నుచూపి పారిపోచుండిరి. ఆ రాజులందరు తలవంచి నన్ను ప్రశంసింపదొడగిరి. నేను ఆ రాజులను ఓడించిన తరువాత వారందరిని విడిచి ఆముగ్గురు కన్యకలను వెంటదీసుకొని హస్తినాపురమునకు వచ్చితిని.

"భరతనందనా! పిదప నేను ఆ కన్యలతో నాతమ్ముడు విచిత్రవీర్యునకు పెండ్లి చేయమని నా తల్లి సత్యవతికి ఆ కన్యకలను ఒప్పగించి, నేను ఏవిధముగ పరాక్రమము చూపి ఆ కన్యకలను తెచ్చితినో, ఆ విధానమును గూడ ఆమెకు తెల్పితిని.

"భరతశ్రేష్ఠా! తరువాత నేను వీరమాతయైన సత్యవతి వద్దకు పోయి ఆమెకు నమస్కరించి యిట్లంటిని:

"తల్లీ! వీరు కాశీరాజు కన్యకలు. పరాక్రమమే వీరికి శుల్కమై యుండెను. అందుచేత నేను సమస్తరాజులను జయించి తమ్ముడు విచిత్రవీర్యుని కొఱకు వీరిని హరించి తెచ్చితిని."

"అది వినిన సత్యవతీదేవి కన్నుల నుండి ఆనంద బాష్పములు రాలెను. ఆమె నా తలను అఘ్రాణించి ప్రసన్నురాలై 'కొడుకా! మిక్కిలి సౌభాగ్యకరమైన విషయము చెప్పితివి. నీ విజయము సంతోషదాయకము' అనెను.

"దుర్యోధనా! తరువాత సత్యవతీ దేవియొక్క అనుమతిచేత వివాహ కార్యములు చేయబడు చుండినప్పుడు కాశీరాజు జ్యేష్ట పుత్రిక అంబ కొద్దిగా సిగ్గుపడుచు నాతో నిట్లనెను:

"భీష్మా! నీవు ధర్మజ్ఞుడవు. సమస్త శాస్త్రజ్ఞాన నిపుణుడవు. కనుక నా మాట విని నాతో ధర్మసమ్మతముగ వ్యవహరించ వలెను నేను నా మనస్సునందు మొదట సాల్వరాజును నా పతిగా ఎన్నుకొని యుంటిని. ఆతడును ఏకాంతమునందు నన్ను వరించెను. ఇది పూర్వపు మాట. ఇది నా తండ్రికి గూడ తెలియదు.

''భీష్మా! నేను ఇతరుని కామించుచున్న రాజకన్యను. నీవు కురువంశ సంజాతుడవై కూడ రాజధర్మమును ఉల్లంఘించి నన్ను నీ యింటియందు ఎట్లు ఉంచుకొనెదవు? భరతశ్రేష్ఠా! ఈ విషయమును నీ మనస్సునందు బాగుగా విచారించి ఒక నిర్ణయము తీసికొని, నీకు ఏది ఉచితమని తోచునో అట్లే చేయుము.

''గంగానందనా, సాల్వరాజు నిశ్చయముగనే నాకొఱకు ఎదురు చూచుచుండును అందువలన కురుశ్రేష్ఠా! అతనిని సేవించుటకు నాకు అజ్ఞ యిమ్ము. వీరవరా! నాయెడ దయజూపుము. ఈ భూమండలమునందు నీవు సత్యవ్రతుడగు మహాత్ముడవని విన్నాను."

''దుర్యోధనా! అప్పుడు నేను తల్లి సత్యవతి యాజ్ఞపై మంత్రులను ఋత్విజులను పురోహితులను సంప్రదించి, సాల్వరాజు కడకు పొమ్మని అంబను ఆజ్ఞాపించితిని.

"నా యజ్ఞ పొంది అంబ వృద్ధ బ్రాహ్మణులు తోడుపోవగా సాళ్వరాజ నగరమునకు బయలు దేరెను. ఆమెతోబాటు ఆమె దాది కూడ ఉండెను. సాళ్వ నగరము చేరి అంబ సాళ్వరాజుతో నిట్లనెను:

''మహారాజా! నేను నీ కడకే వచ్చితిని. ఎల్లప్పుడు నీకు ప్రియము హితము చేయుటయందే ఆసక్తురాలనుగా ఉన్నాను. నన్ను స్వీకరించి సంతోషపరుచుము. రాజా! ధర్మానుసారముగ గ్రహించి నీ చరణముల వద్ద నాకు స్థానమిమ్ము. నేను సర్వదా నిన్నే చింతించుచున్నాను. నీవు కూడ ఏకాంతమునందు నన్ను వివాహము చేసికునుటకు నాతో ప్రస్తావించి యుంటివి.

''ఆ విధముగా చెప్పిన అంబ మాటలను విని సాళ్వరాజు మందహాసము చేయుచు ఆమెతో నిట్లనెను:

''సుందరీ! నీవు ఇప్పుడు ఇతరుని దానవైతివి. కనుక నీవంటి స్త్రీతో వివాహము చేసికొనుటకు నేను ఇష్టపడుట లేదు. కనుక కల్యాణీ! నీవు మరల భీష్మునికడకే పొమ్ము.

"భీష్ముడు నిన్ను బలాత్కారముగ ఎత్తుకొనిపోయి యుండెను. కాబట్టి నిన్ను నేను నా పత్నిగా స్వీకరించగోరను. భీష్ముడు ఆ మహాయుద్ధము నందు రాజులందరిని ఓడించి నిన్ను గెలుచుకొని తనతో తోడుకొని పోయెను అప్పుడు నీవు అతని యెడల ప్రసన్నురాలవైయుంటివి.

''బాలా! నీవు ఇప్పుడు ఇతరునిదానవై యుండగా నిన్నెట్లు పత్నిగా స్వీకరింతును? ఇది నాకిష్టము లేదు. ఏ స్త్రీపైన తొలుత ఇతరుని అధికారమేర్పడునో, అట్టి స్త్రీని, అన్ని ధర్మములను బాగుగా నెరిగి యితరులకు ధర్మోపదేశము చేయు రాజు ఎట్లు స్వీకరించి తన యింటిలో ప్రవేశింప జేయును? కనుక నీ యిష్టము వచ్చిన ప్రదేశమునకు పొమ్ము వ్యర్థముగా సమయము ఇక్కడ గడపకుము,''

"ఆ మాటలు విని అంబ మన్మథ పీడితురాలై సాళ్వరాజుతో నిట్లనెను:

"రాజా! నీవు ఇట్టి మాటలు ఎప్పుడుకూడ పలుకకుము. నేను భీష్మునితో పాటు ప్రసన్నురాలనై పోవలేదు. అతడు సమస్త రాజులను ఓడించి బలాత్కారముగా నన్నపహరించి యుండెను. అప్పుడు విధిలేక నేను ఏడ్చుచు అతనిచేత తీసికొని పోబడితిని.

"కనుక సాల్వరాజా! నేను ఏ యపరాధము చేయని అబలను. నీ యందు అనురాగము కలదానను. నన్ను స్వీకరింపుము. ఎందుకనగా- భక్తులను విడచి పెట్టుట ధర్మము కాదు. నేను భీష్ముని అడిగి, అతని యాజ్ఞ తీసికొని మిక్కిలి ఉత్కంఠతో ఇక్కడకు వచ్చితిని.

"రాజా! భీష్ముడు నన్ను కోరుట లేదు. ఆయన యీ పన్నుగడ తన తమ్ముని వివాహము కొఱకు చేసెనని వినియుంటిని. భీష్ముడు అంబిక, అంబాలిక అను ఇద్దరు నా చెల్లెంద్రనుగూడ తీసికొనిపోయి యుండెను. వారిని తన తమ్ముడైన విచిత్ర వీర్యునకిచ్చి పెండ్లి చేసెను.

"రాజా! నేను నా తలపైన చేయిపెట్టి ఒట్టు పెట్టుకొనుచున్నాను. నిన్ను తప్ప ఇతరు నెవరినిగూడ నేను మనస్సులో తలచుట లేదు.

"రాజేంద్రా! నా పైన ఏ యితర పురుషుని యధికారము ఎప్పుడు కూడ లేదు. నేను స్వేచ్ఛగా మొట్ట మొదట నీ కడకు వచ్చితిని. నేను సత్యము చెప్పుచున్నాను. నాపైన నేను ఒట్టుపెట్టుకొని చెప్పుచున్నాను.

"రాజా! నేను ఇతరు నెవ్వరిని గూడ నా పతిగా తలచలేదు. నీ దయనే కోరుచున్నాను. నేను స్వయముగా నీ సన్నిధికి వచ్చినాను. కన్యాకుమారి ఐన నన్ను నీ ధర్మపత్నిగా స్వీకరింపుము.

"దుర్యోధనా! ఇట్లు అను నయపూర్వకముగ దీనురాలై వేడుచున్న అంబను, సర్పము ప్రాత కుబుసమును విడిచినట్లు సాళ్వరాజు విడిచివేసెను. అనేక విధములుగ అంబ యాచించినను, శాల్వరాజు ఆ కన్యకమాటలను నమ్మ లేదు. తరువాత ఆమె దుఃఖముతో కోపముతోను కన్నీరు గార్చుచు డగ్గుత్తికతో ఇట్లనెను:

"రాజా! నా మాట సత్యమైనచో నీవు నన్ను విడిచిపెట్టిన తరువాత నేను పోయిన చోటులంతటను సత్పురుషులు నాకు ఆశ్రయమిత్తురు గాక!"

"దుర్యోధనా! ఆ విధముగా అంబ దీన స్వరముతో ఏడ్చుచు ఎన్నో విధములుగ అతనిని ప్రార్థించుచుండెను. కాని, శాల్వరాజు ఆమెను పూర్తిగా పరిత్యజించెను.

"అతడు మాటిమాటికి, నీవు పొమ్ము, వెడలిపొమ్ము, నేను భీష్మునకు భయపడుచున్నాను. నీవు భీష్ముని చేత గ్రహింపబడినదానవు' అని యనెను.

"దూరదృష్టిలేని శాల్వుడు ఈ విధముగా చెప్పినమీదట అంబ కురరి (ఆడు లకుముకి పిట్ట) వలె దీనభావముతో దుఃఖించుచు శాల్వనగరము నుండి వెడలిపోయెను.... ...

"అట్లు భీష్ముడు దుర్యోధనునకు చెప్పి తరువాతి అంబ వృత్తాంతమును చెప్పదొడగెను:

"దుర్యోధనా! శాల్వనగరమునుండి వెడలునప్పుడు దుఃఖించుచున్న అంబ యీ విధముగా చింతించుచుండెను:

"ఈ భూమండలమునందు నావలె సంకటములలో పడిన మరియొక యువతి ఎవతెకూడ ఉండి యుండదు. సోదరులకు, బంధువులకు నేను దూరమై పోయితిని. శాల్వరాజుకూడ నన్ను విడిచెను. ఇక నిప్పుడు నేను హస్తినాపురము నకు కూడ పోవజాలను. ఎందుకనగా- శాల్వుని యెడల నాకు అనురాగము కలదని భీష్మునకు చెప్పి యిక్కడికి వచ్చుటకు అయన అనుజ్ఞ తీసికొని యుంటిని.

ఇప్పుడు నన్ను నేను నిందించుకొందునా? దుర్జయుడైన ఆ భీష్ముని నిందింతునా? అథవా, నా స్వయంవర మేర్పరచిన మూర్ఖుడైన నా తండ్రిని దూషింతునా?

"పూర్వము భీష్ముడు స్వయంవరమునకు వచ్చిన రాజులతో భయంకర ముగా యుద్ధము చేయుచున్నప్పుడే భీష్ముని రథమునుండి క్రిందికి దుమికి శాల్వునివద్దకు నేను పోవనైతిని. అదియే నేను చేసిన పెద్ద తప్పు దాని ఫలమే ఇప్పుడు నేను అనుభవించుచున్నాను.

"నేను ఒక మూర్ఖ స్త్రీవలె ఇప్పుడు గొప్ప ఆపదలో చిక్కుకొంటిని. ఛీ! భీష్ముడు ఎంత అవివేకి? మా స్వయంవరమునకు వీర్య శుల్కమును నిర్ణయించి నన్ను వీధిన బడవేసి, జన సముదాయములో దిక్కులేనిదానివలె తిరుగునట్లు చేసిన నా తండ్రి ఛీ! ఎంత మందబుద్ధి కలవాడు?

"ఈ విషయములో నన్ను నేనే ధిక్కరించుకొందును. శాల్వరాజుకు ధిక్కారమే. విధాతకు కూడ ధిక్కారమే. ఈ యందరి దుష్టత్వముల వలన నేను ఈ గొప్ప విపత్తిలో చిక్కుకొన్నాను."

"మనుష్యుడు తన అదృష్టములో నున్నదే పొందగలడు. ఇప్పుడు నాకు జరిగిన అన్యాయమునకు శాంతనునందనుడైన భీష్ముడే ముఖ్యకారణము. అందు వలన ఈ సమయమునందు నేను తపస్సు చేసిగాని, లేక యుద్ధముచేతగాని భీష్మునకు ప్రతీకారము చేయుటయే నాకు ఇప్పుడు తగిన కర్తవ్యమని తెలియు చున్నది. ఎందుకనగా, నా దుఃఖమునకు ప్రధాన కారణము భీష్ముడే.

"ఇపుడు యుద్ధము చేసి భీష్ముని జయింపగల రాజు ఎవడు గూడ లేడు. కనుక తపస్సే చేసెదను' అని నిశ్చయించుకొని అంబ శాల్వనగరము నుండి వెడలిపోయెను.

"పుణ్యాత్ములైన మునీశ్వరుల యాశ్రమమునకు పోయి అంబ ఆ రాత్రి అక్కడనే గడపెను. ఆ యాశ్రమమునందలి తపస్వులు ఆమెను తమ మధ్య ఉంచుకొని రక్షించిరి.

"దుర్యోధనా! సుందరియైన అంబ తనకు సంభవించిన దుఃఖ వృత్తాంతము నంతయు విస్తారముగా మహాత్ములైన ఆ మునీశ్వరులకు చెప్పెను. తాను ఎట్లు అపహరింపబడెనో ఏ విధముగా భీష్ముని నుండి తనకు విముక్తి కలిగెనో, ఎట్లు శాల్వుడు తనను విడిచెనో, ఈ విషయములన్నియు ఆమె వారికి వినిపించెను.

"ఆ యాశ్రమమునందు కఠిన తపోవ్రతపాలనము చేయుచున్న 'శైఖావత్యుడు' అను తపోవృద్ధుడైన శ్రేష్ఠ బ్రాహ్మణుడుండెను. అతడు శాస్త్రములను,

అరణ్యకము (వేదములో భాగములు) లు మొదలైన వాటిని బాగుగా బోధించు సద్గురువుగా నుండెను. అక్కడ మిక్కిలి దుఃఖించుచు నిట్టూర్చుచున్న సాధ్వి యైన అబలయొక్క ఆర్తిని చూచి శైఖావత్యుడు అమెతో నిట్లనెను:

"మహాభాగురాలా!ఇట్టి పరిస్థితిలో ఈ యాశ్రమమునందు ఉన్న మహాత్ములైన తపోధనులు నీకు ఏమి సహాయము చేయగలరు?"

"ఆ మాటకు అంబ ఆయనతో నిట్లనెను:

"భగవన్! నన్ననుగ్రహింపుడు. నేను మూర్ఖురాలనై, నా జీవితము చెడ గొట్టుకొంటిని. కనుక సన్యాసులవలె ధర్మపాలనము చేయ దలచినాను. ఈ యాశ్రమమునందే యుండి దుష్కరమైన తపస్సు చేసెదను.

"పాపకర్మముల నాచరించిన నా పూర్వజన్మ శరీరమువలననే నాకు దుఃఖ రాయకమైన యీ ఫలము కలిగినది. అందులో సందేహము లేదు.

"మహాత్మా! ఇప్పుడు నేను నా బంధుజనులకడకు పోవజాలను. ఎందు కనగా - శాల్వరాజు నాతో కఠినముగా ప్రవర్తించి విడిచి పెట్టెను. దానిచేత నా జీవితమంతయు ఆనంద శూన్యమై దుఃఖమయమయ్యెను.

"తాపసోత్తమా! నీవు దేవతా సమానుడవైన సత్పురుషుడవు.కనుక నాకు తపో విధానమును ఉపదేశించి నన్ననుగ్రహింపుము.

"దుర్యోధనా! ఈ విధముగా దైన్యముతో బల్కిన అంబమాటలను విని శైఖావత్య మహాముని లౌకిక దృష్టాంతములతో, యుక్తులతోను ఆ కన్యకను ఊరడించి ఆమెకు ధైర్యము కలిగించి, 'అక్కడి బ్రాహ్మణులతో కలిసి ఆమె కార్యసాధనము కొఱకు తప్పక ప్రయత్నించెదనని ప్రతిజ్ఞ చేసెను."

ఆ విధముగా భీష్ముడు దుర్యోధనునకు అంబయొక్క దీనావస్థను గూర్చి చెప్పి మరల నిట్లు చెప్పదొడగెను:

"దుర్యోధన మహారాజా! తరువాత ధర్మాత్ములైన ఆ తపోధనులందరు ఆ కన్యక విషయములో చింతించుచు 'ఇప్పుడేమి చేయవలెను' అని విచారించి ఆమెకు ఏదైన సహాయము చేయుటకు పూనుకొనిరి.

"వారిలో కొందరు మునులు 'ఈ రాజకన్యను ఈమె తండ్రి యింటికి చేర్చవలె'ననిరి. మరి కొందరు ఆమెను దూషించిరి.

"కొందరు 'శాల్వరాజుకడకు పోయి ఈమెయొక్క ఈ యవస్థకు అతడే బాధ్యుడని చెప్పి అతనినే స్వీకరింపుమని చెప్పుద'మనిరి.

"ఇతరులు 'ఇది యసంభవము ఎందుకనగా, అతడు ఈమెతో కఠినముగా మాట్లాడి, ఈమెను గ్రహించుటకు నిరాకరించెను' అనిరి.

"దుర్యోధనా! ఆ విధముగా ఆ మునీశ్వరు లందఱు పరస్పరము కూడ బలుకుకొని ఆమెతో నిట్లనిరి:

"మంగళకరులారాలా! ఇట్టి పరిస్థితిలో మనీషులైన తాపసోత్తములు ఏమి చేయగలరు?"

"అట్లు చెప్పి ఆ తాపసు లందఱు ఆ రాజకన్యతో మరల నిట్లనిరి:

"అమ్మా! నీకు ఇల్లు విడిచి సన్యాసులవంటి ధర్మాచరణమునందు కాలము గడపవలసిన ఆవశ్యకత లేదు. మేము పలుకు హితవచనములు వినుము. నీకు శుభము కలుగుగాక! ఇక్కడినుండి నీ తండ్రి యింటికే పొమ్ము. ఆ తరువాత చేయవలసిన పనిని గూర్చి నీ తండ్రి కాశీరాజే విచారించగలడు. నీవు మీ తండ్రి యింటిలో సర్వగుణ సంపన్నురాలవై సుఖముగా నుండగలిగెదవు.

"భద్రే! తండ్రిని ఆశ్రయించి ఉండుటయే ఇట్టి పరిస్థితిలో నీకు న్యాయ సంగతము. అటువంటి ఆశ్రయము మరియొకటి యిప్పుడు నీకు లేదు. స్త్రీకి పతిగాని, తండ్రిగాని ఆశ్రయముగా నుండును. సుఖమైన పరిస్థితిలో స్త్రీకి పతి ఆశ్రయము అగును. సంకటకాలమునందు ఆమె తండ్రి ఆశ్రయమునందుండు టయే ఉత్తమము విశేషించి నీవు అవివాహితగా నున్నావు. కాబట్టి, యీ సన్యాసము నీకు మిక్కిలి దుఃఖసాధ్యమైనది.

"భామినీ! నీవు రాజకుమారివి. సహజముగా సుకుమారివి. కాబట్టి ఈ యాశ్రమమునందు నీ వుండుటచేత అనేక దోషములు సంభవింపవచ్చును. తండ్రి యింటిలో ఆ దోషములు నీకు ప్రాప్తించవు.'

"తరువాత ఇతర తాపసులు గూడ ఆ దీనురాలితో నిట్లనిరి:

''అమ్మా: నిర్జనమైన ఈ దుర్గమారణ్యమునందు ఒంటరిగనున్న నిన్ను చూచి ఎందరో రాజులు ప్రేమించగలరు. కాబట్టి ఈ విధముగ తపస్సు చేయ వలెనను నభిప్రాయము నీకు మంచిది కాదు.'

"ఆ మాటలకు అంబ వారితో నిట్లనెను:

"తాపసులారా! ఇప్పుడు నేను నా తండ్రికడకు తిరిగి పోవుట అసంభవము. ఎందుకనగా - అక్కడ నేను సోదరులమధ్య, బంధువులమధ్య అవమానితురాలనై ఉండవలసి వచ్చును.

"మునీశ్వరులారా! నేను బాల్యమునందు తండ్రి యింటిలో ఉండినాను. ఇప్పుడు మరల అక్కడికి పోవను. కాబట్టి, తపస్విజనులైన మీ చేత రక్షింపబడుచు ఇక్కడనే ఉండి తపస్సు చేయగోరుచున్నాను

"నేను తపస్సు చేయుటకు ఎందుకు కోరుచున్నాననగా, 'పరలోకమునందైనను నాకు ఈ విధముగ మహా సంకటములు కలిగి దౌర్భాగ్యము సంభవించకుండుగాక' యను ఉద్దేశముతో తపస్సు చేసెదను.

''దుర్యోధనా! అంబ మాటలు విని ఆ బ్రాహ్మణులు ఏమియు తోచక చింతామగ్నులై యుండగా, ఆ సమయమునందే 'హోత్రవాహనుడు' అను తపస్సంపన్నుడైన రాజర్షి ఆ వనమునకు వచ్చెను. అతనికి ఆశ్రమవాసులైన మునులందఱు స్వాగతము పలికి కుశల ప్రశ్నములు చేసి ఆసనమునందుంచి అతిథి సత్కారములు చేసి ఆదరించిరి.

"అక్కడ కూర్చొని హోత్రవాహనుడు విశ్రాంతి తీసికొనుచుండెను. అప్పుడు ఆయన వినుచుండగనే అక్కడి మునీశ్వరులు మరల అంబను గూర్చిన ప్రసంగము చేయుచుండిరి.

"దుర్యోధనా! అంబా - కాశీరాజులను గూర్చిన చర్చను విని మహా తేజస్వియైన హోత్రవాహన రాజర్షి మిక్కిలి పరితాపము చెందెను. ఆ రాజర్షి మనస్సు దయతో కరగిపోయెను.

"హోత్రవాహనుడు అంబకు మాతామహుడు (తల్లికి తండ్రి - తాత) దుర్యోధనా! ఆయన వణకుచు లేచి ఆ రాజకన్యకను ఒడిలో కూర్చొన బెట్టుకొని ఊరడింపజొచ్చెను.

"తరువాత హోత్రవాహనుడు ఆమెకు ఈ సంకట పరిస్థితి కలిగినందుకు కారణములను మొదటినుండి చెప్పుమని యామె నడిగెను. అప్పుడామె అన్ని విషయములను విస్తారముగా తెలిపెను.

"తరువాత ఆ రాజర్షి శోకసంతప్తుడై మనస్సులోనే అప్పుడు చేయవలసిన అవశ్యకర్తవ్యమును గూర్చి నిశ్చయించి అంబతో నిట్లనెను:

"బిడ్డా! నీవు చింతింపకుము. నీ తండ్రి వద్దకు పోవుటకు నీకు ఇష్టము లేకున్నచో పోవకుము. నేను నీ తల్లికి తండ్రిని గదా! నా వద్ద నీవుండుము. నీ దుఃఖమును పోగొట్టెదను. నీ మనస్సునందు చాల సంతాపము కలదు గనుకనే నీవిట్లు చిక్కి పోయితివి.

"నా ఉపదేశము ప్రకారము నీవు ఇప్పుడే పరశురామునికడకు పొమ్ము. నీ దుఃఖమును ఆయన తప్పక పోగొట్ట గలడు. ఆయన చెప్పినట్లు భీష్ముడు విననిచో తప్పక అతనిని సంహరించ గలడు. భార్గవశ్రేష్ఠుడైన పరశురాముడు ప్రళయకాలాగ్నితో సమానుడు. నీవు ఆయననే శరణు వేడుము. బిడ్డా! పరశురాముడు నిన్ను న్యాయమైన మార్గమునందు ఉంచగలడు."

''దుర్యోధనా! హోత్రవాహనుడు చెప్పిన మాటలను విని అంబ దుఃఖించుచు ఆయనకు తలవంచి నమస్కారము చేయుచు నిట్లనెను:

"తాతా! నేను నీ యాజ్ఞ చేత పరశురాముని వద్దకు తప్పక పోయెదను కాని, ప్రపంచ విఖ్యాతుడైన ఆ మహాత్ముని కడకు నేడు నేనెట్లు పోవుదును? ఆయన దర్శనము నాకెట్లు లభించగలదు? నా దుఃఖమును ఆయన ఎట్లు పోగొట్ట గలడు? ఇదియంతయు నేను బాగుగా తెలిసికొనిన తరువాతనే అక్కడకు పోయెదను.'

"దుర్యోధనా! అంబ మాటలు విని యామెతో హోత్రవాహనుడిట్లనెను:-

"బిడ్డా! పరశురాముడు మహావనమునందు ఉగ్రమైన తపస్సు చేయుచున్నాడు. ఆయన మహాశక్తి సంపన్నుడు. సత్యప్రతిజ్ఞుడు. నీకు అవశ్యముగా ఆయన దర్శనము లభించగలదు.

"పరశురాముడు సర్వదా మహేంద్రపర్వతముపైన ఉండును. అక్కడ వేదవేత్తలైన మహర్షులు - గంధర్వులు - అప్సరః స్త్రీలు గూడ నివసించుచుందురు.

''బిడ్డా! నీకు మంగళమగు గాక! నీవు అక్కడికి పోయి తొలుత దృఢవ్రతుడైన పరశురామునకు నమస్కారము చేసి, నా వద్ద నుండి వచ్చినానని చెప్పుము. నా పేరు చెప్పగనే ఆయన నీ కార్యమంతయు చక్కబరచును.

''వత్సే! ఆయన నాకు పరమ మిత్రుడు. నా యందు చాల ప్రేమగలవాడు. ఆయన సమస్త శస్త్రధారులలో శ్రేష్ఠుడు.

''దుర్యోధనా! హోత్రవాహనరాజు, అంబతో ఈ విధముగా చెప్పుచుండగనే పరశురాముని ప్రియశిష్యుడైన 'అకృతవ్రణుడు' అక్కడికి వచ్చెను.

''అప్పుడా మునులందరు, హోత్రవాహనునితోపాటు అతనిని చూచిన వెంటనే లెచి నిలువబడిరి. అతనికి స్వాగతసత్కారములు చేసి ఉచితాసనముపైన కూర్చొనజేసి, ఆ మునులు ఒండొరులను చూచుకొనుచు, మధురముగా మాట్లాడుకొనుచుండిరి.

'"దుర్యోధనా! తరువాత, సృంజయవంశీయుడైన హోత్రవాహన రాజర్షి పరశురాముని వృత్తాంతమును గూర్చి అకృతవ్రణుని ఇట్లడిగెను:

''అకృతవ్రణా! ఇప్పుడు వరశురాముని దర్శన మెక్కడ లభించగలదు?

"ఆ మాటకు అకృతవ్రణుడిట్లనెను :

''రాజా! పరశురాముడు సర్వదా నిన్ను గూర్చియే చర్చించుచుండును. 'హోత్రవాహనరాజు నాకు ప్రియమిత్రు'డని చెప్పుచుండును. రేపు ఉదయము పరశురాముడిక్కడకురానున్నాడు. ఆయన నీతోనే కలియుటకు వచ్చుచున్నాడు. కాబట్టి నీవు ఇక్కడనే ఆయన దర్శనము చేయుము.

''రాజర్షీ! ఈ కన్యక ఎందుకు ఈ వనమునకు వచ్చినది? ఈమె యెవరి బిడ్డ? నీకు ఏవిధముగ బాంధవ్యము ఈమెతో కలదు? నేను తెలిసికొనగోరుచున్నాను. అని యడిగెను.

"దుర్యోధనా! అకృతవ్రణుని ప్రశ్నమునకు హోత్రవాహనుడిట్లు బదులు చెప్పెను:

''మహామునీ! ఈమెనా దౌహిత్రి (బిడ్డకు బిడ్డకు). ఈమె కాశీరాజు యొక్క జ్యేష్ఠపుత్రి. ఈమె తన యిరువురు చెల్లెండ్రతోపాటు స్వయంవరమునకు నిలిచెను. ఈమె పేరు అంబ. ఈమె యిద్దరు చెల్లెండ్రపేర్లు అంబిక - అంబాలిక అని.

''మహర్షీ! కాశీపురమునందు ఈ ముగ్గురు కన్యకల స్వయంవరముకొరకు భూమండలమునందలి క్షత్రియులందరు చేరియుండిరి అప్పుడక్కడ గొప్ప స్వయంవరోత్సవ మేర్పరుపబడియుండెను.

"అక్కడికి, అప్పుడు మహాతేజస్వి, బలపరాక్రమ సంపన్నుడునైన శాంతననందనుడు భీష్ముడు వచ్చెనట. అత డక్కడ నున్న రాజుల నందరిని జయించి యీ ముగ్గురు కన్యకలను అపహరించుకొని పోయెనట.

''మహామునీ! భీష్మునకు ఈ కన్యకల యెడ పరిశుద్ధమైన భావముండెను. ఆయన ఈ కన్యకలను హస్తినాపురికి తోడ్కొనిపోయి, తల్లి సత్యవతికి ఒప్పగించి, ఈ ముగ్గురకు తన తమ్ముడు విచిత్రవీర్యునితో వివాహము చేయుమని చెప్పెను.

"బ్రాహ్మణోత్తమా! అక్కడ వివాహ కార్యక్రమములు ఆరంభింపబడుట చూచి యీ అంబ, మంత్రులతోనున్న భీష్మునితో 'ధర్మజ్ఞా! నేను శాల్వరాజును పతిగా మనస్సులోనే వరించుకొని యున్నాను. నా మనస్సు ఇతరునియందు అనురక్తమైయున్నందుచేత, నీవు నా వివాహము నీ తమ్మునితో చేయగూడదు' అని చెప్పెను.

''మహాత్మా! అంబ మాటలు విని భీష్ముడు తన మంత్రులతో సంప్రదించి తల్లి సమ్మతితో ఈ కన్యను విడిచెను. అప్పుడీమె సంతసించి సౌభవిమాన ప్రభువైన సాళ్వుని కడకుపోయి యతనితో నిట్లనెను:

"మహారాజా! భీష్ముడు నన్ను విడిచెను. ఎందుకనగా, పూర్వము నేను మనస్సులోనే నిన్ను ప్రేమించి వరించియుంటిని. కనుక ఇప్పుడు నీవు ధర్మముగా నన్ను చేపట్టుము.'

"అప్పుడు సాల్వరాజునకు ఈమె శీలముపైన సందేహము కలిగెను. కాబట్టి ఈమె కోరికను త్రోసిపుచ్చెను.

"ఆ కారణముచేత ఈమె తపస్సు చేయుటకు ఈ తపోవనమునకు వచ్చెను. ఈమె నా దౌహిత్రి కాబట్టి నేను గుర్తు పట్టితిని. ఈమెకు ఈ దుఃఖము ప్రాప్తించుటకు భీష్ముడే కారణమని యీమె తలచుచున్నది."

''దుర్యోధనా! తరువాత అంబ యిట్లు అకృతవ్రణునితో ననెను:

''భగవాన్! నా మాతాపితామహుడు చెప్పినదంతయు సత్యమే. ఇప్పుడు నా పరిస్థితియు నిదియే. లజ్జా భయముల కారణముగా నేనిప్పుడు మా నగరమునకు పోవుటకు నాకు ఉత్సాహము లేదు.

"ఇప్పుడు భగవంతుడైన పరశురాముడు ఏమి చెప్పునో, అదియే నాకు వరమోత్తమమైన కర్తవ్యమగును. ఇదియే నా నిశ్చయము.'

''దుర్యోధనా! అట్లు హోత్రవాహనుడు, అంబ ఆ యిరువురున్ను చెప్పిన మాటలు విని అకృతవ్రణుడు అంబతో నిట్లనెను:

''మంగళకరురాలా! నీకు దుఃఖము కలిగించునది భీష్ముడు - శాల్వుడు వీరిద్దరు గదా! నీవీ యిరువురిలో నెవరికి ప్రతీకారము చేయగోరుచున్నావు? తెలుపుము.

"నీవు శాల్వరాజునే పెండ్లి చేసికొనగోరుచున్న యెడల పరశురాముడు శాల్వరాజునే తప్పక ఆ పనికి నియోగించును. అట్లుగాక, భీష్మనే యుద్ధము నందు జయింపదలచిన యెడల పరశురాముడు ఆ కార్యము గూడ నీకొరకు సాధించగలడు.

"సృంజయవంశరాజైన హోత్రవాహనుని మాటవిని, నీవు నీ యభిప్రాయమును హోత్రవాహనునకు తెలుపుము. నీకు ఈ రెంటిలో ఏ కార్యము అవశ్యకమో అది నేడే యోచించి ఆయనకు చెప్పుము.'

"దుర్యోధనా! అకృతవ్రణునిమాట విని, అంబ యతనితో నిట్లనెను:

''భగవాన్! భీష్ముడు నా సంగతి తెలియక నన్ను తోడ్కొని పోయెను. బ్రహ్మన్! నా మనస్సు శాల్వరాజునందు లగ్నమైనట్లు భీష్మనకు తెలియదు. ఈ విషయము నీవే బాగుగా యోచించి నిశ్చయింపుము. ఈ రెండు కార్యములలో నీకు ఏది న్యాయ సంగతమని తోచునో దానినే చేయుము. ఆ యిరువురిలో ఏ యొకనినిగాని లేక యిద్దరినిగాని, నీకు ఉచితమని తోచిన వారిని సాధింపుము.

"నా దుఃఖమునకు మూలకారణము యథార్థముగా నీకు మనవి చేసికొంటిని. భగవన్! ఇప్పుడు నీవు నీ యుక్తితోనే యీ విషయమునందు న్యాయ సమ్మతముగా కార్యము చేయును.

''దుర్యోధనా! అట్లు అంబ చెప్పిన మాటలు విని అకృతవ్రణుడు ఆమెతో నిట్లనెను:

''బాలా! నీవు చెప్పునట్టి యీ ధర్మానుకూలమైన మాట నీకు సముచితముగానేయున్నది. ఇక నిప్పుడు నేను చెప్పబోవు మాట వినుము:

"అమ్మా! భీష్ముడు నిన్ను హస్తినాపురమునకు తోడ్కొనిపోవకుండిన యెడల శాల్వరాజు పరశురాముడు చెప్పినట్లు విని నిన్ను ఆదరముతో స్వీకరించియుండెడివాడు. కాని భద్రే! భీష్ముడు నిన్ను గెలుచుకొని తనతో తోడ్కొని పోయెను. కాబట్టి, శాల్వరాజునకు నీ యందు సందేహము కలిగినది.

''భీష్మనకు తన పౌరుషమునందు అభిమానము కలదు ఇప్పుడతడు,తాను జయించుటచేత ఉత్సాహముతో నున్నాడు. కనుక నిప్పుడు నీవు భీష్మనకే ప్రతీకారము చేయుట సముచితమగుచు.'

"ఆ మాటకు అంబ యిట్లనెను:

''బ్రహ్మన్! నేను భీష్మనే సంహరింపజేయవలెనని సర్వదా కోరుచుందును. ఆ యిద్దరిలో నెవడు దోషియని నీవు తలచెదవో, ఎవనివలన నేనింత దుఃఖమనుభవించవలసిన దాననైతినని నీకు తోచునో, అతనినే దండింపజేయుము.'

''దుర్యోధనా! ఆ విధముగా మాట్లాడుకొనుచు వారందరు ఆ రాత్రిం బగళ్ళు గడపిరి.

"ఉదయమే జటావల్కధారియైన పరశురాముడక్కడకు తన శిష్యులతో వచ్చెను. ఆయన మిక్కిలి తేజస్సుతో జాజ్వల్యమానుడుగ నుండెను.రాజా! పరశురామునకు ఏ మాత్రము దైన్యము లేదు. అతడు ధనుస్స-ఖడ్గము-గండ్రగొడ్డలి ధరించియుండెను. రజో గుణరహితుడైన యతడు హోత్రవాహన రాజు కడకు వచ్చెను.

"దుర్యోధనా! అప్పుడా యాశ్రమమునందలి తాపసులందరు పరశురాముని చూచి దోసిలొగ్గి యాయనకు నమస్కరించి నిలుచుకొనియుండిరి. తరువాత ఆయనకు మధుపర్కాదులిచ్చి అతిథి పూజ సల్పిరి. పిదప పరశురాముడు వారి వద్దనే కూర్చొనెను.

"తరువాత పరశురామ-హోత్రవాహను లిద్దరు మిత్రులొక చోట కూర్చొని అనేక సంగతులు మాట్లాడుకొనుచు ఇష్టాగోష్ఠి సలుపుచుండిరి.

''దుర్యోధనా! ఆ యిరువురు మాట్లాడుకొనిన పిదప హోత్రవాహన రాజర్షి పరశురామునితో ప్రయోజనకరమైన మాట నిట్లు మధురముగా చెప్పెను:

''కార్యసాధనకుశలుడవైన ప్రభూ! పరశురామా! యీమె నా దౌహిత్రి, కాశీరాజు పుత్రి. ఈమె కార్య మొకటి యున్నది. అది నీవు ఈమె నుండియే వినుము.''

''దుర్యోధనా! అట్లు హోత్రవాహనుడు చెప్పిన తరువాత పరశురాముడు అంబతో నిట్లనెను:

"చాలా మంచిది. బిడ్డా! చెప్పుము.'

"అప్పుడామె పరశురాముని వద్దకు పోయి, మంగళకరములైన యాయన చరణములకు శిరస్సాప్రణామము చేసి కమలదళములవలెనున్న తన హస్తములతో ఆయన చరణములను స్పృశించి, ఆయన దగ్గరనే నిలిచియుండెను.

ఆమె నేత్రములనుండి బాష్పములు రాలుచుండెను. శోకముచేత ఆర్తురాలై యేడ్చుచు సర్వ ప్రపంచమునకు శరణమీయగల భృగునందనుడైన పరశురాముని శరణు జొచ్చెను.

"దుర్యోధనా! అట్లు నిలుచుకొనియున్న అంబతో పరశురాము డిట్లనెను:

''రాజకుమారీ! నీవు హోత్రవాహనునకు వలెనే నాకును దౌహిత్రివే. నీ మనస్సులోనున్న దుఃఖ కారణమేమో చెప్పుము. నీవు కోరినట్లు నేను అన్ని కార్యములను నెరవేర్చెదను.

"దుర్యోధనా! పరశురాముని మాట విని అంబపరశురామునితో నిట్లనెను:

భగవన్! నీవు మహావ్రత నియమపాలకుడవు. నేడు నేను నీ శరణు జొచ్చితిని. ప్రభూ! భయంకరమైన శోకసాగరమునందు నేను మునిగియున్నాను. నన్ను ఉద్ధరించి కాపాడుము.'

''దుర్యోధనా! పరశురాముడప్పుడామె సుందరరూపము, నూతన తరుణ శరీరము, అత్యంత సౌకుమార్యము చూచి, ఆమె యేమి చెప్పునో యని చింతించెను.

"ఆమె యెడల దయా పరిపూర్ణుడై చాలసేపు ఆ విషయమునే చింతించుచుండి, ఆమెను 'బిడ్డా! నీ విషయము చెప్పుము' అని యడిగిన తరువాత అంబ తన వృత్తాంతమంతయు పరశురామునకు వినిపించెను.

''దుర్యోధనా! అంబ చెప్పిన సంగతియంతయు విని పరశురాముడు తాను చేయవలసిన పనిని నిశ్చయించుకొని యంబతో నిట్లనెను:

"బిడ్డా! నిన్ను నేను భీష్ముని వద్దకు పంపెదను. భీష్ముడు నా యాజ్ఞ వినిన తోడనే తప్పక పాలించగలడు. ఒకవేళ నతడు నా మాట అంగీకరించని యెడల, నేను యుద్ధమునందు నా శస్త్రాస్త్ర జ్వాలలచే అతని, అతని మంత్రులను భస్మీపటలము చేసెదను.

''లేదా, రాజకుమారీ! నీవు భీష్మునికడకు పోవ నిష్టపడనిచో, శాల్వరాజే తొలుత నీ కార్యము నెరవేర్చుటకు అతనిని వినియోగించుదునా? అతనితో నీ వివాహము జరిపెదను, చెప్పుము.'

''దుర్యోధనా! పరశురాముని మాటలు విని, అంబ అతనిని ఇట్లు వేడుకొనెను :

"భృగునందనా! శాల్వరాజునందు నాకు అనురాగము కలదు. తొలుత నుండియే ఆయనను పెండ్లి చేసికొన గోరుచున్నాను. ఈ విషయము నేను చెప్పిన వెంటనే భీష్ముడు నన్ను విడిచెను. అప్పుడు నేను శాల్వరాజు కడకు పోయి, స్త్రీలు స్వయముగా చెప్పుటకు అతి దుష్కరమైన మాటను చెప్పితిని. కాని, అతడు నా శీలమును శంకించుటచేత నన్ను స్వీకరింపలేదు.

''భగవన్! ఇదియంతయు నీవు బాగుగా యోచించి నిశ్చయించి, నీకు ఏది ఉచితమని తోచునో అట్లు చేయుము.

''నాకు గలిగిన యీ వ్యసనమున కంతటికిని మూలకారణము భీష్ముడే యగును. అతడప్పుడు నన్ను బలాత్కారముగా ఎత్తుకొని హస్తినాపురమునకు పోయెను.

''కనుక మహాత్మా! నీవు భీష్మునే సంహరింపుము. అతని కారణముననే నాకీ దుఃఖము సంప్రాప్తమైనది. అందుచేత, నాకు మిక్కిలి అప్రియమైన తపస్సునకు పూనుకుంటిని.

"భార్గవా! భీష్ముడు పరమలోభి, నీచుడు, విజయోల్లాసముతో నిండియున్నాడు. కాబట్టి, నీవు భీష్మునకే ప్రతీకారము చేయవలెను.

"భగవన్! భీష్ముడు నాకీ యవస్థ కలిగించినప్పటినుండియే అతనిని వధింపవలెనను సంకల్పము నాకు గలిగినది. కాబట్టి, మహానుభావా! నేడు నీవు ఈ నా కోరికకయే తీర్చగలవు. ఇంద్రుడు వృత్రాసురుని సంహరించినట్లు నీవు భీష్ముని చంపుము.'

"దుర్యోధనా! అంబ భీష్ముని చంపుమని పరశురాముని కోరగనే ఆయన మిక్కిలి దుఃఖించుచు నంబతో నిట్లనెను:

"సుందరీ! వేదవేత్తయైన బ్రాహ్మణున కెవనికైన అవసరము వచ్చినప్పుడు, అతని రక్షణముకొరకై నేను ఆయుధము ధరించెదను. ఇది నా ప్రతిజ్ఞ. ఎట్టి కారణము లేకుండ నేను నా యిచ్ఛానుసారముగా శస్త్రము పట్టను. కనుక, నా యీ ప్రతిజ్ఞను రక్షించుకొనుచునే నీకై వేరేదైన కార్యము చేసెదను.

''రాజకుమారీ! శాల్వుడు- భీష్ముడు- ఈ యిరువురు గూడ నా యాజ్ఞలో నుండెదరు. కనుక సుందరీ! నీ కార్యము తప్పక నెరవేర్చెదను, దుఃఖింపకుము.

"నేను ఎట్టి సందర్భములోగూడ బ్రాహ్మణుల యాజ్ఞలేకుండ ఆయుధము పట్టను. ఇట్లు నేను ప్రతిజ్ఞ చేసితిని."

"దుర్యోధనా! పరశురాముని మాట విని అంబ ఆయనతో నిట్లనెను:

"భగవన్! నీకు ఎట్లు తోచిన అట్లే చేసి నా దుఃఖమును నివారించుము. నాకు భీష్ముడే దుఃఖమును కలిగించెను. గనుక, నీవు అతనినే వధింపుము.'

"దుర్యోధనా! ఆ మాటకు పరశురాముడు అంబతో నిట్లనెను:

"కాశీపుత్రీ! నీవు మరల బాగుగా యోచించి చెప్పుము. ఒకవేళ భీష్ముడు నీకు వందనీయుడైనను, నా యాజ్ఞపైన నతడు నీ పాదములను తన తలపైన ధరించగలడు.'

"కురురాజా! పరశురాముని మాటకు అంబ ఆయనతో నిట్లనెను:

"భృగువంశమణీ! నాకు నీవు మేలు చేయగోరిన యెడల, నిన్ను భీష్ముడు యుద్ధమునందు ఆహ్వానించినపుడు, నీవు రాక్షసునివలె గర్జించుచు భీష్ముని వధించి, నీవు నాకు ఇంతకుముందు చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకొనుము.'

"దుర్యోధనా! పరశురాముడు - అంబ యీ విధముగా మాట్లాడుచుండగా అకృతవ్రణుడు పరశురామునితో నిట్లనెను:

"మహాత్మా! ఈ కన్యక నీ శరణుజొచ్చెను. కాబట్టి నీవు ఈమెను పరిత్యజించగూడదు. యుద్ధమునందు నీవు పిలిచినప్పుడు భీష్ముడు నీ యెదుటకు వచ్చి, తన పరాజయమును అంగీకరించిన యెడల, లేదా నీ మాట అతడు అంగీకరించినయెడల ఈ కన్యక కార్యము నెరవేరగలదు.

"మహామునీ! ఇట్లు చేయుటచేత నీవు ఈమె కొరకు చేసిన ప్రతిజ్ఞ సత్యమగును. నీవు సమస్త క్షత్రియులను జయించిన తరువాత బ్రాహ్మణుల మధ్య ఒక ప్రతిజ్ఞ చేసియుంటివి.

"అది యేమనగా, 'బ్రాహ్మణుడుగాని, క్షత్రియుడుగాని, వైశ్యుడుగాని, శూద్రుడుగాని బ్రాహ్మణుల ద్వేషించినయెడల, నేను వారిని తప్పక చంపెదను.'

''ఆ ప్రతిజ్ఞతోపాటే 'ఎవరైన భయపడి నన్ను శరణు వేడిన యెడల, అట్టి శరణార్థిని నేను బ్రతికియుండగా, ఎట్టి పరిస్థితిలోనైనను విడువను. యుద్ధమునందు క్షత్రియులందరు ఏకమై వచ్చినను వారిని వధించెదను' అని కూడ ప్రతిజ్ఞ చేసియుంటివి.

''మహాత్మా! భీష్ముడు సమస్త క్షత్రియులను, ఈమె స్వయంవరసమయమునందు జయించియుండెను. కాబట్టి, నీవిప్పుడు యుద్ధమునందు అతనిని ఎదిరించి పోరాడుము.'

''దుర్యోధనా! అట్లు అకృతవ్రణుడు చెప్పిన మాటలు విని పరశురాముడతనితో నిట్లనెను:

''మునిశ్రేష్ఠా! మొదట నేను చేసిన ప్రతిజ్ఞ నాకు జ్ఞప్తియందున్నది. అయినను, సామోపాయము చేతనే కార్యము నెరవేర్చుటకు ప్రయత్నించెదను.

''కాశీరాజు కన్యక తలచిన పని చాల పెద్దది, ఆ కార్యసిద్ధికొరకు నేను ఈమెను వెంటబెట్టుకొని, స్వయముగా భీష్ముని కడకు పోయెదను. భీష్ముడొకవేళ నా మాట విననియెడల, నేను ఆ దురభిమానిని సంహరించెదను. ఇదియే నా నిశ్చయము.

''బ్రహ్మన్! నేను ప్రయోగించిన బాణములు దేహధారుల శరీరములందు ఇరుకుకొనియుండవు. వాటిని చీల్చి బయటకు వెడలిపోవును. ఈ విషయము నీకు, నేను పూర్వము క్షత్రియులతో యుద్ధము చేసినప్పుడు తెలిసియున్నది.

''దుర్యోధనా! అట్లు నిశ్చయించిన తరువాత, ఆ రాత్రి అందరు ఆశ్రమమునందే యుండి, మరునాడు ప్రాతఃకాలమునందు కాలకృత్యములు తీర్చుకొని, సంధ్యావందనము, గాయత్రీజపము, అగ్నిహోత్ర కార్యములను నెరవేర్చుకొని, ఆ మునులందరు నన్ను వధించుటకు ఆశ్రమమునుండి బయలు వెడలిరి.

"కురుపతీ! అట్లు పరశురాముడా మునీశ్వరులను, అంబను వెంటబెట్టుకొని కురుక్షేత్రమునకు పోయెను. అక్కడ ఆ తపస్వులందరు పరశురామునితోపాటు సరస్వతీ నదీతీరమునందు ఆ రాత్రి విడిసిరి.''

''జనమేజయా! ఇట్లు భీష్ముడు దుర్యోధనునకు అంబ వృత్తాంతమును గూర్చి చెప్పుచు, తరువాతి కథ యిట్లు చెప్పదొడగెను:

"దుర్యోధనా! తరువాత మూడవదినమునందు, పరశురాముడు హస్తినాపురము బయట ఒకచోట నిలిచి, 'రాజా! నేనిక్కడికి వచ్చినాను, నీవు నాకొక ప్రియమైన కార్యము చేయుము' అని నాకు సందేశము పంపెను.

"తేజోనిధి, మహాబలపరాక్రమ సంపన్నుడు, భగవంతుడునైన పరశురాముడు నా రాజ్యసీమలోకి వచ్చిన సంగతి విని నేను మిక్కిలి సంతసించి, అతి వేగముగా నతని కడకు పోయితిని.

''కురుకుల భూషణా! అప్పుడు నేనొక గోవును ముందిడుకొని, బ్రాహ్మణులతో దేవతాసమాన తేజస్వులైన ఋత్విక్కులతో, పురోహితులతోను వెడలి పరశురాముని సన్నిధి చేరితిని. అప్పుడాయన నన్ను చూచి, నేను సమర్పించిన పూజను స్వీకరించి నాతో నిట్లనెను:

"భీష్మా! నీవు పూర్వము వివాహము చేసికొనుటకు ఇష్టపడకుంటివిగదా! అట్లైనను, కాశీరాజు కూతురైన యీ కన్యకను అపహరించి, నీ యింటికి తోడ్కొనిపోయి, మరల నెందుకు ఈమెను వెడలగొట్టితివి?

"నీవీ రాజకుమారిని ధర్మభ్రష్టురాలిని చేసితివి. నీవీమెను తాకితివి. ఇట్టి పరిస్థితిలో నీమెను ఎవరు పరిగ్రహించగలరు? నీవీమెను అపహరించి తెచ్చితివి. ఈ కారణము చేతనే శాల్వరాజు ఈ కన్యను వివాహమాడుటకు నిరాకరించెను.

"ఇప్పుడు నీవు నాయాజ్ఞచేత ఈ కన్యను గ్రహింపుము. అట్లు నీవు చేసిన యెడల, ఈ రాజకుమారి స్వధర్మమును పాటించుకొనగలదు. రాజకన్యకల నిట్లు అవమానపరచుట నీకు ఉచితముగాదు.'

''దుర్యోధనా! అప్పుడు నేను పరశురామునితో నిట్లంటిని:

"బ్రహ్మన్! ఎట్టి పరిస్థితిలో గూడ నేనీకన్యను నా తమ్మునితో వివాహము చేయజాలను. ఈమె నాతోనే మొదట, తాను శాల్వుని ప్రేమించినట్లు, తాను ఆయన దాననేయనియు చెప్పియుండుటచేత, ఈమెను విడిచి శాల్వరాజు కడకు పొమ్మంటిని. ఈమె వెడలిపోయెను.

"భృగునందనా! భయముచేతగాని, దయచేతగాని, ధనలోభముచేతగాని, మరి యేయితర కాంక్షచేతగాని, నేను క్షత్రియధర్మమును విడువజాలను. ఇది నేను స్వీకరించిన వ్రతము.'

"దుర్యోధనా! యీ విధముగా నేను చెప్పిన మాటలు విని పరశురాముడు క్రోధముచేత నాతో నిట్లనెను:

"రాజా! నా యీ మాట నీవు అంగీకరింపనియెడల, నేడు నిన్ను, నీ మంత్రులను సంహరించెదను."

"దుర్యోధనా! పరశురాముడు క్రోధారుణ నేత్రముతో నన్ను చూచుచు ఆ మాటనే అనేక పర్యాయములు నాతో ననెను.

"అయినను, నేను ప్రియవచనములనే పలుకుచు, ఆ మహాత్ముని శాంతింపుమని ప్రార్థించితిని. ఏ విధముగ గూడ నతడు శాంతుడు కాకుండెను.

"రాజా! ఇప్పుడు నేను ఆ బ్రాహ్మణశిరోమణి పాదములయందు శిరస్సు ఉంచి, నమస్కారము చేసి యిట్లు అడిగితిని:

'భగవాన్! నీవు నాతో యుద్ధము చేయుటకు కారణమేమి? నా బాల్యమునందు నీవే నాకు నాలుగు అంగములు ధనుర్వేదమును నేర్పితివి. భార్గవా! నేను నీకు శిష్యుడను.'

"దుర్యోధనా! నా మాటలు విని పరశురాము డిట్లనెను:

''భీష్మా! నీవు నన్ను నీ గురువుగా తలచుచున్నావు. కాని, నాకు ప్రియము చేయుటకై యీ కాశీరాజు కన్యను గ్రహింపకున్నావు. నీవు నా మాట వినకున్న యెడల నీకు శాంతి లభించదు సుమా! ఈమెను గ్రహింపుము. నీ కులమును రక్షించుకొనుము. నీచేత ఈమె భ్రష్టురాలైనందుచేత పతిని పొందజాలకున్నది'.

''దుర్యోధనా! యిట్లు చెప్పుచున్న పరశురామునితో నేను స్పష్టముగా నిట్లంటిని:

''భగవన్! ఇక ఈ కార్యము నేను చేయజాలను. నీవిట్లు శ్రమపడుట వలన ప్రయోజనము ఉండదు.

''జమదగ్నినందనా! నీవు నాకు పురాతనమైన దేశికుడవుగనుకనే నేను నిన్ను ప్రసన్నుని చేయుటకు ప్రయత్నించుచున్నాను.

''ఈ అంబను నేను పూర్వమే విడిచితిని. ఇతరునియందు అనురాగము గల స్త్రీ సర్పస్త్రీ వలె మిక్కిలి భయంకరురాలుగా నుండును. తెలిసి తెలిసి యీమెకు తన యింటిలో స్థానమీయగల పురుషుడెవడు ఉండును?

''ఎందుకనగా, స్త్రీలకుగల పరపురుష ప్రేమరూపమైన దోషము పెద్ద అనర్థములకు దారితీయును. ఇంద్రుడు నన్ను భయపెట్టినను, నేను ధర్మము విడువను. నీవు ప్రసన్నుడవైనను సరియే, కాకున్నను సరియే. నీవు చేయదలచిన కార్యము నేదియో చేయుము.

''మహాత్మా! పురాణములో మరుత్తుడు చెప్పిన యీ శ్లోకము వినుచుందుము.

''గురోరప్యవలిప్తస్య కార్యా కార్యమజానతః
ఉత్పథ ప్రతిపన్నస్య పరిత్యాగో విధీయతే.''

(ఒకవేళ గురువైనను సరియే, అతడు కర్తవ్యమును అకర్తవ్యమును తెలిసికొనకుండ గర్వముతో న్యాయమార్గమును ఉల్లంఘించినడచిన యెడల, అట్టి గురువుకు విడిచిపెట్టవలెను.)

''మహామతీ, నీవు నాకు గురువుగా నున్నావు. కనుక, నేను నీకు మిక్కిలి సన్మానము చేసితిని. కాని, గురువు ఎట్లు వ్యవహరించవలెనో నీకు తెలియదు. కాబట్టి, నేను నీతో యుద్ధము చేసెదను.

''నీవు నాకు గురువువని, విశేషించి బ్రాహ్మణుడవని, తపోవృద్ధుడవనియు నేనింతకాలముగా నీవు కఠినముగా వ్యవహరించినను సహించియుంటిని.

''భృగునందనా! ఒకవేళ బ్రాహ్మణుడు గూడ క్షత్రియునివలె ధనుర్బాణములు ధరించి యుద్ధము చేయబూనిన యెడల, అతడు వెన్నుచూపి పారిపోవనంతవరను, అతనితో యుద్ధము చేసి, అతనిని చంపినందువలన బ్రహ్మహత్యా దోషము అంటదని ధర్మశాస్త్ర నిర్ణయము గలదు. తపోధనా! నేను క్షత్రియుడను. క్షత్రియధర్మమునందే యున్నాను.

''ఎవడు ఎట్లు ప్రవర్తించునో, వానియెడల అట్లే వ్యవహరించువానికి అధర్మముగాని, అమంగళముగాని సంభవించదు.

''ధర్మార్థ వివేచనము చేయుటయందు సమర్థుడై, దేశ - కాలముల తత్త్వము నెరిగినవానికి ఒకవేళ అర్థము (లౌకిక కార్యము) నందు సంశయము కలిగిన యెడల, అతడు సంశయాస్పదమైన అర్థమును విడిచి, సంశయ రహితమైన హృదయముతో ధర్మమునే అనుష్ఠింపవలెను. అట్టివాడే శ్రేష్ఠుడని తలచబడును.

''పరశురామా! 'అంబ గ్రహింపబడుటకు యోగ్యురాలా? కాదా?'' అనునది సంశయాస్పదమైన విషయమైనప్పటికిన్ని ఈమెను గ్రహింపమని నాకు చెప్పట న్యాయసమ్మతము గాదు ఈ విధముగా వ్యవరించుచున్న నీతో యుద్ధమే చేసెదను.

''భృగునందనా! యుద్ధమునందు నా బాహుబలమును, అలౌకిక పరాక్రమమును చూడుము. ఇట్టి పరిస్థితిలో గూడ నేను ఏ కార్యము చేయగలనో, అది అవశ్యముగా చేసెదను.

''బ్రాహ్మణోత్తమా! నేను కురుక్షేత్రమునకు పోయి నీతో యుద్ధము చేసెదను. నాతో ద్వంద్వయుద్ధము చేయుటకు నీ యిష్టానుసారముగా సిద్ధము కమ్ము.

''రామా! ఆ మహాయుద్ధము నందు నా నూర్లకొలది బాణముల దెబ్బల చేత పీడితుడవై, శస్త్రపూతుడవై చంపబడినతరువాత, నీ పుణ్యకర్మముల ద్వారా సంపాదించుకొనిన దివ్యలోకములకు పోగలవు.

''యుద్ధమునందు శస్త్రములచేత చంపబడి, తన పాపములను పోగొట్టుకొని పవిత్రుడై పుణ్యలోకమునకు పోవువాడు శస్త్రపూతుడనబడును.

''రామా! ఇప్పుడు వెడలిపోయి కురుక్షేత్రమునకు రమ్ము. నేను యుద్ధము కొరకు అక్కడనే నిన్ను కలుసుకొనుటకు వచ్చెదను.

''నీవు పూర్వము నీ తండ్రికి జలాంజలి యిచ్చి ఆత్మశుద్ధి చేసికొనిన చోటనే నేను గూడ నిన్ను సంహరించి ఆత్మశుద్ధి చేసికొనెదను.

"బ్రాహ్మణబ్రువుడవై (బ్రాహ్మణ జాతి పేరు పెట్టుకొని జీవించు నీచ బ్రాహ్మణుడు), యుద్ధ దుర్మదాంధుడవైన నీవు వెంటనే కురుక్షేత్రమునకు రమ్ము. నేను అక్కడికే వచ్చి నీ పురాతన దర్పము నణచెదను.

"భృగునందనా! నీవు అనేక సభలలో, ప్రపంచము నందలి సమస్త క్షత్రియులను సంహరించితినని చెప్పికొనుచు ఆత్మస్తుతి చేసుకొంటివి.

"ఆ మాటలకు ఉత్తరము వినుము : ఆ దినములలో భీష్ముడుగాని, అతనికి సమానుడైన మరియొక క్షత్రియ వీరుడుగాని జన్మించి యుండలేదు. మహాపరాక్రమ శాలురైన క్షత్రియులు ఆ తరువాత పుట్టిరి. అందుచేత నీ మాటలు సాగినవి.

''ఎండు గడ్డిని అగ్ని ఆక్రమించినట్లు అనాడు నీవు దుర్బల క్షత్రియుల పైన పరాక్రమము చూపితివి.

''పరశురామా! నీ యుద్ధేచ్ఛను, యుద్ధాభిమానమును నశింపజేయు యుద్ధవీరుడు భీష్ముడీనాడు పుట్టినాడు. యుద్ధమునందు నీకు గల పొగరంతయు చూర్ణము చేసెదను. ఇందులో సందేహము లేదు.'

"దుర్యోధనా! నా మాటలు విని పరశురాముడు నవ్వుచు నాతో నిట్లనెను:

"భీష్మా! నీవు నాతో యుద్ధము చేయగోరుట చాల భాగ్యము. కురునందనా! చూడుము ఇప్పుడే నేను నీతో యుద్ధము చేయుటకు కురుక్షేత్రమునకు పోవుచున్నాను అక్కడకే రమ్ము. నీవు చెప్పినట్లే చేసెదను.

"అక్కడ నీవు నా చేత చంపబడి నూర్లకొలది నా బాణములు నీ శరీరము పైన గ్రుచ్చుకొని క్రింద పడియుండిన నిన్ను కాకులు - గ్రద్దలు రాబందులు తినుచుండగా నీ తల్లి గంగాదేవి చూచుగాక!

"దీనుడవై నేడు నా చేత చంపబడిన నిన్ను, సిద్ధ-చారణ సేవితురాలైన గంగాదేవి చూచి యేడ్చుగాక! మహాభాగురాలైన భాగీరథీదేవి యిట్టి పుత్రశోకమును అనుభవించుటకు తగదు. అయినప్పటికిని, నీవంటి దుర్మదాంధుడు - మూర్ఖుడునైన పుత్రుని కనినందుకు ఈ దుఃఖము ఆమె అనుభవించవలసియే యుండును. మదోన్మత్తా! భీష్మా! నాతో రమ్ము. రథాది యుద్ధ సామగ్రితో బయలుదేరుము.'

"దుర్యోధనా! శత్రునగరములను జయించు పరశురాముడు ఈ విధముగా చెప్పగనే, ఆయనకు నేను తలవంచి నమస్కరించి, అట్లే కానిమ్ము అని ఆయనతో యుద్ధము చేయుటకు ఆజ్ఞ తీసికొంటిని.

''దుర్యోధనా! పరశురాముడిట్లు నాతో చెప్పి, యుద్ధేచ్ఛతో కురుక్షేత్రమునకు పోయెను. తరువాత నేను హస్తినా పురములోనికి ప్రవేశించి, తల్లి సత్యవతీ దేవికి ఈ సమాచార మంతయు మనవి చేసితిని.

''రాజా! అప్పుడు నా తల్లి సత్యవతి నాకు మంగళకరములైన స్వస్తి వాచనాది వేదోక్తవిధులను చేయించి, నన్ను అభినందించెను.

''తరువాత నేను బ్రాహ్మణుల యాశీర్వాదములు గ్రహించి సుందరమైన వెండి రథమును ఎక్కితిని. ఆ రథమునకు తెల్ల గుఱ్ఱములు కట్టబడియుండెను.

దాని యందు యుద్ధమునకు అవశ్యకములైన వస్తువులన్నియు సుందరముగా అమర్చబడి యుండెను. రథము పైన పులితోలు కప్పబడియుండెను. యుద్ధముల యందు అనుభవముగల సుశిక్షితుడైన సారథి రథము నడపుటకు వచ్చెను. అతడు సత్కుల సంజాతుడు. అశ్వశాస్త్రపండితుడు. అశ్వములను అదుపులో నుంచుకొనగలవాడుగా నుండెను.

''దుర్యోధనా! నేను శ్వేతకవచము తొడిగికొని, తెల్లని ధనుస్సు ధరించి యుద్ధ యాత్రకు వెడలితిని. నా శిరస్సుపైన తెల్లని గొడుగు ఉండెను. ఇరు వైపుల తెల్లని చామరములు వీవబడుచుండెను. నా తలపాగ-వస్త్రములు-భూషణములు అన్నియు శ్వేతవర్ణములుగానే యుండెను.

''బ్రాహ్మణులు ఆశీర్వాదములు, స్తుతి పాఠకులు స్తోత్రములు చేయుచుండగా నేను కురుక్షేత్రము చేరితిని. నా రథాశ్వములు మనోవేగ వాయువేగములతో, నా సారథి తోలుచుండగా పోవుచుండెను.

''రాజా! నేను, పరశురాముడు యుద్ధ సన్నద్ధులమైతిమి. నేను పరశురాముని యెదుట నిలిచి నా శంఖమును బిగ్గరగా ఊదితిని.

"అక్కడ అనేక బ్రాహ్మణులు, వనవాసులైన తాపసులు, ఇంద్రాది దేవతలు మా యిరువురి దివ్యమైన యుద్ధము చూచుచుండిరి.

''తరువాత దివ్యమాల్యములు కనపడ జొచ్చెను. దివ్యవాద్యములు మ్రోగుచుండెను. మేఘములు ఆకాశమునందు గర్జిల్లుచుండెను. పరశురామునితో వచ్చిన తాపసోత్తములు సంగ్రామ రంగమును చుట్టియుండిరి.

''దుర్యోధనా! సమస్త ప్రాణుల హితమును గోరు నా తల్లి గంగాదేవి అప్పుడక్కడ ప్రత్యక్షమై నాతో నిట్లనెను:

''కొడుకా! నీవేమి చేయదలచితివి? నేను స్వయముగా జమదగ్నినందనుడైన పరశురాముని నీవు నీ శిష్యునితో యుద్ధము చేయకుము అని పలుసార్లు యాచించెదను. పుత్రా! నీవిట్టి పట్టుదల విడువుము. బ్రాహ్మణోత్తముడైన పరశురామునితో యుద్ధము చేయు హఠము నీకు మంచిది కాదు. క్షత్రియహంతయైన పరశురాముడు సాక్షాత్తు పరమేశ్వరునితో సమానుడని నీకు తెలియదా? ఇంత తెలిసి కూడ, నీ వాయనతో యుద్ధమునకు పూనితివా?

"దుర్యోధనా! అప్పుడు నేను చేతులు జోడించి గంగాదేవికి ప్రణామము చేసి ఆమెకు, కాశీరాజకన్యకల స్వయంవర వృత్తాంతము మొదలుకొని జరిగిన సమాచారమంతయు చెప్పి, నాకు పరశురామునకు జరిగిన సంవాదముగూడ చెప్పితిని.

''నా మాటలు విని గంగాదేవి పరశురాముని కడకుపోయి నన్నుక్షమింపుమని పరశురామునికోరి యతనితో నిట్లనెను:

"భృగునందనా! భీష్ముడు నీకు శిష్యుడు కాబట్టి, అతనితో నీవు యుద్ధము చేయకుము.''

''అది విని పరశురాముడు ఆమెతో నిట్లనెను:

''గంగాదేవీ! నీవు తొలుత భీష్ముని యుద్ధమునుండి నివారింపుము. అతడు నా యిష్టము ప్రకారము కార్యము చేయుట లేదు. అందుచేతనే నేను అతనిపై దాడి చేసితిని."

("జనమేజయా! అప్పుడు గంగాదేవి పుత్రప్రేమతో మరల భీష్మునికడకు పోయెను. ఆ సమయమునందు భీష్ముని నేత్రములు క్రోధముచేత ఎఱ్ఱబారియుండెను. అందుచేత అతడు గూడ తల్లిమాట అంగీకరించలేదు.)

"తరువాత మహాత్ముడైన పరశురాముడు ఎదుటకు వచ్చి యుద్ధమునకు నన్ను ఆహ్వానించెను."

ఆ విధముగా భీష్ముడు దుర్యోధనునకు చెప్పి తరువాత తనకు పరశురామునకు జరిగిన యుద్ధమును వర్ణించుచు తాను నవ్వుచు జామదగ్నితో నిట్లంటి ననెను.

భీష్మ-పరశురాముల యుద్ధము

''బ్రహ్మన్! నేను రథమునందు, నీవు భూమిపైన నున్నాము. ఇట్టి పరిస్థితిలో నీతో నేను యుద్ధము చేయజాలను. కాబట్టి నీవు నాతో యుద్ధము చేయదలచిన యెడల రథమెక్కి కవచాదులను ధరించుము.

''తరువాత పరశురాముడు మందహాసముల చేయుచు నాతో నిట్లనెను:

''భీష్మా! నాకు భూమియే రథము, నాలుగు వేదములు నా రథమునకు వాహనములుగా నున్న అశ్వములు. వాయుదేవుడే నా రథసారధి. వేదమాతలైన గాయత్రీ సావిత్రీ సరస్వతులు నాకు కవచము. ఈ యన్నింటితో సురక్షితుడనై యుద్ధము చేసెదను."

"దుర్యోధనా! యిట్లు చెప్పుచునే పరశురాముడు అన్ని వైపుల నుండి బాణవర్షము కురిపించి నన్ను ముంచెను

''కురురాజా! అప్పుడు పరశురాముడు సమస్త శస్త్రాస్త్రములతో శోభిల్లుచున్న అద్భుతమైన రథమునందుండుటను చూచితిని.

''ఆ రథము ఒక నగరమువలె విస్తారముగా నుండెను. ఆయన తన మానసిక సంకల్పముచేత ఆ రథమును నిర్మించియుండెను. అది సువర్ణ భూషితమై యుండెను. పరశురాముడు సూర్యచంద్ర చిహ్నములుగల సుందరమైన కవచము ధరించి యుండెను. చేతిలో దివ్యధనుస్సు వీపున అంబులపొది హస్తములకు ఉడుము తోలుతో చేయబడిన అంగుళిత్రాణములు (చేతి తొడుగులు) ధరించియుండెను. ఆయనకు ప్రియమిత్రుడు వేదవేత్తయునైన అకృతవ్రణుడు రథ సారధ్యము చేయుచుండెను.

''దుర్యోధనా! అప్పుడు పరశురాముడు 'రమ్ము - రమ్ము' అని నన్ను మాటిమాటికి యుద్ధమునకు ఆహ్వానించెను.

"అప్పుడు నా మనస్సు సంతోషోత్సాహముతో నుప్పొంగెను, అప్పుడు పరశురాముడు ఉదయకాల సూర్యునివలె తేజస్వియై ప్రకాశించుచుండెను.

''అజేయుడు, మహాబలపరాక్రమ సంపన్నుడు క్షత్రియవినాశకరుడునైన యతడు ఏకాకిగానే నాతో యుద్ధము చేయుటకు నిలిచియుండెను. అందుచేత నేను గూడ ఒంటరిగానే ఆయన నెదిరించుటకు పోయితిని.

''కురుపతీ! పరశురాముడు నాపైన మూడుసార్లు బాణప్రహారము చేసెను. అప్పుడు నా రథాశ్వములను ఆపి, ధనుస్సునుదించి, రథము దిగి, బ్రాహ్మణ శిరోమణి, మునిప్రవరుడు, విశేషించి నాకు గురువునైన పరశురాముని ఆదరించుటకొరకు పాదచారినై యాయన సమీపమునకుపోయి విధిపూర్వకముగా ప్రణామముచేసి యిట్లంటిని :

"భగవాన్! నీవు నాతోసమానుడవు, అథవా, అధిక శక్తిగలవాడవు. నీవు నాకు గురువు మాత్రమేకాక ధర్మాత్ముడవు. ఇప్పుడు నేను నీతో యుద్ధము చేసెదను. కనుక నీవు నా విజయము నకై ఆశీర్వదింపుము.

ఆ మాటకు పరశురాముడిట్లనెను:

"కురుశ్రేష్ఠా! తన ఉన్నతిని కోరు ప్రతి యోధుడు గూడ ఇట్లే వ్యవహరించవలెను. శ్రేష్ఠులైన తన గురువులతోపాటు యుద్ధముచేయు రాజులకు ఇదియే ధర్మము.

''రాజా! ఒకవేళ నీవు ఈ విధముగా నా వద్దకు రాకుండిన యెడల నీకు శాపమిచ్చియుండును.

''కురునందనా! నీవు ధైర్యముతో యుద్ధము చేయుము. నేనైతే నీ విజయమునకుగాను ఆశీర్వాదము చేయజాలను ఎందుకనగా, ఇప్పుడు నేను నిన్ను ఓడించుటకు నిలిచియున్నాను. రమ్ము, ధర్మపూర్వకముగా యుద్ధము చేయుము. నీ విప్పుడు నా యెడల చూపిన సత్ప్రవర్తనకు సంతసించితిని.'

''దుర్యోధనా! తరువాత నేను ఆయనకు నమస్కారము చేసి శీఘ్రముగా నా రథ మెక్కితిని. బంగారము తొడిగిన నా శంఖమును పూరించితిని.

''తరువాత-నేను పరశురాముడు పరస్పర జయేచ్ఛతో చాల దినములు యుద్ధము చేసితిమి. పరశురాముడే తొలుత నన్ను తీవ్రములైన తొమ్మిదినూర్ల అరువది బాణములతో కొట్టెను. నా నాలుగు అశ్వములను, సారథిని అడ్డగించెను.

"అయినను నేను ధైర్యముతో యుద్ధభూమియందు నిలిచియుంటిని. నేను బ్రాహ్మణులకు, దేవతలకు నమస్కారము చేసి, మందహాసము చేయుచు పరశురామునితో నిట్లంటిని:

''బ్రహ్మన్! నీవు నీ పరిమితిని మీరి నడచుచున్నప్పటికిన్ని నేను మాత్రము సర్వదా నీ యాచార్యత్వముపైన గౌరవముతో నున్నాను. ధర్మ సంగ్రహ విషయమునందు గల నా దృఢనిశ్చయము మరియొకసారి వినుము. నీ శరీరమునందుగల వేదములపైన, నీకు గల బ్రాహ్మణత్వముపైన, నీవు చేసిన మహాతపస్సుపైనను బాణప్రయోగము చేయను.

''రామా! నీవు అవలంబించిన క్షత్రియ ధర్మమునే నా బాణములతో కొట్టెదను. ఎందుకనగా, బ్రాహ్మణుడు ఆయుధములను ధరించినంతమాత్రము ననే క్షత్రియ భావమును పొందగలడు. ఇప్పుడు నీవు నా ధనుస్సు యొక్క శక్తిని, నా భుజబలమును చూడుము. వీరవరా! నా బాణములతో నీ ధనుస్సు నిప్పుడే ఛేదించెదను.

"తరువాద దుర్యోధనా! నా బాణముచేత పరశురాముని ధనుస్సు యొక్క అగ్రభాగము విరిచి ఆ ధనుస్సును క్రింద పడగొట్టితిని. అట్లే నూర్లకొలది బాణములను ఆయన రథముపైన ప్రయోగించితిని. అవి వాయువుచేత ప్రేరితములైన సర్పములవలె త్వరగా పోయి పరశురాముని శరీరమునకు తాకి, రక్తము గారునట్లుగా గాయపరిచి, ఆయన శరీరమునుండి దూరిపోయెను.

''అప్పుడాయన శరీరమునుండి రక్తము గారుచుండెను. వర్షాకాలమునందు మేరుపర్వతమునందలి గైరికాది ధాతువుల (పెక్కు రంగులుగల మూలికలు)తో మిశ్రితమైన జలమువలె, ఆయన శరీరము నుండి రక్తము ప్రవహించుచుండగా ఆయన శోభిల్లుచుండెను.

"రాజా! హేమంతఋతువు తరువాత వసంతమునందు ఎఱ్ఱని పూవుల గుత్తులతో ప్రకాశించుచున్న అశోకవృక్షమువలె, పుష్పించిన మోదుగుచెట్టువలెను పరశురాముడు శోభిల్లుచుండెను.

''రాజా! తరువాత పరశురాముడు మరియొక ధనుస్సు తీసికొని, క్రోధముతో నాపైన బాణవర్షము గురియింపదొడగెను. అనేక విధములైన ఆ పదునైన బాణములు నన్ను గాయపరచి, నా మర్మస్థానములను (కీళ్ళను) భేదింపజొచ్చెను. వాటి వేగము తీవ్రముగా నుండెను. ఆ బాణములు సర్పమువలె, అగ్నివలె, విషమువలె నుండెను. వాటిచేత నేను కంపించితిని.

''రాజా! అప్పుడు నేను దృఢముగా నిలచి కోపముతో పరశురామునిపైన నూర్లకొలది బాణములను ప్రయోగించితిని. అవి అగ్ని-సూర్య-విషసర్పములవలె భయంకరములుగా, తీక్ష్ణములుగా నుండెను.

''వాటిచేత పీడితుడై పరశురాముడు అచేతనునివలె ఆయెను. అప్పుడు నా మనస్సు దయతో కరగి, ఛీ! క్షత్రియధర్మమెంత క్రూరమైనది అని నన్ను ధిక్కరించుకొంటిని

''రాజా! అప్పుడు నాకు మిక్కిలి దుఃఖము కలిగి, ఆహా! క్షత్రియుడనైన నేను చాల పాపము చేసితిని. ధర్మాత్ముడు, బ్రాహ్మణుడునైన నా గురువును బాణములతో కొట్టి పీడించితిని గదా! అని విచారపడితిని.

"దుర్యోధనా! తరువాత నేను పరశురామునిపైన మరల బాణప్రయోగము చేయలేదు. సహస్రకిరణుడైన సూర్యభగవానుడు దినమంతయు భూమిని తపింపజేసి అస్తమించెను. అందుచేత ఆనాటి యుద్ధము అంతటితో ముగిసెను."

''జనమేజయా! అట్లు యుద్ధవృత్తాంతమును దుర్యోధనునకు చెప్పి భీష్ముడు తరువాతి సమాచార మిట్లు చెప్పదొడగెను:

"దుర్యోధనా! సమ్మానిత కార్యకుశలుడైన నా సారథి నా శరీరమునందు గుఱ్ఱముల శరీరములందు గ్రుచ్చుకొనిన బాణములను తీసివేసెను. గుఱ్ఱములను అక్కడక్కడ కొంచెముసేపు త్రిప్పి, వాటికి నీరు త్రాపి, గడ్డి, ఆహారము పెట్టి విశ్రమింపజేసెను.

"అందరు విశ్రమించిన తరువాత మరునాటి ప్రాతఃకాలమునందు మరల యుద్ధము మొదలాయెను. నేను రథము నందు కూర్చొని శీఘ్రముగా వచ్చుటను చూచి పరశురాముడు గూడ యుద్ధ సన్నద్ధుడై వచ్చెను అప్పుడు నేను ధనుస్సును విడిచి, రథము దిగి, ఆయనవద్దకు పోయి పూర్వమువలెనే నమస్కారము చేసి, తిరిగివచ్చి నా రథమెక్కి దృఢముగా ధైర్యముతో యుద్ధమునకు సిద్ధమైనితి.

"కురురాజా! మేము పరస్పరము బాణముల వర్షము కురియించితిమి. ఆయన కురిపించిన నిశిత బాణములను నేను ఆకాశమునందే నా భల్లబాణములతో చూర్ణము చేసితిని. ఇట్లు అనేక పర్యాయములు జరిగెను.

"తరువాత ఆయన ప్రయోగించిన దివ్యాస్త్రములన్నింటిని నా దివ్యాస్త్రములచేత నివారించితిని. అప్పుడాకాశమునందు కోలాహలమాయెను.

"నేనాయనపై వాయవ్యాస్త్రము ప్రయోగించితిని. దానిని పరశురాముడు గుహ్యకాస్త్రముచేత శాంతపరచెను.

''నేను ఆగ్నేయాస్త్రమును అభిమంత్రించి వేయగా నతడు వారుణాస్త్రముచేత దానిని చల్లార్చెను.

''ఈ విధముగా మేము పరస్పరము దివ్యాస్త్రములకు ప్రతిదివ్యాస్త్రములను ప్రయోగించుచు పోరాడుచుంటిమి.

''దుర్యోధనా! తరువాత పరశురాముడు నా యెడమ వైపుగా వచ్చి నా వక్షఃస్థలమునందు బాణముతో కొట్టగా నేను గాయపడి రథమునందు కూలబడి మూర్ఛిల్లితిని. నా సారథి రథమును దూరముగా తీసుకొని పోయెను. అట్లు నేను దూరముగా తీసుకొని పోబడుట చూచి, అకృతవ్రణుడు - అంబ మొదలైనవారు మిక్కిలి హర్షించుచు కోలాహలము చేసిరి.

''ఇంతలో నేను మూర్ఛనుండి తేరుకొని, వారికోలాహలము విని, సహింపజాలక, రథమును శీఘ్రముగా తోలుకొని పొమ్మనగా, సారథి నన్ను యుద్ధభూమికి తోడుకొని పోయెను.

'''దుర్యోధనా! అప్పుడు నేను క్రుద్ధుడుగానున్న పరశురాముని చూచి కుపితుడనై అనేక బాణవర్షముల నతని పై కురిపించితిని. నా ఒక్కొక్క బాణమును పరశురాముడు మూడు మూడు బాణములతో ఖండించెను.

''ఇట్లు నేను వేసిన శత సహస్ర బాణములన్నింటిని పరశురాముడు రెండుగావిరిచి పడవేయజొచ్చెను.

''అప్పుడు నేను ప్రళయకాలాగ్నితో సమానముగా జ్వలించుచున్న బాణమును ప్రయోగించితిని. ఆ దెబ్బతో పరశురాముడు గాయపడి మూర్ఛిల్లి భూమిపైన పడిపోయెను.

''అట్లు అతడు పడగనే, ఆకాశమునుండి సూర్యుడు రాలి పడినట్లుగా హాహాకారముచేయుచు ప్రపంచమంతయు మిక్కిలి బీతిల్లెను.

''కురునందనా! అప్పుడు అకృతవ్రణుడు - అంబ మొదలైన పరశురాముని అనుచరులందరు అతనికడకు పోయి శీతలోపచారము చేసి అతనిని అశ్వాసించిరి.

''తరువాత పరశురాముడు మూర్ఛదేరి, 'భీష్మా! నిలువుము - ఇప్పుడు నీవు చచ్చితివి అని అరచుచు ధనుర్బాణములు ధరించి పదునైన బాణములతో నాకుడి పార్శ్వమును కొట్టెను. ఆ దెబ్బతో నేను ఉద్వేగము చెంది వృక్షమువలె ఊగితిని.

''అప్పుడు పరుశురాముడు క్రుద్ధుడై నా యశ్వములను బాణ ఘాతముల చేత చంపెను. నాపైన బాణములు కురిసెను.నేను గూడ నా నిశిత బాణములతో కొట్టుచు ఆయన గమనమును ఆపితిని. మా యిరువురి బాణములు ఆకాశమునందే ఒండొంటిని ఒరసికొనుచు నిలిచిపోయెను.

''దుర్యోధనా! మా బాణములచేత కప్పబడి సూర్యుడు తపించుట మానెను. వాయుగమనము గూడ మేఘావరుద్ధమైనట్లు ఆగిపోయెను.

తరువాత వాయు కంపము చేత, సూర్యకిరణముల చేతను బాణములు ఒరసికొని దానినుండి అగ్ని ఉత్పన్నమాయెను. ఆ బాణములు, వాటి సంఘర్షముచేత పుట్టిన అగ్నిచేత కాలి భస్మమై భూమిపైన బడెను.

''కౌరవేశ్వరా! అప్పుడు పరశురాముడు అతిక్రుద్ధుడై నాపైన అతి వేగముగా,పదివేలు - లక్షలు - పది లక్షలు - కోట్లు - పది కోట్లు - నూరుకోట్లు తీక్ష్ణబాణములు ప్రయోగించి నన్ను కొట్టెను.

''రాజా! నేనా బాణములనన్నింటిని విషసర్పములవంటి నా బాణముల చేత ఖండించి వృక్షములనువలె భూమిపైన బడగొట్టితిని.

ఆ విధముగా యుద్ధము జరుగుచుండగనే సాయంకాలమాయెను. అప్పుడు నా గురువు యుద్ధభూమి విడిచి పోయెను.

''జనమేజయా! భీష్ముడు దుర్యోధనున కట్లు యుద్ధ సమాచారము చెప్పి తరువాతి యుద్ధ వృత్తాంతమిట్లు చెప్పదొడగెను:

''భరతశ్రేష్ఠా! ఆ మరునాడు పరశురామునితో నాకు మరల అతి భయంకరమైన యుద్ధము జరిగెను.

ప్రతిదినము పరశురాముడనేక దివ్యాస్త్రములను నాపైన ప్రయోగింప జొచ్చెను. నేను గూడ ప్రాణములపైన ఆశవిడిచి, పరశురాముని అస్త్రములనన్నింటిని నా క్రూరాస్త్రముల చేత నష్టపరచితిని.

''ఇట్లు ఆయన యస్త్రములన్నియు నష్టములగుట చూచి చాల క్రుద్ధుడై యముడు విడిచిన కౌరవివలెనున్న శక్తిని నాపైన ప్రయోగించెను. దాని కొన మండుచుండెను. దాని తేజస్సు ప్రపంచమంతట వ్యాపించి యుండెను.

"దుర్యోధనా! అప్పుడు నేను, ప్రళయ కాల సూర్యునివలె జ్వలించుచు నాపైన పడుచున్న శక్తిని అనేక బాణములు ప్రయోగించి మూడు ముక్కలుగా ఖండించి భూమిపై బడవేసితిని. తరువాత పవిత్ర సుగంధ యుక్తమై వాయువు వీచెను.

"కురుపతీ! అట్లు శక్తి ఖండింపబడుట చూచి పరశురాముడు మిక్కిలి క్రుద్ధుడై ఒకటి వెంట ఒకటిగా పన్నెండు శక్తులను నా పైన ప్రయోగించెను. వాటి అమిత తేజస్సును, వేగమును వర్ణించుటకు సాధ్యము కాదు. ప్రళయ కాలమునందు పన్నెండు గురు సూర్యులు ఒకేసారి జ్వలించుచున్నట్లు మండుచు, ఆ శక్తుల నుండి వెడలిన అగ్ని అనేక రూపములు దాల్చి ఆ శక్తులు అన్ని వైపులనుండి మండుచు వచ్చుచుండుట చూచి, నా అవయవములు స్వాధీనము దప్పి నేను మిక్కిలి విహ్వలుడనైతిని.

"రాజా! అప్పుడు నేను ఆ బాణములను నా బాణ జాలము చేత భిన్న భిన్నము చేసి, పన్నెండు బాణములను ప్రయోగించి ఆ పన్నెండు శక్తులను నశింపజేసితిని.

"రాజా! తరువాత పరశురాముడు, సువర్ణ దండములు గల అనేక భయంకర శక్తులను నాపై ప్రయోగించెను. అవి చాలా విచిత్రములుగా నుండెను. వాటిపైన సువర్ణ పత్రములు చెక్కబడియుండెను. అవి, జ్వలించుచున్న పెద్ద కొరవులవలె కనపడుచుండెను. ఆ శక్తులన్నింటిని నా డాలుతో అడ్డగించి ఖడ్గముతో ఖండించితిని.

"రాజా! తరువాత నేను పరశురాముని దివ్యాశ్వముల పైన, సారథిపైన దివ్యములైన బాణములను ప్రయోగింప జొచ్చితిని.

"కుబుసముల నుండి విడిపడిన విష సర్పముల వంటి అతని శక్తులన్నియు ఛేదింపబడుట చూచి, హైహయవంశ నాశకుడైన మహాత్ముడు పరశురాముడు మిక్కిలి కుపితుడై తన దివ్యాస్త్రమును ప్రయోగించెను. ఆ యస్త్రము నుండి మిడుతలవలె అనేక బాణములు జ్వలించుచు వచ్చి నన్ను, సారథిని, రథమును కప్పి వేసెను.

"రాజా! అప్పుడు నా రథము నలువైపుల ఆ బాణములచేత వ్యాప్తమయ్యెను. అశ్వములు - సారథి గూడ బాణాచ్ఛాదితము లాయెను. నా రథము యొక్క నొగలు ఇరుసు ఖండింపబడెను.

"ఆయన బాణ వర్షము సమాప్తమైనప్పుడు, నేను గూడ, నా గురుదేవుని పైన అనేక బాణ వర్షములను గురిపించితిని. వాటిచేత, వేద రాశియైన పరశురాముడు గాయపడెను. ఆయన శరీరము నుండి రక్తధారలు ప్రవహించుచుండెను.

"రాజా! యిట్లు మేమిరువురము బాణాఘాతముల చేత గాయపడితిమి. అప్పుడు సూర్యుడు అస్తమించెను. యుద్ధము నిలిపితిమి.

''మరునాడు సూర్యోదయమునందు మరల మేము యుద్ధమారంభించితిమి

''పరశురాముడు రథమునందు స్థిరముగా నిలిచి నాపైన, పర్వతముపై మేఘము వర్షధారలు కురిసినట్లు, బాణవర్షము కురిపించెను.

"అప్పుడు నా మిత్రుడైన సారథి బాణపీడితుడై రథమునుండి క్రింద పడెను. అప్పుడు నేను చాల దుఃఖించితిని. సారథి బాణఘాతముల చేత మూర్ఛిల్లెను.

"తరువాత రెండు గడియలలోనే నా సారథి ప్రాణ త్యాగము చేసెను. అప్పుడు నేను చాలా భయపడితిని. అతడు చనిపోయిన తరువాత నేను చాల కలవరపడుచునే పరశురాముని బాణములను ఛేదించుచుంటిని.

"రాజేంద్రా! అంతలోనే పరశురాముడు మృత్యువుతో సమామైన బాణమును నాపై విడిచెను. నా సారథి మరణము చేత మిక్కిలి వ్యాకులత్వము చెందుచున్నప్పటికి, పరశురాముడు నన్ను నిశిత బాణములతో కొట్టుచుండెను. రాజా! రక్తపానము చేయునట్టి పరశురాముని బాణమొకటి నా యెదపై తాకి నన్ను భూమిపైన పడవేసెను.

"రాజా! అప్పుడు పరశురాముడు నేను మరణించితినని తలచి, మేఘము వలె బిగ్గరగా గర్జిల్లెను. ఆయన దేహముపైన పులకాంకురములు మొలచెను. ఆయన ప్రసన్నుడై తన అనుచరులతో పాటు మిక్కిలి కోలాహలము చేసెను.

"అక్కడ నా ప్రక్కనున్న కురువీరులు, యుద్ధము చూచుటకు వచ్చిన యితర జనులు, నేను క్రిందపడినది చూచి మిక్కిలి దుఃఖించిరి.

"రాజా! నేను పడిపోవునపుడు సూర్యాగ్ని సమానులైన యెనమండుగురు బ్రాహ్మణులు సంగ్రామభూమిలో నన్ను చుట్టుకొని తమ భుజములపైన ఎత్తికొని నిలిచియుండుట చూచితిని. దానితో నా శరీరమునకు భూమిస్పర్శ కాలేదు.

"నా సోదరులు-బంధువులవలె ఆ బ్రాహ్మణులు నన్ను ఆకాశమునందే ఆపి యుంచిరి. రాజా! ఆకాశమునందు నేను శ్వాసవిడుచుచు నిలిచియుంటిని. వారు నాపైన జలబిందువులను చిలుకరించి, నన్ను పట్టుకొని "గంగానందనా! నీకు మంగళమగుగాక! భయపడకుము' అని నాతో ననిరి.

"దుర్యోధనా! ఆ బ్రాహ్మణుల వచనామృతము చేత నేను సంతృప్తి చెంది, త్వరగాలేచి నిలిచి చూతునుగదా, అప్పుడు నా రథసారథి స్థానము నందు, నదీశ్రేష్ఠురాలైన నా తల్లి గంగాదేవి కూర్చొనియుండెను. ఆమె పాద స్పర్శచేసి నమస్కరించి, పితృదేవతలను తలచి వారికిన్ని నమస్కారము చేసి మరల రథముపైన కూరుచుంటిని.

"రాజా! నా తల్లి గంగాదేవి, నా రథములను, అశ్వములను, ఇతర సామగ్రిని రక్షించెను. అప్పుడు నేను చేతులు జోడించి యామెకు మరల నమస్కారము చేసితిని.

"దుర్యోధనా! తరువాత నేను స్వయముగా కళ్ళెములు పట్టుకొని వాయు వేగములైన యశ్వములను అదుపులో నుంచుకొని, పరశురామునిపైన బాణములను విడిచితిని. అప్పుడు సాయంకాలమగుచుండెను.

"రాజా! అప్పుడు నేను ఒక ప్రబలమైన బాణము పరశురామునిపై ప్రయోగించితిని. అది ఆయన హృదయమును చీల్చునదిగా నుండెను. ఆ బాణ ఘాతముచేత నతడు పీడితుడై మూర్ఛిల్లి, ధనుస్సు విడిచి భూమిపైన పడెను.

"అనేక సహస్ర బ్రాహ్మణులకు దానము చేయు పరశురాముడు నేలపైన పడినప్పుడు, అత్యధిక రక్తమును కురియుచు మేఘములు ఆకాశమును కప్పివేసెను.

"దుర్యోధనా! అప్పుడు పిడుగులు పడినట్లు ధ్వనించుచు నూర్లకొలది ఉల్కలు (కొరవులు) ఆకాశము నుండి పడజొచ్చెను. భూకంపము కలిగెను. సూర్యభగవానుని రాహువు అన్నివైపుల నుండి చుట్టెను. సుడిగాలి తీవ్ర వేగముతో వీచెను. భూమి చలించెను. గ్రద్దలు - కాకులు - రాబందులు సంతోషముతో అన్నివైపుల ఎగురుచుండెను. దిక్కులు మండ జొచ్చెను. గ్రద్దలు మాటిమాటికి భయంకరముగా కూయుచుండెను. దుందుభులు వాయింపబడకయే బిగ్గరగా తమంతట మ్రోగజొచ్చెను.

"రాజా! ఆ విధముగా మహాత్ముడైన పరశురాముడు మూర్ఛిల్లి నేలపైన పడిన వెంటనే, ఉత్పాత సూచకములు - అతి భయంకరములునైన అపశకునములు అనేకములు కలిగెను.

"కురునందనా! ఆ సమయమునందే పరశురాముడులేచి క్రోధమూర్ఛితుడై మరల యుద్ధము చేయుటకు నా సమీపమునకు వచ్చెను.

"ఆయన తాటిచెట్టు ప్రమాణము గల పెద్ద ధనుస్సునందు ఎక్కుబెట్టబడిన బాణమును నాపై విడువజూచునపుడు దయాళువులైన మహర్షులు ఆయనను ఆపిరి. ఆ బాణము ప్రళయకాలాగ్నివలె భయంకరముగా నుండెను. అప్రమేయ స్వరూపముగల భార్గవ రాముడు కుపితుడైయుండి కూడ, ఋషుల మాటలు విని ఆ బాణమును ఉపసంహరించెను.

''రాజా! తరువాత సూర్యుడు అస్తమించెను రాత్రి వచ్చెను. శీతల వాయువు సుఖముగా వీవదొడగెను. అప్పుడు మేమిరువురము యుద్ధము ఆనాటికి ముగించితిమి.

''దుర్యోధనా! ఆ విధముగా మేమిద్దరము ప్రతి దినము సూర్యోదయము నందు యుద్ధమారంభించి, సాయంకాలమునందు ముగించుచుంటిమి. ఇట్లు ఇరువది మూడు దినములు గడచెను.

భీష్మునకు అష్టవసువులు ప్రస్వాపనాస్త్ర మిచ్చుట

''రాజా! ఆ రాత్రి నేను ఏకాంతము నందు శయ్యపైన పరుండి, బ్రాహ్మణులను పితృదేవతలను - దేవతలను - రాక్షసులను - భూతములను - రాజర్షి గణమును స్మరించి, వారికి తలవంచి, నమస్కరించి మనస్సునందే నేనీ విధముగా చింతింప దొడగితిని :

''చాల దినములుగా నేను పరశురామునితో అనిష్ట కారకమైన భయంకర యుద్ధము చేయుచున్నాను. ఆయనను నేను ఏ విధముగా గూడ జయింప జాలకున్నాను. నాకు జయమే కలుగవలసినచో ఈ రాత్రి స్వప్నమునందు నాకు దేవతలు దర్శనమిచ్చెదరు గాక!

''రాజా! నే నిట్లు తలచి నిద్రించితిని. ప్రభాతకాలము నందు కుడివైపు తిరిగి పండుకొని యుండగా స్వప్నమునందు, నేను రథమునుండి పడుచున్నప్పుడు నన్ను క్రిందపడనీయకుండ ఎత్తిపట్టుకొనిన యెనమండుగురు బ్రాహ్మణులు దర్శనమిచ్చి నాతో నిట్లనిరి :

''గంగానందనా! లెమ్ము. భయపడకుము. మేము నిన్ను రక్షించెదము. ఎందుకనగా, నీవు మా స్వరూపుడవే. పరశురాముడు నిన్నే విధముగా గూడ యుద్ధమునందు జయింపజాలడు. నీవే యతనిని జయించెదవు.

''కురువీరా! ఇది 'ప్రస్వాపనము' అను నస్త్రము. దీనికి దేవత ప్రజాపతి. విశ్వకర్మ యీ యస్త్రమును ఆవిర్భవింపజేసెను. ఇది నీకు గూడ ప్రియమైనదే. దీనిని ప్రయోగించు విధానము నీకు స్వయముగానే తెలియగలదు.

''ఎందుకనగా, పూర్వజన్మమునందు నీకు గూడ దీనిని గూర్చిన జ్ఞానము పూర్తిగా నుండెను. ఈ ప్రస్వాపనాస్త్రమును గూర్చి పరశురామునకు గూడ తెలియదు. భూమండలమునందెక్కడను, ఎవ్వరికిని ఈ యస్త్రమును గూర్చి తెలియదు.

''రాజా! ఈ యస్త్రము నీవు స్మరించినంత మాత్రమున నీ వద్దకు వచ్చును. దీనిని ప్రయోగించుము.

''భీష్మా! ఈ యస్త్రప్రభావముచేత నీవు రాజులందరిని శాసించగలవు. ఈ యస్త్రము చేత పరశురాముడు నశించడు. కనుక రాజా! ఈ యస్త్రము ప్రయోగించుట చేత నీకు ఏమాత్రము పాపము అంటదు. ఈ యస్త్రప్రయోగము చేత పరశురాముడు కదలక మెదలక నిద్రించుచు పడియుండును.

''రాజా! నీకు ప్రియమైన యీ యస్త్రముచేత నీవు సంపూర్ణముగా విజయము సాధించిన తరువాత సంబోధనాస్త్రము చేత మరల పరశురాముని మేల్కొల్పగలవు.

''కౌరవ్యా! రేపు ఉదయమే రథమెక్కి నీవు యుద్ధభూమిలో ఈ విధముగానే చేయుము. ఎందుకనగా, చచ్చినవాడు - నిద్రించినవాడు ఇరువురుగూడ మా దృష్టిలో సమానులే.

''రాజా! పరశురామునకు మృతువు ఎప్పుడుగూడ కలుగదు. కనుక ఈ ప్రస్వాపనాస్త్రము అతనిపై ప్రయోగింపుము.'

''దుర్యోధనా! అట్లు నాకు స్వప్నమునందు, బ్రాహ్మణరూపములో వచ్చిన అష్టవసువులు చెప్పి అంతర్ధానము చెందిరి. ఆ యెనమండుగురు సమాన రూపములు గలవారై మహాతేజస్వులుగా కనపడుచుండిరి.

''రాజా! ప్రాతఃకాలమునందు నేను మేల్కొని స్వప్నవృత్తాంతము తలచుకొని మిక్కిలి సంతోషించితిని.

''తరువాత నాకు - పరశురామునకు భయంకర యుద్ధము జరిగెను. అది అత్యద్భుతముగా నుండెను. ప్రాణులందరికి ఆ యుద్ధము చూచి పులకలు పొడమెను. పరశురాముడు నాపైకురిపించిన బాణపరంపరలను నా బాణములచేత నివారించితిని. అప్పుడు మహాతపస్వియైన పరశురాముడు మిక్కిలి కుపితుడై శక్తిని ప్రయోగించెను.

''రాజా! ఆ శక్తిస్పర్శ నాకు ఇంద్రుని వజ్రాయుధస్పర్శవలె బాధాకరముగా నుండెను. దాని కాంతి యమదండకాంతివలె నుండెను. అగ్ని సమానమైన ఆ శక్తి జ్వలించుచు అన్ని దిక్కుల రక్తము నాకుచున్నదా యనునట్టు గోచరించెను.

''ఆకాశమునందలి నక్షత్రమువలె ప్రకాశించుచున్న ఆ శక్తి వచ్చి నా భుజసంధులకు తాకెను. ఆ దెబ్బచేత నా శరీరమునుండి భయంకరముగా రక్తము పొరఁజొచ్చెను. అది పర్వతమునుండి గైరికాది ధాతువులతో మిశ్రితమైన జలము ప్రవహించుచున్నట్లుండెను.

''రాజా! అప్పుడు నేను గూడ కుపితుడనై భయంకరముగా విషము గ్రక్కుచున్న మృత్యువువంటి బాణమును పరశురామునిపై విడిచితిని. అది పరశురాముని లలాటమును గాయపరచెను. దానిచేత నతడు ఉదయరాగ రంజితమైన శిఖరముతో ప్రకాశించుచున్న పర్వతమువలె శోభిల్లునుండెను.

''పరశురాముడు అతి కోపావిష్టుడై విషసర్పమువంటి బాణము ప్రయోగించెను. అది నా యెదను దాకెను. దానిచేత మిక్కిలి నెత్తురు గారెను. నేను నేలపై పడితిని.

''మూర్ఛదేరి నేను జ్వలించుచున్న పిడుగువంటి శక్తిని పరశురామునిపై ప్రయోగించితిని. అది యతని భుజములమధ్య తాకెను. ఆ దెబ్బచేత నతడు దిక్కుతోచక వణకెను.

''రాజా! అప్పుడు అతని మిత్రుడు మహాతపస్వియైన అకృతవ్రణుడు పరశురాముని కౌగిలించుకొని మంచిమాటలతో నూరడించెను.

''తరువాత పరశురాముడు క్రుద్ధుడైన నాపైన పరమోత్తమమైన బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను. దానిని నివారించుటకు నేనుగూడ అట్టి బ్రహ్మాస్త్రమునే విడిచితిని. నా యస్త్రము జ్వలించుచు పైకి లేచెను.

''దుర్యోధనా! మా యిరువురి బ్రహ్మాస్త్రములు మాకు తాకకుండానే రెండుగూడ ఆకాశమునందు ఒండొంటిని దాకుచుండెను. ఆకాశమంతటను అగ్నిజ్వాలలు రేగెను. దానిచేత ప్రపంచవాసులందరు మిక్కిలి బాధపడిరి. ఋషులు-గంధర్వులు దేవతలుగూడ ఆ బ్రహ్మాస్త్రముల తేజస్సుచేత మిక్కిలి పీడితులై తపించిరి. అదియొక విషాద సంఘటనముగా నుండెను.

''రాజా! అప్పుడు ఆకాశము మండుచుండెను. దిక్కులన్నిటను పొగ జుట్టుకొనెను. పర్వతములు-అడవులు-వృక్షములతోపాటు భూమి కంపించెను. ఆకాశమునందు చరించు ప్రాణులుగూడ నక్కడ నిలువజాలకుండెను.

''తరువాత రాజా! సమస్త ప్రపంచమునందు దేవ-దానవులతో సహితముగా హాహాకారము రేగెను.

''అప్పుడు ఇదియే సరియైన సమయమని తలచి నేను 'ప్రస్వాపనాస్త్రము' ప్రయోగింపబూనితిని. వెంటనే నాకు అష్టవసువులు చెప్పినట్లు ఆ విచిత్రాస్త్రము మనస్సునందు స్ఫురించెను.

భీష్మ పరశురాముల యుద్ధసమాప్తి

''రాజా! తరువాత 'భీష్మా! ప్రస్వాపనాస్త్రము ప్రయోగింపకుము' అని ఆకాశమునందు మహాకోలాహలము రేగెను. అయినను ఆ యస్త్రమును నేను ధనుస్సునందు సంధించి పరశురామునిపై గురిపెట్టితిని.

''అప్పుడు నారదుడు వచ్చి నాతో నిట్లనెను:

''కురునందనా! ఆకాశమునందు దేవతలందరు నిలిచియున్నారు. వారు 'ప్రస్వాపనాస్త్రము విడువకుము' అని నిన్ను నివారించుచున్నారు.

''పరశురాముడు తపస్వి, బ్రాహ్మణభక్తుడు, బ్రహ్మవేత్త, బ్రాహ్మణుడు, మీదు మిక్కిలి నీకు గురువు. నీవు ఎట్టి పరిస్థితిలోను అతనిని అవమానించ గూడదు.

''దుర్యోధనా! అప్పుడు ఆకాశమునందు నిలిచియున్న అష్టవసువులవైపు దృష్టిసారించితిని. వారు మందహాసము చేయుచు మెల్లమెల్లగా నాతో నిట్లనిరి:

''భరతశ్రేష్ఠా! నారదుడు చెప్పినట్లే చేయుము. నీవు ప్రస్వాపనాస్త్రము ప్రయోగింపకుండుటయే సమస్త ప్రపంచమునకు పరమ మంగళదాయకమగును.'

''అప్పుడు నేను ఆ యస్త్రమును ఉపసంహరించుకొని విధి పూర్వకముగా బ్రహ్మాస్త్రమునే ప్రకాశింపజేసితిని.

''రాజా! అప్పుడు నేను ప్రస్వాపనాస్త్రమును ఉపసంహరించుట చూచి పరశురాముడు మిక్కిలి ప్రసన్నుడాయెను.

"అప్పుడు ఆయన నోటినుండి హఠాత్తుగా 'మంద బుద్ధియైన నన్ను భీష్ముడు జయించెను' అను వాక్యము బయలు వెడలెను.''

''రాజా! తరువాత పరశురాముడు తన తండ్రి జమదగ్నిని, తాత ఋచీకమహామునిని చూచెను. అతని పితృదేవతలందరు అతని నలువైపుల చుట్టి ఊరడించుచు నిట్లనిరి:

"నాయనా! ఇక నెప్పుడు గూడ ఇట్టి సాహసము చేయకుము. భీష్మునితోనేకాక, మరియే క్షత్రియులతో గూడ నికపైన యుద్ధము చేయుటకు నీకు తగదు.''

''భృగునందనా! క్షత్రియులకు యుద్ధము చేయుట స్వధర్మము. కాని బ్రాహ్మణులకు వేదాధ్యయనము - ఉత్తమ వ్రత నియమపాలనము పరమ ధర్మము. ఈ విషయము పూర్వము నీకు తెలిపి యుంటిమి. ఆయుధము నెత్తుట అతి భయంకర కర్మము. నీకు అనర్హమైన కార్యమునే చేసితివి.

'పరశురామా! ఇంతదాక నీవు భీష్మునితో యుద్ధము చేసి, అనేక విధ్వంసక కార్యములు చేసితివి. ఇదియే యెక్కువ. ఇక నీవు ఈ యుద్ధభూమి నుండి తొలగిపొమ్ము.

''భృగునందనా! నీకు మంగళమగు గాక! నీవు ధనుస్సు నెత్తుటయే చాలును. ఇప్పుడు ధనుస్సు విడువుము. చూడుము. దేవతలందరు భీష్మునిగూడ యుద్ధము నుండి నివారించిరి. వారతనితో నిట్లనుచున్నారు, వినుము:

''గంగానందనా! యుద్ధము చాలింపుము. పరశురాముడు నీ గురువు. నీ వతనితో మాటిమాటికి యుద్ధమునందు జయించుట నీకు ఎప్పుడు గూడ న్యాయము కాదు. భీష్మా! ఈ యుద్ధభూమి యందు నీ బ్రాహ్మణ గురువును గౌరవింపుము.'

''పుత్రా! పరశురామా! మేము నీ గురువులము, ఆదరింపదగిన పితృ దేవతలము. అందుచేత నిన్ను నివారించుచున్నాము. పుత్రా! భీష్ముడు అష్టవసువులలో నొకడు. అతనితో యుద్ధము చేసి నీవింతదాక బ్రతికినదే పరమ సౌభాగ్యమని తలచుము.

''పుత్రా! శాంతను మహారాజునుండి గంగాదేవికి పుట్టిన యీ భీష్ముడు సాక్షాత్తు వసువుగానే తెలిసికొనుము. ఇతనిని నీవెట్లు జయింపగలవు? కనుక నీవు యుద్ధము విరమించుకొని పొమ్ము.

''పుత్రా! ప్రాచీన సనాతన దేవత, వీరవరుడు, భగవంతుడునైన నరుడు ఇంద్రునకు పుత్రుడై పాండవశ్రేష్ఠుడైన అర్జునుడుగా నవతరించనున్నాడు. అతడు పరాక్రమ సంపన్నుడై మూడు లోకములందు గూడ 'సవ్యసాచి' యను పేరుతో ప్రఖ్యాతుడు కానున్నాడు. బ్రహ్మదేవుడు భీష్ముని మృత్యువునకు అతనినే కారణముగా నిర్ణయించి యున్నాడు.'

''దుర్యోధనా! పితృదేవతలట్లు ఉపదేశించిన తరువాత పరశురాముడు వారితో నిట్లనెను:

''పితరులారా! నేను యుద్ధమునందు వెన్ను చూపను. ఇది నేను చిరకాలమునుండి ధరించిన వ్రతము. ఇంతకుముందు గూడ నేను ఏ యుద్ధమునందున్ను వెన్నుచూపి పోవలేదు. పితామహులారా! మీరు మీ యిచ్ఛ వచ్చినట్లు తొలుత భీష్మునే యుద్ధమునుండి ఆపుడు. ఎట్టి పరిస్థితిలో గూడ నేను యుద్ధము నుండి వెనుదిరుగువాడను కాను.'

''దుర్యోధనా! అప్పుడు ఋచీకాది మునీశ్వరులు నారదునితోపాటు నాకడకు వచ్చి యిట్లనిరి:

'''భీష్మా! నీవే యుద్ధమునుండి తిరిగి పొమ్ము. బ్రాహ్మణోత్తముడైన పరశురాముని గౌరవింపుము.''

"దుర్యోధనా! ఆ మాటలకు వారితో నేనిట్లంటిని:

''మహర్షులారా! క్షత్రియధర్మమును దృష్టిలోనుంచుకొని చెప్పుచున్నాను. వీపుపైన బాణముల దెబ్బలు తినుచు ఎప్పుడు గూడ నేను యుద్ధమునుండి వెనుదిరిగి పోవను. ఈ నావ్రతము ప్రపంచమంతట ప్రసిద్ధమై యున్నది.

''నేను లోభము - పిరికితనము - దీనత్వము - లేక ఏ స్వార్థముచేతకాని క్షత్రియుల సనాతన ధర్మములను విడువజాలనను విషయము నిశ్చితమై యున్నది.'

''ఆ మాట చెప్పి నేను పూర్వమువలెనే ధనుర్బాణములను తీసికొని, దృఢనిశ్చయముతో యుద్ధభూమియందు గట్టిగా నిలిచితిని.

''రాజా!

''రాజా! అప్పుడు నారదాది మహర్షులు, నా తల్లి గంగాదేవి అందరు గూడ ఆ యుద్ధభూమి యందు ఒకచోట చేరి పరశురాముని కడకుపోయి ఆయనతో నిట్లనిరి:

''భృగునందనా! బ్రాహ్మణుల హృదయము వెన్నవలె కోమలముగా నుండును. కాబట్టి శాంతుడవు కమ్ము. పరశురామా! ఈ యుద్ధము నుండి తిరిగి పొమ్ము, నీచేత భీష్ముడుకాని, భీష్మునిచేత నీవు కాని చంపబడుటకు యోగ్యులు కారు.'

''అట్లు చెప్పచు వారందఱు రణభూమిని చుట్టుకొనిరి, పితృదేవతలు పరశురాముని చేతినుండి అస్త్రశస్త్రములు క్రింద పెట్టించిరి.

"ఆ సమయమునందే నేను మరల ఆకాశమునందు గ్రహములవలె వెలుగుచున్న అష్టవసువులను చూచితిని. యుద్ధభూమియందు దృఢముగా నిలిచియున్న నాతో వారు ప్రేమ పూర్వకముగా నిట్లనిరి:

''భీష్మా! నీవు నీ గురువైన పరశురాముని వద్దకు పోయి ప్రపంచమునకు శుభము చేకూర్చుము.'

''తన పితరుల ఉపదేశము చేత పరశురాముడు యుద్ధము నుండి నివృత్తుడగుటను చూచి నేను గూడ లోక కల్యాణార్థమై మహర్షుల మాటను అంగీకరించితిని.

''దుర్యోధనా! తరువాత నేను పరశురాముని కడకుపోయి ఆయన చరణములకు ప్రణామము చేసితిని. అప్పుడు నా శరీరమంతయు చాల గాయపడియుండెను. మహాతపస్వియైన పరశురాముడు నన్ను చూచి మందహాసము చేసి ప్రేమ పూర్వకముగా నిట్లనెను:

''భీష్మా! ప్రపంచమునందు ఏ క్షత్రియుడు కూడ నీతో సమానుడు లేడు. ఇక నీవు పోవచ్చును. ఈ యుద్ధమునందు నీవు నన్ను మిక్కిలి సంతోషపరచితివి.

''తరువాత పరశురాముడు నా సమక్షమునందే అంబను పిలిచి ఆ మహాత్ములందరి మధ్య ధైర్యముతో ఇట్లనెను:

''అమ్మా! నేను నా శక్తినంతయును పయోగించి నీ కొఱకు యుద్ధము చేసి నా పౌరుషమంతయు చూపించితిని. ఇక్కడ వీరందఱు కూడ ఆ విషయము ప్రత్యక్షముగ చూచిరి.

"కాని, ఈ విధముగ నేను సర్వోత్తమములైన నా అస్త్రశస్త్రములను ప్రయోగించి కూడ ధనుర్ధారులలో శ్రేష్ఠుడైన భీష్మునికంటే అధిక శక్తిని చూపించజాలక పోయితిని. ఇదియే నా యొక్క అధికాధికమైన శక్తి, అధికాధికమైన బలము కూడ నిదియే.

''కల్యాణీ! ఇప్పుడు నీ యిచ్ఛవచ్చిన చోటికి పొమ్ము అథవా నీ కార్యమింక నేదైన నున్నచో తెలుపుము, చేసెదను.

"ఇప్పుడు నీవు భీష్ముని శరణు వేడుము. నీకు ఇంతకన్న మరి వేరొక గతి లేదు. ఎందుకనగా' మహాశస్త్రాస్త్రములను ప్రయోగించి భీష్ముడు నన్ను జయించెను.'

''అట్లు చెప్పి పరశురాముడు దీర్ఘముగా విశ్వసించి మాట్లాడకుండెను. అప్పుడు రాజకన్యకయైన అంబ పరశురామునితో నిట్లనెను:

''భగవన్! నీవు చెప్పినది సరియే. వాస్తవముగా భీష్ముడు యుద్ధమునందు దేవతలకు కూడా అజేయుడు. నీవు పూర్తిగా నీ శక్తిని వినియోగించి ఉత్సాహముతో నాకై పోరాడితివి. భీష్ముడు దప్ప మరి యితరులెవరు గూడ నిలువరించజాలని పరాక్రమమును చూపితివి. అనేక దివ్యాస్త్రములను గూడ ప్రయోగించితివి. కాని, చివరకు నీవు భీష్మునికంటే విశిష్టమైన శక్తిని చూపించజాలక పోయితివి. నేను గూడ ఇప్పుడు ఏ పరిస్థితిలోను భీష్మునివద్దకు పోజాలను. మహాత్మా! నేనిప్పుడు యుద్ధమునందు భీష్ముని సంహరింప జాలు శక్తిని సంపాదించు చోటికే పోయెదను.'

''దుర్యోధనా! అంబ అట్లు పరశురామునకు చెప్పి అత్యంత క్రోధముతో నా వధోపాయమును చింతించుచు తపస్సు చేయుట కొరకు దృఢ సంకల్పముతో అక్కడి నుండి వెడలి పోయెను.

''తరువాత పరశురాముడు మహర్షులను, నన్ను వీడ్కొని మహేంద్ర పర్వతమునకు తపస్సు చేయుటకు పోయెను.

''దుర్యోధనా! నేను తరువాత బ్రాహ్మణులు ప్రశంసించుచుండగా రథమెక్కి హస్తినా పురమునకు వచ్చి నా తల్లి సత్యవతీ దేవికి జరిగిన సమాచారమంతయు తెలిపితిని. ఆమె కూడ నన్ను అభినందించెను.

''తరువాత నేను అంబ చేయుచున్న కార్యక్రమములను కనిపెట్టుటకు కొందరు బుద్ధిమంతులను నియమించితిని.

అంబ తపస్సు

''దుర్యోధనా! తరువాత నేను నియోగించిన గూఢచారులు నా ప్రియమును, హితమును కోరుచు ప్రతి దినము ఆ కన్యక చేయుచున్న కార్యగతిని, ఆమె మాటలను, ఆమె చేష్టలను కనుగొని నాకు తెప్పుచు వచ్చిరి.

"ఆ కన్యక తపస్సు కొరకు వనమునకు పోయిన నాటినుండి నేను బాధతో దీనుడనై అచేతనునివలె నుంటిని. బ్రహ్మవిదుడైన పరశురాముడొక్కడు దప్ప ఏ క్షత్రియుడు గూడ నన్ను యుద్ధమునందు నేటివరకు జయింప జాలకుండెను.

"కురురాజా! నేనీ వృత్తాంతమును నారదునకు, వ్యాసునకున్ను తెలువగా వారు నాతో, 'భీష్మ! నీవు కాశీరాజు పుత్రిక విషయమై కించిత్తు గూడ దుఃఖపడకుము. దైవ విధిని పౌరుషముతో నెవడు ఆపగలడు?' అని యనిరి.

''రాజా! తరువాత అంబ ఆశ్రమముల మండలిలో చేరి, యమునా నదీ తీరమునందు మానవాతీతమైన కఠోర తపస్సు చేసెను. ఆమె ఆహారము విడిచి కృశించిపోయెను. జడలు ధరించెను. ఆమె శరీరమునందు మురికి, బురద చేరి యుండెను.

''తపోధనురాలైన ఆ కన్యక యిట్లే ఆరు మాసములు వాయు భక్షణము చేయుచు తపోమగ్నయై స్థాణువువలె నిశ్చలముగా నుండెను.

"దుర్యోధనా! తరువాత ఆమె యమునా జలములో మునిగియుండి యేమియు తినక, త్రాగక ఒక సంవత్సర కాలము తపస్సు చేసెను.

"తరువాత ఆమె మిక్కిలి క్రోధముతో ఒక సంవత్సర కాలము పాదాంగుష్ఠాగ్రముపై నిలిచి, చెట్టు నుండి రాలి క్రిందపడిన యెండుటాకు నొక్కటి మాత్రము ఆహారముగా గొనుచు తీవ్రముగా తపస్సు చేసెను.

"దుర్యోధనా! ఈ విధముగా నామె పన్నెండు సంవత్సరములు కఠోర తపస్సులో మునిగియుండి భూమ్యాకాశములను తపింపజేసెను. ఆమె జ్ఞాతి వారందరు వచ్చి తపస్సు చాలింపుమనినను ఆమె విడువలేదు.

"తరువాత నామె సిద్ధ చారణసేవితమైన వత్సదేశమునకు పోయెను. అక్కడ పుణ్యాత్ముల ఆశ్రమములలో సంచరించుచుండెను. అక్కడ పుణ్య నదులలో స్నానము చేయుచు తన యిష్టానుసారముగా నామె రాత్రింబగళ్లు అంతట సంచరించుచుండెను.

"మహారాజా! ఆ దినములలో అంబ శుభంకరములైన నందాశ్రమ - ఉలూకాశ్రమ-చ్యవనాశ్రమ - బ్రహ్మస్థానములకు, దేవతల యజ్ఞ స్థానమైన ప్రయాగకు, దేవారణ్య - భోగవతీ - కౌశికాశ్రమ - మాండవ్యాశ్రమ - దిలీపాశ్రమ - రామహ్రద - పైల-గర్గాశ్రమములకు క్రమముగా పోయి కఠినముగా

వ్రతనియమములను పాలించుచు ఆయాశ్రమములందన్నింటను స్నానములు చేయుచు వానిని సేవించెను.

"కురునందనా! ఆ సమయమునందు నా తల్లి గంగాదేవి, జలమునందు ప్రత్యక్షమై అంబతో 'కల్యాణీ! నీ వెందులకీ విధముగా శరీరము నింతగా క్లేశపరచుచున్నావు? నాకు సత్యము తెలుపుము?' అని యడిగెను.

"రాజా! అప్పుడు అంబ చేతులు జోడించుకొని గంగాదేవితో నిట్లనెను.

"దేవీ, భీష్ముడు యుద్ధమునందు పరశురాముని జయించెను. ఇట్లుండగా, ధనుర్బాణధారియైన భీష్ముని యుద్ధమునందు మరి యే క్షత్రియుడు జయింపగలడు? అందుచేత నేను భీష్ముని వినాశమునకుగాను ఈ కఠోర తపస్సు చేయుచున్నాను.

"దేవీ! నేను స్వయముగా సమర్థురాలనై భీష్ముని సంహరింపగలుగుటకుగాను భూమండలములందున్న సమస్త తీర్థముల యాత్రలు చేయుచున్నాను. భగవతీ! ఇదియే నా వ్రతములకు, తపస్సులకున్ను ఫలము.'

"రాజా! ఆ మాటకు గంగాదేవి అంబతో నిట్లనెను:

"భద్రే! ఇప్పుడు నీవు చేయుచున్నది కుటిలమైన ఆచరణము. నీ యీ కోరిక యెప్పటికిన్ని ఫలించదు. భీష్ముని వినాశము కొరకు నీవు ప్రయత్నము చేయుచుండి యీ వ్రతాచరణములలోనే నీ శరీరము విడిచిన యెడల, నీ వొక వక్రగమనముగల క్షుద్రనదివి కావలసివచ్చును.

"కేవలము వర్షాకాలమునందు మాత్రమే నీయందు నీరు ఉండును. నీయందు జనులకు స్నానము చేయుటకు గూడ వీలు ఉండదు. నీవు వర్షాకాలపు నదివి అని అనిపించుకొనెదవు. తక్కిన యెనిమిది నెలలు గూడ నీ స్వరూపమే యెవరికి గూడ తెలియకుండును. వర్షాకాలమునందు గూడ భయంకరములైన మొసళ్ళు గలిగి ఘోర రూపిణివై యుందువు.'

"దుర్యోధనా! ఆ విధముగా అంబకు చెప్పి గంగాదేవి మందహాసము చేయుచు నక్కడినుండి తిరిగిపోయెను

"తరువాత గూడ అంబ కఠోర తపశ్చర్యలో నిమగ్నురాలై - ఒకసారి యెనిమిది నెలలవరకు, ఒకసారి పది నెలలవరకు గూడ జలము గూడ త్రాగకుండెను. ఆమె పుణ్య తీర్థయాత్రలు చేయుచు వత్సదేశమునందు సంచరించుచు నుండెను.

"దుర్యోధనా! కొంత కాలము తరువాత ఆమె వత్సదేశమునందు 'అంబ' యను పేరుతో నొక ప్రసిద్ధ నది యాయెను. ఆ నదియందు కేవలము వర్షాకాలము నందే జలము నిండియుండును. దానియందు చాల సంఖ్యలో మొసళ్ళు నివసించు చుండెను. ఆ నదిలో దిగుటకుగాని, స్నానాది కార్యములు చేయుటకు గాని చాల అసాధ్యముగా నుండెను. అది వక్రముగా ప్రవహించుచుండెను.

"దుర్యోధనా! అంబ ఆ విధముగా తన అర్ధ శరీరముతో నదిగాను తక్కిన అర్ధశరీరముతో వత్సదేశమునందే ఒక కన్యకగాను ప్రకటితురాలాయెను.

అంబ పునర్జన్మము

''జనమేజయా! భీష్ముడు దుర్యోధనునకు అంబ తపశ్చర్యమును గూర్చి చెప్పుచు తరువాతి వృత్తాంతమునిట్లు చెప్పదొడగెను:

"దుర్యోధనా! పునర్జన్మమునందు గూడ అంబ తపస్సు చేయుటకే దృఢ నిశ్చయముతో నుండుటను చూచి, అక్కడి తపస్వులు ఆమెను తపస్సునుండి ఆపుచు 'నీకు ఏమి చేయవలసియున్నది?' అని యడిగిరి.

''దుర్యోధనా! ఆ మాటకు వారితో నామె యిట్లనెను:

''మహర్షులారా! భీష్ముడు నన్ను తిరస్కరించెను. నేను పతిని పొందుటకు ఆయన సేవ చేయుటకున్ను సాధ్యముగాకుండ భీష్ముడు చేసెను. ఈ నా తపోదీక్ష పుణ్యలోక ప్రాప్తికొరకు కాదు. భీష్ముని వధించుటకే తపస్సు చేయుచున్నాను. భీష్ముని చంపిన తరువాతనే నాకు మనశ్శాంతి కలుగునని నా నిశ్చయము. భీష్ముని కారణముగానే నాకు ఈ దుఃఖపరిస్థితి యేర్పడినది. పతిలోకము నాకు ప్రాప్తించకుండ నతడు చేసెను.

''ప్రపంచమునందు నేను స్త్రీగాక పురుషుడుగాక యున్నాను. భీష్ముని నేను యుద్ధమునందు సంహరించక యీ తపస్సు మానుకొనను. ఇదియే నా సంకల్పము. మీకు స్పష్టముగా తెలుపుచున్నాను.

నాకు స్త్రీత్వము నుండి విరక్తి కలిగినది. కాబట్టి పురుష శరీరము పొందుటకు దృఢ నిశ్చయముతో తపస్సు చేసి నేను భీష్మునకు ప్రతీకారము చేయదలచినాను. అందుచేత మీరు నా తపస్సును ఆపకుడు.'

''దుర్యోధనా! అంతట, ఉమాపతియైన సాక్షాత్ పరమేశ్వరుడు ఆ ఋషుల మధ్య ప్రత్యక్షమై అంబతో, 'నీ యిష్టమైన వరము కోరు కొను'మనగా అంబ నన్ను జయించుటకు వరము కోరెను.

''అప్పుడా మహాదేవుడామెతో, 'అంబా! నీవు తప్పక భీష్ముని వధించెదవు' అని వరమిచ్చెను.

"ఆ మాటవిని అంబ మరల ఆదేవునితో నిట్లనెను:

"భగవన్! నేను స్త్రీనిగదా? నాకు యుద్ధమునందు విజయమెట్లు కలుగును? దేవా! స్త్రీనగుట చేత నా మనస్సు మిక్కిలి తేజోహీనముగ నున్నది.

''దేవా! నీవేమో, నేను భీష్ముని జయింపగలనని వరము ప్రసాదించితివి. ఇది యెట్లు పొసగును? నీ విచ్చిన వరము సత్యమగునట్లు చేయుము. దానిచేత నేను యుద్ధమునందు భీష్ము నెదిరించుటకు, అతనిని చంపుటకును శక్తి గలదాననయ్యెదను.'

''దుర్యోధనా! ఆమె మాట విని పరమేశ్వరు డిట్లనెను:

"కల్యాణీ! నా మాటయెప్పటికిని అసత్యముకాదు. నా మాట సత్యమగును నీవు యుద్ధరంగమునందు తప్పక భీష్ముని సంహరించెదవు. ఈ కార్య సిద్ధి కొరకు అవసరము వచ్చినప్పుడు నీకు పురుషత్వముగూడ వచ్చును. తరువాతి జన్మమునందు నీకు ఈ విషయమంతయు జ్ఞప్తియందుండగలదు.

''భద్రే! నీవు పునర్జన్మమునందు ద్రుపదకులమునందు పుట్టెదవు. అప్పుడు నీవు మహారథికుడవయ్యెదవు. మహావీరుడవయ్యెదవు. నీకు లాఘవముతో అస్త్ర సంచాలన నైపుణ్యము కలుగును. దానితోపాటే నీవు విచిత్రముగా యుద్ధము చేయగల యోధుడవుగా సమ్మానింపబడగలవు.

కల్యాణీ! నేను చెప్పినట్లే అన్నియు తప్పక నీకు సిద్ధించగలవు. నీవు ద్రుపదరాజునకు తొలుత కన్యకగానే పుట్టెదవు. తరువాత కొంతకాలమునకు పురుషుడవయ్యెదవు.'

''దుర్యోధనా! ఆవిధముగా అంబను అనుగ్రహించి పరమేశ్వరుడు అందరు చూచుచుండగనే అంతర్ధానము చెందెను.

''కురుపతీ! ఆ సుందరకన్యక అక్కడి మహర్షులు చూచుచుండగనే, కట్టెలు కూర్చుకొని, ఆ కాష్ఠమునకు నిప్పు అంటించెను. కాష్ఠము మండుచుం

దగా, భీష్ముని పైన క్రోధము చేత ఆమె హృదయము గూడ ఆ కాష్ఠమువలెనే జ్వలించుచుండగా, భీష్మవధకు సంకల్పము పఠించి, ఆ యగ్నిలో ప్రవేశించెను.

''రాజా! ఆవిధముగా కాశీరాజు జ్యేష్ఠపుత్రి అంబ, రెండవ జన్మము నందు యమునా నదీతీరమునందు చితిలో కాలి భస్మము అయ్యెను.''

''జనమేజయా? భీష్ముని మాటలు విని దుర్యోధనుడు మరల నిట్లనెను:

''పితామహా! శిఖండి తొలుత కన్యారూపములోనుండి పిదప పురుషుడుగా నెట్లాయెను? తెలుపుము.''

శిఖండి జన్మవృత్తాంతము

"ఆ ప్రశ్నమునకు భీష్ముడిట్లు ఉత్తరము చెప్పెను:

''దుర్యోధనా! ద్రుపదమహారాజు యొక్క పట్టపు దేవికి పుత్రులు లేకుండిరి. అప్పుడు ద్రుపదుడు శంకరభగవానుని తపస్సుచేత సంతోషపరచెను. ద్రుపదుడు నన్ను వధించగల పుత్రుని బడయుటకు సంకల్పించి ఘోరతపస్సు చేసియుండెను గాబట్టి ఆ మహా దేవుని నిట్లు వరము కోరెను:

''దేవా! నాకు కన్యక వలదు. పుత్రుడు కావలెను - భగవన్! భీష్మునకు ప్రతీకారము చేయగల పుత్రుని కోరుచున్నాను.'

"దుర్యోధనా! ఆ మాటకు శంకరు డిట్లనెను:

''రాజా! నీకు తొలుత కన్యక పుట్టగలదు. తరువాత ఆ కన్యయే పుత్రు డగును. ఇక నీవు తిరిగిపొమ్ము. నేను చెప్పిన దెప్పుడు గూడ మిథ్యకాదు.

''దుర్యోధనా! అప్పుడు ద్రుపదరాజు తన యింటికి పోయి భార్యతో నిట్లనెను:

''దేవీ! నేను చాల ప్రయత్నించితిని. తపస్సుచేత మహాదేవుని ఆరా ధించితిని. ఆ దేవుడు ప్రసన్నుడై నాతో నిట్లనెను:

''రాజా! తొలుత నీకు పుత్రిక జన్మించును. తరువాత ఆమెయే పుత్రుడుగా పరిణమించును.

''ఆ మాటకు నేను మాటిమాటికి శంకరుని పుత్రునికొరకే యాచించితిని, కాని ఆ దేవు 'డిది దైవ విధానము. ఇది తప్పదు. నేనేది చెప్పితినో అది జరిగి తీరు' ననిచెప్పెను.'

''దుర్యోధనా! తరువాత ద్రుపదుని భార్య నియతురాలై ఋతుకాలమున పతి సంయోగము చేసెను. శాస్త్రీయముగా నామె గర్భధారణము చేసెను. ద్రుపదుడు తనకు కలుగబోవు సంతానమునందు అపేక్షగలవాడై గర్భవతియైన భార్యకు అన్ని విధములైన సుఖములు సమకూర్చెను. ఆమె కోరిన వస్తువు లన్నియు నామెముందుంచెను. అమె సకాలములో నొక సుందర కన్యను కనెను.

''కురురాజా! అప్పుడు పుత్రహీనయైన ఆ రాణి 'నాకు పుత్రుడు జన్మించి నాడు' అని ప్రకటించెను.

''దుర్యోధనా! తరువాత ద్రుపదరాజు, రహస్యముగా నుంచబడిన ఆ కన్యకు జాతకర్మాది సంస్కారములన్నియు పుత్రునకు వలె చేయించెను.

"ద్రుపదుని భార్య సర్వప్రయత్నములచేత ఆ రహస్యమును దాచి యుంచెను. ఆ కన్యక నామె పుత్రుడనియే పిలుచుచుండెను. ఆ పట్టణమంతటను. ఒక్క ద్రుపదునకు దప్ప, అది కన్యక యని యెవరికిని తెలియకుండెను.

''శంకరభగవానునిపై భక్తి విశ్వాసములుంచి యా రాణి, ఆ కన్య పుత్రుడేయని ప్రకటించి, ఆ కన్యకకు 'శిఖండి' యని పేరు బెట్టెను. అందరు ఆ పేరనే పిలుచుచుండిరి.

''దుర్యోధనా! నేను మాత్రము నా గూఢచారులద్వారా, నారదుడు చెప్పిన మాటను బట్టి, మహాదేవుని వరదానమును బట్టి, అంబ తపస్సును బట్టియు, శిఖండి 'కన్యక' యని తెలిసికొంటిని."

''జనమేజయా! తరువాతి వృత్తాంతము భీష్ముడు దుర్యోధనున కిట్లు చెప్ప దొడగెను:

శిఖండి వివాహము

"దుర్యోధనా! తరువాత ద్రుపదుడా కన్యకు అన్ని విద్యలు నేర్పుటకు సర్వవిధముల ప్రయత్నించెను. శిఖండి ద్రోణాచార్యుల వద్ద ధనుర్విద్య నభ్య సించెను. శిఖండి కొక కన్యను దెచ్చి వివాహము చేయుమని ద్రుపదుని భార్య కోరెను. ఆమె తన కన్యకు పుత్రునకువలె పెండ్లిచేయ తలపెట్టెను.

''నా కూతురు యౌవనవతియైనను స్త్రీగానే యున్నది. శంకరుని వరము ప్రకారము పుత్రుడుగా మారలేదు' అని ద్రుపదుడు, అతని భార్య చింతింప దొడగిరి. అతడు భార్యతో నిట్లనెను:

''దేవీ! ఈ నా పుత్రి యౌవనావస్థకు వచ్చినప్పటినుండి నా దుఃఖమును పెంచుచున్నది. నేను శంకరభగవానుని మాటపైన విశ్వాసముంచి యింతదాక నీమె కన్యాత్వమును దాచియుంచితిని.'

''దుర్యోధనా! ఆ మాటలు విని అతని భార్య యిట్లనెను :

"మహారాజా! భగవంతుడైన శివుడిచ్చిన వరము ఎట్టి పరిస్థితులలోను మిథ్య కాజాలదు. త్రిలోకసృష్టికర్తయైన భగవంతుని మాట యెట్లు అసత్యమగును, చెప్పుము. ఆ భగవంతుడసత్యము పలుకునా?

'రాజా! నీ కిష్టమైనచో నొకమాట చెప్పెద వినుము. విని నీ బుద్ధికి తోచినట్లు చేయుము.

''రాజా! శంకరునిపై విశ్వాసముంచి, ఒక కన్యను తెచ్చి శిఖండికి వివాహము చేయుము.'

"దుర్యోధనా! భార్య యట్లు చెప్పిన తరువాత, ఇరువురు పరస్పరము సంప్రదించుకొని ఒక నిశ్చయమునకు వచ్చి దశార్ణ రాజపుత్రిని శిఖండి కొరకు నిశ్చయించిరి.

''దశార్ణరాజు పేరు హిరణ్యవర్మ. అతడు తన కన్యను శిఖండికిచ్చి వివాహము చేసెను. అతడు దుర్జయుడైన మహావీరుడుగానుండెను.

"దుర్యోధనా! హిరణ్యవర్మ కూతురు - శిఖండి యిద్దరు గూడ యుక్త వయస్సులో నుండిరి. పరిపూర్ణ యౌవనవతులు. హిరణ్యవర్మ ఇంటిలో వివాహమైన తరువాత పురుడుగానున్న శిఖండి పత్నీ సహితముగా తన కాంపిల్య నగరమునకు వచ్చెను.

"దశార్ణరాజు కూతురు, కొద్ది దినములలో తన పతిగానున్న వ్యక్తి స్త్రీయని తెలిసికొని, తన దాదికి, సఖురాండ్రకున్ను ఆ రహస్యమును సిగ్గుపడుచు, 'శిఖండి పురుషుడుకాదు - స్త్రీ' యని చెప్పెను.

"కురుపతీ! ఈ రహస్యము తెలిసి, వారు మిగుల దుఃఖించిరి. వారు దాసీజనము ద్వారా యీ విషయము హిరణ్యవర్మకు తెలిపిరి. ద్రుపదుడు చేసిన మోసము తెలిసిన దశార్ణదేశరాజు మిక్కిలి కోపించెను.

"దుర్యోధనా! శిఖండి గూడ ఆ రాజకుటుంబమునందు పురుషునివలె తిరుగుచున్నను, తన స్త్రీత్వము తనకు బాగనిపించకుండెను. హిరణ్యవర్మ క్రోధముచేత ద్రుపదరాజకడకు దూతను పంపెను. ఆ దూత, ద్రుపదునితో ఏకాంతమునందు ఇట్లనెను:

''ద్రుపదరాజా! నీవు దశార్ణరాజునకు మోసము చేసితివి. నీవు చేసిన అవమానమునకు ఆయన చాల క్రుద్ధుడై యున్నాడు. నీతో చెప్పుమని ఆయన యీ సందేశమును పంపెను.'

''అట్లు చెప్పి ద్రుపదునకు హిరణ్యవర్మ సందేశమును ఇట్లు వినిపించెను:

''ద్రుపదరాజా! నీవు నాకు చేసిన అవమానమునుబట్టి నీ దుర్బుద్ధి బయటపడినది, నీవు మూఢుడవై నీ పుత్రికిగాను నా పుత్రిని వరించితివి. దుర్మతీ! ఆ మోసమునకు, వంచనకు తగిన ఫలము శీఘ్రముగానే నీ వనుభవించెదవు. ధీరుడవై నిలువుము. నే నిప్పుడే నిన్ను మంత్రి సేవక సహితముగా నిర్మూలించివేసెదను.'

''జనమేజయా! యిట్లు భీష్ముడు చెప్పి, తరువాతి వృత్తాంతమును దుర్యోధనున కిట్లు చెప్పదొడగెను:

''దుర్యోధనా! దశార్ణుని దూత మాటలు విని, ద్రుపదుడు పట్టుబడిన దొంగవలె నోట మాటరాకుండెను. దశార్ణ దూత ద్వారా ద్రుపదుడు 'అది సరికాదు, నీకు మోసము చేయలేదు' అని తన వియ్యంకుని ఒప్పించుటకుగాను దుష్కర ప్రయత్నము చేయుచు సందేశము పంపెను.

''దుర్యోధనా! తరువాత హిరణ్యవర్మ మరల యథార్థమును పూర్తిగా తెలిసికొని, మిక్కిలి కోపముచేత శీఘ్రముగానే ద్రుపదునిపై దాడి సలుపుటకు నిశ్చయించుకొనెను.

"అతడు ద్రుపదుడు చేసిన మోసమును గూర్చి తన మిత్రరాజులకు తెలిపెను. తరువాత తాను పాంచాలరాజుతో నెట్లు వ్యవహరించవలసినది తన మంత్రులతో నాలోచించెను.

''దుర్యోధనా! అప్పుడు హిరణ్యవర్మ మిత్రులందరున్ను 'శిఖండి పుత్రుడుగాడు - పుత్రిక' యని నిర్ణయమైన యెడల మనమందరము ద్రుపదుని చెరబట్టి మన యింటికి తెచ్చి, అతని రాజ్యమునకు మరియొకనిని రాజుగా చేసి, ద్రుపదుని, శిఖండిని చంపించుదము అని నిశ్చయించుకొనిరి.

"తరువాత హిరణ్యవర్మ ద్రుపదునకు 'నీపై త్వరలోనే దాడి చేయుచున్నాను. స్థిరముగా నిలువుము' అని సందేశము పంపెను.

''దుర్యోధనా! ఆ దినములలో ద్రుపదుడు స్వాభావికముగనే భయశీలుడై యుండెను. దానిపైన, అతని అపరాధము గూడ పట్టుబడెను. అందుచేత మిక్కిలి భయపడెను. దశార్ణరాజుకడకు దూతలను పంపిన తరువాత, అధీరుడై తన భార్యతో ద్రుపదుడిట్లనెను:

''దేవీ! మహాబలవంతుడైన నా వియ్యంకుడు హిరణ్యవర్మ సైన్యముతో నాపైన దాడి చేయనున్నాడు. ఇప్పుడు మనమిద్దర మేమి చేయుదము? ఈ కన్య కారణముగా మనము ఏమియు చేయుటకు గూడ తోచకయున్నాము.

"శిఖండి కన్యకయేయని మన వియ్యంకునకు నిశ్చయముగా తెలిసిపోయినది. అతనిని మనము మోసము చేసినట్లు అతనికి స్పష్టముగా తెలిసినది. తన మిత్రులతో వచ్చి మనను రాజ్యమునుండి ఊడబెరుకుటకు నిశ్చయించుకొని యున్నాడు ఇప్పుడు నా జీవితము సంశయములో పడినది. శిఖండి బాలికయే. మనకు ఇప్పుడు సంకటమే ప్రాప్తించినది.

"దేవీ! మనయందరి సంకటము పోవుటకు నీవే యొక యుపాయము నిప్పుడు తెలిపి నన్ను శాంతపరచుము. దానిని త్వరగా ఆచరించెదను. నేను హిరణ్యవర్మను వంచించితిని. ఇప్పుడు మనకు హితమేదియో తెలుపుము, అనుష్ఠించెదను.

''దుర్యోధనా! ఆ విధముగా నడుగుచున్న ద్రుపద మహారాజునకు భార్య యిట్లు బదులు చెప్పెను:

''రాజా! భగవంతుడైన శంకరుని వరము ప్రకారము తప్పక మన బిడ్డ కొడుకగునని నిశ్చయించి యిట్లు చేసితిమి. ఇప్పుడేమి చేయుటకును తోచకున్నది. ఆ భగవంతుడే మన నిప్పుడు రక్షించును.'

''దుర్యోధనా! తరువాత ద్రుపదుడు మంత్రులకు వాస్తవస్థితి తెలిపి దశార్ణదేశాధీశునితో వైరమునకు ఇష్టపడక, యెట్లైనను నగర రక్షణము అవశ్యకమని తలచి, అంతట కట్టుదిట్టములు చేయించెను. వియ్యంకునితో యుద్ధము రాకుండుటకుగాను దేవతలను అర్చింపజొచ్చెను. అప్పుడు అతని భార్య యిట్లనెను:

''రాజా! దేవతారాధనము చేయుట సత్పురుషుల కర్తవ్యము. ఇట్లుండగా, దుఃఖసముద్రమున మునిగియున్న మనము విశేషముగా నారాధించవలెను.

"కాబట్టి నీవు గురుజనమును, దేవతలనందరిని పూజింపుము. బ్రాహ్మణులకు భూరి దక్షిణలిచ్చి తృప్తిపరచుము దశార్ణరాజు తిరిగిపోవుటకుగాను అగ్నియందు హోమాదులు చేయుము. ఆయన మనతో యుద్ధము చేయకుండనే తిరిగి పోవుట దైవానుగ్రహమువలన తప్పక సిద్ధించును.

''రాజా! నగర రక్షణమునకు ఏర్పాట్లు చేయుము. పురుష ప్రయత్నము చేసినప్పుడే దైవము గూడ అనుకూలించును. పురుష యత్నము - దైవానుగ్రహము, ఈ రెండున్ను పరస్పరము విరోధించినప్పుడు రెండుగూడ సిద్ధింపవు. కనుక, నగర రక్షణముతో పాటు దైవారాధన గూడ చేయుము.'

''దుర్యోధనా! అట్లు ఆ భార్యాభర్తలు మాట్లాడుకొనుచు దుఃఖించుచుండగా వారి పుత్రి శిఖండి సిగ్గుచెంది 'నా తల్లి దండ్రులు నా కారణముగానే దుఃఖితులై యున్నారు' అని చింతించి ప్రాణత్యాగము చేయతలపెట్టెను.

శిఖండిని పురుషుడుగా మారుట

"వెంటనే శిఖండిని యిల్లు విడిచి ఘోరమైన అడవికి పోయెను. ఆ వనము 'స్థూణాకర్ణుడు' అను యక్షుని సంరక్షణమందుండెను. అతడు బలైశ్వర సంపన్నుడు. అతని భయముచేత ఆ వనమునకు సామాన్యజనులు పోవకుండిరి.

"దుర్యోధనా! ఆ వనమునందు స్థూణాకర్ణుని భవనము సున్నముతోను మంటితోను నిర్మింపబడి సుందరముగా నుండెను. ఆ భవన ప్రాకారములు అత్యున్నతములుగ నుండెను. దాని నుండి వట్టివేళ్ళ సుగంధిధూమము గుబాలించుచుండెను.

''శిఖండిని ఆ భవనములో ప్రవేశించి అనేక దినములు ఉపవాసము చేసి కృశించి యుండెను. స్థూణాకర్ణుడు అట్టి యవస్థలో నున్న శిఖండిని చూచి దయగలవాడై యిట్లనెను:

''కల్యాణీ! నీవు ఈ ఉపవాస వ్రతము ఎందుకు చేయుచున్నావు? దీనివలన నీకు గలుగబోవు ప్రయోజనమేమియో శీఘ్రముగ తెలుపుము. నేను దానిని పూర్తి చేసెదను.'

''ఆ మాటవిని శిఖండిని, 'ఇది నీకు సాధ్యము కాని పని' యని పలు సార్లు చెప్పినను యక్షుడు 'నేను తప్పక నీ కోర్కె తీర్చెదను' అని మాటిమాటికి ఆమెతో చెప్పుచు నిట్లనెను:

''రాజకుమారీ! నేను కుబేరుని సేవకుడను. నాకు వరమిచ్చు శక్తి కలదు. నీ యిష్టమేమి తెలుపుము ఇవ్వరాని వస్తువుగూడ నీ కిచ్చెదను.'

''దుర్యోధనా! ఆ మాటవిని శిఖండిని స్థూణాకర్ణునకు తన సమాచార మంతయు నామూలాగ్రము తెలిపెను:

''యక్షేశ్వరా! పుత్రహీనులైన నా తలిదండ్రులు మిగుల దుఃఖితులై యున్నారు. వారు నశించెదరు.

''దశార్ణ రాజు కుపితుడై దాడి చేయును. అతడు సువర్ణ కవచము గల వాడు. మహాబలపరాక్రమ సంపన్నుడు.

''అతని నుండి నా తలిదండ్రులను నన్ను రక్షింపుము. నా దుఃఖము నివారించుటకు నీవు ప్రతిజ్ఞ చేసితివి. దయయుంచి నన్నొక శ్రేష్ఠపురుషునిగా మార్చుము.

''హిరణ్యవర్మ మా నగరము పైన దాడి చేయుటలోపలనే నాపై దయ చూపి నన్ను పురుషుని చేయుము.

''దుర్యోధనా! శిఖండిని మాటలు విని యక్షుడు మనస్సులో కొంచెము చింతించి యామెతో నిట్లనెను:

''కల్యాణీ! నీవు కోరినట్లే జరుగును. కాని, యిందుకొక నియమము చెప్పెదను. అట్లు చేయవలెను.

''ఏమనగా, నా పురుషత్వమును నీకు కొంతకాల మిచ్చెదను. నీవు నీ నగరమునకు పోయి నీ పని తీరిన వెంటనే వచ్చి నా పురుషత్వము నాకిచ్చి, నీ స్త్రీత్వమును మరల నీవు తీసికొనవలెను. ఇందుకుగాను నీవు సత్యముగా నాకు మాట యిమ్ము.

''రాజకుమారీ! నేను సిద్ధసంకల్పుడను. శక్తిమంతుడను. నా యిచ్ఛాను సారముగా అంతట తిరుగుచుండువాడను. ఆకాశమునందు గూడ సంచరించు శక్తి గలవాడను. నీవు నా కృపచేత నీ నగరమును, నీ బంధువులను మాత్రమే రక్షించుకొనుము.

''కల్యాణీ! ఈ విధముగా నేను నీ స్త్రీత్వమును గ్రహించి నా పురుషత్వము నీకిచ్చెదను. నీ కార్యము నెరవేరిన తరువాత నీవు వెంటనే మరల నా పురుషత్వమును నాకు తిరిగి యిచ్చుటకు నీవు సత్యమైన ప్రతిజ్ఞ చేసినయెడల నీకు ప్రియము గూర్చెదను-

''దుర్యోధనా! ఆ మాటలు విని శిఖండిని యక్షునితో నిట్లనెను :

''భగవన్! నీవు ప్రసాదించిన పురుషత్వము సకాలములో నీకు తిరిగి యిచ్చెదను. నీవు కొద్దికాలమే నా స్త్రీత్వము ధరించి యుండుము.

''దశార్ణరాజైన హిరణ్యవర్మ, నన్ను చూచి నేను వాస్తవముగా పురుషుడనేయని తెలిసికొని తిరిగి వెడలిపోయినవెంటనే నీ కడకు వచ్చి మరల నా స్త్రీత్వమును ధరించి నీ పురుషత్వమిచ్చెదను.'

''దుర్యోధనా! ఆ విధముగా వారు మాట్లాడుకొని పరస్పరము స్త్రీత్వ-పురుషత్వములను మార్చుకొనిరి.

''రాజా! ఈ విధముగా పురుషత్వము పొంది శిఖండి మిక్కిలి సంతోషముతో తన కాంపిల్య నగరమునకు పోయి తండ్రితో కలిసెను. ఆయనతో జరిగిన వృత్తాంతమంతయు తెలిపెను. ద్రుపదునకు అపారమైన హర్షము కలిగెను.

''ఆ రాజ దంపతులకు పరమేశ్వరుడు ప్రసాదించిన వరము స్మరణమునకు వచ్చెను.

''తరువాత ద్రుపదుడు దశార్ణ రాజునకు 'నా పుత్రుడు పురుషుడు. నా మాటపైన విశ్వాసముంచుము' అని దూతద్వారా చెప్పి పంపెను.

''దుర్యోధనా! దుఃఖమగ్నుడైన దశార్ణరాజు ద్రుపదునిపై అప్పటికే దాడి చేసి యుండెను. అతడు కాంపిల్య నగరము సమీపముచేరి వేదవేత్తయైన యొక బ్రాహ్మణుని ద్రుపదునికడకు దూతగా పంపదలచి యతనితో నిట్లనెను:

''బ్రాహ్మణోత్తమా! నీవు రాజాధముడైన పాంచాలరాజుతో నిట్లనుమని చెప్పెను:

"దుర్మతీ! నీ కన్యకకై నా కన్యను వివాహమునకు కోరితివి. నీ గర్వము నేడు అణచెదను. దానిఫలమనుభవింపుము. ఇందులో సందేహము లేదు.'

"దుర్యోధనా! ఆ సందేశముతో బ్రాహ్మణుడు కాంపిల్యనగరములోనికి పోయి ద్రుపదరాజుతో కలిసెను. ద్రుపదుడా బ్రాహ్మణునకు స్వాగత సత్కా

రములు చేసెను. అక్కడ రాజకుమారుడు శిఖండి గూడ నుండెను ఆ బ్రాహ్మణుడు ద్రుపదుడు చేసిన పూజలు గ్రహింపక యిట్లనెను:

''ద్రుపదరాజా! హిరణ్యవర్మ నీకు పంపిన సందేశము ఈ విధముగా నున్నది, వినుము అని యిట్లనెను:

''దుర్బుద్ధీ! ద్రుపదా! నీ పుత్రిచేత నేను వంచింపబడితిని. ఆ పాపము నీవే చేసితివి. కాబట్టి యిప్పుడా పాపఫలమనుభవింపుము. నాతో యుద్ధము చేయుము. నేను నిన్ను, మంత్రి పురోహిత బాంధవులతోపాటు నీ కులమును ఊడబెరకి వేసెదను.'

''దుర్యోధనా! మంత్రి పురోహిత సహితుడై నిండుసభలోనున్న ద్రుపదునకు ఆ బ్రాహ్మణుడు హిరణ్యవర్మ సందేశమును వినిపించెను.

'అట్టి నిందావాక్యములు విన్నను, ద్రుపదుడు శాంతితో నిట్లనెను.

''బ్రాహ్మణోత్తమా! నీ విచ్చిన సందేశమునకు ప్రతిసందేశము నా దూత ద్వారా నీ రాజుకడకు పంపెదను.'

'తరువాత ద్రుపదుడు గూడ వేదవిదుడైన బ్రాహ్మణుని ద్వారా హిరణ్యవర్మకు ఇట్లు సందేశమంపెను:

''దశార్ణరాజా! నీవు స్వయముగా వచ్చి స్పష్టముగా పరీక్షించుకొనుము. శిఖండి నా పుత్రుడేకాని, పుత్రిక కాదు. నీతో నెవరో అసత్యము చెప్పిరి. ఆ మాట విశ్వసనీయము కాదు.''

''దుర్యోధనా! ద్రుపదుని సందేశము విని హిరణ్యవర్మ కొంత చింతించి, అతిరూప సౌందర్యవతులైన యువతులను, 'శిఖండి పురుషుడా? స్త్రీయా'యని కనుగొనుటకు పంపెను.

''ఆ స్త్రీలు అక్కడికి పోయి వాస్తవమును తెలిసికొని వచ్చి హిరణ్యవర్మకు శిఖండి మహా ప్రభావశాలియైన పురుషుడేయని సంతోషపూర్వకముగా చెప్పిరి.

''అట్లు పరీక్ష చేయించి దశార్ణరాజు మిక్కిలి సంతసించెను. తరువాత నతడు వియ్యంకుడైన ద్రుపదునితో కలిసి యక్కడ మిక్కిలి ఉత్సాహముతో ఉండెను. అల్లుడు శిఖండికి గజాశ్వ - గో - ధన - దాసీజనములను అరణముగా నిచ్చెను.

''దుర్యోధనా అసత్యవార్త చెప్పి పంపినందుకు హిరణ్యవర్మ తన పుత్రిని గూడ నిందించెను.

''ద్రుపదరాజుచేత సన్మానితుడై యతడు తన నగరమునకుతిరిగిపోయెను. అప్పుడు శిఖండినికి గూడ చాల సంతోషము కలిగెను.

కుబేరుడు స్థూణాకర్ణునకు శాపమిచ్చుట

''దుర్యోధనా! శిఖండిని పురుషత్వము పొందివచ్చిన తరువాత కుబేరుడు లోకసంచారము చేయుచు స్థూణాకర్ణుడున్న స్థలమునకు వచ్చెను.

"అతడు ఆకాశమునుండియే స్థూణాకర్ణుని దివ్యగృహమును చూచెను. అది, విచిత్రహారములతో నలంకరింపబడియుండెను. వట్టివేళ్ళు మొదలైన సుంగంధ ద్రవ్యముల పరిమళముతో గుబాళించుచుండెను. అన్నివైపుల దూప దూమములతో నిండియుండెను.

''ఆ భవనమునందు మేలుకట్లు, ధ్వజపతాకలు శోభిల్లుచుండెను. అక్కడ భక్ష్య భోజ్య - పేయాదులైన దంతహోమములు (దంతములతో నమిలి, జిహ్వతో చప్పరించి, జఠరాగ్నిలో హోమము చేయబడు ఆహార పదార్థములు) అన్నియునుండెను.

''అది చూచి కుబేరుడా భవనములో ప్రవేశించెను. అప్పుడు స్థూణాకర్ణుడు తన కెదురువచ్చి స్వాగతము చెప్పనందుకు కుబేరుడు కోపించి, అక్కడి యక్షులతో, 'ఈ యపరాధమునకు స్థూణాకర్ణుడు దండింపదగినవాడు' అనెను.

''దుర్యోధనా! కుబేరుని మాటలు విని యక్షులిట్లనిరి:

''కుబేరమహారాజా! ద్రుపదమహారాజునకు శిఖండినియను నొక కూతురున్నది. ఆమెకు ఏదో యొక విశేష కారణమువలన పురుషత్వము కావలసి వచ్చినది. స్థూణాకర్ణుడామెకు తన పురుషత్వమిచ్చి యామె స్త్రీత్వమును గ్రహించెను. అప్పటి నుండి యతడు స్త్రీరూపముతో నింటిలోనే యుండును. ఆ కారణముచే సిగ్గుపడి తమ సన్నిధికి రాకున్నాడు. తమ చిత్తము వచ్చినట్లు చేయుడు. నేడు మీ విమాన మిక్కడనే యుండవలెను.''

''దుర్యోధనా! యక్షులు చెప్పిన మాటలు విని కుబేరుడు వారితో నిట్లనెను:

''యక్షులారా! మీరు స్థూణాకర్ణుని ఇక్కడికి పిలుచుకొనిరండు. నేను అతనికి దండనము విధించెదను.' అట్లు కుబేరుడామాటనే మాటిమాటికిని అనెను.

''దుర్యోధనా! అట్లు కుబేరుడు పిలువగా స్థూణాకర్ణుడతని సమక్షమునకు వచ్చి నిలిచెను.

స్త్రీ స్వరూపముతో నున్నందుచేత నతడు లజ్జతో తలవంచుకొని యుండెను. స్త్రీరూపములోనున్న యతనిని చూచి కుబేరుడు మిక్కిలి కుపితుడై యతనికి శాపమిచ్చుచు యక్షులతో నిట్లనెను:

"గుహ్యకులారా! యీ పాపిష్ఠుడైన స్థూణాకర్ణునకు సర్వదా స్త్రీత్వమిట్లే యుండుగాక!' యని చెప్పి స్థూణాకర్ణునితో కుబేరుడిట్లనెను:

"పాపచారుడవైన యక్షా! నీవు యక్షజాతిని తిరస్కరించి యిక్కడ శిఖండినికి నీ పురుషత్వమిచ్చి యామె స్త్రీత్వమును ధరించితివి.

"దుర్బుద్ధీ! లోకవ్యవహార విరుద్ధమైన కార్యమును నీవు చేసితివి కాబట్టి, నేటినుండి నీవు స్త్రీవై యుండెదవుగాక!' యని శాపమిచ్చి, 'శిఖండిని పురుషుడుగానే యుండుగాక!' యనియు ననెను.''

"దుర్యోధనా! అప్పుడు యక్షులందరు కుబేరుని అనునయ వినయములతో ప్రసన్నునిచేసి, 'భగవన్! ఈ శాపమునకు అంతము చెప్పుము' అని వేడుకొనిరి. అప్పుడు కుబేరుడు ప్రసన్నుడై శాపాంతము నిట్లు చెప్పెను.:

"యక్షులారా! శిఖండి చంపబడిన తరువాత ఈ స్థూణాకర్ణుడు మరల పురుషత్వమును పొందగలడు. కాబట్టి యితడు నిర్భయముగా నుండవలెను.'

''దుర్యోధనా! కుబేరుడీవిధముగా శాపాంతము చెప్పి, యక్షులచేత పూజితుడై తన సేవకులతోపాటు అక్కడినుండి వెడలిపోయెను.

"స్థూణాకర్ణుడు కుబేరునిచేత శప్తుడై యచటనే యుండెను.

"నాయనా! శిఖండి పూర్వ నిర్ణయము ప్రకారము, తన కార్యము నెరవేరగనే స్థూణాకర్ణుడునికడకు త్వరగా వచ్చి 'భగవన్! నేను నీ సన్నిధికి వచ్చితిని' అని యనెను.

''ఆ మాటవిని స్థూణాకర్ణుడు 'శిఖండీ! నీయెడల నేను చాల ప్రసన్నుడనై యున్నాను అని పలుమార్లు అనెను.

"తరువాత శిఖండికి ఆ యక్షుడు జరిగిన వృత్తాంతమంతయు చెప్పి యిట్లనెను:

''శిఖండీ! నీకారణముగానే కుబేరుడు నాకు శాప మిచ్చెను. ఇక నీవు పొమ్ము. నీయిష్టమువచ్చినట్లు ప్రపంచమంతట సంచరించుము. ఇది నా పూర్వ ప్రారబ్ధకర్మయని తలచెదను. అట్లుకాకున్న యెడల, నీవిక్కడినుండి పోయిన వెంటనే, కుబేరుడు తలవని తలంపుగా నిక్కడికి వచ్చుట యెట్లు సంభవించును? ఇక ఈ శాపమునకు తిరుగులేదు.'

"దుర్యోధనా! తరువాత శిఖండి మిక్కిలి సంతోషముతో కాంపిల్య నగరమునకు పోయెను. ద్రుపదుడప్పుడు పరిపూర్ణమనోరథుడై వచ్చిన శిఖండిని చూచి చాల సంతసించి, అనేక గంధమాల్యాదులతో దేవతలను, బ్రాహ్మణులను పూజించెను. నగరము అలంకరించి బంధువులతో సంతోషముగ నుండెను.

"తరువాత ద్రుపదరాజు శిఖండిని ధనుర్వేదాభ్యాసమునకై ద్రోణాచార్యులకు ఒప్పగించెను.

"ఈ విధముగా దుర్యోధనా! శిఖండి,ధృష్టద్యుమ్నులు మీ సోదరులందరితో పాటు 'గ్రహణ (శస్త్రము తీసికొనుట) - ధారణ (శస్త్రములను ధరించుట) - ప్రయోగ (శస్త్రమును ప్రయోగించుట) - ప్రతీకార - (తనపై పడుచున్న శస్త్రమును త్రిప్పికొట్టుట)- ఈ నాలుగు విధములు (నాలుగు పాదములు) గల ధనుర్వేదాధ్యయనము చేసిరి.

"దుర్యోధనా! నేను ద్రుపదనగరమునందు కొందరు గూఢచారులను నియమించియుంటిని. వారిలో కొందరు మూగవారుగాను. మరికొందరు అంధులుగను, కొందరు చెవిటివారుగను నటించుచు అక్కడి సమాచారమంతయు తెలిసికొని యెప్పటికప్పుడు నాకు తెలుపుచుండిరి గనుక నాకు ఈ సంగతులన్నియు తెలియును.

"నాయనా! రథికశ్రేష్ఠుడైన శిఖండి జన్మవృత్తాంతము చెప్పితిని. ఇతడు తొలుత స్త్రీగా నుండి పిదప పురుషుడైనాడు. ఇతడే పూర్వజన్మమునందు కాశీరాజు జేష్ఠపుత్రికయైన అంబ.

''కనుక నా వ్రత మేమనగా, స్త్రీపైనగాని, తొలుత స్త్రీగానుండి తరువాత పురుషుడుగా మారినవానిపైగాని, స్త్రీ పేరు పెట్టుకొనిన వానిపైగాని, స్త్రీరూపము - స్త్రీల వేష భూషణములు ధరించినవానిపైగాని నేను బాణము ప్రయోగించను.

"కనుక దుర్యోధనా! ఈ శిఖండి తనచేతిలో ధనుస్సుపట్టి యుద్ధము చేయుటకు నా యెదుట నిలిచిన వెంటనే, అతనివైపు చూడను. అతనిపై బాణ ప్రయోగము చేయను.

"ఈ కారణముచేతనే నేను శిఖండిని సంహరింపజాలను. శిఖండి జన్మము యొక్క వాస్తవ వృత్తాంతమును నే నెరుగుదును. కాబట్టి యుద్ధభూమిలో శిఖండి నన్ను చంపుటకు వచ్చినప్పటికిన్ని నే నతనిని చంపను.

"భీష్ముడు స్త్రీని వధించినయెడల, లోకమునందు సత్పురుషులు భీష్ముని నిందించెదరు గాబట్టి శిఖండి యుద్ధభూమిలో నిలిచియుండుట చూచినప్పటికిన్ని నే నతనిని చంపను.'

"జనమేజయా! భీష్ముడు చెప్పిన శిఖండి వృత్తాంతమంతయు విని దుర్యోధనుడు కొంచెముసేపు యోచించి, 'భీష్ముడు శిఖండిని చంపకుండుట ఉచితమే' యని అంగీకరించెను."

వైశంపాయన మహాముని జనమేజయ మహారాజుకు తరువాతి కథయిట్లు చెప్పదొడగెనని సంజయుడు ధృతరాష్ట్రునితో నిట్లనెను:

"ధృతరాష్ట్రమహారాజా! మరునాడు తెల్లవార నీ పుత్రుడు దుర్యోధనుడు సమస్తసేనామధ్యమునందు నిలిచి మరల భీష్మపితామహునిట్లు ప్రశ్నించెను:

"పితామహా! ఈ పాండవులసేన యుద్ధమునకు సన్నద్ధమైయున్నది. ఇందులో చాలామంది కాల్బలమువారు - గజ సైనికులు - అశ్వసైనికులు నిండి యున్నారు. అనేకులు మహారథములతో నిలిచియున్నారు. లోకపాలకులవలె మహా పరాక్రమశాలులైన భీమార్జున ధృష్టద్యుమ్నాది వీరులు ఈ సేనను సంరక్షించుచున్నారు. ఈ సైన్యము, పైకెగురుచున్న ఉన్నత తరంగములు గలదై సమీపించుటకు గూడ సాధ్యము కాకున్న మహా సముద్రమువలె తోచుచున్నది. ఈ సైన్యము ముందుకు సాగకుండ ఆపుట అసంభవమనిపించుచున్నది. పెద్ద పెద్ద దేవతలు గూడ ఈ మహాయుద్ధమునందు ఈ సైన్య సముద్రమును క్షోభింప జాలరు గదా!

"గంగానందనా! నీ వెంత కాలములో ఈ సమస్త సైన్యము ధ్వస్తము చేయగలవు? మహాధనుర్ధరుడైన ద్రోణాచార్యుడు - అత్యంత బలశాలియైన కృపాచార్యుడు - యుద్ధేచ్ఛతో ఉవ్విళ్ళూరుచున్న కర్ణుడు - బ్రాహ్మణోత్తముడైన అశ్వత్థామ ఎంతెంత కాలములో ఈ సేనను సంహరింపగలరు? ఎందుకనగా, నా సేనలో ఈ మీరందరే దివ్యాస్త్రముల నెరిగిన వారుగదా? కనుక నేను తెలిసికొన దలచుచున్నాను. దయయుంచి చెప్పుము.'

"ధృతరాష్ట్ర మహారాజా! దుర్యోధను డడిగిన ప్రశ్నములకు భీష్ము డిట్లు బదులు చెప్పెను:

కౌరవసేనల బలాబలములను గూర్చి భీష్ముడు చెప్పుట

"దుర్యోధనా! నీవు శత్రువుల బలాబలములను గూర్చి అడిగిన ప్రశ్నము యోగ్యముగానే యున్నది. యుద్ధమునందు నాకు గల అధికాధిక శక్తి, నా అస్త్ర శస్త్రముల శక్తి, నా భుజబలము ఎంతయో వివరించి చెప్పెదను వినుము.

"సాధారణులతో సరళముగానే యుద్ధము చేయవలెను. మాయావులను మాయా యుద్ధముతోనే యెదిరించవలెను. ఇదియే ధర్మశాస్త్రము చెప్పుచున్నది.

"నేను పాండవుల సైన్యమును, ఒక్కొక్క దినము ఎందరిని చంపుదును అని దైనిక విభాగము తొలుత చేసికొని వధించెను.

నేను ఒక్క దినములో పదివేల మంది యోధులను, ఒక వేయి మంది రథికులను సంహరించెదను. ఇది నా యొక్క ఒకనాటి భాగము.

"ఈ విధముగా నేను యుద్ధసన్నద్ధుడనై యెన్ని దినములు పోరాడెదనో అన్ని భాగముల సైన్యమును చంపెదను.

"నేను ఒకవేళ యుద్ధమునందు స్థిరముగా నిలిచి, లక్షలకొలది వీరులను సంహరింపగల మహాస్త్రముల నుపయోగించుచున్న యెడల ఒక నెలలో ఈ పాండవసేననంతయు నశింపజేయగలను."

"ధృతరాష్ట్రా! భీష్ముని మాట విని దుర్యోధనుడు ద్రోణాచార్యులను, 'ఆచార్యా! నీవు ఎంత కాలములో పాండవ సైన్యమును సంహరింపగలవు?' అని యడిగెను.

"ఆ మాట విని ద్రోణాచార్యులు నవ్వుచు దుర్యోధనునితో నిట్లనెను:

"ఇప్పుడు నేను వృద్ధుడనైనాను. నా ప్రాణశక్తి, కార్యశక్తి తగ్గినది. అయినను, నా అస్త్రశస్త్రముల అగ్నితో పాండవుల మహా సైన్యములను భస్మము చేసెదను. భీష్ముడేవిధముగా పాండవ సేనను ఒక్క నెలలో నష్టము చేయగలడో,

ఆ ప్రకారమే నేను గూడ ఒక్క నెలలోగానే నశింపజేయగలను అని నా విశ్వాసము. ఇది నా అధికాధికశక్తి యని తెలిసికొనుము.'

''ధృతరాష్ట్రా! కృపాచార్యులు రెండు నెలలతో పాండవ సేనను హతమార్చెదననెను. కాని, అశ్వత్థామ పది దినములలోనే శత్రు-సైన్యమునంతటిని సంహరింపగలనని ప్రతిజ్ఞ చేసెను. కర్ణుడు ఐదు దినములలోనే పాండవ సేననంతయు చంపెదని ప్రతిజ్ఞ చేసెను.

''మహారాజా! కర్ణుని మాటలు విని భీష్ముడు పక్కున నవ్వి యతనితో నిట్లనెను:

''రాధానందనా! ఎంతవరకు యుద్ధభూమిలో శంఖ - ధనుర్బాణములను ధరించిన శ్రీకృష్ణునితో ఏక రథమునందు వచ్చుచున్న అర్జునుని చూడవో, ఎంతవరకు అర్జునునితో యుద్ధమునందు నీవు తలపడవో అంతవరకే నీవు దురభిమానముతో మాట్లాడుచుందువు. ఇంకను ఇట్టి మాటలు ఎన్నియో వదరుచుండెదవు.'

''జనమేజయా! కౌరవసేనలో జరిగిన మాటలన్నియు తెలిసికొని యుధిష్ఠిరుడు తన తమ్ములనందరిని ఏకాంతమునందు పిలుచుకొని వారితో నిట్లనెను:

''తమ్ములారా! నిన్నరాత్రి దుర్యోధనుడు భీష్మాదులతో, మీరెన్ని దినములలో పాండవ సైన్యమును నష్టము చేయగలరు అని అడుగగా భీష్ముడు ఒక్క నెలలో సంహరించెదననియు, ద్రోణాచార్యుడు గూడ అంతకాలములోనే సంహరించెదననియు, కృపాచార్యుడు తనకు రెండు నెలలు కావలెననియు, అశ్వత్థామ పది దినములు తనకు చాలుననియు, కర్ణుడు ఐదు దినములలోనే పాండవుల సేనను సంహరించెదననియు చెప్పిరట. ఈ విషయమంతయు నేను నియమించిన గూఢచారులవలన తెలిసినది.

పాండవసేనలోని వీరులను గూర్చి అర్జునుడు చెప్పుట

''కాబట్టి, నేను గూడ మన బలమును గూర్చి తెలిసికొన గోరుచున్నాను. కనుక అర్జునా! నీ బలమెంతయో, నీవెన్నాళ్ళలో కౌరవసేననంతటిని సంహరింపగలవో చెప్పుము.'

"జనమేజయా! అన్నగారి మాటలకు శ్రీకృష్ణుని చూచుచు అర్జును డిట్లు బదులు చెప్పెను:

''మహారాజా! ఇప్పుడు నీవు చెప్పిన శత్రు పక్ష వీరులందరు మహాత్ములే. శస్త్రాస్త్రకోవిదులే. విచిత్ర యుద్ధము చేయగలవారే. వీరు ఆయా పరిమిత కాలములలో మన సేనను సంహరింపగలవారే. అందులో సందేహము లేదు.

''కాని, రాజా! దీనివలన నీవు సంతాపపడవలసిన అవసరము లేదు. నీ తాపము దూరము కావలెను. నేను సత్యముగా నిప్పుడు చెప్పుచున్నాను, సావధానముగా వినుము:

"మహారాజా! నేను శ్రీకృష్ణభగవానుని సహాయముతో, ఒక్కరథము మాత్రమే తీసికొని, దేవతాసహితములైన మూడు లోకములను, సమస్త చరాచర ప్రాణులను, భూత-భవిష్యత్ - వర్తమానకాలములను గూడ ఒక్క రెప్పపాటు కాలములో నశింపజేయగలను. ఇది నా సంపూర్ణ విశ్వాసము.

"రాజా! శంకరభగవానుడు కిరాతవేషములో నాతో ద్వంద్వయుద్ధము చేయునప్పుడు, ఆ భగవంతుడు నాకిచ్చిన భయంకరాస్త్రము నావద్ద సిద్ధముగానున్నది. ఆ భగవంతుడు ప్రళయకాలమునందు సమస్త ప్రాణులను సంహరించునప్పుడు ప్రయోగించు మహాస్త్రమే యిప్పుడు నావద్దనున్న యస్త్రము. ఇదియే పాశుపతాస్త్రము.

"రాజా! యీ భయంకరాస్త్రమును భీష్ముడు - ద్రోణాచార్యుడు కృపాచార్యుడు వీరెవ్వరుగూడ నెరుగరు. అశ్వత్థామకు గూడ ఇది తెలియదు. ఇట్లుండగా, సూతపుత్రుడైన కర్ణునకిది తెలియుట కలలోని వార్త.

''కాని, మహారాజా! యుద్ధమునందు సాధారణయోధులపైన ఈ దివ్యాస్త్రము ప్రయోగించి చూపుట ఎప్పటికిగూడ యుక్తముగాదు. కాబట్టి మనము సరళభావముతోనే యుద్ధముచేసి శత్రువులను జయించుదము.

''మహారాజా! మనకు యుద్ధమునందు సహాయము చేయుటకు వచ్చిన యీ రాజులందరును దివ్యాస్త్రజ్ఞానము కలవారే. అందరుగూడ యుద్ధము చేయుటకు లభిలషించువారే. వీరందరు వేదాధ్యయనము సంపూర్ణముగా చేసి, యజ్ఞములు చేసి, అవభృథస్నానము (యజ్ఞాంతమునందు చేయు స్నానము) చేసినవారే. వీరందరుగూడ ఎప్పుడున్ను యుద్ధమునందు ఓడిపోనివారే. వీరు యుద్ధభూమియందు దేవతల సేననుగూడ నశింపజేయగలరు.

''రాజా! శిఖండి - యుయుధానుడు (సాత్యకి) - ధృష్టద్యుమ్నుడు - భీమసేనుడు - నకుల, సహదేవులు-యుధామన్యుడు - ఉత్తమౌజుడు - విరాటరాజు-ద్రుపదరాజు-వీరందరుగూడ యుద్ధమునందు భీష్మద్రోణులతో సమానులు.

''రాజా! శంఖుడు - ఘటోత్కచుడు - అతని కొడుకు-'అంజనపర్వుడు'-సాత్యకి-వీరందరు నీకు సహాయకులుగనున్నారు. అభిమన్యుడు - ద్రౌపదీపుత్రులైదుగురు-వీరేకాక నీవుగూడ స్వయముగా మూడు లోకములను నశింపజేయగల సమర్థుడవు.

''రాజా! నీవు క్రోధముతో ఏ పురుషుని చూచెదవో యతడు శీఘ్రముగా నశించును. నీ యీ ప్రభావమును నే నెరుగుదును.

''జనమేజయా! మరునాడు ప్రభాతకాలమునందే దుర్యోధనునిచేత ప్రేరితులై రాజులు పాండవులతో పోరాడుటకు యుద్ధభూమికి పోయిరి.

''అందరు ఉదయమే స్నానాది కాలకృత్యములు తీర్చుకొని పరిశుద్ధులై తెల్లబట్టలు ధరించి పూలదండలు వేసికొని బ్రాహ్మణులతో స్వస్తివాచనము చేయించుకొని, అగ్నిలో హోమము చేసి, ధ్వజములను ఎగురవేయుచు, శస్త్రాస్త్రములు తీసికొని రణరంగమునకు ప్రయాణమైరి.

''వారందరు వేదవేత్తలు, శూరులు. నియమవ్రతములను పాలించువారు. అందరు కవచాదియుద్ధ చిహ్నములతో శోభిల్లుచుండిరి.

కౌరవ సేనాదళముల వివరము

''జనమేజయా! పరాక్రమవంతులైన కౌరవ వీరులందరుగూడ యుద్ధములందు తమ శౌర్యము చూపించి ఉత్తమలోకములను పొందగోరువారే.

"అందరు ఏకాగ్రచిత్తులై పరస్పరము విశ్వాసముతో నుండిరి.

"అవంతీదేశ రాజకుమారులైన విందానువిందులు అను నిద్దరు సోదరులు, బాహ్లీక దేశీయ సైనికులతో కేకయ రాజకుమారుడు మొదలైన వీరందరు ద్రోణాచార్యుని ముందిడుకొని నడచుచుండిరి.

''అశ్వత్థామ - భీష్ముడు - సైంధవుడు, దక్షిణదేశరాజులు - పశ్చిమదేశ రాజులు - పర్వత ప్రాంతీయులైన రాజులు - శకుని - తూర్పుదిక్కు, ఉత్తర దిక్కు రాజులు - శకులు - కిరాతులు - యవనులు-శిబిరాజులు-వసాతిరాజులు-

వీరందరు మహారథికులు, తమ తమ సేనలతో మహారథికుడైన భీష్ముని చుట్టుకొని, రెండు సేనాదళరూపములలో సంసిద్ధులై బయలుదేరిరి.

''సైన్యసహితుడై కృతవర్మ - మహారథికుడైన త్రిగర్తుడు-తమ్ములతో సహితుడైన దుర్యోధనుడు - శలుడు - భూరి శ్రవుడు - శల్యుడు - కోసల రాజైన బృహద్రథుడు వీరందరు దుర్యోధనుని ముందిడుకొని, అతని వెనువెంట మూడు సైన్యదళముల రూపములో సాగిపోవుచుండిరి.

''రణరంగమునందు ధార్తరాష్ట్రులు నూరుగురు కవచాదులు ధరించి కురుక్షేత్రము యొక్క పశ్చిమభాగమునందు వారికి తగిన స్థానములలో నిలిచిరి.

''దుర్యోధనుడు పూర్వమే అక్కడ రెండవ హస్తినాపురమువంటి శిబిరములను నిర్మింపజేసియుండెను. ఆ శిబిరములలో నివసించుచున్న నగరవాసులు గూడ, 'ఆ శిబిరనగరమునకు హస్తినాపురమునకు భేదమేమున్నది' అని భావించుచుండిరి.

''రాజా! అట్టి సౌకర్యములేయున్న దుర్గములను వేలసంఖ్యలో రాజులు నివసించుటకు దుర్యోధనుడు నిర్మింపజేసియుండెను.

"రణరంగమునకు అయిదు యోజనములదూరములో సైనికులు నివసించుటకు ఒక్కొక్క నూరు చొప్పున సేనానివేశముల వరుసలు అనేకములు నిర్మింపబడియుండెను.

"అక్కడ విలువగల ఆవశ్యకములైన సామగ్రులతో నిండియున్న వేలకొలది సేనా నివేశములందు రాజులు తమ తమకు అనురూపమైన వాటిలో నివసించి యుద్ధ సన్నద్ధులై యుండిరి.

"దుర్యోధనుడు ఆ రాజులకు, వారి సైన్యములకు - వాహనములకు రుచికరములైన భక్ష్య భోజ్యపానీయము లిచ్చుటకు ఏర్పాట్లు చేసెను.

"గజాశ్వములకు - శిల్పులకు - ఇతర అనుచరులకు - సూత, వంది, మాగధులకు గూడ దుర్యోధనుడు మంచి భోజనములు ఏర్పరచెను.

అక్కడికి వచ్చిన వైశ్యులకు - వేశ్యాజనమునకు - గూఢచారులకు - ప్రేక్షక జనమునకు ఆదరపూర్వకముగా సత్కారములు చేయించెను.

పాండవుల సేనాదళముల వివరము

"జనమేజయా! ఆ విధముగనే యుధిష్ఠిరుడు గూడ ధృష్టద్యుమ్నాది వీరులను యుద్ధమునకు పోవుట కాజ్ఞాపించెను.

"శత్రు నాశకుడు సేనాపతియునైన ధృష్టకేతువును, చేది - కరూష దేశ రాజులను గూడ యుద్ధమునకు పొమ్మని యుధిష్ఠిరుడు ఆజ్ఞాపించెను. విరాట -

ద్రుపద - శిఖండి - సాత్యకి, పాంచాలవీరులైన యుధామన్యు - ఉత్తమౌజులు వీరిని గూడ ధర్మరాజు యుద్ధమునకు ఆదేశించెను.

"ఈ వీరులందరు మహాధనుర్ధారులు- శూరులు. వీరు కవచములను స్వచ్ఛ సువర్ణ కుండలములను ధరించి, యజ్ఞవేదికపైన నేయి హోమము చేత జ్వలించుచున్న అగ్నివలె, ఆకాశమునందు గ్రహములవలెను ప్రకాశించుచుండిరి.

"తరువాత, వారి వారి అర్హత ననుసరించి సమస్త సేనను యుధిష్ఠిరుడు ఆదరించి ప్రయాణము చేయుటకు ఆజ్ఞాపించెను. వారందరికి, వాహనములకు - రాజులకు సర్వోత్తమములైన ఆహార పానీయములను ఇచ్చుటకు ధర్మరాజు ఆదేశించెను. వారితోపాటు ఉన్న గజాశ్వములకు - కాల్బలములకు, శిల్పులకు గూడ భోజనములు ఏర్పరచబడెను.

"యుధిష్ఠిరుడు ధృష్టద్యుమ్నుని సేనాగ్రభాగమునందుంచి, అభిమన్యుని- బృహంతుని - ద్రౌపదీపుత్రులైదుగురిని ఆ మొదటి సేనాదళముతో పంపెను.

"భీమసేనుని - సాత్యకిని- అర్జునుని యుధిష్ఠిరుడు రెండవ సేనాదళముతో నాయకులనుగా పంపెను.

"అక్కడ సంతోషభరితులైన కొందరు యోధులు యుద్ధ సామగ్రిని వాహనములపై నింపుచుండిరి. కొందరు ఇటునటు తిరుగుచుండిరి. మరికొందరు కార్యనిమగ్నులై యిటునటు పరుగెత్తుచుండిరి. ఆ యందరి కోలాహల ధ్వని స్వర్గలోకమును తాకుచున్నదా యనునట్లుండెను,

"తరువాత యుధిష్ఠిరుడు స్వయముగా విరాట - ద్రుపదరాజులను వెంట దీసికొని యితర రాజులతో గూడ బయలువెడలెను.

"మహాధనుర్ధారులతో సంపన్నమై, ధృష్టద్యుమ్నునిచేత సురక్షితమైన పాండవ సేన, అక్కడక్కడ ఆగుచు - ముందుకు సాగుచు- ఒక చోట నిశ్చలముగా నుండి - ఒకచోట వడిగా ప్రవహించుచున్న జలముతో నిండిన గంగా నదివలె కనపడుచుండెను.

"కొంత దూరము పోయిన తరువాత యుధిష్ఠిరుడు ధార్తరాష్ట్రుల మనస్సులలో భ్రమ కలిగించుటకు తన సేనను మరల దళములు దళములుగా స్పష్టముగా సంఘటితపరచెను.

''ధర్మరాజు ద్రౌపది పుత్రులనైదుగురిని - అభిమన్యుని - నకుల సహదేవులను, ప్రభద్రక వీరులందరిని - పదివేల ఆశ్వికులను - రెండు వేల గజ సైనికులను - పదివేల కాల్బలము వారిని - ఐదునూర్ల రథికులను చేర్చి మొదటి సేనా దళమును నియమించి దానికి భీమసేనుని నాయకునిగా చేసెను.

''మధ్య సేనాదళమునందు, విరాటరాజును - జయత్సేనుని - పాంచాల దేశ వీరులైన యుధామన్యు - ఉత్తమౌజులను ఉంచెను. చేతులలో గదలను ధనుస్సులను ధరించు ఈ యిద్దరు వీరులు మహాపరాక్రములు.

అప్పుడు ఆ యందరిమధ్య భాగమునందు కృష్ణార్జునులు సేన వెనువెంట పోవుచుండిరి.

''అప్పుడు యుద్ధములందు పూర్వానుభవముగల యోధులు మిక్కిలి ఆవేశముతో నిండియుండిరి. ఈ సేనా దళమునందు శౌర్యసంపన్నులధిరోహించిన ఆశ్విక సైన్యము ఇరువది వేలుండెను. ఆ అశ్వికులతోపాటు అయిదు వేల గజసైనికులు - అనేక రథికులు నుండిరి.

''ధనుస్సులు - బాణములు - గదలు - ఖడ్గములు ధరించిన కాల్బలము వారు అనేక సహస్ర సంఖ్యలో సేనకు ముందు - వెనుక పోవుచుండిరి.

"యుధిష్ఠిరమహారాజు ఏ సేనా సముద్రమునందు స్వయముగా నుండెనో, దానియందు అనేక రాజులు ఆయనను నలువైపుల చుట్టి నడచుచుండిరి. దానిలో ఒక వేయి గజసైనికులు - పదివేల ఆశ్వికులు - ఒక వేయిమంది రథికులు - అనేక సహస్రముల కాల్బలముల సైనికులు నుండిరి.

''వారితోనే చేకితానుడు తన మహాసేనతోను - చేది రాజైన ధృష్టకేతువున్ను కలిసియుండిరి.

''సాత్యకి ఒక లక్షమంది రథికులతోపాటు బిగ్గరగా సింహనాదము చేయుచు ముందు సాగిపోవుచుండెను. క్షత్రదేవ - బ్రహ్మదేవులు రథములందు కూర్చొని సేన యొక్క వెనుక భాగమును రక్షించుచు పోవుచుండిరి.

''వీరేకాక, అనేక శకటములు - అంగళ్ళు, వేషభూషణ సామగ్రులు - వాహనములు - వస్తువులు తీసికొనిపోవు బండ్లు - వేయి యేనుగులు - అనేక దశసహస్రముల అశ్వములు చిన్న చిన్నవియైన యితర వస్తువులు అనేకములు- స్త్రీలు - కృశులు - దుర్బలులునైన మనుష్యులు - ధనాగారములు - వాటిని మోయువారు - ఆహార సామాగ్రులు మొదలైన వాటినన్నింటిని చేకూర్చుకొని యుధిష్ఠిర మహారాజు మెల్లమెల్లగా గజసేనతోపాటు సాగిపోవుచుండెను.

''ఆయన వెనువెంట, సుచిత్తునికొడుకు సత్యధృతి - శ్రేణిమంతుడు - వసుదానుడు . కాశీరాజపుత్రుకున్ను పోవుచుండిరి.

''వీరందరిని అనుసరించుచు ఇరువదివేలమంది రథికులు - చిరుగజ్జెలు మ్రోగుచుండగా శోభాయముగానున్న పదికోట్ల అశ్వములు - నాగేటి దండములు వంటి దంతములు గల యిరువదివేల మదగజములు ఉండెను.

''ఆ యేనుగులు యుద్ధకౌశలము గలవి. ఉత్తమ జాతికి చెందినవి. మదజలము స్రవించుచున్నట్టివి. మేఘ బృందమువలె నడచునవిగా నుండెను.

''అవియేకాక, యుద్ధమునందు యుధిష్ఠిరునితో నుండు అరువదివేల గజములు అతని సొంతమువి గూడ నుండెను. అవి వర్షించు మేఘములవలె కుంభస్థలముల నుండి మదజల ధారలను గురియుచుండెను.

"ఆ గజములన్నియు నడచుచున్న పర్వతములా యనునట్లు ఉండి యుధిష్ఠిరుని అనుసరించి పోవుచుండెను.''

''జనమేజయా! ఆ విధముగా యుధిష్ఠిరుని మహాసైన్యము అతి భయంకరముగా నుండెను. దాని ఆశ్రయముతో ధర్మరాజు దుర్యోధనుని ముట్టడించెను.

''ఆ సైన్యములన్నిటికంటె వేరుగా అనేక లక్షల కాల్బలము వారు వెనువెంట పోవుచుండిరి. ఆ సేనా వాహినియంతయు సింహనాదములు చేయుచు ముందుకు సాగిపోవుచుండెను.

''ఆ సమయమునందు యుద్ధభూమిలో లక్షలకొలది మనుష్యులు సంతోషోత్సాహపూరితులై వేల కొలది భేరీ శంఖాది వాద్యములను వాయించగా, ఆ ధ్వని మిన్ను ముట్టుచుండెను."

శుభం భూయాత్.

ఉద్యోగ పర్వము సమాప్తము.

తే॥ గీ॥ వరుసగా విరాటోద్యోగ పర్వ యుగము
నాంధ్ర వచనంబు శ్రీ వేంకటాద్రినాథు
పాదయుగమున నర్పింతుఁ బరమభక్తిఁ
కప్పగంతుల లక్ష్మణ కవిహితుండ.
పంచమవేద మై పరఁగు భారత సంహిత నాదిమంబు న
భ్యంచిత పర్వపంచకము నాంధ్రమునన్ వచనంబు వ్రాసి, నే
నంచిత వేంకటేశ చరణాంబుజ యుగ్మమునందు భక్తి న
ర్పించెద లక్ష్మణుండ నిలువేలుపు పాదయుగంబుఁ గొల్చుచున్.

—కప్పగంతుల లక్ష్మణశాస్త్రి